ఈనాడు
అల్లూరి సీతారామరాజు

శనివారం 17 జనవరి 2026

సందడిగా భారిజం సంబరం

దేవుళ్ల వేషధారణలో బాలలు

పాడేరు, న్యూస్‌టుడే: తామపల్లిలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా భారీ విజయం (భారిజం) పండగ శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. గిరిజన ఆచార, సంప్రదాయాలు ప్రతిబింబేలా గిరిజనులు ఈ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వనుగుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజనులు భారీగా తరలి వచ్చి సందడి చేశారు. గ్రామ చావిడిలోని శంకులమ్మ, పొలిమేరలోని భీముడు విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. పంటలు బాగా పండి.. వ్యవసాయం కలిసి రావాలని, పాడి పశువులతో ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండాలని పూజించారు. సంప్రదాయ ఆయుధాలకు పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ చావిడిలో గిరిజనులంతా థింసా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తమర్బ ప్రసాద్‌నాయుడు, తమర్బ ప్రవీణ్‌ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

పాడేరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీలపై ఈనెల 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జి.ఎన్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామన్నారు. పాడేరు జిల్లా కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష విధానంలో, రెండు నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభిప్రాయాలు చెప్పదలుచుకునే వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పండగ వేళ.. ఆనంద హేల!

చింతపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ వేళ మన్యంలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. చింతపల్లి మండలంలోని చెరులువెనం, తాజంగి, లంబసింగి, బోడకొండమ్మ గుడి, ఎర్రవరం జలపాతాలన్నీ సందర్శకుల రాకతో కళకళలాడాయి. సాధారణంగా పండగ సమయాల్లో పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతాయి. కానీ ఈసారి దూరప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జిల్లా ఆసుపత్రి ఖాళీ

పాడేరు, న్యూస్‌టుడే: మన్యానికి పెద్దదిక్కుగా ఉన్న పాడేరు జిల్లా ఆసుపత్రి సంక్రాంతి పండగ నేపథ్యంలో బోసిపోయింది. బుధ, గురువారాల్లో.. ఆర్థోపెడిక్, జనరల్, ప్రసూతి విభాగం వార్డుల్లో 178 మంది రోగులు ఉన్నారు. మిగిలిన అన్ని వార్డుల్లో ఖాళీ మంచాలే దర్శనమిచ్చాయి. సాధారణంగా ప్రతి రోజు జిల్లా ఆసుపత్రిలో సుమారు 500 మంది రోగులు ఉండి వైద్యసేవలు పొందేవారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో చాలామంది స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

చలి చంపేస్తోంది!

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యాన్ని చలిపులి వణికిస్తోంది. జనవరి రెండో పక్షం మొదలైనా చలి తీవ్రత కొనసాగుతోంది. అరకులోయలో శుక్రవారం 6.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. పెదబయలులో 6.6, ముంచంగిపుట్టు 6.7, జి.మాడుగుల 7.3, చింతపల్లి, హుకుంపేటలో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు.

లక్ష్యం.. లక్ష

మిరియాల విస్తీర్ణం పెంపునకు ప్రణాళిక

నాణ్యమైన, రుచికరమైన కాఫీ అంతర్జాతీయ గుర్తింపు పొందింది మన్యం. కాఫీ తోటల్లో అంతర పంటగా సాగవుతున్న వాటిలో ముఖ్యమైనది మిరియాలు. ఈ పంట సాగును మన్యంలో మరింతగా విస్తరించే యోచనలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అడుగులు వేస్తోంది. ఈ మేరకు కేంద్ర సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ సమన్వయంతో మిరియాల సాగు విస్తరణపై ప్రణాళిక రూపొందించింది. రానున్న మూడేళ్ల కాలంలో కాఫీసాగుకు దీటుగా మిరియాలను విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. పాడేరు, న్యూస్‌టుడే

మిరియాల తోటలు

▶ జిల్లాలోని పదకొండు మండలాల్లో అధికారిక లెక్కల ప్రకారం 52 వేల ఎకరాల్లో మిరియాల సాగు విస్తరించింది ఉంది. సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు మిరియాలను కాఫీలో అంతర పంటగానే చూస్తున్నారే తప్ప ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు. పూర్తి సేంద్రియ పద్ధతిలో పండించే మన్యం మిరియాల్లో ఔషధ గుణాలు ఎక్కువ. అందుకే వీటికి దేశీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీనికితోడు మిరియాల పంటకు అల్లూరి మన్యమే అనుకూల ప్రదేశంగా శాస్త్రవేత్తలు గుర్తించారు.

▼ జిల్లాలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటు చేసి కాఫీ స్థాయిలో విస్తీర్ణం పెంచాలని యోచిస్తున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీలో ఈ పంట సాగు విధానాలపై గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా గిరి యువతకు అవగాహన కల్పించి.. మొక్కల పంపిణీతోపాటు అవసరమైన నిచ్చెనలు, కంచె, ఇతర పరికరాలు రాయితీపై అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రానున్న మూడేళ్ల కాలంలో మరో 48 వేల ఎకరాల్లో పంటను విస్తరించాలని కార్యాచరణ రూపొందించారు. దీనికి స్పైసెస్ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించనుంది. స్థానిక ఐటీడీఏ పర్యవేక్షించనుంది.

మార్కెటింగ్‌కూ భరోసా..: కాఫీ తరహాలో గిరిజనులు పండించే మిరియాల సాగుకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు స్పైసెస్ బోర్డు ముందుకొస్తోంది. ప్రస్తుతం ఏజెన్సీలో పండుతున్న మిరియాలు ప్రైవేటు వ్యాపారస్తుల సహకారంతో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, దిల్లీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. కిందటి ఏడాది కేజీ ధర రూ. 600 నుంచి రూ. 800 వరకూ పలికింది. ప్రభుత్వం చొరవ తీసుకొని మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మరింత ధర లభించే అవకాశముంది.

రంగు పడిందో.. దొరికేసినట్టే!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పేద ప్రజలకు రాయితీపై ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు దారి మళ్లిస్తున్నారు. ఒకటో తేది నుంచి రేషన్ షాపుల్లో బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకున్న తరువాత వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి నల్ల బజారుకు తరలిస్తున్నారు. కొంతమంది సంతల్లో బియ్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. ఈ అక్రమాలకు క్షేత్రస్థాయిలో చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఎఫ్ఆర్‌కే ఐరన్ స్పాట్‌కిట్లను పంపించింది. వీటితో పరీక్షిస్తే అది రేషన్ బియ్యమా.. కాదా అన్నది ఇట్టే పసిగట్టేయొచ్చు.

◗ ఎఫ్ఆర్‌కే అంటే ఫోర్టిఫైడ్ రైస్‌లో ఇసుము ఉందో లేదో త్వరగా తెలుసుకోవడానికి ఉపయోగించే పరికరం. ఈ కిట్‌లోని రసాయనాలు బియ్యంపై వేసినప్పుడు అవి ఐరన్ అయాన్లతో చర్య జరిపి రంగు మారుస్తాయి. ఐరన్ ఉంటే ఆ బియ్యం గింజలు ఎరుపు రంగులోకి మారుతాయి.

ఇలా గుర్తిస్తారు

పట్టుబడిన బియ్యం నమూనాతీసుకుంటారు. తొలుత హెచ్‌సీఎల్ (హైడ్రోక్లోరిక్ యాసిడ్) ద్రావణాన్ని బియ్యం పూర్తిగా తడిసేవరకు పోస్తారు. వెంటనే పొటాషియం థియోసైనేట్ ద్రావణాన్ని కలుపుతారు. ఐరన్ ఉన్న గింజలు వెంటనే ఎరుపు రంగులోకి మారతాయి. తద్వారా ఆవి రేషన్ బియ్యంగా గుర్తిస్తారు. సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు.

చేయికలిపారు.. చెమట చిందించారు!

తూములు ఏర్పాటుచేస్తున్న గ్రామస్థులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి గ్రామానికి వెళ్లడానికి దారి లేక పడుతున్న ఇక్కట్లకు ముగింపు పలికేందుకు ఊరంతా ఒక తాటిపైకి వచ్చారు. చేయిచేయి కలిపి చెమట చిందించి శ్రమదానంతో తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నారు. జామిగుడ, గుంజివాడ గ్రామాల మధ్య నన్న మత్స్యగెడ్డపై గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఐదేళ్లపాటు పనులు నత్తనడకన సాగాయి. నేటికీ అసంపూర్ణంగా దర్శనమిస్తోంది. దీంతో జామిగుడ, గుంజివాడ గ్రామాలకు స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతూనే ఉన్నారు. కష్టాలకు తాత్కాలిక పరిష్కారంగా గురువారం గ్రామస్థులంతా శ్రమదానంతో గెడ్డలో తూములు ఏర్పాటు చేసి దానిపై రోడ్డు నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, జర్సింగి రామ్‌నాయుడు, వంతల గోవర్ధన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకశ్మీర్‌లో ఆరోగ్యకర ఉత్పత్తులు

చింతపల్లి, న్యూస్‌టుడే: అతిశీతల ప్రాంతం లంబసింగికి ఆంధ్రాకశ్మీర్‌గా గుర్తింపు ఉంది. ఇక్కడ మంచు, శీతల వాతావరణంతోపాటు.. ఆరోగ్యాన్నిచ్చే రుచులు, చిరుధాన్యాలు, విదేశీ ఫలాలు, కనువిందు చేసే వివిధరకాల పూల తోటలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

కాకినాడ కాజా, బందరు లడ్డు, మాడుగుల హల్వా.. ఇలా ఒక్కో ప్రాంతానికీ ఒక్కో విశిష్టత ఉంటుంది. లంబసింగిలో సహజసిద్ధంగా లభించే తేనె, పసుపు, మిరియాలు, కాఫీ, స్ట్రాబెరీ, లిచీ, యాపిల్స్ పనస, అనాసపనస, మామిడితోపాటు రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు, పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండించిన వ్యవసాయ, ఉద్యాన పంటలు, సేకరించిన అటవీ ఉత్పత్తులు లభ్యమవుతున్నాయి. చింతపల్లి మండలంలోని కొందరు అభ్యుదయ రైతులు స్ట్రాబెరీని వాణిజ్యపరంగా సాగుచేస్తున్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు వీటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో చాలామంది ఈ సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

చెరువులవెనంలో పర్యాటకులకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయిస్తున్న గిరిజనులు

స్థానికంగానే స్వయం ఉపాధి

సీజనుతో సంబంధం లేకుండా మన్యానికి వచ్చి వెళ్లే వారంతా చిత్రాళ్లగుప్పులో ఆగి ఇక్కడ లభించే వివిధ రకాల పండ్లు, ఉద్యాన ఉత్పత్తులు, చిరుధాన్యాలు కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా లంబసింగి వచ్చేవారు వీటి కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తుంటారు. మన్యంలో లభించే చిరుధాన్యాలతోపాటు అడవితేనె, పనస, పైనాపిల్, మామిడి, అరటి వంటి పండ్లతోపాటు లిచీ, డ్రాగన్ వంటి పండ్లను దుకాణాల్లో అందుబాటులో ఉంచుతున్నాం. పూర్తిగా సేంద్రియ ఉత్పత్తులు కావడంతో ధరలు కాస్త ఎక్కువైనా వెనకాడకుండా వీటిని కొనుగోలు చేస్తుండటం వల్ల స్థానికంగానే ఉపాధి పొందగలుగుతున్నాం. – సృజన, చిరు వ్యాపారి, చిత్రాళ్లగుప్పు

చిన్నా.. సరిగా కనిపిస్తోందా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

★ అనకాపల్లికి చెందిన ఏడేళ్ల బాలుడికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించడంలో జాప్యం జరిగింది. పరీక్ష చేయగా కంటి అద్దాల పవర్ పెరిగింది. సకాలంలో గుర్తిస్తే బాగుండేదని కంటి వైద్యులు చెప్పారు.

★ ఎలమంచిలిలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థికి దృష్టిలోపం పెరగడంతో అక్షరాలు కనిపించక ఇబ్బంది పడుతూ చదువుతున్నాడు.

నల్లబల్ల మీద రాసే అక్షరాలు సరిగ్గా చూడగలిగినప్పుడే విద్యార్థి పాఠాలు సరిగా అర్థం చేసుకోగలడు. చదువులో రాణించగలడు. కానీ జిల్లాలో చాలా మంది పిల్లలు మసకబారిన అక్షరాలు, అంకెలతోనే రోజంతా బడిలో కుస్తీ పడుతున్నారు. ఇది కొద్దిమందికి పరిమితమైన సమస్య కాదు. ప్రతి పదిమందిలో ఓ విద్యార్థి దృష్టిలోపంతో బాధ పడుతున్నాడు. ఇటీవల వైద్యులు జిల్లాలోని పలు పాఠశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహించగా ఈ కఠోర వాస్తవం వెలుగు చూసింది. టీవీలు, సెల్‌ఫోన్ల వినియోగం పెరుగుతుండటం పిల్లల కంటి చూపుపై ప్రభావం చూపుతోంది. ఏటేటా దృష్టిలోపంతో ఉన్న విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

బాలల్లో దృష్టిలోపాన్ని చిన్నప్పుడే గుర్తించడం చాలా అవసరం. ఈ దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఏడాది ఆగస్టు నుంచి జిల్లాలో 251 ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో పలువురు కంటి సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. రోజూ పోషకాహారం తినకపోవడం, 'ఎ' విటమిన్ లోపించడం కారణంగా కొంత మంది దృష్టి మసకబారుతోందని గుర్తించారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం, అదీ కంటి మరీ దగ్గరగా పెట్టుకుని చూడటం చాలామందిపై ప్రభావం చూపుతోందని వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. వీరికి ఉచితంగా కంటి అద్దాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది కంటే కంటి అద్దాలు అవసరమైన విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. ఇంకొన్ని సందర్భాల్లో దృష్టి లోపాన్ని గుర్తించడం ఆలస్యమవుతోంది. వీరికి సమస్య ఉన్నట్లుగానే వారికి తెలియదు. దృష్టి లోపాన్ని ముందుగానే గుర్తిస్తే ముప్పును కొంతవరకు తగ్గించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

అద్దాలు పంపిణీ చేస్తాం

ఇదివరకు 40 ఏళ్ల పైబడిన వారికి దృష్టి సమస్యలు వచ్చేవి. వయస్సులో సంబంధం లేకుండా చిన్నపిల్లలనూ ఈ సమస్య వెంటాడుతోంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరపున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏటా కంటి పరీక్షలు చేస్తున్నాం. ఈ ఏడాది కంటి అద్దాలు అవసరమని గుర్తించిన వారికి పంపిణీ చేస్తాం.
– డాక్టర్ డేవిడ్ వసంత్‌కుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్

కంటి పరీక్షలు చేసిన విద్యార్థుల సంఖ్య	40,155	అద్దాలు అవసరమైనవారు	4212 మంది	గతేడాది అద్దాలు తీసుకున్నవారు	3155 మంది

2,496 ఖాతాలు... రూ. నాలుగు కోట్లు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ప్రజావసరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రజాధనాన్ని సకాలంలో ఖర్చు చేయకపోవడంతో విలువైన ప్రజాధనం బ్యాంకుల్లో మురుగుతోంది. రకరకాల అవసరాల నిమిత్తం పలు బ్యాంకుల్లో కొన్ని పంచాయతీల పేరుమీద ఖాతాలు తెరవగా, మరికొన్ని పాఠశాల నిర్వహణ కమిటీ, ఎంపీడీఓలు, దివ్యాంగుల పింఛన్ల బట్వాడా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తదితర ప్రభుత్వ సంస్థల పేరుమీద తెరిచారు. వీటిలో కొంతమేర నగదు వాడగా, మిగిలిన సొమ్ము బ్యాంకుల్లో అలాగే ఉండిపోయింది. సుమారు 15 నుంచి 20 సంవత్సరాలు అయ్యింది. రాష్ట్రంలో ఇలాంటి బ్యాంకు ఖాతాలు కోకొల్లలు.

▮ అనకాపల్లి జిల్లా విషయానికి వస్తే ఇలాంటి బ్యాంకు ఖాతాలు 2496 వరకు ఈ జిల్లాలో ఉన్నాయి. ఆ ఖాతాల్లో రూ. 4 కోట్లకు పైబడి నగదు నిరుపయోగంగా ఉండిపోయింది. ఇలాంటి ఖాతాలన్నింటిని తిరిగి పునఃప్రారంభించడానికి అవసరమైన చర్యల్ని ప్రభుత్వం చేపట్టింది. డెడ్ అయిన ఖాతాలన్నింటినీ తిరిగి లైవ్ (మనుగడ) లోకి తీసుకు రావడానికి ప్రత్యేక కౌంటర్లను సైతం ప్రతి వాణిజ్య బ్యాంకులో తెరవాలని బ్యాంకులకు సూచనలిచ్చింది. ఈ ఖాతాలను ఏ విధంగా తిరిగి పునరుద్ధరించాలనే దానిపై రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ప్రతి జిల్లా ఖజానా కార్యాలయం (ట్రెజరీ)తో పాటు ఉప ఖజానా శాఖ కార్యాలయాలకు ఇప్పటికే మార్గదర్శకాలందాయి.

▮ ఏ పంచాయతీల పరిధిలో ఇలాంటి బ్యాంకు ఖాతాలు ఉండిపోయాయనే సమాచారాన్ని ఖజానా శాఖ ప్రతి మండల పరిషత్ కార్యాలయానికి పంపించింది. జిల్లాలోని చీడికాడ మండలంలో 86 ఖాతాలు (రూ. 76 లక్షలు), చోడవరం మండలంలో 48 (రూ. 56 లక్షలు), దేవరాపల్లి మండలంలో 83 (రూ. 15 లక్షలు) బ్యాంకుల్లో ఉండిపోయిందని చోడవరం ఉప ఖజానా అధికారి **మీనా** తెలిపారు.

సంక్రాంతి వెలుగుల కాంతి

సీలేరు, న్యూస్‌టుడే: రంగవల్లులు... పిండివంటలు.. డూడూబసవన్నల సందడి.. అల్లుళ్ల కోలాహలం.. గోవులకు పూజలతో మన్యంలో సంక్రాంతి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఇల్లూ ఆనందంతో నిండిపోయింది. గురు, శుక్రవారాల్లో మన్యంలో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. సీలేరు మారెమ్మ, ధారాలమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనుమ పండగ శుక్రవారం రావడంతో ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ధారాలమ్మ, మారెమ్మ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధారాలమ్మగుడి వద్ద భక్తులు వనభోజనాలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

నేడు, రేపు గవర అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

✦ తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' గవర అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెంలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. ✦ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు(శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

✦ మరిన్ని వివరాలకు 9154918858, 8008621414 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

తారల క్రికెట్.. అదరహో..!

మైదానంలో తేజస్వి

వికెట్ తీసిన ఆనందంలో తెలుగు వారియర్స్ క్రీడాకారులు

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) అభిమానుల్లో సంక్రాంతి జోష్ నింపింది. చాలా కాలం తర్వాత విశాఖలో సినీనటుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. తారలు సైతం మైదానంలో కలియ తిరుగుతూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. తొలిరోజు రెండు మ్యాచ్‌లు జరిగాయి.
– విశాఖపట్నం, న్యూస్‌టుడే

పాయల్ రాజ్‌పుత్

ఆటగాళ్లకు అండ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: క్రీడాకారులకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. సాంకేతికత వీరి ఉజ్వల భవిష్యత్తుకు సాయం అందించనుంది. దేశంలోనే ప్రథమంగా మన రాష్ట్రంలో ఈ ఆటగాళ్ల కోసం 'క్రీడా యాప్' అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ వీరికి అన్నివిధాలా సహకరిస్తూ.. ధ్రువపత్రాలను సురక్షితంగా ఉంచుతూ తగిన ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుంది. ఇన్నాళ్లు ఎటువంటి ప్రోత్సాహం, సహకారం లేదని దిగులుతో ఉన్న వారందరికీ ఇది కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.

★ క్రీడా యాప్ డిజిటల్ లాకర్‌తో కూడినది. ఇందులో క్రీడాకారుల అన్ని రకాల ధ్రువపత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఆటగాళ్లకు ఈ పత్రాలు అత్యంత కీలకమైనవి. సాధారణంగా ఎక్కడైనా మర్చిపోవడం.. తదితర కారణాలతో అవసరమైప్పుడు ఇవి కనిపించకపోవడంతో ఒక్కోసారి ఉపాధి అవకాశాలు చేజారుతుంటాయి. అర్హత ఉండి పతకాలు దక్కే వీలున్నా పోటీలకు దూరమయ్యే పరిస్థితి ఎదురవుతుంది. యాప్‌తో ఇక ఈ సమస్య ఎవరికీ తలెత్తదు. ఇందులో వీటిని అప్‌లోడ్ చేసిన వెంటనే సంబంధిత క్రీడాకారునికి అర్హత ఉన్న ప్రోత్సాహకాలు ఎంతవరకు లభిస్తాయో అన్న విషయంపై స్పష్టత ఏర్పడుతుంది.

★ ఇందులో ఉద్యోగాల నోటిఫికేషన్లు, క్రీడా కోటా కింద కేటాయించిన నౌకరి వివరాలు సంబంధిత ఆటగాళ్ల ఫోను నంబర్లకు ఎప్పటికప్పుడు నమోదు కావడం మరో విశేషం. ఈ సమాచారం లేక చాలా మంది అర్హులైనప్పటికీ ఉపాధి పొందలేకపోతున్నారు. ఇలాంటి వారికి ఇప్పుడు ఎంతో ఊరట లభించనుంది.

★ క్రీడా సంఘాలన్నింటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గుర్తింపును తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 1999 నుంచి 2026 సంవత్సరం వరకు క్రీడాకారులు తాము సాధించిన పోటీల ధ్రువపత్రాలను శాప్ వెబ్‌సైట్‌లో పొందుపరుచుకునేందుకు అనుమతి మంజూరైంది. శాప్ గుర్తింపు పునరుద్ధరణకు నోచుకోని వారంతా అన్ని విషయాల్లోనూ అనర్హులవుతారని క్రీడా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లాలోని క్రీడాకారులంతా విధిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి పూజారి శైలజ తెలిపారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి



పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదబయలు బాలికల-2 ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొర్రా పూజిత (14)ను అనారోగ్యం కారణంగా ఈనెల 13వ తేదీన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహానికి స్వగ్రామం సీకరి పంచాయతీ కొరుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులను చరవాణిలో సంప్రదించి.. సమాచారం సేకరించేందుకు ప్రయత్నించినప్పటికీ సంక్రాంతి సెలవులు కావడంతో వారు అందుబాటులో లేకపోవడంతో మృతికి గత కారణాలు పూర్తిగా తెలియరాలేదు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

ఘనంగా మకరజ్యోతి మహోత్సవాలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా గురువారం ఇక్కడి మకరజ్యోతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్వామి అయ్యప్ప దేవాలయం దరిలోని ఎన్టీఆర్ స్టేడియం రాత్రి జన సంద్రోహంతో కిటకిటలాడింది. ముందుగా సాయంత్రం సభాపతి అయ్యన్నపాత్రుడు ఆయన సతీమణి పద్మావతి, కుటుంబ సభ్యులతో అయ్యప్పస్వామి రథయాత్ర చేపట్టారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్టేడియంలో ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలకు ఉత్తర ప్రదేశ్ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ, సత్యసాయి జిల్లా జేసీ మౌర్య భరద్వాజ్ ప్రముఖ గాయకుడు మనో, సినీ సంగీత దర్శకుడు కోటి, గాయకుడు దీపికలను అయ్యన్న దంపతులు, తనయుడు విజయ్ ఘనంగా సత్కరించారు. ఇటీవల తెలుగు మహాసభలు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా అయ్యన్న దంపతులను గజమాలతో గజల్ శ్రీనివాస్ బృందం సన్మానించింది. కోటి, మనో ఆలపించిన గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 1983 నుంచి దివంగత సత్యనారాయణ స్వామి శ్రీకారం చుట్టిన ఈ వేడుకలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాలు అందరినీ ఒక్కటి చేసే సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని కొనియాడారు.

సభాపతి అయ్యన్న, పద్మావతి దంపతులను సత్కరిస్తున్న ఎంపీ రమేష్, గజల్ శ్రీనివాస్ తదితరులు, ఉత్తర ప్రదేశ్ అదనపు డీజీ సత్యనారాయణను సన్మానిస్తున్న అయ్యన్న

రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జాతీయ రహదారి సమీపంలో నిర్మిస్తున్న రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని గజల్ కళాకారుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. అనకాపల్లి జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ట్రస్ట్ సభ్యులు కిరణ్ శర్మ, నందన్ శర్మ, సాయి శర్మ, రామకృష్ణ ప్రసాద్, వీహెచ్‌పీ జిల్లా నాయకుడు శ్రీకాకృష్ణ తదితరులతో మాట్లాడారు. ఆలయ నిర్మాణ పనులపై ఆరా తీశారు. సమాజంలో భక్తి, శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

కోనల్లో.. గిరి'జనం' మధ్యలో..

పండగ చేసుకున్న హోంమంత్రి అనిత

కోటవురట్ల, పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఎత్తయిన కొండలు.. దట్టమైన అటవీ ప్రాంతం.. ఆ గ్రామానికి చేరుకోవాలంటే చిన్న మట్టిరోడ్డే గతి. చరవాణిలు సైతం పనిచేయవు. అదే మన్యం కాదు. కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ శివారు అణుకు గ్రామం. ఈ గ్రామంలో 38 గిరిజన కుటుంబాలున్నాయి. వీరికి తెలుగు స్పష్టంగా రాదు. గిరిజన భాష 'కువి'లో అనర్గళంగా మాట్లాడతారు. ఈ చిన్న కుగ్రామంలో గిరిజనుల మధ్య శుక్రవారం హోంమంత్రి వంగలపూడి అనిత, తన కుమారుడు నిఖిల్, కుమార్తె రేష్మితతో కలిసి కనుమ పండగ చేసుకున్నారు. దాదాపు మూడు గంటలు గిరిజనులతో మమేకమయ్యారు. నిత్యావసర సరకులు అందజేశారు. చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు ఇచ్చారు. గిరియువతతో కలిసి వాలీబాల్, కోలాటం ఆడారు. అందరితో కలిసి భోజనాలు చేశారు. తమ పండించిన పసుపు, టమోటా తదితర కూరగాయలను మంత్రికి అందించారు.

గిరిజన బాలుడికి తినిపిస్తున్న మంత్రి అనిత

సంబంధించిన ముఖ్యమంత్రి పత్రాన్ని అందరికీ చూపించారు. ఆమెకు తెదేపా మండల అధ్యక్షులు పెట్ల లింగన్ననాయుడు, సుంకర బాబ్జీ ఆధ్వర్యంలో గిరిజనులు మన సాంప్రదాయంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత పరదేశమ్మను దర్శించుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని, గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. గిరి యువత విద్యావంతులు కావాలని సూచించారు. పోలీసు సహా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు. గ్రామంలోని పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని ప్రకటించారు. ఇక్కడి నుంచి రోజూ గొట్టివాడకు 10 కి.మీ. నడిచి పిల్లలు బడికి వెళుతున్నారని.. ఆ ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి ట్యాంకు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. కాలుష్యానికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో మీతో పండగ చేసుకోవడం మరపురాని అనుభూతిగా పేర్కొన్నారు. 2014-19లో ప్రభుత్వం మారకపోతే రోడ్డు కూడా పూర్తయ్యేది, వైకాపా పాలనలో ఏటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. రేషన్ సరకులు నేరుగా గ్రామంలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబును ఆదేశించారు. జియో, ఎయిర్‌టెల్ నెట్ వర్క్ టవర్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను చెప్పారు. పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో పాటలు పాడించి, డ్యాన్సులు వేయించారు. పలక, నోట్ పుస్తకాలు, నూతన వస్త్రాలు అందించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి గిరిజన కుటుంబానికి, నిత్యవసర సరకులతో పాటు నూతన వస్త్రాలు, దుప్పట్లు అందించారు. ఎన్నికల ముందు తన కుమారుడు అఖిల్ ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి వచ్చానని, వాలీబాల్ కిట్, టీ షర్టులను గిరిజన క్రీడాకారులకు అందించారు. సరదాగా వారితో వాలీబాల్ ఆడారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాన్ని తిలకించారు. గిరిజనులతో కూర్చుని, కుమారుడు, కుమార్తెతో కలిసి భోజనం చేశారు. కూటమి నాయకులు కాశీనాయుడు, లింగన్ననాయుడు, జనార్దన్, జానకీ శ్రీను, గెడ్డం బుజ్జి, బాబ్జీ, ప్రకాశ్, వెంకటేష్, గోవిందు, పలు శాఖల అధికారులు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

అణుకుపై వరాల జల్లు...

అణుకు గ్రామంలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత ఆ గ్రామంపై వరాల జల్లు కురిపించారు. గ్రామానికి తారురోడ్డు వేసేందుకు రూ. 2.5 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీనికి

ఉత్సాహంగా ఎడ్లబండి పరుగుపోటీలు

ఎడ్లబండి పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో గ్రామ రైతుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లాస్థాయి ఎడ్లబండి పరుగు పోటీలను అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలలకు చెందిన 14 ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో చోడవరం మండలం సింహాద్రిపురం శివారు లెక్కలపాలేనికి చెందిన పెదపైడితల్లమ్మ ఎడ్లబండి ప్రథమస్థానంలో, దేవరాపల్లికి చెందిన జై వీరాంజనేయ ద్వితీయ, లెక్కల వెంకటరమణ (లెక్కలపాలెం) బండి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సి.ఎం.రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగ అన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ఇంట పంట పండుతుందన్నారు. పండగ రోజుల్లో కోడిపందేలు, గుండాటలు దూరంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా ఎడ్లబండి పరుగు పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ మునగపాకలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించి రైతుల్లో ఉత్సాహం నింపుతున్నారని ప్రశంసించారు. నాయకులు పెంటకోట విజయ్, కర్రి సాయికృష్ణ, దాడి ముసిలి నాయుడు, ఉల్లూరి నూకనరసింగరావు, దాడి శివ, అప్పలనాయుడు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బొజ్జన్న కొండ తీర్థం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం బొజ్జన్న కొండ తీర్థం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఏటా కనుమ పండగ నాడు బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో భ్రమణ తపస్వుల తీర్థం నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. మేళాలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. పిల్లలు ఆడుకోవడానికి వీలుగా త్వరలో పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం తీర్థం ఏర్పాట్లపై పోలీసులు, రెవెన్యూ కొండ సిబ్బందితో చర్చించారు. కొండపై భాగంలో ప్రాచీన బౌద్ధ విగ్రహాలు, లింగాల కొండ వద్ద స్తూపాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. కొండ దిగువ భాగంలో చిన్నారులు ఆటపాటలతో గడిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ గాలి పటాల పోటీలను ప్రారంభించారు. యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. పంచదార చిలకలు, గృహోపకరణ సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. డీఎస్పీ శ్రావణి, గ్రామీణ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందితో భారీ పోలీసు బందోబస్తు చేపట్టారు. కొండకు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ నిలిపివేయడంతో కేటాయించిన స్థలాల్లో వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టారు. కొండకు చేరుకునే సబ్బవరం రహదారి, తుమ్మపాల రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది.

తీర్థంలో పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, భారీగా తరలివచ్చిన జనం

సన్మార్గంలో నడిపే బుద్ధుని బోధనలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బుద్ధుని బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని, వాటిని అందరూ ఆచరించాలని నాగపూర్‌కు చెందిన బౌద్ధ భిక్షువు జ్ఞానదీప్ మహాథేరో పేర్కొన్నారు. అనకాపల్లి మండలం శంకరం బొజ్జన్నకొండ వద్ద శుక్రవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో బౌద్ధమేళా నిర్వహించారు. ముందుగా కొండ ప్రవేశ ద్వారం వద్ద పతాకావిష్కరణ చేశారు. కొండ ప్రధాన గుహ వరకు పంచశీల శాంతియాత్ర చేపట్టారు. గుహలో ధ్యానముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసిన అనంతరం కొండ దిగువ భాగంలో దమ్మ మహాసభ నిర్వహించారు. మహాథేరో మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచాన్ని మేలుకొల్పుతున్నాయని తెలిపారు. పంచశీల సూత్రాలను ఆచరించాలని... ద్వేషం, ఈర్ష్య, పగ, ప్రతీకారం విడనాడాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో బౌద్ధ ఆరామాలు ఘన చరిత్రకు నిదర్శనంగా నిలిచాయన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెయ్యి సిద్ధార్థ మాట్లాడుతూ శంకరం వద్ద ఏటా బౌద్ధ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కంబోడియా, మయన్మార్, నాగపూర్‌కు చెందిన భిక్షువులు తరలివచ్చారన్నారు. బొజ్జన్నకొండ వద్ద రూ. 15 కోట్లతో ఫుడ్‌కోర్ట్, లేజర్ షోకు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గొంది నవీన్, విశాఖపట్నం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు, పర్యాటకులు పాల్గొన్నారు.

బౌద్ధ విగ్రహం వద్ద ప్రార్థనలు చేస్తున్న మహాథేరో, బౌద్ధ ఉపాసకులు

ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో శుక్రవారం సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా సుమారు 52 రోజుల క్రితం షట్‌డౌన్ చేసి ఉత్పత్తిని నిలుపుదల చేశారు. అప్పటినుంచి అధికారులు, కార్మికులు శ్రమించి ఈ యూనిట్‌లోని అన్ని విభాగాలకు వార్షిక మరమ్మతులు పూర్తిచేసి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. ప్రస్తుతం 1, 2, 3, 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి యథావిధిగా జరుగుతోందని కార్మిక వర్గాలు తెలిపాయి.

ఆరుగురికి సంక్రాంతి పురస్కారాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పని చేసి కర్షక బాంధవుడిగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి నిలిచారని అనకాపల్లి జిల్లా తెదేపా, భాజపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వర రావు పేర్కొన్నారు. సమాజానికి పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ఆరుగురు సేవకులకు సంక్రాంతి సందర్భంగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి పేరిట అనకాపల్లిలో గురువారం పురస్కారాలు అందజేశారు. గణిత అష్టావధాని తోటకూర సాయిరామకృష్ణ (సామర్లకోట), ఉత్తమ సంఘం సేవకులు చందన వెంకట గంగాధరరావు (పశ్చిమ గోదావరి జిల్లా), 82 సార్లు రక్తదానం చేసిన ఎర్రగుంట కృష్ణారెడ్డి (అనంతపురం జిల్లా) జనరేషన్ యువ సంస్థ బోయిన నరేష్‌కుమార్ (విశాఖపట్నం), సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా అవయవదానం, అంతిమయాత్ర ఉచితంగా వాహనాలు నడుపుతున్న దాడి శ్రీను (పెందుర్తి), చదువుకు పేదరికం కారణం కాదని ఇటీవల నిరూపించి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న రుత్తల లీలాశ్రావణి (తూర్పుగోదావరి జిల్లా)కి పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. రామలింగస్వామి ట్రస్టు నిర్వాహకురాలు పార్వతి, ప్రతినిధులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, శివశంకరబాబు, కోరుకొండ బుచ్చిరాజు, కర్రి సన్యాసినాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త కె.వీరభద్రరావు, మళ్ల జగదీష్ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

బోసిపోయిన జాతీయ రహదారి

నక్కపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ ఆరంభానికి ముందు నిత్యం వాహనాలతో రద్దీగా కనిపించిన జాతీయ రహదారి కనుమ పండగ రోజయిన శుక్రవారం వెలవెలబోయింది. పండగ హడావుడితో అంతా గ్రామాలకే పరిమితం కాగా జాతీయ రహదారిపై స్తబ్దత నెలకొంది. కార్లు, బస్సులే కాకుండా ఇతర రవాణా వాహనాల సంఖ్య తగ్గిపోయింది. దీంతో జిల్లాలో అనకాపల్లి, కశింకోట, తాళ్లపాలెం, అడ్డురోడ్డు, నక్కపల్లి, కాగిత టోల్‌ప్లాజా, వేంపాడు, పాయకరావుపేట వై కూడళ్లలో సందడి కనిపించలేదు. ముఖ్యంగా టోల్‌గేట్ కౌంటర్లన్నీ బోసి పోయాయి. రాకపోకలు సగానికి పైనే పడిపోయాయి. ఇక దుకాణాలు సైతం మూతబడ్డాయి.

టోల్‌గేట్ వద్ద ఖాళీగా ఉన్న కౌంటర్లు

పండగ వేళ విషాదం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: పండగపూట విషాదం నెలకొంది. సంక్రాంతి తీర్థం తిలకించేందుకు వెళ్తున్న యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో ఒకరు దుర్మరణం పాలవగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నక్కపల్లి సీఐ జె. మురళి కథనం ప్రకారం... ఎస్.రాయవరం మండలం గెడ్డపాలేనికి చెందిన దాడిశెట్టి పవన్ (18) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తన స్నేహితులైన రాంబిల్లి మండలం మర్రిపాలేనికి చెందిన మడగల సతీష్, కాగితకు చెందిన వంగలపూడి అభిషేక్‌తో కలిసి ఎస్.రాయవరంలో తీర్థానికి కాగిత నుంచి ద్విచక్ర వాహనంపై ముగ్గురూ గురువారం బయలుదేరారు. వీరు నక్కపల్లి ఆసుపత్రి కూడలి దాటగానే వెనుక నుంచి వచ్చిన లారీ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కిందపడగా, పవన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనానికి వీరి బైకు తగలడంతో దానిపై ఉన్న విజయనగరం జిల్లా కొత్తపాలేనికి చెందిన ఎస్.వరప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు వీరిని సమీపంలోని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందాడు. అభిషేక్, సతీష్‌లకు ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. పవన్‌కు సౌమ్యుడిగా పేరుంది. ఇతడి తల్లి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా, తండ్రి శ్రీనివాసరావు నాలుగేళ్ల క్రితం అడ్డురోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి తన సోదరుడు నవీన్ సంరక్షణలో నక్కపల్లి మండలం ఉపమాకలోనే ఉంటున్నాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు అధిక సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదంపై మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.సన్నిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఇదే మార్గంలో వెళ్లిన హోం మంత్రి అనిత విషయం తెలుసుకుని బాధితులకోసం ఆరా తీయడంతోపాటు పోలీసులతో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను సహకార సంఘం ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పరామర్శించి ఓదార్చారు.

పవన్ (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: వనబసింగి పంచాయతీలోని కొత్తూరు కూడలి నుంచి పెదగుడ వెళ్లే మార్గంలో కొత్తూరుకు సమీపంలోని కల్వర్టు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. నలుగురికి గాయాలయ్యాయని ఎస్సై నాని తెలిపారు. టొంగికోట గ్రామానికి చెందిన దేశిధి అనిల్‌కుమార్, కరింగ్యా భరత్‌కుమార్(17), తరుణ్ కుమార్.. ద్విచక్రవాహనంపై కొత్తూరు వైపు వస్తున్నారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సెక్యూరిటీగార్డులుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, రంజిత్ పాడేరు నుంచి పెదగుడ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ రెండు బైక్‌లు కొత్తూరు వద్ద ఢీకొనగా.. భరత్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అనిల్‌కుమార్, తరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లు రంజిత్, లక్ష్మణ్‌లకు గాయాలయ్యాయి. వీరిని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. భరత్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రంజిత్, లక్ష్మణ్.. శిరస్త్రాణం ధరించి ఉన్నారని, వారిని పాడేరు నుంచి కేజీహెచ్‌కు తరలించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సంక్రాంతి పండగ రోజున ఒకే గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలవ్వగా.. ఒకరు మృతి చెందడంతో టొంగికోటలో విషాదం అలముకుంది.

సంఘటనా స్థలంలో ద్విచక్రవాహనం, స్థానికులు

బీఎన్ రహదారిలో గుంతల పూడ్చివేత

బుచ్చెయ్యపేట: యువకులు శ్రమదానంతో శుక్రవారం బీఎన్ రహదారిలో గుంతలు పూడ్చివేశారు. బంగారుమెట్ట దగ్గర గుంతలు పడి రోడ్డు అధ్వానంగా ఉంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు గురువారం రాత్రి బైక్‌పై వెళ్తూ గుంతల్లో పడి ప్రమాదానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానిక యువకులంతా స్పందించి సొంతనిధులతో పిక్క, డస్ట్ తెప్పించి గుంతలను పూడ్చివేశారు. బీఎన్ రోడ్డును అభివృద్ధి చేయించాలని వీరంతా కోరుతున్నారు.

గుంతలు పూడుస్తున్న యువకులు

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని పెదరామభద్రపురం-శ్రీరాంపురం మధ్య దక్కన్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం పల్సర్ బైకు, స్కూటీ ఢీకొన్నాయి. తునిలోని రామకృష్ణకాలనీకి చెందిన నామవరపు లోకేష్, పితాన కార్తీక్‌కుమార్ పల్సర్ బైకుపై పెదరామభద్రపురం వైపు నుంచి శ్రీరాంపురం వెళుతున్నారు. ఇదే సమయంలో శ్రీరాంపురం నుంచి నామవరం వైపు ఎలక్ట్రికల్ స్కూటీపై వెళుతున్న వ్యక్తిని దక్కన్ రోడ్డు కూడలి వద్ద అతివేగంగా పల్సర్ నడిపి ఢీకొన్నారు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి పట్టణంలోని రాజుగారిబీడుకు చెందిన వారు. ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని సీఐ అప్పన్న చెప్పారు.

ఢీకొన్న బైకులు

అప్పులబాధతో ఆత్మహత్య

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో బలిఘట్టానికి చెందిన **కోరుపోలు మల్లేశ్వరరావు** (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ గపూర్ కథనం ప్రకారం ఈనెల 12వ తేదీన గడ్డి మందు తాగి బలవన్మరణానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదేరోజు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్టు సీఐ వివరించారు. అప్పులు చేసి భవన నిర్మాణాల సెంట్రింగ్ పనులకు ఉపయోగపడే సామగ్రి కొనుగోలు చేశారు. అప్పు ఇచ్చిన వారు కోర్టు నోటీసు పంపడంతో ఆవేదనకు గురై గడ్డిమందు తాగాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తీరంలో గుర్తుతెలియని మృతదేహం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాల్మన్‌పేట సముద్ర తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పాయకరావుపేట ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తీరానికి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్లు స్థానిక మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీరానికి వెళ్లి పరిశీలించగా చనిపోయిన వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలకు పైగా ఉంటుందన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

31 మంది జూదరులపై కేసులు

మునగపాక, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహించిన పేకాట, గుల్లాట శిబిరాలపై ఎస్సై ప్రసాదు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. మునగపాక, నాగవరం, ఒంపోలు, తోటాడ, రామగిరి, నాగులాపల్లి, మల్లవరం గ్రామాల్లో గుల్లాటలు, పేకాట ఆడుతున్న 31 మందిని అదుపులోకి తీసుకొని 15 కేసులు నమోదు చేశామన్నారు. చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పట్టవా?

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం పంచాయతీ పరిధిలో కృష్ణపాలెం సమస్యలతో సతమతమవుతోంది. పైపులైన్లు తరచూ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ గ్రామంలో కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంక్ వద్ద పైపులు దెబ్బతిని ఈ ప్రాంతంలో నీరు నిలిచి తాగునీటి కాలుష్యానికి దారితీస్తోంది. ఒక్కోసారి పైపుల ద్వారా పురుగులు కూడా వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో లీకేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. కాలువల్లో పూడికలను తీయకపోవడంతో చెత్త చెదారంలో పూడికపోయాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని చెబుతున్నారు.

డ్రైనేజీలో పూడిక

పండగ వేళ.. గ్రావెల్ వేట

చీడికాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ వేళ అక్రమార్కులు రెచ్చిపోయారు. పండగ సెలవులు కావడంతో పట్టించుకునేవారు ఉండరని చీడికాడ, జైతవరం, బైలపూడి, వీరభద్రపేట ఇలా పలు గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలకు తెరలేపారు. రాత్రి, పగలు తేడా లేకుండా పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టారు. ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లతో తరలించారు. చీడికాడ మండలంలోని పలు ప్రాంతాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. అటువైపు అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు. అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు అరికట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌పై గ్రావెల్ తరలింపు

పండగ రోజూ నిరసన

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడ చక్కెర కర్మాగారం వద్ద చెరకు రైతులు, కార్మికులు చేపట్టిన దీక్షలు పండగ రోజులు గురు, శుక్రవారాల్లో కూడా కొనసాగించారు. బకాయిల నగదు చెల్లించాలంటూ 15 రోజులుగా కర్మాగారం వద్ద చెరకు రైతులు, కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. పండగ రోజు ఇంట్లో పిల్ల పాపలతో ఆనందంగా గడపాల్సిన మమ్మల్ని రోడ్డున పడేశారంటూ వాపోయారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో చినఅప్పన్నపాలెం, అంభేరుపురం, దామునాపల్లి గ్రామాల రైతులతో పాటు రెడ్డిపల్లి అప్పలరాజు, కోన మోహన్, శరగడం రామునాయుడు, పొట్నూరి అప్పలరాజు పాల్గొన్నారు.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

600 మందికి వైద్యసేవలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: కాశీపురంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూరాలజిస్ట్ డా. ఆదిరెడ్డి దేముడుబాబు సారథ్యంలో నిర్వహించిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలకు స్పందన లభించింది. ఇదే గ్రామానికి చెందిన వైద్య నిపుణురాలు ఆదిరెడ్డి సుష్మ కళ్యాణి, డా. పూడి శివాజీ వైద్య బృందం సుమారు 600 మందికి సేవలందించింది. ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారందరికీ దేముడుబాబు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

పది విద్యార్థులకు ప్రతిభాపోటీలు: ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

రక్తదాన శిబిరంలో వైద్య నిపుణులు

దిల్లీలో చిక్కిన గంజాయి నిందితుడు

నాతవరం, న్యూస్‌టుడే: గంజాయి కేసులో తప్పించుకున్న నిందితుడిని దిల్లీలో నాతవరం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నాతవరం ఎస్సై తారకేశ్వరరావు కథనం ప్రకారం.. ఇక్కడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన కేసులో పశ్చిమ దిల్లీకి చెందిన రోహిత్ కుమార్ ప్రధాన నిందితుడు. కేసు నమోదు చేసినప్పటి నుంచి నాలుగేళ్లుగా ఆయన పరారీలో ఉన్నాడు. ఇతనిపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. నిందితుడు దిల్లీలో నివాసం ఉన్నట్లు అందిన సమాచారంతో ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలతో నాతవరం ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అక్కడి పోలీసు సహకారంతో చాకచక్యంగా పట్టుకుని తీసుకొచ్చామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైని, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నిందితునితో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	145	142
లైవ్	172	162
డ్రెస్డ్	249	294
స్కిన్‌లెస్	284	304

(c) eenadu

పర్యాటక ప్రాంతాల్లో రద్దీ

సంక్రాంతి పండగ, వరుస సెలవులతో అరకులోయకు పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటక కేంద్రాలు కిటకిటలాడాయి. మాడగడ వ్యూపాయింట్ వద్ద సూర్యోదయాన్ని వీక్షించేందుకు తెల్లవారుజామున నాలుగు గంటలకే వందలాది మంది చేరుకున్నారు. పొగమంచు, చలిలో మంటలు వేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. స్థానిక థింసా కళాకారులతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.
– న్యూస్‌టుడే, అరకులోయ పట్టణం

అరకులోయ మాడగడ సన్‌రైజ్‌పాయింట్‌పై పర్యాటకుల కోలాహలం

కొత్తపల్లి జలపాతంలో..

కొత్తపల్లి కళకళ

జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. జలపాతాన్ని సినీ నటుడు గోపికర్ సందర్శించారు. ఇక్కడి అందాలు చూసి మంత్రముగ్ధులయ్యారు. జలపాతం అద్భుతంగా ఉందన్నారు. స్నేహితులు, కుటుంబంతో కలిసి మళ్లీ వస్తామన్నారు.
– న్యూస్‌టుడే, జి.మాడుగుల

ఘనంగా దేవతమ్మ అమ్మవారి పండగ

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో దేవతమ్మ పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. అరుంధతి కాలనీలో కనుమ రోజున ఇక్కడ అమ్మవారి పండగను నిర్వహిస్తుంటారు. శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్చుతూ అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా దేవతమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. తీర్థంలో తినుబండారాలు, పిల్లల ఆట వస్తువులు అమ్మకాలు జరిగాయి.

ఇంటింటికీ నీరు..ఇంకెన్నాళ్లకిస్తారు?

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ఎన్నో ఏళ్ల నుంచి మహిళలు పడుతున్న కష్టాలు తీర్చి.. ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జలజీవన్‌మిషన్ పనులు పడకేశాయి. ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్య కమిటీ పర్యవేక్షణలో చేపట్టిన నీటి పథకాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మరో రెండు నెలల్లో వేసవి ప్రారంభం కానుంది. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో రక్షిత నీటి వసతులు లేక గెడ్డలు, ఊటలపై గిరిజనులు ఆధారపడుతున్నారు. ముంచంగిపుట్టు మండలంలోని 375 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. వాటిలో 72 గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. మరో 120 గ్రామాల్లో పనులకు బిల్లులు విడుదలకాక పనులు మధ్యస్థంగా నిలిచిపోయాయి. అల్లూరి జిల్లావ్యాప్తంగా రూ.30 కోట్ల మేర బిల్లులు విడుదలకాలేదు. ముంచంగిపుట్టు మండలంలో రూ.3 కోట్ల మేర బిల్లులు విడుదల కాకపోవటంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. నీటి పథకాల నిర్మాణాలు పూర్తికాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. పైపులు తుప్పల మధ్య నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ట్యాంకులు అలంకారప్రాయంగా పడి ఉన్నాయి. నిధుల లేమితో 145 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం కాలేదు. 23 పంచాయతీల్లోని మరో 33 గ్రామాలకు పథకాలు మంజూరు చేయక ఆ గ్రామాల గిరిజనులు రక్షిత నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా పైపులు

గుత్తేదారులకు నోటీసులు

జలజీవన్‌మిషన్ పనులకు బిల్లులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. మార్చి నెలాఖరువరకు పనులు పూర్తి చేసేందుకు గడువు ఉంది. గడవులోగా నిర్మాణాలు పూర్తి చేసి రక్షిత నీరు ఇంటింటికీ ఇవ్వాలని గుత్తేదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. – రాజేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ముంచంగిపుట్టు

కొత్తులబయలులో ఊటనీరు మోసుకొస్తున్న మహిళలు

ఊటలే దిక్కు

ముంచంగిపుట్టు మండలంలో జలజీవన్ మిషన్ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు, గెడ్డల్లోని ఊటనీరు వినియోగిస్తున్నారు. కుమడ, బూసీపుట్టు, వనుగుమ్మ, రంగబయలు, కిలగాడ, ఏనుగురాయి, బుంగాపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం, బాబుసాల, జర్జుల, కరిముఖిపుట్టు, బంగారుమెట్ట పంచాయతీల్లోని గ్రామాల్లో నీటి కోసం అల్లాడుతున్నారు. కొత్తులబయలు గ్రామంలో పథకం మంజూరైనా పనులు ప్రారంభించక.. గ్రామంలో మహిళలు పొలం చెంతన ఊటనీరు వినియోగిస్తున్నారు. వేసవిలోగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భళా.. భళా.. కనువిందయ్యేలా!

రోలుగుంట, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల సందర్భంగా బుచ్చెంపేటలో బాల, బాలికలకు ఏకపాత్రాభినయం, భరతనాట్యం, బృంద నాట్యం తదితర పోటీలు నిర్వహించారు. వేదికపై వీరి కళాభినయం ఔరా.. అనిపించేలా మురిపించారు. చూపరులను కట్టిపడేశారు.

భరతనాట్యంలో బాలికలు

నేడు దేవరాపల్లికి పుట్టపర్తి అఖండజ్యోతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్య సాయి బాబా అఖండ జ్యోతి శనివారం సాయంత్రం 6 గంటలకు దేవరాపల్లి చేరుకుంటుందని సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌ఛార్జ్ సీహెచ్. వి. రవి శంకర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు సబ్బవరం నుంచి ఈ అఖండజ్యోతి బయలుదేరుతుందన్నారు. అక్కడి నుంచి కె.కోటపాడు మండలం చంద్రయ్యపేట, జోగన్నపాలెం, వారాడ మీదుగా ములకలాపల్లి, వేచలం, ఎ.కొత్తపల్లి, కాశీపురం మీదుగా సాయంత్రానికి దేవరాపల్లిలోని సత్యసాయి ధ్యాన మందిరానికి చేరుకుంటుందన్నారు.

అదుపు తప్పితే అంతే!

పాడేరు-జోలాపుట్టు ప్రధాన రహదారిలోని వంతెనలకు ఇరువైపులా రక్షణగోడలు దెబ్బతిన్నాయి. తురకలవలస, అరడకోట, చుట్టుమెట్ట, కొత్తూరు గ్రామాలకు సమీపంలో ఉన్న వంతెనల రక్షణగోడలు కూలిపోయాయి. అరడకోట సమీపంలోని వంతెనకు ఒక వైపు ఉన్న రక్షణ గోడ గతంలో వరదకు పడిపోయింది. వాహన చోదకులు ఆదమరిస్తే ఇబ్బందే. కొత్తూరు కూడలి వద్ద ఉన్న చిన్నపాటి వంతెనకు ఇరువైపులా రక్షణగోడ నిర్మించక గతంలో వ్యాన్ బోల్తాపడి ఒకరు మృతి చెందారు. రెయ్యలగెడ్డ వంతెనపై నుంచి ఆటో బోల్తా పడింది. వంతెనలకు మరమ్మతులు చేపట్టి, రక్షణ గోడలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.
– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

అరడకోట వద్ద రక్షణగోడ లేని వంతెన

అంగన్‌వాడీలో అపాయం

స్లాబు కుంగిన అంగన్‌వాడీ భవనం

ఏనుగురాయి పంచాయతీ కొండబంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గోడలు బీటలువారి, స్లాబు కుంగి, ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. గ్రామానికి సమీపంలోని భవనం కూలితే చిన్నారులతోపాటు భవనం సమీపంలోని ఇళ్లకు సైతం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భవనాన్ని కూల్చేసి కొత్త భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

శిథిలావస్థలో జీసీసీ భవనాలు

గిరిజన సహకార సంస్థ భవనాల పరిస్థితి దారుణంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో డిపోలపై ఎటువంటి పర్యవేక్షణ లేదు. ఈ భవనాల్లో సరకు నిల్వ చేయలేక పరాయి పంచన ఉంచాల్సి వస్తోంది. పెదబయలు మండలంలో 39 జీసీసీ డిపోలు ఉన్నాయి. వీటిలో 22 డిపోలు లేక పరాయి పంచన నిర్వహిస్తున్నారు. మిగిలిన 17 డిపోల్లో కొన్ని శిథిలావస్థ, మరికొన్ని మరమ్మతుకు గురయ్యాయి. పెదబయలు మండలం లక్ష్మీపేట డిపో సరకుల నిల్వ చేసే అవకాశం లేకుండా పోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేటు వృక్షల ఇళ్లలో నిల్వ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్త భవనాలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై జీసీసీ మేనేజర్ అప్పన్నను వివరణ కోరగా.. కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.
– పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

లక్ష్మీపేటలో జీసీసీ డిపో భవనం ఇలా..

రోడ్డు పక్కన చెత్త.. తప్పని చింత

పాడేరు పీఎంఆర్‌సీ మార్గంలోని కేవీఆర్ లాడ్జి ఎదురుగా చెత్తను తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గాలి వేస్తే రోడ్డుపై వెళ్తున్న వారిపై చెత్త ఎగిరి పడుతోంది. దీంతో ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రోడ్డు పైన ఉన్న వ్యర్థాలే తొలగిస్తున్నారు. పురవీధుల్లో ఉన్న చెత్త తొలగించకపోవడంతో లోచలిపుట్టు, గుడివాడ, పీఎంఆర్‌సీ ప్రధాన కూడళ్లలో ఉన్న చెత్త తొట్టెల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి రోడ్డుపై ఎగిరిపడుతోంది. ఈ విషయంపై ఈఓఆర్డీని రమేష్‌ను వివరణ కోరగా సంక్రాంతి పండగకు పారిశుద్ధ్య కార్మికులు సెలవులకు వెళ్లిపోవడంతో చాలా చోట్ల చెత్త పేరుకుపోయింది. రెండు రోజుల్లో ఎక్కడైతే చెత్త నిండిపోయిందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, పాడేరు

పీఎంఆర్‌సీకి వెళ్లే మార్గంలోని రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం- కాకరపాడు బస్సు సర్వీసు ప్రారంభం

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఏలేశ్వరం నుంచి అన్నవరం, జడ్డంగి, రాజవొమ్మంగి, కింద్ర, తాళ్లపాలెం మీదుగా కాకరపాడుకు బస్సు సర్వీసు గురువారం ప్రారంభమైంది. కాకరపాడువాసులు ఏలేశ్వరం నుంచి బస్సు సర్వీసు కావాలని విన్నవించడంతో డిపో మేనేజర్ స్పందించారు. రాజవొమ్మంగి, కింద్ర, తాళ్లపాలెం, బోయపాడు మీదుగా కాకరపాడుకు రోజుకు రెండుసార్లు (ఉదయం 9 గంటలు, సాయంత్రం 6.30 గంటలకు)కాకరపాడు గ్రామానికి బస్సు వస్తోంది. బస్సు సర్వీసు నడపడంపై ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్సుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

పొంచి ఉన్న ప్రమాదం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సు దాటిన తరువాత రైవాడ రోడ్డులో వైర్ల ఆధారంతో కూలడానికి సిద్ధంగా ఉన్న టెలిఫోను స్తంభం ఇది. సెల్‌ఫోన్లు రాక ముందు ఇళ్లకు ఫోను సదుపాయం కల్పించడానికి టెలిఫోను ఎక్ఛేంజీ నుంచి వైరు వెయ్యడానికి వేసిన స్తంభాల్లో ఇదొకటి. సెల్‌ఫోన్ల వాడకంతో టెలిఫోన్ల వాడకాన్ని జనం మర్చిపోయారు. అప్పట్లో వేసిన స్తంభాలు నిరుపయోగంగా ఉండిపోవడంతో క్రమేపీ నేలకు ఒరిగిపోతూ శుక్రవారం మధ్యాహ్నానికి భూమికి అతి సమీపం వరకు వాలిపోయింది. దానికి ఉన్న వైర్లు ఆధారంగా ఇంకా ఇలా ఉంది. దీనిని ఇలాగే వదిలేస్తే ఎవరో ఒకరి మీద కూలిపోయే ప్రమాదం ఉంది.

సింగర్బలో ఊరేగింపు

బోడిపుట్టులో బహుమతులు పొందిన చిన్నారులతో గ్రామస్థులు

కొర్రాయిలో గిరిజనుల థింసా నృత్యం

ఇంటింటా సందడి.. ఊరంతా ఉత్సాహం

పాడేరు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో మన్యంలో సందడి నెలకొంది. శుక్రవారం కనుమ సందర్భంగా గిరిజన యువకులు పరిసర గ్రామాలకు వెళ్లి సేరిబుడియా వేషధారణల్లో నృత్యాలు చేసి చందాలు(పంజోర్లు) వసూలు చేశారు. పాడేరు పట్టణానికి పలు గ్రామాల యువకులు వచ్చి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమ్మరిపుట్టు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పాడేరు సర్పంచి ఉషారాణి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ముంచంగిపుట్టు/గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: జోలాపుట్ ఎల్‌ఎఫ్ క్యాంపులో మహిళలకు మ్యూజికల్ ఛైర్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో వారణాసి సుస్మిత, జి.సంధ్యారాణి, మ్యూజికల్ ఛైర్ పోటీలో సూరు మీనాక్షి విజేతలుగా నిలిచారు. జోలాపుట్ సర్పంచి దొర నీలకంఠం, ఎంపీటీసీ సభ్యురాలు బి.కమల, స్థానిక నాయకులు సులేమాన్, ప్రఫుల, యువజన సంఘం తదితరులు పాల్గొన్నారు. జర్రెల పంచాయతీలోని మండిబ గ్రామంలో మహిళలు థింసా నృత్యాలతో అలరించారు. ఏనుగురాయి పంచాయతీలోని బోడిపుట్టు గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, దామోదరం దంపతులు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అరుకు సంత బయలులో సేరుబుడియాల సందడి నెలకొంది.

కొయ్యూరు, సీలేరు, న్యూస్‌టుడే: కొయ్యూరు, రాజేంద్రపాలెం, సింగవరం తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సింగవరంలో విజేతలకు జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ బహుమతులు పంపిణీ చేశారు. రేవళ్లులో సర్పంచి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలను రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ చేతులమీదుగా అందించారు. మంపలోని అల్లూరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నీ విజేతలకు తెదేపా నేతలు వడపల రామారావు, లింగమూర్తిలు బహుమతులు పంపిణీ చేశారు. రాజేంద్రపాలెంలో సర్పంచి సింహాచలం, తెదేపా నేతలు ఖాన్, వరహాలబాబు, జనసేన నేత బుజ్జిబాబు తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ధారకొండలో సీతారాముల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లులు, కుర్చీ ఆట, తాడాట, క్విజ్ పోటీలు నిర్వహించారు.

అనంతగిరి, హుకుంపేట, న్యూస్‌టుడే: కొండిబ పంచాయతీ సింగర్బ, సాడ గ్రామాల్లో గిరిజన సంప్రదాయం ప్రకారం ముతా సంబరాలు నిర్వహించారు. వారం రోజులపాటు నిర్వహించిన ఈ సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. గిరిజన సంప్రదాయ థింసా, ఇతర నృత్యాలతో సందడి చేశారు. కొంతిలిలో వేడుకలు అంబరాన్నంటాయి. ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా గ్రామానికి చేరుకుని సందడి చేశారు.

జి.మాడుగుల, చింతపల్లి, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలంలో సంక్రాంతి, కనుమ వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించుకున్నారు. పశువులకు రైతులు పూజలు చేశారు. పెదబరడలో గిరి మహిళలు సంప్రదాయ థింసా నృత్యాలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు.

రేవళ్లులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి, జీసీసీ మాజీ ఛైర్మన్ ప్రసాద్

జోలాపుట్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

ఒంటిపాకలో గిరిజనుల సందడి

పెదబరడలో మహిళల కోలాటం

ధారకొండలో ముగ్గుల పోటీలు

కొంతిలిలో..

ఉద్యోగ సాధకులకు సత్కారం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కిలగాడలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారిని సంక్రాంతి పండగ సందర్భంగా శుక్రవారం సత్కరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో కిలగాడ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలతోపాటు ఆరుగురు ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. మరో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. దుంప నీలిమ, సమాల నరేంద్రబాబు, బుడేయి విశాలాక్షి, ప్రభాకర్, విజయమురళి, గౌతమి ఉపాధ్యాయులుగా.. రాధిక, భీముని సాయికృష్ణపడాల్‌లు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. సర్పంచి శివశంకర్ ఆధ్వర్యంలో వీరిని సత్కరించారు. జీఓ నం.3 రద్దు చేసినప్పటికీ.. ఒకే గ్రామానికి చెందిన 8 మంది ప్రభుత్వ కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచారని పలువురు కొనియాడారు. పడాల్‌దాసు, కేశవరావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న గ్రామస్థులు

నిబంధనలు పాటించండి

సీలేరు, న్యూస్‌టుడే: పండగ వేళ వాహనదారులు భద్రంగా ప్రయాణించాలని గూడెం కొత్తవీధి ఎస్సై సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం గూడెంకొత్తవీధి కూడలిలో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్నవారికి ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

గూడెంకొత్తవీధి కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్

తాజంగి అందాలు అద్భుతం

చింతపల్లి, న్యూస్‌టుడే: తాజంగి జలాశయం అందాలు అద్భుతంగా ఉన్నాయని గిరిజన సంక్షేమశాఖ డీడీ పరిమళ అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి తాజంగి జలాశయాన్ని సందర్శించారు. బోటు షికారు చేశారు. స్ట్రాబెర్రీ తోటలను పరిశీలించారు.

గ్రంథాలయానికి గూడు కరవు

విద్యార్థులకు పుస్తక జ్ఞానం అందించడంతోపాటు.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఉపయోగపడే పుస్తకాలు లభించే గ్రంథాలయానికి అనంతగిరిలో గూడు కరవైంది. ఆది నుంచి దీనికి సరైన భవనం లేకపోవడంతో నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనంతగిరిలో మండల పరిషత్‌కు చెందిన పాడుబడిన పాత క్వార్టర్స్ భవనాలు ఉండగా.. చాలాకాలంగా ఇందులోనే గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ చదువుకునేందుకు వీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తుపాను సమయంలో విలువైన పుస్తకాలు తడిచిపోయాయి. అనంతగిరిలో పలు పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉండటంతో ఇక్కడకు పుస్తక పఠనానికి వచ్చే విద్యార్థుల సంఖ్య అధికంగానే ఉంటుంది. సంబంధితశాఖ అధికారులు స్పందించి గ్రంథాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు. – అనంతగిరి, న్యూస్‌టుడే

గ్రంథాలయం నిర్వహిస్తున్న మండల పరిషత్‌కు చెందిన పాత భవనం

రాళ్లదారిలో రాకపోకలెలా?

కిలగాడ పంచాయతీలోని తరిగెడ, కొత్తులబయలు గ్రామానికి రహదారి సదుపాయం సమకూరక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు, జోలాపుట్టు ప్రధాన రహదారి నుంచి రెండు కి.మీ.ల దూరంలో ఉన్న తరిగెడ గ్రామానికి తారురోడ్డు నిర్మిస్తామని నాలుగేళ్ల కిందట కంకర పోసి వదిలేశారు. పెదపేట రోడ్డు నుంచి కొత్తులబయలు వరకు ఉన్న మూడు కి.మీ.ల మార్గంలోనూ కంకర పోసి వదిలేశారు. కంకర రోడ్డులో కాలినడకన ప్రయాణం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. కరిముఖిపుట్టు పంచాయతీలోని గొర్రెలమెట్ట మార్గంలోనూ ఇదే పరిస్థితి. తారురోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

రాళ్లుతేలిన తరిగెడ రహదారి

సంపద కేంద్రం.. నిరుపయోగం

గ్రామాల్లో చెత్తను సేకరించి.. తద్వారా సంపదను సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతోంది. అరకులోయ మండలంలోని మాడగడ సమీపంలో సంపద కేంద్రాన్ని నిర్మించారు. ఆరు నెలల క్రితం సంపద కేంద్రం పైకప్పు రేకులు ఎగిరిపోయి వినియోగంలో లేకుండా పోయింది. ఇక్కడ వర్మీకంపోస్ట్ తయారీ సైతం జరగడం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ పనులకు, క్లాప్ మిత్రల వేతనాలకు సొమ్మును పంచాయతీ అధికారులు వెచ్చిస్తున్నారు. సంపద కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– అరకులోయ, న్యూస్‌టుడే

పైకప్పు పోయిన సంపద కేంద్రం

వీధి దీపాలతో కొత్తకళ!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రధాన రహదారిలో ఆర్డీవో కార్యాలయం నుంచి సరస్వతి కూడలి వరకు ఏర్పాటు చేసిన గోవా తరహా వీధి దీపాలను ఎంపీ సి.ఎం.రమేశ్‌తో కలిసి శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం రాత్రి ప్రారంభించారు. వీటికోసం అనకాపల్లి ఎంపీ రూ.30 లక్షలు సమకూర్చారు. అయ్యన్న మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కార్యాలయం కూడలి నుంచి శ్రీకన్య కూడలి మీదుగా పెదబొడ్డేపల్లి కూడలి వరకు ఏర్పాటు చేయాలన్నది తన అభిమతం అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులంతా పాల్గొన్నారు.

వీధి దీపాలను ప్రారంభిస్తున్న సభాపతి అయ్యన్న, ఎంపీ రమేశ్ తదితరులు

(c) eenadu

ఈనాడు
అమరావతి
గుంటూరు
శనివారం జనవరి 17, 2026

పోలీసుల పల్లకీ సేవ!

వేంకటేశ్వరస్వామి అమ్మవార్ల పల్లకీ మోస్తున్న తెనాలి డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

గుంటూరు జిల్లా తెనాలి వైకుంఠపురం ఆలయంలో కొలువైన శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వినూత్నంగా పోలీసుల సేవలందుకుంటున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఏటా స్వామి వారి తెప్పోత్సవం జరుగుతుంటుంది. ఈ క్రమంలో బందోబస్తుగా వచ్చే పోలీసు అధికారులు, సిబ్బంది అలంకృతులైన స్వామి అమ్మవార్ల పల్లకీని ఆలయం వద్ద నుంచి మోసుకొచ్చి తెప్పోత్సవం నిర్వహించే నిజాంపట్నం కాలువలోని పడవ పై వున్న అర్చకులకు అప్పగిస్తారు. స్వామి వారి తెప్పోత్సవం తెనాలి డీఎస్పీ కార్యాలయం వరకు కొనసాగుతుంది. స్వామి వారికి డీఎస్పీ.. నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేయడంతో ముగుస్తుంది. రెండు దశాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతుండటం విశేషం. - న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

వేడుకగా నారసింహుని పార్వేట ఉత్సవం

శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామి

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి పార్వేట ఉత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గోపూజ చేశారు. సాయంత్రం స్వామి వార్లను శ్రీదేవి, భూదేవి సమేతంగా పార్వేటకు తీసుకెళ్లారు. ఆలయం వద్ద నుంచి మంగళగిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. బైపాస్ రోడ్డులో నాలుగు కాళ్ల మండపం వద్ద స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజల అనంతరం వడ్లపూడి(రాజీవ్ సెంటర్) మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈవో సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మునక్కాడ రూ.35!



న్యూస్‌టుడే, పొన్నూరు

ఎంత ఎండ ఉంటే.. అంతగా పండే మునగ పంట చలికి చిక్కింది. గణనీయంగా దిగుబడులు తగ్గడంతో మార్కెట్లో దాని రేటు అమాంతం పెరిగిపోయింది. ఒక్కొక్కటి రూ.35 వరకు విక్రయిస్తున్నారు. ధరలు బాగా పెరగడంతో రైతుబజార్లలో ఇవి కనరాని పరిస్థితి నెలకొంది. పొన్నూరు కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్‌లో గతంలో 180 నుంచి 200 కేజీల వరకు మునగ కాయలు విక్రయించేవారు. నేడు అదే మార్కెట్‌లో కాయ ధర ఎక్కువగా ఉండటంతో వారం నుంచి రోజుకు 25 నుంచి 30 కేజీలే విక్రయిస్తున్నారు. గతంలో రైతుబజార్లలో కేజీ రూ.50 నుంచి రూ.75 వరకు విక్రయించారు. ప్రస్తుతం కేజీ రూ.250 చెబుతున్నారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు ప్రైవేటు మార్కెట్లలో మునగ కాయ రూ.30 నుంచి రూ.35 వరకు అమ్ముతున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.

జిల్లాలోని మంగళగిరి, తుళ్లూరు, పొన్నూరు తదితర ప్రాంతాల్లో సాగయ్యే మునగ తోటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. జిల్లాలో పంట తగ్గిపోవడంతో వ్యాపారులు తమిళనాడు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఆ రాష్ట్రంలో జనవరి నుంచి జూన్ వరకు పంట అందుబాటులో ఉంటుంది. ధర ఎక్కువగా పలకడంతో వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేరు. రైతుబజారులో ముందుగా చెప్పిన వారికి కాయలు తెచ్చి అమ్ముతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మాట వింటే ఒట్టు... పట్టాలి ఓ పట్టు

ఈనాడు – అమరావతి
న్యూస్‌టుడే – పట్టాభిపురం, నగరపాలక సంస్థ

అడుగడుగునా అవినీతి.. చేయి తడపందే కదలని పనులు.. కొలువుల్లో మందగింపు రావాలన్నా.. అస్తవ్యస్త మదింపులో మార్పులు చేయాలన్నా.. పారిశుద్ధ్య విభాగంలో సిబ్బందికి విధులు కేటాయించాలన్నా.. అడిగినంత ఇచ్చుకోవాల్సిందే. కాదంటే కన్నెర్రే. రూ.600 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో గుత్తేదారులదే ఇష్టారాజ్యం. సిబ్బంది సిండికేట్‌గా మారి.. కొంతమంది కార్పొరేటర్లు, చోటామోటా నేతలతో కుమ్మక్కై చెలరేగిపోతున్నారు. జీఎంసీ కొత్త కమిషనర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించనున్న మయూర్ అశోక్‌కు అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి.

➤ మూడోవంతు విభాగాల్లో ఉద్యోగుల కొరత పీడిస్తోంది. పర్యవేక్షణ లేమి కనిపిస్తోంది.

➤ ఇంటింటా చెత్త సేకరణ మొక్కుబడిగా మారగా.. పారిశుద్ధ్య కార్మికులు ఎంతమంది ఉన్నారో.. ఏం చేస్తున్నారో లెక్కల్లేని పరిస్థితి.

➤ మురుగునీటి కాలువల ఆధునికీకరణకు ఏటా రూ. 50 కోట్ల నుంచి రూ.వంద కోట్ల వరకు వెచ్చిస్తుండగా.. కాస్త వర్షానికే నగరం చెరువులా మారుతోంది. సరైన ప్రణాళికల్లేకుండా ఇష్టారాజ్యంగా కట్టడాలుండడమే కారణం. ప్రస్తుతం కాలువల ఆధునికీకరణకు రూ.200 కోట్లకుపైగా వెచ్చించారు.

జీఎంసీలో చెలరేగిపోతున్న కొంతమంది సిబ్బంది
దారికి తేవాల్సిన బాధ్యత కొత్త కమిషనర్‌పైనే

తాగునీటికి తంటాలే

నగర ప్రజల అవసరాలకు నిత్యం 210 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం 150 మిలియన్ లీటర్లే ఇస్తున్నారు. సరఫరా నష్టం పోగా 120 మిలియన్ లీటర్లే అందుతోంది. అనేకచోట్ల పైపులైన్లు మురుగుకాలువల్లోంచి వెళ్తున్నాయి. 42 తాగునీటి రిజర్వాయర్లకు గాను పదికిపైగా శిథిల స్థితిలో ఉన్నాయి. కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో కొన్నిచోట్ల కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టారు. తక్కెళ్లపాడు, సంగంజాగర్లమూడి ఫిల్టరేషన్ పాయింట్లలో నీటిశుద్ధి మాటే లేదు. సిబ్బంది కొరత సమస్యగా మారింది. ఆలం, క్లోరిన్ కొనుగోళ్లలోనూ మాయాజాలమే. ఏటా అతిసారం కేసులు నమోదవుతున్నా.. యంత్రాంగంలో కదలిక రాకపోవడం గమనార్హం. 32 ఉద్యానవనాలుండగా.. సగానికిపైగా నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రీన్ మిషన్ గుంటూరు పేరుతో 5 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించినా.. నిధుల స్వాహా మినహా లెక్క లక్ష కూడా దాటలేదు. ప్రదర్శనలబోర్డుల ఏర్పాటులో మాయాజాలంపై కౌన్సిల్ సమావేశాల్లో రచ్చ జరుగుతున్నా.. పరిష్కారం లేదు.

పక్కదారిలో పట్టణ ప్రణాళిక

పట్టణ ప్రణాళిక విభాగం పక్కదారి పట్టింది. సొంత ఆదాయమే పరమావధిగా సిబ్బంది రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవడం గమనార్హం. సాక్షాత్తూ కమిషనర్ కళ్లుగప్పేందుకు పలుమార్లు ప్రయత్నించిన ఉదంతాలున్నాయి. బీపీఎల్, ఎల్ఆర్ఎస్ మాటున భారీగా డబ్బు చేతులు మారుతోంది. దస్త్రాలు మాయమైపోతున్నాయి.

✸ రెవెన్యూలో రాజకీయ ఒత్తిళ్లు సవాల్‌గా మారింది.

చన్నీళ్లు.. కన్నీళ్లు

జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో తల్లీబిడ్డలకు కష్టాలు

ఈనాడు – అమరావతి

అసలే చలి వణికిస్తోంది... ఉదయం పది గంటలవుతున్నా బయటకు రాలేని పరిస్థితి.. పక్కనుంచేగా ఉన్న ఇళ్లలోని వారే ఇబ్బందులు పడుతుంటే.. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పరిస్థితి చెప్పక్కర్లేదు. విరిగిన కిటికీలు.. పగుళ్లిచ్చిన గోడల మధ్య చలి పులి వంచేస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా రోగులు గజగజ వణికిపోతున్నారు. ప్రసూతి విభాగంలో తల్లీబిడ్డల కష్టాలు అన్నీఇన్నీ కావు. స్నానానికి చల్లటి నీరే దిక్కు. అదీ సరిగా రాక యాతన అనుభవిస్తున్నారు.

వార్డులో బాలింతలు, పసిపిల్లలు

ఇదీ పరిస్థితి..

జీజీహెచ్‌లో రోజుకు 20 నుంచి 30 ప్రసవాలు నమోదవుతుంటాయి. నెలలో కనీసం వెయ్యిమంది వరకు ప్రసూతి సేవలు పొందుతుంటారు. ఈ విభాగంలో నీళ్ల అందుబాటులో ఉండాలి. లేకుంటే దుర్వాసనతో పాటు ఇన్‌ఫెక్షన్ల అవకాశం ఉంటుంది. చాలా రోజులుగా పూర్తిస్థాయిలో నీటి సరఫరా లేదు. మరుగుదొడ్లలో మధ్యాహ్నం 12 గంటల తరువాత సరిగా నీరందని పరిస్థితి. దీనివల్ల బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేడి నీటి కష్టాలెన్నో..

ప్రసవానంతరం బాలింతలు ఆరోగ్యపరంగా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వణికిస్తున్న చలిలో వేడినీటి సౌకర్యం తప్పనిసరి. కానీ ఇక్కడ ఆ మేరకు ఏర్పాట్లు లేవు. చన్నీటి స్నానం వల్ల జలుబు, జ్వరంతో అవస్థలు పడాల్సి వస్తోంది. మాతాశిశు సంరక్షణ విభాగాల్లో గీజర్లు లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల దోపిడీకి అవకాశమేర్పడింది.

సీసా రూ.20.. బకెట్ రూ.100

రోగుల అవసరాలను కొంతమంది వ్యాపారులు అనుకూలంగా మార్చుకుంటున్నారు. చిన్న సీసాకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. బకెట్ వేడినీరు కావాలంటే రూ.వంద నుంచి డిమాండ్‌ను బట్టి రూ.200 వరకు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ప్రసవాలకు వస్తున్నవారిలో పేదలే ఎక్కువ. ప్రతీ పూటా రూ.వందల్లో ఖర్చు చేయాల్సి రావడంతో తట్టుకోలేకపోతున్నారు.

ఇలా చేయొచ్చు..

ప్రసూతి విభాగం పరిసరాల్లో వార్డుకొకటి వేడినీటి యంత్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. హెచ్‌డీఎస్ సమావేశంలో అనుమతి తీసుకుని గీజర్లు ఏర్పాటు చేస్తే తల్లీబిడ్డల సమస్య పరిష్కారమవుతుంది. త్వరలో ఈ విభాగం ఎంసీహెచ్ భవనానికి మారుతున్నందున అక్కడ శాశ్వత ప్రాతిపదికన వేడినీటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణతో 'ఈనాడు' మాట్లాడగా నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వేడినీటి ఇబ్బందులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

డబ్బు ఎప్పుడు ఇస్తారు?

పత్తి రైతుల ఖాతాల్లో జమ చేయని సీసీఐ

ఈనాడు – అమరావతి

రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నగదు జమ చేయడంలో జాప్యం చేస్తోంది. గత 20 రోజులుగా ఇదే పరిస్థితి. సంక్రాంతికైనా సీసీఐ నుంచి డబ్బు వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర దక్కకపోవడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. సాధ్యమైనంత తొందరగానే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఆచరణలో జాప్యం చేస్తోంది.

ఇదీ ప్రక్రియ..

గ్రామాల నుంచి రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలించిన తరువాత... అక్కడ అధికారులు నాణ్యత పరిశీలించి ధర నిర్ణయిస్తారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని మార్కెటింగ్‌శాఖ అధికారులు లెక్కించి సీసీఐ అధికారులకు బిల్లులిస్తారు. ఒక ట్రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ బిల్లులను సీసీఐ ప్రధాన కార్యాలయంలో పరిశీలించి.. రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తారు. ఈ ఏడాది కొంతమందికి మూడు వారాలు దాటినా నగదు జమ కాలేదు. దీనిపై రైతులు సీసీఐ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు.

జీరో ఖాతాలకు సమస్య..

పత్తి రైతుల్లో కొంతమంది మహిళలున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఈ-క్రాప్.. వారి పేర్లతో ఉన్నాయి. వీరిలో కొందరికి బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలున్నాయి. ఇంకొందరికి పోస్టాఫీసు ఖాతాలు కూడా ఉన్నాయి. వాటిల్లో కనీస నగదు నిల్వలు లేకపోవడం వల్ల నగదు జమ చేయలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. రూ.2 లక్షలకంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన ఖాతాల విషయంలో సీసీఐ అధికారులు పలుమార్లు పరిశీలన చేస్తున్నారు. ఈ కారణాల వల్లనే నిర్ణీత సమయంలోగా నగదు జమ కావడం లేదు. సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి నగదు తొందరగా జమ చేయాలని గుంటూరు గ్రామీణ మండలంలోని పలు గ్రామాలతోపాటు మరికొన్ని మండలాల రైతులు కోరుతున్నారు.

మంగళగిరిలో త్వరలో భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం

క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: 'మంగళగిరి నగరంలో అతిపెద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తాం. భూగర్భ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తాం. శ్మశాన వాటికలను ఆధునికీకరిస్తున్నాం.' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన తిలకించారు. ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడారు. విలేకరులతో మాట్లాడుతూ.. మంగళగిరిలో చేపట్టే అభివృద్ధి పనులను వివరించారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పార్లమెంటు తెదేపా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

మశకంపై సమరం

79 ప్రాంతాల్లో డ్రోన్లతో కీమోఫాస్ పిచికారీ

ఈనాడు – అమరావతి

దోమల నివారణపై గుంటూరు నగరపాలక సంస్థ దృష్టి సారించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రత్యేక యంత్రాలతో చర్యలు చేపడుతోంది. మశకాలతోపాటు వాటి లార్వాలను కూడా నాశనం చేయడం ద్వారా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలతో....

నాలుగు మలేరియా డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో దోమల నిర్మూలనపై చాలాకాలంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. నిత్యం ఫాగింగ్ చేస్తున్నట్టు చూపించి.. రూ.లక్షల్లో బిల్లులు పెడుతున్నా... క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించని పరిస్థితి.

లార్వాలు, దోమల నివారణకు ట్రాపర్లు

కీమోఫాస్ పిచికారీకి ఉపయోగిస్తున్న డ్రోన్

వర్షాలు, చలికాలంలో మశకాల విజృంభణకు జ్వరాలు, సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆసుపత్రులకు పోటెత్తడం పరిపాటిగా మారింది. ఈ సమస్యపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగర, పురపాలక సంఘాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశాలివ్వగా... జీఎంసీలో ప్రయోగాత్మకంగా కొన్ని చర్యలు చేపట్టారు.

డ్రోన్లతో ద్రావణం పిచికారీ

మాన్యువల్‌గా కీమోఫాస్ చల్లడానికి వీల్లేని 79 ప్రాంతాలను గుర్తించారు. ఇందులో కొన్ని చెరువులు, కుంటలు, మేజర్ డ్రెయిన్లు ఉన్నాయి. ఇలాంటి చోట డ్రోన్లతో ద్రావణాన్ని చల్లేలా అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇటీవల నల్లచెరువులో దోమల లార్వా నిర్మూలనకు ఆ ప్రక్రియ పూర్తి చేశారు. నల్లకుంట నుంచి చుట్టుగుంట వరకు పిచికారీ పూర్తయింది. నెల రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుంది.

మరో రెండు యంత్రాలతో...

- జీజీహెచ్, ఐడీ ఆసుపత్రి సహా ఎంపిక చేసిన 13 ప్రాంతాల్లో మస్కిటో ఎలిమినేషన్ ట్రాపర్ అందుబాటులో ఉంచారు.
- ఇందులో బయోజెంట్ ఎంజైమ్ ఉంటుంది. ఇది 500 మీటర్ల పరిధిలోని దోమలను ఆకర్షిస్తుంది.
- ఏడుచోట్ల ఐవోటీ సెన్సార్ మిషన్స్ అమర్చారు. ఇది దోమల లార్వాను కనిపెడుతుంది.
- ఈ మొత్తం ప్రక్రియ కోసం రూ. 1.96 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ఇటీవలే కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు.

మొక్కుబడిగా చేస్తే నిష్ఫలమే..

ఈసారైనా పకడ్బందీగా చర్యలు కొనసాగిస్తే ప్రజలకు ఎంతో ఉపశమనం దక్కించినవారవుతారు. ఫాగింగ్ తరహాలో మొక్కుబడిగా మమ అనిపించి.. కాకిలెక్కలు చూపిస్తే ప్రజాధనం దుర్వినియోగం కావడం తప్ప ప్రయోజనం ఉండదు.

ఆంక్షల ఫలితం... బర్లీకి దూరం

గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఈనాడు
అమరావతి

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం హెక్టార్లలో...

	గుంటూరు	బాపట్ల	పల్నాడు	మొత్తం
గతేడాది	3,369	22,770	4,683	30,822
ప్రస్తుతం	544	3,114	733	4,391

ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది 30,822 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవగా... ప్రస్తుతం 4,391 హెక్టార్లకే పరిమితమైంది. రైతులను అప్రమత్తం చేయడం, విత్తనాలు, నారు విక్రయం, పెంపకంపై ఆంక్షలు విధించడంతోపాటు గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం.. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో పర్యవేక్షణ పెంచడంతో ఇది సాధ్యమైంది. నష్టాలు భరించైనా సాగుకు సిద్ధమంటూ ముందుకొచ్చిన రైతులకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. ఈ చర్యలకు ప్రధాన కారణం.. గతేడాది అనుభవాలు. పెద్దఎత్తున పంటను సాగు చేయడంతో సగానికిపైగా ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రంగంలోకి దిగి.. మంచి ధరకు పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

పొగాకు పూర్తిగా ఎగుమతులపై ఆధారపడడం, ఎక్కువ రోజులు నిల్వ చేసే వెసులుబాటు లేకపోవడం, డిమాండ్‌కు మించి దిగుబడులు వస్తే రైతులకు ధర లేక నష్టాలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠినంగానే వ్యవహరించింది.

కొన్నిచోట్లే...

మంచి ధరలే ఉంటాయన్న వ్యాపారుల హామీ మేరకు కొంతమంది రైతులు తెల్లబర్లీ వేశారు. కంపెనీలు రైతులతో ఒప్పందాలు అధికారికంగా చేసుకున్నచోట ప్రభుత్వం సాగుకు అనుమతిచ్చింది. ఏటా సాగు చేస్తున్న ప్రాంతాల్లోనే రైతులు ముందుకొచ్చారు. కంపెనీల నుంచి బాండ్లు ఉన్నాయా? లేదా? అని అధికారులు తనిఖీ చేశారు.

✸ తాజా అనుభవాల ఆధారంగా వచ్చే ఏడాదిలోనూ పంటల సరళిలో మార్పులు సూచించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: సంక్రాంతి సెలవుల అనంతరం తిరుగు పయనమవుతున్నవారి కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం తెలిపారు. శుక్రవారం ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గుంటూరు-1, 2 డిపోలతోపాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల నుంచి హైదరాబాదుకు 14 బస్సులు, బెంగళూరుకు ఒకటి, చెన్నైకు 2 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇవి శనివారం రాత్రి గుంటూరు బస్టాండుకు చేరుకొని అక్కడి నుంచి నిర్దేశించిన ప్రదేశాలకు వెళ్తాయన్నారు. రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్సుల సంఖ్యను మరింత పెంచుతామన్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో దూర ప్రాంతాలకు రద్దీ ఉంటుందని, అందుకుతగ్గ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

స్లీపర్ కోచ్ టికెట్లపై థర్డ్ ఏసీలో ప్రయాణం

డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రైల్వేశాఖ బంపర్ ఆఫర్

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, రేపల్లె: సంక్రాంతి నేపథ్యంలో డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రైల్వేశాఖ నుంచి అనుకోని బంపర్ ఆఫర్ లభించింది. స్లీపర్ కోచ్‌లో టికెట్లు తీసుకున్న అనేకమంది ప్రయాణికులకు అనూహ్యంగా అప్‌గ్రేడేషన్‌లో భాగంగా థర్డ్ ఏసీలో సీట్లు కేటాయించడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఒకరో ఇద్దరో కాదు.. ఏకంగా 120 మందికి పైగా ఈ అవకాశం వరించడంతో పండుగ పూట జాక్‌పాట్‌గా సంబరపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాచిగూడ-రేపల్లె, రేపల్లె-వికారాబాద్ మధ్యన డెల్టా ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. కొద్దిరోజులుగా సాంకేతిక, అంతర్గత సమస్యలు తలెత్తడంతో అధికారులు మార్పులు చేశారు. గత నెల 25 నుంచి కొన్ని అమల్లోకి వచ్చాయి. తాజాగా ఎస్10, ఎస్11 స్లీపర్ కోచ్‌లలో టికెట్లు బుక్ అయిన ప్రయాణికులకు థర్డ్ ఏసీ కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడకుండా. ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి. స్లీపర్ కోచ్ టికెట్లపై థర్డ్ ఏసీలో ప్రయాణించే అవకాశం రావడంతో ప్రయాణికులు సంబరపడ్డారు.

పాత దర్యాప్తుపై సమీక్షకే సీబీఐ పరిమితమైంది

- హైకోర్టు ఆదేశాల మేరకు తాజా దర్యాప్తు చేయలేదు
- ఆయేషామీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు

ఈనాడు - అమరావతి: 'ఆయేషామీరా హత్య కేసును తాజాగా దర్యాప్తు చేయమని హైకోర్టు.. ఆదేశించినా సీబీఐ కొత్తగా శోధించకుండా గతంలో జరిగిన దర్యాప్తును సమీక్షించేందుకే పరిమితమైందని ఆయేషామీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వాదించారు. ఆయేషామీరా హత్య కేసు శుక్రవారం విజయవాడలో సీబీఐ కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చింది. పంచనామా నిర్వహించిన పలువురు రెవెన్యూ అధికారుల సాక్ష్యాలను మళ్లీ సీబీఐ నమోదు చేసిందనీ, గతంలో తాము ఒత్తిళ్లకు లొంగి వాంగ్మూలం ఇచ్చినట్లు వారు వెల్లడించారని చెప్పారు. సీబీఐ కొత్తగా నమోదు చేసిన సాక్షుల స్టేట్‌మెంట్లను డిఫెన్స్ న్యాయవాది చదివి వినిపించారు. గతంలో తాము పోలీసుల ఒత్తిళ్లకు తలొగ్గి ఖాళీ కాగితాలపై సంతకాలు పెట్టి ఇచ్చినట్లు ఉందని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. పునర్విచారణ నివేదికపై ఆయేషామీరా తల్లిదండ్రులు రాతపూర్వకంగా అభ్యంతరాలను కోర్టులో ఫైల్ చేస్తారనీ, సమయం ఇవ్వాలని న్యాయవాది కోరారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ.. ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

రికార్డు స్థాయిలో మాంసం విక్రయాలు

కిటకిటలాడిన దుకాణాలు

కుందుల రోడ్డులో దుకాణం వద్ద ఇలా..

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కనుమ పండగ రోజు గుంటూరు నగరంలో రికార్డు స్థాయిలో మాంసం విక్రయాలు నమోదయ్యాయి. ఉదయం నుంచే కోడి మాంసం, మటన్ కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో దుకాణాల వద్ద బారులు తీరారు. సాధారణ రోజులు, ఆదివారాలు కంటే కూడా కనుమ పండగనాడు కోడి మాంసం, మటన్ విక్రయాలు జోరుగా సాగాయి. గుంటూరు నగరంలో దాదాపు 300కు పైగానే కోడి మాంసం, మటన్ దుకాణాలు ఉంటాయి. కనుమ పండగ రద్దీని ముందే ఊహించిన స్టాల్స్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కనుమ సందర్భంగా 60 వేల కేజీలు పైగానే కోడి మాంసం విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా. మటన్ 20 వేల కేజీలు, చేపలు 9 వేల కేజీల వరకు విక్రయాలు జరిగాయని చెబుతున్నారు. కనుమ పండగను దృష్టిలో పెట్టుకుని ధరలు కూడా కొంత మేరకు పెంచారు. కోడిమాంసంపై కేజీకి రూ.50 నుంచి రూ.100లు, మటన్‌పై రూ.100 వరకు అదనంగా ధర పెంచి విక్రయాలు జరిపారు. కేజీ కోడి మాంసం స్కిన్ రూ.350 వరకు, స్కిన్‌లెస్ రూ.360 పలికింది. నాటు కోడి మాంసం విక్రయాలు బాగా జరిగాయి. దీని ధరలు కూడా బాగా పెంచారు. నాటు కోడి మాంసాన్ని అయితే రూ.1000 వరకు అమ్మారు. మధ్యంతరంగా ఉండే నాటుకోడి మాంసం రూ. 800 వరకు ఉంది. మటన్ కేజీ ధర రూ.1,000, కీమా రూ.1,200, బోన్‌లెస్ 1,300 వరకు పలికింది. సాధారణ రోజులు కంటే కనుమ సందర్భంగా విక్రయాలు రెట్టింపయ్యాయని ఓ దుకాణం యజమాని తెలిపారు.

సరస్ మేళా.. నైపుణ్యాభివృద్ధి ఇలా..

స్టాల్‌లోనే టెర్రకోట కళా ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్న అన్నమయ్య జిల్లా ఈడిగపల్లి మట్టిచేతి కళాకారిణి లక్ష్మి

జూట్‌బ్యాగ్‌ల తయారీ చూపిస్తున్న గుంటూరు కొప్పర్రు మహిళ ఉదయరాణి

పూతరేకులు తయారు చేస్తున్న ఆత్రేయపురం మహిళ

మచిలీపట్నం కలంకారీ చీరల స్టాల్

గుంటూరు సరస్ మేళాలో చేతివృత్తి కళా వస్తువుల విక్రయాలే కాకుండా వాటి తయారీ విధానాన్ని ఇక్కడ ప్రదర్శించి ఆసక్తి ఉన్నవారికి అవగాహన కల్పిస్తున్నారు. టెర్రకోట కళాకృతులు, కొండపల్లి బొమ్మలు, కలంకారి అచ్చులు, పట్టచిత్రకళలు, జూట్‌బ్యాగులు వంటి చేతి కళావృత్తులు, ఆత్రేయపురం పూతరేకులు, మిల్లెట్స్ వంటకాల వంటి ఆహారపదార్థాలు స్టాళ్లలోనే తయారు చేస్తూ వినియోగదారులకు స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న మహిళలకు తెలియజేస్తున్నారు. రోజూ ఆయా రంగాల నిపుణులతో స్వయం సహాయక సంఘ మహిళలకు వ్యవస్థాపక నైపుణ్యాలు, ఉత్పత్తి విలువ జోడింపులు, ప్యాకింగ్, బ్యాంకు పథకాలు, బుక్ కీపింగ్, వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్, లైవ్ డీపీఆర్ తయారీ తదితర 15 అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ విధంగా సరస్ మేళా మహిళలను పరిశ్రమ వ్యవస్థాపకులుగా మార్చేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రాజెక్టు మేనేజర్ కేశవకుమార్ తెలిపారు. -ఈనాడు, అమరావతి

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
ఆర్యవైశ్య కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. గుంటూరు ఈనాడు కార్యాలయంలో (9వ లైన్, పోలీస్ స్టేషన్ ఎదురుగా, అరండల్‌పేట) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026, శనివారం, ఆదివారం)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
92475 20500 & 95501 28306
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

నాటి కూలీల పిల్లలే.. నేడు ఉన్నతోద్యోగులు

పల్లపాడు(పట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పట్టిచెరుకూరు మండలం పల్లపాడు గ్రామంలో రాయల్ యూత్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని మహిళలకు, విద్యార్థులకు అనేక రకాల సాంస్కృతిక, క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి 'ఈనాడు' ఎడిటర్ ఎం. నాగేశ్వరరావు, మిర్చి యార్డు పూర్వ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, హెచ్ఎల్ఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టీపీఎస్ రావు, ప్రముఖ హోమియో వైద్యుడు డా. నాగేశ్వరప్రసాద్‌లు అతిథులుగా హాజరయ్యారు. పది తరగతి తర్వాత నూజివీడు, ఒంగోలు ఐఐఐటీల్లో సీట్లు సాధించిన సునంద, లక్ష్మీప్రసన్నలకు ఎం. నాగేశ్వరరావు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించి, సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక జాతీయ ఖ్యాతి గడించిన విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన పిల్లలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. జనవరి 12వ తేదీ, వివేకానంద జయంతి రోజు గ్రామంలో గ్రంథాలయాన్ని ప్రారంభించాం, గ్రామస్థులంతా దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. వచ్చే సంక్రాంతి లోపు గ్రంథాలయంలో ఎక్కువ పుస్తకాలు చదివిన మొదటి ముగ్గురికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నాణ్యమైన చదువులతో అన్ని సమస్యలకూ పరిష్కారాలని చెబుతూ, ఒకప్పుడు గ్రామంలో కూలీలు, కార్మికులుగా పనిచేసిన ఆదుసుమిల్లి చలమయ్య, బండారు పోలయ్య వంటి వారి పిల్లలు బాగా చదువుకుని నేడు బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పొదుపు అలవాటు పేద కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ఆ శిశువుకు నామకరణం జరిగిన తర్వాత అతని పేరుతో బ్యాంకు ఖాతా ప్రారంభించి రోజుకు రెండు రూపాయలు చొప్పున.. నెలకు రూ.60 డిపాజిట్ చేస్తూ ఉంటే ఆ వ్యక్తికి 60 ఏళ్లు వచ్చేసరికి కోటి రూపాయల నిధి ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా తల్లులు ప్రతినెలా తమ పిల్లల పేరుతో తప్పకుండా పొదుపు చేయాలని సూచించారు. గ్రామం నుంచి 15 ఏళ్ల క్రితమే మద్యం దుకాణాన్ని తొలగించుకున్నా, ఇంకా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, గ్రామ మహిళలు సంఘటితంగా ఊరి నుంచి మద్యాన్ని తరిమేయాలని కోరారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ కంటే, మైదానాల్లో ఆడుకోవాలని అన్నారు. రాత్రి 11 గంటల వరకు సాంస్కృతిక పోటీలు జరిగాయి. ముప్పా రాము, కొర్రపాటి అనిల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగ్గులు వేసిన చిన్నారులు

కుర్చీలాటలో బాలల సందడి

145 రకాల వంటకాలతో సంక్రాంతి విందు

కొత్త అల్లుడికి సరికొత్త రుచులు

తెనాలికి చెందిన వ్యాపారి కనిగిచర్ల రమాకాంత్ తన పెద్ద కుమార్తె భవ్య నిఖితను నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన సుధీష్‌కుమార్‌కు ఇచ్చి ఆరు నెలల క్రితం వివాహం చేశారు. కొత్త అల్లుడు తొలిసారి సంక్రాంతి పండగకు వస్తుండటంతో గురువారం సరికొత్త రుచులతో మహావిందు ఏర్పాటు చేసి మురిపించారు. మొత్తం 145 రకాల వంటకాలతో ఏర్పాటుచేసిన విస్తరి చూసి అల్లుడు, కుమార్తె ఆనందం పట్టలేకపోయారు. అల్లుడి రాక పురస్కరించుకొని బంధుమిత్రులనూ పిలవడంతో ఆ ఇంట పండుగ సందడి నెలకొంది. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

నారాయణ హాస్పిటల్ NARAYANA SUPERSPECIALITY HOSPITAL | శ్రీకాంత్ స్పైన్ సెంటర్
Bringing Expertise To spinal Solutions

ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ !

ఇప్పుడు మన గుంటూరులో!

నడుము నొప్పి, సయాటికా & డిస్క్ సమస్యలకు అధునాతన ఎండోస్కోపిక్ ట్రీట్మెంట్
తక్కువ నొప్పి త్వరగా కోలుకోవడం
రోజువారీ పనులకు త్వరగా తిరిగి చేరుకోవచ్చు

నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 83, ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు-522001

డా॥ శ్రీకాంత్ రెడ్డి దుంపా
M.S (Ortho), DNB (Ortho), FNB (Spine Surgery), FISS (USA)
వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణులు
మరిన్ని వివరాలకు సంప్రదించండి : +91 95974 00472

పోలేరమ్మను దర్శించుకున్న ఐక్యరాజ్య సమితి ప్రతినిధి



హరీష్ దంపతులను సత్కరించిన ఆలయ ప్రతినిధులు, చిత్రంలో కాటూరి వైద్యకళాశాల ఛైర్మన్ సుబ్బారావు

కొండపాటూరు(కాకుమాను), న్యూస్‌టుడే: కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మ తల్లిని ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. కాటూరి వైద్య కళాశాల, ఆసుపత్రి ఛైర్మన్ కాటూరి సుబ్బారావుతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం హరీష్ మాట్లాడారు. ఐక్యరాజ్య సమితిలో భారత్ శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. వైజ్ అంగీకారం తెలిపితే సానుకూలమయ్యే అవకాశం ఉందన్నారు. పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ ఛైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఈఓ జక్కా శ్రీనివాసరావులు వారిని ఘనంగా సత్కరించారు. వారి వెంట టీడీపీ ప్రసాద్, రాఘవరావు, పమిడిపాటి తదితరులు ఉన్నారు.

నేటి సీఆర్డీఏ గ్రీవెన్స్ రద్దు

తుళ్లూరు, న్యూస్‌టుడే: నేడు సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని పరిపాలనా కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్టు శుక్రవారం సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యాలయంలోని కౌంటర్‌లో యథావిధిగా ప్రజలు ఫిర్యాదులను అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

సందడిగా సరస్

❑ పండగ రోజుల్లో తరలొచ్చిన నగరవాసులు
❑ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అలరించిన కోలాటం ప్రదర్శన

జానపద నృత్యం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సరస్ ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వాటిని తిలకించి కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కూడా సందర్శకుల రాకపోకలతో సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో సరస్ ప్రదర్శన కిక్కిరిసింది. సందర్శకులు స్టాల్స్‌ను తిలకించేందుకు ఇబ్బంది కలగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

◆ మట్టితో చేసిన పాత్రలు.. చెక్కబొమ్మలు... వివిధ మెటీరియల్స్‌తో తయారుచేసి హ్యాండీ క్రాఫ్ట్స్, పలు రకాల చీరలు, ఇతర వస్త్రాలు సరస్‌లో సందర్శకులకు దర్శనమిస్తున్నాయి. వీటితోపాటు చిరుధాన్యాలతో తయారుచేసిన పిండివంటలు, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులు, ఆయుర్వేద మందులు మేళాలో ఉన్నాయి. ఫుడ్ కోర్టులోని లైవ్ కిచెన్‌లో అందిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వెజ్, నాన్ వెజ్ వంటకాల రుచులకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..సరస్ వేదికగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షించాయి. జానపద నృత్యాలు, సినీ గీతాలాపనలతో ప్రాంగణం కళకళలాడింది.

అగ్రిమార్కెటింగ్‌పై శిక్షణ..సరస్ వేదికగా స్వయం సహాయక సంఘాల మహిళలకు శుక్రవారం నాచురల్ ఫార్మింగ్, అగ్రి మార్కెటింగ్‌పై మాస్టర్ ట్రైనర్ వై.ప్రసాంగి శిక్షణ ఇచ్చారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాల్సిన తీరుపై శిక్షకులు కిరణ్ పలు ఉదాహరణలో అవగాహన కల్పించారు.

91.9FM Vijayawada Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజి స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

దంతాలు లేవా?
అన్ని రకాల ఆహార పదార్థాలు తినలేకపోతున్నారా?

ఇంప్లాంట్స్‌తో దృఢమైన పళ్ళు మీ సొంతం చేసుకోండి

డా. మానసారెడ్డి గారు

ఉచిత దంత చికిత్సలు
EHS (ఎంప్లాయిస్ హెల్త్ కార్డు), CGHS & ఆరోగ్య భద్రత ద్వారా
EMI సౌకర్యం కలదు

Dr. Kiran's SMILE GROUP of Dental Hospitals Pvt. Ltd.
Andhra Pradesh | Telangana | Karnataka | Kuwait

అయ్యప్పస్వామి గుడి ఎదురుగా, బృందావన్ గార్డెన్స్, గుంటూరు
కాల్: 95502 31862

ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదం

12 ద్విచక్రవాహనాల దగ్ధం

మంటల్లో కాలిపోతున్న వాహనాలు

తాడేపల్లి,న్యూస్‌టుడే: తాడేపల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా భారీ ప్రమాదం తప్పింది. గుంటూరు- కృష్ణా జిల్లాల సరిహద్దు ప్రాంతమైన కనకదర్గమ్మ వారధి వద్ద 16వ నంబర్ జాతీయరహదారిపై ఉన్న ట్రాఫిక్ స్టేషన్ అవరణలో వివిధ రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లోని పలురకాల ద్విచక్రవాహనాలను స్టేషన్ ఆవరణలో ఉంచారు. శుక్రవారం ఉదయం 11 గంటల తరువాత వాహనాలకు నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అటుగా వెళ్లే తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒకవేళ మంటలు పక్కనే ఉన్న స్టేషన్‌కు వ్యాపిస్తే భారీ ప్రమాదం చోటు చేసుకునేది. సిబ్బంది హుటాహుటిన స్పందించి మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు 12 బైక్‌లు పూర్తిగా కాలిపోగా..ఓ వాహనం పాక్షికంగా దెబ్బతింది. ఘటనా స్థలి పైనుంచి వెళ్తున్న విద్యుత్తు తీగల నుంచి వచ్చిన నిప్పు రవ్వలు కింద పడి.. ఎండిపోయి ఆకులు, వ్యర్థాలకు అంటుకుని మంటలు చెలరేగాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 164, రిటైల్ ధర - 191, చికెన్ విత్‌స్కిన్ - 277, చికెన్ స్కిన్‌లెస్ - 315.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267, చికెన్ స్కిన్‌లెస్ - 304.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

అమరావతి అభివృద్ధిని జగన్ అడ్డుకోలేరు

రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సుజనా చౌదరి

తుళ్లూరు, న్యూస్‌టుడే: జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా అమరావతి అభివృద్ధిని అడ్డుకోలేరని మాజీ కేంద్ర మంత్రి, భాజపా ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన మందడం గ్రామానికి చెందిన దొండపాటి రామారావు కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. అనంతరం రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కట్టా రాజేంద్ర రాజధాని రైతులు, రైతుకూలీలు, మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ..'ప్రపంచంలో చాలా చోట్ల నదీ పరివాహక ప్రాంతాల్లోనే రాజధానులు నిర్మితమయ్యాయి. రాష్ట్ర రాజధానిగా అసెంబ్లీలో జరిగిన తీర్మానంలోనూ జగన్ పాల్గొని అంగీకరించారు. ఇప్పుడు అమరావతి నిర్మాణం గురించి విమర్శించడం హాస్యాస్పదం. వైకాపా ప్రభుత్వంలో 3 రాజధానులంటూ దుర్మార్గంగా వ్యవహరించి కేసులు వేసినా రాజధాని రైతులతో కలిసి సుప్రీం కోర్టు వరకు వెళ్లి పోరాడి అమరావతిని సాధించుకున్నాం' అని అన్నారు.

ఇదొక యజ్ఞం..అమరావతి వంటి పెద్ద నగరాన్ని నిర్మించటం సులభమైన పని కాదని, ప్రజా రాజధాని నిర్మాణం ఇక యజ్ఞం లాంటిదని సుజనా చౌదరి పేర్కొన్నారు సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

అధికారుల తీరు బాగోలేదు.. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొందరు అధికారుల తీరు వల్లే రైతుల సమస్యలు పరిష్కారం కావటం లేదని సుజనా చౌదరి దృష్టికి తీసుకు వెళ్లారు. రైతుల సమస్యల పరిష్కార పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అవసరమైతే ఓ సాఫ్ట్‌వేర్ తయారు చేయిస్తామని సుజనా చౌదరి తెలిపారు. అమరావతి ఐకాస నాయకులు, రాజధాని రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

ఆమె కుమార్తెపై రోకలితో దాడి
సహజీవనం చేస్తున్న యువకుడే నిందితుడు

మధురానగర్, న్యూస్‌టుడే: భర్త వదిలేసిన యువతిని చేరదీశాడు. 14 సంవత్సరాలుగా ఆమెతో సహజీవనం చేశాడు. ఆమెను అనుమానిస్తూ నిత్యం గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఆమెతో గొడవపడి ముఖంపై దిండుతో అదిమి హత్య చేశాడు. అడ్డు వచ్చిన యువతి కుమార్తెను రోకలిబండతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన పండగ రోజు కేదారేశ్వరపేటలో కలకలం సృష్టించింది.

✦ కేదారేశ్వరపేట 8వ లైనులో ఉండే హుస్సేనా (39)కి 22 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్తతో విభేదాల కారణంగా రెండేళ్లకే విడిపోయారు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. ఆ తరువాత గుంటూరు జిల్లా నులకపేటకు చెందిన ఆటోడ్రైవర్ సాయి శివకుమార్ ఆమెకు పరిచయం అయ్యాడు. పెళ్లిళ్లకు డెకరేషన్ చేసే సాయికుమార్ ఆమెతో కలిసి కేదారేశ్వరపేట 8వ లైనులో ఉంటున్నారు. యువతి కుమార్తె (19)కు రెండేళ్ల కిందట వివాహం చేశారు. భర్తతో విభేదాల కారణంగా ఆమె విడాకులు తీసుకుని తల్లితో ఉంటున్నారు. ఈ క్రమంలో యువతి కుమార్తెకు రెండో వివాహం చేయాలని తల్లి నిర్ణయించగా శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయమై వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

అనుమానంతో వేధింపులు.. 14 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నా నిత్యం అనుమానించేవాడని, ఆమెతో గొడవ పడేవాడని బంధువులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఈ విషయమై గొడవ పడ్డారని, తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో హుస్సేనా ముఖంపై దిండుతో అదిమి పెట్టగా ఆమె కేకలు వేసింది. ఇది విని కుమార్తె అక్కడకు రాగా ఆమెను తోసి వేశాడు. ఆమె భయంతో బయటకు పరుగులు తీస్తుండగా పక్కనే ఉన్న రోకలి బండను ఆమె పైకి విసిరేయగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అక్కడకు చేరుకోగా సాయి శివకుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. 108 సిబ్బందికి, అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ కుమార్తెను ఆసుపత్రికి తరలించారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం - మంగళగిరి - గుంటూరు జిల్లా

లేఖ నెం. బి2/54/2026, తేది: 16.01.2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమైన (1) చిల్లర సరుకులు మరియు (2) పూలు, పూల దండలు, సదరు రెండు ఐటములకు టెండరు నందు పొందుపరచిన విధముగా ది. 01.04.2026 నుండి ది. 31.03.2027 వరకు సప్లయి చేయుటకు అర్హులైన టెండరుదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వివరములకు 08645-232945 ద్వారా లేదా **https://apeprocurement.gov.in** వెబ్‌సైట్ చూడగలరు.

ఇట్లు : సహాయ కమీషనరు
మరియు, కార్యనిర్వహణాధికారి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఎపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 04.02.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేదీ & సమయం: 04.02.2026, మ॥ 02.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 04.02.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 04.02.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

వ. నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనవి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	గుంటూరు మెయిన్-1 బ్రాంచ్ మెస్సర్స్. మిట్టపల్లి ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టనర్లు: శ్రీ మిట్టపల్లి రమేష్ బాబు, తండ్రి: పాండురంగా రావు మరియు మిట్టపల్లి లక్ష్మి సుస్మిత, తండ్రి: శ్రీ మిట్టపల్లి రమేష్ బాబు	రూ. 1828.15 లక్షలు తేది 11.01.2026 నాటికి	గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, లాలాపురం రోడ్డు, ఆర్ అగ్రహారం, కొండ వెంకటప్పయ్య నగర్, సమీప డోర్ నెం.25-22-23, పౌల్ట్రీ ఫార్మ్ దగ్గర, పైమాషి నెం. 82, అసెస్‌మెంట్ నెం. 37015-01, పట్టా నెం: 1053, బ్లాక్ నెం. 11, డి.నెం. 13/2 (జి.ఎమ్.సి. గుంటూరు, సిటీ ప్లానర్, ఎండోర్స్‌మెంట్ TSA. No. 776/2017-18/G3, FLR No. 435/2017/T.S.I, తేది 09.06.2017 ప్రకారం) నందు 3818.16 చ॥గ॥ కమర్షియల్ భూమి మరియు అందులోని గొడౌన్ బిల్డింగ్ యావత్తు ఆస్తి.	రూ. 1253.00 లక్షలు	రూ. 125.30 లక్షలు

శ్రీ మిట్టపల్లి రమేష్ బాబు పేరున రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌ల వివరములు: 1) డాక్యుమెంట్ నెం : 11866/2000, తేది 23-12-2000 - 379.77 చ॥గ॥. 2) డాక్యుమెంట్ నెం : 11889/2000, తేది 23-12-2000 - 382.64 చ॥గ॥. 3) డాక్యుమెంట్ నెం : 14/2001, తేది 24-12-2000 - 384.62 చ॥గ॥, 4) డాక్యుమెంట్ నెం : 75/2001, తేది 24-12-2000 - 384.50 చ॥గ॥, 5) డాక్యుమెంట్ నెం : 295/2001, తేది 26-12-2000 - 383.42 చ॥గ॥, 6) డాక్యుమెంట్ నెం : 345/2001, తేది 27-12-2000 - 380.18 చ॥గ॥, 7) డాక్యుమెంట్ నెం : 407/2001, తేది 27-12-2000 - 380.35 చ॥గ॥, 8) డాక్యుమెంట్ నెం : 508/2001, తేది 29-12-2000 - 380.41 చ॥గ॥, 9) డాక్యుమెంట్ నెం : 525/2001, తేది 29-12-2000 - 381.62 చ॥గ॥, 10) డాక్యుమెంట్ నెం: 781/2001, తేది 30-12-2000 - 380.65 చ॥గ॥, పైన తెలిపిన 10 ఐటెంలు కలిపి ఒకే స్థలంగా మొత్తం విస్తీర్ణం 3818.16 చ॥గ॥. హద్దులు డీడ్ ప్రకారం. పైన తెలిపిన ఆస్తి యొక్క సెర్సాయ్ ఐడి: 400080648108.

※ బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్సులు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది

ఆస్తి తనిఖీ తేదీ & సమయం: 28.01.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695
బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb
హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 12.01.2026, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Third Eye Consultancy - Guntur GST Registration in 1 Hour No Physical Office Required Contact: 7893270607.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

సంక్రాంతి శుభాకాంక్షలతో... అతితక్కువ ధరలకే గృహప్రవేశానికి సిద్ధంగా 2&3 BHK FLATS
Sri Sai Fortune Heights
◆ క్వాలిటీ కన్‌స్ట్రక్షన్ ◆ 100% వాస్తు ◆ 8 ఫ్లోర్లు ◆ సెమీ & ఫుల్ ఫినిష్ ◆ స్పాట్ అలాట్‌మెంట్ ◆ బ్యాంక్ లోన్ సౌకర్యం
హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎదురు, నల్లపాడు రోడ్డు, గుంటూరు. 9440 777 999, 99499 29060
NAVAYUGA ADS

గ్రేటర్ గుంటూరుకు ఆనుకుని లాల్‌పురంలో ఇల్లు నిర్మించుకునేందుకు అనువైన 167 గజాల స్థలం అమ్మబడును. సం: 9059115854.

PLOT FOR SALE

INNER RING ROAD

రెసిడెన్షియల్ జోన్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన GMC పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 నందు భవిష్యం ఇంటర్నేషనల్ స్కూల్, నారాయణ, NRI, SR, సంకల్ప విద్యాసంస్థలకు అతిచేరువలో మరియు అమరావతి రోడ్, పెట్రోల్ బంక్ సెంటర్ నందు రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు అందుబాటు ధరలలో కలవు. ✆ 7799334555.

SATTENAPALLI

అమరావతి ORR ప్రక్కన, సత్తెనపల్లి పట్టణంలో CRDA, RERA అప్రూవ్డ్, మంచినీటి భూగర్భ జలాలు, 80% లోన్ సౌకర్యంతో కల ప్లాట్లు అమ్మబడును. Cont: 9912353046.

GENERAL

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067.

సంక్రాంతి ఆఫర్: రిజిస్ట్రేషన్ ఫ్రీ. గుంటూరు-Hyd హైవేఫేసింగ్ మేడికొండూరులో గేటెడ్‌కమ్యూనిటీ వెంచర్‌లో CRDA&RERA అప్రూవ్డ్‌తో రెసిడెన్షియల్ ప్లాట్లు గజం 11వేలకే. 7416161625.

తాడికొండ - IRR కి దగ్గరగా తారు రోడ్ ఫేస్ CRDA అప్రూవల్ గల ప్లాట్స్ అమ్మకం. (లోన్ సౌకర్యం కలదు). స్పాట్ రిజిస్ట్రేషన్. సం|| 9985227799.

COMMERCIAL SPACE FOR SALE

GENERAL

304 Sft shop in upcoming biggest mall in Guntur with immediate Rent of 30000/- for sale. Call: 9573454266.

TO LET

COMMERCIAL

Nice Commercial Building for Long Term Rent 3Fls with Lift & Cellar N/E Corner of 6/1 Arundelpet-Ravi, GNT. ✆ 7330724620.

JOBS

Walk-In Interviews for Sales relationship Managers Fresher/Exp. Jayalakshmi Nexa Auto Nagar, Guntur, Whatsapp: 9100787054.

Wanted exp Telecallers/ Computer Operators (F) in Edu Consultancy in Lakshmipuram, Sal: 15K to 20K, Q: Deg. 9052975353.

చిరంజీవ చిట్‌ఫండ్స్ ప్రై॥ లి॥లో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పని చేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం||ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 72888 70101, 72888 87707.

ఒంగోలులో రియల్ ఎస్టేట్ అప్రూవల్ వెంచర్‌లో మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన కమీషన్లతోపాటు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ 98660 94114.

నరసరావుపేట, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను Ph: 7989476799.

బుడంపాడు బైపాస్‌లో ఉన్న హాస్పిటల్‌లో పనిచేయుటకు ఆయమ్మలు, వార్డ్‌బాయ్స్ కావలెను. జీతం 13, 14 వేలు. 4సెలవులు. Ph: 9390304288, 9121014216.

ఇండస్ ఇండ్ నిప్పాన్ లైఫ్‌ఇన్సూరెన్స్ (రిలయన్స్) తెనాలిబ్రాంచ్‌కు మహిళా ఉద్యోగులు కావలెను. Q:డిగ్రీ, 21-50 సం|| తెనాలికి 5 కి.మీ. లోపు వారు. 9246417319.

ప్రముఖ కాలేజిలో మార్కెటింగ్ చేయుటకు డిగ్రీ అర్హత గల PRO's మరియు ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్స్ కావలెను. శ్రీ వర్ధని కాలేజి, 2/6, బ్రాడీపేట, Gnt. 9440214612, 9652146801.

అకౌంటెంట్ జాబ్ అకౌంట్స్ మేనేజర్ కావలెను. టాలీ, 10 సం||ల అకౌంట్స్‌లో అనుభవం, ఐటీ రిటర్న్స్, GST రిటర్న్స్ తెలుసుకున్నవారు kamathamjob@gmail.com కు పంపగలరు.

బాపట్ల సమీపంలో విధులకొరకు సెక్యూరిటీ గార్డ్స్, లేడి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 H డ్యూటీ వివరములకు ✆: 9394110108.

రేపల్లె - నల్లూరుపాలెంలోని భారత్ పెట్రోల్ బంకులో పనిచేయుటకు ఆసక్తి కలవారు కావలెను. పని నేర్పించబడును. - మంచి జీతం. 9246164672.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకొని సంప్రదించవలసిందిగా పాఠకులను కోరడమైనది. ప్రకటనలు చేసే వారు ప్రకటించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

తెనాలి
• తెనాలి • పొన్నూరు

వ్యర్థాలతో సంపద సృష్టి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇళ్లు, వ్యాపార సంస్థల నుంచి సేకరించిన తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి ఆదాయం ఆర్జిస్తూ ఆదర్శంగా నిలిచింది. కిలో రూ.10 చొప్పున అమ్మి అధికారులు ఏటా రూ.60వేల ఆదాయం సమకూరుస్తున్నారు. సేకరించిన తడి చెత్తలో బయో(కాంపోస్టర్లతో), వర్మి(వానపాముల) ఎరువు తయారుచేస్తున్నారు. కిలో లేదా టన్నుల్లో అమ్ముతుంటారు. టన్నుల్లో కొనే వారికి ధర తగ్గింది. ప్రతి నెలా 10 టన్నుల బయో, 3 టన్నుల వర్మి కంపోస్టు తయారు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు పేర్కొన్నారు.

పురపాలక కార్యాలయ కౌంటర్ వద్ద అమ్మకానికి పెట్టిన సేంద్రియ ఎరువు

కనులపండువగా శ్రీనివాస కల్యాణోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని అవధూత దత్తపీఠంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవి దంపతులు స్వామిజీ ఆశీస్సులు అందుకున్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవం

స్వామిజీ ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్సీ ఆలపాటి దంపతులు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ గంగానమ్మపేట పాత శివాలయం మార్గంలో ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. చిన్న రోడ్డులో ఎదురెదురుగా కార్లు, ఆటోలు వచ్చినప్పుడు వాహనాలు నిలిపోతు న్నాయి. వన్ వే బోర్డు ఉన్నా అమలు కావడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. - మనోజ్, సాయి - గంగానమ్మపేట

✔ రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పర్యవేక్షణకు సిబ్బంది ఏర్పాటు చేయిస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.

? తెనాలి పట్టణ చినరావూరు తోట ప్రధాన రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - సాంబశివరావు, చినరావూరు తోట

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. - రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ - పొన్నూరు, న్యూస్‌టుడే

? పొన్నూరు రైలుపేటలోని ప్రధాన రహదారిలో వీధి దీపం వెలగడం లేదు. - పి. వాణి

✔ వీధి దీపాన్ని మరమ్మతు చేయిస్తాం. -షేక్ హసీనా, పురపాలక సంఘ సహాయ ఇంజినీరు

? పొన్నూరు 11వ వార్డులో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - కె. ప్రమోద్‌కుమార్

✔ వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటాం. - పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.

స్పందనకు వందనం:

నీటి వృథాను అరికట్టారు

తెనాలి పట్టణ గాంధీచౌక్‌లో భూగర్భంలోని పైపుల నుంచి రోడ్డుపైకి నీరు వస్తుందని ఈ నెల 7న తేదిన మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియచేయగా, పాత రోజుల నాటి పైపుల అనుసంధాన లింకులు దెబ్బతిన్నాయని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. తాగు నీటి వృథాను అరికట్టారు. - తెనాలి పట్టణ హయ్యర్‌పేటలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఈ నెల 15న మున్సిపల్ అధికారులకు తెలియచేయగా మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

★ మేమున్నాం...మీకు తోడుగా శీర్షిక ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని నేతాజీనగర్‌లో పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు.

మత్తు వదిలేది ఎలా?

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల వారితోపాటు, ఇతరులూ నష్టపోతున్నారు. ప్రమాదాలకు గురై గాయాలపాలవడంతో పాటు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ క్రమంలోనే పోలీస్ విభాగం ప్రతి రోజూ బ్రీత్ ఎనలైజర్‌తో అనుమానితులకు శ్వాస పరీక్షలు నిర్వహిస్తోంది. వాహనదారులు మద్యం తాగారని నిర్ధారణ అయితే వారి వాహనాలను సీజ్ చేయడం తోపాటు సంబంధితులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, చాలా తక్కువగా నమోదవుతున్నాయి. మద్యం తాగారా? లేదా? నిర్ధారించే బ్రీత్ ఎనలైజర్ పరికరాలు అధిక పోలీస్ స్టేషన్ల పరిధిలో పని చేయడం లేదు. వాటి మరమ్మతులు జరగక, కొత్తవి అందుబాటులో లేక నిరంతర తనిఖీలు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో జరగడం లేదు. అన్ని స్టేషన్లలో ఈ పరికరాలు అందుబాటులోకి వస్తే మరింత పకడ్బందీగా కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. తెనాలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఏడాదిలో కేవలం 81 కేసులే నమోదయ్యాయి. ఆయా పరికరాలు ఉంటే రెండు మూడు రెట్లు కేసులు నమోదవడమేగాక, ఆమేర ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

తెనాలి శివారులో రాత్రి సమయంలో శ్వాస పరీక్షలు చేస్తున్న ఎస్సై ఆనంద్

గత ఏడాది స్టేషన్లవారీగా నమోదైన కేసులివి

తెనాలి వన్ టౌన్	15
తెనాలి టూ టౌన్	14
తెనాలి త్రీ టౌన్	12
తెనాలి రూరల్	02
కొల్లిపర	02
పొన్నూరు టౌన్	22
పొన్నూరు రూరల్	03
చేబ్రోలు	11

అపరాధ రుసుంతోపాటు జైలు శిక్ష కూడా

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిలో ద్విచక్రవాహనదారులతో పాటు కార్లు, ఆటోలు, లారీలు నడుపుతున్న వారూ ఉంటున్నారు. ఈ కేసుల నమోదైన వారికి రూ.10 వేలు జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా పడుతున్నాయి. తమ, తమ కుటుంబాల క్షేయస్సు కోరే ఎవరూ ఇలా చేయరు. వీరి వల్ల జరుగుతున్న ప్రమాదాలతో ఇతరులూ నష్టపోతున్నారు. పరికరాల సమస్యను అతి త్వరలోనే పరిష్కరించి అన్ని పోలీస్ స్టేషన్లకు అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతి రోజూ పగలు, రాత్రి తనిఖీలు నిర్వహిస్తాం. - జి.జనార్దనరావు, డీఎస్పీ

నేత్రపర్వం.. వైకుంఠుని తెప్పోత్సవం

అలంకృతుడైన వేంకటేశ్వరస్వామి

ఆర్ అండ్ బీ రోడ్డు పై నుంచి నిజాంపట్నం కాలువలో స్వామి వారి తెప్పోత్సవం చూస్తున్న భక్తులు

తెనాలి వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆలయం సమీపంలోని నిజాంపట్నం కాలువలో స్వామి వారి తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది. కాలువలో వెళ్తున్న స్వామివారిని చూసేందుకు భక్తులు సుమారు 2 కిలోమీటర్ల దూరం బారులు తీరి నిల్చొని వీక్షించారు. పట్టణ డీఎస్పీ జనార్దనరావు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో అనుపమ అర్చకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి

ఇత్తడి మాయంపై చర్యలేవీ?

పొన్నూరు, న్యూస్‌టుడే: దేవుడి సొమ్మును దాత ముసుగులో వైకాపా నేత దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాపా నేత పాల్పడిన దోపిడీ వెలుగులోకి వచ్చింది. దోపిడీపై దేవాదాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. నాటి నుంచి నేటివరకు దోపిడీ చేసిన నేతపై, ఆయనకు సహకారం అందించిన అధికారులపై ఎటువంటి చర్యలకు ఆదేశాలు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొన్నూరు సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ మహా విష్ణు, కాలభైరవ స్వామి దేవాలయాలు ఎదుట ఉన్న ధ్వజ స్తంభాలు దెబ్బతినడంతో గత వైకాపా నేత దాత అవతారం ఎత్తి రెండు ధ్వజ స్తంభాలను అందచేశారు. పాత ధ్వజ స్తంభాలకు ఉన్న సుమారు 200 కేజీల ఇత్తడి తొడుగులను ఆయన మాయం చేసి బయట అమ్ముకున్నట్లు సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇత్తడి తొడుగులు మాయం చేసిన విషయంపై గత ఏడాది జనవరి 12న 'దేవుడికే...శఠగోపం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు స్థానిక దేవాదాయ శాఖ అధికారులు ఇత్తడి మాయంపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. నివేదికను పరిశీలించిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయమని జిల్లా దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అప్పటి అధికారులు, అర్చకులను గుంటూరు పిలిపించి విచారణ చేసి నివేదిక పంపించారు. ఉన్నతాధికారుల వద్దకు నివేదిక వెళ్లి సుమారుగా ఏడాది గడిచినా ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడాన్ని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆలయ కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమరనాథ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ధ్వజస్తంభాల ఇత్తడి తొడుగులు అమర్చలేదన్నారు. విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని, తుది నిర్ణయం ఉన్నతాధికారులు తీసుకోవాల్సి ఉందని వెల్లడించారు.

మహావిష్ణువు దేవాలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం (పాతచిత్రం)

ఇళ్ల మధ్య మురుగు.. చేయరా కనుమరుగు

ఐతానగర్ గోలిడొంక రోడ్డులో ఇళ్ల నడుమ ఉన్న ఖాళీ స్థలం మురుగు నీటి తటాకంలా మారింది. ఇందులో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరో వైపు దుర్గంధంతో స్థానికులు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మరోవైపు అపార్ట్‌మెంట్లలోకి పాములు, పురుగులూ వస్తూ ఉండడంతో ఇబ్బందిపడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

కొమ్మలపై పురుగులు.. ఇళ్లలోకి పరుగులు

తెనాలి పట్టణ గాంధీనగర్‌లోని కవిరాజా పార్కులోని భారీ చెట్ల కొమ్మలు పరిసరాల్లోని ఇళ్ల మీదకు చొచ్చుకు వచ్చాయి. వీటి కొమ్మలకు ఉన్న పురుగులు గాలికి రాలి నేలపై పడటంతో అవి ఇళ్లలోకి వస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు పార్కు లోపలి మరుగుదొడ్ల గోడను చెట్టు నెట్టేస్తూ ఉండటంతో అది ఏ క్షణంలోనైనా పడిపోయేలా ప్రమాదకరంగా ఉంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మరమ్మతుల్లో డొల్లతనం.. తాగునీరు కలుషితం

పట్టణ తాగునీటి సరఫరా నిర్వహణలో డొల్లతనం బహిర్గతమైంది. పట్టణంలో దాదాపు 13 వేల కుళాయిలకు అందిస్తున్న తాగునీటి పైపులు సకాలంలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకైన నీరు కలుషితమవుతోంది. ఈ నీటిలో పందులు దొర్లుతుండగా అదే నీరు లీకైనచోట తిరిగి పైపులోకి చేరుతోంది. కొత్తపేట గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద తాగునీటి పైపు లీకు వంక కన్నెత్తి చూడక పోవటంతో ఆ గుంతలో ఇలా పందులు దొర్లుతున్నాయి. ఇది చూసిన జనం తాగునీరు తాగేదెలా అని మండి పడుతున్నారు. బుర్రిపాలెం, అష్టలక్ష్మి గుడి రోడ్డు, ప్రధాన తపాలా కార్యాలయం వెనక పక్క రోడ్డులోనూ పైపులు లీకై నీరు రోడ్డు మీదపారుతోంది. వీటికి వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు కలుషిత తాగునీరు సరఫరా చేయకుండా చూడాలని వేడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

తెనాలి డివిజన్ గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద..

సీతానగరం కొండపై విదేశీయుల సందడి

తాడేపల్లి, న్యూస్‌టుడే: విదేశీయుల రాకతో సీతానగరం కొండపై సందడి నెలకొంది. ఎన్నారై వైద్యుడు ముక్కమల అప్పారావు నేతృత్వంలో అమెరికా నుంచి 15 మంది విదేశీ వైద్య బృందం గురువారం విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జీయర్ ఆశ్రమ నిర్వహకుడు పురాణం వెంకటాచార్యులు స్వాగతం పలికి.. క్షేత్ర విశిష్టతను వివరించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న వ్యర్థాలతో అవస్థలు

తెనాలి(కొత్తపేట): తెనాలి పురపాలిక పరిధిలోని వ్యర్థాలను బుర్రిపాలెం ఆర్ అండ్ బీ రోడ్డును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలానికి తరలిస్తున్నారు. గుట్టలుగా పేరుకు పోవడంతో తరచూ నిప్పు పెడుతున్నారు. పొగ, దుర్వాసన కారణంగా స్థానికులు, ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు సమస్యలు తప్పడం లేదు.

మద్యం దుకాణంలో చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గంగానమ్మపేటలోని ఒక మద్యం దుకాణంలో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి 1.20 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు దుకాణంలోకి చొరబడి కౌంటర్‌లోని సుమారు రూ.16 వేల నగదు, రెండు మద్యం సీసాలు అపహరించారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. వచ్చిన వారు సుమారు 18 సంవత్సరాల వయసు వారిగా కనిపించారు. పోలీసులు దర్యాప్తులో వారివురు స్థానిక జిలేబి దుకాణంలో పని చేస్తారని తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వెతుకుతున్నామని పోలీసులు వివరించారు.

రైలు కింద పడి వృద్ధుని ఆత్మహత్య

తెనాలి టౌన్: రైలు కిందపడి తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన ఏడుకొండలు (65) ఆత్మహత్య చేసుకున్న ఘటన యడ్లలింగయ్య కాలనీ గేటు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించిన రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడంటూ కొలకలూరు గ్రామానికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై రెండో పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఐతానగర్ గోలి డొంక రోడ్డులోని పొలాల వద్ద శుక్రవారం జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న రెండో పట్టణ పోలీసులు వారి వద్ద రూ.6,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ నందులపేటకు చెందిన 60 సంవత్సరాల నాగలక్ష్మి ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి ప్రాంతానికి చెందిన ముప్పాళ్ల లీలాకృష్ణ(35) గతంలో ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసి ఇక్కడికి వచ్చాడు. తర్వాత సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అమాయకులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడు. ఇటీవల చింతపల్లి మండలంతోపాటు ఇతర ప్రాంతాల్లో 8 మంది నుంచి సుమారు రూ.85 లక్షల వరకు మోసం చేసినట్లు గుర్తించామని తెలిపారు. మాల్ మర్రిగూడ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు.

చేయని పనులు, డిపాజిట్లు రద్దు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులు ఏళ్లుగా మొదలు పెట్టని గుత్తేదార్లకు మున్సిపల్ అధికారులు ఝలక్ ఇచ్చారు. వారి నిర్వాకంతో వార్డుల్లో సకాలంలో పనులు చేపట్టక జనం నానా అవస్థలు పడుతున్నట్లు అధికార, ప్రతిపక్ష సభ్యులు వాపోయినా పట్టించుకున్న వారు లేరు. చివరికి మున్సిపల్ అధికారులు నిబంధనల కొరడా ఝుళిపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మొదలేయని గుత్తేదార్లకు నష్టం కలగకుండా రద్దు పరచటం వంటి కంటి తుడుపు చర్యలతో సరిపుచ్చటం పరిపాటి అయింది. సదరు గుత్తేదార్ల వైఖరితో పురపాలకానికి ఆర్థిక భారం పెరిగినా అధికారుల్లో చలనం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీ పై తెనాలి వచ్చిన మున్సిపల్ అధికారులు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్ల విలువైన సుమారు 50 రకాల అభివృద్ధి పనులు ఆరంభించక పోటానికి గల కారణాలను అధ్యయనం చేశారు. ఉద్దేశపూర్వకంగా చేయలేదని గుర్తించారు. సదరు పనులతోపాటు వీటికి చెందిన రూ.12 లక్షల డిపాజిట్లు రద్దు చేశారు. ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని గుత్తేదార్లకు గట్టి హెచ్చరిక పంపారు. గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్ల విలువగల పనులే రద్దు చేశారు. డిపాజిట్లు రద్దు చేయక కాంట్రాక్టర్లకు మేలు చేశారు. దీనిపై న్యూస్‌టుడే మున్సిపల్ అధికారులను సంప్రదించగా నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిందేనన్నారు. గుత్తేదార్లు చేయని 15వ ఆర్థిక సంఘం నిధుల పనులు వాటి డిపాజిట్లు రద్దు చేసినట్లు తెలిపారు. వీటికి మరోసారి టెండర్ పిలిచినట్లు పేర్కొన్నారు.

డిపాజిట్ రద్దు చేసిన నందులపేటలోని కవిరాజా పార్కు రోడ్డు

సమాజోద్ధరణకు పాటుపడిన రామస్వామి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కవిరాజు త్రిపురనేని రామస్వామి సమాజోద్ధరణకు పాటుపడిన ధీరోదాత్తుడని పలువురు కొనియాడారు. ప్రజ్వలిత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కవిరాజా పార్కులో నిర్వహించిన ఆయన వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మూఢ విశ్వాసాలను ఎదుర్కోటంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించినట్లు వారు పేర్కొన్నారు. ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. సినీనటులు వేమూరి విజయభాస్కర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, కొండముది రమేష్, అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజ్వలిత సంస్థ సభ్యులు

ఆసక్తికరంగా సాగిన ట్రాక్టర్ రివర్స్ పోటీలు

రేపేంది నాటికలోని ఒక సన్నివేశం

సంక్రాంతి సంబరాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం ఖాజీపేట గ్రామంలో సంక్రాంతి పండగ సంబరాల సందడి నెలకొంది. గురువారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. చదువు ప్రాధాన్యం తెలియచేస్తూ తెనాలి కళాకారులు ప్రదర్శించిన 'రేపేంది' నాటిక ఆలోచింపచేసింది. శుక్రవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు ఆసక్తికరంగా, యువత కేరింతల నడుమ సాగాయి. గ్రామ పెద్దలు, యువ ప్రతినిధులు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కొల్లిపర, న్యూస్‌టుడే: సంక్రాంత్రి సాంస్కృతిక సంబరాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కొల్లిపర గ్రామంలోని ఎఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో శ్రీకళానిలయం నేతృత్వంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాన్ని గుదిబండిచినవెంకటరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. జానపద నృత్యాలు, సెమిక్లాసికల్ డాన్స్‌ల్లో విద్యార్థులు కళాకారులు, విద్యార్థులు ఆనందోత్సాహిలనడుమ పాల్గొన్నారు. ఎవరు' సాంఘీక నాటిక ఆహుతులను హృదయాలకు హత్తుకుంది. రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. అధ్యక్ష కార్యదర్శులు జొన్నలఅమ్మిరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, గుదిబండిశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్యప్రదర్శన

కవిరాజు రామస్వామి జరిపిన పోరాటాలే స్ఫూర్తి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మానవాభివృద్ధికి అశనిపాతంగా మారిన విధానాలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవటంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి నాడు జరిపిన పోరాటాలే స్ఫూర్తి అని విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కవిరాజు వర్ధంతి సందర్భంగా శుక్రవారం తెనాలి కవిరాజా పార్కులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య అధ్యక్షత వహించారు. నేటి సమాజంలో నెలకొన్న అసమానతలు రూపమాపటానికి త్రిపురనేని చూపిన తెగువ, పోరాట పటిమ, నిస్వార్థ రాజకీయాలు నేటికీ అనుసరణీయమని అన్నారు. గురజాడ, పులే, త్రిపురనేని ఎంచుకున్న మార్గంలో నేటి యువత పయినించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పై సమగ్ర అవగాహన లేని వారు చేస్తున్న మూఢ విశ్వాస చర్యలను ఆయన నిలదీసారు. ఇలాంటి వారు హేతువాదం నిబద్ధతను దెబ్బతీయలేరని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధే తన అభిమతంగా భావించిన త్రిపురనేని హేతువాద విధానాల వైపు కాస్త ఆలస్యంగానైనా ప్రజలు నడిచినట్లు ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సాహితీవేత్త, పరిశోధక రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ అతిథులను సభకు పరిచయం చేశారు. రాష్ట్ర హేతువాద సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అట్లూరి అనిల్ పేర్కొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ వెంకటేశ్వరరావు

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

తెనాలి టౌన్: ప్రఖ్యాత మల్ల యోధుడు కోడి రామ్మూర్తి నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని ప్రతిభావంతుడైన వైద్య విద్యార్థి జయేంద్రకు స్నేహిత ట్రస్ట్ ఫౌండర్ తాడికొండ మురళి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని న్యాయవాది పొన్నం విజయకుమార్ చేతుల మీదుగా అందించినట్లు తెనాలికి చెందిన సామాజిక సేవకులు తన్నీరు శివశంకర్ శుక్రవారం తెలిపారు. ట్రస్ట్ తరపున గత ఏడాది కూడా ఆర్థిక సహాయం చేశామన్నారు.

ఆవులు, పశువులకు పూజలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కనుమ పండుగ సందర్భంగా శుక్రవారం తెనాలి మండలం సోమసుందపాలెంలోని ఆర్గానిక్ ఫాంతో పాటు, పలు గ్రామాల్లో ఆవులు, పశువులకు రైతులు, పర్యవేక్షకులు పూజలు నిర్వహించారు.

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉపశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ ఫణి వురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ వురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైనసూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, ఋణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ, అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికి, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026

ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

విషసర్పాలకు ఆవాసాలు

మండలం	: పొన్నూరు
గ్రామాలు	: 29
కుటుంబాలు	: 21,930
జనాభా	: 63,504
ఖాళీ స్థలాల సంఖ్య	: 2200

మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు, గోళ్లమూడిపాడు, దండమూడి, ఆరెమండ, ములుకుదురు, మాచవరం, ఉప్పరపాలెం, తదితర గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు దట్టంగా మొలిచాయి. విషసర్పాలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. ఆ ఖాళీ స్థలాలు పక్కనున్న గృహాల్లోకి పాములు, తేళ్లు వంటి విష జంతువులు వస్తున్నాయి. చీకటి పడితే చాలు ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు తొలగించాలని అనేక మార్లు స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలు క్రితం కొంత మంది పంచాయతీ అధికారులు ఖాళీ స్థల యజమానులకు నోటీసులు అందచేశారు. నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలకు శ్రీకారం చుట్టలేదు.

★ కొన్ని గ్రామాల్లో ఖాళీ స్థలాలు పల్లపు ప్రాంతాల్లో ఉండటంతో వర్షపునీరు చేరుతోంది. ఆ వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నీళ్లు అలాగే నిల్వ ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆ నీరు దుర్వాసన వస్తోంది. దోమలు పెరగడానికి కూడా ఇదొక కారణమని చెబుతున్నారు. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో ఖాళీ స్థలాలకు మెరక తోలించే విధంగా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ములుకుదురులో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిచెట్లు

★ దీనిపై పొన్నూరు మండల ఈవోపీఆర్డీ వేముల శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వీలైనంత త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఖాళీ స్థల యజమానులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్లను తొలగించే విధంగా చూడాలని కోరారు.

- న్యూస్‌టుడే, పొన్నూరు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

చమళ్లమూడి (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని చమళ్లమూడి గ్రామంలో అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం వట్టిచెరుకూరు ఎస్సై బాబురావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొట్టిపాటి కోటేశ్వరరావు(70) కడుపునొప్పి, కాళ్లనొప్పులతో కొన్నేళ్లుగా బాధపడుతున్నారు. ఎంతకీ ఉపశమనం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న ఇంట్లో ఉన్న గడ్డి నివారణ రసాయన మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సీతానగరం కొండపై విదేశీయుల సందడి


విదేశీ పర్యాటకులతో మాజీ ఎంపీ గంగరాజు, జీయర్ ఆశ్రమ నిర్వాహకుడు వెంకటాచార్యులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విదేశీయుల రాకతో సీతానగరం కొండపై సందడి నెలకొంది. ఎన్నారై వైద్యుడు ముక్కమల అప్పారావు నేతృత్వంలో అమెరికా నుంచి 15 మంది విదేశీ వైద్య బృందం గురువారం విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జీయర్ ఆశ్రమ నిర్వాహకుడు పురాణం వెంకటాచార్యులు స్వాగతం పలికి.. క్షేత్ర విశిష్టతను వివరించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన: తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామ శివారు చెంచుకాలనీ ప్రధాన రహదారిపై వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఈవోపీఆర్డీ రమణ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను తొలగించి డంప్ యార్డుకు తరలించారు.

18న ఎంయూఎఫ్ సమావేశం

పట్నంబజారు: ముస్లింల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న తెనాలిలో నిర్వహించనున్న ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశానికి హాజరుకావాలని ఫ్రంట్ అధ్యక్షుడు మహమ్మద్ కలీం కోరారు. శుక్రవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కళారూపాలతో సమాజంలో చైతన్యం

పెదనందిపాడు: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

'ఆచమనం' నాటికలోని సన్నివేశం

అబ్బినేనిగుంటపాలెం (పెదనందిపాడు): నాటకరంగాన్ని ఆదరించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. అబ్బినేనిగుంటపాలెంలో గత మూడురోజుల నుంచి ఏబీ పాలెం కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక వైభవం కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఆహ్వాన నాటకోత్సవం ముగింపు సభలో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. కళారూపాలతో సమాజంలో చైతన్యం తేవచ్చని చెప్పారు. కళలను ఆదరించాలని పేర్కొన్నారు. అబ్బినేనిగుంటపాలెంలో నాటకోత్సవం ఏర్పాటు చేసిన పెదబాపారావు, చినబాపారావులను ఆయన అభినందించారు. భగవద్గీత పఠనంలో బెంగళూరులో బంగారు పతకం సాధించిన ఆ గ్రామానికి చెందిన సూర్యకుమారిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ పెద్దఎత్తున నాటకోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నటుడు, దర్శకుడు పి. శివరామకృష్ణయ్య, సర్పంచి కృష్ణప్రసాద్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ పి. సాంబశివరావు, పి. లక్ష్మీనారాయణ, పారిశ్రామికవేత్త వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం సందేశాత్మకం.. ఒడిదొడుకులను ఎదుర్కొని బెదిరిపోకుండా జీవితాన్ని చివరివరకు గడపాలని తెలియజేస్తూ కళా శ్రవంతి కాకినాడ వారి 'ఆచమనం' నాటిక సాగింది. కష్టాల్లో ఉన్న వారికి సహాయ పడాలని ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'మంచి మనసులు' నాటిక చాటి చెప్పింది.

గోదా, వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

సీతానగరంలో గోదా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరంలో దుర్గగుడి దత్తత ఆలయమైన శ్రీమద్వీరాంజనేయ సమేత కోదండరామ స్వామి ఆలయంలో గోదా వేణుగోపాలస్వామి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ క్రతువు అనంతరం గురువారం సీతానగరం కొండ చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆలయం నుంచి చినజీయర్‌స్వామి ఆశ్రమం, చినాంజనేయస్వామి ఆలయం, ప్రకాశం బ్యారేజీ మీదుగా ఆలయానికి చేరుకున్నారు.

పౌరాణిక పద్య పఠన పోటీలు 18న

పెదనందిపాడు: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న ఉదయం 9 గంటలకు పెదనందిపాడు శివాలయ ప్రాంగణంలో కోదండ రామ సంకీర్తన భజన మండలి, స్పిరిచ్యువల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో పౌరాణిక పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ వారు తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు 9441521546 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పల్లెల్లో ప్రగతి పరుగులు

పొన్నెకల్లు శివారు వాగుపై నిర్మించిన వంతెన

నిడముక్కలలో ఏర్పాటు చేసిన కాలువ

తాడికొండ, తుళ్లూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే 'పల్లె పండగ' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశారు. ఇందులో భాగంగా అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు. సీసీ రహదారులు నిర్మించడంతోపాటు మురుగు పారుదల వ్యవస్థను మెరుగు పరిచారు. ప్రస్తుతం మరో సారి 'పల్లె పండగ' - 2.0 కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ నేపథ్యంలో ఆయా పనులకు ఇటీవల స్థానిక ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు జరిగాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. ప్రస్తుతం పరిస్థితి మారడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2025 డిసెంబరు వరకు వివరాలిలా..

మండలం	పనుల సంఖ్య	ఖర్చు
తాడికొండ	118	రూ.2.84 కోట్లు
తుళ్లూరు	36	రూ.1.72 కోట్లు

పీర్ల పంజా, మదర్సా అభివృద్ధికి మంత్రి లోకేశ్ చేయూత

మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పాత మంగళగిరిలో పునర్నిర్మించిన హజరత్ అలీ పీర్ల పంజా, మదర్సాను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వాటి అభివృద్ధికి మంత్రి తన సొంత నిధుల నుంచి రూ.2.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఆయన ముస్లిం పెద్దలు మన స్వాగతం పలికారు. కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాని, షేక్ రఫీ, షేక్ జానీ, షేక్ సాదిక్, షేక్ మహ్మద్‌అలీ, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎస్ఆర్ఎం విద్యార్థుల సత్తా

పతకాలతో విద్యార్థులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మంగళూరులో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు మూడు బంగారు పతకాలు సాధించారు. ఆదిత్య 74.43 మీటర్ల దూరం జావెలిన్ త్రో విసిరి, అనామిక హెప్టాథాన్ పోటీల్లో 5158 పాయింట్లతో, మొహసినా మహమ్మద్ లాంగ్ జంప్‌లో 6.15 మీటర్లు స్కోర్ చేసి బంగారు పతకాలు సాధించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుష్మితా సింగ్ తెలిపారు. విజేతలను వర్సిటీ ప్రెసిడెంట్ డా.సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొ.సతీశ్ కుమార్, రిజిస్ట్రార్ డా.ఆర్. ప్రేమ కుమార్ తదితరులు అభినందించారు.

ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక


వర ప్రసన్నాంజనేయ

లీలా వెంకట సుబ్బారావు

తాడేపల్లి, మంగళగిరి,: లద్దాఖ్‌లో ఈ నెల 20 నుంచి 28 వరకు జరుగనున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో ఐస్ స్కేటింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన వెనిగళ్ల లీలా వెంకట సుబ్బారావు, వరప్రసన్నాంజనేయ ఎంపికైనట్లు కోచ్ అబ్దుల్‌హఫీజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

సంక్రాంతి శోభ కనుమా..!

పల్లెల్లో సందడే సందడి

తుళ్లూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద..

కాకుమాను: ట్రాక్టర్ రివర్స్ పోటీలు

మేడికొండూరులో ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు

న్యూస్‌టుడే బృందం: మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం సంక్రాంతి, శుక్రవారం కనుమ పండగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. పెదనందిపాడు మండలం వరగానిలో పశు ప్రదర్శన పోటీలు జరిపారు. పెదనందిపాడులో వివిధ ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. • కాకుమాను, చినలింగాయపాలెం పరిధిలోని పెద్దివారిపాలెంలో దూర ప్రాంతాలతో పాటు ప్రవాసాంధ్రులు కూడా సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, చిన్నారులకు నృత్యాల పోటీలు ఉత్సాహంగా జరిపారు.

సంప్రదాయాలకు ప్రతీక: ఎమ్మెల్యేలు

తాడికొండ మండలం మోతడకలో నిర్వహించిన సంబరాల్లో స్థానిక ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల ప్రవీణ్, ధూళిపాళ్ల నరేంద్రలు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో నూతన సంగం డెయిరీ భవనంలో మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. గ్రామంతో ఆయనకు ఉన్న అనుబంధం, సేవలను గుర్తుగా గ్రామస్థులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వీరయ్య చౌదరి సేవలను కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం వారు విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ తెదేపా నాయకుడు శివరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు. • మేడికొండూరు బొద్దరయి కూడలిలో ముగ్గులు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, స్లో సైక్లింగ్, బైక్ రైడింగ్, కుర్చీలాట తదితర పోటీలు జరిగాయి. చిన్నా, పెద్దా ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ కూడలిలోని మహాలక్ష్మి (అంకమ్మచెట్టు) వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థం, ప్రసాదం వితరణ జరిగింది.

మేడికొండూరులో ఆపిల్ తినే పోటీల్లో చిన్నారులు

కాకుమాను: పెద్దివారిపాలెంలో వేడుకలకు తరలివచ్చిన గ్రామస్థులు

తాడికొండ: మోతడకలో చిన్నారుల నృత్యం

మోతడకలో మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, నరేంద్ర, ప్రవీణ్ తదితరులు

దుమ్ము లేచి..ఇక్కట్లు తెచ్చి..

రాయపూడి సమీపంలో ఇలా..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనుల కోసం వస్తున్న వాహనాల కారణంగా విపరీతంగా దుమ్ము లేస్తోంది. దీంతో రహదారులపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాజధాని గ్రామాల్లో గుత్తేదారు కంపెనీలు, సీఆర్డీఏ అధికారులు, స్థానికులతో జరిగిన సమావేశంలో వాహనాల కారణంగా దుమ్ము ఏర్పడకుండా రహదారులపై నీరు చల్లిస్తామని చెప్పారు. కానీ కొంత మంది కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఆర్డీఏ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రూ.కోట్లు వెచ్చించి.. నిర్వహణ విస్మరించి

విరిగిపడిన స్తంభం

అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: గుంటూరు నగర శివారు అంకిరెడ్డిపాలెం చెరువును రూ.కోట్ల నిధులతో అభివృద్ధి చేశారు. చుట్టూ వాకింగ్ ట్రాక్, నీటి మధ్యలో విగ్రహం ఏర్పాటు చేశారు. వాలీబాల్ తదితర ఆటలకు సంబంధించిన కోర్టులు అందుబాటులోకి తెచ్చారు. కానీ నిర్వహణ మాత్రం అధ్వానంగా మారింది. ఇక్కడ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభం విరిగి నెల రోజులు అవుతున్నా పట్టించుకోవడం లేదు. మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రధాన రహదారి వైపు డివైడర్ కట్టి సగం రోడ్డును అసంపూర్తిగా వదిలేశారు. కంకర పోసి వదిలివేయడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు వీలు పడటం లేదని స్థానికులు చెబుతున్నారు. వాకింగ్ ట్రాక్ మధ్యలో ఎరువు, చెత్త కుప్పలు పడేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు

ముగ్గులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, వెలువోలు సేవా సమితి సభ్యులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిపురం వెలువోలు సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వెలువోలు సేవా సమితి సభ్యులను అభినందించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. ముగ్గులు, క్రికెట్, లెమన్ అండ్ స్పూన్, కుర్చీలాట, ట్రాక్టర్ రివర్స్, స్లో బైక్ రైడింగ్ వంటి పోటీలు నిర్వహించారు. కోలాటం, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు. క్రికెట్‌లో ఒకటీ, రెండు, మూడు, నాల్గవ బహుమతులు వరుసగా రూ. 40, రూ.30, రూ.20, రూ.10వేలు అందించారు. సీనియర్స్ విభాగం ముగ్గులు పోటీల్లో తొలి ముగ్గురు విజేతలకు వరుసగా ఎల్ఈడీ టీవీ, ఫ్రిజ్, గ్రైండర్, జూనియర్స్ విభాగంలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వారికి వరుసగా స్మార్టు ఫోన్, సైకిల్, ట్రావెలింగ్ బ్యాగు అందించారు. వీటికి తోడు మిగిలిన ఆయా ఆటల్లో కలిపి మొత్తంగా సుమారు రూ.1 లక్ష అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుట్టలమ్మ లడ్డూ ప్రసాదం @ రూ.15.5 లక్షలు


లడ్డూను దక్కించుకున్న నల్లపాడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు

గుంటూరు రూరల్: చల్లావారిపాలెం గ్రామంలోని ఘంటలమ్మ తల్లి, పుట్టలమ్మ తల్లి దేవస్థానం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి 9 కేజీల లడ్డూ వేలం పాట జరిగింది. నల్లపాడు గ్రామానికి చెందిన ఇమడాబతిని నాగేశ్వరరావు ఆ లడ్డూ ప్రసాదాన్ని రూ. 15.5 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకారణ చేశారు.

గండాలయ్య సన్నిధికి ప్లాస్టిక్ సీసాలు, సంచులు తేవొద్దు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పానకాల శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉపాలయమైన మంగళగిరి కొండపై గండాలయస్వామికి దీపం వెలిగించే నువ్వుల నూనె, పూజా సామగ్రిని దేవస్థానమే విక్రయిస్తుందని ఈవో కోగంటి సునీల్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గండదీపం వెలిగించే భక్తులు ప్లాస్టిక్ బాటిల్స్, పాలిథిన్ సంచుల్లో పూజా ద్రవ్యాలు తీసుకురావద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నెల 18న అమావాస్యకు గండ దీపం వెలిగించేందుకు వచ్చే భక్తులు దీన్ని గమనించాలని కోరారు.

స్వామివార్ల వస్త్రాలకు వేలంపాట

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల వస్త్రాలను అధికారులు రెండు రోజులు నిర్వహించిన వేలంలో 118 చీరలను భక్తులు సొంతం చేసుకున్నారు. 450 భక్తులు వేలంలో పాల్గొని స్వామి వార్ల వస్త్రాలను చేజిక్కించుకున్నారు. ఇందుకు గాను ఆలయానికి రూ.53 వేల ఆదాయం సమకూరినట్లు ఈవో సునీల్‌కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

'లంచం ఇవ్వలేదని ఇబ్బంది పెడుతున్నారు'

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు సహకార పరపతి సంఘంలోని ఒక ఉద్యోగి లంచం ఇవ్వలేదని తమకు రుణాలు మంజూరు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని గ్రామ తెదేపా అధ్యక్షుడు, రాజధాని ఐకాస నాయకుడు కాటా అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తుళ్లూరులోని సొసైటీ వద్ద మాట్లాడారు. సొసైటీ అధికారులు అడిగిన పత్రాలు అన్నీ ఇచ్చినా 36 రోజుల నుంచి రుణాలు మంజూరు చేయకుండా సొసైటీ అధికారులు ఇబ్బందులు తిప్పుతున్నారని రైతులు వాపోయారు. సమస్యను ఇప్పటికే సొసైటీ అధ్యక్షుడు ఇందుర్తి నరసింహారావు, డైరెక్టర్లు పి.జయకృష్ణ, జమ్ముల అనిల్ దృష్టికి తీసుకు వెళ్లామని, పరిష్కారం కాకపోతే శనివారం రైతులతో కలసి సొసైటీ ఎదుట ధర్నా చేస్తామని అప్పారావు హెచ్చరించారు.

చెట్టును ఢీకొని కారు బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి మృతి?

క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 10.45 గంటల ప్రాంతంలో విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు మంగళగిరి శివారు ప్రాంతంలోని బైపాస్ రోడ్డుపై చెట్టును ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. లోపల ఇరుక్కుపోయిన వారిని స్థానికులు బయటకు తీశారు. ఓ వ్యక్తి మృతి చెందగా..ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను ఎన్నారై ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి ప్రాంతానికి చెందిన ముప్పాళ్ల లీలా కృష్ణ(35) గతంలో ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసి ఇక్కడికి వచ్చాడు. తర్వాత సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అమాయకులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడు. ఇటీవల చింతపల్లి మండలంతోపాటు ఇతర ప్రాంతాల్లో 8 మంది నుంచి సుమారు రూ.85 లక్షల వరకు మోసం చేసినట్లు గుర్తించామని తెలిపారు. మాల్ మర్రిగూడ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వాస్తవాలు ఒప్పుకున్నట్లు వివరించారు. అతని నుంచి ఒక చరవాణితోపాటు ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నాంపల్లి సీఐ డి.రాజు, చింతపల్లి ఎస్సై రామ్మూర్తి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు

పెదనందిపాడు: పాలపర్రులో దేవతామూర్తుల ఊరేగింపు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా మండల గ్రామాలలోని వివిధ దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదనందిపాడు, పాలపర్రు, కొప్పర్రులో ఉత్సవమూర్తులకు తెప్పోత్సవాలు నిర్వహించారు. పెదనందిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం గోపూజ చేశారు.

వేడుకగా గోపూజోత్సవం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సంక్రాంతి పురస్కరించుకుని గోపూజోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు నల్లూరి రామచంద్ర భట్టాచార్యులు, ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు గోపూజ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజ నిర్వహించి గోమాతను ఆలయంలో ప్రదక్షిణలు చేయించారు. ఉత్సవాన్ని ఈవో సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. • పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య షిర్డీసాయిబాబా మందిరం వద్ద ఉన్న గోశాలలో శుక్రవారం గోపూజ నిర్వహించారు. మందిరం నిర్వాహకులు పాతూరి నాగభూషణం, గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు దంపతులు గోపూజోత్సవాన్ని నిర్వహించారు.

పెదనందిపాడు: వేణుగోపాలస్వామి ఆలయంలో..

పాల్గొన్న పాతూరి నాగభూషణం, శ్రీనివాసరావు

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

చమళ్లమూడి(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని చమళ్లమూడి గ్రామంలో అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం వట్టిచెరుకూరు ఎస్సై బాబురావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొట్టిపాటి కోటేశ్వరరావు(70) కడుపునొప్పి, కాళ్లనొప్పులతో కొన్నేళ్లుగా బాధపడుతున్నారు. ఎంతకీ ఉపశమనం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న ఇంట్లో ఉన్న గడ్డి నివారణ రసాయన మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కడుపు నొప్పి తాళలేక మహిళ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన మహిళ కడుపు నొప్పితో బాధపడుతోంది. మరో వైపు కుటుంబ కారణాల నేపథ్యంలో మానసికంగా కుంగిపోయి ఈ నెల 13న గడ్డి మందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతి చెందింది. ఈ ఘటనపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని భీమినేనివారిపాలెంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఆలూరి నాగాంజనేయులు కుటుంబీకులు వ్యవసాయ పని నిమిత్తం కొన్నాళ్ల కిందట కర్ణాటక రాష్ట్రం వెళ్లారు. ఆ ఇంట్లో చోరీ జరిగిందని మేడికొండూరు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి వెనుక కిటికీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి వచ్చి ఉంటారని భావిస్తున్నారు. బాధితుడు నాగాంజనేయులుతో పోలీసులు ఫోన్ ద్వారా మాట్లాడారు. బీరువాలో ఉంచిన బంగారం చెవి పోగులు ఒక జత, రూ.10 వేలు నగదు మాయమయ్యాయని పోలీసులు తెలిపారు.

దారి.. అధ్వానంగా మారి..

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిరిపురం - వరగాని మధ్య రోడ్డు పాడైపోయింది. పలు చోట్ల గుంతలు పడ్డాయి. అక్కడక్కడ కోతకు గురైంది. అవి రాత్రిళ్లు కనిపించడం లేదు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి చోదకులు గాయాలపాలవుతున్నారు. బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 27, వంగ 24, బెండ 39, పచ్చిమిర్చి 30, కాకర 35, క్యారెట్ 34, క్యాబేజీ 23, బీర 42, దొండ 40, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 27, గోరుచిక్కుళ్లు 39, దోస 38, పొట్ల 30, చామ 23, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 10, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 35, క్యాప్సికం 50, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 55, సొర 15, అరటి 8.
– న్యూస్‌టుడే, పట్నంబజారు

విశేష అభిషేకాలు.. జ్యోతి దర్శనాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మకర సంక్రమణం సందర్భంగా పలు ప్రాంతాల్లో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు, మకర జ్యోతి దర్శనాలు జరిగాయి. స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మకరసంక్రాంతి సందర్భంగా గురువారం రాత్రి గంగిరెద్దుల విన్యాసాలు, భజన కీర్తనలు జరిగాయి. అన్నమయ్య కళావేదికపై క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు దంపతులు స్వామి అభిషేకాలను ప్రారంభించారు. 18 మెట్ల దీప పూజ చేసి మకరజ్యోతి వెలిగించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్ సోదరులు, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మకరజ్యోతి దర్శనం

అయ్యప్పస్వామికి అభిషేకంలో ప్రముఖులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

◆ వినోభానగర్ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు రెండ్రోజులుగా తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు శ్రీనివాస్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. ◆ సంజీవయ్య నగర్ మూడోలైన్ సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకాక సమస్యలు వస్తున్నాయని స్థానికుడు చరణ్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కాలువల్లో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

సమస్యల సవాళ్లను అధిగమిస్తారా...!

నేడు కమిషనర్‌గా మయూర్ అశోక్ బాధ్యతల స్వీకరణ

నగరపాలకసంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరపాలక సంస్థ పరిధిలో దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న అనేక అభివృద్ధి పనులు పట్టాలెక్కాయి. ప్రస్తుతం ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. నగరపాలక సంస్థకు నూతన కమిషనర్‌గా నియమితులైన మయూర్ అశోక్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. యువ ఐఏఎస్ కావడంతో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటారని నగర ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. 2024 ఆగస్టు నుంచి ఇప్పటివరకు పనిచేసిన కమిషనర్ పులి శ్రీనివాసులు మార్కాపురం జిల్లాకు జేసీగా బదిలీపై వెళ్తున్నారు. జీఎంసీలో ప్రస్తుతం జరుగుతున్న పనులతోపాటు పెండింగ్ పనులు కూడా గాడినపెట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వేసవి రానున్న నేపథ్యంలో రిజర్వాయర్లకు దూరంగా ఉన్న ప్రాంతాలు, నగర శివార్లలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. భారీగా ఆర్వోబీల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

నిర్మాణంలో నందివెలుగు రోడ్డు ఆర్వోబీ

శంకర్‌విలాస్ ఆర్వోబీకి.. నగరంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వారధిగా ఉండే శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులు రూ.98 కోట్ల వ్యయంతో ప్రారంభమై జరుగుతున్నాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకాకుండా స్థల సేకరణకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. నందివెలుగురోడ్డులో రూ.36.91 కోట్లతో పనులు సాగుతున్నాయి. ఇవి వేగంగా పూర్తయ్యేలా చూడాలి.

నార్ల ఆడిటోరియం.. గార్డెన్స్‌లో నార్ల ఆడిటోరియం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన అభివృద్ధి చేసి నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉంది. దీని అభివృద్ధికి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ముందుకు వస్తోంది.

తాగునీటి పథకం వినియోగంలోకి.. గోరంట్ల కొండపై శివారు ప్రాంతాలు, పలు విలీన గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.33 కోట్లతో ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని ఈ వేసవికే వినియోగంలోకి తెచ్చేలా చొరవ తీసుకోవాలి.

ఆక్రమణదారుల గుప్పిట్లో విలువైన స్థలాలు.. కార్పొరేషన్ స్థలాలను ఆక్రమణదారులు దర్జాగా కబ్జా చేసి అద్దెలకు ఇచ్చి ఆదాయం గడిస్తున్నా.. పట్టించుకునే వారు లేరు. పట్టాభిపురం ప్రధాన రహదారిలో స్వామి వివేకానందుడి విగ్రహం వెనుక గత కృష్ణా పుష్కరాల నుంచి నకిలీ బి.ఫారాలతో కొందరు ఆక్రమించేసి స్థానికులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా.. పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదు. ఇలా కార్పొరేషన్ స్థలాలు చాలానే కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై దృష్టి పెట్టాలి.

వెండార్ జోన్లు ఏమయ్యాయో.. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు వెండార్ జోన్లు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రతిపాదనలున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. ఈసారి గుర్తించిన స్థలాల్లో పక్కాగా జోన్లు ఏర్పాటు చేసి చిరువ్యాపారులకు రక్షణ కల్పించాలి.

బస్టాండులోని స్టాల్స్‌పై కేసులు నమోదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్‌లో గరిష్ఠ చిల్లర ధరకు మించి ఆహారపదార్థాలు విక్రయిస్తున్న స్టాల్స్‌లో శుక్రవారం ఆర్టీసీ అధికారులు తనిఖీలు చేశారు. ధరల మోతపై ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురితమైన 'ఇక్కడింతే' కథనానికి వారు స్పందించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యంతోపాటు ఆర్టీసీ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. 5 దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. రూ.5,900 అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం తెలిపారు. కొందరు స్టాల్స్ నిర్వాహకులు శీతలపానీయాల విక్రయాలకు అనుమతి తీసుకొని ఇతర పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దుకాణాల ఎదుట ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

ఈనాడు కథనానికి స్పందన

విద్యార్థులకు ఆటల పోటీలు

గుంటూరు నేరవార్లు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో శ్రీకేనగర్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో మానసికోల్లాసంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి అన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, ఆంజిబాబు, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, గోపాల్‌బాబు, శివకుమార్, రిహమాన్ పాల్గొన్నారు.

18న ఎంయూఎఫ్ సమావేశం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ముస్లిం సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న తెనాలిలో నిర్వహించనున్న ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి హాజరుకావాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు మహమ్మద్ కలీం కోరారు. శుక్రవారం మాయాబజారులోని ఎంయూఎఫ్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ముస్లిం ధార్మిక సంస్థల, వక్ఫ్ భూములు, భూ సేకరణ చట్టం ద్వారా సేకరించటానికి జరుగుతున్న ప్రయత్నంపై తెనాలిలో జరిగే సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరించిన మహమ్మద్ కలీం

భాజపా నాయకుల సంబరాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా నగరంలో శుక్రవారం భాజపా శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. భాజపా ఘన విజయం సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించినట్టు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివన్నారాయణ, శ్రీనివాస్, సుబ్బారావు, రవి, భాస్కర్, రామకృష్ణ, విమలదేవి, సరోజిని పాల్గొన్నారు.

ఆవోపా గోసేవ

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూనగర్‌లోని గోశాలలో గోసేవ కార్యక్రమం నిర్వహించారు. ఆవోపా నిర్వాహకులు గోపూజ చేశారు. అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా గోసేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, సాయి రమేష్, మోహన్, శివాజీ, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గోపూజ చేస్తున్న కేవీ బ్రహ్మం, శ్రీనివాసరావు, సాయి రమేష్

సత్య షోరూమ్‌లో రాయితీలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా సత్య షోరూంలో ఈ నెల 18 వరకు భారీ రాయితీలు ఇస్తున్నట్టు షోరూం యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్‌మెషీన్‌లలో ఉత్తమ బ్రాండ్లు అందుబాటు ధరల్లో లభిస్తాయని వివరించింది. మొబైల్ 5జీ ఫోన్లు రూ.7,999 నుంచి, పోర్టబుల్ పార్టీ బ్లూటూత్ స్పీకర్లు రూ.2,449 నుంచి లభిస్తాయని తెలిపింది. కంప్లీట్ కిచెన్ కాంబో రూ.10,999కు అందిస్తున్నట్టు, ఇందులో గ్యాస్ స్టవ్, కుక్కర్, గ్రైండర్, మిక్సీ వంటివి ఉంటాయని వివరించింది. ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి లభ్యమవుతాయని పేర్కొంది. ప్రతీ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుందని తెలిపింది.

'అమరావతిపై జగన్ కక్ష తీరలేదు'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 200 మంది అమరావతి రైతుల ప్రాణాలను బలిగొన్న జగన్‌కు వారిపై కక్ష తీర లేదు...రాజధాని అమరావతిపై ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. చివరకు నదీ గర్భంలో రాజధాని ఏమిటని...దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తామని మాట్లాడడం జగన్ మానసిక పరిస్థితికి అద్దం పడుతుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో తిరుమల నమూనా దేవాలయం సెట్టింగ్ చేయించి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పండగలు, దేవుళ్లను సైతం రాజకీయాలకు వినియోగించుకున్న చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు.

నగరాభివృద్ధిలో శ్రీనివాసులుది కీలకపాత్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో అన్ని వర్గాల ప్రజల మన్నన పొందిన కమిషనర్ పులి శ్రీనివాసులు మరింత ఉన్నత బాధ్యతలు అలంకరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆకాంక్షించారు. శుక్రవారం జీఎంసీ కౌన్సిల్ హాలులో మార్కాపురం జేసీగా బదిలీపై వెళ్తున్న కమిషనర్ శ్రీనివాసులు వీడ్కోలు సభ ఆయన అధ్యక్షతన నిర్వహించారు. మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ స్వల్ప కాలంలో జాతీయస్థాయి ర్యాంకు అందుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేశారని ప్రశంసించారు. ప్రజాసమస్యల పరిష్కారం పట్ల ఆయన అంకితభావం స్ఫూర్తిదాయకమన్నారు. మిషన్ గ్రీన్ పేరుతో నగరాన్ని హరిత వనంగా మార్చేందుకు కృషి చేశారన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. బుడమేరు వరద సహాయక పనుల్లో పనిచేసిన అనుభవం ఎంతో ఉపకరించిందన్నారు. అనంతరం మేయర్, అధికారులు, ప్రజాప్రతినిధులు కమిషనర్ శ్రీనివాసులను సత్కరించారు. కార్యక్రమంలో డీసీలు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికర తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులును సత్కరిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

బదిలీ అయిన కమిషనర్‌కు సత్కారం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ చరిత్రలో కమిషనర్ పులి శ్రీనివాసులు తనదైన అభివృద్ధి మార్కు చూపించారని మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రశంసించారు. శ్రీనివాసులు బదిలీ అయిన సందర్భంగా సంక్రాంతి రోజు ఓ హోటల్లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేరు తెచ్చేలా కమిషనర్ పనిచేశారన్నారు. పరిపాలనలో ఒడిదొడుకులు, ఒత్తిళ్లు ఎదుర్కొని నగరాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపకుడు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం 6.15 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొలుత ముఖ్య అతిథి, మాజీ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యలు [illegible] అందజేస్తారు. సభానంతరం కాలాంజలి, హైదరాబాద్ కళాకారులు యోగం నాటకాన్ని ప్రదర్శిస్తారు. ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్యాలుంటాయి.

ప్రమాదకరంగా కల్వర్టు

రాఘవనగర్ ఒకటో వీధిలో కల్వర్టు నిర్మాణం ఆగిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల కిందట ఇక్కడ మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఒకటో వీధి నుంచి రెండో వీధికి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించకుండా వదిలేశారు. కాలువపై బండరాళ్లు అడ్డుగా వేసి వదిలేశారు. వాటి మధ్యలో ఖాళీగా ఉండటంతో పాదచారులు జారిపడి గాయాల పాలవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

వైభవోపేతం.. సంక్రాంతి సంబరం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

తల్లి మాతంగి నృత్య విన్యాసం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సంప్రదాయ క్రీడలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. [illegible] సంక్రాంతి సంబరాల వేదికగా కళకళలాడింది. ఉదయం పొంగళ్లు, కోడిపందేలు, కర్రసాము, ఖోఖో క్రీడలు నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, మ్యూజికల్ నైట్, మిమిక్రీతో కళాకారులు ఆకట్టుకున్నారు. సినీ గీతాలకు కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. మొదటి సారిగా ఇక్కడ నిర్వహించిన వేడుకలకు స్థానికులు భారీగా తరలివచ్చారు. రానున్న రోజుల్లో ఈ వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తమ వంతుగా సహకరిస్తామని ప్రముఖులు హామీ ఇచ్చారు. సభ అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.5 లక్షల విలువైన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ వేడుకలు ఏటా నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, మాజీ కార్పొరేటర్ గోళ్ల ప్రభాకర్, ఈద్గా గురువయ్య, దేవరపు గాంధీచౌదరి, వివిధ రంగాల ప్రముఖులు వేడుకలకు హాజరయ్యారు.

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీవారు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నెహ్రూనగర్ 2వ వీధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామికి గరుడ వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది.

శ్రీవారి నగరోత్సవంలో భక్తులు

గోపూజలు.. గంగిరెద్దుల విన్యాసాలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ ఛైర్మన్ విజయకుమార్

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న నిర్వాహకులు

గంగిరెద్దుతో డిప్యూటీ మేయర్ షేక్ సజీల

పట్నంబజారు, న్యూస్‌టుడే: చౌత్రా సెంటర్లోని రామాలయం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గోపూజ, హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు ప్రదర్శించారు. వేడుకల్ని తిలకించేందుకు నగర పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. పురోహితులు నంద్యాల దేవేంద్ర ఆచారి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామం పారాయణం చేశారు. వేడుకల్లో ఆలయ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ ఛైర్మన్ మారే మల్ల విజయకుమార్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కాకుమానువారితోటలో...

పట్నంబజారు, న్యూస్‌టుడే: కాకుమానువారితోటలోని నారా చంద్రబాబు నాయుడు క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన మన గుంటూరు - మన సంక్రాంతి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల వేడుకలను తిలకించారు.

బాలలకు పోటీలు...

విజేతలను అభినందిస్తున్న ఈవో ఆంజనేయచార్యులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. బాలలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలను ఈవో ఆంజనేయచార్యులు అభినందించారు.

పేదరికం చదువుకు అడ్డుకాకూడదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదరికం చదువుకు అడ్డు కాకూడదని భారతీయ స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సేవా గ్రూప్ సమన్వయకర్త కేఎస్‌వీ నారాయణ అన్నారు. సంస్థ 75వ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కన్నావారితోటలోని భారతీయ స్టేట్ బ్యాంకు ప్రాంగణంలో నీట్ పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్న ఖైరున్నీసా అనే పేద విద్యార్థికి కాలేజీ, హాస్టల్ ఫీజుల నిమిత్తం రూ.79,598 చెక్కును ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పేదరికంలో మగ్గుతున్న విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు తమ సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు. 2023లో ఆరుగురితో ఏర్పాటైన తమ సంస్థ ప్రస్తుతం 113 మంది సభ్యులతో కుల, మతాలకు అతీతంగా రూ.15 లక్షల మేర సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఇటీవల ఒక పాఠశాలలో రూ.1.65 లక్షలతో డిజిటల్ క్లాస్‌రూం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సమన్వయకర్తలు ఎస్.వేణుగోపాల్, జుజ్జూరు శ్రీనివాసరావు, వెంకటేశ్వరబాబు, కె.శేషగిరిరావు, సభ్యులు సుధాకర్, సీతాకుమార్, అనిల్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఖైరున్నీసాకు చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు, నారాయణ తదితరులు

శనక్కాయల రాజకుమారికి పురస్కారం

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రాజకుమారి, ఉమాశంకర్

గోరంట్ల, న్యూస్‌టుడే: డాక్టర్ శనక్కాయల రాజకుమారికి ఏఐసీఓజీ కార్యక్రమంలో శుక్రవారం ధీర పురస్కారాన్ని అందించి సత్కరించారు. మహిళలపై జరుగుతున్న డిజిటల్ దాడులు, వాటిని ఎదుర్కోవడంపై గుంటూరు పరిసర ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా అవగాహన కల్పించారు. ఇందుకుగాను శుక్రవారం న్యూదిల్లీలో జరిగిన ఏఐసీఓజీ సమావేశంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారికి ధీర పురస్కారాన్ని నో టూ వావ్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ దేవినేని కిరణ్మయి, ఫిగో కోశాధికారి డాక్టర్ శాంతకుమారిల నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా గురువారం నగరంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పాతగుంటూరులోని శివాలయం, అంకమ్మతల్లి దేవస్థానం, వినాయక దేవస్థానం, సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాతగుంటూరు మెయిన్‌రోడ్డులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అరిసెలు పంపిణీ చేశారు. వేడుకల్లో ఆలయ అధ్యక్షుడు పాదర్తి శివన్నారాయణమూర్తి, బొలిశెట్టి అశోక్‌కుమార్, చంద్రశేఖర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

24న పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమావేశం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ మహిళా కళాశాల పూర్వ విద్యార్థినుల సంఘం స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 24న ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ వీఆర్ జ్యోత్స్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో మూడురోజులపాటు సంగీత సద్గురు త్యాగబ్రహ్మ ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎమ్‌వై.శేషురాణి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం లఘు కచేరీలు, సాయంత్రం ప్రధాన కచేరీలు ఉంటాయి. మొదటి రోజు శనివారం సుప్రసిద్ధ వేణుగాన విద్వాంసుడు శశాంక్ కచేరి, ఆదివారం ఉదయం బెజవాడ లక్ష్మీకాంత్ నాదస్వర కచేరి, శోభాయాత్ర, పంచరత్న కీర్తనల గానం ఉంటాయని వెల్లడించారు.

జీవో ప్రకారమే భవన నిర్మాణాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జీవో ప్రకారమే భవనాలు నిర్మించాలని క్రెడాయ్ ఏపీ మాజీ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి సూచించారు. క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ నూతన సంవత్సరం డైనందినిని కార్యాలయంలో ఆవిష్కరించారు. శివారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది డైనందినిలో నూతన జీవో ఉందన్నారు. గుంటూరు ఛాప్టర్ ఛైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, అధ్యక్షులు మామిడి రాము మాట్లాడుతూ నేషనల్ క్రెడాయ్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం గుంటూరు సభ్యులు భవనాలు నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మెట్టు సాంబశివారెడ్డి, ఉపాధ్యక్షులు శివనాగేశ్వరరావు, గోన శివనాగబాబు, సుబ్బారెడ్డి, శంకర్, రాజగోపాల్, సాహిత్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ డైనందిని ఆవిష్కరించిన శివారెడ్డి తదితరులు

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉషశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ ఫణి పురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ పురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైననూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, రుణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికి, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026.

ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

గుంటూరు పశ్చిమ

పుట్టలమ్మ లడ్డూ ప్రసాదం రూ.15.5 లక్షలు

గుంటూరు రూరల్: చల్లావారిపాలెం గ్రామంలోని ఘంటలమ్మ తల్లి, పుట్టలమ్మ తల్లి దేవస్థానం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి 9 కేజీల లడ్డూ వేలం పాట జరిగింది. నల్లపాడు గ్రామానికి చెందిన ఇమడాబతిని నాగేశ్వరరావు ఆ లడ్డూ ప్రసాదాన్ని రూ.15.5 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకారణ చేశారు.

టమాట 22, వంగ 36, బెండ 20, పచ్చిమిర్చి 32, కాకర 36, బీర 36, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజీ 23, క్యారెట్ 26, దొండ 46, బంగాళాదుంప 23, ఉల్లిపాయలు 25, గోరుచిక్కుళ్లు 40, దోస 38, సొర 15, పొట్ల 20, అరటికాయ 10, పెద్దచిక్కుళ్లు 32, చామదుంప 38, బీట్‌రూట్ 22, కీరదోసకాయ 30, బీన్స్ 50, క్యాప్సికమ్ 50, కొత్తిమీర 20, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 20, అల్లం 75, వెల్లుల్లి 165. – పట్టాభిపురం,న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

❖ నగరంపాలెం దగ్గర చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని 'మేమున్నాం మీకు తోడుగా'కు స్థానికులు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా..ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

❖ స్థానిక శివరామ్‌నగర్ దగ్గర ఉన్న సైడ్ కాల్వలో మురుగు ముందు కదలక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపారు. జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు దీనిపై స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు.–న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

సమస్యల సవాళ్లను అధిగమిస్తారా!

నేడు కమిషనర్‌గా మయూర్ అశోక్ బాధ్యతల స్వీకరణ

నగరపాలకసంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరపాలక సంస్థ పరిధిలో దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న అనేక అభివృద్ధి పనులు పట్టాలెక్కాయి. ప్రస్తుతం ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. నగరపాలకసంస్థకు నూతన కమిషనర్‌గా నియమితులైన మయూర్ అశోక్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. యువ ఐఏఎస్ కావడంతో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటారని నగర ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. 2024 ఆగస్టు నుంచి ఇప్పటివరకు పనిచేసిన కమిషనర్ పులి శ్రీనివాసులు మార్కాపురం జిల్లాకు జేసీగా బదిలీపై వెళ్తున్నారు. జీఎంసీలో ప్రస్తుతం జరుగుతున్న పనులతోపాటు పెండింగ్ పనులు కూడా గాడినపెట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వేసవి రానున్న నేపథ్యంలో రిజర్వాయర్లకు దూరంగా ఉన్న ప్రాంతాలు, నగర శివార్లలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

స్వామి వివేకానందుడి విగ్రహం వెనుక వైపు ఆక్రమణలు..

భారీగా ఆర్వోబీల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

శంకర్‌విలాస్ ఆర్వోబీకి.. నగరంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వారధిగా ఉండే శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులు రూ.98 కోట్ల వ్యయంతో ప్రారంభమై జరుగుతున్నాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకాకుండా స్థల సేకరణకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. నందివెలుగురోడ్డులో రూ.36.91 కోట్లతో పనులు సాగుతున్నాయి. ఇవి వేగంగా పూర్తయ్యేలా చూడాలి.

నార్ల ఆడిటోరియం.. గార్డెన్స్‌లో నార్ల ఆడిటోరియం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన అభివృద్ధి చేసి నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉంది. దీని అభివృద్ధికి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ముందుకు వస్తోంది.

తాగునీటి పథకం వినియోగంలోకి.. గోరంట్ల కొండపై శివారు ప్రాంతాలు, పలువిలీన గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.33 కోట్లతో ప్రారంభించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని ఈ వేసవికే వినియోగంలోకి తెచ్చేలా చొరవ తీసుకోవాలి.

అసంపూర్తిగా నార్ల ఆడిటోరియం

ఆక్రమణదారుల గుప్పిట్లో విలువైన స్థలాలు.. కార్పొరేషన్ స్థలాలను ఆక్రమణదారులు దర్జాగా కబ్జా చేసి అద్దెలకు ఇచ్చి ఆదాయం గడిస్తున్నా..పట్టించుకునే వారు లేరు. పట్టాభిపురం ప్రధాన రహదారిలో స్వామి వివేకానందుడి విగ్రహం వెనుక గత కృష్ణా పుష్కరాల నుంచి నకిలీ బి.ఫారాలతో కొందరు ఆక్రమించేసి స్థానికులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా..పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదు. ఇలా కార్పొరేషన్ స్థలాలు చాలానే కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై దృష్టి పెట్టాలి.

వెండార్ జోన్లు ఏమయ్యాయో... ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు వెండార్ జోన్లు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రతిపాదనలున్నా..కార్యరూపం దాల్చడం లేదు. ఈసారి గుర్తించిన స్థలాల్లో పక్కాగా జోన్లు ఏర్పాటు చేసి చిరువ్యాపారులకు రక్షణ కల్పించాలి.

'అమరావతిపై జగన్ కక్ష తీరలేదు'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 200 మంది అమరావతి రైతుల ప్రాణాలను బలిగొన్న జగన్‌కు వారిపై కక్ష తీర లేదు...రాజధాని అమరావతిపై ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. చివరకు నదీ గర్భంలో రాజధాని ఏమిటని... దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తామని మాట్లాడడం జగన్ మానసిక పరిస్థితికి అద్దం పడుతుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో తిరుమల నమూనా దేవాలయం సెట్టింగ్ చేయించి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పండగలు, దేవుళ్లను సైతం రాజకీయాలకు వినియోగించుకున్న చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు.

కళారూపాలతో సమాజంలో చైతన్యం

పెదనందిపాడు: నాటకరంగాన్ని ఆదరించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. అబ్బినేనిగుంటపాలెంలో గత మూడురోజుల నుంచి ఏబీ పాలెం కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక వైభవం కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఆహ్వాన నాటకోత్సవం ముగింపు సభలో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. కళారూపాలతో సమాజంలో చైతన్యం తేవచ్చని చెప్పారు. కళలను ఆదరించాలని పేర్కొన్నారు. అబ్బినేనిగుంటపాలెంలో నాటకోత్సవం ఏర్పాటు చేసిన పెదబాపారావు, చినబాపారావులను ఆయన అభినందించారు. భగవద్గీతపఠనంలో బెంగళూరులో బంగారు పతకం సాధించిన ఆ గ్రామానికి చెందిన సూర్యకుమారిని సత్కరించారు.

నేటి నుంచి త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో మూడురోజులపాటు సంగీత సద్గురు త్యాగబ్రహ్మ ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎమ్‌వై.శేషరాణి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం లఘు కచేరీలు, సాయంత్రం ప్రధాన కచేరీలు ఉంటాయి. మొదటి రోజు శనివారం సుప్రసిద్ధ వేణుగాన విద్వాంసుడు శశాంక్ కచేరి, ఆదివారం ఉదయం బెజవాడ లక్ష్మీకాంత్ నాదస్వర కచేరి, శోభాయాత్ర, త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కీర్తనల గానం, సాయంత్రం కొల్లూరు వందన(తిరుపతి) గాత్ర కచేరి, చివరి రోజు సునీల్ గార్గెన్ (చెన్నై) గాత్ర కచేరి, ఆంజనేయోత్సవం ఉంటాయని వెల్లడించారు.

అథ్లెటిక్స్‌లో ఎస్ఆర్ఎం విద్యార్థుల సత్తా

తుళ్లూరు, న్యూస్‌టుడే: మంగుళూరులో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు మూడు బంగారు పతకాలు సాధించారు. ఆదిత్య 74.43 మీటర్ల దూరం జావెలిన్ త్రో విసిరి, అనామిక హెప్టాథ్లాన్ పోటీల్లో 5158 పాయింట్లతో, ముజసినా మహమ్మద్ లాంగ్ జంప్‌లో 6.15 మీటర్లు స్కోర్ చేసి బంగారు పతకాలు సాధించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మిత సింగ్ తెలిపారు. విజేతలను వర్సిటీ ప్రెసిడెంట్ డా.సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొ.సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డా.ఆర్. ప్రేమ్ కుమార్ అభినందించారు.

పతకాలతో విద్యార్థులు

18న జీడీసీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం

కలెక్టరేట్(గుంటూరు): జిల్లా జీడీసీసీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 18న జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.ఎల్.నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేటలోని బ్యాంకు పరిపాలన భవనంలో సమావేశం జరుగుతుందని వెల్లడించారు. తొలుత కంటి వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

రామస్వామిచౌదరి విగ్రహానికి నివాళులు అర్పించిన సాహితీ సమితి సభ్యులు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో...

రామస్వామి చౌదరి సేవలు ప్రశంసనీయం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రముఖ హేతువాద రచయిత, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేని రామస్వామి చౌదరి బహుముఖ సేవలు ప్రశంసనీయమని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. గురువారం రామస్వామి జయంతిని పురస్కరించుకుని గుంటూరు సమీపంలోని వర్సిటీ పరిపాలన భవన్ లాంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ విద్యా కళాశాలలో త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతిని శుక్రవారం నిర్వహించారు. కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో త్రిపురనేని విగ్రహానికి సమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నగరాభివృద్ధిలో శ్రీనివాసులు కీలకపాత్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో అన్ని వర్గాల ప్రజల మన్నన పొందిన కమిషనర్ పులి శ్రీనివాసులు మరింత ఉన్నత బాధ్యతలు అలంకరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆకాంక్షించారు. శుక్రవారం జీఎంసీ కౌన్సిల్ హాలులో మార్కాపురం జేసీగా బదిలీపై వెళ్తున్న కమిషనర్ శ్రీనివాసులుకు వీడ్కోలు సభ అదనపు కమిషనర్ ఓబులేసు అధ్యక్షతన నిర్వహించారు. మేయర్ కోవెలమూడి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో కాలంతో పోటీపడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై పట్టు ఆయన అంకితభావం స్ఫూర్తిదాయకమన్నారు. మిషన్ గ్రీన్ పేరుతో నగరాన్ని పర్యావరణహితంగా మార్చేందుకు కృషి చేశారన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. బుడమేరు వరద సహాయక పనుల్లో పనిచేసిన అనుభవం ఎంతో ఉపకరించిందన్నారు. అనంతరం మేయర్, అధికారులు, ప్రజాప్రతినిధులు కమిషనర్ శ్రీనివాసులును సత్కరించారు. కార్యక్రమంలో డీసీలు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులును సత్కరిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

పీర్ల పంజా, మదర్సా అభివృద్ధికి మంత్రి లోకేశ్ చేయూత

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: పాత మంగళగిరిలో పునర్నిర్మించిన హజరత్ అలీ పీర్ల పంజా, మదర్సాను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వాటి అభివృద్ధికి మంత్రి తన సొంత నిధుల నుంచి రూ.2.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఆయన ముస్లిం పెద్దలు ఘన స్వాగతం పలికారు. కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాని, షేక్ రఫీ, షేక్ జాని, షేక్ సాధిక్, షేక్ మహ్మద్ అలీ, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: లద్దాఖ్‌లో ఈ నెల 20 నుంచి 28 వరకు జరగనున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో ఐస్ స్కేటింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన వెనిగళ్ల లీలా వెంకట సుబ్బారావు, వరప్రసన్నాంజనేయ ఎంపికైనట్లు కోచ్ అబ్దుల్‌హఫీజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

లీలావెంకట సుబ్బారావు | వర ప్రసన్నాంజనేయ

ముగిసిన సంక్రాంతి సంబరాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సంక్రాంతి సంబరాలు ముగిశాయి. చిన్నారులు, మహిళలు, పురుషులు పోటాపోటీగా సంప్రదాయ వస్త్రాలు ధరించి అలరించారు. చెక్క భజన, కోలాటం ఆకట్టుకున్నాయి. తంబోలా గేమ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మ్యూజికల్ నైట్, నృత్యాలు ఉర్రూతలూగించాయి. పలువురు బుల్లితెర కళాకారులు చేసిన స్కిట్లు అలరించాయి. మిరుమిట్లు గొలిపే విద్యుత్తుదీపాల కాంతులతో ఎన్టీఆర్ స్టేడియం సరికొత్త శోభను సంతరించుకుంది.

సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. సంబరాల్లో భాగంగా గురువారం సాయంత్రం మహిళల కోలాట ప్రదర్శన, అనంతరం పౌరాణిక నాటకం శ్రీకృష్ణ రాయబారం(పడకసీను) ప్రదర్శన జరిగాయి. నాటకంలో శ్రీకృష్ణుడిగా కొల్లూరు శివప్రసాద్, అర్జునుడుగా సిహెచ్.ప్రసాద్, దుర్యోధనుడుగా పి.ప్రసాద్ నటించారు. అనంతరం కళాకారులను కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు సన్మానించారు. కార్యక్రమాల్లో డాక్టర్ నిమ్మల శేషయ్య, అఖిలభారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, మాతృశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ బండ్లమూడి గాంధీ, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లయన్ విజయ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణరాయబారం నాటకంలో ఓ సన్నివేశం

నేటి నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ వ్యవస్థాపకుడు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం 6.15 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొలుత ముఖ్య అతిథి, మాజీ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యలకు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేస్తారు. అనంతరం జరిగే సభలో పరిషత్ అధ్యక్షుడు ఘంటా పున్నారావు, గౌరవాధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణ, ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు నూకవరపు వేంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కేతేపల్లి సాంబశివరావు ప్రసంగిస్తారు. సభానంతరం కళాంజలి, హైదరాబాద్ కళాకారులు యాగం నాటకాన్ని ప్రదర్శిస్తారు. ఆదివారం సాయంత్రం కుందుల చేతన శరణ్య, యర్రం సింధూజ, క్రొవ్విడి శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యాలు అభినయిస్తారు. ఆతరువాత విజయవాడ దృశ్యవేదిక వారు 'ఇది ప్రమాదానికి సంకేతం' నాటకాన్ని ప్రదర్శిస్తారు. సోమవారం సాయంత్రం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు 'సహన' నాటిక ప్రదర్శిస్తారు. 20వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటలకు ఎస్వీ రామారావు, లంక లక్ష్మీనారాయణ, జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రాల్లోని మధుర గీతాల ఆలాపన ఉంటుందని ఒక ప్రకటనలో వెల్లడించారు.

సత్య షోరూమ్‌లో రాయితీలు

నగరపాలక సంస్థ: సంక్రాంతి సందర్భంగా సత్య షోరూంలో ఈ నెల 18 వరకు భారీ రాయితీలు ఇస్తున్నట్టు షోరూం యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్‌మెషిన్‌లలో ఉత్తమ బ్రాండ్లు అందుబాటు ధరల్లో లభిస్తాయని వివరించింది. మొబైల్ 5జీ ఫోన్లు రూ.7,999 నుంచి, పోర్టబుల్ పార్టీ బ్లూటూత్ స్పీకర్లు రూ.2,449 నుంచి లభిస్తాయని తెలిపింది. కంప్లీట్ కిచెన్ కాంబో రూ.10,999కు అందిస్తున్నట్టు, ఇందులో గ్యాస్ స్టవ్, కుక్కర్, గ్రైండర్, మిక్సీ వంటివి ఉంటాయని వివరించింది. ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి లభ్యమవుతాయని పేర్కొంది. ప్రతీ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుందని తెలిపింది.

శనక్కాయల రాజకుమారికి పురస్కారం

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రాజకుమారి, ఉమాశంకర్

గోరంట్ల, న్యూస్‌టుడే: డాక్టర్ శనక్కాయల రాజకుమారికి ఏఐసీఓజీ కార్యక్రమంలో శుక్రవారం ధీర పురస్కారాన్ని అందించి సత్కరించారు. మహిళలపై జరుగుతున్న డిజిటల్ దాడులు, వాటిని ఎదుర్కోవడంపై గుంటూరు పరిసర ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా అవగాహన కల్పించారు. ఇందుకుగాను శుక్రవారం న్యూదిల్లీలో జరిగిన ఏఐసీఓజీ సమావేశంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారికి ధీర పురస్కారాన్ని నో టూ వావ్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ దేవినేని కిరణ్మయి, ఫిగో కోశాధికారి డాక్టర్ శాంత కుమారిల నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశేష అభిషేకాలు.. జ్యోతి దర్శనాలు

గుంటూరు సాంస్కృతికం: మకర సంక్రమణం సందర్భంగా పలు ప్రాంతాల్లో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు, మకరజ్యోతి దర్శనాలు జరిగాయి. స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మకరసంక్రాంతి సందర్భంగా గురువారం రాత్రి గంగిరెద్దుల విన్యాసాలు, భజన కీర్తనలు జరిగాయి. అన్నమయ్య కళావేదికపై క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు దంపతులు స్వామి అభిషేకాలను ప్రారంభించారు. 18 మెట్ల దీప పూజ చేసి మకరజ్యోతి వెలిగించారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్ సోదరులు, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మకరజ్యోతి దర్శనం

భాజపా నాయకుల ఉత్సవాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా నగరంలో శుక్రవారం భాజపా శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. భాజపా ఘన విజయం సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించినట్టు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివన్నారాయణ, శ్రీనివాస్, సుబ్బారావు, రవి, భాస్కర్, రామకృష్ణ, విమలదేవి, సరోజిని పాల్గొన్నారు.

జీవో ప్రకారమే భవన నిర్మాణాలు

క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ దైనందిని ఆవిష్కరించిన శివారెడ్డి తదితరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జీవో ప్రకారమే భవనాలు నిర్మించాలని క్రెడాయ్ ఏపీ మాజీ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి సూచించారు. క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ నూతన సంవత్సరం దైనందినిని కార్యాలయంలో ఆవిష్కరించారు. శివారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది దైనందినిలో నూతన జీవో ఉందన్నారు. గుంటూరు ఛాప్టర్ ఛైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, అధ్యక్షులు మామిడి రాము మాట్లాడుతూ నేషనల్ క్రెడాయ్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం గుంటూరు సభ్యులు భవనాలు నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మెట్టు సాంబశివారెడ్డి, ఉపాధ్యక్షులు శివనాగేశ్వరరావు, గోన శివనాగబాబు, సుబ్బారెడ్డి, శంకర్, రాజగోపాల్, సాహిత్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గుంటూరు నేరవార్తలు: సంక్రాంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో మానసికోల్లాసంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి అన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, అంజిబాబు, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, గోపాలకృష్ణ, శివకుమార్, రెహమాన్ పాల్గొన్నారు.

18న ఎంయూఎఫ్ సమావేశం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ముస్లింల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న తెనాలిలో నిర్వహించనున్న ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశానికి హాజరుకావాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు మహమ్మద్ కలీం కోరారు. శుక్రవారం మాయాబజారులోని ఎంయూఎఫ్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ముస్లిం ధార్మిక సంస్థల, వక్ఫ్ భూములు, భూ సేకరణ చట్టం ద్వారా సేకరించటానికి జరుగుతున్న ప్రయత్నంపై తెనాలిలో జరిగే సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

బస్టాండులోని స్టాల్స్‌పై కేసులు నమోదు

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో గరిష్ఠ చిల్లర ధరకు మించి ఆహారపదార్థాలు విక్రయిస్తున్న స్టాల్స్‌లో శుక్రవారం ఆర్టీసీ అధికారులు తనిఖీలు చేశారు. ధరల మోతపై ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురితమైన 'ఇక్కడింతే' కథనానికి వారు స్పందించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యంతోపాటు ఆర్టీసీ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. 5 దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. రూ.5,900 అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం తెలిపారు. కొందరు స్టాల్స్ నిర్వాహకులు శీతలపానీయాల విక్రయాలకు అనుమతి తీసుకొని ఇతర పదార్థాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దుకాణాల ఎదుట ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

ప్రభుదాస్ రచనల సరళి అభినందనీయం

పద్యకావ్యాన్ని ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రభుదాస్ రచనల సరళి అభినందనీయమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై 'కళాస్రవంతి -సాహితీ స్రవంతి' సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ రచించిన విలాసిని పుస్తకావిష్కరణ సభ జరిగింది. డాక్టర్ సూర్యదేవర రవికుమార్ సభకు అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ వాసా మాణిక్యాలరావు, విశ్రాంత ప్రొఫెసర్ తాళ్లూరి వెంకటరత్నారావు రచయిత కృషిని ప్రశంసించారు.

సీతానగరం కొండపై విదేశీయుల సందడి

విదేశీ పర్యాటకులతో మాజీ ఎంపీ గంగరాజు, జీయర్ ఆశ్రమ నిర్వాహకుడు వెంకటాచార్యులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విదేశీయుల రాకతో సీతానగరం కొండపై సందడి నెలకొంది. ఎన్నారై వైద్యుడు ముక్కమల అప్పారావు నేతృత్వంలో అమెరికా నుంచి 15 మంది విదేశీ వైద్య బృందం గురువారం విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జీయర్ ఆశ్రమ నిర్వహకుడు పురాణం వెంకటాచార్యులు స్వాగతం పలికి.. క్షేత్ర విశిష్టతను వివరించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉషశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ ఫణి పురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ పురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైననూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, ఋణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికి, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026.

ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

(c) eenadu

సంక్రాంతి వైభవం.. కనుమా!

కంకిపాడు: ఈడుపుగల్లులో కోడిపందేలు తిలకిస్తూ..

కంకిపాడు: ఉప్పులూరులో భారీ బరులు

ఘంటసాలలో ముగ్గుల పోటీల్లో మహిళలు

ఊరంతా రంగవల్లులు..
వీధివీధిన గొబ్బెమ్మలు...

ఆకాశాన పతంగులు..
అపురూప పిండివంటలు..

కదలి వచ్చిన బసవన్న..
శుభము పలికిన హరిదాసన్న..

ముద్దులొలికిన పరికిణీలు..
ముచ్చటగొలిపిన పట్టుపంచెలు..

కత్తి దూసిన పందెంకోడి..
కనులారా చూడ తరలివచ్చారండి..

సరిలేని సంప్రదాయ క్రీడలు..
సగర్వమైన సాంస్కృతిక కళలు..

పుడమి పుత్రుని రాజసం..
పరవశించె సకల జగం..

భాగ్యములొసగిన భోగి..
కాంతులు నింపిన సంక్రాంతి..
ఆనంద వైభవం కనుమా...

మూడు రోజుల పండగ..
మురిసె మోము నిండుగా..

– అమరావతి డెస్క్

అవనిగడ్డ రెండో వార్డులో..

గంపలగూడెంలో కానుకలు స్వీకరిస్తున్న హరిదాసు

నందిగామ గ్రామీణం: మునగచర్లలో

బందరు: మేకావానిపాలెంలో విజేతలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన బుల్లెట్, తదితర వస్తువులు



కూచిపూడి : బరుల చెంత పుంజులు

పెడన: బౌన్సర్లు సిద్ధం

ఉప్పులూరులో కోడి పందేలు ఆడేందుకు వచ్చిన వారి కార్లు..

గంపలగూడెం: పెనుగొలనులో అన్నదాతలకు సత్కారం

ఈడుపుగల్లులో జూద శిబిరం...

ఉప్పులూరు : బహుమతిగా ఇచ్చిన రెండు బుల్లెట్లతో నిర్వాహకులు

ఉప్పులూరు : ఎల్ఈడీ తెరలపై వీక్షించేలా ఏర్పాటు



నాగాయలంక : నటరాజ్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన

ఘంటసాల: పశు బలప్రదర్శన పోటీల సందడి

కోళ్లు ఎగిరాయి రూ.కోట్లు రేగాయి!

జోరుగా జూదాలు.. పలుచోట్ల ఘర్షణలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే బృందం

కోడి పందేలు, జూదాల జోరు కనుమ రోజు వరకు పెద్దఎత్తున కొనసాగాయి. గోదావరి జిల్లాలను మరిపించే స్థాయిలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈసారి క్యాసినో, హైటెక్ బరులు వెలిశాయి. ప్రజాప్రతినిదులు, చోటామోటా నేతలు పోటాపోటీగా బరులు వేయడంతో జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కోడి పందేలు, జూదాలు భారీగా జరిగాయి.

హైటెక్ బరులు...

కేసరపల్లి, ఉప్పులూరు, గొడవర్రు, కంకిపాడు, ఈడుపుగల్లు, గుడివాడ, ఉయ్యూరు, ఆకునూరు, గుడ్లవల్లేరు, మచిలీపట్నం మంగినపూడి బీచ్ రోడ్డు తదితరచోట్ల క్యాసినో తరహా హైటెక్ బరుల్లో రూ.కోట్లు ఎగిరాయి. ★ పెడన, మచిలీపట్నం, గుడివాడ, కేసరపల్లి, పెనమలూరు పరిధిలో బరుల్లో వరుస పందేలు గెలిచిన పందెంరాయుళ్లకు కార్లు, ద్విచక్ర వాహనాలు బహుమతిగా ఇచ్చారు. ★ కూచిపూడిలో ద్విచక్రవాహనం ఎవరికీ ఇవ్వకపోవడంతో స్వల్ప వాగ్వాదాలు జరిగాయి.

జనజాతర...

సంక్రాంతి, కనుమలకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. పలుచోట్ల కూలీనాలీ చేసుకునే వారు పందేలు కాసి భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.లక్షలు పోగొట్టుకొని దిగాలుగా వెనుతిరిగారు. దాదాపు అన్ని బరుల వద్ద మహిళలు, పిల్లలు కనిపించారు. గుండాట, కాయ్‌రాజాకాయ్ వంటి ఆటల్లో డబ్బులు పోగొట్టుకున్నారు. కేసరపల్లి, ఉప్పులూరు తదితరచోట్ల మొదటి రెండు రోజులు రాత్రి పగలు జూదాలు జరిగాయి. పలుచోట్ల తెల్లవారుజాము 2, 3 గంటల వరకూ కోడి పందేలు వేశారు.

తగ్గలేదంతే... శుక్రవారం సాయంత్రం నుంచి బరులు తొలగించాలని పోలీసులు పలుచోట్ల పోలీసులు ఒత్తిడి చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు బరుల వద్దకు రావడంతో పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. పలుచోట్ల విద్యుత్తు కనెక్షన్లు తొలగించినా చీకట్లోనే కోడి పందేలు, కోత ముక్క, ఇతర జూదాలు నడిపించారు.

తాగుడు.. తన్నుడు...

మద్యం ఏరులై పారడంతో గొడవలూ ఎక్కువగానే జరిగాయి. అవనిగడ్డలోని పులిగడ్డ, కంకిపాడు దగ్గర ఉప్పులూరు, పెదపారుపూడి పరిధిలోని భూషణగళ్లు, ఇబ్రహీంపట్నంలోని కేతన కొండ, మైలవరం మండలంలోని పొందుగుల, గుడ్లవల్లేరు తదితరచోట్ల ఘర్షణలు జరిగాయి. గుడ్లవల్లేరు బరిలో పుంజుకు కత్తి సరిగా కట్టకపోవడంతో పందెం ఓడిపోయామని ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్నాయి.

అప్పులు చేసి మరీ...

రూ.లక్షలు పోయినా జూదరులు వెనక్కి తగ్గకుండా అప్పులు చేసి మరీ పందేలకు దిగారు. ఇదే అదునుగా పలువురు శిబిరాల్లో రూ.వందకు గంటలకు రూ.10-100 వరకు వడ్డీలకు తిప్పారు. పలుచోట్ల డబ్బుల విషయంలో కొట్లాటలు జరిగాయి. నగదు లావాదేవీలకు క్యూఆర్ కోడ్ స్కాన్.. నగదు చెల్లింపులకు మిషన్లు.. ప్రత్యేక స్టాల్స్‌లో ఏటీఎం, క్రెడిట్ కార్డులు, యూపీఐలపై నగదు ఇచ్చారు. పలుచోట్ల బరుల వద్దే ఫైనాన్స్ ప్రతినిధులు ఆభరణాలు తాకట్టు పెట్టుకొని నగదు ఇచ్చే సదుపాయం కల్పించారు.

పార్కింగ్ పేరుతో దోపిడీ...

బరుల వద్ద పార్కింగ్ పేరుతో నిర్వాహకులు రూ.కోట్లు కొల్లగొట్టారు. ద్విచక్రవాహనానికి పలుచోట్ల రూ.30-50, కారుకు రూ.100-150 వరకు వసూళ్లు చేశారు. పార్కింగ్‌కు డబ్బులు ఇవ్వలేక చాలా మంది రోడ్లపక్కనే వాహనాలు నిలిపేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ★ గుడ్లవల్లేరు బరి వద్ద రోడ్డు పక్కన ముళ్లకంపలు కొట్టారు. బైక్ రూ.30, ఆటో రూ.50, కారు రూ.120 చొప్పున ముక్కుపిండి వసూలు చేశారు.

మాయగాళ్లు... అద్దెరిపోవాల్సిందే!

- అద్దె ఖాతాల గుట్టు రట్టు సులభం ఇక...
- బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చిన పోలీసులు

ఈనాడు, అమరావతి

చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో నగదు లావాదేవీలకు ఉపయోగించేందుకు సైబర్ నేరగాళ్ల ముఠాలు అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నాయి. ఆనక వీటిని ఖండాలు దాటించి నేరగాళ్లకు చేరుస్తున్నాయి. వీటితో పెద్దఎత్తున బెట్టింగ్, సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్ము బదిలీ చేస్తున్నారు. చివరకు దర్యాప్తులో అమాయకులే దొరుకుతున్నారు. ఫిర్యాదులు వచ్చాకే ఇవి వెలుగు చూస్తున్నాయి. బ్యాంకర్ల స్థాయిలోనే పసిగట్టి వివరాలు రాబట్టేలా వారికి పోలీసులు ప్రత్యేకంగా లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.

తొలి దశలో నగర బ్యాంకుల్లో..

డబ్బు ఆశ చూపించి కరెంట్ ఖాతాలు తెరిపించి, వాటిని ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఇది వెలుగుచూసింది. ఈనేపథ్యంలో ఇటీవల సీపీ రాజశేఖర్ బాబు.. బ్యాంకర్లతో సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణకు.. వారికి క్రెడెన్షియల్స్ ఇచ్చారు. దీనిని ప్రయోగాత్మకంగా నగరంలోని బ్యాంకులు, వాటి శాఖల్లో అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా విస్తరిస్తారు. తమ శాఖల్లో అనుమానాస్పద ఖాతాలు, లావాదేవీలను గుర్తిస్తే.. ఆ వివరాలను ఇందులో నమోదు చేస్తారు. ఇవి పోలీసులకు చేరతాయి. ఇప్పటి వరకు లాగిన్‌లో నమోదైన అనుమానాస్పద ఖాతాల వివరాలను పోలీసులు బ్యాక్ ఎండ్‌లో పరిశీలిస్తున్నారు.

బ్యాంకుకో కానిస్టేబుల్..

సైబర్ నేరాలపై అవగాహన కోసం పోలీసులు ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్ రూపొందించారు. ఇందులో సైబర్ సురక్ష పేరుతో ఒక ఆప్షన్ పెట్టారు. నగదు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వెళ్తున్న ఖాతాదారులకు ఏఐ ఆధారంగా పనిచేసే దీనిని ఉపయోగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఇందులోకి వెళ్లి డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించే అంశాలను చదివాకే ఓటీపీ వస్తుంది. తర్వాతే బ్యాంకర్లు నగదు బదిలీకి అనుమతిస్తారు. ఓటీపీ పరిశీలనకూ బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఇప్పటికి 4,329 మంది ఇందులోకి లాగిన్ అయి తెలుసుకున్నారు. ఇందుకు ప్రతి బ్యాంకుకు ఒక కానిస్టేబుల్‌ను కేటాయించగా బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు వీరు డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పిస్తున్నారు.

తాగినోళ్లకు.. తాగినంత!

- జూద శిబిరాల వద్ద అనధికార అమ్మకాలు
- చాలాచోట్ల రెట్టింపు ధరలు వసూలు

ఈనాడు – అమరావతి

సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బరుల వద్ద మద్యం ఏరులై పారింది. కోడిపందేల శిబిరాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పెద్ద, చిన్న బరులు పెద్దసంఖ్యలో ఈసారి ఏర్పాటయ్యాయి. వీటిల్లో అనధికార మద్యం దుకాణాలు వెలిశాయి. భోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా మూడు రోజులు జూద క్రీడలు, కోడిపందేలు పెద్దఎత్తున నిర్వహించారు. శిబిరాల బయట, లోపల జోరుగా మద్యం అమ్మకాలు సాగాయి. సందట్లో సడేమియా అన్నట్లు నిర్వాహకులు రద్దీని సొమ్ము చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు భారీగా జరిగాయి. పందేలు వేసేందుకు పెద్దసంఖ్యలో రావడంతో చాలాచోట్ల రెట్టింపు ధరలకు అమ్మారు.

పెడనలో మద్యం కౌంటర్

చెంతకే మద్యం...

★ ఈడ్పుగల్లు, కేసరపల్లి, గుడివాడ, విస్సన్నపేట మండలం తాటకుంట్ల, రామవరప్పాడు, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బరుల్లో క్యాసినో తరహా జూదక్రీడలు జరిగాయి. వీటిల్లో నేరుగా పందెం రాయుళ్ల వద్దకే మద్యం సరఫరా చేశారు. శిబిరాల్లో మద్యం అమ్మకాలు నిర్వాహకులకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. దాదాపు అన్ని చోట్లా శిబిరాలను రాజకీయ నేతల కనుసన్నల్లోనే ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలోని మద్యం సిండికేట్ నుంచే శిబిరాలకు సరఫరా అయింది.

★ అన్ని శిబిరాల నిర్వాహకులు పెద్దఎత్తున స్టాక్‌ను సమకూర్చుకుని బరుల వద్దకు వాహనాల్లో తెచ్చారు. బరుల బయట కూడా అమ్మకాల కోసం శీతల పానీయాల దుకాణదారులతో ఒప్పందం చేసుకుని.. వారి ద్వారా అమ్మించారు. శిబిరాల్లో మాత్రం పూర్తిగా నేతలే విక్రయాలు సాగించారు. పలు శిబిరాల్లో బహిరంగంగానే లూజ్‌గా కూడా అమ్మారు. పందెం కాసేందుకు వచ్చే వాళ్లు రెట్టింపు ధరలు పెట్టినా కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల నేతలు వేలం వేసి.. ఎక్కువ పాట పాడిన వారికి మద్యం అమ్మకాల కాంట్రాక్టును కట్టబెట్టారు.

★ ఎన్టీఆర్ జిల్లాలో నిరుడు జనవరిలో రూ. 65 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరిగాయి. ఐఎంఎల్ 80,197 కార్టన్లు, బీర్.. 43,605 కార్టన్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది అమ్మకాలు పెరిగాయి. ఐఎంఎల్.. 1,12,957 కార్టన్లు, బీర్.. 39,171 పెట్టెలు విక్రయాలు జరిగాయి. వీటి విలువ రూ.80 కోట్లు. ఈ విక్రయాల్లో ఎక్కువ భాగంగా కోడిపందేల శిబిరాలకు తరలినట్లు తెలిసింది.

వై జంక్షన్ సర్వీసు రోడ్డు పునరుద్ధరణ

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్ బయలుదేరుతున్నారు. వీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెళ్లటానికి జాతీయ రహదారిపై నందిగామ వై జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డును పునరుద్ధరించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల వాహనాలు ఆగకుండా ముందస్తుగా అధ్వానంగా ఉన్న సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేశారు. ఆ రోడ్డుపై వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ ఆగిపోతే ఎత్తువంతెన మీదుగా పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఫ్లైఓవర్ పైన కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డును సిద్ధం చేశారు. పండగ సెలవులు ముగియటంతో కొంత మంది శుక్రవారం మధ్యాహ్నం నుంచే హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో హైవేపై వాహనాల సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, నందిగామ

నకిలీ అనుకున్నా... నిజమే

- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- రూ.5వేలు వచ్చాయంటే నమ్మొద్దు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

'మొదట ఇది నకిలీ అనుకున్నారు, కానీ నిజంగా నాకు రూ.5వేలు వచ్చింది. మీరు కూడా ప్రయత్నించి చూడండి..!'

సంక్రాంతి సందర్భంగా ఫోన్ పే పేరుతో సామాజిక మాధ్యమాల్లో 'లింక్'తో వచ్చిన సందేశం ఇది. ఈ లింక్ క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఇలాంటి లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

లింక్‌తో పొంచి ఉన్న ప్రమాదం.. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు ఇలాంటి లింక్‌లను సృష్టించి దానికి ఆకర్షణీయమైన సందేశం పెట్టి సామాజిక మాధ్యమాల్లో పెడతారు. వీటిని నమ్మి ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే వారి చరవాణి హ్యాక్ అవుతుంది. దానిలో ఉన్న సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. ఆ తరువాత మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేస్తారు.

సామాజిక మాధ్యమాల్లో లింక్‌తో కూడిన సందేశం

బహుమతులు ఊరికే ఇవ్వరు.. పండగ రోజు ఊరికే ఎవరూ బహుమతులు ఇవ్వరని పోలీసులు చెబుతున్నారు. క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయనేది పూర్తిగా తప్పు అని, ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగమని హెచ్చరిస్తున్నారు. మీకు తెలిసిన వ్యక్తులు ఈ లింక్ మీకు ఫార్వార్డ్ చేసినా వాటిని నమ్మవద్దని సూచిస్తున్నారు. ఎవరైనా లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే తక్షణం 1930కి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08517 ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3.50గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 19వ తేదీ ఉదయం 7.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 08518 చర్లపల్లిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 12.30గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట స్టేషన్లలో ఆగుతుంది.

ఒక్కరోజే రూ.22.01 లక్షల ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా శుక్రవారం రికార్డు స్థాయిలో రూ.22.01 లక్షల ఆదాయం దర్శనం టికెట్ల రూపంలో వచ్చినట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. ప్రస్తుతం రెట్టింపు ఆదాయం రావడానికి కారణం స్కానింగ్ పాయింట్ వద్ద పాలకమండలి సభ్యులతో కలిసి పర్యవేక్షించడమే కారణమని ఈవో తెలిపారు. రూ.100 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 728, ఆఫ్‌లైన్లో 2616, రూ.300 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 408, ఆఫ్‌లైన్లో 709, రూ.500 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 1233, ఆఫ్‌లైన్లో 1831 విక్రయించినట్లు పేర్కొన్నారు.

క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు

(c) eenadu

పెట్టుబడి ఒక్కసారి... ఆదాయం 20 ఏళ్లు

రైతేరాజు

కరివేపాకు సాగులో కౌలు రైతుకు లాభాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కరివేపాకు పంటపై ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల నికర ఆదాయం వస్తుంది. ఒక్కసారి ఈ పంటపై పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్లపాటు నికర ఆదాయానిస్తుంది. నీటివసతి ఉన్న రైతులు ఈ పంటసాగు చేస్తే వ్యాపారులే పొలాలకు వచ్చి కొనుగోలు చేస్తారు. పాతకంచల గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి సీతయ్య కంచికచర్ల మండలం కీసరలో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. మూడేళ్ల క్రితం గుంటూరు జిల్లా పెద వడ్లపూడి రైతుల నుంచి కరివేపాకు విత్తనాలు కొన్నారు. ఎకరాకు వంద కిలోల విత్తనం వేశారు. ఇందుకు రూ.2.50 లక్షలు కాగా, రూ.5 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేసి పంటకు నీటి తడులిస్తున్నారు. నాలుగు నెలలకు ఒకసారి కరివేపాకు కోస్తారు. ఇలా ఏడాదిలో మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు సరాసరి ఒక్కో కోతకు అయిదు టన్నులు వస్తుంది. టన్ను రూ.20 వేల వంతున పెదవడ్లపూడి, కుంచనపల్లి వ్యాపారులు కొన్నారు. మూడు కోతల్లో ఎనిమిది ఎకరాలపై 120 టన్నుల దిగుబడి రాగా రూ.20 లక్షల ఆదాయం వచ్చింది. తొలి ఏడాది రూ.12 లక్షలు పెట్టుబడి పోగా రూ.8 లక్షల ఆదాయం సమకూరింది. రెండో ఏడాది పెట్టుబడి తగ్గింది. మొక్కలు ఎదగడానికి మందుల పిచికారీ, కూలీల, కౌలు ఖర్చులు పోగా ఏడాదికి రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. 20 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. వ్యాపారులు కరివేపాకును చిత్తూరు, విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.

తోటలో రైతు సీతయ్య

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న : కూరమిరప (బెంగళూరు మిర్చి) రకాలను తెలపండి?

- బి.వెంకట్, రైతు, పూషడం

సమాధానం : కూరమిరపలో 4 రకాలుగా ఉన్నాయి. ● **కాలిఫోర్నియా వండర్ :** కాయలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పంట కాలం 140-150 రోజులు. దిగుబడి ఎకరాకు 6-8 టన్నులు వస్తుంది. ● **ఆర్కగౌరవ్ :** లేత కాయలు ముదురాకు పచ్చగా ఉండి, పూర్తిగా పెరిగిన దశలో నారింజ రంగుకు మారుతాయి. కాయలు చాలా పెద్దవిగా ఉంటాయి. కాయ బరువు 180- 200 గ్రాములు ఉంటాయి. పంట కాలం 120 రోజులు. హెక్టారుకు దిగుబడి 6-8 టన్నులు వస్తుంది. ● **అర్కబసంత్ :** కాయలు లేత పసుపు రంగులో ఉంటాయి. పంటకాలం 125- 140 రోజులకు వస్తుంది. ఎకరాకు దిగుబడి 6-7 టన్నులు. ● **భారత్ (హైబ్రిడ్) :** కాయలు ముదురాకు పచ్చగా ఉంటాయి. పంట దిగుబడి హెక్టారుకు 14- 16 టన్నులు దిగుబడి వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

– ఘంటసాల, న్యూస్‌టుడే

కొబ్బరి తోటల విస్తరణకు ప్రాధాన్యం

విజయవాడ కేంద్రంగా కొబ్బరి బోర్డు కొనసాగుతున్నా.. తెలంగాణలోనూ కొబ్బరి తోటల విస్తరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని కొబ్బరి అభివృద్ధి మండలి (సీడీబీ) ఉప సంచాలకుడు డాక్టర్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొత్తగా 500 హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించాలని ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అశ్వారావుపేటకు శుక్రవారం వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

సీడీబీ ఉప సంచాలకుడు మంజునాథరెడ్డి

హెక్టారుకు రూ.56వేల రాయితీ.. కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.56వేల రాయితీని సీడీబీ అందజేస్తుంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు రాయితీ లభిస్తుంది. ఆరునెలల వయసున్న తోటల నుంచి కొత్తగా తోటల పెంపకానికి సిద్ధమవుతున్న రైతులందరూ అర్హులే. కొత్తగా తోటలు వేసేవారు మొక్కలు నాటి క్షేత్రంలో జియో ట్యాగ్ ఫొటోతో దరఖాస్తుకు జతపరచాలి. కొబ్బరి నర్సరీల ఏర్పాటుకూ సీడీబీ రాయితీ ఇస్తుంది. ఒక్కో నర్సరీలో గరిష్ఠంగా 10వేల మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్కకు రూ.22 రాయితీ వర్తిస్తుంది.

అందుబాటులో బీమా పథకం.. కొబ్బరి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కేరా సురక్ష పథకం కింద రైతుకు రూ.143, కూలీకి రూ.143 కలిపి ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తే సీడీబీ రూ.813 భరిస్తుంది. ప్రమాదంలో మృతిచెందితే బాధిత కుటుంబాలకు రూ.7లక్షల చొప్పున పరిహారం అందుతుంది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.3లక్షలు, పెద్ద పరిశ్రమలకు 25శాతం లేదా రూ.3కోట్ల వరకు రాయితీ పొందే వీలుంది. ఉద్యానశాఖ ద్వారా అంతరపంటల సాగు, బిందు సేద్యం పరికరాలకూ సాయం పొందొచ్చు.

బెండలో తెల్లదోమ నివారణ

బెండ సాగులో తెల్లదోమ నివారణకు ఉద్యానశాఖ పొన్నూరు విస్తరణాధికారి ఎం.శ్రేయ సూచనలు చేశారు. పంట పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చేస్తాయి. దీంతో ఆకులు పసుపు రంగులోకి మారతాయి. అవి శుంఖు రోగాన్ని వ్యాప్తి చేస్తాయి. తద్వారా ఆకులకు నష్టం జరుగుతుంది. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. పసుపు రంగు డబ్బాలకు గ్రీజు లేదా ఆముదం పూసి పొలంలో అక్కడక్కడ పెట్టి తెల్లదోమలను ఆకర్షింపజేసి నాశనం చేయాలి. దీపపు పురుగు సోకినప్పుడు ఆకుల పైకి దోనె మాదిరిగా ముడుచుకుని పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు మిథైల్ డెమెటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా తెగులును నివారించవచ్చు. బెండసాగులో ఆది నుంచి సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. సాగు ఆరంభం నుంచి వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది. **– పొన్నూరు, న్యూస్‌టుడే**



బెండ తోట

విజేత ఎడ్లజతల యజమానికి జ్ఞాపిక అందజేస్తున్న రంగనాథబాబు, వెంకట్రావు

ముగిసిన రాష్ట్రస్థాయి పశు బల ప్రదర్శన పోటీలు

ఘంటసాల, న్యూస్‌టుడే : ప్రాచీన సంస్కృతి, ఆచార, సంప్రదాయాలను అందరూ గౌరవించి కాపాడాలని ప్రవాసాంధ్రులు గొర్రెపాటి రంగనాథబాబు, మూల్పూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాల జడ్పీ పాఠశాలలో తానా మాజీ అధ్యక్షుడు, దివంగత డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులు నిర్వహించిన పోటీల్లో 23కు పైగా ఒంగోలు జాతి ఎడ్లజతలు పాల్గొన్నాయి. విజేతలైన ఎడ్లజతల యజమానులకు బహుమతులు అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, ఎన్నారై బొబ్బా గోవర్ధనరావు, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి నాయకుడు కనపర్తి శ్రీనివాసరావును నిర్వాహకులు బండి పరాత్పరరావు, అయినపూడి భానుప్రకాష్, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, దోనేపూడి రవిశంకర్, వేమూరి రాజేంద్రప్రసాద్ తదితర ప్రముఖులు సత్కరించారు. న్యాయనిర్ణేతగా సూరపనేని రాధాకృష్ణ వ్యవహరించారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
మాల కుల వధూవరులకు సువర్ణావకాశం
నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విజయవాడ, ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబాలు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 92475 20500
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

ఎందరో కళాకారులను వెలుగులోకి తెచ్చిన రామోజీరావు

కూచిపూడి, న్యూస్‌టుడే : ఈటీవీ ద్వారా ఎందరో కళాకారులను ప్రజలకు అందించిన మహానుభావుడు రామోజీరావు అని తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యంకి అడ్డరోడ్డు వద్ద సంక్రాంతి సంబరాలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటీవీలో జబర్దస్, పాడుతా తీయగా వంటి పలు కార్యక్రమాలు నిర్వహించి.. ఎందరో కళామతల్లి ముద్దుబిడ్డలను వెలికి తీసిన ప్రధాన కారకుడు రామోజీరావు అని చెప్పారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడారు. ఫౌండేషన్ అధినేత, సినీ నిర్మాత గొట్టిపాటి సాయి, స్రవంతి దంపతుల ఆధ్వర్యంలో బుల్లితెర నటులు ప్రదర్శించిన మిమిక్రీ, మ్యూజికల్ నైట్, హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బుల్లితెర ప్రముఖ నటులు బుల్లెట్ సుధాకర్, సునామీ సుధాకర్, షైమా, నరేష్, జీతూ, డాక్టర్ కాసుల కృష్ణంరాజు, సింగర్ సునంద, యాంకర్ అనూష, యాంకర్, సింగర్ సుమంత్ చేసిన వినోద కార్యక్రమాలు అలరించాయి. కళాకారులను అతిథులు సత్కరించారు. తెలుగు యువత గుంటూరు అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మొవ్వ ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, పామర్రు సీఐ వి.సుభాకర్, తెదేపా నాయకులు చాట్ల రమేష్, మోటుపల్లి బసవయ్య (చిన్నా), రాజు కోటి తదితరులు పాల్గొన్నారు.

షైమాను సత్కరిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తదితరులు

22 నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మోపిదేవి, న్యూస్‌టుడే : మోపిదేవిలో స్వయంభుగా వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు 22 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు శుక్రవారం తెలిపారు. అయిదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా స్వామికి చేసే ఆర్జిత సేవలు రద్దు చేశారు.

ఆధ్యాత్మిక.. భయభక్తులతోనే జీవితానికి సార్థకత

ముగిసిన బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

పెద్దఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే : వ్యక్తిగతంగా ఎదురయ్యే అనారోగ్య, ఆర్థిక భయం కన్నా.. ఆధ్యాత్మిక భయభక్తులతో చేసిన తప్పులను సరిదిద్దుకున్నప్పుడే జీవితానికి సార్థకత అని విజయవాడ కథోలిక మేత్రాసనం పీఠాధిపతి తెలగతోటి రాజారావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలో ప్రసిద్ధ బ్రదర్ జోసఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాల ముగింపు కార్యక్రమానికి బిషప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేదలు, నిరాశ్రయులను ఆదుకోవడంలో తంబి ఎప్పుడూ ముందుండే వారని చెప్పారు. క్రీస్తు అనుభవించిన పంచగాయాలను పొందిన బ్రదర్ జోసఫ్ తంబి ధన్యుడయ్యారన్నారు. అనంతరం ప్రత్యేక జపమాల, దివ్యపూజాబలిని మేరీమాతా కపూచియన్ ప్రావిన్స్ ప్రొవిన్షియల్ ఫా.మరియదాసు, రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణకర్త గోపు అభిలాష్, ఇతర గురువులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావును పుణ్యక్షేత్ర బృందం సత్కరించింది. క్రైస్తవ విశ్వాసులు భారీగా పాల్గొనగా.. సంఘ పెద్దలు, మఠకన్యలు, తంబి యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తును డీఎస్పీ శ్రీనివాసరావు బృందం పర్యవేక్షించింది.

దివ్యపూజాబలి అర్పిస్తున్న బిషప్ రాజారావు, ఫాదర్లు మరియదాసు, జోసఫ్, ఇతర మత గురువులు

ఆంధ్రాలో అభివృద్ధికి సహకరించండి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంధ్రాలో అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. గురువారం పామర్రు మండలం పెరిశేపల్లిలో గ్రామ ప్రముఖుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, కృష్ణా ఫౌండేషన్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి, మంజుల దంపతులు వారి తల్లిదండ్రులు దివంగత చెరుకూరి సుబ్బారావు, పుష్పావతి జ్ఞాపకార్థం నిర్మించిన గ్రామ ముఖద్వారం ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. దాత కృష్ణమూర్తి మాట్లాడుతూ పెరిశేపల్లిని తమ కుటుంబంతో సమానంగా చూస్తున్నామని, ఈ గ్రామాభివృద్ధి తన కల అన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వై.వి.బి.రాజేంద్రప్రసాద్, గ్రామ పెద్దలతో కలిసి దాత కృష్ణమూర్తి దంపతులు రిబ్బన్ కత్తిరించి గ్రామ ముఖద్వారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే వర్ల, కొనకళ్ల, రాజేంద్రప్రసాద్, కృష్ణమూర్తి దంపతులు

కంచర్లకు సన్మానం అభినందనీయం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : కమ్మని కనుమ వేళ కంచర్లకు ప్రజలు ఘన సన్మానం చేయడం అభినందనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామ ప్రముఖుడు, వ్యాపారవేత్త, అమెరికాలో ప్రముఖ తెలుగు సంస్థగా గుర్తింపు పొందిన ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) బోర్డు నూతన ఛైర్మన్ కంచర్ల నందకిషోర్‌కి గ్రామస్థులు, బంధుమిత్రులు, స్నేహితులు సన్మానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ దేశ, విదేశాలు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా ఇక్కడకు వచ్చి పండగ చేసుకోవడమే కాకుండా గ్రామాలాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని చెప్పారు. నాట్స్ ఛైర్మన్ నందకిషోర్ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానం గ్రామస్థులతో పంచుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా నా ఊరికి ఏదో చేయాలన్న తపన ఎప్పుడూ ఉంటుందని.. అదే ఈ ప్రాంతంలో ఇల్లు కట్టుకునేలా చేసిందన్నారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గద్దె రామ్మోహనరావు, సంగీత దర్శకుడు మణిశర్మ, సినీ దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నాట్స్ ఛైర్మన్ నందకిషోర్‌ను సన్మానిస్తున్న రాజకీయ, సినీ ప్రముఖులు, గ్రామపెద్దలు

దుకాణంలోకి దూసుకొచ్చిన కారు

ముగ్గురికి గాయాలు

కోడూరు, న్యూస్‌టుడే : ఓ కారు అదుపు తప్పి చెప్పుల దుకాణంలోకి దూసుకురాగా ముగ్గురు గాయపడ్డారు. ఎస్సై కె.చాణక్య వివరాల మేరకు.. కోడూరుకు చెందిన ఆళ్లమూడి బాబూరావు కోడూరులోని గొల్లపాలెం రహదారి పక్కనే చెప్పులు కుట్టే దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం అతను దుకాణంలో ఉండగా.. కోడూరు ప్రాంతానికి చెందిన అద్దంకి ఏడుకొండలు, తూము భాస్కరరావు అక్కడే ఉన్నారు. అదే సమయంలో ఓ కారు అదుపు తప్పి దుకాణంలోకి దూసుకొచ్చింది. దీంతో బాబూరావు, మరో ఇద్దరు గాయపడ్డారు. భాస్కరరావుకు తీవ్రగాయాలవగా మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో భాస్కరరావు పరిస్థితి విషమంగా ఉండగా విజయవాడ ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణాపురం శివారు ఊటగుండం గ్రామానికి చెందిన కందుల వెంకటచంద్ కారు డ్రైవర్‌గా గుర్తించారు. ఎస్సై అతడిపై కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

స్వామిసేవలో హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి, న్యూస్‌టుడే : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోశారు. ఆలయ పర్యవేక్షకుడు అచ్యుత మధుసూదనరావు స్వామి చిత్రపటం అందించారు. పట్టు వస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చల్లపల్లి : చల్లపల్లి మండలం నడకుదురులోని అతి ప్రాచీన మహిమాన్విత పుణ్యక్షేత్రమైన శ్రీపృధ్వీశ్వ క్షేత్రాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య దంపతులు శుక్రవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో అర్చకులు వారికి స్వాగతం పలికారు. శ్రీపృధ్వీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి, వేదపండితుల ఆశీర్వాదం పొందారు. ఆలయ విశిష్టత, పాటలీ వృక్షాల ప్రాశస్త్యాన్ని అర్చకులు న్యాయమూర్తికి వివరించారు. మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత వోల్గా, ఎస్సై కె.వై.దాస్ ఉన్నారు.

జస్టిస్ జయసూర్య దంపతులకు చిత్రపటం అందిస్తున్న మధుసూదనరావు

నాగేశ్వరస్వామి సన్నిధిలో దర్శకుడు మారుతి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని ఖొజ్జిల్లిపేటలో వెలసిన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత నాగేశ్వరస్వామిని సినీ దర్శకుడు మారుతి శుక్రవారం దర్శించుకున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ లంకిశెట్టి నీరజ, కుసుమ హరనాథ్‌బాబు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆయన్ను ఆహ్వానించి సత్కరించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. మారుతి మాట్లాడుతూ.. ఏటా సంక్రాంతికి బందరు రావడంతో పాటు నాగేశ్వరస్వామిని దర్శించుకుంటానని అన్నారు. ఆలయ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు త్రివేణి, రవీంద్ర, గడ్డం చినశివయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మారుతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీరజ తదితరులు

సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గోపూజ చేస్తున్న జస్టిస్ సుధీర్ కుమార్, కుటుంబ సభ్యులు

గోవులను పూజించడం ఆనవాయితీగా మార్చుకోవాలి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : సంక్రాంతిని పురస్కరించుకుని పశు సంపదను, ప్రత్యేకంగా గోవులను పూజించడం ఎంతో ఉత్కృష్టమైన సాంప్రదాయమని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం హనుమాన్‌జంక్షన్‌లో విశ్వహిందూ పరిషత్తు జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పుంగనూరు జాతికి చెందిన రెండు గోవులకు సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కనుమ రోజు ప్రతి ఒక్కరూ గోవులను పూజించడం ఆనవాయితీగా మార్చుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నందిగం స్వామి, తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్

ఈనెల 30 వరకు పొడిగించిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. వీరికి విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో సిట్ అధికారులు నిందితులను విజయవాడలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీనిపై నిందితుల తరఫు న్యాయవాది సుందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 30 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. బెయిల్‌పై ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. న్యాయాధికారి నుంచి అనుమతి తీసుకుని వెళ్లిపోయారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి రాలేదు. వీరి తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. రిమాండ్ పొడిగింపు అనంతరం నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

కోడి పందేల బరిలో వ్యక్తిపై హత్యాయత్నం

పెదపారుపూడి, న్యూస్‌టుడే : మండలంలోని భూషణగుళ్లలో కోడి పందేల బరిలో పందెం విషయంలో వివాదం ఏర్పడి ఒకరిపై హత్యాయత్నానికి దారి తీసింది. గుడివాడ ధనియాలపేటకు చెందిన అనగాని జగన్నాథం భూషణగుళ్లలో ఏర్పాటు చేసిన బరిలో కోడి పందేలు వేయడానికి శుక్రవారం వచ్చాడు. జగన్నాథం కోడి పందెం గెలవడంతో భూషణగుళ్ల గ్రామానికి చెందిన రౌడీషీటర్ విక్రుతి ఈశ్వరరావు అతనితో గొడవ పెట్టుకున్నాడు. బరిలో ఉన్నవారు సర్ది చెప్పారు. తర్వాత ఈశ్వరరావు గ్రామంలోకి వెళ్లి బ్లేడు తీసుకుని పందెం జరిగే స్థలానికి వచ్చాడు. జగన్నాథం వద్దకు వెళ్లి బ్లేడుతో మెడపై, చేతిపై కోసి పరారయ్యాడు. రక్తస్రావం అధికంగా కాగా జగన్నాథాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. అవుట్‌లెట్ పోలీసులు వివరాలు సేకరించి పెదపారుపూడి పోలీస్‌స్టేషన్‌కు తెలిపారు. పెదపారుపూడి పోలీసులు విక్రుతి ఈశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

గాయపడిన జగన్నాథం

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్‌ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008003297

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్‌లోన్. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669

REAL ESTATE

FLAT FOR SALE

మన శ్రీసిటీ కన్‌స్ట్రక్షన్స్ వారి తాడేపల్లి బైపాస్‌లోని ప్రైమ్ లొకేషన్ నందు 9 ఫ్లోర్స్ లగ్జరీ అపార్ట్మెంట్ ఫ్లాట్స్ మరియు విజయవాడ క్లబ్ రోడ్‌లో రివర్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ ఫ్లాట్స్ కొరకు సంప్ర: 98493 03315, 84494 58449.

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్ పక్కన ప్రైమ్ ఏరియాలో టాప్ ఫ్లోర్ 3 BHK, 3 ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ న్యూ ఫ్లాట్ అమ్మకం. ✆ 98853 99999

LAND FOR SALE

గన్నవరం, తెంపల్లి గ్రామం, చిన్న అవుటుపల్లి to తెంపల్లి రోడ్ ఫేసింగ్ 1.42 ac. Industrial Land. RCC షెడ్‌తో. ✆ 89782 66665.

PLOT FOR SALE

మన శ్రీసిటీ వారి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్ బందరురోడ్, వెస్ట్ బైపాస్‌లలో ఓపెన్ ప్లాట్స్, విల్లాలు LP నంబర్‌తో అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్ ✆ 98493 03315, 84494 58449

రిజి. శ్రీ కంచికచర్ల దగ్గర - వెలిటికల్లు రోడ్డులో- HYD హైవేకి 500 మీ॥ పరిటాల రైల్వేహాల్ట్‌కి, ఐకాన్ బ్రిడ్జికి దగ్గరలో CRDA ప్లాట్లు. లోన్ కలదు. ✆78427 58859

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067

VJA, కంచికచర్ల, ఔటర్‌రింగ్‌రోడ్డు DTCP & APCRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥గ॥ 3,900/- నుండి 7,900/- వారధికి 3కిమీలలో చ॥గ॥ 14,500/-. ✆ 96031 45395

NH-65, బెల్ కంపెనీ, మచిలీపట్నం పోర్ట్, గన్నవరం ఎయిర్ పోర్ట్, ORR లకు దగ్గరలో పామర్రు కార్పొరేషన్ పరిధిలో, బందర్ రోడ్, గంగూరులలోను CRDA అప్రూవ్డ్ వెంచర్లో ప్రీమియం ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు & పరిటాల హైవే ఫేసింగ్‌లో మరో నూతన CRDA వెంచర్ త్వరలో ప్రారంభం. 7799334555.

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ॥ రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
✆98486 67454

ప్లాట్స్ అమ్మబడును. డి.టి.సి.పి. లేఔట్‌లో మచిలీపట్నంలో మంచినీటి కాలువ దగ్గర వాసవినగర్‌లో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆79817 81688, 78158 50952

మచిలీపట్నం, ఈడేపల్లి బాలభాను విద్యాలయం రోడ్‌లో 265 గజాలు కమర్షియల్ ప్లాట్ అమ్మకం కలదు. PH.No: 98482 10397, 95559 93366.

PROPERTY FOR SALE

3BHK Flat at HRT Plaza near Benz Circle & 275 Sq.Yds. Open Plot Bharathi Nagar behind Novatel, 5000 Sq.Yds. Vadeswaram. Sale. ✆ 90043 77068.

TO LET

COMMERCIAL

Tolet for Corporate Offices Ground Floor 360 S.Ft Near A Plus Convention Hall, Vijayawada ✆ 90146 33050

SECOND SALE

Furniture for Sale. (Good Condition) Related to Readymade Garment Store @ MG Road, Vijayawada. 97043 87132, 99895 51919.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో పనిచేయుటకు లేబర్‌రూమ్ అసిస్టెంట్, O.T అసిస్టెంట్, O.T కాంపౌండర్ కావలెను. ✆ 93973 41745

VJAలోని ఆటోమొబైల్ హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర పనిచేయుటకు అకౌంటెంట్ (F) కావలెను. EXP. టాలి 3YRS. 10Am to 5Pm ✆ 92464 92455.

NTR, కృష్ణాలలో జగ్గయ్యపేట, కైకలూరు, పామర్రు, అవనిగడ్డ, గుడివాడలో మార్కెటింగ్‌కు PROలు కావలెను. జీతం : 40K, 50K,60K ✆ 89195 20094

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు టెలీకాలర్స్ (స్త్రీ అభ్యర్థులు) కావలెను. అనుభవం 0-2సం॥. ✆ 88862 99444.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు ఆఫీస్ సేల్స్ అభ్యర్థులు కావలెను. అనుభవం 0-2 సం॥. ✆ 63098 80999.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు కలెక్షన్ ఏజెంట్స్ కావలెను. అనుభవం 0-5సం॥. ✆ 88866 55588.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఉత్సవాలు

మాట్లంలో సాయిబాబాను ఊరేగిస్తున్న నిర్వాహకులు

మాట్లం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని మాట్లం పంచాయతీలో షిర్డీ సాయిబాబా ఉత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. 29వ వార్షిక పంచరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయ పురోహితుడు కొండూరి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం బాబా ప్రతిమను బంగారు గుర్రాల రథంపై ఊరేగించారు.

ధర వరలు

టమాట 23, వంగ 23, బెండ 34, పచ్చిమిర్చి 32, కాకర 46, క్యాబేజీ 22, క్యారెట్ 32, దొండ 43, బంగాళదుంప 21, ఉల్లిపాయలు 26, గోరుచిక్కుడు 32, దోస 40, సొర 15, అరటికాయ 7,8, చిక్కుళ్లు 34,బీర 24, చామదుంప 26, మునగ 08/10, కంద 44, బీట్‌రూట్ 24, కీరదోస 28, బీన్స్ 55, క్యాప్సికం 55, అలసందలు 34, చిలకడదుంప 32, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 శుక్రవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరల వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి (91823 61295)ని సంప్రదించవచ్చు. - మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: భర్తమహాశయులకు విజ్ఞప్తి(రెండు షోలు) మనశంకరవరప్రసాదు (రెండుషోలు) **మినీరేవతి:** అనగనగా ఒకరాజు; **సిరికృష్ణ:** మనశంకరవరప్రసాదు సిరివెంకట్: రాజాసాబ్

హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు వెంకట్‌కు పురస్కారం

కుటుంబ సభ్యులతో కలిసి పురస్కారం అందుకుంటూ...

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు చందన వెంకట్‌కు అనకాపల్లికి చెందిన డా. కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ పురస్కారం అందజేసింది. వెంకట్ గత కొన్నేళ్లుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 2026 సంవత్సరానికి గానూ అనకాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు కొణతాల లక్ష్మీపార్వతి, ఫణి భూషణ్‌లు పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

సై అంటే సై

✤ మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో కత్తులు దూసిన కోళ్లు

✤ పలుచోట్ల విజేతలకు బుల్లెట్లు, ఇతర విలువైన వస్తువుల అందజేత

పెడన మండలంలో..

పెడన: ఎల్ఈడీ తెరల ఏర్పాటు..

మేకావానిపాలెం పంచాయతీ పరిధిలోని ఓ బరిలో..

కొంకేపూడిలో పందేల్లో గెలిచిన వ్యక్తికి బుల్లెట్ అందజేత...

బంటుమిల్లి: పెందుర్రులో గుండాట ఆడుతూ..

బంటుమిల్లిలో రాత్రిపూట బరుల వద్ద రద్దీ..

గూడూరులో...

మచిలీపట్నం కార్పొరేషన్, గూడూరు, పెడన, బంటుమిల్లి, న్యూస్‌టుడే: పెడన నియోజకవర్గంలో గతానికి భిన్నంగా ఈ ఏడాది జూదాలు, కోడి పందేలు భారీగా నిర్వహించారు. రూ.కోట్లు చేతులు మారాయి. కార్లు, ద్విచక్రవాహనాలను విజేతలకు బహుమతులుగా అందజేశారు. కొంకేపూడి, పెందుర్రు, పాశ్చాపురం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బరుల్లో విజేతలకు కార్లు, బుల్లెట్లను బహుమతులుగా ఇచ్చారు. పెడన మండలం కొంకేపూడి వద్ద పెడన-గుడివాడ రోడ్డుపై భారీ స్థాయిలో నిర్వహించారు. తిరుపతి, హైదరాబాద్‌ల నుంచి బౌన్సర్లను పిలిపించారు. పార్కింగ్ ఫీజులను విచ్చలవిడిగా వసూలుచేశారు. ✤బందరు మండలంలోని మేకావానిపాలెం, బీచ్‌రోడ్డు, తాళ్లపాలెం, రుద్రవరం తదితర గ్రామాల్లో బరులు ఏర్పాటు చేశారు. మేకావానిపాలెం పంచాయతీ పరిధిలో రెండు బరులు ఏర్పాటు చేయగా.. ఒక బరిలో మాత్రం పందెం వేసేందుకు వచ్చిన వారితో పాటు వీక్షకుల వద్ద కూడా రూ.500లు తీసుకుని కూపన్‌లు పంపిణీ చేశారు. లక్కీడ్రా తీసి ఐదుగురు విజేతలకు పంపిణీ చేసేందుకు బహుమతులను బరి వద్దే సిద్ధంగా ఉంచారు. మొదటి విజేతకు బుల్లెట్, తరువాత ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, టీవీ, గ్రైండర్లు అందించారు. ✤గూడూరు, పోసినవారిపాలెం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బరుల వద్ద పందెగాళ్లు, వీక్షకులతో కోలాహల వాతావరణం నెలకొంది. కోడి పందేల మాటున జూద శిబిరాలు కూడా సాగాయి.

అమృత్ 2.0తో నగరానికి మహర్దశ

రూ.73.38 కోట్లతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంట్లో భాగంగా అమృత్ 2.0 పథకంలో ఆగిపోయిన పనులతోపాటు గతంలో చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన డ్రెయిన్లను అనుసంధానించేందుకు అవసరమైన నిధులు విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తవడంతో త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.

అసంపూర్తిగా మురుగునీటి శుద్ధి ప్లాంట్..

కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో..

అమృత్ 2.0 పథకంలో నగరానికి రూ.73.38 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో రూ.53.10 కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లు ఈడేపల్లి సబ్‌జైల్, ఫతుల్లాబాద ఔట్‌ఫాల్ డ్రెయిన్ల వద్ద నిర్మించాలని నిర్ణయించారు. దీంతో పాటు రిజర్వాయర్‌లు, పైపులైన్లు ఇతర తాగునీటి సంబంధింత పనులు చేపట్టేందుకు రూ.15.24 కోట్లు కేటాయించారు. నగరంలోని కాలనీలతో పాటు రుద్రవరంలోని టిడ్కో గృహ సముదాయం వరకు పైపులైన్ ఏర్పాటు ఇతర పనులకు రూ.1.12 కోట్లు, కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ల నిర్మాణాలకు రూ.1.16 కోట్లు, జిల్లా పరిషత్ కూడలిలోని ధర్మాన చెరువు అభివృద్ధికి రూ.2.76 కోట్లు వెచ్చించేలా చర్యలు తీసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే నిధులు కేటాయించినా సకాలంలో స్పందించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

డ్రెయిన్ల అనుసంధానానికి రూ.13 కోట్లు..

నగరంలో విడతల వారీగా అనేక చోట్ల డ్రెయిన్లు నిర్మించారు. నిర్మాణం చేపట్టినా చాలా చోట్ల అనుసంధానం చేయకుండా వదిలేశారు. పలు చోట్ల అసంపూర్తిగా ఉండటంతో ఎగువ నుంచి వచ్చే మురుగు దిగువకు పారే అవకాశం లేక సమస్య ఏర్పడింది. వైకాపా హయాంలోనే నగరవాసులు వాటిని పూర్తి చేయాలని మొరపెట్టుకున్నారు. వారు అనుసంధానించకపోవడంతో డ్రెయిన్లు ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం ఆ పనులు చేపట్టేందుకు నిధులు విడుదల కావడంతోపాటు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయితే నగరంలో చాలావరకు సమస్యలు పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంది.

త్వరలోనే పనులు - సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్

అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనులతోపాటు డ్రెయిన్లు అనుసంధానించేందుకు కేటాయించిన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంది. దీనిపై సంబంధిత విభాగ అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

సందడిగా.. ముగ్గుల పోటీలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మల్లేశ్వరంలో సంక్రాంతి సందర్భంగా సర్పంచి చెన్ను శ్రీనివాసరావు ఆయన మాతృమూర్తి సీతారావమ్మ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌ఛార్జి గంగుమోలు శివనారాయణ, ఉప సర్పంచి కందుల నాగేశ్వరమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జొన్నలగడ్డ నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తూ..

జానకిరామపురంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో..

మహిళా సంఘం ఆధ్వర్యంలో..

నాగేశ్వరరావుపేట పంచాయతీ జానకిరామపురంలో సీఐటీయూ, మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పర్చూరి ధనశ్రీ, గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి పద్మ, మాజేటి శ్రీనివాసరావు, లంకదాసుల అజయ్‌ఘోష్ పాల్గొన్నారు.

గరుకు స్తంభం ఏర్పాటుతో పితృ దేవతలకు స్వర్గ ప్రాప్తి

గరుకు స్తంభం వద్ద బాలాజీ దంపతులు, తదితరులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: గోవుల కోసం గరుకు స్తంభం ఏర్పాటు చేయడం వలన పితృ దేవతలకు స్వర్గం ప్రాప్తిస్తుందని వేదాలు చెబుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని జగన్నాథపురంలో గోవుల కోసం న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ దంపతులు జగన్నాథస్వామి ఆలయం ఎదుట సంక్రాంతి సందర్భంగా గరుకు స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ప్రాంతాల్లో గోవులు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ గరుకు స్తంభం ఏర్పాటు చేస్తే వాటికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంలో చెప్పిన వేద వ్యాఖ్యల స్ఫూర్తితో ఈ స్తంభం ఏర్పాటు చేయించామని అన్నారు. లంకిశెట్టి సాయిబాబు, సాయిలక్ష్మి, క్రికెట్ క్రీడాకారుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెడన వాసికి జియో ఫిజిక్స్ అవార్డు

భట్ట జ్ఞాన కుమారస్వామి

పెడన, న్యూస్‌టుడే: పెడనకు చెందిన భట్ట జ్ఞాన కుమారస్వామికి 'నియర్ సర్ఫేస్ జియో ఫిజిక్స్ అవార్డు' లభించింది. ఆయిల్ ఇండియా లిమిటెడ్ కాకినాడలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఈయన భూగర్భ పరిశోధనల్లో ఫుల్ వేవ్ సిస్మిక్ సర్వే విధానంపై చేసిన పరిశోధనలు మంచి ఫలితాలు ఇచ్చాయి. ఈ విధానం ద్వారా ఆయిల్ నిక్షేపాల అన్వేషణకు చేపట్టే భూగర్భ పరిశోధనలకు వ్యయం తగ్గుతుందని నిరూపితమైంది. ఈయన కృషిని గుర్తించిన ఆక్వా ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది. ఇటీవల దిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు

చల్లపల్లి, న్యూస్‌టుడే : నేత్రదానానికి అంగీకరిస్తే మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించిన వారవుతారని వాసవీక్లబ్ అధ్యక్షురాలు అమరవాణి తెలిపారు. హఠాన్మరణం చెందిన కొల్లిపర నాగేశ్వరరావు (83) మృతదేహం నుంచి కుటుంబ సభ్యులు రెండు కార్నియాలను దానం చేశారు. నాగేశ్వరరావు కుమారులు కొల్లిపర పిచ్చిబాబు, వారి సోదరులు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండటంతో విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది గురువారం వచ్చి కార్నియాలు సేకరించారు. వాసవీ క్లబ్ సభ్యులు తమ్మన సతీష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూలిన గోడ.. ప్రయాణికుల గుండెల్లో దడ

ప్రమాదకరంగా..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పెడన మండలం కొంగంచర్ల సమీపంలోని శాయి లంక కాలువపై ఉన్న వంతెన రిటైనింగ్ వాల్ కూలి ప్రమాదకరంగా మారింది. గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు నుంచి పెడన మండలంలోని వివిధ గ్రామాల మీదుగా ముదినేపల్లి మండలం శింగరాయపాలెం వెళ్లే రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డులో గోడ కూలి నెల గడుస్తున్నా.. అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని.. కనీసం అక్కడ ప్రమాదమని చెప్పేలా సూచిక కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా, ఏలూరు జిల్లాలను అనుసంధానించే రహదారి కావడంతో సమస్య తీవ్రంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హమ్మయ్య గుంత పూడ్చారు..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని మాచవరంలో ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం పడితే నీళ్లు నిలిచిపోతున్నాయి. మచిలీపట్నం నుంచి పెడన, గుడివాడ, ఏలూరు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఈ రోడ్డు వెంబడే రాకపోకలు సాగిస్తాయి. సమస్య తీవ్రతపై 'ఈనాడు'లో పలుమార్లు చిత్ర కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన అధికారులు గుంతను పూడ్చించేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకులతో సాగర సంగమం కళకళ

హంసలదీవి (కోడూరు), న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో మండల పరిధిలోని హంసలదీవిలో గల సాగర సంగమ తీరం శుక్రవారం కళకళలాడింది. కుటుంబ సమేతంగా, స్నేహితులు బృందాలుగా సాగర సంగమానికి కార్లు, ప్రైవేటు వాహనాలతో రావడంతో ఆ ప్రాంతంలో కోలాహలం నెలకొంది.

తీరంలో పర్యాటకుల సందడి

కనులపండువగా సంక్రాంతి పూజలు

యతిరాజభవనంలో వేంకటేశ్వరస్వామి...

శ్రీరామానుజాచార్య సంస్థాన్‌లో..

ఐదుగళ్లపల్లిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు.


డాబాల సెంటరులోని రామాలయంలో..


చిన ఆకులమన్నాడు కోదండరామస్వామి ఆలయంలో

బందరు, పెడన నియోజకవర్గాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. – న్యూస్‌టుడే బృందం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

★ నగరంలోని జవ్వారుపేటలో ప్రధాన రహదారి సమీపంలో చెత్తను తొలగించడం లేదని స్థానికులు, రాకపోకలు సాగించే ప్రయాణికులు అందించిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రహదారి పక్కన డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా... సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మాజీ సర్పంచి మృతి

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పెడన మండలం కాకర్లమూడి మాజీ సర్పంచి జన్యావుల మారేశ్వరరావు(61) శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. మృతదేహానికి కాకర్లమూడిలోని ఆయన నివాసంలో పలువురు నివాళులర్పించారు. ఆయన ఎంపీటీసీ సభ్యుడి, సర్పంచిగా గ్రామ ప్రగతికి కృషిచేశారని కొనియాడారు.

70 మంది జూదరుల అరెస్టు

గుడివాడ, న్యూస్‌టుడే : గుడివాడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తున్న 70 మందిని అరెస్టు చేసి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎన్.చంటిబాబు శుక్రవారం తెలిపారు.

లక్ష్యం సాధిస్తారా.. నిర్లక్ష్యంగానే ఉంటారా..?

✤ మున్సిపల్ పన్నుల వసూళ్లలో పెడన వెనుకంజ

ఆస్తి పన్ను వసూలు చేస్తున్న సచివాలయ ఉద్యోగిని..

పెడన, న్యూస్‌టుడే

పెడన మున్సిపల్ పన్నుల వసూళ్లలో వెనుకంజ కనిపిస్తోంది. జిల్లాలో తక్కువ ఆదాయం ఉన్న ఈ పురపాలికలో అధికారుల వైఫల్యంతో లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించడం లేదు. ఏళ్లుగా ఆదాయం తగ్గుతున్నా ప్రక్షాళన చర్యలు చేపట్టడం లేదు. జనరల్ ఖాతా నుంచి స్వల్ప సమస్యలను కూడా పరిష్కరించలేని పరిస్థితి.

ఆస్తి పన్నుల వసూళ్లు అంతంతమాత్రమే..

ఆస్తి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మున్సిపల్ కార్యాలయంతో పాటు సచివాలయ ఉద్యోగులు మొత్తం 100 మంది వరకు ఉన్నా లక్ష్యాలను సాధించలేక పోతున్నారు. పట్టణంలోని 8256 భవన యజమానుల నుంచి పాత బకాయిలతో కలిపి రూ.2.37 కోట్ల ఆస్తి పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికి రూ.1.11 కోట్లు రాబట్టారు. తద్వారా 46.84 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మార్చి 31 నాటికి ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా ఇప్పటివరకు 50 శాతం కూడా సాధించలేకపోవడం ఉద్యోగుల పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు. నీటి కుళాయి పన్నులు ఇప్పటికి 20 శాతం మాత్రమే వసూలయ్యాయి. పట్టణంలో 3796 కుళాయిలు ఉండగా ఏడాదికి రూ.14 లక్షలు వసూలు కావాల్సి ఉంది. గత బకాయిలతో కలిపి ఈ మొత్తం రూ.70 లక్షలకు చేరింది. ఫలితంగా నీటి పథక నిర్వహణ పురపాలికకు భారంగా మారింది.

ఖాళీ స్థలాల పరిస్థితి అంతే..

పట్టణంలో 311 ఖాళీ స్థలాలు ఉండగా రూ.26 లక్షల వార్షిక ఆదాయం రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.10 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఫలితంగా 36.80 శాతానికి క్షీణించింది. అయితే ఖాళీ స్థలాలు దాదాపు 600 వరకు ఉంటాయని పన్నుల విధింపులో రెవెన్యూ విభాగం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేయి తడపందే ఆస్తి పన్నులు విధించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పేరుకుపోతున్న కార్యాలయాల బకాయిలు..

పట్టణంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తుల పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. మొత్తం 12 భవనాలకు సంబంధించి రూ.19 లక్షలకు ఇప్పటికి రూ.4 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. మండల పరిషత్తు, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, రైల్వే క్వార్టర్లు, పోలీసుస్టేషన్ తదితర శాఖల భవనాల నుంచి భారీ మొత్తంలో వసూలు కావాల్సి ఉంది.

వేగవంతం చేస్తున్నాం

పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తున్నాం. ఉద్యోగులు ఉదయం 8.30 గంటల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించాం. రోజువారీ లక్ష్యాలనూ నిర్దేశించాం. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 95 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసేందుకూ వెనుకాడం. - డి.కొండయ్య, కమిషనర్

వైభవంగా సీతారాముల కల్యాణం

డోకిపర్రు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : మండలంలోని డోకిపర్రు శ్రీభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసం, వారం రోజులుగా నిర్వహిస్తున్న సుందరకాండ సప్తాహం ముగింపు సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, మేఘా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి దంపతులు స్వామి కాలమానిని, దైనందిని ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఐనపూరు (పమిడిముక్కల): ఐనపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2007- 08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

విజేతలతో నిర్వాహకులు, అతిథులు

గూడూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని మద్దిపట్ల ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. మత్తే నాగరాజు, మద్దాల వీరవెంకట్రావు, కనపర్తి మహేశ్వరరావు, బుస్సా మాణిక్యరావు తదితరులు పర్యవేక్షించారు

బరిలో అపశ్రుతి

మోపిదేవి, న్యూస్‌టుడే : 216 జాతీయ రహదారి పక్కన నిర్వహించిన బరిలో అపశ్రుతి చోటు చేసుకుంది. గురువారం బరివద్దకు వెళ్లే క్రమంలో తాత్కాలికంగా వేసిన బాటపై లోపలికి వెళుతున్న కారు బోల్తా కొట్టి మురుగుబోదులోకి పడిపోయింది. జనం అందులో ఉన్నవారిని బయటకు తీశారు. స్వల్ప గాయాలయ్యాయి. కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు.

★ పందెం నుంచి తప్పుకున్న కత్తి కట్టిన కోడి పారిపోయి అక్కడున్న వ్యక్తులపై దాడి చేసింది. శుక్రవారం కె.కొత్తపాలేనికి చెందిన వ్యక్తిపై అది దాడి చేయగా కాలికి తీవ్ర గాయమైంది.

ఒంగోలు జాతి ఎడ్ల పూటీబండి లాగుడు పోటీలు

కపిలేశ్వరపురం (పమిడిముక్కల), న్యూస్‌టుడే : తెదేపా పమిడిముక్కల మండల శాఖ ఆధ్వర్యంలో కపిలేశ్వపురంలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎడ్ల పూటీ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్ స్థాయి ఎడ్ల పోటీలను గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, స్థానిక పార్టీ నాయకులు ప్రారంభించారు. శుక్రవారం సీనియర్ ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఎమ్మెల్యేలు వర్ల కుమార రాజా, యార్లగడ్డ వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ ఎడ్ల పందేలు, రైతుల పాత్ర, ఆంధ్రుల చరిత్రలో సంక్రాంతి సబంరాలు అంశాలపై ప్రసంగించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

వైభవంగా ఉభయ ముక్తేశ్వరస్వామి గ్రామోత్సవం

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : వేకనూరులోని గంగా పార్వతీ సమేత ఉభయ ముక్తేశ్వర స్వామి ఆలయంలో కనుమ పండగ ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు నేతృత్వంలో రుత్విక్‌లు ఉభయ ముక్తేశ్వర స్వామికి పంచామృత గోక్షీర అభిషేకాలు చేశారు. పార్వతి అమ్మవారికి శ్రీ చక్రపూజ, సహస్ర నామార్చనలు నిర్వహించారు. స్థానిక భక్త సమాజం లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి.. మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ఉత్సవమూర్తులకు వార పోసి కర్పూర హారతులు సమర్పించారు

వేకనూరులో..

నందీశ్వరుడికి బియ్యంతో పూజలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే : స్థానిక పురాతన శివాలయంలో అమావాస్య ముందు వచ్చే బహుళ త్రయోదశి పురస్కరించుకుని శుక్రవారం నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘంటసాల పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కనుమ పండగ పురస్కరించుకుని పశువులకు పూజలు చేయడం ఆనవాయితీ. బియ్యంతో నందీశ్వరునికి పూజలు, అభిషేకం చేశారు.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

తితిదే ధార్మిక శోభ

మద్దూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా మద్దూరులోని ధ్వజస్తంభ రామాలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. బాలికలు నృత్యాలు ప్రదర్శించారు.

మద్దూరు : కుంకుమ పూజలో మహిళలు

మహానందీశ్వరుడికి అభిషేకం

యనమలకుదురు, న్యూస్‌టుడే: యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం త్రయోదశి సందర్భంగా ప్రదోషకాలంలో మహా నందీశ్వరుడికి అభిషేకం, అర్చన నిర్వహించారు. ఆలయ ప్రదాత నరసింహారావు, ఆలయ ఈవో భవానీ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీ.. ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు: రాష్ట్ర బాలురు కబడ్డీ జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించింది. ఆంధ్రా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఈడుపుగల్లులోని శ్రీసీతారామ గార్డెన్స్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ బాలురు కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను గురువారం కొల్లు రవీంద్ర ప్రారంభించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, శ్రీసీతారామ గార్డెన్స్ అధినేత నందమూరి విష్ణువర్ధనరావు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన లీగ్ పోటీలను తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. శనివారం నుంచి నాకౌట్ పోటీలు ప్రారంభమవుతాయని ఆంధ్రా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.

కోళ్ల.. కోట్లాట..

కంకిపాడులో యువకుల ఘర్షణ

కేసరపల్లిలో..

పెదపులిపాక కోడిపందేల వద్ద కోలాహలం

కంకిపాడు శిబిరంలో శుక్రవారం రాత్రి

అంపాపురంలో కోతముక్క శిబిరం

న్యూస్‌టుడే బృందం: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా పలు చోట్ల మూడు రోజులుగా నిర్వహించిన కోడి పందేలు, జూద శిబిరాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కంద్రికకు చెందిన సూరిబాబు 21 పందేలకు 14 గెలవగా, ఈడుపుగల్లుకు చెందిన సాయికిరణ్ తొమ్మిదికి ఆరు విజయాలు సాధించినందుకు రెండు బుల్లెట్ బైకులను శిబిరం నిర్వహణ ప్రతినిధులు వారికి అందజేశారు. చిన్నపాటి ఆటల్లో మహిళలు పాల్గొనడమే కాకుండా కొన్ని శిబిరాలను స్వయంగా నిర్వహించడం ఈ ఏడాది ప్రత్యేకత. ★ ప్రొద్దుటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కోడి పందేలు వేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ★ ఉప్పులూరు కోడి పందేల బరి ముగింపు దశలో కొందరు యువకుల మధ్య జరిగిన చిన్న వివాదాన్ని నిర్వాహకులు వారించారు. ఆ తర్వాత కొంతసేపటికి రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు అందుబాటులో ఉన్న కర్రలు, కుర్చీలతో ఘర్షణకు దిగారు. వాలంటీర్లు అత్యుత్సాహం ప్రదర్శించినట్లు చెబుతున్నారు. నిర్వాహకులు మరోసారి రంగప్రవేశం చేసి గొడవ పెద్దది కాకుండా నివారించారు. సమాచారం అందుకున్న పోలీసులు శిబిరానికి వచ్చి ఘర్షణపై ఆరా తీస్తున్నారు. ★ కంకిపాడు, మరికొన్ని చోట్ల కోడిపందేలు, జూద క్రీడల నిర్వహణ శిబిరాల్లో విద్యుత్తు అక్రమంగా వినియోగించుకున్నట్లు విద్యుత్తు శాఖ అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్తు శాఖ సిబ్బంది శుక్రవారం ఆయా శిబిరాలను తనిఖీ చేసి జంపర్లు తొలగించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

యనమలకుదురులో బహుమతులు అందిస్తూ..

కంకిపాడులో బాలికల నృత్యం

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ ఆటలు, నృత్య పోటీల్లో మహిళలు, బాలబాలికలు పాల్గొన్నారు. విజేతలకు స్థానిక ప్రతినిధులు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే బృందం

ఘనంగా పేరంటాలమ్మ గ్రామోత్సవం

రామవరప్పాడు, న్యూస్‌టుడే : స్థానిక శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ వారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు అమ్మవారి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : త్రయోదశి సందర్భంగా బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వామి వారికి వెండి వస్తువుల బహూకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామికి దాతలు వెండి వస్తువులు బహుకరించారు. ఏలూరు పార్లమెంట్ తెదేపా మహిళా నాయకురాలు వడ్డి వాసవి స్వామి వారికి రూ.1.15 లక్షల విలువైన రెండు వెండి తీర్థం గిన్నెలను తయారు చేయించారు. ఈ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేసి ధర్మకర్తలు, అభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో అర్చకుడు సీతారామాచార్యులకు అందించారు. ధర్మకర్తలు కాకాని అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువులు అందజేస్తున్న వాసవి

వంతెనపై గుంత పూడ్చరూ...

ఉప్పులూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: సుమారు రోజుకు ఐదు వేల వాహనాలు రాకపోకలు సాగించే ఉప్పులూరు వంతెనపై గుంత ఏర్పడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల కిందట కంకర, తారు మిశ్రమంతో పూడ్చినా.. భారీ వాహనాల తాకిడికి పగుళ్లు విస్తరించడంతో అడుగు లోతుకు కుంగింది. దగ్గరకు వచ్చే వరకు గుర్తించక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు పడిపోతున్నాయి. శుక్రవారం సాయంత్రం స్కూటీపై కంకిపాడు వైపు నుంచి వస్తున్న దంపతులు గాయపడ్డారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే గుంతను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన దారపురెడ్డి సురేశ్ చంద్రకుమార్ రాజాకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. బాపులపాడుకు చెందిన యర్రగొర్ల రామయ్య 2022 జూన్ 12న ముద్దాయి చంద్రకుమార్ రాజాకు రూ.3.50 లక్షలు అప్పుగా ఇచ్చారన్నారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని రామయ్య కోరగా ముద్దాయి 2023 జనవరి 9న రూ.3.50 లక్షలకు చెక్కు ఇచ్చినట్లు చెప్పారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారన్నారు. తరువాత కోర్టులో కేసు వేయగా చంద్రకుమార్ రాజాకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అంతిమయాత్ర

జననం 22-8-1951

మరణం 16-1-2026

శ్రీమతి తోటకూర విజయలక్ష్మి గారు

W/o (లేటు) తోటకూర రాఘవేంద్రరావు గారు, పోరంకి

మా తల్లిగారైన శ్రీమతి తోటకూర విజయలక్ష్మి గారు
ది. 16-1-2026 శుక్రవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
అంతిమయాత్ర: ది. 17-1-2026 శనివారం ఉదయం 9.00 గంటలకు
మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.

కుమారుడు: తోటకూర నరేష్‌కుమార్ కోడలు: దీపిక
✆ 90300 38246
కుమార్తెలు: ఎనిగళ్ళ నవీన అల్లుళ్ళు: రాజగోపాల్
అల్లూరి నీలిమ భానుప్రసాద్
మనుమలు: తోటకూర ఆశ్రిత్‌కుమార్, తోటకూర శౌర్య
అల్లూరి విశాల్, అల్లూరి దివ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ★ ఉయ్యూరు కూడలి, కాటూరు రోడ్లల్లో ట్రాఫిక్ అంతరాయం కలిగే విధంగా రోడ్డుకు అటు ఇటు వాహనాలు నిలిపి వేస్తున్న అంశాన్ని ప్రజలు 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకు రాగా స్పందించిన పట్టణ సీఐ టి.వి.వి రామారావు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్డుగా ఉన్న వాహనాలకు జరిమానాలు విధించారు. ★ ఉయ్యూరు పట్టణంలోని అంతర్గత రహదారుల పక్కల చెత్త పేరుకుపోతున్న విషయాన్ని పురపాలక సంఘం పారిశుద్ధ్య విభాగం దృష్టికి తీసుకు రాగా.. చెత్తను పురపాలిక ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి చెత్త తీయించి పరిశుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, ఉయ్యూరు

నిరంతరం వెలుగులు.. ప్రసరించేలా చర్యలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : హనుమాన్‌జంక్షన్ ఎట్టకేలకు విద్యుత్తు దీపాల వెలుగులు సంతరించుకుంది. దాదాపు రెండేళ్ల కిందట వేలేరు శివారు నుంచి రామిలేరు వంతెన వరకు జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. గుత్తేదారు సరిగా పనులు నిర్వహించకపోవడం, అధికారులు పట్టించుకోక పోవడంతో అప్పటి నుంచి నిరుపయోగంగానే మిగిలాయి. పైగా పలు స్తంభాలు భారీ వాహనాల ధాటికి ధ్వంసమైపోయాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవ తీసుకుని సత్వరం దీపాలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ చేపట్టాలని బాపులపాడు గ్రామ పంచాయతీ వర్గాలకు సూచించారు. దీంతో రూ.10 లక్షలు కేటాయించి అసంపూర్తి పనులు, విద్యుత్తు కనెక్షన్లు, ఇతర మరమ్మతులు చేపట్టారు. దాదాపుగా ఇవి కొలిక్కి రావడంతో సంక్రాంతి సందర్భంగా ప్రయోగాత్మకంగా దీపాలు వెలిగించారు. రోజుల వ్యవధిలోనే నిరంతరం వెలుగులు ప్రసరించేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

విద్యుత్తు దీపాల వెలుగుల్లో హనుమాన్‌జంక్షన్

200 మందికి దుప్పట్ల పంపిణీ

పునాదిపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: కంకిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పునాదిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం 200 మంది పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. దాత ఉమాశంకర్, సర్పంచి విజయకుమారి, సంఘ ప్రతినిధులు నాంచారయ్య, గోవిందరావు, సుబ్బారావు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కానూరు ఎంపీహెచ్‌ఏ మృతికి నివాళి

కానూరు, న్యూస్‌టుడే: కానూరు, పెనమలూరు ఆరోగ్య కేంద్రాల్లో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.వి.ఎస్ ప్రసాద్(54) శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. 20ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసాద్ మరణం పట్ల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, డాక్టర్లు శ్రీనివాస్, సుష్మిత, మంజుల తదితరులు నివాళులర్పించారు.

మంచిని, మానవత్వాన్ని పెంచుకోవాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ప్రతి మనిషి తనలో మంచి, మానవత్వాన్ని పెంపొందించుకోవాలని దైవోపదేశకులు డాక్టర్ జాన్ డేవిడ్ అన్నారు. స్థానిక హెబ్రోను ప్రార్థనా మందిరంలో మూడు రోజులుగా క్రీస్తు శుభ సందేశ మహాసభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి ముగింపులో సభలో సాజన్ మాథ్యూ(కేరళ), ఎన్.డి.వి.ప్రసాద్(నరసాపురం) తమ సందేశాన్ని అందించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న దైవోపదేశకులు డాక్టర్ జాన్ డేవిడ్

యువకుడిపై హత్యాయత్నం.. ఒకరి అరెస్టు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: స్థానిక సౌభాగ్యనగర్ ప్రాంతంలో గురువారం ఓ యువకుడిపై కత్తి పోట్లతో జరిగిన హత్యాయత్నంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉయ్యూరు పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. గండిగుంటకు చెందిన కనపర్తి నిఖిల్‌ను మద్యం తాగేందుకు పెనమలూరు ప్రాంతానికి చెందిన పోలన కిరణ్, వడియాల గణేష్‌లు సౌభాగ్యనగర్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అనంతరం వారి మధ్య వివాదం నెలకొనడంతో నిఖిల్‌ను కొట్టారు. దీంతో అక్కడి నుంచి నిఖిల్ పరావ్వడంతో ఆటోలో వెంట పడి ఢీకొట్టి అతడిపై దాడి చేశారు. ఈ క్రమంలో నిఖిల్‌ను కిరణ్ కత్తితో పొడవగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై కె.మల్లికార్జునరావు ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల్ని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం పట్టణ పోలీసులు కిరణ్‌ను అరెస్టు చేసి ఉయ్యూరు కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. ఈ నెల 29 వరకు రిమాండ్ విధించగా మచిలీపట్నం సబ్ జైలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కిరణ్‌పై ఇప్పటికే పెనమలూరు పోలీసుస్టేషన్లో సస్పెక్ట్ షీట్ ఉందని, అతనిపై 60కి పైగా కేసులు నమోదై ఉన్నాయని పట్టణ ఎస్సై తెలిపారు.

నిందితుడిని చూపుతున్న పోలీసులు

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.

కార్లను ధ్వంసం చేసిన దుండగుడు

హనుమాన్‌జంక్షన్: సినిమా థియేటర్ సమీపంలో నిలిపిన కార్ల అద్దాలను ఓ దుండగుడు ధ్వంసం చేయడం హనుమాన్‌జంక్షన్‌లో కలకలం రేపింది. సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక వాస్తు సిద్ధాంతి రొంపెల్లి భగవాన్ నాయుడు ఇంటికి హైదరాబాద్ నుంచి కుమారుడు శివ, పార్వతీపురం నుంచి సమీప బంధువు భాస్కరరావు వచ్చారు. వీరంతా రెండు కార్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కృష్ణా థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లారు. థియేటర్ లోపల పార్కింగ్ రద్దీగా ఉండడంతో సమీపంలోని ఖాళీ స్థలంలో వాహనాలు పెట్టారు. తిరిగొచ్చే సరికి రెండు కార్ల అద్దాలు ధ్వంసమై ఉండగా పోలీసులను ఆశ్రయించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏలూరు జిల్లా ఆంద్రేయపురానికి చెందిన ఓ వ్యక్తి ఉద్దేశ పూర్వకంగా కార్ల అద్దాలను పగలగొట్టినట్లు స్పష్టమైంది. గతంలో థియేటర్ సిబ్బందితో ఇతనికి జరిగిన గొడవను మనసులో పెట్టుకుని ఈ విధ్వంసానికి పాల్పడినట్లు తెలిసింది. ఎస్సై సురేష్ దీనిపై విచారణ చేస్తున్నారు.

అశ్రునివాళి

కీ॥శే॥ గుళ్ళపల్లి శ్రీనుబాబు గారు

చెరగని చిరునవ్వుతో.. మమతల మాధుర్యాన్ని పంచుతూ.. మంచికి మారుపేరుగా, ఆత్మీయులుగా అందరి మనసుల్లో నిలిచి.. మా అభివృద్ధికి బంగారు బాట వేసి.. మా హృదయాల్లో చెరగని ముద్ర వేసి.. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

తల్లిదండ్రులు : గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు (లేటు) - కస్తూరి
భార్య : గుళ్ళపల్లి శశిపూర్ణిమ కుమార్తె : భవిష్య
తమ్ముడు : గుళ్ళపల్లి రామకృష్ణబాబు - మరదలు : నవీల
తమ్ముని కుమారుడు : గుళ్ళపల్లి పునీత్ సుబ్రహ్మణ్యం, తమ్ముని కుమార్తె : ఆద్య
చెల్లెలు : బోయపాటి శ్రీలత - బావ : బోయపాటి ఫణిరాజశేఖర్
మేనల్లుళ్ళు : ఆశిష్, రోహిత్

పెద్దకర్మ : ది. 17-01-2026 శనివారం నాడు విజయవాడ గురునానక్ కాలని రోడ్డులోని NAC కళ్యాణ వేదిక నందు జరుపబడును.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు

చల్లపల్లి, న్యూస్‌టుడే: నేత్రదానానికి అంగీకరిస్తే మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించిన వారవుతారని వాసవీక్లబ్ అధ్యక్షురాలు అమరవాణి తెలిపారు. హరనాథపురం చెందిన కొల్లిపర నాగేశ్వరరావు (83) మృతదేహం నుంచి కుటుంబ సభ్యులు రెండు కార్నియాలను దానం చేశారు. నాగేశ్వరరావు కుమారులు కొల్లిపర పిచ్చిబాబు, వారి సోదరులు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండటంతో విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది గురువారం వచ్చి కార్నియాలు సేకరించారు. వాసవీ క్లబ్ సభ్యులు తమ్మన సతీష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో సాగర సంగమం కళకళ

హంసలదీవి (కోడూరు), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో మండల పరిధిలోని హంసలదీవిలో గల సాగర సంగమ తీరం శుక్రవారం కళకళలాడింది. కుటుంబ సమేతంగా, స్నేహితులు బృందాలుగా సాగర సంగమానికి కార్లు, ప్రైవేటు వాహనాలతో రావడంతో ఆ ప్రాంతంలో కోలాహలం నెలకొంది.

తీరంలో పర్యాటకులు

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కృషి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు విషయం కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తీసుకెళ్లానని మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. మండలంలోని శీపూడి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గంజి రామదాసు మెమోరియల్ సామాజిక భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని.. దీనికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గుడివాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.300 కోట్లకు పైగా వ్యయంతో పై వంతెన నిర్మాణం, పలు రహదారుల అభివృద్ధికి కేంద్ర నిధులు సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. గంజి రామదాసు విగ్రహావిష్కరణ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ విద్యతో ఉన్నత స్థాయికి ఎలా చేరుకోవచ్చో రామదాసు కుటుంబం మంచి ఉదాహరణ అన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఈవో గంజి కమల వర్ధనరావు మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధికి బాలశౌరి, రాము చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ డిప్యూటీ కార్యదర్శి బండి శ్రీనివాస్, ఆర్డీవో బండి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, సర్పంచి కంభోటి దాసన్న, తదితర సర్పంచి గంజి శివయ్య, జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే రాము

గరికపర్రులో రాత్రివేళ కోడి పందేలు

గరికపర్రు బరిలో గుండాట

అవనిగడ్డలో కోడి పందేలు

అవనిగడ్డ మండలం పులిగడ్డ కొబ్బరితోటలో జూదం

కత్తి దూసిన పందెం కోళ్లు.. చేతులు మారిన రూ.కోట్లు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: సంక్రాంతికి కోళ్లు కత్తులు దూశాయి. నువ్వా.. నేనా అన్నట్లు తలబడ్డాయి. రాత్రి, పగలు జోరుగా పందేలు నడిచాయి. కోడి పందేలు పెద్దఎత్తున నిర్వహించారు. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. గుండాట, జూదాలు నిర్వహించారు. బరుల్లో అధిక ధరలు పెట్టారు. మండలంలో గరికపర్రు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, కుమ్మమూరులో బరులు నిర్వహించారు. మద్యం, బిర్యానీ విక్రయాలు చేశారు. బరుల్లో షామియానాలు వేసి రాత్రి వేళ కూడా ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడి పందేలు, జూదాలు నిర్వహించారు. వల్లూరుపాలెం, గరికపర్రు బరుల్లో ఐదు పందేలు గెలిచిన విజేతలకు బైక్, బుల్లెట్లు బహుమతిగా అందజేశారు. పందేలు తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన కార్లు, వాహనాలతో బరుల ప్రాంగణాలు కిక్కిరిశాయి. రెండు రోజులుగా బరుల్లో రూ.కోట్లల్లో డబ్బులు చేతులు మారాయి.

❖ బరుల్లో కోడి పందేలు రూ.5 వేల నుంచి రూ.2 లక్షలకు పైగా జరిగాయి. పై పందేలు రెట్టింపు స్థాయిలో కాశారు. వేలం పాటలో బరులను దక్కించుకున్న కొందరు సొమ్ములు రాబట్టుకునేలా అధిక ధరలు పెట్టారు. బరుల్లో శీతల పానియాలు, తినుబండారాలు రెట్టింపు స్థాయిలో అమ్మి సొమ్ము చేసుకున్నారు. మద్యం క్వార్టర్ సీసాకు రూ.50 అదనంగా తీసుకుని అమ్మారు.

❖ బరుల్లో విద్యుత్తు సదుపాయం లేనిచోట్ల జనరేటర్లు పెట్టారు. మరి కొన్ని వ్యవసాయ మోటారు విద్యుత్తు ఉపయోగించారు. కొన్నిచోట్ల అటుగా వెళ్లే విద్యుత్తు మెయిన్ లైన్‌కు తీగలు తగిలించి వాడుకున్నారు. బరుల్లో ఇన్ని తంతులు జరుగుతున్నా ఏ అధికారి కన్నెత్తి చూడలేదు. పేరుకే కోడి పందేలు నిర్వహణ కట్టడి చేయటానికి మండల బృందం ఏర్పాటు చేశారు. వారు ఎక్కడా కనిపించక పోవటం విడ్డూరం.

కూచిపూడి: మొవ్వ మండలంలో నిర్వహించిన కోడిపందేల్లో పందెంరాయుళ్లు బుల్లెట్లు సొంతం చేసుకున్నారు. కోళ్ల కొట్లాటలో రూ.లక్షలు చేతులు మారాయి. కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ నుంచి పందెం రాయుళ్లు తరలివచ్చారు.

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా సాగాయి. రూ.లక్షల్లో చేతులు మారాయి. మద్యం ఏరులై పారింది.

అవనిగడ్డ గ్రామీణం: అవనిగడ్డ మండలంలోని పులిగడ్డలో టోల్ ప్లాజా సమీపంలో జూద శిబిరాలు నిర్వహించారు. పులిగడ్డలోని కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన జూద శిబిరం ఏర్పాటు చేశారు.

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గంలో జూద శిబిరాలు అందిన కాడికి అమ్మేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన జూద శిబిరాన్ని రూ.55 లక్షలకు హైదరాబాద్ వారికి ఓ నేత అమ్మి పెట్టారని సమాచారం. టిడ్కో కాలనీ వద్ద గల శిబిరాన్ని ఇతర రాష్ట్రాల వారికి రూ.25 లక్షలకు అమ్మినట్లు తెలిసింది. రామనపూడిలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన జూద శిబిరాన్ని యువనేత ఇతరులకు అమ్మారు. దీంతో నిర్వాహకులు కోడి పందేలు నిర్వహించి సొమ్ము చేసుకున్నారు. రూ.లక్షకు పైగా ఉన్న కోడి పందేలకు బరిలో ప్రతి పందెం నుంచి 20 శాతం వసూలు చేశారు. జూద శిబిరాలు కాయిన్లతో కొనసాగించారు. ఎక్కడా నగదు వినియోగించలేదు. గుడివాడ దనియాలపేటలో మిత్ర పక్ష నేతలు లోపల, బయట ప్రారంభించి తొలిరోజు రాత్రి గొడవ జరగడంతో జూదం నిలిపివేశారు.

విజేతకు బుల్లెట్ బహుమతిగా ఇస్తున్న శివరామప్రసాద్

గుడివాడ : టిడ్కో కాలనీలో గుండాట

బుల్లెట్, స్కూటీ గెలుచుకున్నారు

గరికపర్రు (తోట్లవల్లూరు): మండలంలోని గరికపర్రులో నిర్వహించిన కోడి పందేల్లో యాకమూరుకు చెందిన నవీన్ ఐదు కోడి పందేలు గెలవడంతో బుల్లెట్ గెలుచుకున్నాడు. తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ వాహనం అందజేశారు. అలాగే ఒకరు ఎక్కువ కోడి పందేలు గెలవడంతో స్కూటీ బహుమతిగా అందజేశారు.

పమిడిముక్కల: హనుమంతపురంలో ఏర్పాటు చేసిన బరిలో తొలుత మండల స్థాయి వాలీబాల్ పోటీలు, అనంతరం కోడి పందేలు, పలు రకాల జూదాలు సాగాయి.

ఘంటసాల: ఘంటసాల మండలంలో పాపవినాశనం, కొడాలి, లంకపల్లి గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ముసుగులో భారీగా కోడి పందేలు, జూదం సాగాయి.

భద్రిరాజుపాలెం గ్రామాభివృద్ధికి కృషి

భద్రిరాజుపాలెం (తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: భద్రిరాజుపాలెం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎస్.ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సుధారాణి శుక్రవారం ప్రారంభించారు. కేంద్రానికి 11 కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో బాపిరెడ్డి దంపతులు, చాగంటి తిమ్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభించిన సుధారాణి, పక్కన కృష్ణారెడ్డి తదితరులు

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

తోట్లవల్లూరు: రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార రాజా పేర్కొన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో కస్తూరి బాయి మహిళా మండలి భవనంలో మేఘా సంస్థ ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గ్రామానికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ కృష్ణారెడ్డి, సుధారాణి దంపతులు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బాపిరెడ్డి దంపతులు, సర్పంచి హేమలత, దేవాదాయ శాఖ డైరెక్టర్ చాగంటి తిమ్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం

దోకిపర్రు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని దోకిపర్రు శ్రీభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసం, వారం రోజులుగా నిర్వహిస్తున్న సుందరకాండ సప్తాహం ముగింపు సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, మేఘా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి దంపతులు స్వామి కాలమానిని, దైనందిని ఆవిష్కరించారు.

జూద శిబిరం వద్ద గొడవ

పాతఎడ్లంక (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అవనిగడ్డ మండలం పాత ఎడ్లంకలో కోడి పందెం విషయమై శుక్రవారం ఇరువర్గాలు గొడవకు దిగగా.. పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. నాగాయలంకకు చెందిన ఒక వర్గం వారు, బాపట్ల జిల్లా అడవులదీవి ప్రాంతం వారు రూ.పది వేలకు కోడి పందేం వేశారు. పందెం చివరిలో పోలీసులు రావడంతో అందరూ పారిపోగా.. కోడికి కత్తి కట్టిన అతను, కోళ్ల యజమానులు మిగిలారు. వారు మేం గెలిచామంటే మేం గెలిచామని వాగ్వాదానికి దిగారు. ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో లాఠీఛార్జి చేయగా అందరూ పారిపోయారు.

బరిలో అపశ్రుతి

మోపిదేవి, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారి పక్కన నిర్వహించిన బరిలో అపశ్రుతి చోటు చేసుకుంది. గురువారం బరివద్దకు వెళ్లే క్రమంలో తాత్కాలికంగా వేసిన బాటపై లోపలికి వెళుతున్న కారు బోల్తా కొట్టి మురుగుబోదులోకి పడిపోయింది. జనం అందులో ఉన్నవారిని బయటకు తీశారు. స్వల్ప గాయాలయ్యాయి. కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు. ❖ పందెం నుంచి తప్పుకున్న కత్తి కట్టిన కోడి పారిపోయి అక్కడున్న వ్యక్తులపై దాడి చేసింది. శుక్రవారం కె.కొత్తపాలేనికి చెందిన వ్యక్తిపై అది దాడి చేయగా కాలికి తీవ్ర గాయమైంది.

ఇవి వెలగవా?

216 జాతీయ రహదారిలో పెదప్రోలు అంబేడ్కర్ విగ్రహం నుంచి మచిలీపట్నం బైపాస్ మార్గంలో ఉన్న దీపాలు ఆరునెలలుగా వెలగటం లేదు. దాదాపు 20 లైట్లు వెలగక అంధకారం అలముకుంది. ఫిరాదులొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. –మోపిదేవి, న్యూస్‌టుడే

ఒంగోలు జాతి ఎడ్ల పూటీబండి లాగుడు పోటీలు

కపిలేశ్వరపురం (పమిడిముక్కల), న్యూస్‌టుడే: తెదేపా పమిడిముక్కల మండల శాఖ ఆధ్వర్యంలో కపిలేశ్వపురంలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎడ్ల పూటీ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్ స్థాయి ఎడ్ల పోటీలను గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, స్థానిక పార్టీ నాయకులు ప్రారంభించారు. శుక్రవారం సీనియర్ ఎడ్లజతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఎమ్మెల్యేలు వర్ల కుమార రాజా, యార్లగడ్డ వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ ఎడ్ల పందేలు, రైతుల పాత్ర, ఆంధ్రుల చరిత్రలో సంక్రాంతి సబంరాలు అంశాలపై ప్రసంగించారు.

పోటీలో పరిగెడుతున్న ఎడ్లజత

పంట నష్టపరిహారంలో అవినీతిపై విచారణకు ఆదేశం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: గత ఏడాది సెప్టెంబర్‌లో అకాల వర్షాలకు, కృష్ణానదికి భారీ వరద రావడంతో లంకల్లో, మాగాణి భూముల్లో సాగు చేసిన పసుపు, కంద, అరటి, తమలపాకు, మొక్కజొన్న, బొప్పాయి, కూరగాయ తోటలు తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిని వందలాది మంది రైతులు నష్టపోయారు. నష్టపరిహారంలో బినామీ రైతులు లబ్ధి పొందారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా విచారణ సక్రమంగా చేయలేదని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు. ఈ అవినీతి ఆరోపణలపై 2025 డిసెంబరు 29న వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌కు రాష్ట్ర సచివాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరులోని ఉద్యాన శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అడిషనల్ సెక్రటరీ ఎస్.కోటేశ్వరమ్మ 2026 జనవరి 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో పని చేసిన మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి అవినీతికి పాల్పడి, బినామీ రైతుల పేర్లతో సుమారు రూ.1.50 కోట్లు డ్రా చేసి అక్రమాలకు పాల్పడినట్లు తాను ఫిర్యాదు చేశానని శ్రీనివాస గౌడ్ తెలిపారు. అక్రమాలు జరగడం వల్లే తోట్లవల్లూరు మండలంలోని ప్రతి పంచాయతీలో నోటీస్ బోర్డులో నష్టపోయిన రైతుల జాబితాలు ప్రకటించలేదని ఆయన పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణలు

ముళ్లపూడి (పమిడిముక్కల), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా గురు, శుక్రవారాల్లో ముళ్లపూడిలో స్థానిక సీతా రామాంజనేయ దేవస్థానం, సమైక్యత మండలి ఆధ్వర్యంలో పలు ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచి పక్కాల అంజిబాబు బహుమతులు అందజేశారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక యువతను అభినందించారు.

నాగాయలంక: మండవ వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగాయలంక కృష్ణానదీ తీరాన శ్రీరామపాద క్షేత్రంలో సంక్రాంతి వేడుకలు చేశారు.

కూచిపూడి : ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందిస్తూ

చినముత్తేవిలో...

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న వాసుదేవ సోదరులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కూచిపూడి: రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం (కూచిపూడి), మొవ్వ మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ కూచిపూడి వారి సహకారంతో కూచిపూడిలో నిర్వహించిన ముగ్గుల పోటీలో 113 మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో రూ.5,116, రూ.3,116, రూ.2,116, రూ.1,116 వరుసగా నాలుగు బహుమతులతో పాటు ప్రతి మహిళలకు బహుమతి అందించారు. న్యాయనిర్ణేతలుగా జొన్నలగడ్డ అరుణకుమారి, మేకా రాణి వ్యవహరించారు. కూచిపూడి రోటరీ అధ్యక్షుడు జొన్నలగడ్డ హనుమకుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, రోటరీ సభ్యులు పాగోలు రమేష్‌బాబు, కోనేరు లక్ష్మణ్, మద్దాల కామేశ్వరరావు, మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, వైద్యులు లిల్లీపాల్, శ్రావణి, హారిక, పీఆర్వో తాతా గణేష్ పాల్గొన్నారు. అలాగే మొవ్వ మండలం చినముత్తేవిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలలో ముగ్గుల, వివిధ పోటీలు నిర్వహించి.. బహుమతులు అందించారు.

కబడ్డీ విజేత అవనిగడ్డ పీఆర్ జట్టు

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వేకనూరులో గ్రామానికి చెందిన విశ్వనాధుని శ్రీనివాసులు మెమోరియల్ జడ్పీ పాఠశాల దాతల ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అవనిగడ్డకు చెందిన పీఆర్ జట్టు విజేతగా నిలచి రూ.10,116 అందుకుంది. పృథ్వీ ఫ్రెండ్ సర్కిల్ తలగడదీవి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు విశ్వనాథుని వాసుదేవ, సోదరులు బహుమతులు గురువారం అందజేశారు.

అయ్యప్పస్వామి క్షేత్రానికి విరాళాలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్య క్షేత్రమైన చల్లపల్లిలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రానికి దాతలు శుక్రవారం విరాళాలు అందించారు. రావెళ్ల కృష్ణ సేవాసమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ ఆలయ అభివృద్ధికి రూ.25 వేలు వితరణగా ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండు రంగారావుకు అందించారు. అయ్యప్ప స్వామి క్షేత్ర పరివార దేవతలకు వెండి ఆభరణాల నిమిత్తం 250 గ్రాముల వెండిని యడవల్లి అయ్యప్ప కృష్ణ చైతన్య-పావని దంపతులు, వారి కుమారుడు మణికంఠ వితరణగా అందించారు. ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండు రంగారావు, కమిటీ పెద్దలు ఆకుల పృథ్వీ, తుమ్మల వెంకటేశ్వరరావు దాతలను ఘనంగా సన్మానించారు.

రామానగరం ఆలయాల్లో చోరీ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం రామానగరం క్లబ్‌రోడ్ పక్కన ఉన్న కోదండ రామాలయం, గంగానమ్మ ఆలయాల్లో శుక్రవారం చోరీ చేశారు. దొంగలు రామాలయం తలుపులు పగలగొట్టి.. ఆలయంలోని హుండీ తాళం ధ్వంసం చేసి కానుకలు ఎత్తుకెళ్లారు. సమీపంలోని గంగానమ్మ ఆలయంలోని హుండీని కూడా ఇదే రీతిలో పగలకొట్టి కానుకలు తీసుకుని హుండీలను పక్కన పడేశారు. పూజారి రాఘవయ్య శుక్రవారం ఉదయం గుడికి వెళ్లగా చోరీ జరిగినట్లు తెలుసుకుని చల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుండీల్లో ఎంతమేరకు కానుకలు ఉండవచ్చన్నది తెలియలేదు. సీఐ కె.ఈశ్వరరావు పోలీస్ సిబ్బందితో ఆలయాలకు చేరుకుని పరిసరాలు పరిశీలించారు. మచిలీపట్నం నుంచి క్లూస్‌టీమ్ బృందం వచ్చి ఆధారాలు సేకరించినట్లు సీఐ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పేదలకు చీరల పంపిణీ

కోసూరుపాలెం (మోపిదేవి): రెవెన్యూ అధికారులు నిరుపేద ఎస్టీ కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. 30 మందికి వితరణగా వీఆర్వో రమణ తదితరులు సమకూర్చారు. తహసీల్దార్ హరనాథ్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు..

శిఖామణి ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

పామర్రు, న్యూస్‌టుడే: చాట్ల శిఖామణి 34వ వర్ధంతిని స్థానిక చాట్లవానిపురంలోని సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ మండల కార్యదర్శి ఒ.గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శిఖామణి స్థూపంపై పార్టీ శాఖ కార్యదర్శి చాట్ల రాంబాబు జెండా ఎగురవేయగా.. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శివ నాగేంద్రం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేంద్ర బహుమతులు అందజేశారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆదిశేషు విప్లవ గీతాలతో నివాళి అర్పించారు. జిల్లా కమిటీ సభ్యుడు శివ నాగేంద్ర మాట్లాడుతూ శిఖామణి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని చెప్పారు. చాట్ల శ్రీనివాసరావు, అనూష, వెంకటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులకు వితరణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక పురాతన శివాలయంలో సుందరీకరణ పనులకు కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్తి గోపాలకృష్ణ ప్రసాద్ కుమారుడు శ్రీరామ్ శుక్రవారం రూ.10 వేలు తండ్రి ద్వారా ఆలయ కమిటీ ఛైర్మన్ ఘంటసాల కన్నయ్యకు అందించారు.

శతాధిక వృద్ధుడి మృతి

వక్కలగడ్డ (చల్లపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని వక్కలగడ్డలో శతాధిక వృద్ధుడు దాసి సుబ్బారావు (102) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవలే దాసి వంశం వారు సుబ్బారావు, నాంచారమ్మ దంపతులను నూతన దుస్తులు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

70 మంది జూదరుల అరెస్టు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తున్న 70 మందిని అరెస్టు చేసి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎన్.చంటిబాబు శుక్రవారం తెలిపారు.

నందీశ్వరుడికి బియ్యంతో పూజలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక పురాతన శివాలయంలో అమావాస్య ముందు వచ్చే బహుళ త్రయోదశి పురస్కరించుకుని శుక్రవారం నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘంటసాల పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కనుమ పండగ పురస్కరించుకుని పశువులకు పూజలు చేయడం ఆనవాయితీ. బియ్యంతో నందీశ్వరునికి పూజలు, అభిషేకం చేశారు. ❖ శనివారం మాస శివరాత్రి పురస్కరించుకుని శివునికి అన్నాభిషేకం చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నందికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా ఉభయ ముక్తేశ్వరస్వామి గ్రామోత్సవం

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వేకనూరులోని గంగా పార్వతీ సమేత ఉభయ ముక్తేశ్వరస్వామి ఆలయంలో కనుమ పండగ ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు నేతృత్వంలో రుత్విక్‌లు ఉభయ ముక్తేశ్వర స్వామికి పంచామృత గోక్షీర అభిషేకాలు చేశారు. పార్వతి అమ్మవారికి శ్రీ చక్రపూజ, సహస్ర నామార్చనలు నిర్వహించారు. స్థానిక భక్త సమాజం లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి.. మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ఉత్సవమూర్తులకు వార పోసి కర్పూర హారతులు సమర్పించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలో తెదేపా నాయకుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బండి పరాత్పరరావు ఇంట్లో డాక్టర్ బండి రమ్య ఆధ్వర్యంలో చిన్నారులు వల్లభనేని శ్రావ్య, సాయి సాన్విక, ధృతి కృష్ణ, దేవిసంహిత బొమ్మల కొలువును తీర్చిదిద్దారు. గ్రామీణ ప్రాంతం, దేవతామూర్తుల విగ్రహాలు తదితర 100కు పైగా చిన్న విగ్రహాలతో అలంకరించారు. బొమ్మల కొలువును బంధుమిత్రులు తిలకించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఐనపూరు (పమిడిముక్కల), న్యూస్‌టుడే: ఐనపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2007- 08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు టి.వేణుగోపాలరావును సత్కరించారు.

పూర్వ విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు

పాఠశాల అభివృద్ధిపై చర్చ

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి, పూర్వ విద్యార్థుల, ఆహ్వాన కమిటీల సభ్యులు గురువారం పాఠశాలలో సమావేశమయ్యారు. మాజీ సర్పంచి రావి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా మధుర స్మృతులను, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. కంఠంనేని కుటుంబరావు, వైద్యులు రావి శ్రీనివాసరావు, ఉప సర్పంచి కోనేరు సుందర్‌సింగ్, రావి పవన్, రమణబాబు తదితరులు 150 మంది పాల్గొన్నారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం జనవరి 17, 2026 5

సంక్రాంతి వైభవం.. కనుమా!

ఆనంద పరవశం..
కంకిపాడు: ఈడుపుగల్లులో కోడిపందేలు తిలకిస్తూ..

కంకిపాడు: ఉప్పలూరులో భారీ బరులు

రంగవల్లుల వైభవం
వీరులపాడు: పెద్దాపురంలో....

ఊరంతా రంగవల్లులు...
వీధివీధిన గొబ్బెమ్మలు...

ఆకాశాన పతంగులు..
అపురూప పిండివంటలు..

కదలి వచ్చిన బసవన్న..
శుభము పలికిన హరిదాసన్న..

ముద్దులొలికిన పరికిణీలు..
ముచ్చటగొలిపిన పట్టుపంచెలు..

కత్తి దూసిన పందెంకోడి..
కనులారా చూడ తరలివచ్చారండి..

సరిలేని సంప్రదాయ క్రీడలు..
సగర్వమైన సాంస్కృతిక కళలు..

పుడమి పుత్రుని రాజసం..
పరవశించె సకల జగం..

భాగ్యములొసగిన భోగి..
కాంతులు నింపిన సంక్రాంతి..
ఆనంద వైభవం కనుమా...

మూడు రోజుల పండగ..
మురిసె మోము నిండుగా..

– అమరావతి డెస్క్

భళారే బొమ్మల కొలువు:
మైలవరం: లీలావతి గిరిజన పాఠశాలలో సందడి

హరిలో రంగ హరి
గంపలగూడెంలో కానుకలు స్వీకరిస్తున్న హరిదాసు

పొంగళ్లు సిద్ధమండి
నందిగామ గ్రామీణం: మునగచర్లలో

బందరు: మేకావానిపాలెంలో విజేతలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన బుల్లెట్, తదితర వస్తువులు

జన జాతర
ఈడుపుగల్లులో జూద క్రీడల శిబిరాల వద్ద..

పండగంతా ఇక్కడే
ఉప్పలూరులో కోడి పందేలు ఆడేందుకు వచ్చిన వారి కార్లు..

రైతే రాజని..
గంపలగూడెం: పెనుగొలనులో అన్నదాతలకు సత్కారం

సై..
నువ్వా.. నేనా..!

తగ్గేదేలె..
ఈడుపుగల్లులో జూద శిబిరం...

ఆట.. పాట..
జగ్గయ్యపేట: ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం తదితరుల నృత్యం



అలరించే కళ
నాగాయలంక : నటరాజ్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన

వృషభ రాజసం
ఘంటసాల: పశు ప్రదర్శన పోటీల సందడి

కొ..క్కొ..కొ..క్కొ..కోట్లు

జోరుగా జూదాలు.. పలుచోట్ల ఘర్షణలు

రామవరప్పాడులో పొట్టేళ్ల పందేలను వీక్షిస్తున్న జనం..

కోడిపందేలు, జూదం జోరు కనుమ వరకు పెద్దఎత్తున కొనసాగింది. గోదావరి జిల్లాలను తలపించే స్థాయిలో ఉమ్మడి కృష్ణాలో ఈసారి క్యాసినో, హైటెక్ బరులు వెలిశాయి. విజయవాడ నగరంలో ఇద్దరు ఎమ్మెల్యేలు పోటాపోటీగా బరులు వేయడంతో గతంలో ఎన్నడూ లేనంతగా కోడిపందేలు, జూదాలు భారీగా జరిగాయి. గుణదల-రామవరప్పాడు మధ్యలో, నున్న పవర్‌గ్రిడ్ మార్గంలో, అంబాపురం, హైదరాబాద్ వెళ్లే మార్గం, పాముల కాల్వ వద్ద, తిరువూరు, విస్సన్నపేట తదితర ప్రాంతాల్లో క్యాసినో తరహా హైటెక్ బరుల్లో రూ.కోట్లు ఎగిరాయి.

కాయ్ రాజా కాయ్...

సంక్రాంతి, కనుమ రోజుల్లో పెద్దఎత్తున ప్రజలు బరుల వద్దకు తరలివచ్చారు. పలుచోట్ల కూలినాలి చేసుకునేవారు పందేలు కాసి భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.లక్షలు పోగొట్టుకొని దిగాలుగా వెనుదిరిగారు. దాదాపు అన్ని బరుల వద్ద మహిళలు, పిల్లలు కనిపించారు. గుండాట, కాయ్ రాజా కాయ్ వంటి ఆటల్లో డబ్బులు పోగొట్టుకొని వెనుదిరిగారు.

తాగుడు.. తన్నుడు..

మద్యం ఏరులై పారడంతో గొడవలు కూడా ఎక్కువగానే జరిగాయి. అవనిగడ్డ పరిధిలోని పులిగడ్డ, కంకిపాడు దగ్గర ఉప్పులూరు, పెదపారుపూడి పరిధిలోని భూషణగుళ్ల, ఇబ్రహీంపట్నం లోని కేతనకొండ, మైలవరం మండలంలోని పొందుగుల తదితరచోట్ల ఘర్షణలు జరిగాయి.

అప్పులు చేసి మరీ...

రూ.లక్షలు పోయినా జూదరులు వెనక్కి తగ్గకుండా అప్పులు చేసి మరీ పందేలకు దిగారు.

సరిహద్దుల నుంచి జూదరులు...

■ తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాలకు ఖమ్మం, నల్గొండ జిల్లాలు సరిహద్దు కావడంతో పెద్దఎత్తున జూదరులు తరలి వచ్చారు. మూడు రోజుల ముందే పోలీసులు, అధికారులు, బరుల నిర్వాహకుల సమక్షంలో గదులు, హోటళ్లలో అద్దెకు దిగి రూ.కోట్లల్లో పందేలు కాశారు.

■ తిరువూరు ఆర్డీవో కార్యాలయం పక్కనే మామిడితోటలో, ముత్తగూడెం రోడ్డు తెలంగాణ సరిహద్దు, సంత మార్కెట్ తదితర చోట్ల కోడిపందేల మాటున భారీగా కోతముక్క నిర్వహించారు. హైటెక్ బరుల్లో కోడిపందేల కంటే కోతముక్క, గుండాట ఇతర జూదాల్లో రూ.కోట్లు ఎగిరాయి.

■ విస్సన్నపేట పరిధిలోని తాటకుంట్లలో పొలాల్లో ఏసీ గదుల సెట్టింగ్ వేసుకొని కోతముక్క నిర్వహించారు. క్యాసినో తరహా బరిలో భారీగా నగదు చేతులు మారింది.

ఇదే అదునుగా పలువురు శిబిరాల్లో రూ.వందకు గంటల లెక్కన రూ.10-100 వరకు వడ్డీలకు తిప్పారు. పలుచోట్ల డబ్బుల విషయంలో కొట్లాటలు జరిగాయి. నగదు లావాదేవీలకు క్యూఆర్ కోడ్ స్కాన్.. నగదు చెల్లింపులకు మిషన్లు.. ప్రత్యేక స్టాల్స్‌లో ఏటీఎం, క్రెడిట్ కార్డులు, యూపీఐలపై నగదు ఇచ్చారు. పలుచోట్ల బరుల వద్దే ఫైనాన్స్ ప్రతినిధులు ఆభరణాలు తాకట్టు పెట్టుకొని నగదు ఇచ్చే సదుపాయం కల్పించారు.

– ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం, న్యూస్‌టుడే బృందం

మాయగాళ్లు... అద్దెరిపోవాల్సిందే!

- అద్దె ఖాతాల గుట్టు రట్టు సులభం ఇక...
- బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చిన పోలీసులు

ఈనాడు, అమరావతి

చట్టవ్యతిరేక కార్యకలాపాల్తో నగదు లావాదేవీలకు ఉపయోగించేందుకు సైబర్ నేరగాళ్లు ముఠాలు అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఆనక వీటిని ఖండాలు దాటించి నేరాలకు చేరుస్తున్నారు. వీటితో పెద్దఎత్తున బెట్టింగ్, సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్ము బదిలీ చేస్తున్నారు. చివరకు దర్యాప్తులో అమాయకులే దొరుకుతున్నారు. ఏళ్లతరబడి ఇవి వెలుగు చూస్తున్నాయి. బ్యాంకర్ల స్థాయిలోనే పసిగట్టి వివరాలు రాబట్టేలా వారికి పోలీసులు ప్రత్యేకంగా లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.

తొలి దశలో నగర బ్యాంకుల్లో..

డబ్బు ఆశ చూపించి కరెంట్ ఖాతాలు తెరిపించి, వాటిని ఫిలిప్పీన్స్ పంపిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఇది వెలుగుచూసింది. ఈనేపథ్యంలో జిల్లా సీపీ రాజశేఖర్ బాబు.. బ్యాంకర్లతో సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణకు.. వారికి క్రెడెన్షియల్ ఇచ్చారు. దీనిని ప్రయోగాత్మకంగా నగరంలోని బ్యాంకులు, వాటి శాఖల్లో అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా విస్తరిస్తారు. తమ శాఖల్లో అనుమానాస్పద ఖాతాలు, లావాదేవీలను గుర్తిస్తే.. ఆ వివరాలను ఇందులో నమోదు చేస్తారు. ఇవి పోలీసులకు చేరతాయి. ఇప్పటి వరకు లాగిన్‌లో నమోదైన అనుమానాస్పద ఖాతాల వివరాలను పోలీసులు బ్యాక్ ఎండ్‌లో పరిశీలిస్తున్నారు.

బ్యాంకుకో కానిస్టేబుల్..

సైబర్ నేరాలపై అవగాహన కోసం పోలీసులు ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్ రూపొందించారు. ఇందులో సైబర్ సురక్ష పేరుతో ఒక ఆప్షన్ పెట్టారు. నగదు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వెళ్తున్న ఖాతాదారులకు ఏ ఆధారం పరిశీలించి ... ప్రతి ఒక్కరూ ఇందులోకి వెళ్లి డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించే అంశాలను చదివాకే ఓటీపీ వస్తుంది. తర్వాతే బ్యాంకర్లు నగదు బదిలీకి అనుమతిస్తారు. ఓటీపీ పరిశీలనకూ బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఇప్పటికి 4,329 మంది ఇందులోకి లాగిన్ అయి తెలుసుకున్నారు. ఇందుకు ప్రతి బ్యాంకుకు ఒక కానిస్టేబుల్‌ను కేటాయించగా బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు వీరు డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పిస్తున్నారు.

ఔనంటే ఎరువు.. కాదంటే దరువు!

ఈనాడు, అమరావతి

అడ్డగోలు ధరలకు యూరియా అమ్మకాలు

తిరువూరు: మునుకుళ్ల సొసైటీలో యూరియా కోసం పడిగాపులు

యూరియా కృత్రిమ కొరత సృష్టించడం.. అధిక ధరలకు అమ్మడం.. తెలంగాణకు అక్రమ రవాణా... ఇలా యూరియా అమ్మకాల్లో ఏ అడ్డగోలు వ్యవహారానికీ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోయారు. విజిలెన్స్ తనిఖీల పేరిట కంటితుడుపు సోదాలు చేయించడం తప్ప... దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడంతో.. . వ్యాపారులు మేమింతే మారమింతే అన్నట్లు అదే దందా చేస్తున్నారు.

చీమకుట్టినట్లైనా లేదే...

● జిల్లాలో వరి, మొక్కజొన్న, మిరప, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు సాగు నేపథ్యంలో యూరియా డిమాండ్ ఎక్కువగా ఉంది. ● సొసైటీల్లో వచ్చిన నిల్వలు అందరికీ సరిపోకపోవడంతో తప్పక ప్రైవేటు దుకాణాల్లో కొంటున్నారు. ● ఇదేఅదునుగా రూ.266.50లకు అమ్మాల్సిన బస్తా యూరియా రూ.350-400లకు అమ్మేస్తున్నారు. ● నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో అధిక ధరలకు అమ్మి హద్దులు దాటిస్తున్నారు. ● ఈ దందాపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురించగా నందిగామ, తిరువూరు, విస్సన్నపేటలో విజిలెన్స్ తనిఖీలు మొక్కుబడిగా చేపట్టారు. ● నందిగామ, తిరువూరులో కొన్ని దుకాణాల నిర్వాహకులకు షోకాజ్‌లిచ్చి మమ అన్పించారు. ● అధిక ధరలు, అక్రమ రవాణా పరిశీలించకుండా దస్త్రాలు చూసి సరిపెట్టారు. ● విస్సన్నపేటలో అయితే అంతా బాగుందని ధ్రువీకరించారు.

మోత మోగుతోంది...

❖ ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని తిరువూరులో ఓ రైతుతో రూ.5 వేల విలువైన కాంప్లెక్స్ ఎరువులు కొన్పించారు.
❖ నందిగామలో ఓ రైతు రెండు బస్తాల యూరియా కావాలంటే... మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువు తీసుకుంటేనే ఇస్తామని తెగేసి చెప్పడంతో చేసేది లేక రూ.5 వేల విలువైన ఎరువును అవసరం లేకున్నా కొన్నారు. * ఇలా దుకాణాల్లో కొనే స్థోమత లేక సొసైటీలకు వెళితే అక్కడ గోరంత నిల్వకు బోలెడంత మంది రైతులు పడిగాపులు కాస్తున్నారు.
❖ ఉదయం వెళితే సాయంత్రమైనా యూరియా దొరుకుతుందో లేదో గ్యారెంటీ లేదు. నిల్వ అయిపోతే మళ్లీ వచ్చినప్పుడు ఇస్తామని కాగితంపై రాసి పంపుతున్నారు.

నిల్వలు పెంచుతాం...

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. అధిక ధరలకు అమ్మే దుకాణదారులపై తప్పక చర్యలు తీసుకుంటామనీ.. సొసైటీల్లో నిల్వలు పెంచేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

తాగినోళ్లకు.. తాగినంత!

- జూద శిబిరాల వద్ద అనధికార అమ్మకాలు
- చాలాచోట్ల రెట్టింపు ధరలు వసూలు

ఈనాడు - అమరావతి: సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బరుల వద్ద మద్యం ఏరులై పారింది. కోడి పందేల శిబిరాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పెద్ద, చిన్న బరులు పెద్దసంఖ్యలో ఈసారి ఏర్పాటయ్యాయి. వీటిల్లో అనధికార మద్యం దుకాణాలు వెలిశాయి. భోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా మూడు రోజులు జూద క్రీడలు, కోడిపందేలు పెద్దఎత్తున నిర్వహించారు. శిబిరాల బయట, లోపల జోరుగా మద్యం అమ్మకాలు సాగాయి. సందట్లో సడేమియా అన్నట్లు నిర్వాహకులు రద్దీని సొమ్ము చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు భారీగా జరిగాయి. పందేలు వేసేందుకు పెద్దసంఖ్యలో రావడంతో చాలాచోట్ల రెట్టింపు ధరలకు అమ్మారు.

పెడనలో మద్యం కౌంటర్

చెంతకే మద్యం...

★ ఈడ్పుగల్లు, కేసరపల్లి, గుడివాడ, విస్సన్నపేట మండలం తాటకుంట్ల, రామవరప్పాడు, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బరుల్లో క్యాసినో తరహా జూదక్రీడలు జరిగాయి. వీటిల్లో నేరుగా పందెం రాయుళ్ల వద్దకే మద్యం సరఫరా చేశారు. శిబిరాల్లో మద్యం అమ్మకాలు నిర్వాహకులకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. దాదాపు అన్నిచోట్లా శిబిరాలను రాజకీయ నేతల కనుసన్నల్లోనే ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలోని మద్యం సిండికేట్ నుంచే శిబిరాలకు సరఫరా అయింది.

★ అన్ని శిబిరాల నిర్వాహకులు పెద్దఎత్తున స్టాక్‌ను సమకూర్చుకుని బరుల వద్దకు వాహనాల్లో తెచ్చారు. బరుల బయట కూడా అమ్మకాల కోసం శీతల పానీయాల దుకాణదారులతో ఒప్పందం చేసుకుని.. వారి ద్వారా అమ్మించారు. శిబిరాల్లో మాత్రం పూర్తిగా నేతలే విక్రయాలు సాగించారు. పలు శిబిరాల్లో బహిరంగంగానే లూజ్‌గా కూడా అమ్మారు. పందెం కాసేందుకు వచ్చే వాళ్ల రెట్టింపు ధరలు పెట్టినా కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల నేతలు వేలం వేసి.. ఎక్కువ పాట పాడిన వారికి మద్యం అమ్మకాల కాంట్రాక్టును కట్టబెట్టారు.

★ ఎన్టీఆర్ జిల్లాలో నిరుడు జనవరిలో రూ. 65 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరిగాయి. ఐఎంఎల్ 80,197 కార్టన్లు, బీర్.. 43,605 కార్టన్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది అమ్మకాలు పెరిగాయి. ఐఎంఎల్.. 1,12,957 కార్టన్లు, బీర్.. 39,171 పెట్టెలు విక్రయాలు జరిగాయి. వీటి విలువ రూ.80 కోట్లు. ఈ విక్రయాల్లో ఎక్కువ భాగంగా కోడిపందేల శిబిరాలకు తరలినట్లు తెలిసింది.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08517 ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3.50గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 19వ తేదీ ఉదయం 7.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 08518 చర్లపల్లిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 12.30గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట స్టేషన్లలో ఆగుతుంది.

వై జంక్షన్ సర్వీసు రోడ్డు పునరుద్ధరణ

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్ బయలుదేరుతున్నారు. వీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెళ్లటానికి జాతీయ రహదారిపై నందిగామ వై జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డును పునరుద్ధరించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల వాహనాలు ఆగకుండా ముందస్తుగా అధ్వానంగా ఉన్న సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేశారు. ఆ రోడ్డుపై వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ ఆగిపోతే ఎత్తువంతెన మీదుగా పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఫ్లైఓవర్ పైన కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డును సిద్ధం చేశారు. పండగ సెలవులు ముగియటంతో కొంత మంది శుక్రవారం మధ్యాహ్నం నుంచే హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో హైవేపై వాహనాల సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, నందిగామ

నకిలీ అనుకున్నా... నిజమే

- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- రూ.5వేలు వచ్చాయంటే నమ్మొద్దు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

'మొదట ఇది నకిలీ అనుకున్నారు, కానీ నిజంగా నాకు రూ.5వేలు వచ్చింది. మీరు కూడా ప్రయత్నించి చూడండి..!'

సంక్రాంతి సందర్భంగా ఫోన్ పే పేరుతో సామాజిక మాధ్యమాల్లో 'లింక్'తో వచ్చిన సందేశం ఇది. ఈ లింక్ క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఇలాంటి లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

లింక్‌తో పొంచి ఉన్న ప్రమాదం.. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు ఇలాంటి లింక్‌లను సృష్టించి దానికి ఆకర్షణీయమైన సందేశం పెట్టి సామాజిక మాధ్యమాల్లో పెడతారు. వీటిని నమ్మి ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే వారి చరవాణి హ్యాక్ అవుతుంది. దానిలో ఉన్న సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. ఆ తరువాత మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేస్తారు.

సామాజిక మాధ్యమాల్లో లింక్‌తో కూడిన సందేశం

బహుమతులు ఊరికే ఇవ్వరు.. పండగ రోజు ఊరికే ఎవరూ బహుమతులు ఇవ్వరని పోలీసులు చెబుతున్నారు. క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయనేది పూర్తిగా తప్పు అని, ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగమని హెచ్చరిస్తున్నారు. మీకు తెలిసిన వ్యక్తులు ఈ లింక్ మీకు ఫార్వర్డ్ చేసినా వాటిని నమ్మవద్దని సూచిస్తున్నారు. ఎవరైనా లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే తక్షణం 1930కి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

పెట్టుబడి ఒక్కసారి... ఆదాయం 20 ఏళ్లు

రైతేరాజు

కరివేపాకు సాగులో కౌలు రైతుకు లాభాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కరివేపాకు పంటపై ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్లు నికర ఆదాయం వస్తుంది. ఒక్కసారి ఈ పంటపై పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్లపాటు నికర ఆదాయానిస్తుంది. నీటివసతి ఉన్న రైతులు ఈ పంటసాగు చేస్తే వ్యాపారులే పొలాలకు వచ్చి కొనుగోలు చేస్తారు. పాతకంచల గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి సీతయ్య కంచికచర్ల మండలం కీసరలో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. మూడేళ్ల క్రితం గుంటూరు జిల్లా పెద వడ్లపూడి రైతుల నుంచి కరివేపాకు విత్తనాలు కొన్నారు. ఎకరాకు వంద కిలోల విత్తనం వేశారు. ఇందుకు రూ. 2.50 లక్షలు కాగా, రూ. 5 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేసి పంటకు నీటి తడులిస్తున్నారు. నాలుగు నెలలకు ఒకసారి కరివేపాకు కోస్తారు. ఇలా ఏడాదిలో మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు సరాసరి ఒక్కో కోతకు అయిదు టన్నులు వస్తుంది. టన్ను రూ. 20 వేల వంతున పెదవడ్లపూడి, కుంచనపల్లి వ్యాపారులు కొన్నారు. మూడు కోతల్లో ఎనిమిది ఎకరాలపై 120 టన్నుల దిగుబడి రాగా రూ. 20 లక్షల ఆదాయం వచ్చింది. తొలి ఏడాది రూ. 12 లక్షలు పెట్టుబడి పోగా రూ. 8 లక్షల ఆదాయం సమకూరింది. రెండో ఏడాది పెట్టుబడి తగ్గింది. మొక్కలు ఎదగడానికి మందుల పిచికారీ, కూలీల, కౌలు ఖర్చులు పోగా ఏడాదికి రూ. 10 లక్షల ఆదాయం వస్తోంది. 20 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. వ్యాపారులు కరివేపాకును చిత్తూరు, విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.



కరివేపాకు తోటలో రైతు సీతయ్య

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న : కూరమిరప (బెంగళూరు మిర్చి) రకాలను తెలపండి?

- బి.వెంకట్, రైతు, పూషడం

సమాధానం : కూరమిరపలో 4 రకాలుగా ఉన్నాయి. ● **కాలిఫోర్నియా వండర్ :** కాయలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పంట కాలం 140-150 రోజులు. దిగుబడి ఎకరాకు 6-8 టన్నులు వస్తుంది. ● **అర్కగౌరవ్ :** లేత కాయలు ముదురాకు పచ్చగా ఉండి, పూర్తిగా పెరిగిన దశలో నారింజ రంగుకు మారుతాయి. కాయలు చాలా పెద్దవిగా ఉంటాయి. కాయ బరువు 180- 200 గ్రాములు ఉంటాయి. పంట కాలం 120 రోజులు. హెక్టారుకు దిగుబడి 6-8 టన్నులు వస్తుంది. ● **అర్కబసంత్ :** కాయలు లేత పసుపు రంగులో ఉంటాయి. పంటకాలం 125- 140 రోజులకు వస్తుంది. ఎకరాకు దిగుబడి 6-7 టన్నులు. ● **భారత్ (హైబ్రిడ్) :** కాయలు ముదురాకు పచ్చగా ఉంటాయి. పంట దిగుబడి హెక్టారుకు 14- 16 టన్నులు దిగుబడి వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

కొబ్బరి తోటల విస్తరణకు ప్రాధాన్యం

విజయవాడ కేంద్రంగా కొబ్బరి బోర్డు కొనసాగుతున్నా.. తెలంగాణలోనూ కొబ్బరి తోటల విస్తరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని కొబ్బరి అభివృద్ధి మండలి (సీడీబీ) ఉప సంచాలకుడు డాక్టర్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొత్తగా 500 హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించాలని ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అశ్వారావుపేటకు శుక్రవారం వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

హెక్టారుకు రూ.56వేల రాయితీ.. కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ. 56వేల రాయితీని సీడీబీ అందజేస్తుంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు రాయితీ లభిస్తుంది. ఆరునెలల వయసున్న తోటల నుంచి కొత్తగా తోటల పెంపకానికి సిద్ధమవుతున్న రైతులందరూ అర్హులే. కొత్తగా తోటలు వేసేవారు మొక్కలు నాటి క్షేత్రంలో జియోట్యాగ్ ఫొటోతో దరఖాస్తుకు జతపరచాలి. కొబ్బరి నర్సరీల ఏర్పాటుకూ సీడీబీ రాయితీ ఇస్తుంది. ఒక్కో నర్సరీలో గరిష్ఠంగా 10వేల మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్కకు రూ. 22 రాయితీ వర్తిస్తుంది.

సీడీబీ ఉప సంచాలకుడు మంజునాథరెడ్డి

అందుబాటులో బీమా పథకం.. కొబ్బరి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కేరా సురక్ష పథకం కింద రైతుకు రూ. 143, కూలీకి రూ. 143 కలిపి ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తే సీడీబీ రూ. 813 భరిస్తుంది. ప్రమాదంలో మృతిచెందితే బాధిత కుటుంబాలకు రూ. 7లక్షల చొప్పున పరిహారం అందుతుంది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ. 3లక్షలు, పెద్ద పరిశ్రమలకు 25శాతం లేదా రూ. 3కోట్ల వరకు రాయితీ పొందే వీలుంది. ఉద్యానశాఖ ద్వారా అంతరపంటల సాగు, బిందు సేద్యం పరికరాలకూ సాయం పొందొచ్చు.

బెండలో తెల్లదోమ నివారణ

– ఘంటసాల, న్యూస్‌టుడే

బెండ సాగులో తెల్లదోమ నివారణకు ఉద్యానశాఖ పొన్నూరు విస్తరణాధికారి ఎం.శ్రేయ సూచనలు చేశారు. పంట పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చేస్తాయి. దీంతో ఆకులు పసుపు రంగులోకి మారతాయి. అవి శుంఖు రోగాన్ని వ్యాప్తి చేస్తాయి. తద్వారా ఆకులకు నష్టం జరుగుతుంది. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. పసుపు రంగు డబ్బాలకు గ్రీజు లేదా అముదం పూసి పొలంలో అక్కడక్కడ పెట్టి తెల్లదోమలను ఆకర్షింపజేసి నాశనం చేయాలి. దీపపు పురుగు సోకినప్పుడు ఆకుల పైకి దోనె మాదిరిగా ముడుచుకుని పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు మిథైల్ డెమెటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా తెగులును నివారించవచ్చు. బెండసాగులో ఆది నుంచి సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. సాగు ఆరంభం నుంచి వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది. **– పొన్నూరు, న్యూస్‌టుడే**

బెండ తోట

ఒక్కరోజే రూ.22.01 లక్షల ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా శుక్రవారం రికార్డు స్థాయిలో రూ. 22.01 లక్షల ఆదాయం దర్శనం టికెట్ల రూపంలో వచ్చినట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. ప్రస్తుతం రెట్టింపు ఆదాయం రావడానికి కారణం స్కానింగ్ పాయింట్ వద్ద పాలకమండలి సభ్యులతో కలిసి పర్యవేక్షించడమే కారణమని ఈవో తెలిపారు. రూ. 100 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 728, ఆఫ్‌లైన్లో 2616, రూ. 300 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 408, ఆఫ్‌లైన్లో 709, రూ. 500 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 1233, ఆఫ్‌లైన్లో 1831 విక్రయించినట్లు పేర్కొన్నారు.

క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు

భక్తుల రద్దీ: సంక్రాంతి సెలవులు ముగుస్తుండడంతో వేకువ జాము నుంచి భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ లిఫ్టుమార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. దీంతో వన్‌ట్రాఫిక్ పోలీసులు, శాంతి భద్రతల విభాగం పోలీసులు సంయుక్తంగా ట్రాఫిక్‌ను నియంత్రించారు. క్యూలైన్లో సర్వదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత, ఈవో శీనానాయక్ క్యూలైన్లు, స్కానింగ్ పాయింట్ వద్ద ఉండి నియంత్రించారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా

మాల కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ, ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు

95501 28306 & 92475 20500

ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతపేటగడ్డ వద్ద ఆర్య వైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత విఘ్నేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి పాత పేటగడ్డ వరకు మహిళలు వేసిన ముగ్గులను అతిథులు తిలకించారు. అనంతరం సంప్రదాయకంగా గంగిరెద్దులు, కోడిపందేలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. మహిళలు నృత్యం చేస్తుండగా.. ఎంపీ శివనాథ్ వారితో పాదం కలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేసిన కర్రసాము ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా మొత్తం సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయిందన్నారు. తెలంగాణ ప్రజలు తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలకు వచ్చి సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ పల్లె సంస్కృతి పరిరక్షణకు సంక్రాంతి సంబరాలు దోహదపడతాయన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆధ్యాత్మిక.. భయభక్తులతోనే జీవితానికి సార్థకత

ముగిసిన బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

పెద్దఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం): వ్యక్తిగతంగా ఎదురయ్యే అనారోగ్య, ఆర్థిక భయం కన్నా.. ఆధ్యాత్మిక భయభక్తులతో చేసిన తప్పులను సరిదిద్దుకున్నప్పుడే జీవితానికి సార్థకత అని విజయవాడ కథోలిక మేత్రాసనం పీఠాధిపతి తెలగతోటి రాజారావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలో ప్రసిద్ధ బ్రదర్ జోసఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాల ముగింపు కార్యక్రమానికి బిషప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేదలు, నిరాశ్రయులను ఆదుకోవడంలో తంబి ఎప్పుడూ ముందుండే వారని చెప్పారు. క్రీస్తు అనుభవించిన పంచగాయాలను పొందిన బ్రదర్ జోసఫ్ తంబి ధన్యుడయ్యారన్నారు. అనంతరం ప్రత్యేక జపమాల, దివ్యపూజాబలిని మేరీ మాతా కపూచియన్ ప్రావిన్స్ ప్రొవిన్షియల్ ఫా. మరియదాసు, రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ కర్త గోపు అభిలాష్, ఇతర గురువులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావును పుణ్యక్షేత్ర బృందం సత్కరించింది. క్రైస్తవ విశ్వాసులు భారీగా పాల్గొనగా.. సంఘ పెద్దలు, మతకన్యలు, తంబి యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తును డీఎస్పీ శ్రీనివాసరావు బృందం పర్యవేక్షించింది.

దివ్యపూజాబలి అర్పిస్తున్న బిషప్ రాజారావు, ఫాదర్లు మరియదాసు, జోసఫ్, ఇతర మత గురువులు

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ జయసూర్యకు అమ్మవారి చిత్రపటం అందజేస్తూ..

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వివాహిత దారుణ హత్య

ఆమె కుమార్తెపై రోకలితో దాడి

సహజీవనం చేస్తున్న యువకుడే నిందితుడు

మధురానగర్, న్యూస్‌టుడే: భర్త వదిలేసిన మహిళను చేరదీశాడు. 14 సంవత్సరాలుగా ఆమెతో సహజీవనం చేశాడు. ఆమెను అనుమానిస్తూ నిత్యం గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆమెతో గొడవపడి ముఖంపై దిండుతో అదిమి హత్య చేశాడు. అడ్డువచ్చిన యువతి కుమార్తెను రోకలిబండతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన పండగ రోజు కేదారేశ్వరపేటలో కలకలం సృష్టించింది.

● కేదారేశ్వరపేట 8వ లైనులో ఉండే హుస్సేనా (39)కి 22 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్తతో విభేదాల కారణంగా రెండేళ్లకే విడిపోయారు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. ఆ తరువాత గుంటూరు జిల్లా నులకపేటకు చెందిన ఆటోడ్రైవర్ సాయి శివకుమార్ ఆమెకు పరిచయం అయ్యాడు. పెళ్లిళ్లకు డెకరేషన్ చేసే సాయికుమార్ ఆమెతో కలిసి కేదారేశ్వరపేట 8వ లైనులో ఉంటున్నాడు. మహిళ కుమార్తె (19)కు రెండేళ్ల కిందట వివాహం చేశారు. భర్తతో విభేదాల కారణంగా ఆమె విడాకులు తీసుకుని తల్లితో ఉంటున్నారు. ఈ క్రమంలో మహిళ కుమార్తెకు రెండో వివాహం చేయాలని తల్లి నిర్ణయించగా శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయమై వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

అనుమానంతో వేధింపులు: నిత్యం అనుమానించేవాడని, ఆమెతో గొడవ పడేవాడని బంధువులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఈ విషయమై గొడవ పడ్డారని, తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో హుస్సేనా ముఖంపై దిండుతో అదిమిపెట్టగా ఆమె కేకలు వేసింది. ఇది విని కుమార్తె అక్కడకు రాగా ఆమెను తోసివేశాడు. ఆమె భయంతో బయటకు పరుగులు తీస్తుండగా పక్కనే ఉన్న రోకలి బండను ఆమె పైకి విసిరేయగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అక్కడకు చేరుకోగా సాయి శివకుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. 108 సిబ్బందికి, అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ కుమార్తెను ఆసుపత్రికి తరలించారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

కేతనకొండలో రెండు సామాజికవర్గ యువకుల వివాదం

దాడులకు కోడి పందేలే కారణమంటున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కొందరి యువకుల మధ్య చెలరేగిన వివాదం, రెండు సామాజిక వర్గాల కొట్లాటగా మారిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన గోపిచంద్, కిరణ్‌లు తమ ద్విచక్ర వాహనంపై ఓ సామాజిక వర్గం అధికంగా ఉండే నివాసాల వద్దకెళ్లి కొంతసేపు హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రామచంద్ర అనే యువకుడితో వాగ్వాదం జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న యువకులు మరికొందరు స్నేహితులను తీసుకొచ్చి రామచంద్రపై దాడి చేయగా అతని మెడ వద్ద, చెవిపై తీవ్రంగా కత్తి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రామచంద్ర తాలూకు సామాజిక వర్గం అక్కడికి చేరుకొని పి. గోపీచంద్(సన్నీ), కిరణ్, వారితో పాటు వచ్చిన మరికొందరిని విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడి జాతీయ రహదారి(65)పై వరకూ చేరడం, ఇరు వర్గాల వారు భారీగా అక్కడికి రావడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరకొట్టారు. ఈ గొడవలు పునరావృతం కాకుండా ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామమంతా పికెట్ ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు ఒక వర్గంపై 307, మరో వర్గంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్, పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

శిబిరంలోనే వివాదం?: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం శివారు చిలుకూరు కాచవరం వద్ద ఏర్పాటు చేసిన కోడి పందేల శిబిరాలే వివాదానికి మూల కారణమని తెలుస్తోంది. గురువారం మధ్యాహ్నం ఇరు వర్గాలకు చెందిన యువకులు పందేలు వేసినప్పుడు అందులోని ఒక వ్యక్తి కోడి గెలవకపోతే చెవి కోసుకుంటానని బాహాటంగా అన్నాడు. ఆ పందెంలో కోడి నేలకొరగడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పందెంలో గెలిచిన యువకులు రాత్రి గ్రామంలోకి చేరుకొని ఆ యువకుని చెవి కోయాలని నిర్ణయించుకుని వెళ్లడమే ఈ వివాదానికి కారణమని సమాచారం. అయితే ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

కేదారేశ్వరపేటలో మందుబాబుల హల్‌చల్

బీరు సీసాతో ఒకరిపై దాడి

మధురానగర్, న్యూస్‌టుడే: కేదారేశ్వరపేటలోని ఒక బార్ వద్ద రాము, సాల్మన్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. బీరు సీసాతో ఒక వ్యక్తి తల పగలకొట్టారు. అడ్డుకున్నవారిపై తిరగబడి దాడి చేశారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇటీవల బబ్బూరి గ్రౌండ్స్ వద్ద రౌడీ షీటర్ కారుతో హల్‌చల్ చేసిన ఘటన మరువకముందే తాజాగా బార్ వద్ద మద్యం మత్తులో విచక్షణా రహితంగా దాడులకు తెగబడడం తీవ్ర చర్చనీయాంశమైంది. ● కేదారేశ్వరపేటకు చెందిన మోహన్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. గురువారం మధ్యాహ్నం కేదారేశ్వరపేటలోని మాధురి బార్ వద్దకు వచ్చారు. కౌంటర్‌లో పార్శిల్ తీసుకుంటుండగా అయోధ్యనగర్‌కు చెందిన రాము, సాల్మన్‌లు అతనిపై దాడి చేశారు. ముందుగా సాల్మన్ బీరు సీసాతో మోహన్ తలపై కొట్టారు. ఇది గమనించిన స్థానికులు అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా రాము వారిపై తిరగబడ్డాడు. ఇద్దరూ బీరు సీసాలతో మోహన్‌కుమార్‌పై విచక్షణారహితంగా కొట్టారు. తీవ్ర గాయాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై మోహన్‌కుమార్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. ఈ కేసును రాజీ చేసేందుకు స్థానికంగా ఉన్న వైకాపా నేత ఒకరు రంగంలోకి దిగారంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

పాత దర్యాప్తుపై సమీక్షకే సీబీఐ పరిమితమైంది

హైకోర్టు ఆదేశాల మేరకు తాజా దర్యాప్తు చేయలేదు

ఆయేషామీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు

ఈనాడు, అమరావతి, గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: 'ఆయేషామీరా హత్య కేసును తాజాగా దర్యాప్తు చేయమని హైకోర్టు సీబీఐని ఆదేశించింది. కానీ సీబీఐ కొత్తగా శోధించకుండా గతంలో జరిగిన దర్యాప్తును సమీక్షించేందుకే పరిమితమైంది. ఇది హైకోర్టు తీర్పునకు విరుద్ధమని' ఆయేషామీరా తల్లిదండ్రుల తరపు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వాదించారు. ఆయేషామీరా హత్య కేసు శుక్రవారం విజయవాడలో సీబీఐ కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చింది. హైకోర్టు ఆదేశం మేరకు పునర్విచారణ నివేదికను మృతురాలి తల్లిదండ్రులకు ఇటీవల సీబీఐ అధికారులు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నివేదికలోని పలు అంశాలను న్యాయవాది శ్రీనివాస్ కోర్టులో చదివి వినిపించారు. పంచనామా నిర్వహించిన పలువురు రెవెన్యూ అధికారుల సాక్ష్యాలను మళ్లీ సీబీఐ నమోదు చేసిందని, గతంలో తాము ఒత్తిళ్లకు లొంగి వాంగ్మూలం ఇచ్చినట్లు వారు వెల్లడించారని చెప్పారు. ఈ సందర్భంగా సీబీఐ కొత్తగా నమోదు చేసిన సాక్షుల స్టేట్‌మెంట్లను డిఫెన్స్ న్యాయవాది చదివి వినిపించారు. గతంలో తాము పోలీసుల ఒత్తిళ్లకు తలొగ్గి ఖాళీ కాగితాలపై సంతకాలు పెట్టి ఇచ్చినట్లు ఉందని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షులు చెప్పిన దాని ప్రకారం కూడా దర్యాప్తు సాగలేదన్నారు. పాత దర్యాప్తుపై సమీక్ష వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. సీబీఐ పునర్విచారణ నివేదికపై ఆయేషామీరా తల్లిదండ్రులు రాతపూర్వకంగా అభ్యంతరాలను కోర్టులో ఫైల్ చేస్తారని, దీనికి సమయమివ్వాలని న్యాయవాది కోరారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ.. ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

బాలికను పెళ్లాడి.. ఠాణాకు వచ్చి..

కేసులో ఇరుక్కున్న యువకుడు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుని రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులో ఇరుక్కున్నాడో యువకుడు. అతడు పెళ్లి చేసుకుంది మైనర్‌ని అని గుర్తించిన పోలీసులు రక్షణ కోసం వచ్చిన యువకుడిపైనే కేసు పెట్టారు. ఈ ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఒక యువకుడు స్థానికంగా ఉన్న ఒక బాలిక (17)ను ప్రేమించాడు. శుక్రవారం వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెద్దల నుంచి రక్షణ కావాలని కోరుతూ సదరు యువకుడు బాలికను తీసుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. పోలీసుల విచారణలో బాలిక అని తెలియడంతో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు పోలీసులు రికార్డు సిద్ధం చేస్తున్నారు.

మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్..

ఈనెల 30 వరకు పొడిగించిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. వీరికి విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో సిట్ అధికారులు నిందితులను విజయవాడలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీనిపై నిందితుల తరఫు న్యాయవాది సుందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 30 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. బెయిల్‌పై ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. న్యాయాధికారి నుంచి అనుమతి తీసుకుని వెళ్లిపోయారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి రాలేదు. వీరి తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. రిమాండ్ పొడిగింపు అనంతరం నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact **8008003297**

EENADU e Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్‌లోన్. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669

REAL ESTATE

FLAT FOR SALE

మన శ్రీసిటీ కన్‌స్ట్రక్షన్స్ వారి తాడేపల్లి బైపాస్‌లోని ప్రైమ్ లొకేషన్ నందు 9 ఫ్లోర్స్ లగ్జరీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్ మరియు విజయవాడ క్లబ్ రోడ్‌లో రివర్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్ కొరకు సంప్ర: 98493 03315, 84494 58449.

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్ పక్కన ప్రైమ్ ఏరియాలో టాప్ ఫ్లోర్ 3 BHK, 3 ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ న్యూ ఫ్లాట్ అమ్మకం. ✆ 98853 99999

LAND FOR SALE

గన్నవరం, తెంపల్లి గ్రామం, చిన్న అవుటుపల్లి to తెంపల్లి రోడ్ ఫేసింగ్ 1.42 ac. Industrial Land. RCC షెడ్‌తో. ✆ 89782 66665.

PLOT FOR SALE

మన శ్రీసిటీ వారి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్ బందరురోడ్, వెస్ట్ బైపాస్‌లలో ఓపెన్ ప్లాట్స్, విల్లాలు LP నంబర్‌తో అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్ ✆ 98493 03315, 84494 58449

రిజి. ఫ్రీ కంచికచర్ల దగ్గర - చెవిటికల్లు రోడ్డులో- HYD హైవేకి 500 మీ|| పరిటాల రైల్వేహాల్ట్‌కి, ఐకాన్ బ్రిడ్జికి దగ్గరలో CRDA ప్లాట్లు. లోన్ కలదు. ✆78427 58859

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067

VJA, కంచికచర్ల, ఔటర్‌రింగ్‌రోడ్డు DTCP & APCRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ||గ|| 3,900/- నుండి 7,900/- వారధికి 3కిమీలలో చ||గ|| 14,500/-. ✆ 96031 45395

NH-65, బెల్ కంపెనీ, మచిలీపట్నం పోర్ట్, గన్నవరం ఎయిర్ పోర్ట్, ORR లకు దగ్గరలో పామర్రు కార్పొరేషన్ పరిధిలో, బందర్ రోడ్, గంగూరులలోను CRDA అప్రూవ్డ్ వెంచర్లో ప్రీమియం ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు & పరిటాల హైవే ఫేసింగ్‌లో మరో నూతన CRDA వెంచర్ త్వరలో ప్రారంభం. 7799334555.

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ|| రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
✆ **98486 67454**

ప్లాట్స్ అమ్మబడును. డి.టి.సి.పి. లేఔట్‌లో మచిలీపట్నంలో మంచినీటి కాలువ దగ్గర వాసవినగర్‌లో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆79817 81688, 78158 50952

మచిలీపట్నం, ఈడేపల్లి బాలభాను విద్యాలయం రోడ్‌లో 265 గజాలు కమర్షియల్ ప్లాట్ అమ్మకం కలదు. PH.No: 98482 10397, 95559 93366.

PROPERTY FOR SALE

3BHK Flat at HRT Plaza near Benz Circle & 275 Sq.Yds. Open Plot Bharathi Nagar behind Novatel, 5000 Sq.Yds. Vadeswaram. Sale. ✆ 90043 77068.

TO LET

COMMERCIAL

Tolet for Corporate Offices Ground Floor 360 S.Ft Near A Plus Convention Hall, Vijayawada ✆ 90146 33050

SECOND SALE

Furniture for Sale. (Good Condition) Related to Readymade Garment Store @ MG Road, Vijayawada. 97043 87132, 99895 51919.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో పనిచేయుటకు లేబర్‌రూమ్ అసిస్టెంట్, O.T అసిస్టెంట్, O.T కాంపౌండర్ కావలెను. ✆ 93973 41745

VJAలోని ఆటోమొబైల్ హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర పనిచేయుటకు అకౌంటెంట్ (F) కావలెను. EXP. టాలి 3YRS. 10Am to 5Pm ✆ 92464 92455.

NTR, కృష్ణాలలో జగ్గయ్యపేట, కైకలూరు, పామర్రు, అవనిగడ్డ, గుడివాడలో మార్కెటింగ్‌కు PROలు కావలెను. జీతం : 40K, 50K,60K ✆ 89195 20094

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు టెలీకాలర్స్ (స్త్రీ అభ్యర్థులు) కావలెను. అనుభవం 0-2సం||. ✆ 88862 99444.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు ఆఫీస్ సేల్స్ అభ్యర్థులు కావలెను. అనుభవం 0-2 సం||. ✆ 63098 80999.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు కలెక్షన్ ఏజెంట్స్ కావలెను. అనుభవం 0-5సం||. ✆ 88866 55588.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జి.నవీన లావణ్యలత, పక్కనే రాజేశ్వరి, రమేష్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక జిజిఎస్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె. నవీన లావణ్యలత ప్రారంభించారు.

ఆత్మీయ కలయిక... ఆనంద వేడుక

నాటి గురువులతో పూర్వ విద్యార్థుల బృందం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల పరిధి పుట్రేల గ్రామంలోని జడ్పీ పాఠశాలలో 2006- 07లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలలో తిరుగుతూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు తమ అనుభవాలను మిత్రులతో పంచుకుని ఆనందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: రెడ్డిగూడెం పంచాయతీ 4వ వార్డులో డ్రైనుల్లో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? జి.కొండూరు పీహెచ్‌సీకి వెళ్లే సీసీ రోడ్డుపై వివేకానంద పాఠశాల సమీపంలో కృష్ణా జలాల పైపులైను లీకై నిరంతరం వృథాగా పోతోంది. **- ఎస్.లోకేష్** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి ఆరు పంపుల కూడలిలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. దానికి సంబంధించిన మెటీరియల్ కూడలిలో ఉంచడం వల్ల వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. **- ప్రకాష్, కొండపల్లి** ✔ నిర్మాణ గుత్తేదారులతో మాట్లాడి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ**

? కొండపల్లి బ్యాంకు కూడలి మెడ్‌ప్లస్ దుకాణం వద్ద మురుగు రహదారిపైకి వస్తోంది. గతంలో సమస్యను తాత్కాలికంగా పరిష్కరించినా అదే పునరావృతం అవుతోంది. సమస్య పరిష్కరించాలి. **- అలీఖాన్, కొండపల్లి**
✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగును మళ్లిస్తాం.
- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, కొండపల్లి

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా

పతకాలతో నాగిడి గాయత్రి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.

తోలకాలకు తెరలేపారు.. జేబులు నింపుకొంటున్నారు!

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

నీరు లేక అడుగంటిన మైలవరం ఎర్ర చెరువు

కాసులు కురిపించే మట్టి, గ్రావెల్‌పై కొందరు కన్నేసి దందా ప్రారంభించారు. ఒకప్పటి చెరువుల నుంచి మట్టి తోలకాలకు ఇప్పటికే తెరలేపారు. గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో మట్టిని ప్రైవేటుగా తరలించి, జేబులు నింపుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలో ఇటుక బట్టీలు పెద్ద సంఖ్యలో ఉండటం, రియల్ ఎస్టేట్ వెంచర్లకు అవసరం ఉండటంతో గిరాకీని సొమ్ము చేసుకునే పనిలో కొందరు తలమునకలవుతున్నారు.

దశాబ్ద కాలంగా...

ఈ ఏడాది నియోజకవర్గంలోని చెరువులకు సమృద్ధిగా నీరు చేరింది. అదే స్థాయిలో ఇటుక బట్టీల నిర్వహణ సాగుతోంది. కుటీర పరిశ్రమలా ఉన్న బట్టీలకు మట్టిని అమ్మి, రూ. కోట్లు గడించడం దశాబ్ద కాలంగా నియోజకవర్గంలోని కొందరికి పరిపాటిగా మారింది. ఈ సంవత్సరం అదే తరహాలో మట్టి తవ్వకాలకు వ్యూహాలు పన్నుతున్న నాయకులకు మొన్నటి వరకు నిండుగా ఉన్న చెరువుల్లో నీరు అడ్డొచ్చింది. క్రమేపీ నిల్వలు తగ్గడంతో తవ్వకాలకు అనుకూలంగా మారుతోంది. దాంతో రాత్రి వేళల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు చర్యలు ప్రారంభించారు.

రాత్రి వేళ ట్రాక్టర్లతో..

మైలవరం ప్రాంతంలో ప్రధానంగా ఉన్న మైలవరం, పొందుగల పరిధిలోని ఎర్ర చెరువులో ఇప్పటికే దాదాపు నీరు అడుగంటింది. దాంతో రెండ్రోజులుగా రాత్రి వేళ పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. అర్ధరాత్రి ప్రారంభించి తెల్లవారుజాముకే పని ముగించేశారు.

★ రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో వైకాపా హయాంలో దాచిన మట్టిని, పది రోజుల కిందట తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని అయిదు టిప్పర్లను స్వాధీన పర్చుకున్నారు. మైలవరం మండలంలో బట్టీలున్న ప్రాంతాల్లో చెరువుల్లో నీరుండటంతో అక్కడి నుంచి తరలింపు చేపట్టినట్లు చెబుతున్నారు.

★ మైలవరం మండలం వెల్వాడం మీదుగా తరలిస్తున్న టిప్పర్లకు స్థానికులు అడ్డు తిరగడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

★ మైలవరం మండలం ఎదురుబీడెం గట్టు నుంచి గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్ల ద్వారా రాత్రివేళల్లో పెద్ద ఎత్తున తరలుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మధిర కాల్వకు సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శుక్రవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కరి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

పనులు పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

ట్రాఫిక్ పోలీసుల చొరవతో దీపాలకు మరమ్మతులు

కొండపల్లి, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాల మరమ్మతుకు ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపారు. ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి(30) ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి ఐడీఏ వరకూ ఆ రోడ్డును పదేళ్ల కిందట నాలుగు వరుసలుగా నిర్మించి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. అవి కొంత కాలం మాత్రమే వెలుగులందించగా కొన్నేళ్లుగా రాత్రి సమయాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. దీన్ని గమనించిన ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు ఎన్‌హెచ్ఏఐ నిర్వహణ గుత్తేదారులను సంప్రదించి సమస్యను వివరించారు. శుక్రవారం ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది, స్థానిక డిస్కం లైన్‌మెన్లు ఆయా మరమ్మతులను ప్రారంభించారు.

గంపలగూడెం- మధిర రోడ్డులో ఉదయం పది గంటలకు లైట్లతో వస్తున్న వాహనాలు

పొగ మంచు.. పొంచి ఉన్న ముప్పు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల ప్రజలు పొగ మంచుతో అవస్థలు పడుతున్నారు. దీంతో మనుషులకే కాదు పంటలకు నష్టం జరుగుతోంది. వారం రోజులుగా పల్లెలను మంచు దట్టంగా కప్పేయడంతో అయిదారు అడుగుల దూరంలో ఉన్న వారు కూడా కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో చోదకులు ఉదయం పది గంటల వరకు వాహనాలకు లైట్లు వేసుకుని నడుపుతున్నారు. రహదారి మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. పొగ మంచు కారణంగా మిరప, మామిడి తోటల్లో పూత, పిందెలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు కార్మికుల ఆశ అడియాస

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మిక వర్గాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గత బకాయిలు, సర్వీస్ ఇన్‌సెంటివ్‌లు వస్తాయని అనుకున్న విద్యుత్తు సంస్థల కార్మికుల ఆశ అడియాసగా మారింది. ఇందుకు కారణం ముమ్మాటికీ అధికార యంత్రాంగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి గత బకాయిలు, ఇన్‌సెంటివ్‌ల కోసం 2025 సెప్టెంబరు 10న ఎన్టీటీపీఎస్‌తో పాటు ఇతర విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల వద్ద కార్మిక సంఘాలు దీక్షలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపాయి. గత బకాయిలు చెల్లించడంతో పాటు 20 ఏళ్ల విధుల్లో కొనసాగిన కార్మికులకు సర్వీస్ ఇన్‌సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అందులో భాగంగానే జనవరి- 2026 వేతనాలతో కలిపి దశల వారీగా వాటిని చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయగా కొద్దిమంది కార్మికులకు మాత్రమే నగదు జమైంది. అయితే కార్మికులకు సంబంధించిన సర్వీస్ వివరాలు ఎస్ఈ, డీఈ కార్యాలయాల నుంచి విద్యుత్తు కేంద్ర కార్యాలయానికి వెళ్లాల్సిన జాబితా జాప్యం చోటు చేసుకుంది. దీంతో అర్హత కలిగిన కార్మికులందరికీ వేతనాలతో కూడిన బకాయిలు చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో కేవలం జనవరి వేతనాలకే పరిమితమయ్యామని ఎన్టీటీపీఎస్ కార్మికులు వాపోతున్నారు.

బకాయిల చెల్లింపులపై హర్షం

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీర్ఘ కాల బకాయిలను ప్రభుత్వం చెల్లించడం హర్షణీయమని డీపీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని బకాయిలతో కలిపి 60 నెలలకు సంబంధించి రూ.1100 కోట్లు చెల్లించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల్లో సంక్రాంతి సంతోషం రెట్టింపు అయ్యిందని వారు తెలిపారు.

కంభంపాడులో ముగిసిన క్రికెట్ పోటీలు

విజేతలకు ట్రోఫీ అందిస్తున్న పోలీసు అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా ఎ.కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఇందులో ఎ.కొండూరు యువత, పోలీసు జట్టు, వల్లంపట్ల యువత వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రోఫీలు, ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలతో పాటు అక్కడి నాగసింధు స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఆర్థిక సౌజన్యంతో 'మాదక ద్రవ్యాల వినియోగం వద్దు..శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాదం ఉన్న జెర్సీలను ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా గోదారంగనాయకులకు గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెమలి, గోసవీడు, పెనుగొలను, గంపలగూడెం, వినగడప, ఊటుకూరు గ్రామాల్లోని కృష్ణాలయాలు, రామాలయాలు, రంగనాయక స్వామి ఆలయాల్లో నెల రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గుడుల్లో వేకువజాము నుంచి భక్తులతో సందడి నెలకుంది. గురువారం కల్యాణ మహోత్సవం నిర్వహించి గోదారంగనాయకస్వామి ఉత్సవమూర్తులకు మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు.

మైలవరం : పూలతో జూద శిబిరానికి ఏర్పాటు చేసిన ఆహ్వాన ద్వారం

జి.కొండూరులో విద్యుత్తు దీపాల వెలుతురులో..

రెడ్డిగూడెంలో కోసాట

కూడికలు... తీసివేతలు

నగదు లెక్కల్లో నిర్వాహకులు తలమునకలు

మైలవరం, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో మూడ్రోజుల పాటు నిర్వహించిన కోడి పందేలు, జూద శిబిరాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఈ నేపథ్యంలో జరిగిన లావాదేవీలకు సంబంధించి లెక్కల్లో మునిగారు.

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని పొందుగలలో కోడి పందేలు నిర్వహిస్తున్న జూద శిబిరంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య పందేం విషయంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. వేరే గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా, ఒక వ్యక్తి బీర్ బాటిల్ తీసుకుని పొడుస్తానంటూ హల్‌చల్ చేయడంతో అక్కడున్న వారు హడలిపోయారు. వెంటనే అతడిని అడ్డుకుని సర్ది చెప్పగా వివాదం సర్దుమణిగింది.

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో విద్యుత్తు దీపాల వెలుతురులో రాత్రులు సైతం కోడి పందేలు, కోత ముక్క, మూడు ముక్కలాటలను నిర్వహించారు. కొన్నిచోట్ల రాత్రులు పందేలు నిర్వహణకు విద్యుత్తు చౌర్యం జరిపారు.

గంపలగూడెం: మండలంలోని నెమలి, ఊటుకూరు, పెదకొమిర, తునికిపాడు, పెనుగొలను, గుళ్లపూడి తదితర గ్రామాల్లో కోడి పందేలు, జూదం యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కోత ముక్క రూ.కోట్లలో జరిగింది. పందేల నిర్వాహకులు కోసు ఆటను ఇతరులకు విక్రయించి అక్రమార్జన చేశారు. మామిడి తోటల్లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులు, జూద శిబిరాల వద్ద మద్యం సీసాలను రెట్టింపు ధరకు అమ్మారని పలువురు వాపోయారు. ఈ ఏడాది బరుల వద్ద నిర్వాహకులు బౌన్సర్లను ఏర్పాటు చేయడం విశేషం.

తిరువూరు: తిరువూరు మండలంలోని కాకర్ల, మల్లెల, విస్సన్నపేట మండలం తాతకుంట్ల తదితర గ్రామాల్లో రూ.కోట్ల మేర పందేలు జరిగాయి. తిరువూరులోని శ్రీరస్తు వద్ద జరిగిన పందేల్లో బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా ప్రకటించారు. విస్సన్నపేట మండలం తాతకుంట్లలో నిర్వాహకులు ఇండికా డిజైర్ కారు, రెండు బుల్లెట్ ద్విచక్ర వాహనాలను బహుమతులుగా అందించారు. కోడి పందేల నిర్వహణతో కొన్నిచోట్ల ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలికతో పాటు మండల శివారు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారాయి. జూద శిబిరాలతో పాటు ఇతర ఆటలు కొనసాగాయి. మద్యం ఏరులై పారింది.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో కోడి పందేలతో పాటు కోసు(జూదం), నలుపు, ఎరుపు, గుండాటలు యథేచ్ఛగా సాగాయి. పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగాయి. గురువారం నూజివీడు రహదారిలోని బరిలో పందెపు రాయుళ్ల మధ్య ఘర్షణ జరగడంతో సాయంత్రం పందేలను నిలిపేశారు. ఇరువర్గాల పందెపు రాయుళ్లు మాట్లాడుకుని శుక్రవారం యథావిధిగా పందేలు నిర్వహించారు.

కోడి పందేల నిర్వహణలో వివాదం

జి.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడి పందేలను శుక్రవారం సాయంత్రం ముగించే సమయంలో వివాదం చోటు చేసుకుంది. గంగినేని గ్రామంలో పందేలు ముగిసిన సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు యువకులు సందడి చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం రేమిడిచర్ల నుంచి పందేలకు వచ్చిన గోసి పరమేశ్వరరావు అనే వ్యక్తి పక్కనే ఉన్న బండి వద్ద నూడిల్స్ తింటూ గంగినేనికి చెందిన వ్యక్తులను కామెంట్ చేయగా వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో పరమేశ్వరరావుపై గంగినేనికి చెందిన యువకులు ఘర్షణ పడి దాడి చేయగా అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే ఎర్రుపాలెం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ వివాదాన్ని ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌ను సైతం పక్కకు తోసేసి దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. వివాదానికి కారణమైన వ్యక్తులను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

సంక్రాంతి సందడి.. ఊరూరా కాంతి

మైలవరం: వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

తిరువూరు: చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో..

నెమలి కృష్ణాలయం గోశాలలో..

తిరువూరు, న్యూస్‌టుడే : మకర సంక్రాంతిని పురస్కరించుకుని గురు, శుక్రవారాల్లో తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీరాజగోపాల స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి శ్రీగోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణ వేడుక జరిపారు. గురువారం గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలో సంక్రాంతి పండగను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఇంటింటా పిండి వంటలతో మహిళలు సందడి చేశారు. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. హరిదాసులు త్యాగరాయ కీర్తనలు ఆలపిస్తూ కానుకలు స్వీకరించారు. అందమైన రంగవల్లులు వేసేందుకు యువతులు పోటీ పడ్డారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు : మైలవరం , న్యూస్‌టుడే: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు.

పెనుగొలనులో పుడమి పుత్రులకు సన్మానం.. పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో కనుమ పండగ సందర్భంగా శిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో 18 మంది రైతులను సత్కరించినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కనుమ రోజున గోవులను పూజించడం, అన్నం పెట్టే పుడమి పుత్రులను సన్మానించడం సంప్రదాయమని నిర్వాహకులు చెప్పారు.

ప్రత్యేక పూజలు.. మైలవరం, న్యూస్‌టుడే : కనుమను పురస్కరించుకుని శుక్రవారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు గోవులకు పూజలు నిర్వహించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని గ్రామాల్లో గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెవుటూరు, వెల్లటూరులోని గో ఆశ్రమంలో భక్తులు గోమాతలను దర్శించుకుని ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలు చేసి వాటికి పశుగ్రాసం తినిపించారు.

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో గోపూజ నిర్వహించారు. తెదేపా నాయకుడు బెల్లం మధుసూదనరావు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ఆలయంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ చేపట్టారు.

శాస్త్రోక్తంగా కపిల గోమాత పూజ

శ్రీచక్రనవావరణార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కనుమ పండగను పురస్కరించుకొని కపిల వర్ణ గోమాతకు శుక్రవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజ నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లతో అర్చకులు పూజ చేయించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన పలువురు భక్తులు గోపూజ చేశారు. ✦ దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రతి రోజు గోశాలలోని ఆవు పాలను మాత్రమే శ్రీచక్రార్చనకు వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు 6 లీటర్ల పాలను అమ్మవారి ఆలయంలో వివిధ పూజల నిమిత్తం దేవస్థానం గోశాల నుంచి తీసుకొస్తారని అధికారులు తెలిపారు.

కిరాణా దుకాణంలో నగదు అపహరణ

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. ఓ కిరాణా దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు రూ.లక్ష నగదును అపహరించారు. రాత్రి సమయంలో దుకాణం తాళాలు పగలగొట్టి లోపలికి వచ్చి నగదుతో పాటు కొన్ని విలువైన వస్తువులను తీసుకెళ్లారు. గురువారం ఉదయం దుకాణం తెరవడానికి వచ్చిన యజమాని తాళాలు పగిలి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

దొంగలు కాల్చేసిన ఆస్తి పత్రాలు

గోసవీడు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో వజినేపల్లి వెంకటేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు. . ఇంటికి తాళం వేసి బుధవారం వైరాలోని తన బంధువుల ఇంట వేడుకకు వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా వెళ్లారు. గురువారం మధ్యాహ్నం తిరిగి రాగా ముఖ ద్వారం తలుపులు తెరిచి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2.30 లక్షలు, 140 గ్రాములు బంగారం, సుమారు 3 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురి అయ్యాయని బాధితుడు వాపోయారు. తన స్థిర ఆస్తులు, బ్యాంకు పుస్తకాలు, ఇతర పత్రాలను చోరీకి పాల్పడిన వారు ఇంట్లోనే కాల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం గోసవీడు చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుడి నుంచి వివరాలు తీసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించే దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

అతి వేగంతో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామం వద్ద ఓ కారు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన గురువారం చోటు చేసుకుంది. అతి వేగంగా వస్తున్న కారు రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించే క్రమంలో అదుపు తప్పి రహదారి పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. విద్యుత్తు శాఖ సిబ్బంది వచ్చి విద్యుత్తుకు అంతరాయం కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

పర్యావరణ హిత సంచులే వినియోగించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ సంచుల వాడకంపై నిషేధం ఉన్నందున నగర ప్రజలు కేవలం పర్యావరణ హిత సంచులు మాత్రమే ఉపయోగించాలని కార్పొరేషన్ చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నగరపాలక సంస్థ అవగాహన కల్పిస్తున్నందున ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని అన్నారు. వాటిని వినియోగించినా, విక్రయించినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధం సమర్థవంతంగా అమలయ్యేలా అందరూ తమకు సహకరించాలని కోరారు.

కరెన్సీనగర్‌లో పేరంటాలమ్మ ఊరేగింపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రామవరప్పాడులో కొలువైన వెంకమ్మ పేరంటాలమ్మ అమ్మవారిని కరెన్సీనగర్‌లో ఊరేగించారు. మహిళలు ఇంటి ముంగిట నీరు పోసి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీకి చెందిన సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు బాణసంచా కాల్చి అమ్మవారి రథానికి స్వాగతం పలికారు.

ఆహ్లాదం నిండుగా.. వసతులు మెండుగా!

పార్కులు అభివృద్ధి చేస్తున్న కార్పొరేషన్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ పార్కులను పునరుద్ధరించడంతో పాటు, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. కొంతకాలంగా పార్కులు నిర్వహణ లోపంతో కునారిల్లుతున్నాయి. ప్రస్తుతం వాటిని రూ.4.13 కోట్ల వ్యయంతో ఆహ్లాదంగా తయారు చేయడమే కాకుండా చిన్నారులకు ఆట పరికరాలు, పెద్దలకు వ్యాయామ శాలలు ఏర్పాటు చేస్తున్నారు.

●● నగరంలో మూడు కమర్షియల్ పార్కులున్నాయి. రాజీవ్ గాంధీ పార్కు, రాఘవయ్య - అంబేడ్కర్ పార్కు, కేఎల్ రావు పార్కులను ఎప్పటికప్పుడు రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. స్క్రాప్ పార్కును కూడా అందంగా తీర్చిదిద్దారు.

●● వివిధ కాలనీలతో పాటు, ఏలూరు, బందరు, రైవస్ కాలువ కట్టలపై పార్కులతో కలిపి మొత్తం 173 పార్కులు ఉన్నాయి. అందులో ఎక్కువ పార్కులు అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ గట్ల వెంట పచ్చదనం పెంపునకు రూ.లక్షల వ్యయం చేస్తున్నా... వాటిపైనున్న పార్కులను మాత్రం పట్టించుకోవడం లేదు.

●● వివిధ డివిజన్లలోని 119 పార్కులు పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. 54 పార్కులను మాత్రం వదిలేశారు. అవి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైన వాటిలో కొన్నింటిని గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు.

ట్రెండ్‌సెట్ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్న ఆట పరికరాలు

నిధుల కేటాయింపు ఇలా...

●● మూడు నియోజకవర్గాల్లోని 17 పార్కుల్లో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయాయి. వాటిని తొలగించేందుకు రూ.2.78 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రూ.1.70 కోట్ల వ్యయంతో పనులు చేపట్టి అడ్డంకులు తొలగించారు. మొక్కలు నాటారు. రూ.88 లక్షల వ్యయంతో మరికొన్ని అదనపు పనులు చేస్తున్నారు. కొన్ని పనులు టెండరు దశలో ఉన్నాయి. ●● భవానీపురం రోజ్ గార్డెన్ పార్కును రూ.18 లక్షలతో పునరుద్ధరిస్తున్నారు. ●● ఎల్‌బీఎస్ నగర్ పార్కు అభివృద్ధికి రూ.64 లక్షలు వెచ్చిస్తున్నారు. ●● ఏఎస్ఆర్-2 పార్కులో వసతులకు రూ.కోటి ఖర్చు చేస్తున్నారు. ●● కండ్రిక ఎస్సీ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.19.95 లక్షలతో అంచనాలు రూపొందించారు. ●● కుందావారి కండ్రిక కేకే అపార్టుమెంట్ ఏరియా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ●● సింగ్‌నగర్ నందనవనం పార్కులో రూ.45 లక్షలతో పనులు చేపట్టారు. ●● గాంధీ నగర్ గోరా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ●● 29వ డివిజన్ ట్రెండ్‌సెట్ పార్కు అభివృద్ధికి రూ.38 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ●● దుర్గాపురం 27వ డివిజన్ పార్కు అభివృద్ధి రూ.38 లక్షలు కేటాయించారు.

మన సంప్రదాయాలకు ప్రతీక... పండగలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండగలని వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు రావి కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని విజయవాడ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ.. నడకతో ఆరోగ్యాన్ని రక్షించుకుంటూ, సమాజ క్షేమాన్ని కాంక్షిస్తూ కలిసి పండగలు నిర్వహించుకోవడం ఆదర్శనీయమని అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు తొండెపు హనుమంతరావు, విజయవాడ వాకర్స్ సంఘం అధ్యక్షుడు మోటూరి ప్రభాకరరావు, కార్యదర్శి వి.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భోగి మంటలు, హరిదాసు, గంగిరెద్దులు, డప్పు కళాకారుల విన్యాసాలు, రాజేష్ బృందం కోలాటం, జానపద గేయాలు అలరించాయి. భాగవతుల రామశర్మ శిష్య బృందం జానపద నృత్యాలు ఉల్లాసపరిచాయి. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

కోలాట బృందంతో వాకర్స్ ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందన: ✦ 5వ డివిజన్ క్రీస్తురాజపురం ప్రధాన రహదారి అరుల్ నగర్ వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి ధనలక్ష్మి 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి పూడిక తీయించారు.

✦ మూడో డివిజన్ నాగార్జున నగర్ నుంచి మహానాడు రోడ్డుకు వెళ్లే దారిలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి పూర్ణచంద్రరావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో మందులు చల్లించారు.

✦ 4వ డివిజన్ భారతీ నగర్ నుంచి శ్రీనివాస నగర్ బ్యాంకు కాలనీకి వెళ్లే రోడ్డులో 4-8/103 విద్యుత్ స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రాజేష్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

త్రిపురనేని జీవితం స్ఫూర్తిదాయకం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కమిషనర్ (జనరల్) ఎ.రవీంద్రరావు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రవీంద్రరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ.. . కృష్ణా జిల్లాలో జన్మించిన త్రిపురనేని చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారని తెలిపారు. న్యాయవిద్యనభ్యసించి న్యాయవాదిగా సమాజ హితం కోసం పని చేశారని గుర్తు చేశారు. విలువలతో కూడిన సాహిత్యాన్ని రచించి ఎంతో మంది మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆయన రచనలు ప్రజల్లో మంచి ఆలోచనలు రేకెత్తించడమే కాకుండా, చైతన్యం కలిగించాయని తెలిపారు. కుల వ్యవస్థలో అసమానతలు, అన్యాయాలను అరికట్టేందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్వో రజియా షబీన, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అదనపు కమిషనర్(జ) రవీంద్రరావు తదితరులు

18 వరకు సత్యలో ప్రత్యేక ఆఫర్లు

విజయవాడ సిటీ, : సంక్రాంతి సందర్భంగా నగరంలోని సత్య షోరూమ్‌ల్లో ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు తగ్గిస్తున్నారు. టెలివిజన్లు రూ.7,990 నుంచి, ఫ్రిజ్‌లు రూ.13,990 నుంచి, ఎయిర్ కండీషనర్లు రూ.29,990 నుంచి, వాషింగ్ మెషిన్లు రూ.10,990 నుంచి లభిస్తున్నాయి. మొబైల్ కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తున్నారు. 5జీ మొబైల్స్ రూ.7,990 నుంచి, 60 శాతం వరకు రాయితీ, రూ.12 వేల వరకు క్యాష్ బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తున్నారు. నెక్ బ్యాండ్లు కేవలం రూ.199కే, పోర్టబుల్ పార్టీ బ్లూటూత్ స్పీకర్లు రూ.2,449కే లభిస్తున్నాయి. కిచెన్ కాంబోను రూ.10,999కే అందిస్తున్నారు. వాటర్ హీటర్లు రూ.3,300 నుంచి, ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి అందుబాటులో ఉన్నాయి. రూ.888 నుంచి ఈఎంఐ, రూ.25 వేల వరకు క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు ఇస్తున్నారు.

అంతిమయాత్ర

జననం 22-8-1951 | మరణం 16-1-2026

శ్రీమతి **తోటకూర విజయలక్ష్మి** గారు

W/o (లేటు) తోటకూర రాఘవేంద్రరావు గారు, పోరంకి

మా తల్లిగారైన శ్రీమతి తోటకూర విజయలక్ష్మి గారు
ది. 16-1-2026 శుక్రవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
అంతిమయాత్ర: ది. 17-1-2026 శనివారం ఉదయం 9.00 గంటలకు
మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.

కుమారుడు: **తోటకూర నరేష్‌కుమార్** కోడలు: **దీపిక**
✆ 90300 38246
కుమార్తెలు: **ఎనిగళ్ళ నవీన** అల్లుళ్ళు: **రాజగోపాల్**
అల్లూరి నీలిమ **భానుప్రసాద్**
మనుమలు: **తోటకూర ఆశ్రిత్‌కుమార్, తోటకూర శౌర్య**
అల్లూరి విశాల్, అల్లూరి దివ్య

చిన్న సినిమాల విజయం శుభ పరిణామం

పటమట, న్యూస్‌టుడే: తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడం తెలుగు చిత్ర సీమకు శుభ పరిణామమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. చిన్న సినిమాల విజయం వల్ల కొత్త ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారీ' చిత్రం సక్సెస్ మీట్ గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించారు. నిర్మాత అనిల్ సుంకర, దర్శకుడు రామ్ అబ్బరాజుతో కలిసి ఆయన కేక్ కోసి చిత్ర బృందాన్ని అభినందించారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ... ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోందని తెలిపారు. దర్శకుడు రామ అబ్బరాజు మాట్లాడుతూ.. సంక్రాంతికి విడుదలైన శర్వానంద్ సినిమాలు విజయం సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

కేక్ కోస్తున్న ఎంపీ శివనాథ్, నిర్మాత అనిల్ సుంకర, దర్శకుడు రామ్ అబ్బరాజు

బంగారు గొలుసు దొంగ అరెస్టు

పటమట, న్యూస్‌టుడే: మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. ఆ వివరాలను గురువారం స్టేషన్‌లో సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీఐ వెంకట రమణ, ఎస్ఐలు దుర్గామహేష్, శంకరరావు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ రాత్రి గాయత్రినగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు కత్తితో బెదిరించాడు. ఆమె మెడలో 80 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సాయంతో చోరీకి పాల్పడింది పటమటకు చెందిన పెనుకుదురు మహేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు. చోరీ చేసిన రూ.9 లక్షల విలువైన బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

సంగీత వారోత్సవాల్లో సందడి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంగీత వారోత్సవాల సందర్భంగా రెండో రోజు కౌతా పూర్ణానంద కళావేదికపై ఆర్ఆర్ఆర్ మెలోడీస్ అధ్యక్షుడు రాజు నిర్వహణలో సినీ సంగీత విభావరి జరిగింది. లక్ష్మణ్ నాయక్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్ రాజు, చింతకాయల చిట్టిబాబు, జయప్రభ ప్రసంగించారు.

క్రీడాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, నిర్వాహకులు

కబడ్డీ పోటీ.. ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర బాలురు కబడ్డీ జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించింది. ఆంధ్రా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఈడుపుగల్లులోని శ్రీసీతారామ గార్డెన్స్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ బాలురు కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను గురువారం కొల్లు రవీంద్ర ప్రారంభించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, శ్రీసీతారామ గార్డెన్స్ అధినేత నందమూరి విష్ణువర్ధనరావు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన లీగ్ పోటీలను తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. శనివారం నుంచి నాకౌట్ పోటీలు ప్రారంభమవుతాయని ఆంధ్రా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్యలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రీడల్లో ఎదగాలంటే క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి మాట్లాడుతూ... నగరంలో టెన్నిస్ పోటీలు ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు. రాష్ట్ర ఆక్వాటిక్ సంఘం కోశాధికారి ఐ.రమేష్, తెదేపా 26వ డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ నవీన లావణ్యలత, పక్కనే రాజేశ్వరి, రమేష్ తదితరులు

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.



పతకాలతో గాయత్రి

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉషశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ ఫణి వురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ వురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైననూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, ఋణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికి, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026.

ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

రైల్వే వాలీబాల్ కోచ్ రామనాథానికి సత్కారం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: వారణాసిలో ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 72వ జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలో భారతీయ రైల్వే పురుషుల జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన జాతీయ వాలీబాల్ జట్టు కోచ్ అరికపూడి రామనాథం చౌదరిని నాదెళ్ల బసవపూర్ణయ్య ట్రస్ట్ (ఎన్‌బీపీ), ఉమ్మడి కృష్ణా జిల్లా వాలీబాల్ సంఘం సంయుక్తంగా ఐజీఎంసీ స్టేడియంలోని వాలీబాల్ మైదానంలో శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. జాతీయ వాలీబాల్ పోటీలో భారతీయ రైల్వే జట్టు పదేళ్ల తర్వాత విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నట్లు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకరరావు తెలిపారు. రామనాథం ద.మ.రైల్వే విజయవాడ డివిజన్ మెకానికల్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కార్యక్రమానికి అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత, శాప్ డైరెక్టర్ అరెకపూడి రమణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎంతో కాలం తర్వాత భారతీయ రైల్వే జట్టు జాతీయ ఛాంపియన్‌గా నిలవడానికి కోచ్ రామనాథం చేసిన కృషి అభినందనీయమని అన్నారు. జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, ఎన్‌బీపీ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న చౌదరితో ఎన్‌బీపీ ట్రస్ట్, జిల్లా వాలీబాల్ సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు

అశ్రునివాళి

కీ॥శే॥ **గుళ్ళపల్లి శ్రీనుబాబు** గారు

చెరగని చిరునవ్వుతో.. మమతల మాధుర్యాన్ని పంచుతూ.. మంచికి మారుపేరుగా, ఆత్మీయులుగా అందరి మనసుల్లో నిలిచి.. మా అభివృద్ధికి బంగారు బాట వేసి.. మా హృదయాల్లో చెరగని ముద్ర వేసి.. దైవ సన్నిధికి చేరిన మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

తల్లిదండ్రులు : **గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు** (లేటు) - **కస్తూరి**
భార్య : **గుళ్ళపల్లి శశిపూర్ణిమ** కుమార్తె : **భవిష్య**
తమ్ముడు : **గుళ్ళపల్లి రామకృష్ణబాబు** - మరదలు : **నవీల**
తమ్ముని కుమారుడు : **గుళ్ళపల్లి పునీత్ సుబ్రహ్మణ్యం,** తమ్ముని కుమార్తె : **ఆద్య**
చెల్లెలు : **బోయపాటి శ్రీలత** - బావ : **బోయపాటి ఫణిరాజశేఖర్**
మేనల్లుళ్ళు : **ఆశిష్, రోహిత్**

పెద్దకర్మ : ది. 17-01-2026 శనివారం నాడు విజయవాడ గురునానక్ కాలని రోడ్డులోని NAC కళ్యాణ వేదిక నందు జరుపబడును.

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

పతంగులు తొలగించరూ..



విద్యుత్తు తీగల్లో ఇరుక్కున్న పతంగి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : సంప్రదాయ ఆటల్లో భాగంగా పిల్లలు, పెద్దలు పతంగులు ఎగరేస్తారు. ఈ క్రమంలో వాటికున్న మాంజా తెగిపోయి విద్యుత్తు తీగల్లో ఇరుక్కుపోయింది. దీంతో ప్రమాదం జరగక ముందే దాన్ని తొలగించాలని విద్యుత్తుశాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

డీఏ విడుదలపై సంతోషం

నందిగామ, న్యూస్‌టుడే: 30 నెలల డీఏ బకాయిలు విడుదల చేయడంపై స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెల్ల ఉమామహేశ్వర గుప్తా, కార్యదర్శి కేబీఎస్ ప్రసాదరావు, కోశాధికారి ప్రసాద్ సంతోషం వ్యక్తంచేశారు. 2018 జులై నుంచి 2020 వరకు చెల్లించాల్సిన బకాయిలు రావటం వల్ల పండగను ఆనందంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

చర్చి స్వర్ణోత్సవాలు నేడు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి స్వర్ణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో వీలాపతిని జార్జ్ కోర్నిలియస్, జావహరుమారు, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

సమస్యలకు మోడల్ కాలనీ!

జనావాసాల మధ్య నిలిచిన మురుగు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆ కాలనీ గ్రామానికే కాదు అభివృద్ధికి సైతం ఆమడ దూరంలో ఉంది. కనీస మౌలిక వసతులు లేక నిత్యం సమస్యలతో సతమతమవుతున్న ఆ కాలనీనే డీవీఆర్ మోడల్ కాలనీ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో వేసిన సీసీ రహదారులు మినహా మురుగు, తాగు నీటి సమస్యలు స్థానికులను నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పక్కా కాలువలు లేక పోవడంతో పలు చోట్ల మురుగు రహదారులపైనే నిల్వ ఉంటోంది. వీటి నిర్వహణ లోపంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువై కాలనీవాసులు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగు నీటి సరఫరా ప్రస్తుత జనాభా అవసరాలను తీర్చడం లేదని స్థానికులు వాపోతున్నారు. నాటి తెదేపా ప్రభుత్వ హయాంలో తాగు నీటి కోసం నూతన ట్యాంకు నిర్మాణం మొదలుపెట్టినప్పటికీ, తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అది నిలిచిపోయింది. తమ కాలనీ సమస్యలకు మోడల్‌గా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా తమ కాలనీకి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

జూద శిబిరంపై దాడి

వెల్లంకి (వీరులపాడు), న్యూస్‌టుడే: వెల్లంకి గ్రామశివారులో జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8190 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభిమన్యు తెలిపారు.

కాసుక్కూర్చున్నారు!

- శిబిరాల్లోనే మకాం
- కోడి పందేలు, జూదాల్లో చేతులు మారిన రూ. కోట్లు

నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి(న్యూస్‌టుడే)

నవాబుపేట బరిలో ..

నందిగామ డివిజన్‌లో మూడురోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించారు. సంక్రాంతి పండగ సంప్రదాయం ముసుగులో బహిరంగంగానే చట్టవ్యతిరేక జూద శిబిరాలు నడిపారు. పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా కోత ముక్కలాటలు నిర్వహించటం వల్ల రూ.లక్షలు చేతులు మారాయి. రెండు తెలుగు రాష్ట్రాలవాసులు జూద క్రీడల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొందరి జేబులు ఖాళీ కాగా మరికొందరు లాభపడ్డారు. కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద క్యాసినో తరహాలో పేకాట నిర్వహించారు. ఈ శిబిరాల్లో అన్ని సదుపాయాలు కల్పించటంతో రాత్రి, పగలు తేడా లేకుండా ముక్కలాట ఆడారు. నందిగామ మండలం రామిరెడ్డిపల్లి, పెనుగంచిప్రోలులో మామిడి తోటల్లో జూద శిబిరాలు నిర్వహించారు. నందిగామ, ఐతవరం, మామిడితోటల్లో, చందాపురం వద్ద, వత్సవాయి మండలం లింగాల, వత్సవాయి వద్ద కోడిపందేలు జోరుగా సాగాయి. శిబిరాలు వద్దనే మద్యం ఏరులై పారింది. జూద శిబిరాల నిర్వాహకులే మద్యం సరఫరా చేశారు. ఈసారి కోడి పందేలను తిలకించేందుకు బరుల వద్దకు యువతులు, మహిళలు ఉత్సాహంగా తరలివచ్చారు. శిబిరాల నిర్వహణకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు పోలీసు అధికారులు అనధికార అనుమతులు ఇచ్చారు. ఈసమయానికి కోడిపందేలు ముగించిన తర్వాత కూడా జూదం కొనసాగించారు నిర్వాహకులు. బహిరంగంగా జూద శిబిరాలు నిర్వహించటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జూద శిబిరంలో డబ్బు ఎడుతున్న ఆశావహులు

కర్షకుల కష్టాల కనుమా!

సంక్రాంతి కనుమ పండగను పురస్కరించుకుని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మన్నెం తిరుమలదేవి వేసిన రంగవల్లిక ఆలోచింపజేసింది. మండలంలోని చందాపురం గ్రామంలో శుక్రవారం ఆమె ముగ్గుతో ఎడ్లబండితో వస్తున్న రైతు చిత్రాన్ని గీశారు. 'రైతే రాజు రైతు లేనిదే అన్నం లేదు', 'రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి' అని నినాదాలు గీశారు. పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోయారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. కాగా మునగచర్ల గ్రామంలో గురువారం సాయంత్రం బొడ్రాయి సెంటరులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఎస్సై మహతి, భాజపా నాయకురాలు కల్లూరి శ్రీవాణి, సర్పంచి పి.నరసింహయ్య, పాలకేంద్రం అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట ఆడారు. చిన్నారులు నృత్యాలతో సందడిచేశారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

కనుమనాడు గోపూజ

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పూజారులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం కనుమ పండగ సందర్భంగా గోపూజ చేశారు. ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి ఆదేశాలమేరకు సంప్రదాయబద్ధంగా గోవులకు పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు చుంచు రమేష్‌బాబు, శనగవరపు వెంకటేశ్వర శాస్త్రి, కల్లూరి శ్రీవాణి, ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో భట్టి విక్రమార్క పూజలు

అమ్మవారికి పూజలు చేస్తున్న భట్టివిక్రమార్క

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయాన్ని భట్టివిక్రమార్క సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పూజారుల, అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో భట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు, అర్చకులు, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేపాల మోహనరావు, ఆలయ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ, ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పురపాలక సంఘ ఎన్నికలపై ఆరాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నాయకులతో సమావేశమయ్యారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మామిడితోటల్లో శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ఇతర బాధ్యులతో అంతర్గత సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. దీనిలో ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం.

శ్మశానవాటిక అభివృద్ధి చేయండి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన జనసేనపార్టీ కార్యకర్తలు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుకు వినతిపత్రం అందజేశారు. ఏడాది క్రితం మృతి చెందిన పార్టీ కార్యకర్త తోట తిరుపతిరావుకు వచ్చే బీమా మంజూరు కాలేదని చెప్పారు. గ్రామంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు. నందిగామ ఏఎంసీ డైరెక్టర్ సూరా సత్యనారాయణ, ఆకుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రామినేని సోదరుల వర్ధంతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కమ్మవారిపాలెంలో రామినేని సాయి, శ్రీనివాసరావు 25వ వర్ధంతిని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్, శ్రీరామినేని లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, ఫణికౌశిక్, బేబీరాణి వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. రైతు సమస్యలు, విద్యుత్తు పోరాటాలపై ప్రజలను చైతన్యం చేశారని గుర్తుచేశారు.

భక్తులతో పోటెత్తిన దేవాలయాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గురువారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. స్థానిక ముక్కోటి మండపంలో గోదారంగనాథులు, శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వేదపండితులు వెంకటరత్నమాచార్యులు, ధన్వంతరి, తితిదే వేదపండితుడు దుర్భాకుల సాంబమూర్తి అవధాని వైభవంగా నిర్వహించారు. దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి స్వామి వారికి తలంబ్రాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. స్థానిక సాయిఅయ్యప్ప దేవాలయంలో మహిళలు శిర్డీ సాయిబాబాకు పల్లకీసేవ నిర్వహించారు. గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

అంబారుపేటలో పుష్పాలంకరణలో సత్యమ్మతల్లి మూలమూర్తి

గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామి

చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మాగల్లులో ముత్యాలమ్మ తల్లి

పీటల మీద కూర్చునే దంపతులు దరఖాస్తు చేసుకోవాలి

పెనుగంచిప్రోలు: శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణమహోత్సవంలో పీటల మీద కూర్చునేందుకు కాకాని, కొల్లా వంశీకులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి కోరారు. ఫిబ్రవరి ఒకటో తేదీ రాత్రి 9:05 గంటలకు అమ్మవారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. దీనిలో పీటల మీద కూర్చునేందుకు సంప్రదాయం ప్రకారం పెనుగంచిప్రోలు గ్రామంలో శ్రీగోపయ్య స్వామి తరపున కాకాని ఇంటి పేరుతో కోళ్లూరు గోత్రం వారు, తిరుపతమ్మ అమ్మవారి తరపున కొల్లా ఇంటి పేరుతో పగిడిపాళ్ల గోత్రం వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వంశీకులు ఈనెల 22 నుంచి 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు ఏదైనా జాతీయ బ్యాంకులో ఆలయ ఈవో పేరుతో తీసిన రూ.5116 డీడీతో కలిపి అర్జీ పెట్టుకోవాలని కోరారు. అన్ని దరఖాస్తులను కలిపి ఈనెల 23వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు లాటరీ పద్ధతిలో కాకాని, కొల్లా వంశీకుల్లో ఒక్కొక్కర్ని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు అమ్మవారికి, స్వామివారికి రూ.ఐదు వేలు ఖరీదు చేసే పట్టువస్త్రాలు ఈనెల 27వ తేదీ లోపు అప్పగించాల్సి ఉంటుందని చెప్పారు.

కల్యాణం అక్షింతలు తయారీ 23న

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణానికి ముత్తయిదువులతో కల్యాణం అక్షింతలు కలిపే కార్యక్రమం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో ముత్తయిదువులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా



పతకాలతో నాగిడి గాయత్రి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరోసారి ప్రతిభను చాటిందని పేర్కొన్నారు.

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శుక్రవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కరి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

బంగారం గొలుసు దొంగ అరెస్ట్

పటమట, న్యూస్‌టుడే: మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. ఆ వివరాలను గురువారం స్టేషన్‌లో సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీఐ వెంకట రమణ, ఎస్ఐలు దుర్గామహేష్, శంకరరావు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ రాత్రి గాయత్రినగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు కత్తితో బెదిరించాడు. ఆమె మెడలో 80 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సాయంతో చోరీకి పాల్పడింది పటమటకు చెందిన పెనుకుదురు మహేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు.

తాగి వాహనం నడపడం ప్రమాదకరం

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరమని, వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై పి. విశ్వనాథ్ పేర్కొన్నారు. కీసర టోల్ ప్లాజా వద్ద శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తాగి వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వహణలో వివాదం

జి.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడి పందేలను శుక్రవారం సాయంత్రం ముగించే సమయంలో వివాదం చోటు చేసుకుంది. గంగినేని గ్రామంలో పందేలు ముగిసిన సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు యువకులు సందడి చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం రేమిడిచర్ల నుంచి పందేలకు వచ్చిన గోసి పరమేశ్వరరావు అనే వ్యక్తి పక్కనే ఉన్న బండి వద్ద నూడిల్స్ తింటూ గంగినేనికి చెందిన వ్యక్తులను కామెంట్ చేయగా వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో పరమేశ్వరరావుపై గంగినేనికి చెందిన యువకులు ఘర్షణ పడి దాడి చేయగా అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే ఎర్రుపాలెం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ వివాదాన్ని ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌ను సైతం పక్కకు తోసేసి దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. వివాదానికి కారణమైన వ్యక్తులను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

హోరెత్తిన సంక్రాంతి సంబరాలు

ఐతవరం బరిలో పోరుకు సిద్ధమైన కోడిపుంజులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందేలు నిరాటంకంగా సాగాయి. మూడు రోజులు రూ.కోట్లు చేతులు మారాయి. పండగ ముందు హడావుడి చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ తరవాత బరుల వైపు కన్నెత్తి చూడలేదు. నిర్వాహకులు కోడిపందేలతో పాటు జూదం, గుండాట తదితర క్రీడలను జోరుగా కొనసాగించారు. గురు, శుక్రవారాల్లో ఐతవరం, రామిరెడ్డిపల్లి, గట్టుమూల మామిడితోటల్లో పందేలు జరిగాయి. రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు నిర్వహించారు.

చందర్లపాడు, న్యూస్‌టుడే: కొడవటికల్లు సోమేశ్వరస్వామి ఆలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వాసిరెడ్డి శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

వీరులపాడు, న్యూస్‌టుడే: పెద్దాపురం గ్రామంలో రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ముగ్గులు, ట్రాక్టర్ ట్రాలీ పోటీలు నిర్వహించారు. జుజ్జూరు గ్రామంలో మేడికొండూరు హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

కీసర వద్ద కత్తి కడుతున్న పోటీదారులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: సంక్రాంతి వేళ దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది. కోడి పందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసులు చేతులెత్తేశారు. కీసర జాతీయ రహదారి సమీపంలో వేసిన కోడి పందేలకు ఔత్సాహికులు పోటెత్తారు. గండేపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరానికి ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. మూడు రోజుల్లో కోట్ల రూపాయల నగదు చేతులు మారింది.

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడులో శుక్రవారం కోడి పందేలు, పొట్టేళ్ల నిర్వహించారు. కొడవటికల్లు రహదారి వెంబడి ప్రైవేటు పాఠశాల వెనుక కోడి పందేలు జోరుగా కొనసాగాయి. గుండాట, జూద శిబిరాలను ఏర్పాటు చేశారు.

బహుమతులు పంపిణీ చేస్తున్న రమేష్, జ్యోతి దంపతులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని ముళ్లపాడు గ్రామంలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు జరిపారు. గంగిరెద్దుల విన్యాసాలు, మహిళల కోలాటం, గుర్రపు స్వామి, చిన్నారుల భరత నాట్యం అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు అమరనేని రమేష్‌బాబు, జ్యోతి దంపతులు బహుమతులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి గూడపాటి లావణ్య, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట గ్రామంలో గత 11 రోజులుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలు, యువజన మైత్రికి బాటలు అనే నినాదంతో వివిధ క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, క్రికెట్, ముగ్గులు, షటిల్, వ్యాసరచన, రన్నింగ్, తాడులాగుడు తదితర ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం బహుమతులు అందజేశారు.

గ్రామోత్సవంలో స్వాములు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో శ్రీతిరుపతమ్మ అమ్మవారి భజనను అమ్మవారి దీక్షా స్వాములు వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి నమూనా విగ్రహాలతో గ్రామోత్సం చేశారు. అనంతరం గ్రామంలోని డౌన్ సెంటర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భజన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతూ ఒకరి దుర్మరణం

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన కీసర జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన రాచబండి లక్ష్మీనారాయణ(52) స్థానికంగా దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 14న జాతీయ రహదారి పక్కనే ఉన్న పెట్రోలు బంకులో పని నిమిత్తం వెళ్లి అవతలి వైపునకు చేరుకునే క్రమంలో వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడగా, వాహనంపై ఉన్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీనారాయణ మృతి చెందారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

300 మందికి వైద్య పరీక్షలు

శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాసిరెడ్డి ప్రసాద్

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెం పంచాయతీ పరిధిలోని పాత బెల్లంకొండవారిపాలెంలో కారుణ్య ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వడ్లమడుగు లక్ష్మీనారాయణ, పాస్టర్ రాజా, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంభంపాడులో ముగిసిన క్రికెట్ పోటీలు

విజేతలకు ట్రోఫీ అందిస్తున్న పోలీసు అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా ఎ.కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఇందులో ఎ.కొండూరు యువత, పోలీసు జట్టు, వల్లంపట్ల యువత వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రోఫీలు, ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలతో పాటు అక్కడి నాగసింధు స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఆర్థిక సౌజన్యంతో 'మాదకద్రవ్యాల వినియోగం వద్దు..శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాదం ఉన్న జెర్సీలను ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు కార్మికుల ఆశ అడియాస

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మిక వర్గాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గత బకాయిలు, సర్వీస్ ఇన్‌సెంటివ్‌లు వస్తాయని అనుకున్న విద్యుత్తు సంస్థల కార్మికుల ఆశ అడియాసగా మారింది. ఇందుకు కారణం ముమ్మాటికీ అధికార యంత్రాంగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి గత బకాయిలు, ఇన్‌సెంటివ్‌ల కోసం 2025 సెప్టెంబరు 10న ఎన్టీటీపీఎస్‌తో పాటు ఇతర విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల వద్ద కార్మిక సంఘాలు దీక్షలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపాయి. గత బకాయిలు చెల్లించడంతో పాటు 20 ఏళ్ల విధుల్లో కొనసాగిన కార్మికులకు సర్వీస్ ఇన్‌సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అందులో భాగంగానే జనవరి- 2026 వేతనాలతో కలిపి దశల వారీగా వాటిని చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయగా కొద్దిమంది కార్మికులకు మాత్రమే నగదు జమైంది. అయితే కార్మికులకు సంబంధించిన సర్వీస్ వివరాలు ఎస్ఈ, డీఈ కార్యాలయాల నుంచి విద్యుత్తు కేంద్ర కార్యాలయానికి వెళ్లాల్సిన జాబితా జాప్యం చోటు చేసుకుంది. దీంతో అర్హత కలిగిన కార్మికులందరికీ వేతనాలతో కూడిన బకాయిలు చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో కేవలం జనవరి వేతనాలకే పరిమితమయ్యామని ఎన్టీటీపీఎస్ కార్మికులు వాపోతున్నారు.

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జె.నవీన లావణ్యలత, పక్కనే రాజేశ్వరి, రమేష్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్యలత ప్రారంభించారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

బొమ్మల కొలువు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: స్థానిక 34వ డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఒకటి నుంచి 8 లైన్లతో పాటు ఖుద్దూస్‌నగర్, శాంతి నగర్, బొగ్గులైను రైల్వే కాలనీల్లో సంబరాల్లో భాగంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు.

కబడ్డీ పోటీ.. ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు రాష్ట్ర జట్టు

క్రీడాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నిర్వాహకులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర బాలుర కబడ్డీ జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించింది. ఆంధ్రా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఈడుపుగల్లులోని శ్రీసీతారామ గార్డెన్స్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ బాలుర కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను గురువారం కొల్లు రవీంద్ర ప్రారంభించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, శ్రీసీతారామ గార్డెన్స్ అధినేత నందమూరి విష్ణువర్ధనరావు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన లీగ్ పోటీలను తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆంధ్రా జట్టు.. మణిపూర్, కేరళ జట్లపై విజయం సాధించగా.. హిమాచల్‌ప్రదేశ్ జట్టు ఒడిశాపై, ఉత్తరాఖండ్ జట్టు గుజరాత్‌పై, శాయ్ జట్టు తెలంగాణపై, మధ్యప్రదేశ్ జట్టు పశ్చిమ్ బెంగాల్‌పై, చండీగఢ్ జట్టు దిల్లీపై, పంజాబ్ జట్టు ఝార్ఖండ్‌పై, ఛత్తీస్‌గఢ్ జట్టు విదర్భపై, గోవా జట్టు జమ్మూ-కశ్మీర్‌పై, తమిళనాడు జట్టు పుదుచ్చేరిపై, హరియాణా జట్టు ఒడిశాపై, మహారాష్ట్ర జట్టు గుజరాత్‌పై, కర్ణాటక జట్టు తెలంగాణపై, గోవా జట్టు ఝార్ఖండ్‌పై, రాజస్థాన్ జట్టు పశ్చిమ్ బెంగాల్‌పై, విదర్భ జట్టు పుదుచ్చేరిపై, ఉత్తర్‌ప్రదేశ్ జట్టు దిల్లీపై, ఝార్ఖండ్ జట్టు జమ్మూ-కశ్మీర్‌పై, బిహార్ జట్టు కేరళపై, దిల్లీ జట్టు త్రిపురపై విజయం సాధించాయి. శనివారం నుంచి నాకౌట్ పోటీలు ప్రారంభమవుతాయని ఆంధ్రా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం: ✦ భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు మార్గంలో ఖాళీ స్థలాల్లో పలువురు యువకులు మద్యం తాగుతున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఉంచారు. ✦ కుమ్మరివీధులు ప్రాంతంలో మూడో లైన్‌లో పూడిక పేరుకుందని, దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా సమాచారం ఇచ్చారు. పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? చిట్టినగర్ అమ్మవారి ఆలయం వెనుక వీధిలో రోడ్డుపై చెత్త తీయడం లేదు. **- రాజారావు, స్థానికుడు.** ✔ కార్మికులతో చెత్త తరలిస్తాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**

? పాల ఫ్యాక్టరీ బస్టాండ్ ఆవరణలోని కాలువలో పూడిక పేరుకుంది **-చిట్టిబాబు, స్థానికుడు.** ✔ కార్మికులతో పూడిక తీయిస్తాం. **- ఆనంద్‌కృపాల్, స్థానిక శానిటరీ అధికారి.**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆహ్లాదం నిండుగా.. వసతులు మెండుగా!

పార్కులు అభివృద్ధి చేస్తున్న కార్పొరేషన్

విజయవాడ నగరపాలక సంస్థ, చిట్టినగర్, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ పార్కులను పునరుద్ధరించడంతో పాటు, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. కొంతకాలంగా పార్కులు నిర్వహణ లోపంతో కునారిల్లుతున్నాయి. ప్రస్తుతం వాటిని రూ.4.13 కోట్ల వ్యయంతో ఆహ్లాదంగా తయారు చేయడమే కాకుండా చిన్నారులకు ఆట పరికరాలు, పెద్దలకు వ్యాయామ శాలలు ఏర్పాటు చేస్తున్నారు.

●● నగరంలో మూడు కమర్షియల్ పార్కులున్నాయి. రాజీవ్ గాంధీ పార్కు, రాఘవయ్య - అంబేడ్కర్ పార్కు, కేవీఎల్ రావు పార్కులను ఎప్పటికప్పుడు రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. స్క్రాప్ పార్కును కూడా అందంగా తీర్చిదిద్దారు.

●● వివిధ కాలనీలతో పాటు, ఏలూరు, బందరు, రైవస్ కాలువ కట్టలపై పార్కులతో కలిపి మొత్తం 173 పార్కులు ఉన్నాయి. అందులో ఎక్కువ పార్కులు అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ గట్ల వెంట పచ్చదనం పెంపునకు రూ.లక్షల వ్యయం చేస్తున్నా... వాటిపైనున్న పార్కులను మాత్రం పట్టించుకోవడం లేదు.

●● వివిధ డివిజన్లలోని 119 పార్కులు పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. 54 పార్కులను మాత్రం వదిలేశారు. అవి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైన వాటిలో కొన్నింటిని గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు.

ట్రెండ్‌సెట్ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్న ఆట పరికరాలు

నిధుల కేటాయింపు ఇలా...

●● మూడు నియోజకవర్గాల్లోని 17 పార్కుల్లో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయాయి. వాటిని తొలగించేందుకు రూ.2.78 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రూ.1.70 కోట్ల వ్యయంతో పనులు చేపట్టి అడ్డంకులు తొలగించారు. మొక్కలు నాటారు. రూ.88 లక్షల వ్యయంతో మరికొన్ని అదనపు పనులు చేస్తున్నారు. కొన్ని పనులు టెండరు దశలో ఉన్నాయి. ●● భవానీపురం రోజ్ గార్డెన్ పార్కును రూ.18 లక్షలతో పునరుద్ధరిస్తున్నారు. ●● ఎల్బీఎస్ నగర్ పార్కు అభివృద్ధికి రూ.64 లక్షలు వెచ్చిస్తున్నారు. ●● ఏఎస్ఆర్-2 పార్కులో వసతులకు రూ.కోటి ఖర్చు చేస్తున్నారు. ●● కండ్రిక ఎస్సీ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.19.95 లక్షలతో అంచనాలు రూపొందించారు. ●● కుందావారి కండ్రిక కేకే అపార్టుమెంట్ ఏరియా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ●● సింగ్‌నగర్ నందనవనం పార్కులో రూ.45 లక్షలతో పనులు చేపట్టారు. ●● గాంధీ నగర్ గోరా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ●● 29వ డివిజన్ ట్రెండ్‌సెట్ పార్కు అభివృద్ధికి రూ.38 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ●● దుర్గాపురం 27వ డివిజన్ పార్కు అభివృద్ధి రూ.38 లక్షలు కేటాయించారు.

రేపు భవానీపురంలో ఎన్టీఆర్ వర్ధంతి

భవానీపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని భవానీపురం బ్యాంకు సెంటర్‌లో ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు తెదేపా 40వ డివిజన్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించడంతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

పర్యావరణ హిత సంచులే వినియోగించండి

విజయవాడ నగరపాలక సంస్థ: ప్లాస్టిక్ సంచుల వాడకంపై నిషేధం ఉన్నందున నగర ప్రజలు కేవలం పర్యావరణ హిత సంచులు మాత్రమే ఉపయోగించాలని కార్పొరేషన్ చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నగరపాలక సంస్థ అవగాహన కల్పిస్తున్నందున ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక సారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని విక్రయదారులు ప్రత్యామ్నాయం గుర్తించాలని అన్నారు. వాటిని వినియోగించినా, విక్రయించినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధం సమర్థవంతంగా అమలయ్యేలా అందరూ సహకరించాలని కోరారు.

సినిమాలు

నారీ నారీ నడుమ మురారి: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణ కాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **అనగనగా ఒకరాజు, మన శంకరవరప్రసాద్‌గారు, భర్త మహాశయులకు విజ్ఞప్తి:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా ప్రీమియర్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

ఈద్గా, షాదీఖానా అభివృద్ధి చేస్తాం

షాదీఖానా గ్రౌండ్‌లో మసీదు సందర్శించిన ఎంపీ శివనాథ్, నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా గుప్తాసెంటరు సమీపంలోని ఈద్గా, షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. గుప్తా సెంటరు సమీపంలోని ఈద్గా, షాదీఖానాలను మసీదు కమిటీ ఆహ్వానం మేరకు తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాన్, మక్కా మదీనా మసీద్ కమిటీల సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఆయనకు కమిటీ సభ్యులు సాదర ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... పేద ముస్లిం వర్గాల అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ఉన్న ఏకైక షాదీఖానాను తెదేపా ప్రభుత్వం రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించిందన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్, వైకాపా ప్రభుత్వాలు మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా వాటిని అభివృద్ధి చేసేందుకు ఎంపీ నిధులతోపాటు వక్ఫ్‌బోర్డు నిధులు కేటాయించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తామన్నారు. పఠాన్‌ఖాన్ అభివృద్ధికి మదీనా కమిటీ సంరక్షణలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారు. తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి పఠాన్‌ఖాన్ మాట్లాడుతూ.. 3.5 ఎకరాల శ్మశాన వాటికలో రోడ్డు, విద్యుత్తు సౌకర్యం లేక ముస్లిం కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఎంపీ సహకారంతో వాటిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మక్కా, మదీనా మసీదు కమిటీల సభ్యులు హుస్సేన్, బషీర్, యూసఫ్, తెదేపా నాయకులు తమీమ్ అన్సారీ, శివశర్మ, కోటమల్లి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి గోసంరక్షణకు విరాళం

దాతలు వెంకట శివాజీ, పాండురంగారావు కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అభివృద్ధి, గోసంరక్షణకు ఇద్దరు దాతలు రూ.2,00,116 విరాళాలను శుక్రవారం అందజేశారు. హైదరాబాద్ నివాసి గద్దం వెంకట శివాజీ దేవస్థానం అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,00,116, రామకృష్ణాపురం నివాసి కూర్మాల పాండురంగారావు ఆలయ గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దేవస్థానం వేదపండితులు, సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా కపిల గోమాత పూజ

శ్రీచక్రనవావరణార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కనుమ పండగను పురస్కరించుకొని కపిల వర్ణ గోమాతకు శుక్రవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజ నిర్వహించారు. దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లతో అర్చకులు పూజ చేయించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన పలువురు భక్తులు గోపూజ చేశారు. ✦ దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రతి రోజు గోశాలలోని ఆవు పాలను అమ్మవారి శ్రీచక్రార్చనకు వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు 6 లీటర్ల పాలను అమ్మవారి ఆలయంలో వివిధ పూజల నిమిత్తం దేవస్థానం గోశాల నుంచి తీసుకొస్తారని అధికారులు తెలిపారు.

18 వరకు సత్యలో ప్రత్యేక ఆఫర్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా నగరంలోని సత్య షోరూమ్‌ల్లో ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు తగ్గిస్తున్నారు. టెలివిజన్లు రూ.7,990 నుంచి, ఫ్రిజ్‌లు రూ.13,990 నుంచి, ఎయిర్ కండిషనర్లు రూ.29,990 నుంచి, వాషింగ్ మెషిన్లు రూ.10,990 నుంచి లభిస్తున్నాయి. మొబైల్ కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తున్నారు. 5జీ మొబైల్స్ రూ.7,990 నుంచి, 60 శాతం వరకు రాయితీ, రూ.12 వేల వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తున్నారు. నెక్ బ్యాండ్లు కేవలం రూ.199కే, పోర్టబుల్ పార్టీ బ్లూటూత్ స్పీకర్లు రూ.2,449కే లభిస్తున్నాయి. కిచెన్ కాంబోను రూ.10,999కే అందిస్తున్నారు. వాటర్ హీటర్లు రూ.3,300 నుంచి, ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి అందుబాటులో ఉన్నాయి. రూ.888 నుంచి ఈఎంఐ, రూ.25 వేల వరకు క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

త్రిపురనేని జీవితం స్ఫూర్తిదాయకం

రామస్వామి చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అదనపు కమిషనర్(జ) రవీంద్రరావు తదితరులు

విజయవాడ నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కమిషనర్ (జనరల్) ఎ.రవీంద్ర రావు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రవీంద్రరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ... కృష్ణా జిల్లాలో జన్మించిన త్రిపురనేని చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారని తెలిపారు. న్యాయ విద్యనభ్యసించి న్యాయవాదిగా సమాజ హితం కోసం పని చేశారని గుర్తు చేశారు. విలువలతో కూడిన సాహిత్యాన్ని రచించి ఎంతో మంది మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆయన రచనలు ప్రజల్లో మంచి ఆలోచనలు రేకెత్తించడమే కాకుండా సమాజంలో చైతన్యం కలిగించాయని తెలిపారు. కుల వ్యవస్థలో అసమానతలు, అన్యాయాలను అరికట్టడం కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఓ రజియా షబీన, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి ఈశ్వరయ్య, అరుణ్‌కుమార్ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: హేతువాద ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత త్రిపురనేని రామస్వామి అని సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద శుక్రవారం ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ద్వారక సుదర్శన్ నేతృత్వంలో కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అభ్యుదయ కవిగా ఆయన రచించిన పుస్తకాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. కృష్ణా జిల్లా అంగలూరులో జన్మించిన రామస్వామి ప్రభావం వామపక్ష ఉద్యమాలకు ఊతమైందన్నారు. ప్రజా నాట్య మండలి కళాకారుడు పిచ్చయ్య విప్లవ గీతాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో మోతుకూరి అరుణ్‌కుమార్, త్రిపురనేని హితేష్, అశోక్‌కుమార్, నారాయణరావు, ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోళ్ల పందేలు...

గొల్లపూడి సమీపంలో బరి

భవానీపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి పురస్కరించుకుని కోళ్ల పందేలు జోరుగా సాగాయి. భవానీపురం ఊర్మిళానగర్, కొత్తూరు తాడేపల్లి, గొల్లపూడి సమీపంలో పెద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. పందేలు తిలకించేందుకు ప్రవేశ రుసుము కూడా వసూలు చేశారు.

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా

పతకాలతో నాగిడి గాయత్రి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.

పండగలు.. మన సంప్రదాయాలకు ప్రతీక

కోలాట బృందంతో వాకర్స్ ప్రతినిధులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండగలని వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు రావి కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని విజయవాడ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ.. నడకతో ఆరోగ్యాన్ని రక్షించుకుంటూ, సమాజ క్షేమాన్ని కాంక్షిస్తూ కలిసి పండగలు నిర్వహించుకోవడం ఆదర్శనీయమని అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు తాండవ హనుమంతరావు, విజయవాడ వాకర్స్ సంఘం అధ్యక్షుడు మోటూరి ప్రభాకర రావు, కార్యదర్శి వి. సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భోగి మంటలు, హరిదాసు, గంగిరెద్దులు, డప్పు కళాకారుల విన్యాసాలు, రాజేష్ బృందం కోలాటం, జానపద గేయాలు అలరించాయి. భాగవతుల రామశర్మ శిష్య బృందం జానపద నృత్యాలు ఉల్లాసపరిచాయి. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

పందేల నిర్వహణకు విద్యుత్తు చౌర్యం

విద్యుత్తు తీగల వద్ద నుంచి ఇలా..

భవానీ పురం, న్యూస్‌టుడే: జక్కంపూడి పాములకాలువ వద్ద కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు విద్యుత్తు చౌర్యం చేశారు. పేరుకు మాత్రం జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే... ప్రాంగణంలో విద్యుత్తు సరఫరాకు మాత్రం సమీపంలోని విద్యుత్తు తీగల నుంచి ఏర్పాటు చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్తు దీపాలు, మైక్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పెద్ద ఎత్తున వినియోగించారు. పట్టపగలే నిర్వాహకులు విద్యుత్తు చౌర్యం చేసినప్పటికీ విద్యుత్తు శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. నగరానికి సమీపంలో యథేచ్ఛగా కోళ్ల పందేలు నిర్వహించినా పోలీసులు, అధికారులు పట్టనట్లు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రైల్లో మహిళ హ్యాండ్ బ్యాగ్ మాయం

నిమిషాల వ్యవధిలోనే రికవరీ

హ్యాండ్ బ్యాగ్‌ను అందిస్తున్న రైల్వే పోలీస్

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్లో బంగారం వస్తువులు ఉన్న మహిళా ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్ చోరీకి గురి కాకుండా విజయవాడ రైల్వే పోలీసులు తిరిగి అందించిన ఘటన విజయవాడ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ నెల 15న నాగర్‌సోల్-నర్సాపూర్ మధ్య నడిచే రైల్లో సింగ్‌నగర్‌కు చెందిన కొత్తా శ్రీదేవి, శ్రీనివాసరావు దంపతులు ఏసీ బోగీలోని బీ-2లో ప్రయాణిస్తున్నారు. రైలు విజయవాడ 7వ నంబరు ప్లాట్‌ఫారంపైకి చేరుకోగానే లగేజీ మొత్తం కిందకు దించారు. తర్వాత చూసుకోగా తన హ్యాండ్ బ్యాగ్ కనబడలేదు. అప్పటికే రైలు కదిలేందుకు సిద్ధంగా ఉంది. వెంటనే జీఆర్పీ సీఐ జె.వి.రమణకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. బోగీలోకి వెళ్లి పరిశీలించగా.. హ్యాండ్ బ్యాగు దొరికింది. అందులో రూ.15 లక్షల విలువ చేసే 15 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి బంగారం వస్తువులు చోరీకి గురి కాకుండా చూసిన సీఐ రమణతో పాటు సిబ్బంది ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జె.నవీన లావణ్యలత, పక్కనే రాజేశ్వరి, రమేష్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్యలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రీడల్లో ఎదగాలంటే క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి మాట్లాడుతూ... నగరంలో టెన్నిస్ పోటీలు ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు. క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ టోర్నీలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆక్వాటిక్ సంఘం కోశాధికారి ఐ.రమేష్, తెదేపా 26వ డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వాలీబాల్ కోచ్ రామనాథానికి సత్కారం

చౌదరిని సన్మానించిన ఎన్‌బీపీ ట్రస్ట్, జిల్లా వాలీబాల్ సంఘ ప్రతినిధులు క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: వారణాసిలో ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 72వ జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలో భారతీయ రైల్వే పురుషుల జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన జాతీయ వాలీబాల్ జట్టు కోచ్ అరికపూడి రామనాథం చౌదరిని నాదెళ్ల బసవ పూర్ణయ్య ట్రస్ట్ (ఎన్‌బీపీ), ఉమ్మడి కృష్ణా జిల్లా వాలీబాల్ సంఘం సంయుక్తంగా ఐజీఎంసీ స్టేడియంలోని వాలీబాల్ మైదానంలో శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. జాతీయ వాలీబాల్ పోటీలో భారతీయ రైల్వే జట్టు పదేళ్ల తర్వాత విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నట్లు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకరరావు తెలిపారు. కార్యక్రమానికి అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత, శాప్ డైరెక్టర్ అరెకపూడి రమణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

రైలు కింద పడి ప్రయాణికుడు మృతి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి శుక్రవారం ఒక గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సి.హెచ్.రాజా అరవిందనాథ్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, కుమారుడిపై దాడి

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం హరిత హోటల్ సమీపంలోని పిండాల రేవు వద్ద ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, అతని కుమారుడు, మరొకరిపై ఆకతాయిలు దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విజయవాడ మారుతీనగర్‌లో మన్యం మనోజ్ వెంకట దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి శ్రీను ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్. భవానీపురం పిండాల రేవు వద్ద వాటర్ స్పోర్ట్స్ కోచ్‌గా పని చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ రాత్రి శ్రీను, కుమారుడు వెంకట దుర్గాప్రసాద్, స్నేహితుడు జశ్వంత్ ముగ్గురు కలిసి పిండాల ఘాట్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడ మద్యం తాగి ఉన్న రాజు భాయ్ అలియాస్ రాజు, మరికొందరు వారి వద్దకు వచ్చారు. ఇక్కడ ఎందుకు ఉన్నారంటూ ప్రశ్నించి అసభ్యంగా తిట్టి వారిపై దాడి చేశారు. బాధితులు చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం ఊర్మిళానగర్ సమీపంలో కోళ్ల పందేలు ఆడుతున్న ఐదుగురిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్తు కార్మికుల ఆశలు ఆవిరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గత బకాయిలు, సర్వీస్ ఇన్‌సెంటివ్‌లు వస్తాయని అనుకున్న విద్యుత్తు సంస్థల కార్మికుల ఆశలు ఆవిరయ్యాయి. ఇందుకు కారణం ముమ్మాటికీ అధికార యంత్రాంగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి గత బకాయిలు, ఇన్‌సెంటివ్‌ల కోసం 2025 సెప్టెంబరు 10న ఎన్టీటీపీఎస్‌తో పాటు ఇతర విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల వద్ద కార్మిక సంఘాలు దీక్షలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపాయి. గత బకాయిలు చెల్లించడంతో పాటు 20 ఏళ్లు విధుల్లో కొనసాగిన కార్మికులకు సర్వీస్ ఇన్‌సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అందులో భాగంగానే జనవరి- 2026 వేతనాలతో కలిపి దశల వారీగా వాటిని చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయగా కొద్దిమంది కార్మికులకు మాత్రమే నగదు జమైంది. అయితే కార్మికులకు సంబంధించిన సర్వీస్ వివరాలు ఎస్ఈ, డీఈ కార్యాలయాల నుంచి విద్యుత్తు కేంద్ర కార్యాలయానికి వెళ్లాల్సిన జాబితా జాప్యం చోటు చేసుకుంది. దీంతో అర్హత కలిగిన కార్మికులందరికీ వేతనాలతో కూడిన బకాయిలు చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో కేవలం జనవరి వేతనాలకే పరిమితమయ్యామని ఎన్టీటీపీఎస్ కార్మికులు వాపోతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉషశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ పణి పురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ పురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైననూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, రుణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికి, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ పురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026.

ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

విజయవాడ మధ్య

సంగీత వారోత్సవాల్లో సందడి

మాట్లాడుతున్న విజయలక్ష్మి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంగీత వారోత్సవాల సందర్భంగా రెండో రోజు కొత్త పూర్ణానంద కాంవెట్ కపై ఆర్‌ఆర్ మెలోడీస్ ఆధ్వర్యంలో రాజు నిర్వహణలో సినీ సంగీత విభావరి ఘనంగా జరిగింది. ఈ సంగీత కార్యక్రమం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. లక్ష్మణ్ నాయక్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్ రాజు, చింతకాయల చిట్టిబాబు, జయప్రద ప్రసంగించారు. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమం సాగిందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయకులు చంద్రశేఖర్, బ్రహ్మం, వెంకట్, శర్మ, పసుపులేటి శ్రీనివాసరావు, సింగంపల్లి రమణ, సీత, సునీత తదితరులు తమ గానంతో ప్రేక్షకులను అలరించారు.

పర్యావరణ హిత సంచులే వినియోగించండి

చీఫ్ మెడికల్ అధికారి అర్జునరావు

విజయవాడ నగరపాలక సంస్థ: ప్లాస్టిక్ సంచుల వాడకంపై నిషేధం ఉన్నందున నగర ప్రజలు కేవలం పర్యావరణ హిత సంచులు మాత్రమే ఉపయోగించాలని కార్పొరేషన్ చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నగరపాలక సంస్థ అవగాహన కల్పిస్తున్నందున ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని అన్నారు. వాటిని వినియోగించినా, విక్రయించినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధం సమర్థవంతంగా అమలయ్యేలా అందరూ తమకు సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా కపిల గోమాత పూజ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కనుమ పండగను పురస్కరించుకొని కపిల వర్ణ గోమాతకు శుక్రవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజ నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌తో అర్చకులు పూజ చేయించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన పలువురు భక్తులు గోపూజ చేశారు. ☛ దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రతి రోజు గోశాలలోని ఆవు పాలను మాత్రమే శ్రీచక్రార్చనకు వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు 6 లీటర్ల పాలను అమ్మవారి ఆలయంలో వివిధ పూజల నిమిత్తం దేవస్థానం గోశాల నుంచి తీసుకొస్తారని అధికారులు తెలిపారు.

నిర్మాణం పూర్తయినా.. ఉపయోగం సున్నా!

30వ డివిజన్ వాసులకు అరకొరగా తాగునీరు

న్యూస్‌టుడే, మధురానగర్

30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయక్‌నగర్, ట్రెండ్‌సెట్ మిడోస్.. ఈ ప్రాంత ప్రజలకు అరకొరగానే తాగు నీటి సరఫరా జరుగుతోంది. స్థానికుల అవసరాల నిమిత్తం నిర్మించిన తాగునీటి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యి ఏడాది గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. సాంకేతిక కారణాలు చూపి తాగునీటిని సరఫరా చేయకుండా అధికారులు చేతులెత్తేశారు. దీంతో స్థానికులు మధురానగర్ రిజర్వాయర్ నుంచి అరకొరగానే తాగునీటి సరఫరా అవుతోంది.

ఏడాది పూర్తయింది..

గత ప్రభుత్వ హయాంలో 1500 కిలోలీటర్ల సామర్థ్యంతో 30వ డివిజన్ వాసులకు ఉపయోగపడేలా తాగు నీటి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. దీనికి గుణదల గంగిరెద్దుల దిబ్బపై ఉన్న 47 ఎం.ఎల్.డి. ప్లాంట్ నుంచి తాగునీటిని సరఫరా చేసి అక్కడ నుంచి డివిజన్ వాసులకు సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గుణదలలోని ప్లాంట్ నుంచి నీటిని సరఫరా చేసే దాని పరిధిలో ఇప్పటికే ఉన్న ప్రాంతాలకు తాగునీటి కొరత ఏర్పడుతుందని కొంత మంది ప్రచారం చేశారు. దీంతో అక్కడ నుంచి నీటి సరఫరా పనులకు బ్రేక్ పడింది. ఆ ప్లాంట్‌లో ఉన్న మోటార్ల సామర్థ్యం పెంచిన తరవాతే 30వ డివిజన్‌లోని రిజర్వాయర్‌కు నీటిని పంపించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో అక్కడ ఉన్న పాత మోటార్ల స్థానంలో కొత్తవి బిగించాలని నిర్ణయించి దానికి టెండర్లు పిలిచారు.

రెండు సార్లు పిలిచినా..

గుణదల ప్లాంట్‌కు కొత్త మోటార్లు బిగించేందుకు టెండర్లు పిలిచారు. టెండరు నిబంధనల ప్రకారం నగరంలో ఒక గుత్తేదారు అర్హత సాధించారు. ఆయన ఆసక్తి చూపడం లేదు. రెండోసారి పిలిచినా ఇతర గుత్తేదార్లు టెండర్లు వేసినా నిబంధనల ప్రకారం వారికి అర్హత లేకపోవడంతో అవి రద్దయ్యాయి. దీంతో టెండరు నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలని ప్రజాప్రతినిధులు కోరినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

గద్దె వెంకట్రామయ్యనగర్‌లో నిర్మించిన రిజర్వాయర్

తాగునీటి కొరత తప్పదా?

యుద్ధప్రాతిపదికపై రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకురాకపోతే తాగునీటి ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు. మధురానగర్ రిజర్వాయర్ నుంచి ఉదయం పూట కొద్ది సేపు మాత్రమే అందిస్తున్నారని, ప్రస్తుతం ఇది చాలడం లేదని చెబుతున్నారు. అధికారులు చొరవ చూపి యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకుంటేనే ఈ వేసవి కొరత నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

డివిజన్ నెంబరు:	30
రిజర్వాయర్ ఖర్చు:	రూ.4.8 కోట్లు
రిజర్వాయర్ సామర్థ్యం:	15 లక్షల లీటర్లు
ఉపయోగించుకునే కుటుంబాలు:	2,500

కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: స్వరాజ్ మైదానంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనంలో పని చేసే కార్మికులకు ఆర్కే ఫౌండేషన్, పాలెం ట్రస్ట్ చీరలు, పండ్లు పంపిణీ చేసింది. గత 6 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు సాయం చేసేందుకు ఆర్కే ఫౌండేషన్, పాలెం ట్రస్ట్ నిర్వాహకులు బండెల కిరణ్‌రాజ్, రమా కిరణ్‌రాజ్, మేకల బాను తదితరులు పులే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి చేతులమీదుగా అందించారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు కార్మికుల ఆశ అడియాస

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మిక వర్గాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గత బకాయిలు, సర్వీస్ ఇన్సెంటివ్ వస్తాయని ఆశపడ్డ విద్యుత్తు సంస్థల కార్మికుల ఆశ అడియాసగా మారింది. ఇందుకు కారణం ముమ్మాటికీ అధికార యంత్రాంగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి గత బకాయిలు, ఇన్సెంటివ్ కోసం 2025 సెప్టెంబరు 10న ఎన్టీటీపీఎస్‌తో పాటు ఇతర విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల వద్ద కార్మిక సంఘాలు దీక్షలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపాయి. గత బకాయిలు చెల్లించడంతో పాటు 20 ఏళ్ల విధుల్లో కొనసాగిన కార్మికులకు సర్వీస్ ఇన్సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అందులో భాగంగానే జనవరి- 2026 వేతనాలతో కలిపి దశల వారీగా వాటిని చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయగా కొద్ది మంది కార్మికులకు మాత్రమే నగదు జమైంది. అయితే కార్మికులకు సంబంధించిన సర్వీస్ వివరాలు ఎస్ఈ, డీఈ కార్యాలయాల నుంచి విద్యుత్తు కేంద్ర కార్యాలయానికి వెళ్లాల్సిన జాబితా జాప్యం చోటు చేసుకుంది. దీంతో అర్హత కలిగిన కార్మికులందరికీ వేతనాలతో కూడిన బకాయిలు చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో కేవలం జనవరి వేతనాలకే పరిమితమయ్యామని ఎన్టీటీపీఎస్ కార్మికులు వాపోతున్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి

విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎస్సై రాధిక

దుర్గాగ్రహారం: ప్రథమ బహుమతిని గెలుచుకున్న ముగ్గును పరిశీలిస్తూ..

గాంధీనగర్: విజేతలతో సురేష్ తదితరులు

వైభవంగా సంక్రాంతి సంబరాలు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: స్థానిక 58వ డివిజన్‌లో ఈ నెల 9 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలు ఐద్వా, డీవైఎఫ్‌ఐ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో షటిల్, క్రికెట్, త్రోబాల్, కొండకొట్టుడు, నిమ్మకాయ విసురుడు, షాట్‌పుట్ వంటి క్రీడలు నిర్వహించారు. వేల మంది ప్రేక్షకులు తిలకించగా, వందల మంది క్రీడాకారులు, మహిళలు పాల్గొన్నారు. మహిళలు 155 మంది ముగ్గుల పోటీల్లో తమ ప్రతిభను చాటారు. బహుమతుల ప్రదానోత్సవం సభ శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ కృష్ణ హోటల్ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాటలు, నృత్యాలు, కళారూపాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి, డీవైఎఫ్‌ఐ నాయకుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ యువతను చెడు మార్గాల నుంచి దూరంగా ఉంచేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లూనా సెంటర్‌లో ఉత్సాహంగా..

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటర్‌లో బూదాల సురేష్, కమ్మగల రాజు, కె.చిట్టి, ఉప్పుగళ్ల మనీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాధిక, సీపీఎం నాయకుడు దుర్గారావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాధిక మాట్లాడుతూ పండగల ద్వారా సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో..

దుర్గాఅగ్రహారం (సీతారాంపురం), న్యూస్‌టుడే: స్థానిక 25వ డివిజన్ దుర్గాఅగ్రహారంలోని శ్రీఅంకమ్మ తల్లి దేవస్థానం వద్ద డివిజన్ జనసేన పార్టీ తరపున జడగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగిన ముగ్గుల పోటీల్లో పలువురు యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా జనసేన పార్టీ తరపున డివిజన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు పట్టుచీరలు, తర్వాత ఐదు స్థానాల్లో నిలిచిన వారికి ఫ్యాన్సీ చీరలను, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను జడగం మహాలక్ష్మి అందజేశారు. అంకమ్మతల్లి దేవస్థానం సభ్యులు మాట్లాడుతూ హిందూ సంప్రదాయం ఉట్టి పడేలా తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శిరీష, యక్కల మారుతి, శంకరరావు, అజయ్, పద్మ, వెంకటరత్నం, సత్యనారాయణ, శివరాంప్రసాద్, రత్నం, భవాని, చిట్టిబాబు, విజయ్, రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

గాంధీనగర్, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పూరి జగన్నాథ స్వామి క్రికెట్ ట్రోఫీ పోటీలు శుక్రవారం గుణదల సమీపంలోని ఓ మైదానంలో నిర్వహించారు. విజేతలకు విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరుచూరి నాగేశ్వరరావు, బసంత్, బబ్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-22/26, టమాటా-22, బెండ-34, పచ్చిమిర్చి-32, కాకర-46, బీర-24, క్యాలీఫ్లవర్-25/20, క్యాబేజీ-22, క్యారెట్-32, దొండ-42, బంగాళదుంప-20, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-32, దోస-30/40, సొర-15, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-10/8, ఆకుకూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-24, కీరదోస-28, బీన్స్-55/60, క్యాప్సికమ్-54, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22. **(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.**

-ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

రోడ్డుపై నూనె.. జారితే అంతేనా!

బీఆర్‌టీఎస్ రోడ్ ఫుడ్ జంక్షన్ సమీపంలోని ఫుడ్‌కోర్ట్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో కొందరు ఫుడ్‌కోర్ట్ నిర్వాహకులు నూనెను రోడ్డుపై పడేయడంతో వాహనచోదకులు అదుపు తప్పి కింద పడుతున్నారు. గడిచిన వారం రోజుల్లో ఐదుగురు అదుపుతప్పి పడి ప్రమాదానికి గురయ్యారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

- సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే

సుందరీకరణ సగంలో వదిలేసి..

సంక్రాంతి వచ్చిందంటే చాలు ఎపుడెపుడు సొంత ఊరెళ్లిపోదామా అని ఎదురు చూస్తుంటారు. పండగ నుంచి వచ్చిన తరవాత మిగిలిన పని చూసుకుందాంలే అనుకుంటారు. కారల్‌మార్క్స్ రోడ్డులో ఉద్యానవనశాఖ సిబ్బంది ఇదే పని చేశారు. సెంట్రల్ డివైడర్‌పై ఉన్న క్రోటన్ మొక్కలను కత్తిరించి సగం పని అవగానే డ్యూటీ అయిపోయిందని వదిలేసి వెళ్లిపోయారు.

-గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా


పతకాలతో నాగిడి గాయత్రి

విజయవాడ క్రీడలు: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.

కుటుంబ సమేతంగా ఫొటో దిగుతూ..

జ్ఞాపకం.. ఏడాదంతా పదిలం

సంక్రాంతి సందర్భంగా మహాత్మాగాంధీ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పైలట్ సర్వీస్ స్టేషన్‌లో క్యాలెండర్ పండగ నిర్వహించారు. వినియోగదారులు పలువురు కుటుంబ సమేతంగా విచ్చేసి బంకులో ఏర్పాటు చేసిన సంక్రాంతి అలంకరణ వద్ద ఫొటో దిగారు. ఆ ఫొటోతో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించి వినియోగదారులకు ఉచితంగా అందించారు. దాదాపు 850 మంది వినియోగించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

18 వరకు సత్యలో ప్రత్యేక ఆఫర్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా నగరంలోని సత్య షోరూమ్‌ల్లో ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు తగ్గిస్తున్నారు. టెలివిజన్లు రూ.7,990 నుంచి, ఫ్రిజ్‌లు రూ.13,990 నుంచి, ఎయిర్ కండీషనర్లు రూ.29,990 నుంచి, వాషింగ్ మెషిన్లు రూ.10,990 నుంచి లభిస్తున్నాయి. మొబైల్ కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తున్నారు. 5జీ మొబైల్స్ రూ.7,990 నుంచి, 60 శాతం వరకు రాయితీ, రూ.12 వేల వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తున్నారు. నెక్ బ్యాండ్లు కేవలం రూ.199కే, పోర్టబుల్ పార్టీ బ్లూటూత్ స్పీకర్లు రూ.2,449కే లభిస్తున్నాయి. కిచెన్ కాంబోను రూ.10,999కే అందిస్తున్నారు. వాటర్ హీటర్లు రూ.3,300 నుంచి, ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి అందుబాటులో ఉన్నాయి. రూ.888 నుంచి ఈఎంఐ, రూ.25 వేల వరకు క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఆహ్లాదం నిండుగా.. వసతులు మెండుగా!

పార్కులు అభివృద్ధి చేస్తున్న కార్పొరేషన్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ పార్కులను పునరుద్ధరించడంతో పాటు, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. కొంతకాలంగా పార్కులు నిర్వహణ లోపంతో కునారిల్లుతున్నాయి. ప్రస్తుతం వాటిని రూ.4.13 కోట్ల వ్యయంతో ఆహ్లాదంగా తయారు చేయడమే కాకుండా చిన్నారులకు ఆట పరికరాలు, పెద్దలకు వ్యాయామ శాలలు ఏర్పాటు చేస్తున్నారు.

- నగరంలో మూడు కమర్షియల్ పార్కులున్నాయి. రాజీవ్ గాంధీ పార్కు, రాఘవయ్య - అంబేడ్కర్ పార్కు, కేఎల్ రావు పార్కులను ఎప్పటికప్పుడు రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. స్క్రాప్ పార్కును కూడా అందంగా తీర్చిదిద్దారు.
- వివిధ కాలనీలతో పాటు, ఏలూరు, బందరు, రైవస్ కాలువ కట్టలపై పార్కులతో కలిపి మొత్తం 173 పార్కులు ఉన్నాయి. అందులో ఎక్కువ పార్కులు అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ గట్ల వెంట పచ్చదనం పెంపునకు రూ.లక్షల వ్యయం చేస్తున్నా... వాటిపైనున్న పార్కులను మాత్రం పట్టించుకోవడం లేదు.
- వివిధ డివిజన్లలోని 119 పార్కులు పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. 54 పార్కులను మాత్రం వదిలేశారు. అవి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైన వాటిలో కొన్నింటిని గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు.

ట్రెండ్‌సెట్ పార్కులో ఏర్పాటు చేస్తున్న ఆట పరికరాలు

నిధుల కేటాయింపు ఇలా...

- మూడు నియోజకవర్గాల్లోని 17 పార్కుల్లో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయాయి. వాటిని తొలగించేందుకు రూ.2.78 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రూ.1.70 కోట్ల వ్యయంతో పనులు చేపట్టి అడ్డంకులు తొలగించారు. మొక్కలు నాటారు. రూ.88 లక్షల వ్యయంతో మరికొన్ని అదనపు పనులు చేస్తున్నారు. కొన్ని పనులు టెండరు దశలో ఉన్నాయి.
- భవానీపురం రోజ్ గార్డెన్ పార్కును రూ.18 లక్షలతో పునరుద్ధరిస్తున్నారు.
- ఎల్‌బీఎస్ నగర్ పార్కు అభివృద్ధికి రూ.64 లక్షలు వెచ్చిస్తున్నారు.
- ఏఎస్‌ఆర్-2 పార్కులో వసతులకు రూ.కోటి ఖర్చు చేస్తున్నారు.
- కండ్రిక ఎస్సీ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.19.95 లక్షలతో అంచనాలు రూపొందించారు.
- కుందావారి కండ్రిక కేకే అపార్ట్‌మెంట్ ఏరియా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు.
- సింగ్‌నగర్ నందనవనం పార్కులో రూ.45 లక్షలతో పనులు చేపట్టారు.
- గాంధీ నగర్ గోరా పార్కును రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు.
- 29వ డివిజన్ ట్రెండ్‌సెట్ పార్కు అభివృద్ధికి రూ.38 లక్షలు ఖర్చు చేస్తున్నారు.
- దుర్గాపురం 27వ డివిజన్ పార్కు అభివృద్ధి రూ.38 లక్షలు కేటాయించారు.

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్యలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రీడల్లో ఎదగాలంటే క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు.

IN THE COURT OF THE XIV ADDL. DISTRICT JDUGE, VIJAYAWADA.
G.W.O.P.No.93 of 2025
(In the matter of Appointment of guardian for person and property of minors 1) Voleti Sai Keerthana, D/o Late Ravi Kumar and 2) Voleti Punith Raj Kumar, S/o Late Ravi Kumar)
Between:-
Voleti Lavanya... Petitioner
And
Nil ....Respondent
The petitioner filed the petition before the Honorable Court Appointing her as Guardian of minors for permission sale of schedule property subject on condition deposit of Minors sale proceedings amount into Honorable Court. Therefore any one got objection, hereby appear personally or through Advocate before the Honorable Court on 27-01-2026 at 10-30 and filed their objections. If anyone not objected, the matter will be decided as per record.
SCHEDULE
An extent of 56 Sq. yards equal to 46.82 mtrs. of house site in R.S.No.71/4A situated at Plot No.8 Part, Old V.I.T. Assessment No.44786/8P, V.L.T. Present Assessment No.1073235214, Devineni Gandhi Puram, Payakapuram, Vijayawada within the limits of Vijayawada Municipal Corporation limits is being bounded by: East : Road 14 feet, South: Property of Voleti Krishna Kishore 36 feet, West :: 20 feet width Road 14 feet, North :: Plot No.9 36 feet.
(As per Court order)
Vijayawada, Dt.08-01-2026
M.Adinarayana Rao
Advocate for Petitioner,
Governorpet, Vijayawada-2

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నగదు, బంగారం, వెండి వస్తువుల అపహరణ

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో వజినేపల్లి వెంకటేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. ఇంటికి తాళం వేసి బుధవారం వైరాలోని తన బంధువుల ఇంట వేడుకకు వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా వెళ్లారు. గురువారం మధ్యాహ్నం తిరిగి రాగా ముఖ ద్వారం తలుపులు తెరిచి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2.30 లక్షలు, 140 గ్రాములు బంగారం, సుమారు 3 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురి అయ్యాయని బాధితుడు వాపోయారు. తన స్థిర ఆస్తులు, బ్యాంకు పుస్తకాలు, ఇతర పత్రాలను చోరీకి పాల్పడిన వారు ఇంట్లోనే కాల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం గోసవీడు చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుడి నుంచి వివరాలు తీసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించే దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

దొంగలు కాల్చేసిన ఆస్తి పత్రాలు

త్రిపురనేని రామస్వామికి ఘన నివాళి

చార్వాక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న త్రిపురనేని అభిమానులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కవిరాజు త్రిపురనేని రామస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా త్రిపురనేని విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. అనంతరం చార్వాక క్యాలెండర్ ఆవిష్కరించగా శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్‌కుమార్ రచించిన 'సదసత్సంశయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, శ్రీశ్రీ సాహిత్యనిధి అశోక్‌కుమార్, జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, అరసం అరుణకుమార్, ప్రజాగాయకులు పిచ్చయ్య, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కమిషనర్ (జనరల్) ఎ.రవీంద్రరావు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రవీంద్రరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ... కృష్ణా జిల్లాలో జన్మించిన త్రిపురనేని చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారని తెలిపారు. న్యాయవిద్యనభ్యసించి న్యాయవాదిగా సమాజ హితం కోసం పని చేశారని గుర్తు చేశారు. విలువలతో కూడిన సాహిత్యాన్ని రచించి ఎంతో మంది మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆయన రచనలు ప్రజల్లో మంచి ఆలోచనలు రేకెత్తించడమే కాకుండా, చైతన్యం కలిగించాయని తెలిపారు. కుల వ్యవస్థలో అసమానతలు, అన్యాయాలను అరికట్టేందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌వో రజియా షబీన, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపల్ టౌన్, నాజరుపేట, మల్లెలవారి వీధిలో ప్రస్తుతం నివాసం కల శ్రీమతి వెన్నేటి వెంకట నాగ ఉషశ్రీ భర్త వెన్నేటి వీర గణేష్ ఫణి వురఫ్ రవి, వీరి స్థిర నివాసం డోర్ నెం. 23-7-25, గ్రౌండ్ ఫ్లోర్, సారంగపాణి టవర్స్, గిరి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ 520011, వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు కుమారుడు అయిన చిరంజీవి వెన్నేటి సాయికృష్ణ శివ తేజ వురఫ్ శివ అను యువకుడు చెడు స్నేహముల వలన, చెడు అలవాట్లకు లోనై, చెడు నడవడితో జీవితము గడుపుచున్నాడు. అతనికి సకల దుర్వ్యసనములు కలవు. అతని వయస్సు ప్రస్తుతం 20 సంవత్సరములు అయి వున్నది. అతనికి ఎట్టి విద్యార్హత, ఉద్యోగము, వ్యాపారము, ఆస్తులు, ఆదాయము లేవు. అతను తన చెడు వ్యసనముల నిమిత్తము మరియు స్వేచ్ఛా జీవనము నిమిత్తము లోకుల వద్ద పైకం అప్పుగా తీసుకుంటున్నట్లు మా క్లయింటుకు తెలియుచున్నది. అతను ఎవరివద్దనైననూ పైకము అప్పుగా తీసుకొని, ప్రోనోట్లు, తాకట్టు దస్తావేజులు మరియు ఇతరత్రా ఒప్పందములు వ్రాసి ఇచ్చినచో, సదరు అప్పులు, తాకట్టులు, ఋణములు చెల్లించవలసిన బాధ్యత మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

మా క్లయింటు కుమారుడు అయిన సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ, అను అతను సమాజంలో అనేక తగాదాలు, గొడవలు, కొట్లాటలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపములు చేసినప్పటికీ, సదరు కార్యకలాపములతో మా క్లయింటుకు గానీ, వారి కుమార్తె, భర్త గారికి గానీ, లేక మా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరియు సోదరులకు గానీ ఎట్టి సంబంధము, బాధ్యత లేదని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. నా క్లయింటు కుమారుడు సాయికృష్ణ శివతేజ వురఫ్ శివ, చేయు సమస్త పనులకు కేవలము అతను మాత్రమే బాధ్యుడు అని యావన్మందికి తెలియజేయటమైనది.

తెనాలి
తేది : 16.01.2026.
ఇట్లు : వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వేమూరి చంద్రమౌళి శర్మ, న్యాయవాదులు,
తెనాలి. సెల్ నెం. 7799300284.

(c) eenadu

వైభవంగా వెంకన్న గిరి ప్రదక్షిణ

గిరి ప్రదక్షిణలో భక్తజనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణ శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. కనుమను పురస్కరించుకుని ఏటా స్వామివారికి వేడుక నిర్వహిస్తారు. అర్చకులు స్వామి అమ్మవార్లను పుణ్యకోటి వాహనంలో రాజాధిరాజ అలంకారంలో ముస్తాబు చేశారు. భక్తజనం గోవింద నామస్మరణ నడుమ గిరి ప్రదక్షిణకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తుల భజనలు, సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దారి పొడవునా స్వామి వారికి భక్తులు అరటి పండ్ల గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమం అనంతరం బంధుర సరస్సు వద్ద మకర సంవాదం కార్యక్రమాన్ని చేపట్టారు. తర్వాత తిరువీధి సేవ నిర్వహించారు. కళాకారులు ఆలయం వద్ద నిర్వహించిన నృత్య ప్రదర్శన, తోడపెద్దుల సంబరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకను తిలకించడానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉపమాక కిటకిటలాడింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కమ్మేసిన మంచు!

కనుమ పండగ రోజు శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించ లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడ్డారు.
– ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే

చిన్నా.. సరిగా కనిపిస్తోందా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

★ అనకాపల్లికి చెందిన ఏడేళ్ల బాలుడికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించడంలో జాప్యం జరిగింది. పరీక్ష చేయగా కంటి అద్దాల పవర్ పెరిగింది. సకాలంలో గుర్తిస్తే బాగుండేదని కంటి వైద్యులు చెప్పారు.

★ ఎలమంచిలిలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థికి దృష్టిలోపం పెరగడంతో అక్షరాలు కనిపించక ఇబ్బంది పడుతూ చదువుతున్నాడు.

నల్లబల్ల మీద రాసే అక్షరాలు సరిగ్గా చూడగలిగినప్పుడే విద్యార్థి పాఠాలు సరిగా అర్థం చేసుకోగలడు. చదువులో రాణించగలడు. కానీ జిల్లాలో చాలా మంది పిల్లలు మసకబారిన అక్షరాలు, అంకెలతోనే రోజంతా బడిలో కుస్తీ పడుతున్నారు. ఇది కొద్దిమందికి పరిమితమైన సమస్య కాదు. ప్రతి పదిమందిలో ఓ విద్యార్థి దృష్టిలోపంతో బాధ పడుతున్నాడు. ఇటీవల వైద్యులు జిల్లాలోని పలు పాఠశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహించగా ఈ కఠోర వాస్తవం వెలుగు చూసింది. టీవీలు, సెల్‌ఫోన్ల వినియోగం పెరుగుతుండటం పిల్లల కంటి చూపుపై ప్రభావం చూపుతోంది. ఏటేటా దృష్టిలోపంతో ఉన్న విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

బాలల్లో దృష్టిలోపాన్ని చిన్నప్పుడే గుర్తించడం చాలా అవసరం. ఈ దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఏడాది ఆగస్టు నుంచి జిల్లాలో 251 ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో పలువురు కంటి సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. ప్రతిరోజూ క్రమంతప్పకుండా పోషకాహారం తినకపోవడం, 'ఎ' విటమిన్ లోపించడం కారణంగా కొంత మంది

దృష్టి మసకబారుతోందని గుర్తించారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం, అదీ కంటి మరీ దగ్గరగా పెట్టుకుని చూడటం చాలామందిపై ప్రభావం చూపుతోందని వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. వీరికి ఉచితంగా కంటి అద్దాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది కంటే కంటి అద్దాలు అవసరమైన విద్యార్థుల సంఖ్య పెరగడం గమనార్హం. ఇంకొన్ని సందర్భాల్లో దృష్టి లోపాన్ని గుర్తించడం ఆలస్యమవుతోంది. వీరికి సమస్య ఉన్నట్లుగానే వారికి తెలియదు. దృష్టి లోపాన్ని ముందుగానే గుర్తిస్తే ముప్పును కొంతవరకు తగ్గించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

అద్దాలు పంపిణీ చేస్తాం

ఇదివరకు 40 ఏళ్ల పైబడిన వారికి దృష్టి సమస్యలు వచ్చేవి. వయస్సులో సంబంధం లేకుండా చిన్నపిల్లలనూ ఈ సమస్య వెంటాడుతోంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరపున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏటా కంటి పరీక్షలు చేస్తున్నాం. ఈ ఏడాది కంటి అద్దాలు అవసరమని గుర్తించిన వారికి పంపిణీ చేస్తాం.
– డాక్టర్ డేవిడ్ వసంత్‌కుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్

కంటి పరీక్షలు చేసిన విద్యార్థుల సంఖ్య	40,155	అద్దాలు అవసరమైనవారు	4212 మంది	గతేడాది అద్దాలు తీసుకున్నవారు	3155 మంది

కోళ్ల పోరు.. పందేల జోరు!

ఈనాడు డిజిటల్, అనకాపల్లి
రావికమతం, న్యూస్‌టుడే

సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జూదాలు, కోడిపందేలు జోరుగా సాగాయి. పందెంరాయుళ్లను ఆకట్టుకునేలా పలు ప్రాంతాల్లో భారీ బరులు ఏర్పాటు చేశారు. భోగి రోజు ఉదయం నుంచి మొదలుకొని మూడురోజులపాటు రూ. కోట్లలో చేతులుమారాయి. కోడిపందేలతో పాటు గుండాట, నంబర్లాట, కాయ్ రాజాకాయ్ వంటి జూదాలు విచ్చలవిడిగా నిర్వహించారు. తెరవెనుక నుంచి స్థానిక రాజకీయ నేతల అండదండలు ఉండటంతో పోలీసులు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో మాత్రం డ్రోన్లు వినియోగించి పట్టుకున్నారు.

★ పాయకరావుపేట మండలం శ్రీరాంపురం, పి.ఎల్.పురం, సత్యవరం, రాజగోపాలపురం, వెంకటనగరంలో పండగ మూడురోజులు కోడిపందేలు, జూదం నిర్వహించారు. నక్కపల్లి మండలంలోని.. వేంపాడు, ఉపమాక, డి.ఎల్.పురం, ముకుందరాజుపేట చిన్నచిన్న గ్రామాల్లో భారీగా టెంట్లు వేసి పోటీలు నిర్వహించారు. ప్రతి చోటా రూ. లక్షల్లోనే పందేలు సాగాయి. గత మూడు రోజుల్లో ఈ మండలంలో 9 కేసులు కట్టారు. రాంబిల్లి మండలం వెంకటాపురం, లోవపాలెం, కట్టుబోలులో కోడిపందేలు జరిగాయి. గుండాట భారీ స్థాయిలో జరిగింది. అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో భారీ బరి ఏర్పాటు చేశారు.

వేంపాడులో కోడిపందేలు

★ నక్కపల్లి మండలం వేంపాడులోని పెద్ద ఎత్తున గ్యాలరీలు, స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో శిబిరానికి మండల పరిసర ప్రాంతాల నుంచి భారీగా పందెంరాయుళ్లు వచ్చారు. ఇక్కడ పార్కింగ్, ఇతర స్టాళ్ల నుంచే రూ. లక్షల్లో వసుల చేశారు. ఒక్కో బరిలో రూ. 5 వేల నుంచి రూ. లక్షకు పైగా పందేలు జరిగినట్లు తెలుస్తోంది.

★ ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం పెద్దస్థాయిలో డబ్బులు చేతులు మారాయి. జూదాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించినా పోలీసులు కనీసం కన్నెత్తి చూడలేదు. గ్రామాల్లో చిన్నాచితకా కేసులు మాత్రం పెట్టి చేతులు దులుపుకొన్నారు. పందెం బరుల వద్ద గొలుసు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు సైతం జోరుగా సాగాయి.

తీర్థాలపైనా కన్ను: సంక్రాంతి పండగ మొదలుకొని దాదాపు నెల రోజుల వరకు గ్రామాల్లో తీర్థాలు, ఆ తర్వాత మరో రెండు నెలలు గ్రామదేవతల పండగలు, జాతరలు జరుగుతాయి. పండగ సందర్భంగా ఇప్పటికే గ్రామాల్లో కోడిపందేల ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మారుమూల శివారు గ్రామాల్లో పండగ ముందు నుంచే పందేలు జరుగుతున్నాయి. రావికమతం మండలం దొండపూడి, మేడివాడ, రావికమతం, గుమ్మళ్లపాడు, చినపాచిల, పొట్టిదొరపాలెం, సీతయ్యపేటల్లో గుండాటల నిర్వాహకులు ఉన్నారు. తీర్థాలు జరిగే చోట రాత్రి వేళల్లో గుల్లాటలు వేసేందుకు నిర్వాహకులకు రూ.వేలల్లో చెల్లించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

అదిరే ఆతిథ్యం.. అల్లుడి ఆశ్చర్యం

అత్తింటికి వచ్చిన ఆ కొత్త అల్లుడికి దక్కిన ప్రేమ, గౌరవంతో కూడిన 'విందు' ఆశ్చర్యం, ఆనందానికి గురిచేసింది. కొత్త అల్లుడి వయసు ఇరవై తొమ్మిదేళ్లు... ఆ సంఖ్యను పోలుతూ ఏకంగా 290 రకాల మిఠాయిలు, రకరకాల భోజనం, కూరలు తదితరాలను వడ్డించారు. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన నాళం రమేష్, కళావతి సాయిలక్ష్మి మూడు దశాబ్దాల క్రితం నర్సీపట్నం వలసొచ్చారు. గత ఏడాది జులైలో తమ కుమార్తె నవ్యను నర్సీపట్నానికి చెందిన శ్రీహర్షకు ఇచ్చి వివాహం చేశారు. తొలి సంక్రాంతి సందర్భంగా అల్లుడికి 140 రకాల మిఠాయిలు, ఇతర తినుబండారాలు, 40 రకాల కూరలు, పది రకాల బిర్యానీలు వడ్డించారు.

– నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

బసవన్నల పరుగు.. ఎనలేని హుషారు

సంక్రాంతి సందర్భంగా పల్లె గడపలో అందరికీ ఎక్కడలేని హుషారు వచ్చేది ఎడ్ల పరుగు పోటీలతోనే. అందులోనూ మునగపాకలో ఏటేటా ఈ పోటీలు ఎంతో రసవత్తరంగా జరుగుతాయి. ఈ పోటీలను చూసేందుకు జిల్లాలోన్ని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. – మునగపాక, న్యూస్‌టుడే

ఆత్మీయ పథం.. ఆనంద కదం!

మంత్రి వంగలపూడి అనిత సంక్రాంతి పండగ వేడుకలు కోటవురట్ల మండలం అణుకు గ్రామంలో గిరిజనుల మధ్య చేసుకున్నారు. కుమారుడు నిఖిల్, కుమార్తె రేష్మితలతో కల్సి పండగ చేసుకున్నారు. దాదాపు మూడు గంటలకు గిరిజనులతో మమేకమయ్యారు. పిల్లలతో సరదాగా గడిపారు. గ్రామంలో మంత్రి అనిత అందరితో కలిసి సామూహికంగా భోజనాలు చేశారు.

కోలాటం అంటే మనదైన సంప్రదాయం. రఘుకుల తిలక రారా...అంటూ ఆడపడుచులంతా కోలాటం ఆడుతుంటే జిల్లా అధికారి సైతం ఒకింత ఉత్సాహంగా కర్రలు చేతపట్టి పదం కలుపుతూ సంతోషం పంచుకున్నారు. హాజరైన జిల్లా పంచాయతీ అధికారి సందీప్ ఆటవిడుపుగా కోలాటం బృందంతో కలిసి కోలాటం కాసేపు ఆడారు.

– కోటవురట్ల, పాయకరావుపేట, న్యూస్‌టుడే

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

✦ తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లి పందిరి' గవర అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెంలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. ✦ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు(శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

నేడు, రేపు గవర అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

✦ మరిన్ని వివరాలకు 9154918858, 8008621414 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు.
– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ఆటగాళ్లకు అండ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: క్రీడాకారులకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. సాంకేతికత వీరి ఉజ్వల భవిష్యత్తుకు సాయం అందించనుంది. దేశంలోనే ప్రథమంగా మన రాష్ట్రంలో ఈ ఆటగాళ్ల కోసం 'క్రీడా యాప్' అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ వీరికి అన్నివిధాలా సహకరిస్తూ.. ధ్రువపత్రాలను సురక్షితంగా ఉంచుతూ తగిన ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుంది. ఇన్నాళ్లు ఎటువంటి ప్రోత్సాహం, సహకారం లేదని దిగులుతో ఉన్న వారందరికీ ఇది కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.

★ క్రీడా యాప్ డిజిటల్ లాకర్‌తో కూడినది. ఇందులో క్రీడాకారుల అన్ని రకాల ధ్రువపత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఆటగాళ్లకు ఈ పత్రాలు అత్యంత కీలకమైనవి. సాధారణంగా ఎక్కడైనా మర్చిపోవడం.. తదితర కారణాలతో అవసరమైప్పుడు ఇవి కనిపించకపోవడంతో ఒక్కోసారి ఉపాధి అవకాశాలు చేజారుతుంటాయి. అర్హత ఉండి పతకాలు దక్కే వీలున్నా పోటీలకు దూరమయ్యే పరిస్థితి ఎదురవుతుంది. యాప్‌తో ఇక ఈ సమస్య ఎవరికీ తలెత్తదు. ఇందులో వీటిని అప్‌లోడ్ చేసిన వెంటనే సంబంధిత క్రీడాకారునికి అర్హత ఉన్న ప్రోత్సాహకాలు ఎంతవరకు లభిస్తాయో అన్న విషయంపై స్పష్టత ఏర్పడుతుంది.

★ ఇందులో ఉద్యోగాల నోటిఫికేషన్లు, క్రీడా కోటా కింద కేటాయించిన నౌకరి వివరాలు సంబంధిత ఆటగాళ్ల ఫోను నంబర్లకు ఎప్పకప్పుడు నమోదు కావడం మరో విశేషం. ఈ సమాచారం లేక చాలా మంది అర్హులైనప్పటికీ ఉపాధి పొందలేకపోతున్నారు. ఇలాంటి వారికి ఇప్పుడు ఎంతో ఊరట లభించనుంది.

★ క్రీడా సంఘాలన్నింటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గుర్తింపును తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 1999 నుంచి 2026 సంవత్సరం వరకు క్రీడాకారులు తాము సాధించిన పోటీల ధ్రువపత్రాలను శాప్ వెబ్‌సైట్‌లో పొందుపరుచుకునేందుకు అనుమతి మంజూరైంది. శాప్ గుర్తింపు పునరుద్ధరణకు నోచుకోని వారంతా అన్ని విషయాల్లోనూ అనర్హులవుతారని క్రీడా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లాలోని క్రీడాకారులంతా విధిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి పూజారి శైలజ తెలిపారు.

క్రీడాకారులకు యాప్ ప్రయోజనాలు వివరిస్తున్న శాప్ కోచ్ అబ్బు

భలేభలే.. బెల్లం పాకం!

అనకాపల్లి, న్యూస్‌టుడే

బెల్లం పాకం ఎప్పుడైనా రుచి చూశారా.. ఒకసారి తింటే వదలరు. ఇది మార్కెట్‌లో ఎక్కువగా లభించడం లేదు. కేవలం రైతులు బెల్లం తయారీ చేసే సమయంలోనే దీన్ని రుచి చూడొచ్చు. అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో దీనిపై అనకాపల్లి పరిశోధన స్థానంలో పలు పరిశోధనలు చేశారు. తయారీ చేసే విధానాన్ని రూపొందించారు. పరిశోధన కేంద్రంలో శిక్షణ పొందిన కొంతమంది రైతులు ఇప్పుడు సొంతగా పాకం తయారీ చేపట్టి అమ్మకాలు చేస్తున్నారు. అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిలో కొందరు రైతులు వీటి అమ్మకాలు చేపట్టారు. ఈ పాకాన్ని రొట్టెలు, ఇడ్లీ, పూరీ వంటి అల్పాహారాల్లో వాడుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ శక్తినిచ్చేది బెల్లం పాకమని ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. ఈ పాకానికి మంచి డిమాండ్ ఉన్నట్లు రైతులు ఆడారి రాము, భీశెట్టి నాయుడు తెలిపారు.

పోషక విలువలు పుష్కలం

బెల్లం పాకంలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. మాంసకృత్తులు, ఎమినోయాసిడ్స్, ఎకోనిటిక్ యాసిడ్, సిట్రిక్ యాసిడ్, కొవ్వు పదార్థాలు, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, భాస్వరం, ఇనుముతో పాటు విటమిన్- ఏ, బి తగినంత ఉంటాయి. అందుకే వైద్యులు సైతం పంచదారకు బదులు బెల్లం పాకం వినియోగించమని సలహా ఇస్తున్నారు.

తారల క్రికెట్.. అదరహో..

మైదానంలో తేజస్వి

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) అభిమానుల్లో సంక్రాంతి జోష్ నింపింది. చాలా కాలం తర్వాత విశాఖలో సినీ నటుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. తారలు మైదానంలో కలియ తిరుగుతూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. మొదటి మ్యాచ్‌లో పంజాబ్ దే షేర్ జట్టు, కర్ణాటక బుల్డోజర్, రెండో మ్యాచ్‌లో భోజ్‌పురి దబాంగ్, తెలుగు వారియర్స్ జట్లు తలపడ్డాయి. కర్ణాటక జట్టు విజయం సాధించగా, తెలుగు వారియర్స్ ఓడిపోవడం అభిమానులను నిరాశపర్చింది. జట్టులోని అక్కినేని అఖిల్, తమన్, ప్రిన్స్ తదితర నటులు తమ ఆట తీరుతో అలరించారు. కర్ణాటక జట్టుకు ఈగ ఫేమ్ కిచ్చా సుదీప్ కెప్టెన్‌గా వ్యవహరించారు.
– విశాఖపట్నం, న్యూస్‌టుడే

వికెట్ తీసిన ఆనందంలో తెలుగు వారియర్స్

బ్యాటింగ్ చేస్తున్న అఖిల్

పాయల్ రాజ్‌పుత్

ఇక రయ్.. రయ్!

అనకాపల్లిలోని పెరుగుబజారు

అనకాపల్లి, న్యూస్‌టుడే : అనకాపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలు ఇరుగ్గా ఉన్న వీధులను విస్తరిస్తూ వస్తున్నారు. నాయిళ్లవీధి, చింతావారి వీధి రహదారుల విస్తరణ పూర్తి చేశారు. పెరుగు బజారు రహదారి విస్తరణ పూర్తి చేసి ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. రింగ్ రోడ్డును రూ. 1.35 కోట్లతో విస్తరించనున్నారు. రైల్వే స్టేషన్ మీదుగా ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వరకు కాలువలు, కాలిబాట ఏర్పాటు చేస్తారు. ఈ పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు.

★ నూకాలమ్మ ఆలయానికి చేరుకునేందుకు నాలుగు రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే పట్టణంలో ప్రయాణం ఎంతో సులభం అవుతుంది. కొణతాల రామకృష్ణ మంత్రిగా ఉన్న సమయంలో ప్రధాన రహదారిని విస్తరించారు. తర్వాత పీలా గోవింద సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఎన్నికైన తరవాత రహదారుల విస్తరణపై దృష్టి పెట్టారు. నాయిళ్లవీధి, చింతావారివీధి విస్తరణ పనులు పూర్తి చేశారు. వైకాపా ప్రభుత్వం హయాంలో విస్తరణ పనులు నత్తనడకన సాగగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పనులు పూర్తి చేశారు. అనకాపల్లి గవరపాలెం నూకాలమ్మ ఆలయానికి వచ్చే భక్తులు క్రమేపీ పెరుగుతున్నారు. అందుకు అనుగుణంగా కోవెలకు వచ్చే రహదారి సరిపోవడం లేదు. మొత్తం 2.2 కిలోమీటర్ల పొడవున్న రహదారిని విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కొలతలు తీసి మార్కింగ్ ఇచ్చారు. మొత్తం 189 భవనాలు ఆటంకంగా ఉన్నట్లు గుర్తించారు. దీని విస్తరణ జాప్యం అయ్యే పరిస్థితి ఉన్నందున ప్రత్యామ్నాయంగా నాలుగు రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ పనులను జాతరలోగా పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

2,496 ఖాతాలు... రూ. నాలుగు కోట్లు

ఖాతాల్లోనే మూలుగుతున్న ప్రజాధనం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ప్రజావసరాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రజాధనాన్ని సకాలంలో ఖర్చు చేయకపోవడంతో విలువైన ప్రజాధనం బ్యాంకుల్లో మురుగుతోంది. రకరకాల కారణాలతో చాలా ఖాతాల్లోని నిధులను ఎటువంటి లావాదేవీలు జరపకుండా అలాగే వదిలేశారు. బ్యాంకు ఖాతాల్లో కొన్ని గ్రామ పంచాయతీల పేరు మీద తెరవగా, మరికొన్ని పాఠశాల నిర్వహణ కమిటీ, ఎంపీడీఓలు, దివ్యాంగుల పింఛన్ల బట్వాడా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తదితర ప్రభుత్వ సంస్థల పేరుమీద తెరిచారు. ఆయా ఖాతాలకు ప్రభుత్వం నిధులు సైతం జమ య్యాయి. ఇందులో కొంతమేర నగదు వాడగా, మిగిలిన సొమ్ము బ్యాంకుల్లో అలాగే ఉండిపోయింది. అలా ఈ బ్యాంకుల్లో వదిలేసి సుమారు 15 నుంచి 20 సంవత్సరాలు అయ్యింది. రాష్ట్రంలో ఇలాంటి బ్యాంకు ఖాతాలు కోకొల్లలు.

★ అనకాపల్లి జిల్లా విషయానికి వస్తే ఇలాంటి బ్యాంకు ఖాతాలు 2496 వరకు ఈ జిల్లాలో ఉన్నాయి. ఆ ఖాతాల్లో రూ. 4 కోట్లకు పైబడి నగదు నిరుపయోగంగా ఉండిపోయింది. ఇలాంటి ఖాతాలన్నింటిని తిరిగి పునఃప్రారంభించడానికి అవసరమైన చర్యల్ని ప్రభుత్వం చేపట్టింది. డెడ్ అయిన ఖాతాలన్నింటినీ తిరిగి లైవ్ (మనుగడ) లోకి తీసుకు రావడానికి ప్రత్యేక కౌంటర్లను సైతం ప్రతీ వాణిజ్య బ్యాంకులో తెరవాలని బ్యాంకులకు సూచనలిచ్చింది. ఈ ఖాతాలను ఏ విధంగా తిరిగి పునరుద్ధరించాలనే దానిపై రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ప్రతి జిల్లా ఖజానా కార్యాలయం (ట్రెజరీ)తో పాటు ఉప ఖజానా శాఖ కార్యాలయాలకు ఇప్పటికే మార్గదర్శకాలు అందాయి.

★ ఏ పంచాయతీల పరిధిలో ఇలాంటి బ్యాంకు ఖాతాలు ఉండిపోయాయో, దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఖజానా శాఖ ప్రతి మండల పరిషత్ కార్యాలయానికి పంపించింది. ఆ సమాచారం ఆధారంగా ఆయా పంచాయతీ అభివృద్ధి అధికారుల ద్వారా ప్రస్తుత సర్పంచులకు సమాచారం చేరవేస్తున్నారు.

★ సర్పంచి ఆధార్ కార్డు, పాన్‌కార్డు నకలు జత చేసి ప్రభుత్వం ఇచ్చిన నమూనా దరఖాస్తు పూర్తి చేయాలి. తరవాత సర్పంచితో ఈ-కేవైసీ చేయించాలి. తరవాత సర్పంచి నుంచి ఒక లేఖ తీసుకుని దానిని తమ పరిధిలోని ఖజానాకు అందజేయాలి. ఆ దరఖాస్తును రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్‌కి పంపిస్తాం. అక్కడి నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఇటువంటి ఖాతాలను తిరిగి మనుగడలోకి తీసుకొచ్చి, అప్పటి నుంచి బ్యాంకుల్లో ఉండిపోయిన నగదుని తిరిగి ప్రజా అవసరాలకు ఖర్చు చెయ్యడానికి అనుమతి వస్తుంది.

★ జిల్లాలోని చీడికాడ మండలంలో 86 ఖాతాలు (రూ. 76 లక్షలు), చోడవరం మండలంలో 48 (రూ. 56 లక్షలు), దేవరాపల్లి మండలంలో 83 (రూ. 15 లక్షలు), కె.కోటపాడు మండలంలో 20 ఖాతాల్లోని (రూ. 3 లక్షలు) నగదు ఖర్చు కాకుండా బ్యాంకుల్లో ఉండిపోయిందని చోడవరం ఉప ఖజానా అధికారి **ఎల్.మీనా** తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
THE EENADU WAY CLASSIFIEDS
ఈనాడు క్లాసిఫైడ్స్
ప్రతి విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

ఘనంగా మకరజ్యోతి మహోత్సవాలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా గురువారం ఇక్కడ మకరజ్యోతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్వామి అయ్యప్ప దేవాలయం దరిలోని ఎన్టీఆర్ స్టేడియం రాత్రి జన సందోహంతో కిటకిటలాడింది. ముందుగా సాయంత్రం సభాపతి అయ్యన్నపాత్రుడు ఆయన సతీమణి పద్మావతి, కుటుంబ సభ్యులతో అయ్యప్పస్వామి రథయాత్ర చేపట్టారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్టేడియంలో ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తర ప్రదేశ్ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ, సత్యసాయి జిల్లా జేసీ మంత్రి మౌర్య భరద్వాజ్ ప్రముఖ గాయకుడు మనో, సినీ సంగీత దర్శకుడు కోటి, గాయకుడు ధీరజ్‌లను అయ్యన్న దంపతులు, తనయుడు విజయ్ ఘనంగా సత్కరించారు. ఇటీవల తెలుగు మహాసభలు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా అయ్యన్న దంపతులను గజమాలతో గజల్ శ్రీనివాస్ బృందం సన్మానించింది. కోటి, మనోలు ఆలపించిన గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా సభాపతి అయ్యన్న మాట్లాడుతూ 1983 నుంచి దివంగత సత్యనారాయణ స్వామి శ్రీకారం చుట్టిన ఈ వేడుకలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాలు అందరినీ ఒక్కటి చేసి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని కొనియాడారు.

సభాపతి అయ్యన్న, పద్మావతి దంపతులను సత్కరిస్తున్న ఎంపీ రమేష్, గజల్ శ్రీనివాస్ తదితరులు, ఉత్తర ప్రదేశ్ అదనపు డీజీపీ సత్యనారాయణను సన్మానిస్తున్న అయ్యన్న

రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జాతీయ రహదారికి సమీపంలో నిర్మిస్తున్న రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని గజల్ కళాకారుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. అనకాపల్లి జాతీయ రహదారికి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ట్రస్ట్ సభ్యులు కిరణ్ శర్మ, నందన్ శర్మ, సాయి శర్మ, రామకృష్ణ, త్రినాథ్, వీహెచ్‌పీ జిల్లా నాయకుడు శ్రీకాళహస్తి తదితరులతో మాట్లాడారు. ఆలయ నిర్మాణ పనులపై అడిగి తెలుసుకున్నారు. సమాజంలో భక్తి, శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

కోనల్లో.. గిరి'జనం' మధ్యలో..

పండగ చేసుకున్న హోంమంత్రి అనిత

కోటవురట్ల, పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఎత్తయిన కొండలు.. దట్టమైన అటవీ ప్రాంతం.. ఆ గ్రామానికి చేరుకోవాలంటే చిన్న మట్టిరోడ్డే గతి. చరవాణిలు సైతం పని చేయవు. ఇదంతా మన్యం కాదు. కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ శివారు అణుకు గ్రామం. ఈ గ్రామంలో 38 గిరిజన కుటుంబాలున్నాయి. వీరికి తెలుగు స్పష్టంగా రాదు. గిరిజన భాష 'కువి'లో అనర్గళంగా మాట్లాడతారు. ఈ చిన్న కుగ్రామంలో గిరిజనుల మధ్య శుక్రవారం హోంమంత్రి వంగలపూడి అనిత, తన కుమారుడు నిఖిల్, కుమార్తె రేష్మితలతో కల్సి కనుమ పండగ చేసుకున్నారు. దాదాపు మూడు గంటలు గిరిజనులతో మమేకమయ్యారు. నిత్యావసర సరకులు అందజేశారు. చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు ఇచ్చారు. గిరి యువతతో కలిసి వాలీబాల్, కోలాటం ఆడారు. అందరితో కలిసి భోజనాలు చేశారు. తాము పండించిన పసుపు, టమోటా తదితర కూరగాయలను మంత్రికి అందించారు.

అణుకుపై వరాల జల్లు...

అణుకు గ్రామంలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత ఆ గ్రామంపై వరాల జల్లు కురిపించారు. గ్రామానికి తారురోడ్డు వేసేందుకు రూ. 2.5 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించి మంజూరు పత్రాన్ని అందరికీ చూపించారు. ఆమెకు తెదేపా మండల అధ్యక్షులు పెట్ల లింగన్ననాయుడు, సుంకర బాబ్జీ ఆధ్వర్యంలో గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత పరదేశమ్మను దర్శించుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని, గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. గిరి యువత విద్యావంతులు కావాలని సూచించారు. పోలీసు సహా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు. గ్రామంలోనే పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని ప్రకటించారు. ఇక్కడి నుంచి రోజూ గొట్టివాడకు 10 కి.మీ. నడిచి పిల్లలు బడికి వెళుతున్నారని.. ఆ ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి ట్యాంకు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. కాలుష్యానికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో మీతో పండగ చేసుకోవడం మరపురాని అనుభూతిగా పేర్కొన్నారు. 2014-19లో ప్రభుత్వం మారకపోతే రోడ్డు కూడా పూర్తయ్యేదని, వైకాపా పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. రేషన్ సరకులు నేరుగా గ్రామంలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబును ఆదేశించారు. జియో, ఎయిర్‌టెల్ నెట్ వర్క్ టవర్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్లను నిర్మించమని అధికారులకు చెప్పారు. పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో పాటలు పాడించి, డ్యాన్సులు వేయించారు. పలక, నోట్ పుస్తకాలు, నూతన వస్త్రాలను అందించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి గిరిజన కుటుంబానికి, నిత్యావసర సరకులతోపాటు నూతన వస్త్రాలు, దుప్పట్లు అందించారు. ఎన్నికల ముందు తన కుమారుడు అఖిల్ ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి వచ్చానని, వాలీబాల్ కిట్, టీ షర్టులను గిరిజన క్రీడాకారులకు అందించారు. సరదాగా వారితో వాలీబాల్ ఆడారు. గిరిజన మహిళలు ప్రదర్శించిన నృత్యాన్ని తిలకించారు. గిరిజనులతో కూర్చుని, కుమారుడు, కుమార్తెతో కలిసి భోజనం చేశారు. కూటమి నాయకులు కాశీనాయుడు, లింగన్ననాయుడు, జనార్దన్, జానకీ శ్రీను, గెడ్డం బుజ్జి, బాబ్జీ, ప్రకాశ్, వెంకటేష్, గోవిందు, పలు శాఖల అధికారులు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన బాలుడికి తినిపిస్తున్న మంత్రి అనిత

ఉత్సాహంగా ఎడ్లబండి పరుగుపోటీలు

ఎడ్లబండి పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో గ్రామ రైతుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లాస్థాయి ఎడ్లబండి పరుగు పోటీలను అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలలకు చెందిన 14 ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో చోడవరం మండలం సింహాద్రిపురం శివారు లెక్కలపాలేనికి చెందిన పెదపైడితల్లమ్మ ఎడ్లబండి ప్రథమస్థానంలో, దేవరాపల్లికి చెందిన జై వీరాంజనేయ ద్వితీయ, లెక్కల వెంకటరమణ (లెక్కలపాలెం) బండి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సి.ఎం. రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగ అన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతుల ఇంట పంట పండుతుందన్నారు. పండగ రోజుల్లో కోడిపందేలు, గుల్లాటకు దూరంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా ఎడ్లబండి పరుగు పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ మునగపాకలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించి రైతుల్లో ఉత్సాహం నింపుతున్నారని ప్రశంసించారు. నాయకులు పెంటకోట విజయ్, కర్రి సాయికృష్ణ, దాడి ముసిలినాయుడు, ఉల్లూరి నూకనరసింగరావు, దాడి శివ, అప్పలనాయుడు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బొజ్జన్న కొండ తీర్థం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం బొజ్జన్న కొండ తీర్థం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఏటా కనుమ పండగ నాడు బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా తీర్థం నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. మేళాలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. పిల్లలు ఆడుకోవడానికి వీలుగా త్వరలో పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం తీర్థం ఏర్పాట్లపై పోలీసులు, రెవెన్యూ, కొండ సిబ్బందితో చర్చించారు. కొండపై భాగంలో ప్రాచీన బౌద్ధ విగ్రహాలు, లింగాల కొండ వద్ద స్తూపాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. కొండ దిగువ భాగంలో చిన్నారులు ఆటపాటలతో గడిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ గాలి పటాల పోటీలను ప్రారంభించారు. యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. పంచదార చిలకలు, గృహోపకరణ సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. డీఎస్పీ శ్రావణి, గ్రామీణ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందితో భారీ పోలీసు బందోబస్తు చేపట్టారు. కొండకు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా కేటాయించిన స్థలాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టారు. కొండకు చేరుకొనే సబ్బవరం రహదారి, తుమ్మపాల రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

తీర్థంలో పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, భారీగా తరలివచ్చిన జనం

సన్మార్గంలో నడిపే బుద్ధుని బోధనలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బుద్ధుని బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని, వాటిని అందరూ ఆచరించాలని నాగపూర్‌కు చెందిన బౌద్ధ భిక్షువు జ్ఞానదీప్ మహాథేరో పేర్కొన్నారు. అనకాపల్లి మండలం శంకరం బొజ్జన్నకొండ వద్ద శుక్రవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో బౌద్ధమేళా నిర్వహించారు. ముందుగా కొండ ప్రవేశ ద్వారం వద్ద పతాకావిష్కరణ చేశారు. కొండ ప్రధాన గుహ వరకు పంచశీల శాంతియాత్ర చేపట్టారు. గుహలో ధ్యానముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసిన అనంతరం కొండ దిగువ భాగంలో దమ్మ మహాసభ నిర్వహించారు. మహాథేరో మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచాన్ని మేలుకొల్పుతున్నాయని తెలిపారు. పంచశీల సూత్రాలను ఆచరించాలని... ద్వేషం, ఈర్ష్య, పగ, ప్రతీకారం విడనాడాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో బౌద్ధ ఆరామాలు ఘన చరిత్రకు నిదర్శనంగా నిలిచాయన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెయ్య సిద్ధార్థ మాట్లాడుతూ శంకరం వద్ద ఏటా బౌద్ధ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కంబోడియా, మయన్మార్, నాగపూర్‌కు చెందిన భిక్షువులు తరలివచ్చారన్నారు. బొజ్జన్నకొండ వద్ద రూ. 15 కోట్లతో ఫుడ్‌కోర్ట్, లేజర్ షోకు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గొంది నవీన్, విశాఖపట్నం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు, పర్యాటకులు పాల్గొన్నారు.

బౌద్ధ విగ్రహం వద్ద ప్రార్థనలు చేస్తున్న మహాథేరో, బౌద్ధ ఉపాసకులు

ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో శుక్రవారం సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా సుమారు 52 రోజుల క్రితం షట్‌డౌన్ చేసి ఉత్పత్తిని నిలుపుదల చేశారు. అప్పటినుంచి అధికారులు, కార్మికులు శ్రమించి ఈ యూనిట్‌లోని అన్ని విభాగాలకు వార్షిక మరమ్మతులు పూర్తిచేసి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. ప్రస్తుతం 1, 2, 3, 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి యథావిధిగా జరుగుతోందని కార్మిక వర్గాలు తెలిపాయి.

ఆరుగురికి సంక్రాంతి పురస్కారాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పని చేసి కర్షక బాంధవుడిగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి నిలిచారని అనకాపల్లి జిల్లా తెదేపా, భాజపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పేర్కొన్నారు. సమాజానికి పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ఆరుగురు సేవకులకు సంక్రాంతి సందర్భంగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి పేరిట అనకాపల్లిలో గురువారం పురస్కారాలు అందజేశారు. గణిత అష్టావధాని తోటకూర సాయిరామకృష్ణ (సామర్లకోట), ఉత్తమ సంఘం సేవకులు చందన వెంకట గంగాధరరావు (పశ్చిమ గోదావరి జిల్లా), 82 సార్లు రక్తదానం చేసిన ఎర్రగుంట కృష్ణారెడ్డి (అనంతపురం జిల్లా) జనరేషన్ యువ సంస్థ బోయిన నరేష్‌కుమార్ (విశాఖపట్నం), సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా అవయవదానం, అంతిమయాత్ర ఉచితంగా వాహనాలు నడుపుతున్న దాడి శ్రీను (పెందుర్తి), చదువుకు పేదరికం కారణం కాదని ఇటీవల నిరూపించి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న రుత్తల లీలాశ్రావణి (తూర్పుగోదావరి జిల్లా)కి పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. రామలింగస్వామి ట్రస్టు నిర్వాహకురాలు పార్వతి, ప్రతినిధులు కొణతాల పణిభూషణ్‌శ్రీధర్, శివశంకరబాబు, కోరుకొండ బుచ్చిరాజు, కర్రి సన్యాసినాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త కె.వీరభద్రరావు, మళ్ల జగదీష్ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

బోసిపోయిన జాతీయ రహదారి

నక్కపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ ఆరంభానికి ముందు నిత్యం వాహనాలతో రద్దీగా కనిపించిన జాతీయ రహదారి కనుమ పండగ రోజయిన శుక్రవారం వెలవెలబోయింది. పండగ హడావుడితో అంతా గ్రామాలకే పరిమితం కాగా జాతీయ రహదారిపై స్తబ్దత నెలకొంది. కార్లు, బస్సులే కాకుండా ఇతర రవాణా వాహనాల సంఖ్య తగ్గిపోయింది. దీంతో జిల్లాలో అనకాపల్లి, కశింకోట, తాళ్లపాలెం, అడ్డురోడ్డు, నక్కపల్లి, కాగిత టోల్‌ప్లాజా, వేంపాడు, పాయకరావుపేట కూడళ్లలో సందడి కనిపించలేదు. ముఖ్యంగా టోల్‌గేట్ కౌంటర్లన్నీ బోసి పోయాయి. రాకపోకలు సగానికి పైనే పడిపోయాయి. ఇక దుకాణాలు సైతం మూతబడ్డాయి.

టోల్‌గేట్ వద్ద ఖాళీగా ఉన్న కౌంటర్లు

పండగ వేళ విషాదం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: పండగపూట విషాదం నెలకొంది. సంక్రాంతి తీర్థం తిలకించేందుకు వెళ్తున్న యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో ఒకరు దుర్మరణం పాలవగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నక్కపల్లి సీఐ జె. మురళి కథనం ప్రకారం... ఎస్.రాయవరం మండలం గెడ్డపాలేనికి చెందిన దాడిశెట్టి పవన్ (18) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తన స్నేహితులైన రాంబిల్లి మండలం మర్రిపాలేనికి చెందిన మడగల సతీష్, కాగితకు చెందిన వంగలపూడి అభిషేక్‌తో కలిసి ఎస్.రాయవరంలో తీర్థానికి కాగిత నుంచి ద్విచక్ర వాహనంపై ముగ్గురూ గురువారం బయలుదేరారు. వీరు నక్కపల్లి ఆసుపత్రి కూడలి దాటగానే వెనుక నుంచి వచ్చిన లారీ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కిందపడగా, పవన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనానికి వీరి బైకు తగలడంతో దానిపై ఉన్న విజయనగరం జిల్లా కొత్తపాలేనికి చెందిన ఎస్.వరప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు వీరిని సమీపంలోని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందాడు. అభిషేక్, సతీష్‌లకు ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. పవన్‌కు సౌమ్యుడిగా పేరుంది. ఇతడి తల్లి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా, తండ్రి శ్రీనివాసరావు నాలుగేళ్ల క్రితం అడ్డురోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి తన సోదరుడు నవీన్ సంరక్షణలో నక్కపల్లి మండలం ఉపమాకలోనే ఉంటున్నాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు అధిక సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదంపై మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.సన్నిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఇదే మార్గంలో వెళ్లిన హోం మంత్రి అనిత విషయం తెలుసుకుని బాధితులకోసం ఆరా తీయడంతోపాటు పోలీసులతో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను సహకార సంఘం ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పరామర్శించి ఓదార్చారు.


పవన్ (పాతచిత్రం)

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని పెదరామభద్రపురం-శ్రీరాంపురం మధ్య దక్కన్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం పల్సర్ బైకు, స్కూటీ ఢీకొన్నాయి. తునిలోని రామకృష్ణకాలనీకి చెందిన నామవరపు లోకేష్, పితాన కార్తీక్‌కుమార్ పల్సర్ బైకుపై పెదరామభద్రపురం వైపు నుంచి శ్రీరాంపురం వెళుతున్నారు. ఇదే సమయంలో శ్రీరాంపురం నుంచి నామవరం వైపు ఎలక్ట్రికల్ స్కూటీపై వెళుతున్న వ్యక్తిని దక్కన్ రోడ్డు కూడలి వద్ద అతివేగంగా పల్సర్ నడిపి ఢీకొన్నారు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి పట్టణంలోని రాజుగారిబీడుకు చెందిన వారు. ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని సీఐ అప్పన్న చెప్పారు.

ఢీకొన్న బైకులు

అప్పులబాధతో ఆత్మహత్య

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో బలిఘట్టానికి చెందిన **కోరుపోలు మల్లేశ్వరరావు** (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ గఫూర్ కథనం ప్రకారం ఈనెల 12వ తేదీన గడ్డి మందు తాగి బలవన్మరణానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదేరోజు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు సీఐ వివరించారు. అప్పులు చేసి భవన నిర్మాణాల సెంట్రింగ్ పనులకు ఉపయోగపడే సామగ్రి కొనుగోలు చేశారు. అప్పు ఇచ్చిన వారు కోర్టు నోటీసు పంపడంతో ఆవేదనకు గురై గడ్డిమందు తాగాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

31 మంది జూదరులపై కేసులు

మునగపాక, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహించిన పేకాట, గుల్లాట శిబిరాలపై ఎస్సై ప్రసాదు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. మునగపాక, నాగవరం, ఒంపోలు, తోటాడ, రామగిరి, నాగులాపల్లి, మల్లవరం గ్రామాల్లో గుల్లాటలు, పేకాట ఆడుతున్న 31 మందిని అదుపులోకి తీసుకొని 15 కేసులు నమోదు చేశామన్నారు. చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

తీరంలో గుర్తుతెలియని మృతదేహం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాల్మన్‌పేట సముద్ర తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పాయకరావుపేట ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తీరానికి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్లు స్థానిక మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీరానికి వెళ్లి పరిశీలించగా చనిపోయిన వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలకు పైగా ఉంటుందన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

దిల్లీలో చిక్కిన గంజాయి నిందితుడు

నాతవరం, న్యూస్‌టుడే: గంజాయి కేసులో తప్పించుకున్న నిందితుడిని దిల్లీలో నాతవరం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నాతవరం ఎస్సై తారకేశ్వరరావు కథనం ప్రకారం.. ఇక్కడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన కేసులో పశ్చిమ దిల్లీకి చెందిన రోహిత్ కుమార్ ప్రధాన నిందితుడు. కేసు నమోదు చేసినప్పటి నుంచి నాలుగేళ్లుగా ఆయన పరారీలో ఉన్నాడు. ఇతనిపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. నిందితుడు దిల్లీలో నివాసం ఉన్నట్లు అందిన సమాచారంతో ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలతో నాతవరం ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అక్కడి పోలీసు సహకారంతో చాకచక్యంగా పట్టుకుని తీసుకొచ్చామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైని, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నిందితునితో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	145	142
లైవ్	172	162
డ్రెస్‌డ్	249	294
స్కిన్‌లెస్	284	304

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

M Swift VXI / CNG / 2023 / AP40L 9761 Sundaram Finance Ltd., Anakapalli. Cont : 9440909730, 7901677807.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్‌లోన్. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 9396999669

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావులమదుం జంక్షన్, ప్రతీనెల 5,19 తేదీల్లో మందులు

PERSONAL CLASSIFIEDS

LOST

DOCUMENTS LOST

I, Atmakuri Venkata Sivaprasad s/o Late Satyaraja, D.No.7-5-44, Aditya, Panduranga puram, Visakhapatnam-03, AP. I was Lost my Original Documents Nos are : 1) 959/2009 2) 950/2009 3) 3976/2005 4) 3977/2007 5) 4503/2000 6) 1851/1985 7) 1852/1985, While I was travelling from Pandurangapuram to Ramnagar Area.. Pl. Inform if anybody found : 9848194605

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ICAS వైజాగ్. జ్యోతిష్యం, వాస్తు, హస్తరేఖ సర్టిఫైడ్ డిప్లొమో కోర్సులు ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ అడ్మిషన్లు. క్లాసులు ప్రతీ శని, ఆదివారాలలో అపర్ కాన్సెప్ట్ స్కూల్ NAD కొత్తరోడ్ శ్రీ నవోదయ Jr.కాలేజ్, గురుద్వార్ ICAS App.లో క్లాసులు J.శ్రీనివాస్ 9966666659, 9441389808

PEOPLE CARE

OLD AGE HOME

అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లో మదర్ & ఫాదర్ రిటైర్మెంట్ హోమ్ ఆధునికవసతులతో డాక్టర్ & నర్సింగ్ పర్యవేక్షణలో వృద్ధులు & పేషెంట్లకు సేవలు 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

GAJUWAKA

Gajuwaka & Aganampudi Flat for Sale 2 BHK & 3 BHK Available East & West Facing. Contact: 9100682263.

MVP COLONY

MVP Colony, Sector-8 Ushodaya Junction, 2BHK Flat with Seaview, for Sale, handover in 2 Months Ct : 9908232343.

PENDURTHI

2BHK 1000 Sft. & 3BHK 1260 Sft. Police Station, Pendurthi Jn. Zudio Backside Brundavan Garden. 8886216096, 9393108858.

SIRIPURAM

1.16 Cr Siriavenue Apartment 3BHK N/F 1375 Sft UDS 46 Sqy Near Tirumala IIT Opp. Sampath Vinayaka Swamy Temple 9849352323

GENERAL

Chinawaltair Road Opp. 3Town Police Station 3BHK E/W 1539 Sft. Ready to Occupy in 3 Months Contact: 9573493811.

2BHK 1125 Sft. East & West Facing Flats for Sale at Pineapple Colony, Arilova with Car Park. 7396663627, 9985746625.

FLAT FOR SALE 1225 SFT (UDS-60 SQ. YDS) 2 BHK S/F, 1st FLOOR @ BALAJINAGAR OPP: AU 9959577800, 9492121361

HOUSE FOR SALE

ANAKAPALLI

అనకాపల్లిలో 92 చ॥గ॥ ఇల్లు 11 1/2x 72 అమ్మకమునకు కలదు. 14 అడు రోడ్డు. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే. సంప్ర॥ 9849966043/ 8374429445.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగా 'మం' గోవిదాపురం రోడ్డు, హైవేకి 1/2km తారోడ్డుఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట & 4ఎకరాలు కొబ్బరితోట అమ్మకం ✆ 9440255187

PLOT FOR SALE

ANAKAPALLI

Rebaka (Anakapalli to Sabbavaram Highway) Just 300 Meters, 800 Sq.yds. Cost: 12,000/- per Sq.yard. Negotiable. ✆ 9100682263.

BHOGAPURAM

Newly Launched Commercial Venture at Bhogapuram all Facings & 366 Sq.Yds. Tagarapuvalasa "Y" Jn. towards Airport Road. Suitable for all types of Business. 9992273747.

Bhogapuram Bheemili VMRDA Layouts New & Resale Plots 167, 267, 500, 1000Sq.yds Near to Airport. ✆ 9966311167.

COMMERCIAL PLOTS FOR SALE 366 Sq. yds TAGARAPULVALSA "Y"JN Towards Airport Road Newly launched Commercial venture at BHOGAPURAM Direct highway facing ✆9866844433

విశాఖలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చుట్టు ప్రక్కల అప్రూవ్ ఇండ్ల స్థలాలు బ్యాంక్‌లోన్‌తో అమ్మకం. గరిమెళ్ళ శ్రీధర్ 9493640600,9246678028.

KOTHAVALASA

1274 Sq.Yd. VUDA, N/S/W Corner Bits. 40 Feet Roads Kothavalasa. 500 Mtrs. distance from Raipur 6Lines Highway ✆ 8008770421.

కొత్తవలసకి అతి చేరువలో ప్లాంటేషన్ సదుపాయంతో, రాయపూర్ హైవేకి దగ్గరలో అతితక్కువ ధరలలో ప్లాట్ అమ్మకమునకు కలవు. సంప్రదించండి 9951611123.

MADHURAWADA

300 Sq.yds. x 2 Plots E/F Nagarapalem with or without LRS. Contact: ✆ 9177939766 , 9347778898.

Madhurawada Kapuluppada VUDA Plots 216, 245, 267, 751, 960, 1000, 1200, 4200 Details. ✆ 9866883434.

PENDURTHI

చినముషిడివాడ వుడా N/F 170 గ॥లు & పెందుర్తిలో వుడా E/F 200చ॥గ॥లు స్థలంలు అమ్మకం. 6281307400 / 9985049722.

GENERAL

200 Sq.y. East Facing Plot in SVN Layout Near Saraswati Temple, Vizianagaram. Direct Parties only. ✆ 9121782266.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call : 9866219067

Residential East facing 306 yds plot in Viman nagar, NAD, Vizag for Sale. contact: 9441021552

భోగాపురం ఎయిర్‌పోర్ట్ దగ్గర్లో తర్లువాడ గూగుల్‌డేటా సెంటర్ చుట్టు ప్రక్కల VMRDA వుడా ప్లాట్స్ అమ్మకం బ్యాంక్ లోన్ కలదు. Ph: 7995143119.

TO LET

SEETHAMMADHARA

For Rent 3 BHK + Pooja room (house 1st Floor), Seethammadhara North Extension. Ph: 9704778149, 8008727930

COMMERCIAL

MADDILAPALEM

3BHK commercial flat for rent at prime locality JSR residency, Maddilapalem High way, Nr.Satyam Jn., ✆ 8500340656.

JOBS

చిరంజీవ చిట్‌ఫండ్ వైజాగ్‌లో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పనిచేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం॥ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 9441413345.

10th Age 18-40 మా NGO ద్వారా నిరుద్యోగులు వైజాగ్‌లో ఫ్రీగా ప్రభుత్వ సర్టిఫికేట్ & స్టైఫండ్‌తో &15k-18k జీతంతో మెడికల్ జాబ్స్ ✆7036571263.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తెరపై ఈనాడు

రాజా: **రాజాసాబ్**, రామచంద్ర, పర్తిసాయి: **మన శంకర వరప్రసాద్‌గారు**, వెంకటేశ్వర: **భర్త మహాశయులకు విజ్ఞప్తి**, సత్యనారాయణ స్క్రీన్‌1: **అనగనగా ఒకరాజు**, స్క్రీన్‌2: **మన శంకర వరప్రసాద్‌గారు**, షిర్డిసాయి: **నారీనారీ నడుమమురారి**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **మన శంకర వరప్రసాద్‌గారు** స్క్రీన్-2:**రాజాసాబ్**

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. మునగపాకకు చెందిన వేగి పరదేశినాయుడు దంపతులు, వారి కుమారులు రూ.లక్ష కమిటీ సభ్యులకు అందజేశారు. పెంటకోట వెంకట సత్యనారాయణ, కమల దంపతులు, కుదిరెడ్ల వెంకట ప్రసాదు రూ. 25 వేల చొప్పున, కోనపల్లి రామ్మోహనరావు, కనకలక్ష్మి దంపతులు రూ.25,116 అందజేశారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

బంగారు తీగ రూ.50

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిలోని పలు చోట్ల ఒక చెరకు గడ రూ.50లకు అమ్మకమైంది. సాధారణంగా చెరకు గడ ఖరీదు రూ.20 నుంచి 25 ఉంటుంది. బంగారు తీగ చెరకు ఇంతకు రెట్టింపు అమ్మకమైంది. ఇది తినడానికి ఎంతో అనువుగా ఉంటుంది. మెత్తగా, చిన్న పిల్లలు సైతం తొక్కతీసి తింటారు. గుజ్జు మొత్తగా ఉంటుంది. ఈ రకం బెల్లం, పంచదార తయారీకి అనుకూలం కాదు. కొద్ది మంది రైతులే తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఉత్సవాలు, జాతర్ల సమయాల్లోనే వీటి అమ్మకాలు చేస్తారు. అరుదుగా లభించే రకం కావడంతో ధర ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు.

అమ్మకానికి ఉంచిన చెరకు గెడలు

మహిళలకు చీరల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా లక్ష్మీదేవిపేటలో 450 మంది పేదలకు చీరలు, దుప్పట్లు, బియ్యం పీలా రాజారావు ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పీలా తులసీరామ్ పంపిణీ చేశారు. గవరపాలెం సాగి సుబ్బరాజు వీధిలో నూకాలమ్మ దేవస్థానం పూర్వపు ఛైర్మన్ కొణతాల వెంకటరావు 100 మందికి, విద్యుత్తు కార్యాలయం సమీపంలో బుద్ధ రాజేష్ ఆధ్వర్యంలో 200 మందికి దుప్పట్లు అందజేశారు.
ఎస్.రాయవరం: చిల్డ్రన్స్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సారిపల్లిపాలెంలో హోంమంత్రి వంగలపూడి అనిత, మండలంలోని వెంకటాపురంలో తెదేపా మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం వీటిని మహిళలకు అందించారు. అసోసియేన్ ఛైర్మన్ ఉప్పు వీర సంతోష్, వైస్ ఛైర్మన్ చలమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం గ్రామాల్లో మాజీ సర్పంచి నల్లపరాజు వెంకటరాజు 1200 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

కోడిపందేలపై దాడులు

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని చరకాం గ్రామ శివారులో అరెస్ట్ చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఎస్సైలు మనోజ్‌కుమార్, కె.లక్ష్మణరావు సిబ్బందితో వెళ్లి 4 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏనుగుతుని శివారులో గుళ్లాట నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రూ.1870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.
నక్కపల్లి: వేంపాడు, ఉపమాక, డీఎల్ పురం, ముకుందరాజుపేట గ్రామాల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన దాడుల్లో 22 మంది పట్టుకు ని మొత్తం 8 కేసులు నమోదు చేసినట్లు సీఐ జె. మురళి తెలిపారు.
అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వివిధ ప్రదేశాల్లో నిర్వహిస్తున్న లాటరీ బల్లలు, కోడిపందేలపై ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 12 మంది నుంచి రూ.15210 నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ చంద్రశేఖరరావు వెల్లడించారు.

విషపూరిత ఆహారం తిని మూడు ఆవులు మృతి

మునగపాక, న్యూస్‌టుడే: టి.సిరసపల్లిలో విషపూరిత ఆహారం తిని గ్రామానికి చెందిన పొలమరశెట్టి ఈశ్వరరావుకు చెందిన మూడు ఆవులు మృతి చెందాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చదరంగం పోటీల విజేత గంగరాజు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేటలో నిర్వహించిన చదరంగం పోటీల్లో గంగరాజు విజేతగా నిలిచారు. నాయకులు శంకరరావు, ఆ ప్పారావు, కర్రి అభిబాబు, ఆడారి శివ, మళ్ల నాగేశ్వరరావు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

కోటవురట్ల: క్రీడలతో ఆరోగ్యకరంగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వీసీ సూర్యనారాయణరాజు అన్నారు. కోటవురట్ల పీఎంశ్రీ పాఠశాల మైదానంలో పది రోజులపాటు జరిగిన క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 30 వేలు, రూ. 15 వేల చొప్పున నగదు బహుమతులు శుక్రవారం అందించారు. సర్పంచి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు జానకి శ్రీను పాల్గొన్నారు.

విజేతలతో నాయకులు

మత్స్యకారులకు మంచి రోజులు

నక్కపల్లి, న్యూస్‌టుడే

సముద్రానికి ఎదురీదుతూ జీవన పోరాటం సాగించే మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయి. తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రంలో మూడు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు (ఎఫ్.ఎల్.సి) మంజూరు చేయగా, ఇందులో రెండు నక్కపల్లి మండలంలోనే ఏర్పాటు కానున్నాయి.

జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల పరిధిలో వేలాది మంది మత్స్యకారులు చేపల వేటసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో సింహభాగం పాయకరావుపేట నియోజకవర్గానిదే. చేపలవేటలో భాగంగా వీరు ఒడ్డు నుంచి తెప్పలను సముద్రంలోకి తీసుకెళ్లి తిరిగి ఒడ్డుకు చేర్చుతుంటారు. దీనికి తోడు సముద్రంలో పట్టిన మత్స్యసంపదను నిల్వ చేయడానికి, విక్రయించడానికి సరైన సదుపాయాలు ఉండటం లేదు. ఈ సమస్యల పరిష్కారానికి ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వీరు చాలారోజులుగా కోరుతున్నారు. గత ప్రభుత్వంలో వీటిని కేవలం మంజూరుకే పరిమితం చేసి మూలన పెట్టేశారు. దీంతో మత్స్యకారుల ఆశలు తీరలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి వంగలపూడి అనిత వీరి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబుతో మాట్లాడి రెండు కేంద్రాలను నూతనంగా మంజూరు చేయించారు. రాజయ్యపేట వద్ద రూ.17.90 కోట్లు, దొండవాక వద్ద రూ. 16.58కోట్లు వెరసి రూ. 34.48కోట్లతో వీటిని నిర్మించనున్నారు. గతం కంటే దాదాపు రూ. పదికోట్లు అదనంగా వీటికి కేటాయించారు. ఒక్కో ఎఫ్.ఎల్.సి.కి ఆయిదెకరాల చొప్పున స్థలం కేటాయించనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఇకపై తెప్పలను ఒడ్డుకు తెచ్చే కష్టాలుండవు.

ఇలాంటి కష్టాలకు త్వరలోనే చెల్లు

ఒనగూరే సదుపాయాలివే: ఎఫ్.ఎల్.సి. నిర్మితమైతే భారీ రక్షణ ప్రహరీ, ఐస్ ప్లాంటు, సరకు ఎగుమతి దిగుమతి ఏర్పాట్లు, తెప్పలు వలల మరమ్మతు సదుపాయం, ఎండబెట్టే ఆరబెట్టే ప్లాట్‌ఫారం, విశ్రాంతి తీసుకునే షెడ్లు, చేపల నిల్వకు కోల్డ్ స్టోరేజ్, వాహన పార్కింగ్, తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, కాలువలు, రోడ్లు ఇలా అనేక సదుపాయాలుంటాయి. దీని ద్వారా సమీప గ్రామాల మత్స్యకారులు తమ తెప్పలను ఇక్కడే పెట్టుకుని వేట సాగించవచ్చు. చుట్టుపక్కల తీర గ్రామాల మత్స్యకారుల కష్టాలు తీరిపోతాయి.

సదుపాయాల్లేని రాజయ్యపేట తీరం

మరింత అభివృద్ధి: వైకాపా పాలనలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగింది. ఆది నుంచి మత్స్యకారులకు అండగా నిలిచింది మా ప్రభుత్వమే. ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ ఎఫ్ఎల్‌సీలు మంజూరు చేయించాను. వీలైనంత త్వరగా పూర్తి చేయించేలా చూస్తాను. దీని ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తీర గ్రామాలను అన్ని విధాలా మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
– వంగలపూడి అనిత, హోం మంత్రి

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై కూటమినాయకుడు కర్రి సత్యనారాయణ తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గురువారం పండగ సెలవుల నేపథ్యంలో హడావుడిగా పునాదులు నిర్మాణం చేపట్టారని, ఈ నిర్మాణాన్ని అడ్డుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

తాళ్లపాలెం ప్రభుత్వ స్థలంలో నిర్మాణం

అండర్‌పాస్‌లతో అవస్థలు

రైల్వే అండర్‌పాస్‌లు ప్రయాణికులకు అవస్థలను మిగుల్చుతున్నాయి. మండలంలోని పి.ఎల్.పురం, సీతారాంపురం గ్రామాల్లో వీటితో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పి.ఎల్.పురం వద్ద రైల్వేట్రాక్ తొలగించారు. దాని పక్కనే రాకపోకలకు వీలుగా రైలు పట్టాల కింద నుంచి రోడ్డు వేశారు. దీనికి పక్కనే మరో అండర్‌పాస్ ఉంది. ఏమాత్రం వర్షం వచ్చినా నీరంతా దీనిలోకి చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోతోంది. దీనికితోడు కొండగెడ్డ నుంచి బురద కొట్టుకువస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వీటి ద్వారానే జగన్నకాలనీకు రాకపోకలు సాగించాల్సి ఉంది. నీరు పోయేందుకు వీలుగా డ్రైనేజీ నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారమవుతుంది. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

మురుగులో తాగునీటి పైపులైను

తాగునీరు కలుషితమవుతోంది. అధికారుల తీరు ప్రజల ఆరోగ్యానికి ఎసరు పెడుతోంది. పాయకరావుపేటలోని రైల్వే ట్రాక్ దిగువ నుంచి ఇందిరాకాలనీ వద్ద పైపులైను ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా మురుగులో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తుప్పు పట్టి.. రంధ్రాలు పడుతుండటంతో పైపుల్లోకి మురుగు చేరే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కిందట వేసిన పైపులు కావడంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో తరచూ నీరు కలుషితమవుతోందని వాపోతున్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కుళాయిలు డ్రైనేజీల్లోనే ఉన్నాయి. వీటన్నింటినీ గుర్తించి సమస్య పరిష్కరించాల్సి ఉంది. లేకుంటే కలుషిత నీటి కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది. - న్యూస్‌టుడే, పాయకరావుపేట

తవ్వారు... ఇలా వదిలేశారు..

వెంకటనగరం-పాల్మన్‌పేట బీచ్ మార్గంలో రోడ్డుపై గుంత కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో సమీప గ్రామాలకు జలజీవన్ పథకంలో భాగంగా తాగునీటి పైపులైను ఏర్పాటుకు రహదారి మధ్యలో గుంత తవ్వారు. ఆ పైపులైను వేసిన తరువాత తాత్కాలికంగా పూడ్చారు. దీంతో రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడింది. ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ ఆదమరిస్తే మరింత ప్రమాదకర పరిస్థితి నెలకొంటుందని భయపడుతున్నారు. అధికారులు సమస్యపై స్పందించి గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, వాహనదారులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

తోటలకు తప్పని నిఘా నీడ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చోరీలకు కాదేదీ అనర్హం అన్నరీతిలో దొంగతనాలు పెరుగుతున్నాయి. వీటిని రక్షించుకునేందుకు ఇప్పటికే ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదేవిధంగా తోటల రక్షణకు సైతం మండలంలోని రైతులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొబ్బరితోటల్లో చొరబడి రాత్రిపూట కాయలు ఎత్తుకుపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా మండలంలోని కుమారపురంనకు చెందిన రైతు సత్యానందరెడ్డి కొబ్బరితోట వద్ద ఇలా నిఘా కెమెరా ఏర్పాటు చేశారు. సోలార్‌తో పని చేసేవిధంగా బిగించారు.

కొబ్బరితోట వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు

మునగపాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ గ్రామాన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. యువకులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. కేటీవీపాలెం, శంకరం, రేబాక, గొర్లివానిపాలెం, వల్లూరు, చింతనిప్పుల అగ్రహారం, కోడూరు, గోపాలపురం గ్రామాల్లో రైతులు పంట పొలాల్లో పాడిపశువులకు పూజలు చేశారు. పట్టణంలోని గవరపాలెం నూకాంబిక ఆలయంలో ఆలయ నిర్వాహకుడు పెట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు.
ఎలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం, మునగపాక న్యూస్‌టుడే: మునగపాకలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో గోమాత అలంకరణ, ఆరోగ్యం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్‌తో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గం నలుమూలలనుంచి 116 గోవులు పాల్గొన్నాయి. ఎలమంచిలి మండలం సోమలింగపాలెంలో శివాలయం వద్ద పూజలు చేశారు. గౌరీయాత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎండ్లబండి పోటీలు ఆకట్టుకున్నాయి. మునగపాక, నాగులాపల్లిలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గణపర్తిలో నవతరం సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, బిందెలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నాటికలు ప్రదర్శించారు. పాటిపల్లిలో మావూళ్లో గ్రంథాలయం, స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో పెద్దలను సత్కరించారు. మునగపాకలో వేగి పరదేశినాయుడు, లక్ష్మణరావు, రమణబాబు 400 మందికి, సర్పంచి దిమ్మల అప్పారావు, నూకరాజు 300 మందికి, నాగులాపల్లిలో మళ్ల కాళేశ్వరరావు 250 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. హరిపాలెం వద్ద పెంటకోట చావడి వద్ద ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి.
కశింకోట, న్యూస్‌టుడే: సన్నీ యూత్ క్లబ్ అధ్యక్షులు మామిడి నాయుడు ఆధ్వర్యంలో బయ్యవరంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.
ఎస్.రాయవరం, నక్కపల్లి: ఎస్.రాయవరం, మండలం వెంకటాపురం, పెనుగొల్లులో ముగ్గుల పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన యువతులకు బహుమతులు అందజేశారు. వెంకటాపురంలో సర్పంచి కొప్పిశెట్టి సత్యం ఆధ్వర్యంలో చిన్నారులకు మ్యూజికల్ ఛైర్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నక్కపల్లి మండలం నెల్లిపూడిలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

హరిపాలెంలో నాటిక

అలంకరణలో గవరపాలం నూకాంబిక

వెంకటాపురంలో మ్యూజికల్ ఛైర్ ఆడుతున్న చిన్నారులు

నెల్లిపుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

మునగపాకలో ఆకర్షణీయంగా వేసిన ముగ్గులు

క్రీడలతో ఉన్నత ఉద్యోగాలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చునని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అడిషనల్ డీజీ కె.సత్యనారాయణ అన్నారు. కోటవురట్ల మండలంలో తన సొంత గ్రామమైన పాములవాక సంక్రాంతి పండగకు వచ్చారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కలిశారు. వారిని అభినందించి రూ.20 వేల నగదు అందించారు. మాకవరపాలెం మండలంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు అందించారు. ఇమ్మనియల్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఛైర్మన్ జీవన్‌రాయ్, ఉపాధ్యాయులు రమణ, పోతల ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు అందించి అభినందిస్తున్న సత్యనారాయణ

విందు భళా...

పండగ భోజనంబు..131 రకాలతో విందు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కొత్త అల్లుడికి భారీ విందు భోజనం పెట్టడం గోదావరి జిల్లా వాసులకే అలవాటు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలోనూ ఈ సంప్రదాయానికి తెరతీశారు. పాయకరావుపేటకు చెందిన కె. రమణ, అమ్మాజీలు కొత్త అల్లుడికి ఊహించని విందు ఇచ్చారు. కాకినాడ జిల్లా కొడవలికి చెందిన సతీష్, పాయకరావుపేటకు చెందిన తనూషలకు వివాహమైంది. తొలిసారిగా పండగకు అత్తవారింటికి వచ్చిన సతీష్‌కు 126 రకాల వంటకాలు, మరో అయిదు రకాల పండ్లతో భోజనం ఏర్పాటు చేశారు.

కొత్తఅల్లుడికి విందు...

ఆప్యాయతల వడ్డింపు

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపాలెం కర్రివారివీధికి చెందిన బొడ్డేడ కుటుంబీకులు ఒకచోట కలిశారు. వృత్తి, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరంతా కనుమ సందర్భంగా శుక్రవారం ఒకే ఆకులో కలిసి భోజనం చేశారు. మూడు రోజులుగా 60 మంది కలిసి ఆటపాటలతో సరదాగా గడిపారు. సుంకరమెట్ట సత్యనారాయణ దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఒకే ఆకులో భోజనం చేస్తున్న కుటుంబ సభ్యులు

గ్రామాల్లో తీర్థాల సందడికి శ్రీకారం

సోమలింగపాలెంలో పరుగు తీస్తున్న గుర్రం

కొత్తూరు (అనకాపల్లి), అనకాపల్లి గ్రామీణం, ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తీర్థాల సందడి మొదలైంది. అనకాపల్లి మండలం కూండ్రంలో చిన రామస్వామి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. ఎడ్ల పోటీలను గ్రామానికి చెందిన నందారపు సూరిబాబు, జెట్టి అప్పారావు, గంటా తాతయ్యనాయుడు ప్రారంభించారు. విజేతలకు సర్పంచి నందారపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జెట్టి సత్యవతి బహుమతులు అందజేశారు. గాంధీనగరం అంజయ్యకాలనీ వేంకటేశ్వరస్వామి మూలమూర్తిని బంగారు, వజ్ర కవచాలతో అలంకరించారు. శీరంశెట్టివానిపాలెంలో నందీశ్వరస్వామి, అక్కిరెడ్డిపాలెం తారకరామా కాలనీలో కామాక్షమ్మ తీర్థాలు వేడుకగా నిర్వహించారు. సోమలింగపాలెం రాజరాజేశ్వరి సోమేశ్వరస్వామి ఆలయం వద్ద గుర్రాలపోటీలు నిర్వహించారు. విజేతలకు పిళ్లా రమేష్ బహుమతులు అందచేశారు.
మునగపాక: రామగిరిలో కోదండ సీతారాముని తీర్థం వైభవంగా జరిగింది. తిమ్మరాజుపేటలో గురువారం అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. మునగపాకలో జిల్లాస్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో చోడమాంబికా విక్రమ్, సిద్దివినాయక సాయిశ్రీ, దాడి కోటేశ్వరరావు గుర్రాలు నిలిచాయి.
నక్కపల్లి, పాయకరావుపేట గ్రామీణం: నక్కపల్లి మండలం దొంకాడలో గంగాలమ్మ జాతర ఘనంగా జరిగింది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. రాత్రి గ్రామంలో మహిళలు బోనాలతో ఊరేగింపు జరిపారు. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలోని కోదండ రామస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. సత్యవరం, కొత్తూరు, తుని, పాయకరావుపేట, శ్రీరాంపురం, కేశవరం తదితర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.
కశింకోట: కశింకోట శివాలయం, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి దేవస్థానంలో మారుతీ విద్యా పీఠాధిపతి మారుతీ వెంకటాచార్యులు ఆధ్వర్యంలో 350 మంది వృద్ధులకు దుస్తులు, నగదు అందజేశారు. సాయంత్రం సాధు మఠం వద్ద తీర్థం నిర్వహించారు. నర్సింగబిల్లిలో వీరుడుబాబు నిర్వహించిన ముగ్గుల పోటీలను నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు విజేతలకు జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్నతో కలిసి బహుమతులు అందజేశారు.

కూండ్రంలో ఎడ్ల బండి పరుగు పోటీల విజేతకు బహుమతి ఇస్తున్న ప్రతినిధులు

వజ్రకవచాలతో శ్రీ వేంకటేశ్వరుడు

నర్సింగబిల్లి వీరుడుబాబు తీర్థంలో రంగవల్లులను పరిశీలిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

పెదరామభద్రపురంలో తీర్థానికి హాజరైన జనం

దొంకాడలో బోనాలతో భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాల్మన్‌పేటలో ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు పడ్డాయి. వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. – రాజు, స్థానికుడు
✓: గుంతలు తాత్కాలికంగా పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తాత్కాలికంగా పంచాయతీ నుంచి గుంతల్లో గ్రావెల్ వేస్తాం. – కోడ కోటేశ్వరరావు, సర్పంచి, పాల్మన్‌పేట
ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: రేగుపాలెం సమీపాన రోడ్డు పక్కన లారీ బోల్తాపడిన చోట బండరాళ్లు గుట్టగా పడి ఉన్నాయి. వాటిని తొలగించాలి. – కె.సత్యనారాయణ, ఎలమంచిలి
✓: బండరాళ్లను తొలగించేందుకు చర్యలు చేపడతాం.– ఉపేంద్ర, గ్రామీణ ఎస్సై
ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలో చెరకు కొనుగోలు కేంద్రం వద్ద రాత్రులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. మద్యపాన ప్రియులతో ఇబ్బందిగా ఉంది. – సుబ్బారావు శర్మ, ఎలమంచిలి
✓: ఆ ప్రాంతంపై నిఘా ఉంచుతాం. అసాంఘిక కార్యకలాపాలను నిరోధిస్తాం. – సావిత్రి, పట్టణ ఎస్సై
పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: ప్రధాన రహదారి నుంచి చిత్రమందిర్ పక్కన ఉన్న రోడ్డులోకి వెళ్లేచోట గుంత ఏర్పడింది. రహదారి కోతకు గురైంది. – వై.సతీష్, స్థానికుడు
✓: ప్రధాన రహదారి అంచు వద్ద ఉన్న పల్లపు ప్రాంతంలో గ్రావెల్ వేయిస్తాం. ప్రమాదాలు జరుగకుండా చూస్తాం.– కె.డేవిడ్, ఈవో
అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సంతబయలు ప్రాంతాన్ని శుభ్రం చేయడం లేదు. – నాగేశ్వరరావు, అనకాపల్లి
✓: కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. – రవికుమార్, జోనల్ కమిషనర్
అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: సెజ్ రోడ్డులో విద్యుత్తు దీపాలకు అడ్డంగా చెట్టు పెరిగిపోయాయి. వీటి కొమ్మలను తొలగించాలి. – శ్రీనివాసరావు, అచ్యుతాపురం
✓: గతంలో చెట్టు కొమ్మలను తొలగించాం. మళ్లీ తొలగిస్తాం. – సూర్యనారాయణ, డీఈఈ, ఏపీఈపీడీసీఎల్

పార్టీకి సేవలందించే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పార్టీ కోసం సేవలందించే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. అచ్యుతాపురంలో ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం అచ్యుతాపురంలో జరిగింది. మాజీ ఎంపీపీ పప్పల చలపతిరావు, తెదేపా కార్యదర్శులు రాజాన రమేష్‌కుమార్, దూళి రంగనాయకులు, పార్టీపరిశీలకుడు బొండా జగన్నాథం హాజరయ్యారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు పత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో తెదేపా మండల కమిటీ అధ్యక్షులు పీల తులసీరామ్, నాయకులు సన్యాసినాయుడు, శివ న్నారాయణమూర్తి, భీమ రశెట్టి శ్రీను, బాబ్జీనాయుడు పాల్గొన్నారు.

గుర్తింపు పత్రాలను అందిస్తున్న ప్రగడ, పప్పల, రాజాన తదితరులు

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

మంచి మనసున్న మహారాజు మీరు..
మీరు మానుండి దూరమై దైవసన్నిధికి చేరినారు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో...

సోదరులు: తన్నీరు బాబూరావు (లేటు) - మంగ
తన్నీరు నాగేశ్వరరావు - అమ్మాజీ
తన్నీరు ఎరకయ్య, సర్పంచ్, గెడ్డపాలెం - గంగాలక్ష్మి
కుమారులు: సత్యనారాయణ - లక్ష్మి, రమేష్, నాగదుర్గ
కుమార్తెలు - అల్లుళ్లు: కంచర చిట్టిబాబు - లక్ష్మీశ్రీ, మామిడి సూర్యప్రకాష్ - రామలక్ష్మి, వెలగల శ్రీను - నాగలక్ష్మి
మనవళ్లు: రమణ, ప్రసాద్, దుర్గ

కీ.శే. శ్రీ తన్నీరు వెంకటరమణ గారు
న్యాయవాది, సుప్రీంకోర్ట్, గెడ్డపాలెం, యస్.రాయవరం మండలం
జననం: 01-07-1966 మరణం: 06-01-2026

పెద్దకర్మ: తేది. 17-01-2026 శనివారం గెడ్డపాలెం గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1, ఆడి2: మన శంకర వర ప్రసాద్ గారు, ఆడి3: మన శంకర వర ప్రసాద్ గారు, రాజాసాబ్, ఆడి4: భర్తమహాశయులకు విజ్ఞప్తి, **రాజు:** మన శంకర వరప్రసాద్ గారు, భర్త మహాశయులకు విజ్ఞప్తి, **బంగార్రాజు:** రాజాసాబ్ **చోడవరం:** **సాయిలక్ష్మి:** భక్త మహాశయులకు విజ్ఞప్తి శ్రీ **సాయిలక్ష్మి:** రాజాసాబ్, అనగా అనగా ఓ రాజు **పూర్ణా:** మన శంకర వర ప్రసాదు గారు

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. మునగపాకకు చెందిన వేగి పరదేశినాయుడు దంపతులు, వారి కుమారులు రూ.లక్ష కమిటీ సభ్యులకు అందజేశారు. పెంటకోట వెంకట సత్యనారాయణ, కమల దంపతులు, కుదిరెడ్ల వెంకట ప్రసాదు రూ. 25 వేలు చొప్పున, కోనపల్లి రామ్మోహనరావు, కనకలక్ష్మి దంపతులు రూ. 25,116 అందజేశారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

భళా.. భళా.. కనువిందయ్యేలా!

రోలుగుంట, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల సందర్భంగా బుచ్చెంపేటలో బాల, బాలికలు ఏకపాత్రాభినయం, భరతనాట్యం, బృందనాట్యం తదితర పోటీల్లో పోటీపడ్డారు. వేదికపై వీరి కళాభినయం ఔరా.. అనిపించేలా మురిపించారు. చూపరులను కట్టిపడేశారు.

భరతనాట్యంలో బాలిక

అందనంత దూరంలో పశు వైద్యం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది పశు వైద్యశాలలో మూగజీవాలకు వైద్యసేవలు అందడం లేదు. ఏడు నెలలుగా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఎప్పుడు చూసినా మూగజీవాలు, రైతులతో సందడిగా ఉండే ఈ ఆసుపత్రి కొంతకాలం నుంచి బోసిపోయి కనిపిస్తోంది. వైద్య సేవలు అందకపోవడంతో ప్రస్తుతం ఎవరూ ఇక్కడికి రావడం లేదు. ఇక్కడ పనిచేసిన పశు వైద్యాధికారిణి బదిలీపై వెళ్లిపోయారు. వెటర్నరీ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం అటెండర్ ఒక్కరే ఉన్నారు. కార్యాలయానికి వచ్చి తలుపులు తీయడం, ఎవరైనా వస్తే సమాధానం చెప్పడం వరకే ఆమె పరిమితం. స్థానికంగా వైద్యసిబ్బంది ఎవరూ లేకపోవడంతో పశువులకు వైద్యం అందడం లేదు. వడ్డాది చుట్టుపక్కల చాలా గ్రామాలు ఉన్నాయి. పశువులకు ఏదైనా బాగోలేకపోతే రైతులంతా ఎక్కువగా ఈ ఆసుపత్రికే తీసుకువస్తారు. ఇక్కడ వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు సిబ్బందిని, దూరంగా ఉన్న ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్య సిబ్బందిని నియమించి సేవలకు ఆటంకం లేకుండా చూడాలని పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా నరేష్ తదితరులు కోరుతున్నారు.

వడ్డాదిలో పశువుల ఆసుపత్రి

సమస్యలు పట్టవా?

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం పంచాయతీ పరిధిలో కృష్ణపాలెం సమస్యలతో సతమతమవుతోంది. పైపులైన్లు తరచూ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ గ్రామంలో కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంక్ వద్ద పైపులు దెబ్బతిని ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. ఈ పరిస్థితులు తాగునీటి కాలుష్యానికి దారితీస్తోంది. ఒక్కోసారి పైపుల ద్వారా పురుగులు కూడా వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో లీకేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. కాలువల్లో పూడికలను తొలగించలేదు. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని చెబుతున్నారు.

వృథాగా పోతున్న నీరు

ఇదీ కాలువ దుస్థితి

పండగ వేళ.. గ్రావెల్ వేట

చీడికాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ వేళ అక్రమార్కులు రెచ్చిపోయారు. పండగ సెలవులు కావడంతో పట్టించుకునేవారు ఉండరని చీడికాడ, జైతవరం, బైలపూడి, వీరభద్రపేట ఇలా పలు గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలకు తెరలేపారు. రాత్రి, పగలు తేడా లేకుండా పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టారు. ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లతో తరలించారు. చీడికాడ మండలంలోని పలు ప్రాంతాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. అటువైపు అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు. అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు అరికట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌పై గ్రావెల్ తరలింపు

బీఎన్ రహదారిలో గుంతల పూడ్చివేత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: యువకులు శ్రమదానంతో శుక్రవారం బీఎన్ రహదారిలో గుంతలు పూడ్చివేశారు. బంగారుమెట్ట దగ్గర గుంతలతో రోడ్డు అధ్వానంగా మారింది. గ్రామానికి చెందిన ఓ యువకుడు గురువారం బైక్‌పై వెళ్తూ గుంతల్లో పడి ప్రమాదానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానిక యువకులు సొంతనిధులతో గుంతలను పూడ్చే పనులు చేపట్టారు.

గుంతలను పూడుస్తున్న యువకులు

అవీ ఇవీ

నేడు దేవరాపల్లికి పుట్టపర్తి అఖండజ్యోతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్య సాయి బాబా అఖండ జ్యోతి శనివారం సాయంత్రం 6 గంటలకు దేవరాపల్లి చేరుకుంటుందని సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌ఛార్జ్ సీహెచ్. వి. రవి శంకర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు సబ్బవరం నుంచి ఈ అఖండజ్యోతి బయలుదేరుతుందన్నారు. అక్కడినుంచి కె.కోటపాడు మండలం చంద్రయ్యపేట, జోగన్నపాలెం, వారాడ మీదుగా ములకలాపల్లి, వేచలం, ఎ.కొత్తపల్లి, కశింకోట మీదుగా సాయంత్రానికి దేవరాపల్లిలోని సత్యసాయి ధ్యాన మందిరానికి చేరుకుంటుందన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సేవలందించేందుకు 90 శాతం పూర్తి చేసిన భవన నిర్మాణం నిరుపయోగంగా మారింది. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 90 శాతం భవనానికి ఫ్లోరింగ్, తలుపులు, రంగులు వేయాల్సి ఉంది. సర్పంచి వెంకటరమణ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వదిలేశారని వాపోయారు. భవనం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు నిలిచిన అంగన్‌వాడీ భవనం

వీధి దీపాలతో కొత్తకళ!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రధాన రహదారిలో ఆర్డీవో కార్యాలయం నుంచి సరస్వతి కూడలి వరకు ఏర్పాటు చేసిన గోవా తరహా వీధి దీపాలను ఎంపీ సి.ఎం.రమేశ్‌తో కలిసి శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం రాత్రి ప్రారంభించారు. వీటికోసం అనకాపల్లి ఎంపీ రూ. 30 లక్షలు సమకూర్చారు. అయ్యన్న మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కార్యాలయం కూడలి నుంచి శ్రీకన్య కూడలి మీదుగా పెదబొడ్డేపల్లి కూడలి వరకు ఏర్పాటు చేయాలన్నది తన అభిమతం అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులంతా పాల్గొన్నారు.

వీధి దీపాలను ప్రారంభిస్తున్న సభాపతి అయ్యన్న, ఎంపీ సి.ఎం.రమేశ్ తదితరులు

600 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: కశింకోటలో స్వర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూరాలజిస్ట్ డా. ఆడి రెడ్డి దేముడుబాబు సారథ్యంలో నిర్వహించిన మెగా వైద్య, రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇదే గ్రామానికి చెందిన వైద్య నిపుణులు ఆడిరెడ్డి సుష్మ కళ్యాణి, డా. పూడి శివాజీ వైద్య బృందం సుమారు 600 మందికి సేవలందించింది. ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారందరికీ దేముడుబాబు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

పది విద్యార్థులకు ప్రతిభాపోటీలు

ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

రక్తదాన శిబిరంలో డాక్టర్ ఆడిరెడ్డి దేముడుబాబు, సుష్మాకళ్యాణి, శివాజీ తదితరులు

ఘనంగా దేవతమ్మ పండగ

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో దేవతమ్మ పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆరుబయట కాలనీలో కనుమ రోజున ఇక్కడ అమ్మవారి పండగను నిర్వహిస్తుంటారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్చుతూ అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా దేవతమ్మ గుడి వద్దకు తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. తీర్థంలో తినుబండారాలు, పిల్లల ఆట వస్తువులు అమ్మకాలు జరిగాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

చీడికాడ, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. గురువారం అర్జునగిరిలో స్వయంభూ వరాహ లక్ష్మీనృసింహస్వామి, తురువోలు శివాలయం, సిరిజాం పైడతల్లిమ్మ ఆలయాల వద్ద తీర్థాలు జరిగాయి. గ్రామాల్లో తోడపెద్దుల మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైలపూడిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

అలంకరణలో వరాహ లక్ష్మీ నృసింహస్వామి

★ మాడుగులలో భారతనిర్మాణ సేవా సంఘం, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండలంలోని కె.జె.పురం గ్రామంలో గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఒమ్మలి గ్రామంలో సంక్రాంతి రోజున రాముల వారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రకథ ఏర్పాటు చేశారు. శుక్రవారం ముఖలింగేశ్వర స్వామి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మలి జగన్నాథపురం వారిచే కోలాటం, బుర్రకథ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోటపాడు : ఎ.కోడూరులో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి తీర్థం శుక్రవారం జరిగింది. జిల్లాస్థాయి ఎద్దుల పరుగు ప్రదర్శన పోటీలు జరిగాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. గురువారం చౌడువాడలో నారమ్మ పేరంటాలు తీర్థం జరిగింది. పైడమ్మపేటలో ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలతోపాటు పాల్గొన్న వారందరికి శ్రీరామ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, చిన్నపిల్లల వైద్యనిపుణులు రొంగలి అచ్చెంనాయుడు సమకూర్చిన బహుమతులను దాట్ల శివాజీ అందించారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ పండగ ప్రజలందరూ ఆనందంగా జరుపుకొన్నారు. బంగారుమెట్ట గ్రామంలో గురువారం అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలు, గుర్రపు పందాలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. అలాగే కోడిపందాలు జోరుగా జరిగాయి. పందెం కోళ్లు కత్తులు దూసుకున్నాయి. పందెంరాయుళ్లు జోరుగా పందాలు కాశారు. పందాలను తిలకించడానికి అధికసంఖ్యలో జనం తరలివచ్చారు. బంగారుమెట్ట నుంచి పోతనపూడి అగ్రహారం వెళ్లే రోడ్డంతా జనాలతో కిక్కిసిరిసిపోయింది. పిల్లలు, పెద్దలందరూ ఆనందంగా తీర్థంలో తిరుగుతూ సందడి చేశారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. బుచ్చెయ్యపేట, పొట్టిదొరపాలెం, గున్నెంపూడి గ్రామాల్లో శుక్రవారం తీర్థ మహోత్సవాలు జరిగాయి.

రోలుగుంట, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రోలుగుంటతోపాటు కంచుగుమ్మల, బుచ్చెంపేట, కుసర్లపూడి, రత్నంపేట, బి.బి.పట్నం తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఏర్పాటుచేశారు. సర్పంచులు బండారు శ్రీనివాసరావు, పోతురాజునాయుడు, మడ్డు అప్పలనాయుడు, రత్నంపేటలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించి విజేతలకు నగదుతోపాటు ఆసక్తికరమైన బహుమతులను అందజేశారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలు గురువారం సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మాకవరపాలెం రామాలయం వద్ద గ్రామస్తులు ధాన్యం రాశిగా పోసి ఎడ్లబండ్ల చక్రాలు, చెరకు ముక్కలతో ప్రత్యేక ఏర్పాట్లు చేసి దంపతులతో పూజలు నిర్వహించారు. చామంతిపురంలో గిరిజనుల థింసా నృత్యం, శెట్టిపాలెం, తామరం, నారాయణరాజుపేట, లచ్చన్నపాలెం తదితర గ్రామాల్లో పిల్లలకు, పెద్దలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నాతవరం, న్యూస్‌టుడే: నాతవరంలో కెవెస్ఆర్ బృందం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఎంతో కోలాహలంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో గ్రామానికి చెందిన వై. తేజస్విని జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఎంపిక కావడంతో గ్రామ పెద్దలు ఎస్సై తారకేశ్వరరావు ఆమెను సత్కరించారు.

★ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. దీనికి సందర్శకులు వందలాదిగా హాజరయ్యారు.

మాకవరపాలెంలో బాలికల నృత్యం

ఒమ్మలిలో కోలాటం

కేజేపురంలో ఎడ్లబళ్ల పరుగు పోటీలు

బోనస్ పంపిణీ

చీడికాడ, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాడి రైతులు బోనస్ నగదు సద్వినియోగం చేసుకోవాలని చుక్కపల్లి పాలసంఘం అధ్యక్షుడు పేరపు అప్పారావు అన్నారు. చుక్కపల్లిలో పాడి రైతులకు సంక్రాంతి బోనస్, ప్రోత్సాహకాలను గ్రామపెద్దలతో కలిసి అందజేశారు. రూ. 4.93 లక్షల బోనస్, రూ. 70 వేల విలువైన స్టీలు క్యాన్లు పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి అప్పారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చుక్కపల్లిలో పాడిరైతులకు బోనస్, ప్రోత్సాహకాలు అందిస్తున్న సంఘ సభ్యులు

సేవలందించే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పార్టీ కోసం సేవలందించే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. అచ్యుతాపురంలో ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్‌కుమార్, దూళి రంగనాయకులు, పార్టీపరిశీలకుడు బొండా జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు పత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో తెదేపా మండల కమిటీ అధ్యక్షులు పీలా తులసీరామ్, నాయకులు సన్యాసినాయుడు, శివన్నారాయణమూర్తి, భీమరశెట్టి శ్రీను, బాపునాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

రావికమతం, న్యూస్‌టుడే: కనుమ రోజు శుక్రవారం రావికమతం, చినపాచిల, గొంప, కవగుంట గ్రామాల్లో తీర్థాలు జరిగాయి. రావికమతం కంచిపాటి వారి రామాలయం వద్ద ధర్మకర్త, వైకాపా మండల శాఖ అధ్యక్షుడు జగన్నాథరావు ఆధ్వర్యంలో తీర్థం, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. లెమన్ స్పూన్, స్లో సైక్లింగ్, మహిళలకు ముగ్గులు, ఫన్నీ గేమ్స్, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి ముగ్గురు విజేతలకు బహుమతులను ఆలయ ధర్మకర్త జగన్నాథరావు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ మహాలక్ష్మినాయుడు, విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు లోవలు చేతులు మీదుగా విజేతలకు అందజేశారు. గొంపలో భీమలింగేశ్వర స్వామి గుడి, చినపాచిలలో రామాలయం వద్ద తీర్థ మహోత్సవాలు జరిగాయి.

రావికమతంలో విజేతకు బహుమతుల అందజేత

కోదండరామస్వామి తీర్థం

గొలుగొండ, న్యూస్‌టుడే: జోగుంపేట గ్రామంలో కోదండరామస్వామి తీర్థ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తోడపెద్దులు, చెట్టి భజన బృందాలు పాల్గొని భక్తి పాటలు, చిడతల నృత్యాలతో అలరించారు.

రావికమతంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నేడు తీర్థాలు జరిగే గ్రామాలివే

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఎన్.గజపతినగరం గ్రామదేవత నారితల్లెమ్మ అమ్మవారి తీర్థం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లపోటీలను నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి క్రికెట్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు నిర్వాహకులు అందజేయనున్నారు. గొండుపాలెంలో శనివారం దండుముత్యాలమ్మతల్లి తీర్థం జరగనుంది. లంకవానిపాలెం, దాలివలస గ్రామాల్లోనూ తీర్థాలు జరుగనున్నాయి.

8న మోదమాంబ తీర్థం

మాడుగుల గ్రామీణం : ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారి తీర్థం వచ్చేనెల 8న నిర్వహించడానికి కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, అప్పననాయుడు, పడాల అప్పలనాయుడు, మజ్జివిశ్వనాథ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రసూతి సేవల్లో బుచ్చెంపేటకు ప్రత్యేక గుర్తింపు

రోలుగుంట, న్యూస్‌టుడే: తన పాతికేళ్ల వైద్యవృత్తిలో ప్రధానంగా ప్రసూతి సేవల్లో బుచ్చెంపేటతో ఏర్పడిన బంధం విడదీయలేనిదని ఈ క్రమంలోనే రెండు తరాల వారికి ప్రసూతిసేవలు అందిస్తూ వస్తున్నామని నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. సుధా శారద వ్యాఖ్యానించారు. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామస్థులు ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుధా శారద మారుతీ కృష్ణ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రసూతి సేవల్లో బుచ్చెంపేటకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మాజీ సర్పంచి ఉలబాల పోతురాజునాయుడుతో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యులను సత్కరిస్తున్న నాయకులు

సొంత నిధులతో నీటి కొలను చుట్టూ ఇనుప కంచె

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని గొంప గ్రామానికి సమీపంలోని బోడి మెట్టపై పురాతన భీమలింగేశ్వర స్వామి ఆలయానికి చేరువలో రాయి పనులకులు మధ్యలో పెద్ద నీటి కొలను ఉంది. మండు వేసవిలో కూడా నీటి కొలనులో తగినంత నీరు కనిపిస్తుంది. భీమలింగేశ్వర స్వామి (శివుడు) కొండపై స్వయంగా వెలసిన ఈ కొలను నీటిని గ్రామస్థులు పవిత్రమైందిగా భావిస్తారు. కనుమ రోజు శుక్రవారం భీమలింగేశ్వర స్వామి తీర్థం జరిగింది. పరిసర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. పవిత్రంగా భావించే నీటి కొలను దగ్గర వీరంతా పూజలు చేస్తారు. నీటి కొలను లోతు ఎక్కువగా ఉండటంతో దాంట్లోకి దిగేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రావికమతానికి చెందిన గెంజి శ్రీను సొంత నిధులు రూ.65 వేలు ఖర్చు చేసి కొలను చుట్టూరా ఇనుప కంచెను ఇటీవల ఏర్పాటు చేయించారు. కంచె ఉండటం వలన నీటి కొలను పవిత్రంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. కంచెను ఏర్పాటు చేసిన గెంజి శ్రీనును అభినందించారు.

నీటి కొలను చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచె

ఒరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సు దాటిన తరువాత రైవాడ రోడ్డులో వైర్ల ఆధారంతో కూలడానికి సిద్ధంగా ఉన్న టెలిఫోను స్తంభం ఇది. సెల్‌ఫోన్లు రాక ముందు ఇళ్లకు ఫోను సదుపాయం కల్పించడానికి టెలిఫోను ఎక్స్ఛేంజీ నుంచి వైరు వెయ్యడానికి వేసిన స్తంభాల్లో ఇదో స్తంభం. సెల్‌ఫోన్ల వాడకంతో టెలిఫోన్ల వాడకాన్ని జనం మర్చిపోయారు. అప్పట్లో వేసిన స్తంభాలు నిరుపయోగంగా ఉండిపోవడంతో క్రమేపీ నేలకు ఒరిగిపోతూ శుక్రవారం మధ్యాహ్నానికి భూమికి అతి సమీపం వరకు వాలిపోయింది. దానికి ఉన్న వైర్లు ఆధారంగా ఇంకా ఇలా ఉంది. దీనిని ఇలాగే వదిలేస్తే ఎవరో ఒకరి మీద కూలిపోయే ప్రమాదం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలాజీనగర్ ప్రధాన రహదారిలో మురుగు నీరు నిల్వ ఉంది. ఇబ్బందులు పడుతున్నాం. **–వేణు, చోడవరం.** ✓: మురుగు తొలగిస్తాం. కాలువల నిర్మాణానికి ప్రతిపాదించాం. **–కె.శ్రీనివాసరావు, కార్యదర్శి, చోడవరం.**

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కె.అగ్రహారంలోని ఏకైక సామాజిక భవనం శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. **– రమణ,కె.కె.అగ్రహారం,** ✓: పంచాయతీ నుంచి తీర్మానం తీసుకుని కొత్తభవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. **– సుమతి, ఏఈ, కె.కోటపాడు**

పండగ రోజూ నిరసన

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడ చక్కెర కర్మాగారం వద్ద చెరకు రైతులు, కార్మికులు చేపట్టిన దీక్షలు పండగ రోజులు గురు, శుక్రవారాల్లో కూడా కొనసాగించారు. బకాయిల నగదు చెల్లించాలంటూ 15 రోజులుగా కర్మాగారం వద్ద చెరకు రైతులు, కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. పండగ రోజు ఇంట్లో పిల్ల పాపలతో ఆనందంగా గడపాల్సిన మమ్మల్ని రోడ్డున పడేశారంటూ వాపోయారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో చినఅప్పన్నపాలెం, అంభేరుపురం, దామునాపల్లి గ్రామాల రైతులతోపాటు రెడ్డిపల్లి అప్పలరాజు, కోన మోహన్, శరగడం రామునాయుడు, పొట్నూరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలు చేస్తున్న రైతులు, కార్మికులు

రోడ్డు మధ్యలో నిలిచిన వాహనం

చీడికాడ: చీడికాడ-చోడవరం ప్రధాన ఆర్అండ్‌బీ రెండు వరసల రహదారిలో వరహాపురం-దామునాపల్లి మధ్య గురువారం గెడ్డ వద్ద వ్యాన్ నిలిచిపోయింది. ఈ మార్గంలో వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆగిపోయిన వాహనాన్ని రోడ్డు మధ్యలోనే వదిలేయడంతో వాహనచోదలకు ఇబ్బంది పడ్డారు.

వరహాపురం-దామునాపల్లి మధ్యలో..

విజేతలకు బహుమతులు

గొలుగొండ, న్యూస్‌టుడే: కొత్తఎల్లవరంలో జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. తెదేపా సామాజిక మీడియా సమన్వయకర్త కొల్లి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్‌లో పది మారుమూల మైదాన గిరిజన గ్రామాలకు చెందిన 30 జట్లు యువ క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు సర్పంచి రాంబాబు, గ్రామపెద్దలు బహుమతులు అందించారు.

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ముద్దుర్తి సంగమేశ్వరుని దేవాలయం వద్ద శుక్రవారం తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంగమేశ్వరుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి జనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం తీర్థం సందడిగా సాగింది. శనివారం గ్రామంలో సీతారాముల తీర్థమహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

విజేతలతో తెదేపా యువజన నాయకులు గణేష్ తదితరులు

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **రాజాసాబ్** స్క్రీన్-2 - **అనగనగా ఒకరాజు** (మార్నింగ్, ఫస్ట్ షో), **భర్త మహాశయులకు విజ్ఞప్తి** (మ్యాట్నీ, సెకెండ్ షో)

ఎన్టీఆర్ విగ్రహానికి ముస్తాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా పెందుర్తి కూడలిలోని ఆయన విగ్రహాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 18న వర్ధంతి జరగనున్న నేపథ్యంలో మేయర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విగ్రహానికి రంగులు వేయించారు. శిథిలమైన రెయిలింగ్‌ను తొలగించి నూతనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. విగ్రహం నవీకరణతో కూడలి నూతన శోభ సంతరించుకుంది.

జూదరులపై కేసుల నమోదు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న పలువురిపై పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, చింతలగ్రహారం ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో జూద శిబిరాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆయా శిబిరాలపై దాడి చేశారు. లక్ష్మీపురంలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. చింతలగ్రహారంలో జూదం ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గేమింగ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి, గొర్లెవానిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4 కోడి పుంజులు, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 97వ వార్డు పులగానిపాలెంలోని 283బి/12 స్తంభానికి ఉన్న వీధి దీపం గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. - **కాళీప్రసాద్.** ✓: త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, వీధి దీపాల నిర్వహణ ఏఈ

వేపగుంట, న్యూస్‌టుడే: ?: చీమలాపల్లి నుంచి పోర్లుపాలెం వైపు వెళ్లే రహదారిలో వీధి దీపాలు లేక రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. - **వెంకటరావు.** ✓: సమస్యను పరిష్కరించేలా చూస్తాం. - శంకరావు, జెడ్సీ, పెందుర్తి.

?: సబ్బవరం జోడుగుళ్ల నుంచి చిన గొల్లలపాలెం వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. - **పి.ఆనంద్.** ✓: పరిశీలించి చెత్త తొలగించే ఏర్పాటు చేస్తాం. - పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండల పరిషత్తు కూడలి నుంచి ఊటగెడ్డ కూడలి మీదుగా ఎన్టీపీసీ వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. - **నాయుడు.** ✓: రహదారికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. - లలిత, ఏఈ, ఆర్‌అండ్‌బీ.

అభివృద్ధికి ఆమడ దూరం..!

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: 'నాడు - నేడు' పథకంలో భాగంగా పాత పాఠశాలలను పునర్నిర్మించి అభివృద్ధి చేస్తామని గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు హామీలిచ్చి ఊదరగొట్టారు. ఆచరణ మాత్రం అంతంతమాత్రంగానే చేపట్టారు. దీంతో పలు పాఠశాలల్లో కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయి అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయాయి. నరవ జెడ్పీ పాఠశాలలో భవనం ఆగి తుప్పలు పట్టేసింది. డీపీఈపీ నిధులతో నిర్మించిన మరో భవనం అభివృద్ధికి నోచుకోక పాడైపోతోంది.

అసంపూర్తిగా నరవ పాఠశాల భవనం

ప్రస్తుతం 13 గదుల్లో నిర్వహణ:

ఈ పాఠశాలను ప్రస్తుతం 13 గదుల్లో నిర్వహిస్తున్నారు. అందులో ఒకటి ప్రధానోపాధ్యాయుల గది. ఒకటి ఉపాధ్యాయులకు, మరొకటి ల్యాబ్‌కు వినియోగించగా మిగిలిన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు మూడు సెక్షన్ల చొప్పున 15 గదులు ఉండాల్సి ఉండగా కేవలం పది మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయిన డీపీఈపీ భవనం పూర్తయితే 4 గదులు, నాడు-నేడు పథకంలో మంజూరైన భవనం ప్రారంభమైతే మరో ఆరు గదులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 382 మంది పిల్లలు ఉన్నారు. అదనపు గదుల నిర్మాణం జరగకపోవడంతో ఇరుకు గదుల్లోనే చదవడంతో పాటు సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు అవకాశం లేకుండా పోతోంది.

అధికారులు చొరవ చూపాలి

పాఠశాలల్లో అసంపూర్తిగా ఉండిపోయిన భవనాలు పూర్తి చేయించే విషయంలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అధికారులతో పాటు కూటమి నాయకులు చొరవ చూపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణం గతంలో కంటే అధ్వానంగా ఉందని పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి పచ్చదనంతో కళకళలాడేలా చేయాలని వారంతా కోరుతున్నారు.

ప్రజాధనం వృథా:

నాడు - నేడు పథకంలో భాగంగా తొలి విడత రూ.72 లక్షలతో భవనం నిర్మించి మధ్యలో వదిలేశారు. రెండో విడత రూ.1.06 కోట్లు విడుదల అయినప్పటికీ పనులు జరిపించకుండా వదిలేశారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది అధికారులకే తెలియాల్సి ఉంది. డీపీఈపీ నిధులు రూ.55 లక్షలు వెచ్చించి భవనం నిర్మించినప్పటికీ కొంత నిధులు మధ్యలో విడుదల ఆపకపోవడంతో పనులను గుత్తేదారు వదిలేశాడు. ఫలితంగా ఈ రెండు భవనాలకు వెచ్చించిన రూ.1.27 కోట్లు నిధులు మరుగున పడిపోయినట్టయింది. ఇప్పటికైనా పాలకులు, విద్యాశాఖ అధికారులు స్పందించి పనులు చేయిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కల్పించిన వారవుతారు.

తవ్వి వదిలేశారు.. పూడ్చేదెవరు..?

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట - మేహాద్రి రిజర్వాయర్ రహదారి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. 24 గంటల మంచినీటి సరఫరా పైపులైన్లు వేయడం కోసం రహదారిని తవ్వి పునర్నిర్మించకుండా వదిలేశారు. దీంతో గోతులు ఏర్పడి ద్విచక్రవాహనాలు జారి చోదకులు గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిని 100 అడుగులకు విస్తరిస్తామని అధికారులు, పాలకులు ప్రకటించడం మినహా ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఈ రహదారిని ఆనుకొని పదుల సంఖ్యలో కాలనీలు, గ్రామాలు ఉన్నాయి. వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమ కష్టాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దర్పణం

అదుపుతప్పితే.. ప్రమాదమే..!

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి మార్గంలోని పరవాడ ఊటగెడ్డ కూడలికి సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచిఉంది. కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. గాజువాక, ఎలమంచిలి, ఫార్మా సిటీ, అచ్యుతాపురం, ఎన్టీపీసీకి వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో కల్వర్టు రక్షణ గోడలను భారీ వాహనాలు ఢీకొట్టడంతో కూలిపోయాయి. రాత్రి సమయంలో ఇక్కడ చీకటిగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి గెడ్డలో పడి గాయాల పాలవుతున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని చోదకులు కోరుతున్నారు.

భయపెడుతున్న విద్యుత్తు స్తంభాలు

ఫోకస్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ గండి వారి వీధి, గ్రామీణ బ్యాంకు సమీపంలోని ఎల్‌ఈడీ విద్యుత్తు స్తంభాలు వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. స్తంభాల అడుగుభాగం తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో స్థానికులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం ఈ రహదారి పాదచారులు, వాహనదారులతో రద్దీగా ఉంటుంది. ఈ స్తంభాలు నివాసాలు, దుకాణాలను ఆనుకుని ఉన్నాయి. వీటి నిర్వహణను అధికారులు గత కొన్నాళ్లుగా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలు కూలిపోక ముందే సమస్యను పరిష్కరించాలని నివాసితులు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం, అడుగు భాగం (ఇన్‌సెట్లో)

అ. వీ. ఇ. వీ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి - ఆనందపురం రహదారిపై ఇరువాడ వద్ద ఈనెల 14న రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సబ్బవరం పోలీసులు తెలిపారు. చామనఛాయ రంగు కలిగి, సుమారు ఐదున్నర అడుగుల పొడవు ఉంటాడని నీలం గడుల చొక్కా, నేవీ బ్లూ బనియన్, కాఫీ రంగు నిక్కరు ధరించి ఉన్నాడని సీఐ ఆర్.రామచంద్రరావు తెలిపారు. ఇటీవల ఆయన మతిస్థిమితం సరిగాలేక తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించామన్నారు. ఏదో వాహనం ఢీకొని చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నట్లు ఆయన సీఐ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేత

శ్రీను కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనుకు అనకాపల్లికి చెందిన కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందించింది. ఈనెల 14న అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొణతాల లక్ష్మీపార్వతి, కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మళ్ల జగదీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని దాడి శ్రీనును కుటుంబ సమేతంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు.

ఘనంగా సంక్రాంతి క్రీడా పోటీలు

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో సంక్రాంతి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలను సర్పంచి చింతకాయల సుజాత ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రికెట్ విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, వాలీబాల్ విజేతలకు రూ.7 వేలు, రూ.5 వేలు, ముగ్గుల పోటీల విజేతలకు రూ.5వేలు, రూ.2500, రూ.1500 చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు, దేవి, రవి, అప్పన్న, అమ్మోరు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ★ పరవాడలో పైలా గోపిచంద్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను భాజపా సీనియర్ నాయుడు కూండ్రపు సోము నాయుడు చేతులమీదుగా అందజేశారు.. బండారు రాజు, చుక్క గోపి, బత్తి లోకేష్, రెడ్డి లావణ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు, సర్పంచి సుజాత, ముత్యాలు తదితరులు

వైభవంగా భజన చెట్టు ఊరేగింపు

వేపగుంట, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాముల వారి భజన చెట్ల ఉత్సవాలు పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. వేపగుంట రామాలయంలోని భజన చెట్టుకు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా ఆధ్వర్యంలో రామభక్తులు భజనలు చేస్తూ ప్రతీ ఇంటి ముంగిటకు భజన చెట్టును తీసుకెళ్లారు. గ్రామపెద్దలు ముత్తానాయుడు, శేశెట్టి అప్పారావు, సాలాపు రమణ, బల్ల అప్పారావు, తేలసారి కనకరాజు, దమరసింగు అప్పలరాజు, అలమండ శ్రీనివాసరావు పలువురు పెద్దలు పూజలు చేశారు.

వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు

శ్రీనివాసుడికి తిరుమంజన సేవ

శ్రీవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకస్వామి

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేదమంత్రాల నడుమ పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీవారిని అభిషేకించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

కనులపండువగా ఎర్రయమ్మ పేరంటాల తీర్థం

ఎర్రయమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న నాయకులు, భక్తులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలో శుక్రవారం రాత్రి ఎర్రయమ్మ పేరంటాల తీర్థాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు ఎర్రయమ్మను దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక సీఐ మల్లికార్జునరావు, నాయకులు పైలా శ్రీనివాసరావు, సిరిపురపు అప్పలనాయుడు, చుక్క రామునాయుడు, పైలా సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, గండి నమోబాబు, కూండ్రపు సోమునాయుడు, పైలా చిన అక్కునాయుడు తదితరులు పేరంటాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాముగరిడీలు, భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెల్లో కనుమ సందడి

దీపాంజలినగర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో సంక్రాంతి, కనుమ సందడి నెలకొంది. పరవాడ మండలం మడకపాలెంలో ముగ్గులు, మ్యూజికల్ ఛైర్, ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. మహిళలు ఆకట్టుకునే రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దుబాయి, సౌదీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఈ పోటీలకు ఆర్థిక సాయం అందించారు. సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ క్రీడా మైదానంలో సాగరిక రీక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఎన్టీపీసీ ఉద్యోగులు, కుటుంబసభ్యులు ఉత్సాహంగా పాల్గొని గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం తవ్వావానిపాలెంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బోకం శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. పి.పద్మలత(ప్రథమ), బొడ్డి లావణ్య (ద్వితీయ), వేచలపు నాగేశ్వరి (తృతీయ), ఆర్.సుశీల (నాలుగు), బోకం భారతి (ఐదు) స్థానాల్లో నిలిచారు. నగదు బహుమతులు అందించారు. మొగలిపురంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా పెందుర్తి తెదేపా సమన్వయకర్త గండి బాబ్జీ హాజరై మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చినయాతపాలెం శ్రీవీరాంజనేయ ఉత్సవ కమిటీ ప్రతినిధి శరగడం దుర్గినాయుడు, దేవీపురంలో గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో గోమాతకు పూజలు చేశారు.

మడకపాలెంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తవ్వవానిపాలెం ముగ్గుల పోటీల విజేతలతో నిర్వాహకులు

గోవుకు పూజలు చేస్తున్న చినయాతపాలెం గ్రామస్థులు

పరసల సందడి ప్రారంభమాయె..!

వేపగుంట, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో పరసల సందడి శుక్రవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు చింతలగ్రహారం రామాలయం వద్ద రాముల వారి పరసను వైభవంగా జరిపారు. గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని రాములవారికి పూజలు చేశారు. ఈనెల 17న వేపగుంట ముత్యమాంబ, పైడితల్లమ్మ, 22న చింతలగ్రహారం దుర్గామాత, 23న పురుషోత్తపురం పైడిమాంబకు, ఈనెల 19న నరవ పైడితల్లమ్మ, 25న ఆంజనేయస్వామి, 27న కోటనరవ పైడితల్లమ్మ, 25న గవరజగ్గయ్యపాలెం ఆంజనేయస్వామి, 31న బంగారమ్మ అమ్మవార్ల పరసలు జరిపేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, పెద్దలు నిర్ణయించారు.

చింతలగ్రహారం పరసలో పాల్గొన్న స్థానికులు

మృతుల కుటుంబాలకు చేయూత

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సినిమా హాల్ కూడలికి చెందిన ఫొటోగ్రాఫర్ పైలా గోపీచంద్ ఇటీవల మృతి చెందాడు. పరవాడ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ప్రతినిధులంతా ముందుకొచ్చి తలా కొంత వేసుకుని రూ.31 వేలు సమకూర్చారు. మృతుడి కుటుంబ సభ్యులు ఈ మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. మున్ముందు గోపీచంద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పైలా శ్రీను, సెక్రటరీ బాషా, చిన్న, గాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యురాలికి నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సూరాడ ముత్యాలు ఇటీవల తీరంలో చేపల వేట సాగిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గ్రామ సర్పంచి చింతకాయల సుజాత, మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు తన సొంత నిధులు రూ.25 వేలు అందించారు. ఈమేరకు గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మృతుని భార్య అప్పలనర్సకు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు.

జన్మదిన శుభాకాంక్షలు

మంచి మనసున్న విద్యావేత్త, నిరాడంబరులు, BJP యువనాయకులు శ్రీ రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

శ్రీమతి నాదెళ్ళ జ్యోతి M.Sc విశాఖ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి ఎంటర్‌ప్రైజెస్, గోపాలపట్నం

జన్మదిన శుభాకాంక్షలు

నిస్వార్థ సేవాపరులు, ఎన్నో సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తున్న పెందుర్తి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు.

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA Kites Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా, ప్రెసిడెంట్: లయన్స్ క్లబ్, పెందుర్తి

లయన్స్ క్లబ్ Dist: 316A, పెందుర్తి

జన్మదిన శుభాకాంక్షలు

BJP పెందుర్తి నియోజకవర్గ యువకిశోరం, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్న శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు.

గౌ॥ శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రెసిడెంట్: లయన్స్‌క్లబ్, పెందుర్తి

తాండ్ర పాపారాయుడు వెలమ సొసైటీ, పెందుర్తి రి॥నెం. 6/2020

మీ వివాహాది శుభకార్యక్రమాలకు, బిజినెస్ మీటింగ్‌లకు, ఆఫ్‌శారీ ఫంక్షన్లు మొదలైన వాటికి సంప్రదించండి

ఫోన్ : 8985616888

జన్మదిన శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, ఎందరికో మార్గదర్శకులు, BJP పెందుర్తి నియోజకవర్గ రథసారధి శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

గౌ॥ శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

సేనాపతి సోమశేఖర్‌నాయుడు మేనేజింగ్ డైరెక్టర్: డిజైర్ టు డిజైర్ ఇంజినీరింగ్ 97వ వార్డు అధ్యక్షులు, జనసేన పార్టీ

జన్మదిన శుభాకాంక్షలు

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్; ప్రెసిడెంట్: లయన్స్ క్లబ్, పెందుర్తి

పెందుర్తి నియోజకవర్గం BJP నాయకులు

జన్మదిన శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, ఎందరికో మార్గదర్శకులు, BJP పెందుర్తి నియోజకవర్గ రథసారధి శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

గౌ॥ శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

మహాత్మా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ పినగాడి జం॥ పెందుర్తి
మహాత్మా నర్సింగ్ కాలేజ్,
కైట్స్ స్కిల్స్ ప్రై॥ లిమిటెడ్
టీచింగ్ & నాన్‌టీచింగ్ స్టాఫ్, పెందుర్తి

రైల్వేలైన్ల పటిష్ఠతపై దృష్టిపెట్టాలి

ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ సిస్టంను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలంటే రైల్వేలైన్లు పటిష్ఠంగా ఉండాలని, ఈ విషయంలో అధికారులు దృష్టిపెట్టాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన ఏడీఆర్‌ఎం సుధాకర్, వివిధశాఖల అధికారులతో కలిసి గుంతకల్లు-డోన్, డోన్-పాణ్యం సెక్షన్లలో తనిఖీలు చేశారు. లెవల్ క్రాసింగులను, రైల్వే స్టేషన్లలోని సిగ్నలింగ్‌కు చెందిన ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ విభాగాలను పరిశీలించారు. రైళ్లు స్టేషన్లకు చేరుకోగానే వివిధ ప్లాట్‌ఫారాల్లోకి వెళ్లాలంటే ప్యానల్ ఇంటర్‌లాకింగ్ చాలా ప్రధానం. ఇవి సక్రమంగా పనిచేయకుంటే ప్రమాదాలు జరుగుతాయని డీఆర్‌ఎం అన్నారు. వీటి నిర్వహణ విషయంలో తాత్సారం చేయకూడదని చెప్పారు. డోన్ రైల్వే స్టేషన్‌లో వాటి పనితీరును తనిఖీ చేశారు.

రూ.13.28 కోట్లతో..
పీఏబీఆర్ రహదారికి టెండర్

- సీఓటీ ఆమోదానికి సిఫార్సు
- త్వరలో పనులకు శ్రీకారం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: నరకానికి నకళ్లుగా మారిన కూడేరు మండలం జల్లిపల్లి నుంచి పీఏబీఆర్ డ్యాం రహదారి విస్తరణ, బలోపేతం చేసేందుకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా ఈ దారి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం పుణ్యమా.. అని ఈ రహదారి పునర్నిర్మాణానికి హెచ్చెల్సీ ప్రాజెక్టు సారథ్యంలో శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్ ఖరారైంది. గుత్తేదారుడిని ఎంపిక చేస్తూ జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు ఆమోద ముద్ర వేశారు. తుది ఉత్తర్వు కోసం విజయవాడ కమిషనర్ ఆఫ్ టెండర్(సీఓటీ) విభాగానికి సిఫార్సు చేశారు. పది రోజుల్లోపు రూ.13.28 కోట్ల విలువ చేసే ఈ రహదారి పనులు మొదలు కానున్నాయి.

కీలకం

పెన్నఅహోబిలం సమతుల జలాశయం (పీఏబీఆర్).. ఇది ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకం. సాగునీటి కంటే.. ఎక్కువగా తాగునీటి అవసరాలు తీరుస్తోంది. విద్యుత్తు ఉత్పత్తి, పర్యాటక ప్రాంతంగా వృద్ధి జరుగుతోంది. అనంత నుంచి ఉరవకొండ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో జల్లిపల్లి గ్రామం నుంచి ఈ డ్యాంకు వెళ్లాలి. రహదారి అధ్వానంగా ఉండటంతో పర్యాటకులు, అధికారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

5.8 కి.మీ. దూరం

జల్లిపల్లి నుంచి పీఏబీఆర్ డ్యాం దాకా రహదారి దూరం 5.8 కిలోమీటర్లు ఉంది. ఈ రోడ్డును విస్తరించి.. తారు రోడ్డు వేసేందుకు రూ.13.28 కోట్లు మంజూరు చేస్తూ గతేడాది జులై 9న ఉత్తర్వు జారీ చేశారు. ఆ తర్వాత రూ.10 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించారు. ఇద్దరు గుత్తేదారులు పోటీ పడ్డారు. ఎల్1గా నిలిచిన ఓ గుత్తేదారుడికి టెండర్ ఖరారైంది. హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు టెండర్ ప్రక్రియను పర్యవేక్షించారు.

ప్రత్యేక రైళ్లున్నాయ్..
ఖాళీగా వెళ్తున్నాయ్..
అవగాహన లేక వినియోగించుకోలేని ప్రయాణికులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్న ప్రత్యేక రైళ్ల గురించి ఎక్కువ మందికి అవగాహన లేక వినియోగించుకోలేకపోతున్నారు. ఫలితంగా ప్రయాణికులు ప్రతిరోజూ ప్రయాణించే రైళ్లపైనే ఆధారపడుతున్నారు. ఈ రైళ్లలో స్థలం లేక గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. ప్రత్యేక రైళ్లను పది శాతానికి మించి ప్రయాణికులు వినియోగించడం లేదు. ఫలితంగా ఈ రైళ్లు ఖాళీగా వెళుతున్నాయి. అనంతపురం, తాడిపత్రి, కదిరి మీదుగా అధికారులు నడుపుతున్న ప్రత్యేక రైళ్లపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

అనంతపురం మీదుగా

- ప్రతి శనివారం బెంగళూరు-కలబురగి మధ్య ప్రయాణించే రైలు (06207) అనంతపురానికి రాత్రి 11.38, గుంతకల్లుకు రాత్రి 1.15కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (06208) ప్రతి ఆదివారం గుంతకల్లుకు మధ్యాహ్నం 2 గంటలకు, అనంతపురానికి 3.03, ధర్మవరానికి మధ్యాహ్నం 3.35కు వెళుతుంది.
- మైసూరు - కాకినాడ మధ్య మంగళ, శనివారాల్లో ప్రయాణించే రైలు (07034) అనంతపురానికి రాత్రి 12.38, గుంతకల్లుకు రాత్రి 1.55కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (07033) సోమ, శుక్రవారాల్లో గుంతకల్లుకు ఉదయం 6.20, అనంతపురానికి ఉదయం 7.38కి వెళుతుంది.
- అనకాపల్లి - షోలాపూర్ మధ్య శనివారం ప్రయాణించే రైలు (01478) కదిరికి ఉదయం 10.58, ధర్మవరం 11.58, అనంతపురానికి మధ్యాహ్నం 12.43, గుంతకల్లుకు 1.55కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (01477) ప్రతి శుక్రవారం షోలాపూర్‌లో బయలుదేరి గుంతకల్లుకు సాయంత్రం 4.05, అనంతపురం సాయంత్రం 5.18, ధర్మవరానికి 6.18కి వస్తుంది.
- బీదర్ - బెంగళూరు మధ్య ప్రతి సోమ, శనివారాల్లో తిరిగే రైలు (06540) గుంతకల్లుకు రాత్రి 8.40, అనంతపురానికి 9.48, ధర్మవరానికి రాత్రి 11.15కు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆది, శుక్రవారాల్లో అనంతపురానికి రాత్రి 12.38, గుంతకల్లుకు 1.55కు వస్తుంది.

తాడిపత్రి మీదుగా

- ప్రతి మంగళవారం చర్లపల్లి- కొల్లం మధ్య ప్రయాణించే రైలు అనంతపురానికి రాత్రి 7.54, గుత్తి 8.40, తాడిపత్రికి 9.32కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో రైలు ప్రతి (07114) గురువారం ప్రయాణిస్తూ తాడిపత్రికి రాత్రి 1.08, గుత్తి 2.53, అనంతపురానికి రాత్రి 3.35కు వస్తుంది.
- ప్రతి మంగళవారం హిసార్ - తిరుపతి మధ్య ప్రయాణించే రైలు (07718) గుంతకల్లుకు తెల్లవారుజామున 5.45, తాడిపత్రి ఉదయం 7.20కు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో (07717) తాడిపత్రికి తెల్లవారుజామున 4.15, గుంతకల్లుకు ఉదయం 6.45కు వస్తుంది.
- ప్రతి మంగళవారం గుంతకల్లు- కడప మధ్య ప్రయాణించే రైలు గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కు బయలుదేరి తాడిపత్రికి 2.40కు వెళుతుంది.
- ప్రతి గురువారం అహమ్మదాబాద్- తిరుచిరాపల్లి మధ్య తిరిగే రైలు గుంతకల్లుకు ఉదయం 6.50కు వచ్చి తాడిపత్రికి ఉదయం 7.58కి చేరుతుంది.

హెచ్చెల్సీకి
నీరు బంద్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలువకు కేటాయించిన నీటి వాటా పూర్తి కావడంతో జలాశయం వద్ద గురువారం సాయంత్రం హెచ్చెల్సీకి గేట్లు దించి నీటిని బంద్ చేశారు. గురువారం సాయంత్రం నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసినట్లు జలాశయం ఎస్‌ఈ నారాయణనాయక్ తెలిపారు. నీటిని సరఫరాను నిలిపివేయడంతో హెచ్చెల్సీ కింద మిరప సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెలాఖరు వరకు నీరు ఇస్తే తప్పా గట్టెక్కే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో 5 వేల ఎకరాలు, ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో జీబీసీ కింద 25 వేల ఎకరాల వరకు మిరప పంట సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని నీటిని విడుదల చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సాయి పల్లకీతో విద్యార్థులు

ట్రోఫీ అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మానవతా విలువలతో కూడిన విద్యా బోధన, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు సాహసోపేతమైన క్రీడా విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. హిల్‌వ్యూ స్టేడియంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈనెల 11న క్రీడా సమ్మేళనం నిర్వహించిన విషయం విదితమే. ఇందులో ప్రతిభ కనబర్చిన క్యాంపస్‌లు, విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. గురువారం ఉదయం యజుర్వేద మందిరం నుంచి విద్యార్థులు వేదపఠనంతో కవాతు నిర్వహిస్తూ.. బ్రాస్‌బ్యాండు.. సాయి భక్తిగీతాలను ఆలపిస్తూ సాయికుల్వంత్ మందిరానికి చేరుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు, సాయి విద్యార్థులు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బంగారు, రజత, కాంస్య పతకాలు, ట్రోఫీలను ఆర్‌జే రత్నాకర్ తదితరులు అందజేసి, అభినందించారు. విద్యార్థులు సత్యసాయితో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపకులపతి రాఘవేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీకాంత్ ఖన్నా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నారసింహుడి
పార్వేట ఉత్సవం

పార్వేటను తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు (అంతర చిత్రంలో) నారసింహుడు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పులిపార్వేట ఉత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సంక్రాంతిని పురస్కరించుకొని కనుమరోజు ఉదయం పూజల అనంతరం స్వామివారు ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో లఘువమ్మకొండ వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామిని పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వీవీఎస్‌శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామిక వాడలోని పాలపొంగుఉట్టికి చేరుకున్నారు. అక్కడ యాదవులు పాలపొంగులు వండి నైవేద్యంగా సమర్పించారు. ఆతర్వాత వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో పులిపార్వేట నిర్వహించారు. కుందేళ్లను పట్టుకునేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం రాయచోటి రోడ్డులోని శమీ మండపానికి చేరుకున్న స్వామిని అలంకరించి, పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం వెళ్లిన స్వామి సాయంత్రం ఆలయానికి చేరుకోవడంతో అమ్మవారు అలకబూనే సన్నివేశాన్ని అర్చకులు నిర్వహించారు.

చేపల వేట నిషేధం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: బెళుగుప్ప మండలం జీడిపల్లి జలాశయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 7 నుంచి జూన్ 30 వరకు చేపలు వదలడం, పట్టడం పూర్తిగా నిషేధించినట్లు పీఏబీఆర్ మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) పెద్ద బాబునాయక్ తెలిపారు. ఆరునెలలపాటు నిషేధం అమలులో ఉంటుందని, నిబంధన అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో హెచ్చరించారు.

పట్టుగూళ్ల మార్కెట్‌కు
త్వరలో మోక్షం

శిథిల భవనంలో విక్రయాలు

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిథిలావస్థకు చేరిన పట్టుగూళ్ల విక్రయ కేంద్రానికి త్వరలో మోక్షం రానుంది. రూ.8 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసే ఈ మార్కెట్‌కు దాదాపు నాలుగు మాసాల ముందే కేంద్ర ప్రభుత్వం రూ.4 కోట్లు విడుదల చేయగా.. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఖాతాలో జమ అయ్యాయి. ఈ పనులు ప్రారంభమైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా మిగిలిన రూ.4 కోట్లు విడుదల చేయనుంది. 1985, డిసెంబరు 1న అప్పటి చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి పట్టుపరిశ్రమశాఖ నిధులతో విక్రయకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 1987, సెప్టెంబరు 14న అప్పటి స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చింది. ఈ మార్కెట్‌కు ఉమ్మడి రాష్ట్రాలు, కర్ణాటక నుంచి పట్టుగూళ్లను రైతులు తీసుకొస్తుండటంతో వీటి క్రయవిక్రయంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది.

కేంద్రం- పట్టుగూళ్ల మార్కెట్, హిందూపురం
మంజూరైన నిధులు - రూ.4కోట్లు
ఇంకా కావాల్సినవి - రూ.4 కోట్లు

శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు

అయితే ఈ కేంద్రం దాదాపు దశాబ్దాకాలంగా శిథిలావస్థకు చేరటంతో మార్కెట్ నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో నీరు లోపలికి వస్తుండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ, సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యుడు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి రైతు సంఘం నాయకులు, అధికారులు తీసుకెళ్లటంతో నూతన విక్రయకేంద్రానికి కేంద్రం తన వాటాగా నిధులు అందించగా రాష్ట్రప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది.

తాత్కాలిక కేంద్రంలో సౌకర్యాలు

ప్రస్తుతం ఈ విక్రయకేంద్రం ఆవరణంలోనే తాత్కాలిక మార్కెట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పట్టుగూళ్లు అధికంగా వచ్చినా భవనం ముందు, వెనకవైపు గూళ్లు వేసుకొనేలా రేకులు వేస్తారు. భవనంలోపల, ముందుభాగంలో పట్టుగూళ్లు, వెనకభాగంలో జల్లీ గూళ్ల విక్రయాలు జరిగేలా సిద్ధం చేస్తున్నారు. ఈపనులు దాదాపు వారంలో ముగిసే అవకాశం ఉంది. ఇతర ప్రాంతాల నుంచి గూళ్లు తీసుకొచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, భవనం లోపల వెలుతురు, ఫ్యాన్లు, కిటికీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ హంపయ్య దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక మార్కెట్ ఏర్పాటు పనులు ముగిసిన వెంటనే నూతన కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు.

పప్పుసెనగ దిగుబడి ఆశాజనకం

ఉరవకొండ శివారులో సెనగ దిగుబడి వద్ద రైతు

ఉరవకొండ, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా రబీలో సాగైన పప్పుసెనగ పంట కోత జోరుగా సాగుతోంది. పంటకు విల్ట్ తెగులు ఆశించినప్పటికీ దిగుబడి ఆశాజనకంగా ఉంది. జిల్లాలో వర్షాధారంగా 1.20 లక్షల ఎకరాల్లో సెనగ సాగయ్యింది. ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, కనేకల్లు, బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు తదితర ప్రాంతాల్లో అధికంగా సాగైంది. ఎకరాకు రూ.16 వేల ప్రకారం రైతులు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు సగటున 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 7.20 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.5,500 పలుకుతోంది. ఈ లెక్కన రైతుకు కాసింత ఆదాయం కలిసి రానుంది. కౌలు రైతులకు పెద్దగా ఆదాయం ఉండదు. అయితే దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండడం, నెల క్రితం క్వింటా ధర రూ.5 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.500 పెరగడంతో రైతులు ఉపశమనం పొందుతున్నారు. కొందరు పంటను అమ్ముకుంటుండగా, మరికొందరు ధర పెరుగుతుందేమోనన్న ఆశతో నిల్వ ఉంచుకుంటున్నారు. స్థానికంగా మార్కెట్ సదుపాయం లేకపోవడంతో దిగుబడిని రైతులు కర్ణాటకలోని హిరియూర్ లేదా బెంగళూరుకు తరలించాలి. అది భారంతో కూడుకున్న అంశం. దీంతో ఎక్కువ మంది స్థానికంగా దళారులకే పంట దిగుబడిని అమ్ముకుంటున్నారు.

సంతోషమే బలం..

ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గ్రామీణ క్రీడలను ప్రారంభించారు. చిల్లా కట్టి, బొంగరాలు, గోలీలు, తాడు లాగు, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో మంత్రి పాల్గొని సందడి చేశారు. యువకులు, నాయకులతో కలిసి నృత్యం చేశారు.

- న్యూస్‌టుడే, ధర్మవరం

ఆదాయానికి వెదురులేదిక..

- వెయ్యి ఎకరాల్లో ప్రయోగాత్మక సాగు
- నిర్వహణకు ఏటా రూ.2 లక్షలు మంజూరు

రాయదుర్గం, న్యూస్‌టుడే: అనంత జిల్లాలోని బంజరు భూములను వ్యవసాయాధారిత భూములుగా మార్చి రైతులకు నికర ఆదాయాన్ని సమకూర్చేందుకు వెయ్యి ఎకరాల్లో వెదురును ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నట్లు సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు గంగాధర తెలిపారు. జిల్లాలో 10 వేల ఎకరాల్లో వెదురు సాగుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. త్వరలో రైతులకు అవగాహన కల్పించి సాగుకు సమాయత్తం చేస్తామన్నారు.

25 ఏళ్ల వరకు ఆదాయం

ఒక ఎకరాలో పంట సాగుకు ఉపాధి హామీ పథకం కింద ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

విస్తారంగా వర్షాలు..

తెగుళ్లు సోకని పంట వెదురు. పశువులు, దొంగల బెడద ఉండదు. మూడేళ్ల వరకు వెదురులో అంతర పంటలు సాగు చేయవచ్చు. ఇప్పటికే చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఈ పంటను ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. మరో 15 జిల్లాల్లో అమలు చేయనున్నారు. వెదురు సాగుతో వర్షాలు బాగా కురుస్తాయి. నేలలు సారవంతం అవుతాయి. ఆసక్తి ఉన్న రైతులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

జిల్లాలో ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఎక్కువ గిట్టుబాటు కావటం లేదు. అందుకే వెదురుతో రైతులను ఆదుకోవాలని నిర్ణయించారు. అన్ని నేలల్లో ఈ పంట సాగు చేయవచ్చు. రైతులకు టుల్డా వెరైటీ వెదురు మొక్కలను పంపిణీ చేస్తారు. ఒక మొక్క నాటితే ఏడాదికి 10 పిలకలు వస్తాయి. ఏటా పిలకలు రెట్టింపు అవుతాయి. మూడేళ్ల తర్వాత పంట కోతకు వస్తుంది. ఒకసారి నాటితే 25 ఏళ్లదాకా.. ఏటా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా ఆదాయం వస్తుంది. ఈ వెదురు పేపర్, సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. బైబ్యాక్ పద్ధతి ద్వారా కర్ణాటకకు చెందిన ఇండస్ట్రీ ఫౌండేషన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు తెలిపారు.

మత్స్యకారులకు భరోసా
చేపల వేటలో మరణిస్తే రూ.10 లక్షల పరిహారం

ఎంపీఆర్ డ్యాంలో చేపలుపడుతున్న మత్స్యకారులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) పథకం కింద మత్స్యకారులతోపాటు లైసెన్సులు ఉన్న వారందరికీ వర్తింపజేశారు. ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. చేపల వేటలో మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు, బీమా పరిహారం అందజేస్తారు. మత్స్యకారుడు సాధారణ మరణంతోపాటు ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన

4,330	అనంతపురం జిల్లాలో గుర్తింపు పొందిన మత్స్యకారులు
2,992	శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్నవారు

వారికి కార్మికశాఖ ద్వారా రూ.2 లక్షల చొప్పున బీమా పరిహారం ప్రకటించారు. అయితే ఈ-శ్రమ్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

సద్వినియోగం చేసుకోండి
- చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా మత్స్యఅభివృద్ధిశాఖ అధికారి

పీఎంఎంఎస్‌వై పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల బీమా పరిహారం ప్రకటించింది. చేపల వేటలో మత్స్యకారుడు చనిపోతే రైతు సేవా కేంద్రాల్లో కాని, మత్స్య అభివృద్ధి అధికారులను (ఎఫ్‌డీవో) తక్షణమే సంప్రదించాలి.

పీఎంఎంఎస్‌వై అర్హులు ఎవరు?

మత్స్యసహకార సంఘంలో సభ్యులై ఉండాలి. చేపల వేట లైసెన్సు ఉన్నవారికి వర్తిస్తోంది. చేపల వేట ప్రమాదంలో మరణించిన మత్స్యకారుడికి రూ.10 లక్షల బీమా అందజేస్తారు. కార్మికశాఖ ద్వారా ఈ-శ్రమ్ కార్డు పొందితే మత్స్యకారుడు సాధారణ, ఇతర ప్రమాదాల్లో మరణిస్తే రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తారు.

ఆధారాల సమర్పణ

ఆధార్‌కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, శవపంచనామా పత్రం, రేషన్‌కార్డు, మత్స్యసహకార సంఘం ధ్రువీకరణ పత్రం, సంఘం తీర్మానపత్రం సమర్పించాలి.

ఎక్కడ సమర్పించాలంటే..

జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలోని అధికారులకు కాని, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని గానీ కలిసి నకళ్లను సమర్పించాలి. అధికారులు వాటిని పరిశీలించి, విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు.

కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

వైభవం.. చింతలరాయుడి కల్యాణం

తాడిపత్రిలోని చింతలరాయుని ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుడిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

(c) eenadu

వేమన జయంత్యుత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు

కదిరి, గాండ్లపెంట, న్యూస్‌టుడే: ప్రజాకవి వేమన జయంతిని రాష్ట్ర పండగలా జరిపేలా ప్రభుత్వం నిర్ణయించింది. అధికార హోదాలో ఈనెల 19న కటారుపల్లిలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వీవీఎస్‌శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కదిరిలో వేడుకల లోగోను స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

● వేమన విహారానికి రంగులు, దెబ్బతిన్న ప్రాకార నిర్మాణం, బస చేసేందుకు గదులకు మరమ్మతు చేస్తున్నారు. ముందుభాగాన్ని పచ్చిక, మొక్కలతో అందంగా మారుస్తున్నారు. ఉత్సవానికి హాజరయ్యే జనానికి భోజనాలు, వాహన పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులతో పద్యగానం, నాటిక, గానకచేరి నిర్వహించనున్నారు.

వేదవతి హగరిపై వంతెనకు మోక్షం

రూ.6 కోట్ల పీఆర్ నిధులతో నిర్మాణం

వారధి నిర్మించే ప్రదేశం

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు-మాల్యం నడుమ వేదవతి హగరిపై రూ.6 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే భూమిపూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. వేదవతి హగరిపై రాకపోకలు సాగించేందుకు 60 ఏళ్లుగా వంతెనల నిర్మాణానికి నోచుకోలేదు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని విన్నవించిన మేరకు.. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రూ.54 కోట్లతో వేదవతి హగరిపై రెండు వంతెనలు సాకారం కానుండటం శుభ పరిణామం. రూ.48 కోట్లతో హెచ్చెల్సీ వంతెనకు సమాంతరంగా నిర్మించే ర.భ. వంతెన పనులు ఏడాది కిందటే ప్రారంభమయ్యాయి. రూ.6 కోట్లతో 7.5 మీటర్ల వెడల్పు, 230 మీటర్ల పొడవైన వంతెన నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టనున్నారు. ఇది పూర్తయితే రాయదుర్గం-ఉరవకొండ నియోజకవర్గాల మధ్య రాకపోకలకు కష్టాలు తీరనున్నాయి.

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం

గత ప్రభుత్వం వేదవతి హగరిపై వంతెనల నిర్మాణాలకు నిధుల మంజూరులో ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శించింది. మాల్యం రోడ్డులో హగరిలో రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేసి ఆర్భాటపు ప్రచారం చేసుకొంది. 2021లో వేదవతి హగరికి పోటెత్తిన వరద ధాటికి కోతకు గురై రోడ్డు ఆనవాళ్లు లేకుండా కొట్టుకొని పోవడంతో ప్రజాధనం గంగపాలైంది. గత ఐదేళ్లుగా వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచింది. త్వరలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శంకుస్థాపన చేయనున్నారని పీఆర్ డీఈ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా...

ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు

ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లి పందిరి', ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం॥ నుంచి సాయంత్రం 5.30 గం॥ వరకు** తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91543 66099, 91547 72006** ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చు.

వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలిపిన వాట్సప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్ యాప్ ద్వారా చేసుకోవచ్చు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి(శనివారం)ఉదయం ఆరు గంటలకు ఉంటుంది. 6.45 గంటల నుంచి 8.45 గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

వైభవం... చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

చౌడేశ్వరీదేవి మూలవిరాట్

ఆకట్టుకున్న వేషధారణ

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలో చేనేత వర్గాలైన దేవాంగులు, తొగటలు శుక్రవారం చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత దేవాంగులు రెండు, తొగటులు పంచమ జ్యోతుల ప్రదర్శన చేపట్టారు. జ్యోతులను తలపై పెట్టుకుని భజన గీతాలకు నృత్యాలు చేస్తూ ముందుకు కదలారు. దారి పొడవునా భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, జ్యోతులను దర్శించుకున్నారు. ఉత్సవంలో ప్రత్యేక వేషధారణల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఐదేళ్లకోసారి జరిగే ఈ జ్యోతుల ఉత్సవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, డీసీసీ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉరగాద్రి ఆలయ ఛైర్మన్ కొత్త శరత్ పాల్గొన్నారు.

పంచమ జ్యోతులతో తొగటుల ప్రదర్శన

20 నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారి కోసం జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. పాల్గొనే వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీబీ జీ రామ్‌జీ పథకంతో విప్లవాత్మక మార్పులు

మాట్లాడుతున్న రాష్ట్ర భాజపా ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, శ్రీనివాసులు, రాజేష్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం స్థానంలో కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ గ్రామీణ పథకంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ తెలిపారు. కొత్తగా రూపొందించిన ఈ చట్టంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతాయని వెల్లడించారు. ఉపాధి పనిదినాలను వంద నుంచి 125కు పెంచడమే కాకుండా ప్రజల జీవనోపాధులు మెరుగు పర్చి ఆస్తులను సృష్టించడానికి వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి జరగడమే కాకుండా కూలీలకు మెరుగైన వేతనాలు అందుతాయన్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకంతో ప్రజల జీవన విధానాల్లో మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.రాజేశ్ మాట్లాడుతూ.. కోట్ల మంది ప్రజలకు కొత్త పథకంతో ఎంతో మేలు జరగడమే కాకుండా అవినీతి అక్రమాలు పూర్తిగా నిర్మూలన చేయవచ్చని పేర్కొన్నారు.

రూ.1.95లక్షల నగదు చోరీ

బ్యాంకింగ్ సర్వీస్ దుకాణంలో చోరీ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని లేపాక్షి హోటల్ ఎదురుగా ఉండే వీధిలో బ్యాంకింగ్ సర్వీస్ దుకాణంలో శుక్రవారం రూ.1.95 లక్షల నగదు చోరీ జరిగింది. బాధితుడు సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... మధ్యాహ్నం గదికి తాళం వేసి భోజనానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. మూడు గంటలకి దుకాణానికి రాగా డోర్‌ను బెండ్ చేసి లోపల తాళం పగలగొట్టి నగదుతో పాటు మరమ్మతుల కోసం అక్కడ ఉంచిన బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితుడి తెలిపారు. బాధితుడి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సత్యలో సంక్రాంతికి తగ్గింపు ధరలతో విక్రయాలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈనెల 18 తేదీ వరకు సత్య షోరూమ్‌లో తగ్గింపు ధరలతో విక్రయాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక సేల్‌లో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70శాతం వరకు భారీ తగ్గింపులు అందుబాటులో ఉన్నాయన్నారు. టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కండీషనర్లు ఇంటి అవసరాలకు సరిపోయే ఉత్తమ బ్రాండ్లు అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈఎంఐలు, క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతులు ఉన్నట్లు వెల్లడించారు. నగరంలోని సత్య షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రకటనలో తెలిపారు.

బ్యాటరీ వాహనంలో మంటలు

గోదాములో కాలిపోయిన వాహనం, తినుబండారాలు

ఉరవకొండ: బ్యాటరీ వాహనం విద్యుదాఘాతానికి గురై మంటలు చెలరేగాయి. ఈ ఘటన ఉరవకొండలో గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి భీమలింగయ్య, బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన దాదాఖలందర్ తన బ్యాటరీ వాహనంతో దుకాణాలకు కిరాణా జనరల్ వస్తువులతో పాటు తినుబండారాలను సరఫరా చేస్తారు. సరకులను నిల్వ చేసే రేకుల షెడ్డులోనే ఆ వాహనం ఉంది. ఎప్పటిలాగే గురువారం ఉదయం తన వాహనాన్ని స్టార్ట్ చేసే క్రమంలో బ్యాటరీలో విద్యుదాఘాతం ఏర్పడి మంటలు వచ్చాయి. వెంటనే పక్కనే నిల్వ ఉంచిన అగ్గిపెట్టెలకు మంటల వ్యాపించాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పక్కన ఉన్న ద్విచక్ర వాహనం, గోదాములో భారీగా నిల్వ చేసిన జనరల్ వస్తువులు, తినుబండారాలు మొత్తం దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో రూ.15లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

డి.హీరేహాళ్‌లో దొంగల హల్‌చల్

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండల కేంద్రంలో సంక్రాంతి పండగ వేళ దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు.. గవిసిద్ధేశ్వర కాలనీ, కోట ఏరియా, తేరు బజారుతోపాటు పలు ఏరియాల్లో సుమారు 7 కుటుంబాలు సంక్రాంతి సందర్భంగా తిరుమల, సొంతూళ్లకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు గురువారం అర్ధరాత్రి ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. గవిసిద్ధేశ్వర కాలనీలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సునీత ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి రూ.5 వేలు నగదు, కోట ఏరియాలో మహమ్మద్ బషీర్ ఇంట్లో సుమారు 65 తులాల వెండి వస్తువులు, తేరుబజారులోని జి.సిద్ధన్న ఇంట్లో అరకేజీకిపైగా వెండి, హెచ్.సిద్దాపురం శంకరప్ప, రవి ఇళ్లలో వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు.

నిప్పు పెట్టిన కేసులో ముగ్గురి అరెస్ట్

అఖిల్‌ను తీసుకెళుతున్న పోలీసులు

కమలానగర్, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారు జాతీయ రహదారి సమీపంలో ఉన్న నంబూరి వైన్స్, మద్యం దుకాణానికి నిప్పు పెట్టిన కేసులో ముగ్గురిని నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జగదీష్ వివరాల మేరకు... ఈ నెల 12న సాయంత్రం అఖిల్, బాబాఫక్రుద్దీన్ మద్యం కొనుగోలు చేయటానికి వెళ్లారు. ఫోన్ పే చేసే క్రమంలో డబ్బులు రాలేదని సిబ్బంది చెప్పటంతో నిఖిల్ గొడవకు దిగి అక్కడ గాజు అద్దాన్ని పగలగొట్టారు. 13న తెల్లవారు జామున మద్యం దుకాణంలో మంటలు చెలరేగి 4 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు, సామగ్రి కాలిపోయినట్లు మద్యం దుకాణం యజమాని నంబూరి వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు వ్యక్తులు వచ్చి మద్యం దుకాణానికి నిప్పు పెట్టినట్లు సీసీటీవీలో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులకు అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మరుసటి రోజు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా మోహన్‌ను అరెస్ట్ చేశారు. మోహన్ తమ్ముడు అఖిల్, అతని మిత్రుడు బాబాఫక్రుద్దీన్ ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరూ పరారీలో ఉండటంతో వారి ఇంటికి వెళ్లి పోలీసులు నోటీసులు అందించి ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అఖిల్, బాబాఫక్రుద్దీన్ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు వారిని స్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

ఏడేళ్ల కష్టం.. నెరవేరిన వేళ!

ముస్లింలకు న్యాయం చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ముస్లింలకు పవిత్రమైన జామియా మసీదు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే బాలకృష్ణ 2018లో రూ.2.5 కోట్లు మంజూరు చేయించారు. నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అయితే 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు ఇవ్వకుండా వేధించింది. బాలకృష్ణ చొరవతో ఎట్టకేలకు ఏడేళ్ల తరువాత బిల్లు మంజూరైంది. రూ.1.37 కోట్లు సొమ్ము శుక్రవారం ఖాతాలో జమ కావడంతో పట్టణంలోని ముస్లిం సోదరులు శుక్రవారం బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిగిలిన సొమ్ము త్వరలో మంజూరవుతుందని నాయకులు పేర్కొన్నారు.

దంపతులపై యువకుల దాడి

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరసింగప్ప తదితరులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద పరిగి మండలం గొల్లపల్లికి చెందిన ఆరుగురు యువకులు గురువారం ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ, ముందు చక్రాలను పైకి ఎత్తి విన్యాసాలు చేశారు. ఓ వాహనం అదుపు తప్పడంతో మధు అనే యువకుడు కింద పడ్డాడు. అదే సమయంలో వారికి ఎదురుగా ద్విచక్ర వాహనంలో కొల్లకుంట చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు వెళుతున్నారు. వారు వాహనాన్ని ఆపి యువకులను మందలించి హితవు పలికారు. మాకు ఎదురు చెబుతావా అని యువకులు చంద్రశేఖర్‌రెడ్డిని కొట్టారు. రహదారి పక్కన ఇళ్ల వద్ద ఉన్న గ్రామస్థులు, బస్టాండ్‌లో ఉన్నవారు గమనించి దాడిని అడ్డుకొన్నారు. మద్యం మత్తులో ఉన్న యువకులు వారిపైన తిరగబడ్డారు. అయితే మరి కొంత మంది రావడంతో మధు మినహా మిగిలిన ఐదుగురు పరారయ్యారు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చి, మధు అనే యువకుడిని చితకబాది, అతడిని, ద్విచక్ర వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. అయితే ఇది వివాదంగా మారడం గమనార్హం.

నిర్లక్ష్యంగా నడిపితే కఠిన చర్యలు

వాహనాలు అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హిందూపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ నరసింగప్ప శుక్రవారం హెచ్చరించారు. గురువారం దాడులకు దిగిన యువకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజగోపాల్ నాయుడు, ఎస్సై శ్రీధర్‌లతో కలిసి సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వారంతా మద్యం తాగినట్లు పరీక్షల్లో తేలిందని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగేది లేదని కఠిన చర్యలు తీసుకొంటామని ప్రకటించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని సూచించారు. బైక్ రేసింగ్‌లు చేసే వారిపై నిఘా ఉంచామని హెచ్చరించారు.

పండగ పూట విషాదం

మేనత్త ఇంటికి వెళ్తూ యువకుడి దుర్మరణం

నవీన్‌కుమార్‌రెడ్డి

లేపాక్షి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ పూట మేనత్త, ఇతర బంధువులతో కలిసి సంతోషంగా గడపాలని కలలుగన్న ఆ యువకుడిపై విధి చిన్న చూపు చూసింది. మరో 10 నిమిషాల్లో గమ్య స్థానానికి చేరుకునేలోపే మార్గమధ్యలో జింక రూపంలో వచ్చిన మృత్యువు యువకుడి కుటుంబంలో విషాదం నింపింది. హృదయ విదారక సంఘటనకు సంబంధించి వివరాలిలా.. పరిగి మండలం ముళ్లమోతుకపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి(32) బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సంక్రాంతి పండగ కావడంతో స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో సరదాగా గడిపిన అతను మధ్యాహ్నం లేపాక్షి మండలం కొండూరులో ఉన్న మేనత్త బసమ్మ, బంధువులతో కలిసి గడపాలని ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మరో 10 నిమిషాల్లో మేనత్త ఇంటికి చేరుకునేలోపే విధి చిన్నచూపు చూసింది. మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో జింక అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి యువకుడు కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. యువకుడి మరణవార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు యువకుడి తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు.

విద్యుదాఘాతంతో బేకరీ దగ్ధం

రూ.40 లక్షల ఆస్తినష్టం

బేకరీ నుంచి సామగ్రిని వెలికితీస్తున్న జేసీబీ

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అజయ్ బేకరీ దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధమైంది. షాపు నుంచి తెల్లవారుజామున పొగలు వస్తుండటంతో పోలీసులు యజమాని అజయ్‌కు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని దుకాణ షటర్లను జేసీబీతో తొలగించి మంటలను అదుపులోనికి తీసుకొచ్చారు. అప్పటికే బేకరీలోని సామగ్రి, యంత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి బేకరీ భవనం దెబ్బతింది. రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని అజయ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు సుధాకర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపుతామని చెప్పారు.

రూ.30లక్షల బంగారం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

పట్టుబడిన ఆభరణాలు, నిందితులను చూపుతున్న డీఎస్పీ నరసింగప్ప, సిబ్బంది

పెనుకొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గోరంట్ల, సోమందేపల్లి, పెనుకొండ, పరిగి మండలాల పరిధిలో 2024 నుంచి 2026 మధ్య తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ.. శుక్రవారం గోరంట్ల మండలంలోని పాలసముద్రం కూడలి వద్ద షికారి శాలి, కోటయ్యలు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులైన అన్నదమ్ములిద్దరూ ప్రస్తుతం రామగిరి మండలంలోని పేరూరు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. వారి వద్ద నుంచి రూ.30లక్షలు విలువ చేసే 282 గ్రాముల బంగారం, 371గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని వివరించారు. నిందితులు పలుచోట్ల నివాసం ఉంటూ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఇళ్ల యజమానులు ఎవరైనా కొత్తవారు ఇంటి అద్దెకోసం వస్తే వివరాలు తెలుసుకుని ఇళ్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనపడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేసులో కీలకపాత్ర పోషించిన గోరంట్ల సీఐ శేఖర్, సీసీఎస్ సీఐ ఆర్వీ.సతీశ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన వివరించారు.

దాడి కేసులో వైకాపా నాయకులకు కౌన్సెలింగ్

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని పోట్లమర్రిలో బుధవారం వైకాపా నాయకులు తెదేపా నాయకుడు ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. గ్రామ సమీపంలోని చెరువులో వైకాపా నాయకులు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. అనంతరం వాటిని విడిపించుకున్న వైకాపా నాయకులు తమ వాహనాలను పోలీసులకు పట్టించినది తెదేపా నాయకుడు నాగరాజే అని నిర్ధారించుకున్నారు. అనంతరం ఆయన ఇంటిపై వైకాపా నాయకులు చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జ్ఞానేంద్రరెడ్డి దాడి చేశారు. ఇంటిలో ఉన్న చంద్రశేఖర్, తల్లి నాగలక్ష్మి, నాగజ్యోతిలను గాయపరిచారు. దాడికి పాల్పడిన వైకాపా నాయకులు ఏడుగురికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. విచారణ అనంతరం ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్ తెలిపారు.

జూదం ఆడుతున్న ఉద్యోగులు, కానిస్టేబుళ్లు అరెస్ట్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జూదం ఆడుతుండగా శుక్రవారం దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐ గణేష్ తెలిపారు. పట్టుబడిన వారిలో 8 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.26,180 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చుక్కలూరు గ్రామ సమీపంలో...

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి జూదం శిబిరంపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో శివమద్దిలేటి, నాగేంద్రుడు, మధుపాల్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.55,100లు రెండుకార్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఎస్సై ధరణిబాబు పాల్గొన్నారు.

మరదలిని హత్య చేసిన బావ

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మరదలిని బావ హత్య చేసిన సంఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన పవన్‌కుమార్(25)కు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి ఎల్లమ్మబండ సమీపంలోని శ్రీరామచంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు ఓ టింబర్ డిపోలో పనిచేస్తూ, చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు జరగడంతో భార్య పిల్లలతో సహా వెళ్లిపోయింది. అయితే పవన్‌కుమార్ అతని మరదలితో(17) ప్రేమాయణం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బాలిక అతను ఉంటున్న ఇంటికి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య గొడవ జరగడంతో సుత్తితో ఆమె తలపై బాది బయటకు వెళ్లిపోయాడు. తీవ్రగాయాలపాలైన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం సాయంత్రం పవన్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా బాలిక చనిపోయి ఉండటాన్ని గమనించి పరారయ్యాడు. ఈ మేరకు ఇంటి యజమాని ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడి బలవన్మరణం


తిప్పన్న

పెనుకొండ, న్యూస్‌టుడే: రొద్దంలోని ఎస్సీ కాలనీకి చెందిన తిప్పన్న(65) అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది గురువారం సాయంత్రం పెనుకొండ శివారులోని రాజేశ్వరీ కాలనీ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి వివరాలు సేకరించి మృతదేహాన్ని శవపరీక్షల కోసం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: పుట్టగూర్లపల్లిలో మహిళ శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని పరిగి ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. వివరాలిలా.. పుట్లగూర్లపల్లి గ్రామానికి చెందిన జ్యోతి(23) కర్ణాటక రాష్ట్రం మిడిగేసికి మండలం తాడికి చెందిన నాగార్జునతో మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్తతో ఉన్న విబేధాల కారణంగా జ్యోతి ఈ నెల 14న పుట్టింటికి వచ్చింది. మనస్తాపంతో ఇంట్లో జ్యోతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

సంక్రాంతి స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Penukonda Near KIA Car-Factory, Madakasira Highway 50x100 (4 Nos) Sites for Sale Resi Converted, Gated Community, 499/-PSft. Call: 8310681025.

హిందూపురంలో కిరికెర ఇంద్రప్రస్థ లేఅవుట్ ఎదురుగా Saz Gardensలో ప్లాట్స్ కలవు. Ready to Registration సం: 8143917999.

ATP కదిరి రోడ్‌కి విన్సెంట్ డిపాల్ స్కూల్ ఎదురుగా రోడ్ నుంచి 3వ బిట్ AHUDA అప్రూవ్డ్, ఉ: 40 అ||లరోడ్, ద: 30 అ||ల రోడ్, కార్నర్ 10 సెంట్ల ప్లాట్ అమ్మబడును. 9581196786

JOBS

ATP క్యూర్ కైరో ప్రాక్టిక్ సెంటర్ నందు మసాజర్లుగా పనిచేయడానికి స్త్రీలు, పురుషులు కావలెను. # 2-224, 4వ క్రాస్, 2వరోడ్, ATP. Cell 7780544424

మయూరిటైల్స్ & శానిటరీ షోరూంలో పనిచేయుటకు అనుభవంకల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (మేల్) కావలెను. జీతం: 16,000/- + ఇన్సెంటివ్స్. బళ్లారిరోడ్, సాయిబాబాగుడి దగ్గర, ATP. 9848189744.

FACULTY/ TEACHERS

Junior & Senior Lecturers in Maths, Physics, Chemistry, Botany, Zoology, English, Sanskrit Anantapur. Cell: 6302037812

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

కనకదాస విగ్రహ ఊరేగింపు

ఘనంగా కనకదాస జయంతి

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండల కేంద్రంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కనకదాస విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువకులు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి విగ్రహానికి సమర్పించి, పూజలు చేశారు. ఊరేగింపు కోసం బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక కనకదాస విగ్రహాన్ని వాహనంలో అలంకరించి, సాయంత్రం మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: భక్తిశ్రద్ధలతో గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహించారు. శుక్రవారం లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రతం పూర్తి కావడంతో కల్యాణం చేశారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని అర్చకులు శ్రీనాథ్ స్వామి తెలిపారు. శ్రీవారికి విశేష అలంకరణ, పూజలు చేశారు. భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య : రాంనగర్ కాలనీ నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారి మురుగు కాలువ లేక ఇళ్ల ఎదుట మురుగు నిలుస్తోంది -స్థానికులు, కణేకల్లు

సమాధానం : మురుగు శుభ్రం చేయిస్తాం. డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం -చంద్రమౌళి, ఈవోఆర్డీ

సమస్య : నేసేపేట కాలనీ మలుపు వద్ద తాగునీటి పైపు వాల్వ్ నుంచి నీరు లీకవుతోంది. దీంతో పైపులో నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది -మల్లికార్జున, కణేకల్లు

సమాధానం : సిబ్బందిని పంపి, వాల్వ్ లీకేజీని అరికట్టేలా చర్యలు చేపడతాం -చంద్రమౌళి, ఈవోఆర్డీ - న్యూస్‌టుడే, కణేకల్లు

నిధుల ప్రవాహం.. ప్రగతి హారం

రహదారుల అభివృద్ధికి రూ.83.51 కోట్లు మంజూరు

నేత్రపల్లి- కలుగోడు పీఎంజీఎస్‌వై రోడ్డు

రాయదుర్గం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో ప్రగతి పనులు పరుగులు పెడుతున్నాయి. దశాబ్దాలుగా రహదారులు లేని పల్లెలకు కూటమి ప్రభుత్వం కొత్త శోభ తెచ్చింది. వైకాపా హయాంలోని గుంతల దారులకు కూటమి ప్రభుత్వం మోక్షం కల్పించింది. ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రూ.83 కోట్లకు పైగా వెచ్చించింది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

చేపడుతున్నవి ఇవే...

నియోజకవర్గంలో ఎన్‌డీబీ, నాబార్డు, పీఎంజీఎస్‌వై, ఏపీ ఆర్‌ఆర్‌పీ తదితర పథకాల కింద నిధులు మంజూరయ్యాయి. పీఆర్‌లో స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం కింద రూ.9.85 కోట్లు విడుదలయ్యాయి. ఆదిగానిపల్లి నుంచి రచ్చుమర్రికి రూ.2.15 కోట్లు, వేపరాళ్ల నుంచి కొత్తపల్లి మీదుగా ఆదిగానిపల్లికి రూ.4.19 కోట్లు, సిద్దరాంపురం- బొమ్మనహాళ్ రోడ్డుకు రూ.3.51 కోట్లు కేటాయించారు. ఎన్‌డీబీ కార్యక్రమంలో రూ.2.77 కోట్లతో 74 పనులు చేపట్టారు. ఎన్‌డీబీ రెండో దశలో సిమెంటు, బీటీ రోడ్లకు 551 పనులకు రూ.27.97 కోట్లు విడుదల చేశారు. నాబార్డు-30 కింద మూడు రోడ్ల నిర్మాణాలకు రూ.3.02 కోట్లు, నాబార్డు-29 కార్యక్రమంలో 2 పనులకు రూ.6.80 కోట్లు మంజూరయ్యాయి. బాదనహాళ్- గోడిసెలపల్లి, కణేకల్లు-మాల్యం క్రాస్‌వేల నిర్మాణాలకు రూ.6.80 కోట్లు, పీఎంజీఎస్‌వై కింద నేత్రపల్లి- కలుగోడు రోడ్డుకు రూ.4.11 కోట్లు, ఏపీ ఆర్‌ఆర్‌పీ ప్లాను కింద రూ.7.80 కోట్లతో రహదారులను నిర్మించనున్నారు. ఆర్‌అండ్‌బీ కింద ప్యాచ్ పనులకు రూ.6 కోట్లు, బళ్లారి రోడ్డు విస్తరణకు రూ.6.2 కోట్లు, బళ్లారి-గుంతకల్లు రహదారికి రూ.6 కోట్లు, హులికంటి- వితలాపురం రోడ్డుకు రూ.2.20 కోట్లు కేటాయించారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. త్వరలో మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన రహదారులను పునర్నిర్మిస్తాం. - సుధాకర్‌నాయక్, పీఆర్‌డీఈ, రాయదుర్గం

‘దుర్గం’ చేరిన భద్రాద్రి రాముడి అక్షతలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణవాసులను ఆహ్వానించడానికి భద్రాద్రి నుంచి రాముల వారి అక్షతలు వచ్చాయి. శుక్రవారం అక్షితలను ఇంటింటికి పంపిణీ చేయడానికి మహిళలు సిద్ధం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అక్షతలు, ఆధ్యాత్మిక పుస్తకాలను ఇంటింటికి గడప గడపకు వెళ్లి పంపిణీ చేస్తామని తెలిపారు. ఈనెల 26నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కమిటీ అధ్యక్షులు అవినాష్ పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో దుర్గాభవాని

ఉరవకొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి పర్వ దినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దుర్గాభవాని అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

రాయదుర్గం, న్యూస్‌టుడే : పట్టణంలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు అత్యంత భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు జంబుకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఒకరికి అస్వస్థత

బెలుగుప్ప, న్యూస్‌టుడే: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎర్రగుడి గ్రామానికి చెందిన మాల వెంకటేశులకు దగ్గు, జలుబు ఉండటంతో లక్ష్మీబజార్‌లో ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లాడు. వైద్యుడు వేంకటేశుడికి మాత్రలు ఇచ్చి, ఇంజెక్షన్ వేయడంతో కొద్దిసేపటికే ముఖం, కాళ్లు, చేతులు వాపులు వచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆర్‌ఎంపీ ఇంజెక్షన్లు, ఇచ్చిన మాత్రలు బలవంతంగా వెనక్కు లాక్కున్నట్లు బాధితుడు తెలిపారు. స్థానికుల గమనించి కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అయితే ప్రథమ చికిత్సలు అందించాల్సిన ఆర్‌ఎంపీలు మందులు వేసి గుట్టుగా బాటిళ్లు పెట్టడం, కొన్ని వేయడం చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో ఎర్రిస్వామి రైతుకు సంబంధించిన పశుగ్రాసం వామికి ఆకస్మాత్తుగా నిప్పు అంటుకొని కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. రూ.లక్షల విలువ చేసే పశుగ్రాసం అగ్నికి ఆహుతి అయ్యిందన్నారు. సంక్రాంతి రోజున పాడిదారులు బీడీలు తాగి పారేయడంతో నిప్పు అంటుకుందని బాధితులు అన్నారు. గ్రామస్థులు మంటలను ఆదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. ప్రభుత్వం పశుగ్రాసం కొనుగోలు చేయడానికి అవసరమైన పరిహారం ఇవ్వాలని బాధితుడు కోరారు. సంఘటన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ మునివేలు తెలిపారు.

క్రికెట్ విజేత తాళ్లకెర జట్టు

విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కాలవ భరత్, కన్వీనర్ కాలవ సన్నన్న

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే : మండలంలోని తాళ్లకెరలో గురువారం జరిగిన శ్రీవీరభద్ర స్వామి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో తాళ్లకెర జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు కాలవ భరత్, కన్వీనర్ కాలవ సన్నన్న చేతుల మీదుగా ట్రోఫీని, రూ.30 వేలు నగదు బహుమతిని, రన్నర్‌గా నిలిచిన సోమలాపురం జట్టుకు రూ.15వేలను అందజేశారు. సందర్భంగా కాలవ భరత్ మాట్లాడతూ చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గిరిమల్లప్ప, వీరాపురం సర్పంచ్ నాగరాజు, బేలోడు సంజీవ, హనుమంతరెడ్డి, సత్తిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

రాయదుర్గం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న ఆదివారం రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులోని సీతా, రామాంజనేయ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ ట్రస్టు బళ్లారి విమ్స్ వైద్యుల సహకారంతో ఆదివారం ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌లో పామిడి జట్టు గెలుపు

విజేతలకు బహుమతులు అందజేసిన తెదేపా నాయకులు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వెంకటంపల్లి గ్రామంలో పయ్యావుల వెంకటనారాయణప్ప, ఓబుళమ్మ జ్ఞాపకార్థంతో సంక్రాంతిని పురస్కరించుకొని వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. 15న పామిడి, ఎస్‌ఎస్‌ తండా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. హోరాహోరీగా సాగిన పోరులో పామిడి జట్టు విజయం సాధించగా, ఎస్‌ఎస్‌ తండా జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.20వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేల బహుమతిని గురువారం అందజేశారు. తెదేపా నాయకులు మండి ఎర్రిస్వామి, శ్రీరాములు, ఎర్రిస్వామి, శ్రీనివాస్, ఓబుళేసు, శేఖర్, అర్జున్, రమేష్, వీరా పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో యువత సత్తా

రాయదుర్గం, న్యూస్‌టుడే: సంక్రాంతి క్రీడా పోటీల్లో భాగంగా రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధ, గురువారాల్లో కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో ఫైటర్ బ్యాచ్ బాయ్ జట్టు ప్రథమ, రాయదుర్గం యువసైన్యం జట్టు ద్వితీయ, రాయదుర్గం యువసైన్యం సీనియర్ జట్టు తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు.

బొమ్మనహాళ్: విజేతలకు బహుమతి అందజేస్తున్న తెదేపా నాయకుడు మున్నా

బీఎన్‌హళ్లి జట్టు విజయం..

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బి.ఎన్.హళ్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ ఎన్టీఆర్ ట్రోఫీ క్రికెట్ పోటీలలో 30 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో బీఎన్‌హళ్లి- కాశీపురం జట్లు తలపడగా బీఎన్‌హళ్లి టీం విజేతగా నిలిచింది. దీంతో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు యువ నేత కాలవ భరత్ కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విన్నర్స్‌గా నిలిచిన టీంకు రూ.20 వేలు, రన్నర్స్‌గా నిలిచిన కాశీపురం టీంకు రూ.10వేల తో పాటు విన్నర్, రన్నర్ ట్రోఫీలు అందజేశారు.

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని ఉద్దేహాళ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలో చాంద్ వారియస్ విన్నర్‌గా నిలిచింది. తెదేపా కార్యకర్త మున్నా విన్నర్‌కు రూ. 11,111లు , హనుమాన్ ఎంటర్ ప్రైజెస్ యజమాని అనిల్ రన్నర్‌గా నిలిచిన గల్లీబాయ్ టీమ్‌కు రూ.5,555లు నగదును అందజేశారు. తెదేపా మండల నాయకుడు మహేంద్ర తదితరులు కప్‌ను అందజేసి వారిని అభినందించారు.

ఎమ్మెల్యే ఇంట సంక్రాంతి సందడి

కోడి పుంజులతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాజగోపాల్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : సంక్రాంతి పండగను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన నివాసంలో కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి ఆనందంగా గడిపారు.

వైభవంగా భూ వరాహ హోమం

రాయదుర్గం గ్రామీణం: మల్లాపురం గ్రామ సమీపంలోని విప్రమల్లె లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలోని విశిష్ట అద్వైత విశ్వమాత ఆశ్రమంలో ఏర్పాటు చేసిన లక్షినారాయణ యజ్ఞ మండపంలో 64 రోజుల దీక్ష యజ్ఞం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం 55వ రోజు మూల నక్షత్రం పురస్కరించుకొని భూ వరాహ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామమూర్తిస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పురోహితులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఉపాధ్యాయురాలి మృతికి నివాళి

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ క్యాంపులోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న జమ్ము సూర్యకళ(29) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాఠశాలకు సంక్రాంతి సెలవులు రావడంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని పురివలస సొంత గ్రామానికి వెళ్లారు. ఆమె భర్త సత్యనారాయణ విజయనగరం జిల్లాలోని చీపురపల్లె మండలంలోని తాలూరు గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరికి సంతానం లేదు, ఆమె తల్లిదండ్రులూ మృతి చెందారు. ఎంఈవోలు ఈరన్న, మల్లికార్జున, ఎంఆర్‌సీ సిబ్బంది మంజు, అమరేష్, ఇస్మాయిల్, భాస్కర్, ఉపాధ్యాయులు ఆమె మృతికి సంతాపాన్ని తెలిపారు.

కోడిపందెం రాయుళ్లపై కేసు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం పెద్ద బలపంపల్లి సమీపంలో కోడిపందెం ఆడుతున్న ఆరు మందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమన్ తెలిపారు. వారి వద్ద నుంచి రు.3వేలు నగదు, 5 ద్విచక్రవాహనాలు, ఒక పందెంకోడి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మండలంలో ఎక్కడైనా జూదం, పందేలు ఆడుతుంటే సమాచారం ఇవ్వాలని పోలీసుల కోరారు.

బస్సుషెల్టరా.. పశువుల పాకనా?

మండలంలోని కేపీదొడ్డి- 75వీరాపురం గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో రోడ్డుపక్కన ఉన్న బస్సు షెల్టర్ పశువులకు ఆవాసంగా మారింది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌లో పశువులను కట్టేయడంతో అపరిశుభ్రంగా మారి కూర్చొడానికి వీలైనంతగా తయారైంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై సర్పంచ్ నాగరాజును వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, గుమ్మఘట్ట

మురుగు సమస్య పరిష్కరించరూ..

స్థానిక పురాతన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన సిమెంటు రోడ్డుపై మురుగు పారుతోంది. భక్తులు మురుగునీటిలోనే నడుచుకుంటూ ఆలయానికి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. రాత్రి వేళలో స్థానికులు నడిచి వెళ్లేటప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, అధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంబదూరు

పునాదులకే పరిమితం

ఉరవకొండ మండలం ఆమిద్యాలలో మూడున్నరేళ్ల కిందట ఉపఆరోగ్య కేంద్ర నిర్మాణాన్ని చేపట్టారు. కానీ అది నేటికీ పునాదులకే పరిమితం కావడం గమనార్హం. ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నా సరైన భవనం లేక పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

కంకర పరిచారు.. తారు మరిచారు!

పట్టణంలోని కోతిగుట్టలో అనంతపురం ప్రధాన రహదారిపై ఆంజనేయస్వామి దేవాలయం, మాస్ ఎడ్యుకేషన్ కార్యాలయం సమీపంలో గుంతలు ఏర్పడిన దారికి కంకర పరిచి వదిలేశారు. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు పక్కన ఉన్న వారిపై కంకర రాళ్లు వేగంగా తగులుతున్నాయని పలువురు తెలిపారు. అధికారులు స్పందించి తారు వేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

అధ్వాన దారిలో అవస్థలు

వజ్రకరూరు నుంచి బోడిసానిపల్లెకు వెళ్లేదారిలో గుంతలు ఏర్పడి వాహన దారులకు తిప్పలు తప్పడం లేదు. మరోవైపు మురుగు నీరు గుంతల్లో చేరి అస్తవ్యస్తంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించబోయి అదుపుతప్పి మురుగులో పడిపోయిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వజ్రకరూరు

రాతిదూలం లాగుడు పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు, స్థానికులు

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా కూడేరు మండలం జల్లిపల్లిలో మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో స్థానికులు శుక్రవారం వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. పోటీల్లో తోపుదుర్తి చెన్నప్పకు చెందిన వృషభాలు ప్రథమ స్థానంతో రూ.30116, మద్దలచెరువుకు చెందిన కొండయ్య వృషభాలు ద్వితీయ స్థానంతో రూ.20116, బళ్లారికి చెందిన ఆనంద్‌రెడ్డి వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ.10116 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. అలాగే స్లోబైక్ రేస్ పోటీలను చేపట్టారు. సాయంత్రం సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్ల గ్రామ శివారులో జూద స్థావరం పై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసినట్లు గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐ గణేష్ తెలిపారు. వారి నుంచి రూ.5,180 నగదు స్వాధీనం చేశామని పోలీసులు తెలిపారు. దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల హల్‌చల్

కళ్యాణదుర్గం గ్రామీణం: ముదిగల్లు - మల్లిపల్లి గ్రామాల మధ్య రెండు రోజులుగా ఎలుగుబంట్లు రైతులకు, వాహనదారులకు వెళ్లే మార్గంలో కనిపిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా సాగులో ఉండటంతోనే ఎలుగుబంట్లు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. కొందరు వాటిని తరిమి వేయడంతో కొండల్లోకి వెళ్లిపోయాయని తెలిపారు. విషయం తెలుసుకొన్న అటవీశాఖ బీట్ అధికారి నాగేంద్ర నాయక్ సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకొని వివరాలు ఆరా తీశారు. రైతులకు, ప్రజలకు జాగ్రత్తలు కల్పించారు. ఆయా ప్రాంతంలో ఎలుగుబంట్ల పాదాల గుర్తుల ఆధారంగా పలు చోట్ల గస్తీ నిర్వహించారు.

భక్తులకు కలుషిత నీరే దిక్కు!

ఆలయ దక్షిణ గోపురం వద్ద ట్యాంకు చుట్టూ ఇలా..

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కలుషిత నీరే దిక్కుగా మారిన పరిస్థితి. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను కనీసం నెలకోసారి కూడా శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో పాచి పట్టి, అపరిశుభ్రంగా దర్శనం ఇస్తున్నాయి. పైగా వాటిపై కప్పులు లేకపోవడంతో కోతులు ఆ ట్యాంకుల మీద కూర్చుని నీటిని కలుషితం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయం లేకపోవడంతో భక్తులు ఆ నీటిని వాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్యాంకును, పరిసరాలను శుభ్రం చేయించి, వాటిపైన మూతను అమర్చాలని భక్తులు కోరుతున్నారు.

కాలనీల్లో ముళ్లపొదలు.. అధికారులకు పట్టదాయే!

వీధిలో కమ్ముకున్న ముళ్లపొదలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు విపరీతంగా పెరిగి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండలో ఇలాంటి పరిస్థితి ఉన్న దాదాపు 20 కాలనీలున్నాయి. అందులో శివరామిరెడ్డికాలనీ, సీవీవీ నగర్, వీరశైవ నగర్, హమాలీ కాలనీ, రామ్‌నగర్, సాయినగర్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో సమస్య అధికంగా ఉంది. ఇక్కడ నివాస గృహాలకు ఆనుకుని ముళ్ల పొదలు విపరీతంగా పెరిగాయి. వాటిని తొలగించక పోవడంతో అవి చిట్టడవులను తలపిస్తున్నాయి. కొన్ని కాలనీల్లో దారులను సైతం అవి కమ్మేసాయి. దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో ఇళ్లల్లోకి విష పురుగులు, క్రిమి కీటకాలు వస్తున్నాయని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో మరింత కష్టంగా మారుతోందని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు విపరీతంగా పెరిగి, ప్రజలు ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి ముందుగా స్థల యజమానులకు ముళ్లపొదలను తొలగించాలని పంచాయతీ అధికారులు సూచించాలి. అనంతరం వారు పట్టించుకోకపోతే వారికి నోటీసులు ఇవ్వాలి. కానీ ఆ చర్యలేవి ఇక్కడ జరగడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తగిన చర్యలు చేపడతాం...

దీనిపై ఉప ఎంపీడీవో సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా, ఖాళీ స్థలాలను పరిశీలించి, పంచాయతీ అధికారులతో యజమానులకు సూచించేలా చొరవ చూపుతాం.

విషద్రావణం తాగి జీవాల మృత్యువాత

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మారెంపల్లి గ్రామంలో కురుబ మారెన్నకు చెందిన 9మేకలు, 6గొర్రెలు విషద్రావణం కలిపిన నీటిని తాగి గురువారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తనకున్న 50 జీవాలు మేపడానికి దేవరెడ్డిపల్లి పొలాల్లోకి వెళ్లారు. అక్కడ మేత మేశాక నీరు తాగేందుకు నాగప్ప పొలంలోకి వెళ్లాయి. గుంతలోని నీరు తాగాక కొంతసేపటికి 9మేకలు, 6గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన గొర్రెలు పశువైద్యులు వద్ద చికిత్స పొందుతున్నాయి. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మలపనగుడి గ్రామానికి చెందిన తెదేపా నాయకులు దుర్గన్న కుమారుడు ఆంజనేయులు గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆ గ్రామానికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మార్కెట్‌యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, మండల కన్వీనరు పాటిల్ మోహన్‌రెడ్డి, మాజీ మండల కన్వీనరు మాకాసి వెంకటేశులు, ఇతర పార్టీ నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కుటుంబానికి అండగా ఉంటామని మాజీ కన్వీనరు మాకాసి వెంకటేశులు వారికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలంలో గుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు.. 70-75ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం గొట్కూరు గ్రామం, జాతీయ రహదారి వద్ద ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో లభ్యమైంది. మృతుని శరీరంపై గాయాలున్నాయి. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పెండింగు బకాయిలను మంజూరు చేసి విశ్రాంత ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు పాండురంగ అన్నారు. శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2018 జూలై నుంచి 2020 డిసెంబర్ వరకు పెండింగులో ఉన్న బకాయిలను 2.70లక్షల మంది పెన్షనర్ల ఖాతాలో జమచేయడం ఎంతో హర్షించదగిన విషయమని అన్నారు. మాజీ అధ్యక్షుడు శివప్రసాద్, కృష్ణయ్యచౌదరి, మారెన్న, అంజనప్ప, ఇస్మాయిల్, ఫకృద్దీన్, భగవాన్‌దాస్, విజయకుమార్, బాలరాజు, వన్నూరస్వామి, కేవీఎస్.చౌదరి, అంపన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు

● గుంతకల్లు ● శింగనమల ● తాడిపత్రి

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం

నాటక ప్రదర్శన

పామిడి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం మండల పరిధిలోని వంకరాజుకాలువ గ్రామంలో లక్ష్మీ నరసింహ, స్వరరాగ నాటక ఉచిత శిక్షణాలయం ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో అష్టాంగాలు అనే నాటకాన్ని ప్రదర్శించారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి, వాసవీమాత హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

సుందరీకరణకు సున్నాచుట్టారు

కసాపురం పంచాయతీ పరిధిలో బోసిపోయిన రోడ్డు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణం నుంచి కసాపురం వరకు ఉన్న రోడ్డు సుందరీకరణకు నోచుకోవడంలేదు. గుంతకల్లు పురపాలిక ఆధ్వర్యంలో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తే తాము మొక్కలు నాటి రోడ్డును అందంగా మార్చుకుంటామని కసాపురం ఆలయ, పంచాయతీ అధికారులు గతంలో మున్సిపాలిటీ అధికారులకు హామీ ఇచ్చారు. దీంతో గుంతకల్లు- కసాపురం రోడ్డు సగం మాత్రమే మున్సిపాలిటీ పరిధిలో ఉండగా మిగిలిన సగం పంచాయతీ పరిధిలో ఉంది. మున్సిపల్ పరిధి రోడ్డులో అధికారులు సుందరీకరణ పనులను అమలు చేశారు. అయితే కసాపురం ఆలయం, పంచాయతీ అధికారులు మాత్రం వారి పరిధిలో చెట్లను నాటలేదు. దీంతో రోడ్డు బోసిపోయింది. ఇప్పటికైనా మొక్కలు నాటి సుందరీకరణ పనులను చేపట్టాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధికి దూరంగా శివారు కాలనీలు

వినాయక చేనేత కాలనీలో మట్టిరోడ్డే దిక్కు

✦ పురపాలిక : గుంతకల్లు
✦ కాలనీ : వినాయక చేనేత
✦ గృహాలు : 800
✦ జనాభా : 3200

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పురపాలికలో ఉన్న శివారు కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయక కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను చేపట్టలేదు. ఫలితంగా ఇళ్ల ముందు మురుగు నిలుస్తోంది. దీని వల్ల దుర్వాసన, దోమల వ్యాప్తితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. శివారు కాలనీలలో ఒకటైన వినాయక చేనేత కాలనీ వసతులలేమితో అభివృద్ధికి నోచుకోలేదు. మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

★ వినాయక చేనేత కాలనీ గుత్తి ఉపకాలువ సమీపంలో ఉంది. ఇక్కడ చాలా మంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ ఒక్క సీసీ రోడ్డు, మురుగు కాలువ కూడా నిర్మించలేదు. అన్నీ మట్టిరోడ్లే. వర్షం పడిన సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. దారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. దీంతో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి సమీపంలో నీటిపారుదలశాఖ వసతి గదులు నిర్వహణ లేక వృథాగా ఉన్నాయి. చేనేతకాలనీ, జగ్జీవన్‌రాం కాలనీ, భీమ్‌రెడ్డి కాలనీల్లో పాఠశాలలు లేవు. విద్యార్థులు చాలా కష్టంగా దూరంలో ఉన్న ఇతర పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది.

★ కాలువలు లేకపోవడంతో మురుగునీరు దారులపైనే ప్రవహిస్తోంది. మురుగు, వర్షంనీరు మట్టిరోడ్లను గుంతలమయం చేస్తున్నాయి. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలనీలో నీటి కోసం ఒక్క చిన్ననీటి పథకాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా మౌలిక వసతులు ఏర్పాటు చేసి, స్థానికుల అవస్థలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం

- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. విడుదలైన వెంటనే కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడతాం. ప్రస్తుతం నిధుల కొరత ఎక్కువగా ఉంది. నిధుల కోసం ప్రజాప్రతినిధులు కూడా కృషిచేస్తున్నారు. ప్రత్యేక ప్రణాళిక నిధులు త్వరలో విడుదల అవుతాయి.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాతకల్లూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో పాతకల్లూరు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. పామిడి మండలం కత్రిమల జట్టు రెండో స్థానం, కదిరిపల్లి జట్టు మూడో స్థానం, అయ్యవారిపల్లి జట్టు నాల్గో స్థానంలో నిలిచాయి. మొదటి జట్టుకు రూ. 8,116లను దాత వెంకటరాముడు, రెండో జట్టుకు రూ. 5,116లను దాత నాగరాజు, మూడో జట్టుకు రూ. 3,116లను దాతలు మల్లికార్జున, సింగరయ్య, నాల్గో జట్టుకు రూ. 1,116లు దాత పవన్ కల్యాణ్‌లు అందజేశారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అలవంబిస్తున్నాయని సీపీఐ నాయకులు తెలిపారు. క్రిష్టిపాడులో గాంధీవిగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకోస్తున్న నూతన వ్యవసాయ విత్తన మార్కెటింగ్ చట్టం, రైతువ్యతిరేక విద్యుత్తు సంస్కరణల బిల్లు, వేతన చట్టం, లేబర్‌కోడ్‌లను రద్దు చేసి ఉపాధిహామీ పథకంలో జీ రామ్‌జీ చట్టం విరమించుకోవాలని వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టు మూత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రహరీ పక్కన ఉన్న పోలీస్ అవుట్ పోస్టు వినియోగంలో లేకుండాపోయింది. ఆసుపత్రికి వచ్చిన వారు ఫిర్యాదు ఇవ్వడానికి, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేనివారికి ఇక్కడే ఫిర్యాదులను స్వీకరించడానికి 2013లో రెండో పట్టణ పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. కొన్ని రోజులు నిర్వహించిన తరువాత వినియోగంలో లేదు. ఆసుపత్రికి వచ్చిన కేసులపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆసుపత్రి సిబ్బంది అంటున్నారు. అవుట్ పోస్టును వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

దుర్గాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శింగనమల, న్యూస్‌టుడే: శింగనమల మండల కేంద్రంలోని వెలసిన దుర్గాంజనేయ స్వామి గురువారం మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు అభిషేకం, పసుపు కుంకుమ, సిందూరం, పట్టు వస్త్రాలతో ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడులు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్

గుంతకల్లు, న్యూస్‌టుడే: పత్రికా స్వేచ్ఛపై దాడులు చేయడం అన్యాయమని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది రాంకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది నాగరాజు అన్నారు. గుంతకల్లులో శుక్రవారం ఓపీడీఆర్, ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని వారు తెలిపారు. పత్రికావిలేకరులు, మీడియా సంస్థలపై జరుగుతున్న దాడులు, పోలీసుల వేధింపులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎన్టీవీ విలేకరులపై దాడులు చేయడం అన్యాయమని అన్నారు. జర్నలిస్టుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకులపై పోలీసుల దాడులు

శింగనమల, న్యూస్‌టుడే: శివపురం గ్రామ సమీపాన కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడిచేసి ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శివపురం గ్రామంలో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకున్న నిర్వాహకులు పారిపోయారు. కొన్ని ద్విచక్రవాహనాలు మాత్రమే స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రహదారి నిర్మాణ సిబ్బందిపై దాడి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని యల్లనూరు రోడ్డులో 544డీ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందిపై గురువారం సాయంత్రం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు యల్లనూరు రోడ్డులో కంటైనర్ ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటూ కొందరు కార్మికులు రోడ్డు నిర్మాణ పని చేసుకుంటూ ఉన్నారు. సమీపంలోనే మద్యం తాగుతూ ఐదుగురు యువకులు దాడి చేసి సామగ్రిని చెల్లాచెదురుగా వేసి వారి వద్ద ఉన్న రూ.5వేల నగదు అపహరించినట్లు తెలిపారు. వీటిపై గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితుల కోసం విచారణ చేస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

రైల్వేకార్మికుల నిరసన

నల్ల బ్యాడ్జీలతో రైల్వేకార్మికులు

గుత్తి, న్యూస్‌టుడే: సికింద్రాబాదులోని మౌలాలి డీజిల్ షెడ్డులో అధికారుల వేధింపులు తట్టుకోలేక సూపర్‌వైజర్ రాజేశ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడటంతో గుత్తిలోని రైల్వేకార్మికులు శుక్రవారం నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. రైల్వేలో అధికారుల వేధింపులు ఆపాలని డిమాండు చేశారు. భోజన విరామసమయంలో వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డీజిల్ షెడ్డు బ్రాంచి కార్యదర్శి రామాంజులురెడ్డి, ప్రతినిధులు ఎర్రిస్వామి, మనోజ్‌సింగ్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వాల్మీకులను ఏకం చేయడానికి వాల్మీకి సంఘం జాతీయ కార్యదర్శి శ్రీనివాసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెదేపా లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వాల్మీకి మహర్షి క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడానికి కృషిచేయాలని కోరతామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లయోధుడి వర్ధంతి

యాడికి, న్యూస్‌టుడే: ప్రపంచ మల్లయోధుడు కోడి రామమూర్తినాయుడు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యాడికి గాంధీ కూడలి నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు గరిడి శివన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మల్లయోధుడికి మల్లమార్తాండ, వీర హనుమాన్, మల్లరాజ తిలక్, ఇలా అనేక బిరుదులు వచ్చాయని తెలిపారు. అంతకుముందు మల్లయోధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయలసీమ దళిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా గ్రామాల్లో దళితులకు శ్మశానవాటికలు లేక, సామాజిక భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళితకాలనీల్లో అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం కేటాయించే నిధులను సకాలంలో ఖర్చు చేయాలని, నిధులను దారి మళ్లించకూడదని తెలిపారు. దళితులకు శుభ్రమైన నీటిని అందించడానికి నీటిపథకాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం గుంతకల్లు పట్టణ కమిటీని ఏర్పాటు చేసి కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.

మురుగు ఇలా.. వెళ్లేదెలా?

గుంతకల్లులోని పాత గుత్తిరోడ్డులో సంతోష్‌నగర్‌కు వెళ్లే క్రాస్ వద్ద రెండు రోజులుగా మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువలు నిండి మురుగు రోడ్డుపైకి రావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోటార్ సైకిళ్లలో వెళ్తున్నవారు కింద పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పాదచారులు ఎలా నడవాలో దిక్కు తోచడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు తొలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ప్రమాదకరంగా ఫ్యూజు బాక్సు

గుంతకల్లులోని అంథోనీ స్ట్రీట్‌లో బాలంగంగాధర్ స్కూల్ సమీపంలో విద్యుత్తు నియంత్రిక స్తంభం కింద ఫ్యూజ్ బాక్సు ప్రమాదకరంగా కనిపిస్తుంది. ఫ్యూజ్ బాక్సు కింద మూత సగమే ఉండి ప్రమాదకరంగా మారింది. కొందరు అక్కడే చెత్త వేస్తుండటంతో పశువులు వస్తున్నాయి. విద్యుత్తు షాక్‌తో ప్రమాద బారిన పడే అవకాశం ఉంది. నియంత్రికకు కంచె లేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

కాలువపై జాగ్రత్త

పెద్దపప్పూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో మురుగునీటి కాలువ ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి పక్కన మురుగునీటి కాలువపై నిర్మించిన మార్గ బిళంపై మూత దెబ్బతింది. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపప్పూరు

పైపు లీకేజీని అరికట్టండి

నార్పల మండలం మంగపట్నంలో బొడ్రాయి వీధి సమీపాన సత్యసాయి పైపులైన్ లీకేజీతో నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు దారిపై నడవలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నీటి ప్రవాహం వల్ల దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు. న్యూస్‌టుడే, నార్పల

పాడి పశువుల బీమాకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం పశువైద్య ఏడీఏ కార్యాలయం పరిధిలో పాడిరైతులు ప్రభుత్వ పశుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ రత్నకుమార్ తెలిపారు. ఏడీఏ కార్యాలయం పరిధిలో బుక్కరాయసముద్రం, కొర్రపాడు, నార్పల, బి. పప్పూరు పశు వైద్యశాలలు ఉన్నాయన్నారు. పాడి రైతులు రూ.149 బీమా చెల్లిస్తే పశువు మరణిస్తే రూ.15 వేల పరిహారం, రూ.298 బీమా చెల్లిస్తే రూ.30 వేల పరిహారం వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు ఇసుక టిప్పర్లను జప్తు చేసినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా అనంతపురం వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని భూగర్భగనులశాఖ అధికారులకు అప్పజెప్పనున్నట్లు సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

పనిచేయని శుద్ధజల పథకం

బెంచికొట్టాలలో మూతపడ్డ శుద్ధజల కేంద్రం

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణం బెంచికొట్టాలలోని మున్సిపాలిటీకి చెందిన శుద్ధజల పథకం ఐదు నెలల క్రితం మూతపడింది. ఇందులోని యంత్రాలు చెడిపోవడంతో పథకం పనిచేయడంలేదు. ఈ కాలనీవాసులకే కాకుండా సమీపంలోని మస్తాన్‌పేట, కొత్తకొట్టాల, విద్యానగర్ కాలనీల ప్రజలకు ఈ పథకం ద్వారా శుభ్రమైన నీరు అందేది. ప్రస్తుతం కాలనీల ప్రజలు ప్రైవేట్ వారి నుంచి ఎక్కువ ధరకు నీటిని కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. పథకాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి మంచినీరు అందించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు. దీనిపై పురపాలిక అధికారి మాట్లాడుతూ యంత్రాలకు మరమ్మతులు చేయించి శుభ్రమైన నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ ఏఈ హరికృష్ణ తెలియజేశారు.

'జీవితానికి ఆధ్యాత్మికతే పరమావధి'

యాడికి, న్యూస్‌టుడే: మానవ జీవితానికి ఆధ్యాత్మికత పరమావధిగా ఉండాలని, ప్రతి ఒక్కరు భగవత్ చింతనలో కొనసాగాలని విద్యానృసింహభారతిస్వామి పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి ఆలయం ఎదుట గురువారం హిందు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ భారతమాత సంతానం అనే భావనతో ఉండాలన్నారు. దేవాలయాలను రక్షించుకోవాలని తెలిపారు.

తప్పిన ప్రమాదం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వడియంపేట గ్రామ శివారులో శుక్రవారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఖాదర్‌బాషా అనే చోదకుడు అనంతపురంలో బొలేరో వాహనంలో టమాటాలు తీసుకుని హైదరాబాద్ వెళ్తున్నాడు. వడియంపేట శివారుకు రాగానే జాతీయ రహదారిపై బొలేరో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. చోదకుడు ఖాదర్‌బాషా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

జూదరుల అరెస్టు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: తిమ్మాపురం గ్రామ శివారులో శుక్రవారం 17 మంది జూదరులను అరెస్టు చేసి రూ.36వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ ఎస్సై బాలముని తెలిపారు. సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. నగదు స్వాధీనం చేసుకుని, జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

'పౌరుషం గురించి మాట్లాడే హక్కు ప్రభాకర్‌రెడ్డికి లేదు'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పౌరుషం గురించి మాట్లాడే హక్కు జేసీ ప్రభాకర్‌రెడ్డికి లేదని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాంతం, తేదీ ఎప్పుడో ఆయన చెప్పాలని నా కుటుంబం, ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబం రావాలని అమాయకులు ఎవరూ అవసరం లేదని ధైర్యం ఉంటే రావాలని సవాల్ విసిరారు. సోమవారమే ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో మేం కొట్లాడుకుంటున్నామంటూ.. ఫిర్యాదు ఇచ్చుకోవచ్చన్నారు. ఆయన ప్రతిసారి మా కుటుంబం గురించి పౌరుషం లేదంటూ మాట్లాడుతుంటాడని నిజంగా పౌరుషం ఉంటే కొట్టుకోవడానికి రావొచ్చు అన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాయావతి 70వ జన్మదిన వేడుకలను స్థానిక బీఎస్పీ నాయకులు గురువారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి బహుజనుల బాగోగుల కోసం నిరంతరంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, శంకర్, శ్రీనివాసులు, వెంకట, ఓబులేసు, వన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సద్ద మొలక సంబరాలు

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు మకర సంక్రాంతి పండుగ సందర్భంగా సద్ద మొలక సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు శనగపప్పు, వేరుశనగ పప్పు, కొత్త బెల్లం, నువ్వులు, జీడిపప్పు, ద్రాక్షల మిశ్రమాన్ని పంచిపెట్టారు. ఈ సందర్భంగా భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం రోజు సద్ద మొలక సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తోందని తెలిపారు.

తాడిపత్రి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గుంతకల్లు: ఎడ్లబండిపై వెళ్తున్న అభయ విద్యానిధి సభ్యులు

సంబరంగా సంక్రాంతి పండుగ

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలోని అన్ని మండలాల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు, ఎండ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా ఓ చోట చేరి ఆనందంగా గడిపారు. లోగిళ్లు రంగురంగుల ముగ్గులతో ముస్తాబయ్యాయి. - న్యూస్‌టుడే బృందం

దిమ్మగుడిలో ఎడ్లపోటీలు

బుక్కరాయసముద్రం: పీఏ.కాలనీలో ముగ్గుల పోటీలు

ఆర్టీసీ బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి శివారులోని అనంతపురం రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పెద్దవడుగూరుకు చెందిన వెంకట్రాముడు, మల్లికార్జున ద్విచక్ర వాహనంలో గుత్తికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వారు గాయపడగా స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని మర్తాడుకు చెందిన శరణ్ అనే యువకుడు గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. వ్యవసాయ పొలంలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు 108వాహనంలో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిధులులేక.. నిర్వహణ చేపట్టక

పల్లె దారులు అధ్వానం.. రాకపోకలకు తప్పని ఇబ్బందులు

అబ్బేదొడ్డి- మాముడూరు రోడ్డు దుస్థితి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లకు పదేళ్ల నుంచి మరమ్మతులులేవు. దీంతో ప్రజలు శిథిలావస్థలోని రోడ్లపై ప్రయాణించేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామీణ రహదారుల నిర్వహణకు గతంలో ఆర్‌ఆర్‌ఎం గ్రాంటు ఏటా వచ్చేది. పదేళ్ల నుంచి రావడంలేదు. దీంతో గ్రామీణ రోడ్లు నిర్వహణలేక గుంతలమయమయ్యాయి. పల్లెలకు ఆర్టీసీ బస్సులు కూడా నడవడం లేదు. జిల్లా మినరల్ ఫండ్(డీఎంఎఫ్) కింద రూ. 6.50కోట్లతో పంచాయతీరాజ్ ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు లేక ఇంజినీర్లు మరమ్మతులు చేయలేకపోతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు పలు ప్రగతిపనుల భూమిపూజలు, శంకుస్థాపనలకు వస్తుంటారు. అయినా రోడ్ల బాగుపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఎన్టీపీసీ(పాత హైవే) నుంచి ధర్మాపురం వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ. కోటితో ప్రతిపాదనలు పంపారు. అలాగే జక్కలచెరువు- గొందిపల్లి, ఎన్‌హెచ్-44 నుంచి మాముడూరు, నాగసముద్రం రోడ్డు నుంచి పూలకుంట రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు ఇంకా విడుదల కాలేదు. గ్రామీణ రహదారులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ప్రజలు ఆశలుపెట్టుకున్నారు. ఈ విషయమై మండల ఇంజినీర్ మల్లేశ్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే రోడ్ల మరమ్మతులు వెంటనే చేస్తామన్నారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

పశువైద్యశాలలకు సెలవుల్లేవా!

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : సాధారణంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంక్రాంతి సెలవులిచ్చారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంతోపాటు డివిజన్ కార్యాలయాలకు కూడా సెలవులిచ్చారు. పశువులు, జీవాలు అత్యవసరంగా వ్యాధిబారిన పడితే తక్షణమే చికిత్స అందించాలనే ఉద్దేశంతో పశువైద్యశాలలు, నియోజకవర్గ ల్యాబ్‌లు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు సెలవుల్లేవు. అవన్నీ యథాతథంగా పనిచేశాయి. పండుగలు, పబ్బాలన్నది లేకుండా అధికారులు, ఉద్యోగులంతా 365 రోజులు పనిచేయాల్సిందే. పశువైద్యశాలలు, ల్యాబ్‌లు మూసేయడానికి వీల్లేదని, ఏడాదికి 35 రోజులు సెలవులు ఇచ్చినా.. నెలలో మూడు చొప్పున ఒక్కొక్కరు ఒకసారి సెలవులు తీసుకోవాల్సి ఉంటుందని ల్యాబ్, పశువైద్యశాలల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది వాపోయారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శ్రీనివాస్‌నగర్ : 8008573000
మూడోరోడ్డు: 8008573002
ఆజాద్‌నగర్: 9652620265

సమస్య: కోవూరు నగర్ సెల్ టవర్ సమీపంలో పైపు లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. - **నాగరాజు**

సమాధానం: వెంటనే లీకేజీ అరికడతాం.

సమస్య: సూర్యనగర్ రోడ్డు స్టార్ డయాగ్నోస్టిక్ ముందు రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా ఉంది. - **ఎంఎల్ఎన్.సాయి ప్రసాద్**

సమాధానం: త్వరలోనే రోడ్లు మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్ హుస్సేన్ సమాధానాలు ఇచ్చారు.)

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్

సమస్య: ప్రస్తుతం చలికాలమైనందున ఉదయం ఏడు గంటల వరకు చీకటిగా ఉంటోంది. వీధి దీపాలు ఆరు గంటలకే తీసివేస్తున్నారు. ఇంటి ముందు కల్లాపి చల్లి ముగ్గులు వేసేందుకు ఇబ్బంది పడుతున్నాం.

- భారతి, హౌసింగ్‌బోర్డు అనంతపురం

సమాధానం: పరిస్థితిని గమనించి ఆ దిశగా చర్యలు తీసుకుంటాం

- ఈఈ షాకీర్ నగరపాలిక, - న్యూస్‌టుడే, శారదానగర్

నగరంలో నేడు..

కమలానగర్: నేడు ఏ-7 కన్వెన్షన్ హాలులో వైకాపా అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి గ్రామసచివాలయ స్థాయి కమిటీల సంస్థాగత నిర్మాణ సమావేశం.

● అనంత నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరుల భూ కబ్జాలు, బెదిరింపులు, అరాచకాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద నేడు సీపీఎం నాయకుల నిరసన కార్యక్రమం.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అనంత సాంస్కృతికం: స్థానిక బెంగళూరు రోడ్డులో నెలకొన్న శ్రీశివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలోని శ్రీఅనంతేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17న స్వామివారికి పంచామృత సహిత నవ ధాన్యాభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. మాసశివరాత్రి పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం శనివారం సాయంత్రం 5.30కు ప్రారంభమవుతుందన్నారు. సమాచారానికి 88975 22053, 98493 22690 చరవాణి నంబర్లకు ఫోను చేసి తెలుసుకోవచ్చు.

పౌరాణిక నాట్య ప్రదర్శనలు

అనంత సాంస్కృతికం: నగరంలోని లలిత కళాపరిషత్‌లో ఈనెల 17న రెండు పౌరాణిక నాటకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. దివంగత కళాకారుడు కూరగాయల వర్ధంతి సందర్భంగా శనివారం సాయంత్రం లలిత కళాపరిషత్ కళాకారులతో నిర్వహించే ఈ కార్యక్రమంలో 'పాండు సీనుల'లో శ్రీకృష్ణుడుగా డీఆర్వో మాలోల, అర్జునుడుగా సంజీవరెడ్డి, దుర్యోధనుడుగా మైదుకూరు మున్సిపల్ కమిషనర్ నటిస్తున్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గౌరి : రాజా సాబ్, గాయత్రి, తేజశ్విని, నీలిమ : అనగనగా ఒక రాజు, శాంతి, సుధా, త్రివేణి : మన శంకర వరప్రసాద్, ఎస్వీ సినిమా : భర్త మహాశయులకు విజ్ఞప్తి, తరంగిణి, గౌతమి : నారీ నారీ నడుమ మురారి.

హౌసింగ్‌బోర్డు కాలనీ రాంనరేష్ ఫంక్షన్ హాలు నుంచి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లే దారిలో ఇలా డివైడర్ల మధ్యలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ మొక్కలు నాటిన వాటి సంరక్షణ మరువటంతో ఎండిపోయాయి. ఈ ప్రాంతంలో జన సంచారం అధికంగా ఉంటుంది. మొక్కలు నాటితే పచ్చదనంతో ఆహ్లాదంగా ఉంటుంది.

శారదానగర్ శ్మశాన వాటిక నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్లే దారిలో ఇలా డివైడర్ల మోడువారి పోయాయి. మొక్కలు లేక చెత్తతో నిండుతోంది. గతంలో పచ్చదనంతో ఆహ్లాదాన్ని నింపిన దారులు ఇలా ఉన్నాయి.

డివైడర్లపై పచ్చదనమేదీ?

కమలానగర్, న్యూస్‌టుడే : అనంత నగరంలోని రోడ్ల మధ్యలో ఉన్న డివైడర్లపై పచ్చదనం కనుమరుగవుతోంది. గత వైకాపా ప్రభుత్వం లక్షలు వెచ్చించి మొక్కలు నాటారు. వాటి సంరక్షణ మరవటంతో అవి ఎక్కడికక్కడ ఎండిపోయాయి. అప్పట్లో బిల్లుల కోసం తూతూ మంత్రంగా మొక్కలు నాటారని అనేక రకాలుగా అప్పటి ప్రతిపక్షాల నాయకుల నుంచి ఆరోపణలు వచ్చాయి.

● ఇటీవల కాలంలో రోడ్ల మధ్యలో పచ్చదనం కోసం ప్రభుత్వ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. నెలలో ఒక రోజు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌తో పాటు మొక్కలు నాటుతుండటం, ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

● నగరంలోని డివైడర్ల మధ్యలో మొక్కలు లేక చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఆహ్లాదంగా కనిపించే దారులు మోడువారిపోతున్నాయి. రోడ్డు మొక్కలు ఉండటంతో వాహనదారుల రాకపోకల సమయంలో కాస్త ఆహ్లాదాన్ని పంచేవి. ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, పాతూరు ప్రాంతాల్లో కొంతమేర మొక్కలు ఉన్నాయి. మరి కొన్ని ప్రాంతాల్లో ఉన్న డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దానం

కొత్తూరు అమ్మవారు శాలలో...

అనంత సాంస్కృతికం: సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే వేళ నగరంలో పలు ఆలయాల్లో సామూహిక కూష్మాండ దాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పాతూరు, కొత్తూరు వాసవీ మాత ఆలయాలు, అశోక్‌నగర్ హరిహర దేవాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. పితృదేవతలకు నువ్వులతో తిలతర్పణం చేయించి గోత్ర నామాలు పలికించారు. సూర్య భగవానుడికి ప్రీతికరమైన గుమ్మడిని వేదపండితులకు కూష్మాండ దానం చేయించారు. పాతూరు వాసవీ ఆలయంలో అప్పయ్య స్వామికి, కొత్తూరు అమ్మవారుశాలలో కుమారస్వామికి, హరిహర దేవాలయంలో మధుసూదన శర్మకు కూష్మాండ దానం చేశారు.

సంఘ సంస్కర్త కవిరాజు

కవిరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ రామ్మోహన్, ఏఓ అలెగ్జాండర్, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కవిరాజుగా ప్రసిద్ధి చెందిన త్రిపురనేని రామస్వామి చౌదరి సామాజిక న్యాయం, కులమతాల వ్యవస్థల నిర్మూలన కోసం అహర్నిశలు పోరాటాలు సాగించిన గొప్ప సంఘ సంస్కర్త.. అని ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఆ తర్వాత ఆయన జీవిత చరిత్ర గురించి ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ తెలిపారు. 1887 జనవరి 15న కృష్ణా జిల్లా అంగలూరులో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుంచే సాహితీ జిజ్ఞాసతో పెరిగారు. 23 ఏళ్లకే మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణత పొందారు. న్యాయవాదిగా, ప్రముఖ హేతువాద రచయితగా పేరుగాంచారన్నారు. ఆ కాలంలో రాజకీయాల్లో రాణిస్తూ కుల, మతాల వ్యవస్థలపై వేళ్లూనుకున్న మూఢనమ్మకాలు.. వంటిని ఎదిరించి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఇన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంబరం అదరహో

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలు రెండు రోజుల పాటు శిల్పారామంలో కన్నుల పండువగా జరిగాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు కలిసి గాలిపటాలు ఎగురవేశారు. శిల్పారామం ఆవరణం మొత్తం గాలిపటాల సందడి కనిపించింది. సాయంత్రం ఆర్య, ఆది డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చక్కటి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. జానపద నృత్యాలు గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించాయి. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డ్యాన్స్ మాస్టర్ ఆది, షణ్ముఖ, ప్రేమసాహితి, కార్తీక, సంహిత, హితేష్‌రెడ్డి, మమత, భారతి, లోకేష్‌లు అనేక సినిమా పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేశారు. రాను ముంబయికి రాను అనే పాటకు అద్భుతమైన నృత్యంతో ఆకట్టుకున్నారు. అల్లరి అల్లరి చూపులతో అనే పాటకు చక్కటి నృత్యాలు చేశారు. రెండురోజుల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయాల్లో సంక్రాంతి సందడి

బుడ్డప్పనగర్‌లో కనకదుర్గమ్మ తల్లి

రాంనగర్‌లో వెంకటేశ్వర స్వామి

అనంత సాంస్కృతికం: నగరంలో గురువారం మకర సంక్రాంతి పర్వదినం సందడిగా జరిగింది. ప్రతి వీధిలో ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. వారి ఇష్టానుసారంగా వేసిన ముగ్గులు సృజనాత్మకతకు ప్రతీకలుగా నిలిచాయి. దేవాలయాల్లో తెల్లవారు జామునే పంచామృతాభిషేకాలు నిర్వహించి మకర సంక్రమణ పూజలు చేశారు. గంగిరెద్దుల మేళం లలిత కళాపరిషత్ కళాకారుడు వరప్రసాద్ బృందం నగరంలో పలు వీధుల్లో ఆకట్టుకున్నారు.

గంగిరెద్దులతో వరప్రసాద్ బృందం

ఆకట్టుకున్న రంగవల్లి

ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేయిస్తున్న తెదేపా నాయకులు

ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహణకు ఏర్పాట్లు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈనెల 18న తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమానికి అనంతపురం అర్బన్ తెదేపా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేయించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్యచౌదరి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, నగరాధ్యక్షుడు సుధాకర్ యాదవ్, కలిసి వర్ధంతి ఏర్పాట్ల ముమ్మరం చేశారు. వర్ధంతి వేడుకలకు నగరంలోని 50 డివిజన్లతో పాటు నాలుగు పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. విగ్రహం చుట్టూ పూలతో అలంకరించి, ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ నాయకులను ఆదేశించారు.

ఆత్మకూరులో బండలాగుడు పోటీలు

బండను లాగుతున్న యువకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బండ లాగుడు పోటీలు అనగానే అందరికి ఒంగోలు గిత్తలు, పెద్దపెద్ద వృషభాలు ఉంటాయి. అందుకు భిన్నంగా ఆత్మకూరులో యువకులతో బండ లాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. తొలిసారి ఈ పోటీలను ఏర్పాటు చేసినప్పటికి 8 బృందాలు పాల్గొనేందుకు హాజరయ్యారు. ఆత్మకూరుతోపాటు కనగానపల్లి, కూడేరు మండలానికి చెందిన 4 జట్లు హాజరయ్యాయి. వినూత్నంగా నిర్వహించిన ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.

శాస్త్రోక్తంగా గోపూజ..

పంపనూరులో గోపూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కనుమ పండుగను పురస్కరించుకొని మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గోపూజ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఏటా ఆలయంలో గోపూజను నిర్వహిస్తున్నట్లు ఈవో బాబు తెలిపారు. గోశాలలో ఉన్న గోవులకు ప్రత్యేకంగా పసుపు, కుంకుమ, పూలతో పూజలు చేసి పూజ చేసిన ఆవుకి చీరను సమర్పించారు. గోపూజకు వచ్చిన మహిళలందరికి పసుపు, కుంకుమ, గాజులు కానుకగా ఇచ్చారు. గోపూజతో సకల దేవతలకి పూజ చేసినట్టుగా ఉంటుందని ఆలయ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

దండుపాళ్యం బ్యాచ్‌లా దందాలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో దండుపాళ్యం బ్యాచ్‌లా దందాలు సాగుతున్నాయని ఆ బ్యాచ్‌కు ఎమ్మెల్యే నాయకుడుగా ఉన్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు **అనంత వెంకట్రామిరెడ్డి** విమర్శించారు. శుక్రవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు, నారా లోకేశ్ ఆశీస్సులతోనే అరాచకాలు సాగుతున్నాయన్నారు. ఖాళీ జాగా కన్పిస్తే గద్దల్లా వాలిపోతున్నారన్నారు. అనుకూలమైన పోలీసులను నియమించుకొని బెదిరింపులు చేస్తున్నారన్నారు. తెదేపా వాళ్ల ప్రాణాలకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారుల ఉదాసీనత వల్లే నగరంలో అరాచకాలు జరుగుతున్నాయన్నారు. ముఠా నాయకుల పేర్లను లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న, ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఫకృద్దీన్, మద్యం షాపు యజమాని పేర్లు చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున రెండు ఇసుక టిప్పర్లను జప్తు చేసినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా అనంతపురం వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని భూగర్భగనులశాఖ అధికారులకు అప్పజెప్పనున్నట్లు సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

ఆరుగురికి సంక్రాంతి పురస్కారాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసి కర్షక బాంధవుడిగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి నిలిచారని అనకాపల్లి జిల్లా తెదేపా, భాజపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పేర్కొన్నారు. సమాజానికి పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ఆరుగురు సేవకులకు సంక్రాంతి సందర్భంగా డాక్టర్ కొణతాల రామలింగస్వామి పేరిట అనకాపల్లిలో గురువారం పురస్కారాలు అందజేశారు. గణిత అష్టావధాని తోటకూర సాయిరామకృష్ణ (సామర్లకోట), ఉత్తమ సంఘం సేవకులు చందన వెంకట గంగాధరరావు (పశ్చిమ గోదావరి జిల్లా), 82 సార్లు రక్తదానం చేసిన ఎర్రగుంట కృష్ణారెడ్డి (అనంతపురం జిల్లా) జనరేషన్ యువ సంస్థ బోయిన నరేష్‌కుమార్ (విశాఖపట్నం), సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా అవయవదానం, అంతిమయాత్ర ఉచితంగా వాహనాలు నడుపుతున్న దాడి శ్రీను (పెందుర్తి), చదువుకు పేదరికం కారణం కాదని ఇటీవల నిరూపించి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న రుత్తల లీలాశ్రావణి (తూర్పుగోదావరి జిల్లా)కి పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ఘనంగా కనకదాస జయంతి

ఆత్మకూరు: మండలంలోని పి.సిద్దరాంపురంలో గురువారం కనకదాస జయంతిని సందడిగా నిర్వహించారు. గ్రామంలో కురబ యువకులు, యువతులు జ్యోతులు, బోనాలతో ఊరేగింపు చేశారు. కురబల ఆరాధ్య దైవమైన కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. కురబలు రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఒకరికొకరు సాయం చేసుకోవాలని చెప్పారు.

సీఎంకు ఏపీఎన్జీజీవోస్ నాయకుల కృతజ్ఞతలు

రుద్రంపేట: గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు రూ.30 వేల కోట్లు పెండింగ్‌లో ఉంటే అధికారం చేపట్టిన 18 నెలల్లో రూ.13,000 కోట్ల రూపాయలు చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఏపీ ఎన్జీజీవోస్ జిల్లా అధ్యక్షుడు జక్కుల మాధవ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్ సంక్రాంతి పండగ ముందు రోజు రూ..1100 వందల కోట్ల రూపాయలు విడుదల చేసి.. ఉద్యోగుల కళ్లలో ఆనందం నింపిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. బకాయిల మొత్తాన్ని ఏపీ.ఎన్.జి.జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ నాయకత్వంలో సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

నిత్యం రద్దీ.. గుంతలతో ఇబ్బంది

పాతూరులోని గాంధీ విగ్రహం నుంచి తిలక్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ మార్గం నిత్యం రద్దీగా, ఇరుకుగా ఉంటుంది. వాహనదారులు, పాదచారులతో ఈ ప్రాంతమంతా హడావుడిగా ఉంటుంది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. జన సందోహం ఎక్కువగా ఉండే ఈ రోడ్డులో ప్యాచ్ వర్కులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే ఎస్కేయూ**

మలుపు తిరగాలంటే అవస్థలే..

అనంతనగరంలో గడియారపు స్తంభం నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే దారిలో పోలీస్ కాంప్లెక్స్ వాణిజ్య సముదాయం ఉంది. ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి కలిసేచోట మలుపులో ప్రయాణికులను ఎక్కించేందుకు ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారు. మలుపు తిప్పేందుకు వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసులు ఆటోలను ఆ మలుపు వద్ద నిలపవద్దని హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు

- ఈనాడు అనంతపురం

ప్రమాదానికి ఆస్కారం..

గడియారం స్తంభం పీటీసీ పైవంతెన పక్కన ప్రెస్‌క్లబ్ వద్ద పాడైన ఏసీ రిపేరు చేయడానికి మెకానిక్ ఇనుప ఊచలు తేలిన స్లాబ్‌పై నిల్చున్నాడు. ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా పని చేయడం ప్రమాదకరం. పొరపాటున ఆ ఇనుప చువ్వలు మధ్యలో కాలు ఇరుక్కుంటే ముందుకు పడి తీవ్ర గాయాల పాలయ్యే ఆస్కారం ఉంది. **- ఈనాడు అనంతపురం**

తీరని వ్యథ.. ఇంటి సామగ్రి వృథా!

ఆలమూరు లేఅవుట్‌లో వృథాగా పడివున్న సిమెంట్ ఇటుకలు

రుద్రంపేట, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం (మండలం) పరిధి ఆలమూరు పంచాయతీలో గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల లబ్ధిదారులకు వేదనగా మారాయి. ఇళ్లను నిర్మించేందుకు గత ప్రభుత్వం అక్కడున్న రైతుల భూములకు పరిహారం చెల్లించి కొనుగోలు చేసింది. స్థలాలు సరిపోవడం లేదని సమీపంగా ఉన్న ఎర్రకొండను తవ్వి చుట్టూ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అనంత నగరం, శివారు కాలనీలలో ఇళ్లు లేని లబ్ధిదారులకు సెంటు స్థలంలో ఇళ్లను నిర్మించి సొంతింటి కళ సాకారం చేస్తామని ఇచ్చిన హామీ గత ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయింది. ఇళ్ల నిర్మాణంలో వినియోగించే గుట్టలు గుట్టలుగా సిమెంట్ ఇటుకలు, ఇనుప కడ్డీలు, తాగునీటి ట్యాంకులు అసంపూర్తిగా వదిలేయడంతో రూ.కోట్ల రూపాయుల ప్రజా ధనం వృథాగా మిగిలి వినియోగానికి పనికి రాకుండా లేఅవుట్ కాలనీలోనే పడేశారు. సిమెంట్ ఇటుకలు తయారీకి పెద్ద ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ.కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేశారు. స్థానికంగా సిమెంట్ ఇటుకలు తయారు చేసే యంత్రాలు సైతం తుప్పు పట్టిపోతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రారంభానికి నోచుకోకనే ఇళ్లు, తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆరువేలకు పైగా ఇళ్ల నిర్మాణం పనులు గత ప్రభుత్వం ప్రారంభిస్తే నేటికి 50 శాతం ఇళ్లు పునాదులుకే పరిమితమయ్యాయి. అధికారులు అప్రమత్తం కాకోపోతే రూ.కోట్లు రూపాయలు ప్రభుత్వ ధనం వృథా అయ్యే ఆస్కారం ఉంది.

ఉపరితల వంతెన కింద పార్కింగ్ స్థలం కేటాయించాలి

పోలీసులతో మాట్లాడుతున్న షకీల్ షఫీ

అనంత నగరపాలక: నగరంలోని మొదటి, రెండు, మూడో రోడ్డుకు అనుసంధానంగా ఉపరితల వంతెన కింద పార్కింగ్ స్థలం కేటాయించాలంటూ ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ ఆధ్వర్యంలో కోరారు. శుక్రవారం నమాజ్ సందర్భంగా స్థలం లేకపోవడంతో రోడ్డు మీద వాహనాలు ఉంచాల్సి ఉండటంతో ఇబ్బందిగా మారిందని అక్కడ ఖాళీ ప్రదేశం ఉండటంతో అక్కడ వాహనాలు ఉంచడానికి అవకాశం కల్పించాలని కోరారు. కట్టెలు నాటడానికి వెళుతుండగా పోలీసులు, నగరపాలక పట్టణ ప్రణాళిక అధికారులు అక్కడకు చేరుకున్నారు. అధికారికంగా అక్కడ కేటాయించినట్లు ఉత్తర్వులు లేవని ఇప్పటికే కార్లు పార్కింగ్ చేసినట్లే వాహనాలు ఉంచుకోవచ్చని సమస్యను సద్దుమణిగే విధంగా సూచించారు. ఏఎస్పీ అశ్విన్ మణిదీప్, సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, పట్టణ ప్రణాళిక అధికారి మంజుల పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

రథంలో కొలువుదీరిన దేవతామూర్తులు

అనంత సాంస్కృతికం: నగరంలోని శివశక్తి దేవాలయంలో మకర సంక్రాంతి పురస్కరించుకుని దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సాయిట్రస్టు సహకారంతో రథోత్సవం వైభవంగా జరిగింది. నెల రోజులుగా సోమనాథ్ నగర ప్రాంతంలో నిత్యం నగర సంకీర్తన జరిగింది. సంకీర్తన ముగింపు దశలో జరిగిన రథోత్సవంలో వేంకటేశ్వరస్వామి, శివపార్వతులు, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయుడు, శిర్డీ సాయినాథుడి విగ్రహాలను రథంలో కొలువుదీర్చి ఉత్సవాన్ని జరిపారు. ఆలయ ధర్మకర్త శ్రీరాములు, దేవేంద్ర భజన బృందం నాగేశ్వరరావు, బ్రహ్మానందరెడ్డి, నాగరాజు, మాతృమండలి సభ్యులు, యువతీయువకులు పాల్గొన్నారు.

'పౌరుషం గురించి మాట్లాడే హక్కు ప్రభాకర్‌రెడ్డికి లేదు'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పౌరుషం గురించి మాట్లాడే హక్కు జేసీ ప్రభాకర్‌రెడ్డికి లేదని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాంతం, తేది ఎప్పుడో ఆయన చెప్పాలని నా కుటుంబం, ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబం రావాలని అమాయకులు ఎవరూ అవసరం లేదని ధైర్యం ఉంటే రావాలని సవాల్ విసిరారు. సోమవారమే ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో మేం కొట్లాడుకుంటున్నామంటూ.. ఫిర్యాదు ఇచ్చుకోవచ్చన్నారు. ఆయన ప్రతిసారి మా కుటుంబం గురించి పౌరుషం లేదంటూ మాట్లాడుతుంటాడని నిజంగా పౌరుషం ఉంటే కొట్టుకోవడానికి రావొచ్చు అన్నారు.

పాడి పశువుల బీమాకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం పశువైద్య ఏడీఏ కార్యాలయం పరిధిలో పాడిరైతులు ప్రభుత్వ పశుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ రత్నకుమార్ తెలిపారు. ఏడీఏ కార్యాలయం పరిధిలో బుక్కరాయసముద్రం, కొర్రపాడు, నార్పల, బి.పప్పూరు పశు వైద్యశాలలు ఉన్నాయన్నారు. పాడి రైతులు రూ.149 బీమా చెల్లిస్తే పశువు మరణిస్తే రూ.15 వేల పరిహారం, రూ.298 బీమా చెల్లిస్తే రూ.30 వేల పరిహారం వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU.
E.P.No.: 20/2017 in O.S.No: 460/2014

Between
Gutta Naresh, S/o G.Prabhakar, R/at. H.No.6-2-984, Ram Nagar, Ananthapuramu **...Petitioner/ D.Hr.**

V/s

1. S.Nagamani, W/o S.R.Venkateshan, 2. S.V.Sai Jyothi, D/o S.R. Venkateshan Both are R/at. H.No. 2-531, Modinabad, Guntakal (P&M), Anantapuramu. **...Respondents/ J.Drs**

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Dr'sకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచినవారు **06-02-2026**వ తేదీ ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

Property situated at Rachanapalli village polam and panchayat area, within S.R.D. and R.D. of Anantapuramu. **Babu:** Govt.Dry, **Sy.No** 191-E, **A.C.** 5.00 Paiki **Plot No:** 94, **A.C.** 0.04, **Hectares:** 0.016.

Bounded By: East: Road, **West:** Plot No. 123, **South:** Plot No. 93, **North:** Road. **Measuring: East -West:** 43.6 feet or 13.29 meters. **North-South:** 41 feet or 12.50 meters.

D.Hr Value Rs: 15,00,000/-
అమీన వాల్యు రూ. 10,00,000/-
Market Value: Rs: 9,90,800/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

B.Vijaya Kumar, Advocate, Ananthapuramu. Cell: 9440286003.

సర్వేజనా.. దుఃఖినోభవంతు

సర్వేను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తున్న జిల్లా పర్యవేక్షణాధికారి లక్ష్మీపతి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (ఏకీకృత కుటుంబ నమోదు) నత్త నడకన సాగుతోంది. వివరాల నమోదులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వైకాపా హయాంలో కుటుంబ గణన (హౌస్ హోల్డ్ సర్వే) మ్యాపింగ్ చేశారు. ఇది కూడా తూతూ మంత్రంగా మమ అనిపించారు. గ్రామ, వార్డు వాలంటీర్లతో గతంలో నామమాత్రంగా నిర్వహించారు. వీటిలో తప్పిదాలు చోటుచేసుకున్నాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ఏకీకృత కుటుంబ సర్వే చేపట్టింది.

ఏమేం చేస్తారంటే..

ఏకీకృత కుటుంబ సర్వేకు సంబంధించి యూఎఫ్ఎస్ యాప్‌ను రూపొందించారు. పురపాలక, మండలాల పరిధిలోని స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబంలోని సభ్యులందరి వివరాలపై సమగ్ర సమాచారం తీసుకుని యాప్‌లో నమోదుచేస్తారు.

జిల్లాలో మండలాలు : 25
గ్రామాలు : 411
సచివాలయాలు : 430
ఉద్యోగులు : 3,542 మంది
కుటుంబాలు : 4,61,753
సర్వే పూర్తయినవి : 37,480

ఆలస్యంగా మొదలు

ప్రభుత్వం సూచించిన ఈ యూఎఫ్ఎస్ యాప్‌లో తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. యాప్ వర్షన్ 1.0 నుంచి 1.7కు నవీకరించారు. స్వామిత్ర, రీసర్వే, ఈ పంట నమోదు తదితర కార్యక్రమాలతో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఏలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు వెళ్లలేకున్నారు. వివరాలు నమోదు చేసిన తర్వాత వేలిముద్ర, చరవాణిలో వచ్చే ఓటీపీలు, ముఖ ఆధారిత గుర్తింపులో ఏదో ఒక సమాచారాన్ని ధ్రువీకరించాలి. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలున్నాయి. మరి కొందరికి వేలిముద్రలు సక్రమంగా పడకపోవడం సర్వే ఆలస్యానికి కారణంగా నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా సర్వేను త్వరగా పూర్తి చేస్తామని వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా పర్యవేక్షణాధికారి లక్ష్మీపతి చెప్పారు. సర్వేకు సహకరించాలని కోరారు.

లేచి చూడు బిడ్డో.. సర్కారు దగాఖానాను

ఆసుపత్రికి వచ్చే రోగుల్లో చేతకాని, నడవలేని వారిని చక్రాల కుర్చీల్లో ఆయా విభాగాలకు తీసుకెళ్లాల్సిన ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు మదనపల్లె దవాఖానాలో కన్పించడం లేదు. ఆసుపత్రిలో పదుల సంఖ్యలో వీరున్నా నిస్సహాయులైన రోగులను పట్టించుకోవడం లేదు. అత్యవసరమై ఎవరైనా రోగులను ఆసుపత్రికి తీసుకొస్తే కుటుంబ సభ్యులే నానా అవస్థలు పడి కిందకు దించుకుంటున్నారు. చక్రాల కుర్చీలు ఎక్కడున్నాయో వెతుక్కుని తెచ్చి వారిని దించుకోవాల్సిన పరిస్థితి. శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలుడిని ఆసుపత్రిలోకి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు ముప్పుతిప్పలు పడ్డారు. ఆ సమయంలో ఎంఎన్‌వోలున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి పరిస్థితిలో మార్పు తీసుకు రావాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం

వైకాపా నేతలకే పట్టాభిషేకం

■ ప్రభుత్వ ఉద్యోగులకూ ప్లాట్లు ■ లబ్ధిదారుల తిప్పలు దేవుడికెరుక

ములకలచెరువు, పీలేరు గ్రామీణ, మదనపల్లె గ్రామీణ, పెద్దమండ్యం, పీటీఎం, న్యూస్‌టుడే: నిరుపేదలకు దక్కాల్సిన ఇంటి పట్టాలు వైకాపా పెత్తందారులకు చిక్కాయి.. జగనన్న లేఅవుట్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి నాయకులు, కార్యకర్తలే 'పట్టా'భిషేకం చేసుకున్నారు. నోరెత్తకుండా కొందరు అధికారులకు, అక్కడక్కడ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. భూకబ్జాలతో పాటు కాలనీల్లో ప్లాట్లు, ఖాళీ స్థలాలను ఆక్రమించి అమ్మేసుకున్నారు. పీలేరు లాంటి ప్రాంతాల్లో నేటికీ వారి చేతిలోనే పేదల పట్టాలుండడం గమనార్హం.

● జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లోని జగనన్న కాలనీల్లో వైకాపా నాయకులకే మెజార్టీ ఇళ్లు మంజూరు చేశారు. దీంతో అర్హులైన పేదలు సొంతింటి కలకు దూరమయ్యారు. ● గత ప్రభుత్వంలో మంజూరు కానీ ఇళ్లకు కూడా రంగులు వేసి కొత్త ఇళ్లుగా చూపించి బిల్లులు ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. లేఅవుట్లలో మంజూరైన ప్లాట్లను సైతం అమ్మకాలు జరిగాయి. అరకొరగా ఇళ్లు నిర్మించుకున్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

ఎక్కడెక్కడ ఎలా దోచారంటే..

● పెద్దమండ్యం మండలంలో గత ప్రభుత్వం 1,675 జగనన్న ఇళ్లు మంజూరు కాగా 1,404 సొంత జాగాలున్నట్లు అధికారికంగా దస్త్రాల్లో నమోదైంది. మిగిలిన 595 మందికి మండలంలోని పలు గ్రామాల్లో పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వంలో మంజూరు కానీ ఇళ్లకు కూడా బిల్లులు చేసుకుని తమ ఖాతాల్లో వేసుకున్నారు. ● 1404 ఇళ్లలో 935 మందికి పట్టాలు పంపిణీ చేయగా వీటిలో 271 మంది మాత్రమే అర్హులని తేల్చారు. దీనిని బట్టి అక్రమాలు ఎంత దారుణంగా జరిగాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో బిల్లు తీసుకొంటే మళ్లీ అధికారులు ఏ విధంగా పట్టాలు పంపిణీ చేశారనేది అధికారుల తీరుకు నిదర్శనం. ● పెద్దమండ్యం ఆదర్శ పాఠశాల వద్ద లేఅవుట్‌లో 109, మరోచోట 86 పట్టాలు మంజూరు చేశారు.

కంపచెట్ల మధ్య దర్శనమిస్తున్న పెద్దమండ్యం జగనన్న లేఅవుట్

అందులో 85 మంది మాత్రమే పక్కా గృహాలు నిర్మించుకోవడానికి అర్హులుగా అధికారులు తేల్చారు. 110 బోగస్ పత్రాలున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీరంతా వైకాపా సానుభూతిపరులు కావడం గమనార్హం. ● మదనపల్లె జగనన్న లేఅవుట్‌లో అనర్హులకు పట్టాలు మంజూరు చేయగా పలుచోట్ల అమ్మకాలు కూడా జోరుగా జరిగాయి. ● పీటీఎంలో అనర్హులైనా వైకాపా కార్యకర్తలకే ఇళ్లు కేటాయించడంతో నిర్మాణాలు పునాదేలకే పరిమితం అయ్యాయి. తప్పుడు ఆధార్ కార్డులతో బయటి రాష్ట్రాల్లో ఉన్న వారికి కూడా ఇళ్లు కేటాయించారు.

అమ్మకానికి ఇళ్లు

గత ప్రభుత్వ హయాంలో జిల్లావ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు జగనన్న లేఅవుట్లలో పట్టాలిచ్చారు. పీలేరు నియోజకవర్గంలో 87 లేఅవుట్లలో భారీగా అమ్మకాలు జరిగాయి. పట్టాలు పొంది ఇళ్ల నిర్మాణం సగం వరకు చేపట్టి వాటిని అమ్ముకున్నారు.

పల్లె వైభవం కనుమా!

సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పశువుల పండగగా ప్రసిద్ధి చెందింది. ఏడాది పొడవునా రైతులతో పాటు కష్టపడి, పంట ఇంటికి చేరడంలో కీలకపాత్ర పోషించే నేస్తాలకు కృతజ్ఞతగా ఈ పండగ జరుపుకొంటారు. రైతుల జీవితంలో పశుసంపదకు ఉన్న ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ గోపూజ చేస్తారు. జిల్లావ్యాప్తంగా

కనుమ వేడుకల్లో భాగంగా చిట్లా కుప్పలను వేశారు. రాయచోటి పట్టణంలోని కె.రామాపురంలో శుక్రవారం కనుమ వేడుకల్లో వేసిన చిట్లాకుప్పను చిత్రంలో చూడవచ్చు.

- న్యూస్‌టుడే, రాయచోటి, రాయచోటి గ్రామీణ

హాయ్.. అంటే అరచేతిలో ఎఫ్ఐఆర్

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత.. ఎఫ్ఐఆర్‌లో ఏయే అంశాలున్నాయో తెలుసుకోవడం ఇప్పటివరకు సామాన్యులకు కష్టమైనా పని.. కానీ ఇకపై వాట్సాప్‌లో ఎఫ్ఐఆర్ కాపీని సులభంగా పొందవచ్చు. సాధారణంగా పోలీసులు దీన్ని బయటకు ఇవ్వరు. డిజిటల్ పాలనలో భాగంగా ఇప్పుడు వాట్సాప్‌లో సులభంగా చూసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. - న్యూస్‌టుడే, కలకడ

ఎలా పొందాలంటే...

● ఫిర్యాదుదారులు తమ చరవాణి నుంచి 9552300009 మన మిత్ర నంబరుకు హాయ్ అని పంపాలి. అందులో పలు సేవలు కనిపిస్తాయి. పోలీసు విభాగం ఎంపిక చేసుకొని డౌన్‌లోడు ఎఫ్ఐఆర్‌ను ఎంచుకోవాలి. ● అందులో మన వివరాలు నమోదు చేయాలి. జిల్లా, పోలీసు స్టేషన్ (మనం ఎక్కువ ఫిర్యాదు చేశామో అది) ఎఫ్ఐఆర్ నంబరు (ఠాణాలో పోలీసులు చెబుతారు), సంవత్సరం వివరాలు ఇచ్చాక ఎఫ్ఐఆర్ కాపీ డౌన్‌లోడ్ అవుతుంది.

ఉపయోగం ఏమిటంటే...

ఫిర్యాదులో వివరాలు సరిగా నమోదు చేశారా! ఏ సెక్షన్ పెట్టారు. ఇతరులను చేర్చారా! నేర తీవ్రత తగ్గించడానికి సెక్షన్లను తారుమారు చేశారా! లాంటి ముఖ్యమైన వివరాలను తెలుసుకోవచ్చు.

సొంతగడ్డపై సంబరం.. సామాన్యులకు అభయం!

అధికారిక బాధ్యతల బరువు ఎంతున్నా.. సంక్రాంతి వేళ సొంతగడ్డ నారావారిపల్లెకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చివరి రోజు పర్యటన ఆత్మీయతల నడుమ గడిపారు. గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకుంటూ, పెద్దల సమాధుల వద్ద నివాళులర్పిస్తూ, తన కోసం వచ్చిన జనసేన స్తాల కష్టాలను వింటూ.. నేనున్నానంటూ అభయమిచ్చి తన పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. ఆ చిత్రాలే ఇవి. - న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ

నాటి చౌడపురి.. నేటి చౌడేపల్లె

శతబ్దాల క్రితం జమీందారుల సంస్థానమైన పుంగనూరుకు 16 కిలోమీటర్ల దూరంలో వ్యవసాయానికి పనికిరాని చౌడు భూమి ఉండేది. ప్రస్తుత తూర్పు బస్టాండు, మేదరదొడ్డి తిరుపతి రోడ్డును నాడు చౌడపురిగా పిలిచేవారు. చౌడు భూముల్లో పంట పొలాలు సాగు చేసి ఫలితాల కోసం చౌడేశ్వరీదేవిని కొలిచేవారు. గ్రామ దేవత చౌడేశ్వరీదేవి వెలసిన తరువాత చౌడపురి కాస్త చౌడేపల్లెగా ప్రసిద్ధిగాంచింది. 1675లో పట్టణంలో అభీష్ట మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాన్ని నాటి పుంగనూరు జమీందారు ఇమ్మడి చిక్కరాయలు నిర్మించడంతో ఈ ప్రాంతాన్ని చిక్కరాయపురంగా పిలిచేవారు. ఈ రెండూ కాలక్రమేణ కలిసిపోయి చౌడేపల్లెగా అభివృద్ధి చెందింది. - న్యూస్‌టుడే, చౌడేపల్లె

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వరుస సెలవులతో పెద్దఎత్తున భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రానికి భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి క్యూలైన్‌లో శిలాతోరణం వరకు వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. గురువారం శ్రీవారిని 64,064 మంది దర్శించుకున్నారు. రూ.3.80 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఆలయం ఎదుట సేద తీరుతున్న భక్తులు

ప్రకృతి సేద్యం.. వనితల సారథ్యం!

■ పురుషులకు దీటుగా.. సాగులో మేటిగా
■ ఆరోగ్యకర దిగుబడులతో విజయ బావుట

జిల్లాలో మహిళలు వ్యవసాయ రంగంలో పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. వినూత్న పద్ధతులతో పంటలు సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీలో రాణిస్తూ ఆరోగ్యకరమైన ఆహార పంటలు సాగు చేస్తున్నారు. సాగులో మెలకువలు నేర్చుకొని అధిక దిగుబడులు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి కృషికి మెచ్చి ఉత్తమ, ఆదర్శ రైతులుగా ప్రభుత్వం పురస్కారాలు అందజేసింది.

- న్యూస్‌టుడే, రాయచోటి, రామాపురం

ఏటీఎం సాగును వివరిస్తున్న మహిళ రైతు మాధవి

మూడెకరాల్లో ఏటీఎం సేద్యం

రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన మహిళా రైతు మాధవి మూడెకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. మామిడి తోటలో ఏటీఎం మోడల్‌లో వేరుసెనగ, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్ సాగు చేశారు. అలసంద, మొక్కజొన్న, బీర, సొర పండిస్తున్నారు. కుటుంబ అవసరాలతో పాటు స్థానిక సంతల్లో ప్రకృతి వ్యవసాయ స్టాల్స్‌కు తరలించి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. వచ్చే ఆదాయాన్ని అవసరాలకు వినియోగిస్తున్నారు.

అంతర పంటలతో ఆదాయం

వేరుసెనగలో అంతర పంటలు సాగు చేసిన ఈమె రామాపురం మండలం బండపల్లి గ్రామానికి చెందిన రెడ్డెమ్మ. గ్రామంలో ఉన్న తన రెండెకరాల పొలంలో రబీ కింద వేరుసెనగ పంట సాగు చేశారు. ఆ పంటలోనే అలసంద, అనప, పెసర్లు, ఆకు కూరలు, చుట్టూ కంచె పంటగా తీగ జాతి, జొన్న, మొక్కజొన్న సాగు చేశారు. మిశ్రమ పంటల సాగుపై గ్రామంలోని రైతులకు శిక్షణ ఇస్తున్నారు. రెండు, మూడు రకాల పంటలు సాగు చేయడం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటూ మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు.

పెరటి తోటల పెంపకంలో దిట్ట

ఆకుకూరలు, కూరగాయలు పండించడంలో రామాపురం మండలం గంగనేరుకు చెందిన మహిళా రైతు అనిత దిట్ట. ప్రకృతి వ్యవసాయ అధికారుల ద్వారా మెలకువలు నేర్చుకుని సిర్రాకు, చుక్కాకు, పాలాకు, బెండ, గోరు చిక్కుడు, బీర, వంగ, టమాట, మిరప పంటలు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ ఇచ్చిన సూచనలతో పశువుల ఎరువు, కషాయాలను పంటలపై పిచికారి చేస్తూ రసాయన రహిత దిగుబడులు సాధిస్తున్నారు. ఇతర రైతులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తున్న అనిత

వర్షాధారం.. ప్రత్యేకం

నీటి ఆధారం లేకపోయినా కేవలం వర్షాధారంగా దిగుబడినిచ్చే పంటలు సాగు చేస్తూ పాలన్నగారిపల్లెకు చెందిన మహిళా రైతు షమీరా ముందడుగు వేస్తున్నారు. కందిలో అనుసంధాన పంటగా అనప, అలసంద, పెసర, ఉద్ది, ఆముదం వంటి పంటలను 1.50 ఎకరాల్లో సాగు చేశారు. పొలం దగ్గరే ఘన జీవామృతం తయారు చేసి దుక్కిలో వేసి పంట సాగు చేశారు. 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతం పంటపై పిచికారి చేస్తున్నారు. ఆరోగ్యకర ఉత్పత్తులను రాయచోటి-కడప ప్రధాన మార్గంలో విక్రయిస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. ఆదాయాన్ని కుటుంబ పోషణ, పిల్లల చదువులకు వినియోగిస్తున్నట్లు చెప్పారు.

కషాయం తయారు చేస్తున్న షమీరా

ఇంధన పొదుపు.. భద్రతలో గెలుపు

అందరికీ ఆదర్శం ఈ ఆర్టీసీ డ్రైవర్లు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పంచ సూత్రాలను పాటిస్తే ఇంధన పొదుపుతో సహా ప్రమాదాల్లేకుండా బస్సులు నడపవచ్చని ఆర్టీసీ పేర్కొంటోంది. 50 ఏళ్లుగా రాష్ట్రంలో ప్రమాదాలు తగ్గి, దేశంలోనే ప్రయాణికులకు భద్రత కల్పించే సంస్థగా ఆర్టీసీ సంస్థ కేంద్ర ప్రభుత్వం నుంచి పలు మార్లు పురస్కారాలు అందుకుంది. రోడ్డు నిబంధనలను పాటించడంతో పాటు ఇంధన పొదుపు, భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రమాదాలను నివారిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. దీనికి కారణం డ్రైవర్లే. మదనపల్లె డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు జిల్లాలో ఉత్తమ చోదకులుగా ఎంపికయ్యారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా వారేమంటున్నారో వారి మాటల్లోనే..

పంచ సూత్రాలే మార్గాలు

వాహన వేగాన్ని నియంత్రణలో ఉంచితేనే ఇంధన పొదుపు సాధ్యమవుతుంది. వేగం తగ్గితే ప్రమాదాల్లేకుండా వాహనాలను నడపవచ్చు. దూరం నుంచే రోడ్డు పరిస్థితిని గమనించి, ఎక్సలేటర్, క్లచ్‌పై కాలు తీసేసి, బ్రేకుపై కాలు పెట్టడంతో సహా కంటి చూపుతో ప్రమాదాలను నివారించవచ్చు. పంచ సూత్రాలను పాటించడం ద్వారా నెలలో 106 లీటర్ల డీజిల్ పొదుపు చేసి, సంస్థకు రూ.9,870ను ఆదా చేశాను. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ఇంధన పొదుపునకు చోదకంగా పనిచేస్తుంది. - బీఎస్.మణ్యం, ఉత్తమ డ్రైవర్

మూలాలు తెలుసుకుంటే సాధ్యం

పంచ సూత్రాలు పాటించడంతో పాటు నిబంధనల ప్రకారం వాహనాన్ని నడిపితే, ప్రమాదం లేకుండా క్షేమంగా గమ్యస్థానాన్ని చేరగలం. ఈ క్రమంలో 88 లీటర్ల డీజిల్‌ను పొదుపు చేసి సుమారు రూ.8,194 నెలలో సంస్థకు ఆదాయం సమకూర్చాను. ఆరోగ్యం పట్ల సంస్థ ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవడం వల్ల నేను ఆరోగ్యంగా ఉండడంతో పాటు బస్సు కండిషన్‌ను చక్కగా చూసుకుంటూ 30 ఏళ్లుగా ఎలాంటి ప్రమాదాలు చేయకుండా బాధ్యతగా బస్సు నడపగలిగా.

- ఆర్.సాబ్‌జాన్, ఉత్తమ డ్రైవరు

దళిత మహిళలకు రాయితీ రుణాలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాకు ఎస్సీ మహిళలకు వడ్డీలేని రుణాలను అందించేందుకు పీఎం అజయ్ పథకం కింద 120 యూనిట్లు మంజూరైనట్లు డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలకు ప్రధాన మంత్రి అనుసూచిత జాతీయ అభ్యుదయ యోజన పథకం కింద ఈ రుణాలు మంజూరు చేస్తూ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఉత్తర్వులు జారీచేశారని చెప్పారు. 20-35 సంవత్సరాల్లోపు మహిళా సమాఖ్య సభ్యులకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇందులో రూ.50 వేల రాయితీ లభిస్తుందన్నారు. రవాణా విభాగంలో ఆటోలు కూడా తీసుకోవచ్చన్నారు. వ్యవసాయ విభాగంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల తయారీ, ఎన్‌పీఎం పసుపు, మిరప పొడుల దుకాణాలకు సూక్ష్మ తరహా పరిశ్రమలైన బిస్కెట్లు, పేపర్ కప్పులు, అగరబత్తీల తయారీ, చేపలు, పాదరక్షలు, బేకరీ, శీతల పానియాలు, చీరలు, దుస్తులు, స్టేషనరీ దుకాణాలు, కేఫ్‌లు, వంట సామగ్రి, పప్పు వ్యాపారం, బ్యూటీపార్లల్, వంటి 60 రకాల యూనిట్లు ఏర్పాటుకు అవకాశాలున్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఆయా మండల మహిళా సమాఖ్యలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ కోరారు.

జిల్లాకు 120 పీఎం అజయ్ యూనిట్లు

గంగమ్మకు దండలు.. కరుణించమని దండాలు

శక్తి స్వరూపిణిగా పూజలందుకుంటున్న బోయకొండ గంగమ్మకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు 45 మంది దంపతులు సేవాకర్తలుగా పాల్గొన్నారు. ఆది పరాశక్తికి రాహుకాల సమయంలో చేసిన కుంకుమ, పసుపు, గంధం, పంచామృతాభిషేకాలు భక్తులకు కనువిందు చేశాయి. అభిషేకానంతరం జగజ్జననికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈవో ఏకాంబరం నిమ్మకాయలు, నెయ్యి దీపాలను వెలిగించి అభిషేక క్రతువును పూర్తి చేశారు. అమ్మవారి దివ్యరూప దర్శనానికి భక్తులు బారులు తీరారు. - న్యూస్‌టుడే, బోయకొండ (చౌడేపల్లె)

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

బోయకొండ గంగమ్మ

గురుకులం.. సమస్యల కలకలం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలు, ఆర్థిక స్తోమత లేక, ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేక గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందన్న ఆశతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గురుకులాల్లో మౌలిక వసతులు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్లు, స్నానపు గదుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పిల్లలు ఆరుబయటే చన్నీటి స్నానాలు చేస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. ఉన్నవాటితోనే సర్దుకొని చదువులు కొనసాగిస్తున్నారు. బాలికల గురుకులాల్లో సైతం ఇదే పరిస్థితి.

వెంటాడే అసౌకర్యాలిలా..

● జిల్లాలోని కంభంవారిపల్లె మండలం గ్యారంపల్లెలో బాలుర గురుకులం ఉంది. ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతుండగా ఎలాంటి సౌకర్యాలు లేవు. ఇటీవల 15 మరుగుదొడ్లు నిర్మించగా అవి ఏమాత్రం సరిపోవడం లేదు. భవన వసతిలేక అక్కడే చదువుకొని, అక్కడే నిద్రపోతున్నారు. రాత్రిళ్లు కష్టాలకు ఓర్చి నిద్రపోతున్నారు. ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. తరగతి గదులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. పెంకులు ఎక్కడ తలపై పడతాయోనని భయపడుతూ చదువుతున్నారు. భవనాలన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి.

గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో తలుపుల్లేని కిటికీలు

● వాల్మీకిపురం బాలికల గురుకులానికి ప్రహరీ లేకపోవడంతో రక్షణ కొరవడింది. ప్రహరీ పునాదులకే పరిమితమై, అర్ధాంతరంగా ఆగింది. అడ్డుగా ముళ్ల కంపలు వేశారు. గోడ లేకపోవడంతో ఆకతాయిలు పాఠశాలలోనికి ప్రవేశిస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. బాలికల రక్షణపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నీటి సమస్యతో బయట నుంచి ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు.

భవనం పైకప్పుపై ఊడిన పెంకులు

● బి.కొత్తకోట మండలంలో ఎస్సీ బాలుర గురుకులంలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుని చిన్న వర్షానికే ఉరుస్తోంది. వర్షాకాలంలో విద్యార్థుల ఇబ్బందులు వర్ణనాతీతం.

జిల్లాలో గురుకులాలు : 26 చదువుతున్న విద్యార్థులు : 5 వేలకుపైగా

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

హొసపేటెకు బస్సు ప్రారంభం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కర్ణాటకలోని హొసపేటెకు బళ్లారి మీదుగా నడిచే కొత్త బస్సు సర్వీసును స్థానిక రెండో డిపో మేనేజరు బి.అమరనాథ్ శుక్రవారం ప్రారంభించారు. రెండో డిపోకు చెందిన ఈ బస్సు రోజూ తిరుపతిలో సాయంత్రం 4.30గంటలకు బయలుదేరి మదనపల్లెకు 7.30 గంటలకు చేరుతుంది. అనంతరం ఇక్కడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బళ్లారి మీదుగా హొసపేటెకు చేరుతుందని వివరించారు. తిరిగి హొసపేటెలో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి మదనపల్లెకు అర్ధరాత్రి 1.30 గంటలకు, ఉదయం 4.30గంటలకు తిరుపతి చేరుతుందని తెలిపారు. కొత్త బస్సు సర్వీసు సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీఐ పి.ఎస్.మణ్యం, ఎం.సి.కుమారస్వామి, భద్రతాధికారి దామోదర్, ఎన్ఎంయూఏ నాయకులు మునికృష్ణ, వినోద్, బహుజన్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న 2వ డిపో మేనేజరు అమరనాథ్, సిబ్బంది

పండగ పూట తప్పని పస్తులు

❖ మొరాయించిన సీఎఫ్ఎంఎస్ ❖ పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు

పీలేరు, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు డిసెంబరు నెల వేతనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో సంక్రాంతి పండగకు పస్తులు ఉండి విధులు నిర్వహిస్తున్నారు.

● ఉదయం ఐదు గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద హాజరు వేసుకుని కార్మికులు విధులకు వెళ్తారు. తమకు నిర్ణయించిన వీధుల్లో చెత్తతో పాటు ఇళ్ల వద్ద చెత్తను ట్రాక్టర్లకు ఎత్తడం, మురుగు కాలువలు శుభ్రం చేస్తుంటారు. జిల్లాలోని 25 మండలాల్లో 1,400 మంది పారిశుద్ధ్య కార్మికులు ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.12 -15 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. గతంలో పంచాయతీ నేరుగా నగదుగా వేతనాలు చెల్లిస్తుండగా.. పంపిణీ పారదర్శకంగా ఉండాలన్న కార్మికుల డిమాండ్ మేరకు బ్యాంకు ఖాతాల నుంచి ఆన్‌లైన్‌లో వేతనాలు తీసుకుంటున్నారు.

● పంచాయతీకి వచ్చే అన్ని రకాల పన్నులు బ్యాంకులో జమ చేస్తారు. బ్యాంకు నుంచి వేతనాలు కార్మికుల బ్యాంకు ఖాతాలకు జమవుతాయి. అయితే రాష్ట్ర ఖజానా సెంట్రల్ ఫండ్స్ మెయింటెనింగ్ సిస్టమ్ (సీఎఫ్ఎంఎస్)కు పంచాయతీ కార్మికుల వేతనాలకు సంబంధించిన బిల్లులు సమర్పిస్తే పరిశీలించి వారి ఖాతాలకు జమ చేస్తారు.

● బిల్లులు గత నెల నిర్ణీత గడువు లోగా సమర్పించినా జనవరిలో తీసుకోవాల్సిన వేతనాలు ఇప్పటి వరకు అందలేదు. దీంతో పండగను అప్పులు చేసి జరుపుకొన్నారు. అధికారులను కలిసి తమ సమస్యను విన్నవించినా ఫలితం లేదని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

పీలేరులో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

జిల్లా మొత్తం కార్మికుల వేతనాల చెల్లింపులు ప్రభుత్వం ఆధీనంలోని సీఎఫ్ఎంఎస్ నుంచి రావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు మరోమారు కార్మికుల సమస్యను తెలియపరచి వేతనాల చెల్లింపు జరిగేలా చూస్తాం.

- రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి

వారంలోగా మామిడి బకాయిల చెల్లింపు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వారంలోగా తోతాపురి మామిడి బకాయిల మొత్తాన్ని రైతులకు చెల్లించేందుకు చర్యలు చేపట్టామని ఉద్యానశాఖ ఇన్‌ఛార్జి జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. 'మామిడి రైతుకు సంక్రాంతి కరవు' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రూ. 20 కోట్లు వారంలోగా చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారని, తదనుగుణంగా బకాయిలు చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారన్నారు. కొందరు రైతులు గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఖాతా నంబర్లు సమర్పించకపోవడంతో నిధుల జమ ఆలస్యమైందని, వివరాలు ఈ నెల 20లోగా అందజేయాలని కోరారు.

ఈనాడు కథనానికి స్పందన

గోసంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఎల్ఎస్‌నగర్ వద్ద ఉన్న తితిదే ఎస్వీ గోసంరక్షణ శాలలో కనుమ పండగను పురస్కరించుకుని గోపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఈవో అనిల్ కుమార్ సింఘాల్ దంపతులు వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గోవుపేడతో రూపొందించిన బొమ్మరిల్లు వద్ద కాటమరాజుకు పూజ, గౌరీపూజ, తులసిపూజ నిర్వహించారు. గజరాజు, అశ్వాలు, వృషభాలకు పూజ చేసి వాటికి దాణా తినిపించారు. తర్వాత గోమందిరంలో పుంగనూరు గోవుకు గోపూజ చేసి, కర్పూర హారతులు సమర్పించారు. తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గోసంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల గోసంరక్షణ కోసం జాతీయ సెమినార్ నిర్వహించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన దీనికి అంగీకరించారని, వందే గోమాతరం పేరుతో తితిదే సదస్సు నిర్వహించనుందని తెలిపారు.

గోవుకు అరటి పండు తినిపిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు

ఈసారి పుంగనూరు గోవుకు పూజ

ఏటా సాధారణ జాతి ఆవులకు గోపూజ నిర్వహించేవారు. ఈ సారి ప్రత్యేకంగా పుంగనూరు జాతికి చెందిన ఆవుకు ఈవో గోపూజ నిర్వహించారు. దాససాహిత్య, ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన భజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి నృత్యాలు, హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్వీ గోసంరక్షణ శాల సంచాలకులు శివకుమార్, గోశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కైలాసగిరి.. 'భక్తజన' ఝరి

కైలాసగిరి ప్రదక్షిణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని రాజగోపురం వద్ద ఉత్సవమూర్తుల శోభ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఓం నమఃశివాయ.. హరహర మహదేవ దివ్య నామస్మరణలతో కైలాసగిరులు పులకించిపోయాయి. తెలుగింటి పండగల్లో కనుమ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున శుక్రవారం నిర్వహించిన కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి భక్తులు ప్రవాహంలా తరలివచ్చారు. బ్రహ్మాండనాయకుడైన భవుని కల్యాణోత్సవానికి రావాలంటూ తన దేవేరితో కలసి కైలాసగిరుల్లో కొలువుదీరిన పరివార దేవతలు, మునులు, సాధువులు, రుషులను ఆహ్వానించడం ఈ విశేషోత్సవ పరమార్థం. స్వయంగా ఆదిదంపతులు పెళ్లి పిలుపులకు రావడంతో 24 కిలోమీటర్ల ప్రదక్షిణ మార్గం భక్తజన సంద్రంగా మారింది. కచ్చితమైన సమయపాలనతో ఉత్సవాన్ని ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పురవీధుల్లో సాగుతున్న ఊరేగింపు

పుంగమ్మ.. పుంగనూరు గంగమ్మ

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు పట్టణం పైభాగంలో నిర్మించిన చెరువు సాగు, తాగునీటికి ప్రధానమైంది. దీని కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన పుంగమ్మ చెరువుగా పేరొచ్చింది. వందల ఏళ్లనాడు పరశురామ క్షేత్రమైన పుంగనూరు ప్రాంతాన్ని పాలించిన ఏకిలదొర ఏడుగురు కుమార్తెల్లో పుంగమ్మ, రంగమ్మ, సుబ్బమ్మతో పాటు మరో నలుగురు ఉండేవారు. అతనికి పుత్రుడు లేకపోవడంతో పెద్ద కుమార్తె పుంగమ్మకు సకల విద్యలు నేర్పించి రాజ్య పాలకురాలిగా పట్టాభిషేకం చేయించారు. నాటి వరకు చిన్న కుంటగా ఉన్న ఈ చెరువు పునర్నిర్మాణ పనులను చోళ రాజు అనుమతితో పూర్తి చేశారు. కౌండిన్య నది నుంచి నీటిని మళ్లించడంతో పుష్కలంగా పంటలు పండటంతో రైతులు పొంగళ్లు పెట్టారు. అదే ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువు కట్ట తెగి పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిలో గంగాదేవి ఏకిల దొర కలలోకి వచ్చి తనకు తోడుగా 16 ఏళ్ల కన్యను పంపితే కట్ట నిలుపుతానని చెప్పింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, ఇతరులకు చెప్పలేక మదనపడ్డాడు. తండ్రి అంతర్మథనం అర్థం చేసుకున్న పుంగమ్మ వారిని ఓదార్చింది. చెరువులో నీళ్లు నిలిస్తేనే ప్రజలు సుఖసంతోషాలు, సిరిసంపదలతో ఉంటారని, దీని కోసం ఏ త్యాగానికైనా సిద్ధమేనని వెళ్లి కట్ట తెగిన చోట సజీవ సమాధి అయిందని చరిత్ర చెబుతోంది. దీన్ని చూసి ఆమె చెల్లెలు రంగమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. అదే ప్రాంతంలో నాడు నిర్మించిన ఆలయంలో పుంగమ్మ, రంగమ్మ విగ్రహాలను నెలకొల్పి ప్రజలు పూజలు చేస్తున్నారు. దశాబ్దం కిందట ఆలయాన్ని పునర్నిర్మించారు. వారిద్దరితో పాటు మరో చెల్లెలు సుబ్బమ్మ పేరుతో పట్టణ సమీపంలో చెరువులు ఉన్నాయి.

పుంగమ్మ, రంగమ్మ దేవతలు

పుంగమ్మ చెరువు

శ్రీవారి ఆలయంలో కాకబలి

తిరుమల: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా కనుమ పండగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే కాకబలి కార్యక్రమం శుక్రవారం వైదికోక్తంగా జరిగింది. అర్చకులు పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు.

● శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తితిదే మాజీ జేఈవో శ్రీనివాసరాజు, డ్రమ్స్ శివమణి, కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు.

13 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు శుక్రవారం 13 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి శనివారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు రెండు వేల టోకెన్లు జారీ చేశారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో భక్తుల తాకిడి విపరీతంగా కనిపించింది.

కట్ట దాటాలంటే.. కట్టెలే ఆధారం

పెద్దతిప్పసముద్రం మండలంలోని మద్దయ్యగారిపల్లి వద్ద పరిస్థితి ఇది. రైతులు పొలాలకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. వరదల కారణంగా హంద్రీ-నీవా కాలువ కొట్టుకుపోయింది. మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు వంతెన నిర్మించకుండా వదిలేశారు. దీంతో చేసేది లేక ఇలా కర్రలతో వంతెన ఏర్పాటు చేసుకున్నారు. పంటలు తీసుకురావాలంటే వాహనాలతో అదనంగా మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. కర్రలు విరిగినా, ఆ ప్రాంతంలో కాలు జారినా ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, ములకలచెరువు**

చురుగ్గా ఎక్స్‌ప్రెస్ వే పనులు

❖ ఆరు నెలల్లో వినియోగంలోకి వచ్చే అవకాశం ❖ ఎదురుచూస్తున్న మొగిలి ఘాట్ ప్రయాణికులు

పలమనేరు, న్యూస్‌టుడే: చెన్నై-బెంగళూరు నగరాలను కలుపుతూ అత్యంత వేగంగా ప్రయాణం చేయడానికి వీలుగా నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. తమిళనాడులోని శ్రీపెరంబదూరు నుంచి కర్ణాటకలోని హొసకోట వరకు 283 కి.మీ. దూరం ఈ రోడ్డు పనులు చేపడుతున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా చిత్తూరు-పలమనేరు మార్గంలోని మొగిలి ఘాట్‌లో ప్రయాణం చేసే వారు ఇంకా వేగంగా రోడ్డు పనులు పూర్తికావాలని కోరుకుంటున్నారు. కాగా ప్రస్తుతం మొగిలి ఘాట్ మలుపుల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల విభాగం ఏడాదికి రూ.50 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నా.. ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే తప్ప. . ప్రయోజనం లేదని సంబంధిత శాఖ అధికారులే చెబుతున్నారు.

మొగిలి ఘాట్ వద్ద ఎక్స్‌ప్రెస్ వే లింకు రోడ్డు నిర్మాణం

మూడు చోట్ల మినహా..

కొత్త మార్గంలో మూడు చోట్ల కనెక్టింగ్ పనులు చేపడుతున్నారు. బైరెడ్డిపల్లె, మొగిలి, చిత్తూరు సరిహద్దు వద్ద పనులు పూర్తి కావాల్సి ఉంది. మిగిలిన చోట్ల దాదాపు పనులు పూర్తయ్యాయి. మరో ఆరు నెలల వ్యవధిలో పనులన్నీ పూర్తయ్యే అవకాశముందని అంచనా. ప్రస్తుతం వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల నుంచి బెంగళూరు హొసకోట వరకు ప్రయాణం సాగిస్తున్నారు.

అంతమందిని ఎలా కుక్కావురా బుజ్జీ!

తిరుమల వ్యాన్‌లో 20 మంది తరలింపు

'అతడు' సినిమాలో మనుషులను వాహనంలో కుక్కినట్లు శుక్రవారం తిరుమలలోని తితిదే షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో ఓ ప్రైవేటు మినీ వ్యాన్ డ్రైవర్ వాహనంలో 20 మందిని ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణించాడు. చివరికి వ్యాను డోర్ కూడా వేయలేని పరిస్థితి. ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తులను తరలించేందుకు కొందరు ప్రైవేటు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

కలవని డివిజన్.. మారని మండలాలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏర్పాటై 15 రోజులు గడచినా, ఇంత వరకు విద్యుత్తు సంస్థకు చెందిన పుంగనూరు డివిజన్‌ను జిల్లాలో కలపకపోగా, సుండుపల్లె, వీరబల్లి మండలాలను సైతం రాజంపేటకు మార్చడంలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లెను కొత్త జిల్లాగా ప్రకటించగా, విద్యుత్తు సంస్థకు చెందిన సూపరింటెండెంట్ ఇంజినీరు మాత్రం విధుల్లో చేరారు. ఆయా మండలాలతో పాటు డివిజన్‌ను మార్చకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కారణంగా నిర్మాణ విభాగం సైతం డివిజన్‌లో పనులు చేపట్టేందుకు యాజమాన్యం ఆదేశాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఇకనైనా విద్యుత్ సంస్థ యాజమాన్యం చర్యలు చేపట్టాల్సి ఉంది.

రెండవ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పృథ్వి గ్యాస్ట్రో - లివర్ & ఎమర్జెన్సీ
సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

C.T.M రోడ్డు, బిగ్ బజార్ ప్రక్కన, RTC బస్టాండు దగ్గర, మదనపల్లి.
PH: 08571-350553, Cell: 70366 33999

మమ్మల్ని ఆదరించి, మా యొక్క హాస్పిటల్‌ని విజయ పథంలో నడవడానికి సహకరిస్తూ...
మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా మీ యొక్క ఆదరాభిమానాలు ఇలాగే కలకాలం కొనసాగాలని ఆశిస్తూ... సదా మీ సేవలో...

వార్షికోత్సవం సందర్భంగా 17-01-2026 శనివారం నాడు ఉదయం 9 గం॥ల నుండి 2 గం॥ల వరకు ఉచిత ఫైబ్రోస్కాన్ (Fatty Liver) HBSAg, H.C.V క్యాంపు నిర్వహించుచున్నాము

అన్నమయ్య జిల్లాలోనే మదనపల్లి నందు ప్రత్యేక నైపుణ్యంగల గ్యాస్ట్రో ఎంటరాలజీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు
❖ ఎండోస్కోపి సేవలు ❖ కొలనోస్కోపి సేవలు
❖ ప్రేగు సంబంధిత వ్యాధులు ❖ ప్యాంక్రియాస్ సమస్యలు
❖ లివర్ సమస్యలు ❖ ICU సేవలు
❖ జనరల్ మెడిసన్ సేవలు ❖ ల్యాబ్ సర్వీస్

డా॥ కె.పృథ్వి M.B.B.S., M.D (Gen. Med), D.M (Gastro)
డా॥ కె.అఖిల M.B.B.S., M.D., Anaesthesia, FICCM
డా॥ కె.ధనుష్ M.B.B.S., M.D. General Medicine

పండగవేళ విషాదం

వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి

సంక్రాంతి పండగ వేళ.. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు.

● **లారీ ఢీకొని యువతి.. బైరెడ్డిపల్లె:** మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో నెల్లిపట్ల క్రాస్ వద్ద పొలంలో ఉన్న ఆవుల నుంచి పాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి నడిచి వెళ్తుండగా బైరెడ్డిపల్లెలోని కురవవీధికి చెందిన జయచంద్ర కుమార్తె హేమప్రియ (17)ను వెనక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మరణించింది. వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండే కుమార్తె మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరయ్యారు.

హేమప్రియ (పాతచిత్రం)

● **పండగకు చెల్లి ఇంటికొచ్చి వెళ్తుండగా.. బంగారుపాళ్యం:** వినాయకపురంలో చెల్లి ఇంటికి వచ్చి వెళ్తుండగా గంగవరం మండలం బూడిదపల్లెకు చెందిన లక్ష్మమ్మ(70)ను శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని కారు ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

● **డివైడర్‌ను ఆటో ఢీకొని.. తడ:** చేనిగుంట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వరదయ్యపాళెం మండలం సిద్ధమ అగ్రహారానికి చెందిన ఆటో డ్రైవర్ చెరివి మునిచంద్రయ్య (40) మృతి చెందారు. ఈ ఘటనలో జాతీయ రహదారి నిర్వహణ పనులు చేస్తున్న చిల్లకూరు మండలం, ముత్యాలపాడుకు చెందిన వలిపి వెంకటరమణయ్య, దొరవారిసత్రం మండలం నెల్లూరుపల్లికి చెందిన చెంబేటి సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. పండగ సందర్భంగా మునిచంద్రయ్య సొంతూరుకు భార్యాపిల్లల్ని ముందుగా పంపాడు. తనూ ఊరెళ్లే క్రమంలో కన్నుమూశాడు.

మునిచంద్రయ్య (పాత చిత్రం)

● **రైలు నుంచి జారిపడి.. దొరవారిసత్రం:** పోలిరెడ్డిపాలెం సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎగ్మోర్ నుంచి బర్మాపూర్ వరకు తీసుకున్న జనరల్ టికెట్ లభించింది. మృతుని వయసు 40 - 45 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● **విహారయాత్రకు వచ్చి గుండెపోటుతో.. కేవీబీపురం, న్యూస్‌టుడే:** కుటుంబ సభ్యులతో కేవీబీ పురం మండలం ఆరే సిద్ధేశ్వర కోన జలపాతంలో సరదాగా గడిపిన చెన్నైకు చెందిన శరవణన్(55) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది.

కుటుంబ కలహాలతో రైతు బలవన్మరణం

కలకడ: బాలయ్యగారిపల్లె పంచాయతీ దిగువపాళెంకు చెందిన అమృతయ్య (50), భాగ్యమ్మ దంపతులు పదేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. నెల కిందట భాగ్యమ్మ భర్త వద్దకు తిరిగొచ్చింది. ఏం జరిగిందో తెలియదు కానీ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న అమృతయ్యను పశువుల కాపరులు గుర్తించారు. రాయచోటి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జీవనోపాధికి వచ్చిన యువకుడు..

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలోని ఓ కోళ్లఫారంలో పశ్చిమబంగాకు చెందిన రవీంద్ర చిగ్‌బరాక్ (29), ఆయన భార్య రష్మి పని చేస్తున్నారు. కొద్దిరోజులుగా తనలో తానే మాట్లాడుకుంటున్న రవీంద్ర శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కడుపునొప్పి తాళలేక..

పెనుమూరు: కడుపు నొప్పి తాళలేక కావూరివారిపల్లె పంచాయతీ ఎరుగానిపల్లెకు చెందిన లోకయ్య(50) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

చికిత్స పొందుతూ బాలుడు..

గాలివీడు, న్యూస్‌టుడే: స్థానిక దేవాలయం వీధికి చెందిన కల్యాణి, భద్రయ్య దంపతుల కుమారుడు చిన్న (1) మంగళవారం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. శుద్ధజల క్యాన్ల ఆటో ఢీకొట్టింది. గాయపడ్డ బాలుడిని వేలూరు సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ఐసర్‌లో క్లాసికల్ కార్యశాల

ఏర్పేడు: తిరుపతి ఐసర్ క్లాసికల్ ఆర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పిక్ మెకే విరాసిత్-2026 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ కళాకారుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. యువతలో భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, శాస్త్రీయ కళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపతాయని ఆచార్యులు అభిప్రాయ పడ్డారు. ఆర్కే శ్రీరామ్‌కుమార్, గానకంత బొర్రా, జ్యోతి హగ్డే వంటి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

ఆచార్యులకు పురస్కారం

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆచార్యులు విజయమోహనన్ పిళ్లై చిరంతన్ రసయన్ సంస్థ(సీఆర్ఎస్)నుంచి జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రోకెమిస్ట్రీలో వివిధ ప్రయోగాలు చేపట్టడంతో పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఐసర్ ఆచార్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మరెన్నో పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

20న ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 20న అభిప్రాయాన్ని సేకరించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులు తిరుపతి, విజయవాడ, కర్నూలులో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 20న తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చన్నారు. పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

EENADU Classifieds

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

TO LET
తిరుపతి అంకాలమ్మ గుడి దగ్గర opp: RTC బస్టాండ్ ఇంద్రలోక్ అపార్ట్‌మెంట్ 3 BHK - 404 నార్త్ ఫేస్ ఫ్లాట్ అద్దెకు కలదు. Ph: 98663 61369.

JOBS
Tele Callers Female Qua: Any Degree & Basic system knowledge. N Sreenatha Reddy Recovery Agency, Bairagapattida, TPT ✆ 90328 01545

తిరుపతి, సేవా సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్టు, వంట మనుషులు, నైట్ డ్యూటీ చేయుటకు హౌస్ కీపింగ్ స్టాఫ్ M/F కావలెను. Cont: 99495 32652.

తిరుచానూరు లాడ్జి నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, రూమ్ బాయ్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: 94405 81161.

సహానా గ్రాండ్ హోటల్ తిరుపతి నందు హౌస్ కీపింగ్ వర్క్ చేయుటకు సిబ్బంది కావలెను. జీతం: 12 నుండి 14000 వరకు కలదు. Cont:9440364488.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • పీలేరు

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు

కలకడ, న్యూస్‌టుడే : స్థానిక కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో ఈనె 19న జరగనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన ఆహ్వాన కమిటీ సభ్యులు కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సమేతంగా రావాలంటూ కరపత్రాలు పంపిణీ చేసి ఆహ్వానిస్తున్నారు. తిరుపతి లలితాపీఠం వ్యవస్థాపకులు స్వరూపానందరగిస్వామి, మల్లికార్జున పాల్గొంటారు.

క్రీడలతో మానసికోల్లాసం

బ్యాటింగ్ చేస్తున్న వైకాపా నాయకుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం, న్యూస్‌టుడే: యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని, వాటి సాకారం దిశగా సాగాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని హనపురం పంచాయతీ కొండవాండ్లపల్లెలో వైకాపా నాయకులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను బ్యాటింగ్ చేసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. రాజారెడ్డి, దివ్యకుమార్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చలమరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

గాలివీడు, న్యూస్‌టుడే

సమస్య: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలున్న ప్రాంతంలో కాలువలు పూడిపోయాయి. మురుగు నిలిచింది. రోడ్డుపైకి వస్తుంది **- విశ్వనాథ్, స్థానికుడు**
సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- లక్ష్మీదేవి, సర్పంచి

పశుసంపద మన నేస్తం

రాయచోటి, న్యూస్‌టుడే: పశు సంపద మనకు అసలైన నేస్తాలని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శుక్రవారం కనుమ పండుగను పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పశు సంపదను పూజించే కర్తవ్యాన్ని కనుమ చెబుతుందన్నారు. మాసాపేట, పాతరాయచోటిలో ఆయన పర్యటించి పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. చిట్లాకుప్పలను వెలిగించారు.

లోకేశ్‌ను కలిసిన నాయకులు

పీలేరు గ్రామీణ (న్యూస్‌టుడే) : కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలియజేశారని పీలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషోర్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఆయన గురువారం చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నారా లోకేశ్‌ను కలిసి, పీలేరులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించామని ఆయన చెప్పారు.

తొలగని చెత్త.. కదలని మురుగు

పార్కులోని మరుగుదొడ్ల దుస్థితి

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: పాత జిల్లా కేంద్రమైన రాయచోటి సమస్యల నిలయంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల వైఫల్యం వెరసి ప్రజలకు శాపంగా మారింది. సంక్రాంతి పండగ సమయంలోనూ ఇంటింటి చెత్త సేకరణ లేక అవస్థలు పడ్డారు. చెత్త కుండీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించలేదు. దీంతో పాటు మురుగు కాల్వలు శుభ్రం చేయక వ్యర్థ జలాలు నిలిచిపోయాయి. అంతే కాకుండా రహదారి మధ్యలోని మ్యాన్‌హోళ్లు తెరుచుకుని ప్రమాదకరంగా మారాయి. అంతే కాకుండా ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఉద్యాన వనం.. అసౌకర్యంగా మారింది.

ప్రమాదకరంగా కాల్వలు

నిర్వహణ లేక మురుగు కాల్వలు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని కల్వర్టులపై ఏర్పాటు చేసిన ఇనుప మ్యాన్‌హోళ్లు తెరుచుకున్నాయి. వీటికి నెలల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఆ దారుల్లో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అగస్త్యేశ్వర స్వామి ఆలయ సమీపంలో రోడ్డు మధ్యలో చిన్నపాటి కల్వర్టుపై ఏర్పాటు చేసిన ఐరన్ మ్యాన్ హోల్ పూర్తిగా దెబ్బతింది. వరిగ, కాకుళారం, కాటిమాయ కుంట గ్రామాలకు నుంచి నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రిపూట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల వ్యవధిలో 10 మందికి పైగా గాయపడ్డారని స్థానికులు తెలిపారు.

విరిగిన అక్షరాలు.. పనికిరాని పరికరాలు

ఇది మున్సిపల్ పార్కులోని పరిస్థితి. 2023లో డైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏకైక ఉద్యానవనం.. అసౌకర్యాలతో కనిపిస్తుంది. ఐ లవ్ రాయచోటి అక్షరాలు రంగు పోయి కళావిహీనంగా మారాయి. పార్కంతా చెత్త, మద్యం సీసాలతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మరుగుదొడ్ల పరిస్థితి అంతే. నీటి సౌకర్యం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. టైల్స్ పగిలిపోవడంతో వినియోగానికి పనికి రాకుండా పోయాయి. జిమ్ పరికరాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. పూర్తిగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని నడకదారులు ఆరోపిస్తున్నారు.

✤ అధ్వానంగా ఉద్యానవనం
✤ తెరుచుకున్న మ్యాన్‌హోళ్లు

ఎక్కడికక్కడే వ్యర్థాలు

పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ఈ సమస్య వేధిస్తోంది. 50 వేల మంది నివసిస్తున్న పట్టణంలో సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేరని ప్రజలు వాపోతున్నారు. గాలివీడుకు వెళ్లే రోడ్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఎలక్కాయ చెట్టు వద్ద డస్ట్‌బిన్ నిండిపోయి చెత్త రోడ్డుపైకి చేరింది. ఆంజనేయ స్వామి గుడి దారిలో రహదారే చెత్తడబ్బాగా మారింది. కుక్కలు, ఆవులు ఆహారం కోసం వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతోపాటు కొత్తపేట ప్రాంతంలోనూ చెత్త కనిపిస్తుంది. రోజుల తరబడి చెత్త తీయకపోవడంతో దుర్వాసన వస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ప్రజలు సైతం వ్యర్థాలను కుండీల్లో వేయకుండా రోడ్డుపైనే పడేస్తున్నారు.

రేపు రక్తదాన శిబిరం

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఈ నెల 18న రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని తెదేపా కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెదేపా నాయకుడు తౌహీద్‌ఖాన్ శుక్రవారం పేర్కొన్నారు. తెదేపా వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన విలేకర్లకు తెలిపారు. రాజంపేట పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శిబిరం గోడపత్రులను ఆవిష్కరించారు.

దర్గా అభివృద్ధికి కృషి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: షంషేర్‌ఖాన్ దర్గా అభివృద్ధే ధ్యేయమని వాల్మీకిపురంకు చెందిన గౌస్ బాషా శుక్రవారం తెలిపారు. ఇటీవల గుర్రంకొండ మండలంలోని కొత్తపల్లె షంషీర్ ఖాన్ దర్గాకు ఆయన ముతవల్లీ నియమితులయ్యారు. శుక్రవారం గౌస్ బాషా కొత్తపల్లె గ్రామస్థులతో కలిసి దర్గాలో పూలచాదర్, గలేఫ్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా అభివృద్ధిపై గ్రామస్థులతో సమావేశమై మాట్లాడుతూ దర్గా ఆస్తులకు వంద శాతం రక్షణ ఉండేలా చేస్తామని, దర్గా ఆస్తుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

కదలాలంటే.. నెట్టాల్సిందే..!

కలికిరి క్రాస్ రోడ్డులో బుధవారం మదనపల్లె డిపో బస్సు ప్రధాన రహదారిపై ఆగిపోయింది. ఈ కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు, ట్రాఫిక్ పోలీసులు బస్సును నెట్టాల్సి వచ్చింది. సెల్ఫ్ మోటారు పనిచేయకపోవడంతో.. స్టార్ట్ కాలేదని సిబ్బంది తెలిపారు. కండిషన్ లేని బస్సులతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించాలన్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

'మంతెన' మెచ్చిన 'ముగ్గులు'

పీలేరు, న్యూస్‌టుడే: ప్రకృతి వైద్యుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా. మంతెన సత్యనారాయణరాజు పీలేరు దంపతులు పద్మావతి, కృష్ణయ్య దిద్దిన ముగ్గులను చూసి అభినందించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మంతెన పీలేరుకు చెందిన దంపతులతో చరవాణిలో మాట్లాడి సంక్రాంతికి విజయవాడలోని మంతెన ప్రకృతి వైద్యం ప్రాంగణానికి రమ్మని ఆహ్వానించారు. దాంతో మంతెన వద్ద ఆరోగ్య శిక్షణ పొందిన దంపతులు మంతెన ఆరోగ్య ప్రాంగణానికి వెళ్లి ముగ్గులు వేశారు. వాటిని పరిశీలించిన మంతెన.. దంపతులను అభినందించారు.

ఉత్సాహంగా కనుమ సంబరాలు

సంబేపల్లెలో.. చిట్లా కుప్ప

వాల్మీకిపురంలో.. కాలుతున్న చిట్లా కుప్ప

పీలేరులో..

వాల్మీకిపురంలో దోసెలచల్ల నిమజ్జనం

రాయచోటి: మాధవరంలో..

రామాపురం: గౌరమ్మ ఊరేగింపు

న్యూస్‌టుడే, బృందం: సంక్రాంతి పర్వదినాన.. పల్లె సీమలు జనంతో కళకళలాడాయి. ప్రతి ఇంటా పట్టణం వచ్చిన బంధుమిత్రుల సందడి నెలకొంది. సంక్రాంతి, కనుమ సందర్భంగా పలు వేడుకలు నిర్వహించారు. ఆలయాల వద్ద ముగ్గుల పోటీలు, కబడ్డీ, సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టారు. కనుమ పండుగ రోజున పశు సంపదను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. బెలూన్లు, రంగు కాగితాలు కట్టి పశువుల ఊరేగింపు నిర్వహించారు. రైతు కుటుంబాలు పశు సంపద వృద్ధి కోసం కాటమరాజుకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఊరూరా వైభవంగా చిట్లాకుప్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో దోసెల చల్ల కార్యక్రమం నిర్వహించారు.

కలకడ..కురవపల్లెలో అలంకరణలో పశువులు

కలికిరి: బహుమతి అందిస్తున్న సీఐ రామచంద్ర, ఎస్‌ఐ రమణయ్య

చిన్నమండెం: కాటమరాజు ఆలయంలో గ్రామస్థుల పూజలు

వైభవంగా ఆరాధనోత్సవాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిన్నర్సుపల్లె మఠంలో వెలసిన శ్రీశ్రీ పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు గురు, శుక్రవారాల్లో వైభవంగా సాగాయి. గురువారం సాయంత్రం పీరయ్యస్వామి సమాధికి ప్రత్యేక అలంకరణ, దీపాలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి అఖండ భజన కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజనలు అందరిని అలరించాయి. రాత్రి పది గంటల నుంచి తెల్లవారేదాకా సాగిన సాసవుల చిన్నమ్మ కథ నాటక ప్రదర్శనలో భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ సంతానం కోసం, రోగాల నయం కోసం భక్తులు వరపడ్డారు. ఉత్సవాలకు వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బాబురెడ్డి హాజరై పూజలు చేశారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి భక్తులు తరలివచ్చారు.

మౌలాలి జెండా ప్రదక్షిణలో పాల్గొన్న పీఠాధిపతి నాగలింగమయ్య

కోడి పందేలు.. నలుగురి అరెస్టు

సంబేపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలో కోడి పందెం నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ గురువారం తెలిపారు. ప్రకాష్‌నగర్ కాలనీ గ్రామం మినమరెడ్డిగారిపల్లె, దేవపట్ల గ్రామాల శివారులో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో వెళ్లి 8 పుంజులు, నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

సొంత భవనం లేక.. అద్దె భవనమే గతి

కలికిరి, న్యూస్‌టుడే: స్థానికంగా ఉర్దూ అకాడమీ గ్రంథాలయం, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసింది. ఈ కేంద్రాలు మంజూరై పదిహేనేళ్లు కావస్తున్నా.. ఇంత వరకు సొంత భవనానికి నోచుకోలేదు. దీంతో గాలి, వెలుతురు లేని అద్దె భవనంలో అసౌకర్యంగా సాగుతోంది. ఈ కేంద్రాల నిర్వహణ కోసం ఇద్దరు ఫ్యాకల్టీలు, ఓ లైబ్రేరియన్, మరో ఇద్దరు అటెండర్లు పనిచేస్తున్నారు. కలికిరి కేంద్రంగా ఎలాంటి ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు లేకపోవడంతో ఉర్దూ విద్యార్థులు కరవయ్యారు. మండలంలోని మహల్‌లో ఏర్పాటు చేసి ఉంటే ప్రయోజనం ఉండేది.

అడ్డంగా స్తంభం.. రాకపోకలకు కష్టం

పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ చక్రవాండ్లపల్లె నడి వీధిలో విద్యుత్తు స్తంభం అడ్డంగా ఉంది. దీంతో వీధిలోకి ట్రాక్టర్లు, కార్లు ఇతర నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనదారులు సైతం రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు విద్యుత్తు శాఖ అధికారులకు చెప్పినా స్పందన లేదని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

అమ్మో.. గుండు జారితే..!

రాయచోటి- అనంతపురం ప్రధాన మార్గంలో యండపల్లె వద్ద పెద్ద గుట్ట ఉంది. ఆ గుట్టలో కొంత భాగం తొలిగించి రహదారి నిర్మించారు. అందులో మిగిలిపోయిన పెద్ద బండరాయి ప్రమాదకరంగా మారింది. ఓ వైపు రహదారి.. ఆ పక్కనే గృహాలు ఉన్నాయి. వర్షాల సమయంలో కిందకి జారితే భారీ ప్రమాదం తప్పదు. ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రక్షణ చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

ఖరీదైన ప్రాంతం.. అభివృద్ధికి ఆమడదూరం

మండల కేంద్రంలోని చిత్తూరు మార్గంలో బృందావననగర్ ఖరీదైన, అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. పదేళ్ల కిందట చేసిన ఈ ప్రాంతంలో ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. పంచాయతీకి బిల్డింగ్ అనుమతులు, పన్నులు ఇలా అన్నింటిని కట్టించుకుంటున్నారు. అయితే మౌలిక వసతుల కల్పనలో మాత్రం పంచాయతీ పాలకవర్గం మీనమేషాలు లెక్కిస్తుందని స్థానికులు వాపోతున్నారు. అంతర్గత రహదారులు సీసీకి నోచుకోలేదు. మురుగు కాల్వల నిర్మాణం చేపట్టనేలేదు. చాలా మంది ఇంటి ఎదుట ఇంకుడు గుంతలతో కాలం వెల్లదీస్తున్నారు. అలాగే వీధుల్లో విద్యుత్తు దీపాలు లేక రాత్రిపూట అంధకారాన్ని తలపిస్తోంది. కొందరు మురుగు వదిలేయడంతో చిత్తూరు- హైదరాబాదు జాతీయ రహదారిపై పారుతుంది. పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఈవో బ్రహ్మారెడ్డి తెలిపారు.
- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

దుప్పట్ల పంపిణీ

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ కంబిరెడ్డిగారిపల్లె ఎస్టీ కాలనీలో శుక్రవారం రాష్ట్ర యానాది గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు సుశీల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవనాల్లేక.. చిన్నారులకు ఇక్కట్లు

కంభంవారిపల్లెలో అసంపూర్తిగా నిర్మాణం

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): పూర్వ ప్రాథమిక విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేక శిథిల గదులు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిల్లో అసౌకర్యాలు కనిపిస్తున్నాయి. సొంత భవనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇస్తున్నా.. ఇంకా ఈ సమస్య వేధిస్తోంది. అభం శుభం తెలియని చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కంభంవారిపల్లెలో భవనం అసంపూర్తిగా ఉండటంతో అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ పిల్లలు సుమారు 20 మంది ఉన్నారు. గుర్రంకొండ మండలం కొత్తపేటలో ఇదే సమస్య ఉంది. పిల్లలు 23 మంది ఉన్నారు. ఇంటి వద్ద నుంచే నీళ్ల సీసాలు తెచ్చుకోవాల్సి ఉంది. కలికిరి మండలం కొర్నమిట్టపల్లెలో భవనం అసంపూర్తిగా ఉంది. ఈ విషయంపై పీఆర్ ఏఈ శుభ్రత్ వివరణ కోరగా అసంపూర్తి భవనాలు పూర్తికి నిధులు కోసం ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు చేస్తామన్నారు.

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No: 13/2023
కొండూరు అనిల్‌కుమార్‌రాజు, S/o రాజగోపాల్‌రాజు, వయస్సు 32 సం॥రాలు, ప్రైవేట్ ఉద్యోగం వలన జీవనం సాకిన్ దిగువరాచపల్లి H/o గున్నికుంట్ల, సంబేపల్లి మండలం, అన్నమయ్య (జిల్లా) ..వాది
మరియు
కొండూరు ఉమామహేశ్వరరాజు S/o రామరాజు, వయస్సు 50 సం॥లు, వ్యాపారం వలన జీవనం సాకిన్ గుర్రప్పగారిపల్లి, వీరబల్లి మండలం, అన్నమయ్య జిల్లా ..4వ ప్రతివాది
నోటీసు
పై నెంబరు యొక్క దావా నందు వాది మీ మీద OS No: 13/2023 దావా దాఖలు చేసియున్నారు. అందువలన మీరు 19-02-2026వ తేదీన వాయిదాగా వుంటూ ఉన్నది. అందువలన మీరు ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ సదరు కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతటా మీ పరోక్షంగా తీర్మానించబడును.
ఇట్లు,
తేది: 16-01-2026 శ్రీ వి.సి.రెడ్డెప్ప రెడ్డి
స్థలం: రాయచోటి వాది పరం న్యాయవాది

(c) eenadu

మదనపల్లె
• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

ముఖ్యమంత్రికి వినతి

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని బురకాయల కోట పంచాయతీని మండల కేంద్రంగా మార్చాలని పలువురు నారావారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. బ్రిటిష్ కాలంలో బురకాయలకోట మండలంగా ఉండేదన్నారు. ఇప్పటికీ పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయాలు ఉన్నట్లు చెప్పారు. పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మూర్తిస్వామి, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, బాబు, సీవీ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పంటలకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళంపేట పంచాయతీలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు దాడులకు దిగింది. దిగువమూర్తివారిపల్లె గ్రామానికి చెందిన రైతులు నాగరాజ, నరసింహులు, చిన్నబ్బ, బాషా మామిడి తోటల్లోని కొమ్మలను విరిచేసి నష్టం కలిగించినట్లు రైతులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

అప్రమత్తతతో సైబర్ నేరాలు దూరం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రామకృష్ణ సూచించారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ గొల్లపల్లెలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ బానిసలుగా మారితే జీవితం దుర్భరం అవుతుందన్నారు.

ఆగిన పనులు.. చిన్నారులకు అవస్థలు

పుంగనూరు మండలంలోని రాగానిపల్లె పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ భవనం పనులు అయిదేళ్లుగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రూ.16 లక్షలతో నిర్మాణం చేపట్టారు. రూ.8 లక్షలు మంజూరు కావడంతో స్లాబ్ వరకు పనులు చేశారు. తర్వాత నిధులు రాకపోవడంతో ఆపేశారు. ఇరుకు గదుల్లో చిన్నారులు అవస్థలు పడుతున్నారని పలువురు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

కల్వర్టు ఛిద్రం.. జరభద్రం

నిమ్మనపల్లె మండలం సింగంవారిపల్లెలో నిర్మించిన కల్వర్టు పాడైంది. మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తర్వాత వర్షాలకు రంధ్రం ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతుండటంతో ముళ్ల కంపను అడ్డంగా పెట్టారు. ఈ మార్గంలో ఎక్కువగా వాహనాలు తిరుగుతుంటాయి. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాల బారిన పడతారని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, నిమ్మనపల్లె

గ్రామ సింహాలు.. ప్రజలు బెంబేలు

నిమ్మనపల్లె పట్టణంలో గ్రామ సింహాల సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గుంపులుగా తిరుగుతూ వీధుల్లో చిన్నారులు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయి. ద్విచక్ర వాహనాల వెంట పడుతుండటంతో చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఇటీవల కాలంలో 20 మంది కుక్కకాట్లతో ఆసుపత్రులకు వచ్చి చికిత్స పొందినట్లు వైద్యులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, నిమ్మనపల్లె

గండి పూడ్చరు.. గండం తప్పదు

రామసముద్రం మండలంలోని గుంతలపేట చెరువుకు 2021లో గండి పడింది. అయిదేళ్లు అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాలు కురిస్తే నీరు వృథాగా వెళ్లిపోతోంది. దీంతో ఆయకట్టు భూమి బీడుగా మారింది. రామసముద్రం, గుంతలపేట, తిరుమలరెడ్డిపల్లె రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి పారుదల శాఖ ఏఈ శ్రీధర్ వద్ద ప్రస్తావించగా.. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. – న్యూస్‌టుడే, రామసముద్రం

అయిదేళ్లుగా పునాదుల్లోనే!

రామసముద్రం మండలం అరికెల, మానేవారిపల్లె పంచాయతీలకు సంబంధించిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణాలను అరికెల గ్రామంలో అయిదేళ్ల క్రితం ప్రారంభించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. ఉన్నతాధికారులకు నివేదించామని పీఆర్ డీఈఈ శివప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, రామసముద్రం

కొత్త కార్యాలయాలు.. కానరాని పనులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటైంది. గత నెల 31 నుంచి సబ్‌కలెక్టరేట్‌ను కలెక్టరేట్‌గా మార్చారు. కలెక్టర్ ఇక్కడ నుంచే పాలన చేపడుతున్నారు. పలు విభాగాల్లో కంప్యూటర్లు, సామగ్రి ఏర్పాటు చేస్తున్నారు. జేసీ, డీఆర్వోలు ఇక్కడ నుంచే సేవలు అందిస్తున్నారు. వీరికోసం బీటీ కళాశాల, పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రంలోని ఖాళీ గదులను తాత్కాలికంగా కేటాయించారు. కొన్ని బాగు చేయగా, మరికొన్ని చోట్ల ఎలాంటి పనులు ప్రారంభించలేదు.

పలు శాఖలకు కేటాయించిన బాలుర వసతిగృహం

వారంలో స్పష్టత..

బెంగళూరు రహదారిలో ఉద్యాన, మత్స్యశాఖలతో పాటు సూక్ష్మ నీటిపారుదల, పట్టుగూళ్ల, కో ఆపరేటివ్ శాఖలకు కేటాయించారు. ఈ ప్రాంతంలో భవనాలను కొన్ని శాఖలు శుభ్రం చేసుకుంటున్నాయి. స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ కార్యాలయాన్ని అమ్మచెరువు మిట్టలోని ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా మరికొన్ని జిల్లా స్థాయి కార్యాలయాలు ఎక్కడ ఏర్పాటు చేస్తారనే అంశంపై వారంలో స్పష్టత రానుంది.

ఒకటి, రెండు శాఖలే..

మదనపల్లె పట్టణంలోని పుంగనూరు రహదారిలోని డీడీవో కార్యాలయంలో సబ్‌కలెక్టరేట్ ఉంది. బీటీ కళాశాలలో డ్వామా, డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, ప్రణాళిక అధికారి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు డ్వామా సిబ్బంది మాత్రమే బాగు చేయించి విధులు ప్రారంభించారు. మిగిలినవి ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. సీటీఎం రోడ్డు పారిశ్రామిక వాడలో పట్టుగూళ్ల మార్కెట్ సమీపంలో రైతు సహాయక కేంద్రాన్ని వ్యవసాయ శాఖకు కేటాయించారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. బీటీ కళాశాల పీజీ బాయ్స్ వసతి గృహంలో భూమి, సర్వే రికార్డులు, ఖజానా, దేవాదాయ, మైనార్టీ సంక్షేమం, పౌరసరఫరాలు తదితర శాఖలకు కేటాయించారు. వీటిలో సర్వే, ఖజానా అధికారులు మాత్రమే పనులు చేయించారు.

రహదారులు తారుమారు

నాణ్యత లేక రాళ్లు తేలిన వైనం

పుంగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర, గ్రామీణ రహదారులను యుద్ధ ప్రాతిపదికన బాగు చేసింది. గతేడాది సంక్రాంతిలోపు రోడ్లు బాగు పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో గ్రామాలు, పట్టణాల్లో జోరుగా పనులు చేపట్టారు.

రూపురేఖలు కోల్పోయిన దర్గా మార్గం

అయితే నాణ్యత లోపించడంతో పలు చోట్ల రోడ్లు పాడయ్యాయి. రాళ్లు తేలి అధ్వానంగా మారాయి.

నెలల వ్యవధిలోనే..

పట్టణాల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీనికి తోడు వర్షాలతో చాలా చోట్ల రోడ్డు గుంతలుగా మారాయి. నాణ్యత లేకపోవడంతో ఏడాదికే రూపురేఖలు కోల్పోయాయి. కొన్ని చోట్ల రెండు నెలల్లోనే పూర్వస్థితికి చేరాయి. దీంతో రూ.కోట్లు వృథా అయినట్లు పలువురు వాపోతున్నారు. పుంగనూరు పట్టణంలో దర్గా వద్ద, వనల మదిన్నె మలుపులో కంకర తేలిన రోడ్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్యాచ్ వర్కులు చేసిన నెలల వ్యవధిలోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

గుంతల్లోకి నిధులు..

జిల్లాలోని పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో సుమారు 700 కిలోమీటర్ల మేర రహదారుల్లోని గుంతలు పూడ్చేందుకు రూ.11 కోట్ల వరకు ఖర్చు చేశారు. వేగంగా పనులు చేపట్టడంతో చాలా చోట్ల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేశారు. ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. పాడైన రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మదనపల్లె పట్టణం: 80085 74611
పీలేరు గ్రామీణం: 80085 74958
పుంగనూరు: 80085 74622

? మదనపల్లె గ్రామీణ మండలం కొత్తిండ్లు రెడ్డమ్మ పిండి మిషన్ ఎగువ వీధిలో దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం. **- సల్మాన్** ✓ వీధి దీపాలు బాగు చేయిస్తాం. **- షర్ఫుద్దీన్, కార్యదర్శి** ? వేంపల్లె పంచాయతీ కేంద్రంలో ఇళ్ల ముందు మురుగు నిలిచిపోతోంది. దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం. **- రమణ** ✓ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- తాజ్ మస్రూర్, ఎంపీడీవో** ? బాలాజీకాలనీ సీటీఎం రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- సుబ్రహ్మణ్యం** ✓ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- తిరుపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

విద్యుత్తు స్తంభం బాగు

స్పందనకు వందనం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని మద్దయ్యగారిపల్లె పంచాయతీ సమీపంలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈనెల 10న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురించగా ఏఈ గిరిధర్ స్పందించి సిబ్బందితో స్తంభం సరి చేయించారు.

వైభవం.. రంగనాథ కల్యాణం

ఉత్సవంలో పాల్గొన్న శాంతారామ్ స్వామీజీ, పండితులు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మదనపల్లె బర్మావీధిలోని షిర్డీ సాయి ఆలయంలో గోదాదేవి- రంగనాథ స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ధనుర్మాసంలో నెల రోజుల పాటు శాంతారామ్ స్వామీజీ పర్యవేక్షణలో తిరుప్పావడై నిర్వహిస్తారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీరాములునాయుడు, బాబునాయుడు ఆధ్వర్యంలో పండితులు రాజాస్వామి కల్యాణం నిర్వహించారు. కమిటీ సభ్యులు నాగార్జున బాబు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

విద్యార్థిని అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సైక్-మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీల్లో మదనపల్లె శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి మజహర్‌అలీ సత్తా చాటాడు. అండర్ 18 విభాగంలో గ్రూప్ ఈవెంట్, డబుల్ మిక్స్ పోటీల్లో రజతాలు, వ్యక్తిగత విభాగంలో కాంస్యం సాధించాడు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర, సిబ్బంది అభినందించారు.

పీడీ మృతికి సంతాపం

మనోహర్ (పాతచిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: గుండెపోటుతో చీకలబైలు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ మనోహర్ (57) గురువారం రాత్రి మృతి చెందారు. మదనపల్లె పట్టణానికి చెందిన మనోహర్ రేణిమాకులపల్లె, మదనపల్లె, అంగళ్లు పాఠశాలల్లో పనిచేశారు. గుండె నొప్పి రావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పీడీ సంఘం జిల్లా నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య అనసూయ, కుమారుడు సాయి ఉన్నారు.

రక్తదానంతో చేయూత

పుంగనూరు గ్రామీణ, మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పారిశ్రామికవేత్త కొత్తపల్లె చెంగారెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లె గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ, మదనపల్లె భారతమాత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 27 మంది రక్తదానం చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. సొసైటీ జిల్లా కార్యదర్శి జగదీష్, శ్రావణ్‌కుమార్, మహేష్‌కుమార్, గోవర్దన్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌లో ప్రమాదం

ధ్వంసమైన కారు ముందుభాగం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. తిరుపతికి చెందిన ఇంద్రాణి, మరో నలుగురు శుక్రవారం కారులో హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. ఘాట్ మొదటి మలుపులో కిందికి వస్తున్న బస్సు, పైకి వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొని ఆగిపోయాయి. కారులోని ఇంద్రాణి ముఖానికి గాయాలవగా 108లో మదనపల్లె తరలించారు.

గొర్రెలపై గుర్తు తెలియని జంతువు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం గ్రామంలో కోటబాయి సమీప అటవీ ప్రాంతంలో గొర్రెల మందపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. శుక్రవారం సాయంత్రం కృష్ణయ్య తన 40 గొర్రెలను తీసుకొని అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. ఒక్కసారిగా జంతువు పెద్దగా అరుస్తూ వచ్చి మూడు గొర్రెలను గాయపరిచిందని ఆయన చెప్పారు. భయంతో పరుగులు పెట్టానని, జంతువును చూడలేదని తెలిపారు. వచ్చే సరికి గాయాలతో ఒకటి మృతి చెంది ఉందన్నారు. గాయపడిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. శనివారం వెళ్లి పరిశీలిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

మద్యానికి బానిసై వేధింపులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: భర్త మద్యానికి బానిసై భార్య, బిడ్డల్ని వేధిస్తూ ఇంటి నుంచి గెంటేసిన ఘటన శుక్రవారం రామకుప్పం మండలం నెర్నిపల్లెలో చోటు చేసుకుంది. ఏఎస్సై అశ్వర్థనారాయణ వివరాల మేరకు.. పట్టణంలోని అగర్తవీధికి చెందిన అమరావతికి నెర్నిపల్లెకు చెందిన విజయ్‌తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన విజయ్ రూ.2 లక్షలు తీసుకురావాలని కోరుతూ అమరావతిని ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆమె పిల్లలతో పాటు పుట్టింటికి వచ్చేశారు. ఈమే రకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిద్దాం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించేందుకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సహకరించాలని ప్రజా రవాణాధికారి రాము విజ్ఞప్తి చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా ఈయూ నాయకులు శుక్రవారం కలిసి సత్కరించారు. ప్రభుత్వం చేపట్టిన స్త్రీశక్తి పథకాన్ని మరింత విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.ప్రభాకర్‌యాదవ్, సీఏబాబు, నాగూర్ వలి, శ్రీనివాసులు, బి.మధు తదితరులు ఉన్నారు.

రామును సత్కరించిన నాయకులు

కందుకూరులో చోరీలు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: కందుకూరులో గురువారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. బస్టాండు సమీప మసీదులో పంకా తీసుకెళ్లిపోయారు. ఇక్కడ కొన్ని పుస్తకాలను చిందరవందర చేశారని మసీద్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా రియాజ్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో రూ.20 వేల నగదు పట్టుకెళ్లిపోయారు. మూడురోడ్ల కూడలిలో 30 లీటర్ల పెట్రోలు, చెప్పుల దుకాణంలో నగదు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

సుందరీకరిస్తే ఆహ్లాదమే

జిల్లా కేంద్రం మదనపల్లెలో ప్రజలు సరదాగా సేద తీరాలంటే ఒక్క ప్రాంతమూ కనిపించదు. రాజీవ్ పార్కు ఉన్నా పట్టణానికి దూరం కావడంతో ఎవరూ వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం పట్టణం నడిబొడ్డున కోమటివానిచెరువు సువిశాలంగా 47 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువులో ఎల్లప్పుడూ నీరుంటాయి. కట్టపై అయిదేళ్ల క్రితం తారురోడ్డు నిర్మించారు. దీంతో ఎక్కువ మంది ఉదయం కాలినడకకు వస్తుంటారు. ఈ చెరువు కట్టపై పచ్చదనం పెంచి, బోటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

రామస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కవిరాజు త్రిపురనేనికి నివాళి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: సామాజిక విప్లవకారుడు, కవిరాజు త్రిపురనేని రామస్వామికి రెవెన్యూ అధికారులు నివాళులర్పించారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలతో కలెక్టరేట్‌లో రామస్వామి చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేశారు. న్యాయ, రాజకీయ రంగాల్లో చేసిన రచనలు సమాజాన్ని మేల్కొలిపాయని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడి ఆసుపత్రిలో చేరారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలం ఫైవంతెన సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి యనమలవారిపల్లెకు చెందిన మధు, ఆయన భార్య మాధవికి తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపై పడిఉన్న వారిని స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది చేరుకొని ఆసుపత్రికి తరలించారు. ● పెద్దమండ్యం మండలం తురకపల్లె మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. గుర్రంకొండ మండలం ఎల్లుట్లకు చెందిన వినోద్, కవిత దంపతులు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరికీ గాయాలవగా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బి.కొత్తకోటలో అలంకరణలో సాయిబాబా

మదనపల్లెలో పశువులకు ముస్తాబు చేసి తీసుకెళ్తున్న స్థానికులు

నిమ్మనపల్లెలో చిట్లాకుప్ప చుట్టూ గ్రామస్థులు

రామసముద్రంలో పూజలు అందుకుంటున్న గంటమ్మ

సంక్రాంతి సంబరం.. ఊరూరా ఉత్సవం

మదనపల్లె అర్బన్, నిమ్మనపల్లె, ములకలచెరువు, రామసముద్రం, రొంపిచెర్ల, పెద్దమండ్యం, కల్లూరు, సోమల, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలు గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. మదనపల్లె మండలంలోని సీటీఎం, రామాచార్లపల్లె పంచాయతీల్లో పశువులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ● సీటీఎంలో గంగమ్మ గుడి సమీపంలో చిట్లే కుప్ప ఏర్పాటు చేసి పశువులను తీసుకెళ్లారు. ● తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులు పశువులను అలంకరించి ఊరేగింపుగా కాటమరాజు వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. చిట్ల కుప్ప చుట్టూ పశువులను ఊరేగించి ఇళ్లకు తరలించారు. ● రామసముద్రం మండల కేంద్రంతో పాటు తిరుమలరెడ్డిపల్లె, పెద్దకురప్పల్లె, మట్లవారిపల్లె, చెంబకూరులో పశువులను అలంకరించి మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. ● సోమల మండలంలోని కమ్మపల్లె, ఆవులపల్లె, నంజంపేట, సోమల, మేటిమంద, కందూరు. సూరయ్యగారిపల్లె, నడింపల్లె గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ● బి.కొత్తకోట షిర్డీ సాయి మందిరంలో సాయిబాబాను అలంకరించి పూజలు చేశారు. ● రొంపిచెర్ల మండలంలో కనుమను పురస్కరించుకొని పశువులకు పూజలు చేశారు. కాటమరాజు ఆలయానికి తీసుకువెళ్లారు. ● కె.కొత్తపేట, మంగళంపేటలో పశువుల పోటీలు నిర్వహించారు. తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి కాటమరాజుకు పూజలు చేసి పోటీలు ప్రారంభించారు. కె.కొత్తపేటలో పశువుల పోటీలు నిర్వహించారు.

CHANGE OF NAME

I, J.D.KEERTANA (old name), D/o J.V.Dinakar Naidu and W/o Palyam Navin Ramanarayana, resident of D.No.16-106-18, Siva Jyothi Nagar, Sai Chitra Theatre, Madanapalle Post and Town, Chittoor Dist., Andhra Pradesh -517325. Henceforth be known as KEERTANA JALA DINAKAR (new name).

ఫుట్‌బాల్ విజేత మదనపల్లె ఎంఎస్‌సీ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని 'మత్తుకు నో చెప్పు.. జీవితం కాపాడుకో' నినాదంతో ఆరోగ్యవరంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. 8 జట్లు తలపడగా మదనపల్లె ఎంఎస్‌సీ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో ఎనమలవారిపల్లె ఈఎఫ్‌ఏపై గెలిచి సత్తా చాటింది. సిద్ధమ్మగారిపల్లె సిటిజన్ లెవన్ మూడు స్థానంలో నిలిచింది. విజేతలకు వెంకటరమణ, విశ్రాంత పీడీలు కృష్ణయ్య, వెంకటేష్, సుధాకర్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు జాఫర్, డీఎఫ్‌ఏ అధ్యక్షుడు కమలేష్ ట్రోఫీ అందజేశారు. ● **క్రికెట్‌లో ఓజీ సత్తా.. సోమల:** మండలంలో నంజంపేట పూర్వ విద్యార్థుల క్రికెట్ పోటీల విజేతగా ఓజీ జట్టు నిలిచింది. గట్టువారిపల్లె ది కింగ్‌ఆఫ్ రాయల్స్‌పై ఫైనల్‌లో విజయం సాధించింది. నిర్వాహకుడు మురళి, పూర్వ విద్యార్థుల సంఘాధ్యక్షుడు మునిరాజ, ఉపాధ్యక్షుడు అనుబేగ్, నాగభూషణం ట్రోఫీలు ఇచ్చారు. విజేతకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు అందజేశారు. ● క్రీడలతో శరీరక దారుఢ్యం సొంతం అవుతుందని ఎస్సై రమేష్ అన్నారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో షటిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు.

మదనపల్లె విద్య: జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

సోమల: ట్రోఫీతో నంజంపేట ఓజీ జట్టు

కోడి పందేల శిబిరాలపై దాడులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మండలంలో పలు చోట్ల కోడి పందేలు ఆడుతున్న 15 మందిని గురు, శుక్రవారాల్లో అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. బొమ్మనచెరువు పంచాయతీ మడివారిపల్లె వద్ద ఆరుగురి నుంచి 2 కోళ్లు, రూ.1,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ● బాబుకాలనీలో నలుగురిని అరెస్టు చేసి 2 కోళ్లు, రూ.1,200, కోటవారిపల్లె సమీపంలో అయిదుగురి నుంచి రూ.6,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ● **ములకలచెరువు:** కోడిపందెం ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు ఎస్సై ప్రతాప్ తెలిపారు. పెద్దపాళ్యం సమీపంలో ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి రెండేసి కోళ్లు, చరవాణులు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని మార్లపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.10,500 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అన్సార్ బాషా తెలిపారు. ● బండ్లపల్లె సమీప పొలాల్లో శుక్రవారం జూదం ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కేవీ రమణ తెలిపారు. వారి నుంచి రూ.20,500 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

టపాసులు పేలి గడ్డివాములు దగ్ధం

రామసముద్రం, న్యూస్‌టుడే: టపాసులు పేలడంతో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. కురిజలలో ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి అంత్యక్రియల్లో భాగంగా టపాసులు పేల్చారు. ప్రమాదవశాత్తూ నిప్పులు పడటంతో హనుమంతు, రమణాచారి, వరలక్ష్మికి చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. పుంగనూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకొని మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారు.

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

HMOP No: 47/2025

మండిపల్లి మల్లేశ్వరి W/o మూగ నిరంజన్ రెడ్డి D/o M శివారెడ్డి, వయస్సు 32 సం॥లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వలన జీవనం సాకిన్ నడిగడ్డపల్లి, పడమటికోన గ్రామము, చిన్నమండెం మండలం, అన్నమయ్య (జిల్లా) ..పిటీషనరు

మరియు

మూగ నిరంజన్ రెడ్డి S/o శివారెడ్డి, వయస్సు 37 సం॥లు [illegible]

[illegible]

తేది:16-01-2026
స్థలం: రాయచోటి

[illegible]

(c) eenadu

పడమర బాపట్లలో గోపూజ

సంబరాలు అదిరె.. పల్లె మురిసె..

బాపట్ల, న్యూస్‌టుడే

సంక్రాంతి సంబరాలతో జిల్లాలోని పల్లెలు కళకళలాడాయి. పిల్లలు, యువత, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భావనారాయణస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కనుమ రోజు శుక్రవారం గోపూజ చేశారు. ఆవులు, ఎద్దులను అందంగా అలంకరించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని రైతులు పూజలు చేశారు. రంగవల్లులు, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలకు బహుమతులు ప్రదానం చేశారు.

బొమ్మల కొలువును తిలకిస్తున్న యువతులు

● బాపట్ల, చీరాల పట్టణాల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. పాపినేనివారి కుటుంబం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు తిలకించేందుకు వందల మంది వచ్చారు. 1985 నుంచి వీరు బొమ్మల కొలువు నిర్వహిస్తున్నారు. పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో రాష్ట్రస్థాయి పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. బాపట్ల భీమావారిపాలెం కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండి లాగుడు పోటీలు ఘనంగా ముగిశాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ బహుమతులు ప్రదానం చేశారు. బాపట్ల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో వెటరన్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ క్రికెట్ ఆడి సందడి చేశారు.

● జిల్లెళ్లమూడి అమ్మ, పడమర బాపట్ల మహర్షి ఆశ్రమంలో సామూహికంగా గోపూజలు చేశారు. తీర ప్రాంతంలో పిల్లలు, యువత రంగురంగుల పతంగులు ఎగురవేశారు. బీచ్ రిసార్టులు, హోటళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ సినీ పోరాట దర్శకులు రామ్‌లక్ష్మణ్‌లు చీరాలలోని కోటయ్య వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి అల్పాహారం పంపిణీ చేశారు.

ఢీ అంటే ఢీ

కనుమ పండగను పురస్కరించుకుని పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. 12 పొట్టేళ్లు పాల్గొనగా.. ఆరు జతలుగా పోటీలు చేపట్టారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పోటీలను తిలకించారు. - న్యూస్‌టుడే, పర్చూరు

గస్తీ కరవై.. భద్రత బరువై

సూర్యలంకలో దెబ్బతిన్న స్పీడ్ బోట్లు

బాపట్ల, న్యూస్‌టుడే

తీర ప్రాంత భద్రతపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లాలోని సముద్ర తీరంలో ఏడేళ్లుగా స్పీడ్ బోట్లతో గస్తీ నిలిచిపోయింది. సూర్యలంక మెరైన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రూ.కోట్ల విలువైన మూడు స్పీడ్ బోట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొత్త స్పీడ్ బోట్లు రాలేదు. సముద్ర తీరం ద్వారా అసాంఘిక శక్తులు చొరబడితే ముందుగానే గుర్తించి పట్టుకోవాల్సిన మెరైన్ పోలీసు వ్యవస్థ బలహీనపడింది.

జిల్లాకు 74 కి.మీ. పొడవైన సముద్ర తీరం ఉంది. 2008 నవంబరులో పాకిస్థాన్ నుంచి తీవ్రవాదులు సముద్ర మార్గాన ముంబయిలోకి చొరబడి మారణహోమం సృష్టించిన తర్వాత తీర ప్రాంత భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. మెరైన్ పోలీసు విభాగాన్ని పటిష్ఠం చేసి నిధులు, పరికరాలు సమకూర్చింది. తీరం నుంచి సముద్రంలో ఐదు నాటికల్ మైళ్లు గస్తీ చేపట్టి తీవ్రవాదులు, అసాంఘిక శక్తులు చొరబడకుండా పట్టుకోవాల్సిన బాధ్యత మెరైన్ పోలీసులపై ఉంటుంది. జిల్లాలోని సూర్యలంక, నిజాంపట్నంలో మెరైన్ పోలీస్‌స్టేషన్లున్నాయి. 2010లోనే

మెరైన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆరుబయట ఉంచిన స్పీడ్‌బోట్లు

సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్‌కు మూడు స్పీడ్‌బోట్లు కేటాయించారు. స్థానికంగా వీటిని నిలిపేందుకు, సముద్రంలోకి వెళ్లి గస్తీ నిర్వహించడానికి జెట్టీ లేకపోవడంతో నిజాంపట్నం హార్బర్లో ఉంచారు. మెరైన్ పోలీసులు నిజాంపట్నం హార్బర్‌కు వెళ్లి అక్కడి నుంచి రోజూ సముద్రంలో నాలుగు గంటలు గస్తీ నిర్వహించేవారు.

రూ.60 లక్షలు అవసరం.. సముద్రంలో గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో స్పీడ్ బోట్లు దెబ్బతిన్నాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేయలేదు. ఫలితంగా ఏడేళ్ల నుంచి గస్తీ తిరగడంలేదు. క్రూ సిబ్బంది కూడా వెళ్లిపోయారు. ప్రస్తుతం సూర్యలంక మెరైన్ స్టేషన్ వద్ద ఇవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. వీటి మరమ్మతులకు రూ.60 లక్షల వరకు కావాల్సి ఉంది. స్థానిక మెరైన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి నిధులు, అనుమతుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపించారు. అయితే నిధులు విడుదల కాలేదు.

కొత్తవి కొనుగోలులో జాప్యం.. తీరంలో గస్తీ పటిష్ఠంగా నిర్వహించడానికి నిజాంపట్నం మెరైన్ స్టేషన్‌కు కొత్తగా రెండు, సూర్యలంకకు ఒకటి మొత్తం మూడు బోట్లు రావాల్సి ఉంది. కొత్తవి కొనుగోలులో కేంద్రం జాప్యం చేస్తోంది. మెరైన్ పోలీసులు నెలకు ఒకట్రెండు సార్లు మత్స్యకారుల పడవల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. గతంలో శ్రీలంక మత్స్యకారులు జిల్లాలోని తీర ప్రాంతంలోకి ప్రవేశించారు. వారిని మెరైన్ పోలీసులు పట్టుకున్నారు. ప్రస్తుతం గస్తీ లేకపోవడంతో మత్స్యకారుల వేషంలో తీవ్రవాదులు, అసాంఘిక శక్తులు చొరబడేందుకు అవకాశాలున్నాయని భద్రత నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మెరైన్ సీఐ లక్ష్మారెడ్డిని సంప్రదించగా కొత్త స్పీడ్ బోట్లు త్వరలో వస్తాయన్న సమాచారం ఉందన్నారు. తీరం వెంబడి గస్తీ కొనసాగిస్తున్నామని తెలిపారు.

సందడిగా సరస్

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సరస్ ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వాటిని తిలకించి కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కూడా సందర్శకుల రాకపోకలతో సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో సరస్ ప్రదర్శన కిక్కిరిసింది. సందర్శకులు స్టాల్స్‌ను తిలకించేందుకు ఇబ్బంది కలగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

స్పందిద్దాం.. ప్రాణం నిలుపుదాం

గోల్డెన్ అవర్‌లో సాయం చేస్తే ప్రోత్సాహకం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందక ఎందరో మరణిస్తున్నారు. మన కళ్ల ముందు ప్రమాదం జరిగి సాయం కోసం ప్రాధేయపడినా కేసులవుతాయని చాలామంది భయపడుతుంటారు. గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్స అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా పండగ వేళల్లో రహదారులపై ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మానవత్వంతో సాయం అందించాల్సిన అవసరం ఉంది.

మీరే ఉత్తమ పౌరుడు.. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి కాపాడిన పౌరులపై కేసులు లేకుండా చూస్తామని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. బాధితులకు సాయం చేసిన వ్యక్తికి ఇచ్చే రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని గతేడాది నుంచి రూ.25 వేలకు పెంచింది. పైగా ఉత్తమ పౌరుడి(గుడ్ సమారిటిన్)గా గుర్తించి పురస్కారం, ప్రశంసాపత్రం ఇస్తామని ప్రకటించింది.

ఎలా పొందాలంటే.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని వైద్యశాలకు తీసుకెళ్లాక సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారమిస్తే పోలీసులు ఓ లేఖ ఇస్తారు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దారుకు దరఖాస్తు చేయాలి.

రవాణా, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, వైద్య శాఖలు, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో కూడిన కమిటీ గుర్తించి ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.

● జిల్లాలో ఏడాదికి సగటున 800 ప్రమాదాలు జరిగితే దాదాపు 200 మంది మృతి చెందుతున్నారు. ఈ కార్యక్రమం అమలైనప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఒక్కరు కూడా ప్రోత్సాహక బహుమతులు అందుకోలేదు. గోల్డెన్ అవర్‌పై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నామని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటం అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

నాటక రంగం.. సమాజ స్థితిగతులకు దర్పణం

యద్దనపూడి, న్యూస్‌టుడే: సమాజంలో చోటుచేసుకునే పరిణామాలకు ప్రతిరూపంగా నిలిచేది నాటక రంగం మాత్రమే అని, ప్రతి మండలంలోనూ వేదికలు ఏర్పాటు చేసి నాటికల ప్రదర్శనల ద్వారా ప్రజల్ని చైతన్యపరచాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పుడి కృష్ణమోహన్ సూచించారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతవరంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళా పరిషత్తు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలను ఆయన తన సతీమణి, న్యాయవాది వసంతలక్ష్మితో కలిసి జ్యోతి వెలిగించి, నటరాజ పూజతో గురువారం రాత్రి ప్రారంభించారు. అనంతరం సభా వేదికపై ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లోనూ కళలపై గ్రామీణులు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా నాటక రంగం దోహదపడుతుందన్నారు. నాటక కళాకారులు సినీ రంగానికి పునాదిరాళ్ల వంటివారన్నారు. యువ దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ కళా రంగానికి తన అండదండలు అన్ని వేళలా ఉంటాయన్నారు. ఇటీవల సంక్రాంతికి విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడం ప్రేక్షకుల ఆదరాభిమానాలకు శుభసూచికమన్నారు. అనంతరం రంగస్థల నటి, బుల్లితెర నాయకి టి.లక్ష్మిని సత్కరించారు. పరిషత్తు అధ్యక్షుడు గుదే పాండురంగారావు, కందిమళ్ల సాంబశివరావు, మురకొండ ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

● నాటికల పోటీలు గ్రామీణుల్లో చైతన్యం నింపాయి. తొలి రోజు మూడు నాటికలను ప్రదర్శించారు. కాకినాడ వారి కన్నీటికి విలువెంత..?, విజయవాడ వారి ప్రపంచతంత్రం, ఇదేనా ధర్మం? ఇదే నా ధర్మం నాటికలు ప్రదర్శించారు. ● శుక్రవారం హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, స్త్రీమాత్రే నమః, తాడేపల్లి వారి దేవుణ్ని చూశా, వీరన్నపాలెం వారి దీపం కింద చీకటి నాటికలను ప్రదర్శించారు.

నటి లక్ష్మిని సత్కరిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, దర్శకుడు అనిల్ రావిపూడి, పాండురంగారావు ✦ ప్రపంచతంత్రం నాటికలో ఓ సన్నివేశం

పట్టుబడితే.. రూ.10 వేల జరిమానా

ఉడ్‌నగర్, దర్బార్ రోడ్డు, కొత్తపేట (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: మందుబాబులూ పారాహుషార్.. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులతో పాటు భారీగా జరిమానా చెల్లించాల్సిందే. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర రహదారులపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో రూ.2 వేలు మాత్రమే జరిమానా ఉండేది. దాన్ని ప్రస్తుతం రూ.10 వేలకు పెంచారు. కొత్త నిర్ణయాలతో న్యాయస్థానాల్లో పలువురికి జరిమానాతో పాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

● గత ఏడాది దాదాపు 1429 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. చీరాల పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానాను న్యాయస్థానం విధించింది. ఈ తరహా కేసులు జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వెలుగు చూస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా మద్యం తాగి వాహనాల్ని అజాగ్రత్తగా నడపడంతో జరిగేవి కావడం గమనార్హం.

సులువుగా.. పారదర్శకంగా!

ఆన్‌లైన్‌లో డ్వాక్రా రుణాల మంజూరు

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు శుభవార్త అందించింది. ఇప్పటివరకు పొదుపు సంఘాల మహిళలకు ఇస్తున్న రుణాల్లో పారదర్శకత పెంచేలా ఇకపై ఆన్‌లైన్లో మంజూరుకు చర్యలు చేపడతామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు.

జిల్లాలో ప్రస్తుతం 30,538 సంఘాల పరిధిలో 3,05,870 మంది సభ్యులున్నారు. ఇప్పటివరకు రుణాలు పొందడానికి వారు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేంది. ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల లావాదేవీల డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. రుణాల మంజూరు, వాయిదాల చెల్లింపులను ఆన్‌లైన్లోనే ఇకపై మంజూరు చేయనుంది. బ్యాంకు లింకేజీ రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించి మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

స్వయం సహాయక సంఘాల సభ్యులు

☛ స్వయం సహాయక సంఘాల మహిళలు ఇప్పటివరకు పొదుపు చేసుకుని, సంఘ సభ్యుల తీర్మానంతో రుణం తీసుకుని వడ్డీ సహా చెల్లిస్తున్నారు. ఏటా రూ.కోట్ల మేర బ్యాంకు లింకేజీల ద్వారా వివిధ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. గతంలో ఈ ప్రక్రియ అంతా ఆఫ్‌లైన్ విధానంలో జరిగేది. దీంతో లెక్కల్లో తేడాలు వచ్చేవి. ఇకపై అంతా ఆన్‌లైన్ ప్రక్రియలోకి సంఘాల లావాదేవీలను తీసుకురానున్న తరుణంలో సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని భావిస్తున్నారు.

దీనిపై ఏపీఎం చిన్నయ్య మాట్లాడుతూ సీసీల ద్వారా డాక్యుమెంటేషన్ ఆన్‌లైన్‌లో పూర్తయిన వెంటనే 24 గంటల్లో లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుందని తెలిపారు.

ఇక ఇంటి నుంచే పోస్ట్

అందుబాటులోకి డాక్ సేవా యాప్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారులను ఆకట్టుకోవడానికి తపాలా శాఖ సరికొత్త హంగులు సమకూర్చుకుంటోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే వివిధ సేవలు పొందేలా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. డాక్ సేవా యాప్ ద్వారా ఉన్న చోటు నుంచే అవసరమైన సేవలు, పనులు చక్కబెట్టుకునే వెసులుబాటు కల్పించింది.

✦ రిజిస్టర్, స్పీడ్ పోస్టు చేయాలంటే ఇప్పటి వరకు తపాలా కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇకపై డాక్ సేవా యాప్‌లో అవసరమైన వివరాలు నమోదు చేస్తే సిబ్బంది వచ్చి పోస్టు చేయాల్సిన వాటిని తీసుకుని పంపాల్సిన చిరునామాకు చేరవేస్తారు. ✦ ఈ యాప్ ద్వారా సులువుగా మనీయార్డర్ కూడా పంపొచ్చు. పార్సిల్ ఎక్కడ ఉందో క్షణాల్లో తెలుసుకునే వీలుంది. ✦ బీమా పాలసీ తీసుకోవడం, డిపాజిట్లు చేయడానికి ఈ యాప్ సహకరిస్తుంది. ✦ ఫిర్యాదులు, బీమా చెల్లింపులు, నెట్ బ్యాంకింగ్, పాస్ పుస్తకాల నవీకరణ, పొదుపు ఖాతాలో నగదు జమ, తపాలా కార్యాలయాల చిరునామా తెలుసుకోవడం.. ఇలా అన్ని రకాల సేవలు యాప్ ద్వారా పొందొచ్చు.

కోళ్లాట.. కోట్లాట!

బాపట్ల, చీరాల అర్బన్, రేపల్లె అర్బన్, వేమూరు, న్యూస్‌టుడే : పండగ రెండ్రోజులు ఉదయం నుంచి రాత్రి వరకు జోరుగా కోడి పందేలు నిర్వహించారు. రూ.కోట్ల సొమ్ము చేతులు మారింది. ఈసారి బాపట్ల, రేపల్లె, వేమూరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చీరాల ప్రాంతానికి పందేల సంస్కృతి విస్తరించింది. వీటిని తిలకించడానికి చెన్నై, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు నగరాల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. బరుల వద్ద జాతర వాతావరణం కనిపించింది. బరిలోకి కోళ్లు వదిలిన వారు రూ.లక్షల్లో పందెం కాశారు. పైపందేలు అంతేస్థాయిలో పెట్టారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం, పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం, చుండూరు గ్రామాల్లో భారీ ఎత్తున పందేలు వేశారు. ఎక్కువ పందేలు గెలిచిన కోడి పుంజుల యజమానులకు ప్రత్యేక బహుమతిగా బుల్లెట్ వాహనాలు అందజేశారు. తూర్పుపాలెం బరిలో లక్కీ డ్రా నిర్వహించి విజేతకు బుల్లెట్ ఇచ్చారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోడి పుంజులు ఎక్కువ పందేలు గెలిచి రెండు బుల్లెట్ వాహనాలను సాధించాయి. పందేలు వేయడానికి, చూడటానికి వేల మంది తరలి రావడంతో జాతర వాతావరణం కనిపించింది. రోడ్లు కిక్కిరిసి ట్రాఫిక్ జామైంది. మహిళలు సైతం పందేలు కాయడం విశేషం. భట్టిప్రోలు మండలం పల్లెకోన, కొల్లూరు, వేమూరు, చావలిలో ఏర్పాటు చేసిన బరుల్లో పందెం కోళ్లు హోరాహోరీగా తలపడ్డాయి.

● వేటపాలెం మండలం కఠారిపాలెంలో తొలిసారి బరి ఏర్పాటు చేసి పండగ మూడ్రోజులు కోడి పందేలు నిర్వహించారు. గతంలో రహస్య ప్రాంతాల్లో చిన్న పందేలు జరిగేవి. ఈసారి పెద్ద బరి ఏర్పాటుచేసి రూ.లక్షల్లో పందేలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య పందేలను తిలకించారు. జిల్లాలోని బరుల వద్ద కోత ముక్కాట, మట్కా, గుండాట తదితర జూద క్రీడలు సమాంతరంగా నిర్వహించారు. రూ.కోట్లలో జూదం సాగింది. పోటీలు జరిగే ప్రాంతాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం, బీర్లు విక్రయించారు. తాత్కాలికంగా రెస్టారెంట్లు, భోజనశాలలు ఏర్పాటు చేయగా.. భారీ ఎత్తున వ్యాపారం జరిగింది.

మంతెనవారిపాలెం బరిలో తలపడుతున్న పందెం కోళ్లు

ఆంక్షల ఫలితం.. బర్లీకి దూరం

గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఈనాడు - అమరావతి

ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది 30,822 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవగా... ప్రస్తుతం 4,391 హెక్టార్లకే పరిమితమైంది. రైతులను అప్రమత్తం చేయడం, విత్తనాలు, నారు విక్రయం, పెంపకంపై ఆంక్షలు విధించడంతోపాటు గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం.. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో పర్యవేక్షణ పెంచడంతో ఇది సాధ్యమైంది. నష్టాలు భరించైనా సాగుకు సిద్ధమంటూ ముందుకొచ్చిన రైతులకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. ఈ చర్యలకు ప్రధాన కారణం.. గతేడాది అనుభవాలు. పెద్దఎత్తున పంటను సాగు చేయడంతో సగానికిపైగా ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రంగంలోకి దిగి.. మంచి ధరకు పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. పొగాకు పూర్తిగా ఎగుమతులపై ఆధారపడడం, ఎక్కువ రోజులు నిల్వ చేసే వెసులుబాటు లేకపోవడం, డిమాండ్‌కు మించి దిగుబడులు వస్తే రైతులకు ధర లేక నష్టాలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠినంగానే వ్యవహరించింది.

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం హెక్టార్లలో..				
	గుంటూరు	బాపట్ల	పల్నాడు	మొత్తం
గతేడాది	3,369	22,770	4,683	30,822
ప్రస్తుతం	544	3,114	733	4,391

కొన్నిచోట్లే... మంచి ధరలే ఉంటాయన్న వ్యాపారుల హామీ మేరకు కొంతమంది రైతులు తెల్లబర్లీ వేశారు. కంపెనీలు రైతులతో ఒప్పందాలు అధికారికంగా చేసుకున్నచోట ప్రభుత్వం సాగుకు అనుమతిచ్చింది. ఏటా సాగు చేస్తున్న ప్రాంతాల్లోనే రైతులు ముందుకొచ్చారు. కంపెనీల నుంచి బాండ్లు ఉన్నాయా? లేదా? అని అధికారులు తనిఖీ చేశారు.

తాజా అనుభవాల ఆధారంగా వచ్చే ఏడాదిలోనూ పంటల సరళిలో మార్పులు సూచించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సాగర్ నీటిమట్టం 554 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 7 గంటలకు 554.00 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 16,110 క్యూసెక్కుల నీరు వస్తోంది. జల విద్యుత్తు కేంద్రానికి నీటిని నిలిపివేశారు.

స్లీపర్ కోచ్ టికెట్లపై థర్డ్ ఏసీలో ప్రయాణం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, రేపల్లె: సంక్రాంతి నేపథ్యంలో డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రైల్వేశాఖ నుంచి అనుకోని బంపర్ ఆఫర్ లభించింది. స్లీపర్ కోచ్‌లో టికెట్లు తీసుకున్న అనేకమంది ప్రయాణికులకు అనూహ్యంగా అప్‌గ్రేడేషన్‌లో భాగంగా థర్డ్ ఏసీలో సీట్లు కేటాయించడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఒకరో ఇద్దరో కాదు.. ఏకంగా 120 మందికి పైగా ఈ అవకాశం వరించడంతో పండుగ పూట జాక్‌పాట్‌గా సంబరపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాచిగూడ - రేపల్లె, రేపల్లె - వికారాబాద్ మధ్యన డెల్టా ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. కొద్దిరోజులుగా సాంకేతిక, అంతర్గత సమస్యలు తలెత్తడంతో అధికారులు మార్పులు చేశారు. గత నెల 25 నుంచి కొన్ని అమల్లోకి వచ్చాయి. తాజాగా ఎస్10, ఎస్11 స్లీపర్ కోచ్‌లలో టికెట్లు బుక్ అయిన ప్రయాణికులకు థర్డ్ ఏసీ కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడకుండా. ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి. స్లీపర్ కోచ్ టికెట్లపై థర్డ్ ఏసీలో ప్రయాణించే అవకాశం రావడంతో ప్రయాణికులు సంబరపడ్డారు.

డబ్బు ఎప్పుడు ఇస్తారు?

పత్తి రైతుల ఖాతాల్లో జమ చేయని సీసీఐ

రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నగదు జమ చేయడంలో జాప్యం చేస్తోంది. గత 20 రోజులుగా ఇదే పరిస్థితి. సంక్రాంతికైనా సీసీఐ నుంచి డబ్బు వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర దక్కకపోవడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. సాధ్యమైనంత తొందరగానే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఆచరణలో జాప్యం చేస్తోంది.

ఈనాడు - అమరావతి

గ్రామాల నుంచి రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలించిన తరువాత... అక్కడ అధికారులు నాణ్యత పరిశీలించి ధర నిర్ణయిస్తారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని మార్కెటింగ్‌శాఖ అధికారులు లెక్కించి సీసీఐ అధికారులకు బిల్లులిస్తారు. ఒకట్రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ బిల్లులను సీసీఐ ప్రధాన కార్యాలయంలో పరిశీలించి.. రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తారు. ఈ ఏడాది కొంతమందికి మూడు వారాలు దాటినా నగదు జమ కాలేదు. దీనిపై రైతులు సీసీఐ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు.

జీరో ఖాతాలకు సమస్య

పత్తి రైతుల్లో కొంతమంది మహిళలున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఈ-క్రాప్.. వారి పేర్లతో ఉన్నాయి. వీరిలో కొందరికి బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలున్నాయి. ఇంకొందరికి పోస్టాఫీసు ఖాతాలు కూడా ఉన్నాయి. వాటిల్లో కనీస నగదు నిల్వలు లేకపోవడంతో నగదు జమ చేయలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన ఖాతాల విషయంలో సీసీఐ అధికారులు పలు మార్లు పరిశీలన చేస్తున్నారు. ఈ కారణాల వల్లనే నిర్ణీత సమయంలోగా నగదు జమ కావడం లేదు. సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి నగదు తొందరగా జమ చేయాలని గుంటూరు గ్రామీణ మండలంలోని పలు గ్రామాలతోపాటు మరికొన్ని మండలాల రైతులు కోరుతున్నారు.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
ఆర్యవైశ్య కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. గుంటూరు ఈనాడు కార్యాలయంలో (9వ లైన్, పోలీస్ స్టేషన్ ఎదురుగా, అరండల్‌పేట) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026, శనివారం, ఆదివారం)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్ ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
92475 20500 & 95501 28306
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

హోంస్టేలకు ఆదరణ

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న చీరాలలో హోంస్టేలకు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే కొత్తపేట, చీరాల, వడ్డెసంఘం తదితర ప్రాంతాల్లో చాలా మంది తమ గృహాల్లో పర్యాటకులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేసి, అద్దెకిస్తున్నారు. పర్యాటకుల కోసం ఇప్పటికే వందల సంఖ్యలో ప్రైవేట్ అతిథిగృహాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలి. కొన్ని సమయాల్లో ఇవి ఖాళీలు లేకపోవడంతో అనుకోకుండా బంధువులతో తీరానికి వద్దామనుకునే దూర ప్రాంతాల వారికి నిరాశే మిగులుతోంది. దీన్ని గమనించిన కొందరు ఇంట్లో ఉన్నట్లుగా (హోంస్టే) వీటిని తయారు చేస్తున్నారు. దీనికోసం గూగుల్‌లోకి వెళ్లి చీరాల ప్రాంతం హోం స్టేలు అని సెర్చ్ చేస్తే వాటి వివరాలు లభ్యమవుతున్నాయి. ఒక్కొక్క ఇంట్లో డబుల్, సింగిల్, కామన్ బెడ్స్ అందుబాటులోకి ఉన్నాయి. అంతే కాకుండా వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఉంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారికి ఇంటి తరహా భోజనం, అల్పాహారం అందించడంతో వీటిపై పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. తీరంలో కన్నా తక్కువ ధరకు ఇవి దొరకడం, సమయం ఎక్కువగా ఉండటంతో ఇందులో ఉండేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారనే అభిప్రాయాన్ని నిర్వాహకులు వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపేటలోని హోం స్టే

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి

మాట్లాడుతున్న జాక్టో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బాపట్ల, న్యూస్‌టుడే: సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని జిల్లా జాక్టో అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5న సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు కోసం ఆల్ ఇండియా జాక్టో, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చ్‌కు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరువు భత్యం బకాయిలు కొందరికే జమ అయ్యాయని, పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదన్నారు. 12వ పీఆర్సీ నియమించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు లీవ్ ఎన్‌కాష్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడివాడ అమరనాథ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ నూర్ బాషా సుభాని, రాష్ట్ర కౌన్సిలర్లు ఉన్నారు.

నారాయణ హాస్పిటల్ | శ్రీకాంత్ స్పైన్ సెంటర్ Bringing Expertise To spinal Solutions

ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ !

ఇప్పుడు మన గుంటూరులో!

నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 83, ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు-522001

డా॥ శ్రీకాంత్ రెడ్డి దుంపా
M.S (Ortho), DNB (Ortho), FNB (Spine Surgery), FISS (USA)
వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణులు

మరిన్ని వివరాలకు సంప్రదించండి : +91 95974 00472

ఘనంగా త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి

రామస్వామి చిత్రపటానికి నివాళి అర్పించిన ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే: ఎస్పీ కార్యాలయంలో త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి నిర్వహించారు. రామస్వామి చిత్రపటానికి ఎస్పీ ఉమామహేశ్వర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు సాహితీ జగత్తులో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన కవిరాజుగా త్రిపురనేని నిలిచారన్నారు. ఆయన కవి మాత్రమే కాదని సామాజిక విప్లవకారుడు, హేతువాది అని పేర్కొన్నారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా ఉరుసు మహోత్సవం

హాజరైన భక్తులు

ప్రత్యేక అలంకరణలో మస్తాన్ అవులియా సమాధి

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా బాపట్ల మస్తాన్ అవులియా దర్గా ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేడుకలు తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి 145 ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు. మత సామరస్యానికి ఈ దర్గా నిలుస్తుందని దర్గా కమిటీ తెలిపింది. గంధం జెండా ఊరేగింపు వైభవంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు. 17న తహలీల్ ఫాతిమా ప్రత్యేక వేడుక ఆరాధన జరుగుతుందని కమిటీ తెలిపింది.

అపరిచిత లింకులు క్లిక్ చేసి మోసపోవద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: అపరిచిత లింకులు క్లిక్ చేసి మోసపోవద్దని, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ప్రచారమయ్యే అనుమానాస్పద లింకులపై అప్రమత్తత అవసరమని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గడిచిన కొద్ది రోజులుగా 'నాకు రూ.5 వేలు వచ్చాయి... మొదట నకిలీ అనుకున్నా. కాని మీరు కూడా ప్రయత్నించి చూడండి' అనే అంశంపై వస్తున్న లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు.

పోలేరమ్మను దర్శించుకున్న ఐక్యరాజ్య సమితి ప్రతినిధి

హరీష్ దంపతులను సత్కరించిన ఆలయ ప్రతినిధులు

కొండపాటూరు(కాకుమాను), న్యూస్‌టుడే: కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మ తల్లిని ఐక్యరాజ్య సమితి భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. కాటూరి వైద్య కళాశాల, ఆసుపత్రి అధినేత కాటూరి సుబ్బారావుతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం హరీష్ మాట్లాడారు. ఐక్యరాజ్య సమితిలో భారత్ శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. చైనా అంగీకారం తెలిపితే సానుకూలమయ్యే అవకాశం ఉందన్నారు. ఆలయ ఛైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఈఓ జక్కా శ్రీనివాసరావులు వారిని సత్కరించారు.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన

సీనియర్ కేటగిరిలో బండను లాగుతున్న ఎడ్ల జతలు

పర్చూరు, న్యూస్‌టుడే: మండల పరిధి అన్నంబట్లవారిపాలెంలోని గోరంట్ల రత్తయచౌదరి ప్రాంగణంలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు శుక్రవారంతో ఐదో రోజుకు చేరాయి. ఈ పోటీల్లో సీనియర్ కేటగిరీ విభాగంలో వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది ఎడ్ల జతలు తలపడ్డాయి. 25 క్వింటాళ్ల బరువును సునాయాసంగా లాగుతూ ఎడ్ల జతలు బలాన్ని ప్రదర్శించాయి. గురువారం జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న రైతులను ప్రోత్సహించేలా ప్రతి ఒక్క ఎడ్లజత యజమానులకు జ్ఞాపికలు నిర్వాహకులు అందించారు.

ముగిసిన పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా భీమావారిపాలెంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన శుక్రవారంతో ముగిసింది. జూనియర్, సీనియర్స్ విభాగాల్లో విడి విడిగా పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. గెలుపొందిన ఎడ్ల జత యజమానులకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సీనియర్స్ విభాగంలో అమృతలూరు మండలం పెదపూడికి చెందిన ఆలా హరికృష్ణ యాదవ్, జూనియర్స్‌లో చీరాల బోయివారిపాలేనికి చెందిన శ్రీకృష్ణయాదవ్ యూత్ ఎడ్ల జతలు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

బాపట్లలో..

విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై 20 నుంచి ప్రజాభిప్రాయసేకరణ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారు జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. పాల్గొనే వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దంతాలు లేవా? అన్ని రకాల ఆహార పదార్థాలు తినలేకపోతున్నారా?

ఇంప్లాంట్స్‌తో దృఢమైన పళ్ళు మీ సొంతం చేసుకోండి

డా. మానసారెడ్డి గారు

ఉచిత దంత చికిత్సలు
EHS (ఉద్యోగుల హెల్త్ కార్డు), CGHS & ఆరోగ్య భద్రత ద్వారా
EMI సౌకర్యం కలదు

Dr. Kiran's SMILE GROUP of Dental Hospitals Pvt. Ltd.
Andhra Pradesh | Telangana | Karnataka | Kuwait

అయ్యప్పస్వామి గుడి ఎదురుగా, బృందావన్ గార్డెన్స్, గుంటూరు
కాల్: 95502 31862

జాతీయ రహదారిపై 50 కిలోల గంజాయి స్వాధీనం

గంజాయి పొట్లాలు చూపుతున్న డీఎస్పీ రామాంజనేయులు పక్కన సీఐ శ్రీనివాసరావు, సైదా, బాషా

మార్టూరు, న్యూస్‌టుడే: కోల్‌కతా- చెన్నై 16వ నంబరు జాతీయ రహదారిపై నిషేధిత గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని మార్టూరు పోలీసులు పట్టుకుని, వారి నుంచి 50 కేజీలు స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం మార్టూరు స్టేషన్‌లో ఇద్దరు నిందితులను అరెస్టు చూపి, వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి గంజాయి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద సీఐ వై.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారన్నారు. ఈక్రమంలో కారులో కర్ణాటక రాష్ట్రం మండేకోలుకు చెందిన అబ్దుల్ అజీజ్ (బెంగళూరులో ట్యాక్సీ డ్రైవర్‌గా చలామణి అవుతూ), నెల్లూరులో ఉండే చిత్తూరు జిల్లా పాకాలకు చెందిన షేక్ ఫర్జానా బేగంతో కలిసి అరకు నుంచి బెంగళూరుకు 25 గంజాయి పొట్లాలు (ఒక్కోటి రెండేసి కిలోలు) తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. చూసేవారికి భార్యాభర్తలుగా కనిపిస్తూ అజీజ్ కారు నడుపుతుండగా, బేగం ముందు డ్రైవర్ పక్క సీటులో కూర్చుందన్నారు. కారు డిక్కీలో ప్రత్యేకంగా అర ఏర్పాటుచేసి గంజాయి పొట్లాలు కనిపించకుండా ఉంచారన్నారు. సీఐకు వచ్చిన సమాచారం మేరకు కారులో తనిఖీలు చేపట్టగా సుమారు రూ.1.15 లక్షలు విలువైన గంజాయి పట్టుబడిందన్నారు. వారు ప్రయాణిస్తున్న కారు, మూడు ఫోన్లు, రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దర్నీ అద్దంకి న్యాయస్థానానికి తరలించి న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామన్నారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ సైదా, ఏఎస్సై మహబూబ్ బాషా, హెచ్‌సీ కోటేశ్వరరావు, సాయిరాం, రమేశ్, విజయ్, అనితలను ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

పేరుకు చీపుర్ల వ్యాపారం.. తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేస్తూ..

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వీధుల్లో తిరుగుతూ చీపుర్లు విక్రయిస్తాడు. ఆ సమయంలో ఏ ఇంటికైనా తాళం వేసి ఉంటే దాన్ని పగులగొట్టి నగలు, నగదు దోచుకెళ్లే దొంగను చీరాల పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఒకటో పట్టణ పోలీసు స్టేషనలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మహ్మద్ మొయిన్ వెల్లడించారు. గత నెల 19న దేశాయిపేట పంచాయతీ కేపాల్ కాలనీలో నివసించే పుట్ట ఫణి రాజ ఇంటికి తాళం వేసి, చీరాలలో వైద్యశాలకు వెళ్లగా ఆ సమయంలో తాళాలు పగులగొట్టి, చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో విచారణ పోలీసులకు స్థానిక రైల్వేస్టేషను సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నెల్లూరు జిల్లా గూడూరు పట్టణం గాంధీనగర్‌కి చెందిన రామనాథం కిరణ్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా పైన పేర్కొన్న చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. 2023 సంవత్సరం సెప్టెంబరు మొదటి వారంలో రేపల్లె పట్టణంలోని ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి దాని తాళాలు పగులగొట్టి, బీరువాలోని నగలు తస్కరించి, వాటిని కరిగించి ముక్కగా చేశాడు. గత ఏడాది నవంబరు 11న కడప జిల్లా సిద్దవటం మండలం నలందా నగర్ లోనూ ఇదే తరహాలో చోరీ చేసి ఆ బంగారాన్ని కరిగించాడు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో ఇతనిపై 65 కేసుల వరకు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇతని నుంచి 156 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన డీఎస్పీ, సీఐ సుబ్బారావు, మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి, ఐడీ పార్టీ సిబ్బంది ఏఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, అచ్చయ్య, ప్రసాద్, పీసీ బాలచంద్రలను ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించి రివార్డు ప్రకటించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్, పక్కన సీఐ సుబ్బారావు, మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి

పండగ రోజు విషాదం.. రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కుంచాలవారిపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: పండగ రోజు విషాదం నెలకొంది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన గురువారం కుంచాలవారిపాలెం వద్ద పిట్టలవానిపాలెం మార్గంలో చోటు చేసుకుంది. చెరుకుపల్లి ఎస్సై టి.అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. నిజాంపట్నం ఎక్స్ మిలటరీ కాలనీకి చెందిన యేమినేని రామకృష్ణ బైక్‌పై పని మీద చందోలు వచ్చి తిరిగి వెళ్తున్నారు. పిట్టలవానిపాలెం నుంచి మోపెడ్‌పై వస్తున్న మరొక వ్యక్తి.. అతడు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో రామకృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మోపెడ్ నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలు కావడంతో అతడు వైద్యం నిమిత్తం గుంటూరు వెళ్లినట్లు తెలిపారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 164, రిటైల్ ధర - 191, చికెన్ విత్‌స్కిన్ - 277, చికెన్ స్కిన్‌లెస్ - 315.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267, చికెన్ స్కిన్‌లెస్ - 304.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

వలస కూలీ మృతి

కొండబాబు(పాతచిత్రం)

కొల్లూరు: స్థానిక ఇటుక బట్టీల్లో పని చేసేందుకు వచ్చిన వలస కూలీ మద్యం మత్తులో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బెల్లవరానికి చెందిన అన్నిక కొండబాబు (35) మూడు వారాల క్రితం తన అన్నతో కలిసి పెసర్లంక సమీపంలోని ఇటుక బట్టీల్లో పని చేసేందుకు వచ్చాడు. సంక్రాంతి సందర్భంగా పనికి విరామం కావడంతో కొల్లూరు చేరుకుని మద్యం తాగి, లాకుల కూడలిలోని పంట కాలువ వంతెన గోడపై కూర్చున్నాడు. కొద్దిసేపటికి కాలువలో పడిపోయాడు. నామమాత్రపు స్థాయిలో నీటి ప్రవాహం ఉన్నా తల వంతెన గోడకు కొట్టుకుని మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

కంభం చెరువులో పడి..

కంభం : పడవ బోల్తా పడి జాలరి మృతి చెందిన సంఘటన మార్కాపురం జిల్లా యర్రబాలెం సమీపంలోని కంభం చెరువులో చోటుచేసుకుంది. ఎస్సై శివ కృష్ణారెడ్డి కథనం మేరకు..వేటపాలెం మండలం రామచంద్రాపురానికి చెందిన వాయుల శేషయ్య (25) కంభంలోని పెద్దనల్లకాలువ ప్రాంతంలో ఉంటున్నారు. స్థానిక చెరువులో చేపలు పడుతూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి చెరువులో చేపలు పట్టేందుకు పడవలో వెళ్లగా ఓ చెట్టు మొద్దును ఢీకొని పడవ బోల్తా పడటంతో గల్లంతయ్యారు. మృతదేహం గురువారం నీటిపై తేలియాడగా, బాధితుడి తండ్రి కనకయ్య గుర్తించిఫిర్యాదు చేశారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం - మంగళగిరి - గుంటూరు జిల్లా

లేఖ నెం. బి2/54/2026, తేది: 16.01.2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమైన (1) చిల్లర సరుకులు మరియు (2) పూలు, పూల దండలు, సదరు రెండు ఐటములకు టెండరు నందు పొందుపరచిన విధముగా ది. 01.04.2026 నుండి ది. 31.03.2027 వరకు సప్లయి చేయుటకు అర్హులైన టెండరుదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వివరములకు 08645-232945 ద్వారా లేదా https://apeprocurement.gov.in వెబ్‌సైట్ చూడగలరు.

ఇట్లు : సహాయ కమీషనరు మరియు, కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

BUSINESS SERVICES
BUSINESS OFFER
Third Eye Consultancy - Guntur GST Registration in 1 Hour No Physical Office Required Contact: 7893270607.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL

సంక్రాంతి శుభాకాంక్షలతో... అతితక్కువ ధరలకే గృహప్రవేశానికి సిద్ధంగా 2&3 BHK FLATS

Sri Sai Fortune Heights
9440 777 999, 99499 29060

EENADU Classifieds

GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing, MG Road proximity. Call: 9866219067.

COMMERCIAL SPACE FOR SALE
GENERAL
304 Sft shop in upcoming biggest mall in Guntur with immediate Rent of 30000/- for sale. Call: 9573454266.

TO LET
COMMERCIAL
Nice Commercial Building for Long Term Rent 3Flrs with Lift & Cellar N/E Corner of 6/1 Arundelpet-Ravi, GNT. ✆ 7330724620.

PLOT FOR SALE
INNER RING ROAD

JOBS
Walk-In Interviews for Sales relationship Managers Fresher/Exp. Jayalakshmi Nexa Auto Nagar, Guntur. Whatsapp: 9100787054.

SATTENAPALLI

Wanted exp Telecallers/ Computer Operators (F) in Edu Consultancy in Lakshmipuram, Sal: 15K to 20K, Q: Deg. 9052975353.

గమనిక

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జీ.ఎస్.టీ. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల
•బాపట్ల •రేపల్లె •వేమూరు

సందడిగా ముగ్గుల పోటీలు

విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏడో వార్డులో మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, క్రీడా పోటీల్లో గృహిణులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. పురపాలక సంఘం డీఈ మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు త్రిపురనేని

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: తన రచనల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన సమరయోధుడు త్రిపురనేని రామస్వామి అని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు అన్నారు. రామస్వామి 83వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టౌన్ హాలులో శుక్రవారం న్యూస్ పేపర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాయావతి పుట్టినరోజు వేడుక

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి 70వ జన్మదిన వేడుకలు నిర్వహించడం సంతోషమని బహుజన సమాజ్‌వాద్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జి.రాజారావు అన్నారు. పట్టణంలోని మహాత్ముల విగ్రహాల కూడలిలో శుక్రవారం ఆమె జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా నాయకులు కేక్ కోసి మిఠాయిలు పంచారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? చందోలు బండ్లమ్మ దేవస్థానం సమీపంలో రహదారి పక్కన స్థానికులు చెత్తాచెదారం వేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రెండ్రోజులకు ఒకసారి చెత్త తీయడంతో ఇబ్బందిగా ఉంది. -షరీఫ్, చందోలు ✔ పరిశీలించి వెంటనే చెత్త తొలగించి మళ్లీ అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం. - సుజాత, కార్యదర్శి, చందోలు – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

స్పందన: వ్యర్థాలు తొలగింపు,, **పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే:** ఖాజీపాలెం పంచాయతీ పరిధిలోని మసీదు వీధిలో రహదారి పక్కనే గల ముళ్లపొదల్లో చెత్త వ్యర్థాలు వేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు' దృష్టికి తీసుకురాగా 14వ తేదీ ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు సిబ్బందితో చెత్త, వ్యర్థాలు తొలగింపజేశారు.

పట్టణ ప్రగతికి అడుగులు

రూ.మూడు కోట్లతో మౌలిక వసతుల పనులు

న్యూస్‌టుడే, ఆర్ట్స్ కళాశాల, రైలుపేట (బాపట్ల)

ముంపు బారిన రాజీవ్‌గాంధీ కాలనీ (పాత చిత్రం)

బాపట్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. రహదారులు, సిమెంటు కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. టెండర్లు పిలిచి త్వరలో గుత్తేదారుకు పనులు అప్పగించనున్నారు. పురపాలక సంఘానికి ఎన్నికలు జరగక పాలకవర్గం లేకపోవటంతో నిధుల కొరత ఏర్పడింది. సాధారణ నిధులు పైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా రూ.రెండు కోట్లకు మించి అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టలేకపోతున్నారు. పురపాలక సంఘంలో కొత్తగా ఏర్పడ్డ రెండు కాలనీల్లో సిమెంటు రోడ్లు, కాలువలు, పైప్‌లైన్లు నిర్మించాల్సి ఉంది.

✦ చిల్లరగొల్లపాలెం, రాజీవ్‌గాంధీకాలనీ, శారదాపురికాలనీ, వెన్నెలకంటినగర్, ఉప్పరపాలెం, రాజీవ్‌నగర్ కాలనీ, ఇందిరాకాలనీ, ప్యాడిసన్‌పేటలో భారీవర్షాలు కురిస్తే గృహాల చుట్టూ నీరు చేరుతోంది. ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వస్తోంది.

✦ పురపాలక శాఖ మంత్రి నారాయణను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కమిషనర్ రఘునాథరెడ్డి కలిసి బాపట్ల పురపాలక సంఘం ఆర్థిక పరిస్థితి వివరించారు. అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి స్పందించి రూ.3 కోట్లు విడుదల చేశారు. వీటితో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికలను పురపాలక అధికారులు, ఎమ్మెల్యే రూపొందించారు. విద్యానగర్ కాలనీలో ఎన్‌హెచ్ 216ఏ, బైపాస్ మార్గాన్ని కలుపుతూ ప్రస్తుతం ఉన్న మెటల్ రహదారి స్థానంలో తారు రోడ్డు నిర్మించనున్నారు. దీనికి రూ.కోటి కేటాయించారు.

✦ పట్టణంలోని నరాలశెట్టివారిపాలెం వద్ద జిల్లా కోర్టు సముదాయం నుంచి ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాలల మీదగా ఎన్‌హెచ్ 216 ఏ వరకు రూ.కోటితో తారు రోడ్డు నిర్మించనున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి రూ.30 లక్షలతో సిమెంటు కాలువలు నిర్మించనున్నారు. చిల్లరగొల్లపాలెం, శ్రీనివాసనగర్ కాలనీల్లో సిమెంటు కాలువల నిర్మాణానికి రూ.56 లక్షలు కేటాయించారు. వివేకానందకాలనీలో సిమెంటు రోడ్డును రూ.14 లక్షలతో నిర్మించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మార్చి నెలాఖరులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు.

బండ్లమ్మ ఆలయంలో పూజలు

అనుగ్రహమాతగా అమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. మకర సంక్రాంతి తర్వాత కనుమ పండగ కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఘంటసాల నరసింహమూర్తి మాట్లాడుతూ కనుమ రోజున సమస్త పశువృద్ధిని, జీవకోటిని అనుగ్రహించే మాతగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

వైభవంగా నరసింహుని తెప్పోత్సవం


నిజాంపట్నం ఛానల్‌లో నిర్వహిస్తున్న తెప్పోత్సవం

అల్లూరు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా రెడ్లపాలెం తీసుకువచ్చారు. అక్కడ నిజాంపట్నం ఛానల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై స్వామి వార్లను ఉంచారు. అల్లూరు నుంచి జలమార్గంలో పిట్టలవానిపాలెం తీసుకువచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలను తిలకించారు.

తీరనున్న పేదల ఆకలి

ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా భట్టిప్రోలులో అన్న క్యాంటీన్ కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్య తరగతుల వారి కల నెరవేరనుంది. స్థానిక బౌద్ధ స్తూపం ఎదుట రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేగవంతంగా పనులు జరగడంతో ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఈ నెలాఖరు లోపు ప్రారంభించాలని తెదేపా శ్రేణులు నిర్ణయించారు.

విజేతలు వీరే

బహుమతులు గెలుచుకున్న మహిళలు

బాపట్ల, బాపట్ల వెస్ట్: తెదేపా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో సంక్రాంతి సంబరాల సందర్భంగా స్థానిక భావనారాయణ స్వామి దేవస్థానం సమీపంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదవ స్థానాల్లో టి.తులసిరాణి, పి.సాయివెంకటలక్ష్మి, టి.యోగిత, యు.అన్వశ్రీ, కె.ప్రభావతి నిలిచి నగదు బహుమతులు అందుకున్నారు. ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరక్టర్ చివుకుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బరిలో కలబడుతున్న కోడిపుంజులు

పందేలు జోరుగా.. పండగ సందడిగా

పల్లెకోన(భట్టిప్రోలు), కొల్లూరు, నగరం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ పురస్కరించుకొని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో జోరుగా కోడి పందేలు కొనసాగాయి. సంక్రాంతి పండగ మూడు రోజులు ఇదే వాతావరణం నెలకొంది. రూ.లక్షల్లో నగదు లావాదేవీలు జరిగాయి. ఈ పందేలను తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు. వీటితోపాటు వివిధ రకాల జూదాలు, ఆటలు నిర్వహించారు. కొల్లూరు శివారులో ఏర్పాటు చేసిన బరిలో నిర్వహించిన కోడి పందేల్లో కారును ఆవులవారిపాలేనికి చెందిన సనకా ఉదయ భాస్కర్ గెలుచుకున్నారు. మరో ఇద్దరు చెరొక బుల్లెట్ వాహనాన్ని, ఒక్కరు యూనికాన్ వాహనాన్ని గెలుచుకున్నారు. ఈ బహుమతులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ విజేతలకు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశ్రాంత ఉపాధ్యాయుడు మోహనరావును సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

అమృతలూరు, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-75 విద్యాసంవత్సరంలో చదువుకొన్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 150 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 54 సంవత్సరాలు తర్వాత కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావును సన్మానించారు.

ఉమ్మారెడ్డితో విజేతలు

సంక్రాంతి అందరి పండగ

కొండుబోట్లవారిపాలెం (బాపట్ల టౌన్), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ భారతీయులందరూ ఉత్సాహంగా నిర్వహించుకునే పండగ అని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన స్వగ్రామమైన కొండుబోట్లవారిపాలెంలో వివిధ క్రీడా పోటీలతో పాటు ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన వారికి శుక్రవారం ఉమ్మారెడ్డి బహుమతులు అందజేశారు. పండగ సందర్భంగా ఉమ్మారెడ్డి కుటుంబం అంతా కలుసుకుంది.

పొగమంచు... రాకపోకలకు అవస్థలు

నాలుగు రోజులుగా పొగమంచుతో తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటలు దాటే వరకు వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఉదయం సమయంలో లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు తెనాలి- వెల్లటూరు రాష్ట్ర రహదారి, భట్టిప్రోలు- బ్రాహ్మణకోడూరు, కూచిపూడి-గోవాడ మార్గాల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహన దగ్గరకు వచ్చేవరకు తెలియడం లేదు. వ్యవసాయ పనులకు రోడ్లపై కాలినడకన వెళ్లేవారు మంచు కారణంగా భయపడుతున్నారు. -న్యూస్‌టుడే, వేమూరు

ఘనంగా గోదాదేవి గ్రామోత్సవం

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం సీతారామాలయం దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. గోదాదేవి, శ్రీరంగనాయకస్వామి ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం చేశారు.

ప్రాచీన సంప్రదాయ కళల ప్రదర్శన

ఐలవరం(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: సంక్రాంతి పురస్కరించుకొని ఐలవరం గ్రామంలో ప్రాచీన సంప్రదాయ కళలను ప్రదర్శించారు. కర్రసాము, కూచిపూడి నృత్యం, రిబ్బన్ ఆటలు వంటివి ఆకట్టుకొన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు ప్రారంభించారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరులోని పించనుదారుల భవనంలో గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన కుటుంబ సభ్యులను, ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించారు. ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసి వయో వృద్ధులు నార్ల భూషయ్య, గాజుల నాగలక్ష్మి, ఎం.లక్ష్మి, గరికపాటి బాబూరావు, సుబ్బారావు, మధు, మల్లిపెద్ది సాంబశివరావు, కూచిపూడి యోబు, ఆంజనేయప్రసాద్, ప్రవాస భారతీయుడు మల్లిపెద్ది వెంకట మురళీలకు సన్మానం జరిగింది.

అక్కరకురాని దాతల సాయం

రేపల్లె మండలం సింగుపాలెంలో కొన్నేళ్లుగా ప్రజలకు ప్రభుత్వ హోమియో వైద్యశాల అందడం లేదు. కొవిడ్-19 దృష్ట్యా కొద్దిరోజులు వైద్యశాలను తెరవలేదు. అక్కడ పనిచేసిన వైద్యురాలు 2020 మార్చిలో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం కొన్ని రోజులు డిప్యూటేషన్‌పై ఓ వైద్యుడు సేవలు అందించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యుడ్ని నియమించక వైద్యం పూర్తిగా దూరమైంది. సింగుపాలేనికి చెందిన విశ్రాంత హోమియో అడిషనల్ డైరెక్టర్ యార్లగడ్డ సత్యనారాయణ వైద్యశాల భవన నిర్మాణానికి స్థలం దానం చేశారు. నిర్మాణానికి యార్లగడ్డ శరత్ బాబు, శ్రీకాంత్ బాబు ఆర్థిక సాయం చేశారు. మండల అధికారులు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

బోర్డు సరి చేయండి

తెనాలి- వెల్లటూరు మార్గంలో జంపని రావులమ్మ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఊరు పేర్లను తెలిపే బోర్డు నేలవాలింది. దాని గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు కొందరు తాము వెళ్లే మార్గం ఏ ఊరు వెళ్తుందో తెలియక తికమక పడుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేష్ మాట్లాడుతూ పరిశీలించి, నేలవాలిన బోర్డు సరిచేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, వేమూరు

చేతిపంపునకు తుప్పు

తహసీల్దారు కార్యాలయం ముందున్న చేతి పంపు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురైంది. కార్యాలయానికి వచ్చిపోయే ప్రజలు వినియోగించుకునేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం ముందున్న చేతి పంపు పైపునకు తుప్పు పట్టింది. నెలలో ఒకరిద్దరు జిల్లా స్థాయి అధికారులు కార్యాలయానికి వచ్చి పోతుంటారు. అయినా పట్టించుకోవడం లేదు. త్వరగా బాగు చేయించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నగరం

అందుబాటులో అంబులెన్స్

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జాతీయ రహదారిపై ప్రత్యేకంగా 1033 అంబులెన్స్ వాహనాన్ని అధికారులు సిద్ధం చేశారు. జాతీయ రహదారి 216పై చీరాల నుంచి రేపల్లె వరకు రోడ్డు ప్రమాద బాధితుల రక్షణకు ఈ వాహనాన్ని ఉంచారు. చందోలు పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం కూడలి వద్ద ఈ వాహనం ఉంటోంది. - చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

నాటారు.. రక్షించారు

పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజాప్రతినిధుల నుంచి అధికారుల వరకు చెప్పడం పరిపాటే. అయితే కొందరు మాటలతో సరిపెట్టకుండా ఆచరణలో పెట్టడం అరుదు. వేమూరు మండలం పెనుమర్రు అడ్డరోడ్డు నుంచి భట్టిప్రోలు వెళ్లే మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఐదారేళ్ల క్రితం రోడ్డుకు రెండువైపులా మొక్కలు నాటడమే కాకుండా రక్షించారు కూడా. దీంతో అవి పెరిగి పెద్దవై, బాటసారులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. –న్యూస్‌టుడే, వేమూరు

చినఅరవపల్లి దారి.. ఆదమరిస్తే ప్రాణాలు హరీ

రహదారి దుస్థితి ఇలా..

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం చిన అవరపల్లి నుంచి తుమ్మల వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వరి ధాన్యం బస్తాలతో కైతేపల్లి నుంచి రేపల్లె వస్తున్న ట్రాక్టరు ఎదురుగా వస్తున్న బస్సుకు దారి ఇచ్చే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవరు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ట్రాక్టరుపై ఎవరూ కూర్చోకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మోళ్లగుంట, తుమ్మల, పోటుమెరక, వడ్డివారిపాలెం, బొందలగరువు, సింగుపాలెం, విశ్వేశ్వరం, కైతేపల్లి నుంచి నిత్యం ఈ మార్గం నుంచే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. అధ్వానంగా ఉన్న రోడ్డుపై రాకపోకలు చేసేప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతామోనని ఆందోళన చెందుతున్నారు.

రూ.49 కోట్లు మంజూరు.. : గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రహదారులను అభివృద్ధి చేయించడంలో విఫలమైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.49 కోట్లు మంజూరు చేయించారు. అరవపల్లి నుంచి గంగడిపాలెం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టారు. అయినా ఇప్పటి వరకు అధికారులు పనులు ప్రారంభించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రహదారులు భవనాల శాఖ ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలో పనులు చేపట్టేలా చొరవ చూపుతామని తెలిపారు.

సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌ల సందడి

వృద్ధులతో రామ్‌లక్ష్మణ్‌లు

చీరాల అర్బన్, పర్చూరు, న్యూస్‌టుడే: చీరాలలో సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు శుక్రవారం సందడి చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని హరిప్రసాద్ నగర్‌లో ఉన్న కోటయ్య వృద్ధాశ్రమాన్ని వారు సందర్శించి, స్వయంగా వృద్ధులకు అల్పాహారం వడ్డించారు. అనంతరం చిన్నారులతో కలిసి డ్యాన్సులు, కర్రసాము చేసి అందర్నీ అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఈ ఆశ్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉంటోందన్నారు. తాము పోరాట దృశ్యాలు రూపొందించిన అఖండ-2(బాలకృష్ణ నటించిన) మంచి విజయాన్ని తెచ్చిపెట్టిందని, మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాదుతో పాటు ప్రభాస్ నటించిన రాజాసాబ్‌లోనూ ఫైట్ మాస్టర్లుగా చేశామని, సినిమాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

✦ పర్చూరు మండల అన్నంబొట్లవారిపాలెంలో గురువారం సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు సందడి చేశారు. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో అప్పలనేని రంగయ్య ప్రాంగణంలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి బండలాగుడు ఎడ్ల బలప్రదర్శన పోటీలకు వారు హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో జరిగిన ఈ పోటీలను వారు ఆసక్తిగా వీక్షించారు. నిర్వాహకులు వారిని సన్మానించారు.

కూలేందుకు సిద్ధమై.. గుండెల్లో గుబులై

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలో పలు చోట్ల పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్లుగడుస్తున్నా వీటిని కూల్చడం లేదు. పిట్టలవానిపాలెం సాయిబాబా గుడి సమీపంలో వ్యవసాయ పరపతి సంఘం గోదాములు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గ్రామంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటం వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, భక్తులు, రైతులు ఇటుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

పీవీపాలెంలో శిథిలావస్థకు చేరిన పీఏసీఎస్ భవనం

ప్రస్తుతం చిన్నచిన్న రాళ్లు పెచ్చులూడి పడుతున్నాయని, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్లపొదలు అల్లుకు పోయి విషసర్పాలకు నిలయంగా మారాయని రాత్రి వేళ ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ❖ ఖాజీపాలెం పీఏసీఎస్ భవనం అల్లూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉంది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనంపై పెద్దపెద్ద వృక్షాలు పెరిగి గోడలను చీల్చేశాయి. పెద్ద గాలి వీస్తే ముప్పు తప్పదని స్థానికులు చెబుతున్నారు. భవనంలో విషపురుగులు, పిల్లులు చేరి రాత్రి వేళ నిద్ర లేకుండా చేస్తున్నాయని, అంటు రావాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చోడిపాలెం రామాలయం పక్కన విద్యార్థులు లేక పోవడంతో పదేళ్ల క్రితం పాఠశాలను మూసివేశారు. పాఠశాల గదులు పడిపోయి ముళ్లపొదలు అల్లుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి పాత భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యుడు కొమ్మినేని మృతికి నివాళి

బాపట్ల: మాజీ ఎమ్మెల్యే కొమ్మినేని వెంకటేశ్వరరావు కుమారుడు, ప్రముఖ వైద్యుడు కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు(92) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బాపట్ల మండలం కంకటపాలేనికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మరణించారు. పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

తెదేపా కార్యకర్త..

అమృతలూరు: మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త ప్రకాశరావు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. తెలుగు యువత నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం రూ.11 వేలు అందించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చిన్ని దీప్తి, W/o. సోము విజయ్‌కుమార్, డోర్ నెం. 14-6-41, వింజమూరివారితోట, వార్డు నెం.25, బాపట్ల, నాకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 7082/2022 దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం. 8170/2021 పోయినవి. దొరికినవారు సంప్రదించగలరు.

✆ 94924 66038

సినీ ఫక్కీలో చోరీ

కొల్లూరు, న్యూస్‌టుడే: తన ద్విచక్ర వాహనాన్ని స్థానిక గౌడపాలెంలోని ఓ హోటల్ ముందు నిలిపి టీ తాగుతున్న వ్యక్తిని ఏమార్చి అతడి బండిలోని నగదును సినీ ఫక్కీలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు చాకచక్యంగా దొంగిలించి ఉడాయించిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో స్థానికంగా హల్‌చల్ చేస్తుండడంతో చర్చనీయాంశంగా మారింది. కారులో వచ్చిన నలుగురిలో ఓ వ్యక్తి టీ తాగుతున్న ద్విచక్ర వాహనదారుడి వద్దకు వచ్చి మాటలు కలిపి ఏమార్చగా మరొక యువకుడు బండిలోని నగదు, పుస్తకాలను దొంగిలించాడు. ఇంతలోనే మరో బండిపై అక్కడకు చేరుకున్న యువకుడు నగదు చోరీ చేసిన యువకుడ్ని ఎక్కించుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ఇంతలోనే ద్విచక్ర వాహనదారుడిని ఏమార్చిన వ్యక్తి, కారు అనూహ్యంగా అక్కడ నుంచి మాయం అయ్యాయి. టీ తాగి తన ద్విచక్రవాహనం వద్దకు చేరుకున్న బాధితుడు తన వాహనంలోని సుమారు రూ.7 వేలు నగదు, విలువైన పుస్తకాలు మాయం కావడంతో అవాక్కయ్యాడు. బాధితుడితో పాటు చోరీకి పాల్పడిన వ్యక్తులు ఎవరనేది వెల్లడి కాలేదు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

టీ తాగుతున్న ద్విచక్ర వాహనదారుడు (ఎర్ర చొక్కా వ్యక్తి)ని మాటలతో ఏమార్చుతున్న పక్కనున్న తెల్ల చొక్కా వ్యక్తి

జూద శిబిరం వద్ద గొడవ

గుంపును చెదరగొట్టిన పోలీసులు

పాతఎడ్లంక (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం పాత ఎడ్లంకలో కోడి పందెం విషయమై శుక్రవారం ఇరువర్గాలు గొడవకు దిగగా.. పోలీసులు లాఠీఛార్జి చేశారు. నాగాయలంకకు చెందిన ఒక వర్గం వారు, బాపట్ల జిల్లా అడవులదీవి ప్రాంతం వారు రూ.పది వేలకు కోడి పందెం వేశారు. పందెం చివరిలో పోలీసులు రావడంతో అందరూ పారిపోగా.. కోడికి కత్తి కట్టిన అతను, కోళ్ల యజమానులు మిగిలారు. వారు మేం గెలిచామంటే మేం గెలిచామని వాగ్వాదానికి దిగారు. ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో లాఠీఛార్జి చేయగా అందరూ పారిపోయారు.

గొడవ పడుతున్న ఇరువర్గాలు, జోక్యం చేసుకుంటున్న పోలీసులు

బండను లాగుతూ... బలాన్ని ప్రదర్శిస్తూ...

పర్చూరు: సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధి అన్నంబొట్లవారిపాలెంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో అప్పలనేని రంగయ్య ప్రాంగణంలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి బండలాగుడు ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారంతో నాల్గో రోజుకు చేరాయి. న్యూకేటగిరీ విభాగంలో తొమ్మిది ఎడ్ల జతలు పాల్గొనగా సాయంత్రం పోటీలను ప్రారంభించారు. పాల్గొన్న ప్రతి ఎడ్ల జత యజమానులకు జ్ఞాపికలు అందజేశారు. గురువారం జరిగిన సీనియర్ కేటగిరీ విభాగంలో ఎల్‌వీఆర్ బుల్స్ కృష్ణా జిల్లా గన్నవరానికి కె.రాజాచౌదరి(ప్రథమ), బీరమ్స్ బుల్స్ నంద్యాల జిల్లాకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరావు(ద్వితీయ), కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని సత్యచౌదరి (మూడవ) బహుమతులు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'మన శంకర్‌వరప్రసాద్ గారు' విజయోత్సవం

యద్దనపూడి: వెండితెర సంచలనాల యువ దర్శకుడు అనిల్ రావిపూడి స్వగ్రామం చిలుకూరివారిపాలెంలో సందడి నెలకొంది. శుక్రవారం చిలుకూరివారిపాలెం విచ్చేసిన అనిల్‌కి అభిమాన సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి బరిలో మెగాస్టార్ చిరంజీవి నటించిన చిత్రం మన శంకర్‌వరప్రసాద్ గారు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీనికి దర్శకత్వం వహించిన అనిల్‌తో అభిమాన సంఘ నేతలు కేకు కోయించి, మిఠాయిలు పంచారు.

(c) eenadu

చీరాల

•చీరాల •పర్చూరు

బండను లాగుతూ...బలాన్ని ప్రదర్శిస్తూ...

న్యూ కేటగిరీ విభాగం పోటీలో ఎడ్ల జతలు

పర్చూరు, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధి అన్నంబొట్లవారిపాలెంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో అప్పలనేని రంగయ్య ప్రాంగణంలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి బండలాగుడు ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారంతో నాల్గో రోజుకు చేరాయి. న్యూకేటగిరీ విభాగంలో తొమ్మిది ఎడ్ల జతలు పాల్గొనగా సాయంత్రం పోటీలను ప్రారంభించారు. పాల్గొన్న ప్రతి ఎడ్ల జత యజమానులకు జ్ఞాపికలు అందజేశారు. గురువారం జరిగిన సీనియర్ కేటగిరీ విభాగంలో ఎల్‌వీఆర్ బుల్స్ కృష్ణా జిల్లా గన్నవరానికి కె. రాజాచౌదరి(ప్రథమ), బీరమ్స్ బుల్స్ నంద్యాల జిల్లాకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరావు(ద్వితీయ), కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని సత్యచౌదరి (మూడవ) బహుమతులు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ద్రోణాదుల తిరునాళ్ల

ద్రోణాదుల(మార్టూరు), న్యూస్‌టుడే: కనుమ పర్వదినం మరునాడు ఆనవాయితీగా నిర్వహించే గ్రామ తిరునాళ్ల ఉత్సవాలకు మండలంలోని ద్రోణాదుల ముస్తాబైంది. శనివారం మధ్యాహ్నం గ్రామ చెరువులో స్వామి వార్ల ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు, ఉన్నత పాఠశాలలో కోలాట ప్రదర్శన ఉంటాయని తెలిపారు.

వాడరేవులో పోలీసుల పల్లె నిద్ర

చీరాల గ్రామీణం: వాడరేవు తీరంలో శుక్రవారం రాత్రి గ్రామీణ పోలీసులు పల్లె నిద్ర నిర్వహించారు. గ్రామస్థులను సమావేశపరిచి పలు రకాల చట్టాలు, నేరాలు, వాటికి విధించే శిక్షల గురించి వివరించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా పలు సూచనలు చేశారు. గ్రామీణ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చీరాల: వీరరాఘవస్వామివారి నగరోత్సవం

ఇంకొల్లు నాగుల చెరువులో తెప్పోత్సవం

కారంచేడు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి, నిర్వాహకులు

చీరాల: ఆవులకు పూజ చేస్తున్న వార్డు ప్రతినిధులు

సంక్రాంతి వేడుకలు.. ఆనందాల లోగిళ్లు

చీరాల: కొలువుదీరిన బొమ్మలు

చీరాల, చీరాల అర్బన్, ఇంకొల్లు, కారంచేడు, మార్టూరు, యద్దనపూడి, చినగంజాం, న్యూస్‌టుడే: తెలుగువారి పెద్దపండగ సంక్రాంతిని ప్రజలు సందడిగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి రోజున ఉత్తరాయణ పుణ్యకాలంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. బొమ్మల కొలువులు నిర్వహించారు. కనుమ రోజు పశువులను పూజించారు. చల్లారెడ్డిపాలెంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, నేత అమర్‌నాథ్‌లు పాల్గొన్నారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. వాక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్‌పీఎం మైదానంలో వేడుకలు నిర్వహించారు. పశువులను పూజించారు. కనుమ సందర్భంగా వీరరాఘవస్వామివారి నగరోత్సవం వైభవంగా చేశారు.

★ ఇంకొల్లు పరిసర గ్రామాల్లో వేడుకలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. కనుమ సందర్భంగా ఇంకొల్లు నాగుల చెరువులో ప్రధాన దేవతలైన చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి, గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను తెప్పపై ఉంచి, ఉత్సవం నిర్వహించారు. బాలబాలికలతో బృందావన భజన కార్యక్రమం, పాట కచేరీ ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం దగ్గర ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గంగిరెద్దుల ప్రదర్శనలు, గంగడసం, ఇదు పులపాడు, నక్కలపాలెం, పూసపాడు, దుద్దుకూరు గ్రామాల్లో మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించారు. కనుమ రోజు మద్యం, మాంసం దుకాణాలు కిటకిటలాడాయి.

యద్దనపూడి, కారవిరావపాలెం, రాజుపాలెం, పూనూరు తదితర గ్రామాల్లో తెప్పోత్సవాలు ప్రత్యేకతను చాటాయి. మార్టూరు మండలం ఐలవరంలో శుక్రవారం తెదేపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనిలో ఆలపల్లి గ్రామానికి చెందిన కె.శేషకుమారి మొదటి బహుమతిగా రూ.10,116, రెండో బహుమతిని కోనంకి గ్రామానికి చెందిన రూ.7,116, మూడో బహుమతిగా రూ.5116 వలపర్ల చెందిన ఎస్.కోమలి గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు.

చినగంజాం భావనారాయణ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత భావనారాయణ స్వామి, శ్రీసీతారామస్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లను, శివాలయంలోని గంగాభవానీ సమేత చిదంబరేశ్వరస్వామి వార్లను రెండు ట్రాక్టర్లపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. సంతరావూరు, కడవకుదురు, గొనసపూడి గ్రామాల్లో దేవేరులను గ్రామోత్సవాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. పెదగంజాంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కొత్తపాలెం శివాలయం వద్ద శుక్రవారం సాయంత్రం తెప్పోత్సవం వైభవంగా జరిగింది. మున్నంవారిపాలెం గ్రామ పెద్దలు, ఎంప్లాయీస్ యూనియన్, యూత్ ఆధ్వర్యంలో శివాలయం వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై రమేష్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీనికి ముందు మున్నంవారిపాలెంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, చిన్న పిల్లలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ద్వారకపాడులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

★ చీరాల పట్టణ పరిధి వైకుంఠపురంలోని కొణికి వారి ఇంట సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. చంద్రశేఖర్, సావిత్రి దంపతులు, వీరి కుమార్తెలు సుష్మ, శ్రావ్య, వైష్ణవిలు ఏటా వివిధ రకాల బొమ్మలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో రామాయణం, భారతం, వివాహ వ్యవస్థను తెలిపే సెట్టింగ్ సంబంధించిన బొమ్మలు ఉన్నాయి. ప్రారంభంలో కొన్ని బొమ్మలతో వీటిని ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఆ సంఖ్య 1500 చేరడం విశేషం. విహార యాత్రలకు వెళ్లిన ప్రతిసారి కొత్తవాటిని తీసుకొచ్చి ఇంట్లో ప్రదర్శన నిమిత్తం వీరు ఉంచుతున్నారు. దీన్ని చూసేందుకు చుట్టుపక్కల వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సృజన వెలికితీతకే ముగ్గుల పోటీలు

మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సంక్రాంతి పండగ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందన్నారు. గురువారం రాత్రి కారంచేడులో గౌతమబుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, శ్రీ ప్రసన్నాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళలు ముగ్గులను బియ్యం పిండితో వేస్తే ఆ పిండిని చీమలు ఆహారంగా తీసుకుంటాయని, ఇది ప్రకృతి ధర్మమన్నారు. ఈ పోటీల్లో యార్లగడ్డ హర్షిత(ప్రథమ), తాళ్లూరి దేవశ్రీ(ద్వితీయ), పూరిమెట్ల మౌనిక(మూడవ), పూనాటి రాజ్యలక్ష్మి(నాల్గవ)తో పాటు ప్రత్యేక బహుమతిని చుండూరి శ్రీవర్షిణి దక్కించుకున్నారు. విజేతలకు ఎంపీ పురందేశ్వరి బహుమతులు అందజేశారు. వాడరేవులోని తమ ఫామ్ హౌస్‌ని ఎంపీ పురందేశ్వరి, భర్త, మాజీ మంత్రి వెంకటేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె తీరం వెంట కొద్దిసేపు షికారు నడిపారు. సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

రాజపాలెం చెరువులో రాములోరి తెప్పోత్సవం

మార్టూరు: ఆకట్టుకున్న రంగవల్లి

ఇంకొల్లు ఆంధ్రా బ్యాంకు రోడ్డులో..

చినగంజాంలో ఎద్దుల బండిపై ఊరేగింపుగా వెళుతున్న దేవేరులు

సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌ల సందడి

వృద్ధులతో రామ్‌లక్ష్మణ్‌లు

చీరాల అర్బన్, పర్చూరు, న్యూస్‌టుడే: చీరాలలో సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు శుక్రవారం సందడి చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని హరిప్రసాద్ నగర్‌లో ఉన్న కోటయ్య వృద్ధాశ్రమాన్ని వారు సందర్శించి, స్వయంగా వృద్ధులకు అల్పాహారం వడ్డించారు. అనంతరం చిన్నారులతో కలిసి డ్యాన్సులు, కర్రసాము చేసి అందర్నీ అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఈ ఆశ్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉంటోందన్నారు. తాము పోరాట దృశ్యాలు రూపొందించిన అఖండ-2(బాలకృష్ణ నటించిన) మంచి విజయాన్ని తెచ్చిపెట్టిందని, మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాదుతో పాటు ప్రభాస్ నటించిన రాజాసాబ్‌లోనూ ఫైట్ మాస్టర్లుగా చేశామని, సినిమాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

★ పర్చూరు మండల అన్నంబొట్లవారిపాలెంలో గురువారం సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు సందడి చేశారు. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో అప్పలనేని రంగయ్య ప్రాంగణంలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి బండలాగుడు ఎడ్ల బలప్రదర్శన పోటీలకు వారు హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో జరిగిన ఈ పోటీలను వారు ఆసక్తిగా వీక్షించారు. నిర్వాహకులు వారిని సన్మానించారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో స్వర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి క్రీడా సంబరాల్లోనూ పాల్గొన్నారు.

వైభవంగా భావనారుషి బ్రహ్మోత్సవాలు

ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

వేటపాలెం, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీభద్రావతి సమేత భావనారుషి నగరోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పులి వాహనంపై ఉంచి మేళతాళాలు, తప్పెట్ల నడుమ దేవతామూర్తుల వేషధారణలతో సాగించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి లీలా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాన్ని పద్మశాలీయ బహుత్తమ సంఘ ప్రతినిధులు పర్యవేక్షించారు.

చీరాల, న్యూస్‌టుడే: పేరాలలోని శ్రీభావనారుషిస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారి నగరోత్సవం, బాలికలకు లెమెన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి పొంగళ్లు మాను ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈసందర్భంగా రంగోలి నిర్వహించారు. కాశీపతి జానపద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, గుద్దంటి వెంకటసుబ్బారావు ఇతర పెద్దలు పర్యవేక్షిస్తున్నారు.

తుప్పు పడుతున్నాయ్

పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాలు

పర్చూరు, న్యూస్‌టుడే: మండలంలో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు పెద్ద సంఖ్యలో ఉండిపోయాయి. వీటికి సంబంధించిన కేసుల్లో పురోగతి మేరకు తిరిగి ఇవ్వడమా లేదా అన్న విషయం తెలుస్తోంది. ఒక ట్రాక్టర్‌తో పాటు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొన్నేళ్లుగా ఈ స్టేషన్ ఆవరణలో, పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. వాహనాలు తిరిగి అందజేసే సమయానికి యజమానులకు పనికిరాకుండా తయారయ్యే పరిస్థితి నెలకొంది. కేసులు త్వరితగతిన పూర్తి చేస్తే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

నాటక రచయిత కందిమళ్లకు సత్కారం

కందిమళ్లను సత్కరిస్తున్న కౌండిన్య ట్రస్టు ప్రతినిధి డాక్టర్ నారాయణ

కోలలపూడి (మార్టూరు), న్యూస్‌టుడే: కళారంగ అభ్యున్నతికి అహర్నిశలూ శ్రమించే వ్యక్తి విశ్రాంత అధ్యాపకుడు, రంగస్థల రచయిత, నటుడు కందిమళ్ల సాంబశివరావు అని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ ఈవీ నారాయణ అన్నారు. మండలంలోని కోలలపూడిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కందిమళ్లను ఘనంగా సత్కరించారు. విద్య, సేవ రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. డీఎస్పీ చంద్రమౌళి, బలరామయ్య, వెంకటరావు, సర్పంచి సతీష్ పాల్గొన్నారు. అనంతరం కౌండిన్య ట్రస్ట్ ద్వారా గ్రామంలోని పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఏటా ట్రస్ట్ ద్వారా 600 మందికి ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు చెప్పారు. కోలలపూడిలో 49 మంది బాలలకు అందజేశారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

'మన శంకర్‌వరప్రసాద్ గారు' విజయోత్సవం

అనిల్ రావిపూడితో అభిమానులు

యద్దనపూడి, న్యూస్‌టుడే: వెండితెర సంచలనాల యువ దర్శకుడు అనిల్ రావిపూడి స్వగ్రామం చిలుకూరివారిపాలెంలో సందడి నెలకొంది. శుక్రవారం చిలుకూరివారిపాలెం విచ్చేసిన అనిల్‌కి అభిమాన సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి బరిలో మెగాస్టార్ చిరంజీవి నటించిన చిత్రం మన శంకర్‌వరప్రసాద్ గారు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీనికి దర్శకత్వం వహించిన అనిల్‌తో అభిమాన సంఘ నేతలు కేకు కోయించి, మిఠాయిలు పంచారు. అంతకుముందు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. అనిల్ అభిమాన సంఘం రాష్ట్ర నేత కృపారావు వెంట ఉన్నారు.

కూలే వరకు పట్టదా?

పర్చూరు- కొల్లావారి పాలెంలో ఇలా..

పర్చూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారగా, గ్రామాల్లోని వార్డుల్లో కొన్ని నియంత్రికల వద్ద చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయని ప్రజలు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పర్చూరు-కొల్లావారిపాలెం వెళ్లే రహదారిలో పొలాల్లో స్తంభాలు ఒకవైపు పూర్తిగా ఒరిగాయి. శ్రీ అద్దంకి నాంచారమ్మ దేవాలయం సమీపంలో ఓ భవనం వద్ద పిచ్చిమొక్కలు అల్లుకున్నాయని, గాలులు వీచినప్పుడు నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో మూడడుగుల ఎత్తులో విద్యుత్తు నియంత్రిక ఉండటంతో ఆ వైపు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం: జె.శ్రీనివాసులు, డీఈఈ, పర్చూరు

కొన్ని గ్రామాల్లో ఒరిగిన విద్యుత్తు స్తంభాలను సరి చేసే పనులు చేపట్టాం. తక్కువ ఎత్తులో ఉన్న తీగలను సరి చేయడంతోపాటు నియంత్రికల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగిస్తాం. ప్రజలకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

శ్మశానంలో ఖననానికి జాగా ఏదీ?

సమాధులతో నిండిపోయిన రుద్రభూమి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: శ్మశానంలో ఖననానికి జాగాలేక అంబేడ్కర్‌నగర్ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొల్లు గ్రామం ఏర్పడినప్పుడు కొద్దిపాటి స్థలంలో శ్మశానం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికి ఇప్పటికి కాలనీ ఐదు రెట్లు విస్తీర్ణం పెరిగింది. జనాభా రెండు వేలకు చేరింది. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం మృతులను ఖననం చేసి, నిర్మాణాలు ఏర్పాటు చేసుకుంటారు. దీంతో ఉన్న కొద్దిపాటి స్థలం సమాధులతో నిండిపోయింది. రెండు దశాబ్దాలుగా రుద్రభూమికి కొత్తగా స్థలం కేటాయించాలని కాలనీ వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం స్వర్ణ ఆర్అండ్‌బీ రోడ్డు అంచు వరకు సమాధులు ఏర్పాటయ్యాయి. శ్మశానంలో అడుగుపెట్టే వీల్లేకుండా ఉండటంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమ కాలనీకి కొంత స్థలం ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల రజతోత్సవాలు

పూర్వ విద్యార్థుల బృందం

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత శుక్రవారం పాఠశాల ఆవరణలో కలుసుకుని, రజతోత్సవాలను వేడుకగా జరుపుకొన్నారు. ఆనాటి జ్ఞాపకాలు... తరగతి గదుల్లో చేసిన అల్లరి... ఉపాధ్యాయుల దండన తదితర విషయాలను ఒక్కసారి మననకు తెచ్చుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో పాటు కళాశాల కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, గొల్లపూడి సీతారాంలను సత్కరించారు. అందె కుమార్, పొన్నూరి రవిబాబు, అవ్వారు మోహనరావు, కల్లూరి మాధవరావు, షఫీ, సంతోష్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నిటలాక్షేశ్వరరావుకు అభినందనలు

పందిళ్లపల్లి (వేటపాలెం), న్యూస్‌టుడే: పందిళ్లపల్లి కొత్తనగర్‌కి చెందిన కొలుకుల నిటలాక్షేశ్వరరావు విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఈయన అఖిల భారత సాంకేతిక విద్యామండలిలో ఫెలోషిప్ సాధించారు. మాజీ శాసన సభ్యుడు ఆమంచి కృష్ణమోహన్, దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బండ్ల బాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేటపాలెం, న్యూస్‌టుడే: వారందరూ బీబీహెచ్ ఉన్నత పాఠశాలలో 1998లో పదోతరగతి చదువుకున్నారు. సంక్రాంతి రోజున నాగవరపమ్మ ఆలయం వద్ద అందరూ సమావేశమై చిన్నప్పటి అల్లర్లు, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనాటి మిత్రుడు బాణాల లక్ష్మీనారాయణ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని కుటుంబానికి రూ.లక్ష డిపాజిట్ రూపంలో అందజేయడానికి, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

అక్షర యోధుడు త్రిపురనేని

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: తన రచనల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన సమరయోధుడు త్రిపురనేని రామస్వామి అని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు అన్నారు. రామస్వామి 83వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టౌన్ హాలులో శుక్రవారం న్యూస్‌పేపర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తీరనున్న పేదల ఆకలి

ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా భట్టిప్రోలులో అన్న క్యాంటీన్ కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్య తరగతుల వారి కల నెరవేరనుంది. స్థానిక బౌద్ధ స్తూపం ఎదుట రూ. 61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేగవంతంగా పనులు జరగడంతో ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఈ నెలాఖరు లోపు ప్రారంభించాలని తెదేపా శ్రేణులు నిర్ణయించారు.

పొట్టేళ్ల విజేతలకు బహుమతులు

పర్చూరు, న్యూస్‌టుడే: మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బలప్రదర్శన పోటీల్లో విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ. 10,116 కాకుమానుకు చెందిన నాగయ్య, రెండో బహుమతిగా రూ. 7,116 మార్టూరుకు చెందిన పి.శ్రీనివాసరావు, మూడో బహుమతిగా రూ. 5,116 అద్దంకి మండలం తమ్మవరం గ్రామానికి చెందిన వేల్పుల వెంకటేశ్వరరావుల పొట్టేళ్లు కైవసం చేసుకున్నాయి.

వివాహిత అదృశ్యంపై కేసు

కారంచేడు, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామానికి చెందిన 24 ఏళ్ల వివాహిత అదృశ్యంపై శుక్రవారం రాత్రి కారంచేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ 15వ తేదీ మధ్యాహ్నం నుంచి ఆ మహిళ కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

చికిత్స పొందుతున్న సాయి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఏం చేయాలో అర్థం కాక చివరకు పెట్రోలు పోసుకున్న పట్టణంలోని కొట్ల బజారుకు చెందిన తల్లీ కొడుకైన వేముల సుజాత, సాయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో తల్లి (58) మృతిచెందిన విషయం తెలిసిందే. గాయాలతో సాయి ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనిపై రెండో పట్టణ ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవకు సత్కారం

రాఘవతో యాదవ సంఘ పెద్దలు

చినగంజాం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కడవకుదురు యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని కబడ్డీ, పరుగు, లెమన్ స్పూన్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి, శుక్రవారం రాత్రి జరిగిన సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం యాదవ సంఘం పెద్దలు, ఉద్యోగులు, యువజన సంఘం వారు ఇటీవల జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గ్రామ యాదవ సంఘానికి చెందిన నక్కల రాఘవను శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

సినీ ఫక్కీలో చోరీ

టీ తాగుతున్న ద్విచక్ర వాహనదారుడు (ఎర్ర చొక్కా వ్యక్తి)ని మాటలతో ఏమార్చుతున్న పక్కనున్న తెల్ల చొక్కా వ్యక్తి

కొల్లూరు, న్యూస్‌టుడే: తన ద్విచక్ర వాహనాన్ని స్థానిక గౌడపాలెంలోని ఓ హోటల్ ముందు నిలిపి టీ తాగుతున్న వ్యక్తిని ఏమార్చి అతడి బండిలోని నగదును సినీ ఫక్కీలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు చాకచక్యంగా దొంగిలించి ఉడాయించిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ పుటేజీ సామాజిక మాధ్యమాల్లో స్థానికంగా హల్‌చల్ చేస్తుండడంతో చర్చనీయాంశంగా మారింది. కారులో వచ్చిన నలుగురిలో ఓ వ్యక్తి టీ తాగుతున్న ద్విచక్ర వాహనదారుడి వద్దకు వచ్చి మాటలు కలిపి ఏమార్చగా మరొక యువకుడు బండిలోని నగదు, పుస్తకాలను దొంగిలించాడు. ఇంతలోనే మరో బండిపై అక్కడకు చేరుకున్న యువకుడు నగదు చోరీ చేసిన యువకుడ్ని ఎక్కించుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ఇంతలోనే ద్విచక్ర వాహనదారుడిని ఏమార్చిన వ్యక్తి, కారు అనూహ్యంగా అక్కడ నుంచి మాయం అయ్యాయి. టీ తాగి తన ద్విచక్రవాహనం వద్దకు చేరుకున్న బాధితుడు తన వాహనంలోని సుమారు రూ.7 వేలు నగదు, విలువైన పుస్తకాలు మాయం కావడంతో అవాక్కయ్యాడు. బాధితుడితో పాటు చోరీకి పాల్పడిన వ్యక్తులు ఎవరనేది వెల్లడి కాలేదు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సంప్రదాయ కళల ప్రదర్శన

ఐలవరం(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: సంక్రాంతి పురస్కరించుకొని ఐలవరం గ్రామంలో ప్రాచీన సంప్రదాయ కళలను ప్రదర్శించారు. కర్రసాము, కూచిపూడి నృత్యం, రిబ్బన్ ఆటలు వంటివి ఆకట్టుకొన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు ప్రారంభించారు.

పందేలు జోరుగా.. పండగ సందడిగా

పల్లెకోన(భట్టిప్రోలు), కొల్లూరు, నగరం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ పురస్కరించుకొని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజవర్గాల్లో జోరుగా కోడి పందేలు కొనసాగాయి. సంక్రాంతి పండగ మూడు రోజులు ఇదే వాతావరణం నెలకొంది. రూ.లక్షల్లో నగదు లావాదేవీలు జరిగాయి. ఈ పందేలను తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు. వీటితోపాటు వివిధ రకాల జూదాలు, ఆటలు నిర్వహించారు. కొల్లూరు శివారులో ఏర్పాటు చేసిన బరిలో నిర్వహించిన కోడి పందేల్లో కారును ఆవులవారిపాలేనికి చెందిన సనకా ఉదయ భాస్కర్ గెలుచుకున్నారు. మరో ఇద్దరు చెరొక బుల్లెట్ వాహనాన్ని, ఒక్కరు యూనికాన్ వాహనాన్ని గెలుచుకున్నారు. ఈ బహుమతులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ విజేతలకు అందజేశారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరులోని పింఛనుదారుల భవనంలో గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన కుటుంబ సభ్యులను, ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించారు. ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసి వయో వృద్ధులు నార్ల భూషయ్య, గాజుల నాగలక్ష్మి, ఎం.లక్ష్మి, గరికపాటి బాబూరావు, సుబ్బారావు, మధు, మల్లిపెద్ది సాంబశివరావు, కూచిపూడి యోబు, ఆంజనేయప్రసాద్, ప్రవాస భారతీయుడు మల్లిపెద్ది వెంకట మురళీలకు సన్మానం జరిగింది.

PASSPORT MISSING
I Abburi Ajay Kumar, S/o. Chenchubabu, H.No. 2-53, Chinthagumpalli, Chinnaganjam Mandal, Bapatla (Dist.) on 13/01/2026 my Passport (No. K3129593) was misplaced with in the Limits of Chinnaganjam. If any one Found pl Contact: 97006 02400

(c) eenadu

సర్వదర్శనానికి 14 గంటలు

ఆలయం ఎదుట సేద తీరుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వద ర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వరుస సెలవులతో పెద్దఎత్తున భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి క్యూలై న్‌లో శిలాతోరణం వరకు భక్తులు వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్ ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. గురువారం శ్రీవారిని 64,064 మంది దర్శిం చుకున్నారు. రూ.3.80 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ పెరిగింది. యాత్రికుల వసతి సముదా యంలో భక్తులు సేదతీరాలని తితిదే ప్రకటిస్తోంది. తిరుమ లలో చలి తీవ్రత పెరిగింది.

20న విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 20న అభిప్రా యాన్ని సేకరించనున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులు తిరుపతి, విజ యవాడ, కర్నూలులో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 20న తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రజలం దరూ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చన్నారు. పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకో వాలని ఆయన కోరారు.

సొంతగడ్డపై సంబరం.. సామాన్యుడికి అభయం

ముగిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నారావారిపల్లె పర్యటన

ఈనాడు డిజిటల్, తిరుపతి, చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: అధికార బాధ్యతల బరువు ఎంత ఉన్నా.. పుట్టి పెరిగిన మట్టి వాసన ఆ బరువును దింపేస్తుంది. సంక్రాంతి సంబరాల వేళ సొంతగడ్డ నారావారిపల్లెకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. వివిధ రోజు పర్యటనలో ఆత్మీయుల మధ్య గడిపారు. పచ్చని పల్లెలో పండగ వాతావరణం ఒకవైపు.. కన్నవారి, తోడబుట్టిన వారి జ్ఞాపకాలు మరోవైపు ఆయన్ను భావోద్వేగానికి గురి చేశాయి. గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకుంటూ, పెద్దల సమాధుల వద్ద నివాళులర్పిస్తూ, తన కోసం వచ్చిన జనసేనాల కష్టాలను వింటూ.. ముఖ్యమంత్రి తన పర్యటనను మమతల పందిరిలా మార్చారు.

ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద నారా, నందమూరి కుటుంబ సభ్యుల నివాళి

సీఎం భావోద్వేగం

సొంతూరులో కుటుంబంతో కలిసి పండగ చేసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని భావోద్వేగంతో సీఎం వివరించారు. గతంలో గ్రామాలకు వెళ్లడానికి భయపడేవారు. ఈ ఏడాది ఉత్సాహంగా వెళ్లారు. మన పూర్వీకులను గౌరవించుకోలేకపోతే మనకు జంతువులకు తేడా ఉండదు. మన పండగలు ప్రకృతి వాతావరణానికి అనుగుణంగా రూపొందాయి.' అని సీఎం వివరించారు. ● వ్యవసాయంలోనే కాదు, పాడి పరిశ్రమలోనూ డ్రోన్లను వాడుతున్నాం. ఇది పనిని సులభతరం చేస్తుంది. కచ్చితమైన ఫలితాలను ఇస్తోంది. తిరుపతిలో చెరువుల సుందరీకరణ చేపడతాం. శెట్టిపల్లి భూ సమస్యను పారదర్శకంగా పరిష్కరించాం. భూ రికార్డులపై సాంకేతికతతో కూడిన 'రాజముద్ర' పడుతుంది. దాన్ని ట్యాంపరింగ్ చేయడం ఎవరి తరమూ కాదు.' అని సీఎం పేర్కొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న చంద్రబాబు

స్వర్ణ నారావారిపల్లె సాధన ఇలా..

'స్వర్ణ నారావారిపల్లె' లక్ష్యంతో ఇక్కడి మూడు పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. 248 మందికి ఇళ్లు లేవని గుర్తించాం. వీరిలో 187 మందికి కనీసం ఇళ్ల స్థలాలు కూడా లేవు. అందుకే 2+1 లేదా 1+1 పద్ధతిలో ఇళ్లు నిర్మించాలని అధికారులకు సూచించా.' అని సీఎం స్పష్టం చేశారు. మధ్యాహ్నం చంద్రగిరి మండలంలోని యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

తల్లిదండ్రుల సమాధుల వద్ద పూలు చల్లుతున్న సీఎం చంద్రబాబు

జనం కోసం.. జనంలోనే..

జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల వద్దకు సీఎం స్వయంగా వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను సావధానంగా విని, అర్జీలను స్వీకరించారు. తక్షణమే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి లోకేశ్, భువనేశ్వరి మధ్యాహ్నం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, ఏపీఎస్ ఛైర్మన్ గోనె బాషా, మండల అధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, కౌన్సిలర్ దేవేంద్ర పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు

నీకు ఐదు.. నాకు ఐదు..

- సమగ్ర శిక్షా పోస్టుల భర్తీలో పైరవీలు
- ముగ్గురు ప్రజాప్రతినిధులకు పంచిన వైనం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో పోస్టుల భర్తీలో పైరవీలు జోరందుకున్నాయి. వార్డెన్, వంట మనిషి, వాచ్‌మెన్ ఇలా బోధనేతర పనులకు 31 వివిధ పోస్టుల భర్తీకి సమగ్ర శిక్షా అధికారులు దరఖాస్తులు ఆహ్వానించగా 712 వచ్చాయి. ఈ నెల 12తో గడువు ముగిసినా పలువురు దరఖాస్తులతో జిల్లా కార్యాలయానికి వస్తుండటం గమనార్హం. వీటి భర్తీలో ప్రజాప్రతినిధుల జోక్యం విమర్శలకు తావిస్తోంది.

స్పష్టత కరవు..: గడువు ముగిసేనాటికి వచ్చిన దరఖాస్తులను బట్టి ఒక పోస్టుకు 23 మంది పోటీపడుతున్నారు. అభ్యర్థులను రాత, మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేయాలా, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఏర్పాటు చేసి ఎంపిక చేయాలా అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

ప్రజాప్రతినిధుల సిఫారసులు..

పోస్టుల భర్తీ ప్రక్రియపై అధికారులు ఒక వైపు మల్లగుల్లాలు పడుతుంటే మరో వైపు కొందరు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలువురికి సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఓ ప్రజాప్రతినిధి తన వద్దకు వచ్చిన వారికి సిఫార్సు చేశారు. జిల్లా కేంద్రం, పక్కనే ఉన్న ఎమ్మెల్యేలు సైతం తమ వారికి ఈ పోస్టులు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దరఖాస్తులు పరిశీలనలో ఉండగానే మరో వైపు అప్పుడే అంతర్గతంగా జాబితా సిద్ధమైందని విశ్వసనీయ సమాచారం. జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులకు ఐదేసి చొప్పున పోస్టులు ఇచ్చేందుకు ఓ జిల్లా అధికారి అంగీకారం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఆ అధికారి కూడా తన ఖాతాలోనూ ఐదు పోస్టులు ఇచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఇలా 20 పోస్టులు మినహాయిస్తే మిగిలిన 11 పోస్టులను ఎలా భర్తీ చేస్తారో తేల్చడం లేదు.

నిబంధనల ప్రకారమే..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే దరఖాస్తులు స్వీకరించాం. వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత దరఖాస్తుల జాబితా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిస్తాం. ఆయన ఆదేశాల ప్రకారం ప్రక్రియ చేపడతాం. – వెంకటరమణ, ఏపీసీ, సమగ్ర శిక్షా

ఆనందాల ముంగిళ్లు.. సంక్రాంతి ఉషస్సు

ఘనంగా వేడుకలు

గుడుపల్లెలో పశువుల పండగకు తరలివచ్చిన జనం

సంక్రాంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్ని తాకాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇంద్రధనస్సు నేలకు దిగిందా అన్నట్లుగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు ముచ్చటగొలిపాయి. కొన్ని గ్రామాల్లో జల్లికట్టు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆలయాలు సైతం కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు చేశారు. చిన్ననాటి స్నేహితులను కలిసి రోజంతా ఆనందంగా గడిపారు. – న్యూస్‌టుడే బృందం


కాణిపాకం వీధుల్లో ఊరేగుతున్న సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి

కుప్పం మండలం వాలూరులో సామూహిక పొంగళ్లు పెడుతున్న స్థానికులు

కుప్పంలో మూడు రైళ్ల నిలుపుదలకు ఉత్తర్వులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం రైల్వేస్టేషన్‌లో ఎస్ఎంవీటీ-అలిపుర్దార్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు-రాధికపూర్, ఎస్ఎంవీటీ బెంగళూరు-బాలుర్ఘాట్ వారాంతపు రైళ్ల నిలుపుదలకు రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు సాయిమాతా సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. ఈ మూడు రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభిస్తారని ఆయన వివరించారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-అలిపుర్దార్ ప్రతి శనివారం బెంగళూరులో బయల్దేరి కుప్పానికి ఉదయం 10.40 గంటలకు చేరుకుని.. విజయవాడ, భువనేశ్వర్, కోల్‌కతా మీదుగా అలిపుర్దార్‌కు వెళ్తుందన్నారు. అదే రైలు అలిపుర్దార్ నుంచి బయల్దేరి తిరిగి గురువారం తెల్లవారుజామున 1.00 గంటకు కుప్పం చేరుకుంటుందని తెలిపారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-రాధికపూర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం 1.50కు బెంగళూరు నుంచి బయల్దేరి సాయంత్రం 4.00కు కుప్పానికి వస్తుందని, ఎస్ఎంవీటీ బెంగళూరు-బాలుర్ఘాట్ ప్రతి బుధవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరు నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.00కు కుప్పం చేరుకుంటుందని వివరించారు. రైళ్ల నిలుపుదలకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శశాంక్ ఉంటే గెలుపు వెన్నంటే

- అండర్– 23లో రాష్ట్రంలోనే అత్యధిక స్కోరర్‌గా నమోదు
- క్రికెట్‌లో రాణిస్తున్న యువకుడు

పరుగుల వేటలో కోహ్లీని తలపిస్తాడు. వికెట్ల వెనుక ధోనీని మైమరిపిస్తాడు. తను బరిలో దిగితే బంతులు బౌండరీల వైపు పరుగులు పెట్టాల్సిందే. ఇలా క్రికెట్‌లో అదరగొడుతున్నాడు తిరుపతికి చెందిన యువ క్రికెటర్ శశాంక్.

తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంటకు చెందిన జయదేవ్, జయశ్రీ దంపతుల కుమారుడు శశాంక్ శ్రీవత్స. క్రికెట్‌పై ఆసక్తి ఉండటంతో 8వ తరగతిలో స్థానిక నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో శిక్షకుడు మస్తాన్ వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ప్రస్తుతం వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు. 2025లో జరిగిన అండర్- 23 టెస్ట్ మ్యాచుల్లో 230 పరుగులతో రాష్ట్రంలోనే అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. భారత క్రికెటర్ నితీష్‌కుమార్ జట్టులో సభ్యుడిగా వ్యవహరించాడు. సెప్టెంబరులో జరిగిన రంజీ ప్రాబబుల్స్‌లో రాణించి తిరుపతి వేదికగా జరిగిన చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో 200కు పైగా స్ట్రైక్‌రేట్, 16 బంతుల్లో 50 పరుగులతో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందాడు. ఇటీవల 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ఈఎస్ఎల్ పోటీల్లోనూ కీలకంగా వ్యవహరించి జట్టు విజయానికి బాటలు వేశాడు.

– న్యూస్‌టుడే, తిరుపతి (క్రీడలు)

సచివాలయ సేవలు.. సరిగా లేవండీ!

ఐవీఆర్ఎస్‌లో ప్రజల అసంతృప్తి

పౌరులకు తక్కువ సమయంలో అవినీతి రహితంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సచివాలయాలు గాడి తప్పాయి. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడం, ఉన్నా వారి వ్యవహారశైలి బాగా లేకపోవడంతో అంతిమంగా ప్రజలే ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు కలెక్టర్ హెచ్చరించినా పరిస్థితిలో మాత్రం మార్పు లేదు.

– ఈనాడు– చిత్తూరు, తిరుపతి

కుప్పం, సత్యవేడు, చంద్రగిరి, గంగాధరనెల్లూరులో..

సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాలి. గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్న కుప్పం, గంగాధరనెల్లూరు, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో వీరు పెద్దగా అందుబాటులో ఉండటంలేదు. అదేమని అడిగితే ఉన్నతాధికారులు.. వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సర్వేలు చేయాలని ఆదేశించారని సమాధానమిస్తున్నారు. ఒకవేళ అలా బయటకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టాల్సి ఉన్నా పాటించడం లేదు. తిరుపతి నగరంలోని సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లోనే ఉండాలని పేర్కొన్నా కొన్నిచోట్ల వారు కూడా దొరకడంలేదు.

సంతకం పెట్టించుకుని రండంటూ..

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సచివాలయ ఉద్యోగుల వ్యవహారశైలిపై చర్చకు వచ్చింది. ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలంటే తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లోని సిబ్బంది నుంచి సంతకం పెట్టించుకుని వస్తేనే వాటిని స్వీకరిస్తామని చెబుతున్నారని ఉన్నతాధికారులే స్పష్టం చేశారు. ప్రధానంగా సర్వేయర్లు, వీఆర్వోలు ఇలా చెబుతున్నారు. ఈ రెండు శాఖల్లోని ఉద్యోగులే అవినీతిలోనూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లాలంటే ముందుగానే లంచం ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలంలోని సర్వేయర్.. డబ్బులు తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడటమే దీనికి నిదర్శనం.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లూ అదే మార్గంలో..

ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖలో పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సైతం రెవెన్యూ యంత్రాంగం బాటలోనే వెళుతున్నారు. వివరాలు నమోదు చేయాలంటే తప్పక ఎంతోకొంత చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు. దాంతో ఎంతో సదుద్దేశంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ అభాసుపాలవుతోంది.

చిత్తూరు జిల్లాలో సచివాలయ సిబ్బందిపై ఐవీఆర్ఎస్‌లో వెల్లడైన అభిప్రాయాలు ఇలా.. (శాతాల్లో..)

ప్రశ్న	సమాధానం	శాతం
సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నారా?	ఉన్నారు	62.6
	లేరు	37.4
సిబ్బంది ప్రవర్తన బాగుందా?	బాగుంది	70.9
	బాగాలేదు	29.1
ఉద్యోగులు లంచాలు తీసుకుంటున్నారా?	తీసుకుంటున్నారు	30.1
	లేదు	69.9

ఎక్స్‌ప్రెస్ వే.. పనులు రయ్‌రయ్

ఆరు నెలల్లో వినియోగంలోకి వచ్చే అవకాశం

పలమనేరు, న్యూస్‌టుడే: చెన్నై-బెంగళూరు నగరాలను కలుపుతూ అత్యంత వేగంగా ప్రయాణం చేయడానికి వీలుగా నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. తమిళనాడులోని శ్రీపెరంబదూరు నుంచి కర్ణాటకలోని హొసకోట వరకు 283 కి.మీ. దూరం ఈ రోడ్డు పనులు చేపడుతున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా చిత్తూరు-పలమనేరు మార్గంలోని మొగిలి ఘాట్‌లో ప్రయాణం చేసే వారు ఇంకా వేగంగా రోడ్డు పనులు పూర్తికావాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం మొగిలి ఘాట్ మలుపుల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల విభాగం ఏడాదికి రూ.50 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నా.. ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే ఫలితం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులే చెబుతున్నారు.

మొగిలి ఘాట్ వద్ద ఎక్స్‌ప్రెస్ వే లింకు రోడ్డు నిర్మాణం

వివరాలిలా..
- చెన్నై-బెంగళూరు: 283 కి.మీ
- నిర్మాణ వ్యయం: రూ.18 వేల కోట్లు
- పూర్తయిన పనులు: 80 శాతం

మూడు చోట్ల మినహా..

కొత్త మార్గంలో మూడు చోట్ల కనెక్టింగ్ పనులు చేపడుతున్నారు. బైరెడ్డిపల్లె, మొగిలి, చిత్తూరు సరిహద్దు వద్ద పనులు పూర్తి కావాల్సి ఉంది. మిగిలిన చోట్ల దాదాపు పనులు పూర్తయ్యాయి. మరో ఆరు నెలల వ్యవధిలో పనులన్నీ పూర్తయ్యే అవకాశముందని అంచనా. ప్రస్తుతం వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల నుంచి బెంగళూరు హొసకోట వరకు ప్రయాణం సాగిస్తున్నారు.

16 నుంచి కాగిత రహిత పాలన

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగంగా పురోగతిని తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 16 నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ-ఆఫీస్ (కాగిత రహిత పాలన) అమలుకు రాష్ట్ర ఉన్నతాధికారులు.. జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో 98 ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి. చాలా శాఖల్లో దస్త్రాల నిర్వహణ అధికంగా మాన్యువల్ విధానంలోనే సాగుతోంది. పురపాలక శాఖ కార్యకలాపాలను ఈ నెల 16 నుంచి ఈ-ఆఫీస్ ద్వారా నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. వైద్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం పీహెచ్‌సీ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు, సర్వీసు వ్యవహారాలు, అనుమతులు ఇతర అంశాలను ఈ-ఆఫీస్ ద్వారా కొనసాగించాలని ఆదేశాలిచ్చారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు ఈ ఆదేశాలను ఇచ్చారు. ఈ-ఆఫీస్ విధానాన్ని చరవాణిలో ప్రత్యేక యాప్ ద్వారా చూసుకునేందుకు వెసులుబాటును ఇచ్చారు. దస్త్రాలను స్కాన్ చేసి యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజీ స్టైల్	సా॥ 5 - రా॥ 9
ఈఎఫ్ఎమ్ సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

పక్కాగా.. ఈ-పంట లెక్క

- రైతులు సమ్మతిస్తేనే పూర్తయినట్లు
- శరవేగంగా నమోదుకు కసరత్తు
- ముమ్మరంగా సాగు..

న్యూస్‌టుడే, చిత్తూరు(వ్యవసాయం): పంటల సాగులో ఎంతో కీలకమైన ఈ-పంట యాప్‌ను రైతులకు ప్రయోజనకరంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది.. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని నిర్ణయించింది.. మొదటిసారి రైతుల సమక్షంలో వారి సమ్మతితోనే రబీలో నమోదు ప్రక్రియ జరగనుంది.

జిల్లాలో రబీ పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తరిస్తోంది. ఈ ఏడాది రబీలో వరి విస్తారంగా సాగయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తదనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నారు.

ఎంతో కీలకం..

పంటలు సాగు చేపట్టిన రైతులకు వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తించాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి. దీనికితోడు బీమా వర్తించాలన్నా.. అకాల వర్షాలు.. ఇతర విపత్తుల కారణంగా పంట దెబ్బతిని పరిహారం పొందాలన్నా ఇది ఎంతో కీలకం. ప్రభుత్వాలు సైతం ఈ వివరాలనే ప్రామాణికంగా తీసుకుంటాయి.

రబీ సాగు వివరాలిలా..
- సాధారణ సాగు విస్తీర్ణం: 82 వేల ఎకరాలు
- ఇప్పటికి సాగుచేసింది: 23 వేలు
- ఈ-పంట నమోదుకు గుర్తించిన ల్యాండ్ పార్సిల్స్: 3.14 లక్షలు
- ఇప్పటివరకు నమోదు: 11,250 ఎకరాలు

ముందస్తు సమాచారం..

ఈ ప్రక్రియ మొత్తం రైతుల సమ్మతితోనే జరగనుంది. ఏరోజు సాగు వివరాలు నమోదు చేస్తారన్న సమాచారాన్ని ముందుగానే రైతు చరవాణికి పంపుతారు. పూర్తయ్యాక ముగిసినట్లు సంక్షిప్త సందేశం వెళ్తుంది. ఈ-పంట వెబ్ లింక్, క్యూఆర్ కోడ్‌తో వ్యవసాయ, ఉద్యానశాఖల సిబ్బంది ఏఏ వివరాలు నమోదు చేశారో రైతులు సులువుగా తెలుసుకోవచ్చు. పొరపాట్లు ఉన్నా, తప్పులు దొర్లినా, రైతులు తనకు వచ్చిన ఎస్ఎంఎస్ లింక్ ద్వారా తిరస్కరించవచ్చు. అది మళ్లీ వీఏఏ లాగిన్‌కు వెళ్తుంది. అలా రైతు సమక్షంలో మళ్లీ వివరాలు సేకరించి సరిచేస్తారు. ఇవన్నీ జరగాలంటే మాత్రం ఆధార్‌కు ఫోన్ నంబరు లింక్ అయి ఉండాలి.

ఫిబ్రవరి 28లోగా పూర్తిచేయాలి..: మురళి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఈ-పంట నమోదుకు ఫిబ్రవరి 28 చివరి గడువు. పంటలు సాగు చేసిన రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ-పంట నమోదు చేసుకోవాలి.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

చేపాచేపా.. అమ్మేదెలా..?

■ పట్టణాల్లో మార్కెట్ల కరవు
■ అవస్థల్లో పట్టణవాసులు

☛ జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీలు ఏర్పడి 20 ఏళ్లయింది.. ఆయా పట్టణాల్లో కనీసం మౌలిక వసతులూ కరవే. ప్రధానంగా మార్కెట్లు లేక రైతులు రోడ్లపై తాము పండించిన పంట ఉత్పత్తులు విక్రయించుకోవాల్సిన దుస్థితి. గత పాలక వర్గాలు కనీసం మార్కెట్లకు స్థలాలైనా కేటాయించలేదు. ఈ నేపథ్యంలో రోడ్లపైనే క్రయవిక్రయాలతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

న్యూస్‌టుడే, పుత్తూరు: జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీలు మేజర్ పంచాయతీల నుంచి 2005 పురపాలక సంఘాలుగా ఆవిర్భవించాయి.. పట్టణాలుగా అవి మారినా మౌలిక వసతులు నేటికీ సమకూరలేదు.. ముఖ్యంగా మాంసం, చేపల మార్కెట్ లేక రహదారుల వెంట విక్రయిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి.. ఆదివారమైతే పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.. పలమనేరులో చేపల మార్కెట్ కోసం రూ.15 లక్షలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినా మిగిలిన చోట్ల దయనీయ స్థితి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగర, పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.

పుత్తూరులో శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల ఆలయం ఎదురుగా రోడ్డుపైనే చేపల మార్కెట్

బహిరంగంగా జంతువధ..

మాంసం విక్రయాలు ఒక ఎత్తయితే.. కొందరు విక్రేతలు రహదారుల పక్కనే జంతువులను వధించడం సమస్యగా మారింది. పుత్తూరులో కార్వేటినగరం రోడ్డు, ఎన్జీవో కాలనీ, గేటుపుత్తూరు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, నగరిలో ఏకాంబరకుప్పం, నగరి ప్రధాన రహదారి, నగరి-నాగలాపురం రోడ్డు, పలమనేరులో గాంధీనగర్, ప్రధాన మార్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వ్యర్థాలను సైతం కాలువల్లో పడేస్తుండటంతో మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. ఆదివారమైతే ప్రతి వీధి వద్ద ఇదే పరిస్థితి. చేపల మార్కెట్లు తాత్కాలికంగా ఉన్నా ఆదివారం ఆయా వీధుల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసి ఆ వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్తున్నారు. చేపలు శుభ్రం చేసే నీరంతా రోడ్డుపైనే పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

భూమిపూజ చేసినా..

జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వ హయాంలో చేపల మార్కెట్లు కోసం రూ.15 లక్షల చొప్పున రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఒక్క పలమనేరు మున్సిపాలిటీలో మాత్రమే నిర్మించారు. పుత్తూరు, నగరిలో తెదేపా హయాంలో భూమి పూజ చేశారు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వైకాపా రావడంతో ఆ టెండర్లు రద్దు చేశారు. మంత్రి హోదాలో రోజా భూమిపూజ చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఇక మాంసం దుకాణాలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..

రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మాంసం దుకాణాలు ఏర్పాటు చేయరాదు. జంతువధశాల లేక ఇలా జరుగుతోంది. త్వరలోనే దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు రాగానే ఏర్పాటు చేస్తాం. చేపల మార్కెట్ల ఏర్పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మించేలా చూస్తాం.

-నాగేశ్వరరావు, కమిషనర్, పుత్తూరు

'రచనల్లో యువతను ప్రోత్సహించాలి'

కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న రచయితలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాలనలో భాగంగా 'రెవెన్యూ క్లినిక్', 'వసతిగృహాల్లో ముస్తాబు', 'పాఠశాలల్లో అవసరం క్రీడలు' కార్యక్రమాలు రూపొందించిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నక్కల ప్రభాకర్‌రెడ్డి అభినందనీయులని చిత్తూరు జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో నక్కల ప్రభాకర్‌రెడ్డికి ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రచయితల సంఘంతో తనకున్న అనుబంధం విడదీయరానిదని, వ్యక్తి సర్వతోముఖాభి వృద్ధికి సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. సాహిత్య పఠనం ద్వారా సృజనాత్మకత వెలికితీయవచ్చని, యువత రచన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు తేజోమూర్తి, రచయితల సంఘం నాయకులు గిరిధరన్, సహదేవనాయుడు, ఎడ్ల బాలకృష్ణారెడ్డి, గోవర్ధన్ బాబి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

రాజగోపాలనాయుడి విగ్రహం వద్ద మాజీ మంత్రి అరుణకుమారి కుటుంబ సభ్యులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగ్రామం దిగువమాఘంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రాజన్న పార్కులోని అరుణకుమారి తండ్రి దివంగత ఎంపీ రాజగోపాలనాయుడి విగ్రహానికి గురువారం ప్రత్యేక పూజలు చేసి నివాళులు అర్పించి అందరికీ ప్రసాదాలు అందజేశారు. గల్లా కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి కోలాటాలు, గంగిరెద్దులు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. అమరరాజ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు, ఛైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, డాక్టర్ రమాదేవి, సినీ హీరో గల్లా అశోక్, సర్పంచి గోపి, మాజీ సర్పంచి కుమార్‌నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి వైభవంగా పూజలు

వడమాలపేట, న్యూస్‌టుడే: మకర సంక్రాంతి నేపథ్యంలో అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలు, బంగారు నగలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆపై తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు, అర్చకులు సూర్యకుమారాచార్యులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

ఘనంగా గణనాథుడికి గ్రామోత్సవం

కాణిపాకం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు గురువారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఉత్సవమూర్తులను సర్వాలంకృతులను చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, మూషిక వాహనంపై అధిరోహించి ఊరేగించారు. భక్తులు స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ✶ ప్రదోషకాల సమయంలో అనుబంధ ఆలయమైన మరగదాంబికా సమేత శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి మూలవిగ్రహానికి, ప్రాంగణంలో కొలువుదీరిన మహానందికి ఏకకాలంలో అభిషేకం నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

నందికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్

13 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు శుక్రవారం 13 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి శనివారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు రెండు వేల టోకెన్లు జారీ చేశారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో భక్తుల తాకిడి విపరీతంగా కనిపించింది.

పుస్తక ప్రసాదానికి విశేష స్పందన

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఆరిమాను గంగమ్మ ఆలయంలో కనుమ సందర్భంగా శుక్రవారం పైనేని మునెమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వహించిన పుస్తక ప్రసాదానికి విశేష స్పందన లభించింది. 10 వేల పుస్తకాలు అందజేశామని సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు, పుష్ప, మురళి తెలిపారు. వినూత్న రీతిలో పుస్తకాలు అందజేయడం ఎంతో బాగుందని పుస్తక ప్రియులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటరాయలు తదితరులు పాల్గొన్నారు.

నీతి పద్యాల పుస్తకాలు అందజేస్తున్న తులసీనాథం నాయుడు, మురళి

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తితిదే మాజీ జేఈవో శ్రీనివాసరాజు, డ్రమ్స్ శివమణి, కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

స్వామివారిని దర్శించుకున్న చాగంటి కోటేశ్వరరావు

మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి లోకేశ్‌కు వినతి

మంత్రి లోకేశ్‌ను కలిసిన మునీశ్వరరెడ్డి

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్షుడు మునీశ్వర రెడ్డి విన్నవించారు. నారావారిపల్లెలో సంఘం నాయకులు లోకేశ్‌కు మామిడి రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గుజ్జు పరిశ్రమలు తోతాపురి మామిడి కిలోకు రూ.8 చొప్పున సత్వరమే చెల్లించాలని, రానున్న సీజన్‌లో ముందుగానే ఎన్ని పరిశ్రమలు మామిడి కాయలు సేకరిస్తాయో ప్రకటించాలని కోరారు. మామిడి ఉత్పత్తులను అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు సరఫరా చేయాలని; గుజ్జు పరిశ్రమలు, మండీలు, ర్యాంపులు నిర్వహించే మార్కెటింగ్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలని, నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు విక్రయించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. మామిడి రైతు సంఘం నాయకులు మునిరత్నం నాయుడు, ఉమాపతినాయుడు, జయదేవయ్య పాల్గొన్నారు.

వారంలోగా మామిడి బకాయిల చెల్లింపు

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వారం లోగా తోతాపురి మామిడి బకాయిల మొత్తాన్ని రైతులకు చెల్లించేందుకు చర్యలు చేపట్టామని ఉద్యానశాఖ ఇన్‌ఛార్జి జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. 'మామిడి రైతుకు సంక్రాంతి కరవు' శీర్షికన 'ఈనాడు' లో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రూ.20 కోట్లు వారంలోగా చెల్లించాలని కలెక్టర్ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారని, తదనుగుణంగా బకాయిలు చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారన్నారు. కొందరు రైతులు గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఖాతా నంబర్లు సమర్పించకపోవడంతో నిధుల జమ ఆలస్యమైందని, వివరాలు ఈ నెల 20లోగా అందజేయాలని కోరారు.

తిరుచ్చిపై వేణుగోపాలుడి విహారం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేణుగోపాలస్వామి తిరుచ్చిపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో కనుమ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఆవరణలో గోపూజ నిర్వహించారు. ఉభయ నాంచారుల సమేతుడైన స్వామి వారు తిరుచ్చిపై విహరించారు. తితిదే సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, అర్చకులు గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గట్టులో తెదేపా నాయకుడు రమేష్ ఇంటిపై దాడి

☛ తాగిన మైకంలో ఫ్లెక్సీ చింపివేత

చింపివేసిన ఫ్లెక్సీ

పుత్తూరు, న్యూస్‌టుడే: గట్టు గ్రామంలో తెదేపా గ్రామ అధ్యక్షుడు రమేష్ ఇంటిపై దాడికి పాల్పడి, అతడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తాగిన మైకంలో చింపివేసిన ఘటన జరిగింది. బాధితుడు రమేష్ సమాచారం మేరకు.. గంగ జాతర సందర్భంగా తన ఇంటి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. భోగి పండగ రోజున గ్రామానికి చెందిన మురళి, క్రాంతి, శశి మద్యం తాగి తన ఇంటి వద్ద ఉన్న ఎమ్మెల్యే భానుప్రకాష్ ఫ్లెక్సీని చింపివేసి కాక మద్యం పోయడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీంతో ఇంటిలో ఉన్న కుక్క మొరగడంతో తాను వెళ్లి వారిని ఇదేమిటని ప్రశ్నిస్తే తనను దుర్భాషలాడడమే కాక, తన ఇంటిపై దాడికి పాల్పడ్డారని, గతంలోనూ వారు తనను హతమారుస్తామని బెదిరించారని పేర్కొన్నారు. గతంలో వారు తమపై దాడి చేశారన్నారు. అప్పట్లో పలుమార్లు గ్రామస్థులు సర్దిచెప్పడంతో ఫిర్యాదు వాపసు తీసుకున్నానని చెప్పారు. తన భార్య ఇటీవల మృతి చెందిందని, ఆ బాధలో ఉంటే వాళ్లు తన కుటుంబాన్ని టార్గెట్ చేసి వేధిస్తున్నారన్నారు. వారివల్ల తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఐసర్ ఆచార్యులకు పురస్కారం

విజయ మోహనన్ పిళ్లైను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆచార్యులు విజయమోహనన్ పిళ్లై.. చిరంతన్ రసయన్ సంస్థ(సీఆర్ఎస్)నుంచి జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రోకెమిస్ట్రీలో వివిధ ప్రయోగాలు చేపట్టడంతో పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఐసర్ ఆచార్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మరెన్నో పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

క్లాసికల్ కార్యశాల..

ఏర్పేడు: తిరుపతి ఐసర్ క్లాసికల్ ఆర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పిక్‌మెకే విరాసిత్-2026 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ కళాకారుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. యువతలో భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, శాస్త్రీయ కళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపతాయని ఆచార్యులు అభిప్రాయ పడ్డారు. ఆర్‌కే శ్రీరామ్‌కుమార్, గానకంఠ బొర్రా, జ్యోతి హగ్డే వంటి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

జస్టిస్ సంజీవ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

గణనాథుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూల మూర్తి దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, ఎస్సై నరసింహులు, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

గోపూజతో సకల పాపహరణం

గోవుకు దాణా తినిపిస్తున్న ఈవో పెంచల కిశోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: నిత్యం గోపూజ నిర్వహణతో సకల పాపాలు హరించుకుపోతాయని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఈవో పెంచల కిశోర్ తెలిపారు. కనుక పండుగ సందర్భంగా ఆలయ గోశాలలో శుక్రవారం గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గోమాతలో సకల దేవతలు కొలువుదీరి ఉంటారన్నారు. గోవును పూజించడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం గోవుకు దాణా అందజేశారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పండగవేళ విషాదం

వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి

సంక్రాంతి పండగ వేళ.. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు.

● **లారీ ఢీకొని యువతి.. బైరెడ్డిపల్లె:** మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో నెల్లిపట్ల క్రాస్ వద్ద పొలంలో ఉన్న ఆవుల నుంచి పాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి నడిచి వెళ్తుండగా బైరెడ్డిపల్లెలోని కురవవీధికి చెందిన జయచంద్ర కుమార్తె హేమప్రియ (17)ను వెనక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మరణించింది. వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండే కుమార్తె మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరయ్యారు.

హేమప్రియ (పాతచిత్రం)

● **పండగకు చెల్లి ఇంటికొచ్చి వెళ్తుండగా.. బంగారుపాళ్యం:** వినాయకపురంలో చెల్లి ఇంటికి వచ్చి వెళ్తుండగా గంగవరం మండలం బూడిదపల్లెకు చెందిన లక్ష్మమ్మ(70)ను శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని కారు ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

● **డివైడర్‌ను ఆటో ఢీకొని.. తడ:** చేనిగుంట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వరదయ్యపాళెం మండలం సిద్ధమ అగ్రహారానికి చెందిన ఆటో డ్రైవర్ చెరివి మునిచంద్రయ్య (40) మృతి చెందారు. ఈ ఘటనలో జాతీయ రహదారి నిర్వహణ పనులు చేస్తున్న చిల్లకూరు మండలం, ముత్యాలపాడుకు చెందిన వలిపి వెంకటరమణయ్య, దొరవారిసత్రం మండలం నెల్లూరుపల్లికి చెందిన చెంబేటి సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. పండగ సందర్భంగా మునిచంద్రయ్య సొంతూరుకు భార్యాపిల్లల్ని ముందుగా పంపాడు. తనూ ఊరెళ్లే క్రమంలో కన్నుమూశాడు.

మునిచంద్రయ్య (పాత చిత్రం)

● **రైలు నుంచి జారిపడి.. దొరవారిసత్రం:** పోలిరెడ్డిపాలెం సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎగ్మోర్ నుంచి బర్మాపూర్ వరకు తీసుకున్న జనరల్ టికెట్ లభించింది. మృతుని వయసు 40 - 45 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● **విహారయాత్రకు వచ్చి గుండెపోటుతో.. కేవీబీపురం, న్యూస్‌టుడే:** కుటుంబ సభ్యులతో కేవీబీ పురం మండలం ఆరే సిద్దేశ్వర కోన జలపాతంలో సరదాగా గడిపిన చెన్నైకు చెందిన శరవణన్(55) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది.

కుటుంబ కలహాలతో రైతు బలవన్మరణం

కలకడ: బాలయ్యగారిపల్లె పంచాయతీ దిగువపాళెంకు చెందిన అమృతయ్య (50), భాగ్యమ్మ దంపతులు పదేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. నెల కిందట భాగ్యమ్మ భర్త వద్దకు తిరిగొచ్చింది. ఏం జరిగిందో తెలియదు కానీ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న అమృతయ్యను పశువుల కాపరులు గుర్తించారు. రాయచోటి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జీవనోపాధికి వచ్చిన యువకుడు..

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలోని ఓ కోళ్లఫారంలో పశ్చిమబంగాకు చెందిన రవీంద్ర చిగ్‌బరాక్ (29), ఆయన భార్య రష్మి పని చేస్తున్నారు. కొద్దిరోజులుగా తనలో తానే మాట్లాడుకుంటున్న రవీంద్ర శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కడుపునొప్పి తాళలేక..

పెనుమూరు: కడుపు నొప్పి తాళలేక కావూరివారిపల్లె పంచాయతీ ఎరుగానిపల్లెకు చెందిన లోకయ్య(50) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

చికిత్స పొందుతూ బాలుడు..

గాలివీడు, న్యూస్‌టుడే: స్థానిక దేవాలయం వీధికి చెందిన కల్యాణి, భద్రయ్య దంపతుల కుమారుడు చిన్న (1) మంగళవారం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. శుద్ధజల క్యాన్ల ఆటో ఢీకొట్టింది. గాయపడ్డ బాలుడిని వేలూరు సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

రైళ్లలో చోరీ చేసే దొంగ అరెస్టు

నిందితుణ్ని చూపుతున్న రైల్వే పోలీసులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు, పాకాల, కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలోని ప్లాట్‌ఫామ్‌లు, కదులుతున్న రైళ్లలో చోరీలకు పాల్పడే నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు రైల్వే పోలీసుస్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్సైలు ధర్మేంద్రరాజు, మధుసూదన్‌రావు.. నిందితుడిని చూపి నేరాల వివరాలు వెల్లడించారు. రైల్వే స్టేషన్ పరిధిలో నమోదవుతున్న చోరీ కేసులను నియంత్రించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో బృందాలుగా ఏర్పడి నిఘా ఏర్పాటు చేశాం. కొన్ని చోరీల పక్కా సమాచారంతో శుక్రవారం చిత్తూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-1 వద్ద అనుమానాస్ప దంగా తిరుగుతున్న కుప్పానికి చెందిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించాం. రైలులో నిద్రిస్తున్న వారి చరవాణులు, బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు అతడు నేరం అంగీకరించాడు. అతడి నుంచి రూ.2 లక్షల విలువజేసే బంగారు గొలుసు, ఓ చరవాణి స్వాధీనం చేసుకున్నాం. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వారు పేర్కొన్నారు.

పి.కొత్తకోటలో అగ్ని ప్రమాదం

దగ్ధమైన షెడ్డు

పూతలపట్టు, న్యూస్‌టుడే: పి.కొత్తకోటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితురాలు మునెమ్మ తెలిపారు. కూటంవారిపల్లెకు చెందిన ఆమెకు పి.కొత్తకోట సమీపంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. అక్కడ రేకులతో పెద్ద షెడ్డు ఏర్పాటు చేసి అందులో విద్యుత్తు మోటార్లు, సూక్ష్మనీటిసాగుకు అవసరమైన పరికరాలు ఉంచారు. గురువారం గుర్తుతెలియని వ్యక్తులు ఆ షెడ్డుకు నిప్పు పెట్టడంతో రూ.10 లక్షల విలువజేసే ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు కన్నీంటిపర్యంతమయ్యారు. తహసీల్దార్ రమేష్‌బాబుకు అగ్ని ప్రమాదంపై ఫిర్యాదు చేసి ఆదుకోవాలని కోరారు.

అర్ధగిరి ఆలయ ప్రధాన అర్చకుడి కన్నుమూత

వేణుగోపాలాచార్యులు (పాత చిత్రం)

తవణంపల్లె, న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు (60) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. అర్ధగిరిలో సుమారు 20 సంవత్సరాలు అర్చకులుగా పనిచేస్తున్నారు. వారి స్వగ్రామం అన్నమయ్య జిల్లా సీటీఎంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిశేఖర్, సిబ్బంది వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. కూటమి ప్రభుత్వం నూతనంగా నియమించిన ఆలయ ధర్మకర్తల మండలిలో వేణుగోపాలాచార్యులు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.

EENADU Classifieds

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

TO LET
తిరుపతి అంకాలమ్మ గుడి దగ్గర opp: RTC బస్టాండ్ ఇంద్రలోక్ అపార్ట్‌మెంట్ 3 BHK - 404 నార్త్ ఫేస్ ఫ్లాట్ అద్దెకు కలదు. Ph: 98663 61369.

JOBS
Tele Callers Female Qua: Any Degree & Basic system knowledge. N Sreenatha Reddy Recovery Agency, Bairagapattida, TPT ✆ 90328 01545
తిరుపతి, సేవా సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, వంట మనుషులు, నైట్ డ్యూటీ చేయుటకు హౌస్ కీపింగ్ స్టాఫ్ M/F కావలెను. Cont: 99495 32652.

తిరుచానూరు లాడ్జి నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, రూమ్ బాయ్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: 94405 81161.
సహానా గ్రాండ్ హోటల్ తిరుపతి నందు హౌస్ కీపింగ్ వర్క్ చేయుటకు సిబ్బంది కావలెను. జీతం: 12 నుండి 14000 వరకు కలదు. Cont:9440364488.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

వైభవంగా అయ్యప్పస్వామి ఊరేగింపు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మకర సంక్రాంతి నేపథ్యంలో స్థానికంగా అయ్యప్పస్వామిని గురువారం గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కుమార్ ఆచారి, దనయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన స్తంభం ఏర్పాటు

చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలోని నల్లగాంపల్లె సమీపంలో రహదారి పక్కన విరిగి, వంగిపోయిన విద్యుత్తు స్తంభం సమస్యపై ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య, ఏఈ ప్రసన్న కుమారి స్పందించారు. పాతదాన్ని తొలగించి నూతన స్తంభాన్ని సిబ్బందితో ఏర్పాటు చేయించారు. ప్రమాదాన్ని నివారించారు. - న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

ముత్తిరేవుల ఫ్లైఓవర్ పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రికలోని ఫ్యూజ్ సమస్యపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ట్రాన్స్‌కో ఏఈ నరసింహులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన నియంత్రిక దిగువన ఉన్న ఫ్యూజ్ వైర్లు తొలగించి పైభాగంలో ఏర్పాటు చేయించారు. -న్యూస్‌టుడే, పూతలపట్టు

అర్జీ స్వీకరించి మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే థామస్ అన్నారు. అల్లాగుంట గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలు అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులు యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రాజు, జిల్లా నాయకులు మురళీకృష్ణ, రమయాదవ్, మురళి, నాయకులు రాజా, రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకిలో గోదాదేవి విహారం

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ కాలనీలోని శ్రీ గోవింద మందిరంలో శుక్రవారం శ్రీ గోదాదేవి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆపై అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. గోపూజ వైభవంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

మురుగుతో బేజారు..

✦ నీటి గుంతలతో దోమల విజృంభణ ✦ తూతూమంత్రంగా నివారణ చర్యలు ✦ పట్టించుకోని నగరపాలక సంస్థ

తేనెబండలో కల్వర్టు సమీపంలో మురుగునీరు

రంగాచారి వీధి వెనుక భాగంలో నీవానదిలో ఇలా..

✦ డివిజన్లు: 50 ✦ఆవాసాలు: 450 పైనే ✦ మురుగునీటి గుంతలు: 250

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలో ఖాళీ స్థలాల్లోని మురుగునీటి గుంతల్లో నీటి నిల్వల కారణంగా దోమలు, కీటకాల బెడద ఎక్కువైంది. విషజ్వరాలకు కారణమైన దోమలకు ఆవాసంగా మారిన ఖాళీ మురుగునీటి గుంతలు స్థానికుల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో ఆయా కాలనీల వాసులు దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల్లో మురుగు నిలిచింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసాల మధ్య భారీ మురుగు నీటి గుంతల సమస్యతో స్థానికులు సతమతమవుతున్నారు. ఆయా గుంతల నుంచి మలేరియా తదితర విషజ్వరాలకు కారణమయ్యే దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. నగరం నడిబొడ్డున అభివృద్ధి చెందిన కాలనీల నడుమ ఖాళీ స్థలాల్లో ఏర్పడిన పెద్ద పరిమాణంలో ఉన్న వీటిని దోమలు ఆవాసాలుగా మార్చుకుని స్థానికులను కలవర పెడుతున్నాయి. దోమకాటుతో తరచూ మలేరియా, డెంగీ కేసులు నమోదవడం పరిపాటిగా మారింది.

సమస్య ఎక్కడెక్కడంటే..

బాలాజీ నగర్, సంజయ్‌గాంధీ నగర్, సంతపేట గంగమ్మగుడి వీధి, కామేశ్వర నగర్, త్యాగరాజ నగర్, రామ్‌నగర్ కాలనీ, గంగనపల్లె, దొడ్డిపల్లె, గొడుగుమూరు, లెనిన్‌నగర్, ఓటిసపల్లె, కట్టమంచి, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో నివాసాల వద్ద ఈ గుంతలు ఏళ్ల తరబడి మురుగునీటితో అలానే ఉన్నాయి. రామ్‌నగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్, మిట్టూరు ఎక్స్‌టెన్షన్, కాజూరు, భరత్‌నగర్, మురకంబట్టు ఎం.అగ్రహారం, కట్టమంచి, మురుగానపల్లె, చెంగల్రాయమిట్ట, సాంబయ్య కండ్రిగ తదితర ప్రాంతాల్లో ఆయా గుంతల కారణంగా సమస్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో నగరంలో డ్రైనేజీ కాలువలు, వీధుల్లో చెత్త, వ్యర్థాలతో పాటు సదరు గుంతలు స్థానికులకు సంకటంగా మారాయి. వీటిని పూడ్చాలని పలుమార్లు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరిగి విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. జ్వరాలు దరిచేరనీయకుండా ఉండాలంటే ఈ గుంతలు వెంటనే పూడ్చివేయాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి..

నగరంలోని ప్రధాన కాలనీల్లో మురుగునీటి గుంతల కారణంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి విడిచిపెట్టే వ్యర్థ నీరు సన్నటి కాలువల ద్వారా ఈ గుంతల్లోకి చేరుతోంది. తద్వారా ఇవి ఏళ్ల తరబడి అలానే ఉంటున్నాయి. వీటిని పూడ్చివేయడానికి ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.
-శేఖర్, బాలాజీనగర్

దోమల నివారణకు చర్యలు..

మురుగునీటి గుంతల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాం. డ్రోన్ల సాయంతో మలాథియాన్ పిచికారీతో పాటు వాటిలో నూనె బంతులు వేస్తున్నాం.
- లోకేశ్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

సీఎం రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎంపీ సీఎం రమేష్‌ను కలిసిన నాయకులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా చిత్తూరు నగరానికి విచ్చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, బుల్లెట్ ట్రైన్ నిలుపుదల తదితర అంశాలపై వారు ఆయనతో చర్చించారు. పార్టీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర, రెడ్డిమస్తాన్, మునిరాజా తదితరులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

చెక్కు అందజేస్తున్న లక్ష్మీసౌమ్య కుటుంబ సభ్యులు

గో సంరక్షణ పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ గో సంరక్షణ పథకానికి తిరుపతికి చెందిన లక్ష్మీ సౌమ్య రూ.లక్ష చెక్కును ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడికి శుక్రవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఉన్నత పాఠశాలలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

నాటి జ్ఞాపకం.. మదినిండా పదిలం

పెనుమూరు : వారంతా 41 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు. ఆపై చాలాకాలం తరవాత ఒకటిగా కలిసి తమ పాత జ్ఞాపకాలు పంచుకున్నారు. వారే పెనుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-85లో విద్యాభ్యాసం చేసిన పదో తరగతి విద్యార్థులు. సంక్రాంతి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన వీరు శుక్రవారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. పాఠశాలలో నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని సంబరపడ్డారు. పాఠశాలకు 50 కుర్చీలు వితరణగా అందజేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చిన్నబ్బరెడ్డి, పద్మనాభనాయుడు, ప్రభాకర్‌రెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో వరలక్ష్మి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

18 వరకు గృహోపకరణాలపై తగ్గింపు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా సత్య సంస్థ జనవరి 13 నుంచి 18 వరకు సంక్రాంతి సేల్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక సేల్‌లో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయని సంస్థ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈఎంఐలు, క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు అందజేస్తామంది. సమీప సత్య షోరూమ్‌ను సందర్శించి సద్వినియోగం చేసుకోండని కోరింది.



✦ పులిగుండు ఆలయం వద్ద క్యూలైన్లు ✦ గుంటీశ్వరస్వామి ఉత్సవమూర్తి

నేడు కొండచుట్టు తిరునాళ్ల

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రకృతి సిద్ధంగా వెలసిన పులిగుండు కొండచుట్టు తిరునాళ్ల శనివారం జరుగనుంది. ఇందుకు ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పూర్తిచేశారు. ఈ తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. పర్యాటకులు పులిగుండుపైకి ఎక్కి అక్కడ ఉన్న ఆలయాలను సందర్శిస్తారు. భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, స్వామివారి దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే పుట్టినరోజున సేవా కార్యక్రమాలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పుట్టినరోజు వేడుకలు గురువారం నిర్వహించారు. గాంధీ విగ్రహ కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించి సీయంటీఎస్ మైదానంలో వేదిక వద్దకు ఎమ్మెల్యే చేరుకున్నారు. ఆయనకు అభిమానులు, కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గజమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దపెద్ద కేకులను ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే కోసి పంపిణీ చేశారు. పేదలకు తోపుడు బండ్లు, సైకిళ్లు, ఇస్త్రీ బండ్లు, పానీపూరీ విక్రయ బండ్లు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు ఇచ్చారు. బెంగళూరు నుంచి ఎమ్మెల్యే అభిమానులు చిత్తూరుకు వచ్చి రక్తదానం చేశారు. బధిరుల కోసం దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి 240 మందికి పరీక్షలు చేసి ఆపై అవసరమైన వారికి వినికిడి యంత్రాల కోసం సిఫార్సు చేశారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే జగన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. **కాణిపాకం:** వరసిద్ధి వినాయకస్వామిని జగన్మోహన్ దర్శించుకున్నారు. పాలకమండలి ఛైర్మన్ మణినాయుడు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

అభిమానులు బహూకరించిన కత్తితో ఎమ్మెల్యే జగన్మోహన్

మంచు పొరలు కాదు.. చెరకు గడ పూతలు



ఈ చిత్రాన్ని చూస్తే ఎక్కడో హిమాలయాల్లో మంచు కొండల్లో పేరుకుపోయిన పొరల్లా ఉన్నాయనుకుంటే పొరపాటే. ఇవి ఆముదాల గ్రామంలో ఓ చెరకు తోటలో.. చెరకు గడకు విరబూసిన తెల్లటి పువ్వులు(పూతలు). ఉదయం తెల్లటి పువ్వులు మంచులో మిలమిలా మెరుస్తూ ఆహ్లాదకరంగా ఉండి చూపరులను ఆకర్షిస్తున్నాయి. విస్తారంగా చెరకు గడకు పెరిగిన ఈ పూతలు పూలవనంలా చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది మండలంలో అధిక వర్షాభావంతో తేమశాతం ఎక్కువ కావడంతో ఇలా చెరకు తోటలో పూతలు పూస్తున్నాయని రైతులు చెబుతున్నారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

సమావేశమైన సీపీఐ నాయకులు

ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి

నగరి, న్యూస్‌టుడే: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో ఈ నెల 18న విజయోత్సవ సభ నిర్వహించనున్నారని, దీన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి టి.కోదండయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విజయోత్సవ సభకు జిల్లా నుంచి కార్మిక వర్గాలు తరలి రావాలన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు, తెదేపా నాయకులు

శ్రీరంగరాజపురం: అమ్మవారి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్

విజయపురం: మహారాజపురంలో విజేతలకు కప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి: ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

రంగవల్లుల సోయగం.. సంక్రాంతి శోభితం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలను నగరవాసులు వైభవంగా నిర్వహించారు. పూర్వీకులను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్‌బాక్స్ అకాడమీలో బాలికలు సంప్రదాయ వేషధారణలో పండగ నిర్వహించారు. సంస్థ నిర్వాహకురాలు యువన్య పాల్గొన్నారు. ✦ రైతులు తమ పశువులను అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని వీధుల్లో ఊరేగించారు.

పూతలపట్టు: ప్రో ఫుడ్స్ అండ్ బేవరేజస్(డాల్ఫిన్ జ్యూస్) ఆధ్వర్యంలో పంటపల్లెలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు తెదేపా నాయకులు యువరాజుల నాయుడు, గోపి, ప్రసాద్ బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ఒట్టిగంట ప్రసాద్, నేతాజీ, సర్పంచి నీరజ పాల్గొన్నారు.

విజయపురం: ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. పన్నూరులో సంప్రదాయ దుస్తులతో ఎడ్ల బండిలో వెళ్లి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. కనకమ్మసత్రం నుంచి మహారాజపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ రాజమ్మ, ఎంపీపీ లక్ష్మీపతిరాజు నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, లోకేష్, రాజశేఖర్‌రాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, దశరథరాజు, గజేంద్రనాయుడు, రఘునాథరెడ్డి పాల్గొన్నారు. **నిండ్ర:** స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులందరికీ సర్పంచి వసంత, ఆమె భర్త బాబురెడ్డి సహకారంతో దుస్తులు పంపిణీ చేశారు. **నగరి:** తితిదే అనుబంధ శ్రీకరియ మాణిక్యస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడి అవతారంలో స్వామివారిని అలంకరించి ఊరేగించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ✦ కనుమ పండగను మాజీ మంత్రి రోజా తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి స్వగృహంలో ఆనందంగా నిర్వహించారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు కుప్పమ్మ, గంగమ్మగుడి గ్రామంలో ఆరిమాను గంగమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుప్పమ్మ ఆలయంలో అగ్నిగుండ ప్రవేశం ఆసక్తిగా సాగింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, హస్తకళల అభివృద్ధి మండలి ఛైర్మన్ హరిప్రసాద్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్.. పుల్లూరు కుప్పమ్మ ఆలయంలో పూజలు చేశారు.

కేబీఆర్‌పురంలో.. పుత్తూరు: కేబీఆర్‌పురంలో గ్రామ యువత మహిళలకు ముగ్గులు, స్థానికులకు కబడ్డీ, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించారు. పిల్లలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంబరాలను వీక్షించడానికి గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు.

సంతపేట: అగస్తీశ్వరస్వామి దేవస్థానంలో నందీశ్వరుడికి కూరగాయల అలంకరణ

పాలసముద్రం: పొంగళ్లు పెట్టేందుకు వస్తున్న గ్రామస్థులు

కలెక్టరేట్: గొబ్బియాలు ఆడుతున్న యువతులు

పుత్తూరు: కేబీఆర్‌పురంలో సంబరాల్లో గ్రామస్థులు

IN THE COURT OF THE
V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
O.S.NO. 792 OF 2024

Bank of Baroda, Kattamanchi Branch, Rep., by its Branch Manager. ...Plaintiff
-versus-
Kodandarama Agencies, Chittoor Rep., by its Prop., G.Pradeep Kumar .. Defendant

SUIT SUMMONS TO DEFENDANT

To
Kodandarama Agencies,Chittoor
Prop., G.Pradeep Kumar
S/o late K.Govindarajulu,
D.No.8-184, Jandamanu Street,
Near Raghavendraswamy Temple,
Chittoor, Chittoor District.

Sir, Please take notice that the plaintiff bank has filed the above suit against you for recovery of the amount. The said suit is posted to **11.2.2026** for your appearance. If you have got any objection you may appear on **11.2.2026 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sd/-**M.SUBRAMANYAM REDDY**
Advocate for Plaintiff
Place: Chittoor,Date:16-01-2026

IN THE COURT OF
THE PRL., CIVIL JUDGE
(SENIOR DIVISION),CHITTOOR
E.P.NO.06 OF 2021
O.S.NO.183 OF 2016

Between:
Syed Ruknuddin (died) and others ...D.Hrs
And:
M. Lalitha and others. ...J.Drs

NOTICES TO THE J.DRS NO.2 AND 3

To
1.M.Suresh Babu,
S/o. late R. Manikyam,
D.No. 4-619, Bound Street, Greamspet,
Chittoor town and district.(**JDr.No.2**)
2. M. Sudhakar,S/o. late R. Manikyam,
D.No. 4-619, Bound Street, Greamspet,
Chittoor town and district.(**J.Dr.No.3**)

Please take notice that the Decree Holders No. 2 and 3 who are L.Rs of deceased 1st decree holder are proceeding with above Execution petition in **E.P No. 06 of 2021** filed by deceased 1st D.Hr on the file of the above said court for sale of E.P. schedule mentioned property against both you and another. The said E.P proceedings stands posted to **13.02.2026** for your appearance before the above said Hon'ble Court. Please attend before the above said Court on **13.02.2026 at 10-30 a.m.** either in person or through your counsel and to file your objections if any, failing which the matter will be decided exparte

Sd/-**C.SURESH REDDY**
Advocate for D.Hrs
Place: Chittoor,Date:16-01-2026

పుత్తూరు: అలంకరించిన గంగిరెద్దు

చిత్తూరు గ్రామీణ: రంకెలేస్తూ పరుగెడుతున్న ఎద్దు

వెదురుకుప్పం: జనసమూహంలోకి పరుగులు తీస్తున్న ఎద్దు

వెదురుకుప్పం: కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు

కోలాహలంగా పశువుల పండగ

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కనుమ నేపథ్యంలో పశువులను ప్రత్యేకంగా అలంకరించి ఊరి పొలిమేర వద్ద ఉండే గ్రామదేవతకు పూజలు చేసి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. తుమ్మిందలో కాడెద్దుల రంకెలు అలరించాయి. కాడెద్దుల్ని ప్రత్యేకంగా అలంకరించి, వీధుల్లో రంకెలేయించారు. గ్రామ పెద్దలు రఘు, కుమార్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పుత్తూరు: పాడి రైతులు పశువులను శుభ్రంగా నీటితో కడిగి పసుపు, కుంకుమ పెట్టి పూజలు నిర్వహించారు. రంగులు వేసి అలంకరించారు. రైతులు ఆవుల కొట్టంలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. **వెదురుకుప్పం:** వేణుగోపాలపురం(యం)లో పశువుల పండగను కోలాహలంగా నిర్వహించారు. పక్క మండలాల నుంచి సైతం పశువుల యజమానులు తరలిరావడంతో జన సంద్రమైంది. సిద్ధం చేసిన పశువులను జనసమూహం వైపు డప్పుల వాయిద్యాల నడుమ వదలిపెట్టారు. వేగంగా పరుగులు తీస్తున్న ఎద్దులు, కోడెగిత్తలను నిలువరించడానికి యువత చేసిన సాహసం కనులపండుగగా సాగింది. **తవణంపల్లె:** ఈచనేరి గ్రామంలో పశువుల పండగ వైభవంగా నిర్వహించారు.

బస్సు కిందపడి తీవ్రగాయాలు

వెదురుకుప్పం: మండలంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పెరుమాళ్లపల్లెకు చెందిన జయరామిరెడ్డి సొంత పని నిమిత్తం తిరుపతికి వెళ్లి తిరుపతి-చిత్తూరు బస్సులో స్వగ్రామానికి వచ్చాడు. బస్టాపు వద్ద బస్సు దిగి ముందు నడిచి వెళ్తుండగా మిగిలిన ప్రయాణికులు దిగడంతో బస్సు ముందుకు కదిలింది. ఇంతలో అదికాస్తా అతడికి తగలడంతో కిందపడిపోయాడు. అతడి కాలిపై బస్సు ముందర చక్రం ఎక్కి తీవ్రగాయాలవడంతో 108 వాహనంలో తిరుపతి రుయాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి.. పుత్తూరు ఆరేటమ్మ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా మాంబేడు సమీప పచ్చికాపల్లం-కార్వేటినగరం రహదారిపై అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇతర వాహనదారులు అతడిని పచ్చికాపల్లం పీహెచ్‌సీకి తరలించి అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

జూదరుల అరెస్టు.. నిండ్ర, న్యూస్‌టుడే: ఆరూరు ఎస్సీ కాలనీలోని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న అదే కాలనీకి చెందిన కుమార్, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం కీళపూడి గ్రామానికి చెందిన విజయేంద్రన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై మల్లికార్జున తెలిపారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

భక్తులకు తప్పని ఇబ్బంది

కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ ఆవరణలో కొందరు కార్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో భక్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. నాలుగేళ్ల కిందట ఆలయ ఆవరణలో వాహనాల పార్కింగ్‌పై ఆలయ పాలకవర్గానికి, భక్తుల మధ్య వాగ్వాదం జరిగింది. అయితే మళ్లీ కొందరు కార్లను పార్కింగ్ చేస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

రక్తదానంతో చేయూత

పుంగనూరు గ్రామీణ, మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పారిశ్రామికవేత్త కొత్తపల్లె చెంగారెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లె గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ, మదనపల్లె భారతమాత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 27 మంది రక్తదానం చేశారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. సొసైటీ జిల్లా కార్యదర్శి జగదీష్, శ్రావణ్‌కుమార్, మహేష్‌కుమార్, గోవర్ధన్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్కనపల్లెలో ముగ్గుల పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న రఘుచంద్రగుప్తా

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కనపల్లెలో సంక్రాంతి పండగ సందడిగా జరిగింది. తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్ర గుప్తా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు, పిల్లలు వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 50 మందికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గ్రామసంరక్షణ పూజలు

పూజలో పాల్గొన్న మహిళలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని వీరప్పల్లె పంచాయతీ కొత్తవీరప్పల్లె గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బుధ, గురువారాలు గ్రామ సంరక్షణ పూజలు నిర్వహించారు. గంగమ్మ ఆలయంలో గురుప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, గ్రామం మధ్యలో అఘోరాస్త్రహోమం, అఘోరయంత్రపూజ చేపట్టారు.

మేమంతే.. మారమంతే

● పండగ వేళా ఆగని తవ్వకాలు ● పట్టించుకోని అధికారులు

పలమనేరు, న్యూస్‌టుడే: పగలు రాత్రి తేడా లేకుండా ఇసుకాసురులు ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పండగ వేళ కూడా పలమనేరులోని కౌండిన్య నదిలో తవ్వకాలు చేపట్టారు. పట్టణానికి 4 కి.మీ దూరంలోని క్యాటిల్‌ఫారం వద్ద కౌండిన్య నదిలో ఇటీవల వర్షాలకు నదిలో నిండుగా నీరుండటంతో ఇసుక తీయటం కొంత కష్టమైంది. ప్రస్తుతం కాస్తంత నీరు తగ్గటంతో వెంటనే తవ్వకాలు చేపట్టారు. పైగా ధరలు కూడా పెంచేశారు. టిప్పర్ ఇసుక రూ.20 వేలకు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

ఇసుక తోడుతున్న కూలీలు

ఎక్కడెక్కడంటే

పలమనేరు మండలం క్యాటిల్‌ఫారం, నాగమంగళం, గంగవరం మండలం జీడుమాకులపల్లె, దండపల్లెక్రాస్, కల్లుపల్లె, పెద్దపంజాణి మండలం కలగటూరు సమీపంలోని నదిలో ఇసుక ఇష్టానుసారం తవ్వుతున్నారు.

ఈ ప్రాంతాల్లో అధికం

పలమనేరు మండలం ముసలిమడుగు, కూర్మాయి ప్రాంతాల్లో ఇసుక తోడటం ఎక్కువగా ఉంటోంది. నదిలో నీరున్న సమయంలో జేసీబీలతో మాత్రమే తవ్వకాలు జరిపేవారు. ప్రస్తుతం నీరు తగ్గుముఖం పట్టడంతో నది ఒడ్డున కూలీలతో తవ్వకాలు జరుపుతున్నారు. అధికారులు స్పందించకుంటే నది రూపురేఖలు కోల్పోతుందని ప్రజలు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నిబంధనల విరుద్ధంగా ఇసుక తవ్వే ప్రాంతాలను పరిశీలిస్తాం. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటాం. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

- భవాని, ఆర్డీవో, పలమనేరు

విజేతకు బహుమతి అందిస్తున్న పవిత్ర మురళీకృష్ణ

విజేతలకు బహుమతులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగర్‌లో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పవిత్రమురళీకృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీలో ప్రతిభ చూపించిన వారికి గురువారం బహుమతులు పంపిణీ చేశారు.

ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిద్దాం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించేందుకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సహకరించాలని ప్రజా రవాణాధికారి రాము విజ్ఞప్తి చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా ఈయూ నాయకులు శుక్రవారం కలిసి సత్కరించారు. ప్రభుత్వం చేపట్టిన స్త్రీశక్తి పథకాన్ని మరింత విజయవంతం చేయాలన్నారు.

గో సంరక్షణ పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ గో సంరక్షణ పథకానికి తిరుపతికి చెందిన లక్ష్మీసౌమ్య రూ.లక్ష చెక్కును ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడికి శుక్రవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

జలహారతిలో వేదపండితులు, నాయకులు

కృష్ణమ్మకు జలహారతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: చుక్క నీరు లేక ఎండిన లక్ష్మీపురం చెరువుకు హంద్రీ-నీవా కాలువ ద్వారా కనమనపల్లె చెరువు నుంచి కృష్ణా జలాలు చేరాయి. లక్ష్మీపురం చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం వేదపండితులు కృష్ణమ్మ జలాలకు జలహారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. నాయకులు నారాయణప్ప, రవి, బాలు, లోకేశ్, రాజు, హరి, చంద్ర పాల్గొన్నారు.

కుప్పం గ్రామీణం: పూజలు చేస్తున్న ప్రజలు ● గుడుపల్లె: ఎద్దుల పరసను తిలకించేందుకు తరలివచ్చిన జనం

కోలాహలంగా కనుమ సంబరాలు

కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే: కుప్పం మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం కనుమను కోలాహలంగా జరుపుకొన్నారు. తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో సామూహిక పొంగళ్లు పెట్టి పశువుల దొడ్డిలో పూజలు చేశారు. మరికొన్ని గ్రామాల్లో పశువులకు ప్రత్యేక అలంకరణలు చేపట్టి జన సందోహం నడుమ పరుగులు తీయించారు. ● గుడుపల్లె, న్యూస్‌టుడే: కనుమ పండుగను గుడుపల్లెలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోలాహలంగా సాగిన కనుమను తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన జనంతో గుడుపల్లె ప్రాంతం కిటకిటలాడింది. వేంకటేశ్వరాలయంతో పాటు గ్రామ దేవతలైన గంగమ్మ, మారెమ్మ, పెద్దపులి గంగమ్మ, నాగదేవతలకు ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం పశువుల పరస చేపట్టారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. యువత కోడెగిత్తలను నిలవరించి రంగుల పలకలను దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో 20 మంది గాయపడ్డారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నంతో కుప్పం, గుడుపల్లె మండల నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: కెళవాతిలో పశువులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, సతీమణి రేణుకారెడ్డి

పాలారు జలం రైతన్నకు వరం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం నందికొండల్లో పుట్టి... కుప్పం మీదుగా తమిళనాడుకు ప్రవహిస్తున్న పాలారు జలాలను ఒడిసిపట్టారు. ఈ కాలువలో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడంతో ఇటీవల కురిసిన వర్షానికి జలకళ సంతరించుకుంది. ఈ నీటితో వేలాదిమంది రైతులు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

కుప్పం మండలం కంగుంది వద్ద పాలారు చెక్‌డ్యామ్‌లో జలకళ

బోరు వేయలేదు..



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. నేను ఇంతవరకు బోరు వేయలేదు. పాలారులో మోటారు పెట్టుకుని మల్బరీ సాగు చేపట్టాను. ఈ ఏడాది డ్యాంలో నీరు సమృద్ధిగా ఉండటంతో వేసవిలో సాగుకు భయం లేదు.

-వేణప్ప, రైతు, కంగుంది

అభివృద్ధి ప్రచారం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న అభివృద్ధిపై ప్రచార హోర్డింగ్‌లు కుప్పంలో వెలిశాయి. 'చంద్రన్న సారథ్యం.. కుప్పం అభివృద్ధి పథంలో మరో సువర్ణ అధ్యాయం..', 'నయా.. విద్యా కేంద్రంగా కుప్పం' ఇలా అన్ని అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేసేందుకు ఇలా హోర్డింగ్‌లతో కుప్పాన్ని నింపారు.

కుప్పం చెరువుకట్ట వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్

లీకులు.. ప్రజలకు తిప్పలు

గంగవరం మండల పరిధి నడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎన్టీఆర్ సుజల స్రవంతి శుద్ధ జలం కేంద్రానికి వెళ్లే పైపులైను దెబ్బతినింది. దీనివల్ల పలుచోట్ల నీరు లీకేజీ అవుతూ రోడ్డుపై వృథాగా ప్రవహిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

మురుగు తొలగించరా..?

వి.కోట మండల పరిధిలోని పత్రపల్లె గ్రామంలో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. వీటిని శుభ్రపరచకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వస్తోంది. పిల్లలు రోగాల బారినపడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, వి.కోట

ఈ జనరేటర్లు అలంకారానికే

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనరేటర్ అలంకార ప్రాయంగా మారింది. దాదాపు దశాబ్దం కిందట ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన దీన్ని వినియోగించకపోవడంతో.. మూలన చేరి.. తుప్పు పడుతోంది. కుప్పం నియోజకవర్గంలోని 9 పీహెచ్‌సీలలో జనరేటర్‌లను వాడకపోవడంతో రూ.లక్షలాది ప్రభుత్వ సొమ్ము వృథాగా పోతోంది. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్తు జనరేటర్‌లను వినియోగంలోకి తీసుకురావాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

శుద్ధజలం సమకూరింది..!

కుప్పం నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు శుద్ధజలం వసతి సమకూరింది. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థల సహకారంతో శుద్ధ జలం ప్లాంట్లను నెలకొల్పారు. శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో దాదాపు 700 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. గతంలో బోర్ల నీటినే తాగేవారు. కూటమి ప్రభుత్వం చొరవతో స్థానికంగా ప్రైవేటు విద్యా సంస్థల, స్వచ్ఛంద సంస్థల వితరణతో ఇటీవల శుద్ధజలం ప్లాంట్లను నెలకొల్పారు. సురక్షిత తాగునీటి వసతి సమకూరడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, కుప్పం

కుప్పం చెరువుకు నీరు

తీవ్ర వర్షాభావంతో ఎండిన కుప్పం చెరువులోకి కృష్ణమ్మ జలాలు శుక్రవారం ప్రవేశించాయి. ప్రస్తుతం చెరువులోని ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మట్టిని తవ్వి లోతు పెంచేందుకు పురపాలిక, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. కృష్ణమ్మ జలాలు చెరువులోకి ప్రవేశిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

గొర్రెలపై గుర్తుతెలియని జంతువు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం గ్రామంలో కోటబాయి సమీప అటవీ ప్రాంతంలో గొర్రెల మందపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. శుక్రవారం సాయంత్రం కృష్ణయ్య తన 40 గొర్రెలను తీసుకొని అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. ఒక్కసారిగా జంతువు పెద్దగా అరుస్తూ వచ్చి మూడు గొర్రెలను గాయపరిచిందని ఆయన చెప్పారు. భయంతో పరుగులు పెట్టానని, జంతువును చూడలేదని తెలిపారు. వచ్చే సరికి గాయాలతో ఒకటి మృతి చెంది ఉందన్నారు. గాయపడిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. శనివారం వెళ్లి పరిశీలిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బైరెడ్డిపల్లెలో పశువుల పరసను ప్రారంభిస్తున్న తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాధమ్మ

సందడిగా పశువుల పరస

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగలో మూడో రోజు శుక్రవారం కనుమను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. పాడి పెంపకం చేస్తున్న రైతులు పశువులను శుభ్రం చేసి అలంకరించారు. పాతూరునత్తం, బైరెడ్డిపల్లె, నెల్లిపట్ల గ్రామాల్లో పశువుల పరస సందడిగా జరిగింది. పశువుల పరసను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

పోలీసుల అదుపులో కల్తీపాల తయారీ దారులు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని సరిహద్దు గ్రామాల సమీపంలో పలు చోట్ల కల్తీ పాల తయారీ స్థావరాలపై కర్ణాటక పోలీసులు దాడులు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న ఘటన రెండు రోజుల కిందట చోటు చేసుకుంది. కర్ణాటక పరిధి కేజీఎఫ్ తాలూకాలోని బళ్లగిరిలో కల్తీ పాల తయారీని గుట్టు రట్టు చేసిన అక్కడి ప్రజారోగ్య శాఖ అధికారులు, పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు.. ఆంధ్రా పరిధిలోని బోయనపల్లెతో పాటు స్థానికంగా పలుచోట్ల పాలు కల్తీకి పాల్పడుతున్న వ్యాపారులను గుర్తించారు. కల్తీకి వినియోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సమాచారం.

తెదేపా నేత మృతికి నివాళి

శాంతిపురం: మండలంలోని కెనమాకులపల్లెకు చెందిన తెదేపా బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రమేష్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ విశ్వనాథ నాయుడు తదితరులు రమేష్ మృతదేహానికి నివాళి అర్పించారు.

నారా భువనేశ్వరి పరామర్శ

సీఎం చంద్రబాబునాయుడి సతీమణి ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి చరవాణి ద్వారా రమేష్ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని.. అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.

మద్యానికి బానిసై వేధింపులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: భర్త మద్యానికి బానిసై భార్య, బిడ్డల్ని వేధిస్తూ ఇంటి నుంచి గెంటేసిన ఘటన శుక్రవారం రామకుప్పం మండలం నెర్నిపల్లెలో చోటు చేసుకుంది. ఏఎస్సై అశ్వర్థనారాయణ వివరాల మేరకు.. పట్టణంలోని అగర్తవీధికి చెందిన అమరావతికి నెర్నిపల్లెకు చెందిన విజయ్‌తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన విజయ్ రూ.2 లక్షలు తీసుకురావాలని కోరుతూ అమరావతిని ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆమె పిల్లలతో పాటు పుట్టింటికి వచ్చేశారు. ఈమేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌లో ప్రమాదం

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. తిరుపతికి చెందిన ఇంద్రాణి, మరో నలుగురు శుక్రవారం కారులో హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. ఘాట్ మొదటి మలుపులో కిందికి వస్తున్న బస్సు, పైకి వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొని ఆగిపోయాయి. కారులోని ఇంద్రాణి ముఖానికి గాయాలవగా 108లో మదనపల్లె తరలించారు.

ధ్వంసమైన కారు ముందుభాగం

ప్రమాదాలకు అడ్డదారి

జాతీయ రహదారిలోని డివైడర్ల వద్ద కొందరు అడ్డదార్లు ఏర్పాటు చేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. పట్టణానికి 2 కి.మీ దూరంలోని నాగమంగళం బైపాస్ కింద డివైడర్‌ను ధ్వంసం చేసి దారి ఏర్పాటు చేశారు. సర్వీసు రోడ్డు నుంచి నేరుగా జాతీయ రహదారిలోకి కలిసేలా ఉన్న దారిలో ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాల్సిన అవసరముంది. - న్యూస్‌టుడే, పలమనేరు

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాలమానిని ఆవిష్కరణ

పలమనేరు: బలిజ అభ్యుదయ సేవా సంఘం నూతన కాలమానిని శుక్రవారం హైకోర్టు సీనియర్ న్యాయవాది పోలూరు గంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలిజ అభ్యుదయ సేవా సంఘం 15వ వార్షికోత్సవం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రూపేష్, కిరణ్‌కుమార్, దైవప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: చలమంగళంలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జైభీమ్ ఫౌండేషన్ ఛైర్మన్ శంకర్, నాయకులు

అంతిమయాత్రలోనూ అవస్థలే!

వీడని శ్మశానవాటికల సమస్యలు ● వసతుల కల్పనకు దృష్టిసారించని అధికారులు

గుడుపల్లె, న్యూస్‌టుడే: పుట్టుకకు ఎంత గౌరవం ఇస్తామో.. అదే స్థాయిలో మరణానంతరం అంతిమయాత్రకు అంతే గౌరవం ఇవ్వాలంటూ మన పెద్దలు చెప్పారు. కానీ కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శ్మశానవాటికలు లేక ఆఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు.

స్థలాలకు దారి లేక..

అధిక గ్రామాల్లో శ్మశాన వాటికకు సరైన స్థలాలు లేవు. ఒకవేళ ఉన్నా దారి సౌకర్యం లేకపోవడంతో గ్రామీణులు అంతిమయాత్రలో పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. వసతులు కల్పించాలంటూ ప్రజలు దశాబ్దాల కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా నేటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

గుడుపల్లె మండలం కాడేపల్లె గ్రామానికి అర కి.మీ. దూరంలో బ్రాహ్మణ, గాండ్ల కులస్థులకు శ్మశాన వాటిక కోసం ఏళ్ల కిందట స్థలం కేటాయించారు. అయితే నేటికీ ఆ శ్మశానవాటికకు దారి వసతి లేకపోవడంతో పొలాల గట్లపైనే అతి కష్టం మీద మృతదేహాలను తీసుకెళ్లాల్సిన పరిస్థితి. పాలకులు స్పందించి కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు, వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు ఉచిత నేత్ర శిబిరం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిమాతా సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు శుక్రవారం తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తామన్నారు.

'ప్రతి సంక్రాంతి ఇక్కడే జరుపుకొంటా'

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రతి సంక్రాంతిని చిత్తూరు జిల్లాలోనే జరుపుకొంటానని సినీనటుడు సప్తగిరి పేర్కొన్నారు. ఆయన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడారు. పట్టణ వాసులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.



స్నేహితులతో నటుడు సప్తగిరి

(c) eenadu

జగ్గన్నతోట తీర్థస్థలిలో కొలువైన ఏకాదశ రుద్ర ప్రభలు

ఎత్తైన ప్రభల కొలువు

అత్యంత ఎత్తుగా తయారు చేసిన వాకలగరువు, తొండవరం ప్రభలు ఆకట్టుకున్నాయి. అంబాజీపేట మండలంలోని వాకలగరువు నుంచి ఉమాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి, తొండవరం నుంచి ఉమా తొండేశ్వరస్వామి, అమలాపురం గ్రామీణ మండలం సాకుర్రుగున్నేపల్లి నుంచి ఉమాపార్వతి రామేశ్వరస్వామి ప్రభలను యువకులు భుజాలపై మోసుకుంటూ రావిచెట్టుకూడలికి తీసుకువచ్చారు. కొబ్బరి తోటలు, రహదారులను దాటించి, తీర్థం నిర్వహించారు.

జగ్గన్న తోట.. రుద్రుల కోట

వేడుకగా ప్రభల తీర్థం

ముక్కామల నుంచి తీసుకొస్తూ..

న్యూస్‌టుడే, అంబాజీపేట

జగ్గన్నతోట జనసంద్రమైంది. ఏకాదశరుద్రులను ఏకకాలంలో చూసేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఏకాదశరుద్రుల గ్రామాల్లో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం జగ్గన్నతోటలోని తీర్థ స్థలికి తీసుకువచ్చారు. తొలుత ఉదయం 10.30 గంటలకు మొసలపల్లి ప్రభను తీసుకొచ్చారు. అనంతరం ఒక్కొక్కటిగా వివిధ గ్రామాల నుంచి ప్రభలు వచ్చాయి. చివరిగా గంగలకుర్రు ప్రభ చేరుకుంది. అక్కడ భక్తుల దర్శనం అనంతరం తిరిగి ఒక్కొక్కటి గ్రామాలకు మరలాయి. ఈ మహత్తర ఘట్టాన్ని వీక్షించేందుకు సామాన్యుల నుంచి అందరూ తరలివచ్చారు. కొబ్బరితోటల్లో ఆధ్యాత్మిక వేడుకను తిలకించేందుకు లక్షలాది మంది రావడంతో సమీపంలోని కొబ్బరితోటలు సహా జగ్గన్నతోట తీర్థ స్థలి నిండిపోయింది.

గంగలకుర్రు ప్రభను కౌశికనది దాటిస్తున్న గ్రామస్థులు

ట్రాఫిక్ చిక్కులు.. జనం ఇబ్బందులు

జగ్గన్నతోటకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల రోడ్లలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. పుల్లేటికుర్రు-ఇరుసుమండ ప్రధాన రహదారిలో సమస్య ఏర్పడింది. ప్రజాప్రతినిధులు, అధికారులకు సంబంధించిన వాహనాలు తీర్థం జరిగే ప్రాంతం వద్ద నిలుపుదల చేయడంతో చాలాసేపటి వరకు చిక్కుముడి వీడలేదు. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వాకలగరువులో రావిచెట్టు కూడలికి ప్రభలను తీసుకువచ్చే సమయంలో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

అంబాజీపేట: రావిచెట్టుకూడలి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ఉత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన అశేష జనం (డ్రోన్ చిత్రం)

కౌశికా తీరంలో వంతెనపై కిక్కిరిసిన జనం

పి.గన్నవరం మండలం పప్పులవారిపాలెంలో కొలువుదీరి..

వేడుకను కెమెరాలో బంధిస్తూ..

హోరాహోరీ.. గెలుపే గురి

రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు శనివారంతో ముగియనున్నాయి. 14వ జాతీయ, 21వ ఆంధ్రప్రదేశ్ మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంట్, ప్రథమ సబ్ జూనియర్స్ పోటీల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీల్లో 45 బాస్కెట్‌బాల్ జట్లు తలపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ టోర్నమెంట్‌లో 6 మహిళా, 21 పురుషుల జట్లు పాల్గొన్నాయి. సబ్ జూనియర్స్ పోటీల్లో 8 బాలికల, 10 బాలుర జట్లు తలపడుతున్నాయని ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు.

- న్యూస్‌టుడే, రామచంద్రపురం

జిల్లా మీదుగా నడిచే ప్రత్యేక రైళ్లు ఇవే..

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పండగ అనంతరం ఆయా ప్రాంతాలకు బయలుదేరే తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్య స్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను కొనసాగిస్తోంది. ● శని, ఆది వారాల్లో జిల్లా మీదుగా విశాఖపట్నం-విజయవాడ(08567), విజయవాడ-విశాఖపట్నం(08568) జన్‌సాధారణ్(అన్‌రిజర్వ్డ్) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ● ఈ నెల 17, 19న విశాఖపట్నం-చర్లపల్లి(08511), 18, 20న చర్లపల్లి-విశాఖపట్నం(08512) అదనపు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఆగుతాయి. ● ఈ నెల 18న విశాఖపట్నం- చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 18న అనకాపల్లి-చర్లపల్లి(07479), 19న చర్లపల్లి-అనకాపల్లి(07477), అనకాపల్లి-చర్లపల్లి(07478) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 19న చర్లపల్లి-కాకినాడ టౌన్(07480), కాకినాడ టౌన్-చర్లపల్లి(07482) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

సాగర తీరంలో ఉత్సాహ కెరటాలు

ఎస్.యానాం బీచ్ ఓపెన్ ఆడిటోరియంలో కిక్కిరిసిన ప్రేక్షకులు

కళాకారుల నృత్య ప్రదర్శన

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలోని ఆంధ్రాగోవా కోకో బీచ్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడురోజుల పాటు ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షల మంది తరలి వచ్చారు. దీంతో ఎస్.యానాం సముద్రతీరం జనసముద్రాన్ని తలపించింది. సినీ, బుల్లితెర ప్రముఖులతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు పర్యాటకులను అలరించాయి.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

● ఐ.పోలవరం మండలంలోని ఓ గురుకుల పాఠశాల విద్యార్థినిని ఒకరు బంధువు అంటూ బయటకు తీసుకెళ్లారు. ఆపై అత్యాచారం చేసేందుకు యత్నించారు.

● ముమ్మిడివరం పరిధిలోని గురుకుల పాఠశాల విద్యార్థినిని ఓ మహిళ సంరక్షురాలునంటూ బయటకు తీసుకెళ్లి మరో వ్యక్తికి అప్పగించింది. జిల్లాలో ఇటీవల జరిగిన ఈ రెండు ఘటనలు సంచలనంగా మారాయి.

గుర్తింపుతో పిల్లలు భద్రం

అల్లవరం, న్యూస్‌టుడే: జిల్లాలో సాంఘిక సంక్షేమ, జిల్లా వెనుకబడిన తరగతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో దాదాపు 17వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా పేద విద్యార్థులే. వసతి గృహాల్లోని విద్యార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతిఒక్కరికి గుర్తింపు కార్డు ఇవ్వనున్నారు. ఇందులో విద్యార్థి వివరాలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకుడి ఫొటో, చిరునామా, చరవాణి నంబరు, వారి సంతకాలు వివరాలన్నీ ఉంటాయి. పిల్లలను తీసుకెళ్లాలని వచ్చిన వారు గుర్తింపు కార్డు చూపిస్తేనే విద్యార్థిని పంపిస్తారు. వీటితో పిల్లల భద్రతకు పూర్తి భరోసా ఇవ్వగలమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిలక్ష్మి దేవి తెలిపారు.


ప్రత్యేక గుర్తింపు కార్డుల నమూనా

వీటికి చెక్ పెట్టాలని..

● వసతిగృహాల్లో చదువుతున్న పిల్లలకు సంబంధం లేని వ్యక్తులు వస్తున్నారు. ● ఆసుపత్రికి తీసుకెళ్లాలని, కుటుంబ సభ్యులు లేదా బంధువులకు ఆరోగ్యం బాగోలేదని కారణాలు చెప్పి బడిలో విద్యార్థులను బయటకు తీసుకెళ్తున్నారు. ● భద్రతపై అనుమానాలు వస్తున్నాయి. ● సిబ్బంది పాత్ర, విధి నిర్వహణపై వారు చూపుతున్న శ్రద్ధ తదితర అంశాలపై ఆరోపణలు వచ్చాయి.

జిల్లాలో వివరాలు

వసతి గృహం	సంఖ్య	విద్యార్థులు
గురుకులాలు	6	13,040
సాంఘిక సంక్షేమ శాఖ	33	2,930
బీసీ వెల్ఫేర్	22	857

హైదరాబాద్‌కు 20 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సంక్రాంతికి హైదరాబాద్ నుంచి వచ్చి పండగ అనంతరం తిరిగి బయలుదేరే ప్రయాణికులకు 20 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈనెల 19 వరకు హైదరాబాద్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. తిరుగు ప్రయాణికుల ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా రాజమహేంద్రవరం డిపో నుంచి 17 నడపనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. తిరుగు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే దానికనుగుణంగా మరిన్ని ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

కత్తులు దూసిన కోళ్లు.. చేతులు మారిన రూ.కోట్లు

అమలాపురం కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఎన్ని హెచ్చరికలు చేసినా.. నిబంధనలు పెట్టినా.. ఎట్టకేలకు కోడికత్తే గెలిచింది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 20 మండలాల్లో ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేశారు. ఆకర్షించేందుకు ప్రత్యేక బహుమతులు పెట్టారు. అమలాపురం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కొన్ని బరుల వద్ద అశ్లీల నృత్యాలు చేయడం విమర్శలకు తావిచ్చింది.

క్రికెట్ స్టేడియంను తలపించేలా..

ఐ.పోలవరం మండలం మురమళ్లలో క్రికెట్ స్టేడియంను తలపించేలా భారీ ఏర్పాట్లు చేశారు. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం, సినీ నటులు హేమ, శివారెడ్డి తదితరులు తిలకించారు. బౌన్సర్లను పెట్టి, డ్రోన్లతో ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అందరూ వీక్షించేలా ఎల్ఈడీ తెరలు పెట్టారు.

మురమళ్లలో

గెద్దనపల్లిలో

వసూలుచేసి..

గుండాట నిర్వాహకుల వద్ద నుంచి కోడి పందేలు నిర్వహించే వారు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారు. ఈమొత్తం కాకుండా బరిలో నిర్వహించే ప్రతి పందెంలో 10 నుంచ 15 శాతం కమీషన్‌గా తీసుకున్నారు. కొంత మంది కేటుగాళ్లు గుట్టు చప్పుడు కాకుండా దొంగ నోట్లను మార్పిడి చేశారు. అల్లవరం మండలం గుండెపూడి బరి వద్ద దొంగనోట్లను గుర్తించిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

రూ.లక్ష నుంచి రూ.50 లక్షలు..

పలు బరుల వద్ద ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు నిర్వహించారు. జిల్లాలో అత్యధికంగా మురముళ్ల బరిలో రూ.లక్షల్లో పందేలు జరిగాయి. కొంకాపల్లి, కోడూరుపాడు గ్రామాల్లో వరుసగా 10 పందేలు నిర్వహించి 6 పందేలు గెలిచిన వ్యక్తికి బుల్లెట్ బండి బహుమతిగా ఇచ్చారు. మూడు రోజుల్లో సుమారు రూ.100 కోట్లు చేతులు మారి ఉంటుందని అంచనా.

దొంగనోట్ల మార్పిడి..

కాకినాడ గ్రామీణం కరప-పెనుగుదురు సరిహద్దులో నిర్వహించిన బరిలో విశాఖకు చెందిన వర్మ బృందం ఇన్నోవా కారును దక్కించుకుంది. భోగిరెడ్డి కొండలరావు ఆధ్వర్యంలో 60 పందేలు నిర్వహించగా విశాఖ వర్మ బృందం 31, చొల్లంగి రాంబాబు వర్గీయులు 29 పందేలను గెలిచారు. వర్మ బ్యాచ్‌కు కారు కానుకగా ఇచ్చారు.

లంక భూములకు గర్భశోకం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గోదావరి లంక భూములు.. సారవంతానికి పెట్టింది పేరు. ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటికి గోదావరిలో కలిసిపోతున్నాయి. పలు లంక గ్రామాల్లో ఊళ్లకు ఊళ్లు నదీపాతానికి గురవుతున్నాయి. కోనసీమలోని 16 మండలాల్లో 72 గ్రామాల్లో గోదావరి ప్రవహిస్తోంది. రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, కె.గంగవరం, పామర్రు మండలాల్లో గౌతమీ గోదావరి ప్రవహిస్తుండగా.. ఆత్రేయపురం, మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి వరకు వశిష్ఠ గోదావరి.. పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట మండలంలోని తొండవరం, అల్లవరం మండలం వరకు వైనతేయ గోదావరి ఓడలరేవు వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ పరిధిలో 75 వేల ఎకరాల్లో లంక భూములు విస్తరించి ఉన్నాయి. వీటిలో కొబ్బరితో పాటు కోకో, బత్తాయి, అరటి వంటి అంతర పంటలు, కూరగాయల సాగు చేస్తున్నారు.

గడిచిన సంవత్సరాల్లో..

ఐ.పోలవరం మండలం రామాలయంపేట, ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని సలాదివారిపాలెం, కూనాలంక, గురజాపులంక, తాళ్లరేవు మండలం పిల్లంక, కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామాల్లో గడిచిన పదేళ్లలో వందల ఎకరాలు లంక భూములు నదిలో కలిశాయి. సలాదివారిపాలెంలో ఓ పురాతన గుడి ఇప్పటికే గోదావరిలో కలిసిపోగా అక్కడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్తిగా పడిపోయింది. రామాలయం పేట వద్ద రూ.79 కోట్లతో రివిట్‌మెంట్ పనులు కొంత వరకు పూర్తి చేశారు.

సలాదివారిపాలెంలో గోదావరిలో కలిసిపోతున్న కొబ్బరితోటలు

అప్పట్లో హామీ ఇచ్చినా..

ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో పొట్టిలంకలో 1000 మీటర్లు, రాణేలంకలో 400 మీటర్లు, గురజాపులంకలో 600 మీటర్లు, కూనాలంకలో 800, వివేకానంద వారధి వద్ద 300, కొండుకుదురులంకలో 400 మీటర్లు వెరసి 3.5 కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్ నిర్మాణానికి రూ.150 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు 2023 ఆగస్టులో లంక గ్రామాల పర్యటన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినా రూపాయి కూడా ఇవ్వలేదు. లంక గ్రామాల్లో నదీ కోత నివారణకు నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వం పైనే లంక వాసులు ఆశలు పెట్టుకున్నారు. రివిట్‌మెంట్, గ్రోయిన్లు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ముమ్మిడివరం హెడ్ వర్క్స్ డివిజన్ పరిధిలో రూ.350 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని ఏఈ ఈశ్వరమణ్యం తెలిపారు.

కాలం చెల్లిందా.. పరీక్షలు తప్పనిసరి

మీ కోసం

న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం

లారీ, కారు, ద్విచక్రవాహనం, లారీలు, ఇలా ఏదైనా వాహనం ఏళ్లు గడిచినా వాడుతున్నారా. కాలం చెల్లినా రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారా.. ఇకపై అలా తిరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిందే. ఒక్కోదానికి స్లాబ్ ప్రకారం భారీ మూల్యం చెల్లించాల్సిందే. 15 ఏళ్లు దాటినా వినియోగించాలంటే ఫిట్‌నెస్ (సామర్థ్యం) పరీక్షలు తప్పనిసరి రవాణా శాఖ అధికారులు, ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి పరీక్ష చేయించుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాతే తిప్పాలి. ఈ పరీక్షలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఫీజు పెంచింది. సర్టిఫికెట్ ఫీజు, గ్రాంట్, రెన్యూవల్‌కు తోడుగా జీఎస్టీ ఛార్జీలు జోడించింది. * చాలా మంది ఇతర రాష్ట్రాల నుంచి పాత వాహనాలను కొనుగోళ్లు చేసి స్థానికంగా తిప్పుతున్నారు. అక్కడి రిజిస్ట్రేషన్ నంబరుతోనే తిరుగుతున్నారు. ఇకపై వారు సైతం దీనిపై దృష్టి సారించాలి.

ఫీజులు ఇలా (రూ.ల్లో)...

బండి రకం	15 నుంచి 20 ఏళ్లు	అంతకు మించితే
మోటారు సైకిల్	1,500	3,000
ఆటో రిక్షా, క్యాబ్	4,500	9,000
ఎల్‌జీవీ/ఎల్‌ఎంవీ	8,500	17,000
ఎంజీవీ	11,300	22,600
హెచ్‌జీవీ/హెచ్‌పీవీ	14,000	28,000

వాహనం తనిఖీ చేస్తున్న అధికారులు

స్వాధీనం చేసుకుంటాం..

రిజిస్ట్రేషన్ కాలం పూర్తయిన వాహనాలను కచ్చితంగా రెన్యూవల్ చేయించుకోవాలి. రెన్యూవల్ చేయించుకోకపోతే స్వాధీనం చేసుకుంటాం. - **దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా రవాణాశాఖాధికారి**

ఆకాశయానం.. మూడింతలు ప్రియం

కోరుకొండ, న్యూస్‌టుడే

ఆకాశయానం టికెట్ ధర అమాంతం పెరిగింది. సంక్రాంతి పండగ సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. పండగ ప్రారంభమైన వరుసగా మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంది. తరువాత మరో మూడు రోజులూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని విమానాశ్రయవర్గాలు అంటున్నాయి.

పండగ వేళ పెరిగిన టికెట్ ధరలు

దేశం నలుమూలల నుంచి విమాన సర్వీసులు అందుబాటులోకి రావడంతో పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది.

వచ్చేటప్పుడు... వెళ్లేటప్పుడు

పండగకు ముందు 3 రోజులూ ఇక్కడికి చేరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో విమాన సర్వీసులు రద్దీగా వచ్చాయి. తరువాత ఇక్కడ నుంచి వెళ్లేవారి సంఖ్యా అదే స్థాయిలో ఉండడంతో అదే రద్దీ కొనసాగనుంది. పెద్ద సంఖ్యలో రాకపోకలతో సందడిగా మారింది.

అమ్మో ధర..

ఇతర దేశాల నుంచి కనెక్టివిటీతో విమాన సర్వీసుల ద్వారా ఇక్కడికి చేరుకున్న ప్రయాణికులు టికెట్ ధర తెలుసుకుని అవాక్కవుతున్నారు. ఇంతకు ముందు ఎన్నడూలేని విధంగా ధరల్లో చాలా వ్యత్యాసం ఉందని అంటున్నారు. సాధారణ రోజుల్లో ప్రయాణంతో పోలిస్తే దాదాపుగా మూడు రెట్లు ధర పెరిగిందని అంచనా వేసుకుంటున్నారు.

టిక్కెట్ల ధరల వివరాలు ఇలా... (సుమారు రూ.వేలల్లో)

ప్రాంతం	సాధారణ రోజుల్లో	ప్రస్తుతం
హైదరాబాద్	4 – 6	12 – 18
దిల్లీ	6 – 8	10 – 16
ముంబయి	6 – 8	8 – 14
బెంగళూరు	5 – 8	8 – 12
చెన్నై	5 – 8	8 – 14
తిరుపతి	4 – 8	6 – 12

రూ.18 వేలు చెల్లించా..

హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం రావడానికి రూ.18 వేలు చెల్లించాల్సి వచ్చింది. మా కుటుంబ సభ్యులందరూ కలిసి వారం రోజులు ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. మా బంధువులు కొందరు టికెట్లు తీసుకుందామని ప్రయత్నిస్తే రూ.14 వేలు, 18 వేలు పలికిందని, రూ.20 వేలు కూడా దాటిందని చెప్పారు.

- మార్ని శ్రీనివాసరావు, హైదరాబాద్

మూడింతలు పెరిగాయి..

సంక్రాంతికి వచ్చేందుకు ముందుగా టికెట్లు బుక్ చేసుకున్నాం. యుఎస్‌కి ట్రిప్‌కు వెళ్లడంతో వచ్చేటప్పుడు హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నాను. టికెట్టు ధర ఇంతకు ముందు కన్నా మూడు రెట్లు పెరిగింది. సంక్రాంతికి డిమాండ్ ఉండటంతో టిక్కెట్ల ధర కూడా భారీగానే పెంచేశారు.

- నెక్కంటి వెంకట్, వైజాగ్

(c) eenadu

కళాకారులతో చిందేసిన ఎమ్మెల్యే

సంక్రాంతి సందర్భంగా పి.గన్నవరం మండలం బోడపాటి వారిపాలెంలో కొండాలమ్మఅమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడురోజులపాటు ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా సాగాయి. సంక్రాంతిరోజు గురువారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కళాకారులతో కలిసి నృత్యంచేస్తూ కాసేపు సందడి చేశారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

సచిత్రంగా సంక్రాంతి

మలికిపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన సంక్రాంతి చిత్రాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, గంగిరెడ్లు, కోడిపందేలు, పతంగులు, హరినామ కీర్తనలతో హరిదాసుల గ్రామోత్సవం తదితర అంశాలు ఇందులో పొందుపరిచారు. ఇవి పలువురిని ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, మలికిపురం

చిరు సోదరీమణుల సందడి

కోనసీమలో సంక్రాంతి సంబరాలను వీక్షించేందుకు మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు సినీహీరో చిరంజీవి సోదరీమణులు డాక్టర్ మాధవి, విజయదుర్గ కుటుంబ సమేతంగా గురువారం విచ్చేశారు. గ్రామంలో జరిగిన ప్రభల ఊరేగింపు, తీర్థంలో పాల్గొన్నారు. స్థానికంగా మండువా లోగిలిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మమేకమయ్యారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

కొత్త అల్లుడికి 1,574 వంటకాలతో విందు

మామిడికుదురు మండలం ఆదుర్రులో సంక్రాంతి పండక్కి వచ్చిన కొత్త అల్లుడికి 1,574 రకాల ఆహార పదార్థాలతో గురువారం విందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విజ్జపు వెంకటరత్నం, సుశీల దంపతులు గత ఫిబ్రవరిలో తమ కుమార్తె కీర్తిశ్రీని పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయిశరత్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్లుడికి వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, శీతలపానీయాలతో విందు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: అయిదు నుంచి పదోతరగతి వరకు పూర్తి చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీల్లో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిఐఆర్‌యుఎంఎఎల్ఎఐఐటీఈడీ' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

20 నుంచి క్షేత్రపాలకుడి కల్యాణం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్ర పాలకుడు పార్వతీనీలకంఠేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు ఈనెల 20 నుంచి 24వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు దేవాదాయశాఖ, ఆలయ ఈవో, ఏసీ నాగవరప్రసాద్, సిబ్బంది ఘనంగా చేస్తున్నారు. లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలకు ముందు ఐదు రోజులపాటు ఈ స్వామి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఈ క్షేత్రంలో ఆనవాయితీ. ఈనెల 20న రాత్రి 7గం.లకు అంకురార్పణతో ప్రారంభమవుతుంది. 21న దివ్య కల్యాణం, 22, 23న ప్రత్యేక పూజలు, 24న శ్రీపుష్పోత్సవంతో ముగిస్తారు. 25నుంచి లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలు ప్రారంభమై ఫిబ్రవరి2తో ముగుస్తాయని ఏసీ తెలిపారు.

విపత్తుల నుంచి కాపాడే కాలభైరవుడికి ఉత్సవం..

● 18న చొల్లంగి తీర్థం, జాతర

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోన మండలంలోని బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి నీలరేవు సముద్రపు తీరంలో కొలువై ఉన్న కాలభైరవుని ఆలయం ఎంతో విశిష్టత కలిగినది. ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఇక్కడ జాతర, తీర్థం ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం చొల్లంగి తీర్థం సందర్భంగా ఆ విశేషాలు తెలుసుకుంటే..

మత్స్యకారులకు ప్రతిమలు దొరకడంతో..

సుమారు రెండు వందల ఏళ్ల క్రితం ఇక్కడ సముద్ర తీరంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు కాలభైరవుడు, బ్రహ్మేశ్వరుని ప్రతిమలు దొరకడంతో వాటిని తీసుకువచ్చి సముద్రపు ఒడ్డున పెట్టి పూజలు చేయడం ప్రారంభించారు. తర్వాత కాలంలో కాలభైరవునికి ఇక్కడ ఆలయం నిర్మించారు. కాలభైరవునితోపాటు, బ్రహ్మేశ్వరుడు ఇక్కడ కొలువై ఉన్నాడు. చొల్లంగిఅమావాస్య ముందురోజు రాత్రి ఇక్కడ ప్రత్యేక జాతర కార్యక్రమం నిర్వహిస్తారు. మరునాడు తీర్థం ఉంటుంది. ఇక్కడ స్థానిక మత్స్యకారులే స్వామివార్లకు పూజలు చేస్తారు. సముద్రపు విపత్తుల నుంచి ఆ కాలభైరవుడు, బ్రహ్మేశ్వరులే తమను కాపాడుతున్నారని గంగపుత్రుల నమ్మకం.

నీలరేవులో ఆలయం

సంతానస్వామిగా ప్రసిద్ధి

ఇక్కడ స్వామివారు సంతానస్వామిగా ప్రసిద్ధి. పిల్లలు పుట్టని మహిళలు పుణ్యస్నానమాచరించి ఆలయంలో కాలభైరవుని పాదముద్రలు ఎదురుగా ఉన్న నందీశ్వరుని ముందు రాత్రంతా నిద్రించి భక్తితో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

కాలభైరవుడు

వేలసంఖ్యలో ప్రజలు..

ఎంతో ప్రత్యేకత కలిగిన ఆలయం కావడంతో చొల్లంగి తీర్థానికి దూరప్రాంతాల నుంచి ఎందరో భక్తులు ఇక్కడ కాలభైరవున్ని దర్శించుకోవడానికి వస్తుంటారు. తెల్లవారుజాము నుంచి సముద్ర స్నానాలు ఉంటాయి. శనివారం రాత్రి నుంచి చొల్లంగి ఉత్సవాలు, జాతర నిర్వహించి ఆదివారం ఉదయం తీర్థం నిర్వహిస్తారు. ఇక్కడకు వచ్చేందుకు అమలాపురం నుంచి పల్లం, చిర్రయానం వరకు బస్సు సౌకర్యం ఉంటుంది. ఆటోలలో ఇక్కడకు చేరుకోవచ్చు. కాట్రేనికోన నుంచి పల్లం మీదుగా ఇక్కడకు వెళ్లేందుకు తొమ్మిది కిలోమీటర్ల దూరం, చిర్రయానం వైపునా అయితే సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

టెస్లా కారుతో సందడి

అమలాపురం పట్టణం, ఐ.పోలవరం: సంక్రాంతి అంటే కోనసీమలో సంబరాలు అంబరాన్ని అంటుతాయి. ఇక్కడ జరిగే వేడుకలకు దేశ, విదేశాల నుంచి వస్తారు. ఎంతో ఖరీదైన కార్లలో వచ్చి కోడిపందేలు ఆడతారు. చెన్నైకు చెందిన ప్రముఖ వ్యాపారి ఆదిత్యరామ్ టెస్లా కారులో వచ్చారు. అమలాపురం, మురమళ్ల తదితర ప్రాంతాల్లో తిరిగారు. స్థానికులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కాగా ఈయన స్వస్థలం ముమ్మిడివరం మండలం గాడిలంక. ఏటా సంక్రాంతి సంబరాలకు వస్తుంటారు. ఈ వాహనాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు స్థానికంగా చెబుతున్నారు.

అమలాపురం గడియారస్తంభం కూడలిలో టెస్లా కారు వద్ద ఆదిత్యరామ్

చిత్ర పరిశ్రమకు అండగా కూటమి ప్రభుత్వం

● 'గేదెల రాజు' టీజర్ విడుదల చేసిన ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చిత్ర పరిశ్రమకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో గురువారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాల్లో గేదెల రాజు సినిమా టీజర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమా టైటిల్ పాత్రధారి కుంచే రఘు మాట్లాడుతూ కాకినాడ, ఉప్పలగుప్తం ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగిందన్నారు. నటులను ప్రోత్సహించడంలో ఎమ్మెల్యే ఆనందరావు పాత్ర మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు రఘును సన్మానించారు. సినిమా డైరెక్టర్ మోటూరి చైతన్య మాట్లాడుతూ క్రైమ్ డ్రామాగా ఈ సినిమా నిర్మించామని, చిత్రీకరణ పూర్తయిందన్నారు. ఫిబ్రవరి నెలలో విడుదల అవుతుందని, మౌనిక, టీనా శ్రావ్య కథానాయికలుగా, వికాస్, రవి ముఖ్యపాత్రల్లో నటించారన్నారు.

ఎస్.యానాంలో 'గేదెల రాజు' టీజర్ విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు, చిత్ర యూనిట్

శతాబ్దాల చరిత్ర కొత్తపేట ప్రభల తీర్థం

కొత్తపేట, న్యూస్‌టుడే: కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న ప్రభలతీర్థాలకి శతాబ్దాల చరిత్ర ఉంది.. కోనసీమలో పలుచోట్ల ప్రభల ఉత్సవాలు కనుమ రోజు జరుగుతుండగా ఎప్పటిలానే సంప్రదాయ ప్రకారం సంక్రాంతి రోజున కొత్తపేటలో నిర్వహించారు. పాత, కొత్త రామాలయాలు, బోడిపాలెం తదితర 12 ప్రభలతో ఏకాదశ రుద్ర రూపాలతో కొలువుదీరగా.. వేలాది సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గురువారం కొత్తపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో ప్రజల దర్శనార్థం వివిధ రకాల దేవుని ప్రతిరూపాలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో ఊరేగింపుగా ఏర్పాటు చేశారు. ● కొత్తపేట జూనియర్ కళాశాల మైదానంలో ప్రభల తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి సుమారు నాలుగు గంటలపాటూ నిరంతరంగా నిర్వహించిన బాణాసంచా ప్రదర్శన ఉత్సావాలకు మరింత శోభను చేకూర్చింది. కాంతులు విరజిల్లుతున్న మల్లెపందిరిలు, మనస్సును ఆకట్టుకునే విధంగా ఈత చెట్టులు, బుసలు కొడుతున్న పాములు, గదలు, మరెన్నో రకాల బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణసంచా కాల్పులను అనేకమంది చరవాణుల్లో బంధించారు.

అబ్బురపరుస్తున్న బాణసంచా

కొత్తపేటలో కొలువుదీరిన ప్రభలు

భజగోవిందం.. జగదానందం

● కిక్కిరిసిన వాడపల్లి దివ్యక్షేత్రం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: భక్తజన వరదా.. చందన స్వరూపా నమోస్తుతే స్మరణతో కోనసీమ తిరుమల వాడపల్లి పులకించింది. శ్రీమన్నారాయణుడు దివ్యాలంకార శోభితుడై భక్తులకు జగన్మోహనంగా దర్శనమిచ్చారు. ఆదివారం కనుమ పండగ కావడంతో వెంకన్న క్షేత్రం వేలాది మంది భక్తజనంతో అలరారింది. గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.

విజేతలకు బుల్లెట్ బండి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ పరిధిలోని గోపులంకలో వేగేశ్న శ్రీనురాజు ఆధ్వర్యంలో కోడి పందేలు జరిగాయి. అందులో వరుసగా ఆరు పందేలను హైదరాబాద్‌కు చెందిన రమణ బృందం గెలుపొందింది. విజేతకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నిర్వాహకుడు వేగేశ్న శ్రీనురాజు చేతుల మీదుగా బుల్లెట్ బండిని శుక్రవారం బహూకరించారు. దడాల అప్పారావు, దొరబాబు, శీలం అంజి పాల్గొన్నారు.

రావులపాలెంలో కోడి పందేలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్ తదితరులు

3 రోజులు.. కొనసాగిన బరులు

సంక్రాంతి నేపథ్యంలో రావులపాలెం మండలంలో కోడిపందేలు జోరుగా సాగాయి. మూడు రోజుల పాటు బరుల్లో పందేలను నిర్వహించి లక్షల్లో చేతులు మారాయి. బరుల్లో పదుల సంఖ్యలో గుండాటను నిర్వహించారు. రావులపాలెం బరిలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజులు సంక్రాంతి రోజున కోడి పందాలను ప్రారంభించారు. - న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు 8008621414 & 9154918858 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి దుర్గేష్

రామచంద్రపురం: రామచంద్రపురం కేంద్రంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరాలయాన్ని రూ.4కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వి.ఎస్.ఎం కళాశాలలో జరుగుతున్న కోనసీమ సంక్రాంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆనందం సంతోషం పెంపొందించేందుకు ప్రభుత్వం సంక్రాంతి, గండికోట సంబరాలు అమరావతి ఆవకాయ, డ్రాగన్ పడవ పోటీలు, జగ్గన్నతోట ప్రభల తీర్థం నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ జరగని విధంగా సంక్రాంతి సంబరాలు మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ప్రజల్లో సామాజిక ఐక్యత, సమానత్వానికి మంత్రి సుభాష్ చేస్తున్న కృషిని దుర్గేష్ ప్రశంసించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకునేందుకు నిత్యం పనిచేస్తానన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మంత్రులు దుర్గేష్, సుభాష్, నాయకులు

కోటిపల్లి- ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధనే లక్ష్యం

కోనసీమ జిల్లా ప్రజల వాంఛ అయిన కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి నిర్మాణ లక్ష్యమే ధ్యేయంగా పనిచేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. వి.ఎస్.ఎం కళాశాలల ప్రాంగణం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి ఉత్సవ్-2026 ముగింపు సభలో మంత్రి మాట్లాడారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	157-00
రిటైల్ లైవ్	184-00
డ్రెస్డ్	267-00
స్కిన్‌లెస్	304-00

వద్దన్నా.. వినిపించుకోలేదు

● ప్రభలపై వైకాపా జెండాలు.. నేతలు, నటుల ఫొటోలు

అంబాజీపేట: పరమశివుడి ప్రతిరూపాలుగా కొలిచే సంక్రాంతి ప్రభలకు పార్టీల జెండాలు, రాజకీయ నాయకులు, సినీ నటుల చిత్రాలు వద్దని ముందుగానే సూచించినా కొందరు పట్టించుకోలేదు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలో కొందరు యువకులు వైకాపా జెండాలతో హల్‌చల్ చేశారు. ఎగువ కౌశిక నదిని ప్రభలు దాటే సమయంలో వారు వీటిని ప్రదర్శించారు. ఇంకొందరు అభిమాన నటుల ఫ్లెక్సీలు, బొమ్మలను ప్రభలతో పాటు ఊరేగింపులో ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ప్రభల తీర్థాల్లో ఈ తరహా పోకడలు వద్దని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి పోలీసులకు సూచించారు. ఈ అంశంపై పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజుతో మాట్లాడారు. వైకాపా జెండాల ప్రదర్శనపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభల ఉత్సవంలో వైకాపా జెండాతో ఇలా..

పోలీసులను ప్రశ్నిస్తున్న తేజస్వి

నదీ విహారం చేస్తున్న పర్యాటకులు

దిండి రిసార్ట్స్‌లో సందడి

పర్యాటకుల తాకిడితో దిండి రిసార్ట్స్‌లో సందడి నెలకొంది. గృహపడవలు, ఫంటూన్, ఆత్రేయ బోటుల్లో నదీ విహారంతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు, యువకులు ఈత కొలనులో ఈత కొట్టారు. రిసార్ట్స్‌లో గదులన్నీ నిండిపోయాయి. - న్యూస్‌టుడే, మలికిపురం

EENADU eClassifieds

BUSINESS SERVICES
BUSINESS OFFER
మేముచేయుచున్న బిజినెస్ మీరు వ్యక్తి గతంగా గాని మాతో కలిపి చేయుట ద్వారా మంచి లాభాలను పొందండి. వివరాలకు: 9391717772.

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాల్లో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE
మధ్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మీ లాడ్జిలో, SVG మార్కెట్, ఆర్.టి.సి. కాంప్లెక్ ఎదురుగా ప్రతినెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY
సంక్రాంతి శుభాకాంక్షలు
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు MD, DM (Rheumatology, NIMS, HYD)
24-1-2026న (శనివారం) 11 Am to 5 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సీసీసీ ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
25-1-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

PROFESSIONAL SERVICES
ASTROLOGY
ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ (ICAS చెన్నై Regd.) వారి జ్యోతిష్య, వాస్తు కోర్సులకు ప్రవేశ ఆహ్వానము. ★ అమలాపురం ★ రాజమండ్రి కాకినాడ సెంటర్లలో 1) గీతా విద్యాలయం, అమలాపురం ★ 9492813554, 2) సరస్వతీ హాల్, గోదావరి గట్టు, రాజమండ్రి. సెల్: 9966666659. J.శ్రీనివాస్ www.icasindia.org

EENADU for Advertisement Contact: 8008597607

REAL ESTATE
FLAT FOR SALE
KAKINADA CITY
FLATS FOR SALE
కాకినాడ సురేష్ నగర్ శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ ఎదురుగా
నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు తూర్పు మరియు పడమర ఫేసింగ్ 2 BHK FLATS అమ్మకానికి కలవు.
Contact 63031 73055 90103 85888

HOUSE FOR SALE
GENERAL
ఖండపల్లి గ్రామంలో కాముల్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం, పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. Cell: 9392122526.

LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రికి 30కి.మీ. దూరం మురారి గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60సెంట్లు భూమి అమ్మకం. (నో బ్రోకర్స్). 9032988265.

KAKINADA RURAL
1.15ఎకరముల పొలంఅమ్మకం కాకినాడ, కరప మండలం, వేములవాడ రామచంద్రపురం హైవేకు, లేవుట్‌నకు, ఇళ్లకు అనుకుని గోడౌన్, ఇండస్ట్రీస్‌కు అనువైనది అమ్మకం. నో బ్రోకర్స్. 9399934499.

GENERAL
1.10 Acre N/E Corner Full Tar Road Facing Commercial Land Opp. to N.T. Rajapuram Sachivalayam. 1.8KM from Gandapalli Highway. 8500268603.

PLOT FOR SALE
BHOGAPURAM
Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

KAKINADA CITY
★★★ కాకినాడదగ్గరలో Plot కొనండి, Plot గెలవండి భారీ సంక్రాంతి ఆఫర్లు గజం కేవలం 9,999/- రూ. నుంచి ప్రారంభం. ✆ 8886663196
కాకినాడకు అతిదగ్గరలో తక్కువ రేట్లకే సైట్లు, బిల్డింగ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు అమ్మబడును. ✆ 77806 73892.
అన్నవరం సెంటు: 11 లక్షలు, మాధవపట్నం సెంటు: 9 లక్షలు, పెద్దాపురం సెంటు: 7 లక్షలు, ఉండూరు ఊరు మధ్య: 4 లక్షలు, బ్యాంక్ లోన్. 9063385043.

KAKINADA RURAL
కాకినాడ బైపాస్‌కు 1కి.మీ.దూరం మాధవపట్నం- రామేశ్వరం కొత్తూరులో 125, 135, 145, 275 చ॥గ॥లు, 40అ॥ల రోడ్లతో టీచర్లు, లాయర్లు, బ్యాంకు ఉద్యోగుల ఇళ్లతో అభివృద్ధి చెందిన లేఅవుట్, ✆ 98481 33799.

RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చ॥గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/ వాట్సాప్: 80748 57055.
RK Township వారి రాజమండ్రి వెంచర్లపై సంక్రాంతి Gold ఆఫర్ కలదు. వివరాలకు: బ్రాంచ్ మేనేజర్, Contact Cell: 99490 91197.

RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి సమీపం రాజానగరం పంచాయతీ "చక్రద్వారబంధం" రోడ్డు సాయినగర్‌లో 191.5 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 9704193649, 8019227241

GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET
COMMERCIAL
4BHK flat with 2 car parking near GAIL office in Rajahmundry. Suitable for corporate Office/ Guest House. Cont: 9347146720

JOBS
WANTED MARKETING MANAGERS/ Asst. Managers, Qualification: Degree, Age: Above 30 Years, Salary: Above 30K. Cont. Cell: 90108 09384.
కాకినాడ, హోటల్-రెస్టారెంట్‌లో బిర్యానీ, సౌత్ ఇండియన్, చైనీస్, టిఫిన్స్ మాస్టర్స్, సప్లయర్స్, హెల్పర్స్ (బాయ్స్ & గర్ల్స్) కావలెను. Contact Cell: 99493 43008.
కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-50 పై॥ అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో గుమ్మటం ఊరేగింపు

మామిడికుదురు, న్యూస్‌టుడే: ముస్లింలు తమ ఏడో ఇమామ్ మూసయే కాజిం షహదత్ సందర్భంగా మామిడికుదురు, నగరం గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ప్రవక్త కుమా మౌలానా సయ్యద్‌అబ్బాస్ బాబరీ స్థానిక మంజిలే కర్బలా పంజాలో జరిగిన మజ్లిస్‌లో ప్రవచనలు చేశారు. అనంతరం బార్గాహ్ ఫాతిమా పంజా నుంచి గుమ్మటాన్ని వీధి ఊరేగించారు. పెదపంజేషా వరకు మాతం జరిపారు. పలు గ్రామాల నుంచి వచ్చిన అనేకమంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పెదపళ్లలో గవ్వ ఉత్సవం

అలమూరు, న్యూస్‌టుడే: పెదపళ్ల పోలేరమ్మ జాతర సందర్భంగా కనుమ పండగనాడు గ్రామంలో గవ్వ ఉత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ఇచ్చిన కోళ్లను పోలేరమ్మ పూలగరగను ఎత్తుకున్న ఆసాది కొరికారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ● అలమూరు గ్రామ దేవత రావులమ్మ తీర్థం అంగరంగవైభవంగా జరిగింది. అమ్మవారు పుట్టినిల్లు నుంచి మెట్టినిల్లు చేరే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80085 74174
ఉ. 10 - మ. 1
80085 74229
90323 93884

చెత్తాచెదారాలు శుభ్రం..

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని కొత్తకాలనీలో రోడ్డు వెంట చెత్తాచెదారాలు పేరుకుని పోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

ఎత్తైన ప్రభ దర్శనభాగ్యం కలిగింది

వాకలగరువు ప్రభ వద్ద గోవిందానంద సరస్వతీస్వామీజీ

అంబాజీపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించే ప్రభను దర్శించుకోవడం మహాభాగ్యంగా భావిస్తున్నానని హంపిలోని పంపా క్షేత్ర అధిపతి శ్రీశ్రీశ్రీ గోవిందనందసరస్వతి స్వామీజీ అన్నారు. వాకలగరువులోని ఉమా పార్వతీసోమేశ్వరస్వామి ప్రభను ఆయన గురువారం దర్శించుకున్నారు.

మామిడికుదురులో వేడుకగా ఊరేగింపు

తూర్పుపాలెంలో నీలపల్లమ్మ ఆలయానికి తీసుకున్న ప్రభలు

ముక్తేశ్వరంలో కొలువుదీరి..

ఈతకోటలో ..

అశ్వరభ శ్వరభ.. పరిఢవిల్లిన ప్రభ

మామిడికుదురు, మలికిపురం, కొత్తపేట, రావులపాలెం గ్రామీణం, రాజోలు, అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, న్యూస్‌టుడే: అశ్వరభ.. శ్వరభ అంటూ మంగళవాయిద్యాలతో అశేష జనవాహిని మధ్య తరలివచ్చిన ప్రభలు శుక్రవారం కొలువుదీరాయి. ● మామిడికుదురు, పెదపట్నం, పాశర్లపూడి, నగరం, ఈదరాడ తదితర గ్రామాల నుంచి కొర్లగుంట తీర్థ స్థలికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. పెదపట్నంలోని పలు వీధుల్లోంచి సుమారు పది ప్రభలను స్థానికంగా పంటకాలువ జలాల్లో దిగి తీర్థ స్థలికి తీసుకువెళ్లడం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కేశనపల్లి, తల్లి ప్రభతో సహ తొమ్మిదేసి ప్రభలను ఆయా ప్రాంతాల నుంచి ఊరేగింపుగా కేశనపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లో వేంచేసి ఉన్న నీలపల్లమ్మ ఆలయాలకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ● పి.గన్నవరం మండలం పప్పులవారి పాలెం డ్యాం సెంటర్ వద్ద పంచదర్ల ప్రభలు కొలువుదీరాయి. డి.ఐ.జి.(పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) భూసారపు సత్యఏసుబాబు నరేంద్రపురంలో ప్రభను దర్శించుకున్నారు.

ఐజీ అశోక్‌కుమార్‌కు వివరిస్తున్న ఎస్పీ భీమారావు

కొత్తపేట: జగ్గన్నతోట, కొత్తపేట ప్రాంతాల్లో నిర్వహించే ప్రభల తీర్థానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా డీఎస్పీ సుంకర మురళీమోహన్ 800 మంది సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు. జగ్గన్నతోటలో ప్రభల తీర్థానికి 300 మంది పోలీసు సిబ్బంది, కొత్తపేటలో నిర్వహించిన ప్రభల తీర్థానికి 500 మంది సిబ్బంది నియమించి ప్రత్యేక పహారా ఏర్పాటు చేశారు. పోలీసుల సమన్వయంతో చేపట్టిన చర్యల వలన ప్రభల తీర్థం ప్రశాంతంగా భక్తిశ్రద్ధల మధ్య కొనసాగిందని భక్తులు అభిప్రాయపడ్డారు.

ప్రభల తీర్థాన్ని తిలకించేందుకు వచ్చిన జనవాహిని

కడప నుంచి కుటుంబంతో..

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని చూసేందుకు కడప నుంచి కుటుంబంతో వచ్చాం. నా భార్య, పిల్లలు ఎంతో ఆనందపడ్డారు. రాష్ట్ర పండగగా గుర్తించడంతో ప్రాముఖ్యత ఏర్పడింది. కౌశిక నదిని దాటి వచ్చే దృశ్యాలు చూసేందుకు తరలి వచ్చాం.

– ఎస్.బాలకృష్ణ, కుటుంబ సభ్యులు, కడప

రాష్ట్ర పండగగా..

నేను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. కొన్నేళ్లుగా జగ్గన్నతోట తీర్థానికి రాలేకపోతున్నాను. రాష్ట్ర పండగగా ప్రకటించిన తరువాత ఈసారి రావాలని ఇక్కడికి వచ్చాను. మాది అంబాజీపేట మండలం గంగలకుర్రు.

– బొడ్డపాటి రమ, అమెరికా

25 ఏళ్ల తర్వాత..

జగ్గన్నతోట ప్రభల తీర్థం ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది. అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటున్నాను. గతంలో ఓసారి ఉత్సవానికి వచ్చాను .25 సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడు రావడం చాలా ఆనందంగా ఉంది.

– భమిడిపాటి నానాజీ, అమెరికా

నరేంద్రపురంలో ప్రభను దర్శించుకుంటున్న డి.ఐ.జి. (పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) భూసారపు సత్యఏసుబాబు

పప్పులవారిపాలెం వద్ద పంట కాలువలోంచి తీర్థ ప్రదేశానికి తరలిస్తూ..

కొత్తపేట మండలం మోడేకుర్రు నుంచి పప్పులవారి పాలెం డ్యాం సెంటర్‌కు తీసుకొస్తున్న యువత

పాదలాడలోని కామాక్షమ్మ ఆలయం వద్ద ..

గెలిచింది కోడే..

మామిడికుదురు, ఆత్రేయపురం, రావులపాలెం గ్రామీణం, మలికిపురం, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు పలు గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలు, రికార్డింగ్ డ్యాన్సులు యథేచ్ఛగా సాగిపోయాయి. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో బుధవారం నుంచి శుక్రవారం వరకు అడ్డూఆపూ లేకుండా పోయింది. మామిడికుదురు మండలంలోని మగటపల్లి, కొమరాడ, ఈదరాడ, గోగన్నమఠం, ఆదుర్రు, పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నం తదితర చోట్ల రూ.లక్షల్లో జరిగాయి. కొమరాడలో విజేతలకు ద్విచక్ర వాహనాలు బహుమతులుగా అందజేశారు. ● బొబ్బర్లంక, పేరవరం వంటి గ్రామాల్లో ర.భ. రాష్ట్రీయ రహదారి చెంత పందెలు నిర్వహించడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ప్రయాణికులు పడరానిపాట్లు పడ్డారు. ● రావులపాలెం మండలం రావులపాడు, వెదిరేశ్వరం, దేవరపల్లి తదితర గ్రామాల్లో భారీస్థాయిలో కోడిపందేలు, గుండాటలు నిర్వహించగా కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ● మలికిపురం, మేడిచర్లపాలెం, లక్కవరం, మట్టపర్రు తదితర గ్రామాల్లో మూడో రోజున కోడిపందేలు జోరుగా సాగాయి. రూ.లక్షలు చేతులు మారాయి. శిబిరాల వద్ద గుండాట, మద్యం అక్రమ అమ్మకాలు సాగాయి. కేశనపల్లి, పడమటిపాలెం, తూర్పుపాలెం గ్రామాల్లో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించారు.

అప్పనపల్లి ఏటిగట్టు దిగువలో కోడిపందేలు

ఆట వస్తువుల పంపిణీ

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేదిపల్లిపాలెంలోని విద్యార్థులకు ఆస్ట్రేలియా యువకులు శుక్రవారం ఆట వస్తువులు పంపిణీ చేశారు. కోనసీమ అందాలు, సంక్రాంతి సంబరాలను తిలకించడానికి రెండు రోజుల కిందట వీరు ఇక్కడికి విచ్చేశారు. ముందుగా కోడిపందేలను తిలకించారు. అనంతరం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు అందజేసి బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక వశిష్ఠ గోదావరిలో సాగర సంగమం వరకు బోటింగ్ చేశారు.

బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాట్‌లతో విద్యార్థులు, ఆస్ట్రేలియన్లు

ఇంద్రజాలంతో అలరించిన అలీ

మామిడికుదురు, న్యూస్‌టుడే: సంక్రాంతి వేళ చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో నారా, నందమూరి కుటుంబాల ఆత్మీయ కలయిక సందర్భంగా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన అలీ తన ఇంద్రజాల ప్రదర్శనతో సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతుల ప్రశంసలు అందుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. సీఎం దంపతులు ఎంతో ఆసక్తిగా వీక్షించి అభినందించారన్నారు.

సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతుల ఎదుట ప్రదర్శన ఇస్తున్న అలీ

శిథిలమైన తుపాను ఆశ్రయ భవనం



కేశనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని తుపాను ఆశ్రయ భవనం శిథిలమై నిరుపయోగంగా మారింది. సుమారు 30 సంవత్సరాల క్రితం ఇది నిర్మితమైంది. అప్పటి నుంచి అసలు వినియోగించలేదు. కనీసం పాఠశాల తరగతులను కూడా ఇందులో నిర్వహించలేదు. ప్రస్తుతం భవనంపై మొక్కలు మొలిచి ప్రమాదకరంగా ఉంది. దీనిపై తహసీల్దార్ టి.శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.– న్యూస్‌టుడే, మలికిపురం

బీటలువారి.. ప్రమాదంగా మారి..

నేదునూరు పెదపేటలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే సీసీరోడ్డు బీటలువారి అధ్వానంగా మారింది. రాత్రి సమయంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో విద్యార్థులు, ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

నేటికీ తొలగని చిత్రం

ప్రభుత్వం మారి రెండేళ్లు పూర్తి కావస్తున్నా వైద్యఆరోగ్యశాఖ మాత్రం మాజీ సీఎం చిత్రాలు తొలగించడంలో విఫలమవుతోంది. రాజోలు మండలం చింతలపల్లి గ్రామ పంచాయతీ ఎదురుగా హోర్డింగ్ ఇంకా దర్శనమిస్తోంది. దీనికి ఎదురుగా జడ్పీ ఉన్నత పాఠశాల కూడా ఉండటం విశేషం. దీనిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

240 రకాల పదార్థాలతో విందు

ఆత్రేయపురం: ఆత్రేయపురానికి చెందిన తాడేపల్లి వెంకట సత్యానందం, సరోజినిల కుమార్తె సాయిప్రవీణకు కొత్తపేటకు చెందిన శ్రీకాకోళ్లపు వినయ్‌కి ఇచ్చి గత సంవత్సరం వివాహం చేశారు. సంక్రాంతి పురస్కరించుకుని అల్లుడికి 240 రకాల విందుతో భోజనం వడ్డించారు. అనంతరం పండగ కానుకగా బుల్లెట్ బైక్ అందజేశారు.

చెన్నై అల్లుడికి 60 రకాలతో.. పి.గన్నవరం: పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు నామాడివారిపేటలో కొత్త అల్లుడికి 60 రకాల వంటకాలతో గురువారం విందుభోజనం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నూకల నవ్యకు చెన్నైకి చెందిన విజయ్‌తో నెల రోజుల క్రితం వివాహమైంది. సంక్రాంతికి తీసుకొచ్చిన కొత్త అల్లుడు విజయ్‌కు అత్తమామలు నూకల రాజ్‌కుమార్, రాజామణి రకరకాల వంటకాలు తయారు చేసి పెద్ద విస్తరేసి దాంట్లో భోజనం పెట్టారు.

మాయావతి జన్మదినోత్సవం

అంబాజీపేట: బీఎస్పీ అధినేత్రి, మాజీ సీఎం మాయావతి జన్మదినోత్సవాన్ని మాచవరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోఆర్డినేటర్ గెడ్డం సంపదరావు, ప్రధాన కార్యదర్శులు గుమ్మాపు చిత్రసేన్, కొల్లాబత్తుల సత్యం హాజరై మాట్లాడారు. మాయావతిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లక్ష్మణరావు, రాంబాబు, ములపర్తి చందు, శివశంకర్ పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీజీవో డైరీ ఆవిష్కరణ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని వసంత మండపంలో శుక్రవారం ఏపీఎన్‌జీజీవోస్ సంఘ తాలూకా అధ్యక్షుడు ఏపుగంటి సురేష్ ఇతర కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నూతన డైరీ, క్యాలెండర్‌ను దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిష్ఠాత్మక సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అదేవిధంగా కొత్తపేటలో నిర్మించనున్న భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కొత్తపేట తాలూకా పూర్వపు అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మోటూరి రామరావు తదితరులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎన్ఎస్ చక్రధరరావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ హేల

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు మండలం మగటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98, మొగలికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదోతరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయంగా కలిశారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువ, పూలమాలలతో సత్కరించారు. సహపంక్తి భోజనాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

మగటపల్లిలో..

మొగలికుదురులో..

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి భీమవరంలోని శివరావుపేటకు చెందిన పేరిచర్ల వెంకట కృష్ణంరాజు, సత్యవాణి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని శుక్రవారం సమర్పించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అభినందించారు.

గోదావరిలో యువకుడి గల్లంతు?

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: చించినాడ వంతెన సమీపాన గోదావరి నదిలో యువకుడు గల్లంతైనట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలానికి యువకుడు ఎస్.శ్రీమణికంఠ కుమార్ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అదే రోజు రాత్రి అతడి చరవాణి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో చించినాడ వంతెన వద్ద మోగుతున్నట్లు స్థానికులు గుర్తించి.. దాని ద్వారా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీమణికంఠ నదిలో గల్లంతైనట్లు అనుమానిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో యలమంచిలి పోలీసులు శుక్రవారం నదిలో గాలింపు చర్యలు చేపట్టగా అతడి ఆచూకీ లభ్యం కాలేదు.

తెదేపా నేత మృతికి సంతాపం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు వెత్సా అనిల్‌కుమార్‌కు పితృవియోగం కల్గింది. ఉచ్చిలి గ్రామానికి చెందిన తండ్రి వెత్సా సూర్యనారాయణ(70) గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. సూర్యనారాయణ మృతి పట్ల మండల పార్టీ అధ్యక్షుడు కూసంపూడి బాబు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, కూటమి నాయకులు ముళ్లపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గట్లు కుంగి.. రక్షణ కొరవడి

● పలుచోట్ల మీడియం డ్రెయిన్ల దుస్థితి

– న్యూస్‌టుడే, మామిడికుదురు

పంటచేలు, కొబ్బరి తోటల నుంచి వచ్చే మురుగు, ముంపునీటిని నదిలోకి మళ్లించే మీడియం డ్రెయిన్లు పలు చోట్ల అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బందులు శ్రుతిమించుతున్నాయి. గట్లు కుంగిపోవడం, కొన్నిచోట్ల ఆక్వా చెరువులతో ఆక్రమణలకు గురవ్వడం, ఇరువైపులా, మధ్యలోనూ తుప్పలు పెరిగి పారుదలకు ఇబ్బందికరంగా మారడంతో ఈ దుస్థితి ఎదురవుతోంది. ఏళ్లకాలంగా వీటిని పట్టించుకోకపోవడంతో సమస్య జటిలమైంది. వీటి ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో ఆధునికీకరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఉప డివిజన్ పరిధిలో..

రాజోలు డ్రైనేజీ ఉప డివిజన్ పరిధిలో సుమారు 99 కిలోమీటర్ల మేర పది మీడియం డ్రెయిన్లు ఉన్నాయి. ఇందులో కొన్నిచోట్ల తూడు, డెక్క తొలగించడం మినహా పూడికతీత, గట్లు పటిష్ఠం పనులు ఎక్కడా చేపట్టలేదు. ముఖ్యంగా ఇవి నదిలో కలిసే చోట పరిస్థితి సమస్యాత్మకంగా తయారైంది.

● 290 ఎకరాల వరి ఆయకట్టుకు ఆధారమైన కడలి మీడియం డ్రెయిన్ గట్టు బలహీనంగా ఉంది. దీని చివరి భాగంలో కుడిగట్టు క్రమేణా కుంగిపోతోంది.

● 525 ఎకరాల్లోని మురుగు, ముంపునీటిని పారుదల చేసే బచ్చలబంద డ్రెయిన్ గట్టు మాకనపాలెం నుంచి ఆదుర్రు వరకు బలహీనంగా మారింది. కొన్నిచోట్ల ఆక్వా చెరువుల కారణంగా ఆక్రమణలకు గురైంది. ఇందులో పలుచోట్ల తుప్పలతో పాటు చెత్తకుప్పలు వేయడంతో పారుదలకు అడ్డంకిగా మారుతోంది.

● పాశర్లపూడి నుంచి ఆదుర్రు వరకు ఉన్న వాడబోది, నగరం నుంచి లూటుకుర్రు వరకు ఉన్న వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్లపై సుమారు 700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో తూడు తొలగించినా పలుచోట్ల మళ్లీ పెచ్చరిల్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని ఆనుకుని ఎడమవైపు గట్టు పలుచోట్ల ఛిద్రంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని పూర్తిస్థాయిలో చక్కదిద్దాలని విన్నపాలు చేస్తున్నారు.

గోగన్నమఠంలో కడలి డ్రెయిన్ గట్టు కుంగిపోతున్న తీరు

అడ్డంకులు లేకుండా చూస్తాం

మీడియం డ్రెయిన్లలో నీటిపారుదలకు ఎక్కడా అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు చేపడతాం. నిధులు వచ్చిన వెంటనే పూడికతీత పనులు చేపట్టి రైతులకు అన్నివిధాల ప్రయోజనకరంగా ఉండేలా వాటిని తీర్చిదిద్దుతాం. ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపడతాం.

– ఆనంద్‌కిరణ్, ఏఈఈ, డ్రైనేజీశాఖ

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

వెలంపాలెం ఆస్థాన మండపంలో కనుమ పూజ

ద్రాక్షారామ: వెలంపాలెం కంబాలచెరువు వద్ద ఉన్న ఆస్థాన మండపంలో (అటుకుల మండపం) శుక్రవారం రాత్రి భక్తి శ్రద్ధలతో కనుమ పూజను నిర్వహించారు. ఏటా కనుమ రోజున శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని, క్షేత్ర పాలకుడు లక్ష్మీ సమేత నారాయణస్వామిని, చండికా సమేత సూరేశ్వరస్వామిని ఆలయం నుంచి పల్లకిల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి వెలంపాలెం కంబాలచెరువు వద్ద ఉన్న ఆస్థాన మండపంలో కనుమపూజ చేస్తారు. దీనిలో భాగంగా రాత్రి 10 గంటల ప్రాంతంలో ఈ పూజను జరిపించారు. ఆలయ పురోహితులు వేద మంత్రాల నడుమ పూజను నిర్వహించి.. భక్తులకు అటుకుల ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం పల్లకీలను వెలంపాలెం గోగులాంబ ఆలయం మీదుగా దేవాలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, స్వస్తివాచకులు, పురోహితులు పాల్గొన్నారు

భీమేశ్వరాలయంలో కనుమ వేడుకలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ కనుమ అంటే పశువులను పూజించే పండగ అని.. మన సంస్కృతికి నిదర్శనంగా ఆలయంలో పశు పూజ నిర్వహించడం జరిగిందని తెలిపారు. గోమాతను పూజిస్తే సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో గోవుకు పూజ చేస్తున్న పండితులు

ఘనంగా ప్రభల తీర్థం

రామచంద్రపురంలో సంక్రాంతి ఉత్సవ్ సభలో వీక్షకులు

చెయ్యేరులో కొలువైన ప్రభలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కనుమ పండుగను పురస్కరించుకుని కాట్రేనికోన మండలం చెయ్యేరులో ప్రభలతీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చెయ్యేరులోని రాయుడుపాలెంలో అయినాపురం, చెయ్యేరు కాలువగట్టు, అగ్రహారం, బాలయోగి సెంటర్, మరకోడు, లక్ష్మీవాడ, చెయ్యేరు మెయిన్ తదితర గ్రామాలకు చెందిన 11 ప్రభలను ఒకేచోట కొలువుంచి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రభలతీర్థం మొదలై 50 ఏళ్లు పూర్తికావడంతో సంస్కృతిక కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభల, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పామర్రు, ద్రాక్షారామం: కె.గంగవరం మండలం శివలపాడులో ప్రభల తీర్థం కనుల పండువగా జరిగింది. దంగేరు, కుందూరు, గుడిగళ్లభాగ, శివల, కుడుపూరు, పేకేరు, తాళ్లపొడ పసరవ గ్రామాల ప్రభలను అందంగా అలంకరించి 5, 6 కిలోమీటర్ల దూరం నుంచి ఊరేగింపుగా మోసుకొచ్చి తీర్థంలో ఉంచుతారు. కోటిపల్లిలో కూడా స్థానికులు ప్రభలను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ● జగన్నాయకులపాలెంలో అనిశెట్టి సత్తెయ్య కుటుంబీకుల ఆధ్వర్యంలో ప్రభల తీర్థం నిర్వహించారు.

ఐ.పోలవరం: మండలంలోని బాణాపురంలోని తోటలో ప్రభల ఉత్సవం నిర్వహించారు. సత్తెమ్మతల్లి అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో శుక్రవారం ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరంలోని శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయం నుంచి పల్లిపాలెం వరకు ప్రభలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ముమ్మిడివరం చింతలమెరక, కొత్తలంక ప్రభలను సాంప్రదాయబద్ధంగా పంటచేలు, చెరువులు, డ్రెయిన్ల మధ్య నుంచి ఉత్సాహంగా సాగించారు. అగ్రహారం, కొమానపల్లి, వడ్డిగూడెం, పదవమైలు సెంటర్, రాజుపాలెంల నుంచి వచ్చిన ప్రభలు పల్లిపాలెంలో కొలువుదీరడంతో ఆ ప్రాంతం జనంతో నిండిపోయింది. ● అమలాపురం పట్టణం: అమలాపురం వంటెద్దువారివీధిలో గనికమ్మ ఆలయం వద్ద తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు వీధుల ప్రభలను అందంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి బంగారు మంగళసూత్రాలను యాళ్ల సతీష్ దంపతులు బహూకరించారు. సంపత్ వెంకటేశ్వరరావు దంపతులు, మెట్ల రమణబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ బాణాసంచా కాల్పులతో వీనులవిందుగా ఉత్సవాలు ముగిసాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంవద్ద, కమ్మవారివీధిలో ప్రభలు ఊరేగింపు నిర్వహించి, పూజలు చేశారు.

ముమ్మిడివరం: చెరువులో తీసుకువస్తున్న ప్రభలు

జగన్నాయకులపాలెంలో ప్రభల ఊరేగింపు

ప్రభలతీర్థంలో కత్తులు చూపుతున్న ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం పరిధిలోని పల్లిపాలెంలో..

1989-90 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు ఉన్నత పాఠశాలలో 1989-90, 2008-09 సంవత్సరాల్లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం విడివిడిగా జరిగింది. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అందరూ కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అవసరాల రామకృష్ణ, సలాది గోవిందరాజు, ఎన్.భీమరాజులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల వసతి మెరుగుపరచడానికి సహకారం అందిస్తామని 1989-90 బ్యాచ్ విద్యార్థులు తెలిపారు.

2008-09 బ్యాచ్ విద్యార్థులు

యథేచ్ఛగా కోడిపందేలు.. గుండాట

ముమ్మిడివరం, కాట్రేనికోన, అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. ఈనెల 14వ తేదీన భోగి పండుగ నుంచి ప్రారంభమైన కోడిపందేలు మూడురోజులు జరిగాయి. ముమ్మిడివరం మండలంలోని కొత్తలంక, అన్నంపల్లి, గేదెల్లంక, నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, పల్లిపాలెం ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహించారు. అన్ని బరుల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేయడంతో యువత గుండాటలో పాల్గొన్నారు. ఇందులో రూ.కోట్లలో నగదు చేతులు మారింది. గత ఏడాది కోడిపందేలు మినహా గుండాట ఇవ్వకపోగా.. ఈ ఏడాది గుండాటకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయి.

● కాట్రేనికోన మండలంలో గురు, శుక్రవారాల్లో పలుచోట్ల కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగాయి. ప్రధానంగా చెయ్యేరు, గెద్దనపల్లిలో బరుల్లో పందేలు జరిగాయి. చెయ్యేరులో 11 బోర్డుల్లో గుండాట నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు నిర్వహించారు. పల్లంకుర్రులోని మొక్కలతిప్ప, బలుసుతిప్ప, వేట్లపాలెం, నడవపల్లి, కందికుప్ప బంటుమిల్లి తదితరచోట్ల బరుల్లో పందేలు, గుండాటలు ఉత్సాహంగా సాగాయి. కొన్నిచోట్ల బరుల వద్ద బెల్టు దుకాణాలు ఏర్పాటుచేయడంతో మద్యం ఏరులైపారింది.

● కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం దగ్గర నిర్వహించిన జెట్ కోడిపందెలలో అనతావరం గ్రామానికి చెందిన వలవల కిరిటీ రోజుకు అయిదు కోడిపుంజులతో రూ.5లక్షల వంతున మూడు రోజుల పాటు ప్రత్యర్థి కోడిపుంజులను ఓడించి రూ.10లక్షలు గెలిచారు. ఆయనకు తెదేపా కౌన్సిలర్ చిక్కాల రాంబాబు, ఎంపీటీసీ పనసా బుజ్జి, బొర్రా ఈశ్వరరావు, ఇండుగుల ఆనందలు బుల్లెట్‌ను అందజేశారు.

రాజుపాలెంలో కోడిపందేల బరి వద్ద కోలాహలం

అల్లవరం: బహుమతిగా ద్విచక్ర వాహనం

మురమళ్లలో సినీనటి హేమ తదితరులు

మురమళ్లలో తిలకిస్తున్న ఎంపీలు ఉదయ్‌శ్రీనివాస్, హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

30 కేసుల నమోదు

కాట్రేనికోన మండలవ్యాప్తంగా మూడురోజుల పాటు నిర్వహించిన గుండాట, కోడిపందేలకు సంబంధించి మొత్తం 30 కేసులు నమోదు చేశామని కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపారు.

సమాజాన్ని ప్రభావితం చేసేవి కళలు

పామర్రు, న్యూస్‌టుడే: సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సమాజాన్ని ప్రభావితం చేసే అంశాల్లో కళలు మొదటి స్థానంలో ముందుంటాయని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ అన్నారు. కె.గంగవరం మండలం అముజూరులో జరిగిన సంక్రాంతి సంబరాల్లోని విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. నాటక కళాపరిషత్ అధ్యక్షుడు మరివాడ సూర్యనారాయణ(బుజ్జయ్య) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు అవసరాల రామకృష్ణ హనుమంతరావు, ఎ.వి.రమణమూర్తి, వాడ్రేవు ప్రసాద్, ఎం.సత్యనారాయణ, చిట్టూరి రాంబాబు, పెంకే సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అన్నపూర్ణ

ఓటర్ల నమోదు, అభ్యంతరాల గడువు పెంపు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రజలు ఓటర్ల జాబితా నమోదులో సవరణ, అభ్యంతరాలు తెలియజేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించిన గడువును ఈనెల 19వరకు పెంచినట్లు కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి పవన్ దివాన్ తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో అత్యధికులు సెలవుల్లో ఊళ్లకు వెళ్లే పరిస్థితి ఉంటుందని, గడువు పొడిగించాలని పుదుచ్చేరిలోని రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులను కోరారు. దీనిపై ప్రధాన ఎన్నికల అధికారి పి.జవహర్ ఈసీకి చేసిన విజ్ఞప్తి మేరకు గడువు పెంచినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

వేదికపై నృత్యం

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం..

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలోని ఆంధ్రాగోవా బీచ్‌కు సంక్రాంతిని పురస్కరించుకుని పర్యాటకులు, ప్రజలు పోటెత్తారు. బీచ్‌లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసి అనేక మందికి ఉపాధి కల్పించడమే ధ్యేయమని, వచ్చే ఏడాదికి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి బీచ్‌కు జాతీయ గుర్తింపు తెస్తానని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గురువారం సాయంత్రం నిర్వహించిన సినీ, సంగీత ప్రముఖులతో చేసిన డ్యాన్స్, మ్యూజికల్స్ షోలు ప్రేక్షకులను ఉర్రుతలూగించాయి. బీచ్‌కు ఇరువైపుల ఏర్పాటు చేసిన లేజర్‌షో లైటింగ్ ఆకట్టుకుంది. తాత్కాలికంగా బీచ్ ఒడ్డున నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ● సినీ నేపథ్య గాయకుడు, నటుడు కుంచే రఘు, ధనుంజయ్, సమీరా భరద్వాజ్, కీర్తన శర్మ, అనుదీప్ దేవ్, దామిని, లిప్సిక తదితరులు ఆలపించిన గీతాలు మైమరిపించాయి. అగ్నిజ్వాలల విన్యాసాలు, ఢీ డ్యాన్సర్స్ నృత్యాలు కట్టిపడేశాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ హరీష్‌మాధుర్, ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.


ఆనందరావును సన్మానిస్తున్న కూటమి నాయకులు

మంచు దుప్పటి

దట్టంగా అలముకున్న పొగమంచు శుక్రవారం ఉదయం యానాంను కప్పేసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ఎంతో ఆస్వాదించారు. ఉదయం 7.30 గంటలకూ వాహనాలు కనిపించని విధంగా పొగమంచు దట్టంగా అలముకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, యానాం

త్రిపురనేని జయంతి

అమలాపురం పట్టణం: సమాజంలో కుల వ్యవస్థను నిర్మూలించడానికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి చేసిన సేవలను గుర్తించుకోవాలని ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ తెలిపారు. ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు అమలాపురం ఎస్పీ కార్యాలయంలో త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. త్రిపురనేని చిత్రపటానికి ఏఎస్పీ ప్రసాద్, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ మానవతావాదాన్ని తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టారని, ఆయన రాసిన సూత పురాణము, కురుక్షేత్రం వంటి రచనలు ఆలోచనాత్మకంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద ఏఎస్పీ ప్రసాద్, పోలీస్ అధికారులు

యువకుల రక్తదానం

రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగ్రాతుల ప్రాణాలను రక్తదానంతో కాపాడువచ్చునని తాళ్లరేవు జడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పేర్కొన్నారు. నీలపల్లిలో చర్చి ఫాదర్ పంపన దావీదు జ్ఞాపకార్థం ఆయన కుమారులు శ్యాం ప్రసాద్, పరంజ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని తాళ్లరేవు జడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ప్రారంభించారు. కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ వైద్యులు కామరాజు పర్యవేక్షణలో 80 మంది యువకులు రక్తదానం చేశారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

కోకో బీచ్‌లో సందడే సందడి..

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం ఆంధ్రాగోవా కోకో బీచ్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు సందడి చేశారు. సముద్రపు ఒడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాండ్ బైక్‌లపై రైడింగ్ చేస్తూ ఆనందించారు. ఒంటెలు, గుర్రాలపై స్వారీ చేస్తూ కేరింతలు కొట్టారు. ఓపెన్‌టాప్ జీపులు నడుపుతూ ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పాఠశాల శతవసంతాల వేడుక

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

కాట్రేనికోన మండలంలోని కొప్పిగుంట ప్రాథమిక పాఠశాల శతవసంతాల వేడుకలను గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 1925లో ఏర్పడిన ఈ పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను, ఇక్కడ చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారిని పిలిచి ఆత్మీయ వేడుక చేశారు. ఎస్సై అవినాష్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పర్వదినాన శతవసంతాల వేడుక నిర్వహించడం సంతోషమన్నారు. పాఠశాల, గ్రామ అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తామని వక్తలు తెలిపారు. నాటి గురువులు, ఉద్యోగులు, ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. ముగ్గులు, ఇతర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

సంక్రాంతి ఆటల పోటీలు

యానాం, న్యూస్‌టుడే: ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం సంక్రాంతి ఆటల పోటీలు, వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్పీ బహుమతులు అందజేశారు. ఎస్సైలు పునీత్‌రాజా, కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు, రమణమూర్తి బృందం పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎస్పీ వరదరాజన్, పోలీసు అధికారులు

జ్ఞాపకాల తోటలో స్నేహపుష్పాలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలో కాన్వెంట్ ఎస్‌వీఎస్‌ఎన్ బెస్ట్ కాన్వెంట్‌లో 1985-1993 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఈదరపల్లి రోడ్డు నందివాడ బాబి స్వగృహంలో శుక్రవారం సందడి చేశారు. స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాలలో తాము చేసిన అల్లరిని, గత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. స్నేహితులతో ఫొటోలు తీసుకుంటూ ఆనందం పంచుకున్నారు. బాబి దంపతులను, సంగీత విద్వాంసుడైన మట్టపర్తి చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సాధనాల ప్రకాష్, తిక్కిరెడ్డి బాల, ప్రసన్న, జానకుల సతీష్, రామకృష్ణ, దేవరపల్లి శాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

చాలా ఆనందంగా ఉంది..

చరవాణుల నంబరు తెలియక ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియదు అందరిని కలిపించేందుకు చాలా ఇష్టపడి ప్రయత్నించాం. ఒక స్నేహితుడి ద్వారా మరొక స్నేహితుడిని కలుపుతూ వాట్సప్ గ్రూప్ తయారు చేశాం. సంక్రాంతికి కలవాలని నిర్ణయించుకున్నాం. అందరం కలుసుకున్నాక చాలా ఆనందంగా ఉంది. – నందివాడ బాబి

ఆస్ట్రేలియా నుంచి వచ్చా..

33 సంవత్సరాల తర్వాత మిత్రులను కలవడం ఆనందంగా ఉంది. సంక్రాంతి సందర్భంగా ఆస్ట్రేలియా నుంచి వచ్చాను. అందరూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం. ఇంకా కొందర్ని కలవాలి. – మేడిచర్ల సత్యప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు

సిడ్నీ నుంచి వచ్చాను...

మేము ప్రస్తుతం సిడ్నీలో ఉంటున్నాం. పాత మిత్రులను కలుసుకోడానికే ఇక్కడకు వచ్చాను. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలతో ఎంతో ఉత్సాహం వస్తుంది. ఏటా కలవాలని నిర్ణయించుకున్నాం. – గన్నిశెట్టి అప్పు, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు

కొత్త అల్లుడికి విందు భోజనం

అమలాపురంలో 123 రకాలు

కె.అగ్రహారంలో 116 పిండివంటలతో

అమలాపురం పట్టణం: సంక్రాంతి సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో పండగ జరుపుకోవడానికి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రాలు, ఇతర దేశాలలో నివసిస్తున్నవారు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కొత్త అల్లుళ్లకు వందల రకాలతో విందు భోజనాలు వడ్డించారు. స్థానిక వంటెద్దువీరి వీధికి చెందిన వంటెద్దు బాబి గృహంలో అల్లుడు ముప్పర్తి సాయిమణిదీప్, కుమార్తె లలితలకు 123 రకాలతో గోదావరి విందు భోజనం పెట్టారు. కె.అగ్రహారంలో తాడికొండ సుభాష్, సురేఖ దంపతులు అల్లుడు సాయి, కుమార్తె నవ్యలకు 116 పిండివంటలతో భోజనం వడ్డించారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యం

ఉప్పలగుప్తం: ఉద్యాన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కొబ్బరిలో వివిధ రకాలను ప్రదర్శిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి పీచుతో చేసిన వేంకటేశ్వరస్వామి బొమ్మలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రకృతి సాగులో పండించిన వివిధ రకాలను ప్రదర్శించారు.

అయ్యప్ప గ్రామోత్సవం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స జగ్గప్పరాజు, సరిపల్లి రామకృష్ణంరాజు, గంజి జాజి, కాజులూరి రామలింగేశ్వరరావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు దుప్పట్ల అందజేత

కాట్రేనికోన: ఖమ్మంనకు చెందిన గ్రేస్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో కాట్రేనికోనలోని అడవిపేటలో 100 మంది పిల్లలకు దుప్పట్లు, బొమ్మలను అందజేశారు. వారి సేవలను గ్రామస్థులు కొనియాడారు. జాకబ్, లాజరస్, బాబి, రవి, బాలయోగి, సతీష్, పెద్దలు పాల్గొన్నారు.

గెద్దనపల్లిలో చెట్టును ఢీకొన్న కారు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండలంలోని గెద్దనపల్లిలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పల్లంకుర్రు వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కొబ్బరిచెట్టును ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారని వారు చెప్పారు.

అగ్ని ప్రమాదంలో పూరిపాక దగ్ధం

అల్లవరం: మండలంలో తాడికోన గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో దోనిపాటి సోమేంద్ర అనే వ్యక్తికి చెందిన పూరిపాక, రేకుల షెడ్డు గురువారం కాలిపోయాయి. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక మంచం, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. దీనికి విద్యుత్తు సౌకర్యం లేదు. ఎవరూ నివాసం ఉండటం లేదు. అమలాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యానాం, న్యూస్‌టుడే: భీంనగర్ ఏటిగట్టు మార్గంలోని మున్సిపల్ కల్యాణమండపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు యూకేవీ నగర్‌కు చెందిన మనుపాటి మిస్సమ్మ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై పోచయ్య తెలిపారు. చనిపోయిన వ్యక్తికి 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనారోగ్యం లేదా ఇతర కారణాలతో చనిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.

(c) eenadu

గరుడగమన.. నమో నారాయణ..

బలభద్రపురంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన స్వామివారి ఉత్సవ మూర్తులను దర్శించుకుని రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఏటా కనుమ పండుగ రోజున స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. మాజీ సర్పంచి సత్తి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు గరుడ వాహనాన్ని ఆలయానికి అందించారు. రథోత్సవానికి ముందు భక్తులు కోలాటమాడుతూ భజనలు చేశారు. - న్యూస్‌టుడే, బిక్కవోలు

భజగోవిందం.. జగదానందం
కిక్కిరిసిన వాడపల్లి దివ్యక్షేత్రం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: భక్తజన వరదా.. చందన స్వరూపా నమోస్తుతే స్మరణతో కోనసీమ తిరుమల వాడపల్లి పులకించింది. శ్రీమన్నారాయణుడు దివ్యాలంకార శోభితుడై భక్తులకు జగన్మోహనంగా దర్శనమిచ్చారు. ఆదివారం కనుమ పండగ కావడంతో వెంకన్న క్షేత్రం వేలాది మంది భక్తజనంతో అలరారింది. గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.

జగ్గన్న తోట.. రుద్రుల కోట
వేడుకగా ప్రభల తీర్థం

న్యూస్‌టుడే, అంబాజీపేట

జగ్గన్నతోట జనసంద్రమైంది. ఏకాదశరుద్రులను ఏకకాలంలో చూసేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఏకాదశరుద్రుల గ్రామాల్లో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం జగ్గన్నతోటలోని తీర్థ స్థలికి తీసుకువచ్చారు. తొలుత ఉదయం 10.30 గంటలకు మొసలపల్లి ప్రభను తీసుకొచ్చారు. అనంతరం ఒక్కొక్కటిగా వివిధ గ్రామాల నుంచి ప్రభలు వచ్చాయి. చివరిగా గంగలకుర్రు ప్రభ చేరుకుంది. అక్కడ భక్తుల దర్శనం అనంతరం తిరిగి ఒక్కొక్కటి గ్రామాలకు మరలాయి. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు సాయంత్రం వరకు తండోపతండాలుగా జనం తరలివస్తూనే ఉన్నారు. కొబ్బరితోటల్లో ఆధ్యాత్మిక వేడుకను తిలకించేందుకు లక్షలాది మంది రాష్ట్రం నలుమూలల నుంచి కుటుంబ సమేతంగా రావడంతో తీర్థ స్థలి నిండిపోయింది.

గంగలకుర్రు ప్రభను కౌశికనది దాటిస్తున్న గ్రామస్థులు

ట్రాఫిక్ చిక్కులు.. జనం ఇబ్బందులు

జగ్గన్నతోటకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల రోడ్లలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. పుల్లేటికుర్రు-ఇరుసుమండ ప్రధాన రహదార్లలో సమస్య ఏర్పడింది. ప్రజాప్రతినిధులు, అధికారులకు సంబంధించిన వాహనాలు తీర్థం జరిగే వంతెన వద్ద నిలుపుదల చేయడంతో చాలాసేపటి వరకు చిక్కుముడి వీడలేదు. దీంతో భక్తులు ఇబ్బందులు చవిచూశారు. వాకలగరువులో రావిచెట్టు కూడలికి ప్రభలను తీసుకువచ్చే సమయంలోనూ పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

అంబాజీపేట: రావిచెట్టుకూడలి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ముక్కామల నుంచి తీసుకొస్తూ..

కౌశికా తీరంలో వంతెనపై కిక్కిరిసిన జనం

జగ్గన్నతోట తీర్థస్థలిలో కొలువైన ఏకాదశరుద్ర ప్రభలు

వేడుకను కెమెరాలో బంధిస్తూ..

ఉత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన అశేషభక్తజనం(డ్రోన్ చిత్రం)

తీరం.. పర్యాటక సోయగం
రివర్ ఫ్రంట్ పేరిట చురుగ్గా పనులు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

గోదావరి తీరం పర్యాటకంగా మరింత తళుకులీనుకుంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో నగర సుందరీకరణకు సంబంధించి నగరపాలక సంస్థ ప్రతిపాదించిన పనులు పట్టాలెక్కుతున్నాయి. ముఖ్యంగా గోదావరి గట్టు వెంబడి రివర్ ఫ్రంట్ పేరిట తీరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు.

గోదావరి ఒడ్డున చేపడుతున్న పనులు

200 మీటర్ల పొడవునా..

పుష్కర ఘాట్ నుంచి 200 మీటర్ల పొడవునా గట్టును నదీ లోపలకు విస్తరించి, ఆపై పూర్తి స్థాయిలో పర్యాటకంగా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. గట్టుపై మినీ రెస్టారెంట్లు, ఆకట్టుకొనే స్టాల్స్, చిన్నారులకు అనువైన గేమ్స్ షోలు ఏర్పాటు చేస్తారు. సరదాగా కాసేపు విశ్రాంతి తీసుకొనే విధంగా నదీపై ఉన్న అనుభూతిని కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హేవలాక్ బ్రిడ్జి, ఉంకులు పర్యాటకులను ఆకర్షిస్తున్న తరుణంలో రివర్ ఫ్రంట్ ఏర్పాటు కొత్త సొబగులను తీసుకురానుంది. రెండు దశల్లో జరిగే పనుల్లో మొదటి దశలో ఏపీటీడీసీ కార్యాలయం నుంచి వీఐపీ ఘాట్ వరకు, రెండో దశలో పుష్కర ఘాట్ నుంచి ఆర్యాపురం నల్లా ఛానల్ వరకు రివర్ ఫ్రంట్ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను పుష్కర ప్రత్యేక నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. ఈ విధంగా గట్టు ప్రాంతాన్ని విస్తరించడం వల్ల అనేక విధాలుగా ప్రయోజనం కలుగుతుంది. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల గట్టు పటిష్టత మరింత పెరుగుతుంది. భక్తులు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా స్నానాలు చేయవచ్చు. గట్టున్న నీళ్లు తాకే ప్రాంతం మొత్తం సిమెంటుతో పటిష్టం చేయడం, నదిలో కొంత దూరం ఐరన్ డ్రిల్లింగ్ ఉండడంతో స్నానాలు చేసే సమయంలో జారి పడిపోయినా ఎటువంటి ప్రమాదం ఉండదు. ఇక గట్టును అందంగా తీర్చిదిద్దడం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. సాయంత్రం వేళ పర్యాటకుల తాకిడి అధికమవుతుంది.

కోడీ.. ఎక్కడా తగ్గలే!
విస్తృతంగా బరులు.. భారీ పందేలు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, నిడదవోలు, కొవ్వూరు పట్టణం, గోపాలపురం: సంప్రదాయాల పండగ సంక్రాంతిని ఆసరాగా చేసుకొని ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. రూ.వందల కోట్లు చేతులు మారాయి. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని దాదాపు ప్రతి మండలంలో కనీసం పది చొప్పున బరులు ఏర్పాటుచేశారు. ఈ మూడు రోజుల్లో దాదాపు రూ.500 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఫ్లడ్‌లైట్ల వెలుగులో డ్రోన్ కెమెరాల చిత్రీకరణతో ఎల్‌ఈడీ తెరలపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ తరహా ఏర్పాట్లలో ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి ముందు వరుసలో ఉంది. ఇక్కడ సుమారు 20 ఎకరాల్లో భారీ బరి నిర్వహించారు. పెద్ద ఎత్తున నగదు చేతులు మారింది. 50 మంది వరకు బౌన్సర్లను బందోబస్తుకు నియమించగా, నగదు లెక్కింపునకు పదుల సంఖ్యలో మెషిన్లు తీసుకువచ్చారు. ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక, పేరవరం, లొల్ల, ర్యాలీ, తాడిపూడిలో పోటీలు నిర్వహించారు. కొత్తపేట, లొల్లలో అశ్లీల నృత్యాలు సైతం ఏర్పాటుచేయడం గమనార్హం. పందేలు మూడు రోజుల పాటు నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగాయి. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

కొవ్వూరు మండలం పంగిడిలో దీపాల వెలుగులో కోడిపందేలు

● పందేలు చూసేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో వచ్చారు.

● ప్రతి బరిలోనూ గొలుసు దుకాణాలు ఏర్పాటుచేసి నచ్చిన ధరకు మద్యం విక్రయించారు. కొందరైతే వాహనాల్లో మద్యం సీసాలు తెచ్చి తాగుతూ అక్కడే పందేలు నిర్వహిస్తూ కనిపించారు.

● ప్రతి బరిలోనూ ఆరు నుంచి 10 వరకు గుండాట బోర్డులు ఏర్పాటుచేశారు. రూ.500కు తక్కువ లేకుండా కాసేలా కొందరు నిబంధనలు పెట్టారు. గుండాట ఏర్పాటుకు వేలం నిర్వహించారు. గోపాలపురం, కాకినాడ గ్రామీణంలో రూ.30 లక్షల వరకు చెల్లించి దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ● రాజానగరం, కొత్తపేట, అమలాపురం, రాజమహేంద్రవరం గ్రామీణం, నిడదవోలు, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన బరుల్లో కార్లు, బుల్లెట్లు విజేతలకు అందించారు. గోపాలపురంలో కోళ్ల టోర్నమెంట్ నిర్వహించారు. చెరోవైపు ఆరుదేసి కోళ్లను బరిలోకి దించి పోటీ పెట్టారు. విజేతకు రూ.8 లక్షలు అందజేశారు. ● నిడదవోలు నియోజకవర్గంలో 40 వరకు బరులు ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజుల సమయంలో సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేర, గోపాలపురం నియోజకవర్గంలో సుమారు 32 బరులు ఏర్పాటు చేయగా మూడు రోజుల్లో రూ. 6 కోట్ల నుంచి 8 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా.

ఆకాశయానం.. మూడింతలు ప్రియం
పండగ వేళ పెరిగిన టికెట్ ధరలు

ఆకాశయానం టికెట్ ధర అమాంతం పెరిగింది. సంక్రాంతి పండగ సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. పండగ ప్రారంభమైన వరుసగా మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంది. తరువాత మరో మూడు రోజులూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని విమానాశ్రయ వర్గాలు అంటున్నాయి. ప్రయాణికులు టికెట్ ధరలు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోరుకొండ

అమ్మో ధర..

ఇతర దేశాల నుంచి కనెక్టివిటీతో విమాన సర్వీసుల ద్వారా ఇక్కడికి చేరుకున్న ప్రయాణికులు టికెట్ ధర తెలుసుకుని అవాక్కవుతున్నారు. ఇంతకు ముందు ఎన్నడూలేని విధంగా ధరల్లో చాలా వ్యత్యాసం ఉందని అంటున్నారు. సాధారణ రోజుల్లో ప్రయాణంతో పోలిస్తే దాదాపుగా మూడు రెట్లు ధర పెరిగిందని అంచనా వేసుకుంటున్నారు.

వచ్చేటప్పుడు... వెళ్లేటప్పుడు

దేశం నలుమూలల నుంచి విమాన సర్వీసులు అందుబాటులోకి రావడంతో పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. పండగకు ముందు 3 రోజులూ ఇక్కడికి చేరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో విమాన సర్వీసులు రద్దీగా వచ్చాయి. తరువాత ఇక్కడ నుంచి వెళ్లేవారి సంఖ్యా అదే స్థాయిలో ఉండడంతో అదే రద్దీ కొనసాగనుంది. పెద్ద సంఖ్యలో రాకపోకలు ఉండడంతో ప్రయాణికులతో విమానాశ్రయం సందడిగా మారింది.

ధరల వివరాలు ఇలా... (సుమారు రూ.వేలల్లో)

ప్రాంతం	సాధారణ రోజుల్లో	ప్రస్తుతం
హైదరాబాద్	4 – 6	12 – 18
దిల్లీ	6 – 8	10 – 16
ముంబయి	6 – 8	8 – 14
బెంగళూరు	5 – 8	8 – 12
చెన్నై	5 – 8	8 – 14
తిరుపతి	4 – 8	6 – 12

గతంలో ఎప్పుడూ ఇలా లేదు..

సంక్రాంతికి వచ్చేందుకు ముందుగా టికెట్లు బుక్ చేసుకున్నాం. యుఎస్‌కి ట్రిప్‌కు వెళ్లడంతో వచ్చేటప్పుడు హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నాను. గతంలో చాలాసార్లు విమాన ప్రయాణం చేశాను. టికెట్ ధర ఇంతకు ముందు కన్నా మూడు రెట్లు పెరిగింది. సంక్రాంతికి డిమాండ్ ఉండటంతో టికెట్ల ధర కూడా భారీగానే పెంచేశారు. - నెక్కంటి వెంకట్, వైజాగ్

రూ.18 వేలు చెల్లించా..

హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం రావడానికి ఒక్కో టికెట్‌కు సుమారుగా రూ.18 వేలు చెల్లించాల్సి వచ్చింది. మా కుటుంబ సభ్యులందరం కలిసి వారం రోజులు ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. మా బంధువులు కొందరు టికెట్లు తీసుకుందామని ప్రయత్నిస్తే రూ. 14 వేలు, 18 వేలు పలికిందని, రూ. 20 వేలు కూడా దాటిందని చెప్పారు. సంక్రాంతికి రావాలనే తపనతో ఎవరూ ధర పరిగణనలోకి తీసుకోలేదు. - మార్ని శ్రీనివాసరావు, హైదరాబాద్

జిల్లా మీదుగా నడిచే ప్రత్యేక రైళ్లు ఇవే..

వి.ఎల్.పురం: పండగ అనంతరం ఆయా ప్రాంతాలకు బయలుదేరే తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్య స్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను కొనసాగిస్తోంది. ● శని, ఆది వారాల్లో జిల్లా మీదుగా విశాఖపట్నం-విజయవాడ(08567), విజయవాడ-విశాఖపట్నం(08568) జన్‌సాధారణ్(అన్‌రిజర్వ్డు) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ● ఈ నెల 17, 19న విశాఖపట్నం-చర్లపల్లి(08511), 18, 20న చర్లపల్లి-విశాఖపట్నం(08512) అదనపు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఆగుతాయి. ● 18న విశాఖపట్నం- చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు రైల్వేస్టేషన్లలో ఇవి ఆగుతాయి. ● 18న అనకాపల్లి-చర్లపల్లి(07479), 19న చర్లపల్లి-అనకాపల్లి(07477), అనకాపల్లి-చర్లపల్లి(07478) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 19న చర్లపల్లి-కాకినాడ టౌన్(07480), కాకినాడ టౌన్-చర్లపల్లి(07482) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

కాలం చెల్లిందా.. పరీక్షలు తప్పనిసరి

-న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం

లారీ, కారు, ద్విచక్రవాహనం, లారీలు, ఇలా ఏదైనా వాహనం ఏళ్లు గడిచినా వాడుతున్నారా.. కాలం చెల్లినా రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారా.. ఇకపై అలా తిరిగితే .. ఒక్కోదానికి స్లాబ్ ప్రకారం భారీ మూల్యం చెల్లించాల్సిందే. 15 ఏళ్లు దాటినా వినియోగించాలంటే ఫిట్‌నెస్ (సామర్థ్యం) పరీక్షలు తప్పనిసరి రవాణా శాఖ అధికారులు, ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి పరీక్ష చేయించుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాతే తిప్పాలి. ఈ పరీక్షలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఫీజు పెంచింది. సర్టిఫికెట్ ఫీజు, గ్రాంట్, రెన్యూవల్‌కు తోడుగా జీఎస్టీ ఛార్జీలు జోడించింది. ఆలస్యం చేసినా వాటి ఛార్జీలు మరింత భారమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఫీజులు ఇలా (రూ.ల్లో)...

బండి రకం	15 నుంచి 20 ఏళ్లు	అంతకు మించితే
మోటారు సైకిల్	1,500	3,000
ఆటో రిక్షా, క్యాబ్	4,500	9,000
ఎల్‌జీవీ/ఎల్‌ఎంవీ	8,500	17,000
ఎంజీవీ	11,300	22,600
హెచ్‌జీవీ/హెచ్‌పీవీ	14,000	28,000

మీ కోసం

రీమోడల్ వాహనాలు..

చాలామంది ఇతర రాష్ట్రాల నుంచి పాత వాహనాలను కొనుగోలు చేసి స్థానికంగా తిప్పుతున్నారు. అక్కడి రిజిస్ట్రేషన్ నంబరుతోనే తిరుగుతున్నారు. 15 ఏళ్లు దాటినా వాటిని రీమోడల్, మార్పు చేసి వినియోగిస్తున్నారు. ఇకపై వారు సైతం దీనిపై దృష్టి సారించాలి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

హైదరాబాద్‌కు 20 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సంక్రాంతికి హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చి పండగ అనంతరం తిరిగి బయలుదేరే ప్రయాణికుల కోసం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 20 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ నెల 19 వరకు హైదరాబాద్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. తిరుగు ప్రయాణికుల ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా రాజమహేంద్రవరం డిపో నుంచి 17, కొవ్వూరు డిపో నుంచి రెండు, నిడదవోలు డిపో నుంచి ఒక ప్రత్యేక బస్సును హైదరాబాద్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. తిరుగు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే దానికనుగుణంగా హైదరాబాద్‌కు మరిన్ని ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నం, విజయవాడ తదితర దూరప్రాంతాలకు కూడా తిరుగు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అప్పటికప్పుడు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

గ్రామీణ దారులకు మోక్షం
జిల్లాలో రూ. 40.25 కోట్లతో మరో 267 రోడ్ల అభివృద్ధి

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

గత వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని గ్రామీణ రహదారులు దశలవారీగా మెరుగుపడుతున్నాయి. వీబీజీ రామ్‌జీ నిధులతో అభివృద్ధికి నోచుకుంటున్నాయి. గతేడాది పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం అనుసంధానం ద్వారా రూ.59.02 కోట్లతో జిల్లాలోని ఆయా గ్రామాల్లో 633 రహదారులను అభివృద్ధి చేయగా ఇప్పుడు పల్లె పండగ 2.0 కింద రూ.40.25 కోట్లతో మరో 267 పల్లెదారులను అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం రోడ్లు, డ్రెయిన్లు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. రహదారులు అధ్వానంగా తయారవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుపై దృష్టి సారించింది. ముఖ్యంగా పల్లె దారుల అభివృద్ధికి వీబీజీ రామ్‌జీ పథకంలో 60 శాతం వేతనాలు, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు మంజూరు చేస్తోంది. పల్లె పండగ 2.0 కార్యక్రమంలో జిల్లాలోని 18 గ్రామీణ మండలాల పరిధిలో 210 రహదారులను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించి ఆ మేరకు పనులు మంజూరు చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభించి 28 రోడ్లు పూర్తి చేయగా మరో 29 పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 210 గ్రామీణ రోడ్ల పనులను త్వరలో చేపట్టనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ నాగమహేశ్వర రావు తెలిపారు.



అనపర్తి మండలం మహేంద్రవాడలో కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు

పల్లె పండుగ 2.0 కింద జిల్లాలో ఇలా..

నియోజకవర్గం	మంజూరైన రోడ్లు	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
నిడదవోలు	61	6.01
కొవ్వూరు	41	6.02
అనపర్తి	47	6.00
రాజమహేంద్రవరం(గ్రామీణం)	30	6.07
గోపాలపురం	38	6.00
రాజానగరం	19	6.10
గోకవరం (మండలం)	31	4.05

ఆరు గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు..

పల్లెపండగ 2.0 కార్యక్రమంలో జిల్లాలోని ఆరు గ్రామాల్లో 2,472 మీటర్ల మేర 25 మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. రూ.92 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన ఈ పనులు కూడా వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా చేపడుతున్నారు. గోకవరం, నిడదవోలు, పెరవలి, నల్లజర్ల, రాజానగరం, అనపర్తి మండలాల పరిధిలోని ఆరు గ్రామాల్లో చేపడుతున్న మ్యాజిక్ డ్రెయిన్లలో ఇప్పటికే 23 పూర్తికాగా ఇంకా రెండు చోట్ల పనులు పురోగతిలో ఉన్నట్లు డ్వామా పీడీ తెలిపారు.

నిర్యాణము

జననం - మరణం
09.01.1921 - 06.01.2026

మా తండ్రి గారైన
శ్రీ రొంగల రాముడు గారు
ది.06.01.2026, మంగళవారం నాడు స్వర్గస్తులైనారు

పెద్దకర్మ:
18.01.2026 ఆదివారం
శ్రీ కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ ఆడిటోరియం, నిడదవోలు నందు జరుపబడును అని తెలియచేయడమైనది

కుమారులు మరియు కోడళ్ళు
రొంగల చెల్లారావు, సుమిత్ర
రొంగల వరప్రసాద్, శోభారాణి
రొంగల శ్రీనివాస్, బిందు
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

కళాకారులతో పథం కలిపిన ఎమ్మెల్యే

సంక్రాంతి సందర్భంగా పి.గన్నవరం మండలం బోడపాటి వారిపాలెంలో కొండాలమ్మఅమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడురోజులపాటు ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా సాగాయి. సంక్రాంతిరోజు గురువారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కళాకారులతో కలిసి నృత్యంచేస్తూ కాసేపు సందడి చేశారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

సచిత్రంగా సంక్రాంతి

మలికిపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన సంక్రాంతి చిత్రాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, గంగిరెడ్లు, కోడిపందేలు, పతంగులు, హరినామ కీర్తనలతో హరిదాసుల గ్రామోత్సవం తదితర అంశాలు ఇందులో పొందుపరిచారు. ఇవి పలువురిని ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, మలికిపురం

చిరు సోదరీమణుల సందడి

కోనసీమలో సంక్రాంతి సంబరాలను వీక్షించేందుకు మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు సినీహీరో చిరంజీవి సోదరీమణులు డాక్టర్ మాధవి, విజయదుర్గ కుటుంబ సమేతంగా గురువారం విచ్చేశారు. గ్రామంలో జరిగిన ప్రభల ఊరేగింపు, తీర్థంలో పాల్గొన్నారు. స్థానికంగా మండువా లోగిలిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మమేకమయ్యారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

కొత్త అల్లుడికి 1,574 వంటకాలతో విందు

మామిడికుదురు మండలం ఆదుర్రులో సంక్రాంతి పండక్కి వచ్చిన కొత్త అల్లుడికి 1,574 రకాల ఆహార పదార్థాలతో గురువారం విందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విజ్జపు వెంకటరత్నం, సుశీల దంపతులు గత ఫిబ్రవరిలో తమ కుమార్తె కీర్తిశ్రీని పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయిశరత్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్లుడికి వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, శీతలపానీయాలతో విందు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు)** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు **8008621414 & 9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

9 రోజులు.. 14 క్షేత్రాలు

☞ 20న ఆర్టీసీ 'కర్ణాటక - మైసూర్ యాత్ర' ప్రత్యేక బస్సు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు దర్శించుకునే భక్తుల కోసం 'కర్ణాటక-మైసూర్ యాత్ర' పేరిట రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు ఇక్కడ డిపో నుంచి బయలుదేరుతుంది. తొమ్మిది రోజులపాటు సాగే యాత్రలో భాగంగా 14 క్షేత్రాల్లోని ఆలయాలను భక్తుల దర్శించుకోవచ్చు. ఈ బస్సులో 2ప్లస్2 సీట్లు, టీవీ సౌకర్యం ఉంటుందని, టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.11,500లుగా నిర్ణయించినట్లు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తామన్నారు. మార్గమధ్యలో విశ్రాంతి కోసం హోటళ్లలో గదులు తీసుకుంటే దానికయ్యే అదనపు చార్జీని భక్తులే భరించాల్సి ఉంటుందని తెలిపారు. పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారు ఆర్టీసీ కల్పిస్తున్న ఈ ప్రత్యేక యాత్ర బస్సు సౌకర్యాలన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మాధవ్ కోరారు.

యాత్రకు ఏర్పాటు చేసే సూపర్‌లగ్జరీ బస్సు

దర్శించే క్షేత్రాలివి.. కర్ణాటక - మైసూర్ యాత్రలో భాగంగా శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబిక, మహానందిలో మహానందేశ్వర, మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి, హంపిలో విరూపాక్ష అమ్మవారు, గోకర్ణలో ఆత్మశివ లింగం, మురుడేశ్వర్‌లో మురుడేశ్వరస్వామి, కొల్లూరులో మూకాంబికాదేవి ఆలయాలు, ఉడిపిలో కృష్ణదేవాలయం, శృంగేరిలో శారదాంబ దేవాలయం శక్తిపీఠం, హార్నాడులో అన్నపూర్ణేశ్వరిదేవి, ధర్మస్థలంలో మంజునాథ స్వామి, కుక్కేలో సుబ్రహ్మణ్యేశ్వస్వామి, శ్రీరంగపట్నంలో రంగనాథస్వామి ఆలయాలు, మైసూర్‌లో చాముండేశ్వరిదేవి శక్తిపీఠాన్ని భక్తులు దర్శించుకోవచ్చు.

మరిన్ని వివరాల కోసం.. ఈ యాత్రకు సంబంధించి మరిన్ని వివరాలు, సమాచారం, టికెట్ల బుకింగ్ కోసం స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారులను లేదా 95023 00189, 99666 66544, 98660 45588 చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చు.

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: అయిదు నుంచి పదో తరగతి వరకు పూర్తి చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీలలో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షలకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిఐఆర్‌యుఎమ్ఎఎల్ఎఈడీయు.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

'సత్య'లో 18 వరకు పండగ ఆఫర్లు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా తమ షోరూమ్‌ల్లో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై భారీ తగ్గింపుతో ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక విక్రయాలు కొనసాగిస్తున్నట్లు సత్య సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆఫర్లలో భాగంగా టెలివిజన్లు రూ.7,990 నుంచి, ఫ్రిజ్‌లు రూ.13,990, ఏసీలు 29,990, వాషింగ్‌మెషీన్లు రూ.10,990 నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. 5జీ మొబైల్స్ ఫోన్లపై 7,990 నుంచి 60 శాతం వరకు డిస్కౌంట్, రూ.12 వేల వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో వంటగది అవసరాలన్నీ ఒకేసారి పొందేందుకు కంప్లీట్ కిచెన్ కాంబోను కేవలం రూ.10,999కే అందిస్తున్నామని, ఇందులో గ్యాస్‌స్టవ్, కుక్కర్, గ్రైండర్, మిక్సీ వంటి ఉత్పత్తులు ఉన్నాయని తెలిపారు. వాటర్ హీటర్లు రూ.3,300 నుంచి, ల్యాప్‌టాప్‌లు రూ.25,490 నుంచి అందుబాటులో ఉన్నాయని, ప్రతి కొనుగోలుపై బహుమతులు కూడా అందిస్తున్నామని తెలిపారు.

బాల్యం గుర్తుకొచ్చింది.. స్నేహం పలకరించింది

అనపర్తి గ్రామీణం: కాలం సంవత్సరాలుగా కరిగిపోవచ్చు.. ఒక్కొక్కరు వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఉండొచ్చు. కానీ వారి మధ్య స్నేహం మాత్రం ఎన్నేళ్లయినా నిత్యనూతనంగా కొనసాగుతూనే ఉంది. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978-79 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు పూర్వ విద్యార్థులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒకే వేదికపై కలిశారు. టీజీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి విద్యార్థుల మధురస్మృతుల పరిమళాలు వెదజల్లాయి. ఆపాత మధురాలను గుర్తుచేసుకుంటూ కొందరు భావోద్వేగానికి గురవగా.. మరికొందరు అప్పటి సంగతులతో మిత్రుల్లో నవ్వులు పూయించారు. ఆనాటి గురువుల సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. డా.తేతలి దశరథ రామారెడ్డి, టి.సుధాకర్, గంగిరెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, సత్తి శ్రీవెంకటరెడ్డి, హోతా శర్మ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సమ్మేళనంలో కలిసిన విద్యార్థులు

శతాబ్దాల చరిత్ర కొత్తపేట ప్రభల తీర్థం

కొత్తపేట, న్యూస్‌టుడే: కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న ప్రభలతీర్థాలకి శతాబ్దాల చరిత్ర ఉంది.. కోనసీమలో పలుచోట్ల ప్రభల ఉత్సవాలు కనుమ రోజు జరుగుతుండగా ఎప్పటిలానే సంప్రదాయ ప్రకారం సంక్రాంతి రోజున కొత్తపేటలో నిర్వహించారు. పాత, కొత్త రామాలయాలు, బోడిపాలెం తదితర 12 ప్రభలతో ఏకాదశ రుద్ర రూపాలతో కొలువుదీరగా.. వేలాది సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గురువారం కొత్తపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో ప్రజల దర్శనార్థం వివిధ రకాల దేవుని ప్రతిరూపాలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో ఊరేగింపుగా ఏర్పాటు చేశారు. ● కొత్తపేట జూనియర్ కళాశాల మైదానంలో ప్రభల తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి సుమారు నాలుగు గంటలపాటూ నిరంతరంగా నిర్వహించిన బాణాసంచా ప్రదర్శన ఉత్సావాలకు మరింత శోభను చేకూర్చింది. కాంతులు విరజిల్లుతున్న మల్లెపందిరిలు, మనస్సును ఆకట్టుకునే విధంగా ఈత చెట్లు, బుసలు కొడుతున్న పాములు, గదలు, మరెన్నో రకాల బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణాసంచా కాల్పులను అనేకమంది చరవాణుల్లో బంధించారు.

అబ్బురపరుస్తున్న బాణసంచా

కొత్తపేటలో కొలువుదీరిన ప్రభలు

20 నుంచి క్షేత్రపాలకుడి కల్యాణం

అంతర్వేది: అంతర్వేది క్షేత్ర పాలకుడు పార్వతీనీలకంఠేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు దేవాదాయశాఖ, ఆలయ ఈవో, ఏసీ నాగ వరప్రసాద్, సిబ్బంది ఘనంగా చేస్తున్నారు. లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలకు ముందు ఐదు రోజుల పాటు ఈ స్వామి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఈ క్షేత్రంలో ఆనవాయితీ. ఈనెల 20న రాత్రి 7గం.లకు అంకురార్పణతో ప్రారంభమవుతుంది. 21న దివ్య కల్యాణం, 22, 23న ప్రత్యేక పూజలు, 24న శ్రీపుష్పోత్సవంతో ముగిస్తారు.

సత్యదేవుని ప్రభోత్సవం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని ప్రభోత్సవం శుక్రవారం వేడుకగా జరిగింది. సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో గ్రామంలోని చినరావిచెట్టు వద్ద పురాతన రామాలయం వద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వద్దన్నా.. వినిపించుకోలేదు

● ప్రభలపై వైకాపా జెండాలు.. నేతలు, నటుల ఫొటోలు

అంబాజీపేట: పరమశివుడి ప్రతిరూపాలుగా కొలిచే సంక్రాంతి ప్రభలకు పార్టీల జెండాలు, రాజకీయ నాయకులు, సినీ నటుల చిత్రాలు వద్దని ముందుగానే సూచించినా కొందరు పట్టించుకోలేదు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలో కొందరు యువకులు వైకాపా జెండాలతో హల్‌చల్ చేశారు. ఎగువ కౌశిక నదిని ప్రభలు దాటే సమయంలో వారు వీటిని ప్రదర్శించారు. ఇంకొందరు అభిమాన నటుల ఫ్లెక్సీలు, బొమ్మలను ప్రభలతో పాటు ఊరేగింపులో ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ప్రభల తీర్థాల్లో ఈ తరహా పోకడలు వద్దని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజశ్వి పొడపాటి పోలీసులకు సూచించారు. ఈ అంశంపై పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజుతో మాట్లాడారు. వైకాపా జెండాల ప్రదర్శనపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభల ఉత్సవంలో వైకాపా జెండాతో ఇలా..

పోలీసులను ప్రశ్నిస్తున్న తేజశ్వి

రాష్ట్రంలో 5 వేల ఆలయాల నిర్మాణం

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని తితిదే పాలక మండలి సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో తితిదే పాలకమండలి సమావేశం ఇటీవల నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5000 కొత్త ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి తీర్మానం చేసినట్లు చెప్పారు. కొత్తగా ఆలయాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే నిధులు మంజూరు చేస్తామన్నారు. దేవరపల్లి వెంకన్న సన్నిధి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు, అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తితిదే పాలకమండలి సభ్యుడు మునికోటేశ్వరరావుకు చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మేముచేయుచున్న బిజినెస్ మీరు వ్యక్తి గతంగా గాని మాతో కలిపి చేయుట ద్వారా మంచి లాభాలను పొందండి. వివరాలకు: 9391717772.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి: శ్రీ సాయిలక్ష్మి లాడ్జిలో, SVG మార్కెట్, ఆర్.టి.సి. కాంప్లెక్ ఎదురుగా ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY

సంక్రాంతి శుభాకాంక్షలు
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
24-1-2026న (శనివారం) 11 Am to 5 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
25-1-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ (ICAS చెన్నై Regd.) వారి జ్యోతిష్య, వాస్తు కోర్సులకు ప్రవేశ ఆహ్వానము. ★ అమలాపురం ★ రాజమండ్రి, కాకినాడ సెంటర్లలో 1) గీతా విద్యాలయం, అమలాపురం ★ 9492813554, 2) సరస్వతీ ఘాట్, గోదావరి గట్టు, రాజమండ్రి. సెల్: 9966666659. J.శ్రీనివాస్ www.icasindia.org

EENADU for Advertisement Contact: **8008597607**

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY



FLATS FOR SALE కాకినాడ సురేష్ నగర్ శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు తూర్పు మరియు పడమర ఫేసింగ్ 2 BHK FLATS అమ్మకానికి కలవు. Contact **63031 73055 90103 85888**

HOUSE FOR SALE

GENERAL

ఖండపల్లి గ్రామంలో కాముట్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం, పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. Cell: 9392122526.

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30కి.మీ. దూరం మురారి గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60సెంట్లు భూమి అమ్మకం. (నో బ్రోకర్స్). 9032988265.

KAKINADA RURAL

1.15ఎకరముల పొలంఅమ్మకం కాకినాడ, కరప మండలం, వేములవాడ రామచంద్రపురం హైవేకు, లేఅవుట్‌నకు, ఇళ్లకు అనుకుని గొడౌన్, ఇండస్ట్రీస్‌కు అనువైనది అమ్మకం. నో బ్రోకర్స్, 9399934499.

GENERAL

1.10 Acre N/E Corner Full Tar Road Facing Commercial Land Opp. to N.T. Rajapuram Sachivalayam. 1.8KM from Gandapalli Highway. 8500268603.

PLOT FOR SALE

BHOGAPURAM

Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

KAKINADA CITY

★★★ **కాకినాడదగ్గరలో** Plot కొనండి, Plot గెలవండి భారీ సంక్రాంతి ఆఫర్లు గజం కేవలం 9,999/- రూ. నుంచి ప్రారంభం. ✆ 8886663196

కాకినాడకు అతిదగ్గరలో తక్కువ రేట్లకే సైట్లు, బిల్డింగ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు అమ్మబడును. ✆ 77806 73892.

అన్నవరం సెంటు: 11 లక్షలు, మాధవపట్నం సెంటు: 9 లక్షలు, పెద్దాపురం సెంటు: 7 లక్షలు, ఉండూరు ఊరు మధ్య: 4 లక్షలు, బ్యాంక్ లోన్. 9063385043.

KAKINADA RURAL

కాకినాడ బైపాస్‌కు 1కి.మీ.దూరం మాధవపట్నం- రామేశ్వరం కొత్తూరులో 125, 135, 145, 275 చ॥గ॥లు, 40అ॥ల రోడ్లతో టీచర్లు, లాయర్లు, బ్యాంకు ఉద్యోగుల ఇళ్లతో అభివృద్ధి చెందిన లేఅవుట్, ✆ 98481 33799.

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చ॥గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/ వాట్సాప్: 80748 57055.

RK Township వారి రాజమండ్రి వెంచర్లపై సంక్రాంతి Gold ఆఫర్ కలదు. వివరాలకు: బ్రాంచ్ మేనేజర్, Contact Cell: 99490 91197.

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి సమీపం రాజానగరం పంచాయతీ "చక్రద్వారబంధం" రోడ్డు సాయినగర్‌లో 191.5 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 9704193649, 8019227241

GENERAL

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET

COMMERCIAL

4BHK flat with 2 car parking near GAIL office in Rajahmundry. Suitable for corporate Office/ Guest House. Cont: 9347146720

JOBS

WANTED MARKETING MANAGERS/ Asst. Managers, Qualification: Degree, Age: Above 30 Years, Salary: Above 30K. Cont. Cell: 90108 09384.

కాకినాడ, హోటల్-రెస్టారెంట్‌లో బిర్యానీ, సౌత్ ఇండియన్, చైనీస్, టిఫిన్స్ మాస్టర్స్, సప్లయర్స్, హెల్పర్స్ (బాయ్స్ & గర్ల్స్) కావలెను. Contact Cell: 99493 43008.

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-50** పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	157-00
రిటైల్ లైవ్	184-00
డ్రెస్ట్	267-00
స్కిన్‌లెస్	304-00

92.7 FM Rajamahendravaram (ఈ FM 92.7 Mee FM)

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact **9000180626, 9989993175**

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి దుర్గేష్

రామచంద్రపురం: రామచంద్రపురం కేంద్రంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరాలయాన్ని రూ.4కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వి.ఎస్.ఎం కళాశాలలో జరుగుతున్న కోనసీమ సంక్రాంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆనందం సంతోషం పెంపొందించేందుకు ప్రభుత్వం సంక్రాంతి, గండికోట సంబరాలు అమరావతి ఆవకాయ, డ్రాగన్ పడవ పోటీలు, జగ్గన్నతోట ప్రభల తీర్థం నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ జరగని విధంగా సంక్రాంతి సంబరాలు మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ప్రజల్లో సామాజిక ఐక్యత, సమానత్వానికి మంత్రి సుభాష్ చేస్తున్న కృషిని దుర్గేష్ ప్రశంసించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకునేందుకు నిత్యం పనిచేస్తానన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మంత్రులు దుర్గేష్, సుభాష్, నాయకులు

కోటిపల్లి- ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధనే లక్ష్యం

కోనసీమ జిల్లా ప్రజల వాంఛ అయిన కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి నిర్మాణ లక్ష్యమే ధ్యేయంగా పనిచేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. వి.ఎస్.ఎం కళాశాలల ప్రాంగణం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి ఉత్సవ్-2026 ముగింపు సభలో మంత్రి మాట్లాడారు.

గోదావరిలో స్నానానికి దిగి బాలుడి మృతి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు గోదావరిలో దిగిన బాలుడు మృతి చెందడం ఆ ఇంట్లో తీరని విషాదం నింపింది. కనుమ పండుగ వేళ బాలుడు విగతజీవిగా మారిన ఘటన అందరినీ కలచివేసింది. పెనకనమెట్టకు చెందిన వేములూరి దినేష్ (17) రాజమహేంద్రవరంలోని ఓ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతున్నాడు. ఖమ్మంలో ఉండే మావయ్య పసలపూడి రాజీవ్‌గాంధీ పెనకనమెట్ట రాగా దినేష్, బంధువుల పిల్లలు అయిదుగురు) శుక్రవారం ఉదయం కొవ్వూరు వచ్చారు. 11.30 గంటల సమయంలో స్నానం చేసేందుకు దండకుంట రేవులో గోదావరిలోకి దిగారు. దినేష్ గోదావరిలో కొద్దిగా లోపలికి వెళ్లగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ విషయం అగ్నిమాపక సిబ్బంది, పట్టణ పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో దినేష్ మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. దినేష్‌కు తల్లి లేనందున అమ్మమ్మ వద్ద పెనకనమెట్టలో ఉంటున్నాడు.

వేములూరి దినేష్ (పాత చిత్రం)

బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరం - పి.ఎర్రగొండ రహదారిలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.ఎర్రగొండ గ్రామానికి చెందిన నైని బాబూరావు(42) సంక్రాంతి సందర్భంగా వై.రామవరంలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా.. ఏలేశ్వరం నుంచి వై.రామవరం వస్తున్న బస్సును ఢీకొట్టాడు. బైక్ పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకుని బాబూరావు కాలిపోయి మృతి చెందాడు. దీనిపై ఎస్సై పృథ్వియాదవ్ కేసు నమోదు చేశారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

18న ధ్రువీకరణ పత్రాల మంజూరు

టి.నగర్, న్యూస్‌టుడే: మదర్సా జామియా ఫాతిమా జనాతుల్ ఇస్లాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఖురాన్-హఫీజ్ పూర్తి చేసిన బాలబాలికలకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు నిర్వాహకులు ఫాతిమా బవాతుల్ , మౌలానా గులాం మొహిద్దీన్ రజ్వీ సాహెబ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జేకే గార్డెన్స్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సంబంధిత ధ్రువ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

రైతుబజారులో ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-20, వంకాయలు నలుపు-24/గులాబీ-32/తెలుపు-26/దొమ్మేరు-38, బెండ-36, కాకర-38, బీర పందిరి-36, దొండ-44, క్యారెట్-30, బీట్‌రూట్-24, గోరు చిక్కుళ్లు-32, దోస-28, ఆనబకాయ-24, చిక్కుళ్లు-40, పచ్చిమిర్చి-40, బంగాళదుంపలు-18, ఉల్లిపాయలు-21

దూరప్రాంత సర్వీసుల్లో తిరుగు ప్రయాణాలు మొదలు

స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోకి వస్తున్న ప్రయాణికులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పండగ అనంతరం శుక్రవారం సాయంత్రం నుంచి దూరప్రాంతాలకు ప్రయాణాలు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ సర్వీసులతోపాటు రెండు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులు బయలుదేరినట్లు డిపో అధికారులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌కు మరో నాలుగు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ, విశాఖపట్నం తదితర దూరప్రాంతాలకు మాత్రం ప్రస్తుతం తిరుగుప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండటంతో షెడ్యూల్ సర్వీసులనే నడిపామని, శనివారం నుంచి తిరుగు ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. భోగి పండగ రోజు వరకు ఇక్కడి ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడగా సంక్రాంతి రోజున మాత్రం వెలవెలబోయింది. ఇప్పుడు దూరప్రాంత సర్వీసుల్లో కొంచెం రద్దీ మొదలుకాగా ఉమ్మడి జిల్లా పరిధిలో తిరిగే లోకల్ సర్వీసుల్లో మాత్రం ఇంకా మొదలు కాలేదు. శనివారం సాయంత్రం నుంచి లోకల్ సర్వీసుల్లో కూడా రద్దీ మొదలయ్యే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

పండగ వేళ.. రైతుబజార్లు వెలవెల

– న్యూస్‌టుడే, దేవీచౌక్

కనుమ పండగ ప్రభావంతో శుక్రవారం రాజమహేంద్రవరంలోని రైతుబజారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. వినియోగదారులతోపాటు రైతులు కూడా తక్కువగా హాజరు కావడంతో వెలవెలబోయాయి. కూరగాయలు సైతం కొన్ని రకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కనుమ కావడంతో అంతా మాంసాహారంవైపు దృష్టి మరల్చడంతో కూరయాలు కొనుగోలు చేసేవారు చాలతక్కువగా ఉన్నారు. నగరంలో తొమ్మిది రైతుబజారులు ఉండగా ఒక్కోచోట 50 శాతం కంటే తక్కువ రైతులు, డ్వాక్రా సభ్యులు హాజరయ్యారు. నిత్యం రద్దీగా ఉండే గణేష్‌చౌక్, క్వారీ, వై జంక్షన్ రైతుబజార్లలో సైతం కొనుగోలుదారులు ఎక్కువగా కనిపించలేదు. పండగ కారణంగా కోతలు కోసేవారు లేకపోవడంతో కూరగాయలు తక్కువగా వచ్చాయని రైతులు పేర్కొంటున్నారు. సోమవారం వరకు సంక్రాంతి ప్రభావం ఉంటుందని తెలిపారు.

వై జంక్షన్ రైతుబజారులో మూతపడిన దుకాణాలు

అందుబాటులోకి స్థానిక పంట ఉత్పత్తులు..

గణేష్‌చౌక్ రైతుబజారులో టమాట విక్రయాలు

స్థానిక పంటలు అందుబాటులోకి రావడంతో పండగ సమయంలో వినియోగదారులకు ఊరట లభించింది. బెండ, దొండ మినహా మిగతా కూరగాయల ధరలు కేజీ రూ. 30 లోపే ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడ దిగుమతికావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దొండ, బెండ తక్కువ మొత్తంలో దిగుబడి ఉండటంతో వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటి వరకు మదనపల్లి, అనంతపురం నుంచి దిగుమతి చేసుకుంటున్న టమాట స్థానికంగా అందుబాటులోకి రావడంతో టోకు మార్కెట్‌పై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పోయింది. పదిరోజుల నుంచి స్థానిక పంట ఉత్పత్తులు అందుబాటులోకి రావడంతో ఈ నెల 7వ తేదీన కేజీ ధర రూ. 30 ఉండగా తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టింది. రైతుబజార్లలో ప్రస్తుతం కేజీ రూ. 20లకు లభిస్తున్నాయి. నగరంలోని పెద్ద రైతుబజార్లకు రోజుకు 6 నుంచి 7 క్వింటాళ్లు, చిన్న బజార్లకు 5 నుంచి 6 క్వింటాళ్లు అవసరం అవుతాయి. స్థానిక పంట అందుబాటులోకి రావడంతో డిమాండ్‌కు సరపడా టమాటా సరఫరా అవుతోంది. ఈ నెలాఖరునాటికి మరింత తగ్గుముఖం పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

మెట్లపై దీపాలు వెలిగిస్తూ...

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాజమహేంద్రవరం నల్లమందుసందు వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, హారతి సమర్పించారు. ఏటా మకర సంక్రాంతి రోజున ఆలయంలో నిర్వహించే అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ఏవీఏ రోడ్డు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు రాజమహేంద్రవరంలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బొమ్మూరు కూడలిలో ఆటో రిక్షా కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం నిషేధమని స్పష్టం చేశామన్నారు. వాహనదారులకు రోడ్డు భద్రతా ప్రమాణాలు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అవసరాన్ని వివరిస్తూ అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సంపత్‌కుమార్, రవికుమార్, నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని పాలచర్లలో శ్రీసాయి దుర్గా, అభయాంజనేయ స్వామివారి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున నగర సంకీర్తనలతో పాటు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ చేశారు. అనంతరం కోలాటం, తీన్మార్ కార్యక్రమాలతో గ్రామమంతా తిరిగారు. 13 సంవత్సరాలుగా కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

అ'పూర్వ' సమ్మేళనం

కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని మహాత్మా గాంధీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1978-79లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు అందజేశారు. – న్యూస్‌టుడే, టి.నగర్

నగరంలో సంక్రాంతి సందడి

నగరంలో సంక్రాంతి సందడి నెలకొంది. సొంతూళ్లకు వచ్చేవారు, వెళ్లేవారితో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రధానంగా మెయిన్ రోడ్, తాడితోట, డీలక్స్ సెంటర్ తదితర చోట్ల వస్త్ర వ్యాపారం జోరుగా సాగింది. రాజమహేంద్రవరం పరిసర మండలాల నుంచి పల్లెవాసులు ఎక్కువ మంది కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో వ్యాపార సముదాయాలున్న రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఒక్క వస్త్ర దుకాణాలకు సంబంధించి రోజుకు రూ. 15-20 కోట్లు వ్యాపారం జరిగినట్లు సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు కూడా ఊపందుకున్నాయి. వ్యాపార సంస్థలు అనేక రాయితీలు, బహుమతులు ప్రకటించడంతో పెద్ద ఎత్తున ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకున్నారు. టీవీ, ఫ్రిజ్, ఫర్నిచర్ వంటి గృహోపకరణాల కొనుగోళ్లు బాగా జరిగాయి. వివిధ ఆటోమొబైల్ సంస్థలు డిస్కౌంట్ ప్రకటించడంతో నూతన వాహనాల కొనుగోళ్లకు ప్రజలు మొగ్గు చూపారు. హోటళ్లు కూడా సందడిగా మారాయి. బంధువులతో కలిసి ప్రత్యేక రుచుల కోసం హోటళ్లకు తరలివచ్చారు. పండగ సందర్భంగా పలు నూతన చిత్రాలు విడుదల కావడంతో సినిమా థియేటర్లలో అదనపు షోలు సైతం వేశారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు, టి.నగర్

సారంగధరేశ్వరస్వామికి విశేష అలంకారం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఆలయం

వైభవంగా సారంగధరుడి తీర్థం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం సమీపంలోని సారంగధరమెట్టపై కొలువైన సారంగధరస్వామి తీర్థం వైభవంగా జరిగింది. కనుమ పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం సారంగధరేశ్వరస్వామి ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి కుంకుమార్చన, మధ్యాహ్నం 3 గంటలకు త్రయోదశి సందర్భంగా నందీశ్వరుడికి అభిషేకం జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతనామ పూజ, నీరాజన మంత్రపుష్పం, వేదాశీర్వాదం నిర్వహించారు. తీర్థం కావడంతో ఆలయాన్ని, ఆలయానికి సారంగధరుడి చరిత్ర సంబంధించిన విగ్రహాలను పూలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సారంగధరుడి తీర్థం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ఆలయ మేనేజర్ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కె.వి.డి.ఎస్.సి.వి.చౌదరి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిరాశ్రయులకు భోజనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిరాశ్రయులకు పండగ వేళ భోజనం సమకూర్చింది. పలు కారణాలతో నగరానికి వలస వచ్చిన కూలీలు, నిరాశ్రయులు, బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించే వారికి నిర్వాహకులు భోజనం అందజేశారు. పండగ కావడంతో చిన్నపాటి హోటళ్లు మూతపడటంతో అత్యవసర పనులపై వచ్చిన వారికి సైతం భోజనం అందించామని సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. పండగ సమయంలో సేవలకు సహకారం అందించిన సిబ్బంది వీర్రాజు, చిట్టెమ్మ, రమణమ్మ, తదితరులను సత్కరించి అభినందించారు.

హెచ్చరికలు బేఖాతరు

రాజమహేంద్రవరం నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్తా, చెదారం వేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు రావడం లేదు. స్థానిక జయకృష్ణపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ వెనకవైపు కళాశాలగోడను ఆనుకుని ఉన్న రోడ్డు పక్కన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నింపేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే అక్కడ చెత్తను తొలగించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా..?

కోరుకొండ రోడ్డులోని రాజా థియేటర్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన మురుగునీరు నిలిచిపోవడంతో అటుగా వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. డ్రెయినేజీలో పూడిక తీయడంతో దాంతోపాటు మురుగు బయటకు వచ్చి రోడ్డుపక్కన నిలిచిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో మురుగు నిలిచిపోవడం వల్ల వాహనదారులతోపాటు పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

గుంతలమయం.. చింతల ప్రయాణం

రాజమహేంద్రవరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో భాస్కర్ నగర్ ఒకటి. ఈ ప్రాంతంలో గ్లోగార్డెన్ ఎదురుగా ఉన్న రోడ్డు చాలా వరకు గుంతలమయంగా మారడం, మరికొన్ని చోట్ల ధ్వంసం కావడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. భారీ గుంతలను దాటుకుని వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, గుంతల్లోపడి వాహనాలు దెబ్బతింటున్నాయని చోదకులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పూడికతో ఇలా.. మురుగు పారేదెలా..?

స్థానిక తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆవకాలనీలోని గృహసముదాయాల వద్ద పలు వీధుల్లోని డ్రెయిన్లు పూడికతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. చాలా రోజులుగా పూడిక తొలగించకపోవడంతో మురుగు పారే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు పెరిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

బస్టాపుల్లో వ్యాపారాలు.. ప్రయాణికులకు అవస్థలు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే లాలా చెరువు కూడలిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గల బస్టాప్ చిరు వ్యాపారులకు అడ్డాగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోంది. ముఖ్య కూడలిలో ఇలా ప్రయాణికులు రోడ్డుపైకి వచ్చేస్తుండడంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. నగరంలోని మరికొన్ని బస్టాప్‌ల వద్దా ఇదే పరిస్థితి. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

భక్తిశ్రద్ధలతో నరసన్న గ్రామోత్సవం

కోరుకొండ: ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి వారి గ్రామోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. గురువారం పశ్చిమ గోనగూడెం, శుక్రవారం రాత్రి జంబూపట్నంలో వుల్లి బుజ్జిబాబు స్వగృహం వద్ద అర్చన, విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలు ముగియడంతో ఏటా సంప్రదాయబద్ధంగా ఈ రెండు గ్రామాలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆయా గ్రామాలకు తీసుకెళ్తారు. గిరిధరాచార్యులు, సంతోష్, వంశీ, అర్చక స్వాములు పాల్గొన్నారు.

ఈట్‌స్ట్రీట్ ప్రాంతంలో పారిశుద్ధ్యం పడక

సాయంత్రం వేళ యువత, కుటుంబాలతో సందడిగా కనిపించే ఈట్‌స్ట్రీట్ ప్రాంతంలో పారిశుద్ధ్యం పడకేసింది. కూర్చొని రుచులు ఆరగించేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్, బల్లల వద్ద చెత్త పేరుకుపోయి, దుర్వాసన వస్తోంది. కొంత మంది తిన్న తరువాత ఖాళీ ప్లేట్లు, గ్లాసులు ఇష్టారీతిగా ఫుట్‌పాత్‌పైన, మొక్కల వద్ద పడేస్తుండడంతో చెత్త అంతా రోడ్లపైకి చేరుతోంది. వ్యాపారులు సైతం దుకాణాలు మూసే సమయంలో పరిసరాలు అపరిశుభ్రంగా వదిలేస్తుండడంతో ఉదయం నడకకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఇరుకు సందుల్లో ట్రాఫిక్ ఇక్కట్లు

అసలే సందులు.. ఆపై ఇష్టారీతిగా కారులు, ఆటోలు, మిని వ్యాన్ల రాకపోకలతో నగరంలోని మెయిన్ రోడ్డు, గంటాలమ్మ గుడి వీధి, మెరక వీది, జండాపంజా రోడ్డు తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో సాధారణ రోజుల్లోనే రద్దీ ఎక్కువ. ఇక పండగలు, పర్వదినాల్లో చెప్పనక్కరే లేదు. ప్రధాన మార్కెట్ కావడంతో నగరంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలపై తరలివస్తుంటారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. నియంత్రణకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినా.. కొందరు వాటిని అతిక్రమించి వస్తుండడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పట్లేదు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

మెయిన్‌రోడ్డు సీతమ్మసందు మార్గంలో ఆటో నిలపడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు

జండాపంజా రోడ్డులో కార్లు, ఆటోలతో..

అరచేతిలో తపాలా సేవలు

– న్యూస్‌టుడే, దేవీచౌక్

తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆ శాఖ సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. తాము అందించే సేవలన్నీ స్మార్ట్ ఫోన్ ద్వారా ఉపయోగించుకునేలా 'డాక్ సేవ' పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా స్పీడ్ పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను సకాలంలో ట్రాక్ చేసుకోవచ్చు. దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత చార్జీ అవుతుందో తక్షణమే లెక్కించవచ్చుని, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సేవల కోసం గంటల తరబడి క్యూలైన్లో నిలబడే అవసరం లేకుండా డాక్ సేవ యాప్ ద్వారానే పూర్తిచేయవచ్చని, జీపీఎస్ సహాయంతో సమీప తపాలా కార్యాలయాల వివరాలు తెలుసుకోవచ్చు రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. చిన్న మొత్తాల పొదుపు ఖాతాలకు ఎంత వస్తుంది, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయాలనే వారికి ఎంత ప్రీమియం పడుతుందో చూసుకోవచ్చు. కార్పొరేట్ వినియోగదారుల కోసం ప్రత్యేక విభాగం ఈ యాప్‌లో ఉంది.

మీ కోసం

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవడం చాల సులభం. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లో డాక్ సేవ యాప్ అని టైప్ చేసి అక్కడ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో ఉన్న అధికారిక యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఓపెన్ చేసి మొబైల్ నంబరు లేదా ఈ మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వాలి. ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యాక సేవలను వినియోగించుకోవచ్చు.

అనధికార నిర్మాణాలపై సర్వే

- ఇప్పటి వరకు 250 భవనాల యజమానులకు నోటీసులు

అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో అనధికారికంగా జరిగిన నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం సర్వే నిర్వహిస్తోంది. నిబంధనలు పాటించకుండా అదనపు అంతస్తులు, సెల్లార్లను వ్యాపార కేంద్రాలుగా మార్చడం, కనీసం సెల్లార్లు లేకుండా నిర్మాణం జరగడం వంటి అంశాల నేపథ్యంలో యంత్రాంగం తనిఖీలు చేస్తోంది. గత ప్రభుత్వంలో భవన నిర్మాణాలకు సంబంధించి అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులపై అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. ఏకంగా ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొంత మంది మధ్యవర్తుల సహాయంతో భారీ భవనాలను అడ్డగోలుగా నిర్మించేశారు. దీంతోపాటు పుష్కరాలకు రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ అంతరాయాన్ని అధికమించేందుకు రోడ్ల విస్తరణ చేపడుతుండడంతో ఆక్రమణలపైనా చర్యలకు సిద్ధపడుతున్నారు. తాజాగా నిర్మాణంలో ఉన్న వాటిని కూడా తనిఖీ చేసి, నిబంధనలకు అనుగుణంగా లేకుంటే వాటిపై చర్యలు తీసుకోనున్నారు. గతంలో సెల్లార్లు లేకుండా భారీ భవంతులు, వాణిజ్య సముదాయాలకు అనుమతులు ఇచ్చారు. వాటి వల్ల రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. అధికారం పేరుతో కొంత మంది మధ్యలో వ్యక్తులు నగరంలో భారీ భవనాలు, అపార్ట్‌మెంట్ల అనుమతుల విషయంలో రెచ్చిపోయారు. ప్రణాళికా విభాగంలో అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు సేకరించి, మధ్యవర్తులు అక్కడికి చేరిపోయేవారు. మేము దగ్గరుండి అనుమతులు ఇప్పిస్తాము, అందుకోసం రూ. 5 లక్షల నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుందని బేరసారాలు చేయడం ఆనవాయితీగా మారిపోయింది.

మూడు ప్రాంతాలను ఆనుకునే..

మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, గోదావరి గట్టు ప్రాంతాలను ఆనుకొని గడిచిన ఐదేళ్లలో 28 అక్రమ భవనాలకు అనుమతులు ఇప్పించారు. నిబంధనల మేరకు భవనాలకు జీ ప్లస్ 2 అనుమతులు ఉంటే అదనంగా ఒకటి, రెండు అంతస్థులకు అవకాశం కల్పించడం ఇవన్నీ ఇష్టానుసారంగా నడిపించారు. జేఎన్ రోడ్డు, దానవాయి పేట, ప్రకాశంనగర్, తిలక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలన్నీ పూర్తిగా అనుమతులు లేకుండా నిర్మించినవి కావడం గమనర్హం. ఇప్పటి వరకు 250 భవనాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. అయితే ప్రభుత్వం బీపీఎస్‌కు అవకాశం కల్పించడంతో ఆ దిశగా కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. బీపీఎస్‌కు 81 మంది దరఖాస్తు చేసుకొన్నారు. దీంతోపాటు తాజాగా అనధికారికంగా నిర్మాణంలో ఉన్న భవనాలను గుర్తించి నిర్మాణాలను తొలగిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో నేతల ఆజ్ఞలకు తలొగ్గిన అధికారులు ఇప్పుడు ప్రభుత్వం మారాక బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారికి ఇదంతా తలనొప్పి వ్యవహారంగా మారింది. అనధికార భవనాల విషయంలో ఏం చేయాలనేది ప్రశ్నార్థకంగా ఉంది. అయితే ఇదంతా కేవలం భవిష్యత్తులో ఏర్పడే ఇబ్బందులు దృష్ట్యా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

భక్తిశ్రద్ధలతో నరసన్న గ్రామోత్సవం

కోరుకొండ: ప్రసిద్ధ గాంచిన కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామివారి గ్రామోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. స్వామివారి పల్లకి గోనగూడెం, శుక్రవారం రాత్రి బూరుగుపూడిలో వీధి వీధికి తిరగగా స్వగృహాల వద్ద అర్చన, విశేష పూజలు నిర్వహించారు. దసరోత్సవాలు ముగియడంతో ఏటా సంప్రదాయబద్ధంగా ఈ రెండు గ్రామాలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆయా గ్రామాలకు తీసుకెళ్తారు. గిరిధరాచార్యులు, సంతోష్, వంశీ, అర్చక స్వాములు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

రాజానగరం: మండలంలోని పాలచర్లలో శ్రీసాయి దుర్గా, అభయాంజనేయ స్వామివారి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నగర సంకీర్తనతో పాటు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ చేశారు. అనంతరం కోలాటం, తీన్మార్ కార్యక్రమాలతో గ్రామమంతా తిరిగారు. 13 సంవత్సరాలుగా కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మేమున్నాం.. మీకు తోడుగా

మీ సంస్థకు సంబంధించిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947
ఉ. 10 - మ. 1

దుర్వాసనతో ఇక్కట్లు

సమస్య: చెరువుగట్టు వెనుక వీధిలోని దుకాణాల్లో వ్యర్థాలు రోడ్డు పక్కనే పారవేస్తున్నారు. విపరీతమైన దుర్వాసన వల్ల రాకపోకలు సాగించలేకపోతున్నాం. - శ్రీకాంత్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. - కాశీ, గ్రామకార్యదర్శి, బొమ్మూరు - న్యూస్‌టుడే, బొమ్మూరు

నీరు వస్తోంది

స్పందనకు స్పందన

హుకుంపేట రామకృష్ణనగర్ మూడో వీధిలోని మైపైప్‌లైను పగిలి నీరు వృథాగా పోతుంది. రెండు రోజుల నుంచి నీరు రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామకార్యదర్శి కాశీ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించి నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కరించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

రంగుల ముగ్గులు.. సంప్రదాయ ప్రతీకలు

పోటీదారుల ముగ్గులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కడియం, న్యూస్‌టుడే: రంగు రంగుల ముగ్గులు తెలుగు సంప్రదాయ ప్రతీకలుగా నిలిచాయని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ కొనియాడారు. కడియపులంక గ్రామదేవతగా కొలిచే ముసలమ్మతల్లి ఆలయ ఆవరణలో ఏటా నిర్వహించే సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా శుక్రవారం హాజరయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు సమీప గ్రామాల నుంచి ఔత్సాహిక యువతులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది న్యాయనిర్ణేతలుగా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. మంత్రి దుర్గేశ్ గెలుపొందిన వారికి బంగారు డాలర్, వెండి పట్టీలు, డ్రెస్సింగ్ టేబుల్, సోఫా, గ్రైండర్ తదితర గృహోపకరణాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, సర్పంచి మారిశెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మార్గాని ఏడుకొండలు, పల్ల సుబ్రహ్మణ్యం, సినీ నటుడు భద్రం, పుల్లా చిన్న సత్యనారాయణ, పెద్ద సత్యనారాయణ, తిరుమలశెట్టి భాస్కరరావు, గట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగరంగ వైభవంగా.. రంగవల్లులు

రాజానగరం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కానవరంలో విజయ గణపతి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా గ్రాము బంగారం, ద్వితీయ బహుమతిగా వాషింగ్ మెషీన్, తృతీయ బహుమతిగా వెండి పట్టీలు అందజేశారు. ● చక్రద్వారబంధంలో నిర్వహించిన పోటీల్లో 60 మంది పాల్గొనగా కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన మార్గాని పద్మ ప్రథమ బహుమతిని పొందింది. ● కొండగుంటూరులో భాజపా ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పోటీలకు రాష్ట్ర భాజపా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కాలెపు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

ప్రథమ విజేతకు బహుమతి అందిస్తున్న మంత్రి దుర్గేశ్

చక్రద్వారబంధంలో విజేతకు బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

సంక్రాంతి సంబరాలకు నేతల హాజరు

ఆర్టీసీ ఛైర్మన్, ఎమ్మెల్యేలకు మొక్కను అందించి స్వాగతిస్తున్న మార్గాని

కడియం: కడియపులంక గ్రామానికి చెందిన ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ ఇంట జరిగిన సంక్రాంతి వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, అమెరికా తానా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ రామ్ కోమటి, భాజపా నాయకుడు ఆకూరి శ్రీరామ్‌లకు మొక్కలు అందించి ఆయన స్వాగతం పలికారు. కడియంలోని నర్సరీ అందాలు మనసుకు ఆహ్లాదానికి నిలయంగా మారాయని వారంతా కొనియాడారు. అనంతరం మార్గాని సోదరుడు వీరబాబు ఇంట జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సులు నిర్దేశిత స్టాపుల వద్ద ఆపకుండా వెళ్తుండడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆర్టీసీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం ఉపాధ్యక్షుడు పోపాటి గోపి, ఎఎంసీ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, సిద్ధిరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

18న ధ్రువీకరణ పత్రాల మంజూరు

టి.నగర్: మద్రాస్ జామియా ఫాతిమా జనాతుల్ ఇస్లాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఖురాన్-హిఫ్జ్ పూర్తి చేసిన బాలబాలికలకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు నిర్వాహకులు ఫాతిమా బవాతుల్, మౌలానా గులాం మొహియుద్దీన్ రజ్వి సాహెబ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జేకే గార్డెన్స్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సంబంధిత ధ్రువ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

మూడు రోజులూ... కోడై కూసింది!

ముమ్మరంగా పందేలు, గుండాటలు

కోరుకొండ, రాజానగరం, న్యూస్‌టుడే: ముందు నుంచి చేసిన హడావుడి అంతా నీరుగారింది. పందేలకు బరులు సిద్ధం చేస్తుంటే అధికార యంత్రాంగం వాటిని ధ్వంసం చేయడం, హెచ్చరికలు, ఫ్లెక్సీలు, మైకు ప్రచారం ఇదంతా ఆర్బాటమే అని తేలింది. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఈ ఏడాది సంక్రాంతికి బరుల నిర్వాహకులు రెచ్చిపోయారు. పలు చోట్ల భారీ ఎత్తున నిర్వహించడంతో పందెందారులను ఎక్కడెక్కడ నుంచో రాబట్టగలిగారు.

బరులు వద్ద బుల్లెట్ల ప్రదర్శన

కార్లు... బుల్లెట్ వాహనాలు

రాజానగరం నియోజకవర్గం చరిత్రలో తొలిసారిగా ఇంత పెద్ద ఎత్తున కోడి పందేలు, గుండాట జరగడం ఇదే మొదటిసారి. ఎన్నడూలేని విధంగా కార్లు, బుల్లెట్లు బరుల్లో పెట్టి ఆడించగలిగారు. కొందరు నాయకులు, అధికారుల అండదండలతోనే భారీ జూదానికి తెరలేపారని విమర్శలు వస్తున్నాయి. కోటిలో ఏర్పాటు చేసిన రెండు బరుల్లో 300కి పైగా పందేలు జరిగాయి. రెండు కార్లు, ఆరు బుల్లెట్ వాహనాలను గెలిచినవారికి బహుమతులుగా ఇచ్చారు. మధురపూడిలోనూ పెద్ద ఎత్తున జూదం, బరులు ఏర్పాటు చేశారు. మరోచోట ఉండేశ్వరపురం-మధురపూడి సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బరిలోనూ నాలుగు బుల్లెట్ వాహనాలు విజేతలకు అందజేశారు. రాజానగరం మండలం పరిజల్లిపేట, శ్రీకృష్ణపట్నంలో జరిగిన పందేల్లో నాలుగు బుల్లెట్ వాహనాలను బహుమతులుగా అందజేశారు. సీతానగరం మండలం పెద్దకొండేపూడిలోనూ భారీ ఎత్తున బరి, గుండాట ఏర్పాటు చేశారు. రఘుదేవపురంలో పందేల ప్రదర్శన కోసం భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

ఒకవైపు పందేలు... మరోవైపు జూదం

కోడిపందేల ముసుగులో గుండాట, జూదం కూడా అదే స్థాయిలో నిర్వహించడం విశేషం. రాజానగరం మండలం రాజానగరం, దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం, కలవచర్ల, ముక్కినాడ, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవాపురం, రాజవరం, కణుపూరు, నరసాపురం, గాదరాడ, మునగాల, నిడిగట్ల, దోసకాయలపల్లి గ్రామాల్లోనూ పందేలు, జూదం పెద్దఎత్తున నిర్వహించారు.

రంగంలోకి పోలీసులు

పండగ మూడు రోజులు పందేలు, గుండాట జోరుగా సాగుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి పోలీసులు రంగంలోకి దిగారు. పండగ అయిపోయింది, పందేలను ఆపండి అంటూ పోలీసు సిబ్బంది మైకులు పట్టుకుని చెప్పడం ప్రారంభించారు. అయినా కొందరు నిర్వాహకులు వారి మాటను పెడచెవిన పెట్టి రాత్రయినా నిర్వహిస్తున్నారు. హెచ్చరిస్తున్న వినకుండా పందేలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

గోదాకృష్ణుల తిరువీధి ఉత్సవం

కోరుకొండ, న్యూస్‌టుడే: స్థానిక కోదండ రామాలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా గోదాకృష్ణుల తిరువీధి ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు ఇరగవరపు రఘురాం ఆధ్వర్యంలో గోదాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు విశేష పుష్పాలంకరణ చేసి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఉత్సవ మూర్తులను దర్శించి హారతులతో స్వాగతం పలికారు.

పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

గోదారోళ్లతో మామూలుగా ఉండదు

కడియం, న్యూస్‌టుడే: రాష్ట్రం నలుమూలల్లోనూ గోదారోళ్లంటే ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇక్కడి వాళ్లంతా మాటల్లో వెటకారం, భోజనం వడ్డించడంలో ప్రేమను కురిపిస్తారని పేరు. ఈ క్రమంలో తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తోరాటి శివసూర్యకు అదే మండలంలోని జేగురుపాడుకు చెందిన రంకిరెడ్డి లీలాదేవితో గతేడాది వివాహమైంది. అతడి మామగారు రంకిరెడ్డి సుబ్రహ్మణ్యం తొలిసారి పండక్కి ఇంటికి వచ్చిన కొత్త అల్లుడికి ఒకటి కాదు, రెండు కాదు దాదాపు 70 రకాల వంటకాలతో ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. దీంతో గోదారోళ్ల మర్యాదలంటే అంతేగా అంటూ పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

70 రకాల వంటకాలతో నూతన దంపతులు

బొమ్మూరు: సంక్రాంతి అంటే కొత్త అల్లుళ్లకు పండగే. బొమ్మూరు వెంకటగిరికొండకు చెందిన ముద్దాల తిరుపతిరావు, శ్రీదేవిల అల్లుడికి 51 రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన దంపతులైన వరుణ్, ప్రత్యూషలకు ప్రత్యేకంగా వండి, వడ్డించామని తిరుపతిరావు తెలిపారు..

మాజీ ఎమ్మెల్సీ జయంతి వేడుకలు

పెదపూడి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ బొడ్డు భాస్కర రామారావు జయంతిని పెద్దాడ గ్రామంలో గురువారం నిర్వహించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేకు కోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా గంగాధరచౌదరి, తిబిరిశెట్టి గణేష్, పైణ్ణి వీరవెంకట సత్యనారాయణ, బొడ్డు శ్రీను, ప్రత్తిపాటి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల సందడితో పుష్కరవనం

రాజానగరం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ కనుమ సందర్భంగా శుక్రవారం గోదావరి మహాపుష్కరవనం సందర్శకులతో సందడిగా మారింది. చిన్నారులతో వనమంతా సరదాగా విహరించారు. రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్న సిక్కిం విద్యార్థినులు వనంలో ఏర్పాటు చేసిన ఆర్చరీ, షూటింగ్‌లలో పాల్గొన్నారు.

చెత్త తొలగించండి సారూ...

మోరంపూడి, న్యూస్‌టుడే: శాటిలైట్ సిటీ బీ బ్లాక్ ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. పశువులు చెత్తను చెల్లాచెదురు చేసి రోడ్లపైకి విసిరేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో దుర్వాసన పెరిగిపోయి, దోమలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిని కమ్మేసిన మంచు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువులో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం దాదాపు 9 గంటల వరకు ముందున్న వాహనాలు కనిపించనంత దట్టమైన మంచు కమ్మేసింది. పండగ రోజు కావడంతో వాహనాల రద్దీతో పాటు ఎదురుగా వెళ్తున్నవి కనిపించక ప్రయాణికులు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐజీ రవికృష్ణకు సత్కారం

గోకవరం, న్యూస్‌టుడే: చాలా ఏళ్ల తరువాత సంక్రాంతికి స్వగ్రామం రావడం చాలా సంతోషంగా ఉందని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. స్వగ్రామమైన గోకవరం మండలం కామరాజుపేటకు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వచ్చారు. కనకదుర్గమ్మ ఆలయానికి రాగా ధర్మకర్త అశోక్ గజపతి, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్తిబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌బాబు, సర్పంచి అడపా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలతో గుబులు....

కొంతమూరు, న్యూస్‌టుడే: కొంతమూరు అఫిషియల్ కాలనీలోని ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్లు గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ వినియోగపు నీరు గుంతలోకి చేరి పాదచారులపై పడుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీసీ సంఘం యువజన అధ్యక్షుడి ఎన్నిక

బిక్కవోలు: జిల్లా బీసీ సంఘం యువజన అధ్యక్షుడిగా బిక్కవోలు మండలం ఆరికిరేవులకు చెందిన వాసిరెడ్డి వాసును నియమించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల గోపాలకృష్ణ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని శుక్రవారం వాసు తెలిపారు.

ఒనువులమ్మకు ప్రత్యేక పూజలు

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: తొర్రేడులోని ఒనువులమ్మ ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన చేశారు. గరగల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం భక్తుల సమక్షంలో చండీ హోమం జరిపించారు.

నేడు రథోత్సవం

కోరుకొండ, న్యూస్‌టుడే: శ్రీరంగపట్నంలో శనివారం రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. దేవీ గౌరీ శంకరుల రథోత్సవం, గౌరీ శంకరుల రథోత్సవం వేర్వేరు ప్రాంతాల నుంచి రెండు రథాలపైనా వైభవంగా జరిపించనున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గ్రామశ్రేయస్సుకు ఘనంగా గోపూజ

గోపూజలో పాల్గొన్న భక్తులు

కడియం, న్యూస్‌టుడే: కడియంలో కొలువై ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ గోసంరక్షణ సమితి అధ్యక్షుడు గిరజాల బాబు, రామకృష్ణ తులసీ ఆధ్వర్యంలో కనుమ పండగను పురస్కరించుకుని గోపూజ, ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ప్రధాన అర్చకుడు అప్పిలి శ్రీమన్నారాయణ వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులంతా సుఖ సంతోషాలు, పాడి పంటలతో అభివృద్ధి చెందాలని వారంతా ప్రత్యేక ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ తోరాటి శ్రీను, భాజపా గ్రామీణ కన్వీనర్ ఆకుల సుధాకర్, గ్రామపెద్దలు గిరజాల నాగేశ్వరరావు, చిక్కాల ఉమా మహేశ్వరరావు, వెలుగుబంటి అచ్యుతరామ్, పున్నమిరాజు వీర్రాజు, దొడ్డా బుజ్జి, గారపాటి తాతబ్బాయి, దాసరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషి

తొలి సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

పెదపూడి, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని పెదపూడి మండలం కరకుదురు అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రావు కోరారు. గురువారం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలతో నిర్వహించిన తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విద్యనభ్యసించి ఇతర దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికే అసోసియేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని, గ్రామంలో అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సవరపు అజయ్, యంట్రు వీర్రాజుచౌదరి, చిక్కాల రమేష్, బెజ్జబరపు అప్పన్నబాబు పాల్గొన్నారు.

రూ.కోట్లలో కోడి పందేల వ్యాపారం

రాజానగరం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మండలంలో మూడు రోజులు పాటు కోడి పందేలు, జూదాల ద్వారా మొత్తంగా సుమారు మూడు కోట్ల రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తోంది. మండలంలోని పరిజల్లిపేట, శ్రీకృష్ణపట్నం, రాజానగరం, దివాన్‌చెరువు, నరేంద్రపురం, తోకాడ, ముక్కినాడ, పల్ల కడియం పాలచర్ల, సీతారామపురం తదితర గ్రామాల్లో భారీగా కోడి పందేలు నిర్వహించారు. ఈసారి పందేలను చూసేందుకు మహిళలు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు.

డిజిటల్ గ్రంథాలయం.. ప్రకటనలకే పరిమితం

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చదువుకునే వారికి ఆధునిక పద్ధతుల్లో విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో గత పాలకులు ప్రతి గ్రామ పంచాయతీలో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటి సాయంతో యువత విజ్ఞానం, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవచ్చని ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం గ్రామంలో ఉండి పని చేసుకునేలా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామంటూ హడావుడి చేసినా..అదంతా మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

మూడు డిజిటల్ గ్రంథాలయాల మంజూరు

మొదటి విడతగా ప్రతి గ్రామ పంచాయతీలో ఓ డిజిటల్ గ్రంథాలయాన్ని నిర్మించాలని అధికారులు స్థలసేకరణ జరిపారు. ఒక్కో భవనానికి రూ.16 లక్షలు కేటాయించారు. మొదటి విడతలో రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి రాజానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం గ్రామీణం నియోజకవర్గంలోని బొమ్మూరులో వీటి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. డిజిటల్ లైబ్రరీలకు రాజానగరానికి రూ.30 లక్షలు, కోరుకొండకు రూ.30 లక్షలు, బొమ్మూరుకు రూ.50 లక్షలు మొత్తంగా రూ.1.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రాజానగరంలోని శాఖా గ్రంథాలయం

బిల్లులు రావనే భయంతో.....

డిజిటల్ గ్రంథాలయ భవనాలు నిర్మాణాలకు గుత్తేదారులెవరూ ముందుకు రావడం లేదు. గతంలో నిర్మించిన వాటికే చెల్లింపులులేవని అంతా ముఖం చాటేస్తున్నారు. ఈ నిర్మాణాలను 2023 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. కాగా బిల్లుల చెల్లింపులో జాప్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడి పనులు ఎక్కడికక్కడ పడకేశాయి. డిజిటల్ గ్రంథాలయాల్లో 3 కంప్యూటర్లు, స్కానర్, ప్రింటర్ ఏర్పాటు చేయాలి. పాఠకుల కోసం కుర్చీలు, బల్లలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదనల్లో ఉంది. వీటితో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ పత్రికలు, పుస్తకాలను సమకూర్చాలి. ఇవన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి.

కూటమి ప్రభుత్వంపైనే భారం

డిజిటల్ గ్రంథాలయాలు పూర్తై వినియోగంలోకి తీసుకొస్తే వీటికి సంబంధించి విద్యుత్తు బిల్లులు, నెట్ ఛార్జీలు ఎవరు చెల్లించాలన్న దానిపై ఇంకా ఎటువంటి స్పష్టత లేదు. వీటిపైనే ఆశలు పెట్టుకున్న యువత, నిరుద్యోగులకు చివరికి నిరాశే మిగిలింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

S.O.P. No. 2/2026

Between:
1. Relangi Vijayakumari,
2. Relangi Mahidar Satya Kumar,
3. Relangi Vedasri Vijaya Harshitha
(Petitioners 2 and 3 being minors represented by Paternal Grand Mother and guardian the 1st Petitioner) ... Petitioners

And

1. AXIS MAX Life Insurance Company Limited, Represented by its Manager, Rajamahendravaram - 533104.
2. AXIS MAX Life Insurance Company Limited, Gurugram - 122015, Haryana State. ... Respondents

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై గ్రంథంలో చనిపోయిన రేలంగి శివన్నారాయణ గారికి రావలసిన ప్రతిఫలములు పిటీషనర్స్‌కి వారసులుగా దాఖలు పడిఉన్నవి పైన 1వ పిటీషనర్ మరియు 2, 3 పిటీషనర్స్‌కి 1వ పిటీషనర్ గార్డియన్‌గా వ్యవహరించుచున్నారు మరియు పైన తెలిపిన పిటీషనర్స్ (Late) శివన్నారాయణ గారు వారసులు అని సక్సేషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం S.O.P. దాఖలు చేసియున్నారు. కావున పై నెంబరు S.O.P. లో ఎవరికైన అభ్యంతరములు ఉన్న యెడల **ది.5-2-2026**న ఉదయం 10.30 ని॥లకు పై కోర్టులో తెలియపర్చుకోవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

రాజమండ్రి,
16-01-2026.

A.సుబ్బారావు
అడ్వకేట్, రాజమండ్రి

(c) eenadu

కొవ్వూరు

●కొవ్వూరు ●నిడదవోలు ●గోపాలపురం

ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన

నిడదవోలు, న్యూస్‌టుడే: మండలంలోని కోరుమామిడిలో గురువారం యువతకు ఉపాధి అవకాశాలపై ట్రైకామ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ పరంగా ప్రభుత్వ స్థాయిలో ఉన్న ఉద్యోగావకాశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాధాన్యాన్ని ప్రతినిధి బాబు వివరించారు. సహకార సంఘ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రరావు, తెదేపా నాయకుడు ఉప్పల కాశీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మెట్టపల్లి సుబ్బారాయుడు, గ్రామ ప్రముఖులు యిమ్మణ్ణి మురళీధర్, ఉండవల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు రాజమహేంద్రవరంలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బొమ్మూరు కూడలిలో ఆటో రిక్షా కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం నిషేధమని స్పష్టం చేశామని, వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని సూచించామన్నారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అవసరంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సంపత్‌కుమార్, రవికుమార్, నారాయణ పాల్గొన్నారన్నారు.

గోదా, గోపాలస్వామి శయనోత్సవం

దధి మథనోత్సవంలో మహిళా భక్తులు

కొవ్వూరు పట్టణం: ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెల రోజులపాటు తిరుప్పావై పశుర పఠనం, విష్ణు సహస్రనామ పారాయణలతో వైష్ణవాలయాల్లో సందడి నెలకొంది. పాతఊరు రుక్మిణిసత్యభామా సమేత వరద గోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం దధి మథనోత్సవం, అవబృథ స్నానం నిర్వహించారు. రాత్రి కల్యాణ ఉత్సవమూర్తులకు శయనోత్సవం, పర్యాంక సేవ అనంతరం అర్చకులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, అనంతగోపాల్ గర్భాదాన కాండ పఠించి చోర సంవాదాన్ని భక్తులకు వివరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పండగ వేళ.. ఆలయాల కళ

తాళ్లపూడి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ పురస్కరించుకొని శుక్రవారం తాళ్లపూడి మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక, పెద్దేవం తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి, శివుడు, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

19 నుంచి సౌర యాగం

తాళ్లపూడి: మాఘమాసం పురస్కరించుకొని మండలంలోని ప్రక్కిలంకలో 19 నుంచి ఫిబ్రవరి 22 వరకు సౌరయాగం నిర్వహించనున్నట్లు అర్చకుడు కొవ్వలి విశ్వనాథశర్మ తెలిపారు. నెల రోజుల పాటు సౌరయాగం, సౌరహోమం, గోపూజ, స్వామివారికి పుష్పాలతో అలంకరణ, రథం ఊరేగింపు, సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణం జరుగుతుందని వివరించారు.

దూరప్రాంత సర్వీసుల్లో తిరుగు ప్రయాణాలు మొదలు

వి.ఎల్.పురం: పండగ అనంతరం శుక్రవారం సాయంత్రం నుంచి దూరప్రాంతాలకు ప్రయాణాలు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ సర్వీసులతోపాటు రెండు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులు బయలుదేరినట్లు డిపో అధికారులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌కు మరో నాలుగు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ, విశాఖపట్నం తదితర దూరప్రాంతాలకు మాత్రం ప్రస్తుతం తిరుగు ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉందని, షెడ్యూల్ సర్వీసులనే నడిపామని, శనివారం నుంచి తిరుగు ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. భోగి పండగ రోజు వరకు ఇక్కడి ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడగా సంక్రాంతి రోజున మాత్రం వెలవెలబోయింది. ఇప్పుడు దూరప్రాంత సర్వీసుల్లో కొంచెం రద్దీ మొదలుకాగా ఉమ్మడి జిల్లా పరిధిలో తిరిగే లోకల్ సర్వీసుల్లో మాత్రం ఇంకా మొదలు కాలేదు. శనివారం సాయంత్రం నుంచి లోకల్ సర్వీసుల్లో కూడా రద్దీ మొదలయ్యే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోకి వస్తున్న ప్రయాణికులు

ప్రతి ఇంటా సంక్రాంతి

కొవ్వూరు పట్టణం, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: తెలుగుదనానికి ప్రతిరూపమైన సంక్రాంతి, కనుమ పండుగలను కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. సంక్రాంతి రోజు గురువారం ఆలయాలను దర్శించుకుని కలసి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. కనుమ రోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఇంటి ముందు తెలుగుదనం, ప్రకృతి ఉట్టి పడేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. కొంతమంది సాయంత్రం తిరుగు ప్రయాణాలతో రైల్వే స్టేషన్, బస్టాండుల వద్ద ప్రయాణాల రద్దీ కనిపించింది. ● ఉండ్రాజవరం, చివటం, పసలపూడి తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేలివెన్నులో శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, బంధు, మిత్రులు, ప్రజలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సెట్టింగ్ ఆకట్టుకుంది.

గౌరీపట్నంలో విజేతలకు నగదు అందజేస్తున్న పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తదితరులు

ముగ్గుల పోటీల్లో విజేతలకు బంగారం

గోపాలపురం: వేళ్లచింతలగూడెంలో ఆర్అండ్ఎం ఫౌండేషన్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ద్వారకాతిరుమలకు చెందిన కీర్తన, వేళ్లచింతలగూడేనికి చెందిన వైష్ణవి, గోపాలపురానికి చెందిన మంగ వరుస స్థానాలు సాధించగా 6, 5, 3 గ్రాములు చొప్పున బంగారాన్ని ఎమ్మెల్యే వెంకటరాజు, ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఛైర్మన్ ఘంటా మధుకృష్ణ చేతుల మీదుగా బహుమతిగా అందజేశారు.

చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో..

దేవరపల్లి: చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో జనసేన నాయకురాలు దిరిసిన ఫాతిమారాణి శుక్రవారం గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం సమీపంలో ఉన్న ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గౌరీపట్నం, కొండగూడెం గ్రామాల నుంచి సుమారు 76 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలు నాగజ్యోతి, అనుదీప్తి, ప్రసన్నలకు వరుసగా రూ.10 వేలు, రూ.7,500, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులను పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఎస్.జాన్ పీటర్ చేతుల మీదుగా అందజేశారు. మరో పది మంది మహిళలకు ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున, పాల్గొన్న వారందరికీ రూ.500 చొప్పున అందజేశారు.

వేలివెన్నులో సంక్రాంతి సంబరాల్లో శేషారావు, బంధుమిత్రులు

ముగ్గుల పోటీలో విజేతకు బంగారం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

నూతన కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి, నాయకులు

క్రమశిక్షణకు మరోపేరు తెదేపా

గోపాలపురం, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మరో పేరు తెదేపా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. వేళ్లచింతలగూడెంలో మండల తెదేపా కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. సామాన్య ప్రజలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు అప్పగించడం, ప్రస్తుతం ఎమ్మెల్యే కావడం నిదర్శనమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని తెదేపా గుర్తిస్తుందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొర్లపాటి రాము, ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఛైర్మన్ ఘంటా మధుకృష్ణ, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, నాయకులు యిల్లూరి రాము, అన్నవరం, వేముల నాగరాజు, కాకర్ల జగదీష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ అధరహో

రికార్డు స్థాయి పెరుగుదల

న్యూస్‌టుడే – ఉండ్రాజవరం

బ్రాయిలర్ కోళ్ల ధర రికార్డు స్థాయికి చేరింది. ఎన్నడూ లేని విధంగా రైతు వద్ద లోడు కిలో ధర రూ.153 పలుకుతోంది. మొన్నటి వరకు కిలో రూ.86 ఉండటంతో నష్టాలు చవిచూశారు. కిలో రూ.105 వస్తే పెట్టుబడి గిట్టుబాటుగా ప్రస్తుత ధర లాభదాయకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శీతాకాలం కావటంతో బ్రాయిలర్ కోళ్ల పెంపకాన్ని మమ్మరంగా చేపట్టారు. ఒక కోడి రెండున్నర కిలోల చొప్పున దిగుబడి వస్తుంది. చిల్లర మార్కెట్లో బ్రాయిలర్ స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.300 వరకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, కొవ్వూరు ప్రాంతాల్లో బ్రాయిలర్ కోళ్ల పెంపకంతో పలువురు రైతులు, వ్యాపారులు, కూలీలు ఉపాధి పొందుతున్నారు. సుమారు 35 గ్రామాల్లో బ్రాయిలర్ షెడ్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో రోజుకు 50 వేల బ్రాయిలర్ కోళ్ల వరకు ఉత్పత్తి చేస్తున్నారు.

వెలగదుర్రులోని ఒక ఫారంలో కోళ్లు

సంక్రాంతి, మేడారం ఉత్సవాలతో గిరాకీ..

ప్రస్తుతం సంక్రాంతి పురస్కరించుకుని ఈ ప్రాంతంలో బంధు, మిత్రుల రాక కారణంగా చికెన్ వినియోగం పెరిగింది. మరో పది రోజులపాటు ధర బాగుంటుందని రైతులు చెబుతున్నారు. తెలంగాణలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా బ్రాయిలర్ కోళ్ల ఎగుమతులు పెరిగాయి. రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు తదితర పట్టణాల్లోని రెస్టారెంట్లలో సైతం చికెన్ వినియోగం పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

మేత పెట్టుబడి ఇలా..

ప్రస్తుతం బ్రాయిలర్ పిల్ల రూ. 22 ఉంది. మేత టన్ను ధర రూ. 49 వేలు పలుకుతోంది. బ్రాయిలర్ కోడి 50 రోజులకు తయారవుతుంది. ఈ వ్యవధిలో 4 కిలోల మేత తింటుంది. తద్వారా 2 కిలోల దిగుబడి (బరువు) వస్తుంది. పలువురు కంపెనీల ద్వారా పెంచిన కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. పెద్ద ధర రూ. వెయ్యి నుంచి రూ.1,500కు చేరింది. దాణాగా మొక్కజొన్న, తవుడు వినియోగిస్తున్నారు. సాధారణంగా 50 రోజుల వ్యవధిలో కోడి పెంపకానికి రూ.105 పెట్టుబడి అవుతుంది. తాడిపర్రు, వెలగదుర్రు, ఉండ్రాజవరం, సత్యవాడ, పెరవలి, నిడదవోలు పరిధిలో బ్రాయిలర్ పెంపకం ఇటీవల పెరిగింది. ఈ స్థాయిలో ధర ఎప్పుడూ పెరగలేదని ఉండ్రాజవరం రైతు ఎం.శేఖర్ అన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసన్న గ్రామోత్సవం

కోరుకొండ: ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామివారి గ్రామోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. గురువారం పశ్చిమ గోనగూడెం, శుక్రవారం రాత్రి జంబూపట్నంలో వుల్లి బుజ్జిబాబు స్వగృహం వద్ద అర్చన, విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలు ముగియడంతో ఏటా సంప్రదాయబద్ధంగా ఈ రెండు గ్రామాలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆయా గ్రామాలకు తీసుకెళ్తారు. గిరిధరాచార్యులు, సంతోష్, వంశీ, అర్చక స్వాములు పాల్గొన్నారు.

స్నేహితులతో దర్శకుడు వినాయక్ సందడి

చాగల్లు, న్యూస్‌టుడే: సంక్రాంతి రోజున స్వగ్రామంలో స్నేహితులతో గడపడం ఆనందంగా ఉందని ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా చాగల్లు విచ్చేసిన ఆయన తన స్నేహితులు, గ్రామస్థులతో 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా విశేషాలను పంచుకున్నారు. రానున్న కాలంలో మెగాస్టార్ చిరంజీవి మరిన్ని హిట్‌లతో ప్రజలను వినోదాన్ని అందించాలని ఆకాంక్షించారు.

డిమోన్‌పవన్‌కు సత్కారం

పవన్‌ను సత్కరిస్తున్న కృష్ణమూర్తి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: బిగ్‌బాస్ సీజన్ 9 విభాగంలో పాల్గొని మూడో స్థానం కైవసం చేసుకున్న పాలంగికి చెందిన డెమోన్‌పవన్‌ను ఉండ్రాజవరంలో జనసేన నాయకులు, యువకులు, ప్లీడరు గుమస్తాల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కటకం కృష్ణమూర్తి తదితరులు శుక్రవారం సత్కరించారు. జనసేన నాయకుడు బుద్దాల దుర్గాప్రసాదు, యువతీ, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

220 రకాల పిండివంటలతో విందు

సంక్రాంతి సందర్భంగా పెరవలికి చెందిన అగర్తి వెంకటకృష్ణారావు, స్వరూపారాణి దంపతులు తమ అల్లుడికి 220 రకాల పిండివంటలతో ఏర్పాటు చేసిన విందు ఆకట్టుకుంది. ఇటీవల కుమార్తె భాగ్యశ్రీలక్ష్మిని బొడ్డు భార్గవ్‌కు ఇచ్చి వివాహం చేశారు. తొలి పండగకు పిలిచి రకరకాల పిండివంటలు, మిఠాయితో విందు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, పెరవలి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చాగల్లు, న్యూస్‌టుడే: ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పోశయ్య గాయలపాలయ్యారు. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కె.సత్యకుమార్ తన తండ్రి పోశయ్యతో గురువారం మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం బయలుదేరారు. ధర్మవరం గ్రామ శివారు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోశయ్య గాయాలపాలవ్వగా రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అందిన వివరాల మేరకు, సత్యకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ భగవన్‌దాస్ తెలిపారు.

బరి వద్ద యువకుల ఘర్షణ

ఘర్షణ పడుతున్న యువకులు

నల్లజర్ల: నల్లజర్లలో కోడి పందేల బరి సమీపంలో గురువారం యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. యువకులంతా గుంపులుగా చేరి ఒకరినొకరు బాహాబాహీకి దిగడంతో అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. నల్లజర్ల పోలీసులు రంగప్రవేశం చేసిన యువకులను చెదరగొట్టారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన కడుగూరి వెంకటేష్, నల్లజర్లకు చెందిన కలపాల బాబును అదుపులోకి తీసుకున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కత్తులు కట్టి కోడి పందేలు నిర్వహిస్తున్న బరులపై దాడులు చేసినట్లు పట్టణ, గ్రామీణ పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ పి.విశ్వం చెప్పిన వివరాల ప్రకారం పట్టణంలో పందేలు జరిగే స్థావరంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లు, రెండు కత్తులతో పాటు రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామీణ ఎస్ఐ కె.శ్రీహరి మాట్లాడుతూ పంగిడి, పశివేదలలో కోడి పందేలు నిర్వహిస్తుండగా దాడి చేశామన్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఒక కోడి, రెండు కత్తులు, రూ.3,060 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జూదాల్లో 25 మందిపై కేసులు

తాళ్లపూడి: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని తాళ్లపూడి మండలంలో జూదాలు నిర్వహించిన 25 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కోడి పందేలకు సంబంధించి 6, గుండాట 3, ఇతర జూదంపై 3 కేసులు నమోదు చేశామన్నారు. ఆరు కత్తులు, ఆరు కోళ్లు, రూ.12,300 స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

నిడదవోలులో నలుగురు..

నిడదవోలు: వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తుండగా దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మండలంలోని ఆయా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి పుంజు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోడి పందేలు.. రూ.కోట్లలో లావాదేవీలు

తాళ్లపూడి: కోడిపందేల వద్ద జనం

కొవ్వూరు పట్టణం, నిడదవోలు, గోపాలపురం, ఉండ్రాజవరం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: పండుగ సంప్రదాయం పేరుతో కోళ్లతో కత్తులు దూయించారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో కోడి పందేలు, బరుల వద్ద గుండాట, ఇతర జూదాలు యథేచ్ఛగా సాగాయి. మద్యం విక్రయాలు పెద్దఎత్తున సాగాయి. కొన్నిచోట్ల రాత్రి వేళ ఫ్లడ్ వెలుగుల్లోనూ కోడి పందేలు నిర్వహించారు. పలు బరుల వద్ద బౌన్సర్లను ఏర్పాటు చేశారు. రహదారి పక్కనే బరుల వల్ల ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ● కొవ్వూరులోని బరిలో కోడిపందేలను తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య కొద్దిసేపు తిలకించారు. ● నిడదవోలు మండలం విజ్జేశ్వరం బరి వద్ద శుక్రవారం వివాదం చోటుచేసుకోవడంతో పోలీసులు సర్దుబాటు చేశారు. పలు బరులను కూటమి, వైకాపా నాయకులు కొందరు కలిసి నిర్వహించారు. ● గోపాలపురం, దొండపూడిలో జరిగిన కోడి పందేల బరుల్లో ఎక్కువ గెలుచుకున్న వారికి బుల్లెట్లు బహుమతిగా ఇచ్చారు. ● తాళ్లపూడి మండలం మలకపల్లిలో పండుగ మూడు రోజుల్లో అత్యధిక పందేలు గెలిచిన వారికి కారు, బుల్లెట్లను బహుమతులుగా అందించారు. ● గోపాలపురం, నల్లజర్ల, ఉండ్రాజవరం మండలాల్లో నిర్వహించిన కోడి పందేలు, జూదాల్లో కోట్లాది రూపాయలు చేతులుమారాయి.

విజ్జేశ్వరం బరి వద్ద ఘర్షణ

ఉండ్రాజవరంలో బరివద్ద ఎన్నారై యువతులు

నేత్ర దానం

ఉప్పులూరి సుబ్బారావు (పాత చిత్రం)

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తాను మరణించినా తన కళ్లు మరొకరికి వెలుగునివ్వాలన్న ఆయన సంకల్పాన్ని భార్య, కుటుంబ సభ్యులు నెరవేర్చారు. కొవ్వూరు మండలం తోగుమ్మికి చెందిన ఉప్పులూరి సుబ్బారావు బుధవారం మృతిచెందగా ఆయన నేత్రాలను దానం చేశారు. నిడదవోలులోని ఎల్వీ ప్రసాద్ నేత్రాలయానికి సమాచారం ఇవ్వగా నిపుణులు వచ్చి సుబ్బారావు కార్నియాలను సేకరించారు. కంటి చూపు ప్రసాదించాలన్న సుబ్బారావు సంకల్పం, ఆయన కోరికను నెరవేర్చిన కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

'క్రిస్టియన్ మైనార్టీలపై దాడులను సహించం'

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణ పేరుతో క్రిస్టియన్ మైనార్టీలపై దాడులు చేస్తే సహించబోమని క్రిస్టియన్‌సేటా సంఘ్ జాతీయ కన్వీనరు బొంతా శ్యామ్‌రవిప్రకాష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఘజియాబాద్‌లో హిందూ రక్షదళ్ చీఫ్ పింకిచౌదరి కత్తులు పంపిణీ చేయడం, దానికి మద్దతుగా యతి నర్సింహానంద్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి నర్సింహానంద్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అరచేతిలో తపాలా సేవలు

– న్యూస్‌టుడే, దేవీచౌక్

తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆ శాఖ సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. తాము అందించే సేవలన్నీ స్మార్ట్ ఫోన్ ద్వారా ఉపయోగించుకునేలా 'డాక్ సేవ' పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా స్పీడ్ పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను సకాలంలో ట్రాక్ చేసుకోవచ్చు. దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత చార్జీ అవుతుందో తక్షణమే లెక్కించవచ్చని, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సేవల కోసం గంటల తరబడి క్యూలైన్లో నిలబడే అవసరం లేకుండా డాక్ సేవ యాప్ ద్వారానే పూర్తిచేయవచ్చని, జీపీఎస్ సహాయంతో సమీప తపాలా కార్యాలయాల వివరాలు తెలుసుకోవచ్చు రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. చిన్న మొత్తాల పొదుపు ఖాతాలకు ఎంత వస్తుంది, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయాలనే వారికి ఎంత ప్రీమియం పడుతుందో చూసుకోవచ్చు. కార్పొరేట్ వినియోగదారుల కోసం ప్రత్యేక విభాగం ఈ యాప్‌లో ఉంది.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవడం చాల సులభం. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లో డాక్ సేవ యాప్ అని టైప్ చేసి అక్కడ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో ఉన్న అధికారిక యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఓపెన్ చేసి మొబైల్ నంబరు లేదా ఈ మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వాలి. ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యాక సేవలను వినియోగించుకోవచ్చు.

డివైడర్‌ను ఢీకొని దేవరపల్లి ఎంపీపీ సోదరుడి మృతి

కుప్పాల అప్పారావు (పాత చిత్రం)

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు సోదరుడు కుప్పాల అప్పారావు (55) గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ డైమండ్ జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై దేవరపల్లి వస్తుండగా మంచు ప్రభావంతో డివైడర్‌ను గమనించక ఢీకొట్టారు. తల, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం దేవరపల్లి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీపీ దుర్గారావును జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, మండలంలోని వైకాపా నాయకులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఆయనను శుక్రవారం పరామర్శించి అప్పారావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

తిరిగినంత కాలం నడిపారు.. మూలన పెట్టారు

న్యూస్‌టుడే – కొవ్వూరు పట్టణం

అధికార యంత్రాంగం వినియోగించిన వాహనాలు మరమ్మతులకు చేరడంతో పక్కన పెట్టేశారు. సంవత్సరాల తరబడి వదిలేయడంతో ఎందుకూ పనికిరాని స్థితికి చేరాయి. ఎండకు ఎండి.. వానకు తడిసి చివరికి మట్టిలో కలిసిపోతున్నాయి. లక్షలు వెచ్చించి కొన్న వీటిని చిన్నపాటి మరమ్మతులు సైతం చేయక మూలకు తోసేశారు. కాలక్రమంలో ఆయా శాఖల అధికారులు కొత్త వాహనాలను కొనుగోలు చేయడం, అద్దెకు తీసుకోవడంతో పాతవి మరుగున పడ్డాయి. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయాల ప్రాంగణాల్లో జీపులు (ప్రభుత్వ వాహనాలు) దుస్థితికి చేరాయి.

మూలకు చేరిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వాహనం

25 సంవత్సరాలుగా...

★ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని రోడ్ రోలర్ శిథిల స్థితికి చేరి 25 ఏళ్లయింది. ఇపుడు నూతన రోలర్లు రావడంతో దీనికి పక్కకు నెట్టారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్యాలయాలు నడుస్తున్న జడ్పీ స్టోర్ షెడ్ ఉన్న ప్రాంగణంలో దీనిని పెట్టారు.

★ అదే ప్రాంగణంలో పంచాయతీరాజ్ జీపు శిథిలమై కనిపిస్తోంది. ఆ శాఖ ద్వారా నీటి సరఫరా విభాగానికి చేరిన మరో వాహనం కూడా అలాగే పాడై మూలకు చేరింది.

వేలం వేయక.. ధ్వంసం చేయక..

ఎందుకు పనికి రాని వీటికి వేలంపాట నిర్వహించడమో పూర్తిగా ధ్వంసం చేసి స్థలాన్ని శుభ్రం చేయడమో చేయాల్సి ఉంది. శిథిలమైన వాహనాలు, చుట్టూ పిచ్చిమొక్కలతో శుభ్రత లేక ఆయా ప్రాంగణాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయి. ఆ కార్యాలయ ప్రాంగణాల్లో ఏదైనా కార్యక్రమాలు నిర్వహించినపుడు వీటిని అటూ ఇటూ మార్చడం మినహా వినియోగంలోకి తెచ్చే యత్నాలు మృగ్యమయ్యాయి. ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

పండగ వేళ నిరాశ్రయులకు భోజనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : స్థానిక స్వర్ణాంధ్రా సేవా సంస్థ నిర్వాహకులు పండగ వేళ కూడా సేవలందించారు. పలు కారణాలతో నగరానికి వలస వచ్చిన కూలీలు, నిరాశ్రయులు ఇబ్బంది పడకుండా సమయానికింత ఆహారం సమకూర్చారు. పండగ కావడంతో చిన్నపాటి హోటల్స్ మూతపడడంతో అక్కడి వారికి సైతం భోజనం అందించామని సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. పండగ సమయంలో సేవలకు సహకారం అందించిన సిబ్బంది వీర్రాజు, చిట్టెమ్మ, రమణమ్మ, తదితరులను సత్కరించి అభినందించారు.

తెల్లారినా వీడని మంచు తెర

నిడదవోలు ప్రాంతంలో శుక్రవారం ఉదయం 10 గంటలయినా మంచు తెర వీడలేదు. ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తెల్లవారు జామున ద్విచక్ర వాహన చోదకులు పడరాని పాట్లు పడ్డారు. లైట్లు వేసుకుని వెళ్లినా దారి కనిపించని పరిస్థితి ఎదుర్కొన్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

(c) eenadu

మండపేట

•మండపేట • అనపర్తి

అలరించిన ఆటల పోటీలు

బుడగలు ఊదే పోటీలో పాల్గొన్న యువతులు

రంగంపేట, న్యూస్‌టుడే: కులమతాల తారతమ్యాలు పక్కనబెట్టి చిన్నారులు, యువకులు, యువతులు, వృద్ధులు ఇలా వయస్సు ఆధారంగా మర్రిపూడిలో శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామస్థులు జూద క్రీడల వైపు మొగ్గుచూపకుండా సంప్రదాయ క్రీడా పోటీలను దాదాపు పదేళ్లుగా విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టా సోమన్న చౌదరి నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి పీఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 90వ జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం నుంచి మూడు రోజులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం తమిళనాడు తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం ఆరు గంటలకు తితిదే వేదపండితులతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. శని, ఆది, సోమవారాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఉ॥ 10 - మ॥ 1
ద్రాక్షారామ : 80085 74192
ద్వారపూడి : 91543 96553

మురుగు పారుదలకు చర్యలు..

సమస్య: మండపేట మండలం అర్తమూరు గ్రామం నారాయణరెడ్డివారివీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. – ఎస్.కిషోర్, అర్తమూరు

పరిష్కారం: సమస్యను పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌కు తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగు పారేలా చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పట్టాలెక్కని ప్రత్యామ్నాయ మార్గం

• మండపేటలో తొలగని ట్రాఫిక్ చిక్కులు

న్యూస్‌టుడే, మండపేట

మండపేట పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం సమయాలతో పాటు పండుగ వేళల్లో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సంక్రాంతి నేపథ్యంలో పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల్లో ఎటు నుంచి ఎటు వెళ్లాలన్నా రెండు గంటలకుపైగా నడిరోడ్డుపై ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇలా ఉంటే సమీప భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. రాజమహేంద్రవరం, విశాఖపట్నం, కాకినాడ నగరాల నుంచి మండపేట పట్టణంతో పాటు కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని గ్రామాలకు చేరుకోవాలంటే మండపేట మీదుగానే చేరుకోవాలి. సమీప మండలాల్లోని గ్రామాలకు ఇదే ప్రధాన మార్గంగా కావడంతో వాహనదారులు మండపేట మీదుగానే ఆయా ప్రయాణించాలి. ఆయా గ్రామాల నుంచి రాజమహేంద్రవరం, రామచంద్రపురంలోని కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ఆయా విద్యా సంస్థల బస్సులు కూడా పట్టణంలోని ప్రధాన మార్గాల్లోనే రాకపోకలు సాగించాలి. స్థానికంగా రైస్‌మిల్లులు, ఇటుకబట్టీలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలతో మండపేట పట్టణం నిత్యం రద్దీగా మారుతోంది.

రాజరత్న కూడలిలో నిలిచిన వాహనాలు

బైపాస్ పూర్తయితే..

మండపేట పట్టణంలోకి రావాల్సిన వాహనాలను మాత్రమే అనుమతించి కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాలకు వెళ్లాల్సిన వాహనాలను నేరుగా మారేడుబాక బైపాస్ రోడ్డు మీదుగా కపిలేశ్వరపురం రోడ్డులోకి మళ్లించే అవకాశం ఏర్పడుతుంది. మారేడుబాక గ్రామానికి కూడా ప్రధాన రహదారితో అనుసంధానం ఏర్పడి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే మండపేట రావాల్సిన అవసరం ఉండదు.

మారేడుబాక బైపాస్..

పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన కెనాల్‌రోడ్డులోని మారేడుబాకను కలుపుతూ నిర్మించే వంతెన, రహదారి పనులు మళ్లీ పట్టాలెక్కించాల్సిన అవసరం కనిపిస్తోంది. గతంలో తెదేపా హయాంలోనే దీనికి ప్రతిపాదనలు వచ్చినా ఆ తరవాత వచ్చిన ప్రభుత్వం విస్మరించింది. దీంతో మళ్లీ ఈ రోడ్డుకు నిధులు కేటాయించి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అంతకుముందు కెనాల్‌రోడ్డులో మారేడుబాకను కలిపేందుకు నిర్మించిన వంతెన స్థంభాల వరకు మాత్రమే వచ్చాయి. నిధుల కొరత కారణంగా నిర్మాణం ఇంకా పూర్తిచేయలేదు. రెండు దశాబ్దాల క్రితమే పంటకాలువలపై నీటి పారుదల శాఖ నిధులతో వంతెనల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీనిపై జల వనరుల శాఖ అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో పనులను ర.భ. శాఖ చేపట్టాల్సి వచ్చింది. ప్రస్తుతం నిధుల కొరతతో పనుల్లో కదలిక కొరవడింది.

సీఎంకు ప్రతిపాదనలు..

ఇటీవల రాయవరం మండలంలో పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గంలోని పలు రహదారుల నిర్మాణాలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వినతిపత్రం అందించారు. ప్రతిపాదనల్లో మారేడుబాక బైపాస్‌రోడ్డు, తాపేశ్వరం బైపాస్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి.
– సూర్యనారాయణ, డీఈ, ర.భ. శాఖ

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా అనపర్తి పాతవూరులోని బాపనమ్మ తల్లి ఆలయం వద్ద వృద్ధులు, మహిళలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, గౌరు జనార్దన్‌రెడ్డి గురువారం దుస్తులు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. అనపర్తిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు, దుస్తులు పంపిణీచేశారు.

నేడు రథోత్సవం

కోరుకొండ, న్యూస్‌టుడే: శ్రీరంగపట్నంలో శనివారం రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. దేవీ గౌరీ శంకరుల రథోత్సవం, గౌరీ శంకరుల రథోత్సవం వేర్వేరు ప్రాంతాల నుంచి రెండు రథాలపైనా వైభవంగా జరిపించనున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఐజీ రవికృష్ణకు సత్కారం

గోకవరం: చాలా ఏళ్ల తరువాత సంక్రాంతికి స్వగ్రామం రావడం చాలా సంతోషంగా ఉందని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. స్వగ్రామమైన గోకవరం మండలం కామరాజుపేటకు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు సత్కరించారు.

బలభద్రపురంలో సత్యవాఖ్య పండగలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురంలో ఐ ఫర్ గాడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన సత్యవాఖ్య పండగ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. క్రైస్తవులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దత్తుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ

బాబాను దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: పెద్ద పండగ సంకాంత్రి ఈ ఏడాది గురువారం వచ్చింది. శిర్డీ సాయికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో బలభద్రపురంలోని ఆంధ్రా శిర్డీ సాయిబాబా ఆలయం భక్తులతో రద్దీగా మారింది. వేకువజామునే బాబాకు క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం హారతి, పూజల తర్వాత అన్నప్రసాదం అందించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడా భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు.

సంక్రాంతి వేడుకలు

మేళతాళాలతో పేరంటాళ్లమ్మ సారె ఊరేగింపు

మండపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ పండుగలు మండపేటలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులతో మూడు రోజుల పాటు ఆనందోత్సాహాలతో గడిపారు. ఏడిదరోడ్డులోని పాపమ్మ పేరంటాళ్ల అమ్మవారి తీర్థం వైభవంగా సాగింది. కొప్పిరెడ్డివారి పుట్టింటి నుంచి పాపమ్మ పేరంటాళ్లమ్మ ఆలయానికి సారె తీసుకువెళ్లి సమర్పించారు. మేళతాళాలతో సారె ఊరేగింపు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించి పూజలుచేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలు పార్టీల నాయకులు మొక్కులు సమర్పించారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

జోరుగా పందేలు.. గుండాటలు

మండపేటలో గుండాట వద్ద గుమిగూడిన యువకులు

మండపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో మండపేట గొల్లపుంత సమీపంలో కోడిపందేల శిబిరాలు జోరుగా నిర్వహించారు. బరులను ధ్వంసం చేసి.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించిన పోలీసులు పండుగ మూడు రోజులూ కనిపించలేదు. దీంతో నిర్వాహకులు పందేలు, గుండాట లాంటి జూదాలను నిరాటంకంగా కొనసాగించారు. ఆయా శిబిరాల్లో రూ.లక్షలు చేతులు మారాయి. జూదంలో పాల్గొన్న పలువురు జేబులు ఖాళీ చేసుకుని నిరాశగా తిరుగుముఖం పట్టారు.

18న ధ్రువీకరణ పత్రాల మంజూరు

బి.నగర్: మదర్సా జామియా ఫాతిమా జనాతుల్ ఇస్లాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఖురాన్-హఫీజ్ పూర్తి చేసిన బాలబాలికలకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు నిర్వాహకులు ఫాతిమా బవాతుల్, మౌలానా గులాం మొహిద్దీన్ రజ్వీ సాహెబ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జేకే గార్డెన్స్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సంబంధిత ధ్రువ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

తొలి సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషి

పెదపూడి, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని పెదపూడి మండలం కరకుదురు అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రావు కోరారు. గురువారం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామపెద్దలు, స్థానిక ప్రజలతో నిర్వహించిన తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పుట్టిపెరిగి ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఇతర దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికే అసోసియేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని, గ్రామంలో అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సవరపు అజయ్, యండ్రు వీర్రాజుచౌదరి, చిక్కాల రమేష్, బెజ్జబరపు అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుటుంబ సమ్మేళనం

పండగకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం సోమేశ్వరంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి విచ్చేసిన కామిశెట్టి వంశీయులు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. సుమారు 150 మంది బుధవారం గ్రామానికి చేరుకుని భోగి సంబరాలకు కలిసికట్టుగా హాజరయ్యారు. వీరి రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

వెంకటాపురంలో జబర్దస్త్ బృందం సందడి

జబర్దస్త్ బృందం, తెదేపా నేత ఆళ్ల గోవిందు

రంగంపేట, న్యూస్‌టుడే: వెంకటాపురంలో జబర్దస్త్ బృందం సందడి చేసింది. సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం డైరెక్టరు బోడెం శ్రీను నివాసంలోని కార్యక్రమానికి జబర్దస్త్ నటులు హైపర్ ఆది, శాంతిస్వరూప్, అజార్, సన్నీ హాజరయ్యారు. తెదేపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు కొద్దిసేపు వారితో ముచ్చటించారు.

వైభవంగా గనిపోతురాజుస్వామి తీర్థ మహోత్సవం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం కేశవరం గ్రామంలో ప్రసిద్ధిచెందిన గనిపోతురాజు స్వామి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కనుమ రోజు ప్రారంభమైన 30 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ ఆళ్ల రాజబాబు, ఈవో వుండమట్ల రాజేష్ వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వుండమట్ల రామకృష్ణ, కొను సత్యనారాయణ, సత్యవతి మంగ, పిల్లి భవాని, దాసరి సుబ్బారావు, వుండమట్ల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మెర్నిపాడు గ్రామదేవత ముత్యాలమ్మ..

మండపేట మండలం మెర్నిపాడు గ్రామదేవత ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. సర్పంచి గారపాటి సౌజన్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ సభ్యులు గారపాటి అశోక్‌కుమార్, బొజ్జా కృష్ణమ్మ, మద్దిపాటి వెంకటరావు, యరమాటి సతీష్, గోపీచంద్, మానేపల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడిదలో చింతాలమ్మ..

ఏడిద గ్రామదేవతగా పేరుగాంచిన చింతాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవంలో వివిధ గ్రామాల ప్రజలు దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకొన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షణ వీరరాజు, గొడవర్తి ఎర్రయ్య, మేకా జేజిబాబు, యడపోతిన బేబి, బి.శ్రీను, పలివెల సుబ్బారావు, చిలుకూరి కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో గనిపోతురాజు స్వామి

రంగంపేటలో..

రంగంపేట: రంగంపేట మండలం సింగంపల్లిలో ప్రసిద్ధిచెందిన వీరలమ్మ తల్లి తీర్థ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు గ్రామాల మధ్య జరిగిన మహోత్సవానికి సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులను అలరించేందుకు నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వీరుళ్లమ్మ జాతరకు పోటెత్తిన జనం

వీరుళ్లమ్మతల్లి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలిచే అనపర్తి గ్రామదేవత వీరుళ్లమ్మ తల్లి జాతర గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేకపూజలు చేసి గరగను శిరస్సున ధరించి వేడుకలను ప్రారంభించారు. జాతర తెల్లవారుజాము వరకు కోలాహలంగా కొనసాగింది. ఆలయంతో పాటు మెయిన్‌రోడ్డు, ప్రధాన వీధుల్లో ఏర్పాటుచేసిన విద్యుత్తు దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతరను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో కెనాల్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు కిక్కిరిసిపోయాయి. పలువురు చిన్నారులతో కలిసి ఆలయ ప్రాంగణంలో దివిటీలు, కాగడాలు వెలిగించారు. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీజే వద్ద యువకులు కేరింతలు కొట్టారు. అనపర్తి మెయిన్‌రోడ్డు రామాలయం వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్, కొలంబస్, చిన్నారులు, పెద్దలను ఆకర్షించాయి. బాణసంచా పోటీల్లో మిరమిట్లు గొలిపేలా కాల్చారు. రెండో రోజు శుక్రవారం అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎగ్జిబిషన్ వద్ద జన సందడి

డీజే వద్ద కేరింతలు కొడుతున్న యువకులు

జిల్లా బీసీ సంఘం యువజన అధ్యక్షుడిగా వాసిరెడ్డి

బిక్కవోలు, న్యూస్‌టుడే: జిల్లా బీసీ సంఘం యువజన అధ్యక్షుడిగా బిక్కవోలు మండలం ఆరికిరేవులకు చెందిన వాసిరెడ్డి వాసును నియమించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల గోపాలకృష్ణ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

మాజీ ఎమ్మెల్సీ జయంతి వేడుకలు

పెదపూడి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కర రామారావు జయంతిని పెద్దాడ గ్రామంలో గురువారం నిర్వహించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేకు కోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా గంగాధరచౌదరి, తిబిరిశెట్టి గణేష్, పైణ్ణి వీరవెంకట సత్యనారాయణ, బొడ్డు శ్రీను, ప్రత్తిపాటి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరాలపై దాడి: పది మంది అరెస్ట్

రాయవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రం రాయవరం, కూర్మాపురం శివారు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరాలపై గురు, శుక్రవారాల్లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై డి.సురేష్‌బాబు శుక్రవారం మాట్లాడుతూ పండుగ రెండు రోజుల్లో కోడి పందేలు కాస్తున్న పది మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి ఆరు కోళ్లు, రూ.2,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వివరించారు.

గోనెసంచులు దగ్ధం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు కాలువగట్టున పెద్దఎత్తున గోనెసంచులు, చెత్త వేయడంతో ప్రమాదవశాత్తు అవి అంటుకుని మంటలు చెలరేగాయి. వీటిని ఆనుకుని గోదాములు ఉండటంతో స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే అగ్నిమాపక శాఖ అనపర్తి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు.

ఎమ్మెల్యేకు సత్కారం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు అనపర్తిలో హాల్ట్ మంజూరుచేయించిన సందర్భంగా రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని శుక్రవారం పలువురు సత్కరించారు. అనపర్తి, బిక్కవోలు, రాయవరం, మండపేట, రామచంద్రపురం తదితర ప్రాంతాల వ్యాపారులు, ప్రయాణికులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన

ఏవీఏ రోడ్డు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు రాజమహేంద్రవరంలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బొమ్మూరు కూడలిలో ఆటో రిక్షా కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం నిషేధమని స్పష్టం చేశామని, వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని సూచించామన్నారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అవసరంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎంవీఐలు సంపత్‌కుమార్, రవికుమార్, నారాయణ పాల్గొన్నారన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

పోటీలో తలపడుతున్న ఊలపల్లి, కరకుదురు జట్ల క్రీడాకారులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలులో గురువారం ఆహ్వాన వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, డా.రాజీవ్ తొలి మ్యాచ్‌ని ప్రారంభించగా మొత్తం 17 జట్లు పాల్గొంటున్నాయి. పూల్ ఏ గ్రూప్‌లో రామేశ్వరం, బలభద్రపురం, జి.దొంతమూరు, వడిశలేరు గ్రామాలకు చెందిన జట్లు, పూల్ బీలో అనపర్తి, రంగాపురం, గండ్రేడు, కైకవోలు గ్రామాల జట్లు, పూల్ సీలో ఊలపల్లి, కాపవరం, కరకుదురు, పెద్దాడ గ్రామాల జట్లు, పూల్ డీలో ఈలకొలను, ఆరికిరేవుల, బిక్కవోలు, అనపర్తి బీ, ఊలపల్లి బీ జట్లు తలపడుతున్నాయి. పోటీలను రాత్రి, పగలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఊలపల్లి, పెద్దాడ, కైకవోలు, అనపర్తి జట్లు క్వార్టర్ ఫైనల్ చేరాయి. కార్యక్రమంలో కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, జి.త్రిమూర్తులు, పాలచర్ల శివప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

షటిల్ విజేతలకు బహుమతులు

మండపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఈనెల 14, 15, 16 తేదీల్లో కృష్ణకల్యాణినగర్‌లో నిర్వహించిన జూనియర్స్ షటిల్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 14 సంవత్సరాలలోపు వయసున్న బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గెడా శ్రీనివాస్, విజ్ఞాన్ రాంబాబు, బొబ్బా రామయ్య చౌదరి ఆధ్వర్యంలో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో కార్తిక ప్రథమ, కీర్తన ద్వితీయ బహుమతులు సాధించారు. డబుల్స్‌లో కార్తిక ప్రథమ, త్రిద ద్వితీయ బహుమతి అందుకున్నారు. బాలుర సింగిల్స్‌లో పవన్ ప్రథమ, చందు ద్వితీయ బహుమతులు పొందారు. బాలుర డబుల్స్ విభాగంలో చందు, సాయితేజ ప్రథమ బహుమతి, అభిషేక్, పూర్ణసాయి ద్వితీయ బహుమతి పొందారు. వీరికి వల్లూరి గాంధీ, చేకూరి హరిబాబు, నూనె సత్తిబాబు, టి.వి.వెంకటేశ్వరరావు, తదితరులు బహుమతులు అందించారు.

నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకున్న విజేతలు

పందలపాకలో క్రికెట్ టోర్నమెంట్..

బిక్కవోలు: పందలపాకలో క్రికెట్ టోర్నమెంట్‌ను తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పోటీల్లో అయిదు జట్లు పాల్గొంటున్నాయని ఆయన వివరించారు. ఎక్కడో స్థిరపడిన క్రీడాకారులంతా సంక్రాంతిని పురస్కరించుకుని స్వగ్రామం చేరుకుని పోటీలకు దిగడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీల నిర్వాహకుడు చంటి వినయ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు టోర్నమెంట్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, ఇంకా పలువురు నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ

రాయవరం, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తిని చాటాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు కోరారు. శుక్రవారం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అయిదు రోజులుగా నిర్వహిస్తున్న రాయవరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ (ఆర్‌పీఎల్) పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వారు మాట్లాడారు. కాశీవిశ్వేశ్వర ఆలయ కమిటీ ఛైర్మన్ మల్లిడి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కొల్లు రాంబాబు, పడాల కమలారెడ్డి, పారిశ్రామికవేత్త తాడి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. టోర్నీ నిర్వాహకులు మాట్లాడుతూ పది ఓవర్ల పరిమిత క్రికెట్ పోటీల్లో రాయల్ వారియర్స్, డిజర్ట్ ఈగల్స్, డెడ్లీ స్ట్రైకర్స్, జాగ్వార్ 11, వైల్డ్ కింగ్స్ జట్లు తలపడ్డాయన్నారు. తుదిపోరులో రాయల్ వారియర్స్‌పై డిజర్ట్ ఈగల్స్ విజయం సాధించి విజేతగా నిలిచిందన్నారు. విన్నర్స్, రన్నర్స్ బృంద సభ్యులకు నగదు, జ్ఞాపిక, ప్రోత్సాహక ధ్రువీకరణ పత్రాలు అందించారు.

విజేత జట్టుతో ఎంపీపీ వెంకటరమణ, రాంబాబు తదితరులు

(c) eenadu

రాజకీయ కురువృద్ధుడు భీమణ్ణ ఖండ్రే ఇకలేరు

బీదర్, న్యూస్‌టుడే : మాజీ మంత్రి, అఖిల భారత వీరశైవ లింగాయత మహాసభ మాజీ అధ్యక్షుడు భీమణ్ణ ఖండ్రే (102) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. పక్షం రోజులుగా ఆయన వయోసహజ అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. వైద్యుల సూచనతో సోమవారమే బీదర్ సమీప బాల్కిలోని స్వగృహానికి ఆయన చేరుకున్నా.. కోలుకోలేక శుక్రవారం రాత్రి 11 గంటలకు కన్నుమూశారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే వివిధ మఠాల అధిపతులు, స్వామీజీలు బీదర్ చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు సంతాపాలు ప్రకటించారు. రాజకీయంగా ఆయన మచ్చలేని నేతగా పేరొందారు. రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే, బీదర్ ఎంపీ సాగర్ ఖండ్రే తదితరులు ఆయన రాజకీయ వారసులే. ఆయన మృతి బీదర్ జిల్లాతో పాటు కన్నడనాడుకూ ఎంతో లోటని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంతాపం ప్రకటించారు.

మొరాయించిన సిద్ధు హెలికాప్టర్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : తుమకూరులో కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళ్లవలసిన ప్రత్యేక హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం ఎదురు కావడంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రహదారి మార్గంలో బయలుదేరి వెళ్లారు. హెచ్‌ఏఎల్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌ను అధికారులు శుక్రవారం సిద్ధం చేశారు. టేకాఫ్ సమయంలో సాంకేతిక సమస్య ఎదురు కావడంతో భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాన్ని రద్దు చేశారు. జక్కూరు నుంచి రహదారి మార్గంలో ఆయన తుమకూరుకు బయలుదేరి వెళ్లారు.

ఆస్తి కోసం తమ్ముడ్ని కడతేర్చిన అన్న

మండ్య, న్యూస్‌టుడే : ఆస్తి పంపకాలకు సంబంధించి యోగేశ్ (35) అనే వ్యక్తిని అతని అన్న లింగరాజు తన కుమారులతో కలిసి హత్య చేశాడని పోలీస్ అధికారులు వెల్లడించారు. మండ్య తాలూకా మాయప్పనహళ్లి గ్రామంలో యోగేశ్, లింగరాజు మధ్య కొన్నేళ్లుగా ఆస్తి వివాదాలు ఉన్నాయి. గ్రామ పెద్దలు పలుసార్లు రాజీ పంచాయతీ నిర్వహించినా, కొద్ది రోజుల అనంతరం వారు గొడవ పడేవారు. యోగేశ్‌కు వివాహం నిశ్చయం కాగా, ఆయన నివాసంలో నిశ్చితార్థ కార్యక్రమం జరుగుతుండగా తన కుమారులు భరత్, దర్శన్‌లతో కలిసి లింగరాజు అక్కడికి వచ్చాడు. యోగేశ్‌తో గొడవ పెట్టుకుని, ఆయుధాలతో దాడి చేసి ముగ్గురూ పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. మండ్య గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చాముండి కొండపై నిర్మాణాలకు అడ్డుకట్ట

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : చాముండేశ్వరి బెట్టపై ఎటువంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. బెట్టపై నిర్మాణాన్ని చేపట్టేందుకు చాముండేశ్వరి క్షేత్ర అభివృద్ధి ప్రాధికార చర్యలు చేపట్టిందని రాజమాత ప్రమోదాదేవి వేసుకున్న అర్జీని జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారణ చేపట్టారు. ప్రాధికార ఏర్పాటుకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానంలో కేసు కొనసాగుతున్న సమయంలో నిర్మాణాలను ప్రారంభించారని ఆమె తరపు సీనియరు న్యాయవాది జె.సాయి దీపక్ వాదనలు వినిపించారు. కేసు పరిష్కారం అయ్యే వరకు బెట్టపై ఎటువంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

హొసహళ్లి వేడుకల్లో ముప్పు

మండ్య, న్యూస్‌టుడే : హొసహళ్లి గ్రామంలో పశువులను అలంకరించి, నిప్పుల్లో నుంచి దూకించే సమయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. మంటలకు ఎద్దులు భయపడి వాటిని వీక్షించేందుకు వచ్చిన వారిపైకి ఉరికాయి. దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, పలువురు చిన్నపాటి గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. బాధితులను చికిత్స కోసం మండ్యలోని ఆసుపత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

కారాగారంలో బలవన్మరణం

ధార్వాడ, న్యూస్‌టుడే : భార్యను హత్య చేసి జీవిత ఖైదు అనుభవిస్తున్న ఈశ్వరప్ప పూజార్ (45) అనే ఖైదీ ధార్వాడ కారాగారంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదగ జిల్లా లక్ష్మేశ్వర్‌కు చెందిన ఈశ్వరప్పకు న్యాయస్థానం 14 ఏళ్ల శిక్షను విధించగా, ఏడేళ్ల నుంచి ఆయన కారాగారంలో ఉంటున్నాడు. కారాగారంలో నిర్మాణంలో ఉన్న భవంతిలో ఉరి వేసుకుని ఉన్నట్లు శుక్రవారం గుర్తించారు. సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈశ్వర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పొత్తు ధర్మమే ప్రాణప్రదం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రానున్న గ్రేటర్ బెంగళూరు పాలికె (జీబీఏ) ఎన్నికల్లో పొత్తు ధర్మానికి భంగం కలుగకుండా జనతాదళ్ కార్యకర్తలు, నేతలు వ్యవహరించాలని కేంద్ర మంత్రి కుమారస్వామి పిలుపునిచ్చారు. బెంగళూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవేగౌడ నేతృత్వంలో నగర నాయకుల సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ, సమస్యలు ఏమైనా ఎదురైతే బహిరంగ ప్రకటనలు ఇవ్వవద్దని, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

జీబీఏ ఎన్నికల్లో పొత్తుతోనే వెళ్లి కైవశం చేసుకునేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికలను రూపొందించుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. భాజపాతో పొత్తు ఉండదని జరుగుతున్న ప్రచారం వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని ఆరోపించారు. పొత్తులో భాగంగా ఎన్నిసీట్లను భాజపా కేటాయిస్తుందో త్వరలో తేలుతుందని చెప్పారు. 'కుమారస్వామికి మాట్లాడడం ఒక చాపల్యం' అని మంత్రి ప్రియాంక్ ఖర్గే

తండ్రిమాటలు ఆలకిస్తున్న కుమార

చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ 'నాదొక రకం చాపల్యం. మీకు డబ్బు సంపాదించాలనే చాపల్యం. మేము ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, వారి మద్దతు పొందాలనే చాపల్యం. మీకూ, నాకు ఉన్న తేడా అదే' అంటూ బదులిచ్చారు.

రాబడి.. బొటాబొటీ

● ఆదాయం కంటే ఖర్చులే భారం ● అదుపు తప్పిన సిద్ధు లెక్కాచారం

ఈనాడు, బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన 17వ బడ్జెట్ కోసం కసరత్తు ప్రారంభించారు. మార్చి తొలివారంలో బడ్జెట్ సమావేశాలుంటాయని ఆయనే ప్రకటించారు. ఈ సమయంలో ఆర్థికశాఖ గడచిన ఆర్థిక సంవత్సరంలో తొలి మూడు త్రైమాసికాల రాబడిపై చేసిన సమీక్ష సర్కారుకు ఆందోళన కలిగిస్తోంది. చివరి త్రైమాసికానికి మరో 40 రోజులే మిగిలి ఉండగా ఈలోగా గత బడ్జెట్ అంచనాను అందుకోవటం కష్టమనే ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అనుకున్న లక్ష్యాలు చేరుకునే తీరుతామని సీఎం ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● ద్రవ్యలోటు రాష్ట్ర జీడీపీ (జీఎస్‌డీపీ)లో 3 శాతాన్ని మించకూడదని ఆర్థిక బాధ్యత చట్టం చెబుతోంది. డిసెంబరు వరకు రాష్ట్ర రాబడి, వ్యయాలను లెక్కగడితే ద్రవ్యలోటు మొత్తం జీఎస్‌డీజీలో 2.95 శాతంగా నమోదైంది. రాబడి, వ్యయాల మధ్య వ్యత్యాసం రూ. 90,428 కోట్లుగా నమోదు కాగా ఈ తేడా వసూలు చేసే పన్నులు, సెస్‌లు, కేంద్ర జీఎస్‌టీ పరిహారాల కంటే కట్టుబడి వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది. ఒక్క జీఎస్‌టీ స్లాబ్‌ల వల్లనే రూ.19,252 కోట్లను రాష్ట్రం చవిచూసింది. 2025-26 ఏడాది బడ్జెట్‌ను రూ.4.09 లక్షల కోట్లతో ప్రతిపాదించగా ఇందులో రూ.3.11 లక్షల కోట్లను రాష్ట్ర రాబడి నుంచే లెక్క గట్టారు. మూడు త్రైమాసికాల్లో వచ్చింది రూ.2.92 లక్షల కోట్లు మాత్రమే.

అప్పులతో తిప్పలు

ఈ మూడు త్రైమాసికాల్లో రాష్ట్రం బహిరంగ విపణి నుంచి రూ.93 వేల కోట్లను అప్పుగా తెచ్చుకున్నారని ఐసీఆర్ఏ నివేదిక వెల్లడించింది. ఈ మొత్తం గత రెండు ఆర్థిక సంవత్సరాల తొలి మూడు త్రైమాసికాల్లో తెచ్చిన అప్పు కంటే రెండు రెట్లు అధికం. మరో త్రైమాసికం మిగిలి ఉండగా రాష్ట్ర వ్యయాల కోసం ఇంకెంత అప్పు తేవాలో అంచనాకు అందలేదు. ఒక్క డిసెంబరు నెలలోనే రూ.12 వేల కోట్లను అప్పుగా తెచ్చిన సిద్ధరామయ్య మరో రెండు నెలల్లో వచ్చే రాబడిపై ఆధారపడి మరో విడత అప్పును అంచనా వేయాల్సి ఉంది. డిసెంబరు తరహాలోనే మరో రెండు నెలలు రుణాలు తెస్తే మొత్తం ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పు రూ.1.16 లక్షల కోట్లు కాగా ఈ మొత్తం బడ్జెట్‌లో 28 శాతంగా నమోదవుతుంది.

ఒక్క అబ్కారి మినహా

రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయాన్ని చేకూర్చే నాలుగు శాఖల్లో ఒక్క అబ్కారి మినహా మిగిలిన అన్ని శాఖల నుంచి రాబడి తగ్గింది.

ఈసారైనా మిగులు బడ్జెట్ సాధ్యమేనా?

ఇందులో వాణిజ్య పన్నులు గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 16-17 శాతమే ప్రగతి సాధించగా రూ.9 వేల కోట్లు కొరత, మోటారు వాహన పన్నుల్లో రూ.13,500 కోట్లు, ఎక్సైజ్‌లోనూ రూ.5 వేల కోట్లు అంచనా కంటే తక్కువగా వసూలయ్యాయి. రాష్ట్ర రాబడికి కీలకమైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ముద్రణ శాఖలోనూ 65 శాతం మాత్రమే రాబడి సాధ్యమైంది. ఇందుకు కారణంగా కొత్త చట్టాల కారణంగా కావేరి సాఫ్ట్‌వేర్ 2.0 వినియోగదారులకు అందుబాటులోనికి రాకపోవటంతోనే రాబడి తగ్గినట్లు అంచనా వేస్తున్నారు.

రుణాల రామయ్య!

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన ముఖ్యమంత్రి తన రికార్డులు వ్యక్తిగత లబ్ధికే తప్ప రాష్ట్రానికి ఉపయోగపడలేదని విపక్ష నేత ఆర్.అశోక్, భాజపా ఎంపీ లెహర్ సింగ్ ఆరోపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు రూ.1.38 లక్షల కోట్లుగా నమోదవటం, రికార్డు స్థాయిలో అప్పులు తెచ్చిన ముఖ్యమంత్రి తన దృష్టంతా అధికార రక్షణపైనే ఉంచారని ఆరోపించారు. గ్యారంటీ పథకాలతో అదుపు తప్పిన వ్యయం, తగ్గిన రాబడితో రాష్ట్ర ఆర్థికంగా పతనమైనట్లు వీరు ఆరోపించారు.

పాలికె సమరానికి సన్నాహాలు

బెంగళూరు (బాణసవాడి): గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని ఐదు నగరపాలికెల పరిధి 368 వార్డులకు జూన్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఈనెల 20న రాష్ట్ర ఎన్నికల సంఘం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలా? ఈవీఎంలు ఎంచుకోవాలా? అనే అంశంపై చర్చిస్తారు. నోడల్ అధికారులు, జీబీఏ చీఫ్‌కమిషనర్, ఐదు పాలికెల కమిషనర్లు, నగరాభివృద్ధిశాఖ అధికారులు పాల్గొంటారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ చేపడతారు. రిజర్వేషన్ల కేటాయింపు, అభ్యంతరాలు, బీఎల్‌ఓల నియామకం, పోలింగు కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి, భద్రతాంశాలు చర్చిస్తారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ పరీక్షల నిర్వహణ తేదీలను పరిగణనలోనికి తీసుకుని ఎన్నికల తేదీ ప్రకటిస్తారు.



లోహవిహంగాల విహార విలాసం!

బీదర్, న్యూస్‌టుడే : బీదర్ కోట వద్ద భారతీయ వాయుదళం శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విన్యాసాలకు చక్కని స్పందన లభించింది. నీలి ఆకాశంలో హృదయం ఆకారంలో పొగలు చిమ్ముతూ గీచిన చిత్రం, పక్షుల్లా పెద్ద చప్పుడు చేస్తూ వెళ్లడం, గగనవీధిలో మువ్వన్నెల పొగల్ని విడవడం ప్రేక్షకులకు చక్కని అనుభూతిని అందించింది. భారతీయ వాయుదళంలోని 'సూర్యకిరణ్' ఏరోబ్యాటిక్ బృందానికి చెందిన పైలెట్లు తొమ్మిది విమానాలతో రెండు విడతల్లో గంటకు పైగా ప్రదర్శన ఇచ్చారు. యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కోట వద్దకు మధ్యాహ్నానికే చేరుకున్నారు. క్రాసింగ్, బ్యారల్ రోల్, ఎదురెదురుగా వచ్చి చివరి క్షణంలో పల్టీలు కొట్టడం తదితరాలను పైలెట్లు ప్రదర్శించారు. కోటలో పలు చోట్ల ధ్వనివర్ధకాలను ఏర్పాటు చేశారు. జిల్లాధికారి శిల్పా శర్మ, ఉన్నతాధికారులు డాక్టర్ గిరీశ్ బదోలె, శివానంద కరాళె తదితరులు ఈ విన్యాసాలు వీక్షించారు. బీదర్ వాయుదళ శాఖ అధికారులు పరాగ్‌లాల్, వైశాలి లాల్, వివేక్ అగర్వాల్, బీరేంద్ర సింగ్, సి హరి, టీజే సింగ, క్యాప్టెన్ అజయ్ దాశరథి తదితరులు ఎయిర్‌షోను సమీక్షించారు.


'సూర్యో'దయం: చారిత్రక బీదర్ కోట వేదికగా వాయుసేన విన్యాసాలు

కల్యాణ కంకణాలు

మైసూరు సమీప సుత్తూరు మఠం వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వేదికపై వందకు పైగా జంటలు ఏకకాలంలో వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాయి. స్వామీజీతో కొత్త జంటలతో పాటు ప్రముఖుల బృందచిత్రం.. **- న్యూస్‌టుడే, మైసూరు**

రాజధాని రాజసం

కన్నడిగులు ఎప్పుడెప్పుడా.. అని ఎదురు చూస్తున్న రాజధాని పండగ.. బెంగళూరు హబ్బ శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. విధానసౌధ ముంగిట ప్రత్యేక వేదికపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఢంకా మోగించి (చిత్రంలో) ఉత్సవాలు ప్రారంభించారు. ఆపై.. వివిధ సాంస్కృతిక సంబరాలు, పోటీల కొనసాగింపునకు పచ్చ జెండా ఊపారు **- న్యూస్‌టుడే, బెంగళూరు**

అగ్నిపరీక్ష

సంక్రాంతి వేళ రైతులు సందడి చేశారు. పాత మైసూరు జిల్లాల్లో వృషభాలను సింగారించి.. అగ్నిలో దూకించి సత్తా చాటే పోటీలకు కొదవలేదు. సంప్రదాయంగా కొనసాగుతున్న ఈ వేడుకలను మైసూరు సమీప సిద్ధలింగపురంలో భారీగా నిర్వహించిన వేళ.. కానవచ్చిన ఉత్కంఠభరిత దృశ్యమిదీ **- న్యూస్‌టుడే, మైసూరు**

ఆటల కోట

పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో వేగంగా ప్రగతి సాధిస్తున్న తుమకూరు కేంద్రంగా రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం ఉదయం ప్రారంభించారు. మహాత్మాగాంధీ క్రీడాప్రాంగణంలో పోటీల ప్రారంభ వేదికపై సీఎంతో పాటు హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్, దిల్లీలో కర్ణాటక ప్రతినిధి జయచంద్రనూ చూడొచ్చు **- న్యూస్‌టుడే, తుమకూరు**

లక్కుండిలో తవ్వకాలు

తవ్వకాలకు వచ్చిన యంత్రోపకరణం

గదగ, న్యూస్‌టుడే : చారిత్రక లక్కుండి గ్రామంలో ఇంటి నిర్మాణానికి పునాదులు తీస్తున్న సమయంలో నిధి దొరకడంతో ఇతర ప్రాంతాల్లోనూ తవ్వకాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిధి దొరికిన ఇంటికి చుట్టుపక్కల ప్రాంతాలు, ఆలయాలకు సమీపంలోని భూముల్లో తవ్వకాల కోసం తీసుకువచ్చిన యంత్రోపకరణాలకు అధికారులు పూజలు చేయించారు. శ్రీ కోటో వీరభద్రేశ్వర దేవాలయం సమీపంలో పురాతత్వ శాఖ అధికారులు తవ్వకాలను ప్రారంభిస్తున్నారని జిల్లాధికారి సీఎన్ శ్రీధర్ తెలిపారు. ఏమైనా నిధి లభిస్తే, ఇతర ప్రాంతాల్లోనూ తవ్వకాలు కొనసాగిస్తారని చెప్పారు.

బాణసంచా కాల్చుతున్న కార్యకర్తలు

నినాదాలు చేస్తున్న నేతలు, కార్యకర్తలు

'మహా' విజయంతో కమలదళం ఖుషీ

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా మిత్రకూటమి విజయ దుందుభి మోగించడంతో కర్ణాటక వ్యాప్తంగా పార్టీ శ్రేణులు శుక్రవారం విజయోత్సవాలను ఆచరించుకున్నాయి. బెంగళూరు మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నేతలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. బెంగళూరు, మంగళూరు, బెళగావి, కలబురగి, హుబ్బళ్లి, ఉడుపి విభాగంలో వేడుకలు మిన్నంటాయి. మహారాష్ట్రలోని గెలుపులో పార్టీ కార్యకర్తల శ్రమదాగి ఉందని పార్టీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. కర్ణాటకలో త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ దళ్‌తో కలిసి విజయకేతనాన్ని ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు అన్నీ సిద్ధంగా ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బ్యాలెట్ పత్రంలో ఎన్నికలు నిర్వహిస్తే తమ గెలుపును అడ్డుకోవడం సాధ్యం కాదని బీరాలు పలికిన కాంగ్రెస్‌కు అక్కడి ఓటర్లు చక్కని గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

అన్నదాతకు దన్నుగా నిలవండి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ఆహార పరిస్థితి, నీటి కొరత, క్షీణిస్తున్న భూసారం, అన్నదాతల దుస్థితికి సంబంధించిన అంశాలపై మేధావులు నిత్యం కనీసం రెండు నిమిషాలు మాట్లాడాలని ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్ పిలుపునిచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని చిక్కబళ్లాపుర సమీపంలోని ఈషా ఫౌండేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడం, సేద్యాన్ని లాభదాయక ప్రక్రియగా మార్చవలసిన అవసరం ఉందన్నారు. మన దేశంలో పండగల ఆచరణ వెనుక ప్రత్యేకత ఉంటుందని చెప్పారు. ప్రకృతితో మమేకమై భారతీయులు పండగలు చేసుకుంటారని గుర్తు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరులో బెంగళూరులో లింగభైరవి, నవగ్రహ ఆలయాలు, తీర్థ కుండల ప్రతిష్ఠను చేపడుతున్నామని ప్రకటించారు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 2 వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈషా ఫౌండేషన్‌కు వెళ్లే మార్గంలో భద్రత కోసం ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్పీ కుశాల్ చౌక్సీ భద్రతను పర్యవేక్షించారు.

సాంస్కృతిక ప్రదర్శనల్లో కళాకారుల సందడి

కార్యక్రమాలను వీక్షిస్తున్న జగ్గీ వాసుదేవ్

శ్రీకాంత్ పంగార్కర్ విజయం..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కర్ణాటకకు చెందిన సీనియరు విలేకరి గౌరీలంకేశ్ హత్య కేసు నిందితుడు శ్రీకాంత్ పంగార్కర్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందారు. జల్నా వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా శ్రీకాంత్ పోటీ చేశారు. ఏకనాథ్ శిందే నేతృత్వంలోని శివసేన ఆయనపై ఎవరినీ పోటీకి నిలపలేదు. భాజపా, కాంగ్రెస్‌తో పాటు ఇతర అభ్యర్థులను వెనక్కు నెట్టి తన సమీప ప్రత్యర్థి కన్నా 2621 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. శ్రీకాంత్ 2001-2006 మధ్యలో శివసేన తరపున పోటీ చేసి, జల్నాలో గెలుపొందారు. ఆయనకు 2011లో శివసేన టికెట్ నిరాకరించడంతో హిందూ జన జాగృతి సమితిలో చేరారు. నాటుబాంబులు, మారణాయుధాలను కలిగి ఉన్న ఆరోపణలపై 2018 ఆగస్టులో ఆయనను మహారాష్ట్ర తీవ్రవాద నియంత్రణ దళం అరెస్టు చేసింది. గత ఎన్నికల ముందు పంగార్కర్ శివసేనలో చేరారు. ప్రజా సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయనను పార్టీ నుంచి ఏకనాథ్ శిందే బయటకు పంపించడం ప్రస్తావనార్హం.

రక్షణ దళాలే యువతకు ఆదర్శం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : భారతీయ రక్షణ దళాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ పిలుపునిచ్చారు. సైన్యంలో చేరడం అంటే వ్యక్తిగత హితాసక్తిని పక్కన పెట్టి, దేశసేవకు అంకితం కావడమేనని గుర్తుచేశారు. హలసూరు మద్రాసు ఇంజినీరింగ్ గ్రూపు ఆవరణలోని యుద్ధ స్మారకం వద్ద గురువారం నిర్వహించిన 78వ సేనా దినోత్సవంలో విశ్రాంత సైనికులు, అమరవీరుల కుటుంబాలకు స్మరణికలు, బహుమతులను వితరణ చేసి మాట్లాడారు. నేటి యువతకు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వం, అందరితో కలిసి పని చేసే విలువలు అత్యంత అవసరమని తెలిపారు. రక్షణ శాఖ అధికారులు మేజర్ జనరల్ వీటీ మ్యాథ్యూ, అజయ్ సింగ్ ఠాకూర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల కుటుంబ సభ్యులకు స్మరణికలు, బహుమతులు అందిస్తున్న గహ్లోత్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

పాదయాత్రపై నీళ్లు చల్లిన అధిష్ఠానం

నిరాశలో భాజపా శ్రేణులు

బళ్లారి, న్యూస్‌టుడే: జనవరి 1న కాంగ్రెస్ - భాజపా కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణ, అల్లర్లు, కాల్పుల ఘటన నేపథ్యంలో మాజీ మంత్రులు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు పార్టీ కంటే వ్యక్తిగతంగా ప్రతిష్ఠను నిలబెట్టుకోవాలని బళ్లారి నుంచి బెంగళూరుకు పాదయాత్ర చేయాలని సిద్ధమైన నేపథ్యంలో అధిష్ఠానం వారి ఆశలపై నీళ్లు చల్లింది. మాజీ మంత్రులు వేసుకున్న ప్రణాళికపై అగ్రనాయకులు పాదయాత్ర లేకుండా కేవలం సమావేశానికే పరిమితం కావాలని సూచించడంతో వారు నిరాశ లోనయ్యారు. రాజధానికి పాదయాత్రగా వెళ్లి నిరసన తెలియజేయాలని గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు ఉత్సాహాన్ని భాజపా అధిష్ఠానం ఏమాత్రం ఒప్పుకోలేదు. వారు ఇద్దరు నాయకులు తమ రాజకీయ ప్రాముఖ్యతను తిరిగి పొందడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకుంది. అల్లర్ల కేసు తర్వాత గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు ప్రతి రోజు ఏదున్న కొత్త విలేకరుల సమావేశాలు నిర్వహించి, ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పార్టీ నుంచి ఎలాంటి అధికారిక సూచనలు లేకుండానే పాదయాత్ర నిర్వహించాలని ఉద్దేశాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు నాయకులు ప్రతిపాదన చేసి పార్టీ అధిష్ఠానం ఆమోదం పొందడానికి ప్రయత్నించారని చెబుతారు. అధిష్ఠానం ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించిందని తెలిసింది.

సిద్ధమైన బహిరంగ సభ వేదిక

కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్‌రెడ్డిపై పోరాటం కేవలం సమావేశానికి పరిమితం చేసింది.

పూర్తిగా సన్నాహాలు చేసింది

బళ్లారి నుంచి బెంగళూరుకు పాదయాత్ర పార్టీ అధిష్ఠానం అనుమతి ఇస్తుందని నమ్మకంతో గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు రూట్ మ్యాప్ సిద్ధం చేసి, మీడియాకూ విడుదల చేశారు. పాదయాత్రకు అనుమతి ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రకటిస్తారని, 17న బహిరంగ సమావేశం ముగిసిన తర్వాత అక్కడ నుంచే పాదయాత్ర ప్రారంభిస్తామని నేతలిద్దరూ వెల్లడించడం చివరికి పాచిక పారలేదు.

కుమార తిరస్కరణ?

బళ్లారిలో జరిగిన ఘర్షణ గురించి భాజపా నాయకులు తమ పరిమితుల్లో మాట్లాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి మాత్రం గాలికి మద్దతుగా కొద్ది రోజులు బ్యాటింగ్ ఆడారు. కాల్పుల్లో మృతిచెందిన సామాన్య కార్యకర్త రాజశేఖర్ మృతదేహాన్ని రెండోసారి పోస్ట్‌మార్టం చేసినట్లు తప్పుబట్టారు. ఇది చాలా రోజులుగా చర్చనీయాంశంగా మారింది. పాదయాత్రకు సిద్ధమవుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు, కుమారస్వామి మద్దతు పొందడానికి ప్రయత్నాలు చేశారని సమాచారం. ఇదే విషయమై పాదయాత్రకు రావాలని ఆహ్వానించగా పార్టీ అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి ఆహ్వానం అందలేదని, రెడ్డి మాత్రమే ఆహ్వానించారని, తాను రానని చెప్పినట్లు తెలిసింది. కేంద్ర మంత్రులు వస్తున్నట్లు నేటి వరకు సమాచారం లేదు. కేవలం రాష్ట్ర భాజపా అధ్యక్షుడు విజయేంద్ర మాత్రమే వస్తున్నట్లు తెలిసింది.

వేదికను పరిశీలించిన ఐజీపీ, డీసీ

బళ్లారి, న్యూస్‌టుడే: భాజపా బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ యార్డ్‌లో ఈ నెల 17న నిర్వహించే బహిరంగ సభ వేదికను శుక్రవారం బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ డా.పి.ఎస్.హర్ష, జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్, జిల్లా పోలీస్ అధికారి డా.సుమన్ పెన్నేకర్, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్ పరిశీలించారు. వేదిక ఐదువైపుల నేతలు రావడానికి ద్వారాలు, అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బంది, తదితర వాటిని పరిశీలించారు.

వేదికను పరిశీలిస్తున్న ఐజీపీ డా.పి.ఎస్.హర్ష, డీసీ కె.నాగేంద్రప్రసాద్, ఎస్పీ డా.డి.సుమన్ పెన్నేకర్ తదితరులు

17న మద్యం విక్రయాలు నిషేధం

బళ్లారి నగరంలో ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే బహిరంగ సమావేశం శాంతియుతంగా నిర్వహించడానికి నగరంలో మద్యం విక్రయాలను నిషేధిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి కె.నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 16న రాత్రి 10 గంటల నుంచి జనవరి 18న ఉదయం 6 గంటల వరకు నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి

సింధనూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని వీబీ జీ రామ్ జీగా మార్చిన కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి తెలిపారు. ఆయన శుక్రవారం సింధనూరు గాంధీ కూడలిలో కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ, వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఒక రోజు ఉపవాస సత్యాగ్రహం చేపట్టారు. ఆయనతో పాటు ఆయన అనుచరులు కూడా ఈ దీక్షలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద ప్రజల పొట్ట కొట్టినట్లయిందని అన్నారు.

‘శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి’

జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ డా.పి.ఎస్.హర్ష రాత్రి గస్తీ నిర్వహించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. నూతన సంవత్సరం జనవరి 1న బళ్లారి నగరంలో రెండు వర్గాల ఘర్షణ, అల్లర్లు, కాల్పులతో ఓ సామాన్య కార్యకర్త మృతి చెందడంతో నగరంలో శాంతిభద్రతలు లోపించాయి. దీనిపై ఐజీపీ, ఎస్పీ ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగా ఐజీపీ డా.పి.ఎస్.హర్ష నగరంలో గస్తీ నిర్వహించి, శాంతిభద్రతలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అన్ని రకాల సన్నాహాలు చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచాలని అధికారులకు కఠినమైన సూచనలు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిపోయే వారిపై కూడా దృష్టి పెట్టినట్లు వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచడానికి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. నగరంలోని లాడ్జిలు, హోటళ్లు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బళ్లారి పోలీస్ విభాగం వ్యాప్తిలోకి వచ్చే రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల నుంచి అవసరమైన సిబ్బందిని నియమించి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బళ్లారి నగరంలో జోన్ల వారిగా పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. వారు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అనుమతించవద్దని హెచ్చరిక ఇస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించేవారు, సమాజ శాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐజీపీ హెచ్చరించారు.

నగరంలో గస్తీ తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ డా.పి.ఎస్.హర్ష, ఇతర పోలీస్ అధికారులు

ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అరెస్టుకు డిమాండ్

పాదయాత్ర చేసి తీరుతామన్న భాజపా నేతలు

బళ్లారి, న్యూస్‌టుడే: ద్వేషభాషణ...రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చారు. ఈ నెల 1న నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తన అనుచరులతో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి నివాసం ముందుకు వచ్చి 10 నిమిషాల్లో బళ్లారి విడిచి వెళ్లాలి...5 నిమిషాల్లో జనార్దన్‌రెడ్డి ఇంటిని తగలపెడతానని ప్రకటించారు. ఇలా రెచ్చగొట్టే ప్రసంగం చేసిన ఎమ్మెల్యేని ఇంత వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ఎమ్మెల్సీ రవికుమార్ నిలదీశారు. శుక్రవారం ఏపీఎంసీలో బహిరంగ సమావేశం ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే తన అనుచరులు, ప్రైవేట్ గన్‌మెన్లతో మాజీ మంత్రి ఇంటి వద్దకు వచ్చి కాల్పులు జరిపారని, కాల్పుల్లో కాంగ్రెస్ పార్టీ సామాన్య కార్యకర్త మృతిచెందారన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి ఘటన ఎక్కడా జరగలేదన్నారు. మరణ స్థలంలోనే ఏడు బుల్లెట్లు లభించాయని, బళ్లారిలో గూండాయిజం జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి గూండాయిజాన్ని భాజపా సహించదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని సిట్, సీఐడీపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఘటనపై పారదర్శకంగా విచారించడానికి సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసు మూసివేయడానికి ఎమ్మెల్యే వద్ద ఉన్న నలుగురిని అరెస్టు చేస్తే సరిపోదు..ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలు పెరిగాయని, శాంతిభద్రతలు లోపించాయన్నారు. దీన్ని నిరసిస్తూ నేడు బళ్లారి నగరంలోని ఏపీఎంసీలో జరిగే సమావేశానికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతో పాటు, మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, విధానసభ ప్రతిపక్షనేత ఆర్.అశోక్, విధానపరిషత్ ప్రతిపక్షనేత చలువాది నారాయణ స్వామి, చిత్రదుర్గం ఎంపీ గోవింద్ కారజోళ, తదితరులు హాజరవుతారని చెప్పారు. బహిరంగ సమావేశం అనంతరం 19, 20 తేదీల్లో భాజపా జాతీయ అధ్యక్షుడు ఎన్నిక తర్వాత తమ రాష్ట్ర అధ్యక్షుడు ఢిల్లీకి వెళ్లి పాదయాత్రకు అనుమతి తెస్తారన్నారు. మాజీ మంత్రి బి.శ్రీరాములు మాట్లాడుతూ బళ్లారి నగరంలో కాల్పులు, ఘర్షణ, అల్లర్లు జరిగిన 16 రోజులు గడిచినా...నేటి వరకు ఎమ్మెల్యేను అరెస్టు చేయలేదని, తక్షణమే ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని కోరారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, లోకేష్ మాజీ సభ్యుడు నట్ట పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంసీలో బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవి కుమార్, మాజీ మంత్రులు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తదితరులు

2,500 మందితో భద్రత

బళ్లారి నగర ఏపీఎంసీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. ఎస్పీ రవికుమార్ వేదిక వద్ద, ఏపీఎంసీ మార్కెట్ యార్డ్ పోలీస్ స్టేషన్‌లోనే ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. బళ్లారి, దావణగెరె, కలబురగి, హుబ్బళ్లి, బెంగళూరు, శివమొగ్గ తదితర పోలీస్ ఠాణాల నుంచి 2,500 మంది పోలీసులను రప్పించారు. నగరంలో ప్రధాన కూడళ్లు, రహదారులు, ఏపీఎంసీ మార్కెట్‌ను మొత్తం పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. వేదిక సమీపంలో అంబులెన్స్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉంచారు. ముందు జాగ్రత్త చర్యగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రజలకు గోడ పత్రికలు, చిత్రాల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నామని పంచ గ్యారంటీ యోజన తాలూకా అధ్యక్షుడు మారుతి వరప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కేకేఆర్టీసీ బస్సు ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం వార్తా, సార్వజనిక ప్రచార శాఖ ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, టీఎస్పీ పథకాలు, పంచ గ్యారంటీ పథకాల అవగాహన జాగృతి కార్యక్రమాన్ని నగరసభ మాజీ అధ్యక్షుడు బి.ఎం.సతీస్, తహసీల్దార్ గౌసియా బేగం, నగరసభ కమిషనర్ గంగాధర్, కేకేఆర్టీసీ అధికారి షేక్షావలితో కలిసి ప్రారంభించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిమ ఏర్పాటు చేసి, గోడ పత్రికలను ఆవిష్కరించారు.

ప్రభుత్వ పథకాల గోడచిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు, పంచ గ్యారంటీ ప్రతినిధులు

పామ్ ఆయిల్ ట్యాంకర్ పల్టీ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా దేవలాపుర శివారులోని కణవి మారెమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఉదయం పామ్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. బెంగళూరు నుంచి గంగావతి వైపు వెళ్తున్న 20 వేల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పడిపోయింది. ఆయిల్ కారిపోవడంతో చుట్టుపక్కల ప్రజలు బిందెలు, బక్కెట్లు తీసుకుని ట్యాంకర్ వద్దకు వచ్చి తీసుకెళ్లారు. రోడ్డుపై వాహనాలు అధిక సంఖ్యలో నిలవడంతో వాహన సంచారానికి అంతరాయం ఏర్పడింది. కుడతిని పోలీసులు వచ్చి వాహన సంచారాన్ని సుగమం చేశారు.

బోల్తా పడిన పామ్ ఆయిల్ ట్యాంకర్

ఈళిగనూరులో మద్యంపై సమరం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకా ఈళిగనూరులో ఆదివారం నుంచి మద్యం విక్రయాలు జరపవద్దని గ్రామస్థులు నిర్ణయించారు. ఈ విషయమై గ్రామంలోని మారుతేశ్వర ఆలయంలో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయాల వల్ల యువకులు మద్యానికి అలవాటుపడడం, తదితర దుష్పరిణామాలతో మద్యం అమ్మకాలు నిషేధించాలని నిర్ణయించారు. మద్యం అమ్మేవారికి శనివారం వరకు గడువు ఇచ్చి ఆదివారం నుంచి విక్రయాలు జరపవద్దని తెలిపారు.

ఆలయంలో సమావేశమైన గ్రామస్థులు

శాసనసభలో బల్డోటా వ్యతిరేక పోరాటాన్ని ప్రస్తావిస్తాం

గంగావతి, న్యూస్‌టుడే: శాసనసభ ప్రత్యేక సమావేశంలో కొప్పళ ప్రజలు బల్డోటా ఉక్కు కార్ఖానా విస్తరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని ప్రస్తావిస్తామని శాసమండలిలో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కొప్పళ బచావో ఆందోళన సమితి చేస్తున్న దీక్షలో పాల్గొని మాట్లాడారు. కొప్పళ, భాగ్యనగర పట్టణాలు, మరో 20 పల్లెలు కార్ఖానా విస్తరణ బాధితులుగా మారుతారన్నారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి కేంద్రంపై వేలెత్తి చూపి జారుకుంటున్నారన్నారు. కేంద్రానికి తాము నచ్చజెబుతామంటూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విస్తరణ ఆదేశాలను రద్దు చేయాలన్నారు. ఈ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడం అందరి బాధ్యత అన్నారు. కొప్పళ ప్రజాప్రతినిధులు ఈ విషయంలో గవిమఠం స్వామీజీని అవమానిస్తున్నారన్నారు. బసాపుర చెరువు ఆక్రమణలను సైతం తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లమప్రభు బెట్టదూరు, మంజునాథ్ గొండబాళ, బీజీ కరిగార, మల్లికార్జున గోనాళ, కనకమూర్తి, రవికాంత్, కల్లమ్మ ర్యావణకి పాల్గొన్నారు.

కొప్పళలో బల్డోటా వ్యతిరేక పోరాట శిబిరంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

ఘనంగా పీర్ చిస్తి వుల్ ఖాద్రి ఉరుసు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పీర్ చిస్తి వుల్ ఖాద్రి ఉరుసును శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తెక్కలకోట పట్టణంలో నిట్టూరు రహదారిలోని హజరత్ ఖ్వాజా సైయద్ షా అబ్దుల్ రజాక్ పీర్ హుసేని వుల్ హుసేని జఫారి చిస్తి వుల్ ఖాద్రి 21వ సంవత్సర ఉరుసు నిర్వహించారు. ఉదయం హజరత్ సైయద్ షా చాంద్ పీర్ హుసేని నివాసం నుంచి పట్టణ వీధుల్లో ఊరేగింపుగా ధార్మిక నినాదాలు చేస్తూ దర్గాకు వెళ్లారు. కార్యక్రమంలో భాగంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రాత్రి దర్గా ఆవరణలో మహారాష్ట్రకు చెందిన తౌసీఫ్ జునైద్, పుణెకు చెందిన చోటి షబనమ్ ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు.

ఉరుసుకు ఊరేగింపుగా వెళ్తున్న మతగురువులు

జొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

బళ్లారి, న్యూస్‌టుడే: 2025-26 ఏడాది ఖరీఫ్‌లో పండించిన తెల్లజొన్నలు మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఉప నిర్దేశకురాలు షకీనా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం రైతులు ముందుగా ఫ్రూట్స్ సాంకేతిక యాప్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం వారు తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లు, తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల సహకార అమ్మకాల సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ రుణ సహకార సంఘాల్లో తెరిచిన కొనుగోలు కేంద్రాల్లో జొన్నలను విక్రయించడానికి సరైన పత్రాలను అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. 2025-26 ఏడాది ఖరీఫ్ సీజన్‌కు చెందిన తెల్ల జొన్నల నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు.

కేంద్రాల వివరాలు

తెల్లజొన్నలు-హైబ్రీడ్ రూ. 3,699 క్వింటాల్‌కు), తెల్ల జొన్నలు మల్దండి రూ. 3,749లతో కొనుగోలు చేస్తున్నట్లు ఉప నిర్దేశకురాలు తెలిపారు. బళ్లారి తాలూకాలోని తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం, బళ్లారి, మోకా, అసుండి, రూపనగుడి, అమరాపురం గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కురుగోడు తాలూకాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, సిరుగుప్ప తాలూకాలోని కె.బెళగల్లు, కరూర్, హచ్చొళ్లి, బూదుగుప్ప, బి.ఎం.సూగూరు, తాళూరు, ముద్దటనూరు, అరళిగనూరు, సిరిగేరి గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కొనుగోలు చేస్తారన్నారు. కంప్లి తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం, కంప్లి, ఎమ్మిగనూరు గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలల్లో జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సంప్రదించి ఫ్రూట్స్ ఐడీ, ఆధార్ నమోదు, తదితర పత్రాలను చూపించాలన్నారు.

భక్తుల సేవలో రుద్రమునీశ్వర మఠం

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకాలో ప్రసిద్ధి గాంచిన చికల్‌పర్వి రుద్ర మునీశ్వర మఠం, కరేగుడ్డ మహంతేశ్వర మఠం భక్తుల సేవల్లో తరిస్తున్నాయి. ఇక్కడ నిత్య అన్నదానం జరుగుతోంది. భక్తులు ఏ సమయంలో మఠానికి వచ్చినా వారికి ప్రసాద వితరణ చేయనిదే పంపరు. ఈ క్రమంలో తుంగభద్ర నది తీరంలో ఉన్న రుద్రమునీశ్వర మఠానికి మూడు రాష్ట్రాల భక్తులు వస్తుంటారు. నది అవతల ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి తెప్పలు, అరగోలు మీద ఇక్కడి వచ్చి మఠాన్ని సందర్శించుకుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సందర్భంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు, ప్రజలు, పాదచారులు వస్తుంటారు. వీరికి ఇబ్బంది కలగకుండా మఠం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు పండుగ వంటకాలతో విశేష అన్నసంతర్పణ చేశారు. సదాశివమహాస్వామీజీ పర్యవేక్షణలో మఠం అభిమానులు, భక్తులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మఠంలో నిర్వహిస్తున్న అన్నసంతర్పణ

హంపీ ఉత్సవాల్లో ఐదు వేదికలు

హొసపేటె, న్యూస్‌టుడే: వచ్చే నెల 13 నుంచి మూడు రోజులపాటు జరిగే హంపీ ఉత్సవాల్లో కళాకారులందరికీ అవకాశం కల్పించేందుకు ఐదు వేదికలను నిర్మాణం చేస్తున్నామని మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం ఆయన హంపీలో ప్రధాన వేదిక నిర్మాణ స్థల పరిశీలన చేసిన తరువాత మాధ్యమాలతో మాట్లాడారు. 13న ముఖ్యమంత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు. దేశ, విదేశాల కళాకారులకు అవకాశం కల్పిస్తున్నాం, స్థానిక కళాకారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు. అశ్విని పునీత్‌రాజ్ కుమార్, ధ్రువసర్జా ఉత్సవాలకు రావటానికి ఒప్పుకొన్నారు, మరికొంతమంది స్యాండల్‌వుడ్ కళాకారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. డీసీ కవితా మన్నికేరి, ఎస్పీ ఎస్.జాహ్నవి, జడ్పీ సీఈవో మహ్మదలి అక్రమ్ షా తదితరులు పాల్గొన్నారు.

హంపీలో ఉత్సవ ప్రధాన వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్

మరో ఇద్దరు ప్రైవేట్ గన్‌మెన్ల అరెస్టు

బళ్లారి, న్యూస్‌టుడే: జనవరి 1న నగరంలోని హవంబావిలో జరిగిన కాల్పులు, ఘర్షణ, అల్లర్లకు సంబంధించి సీఐడీ పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. దీనిపై బ్రూస్‌పేటె పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసులు నమోదు చేయగా, నాలుగు కేసులను సీఐడీకి అప్పగించిన విషయం తెలిసిందే. సీఐడీ ఏడీజీపీ బి.కె.సింగ్, ఎస్పీ హర్ష ప్రియంవద, ఇద్దరు డీఎస్పీలు, సీఐల ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఇప్పటికే 26 మందిని అరెస్టు చేయగా, సీఐడీ పోలీసులు ప్రైవేట్ గన్‌మెన్లు బల్జీత్‌సింగ్, మహేందర్ సింగ్‌లను అరెస్టు చేసి బ్రూస్‌పేటె పోలీస్ స్టేషన్‌లో విచారించి జైలుకు తరలించారు.

బ్రూస్‌పేటె పోలీస్ స్టేషన్ నుంచి గన్‌మెన్లను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

విరూపాక్ష సన్నిధిలో భక్తుల సందడి

హొసపేటె: హంపీ విరూపాక్ష వీధిలో భక్తుల సందడి

హొసపేటె: మరక సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం హంపీలో భక్తులు సందడి చేశారు. విరూపాక్షుని దర్శనానికి బారులు తీరారు. ఉదయం నుంచి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కైంకర్యాలు నెరవేరాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి స్వామివారికి అలంకరణ, అభిషేకాలు చేశారు. బంగారు కిరీటంతో అలంకృతుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం పక్కనే ఉన్న తుంగభద్రలో భక్తులు సంక్రాంతి పుణ్యస్నానాలు చేశారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షిద్దాం

చెళ్లకెర(చిత్రదుర్గం): భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్.నవీన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇక్కడ చిత్రదుర్గం శివారులోని మేదేహళ్లి అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత మన సంస్కృతి, ఆచార విచారాలు, పర్వదినాలపై ఆసక్తి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు, భక్తుల మధ్య అవినాభావ సంబంధం ఉందన్నారు. రెండు నెలల కాలంలో అయ్యప్ప స్వామి భక్తులకు దేవాలయంలో నిర్వహించిన అన్న సంతర్పణలో సుమారు 2 లక్షల మంది భక్తులు సేవలను పొందారన్నారు. ప్రతినిధులు అరుణ్‌కుమార్, లింగారెడ్డి, బదరీనాథ్, ద్యామణ్ణ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతిదర్శన పూజలు

బళ్లారి గ్రామీణ: మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాఘవేంద్రకాలనీ అయ్యపస్వామి ఆలయంలో జ్యోతి దర్శన పూజలు వైభవంగా జరిపారు. 18 మెట్లకు పుష్పాలతో అలంకరించి దీపాలు వెలిగించారు. శబరి అయ్యప్పస్వామి జ్యోతి దర్శనాన్ని నగరప్రజలకు పెద్ద తెరలు ఏర్పాటుచేసి చూపించారు. అయ్యప్పస్వామికి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు జయప్రకాష్ గుప్త మాట్లాడుతూ ఏటా సంక్రాంతి రోజు శబరిలోని జ్యోతి దర్శనం చూపిస్తామన్నారు. విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్భయానందస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజల్లో పాల్గొన్న ఆలయ అధ్యక్షుడు జయప్రకాష్‌గుప్త, తదితరులు

బళ్లారి అయ్యప్ప దేవాలయంలో పూజలను తిలకిస్తున్న భక్తులు

చెళ్లకెర: లక్షదీపోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడుతన్న ఎమ్మెల్సీ నవీన్

చెళ్లకెర: మేదహళ్లిలో అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన లక్ష దీపోత్సవం

త్రిచక్ర వాహనాల్ని ఢీకొన్న కారు

ఒకరి దుర్మరణం - ముగ్గురికి గాయాలు

హొసపేటె, న్యూస్‌టుడే: ఇద్దరు దివ్యాంగులు నడుపుతున్న రెండు త్రిచక్ర వాహనాలను ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఓ వాహనం వెనుక సీటులో కూర్చొన్న మంగళగౌరి (43) అనే మహిళ తీవ్ర గాయాలతో ప్రమాద స్థలంలో మృతిచెందారు. మరో వాహనంలో కూర్చొన్న చిన్మయి (15), ఇద్దరు దివ్యాంగులు లింగరాజ్ (18), సిద్ధేశ (19)లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కూడ్లిగి తాలూకా అమ్మనకెరె సమీపం 50వ జాతీయ రహదారిలో జరిగింది. అమ్మనకెరె నుంచి దివ్యాంగులు లింగరాజ్, సిద్ధేశ్ రెండు త్రిచక్ర వాహనాల్లో కూడ్లిగి వైపు వెళ్తుండగా, మార్గ మధ్యలో అదే ప్రాంతానికి చెందిన మంగళగౌరి, చిన్మయి కూడ్లిగి వెళ్తూ తలా ఓ వాహనాన్ని ఎక్కారు. కొంత దూరం వెళ్లగానే ఓ మలుపులో ఎదురుగా వచ్చిన కారు రెండూ వాహనాల్ని ఢీకొంది.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగరం ● చిత్రదుర్గ

తుంగభద్ర నది వద్ద శనగ పిండి పంపిణీ

నది వద్ద స్వచ్ఛతా కరపత్రాలు ప్రదర్శిస్తున్న అభియాన ప్రతినిధులు

కంప్లి: కంప్లి నిర్మల తుంగభద్ర అభియాన ప్రతినిధులు మకర సంక్రాంతి రోజు కోట వద్ద శనగ పిండి పంపిణీ చేశారు. అభియాన సంచాలకుడు డాక్టర్ భట్టా రామాంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి ఉత్తరాయణ ప్రారంభం నాడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో నదీ స్నానానికి వస్తారు. సబ్బులు, షాంపూ తదితరాలను వాడడం వల్ల నది నీరు కలుషితమవుతుంది. వాటికి బదులు శనగ పిండిని వాడాలంటూ పంపిణీ చేశామని తెలిపారు. నది స్వచ్ఛతను కాపాడాలంటూ కర పత్రాలను ప్రదర్శించారు. అభియాన ప్రతినిధులు అమరే గౌడ, ఇటిగి విరుపాక్షి, బి.వి.గౌడ, నిరంజన గౌడ, పత్రయ్య స్వామి పాల్గొన్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి

క్రీడాకారుడు తిప్పేస్వామి యాదవ్‌కు చెక్కు అందజేస్తున్న సుజాత సత్యప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: మంగళూరులో జరిగిన పరుగు పోటీల్లో కుడతిని పట్టణానికి చెందిన తిప్పేస్వామి యాదవ్ 42 కిలోమీటర్ల పరుగులో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. యువకుడి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి కుడతిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఆర్.సుజాత సత్యప్ప రూ.30 వేల ప్రోత్సాహ ధనం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో విజేతగా నిలవాలని కోరారు.

ఆలయాల్లో హుండీల చోరీ

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకాలోని అయిదు గ్రామాల్లో గురువారం రాత్రి దొంగతనాలు జరిగాయి. కొట్నేకల్ గ్రామంలోని దుర్గా దేవి ఆలయం, జమాపురలోని జడెసిద్ధేశ్వర తాత ఆలయం, అరుణోదయ -1 తాండాలోని సేవాలాల్, దుర్గా దేవి ఆలయాలు, అంజూరి క్యాంపులోని రామాలయంలో విగ్రహాల బంగారు ఆభరణాల దొంగతనాలు జరిగాయి. అరుణోదయ తాండా-2లోని ఓ ఇంట్లో సైతం చోరీ జరిగింది. ఒకే రాత్రి ఇన్ని చోట్లా దొంగతనాలు జరగడంతో ప్రజలు భయపడుతున్నారు.

బాల్య వివాహరహిత గ్రామపంచాయతీలకు పురస్కారాలు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా బాలల రక్షణాధికారి కార్యాలయం 2024-25 ఏడాదికి బాల్య వివాహాల రహిత గ్రామ పంచాయతీలను గుర్తించి పురస్కారం ఇవ్వాలని నిర్ణయించిందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు లేని గ్రామ పంచాయతీలు ఉంటే పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోపు స్థానిక కంటోన్మెంట్‌లోని శాంతిధామ ఆవరణలోని జిల్లా బాలల రక్షణ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నేడు విద్యుత్తు వినియోగదారులతో సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి గ్రామీణ జెస్కాం ఉపవిభాగం పరిధి విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి శనివారం ఉదయం 11గంటలకు బళ్లారి జెస్కాం గ్రామీణ ఉప విభాగం కార్యాలయంలో విద్యుత్తు వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జెస్కాం ఈఈ మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉపవిభాగం-2 వ్యాప్తిలో విద్యుత్తులైన్లలో మరమ్మతులు జరుగుతుండటంతో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం వ్యాప్తిలోకి వచ్చే మారుతికాలనీ, హుసేన్‌నగర్, రామయ్యకాలనీ, రాఘవేంద్ర కాలనీ, అనంతపురం రహదారి, పటేల్‌నగర్, ఎస్.ఎన్.పేటె, దుర్గాకాలనీ, వెంకటేశ్వర నగర, హెచ్.ఎల్.సి కాలనీ, సత్యసాయి కాలనీల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని చెప్పారు.

ఈతకు వెళ్లి బాలుడి విషాదాంతం

వంశీరెడ్డి మృతదేహం

మాన్వి,న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు నీటిపాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సంక్రాంతి పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, యువతీ, యువకులు నదీ స్నానాలు చేసేందుకు చికల్‌పర్వి గ్రామం సమీపంలో ప్రవహించే తుంగభద్ర నదికి వచ్చారు. కర్ణాటక (మాన్వి తాలూకా) వైపున నది ఎండిపోయి గుంతల్లో మాత్రమే నీరు నిల్వ ఉండగా ఆంధ్రప్రదేశ్ వైపు నదీ పాయలో నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది యువకులు నదిలో ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు అటువైపునకు వెళ్లారు. మాన్వి తాలూకా రాజలదిన్ని గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి కుమారుడు వంశీరెడ్డి(17) ఈత కొట్టేందుకు నదిలో దూకాడు. ఆ ప్రాంతం లోతుగా ఉండటాన్ని గమనించకపోవటంతో నీట మునిగిపోయాడు. అక్కడ స్నానాలు చేస్తున్న వారు వంశీని రక్షించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముగ్గురు మహిళల అదృశ్యం

సిద్ధమ్మ

గిరిజమ్మ

విశాలాక్షి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి మహిళా పోలీస్ స్టేషన్ వ్యాప్తికి చెందిన సిద్ధమ్మ(61) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

● **బళ్లారి:** బళ్లారి నగర మహిళా పోలీస్‌స్టేషన్ వ్యాప్తికి చెందిన గిరిజమ్మ (78) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గిరిజమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

● **బళ్లారి:** బళ్లారి మహిళా పోలీస్ స్టేషన్ వ్యాప్తికి చెందిన విశాలాక్షి(55) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలుగు, కన్నడ భాషల్లో మాట్లాడుతుంది. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి

బళ్లారి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందారు. కుడతిని సమీపంలోని తిమ్మాలాపురం వద్ద ఉన్న గుర్తుతెలియని మహిళ (40) అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసుల సహకారంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సంబంధికులు ఉంటే కుడతిని పోలీసులను సంప్రదించాలన్నారు.

రంగుల దుకాణం దగ్ధం

మాన్వి,న్యూస్‌టుడే: స్థానిక బసవ కూడలి వద్ద ఉన్న లక్ష్మీవెంకటేశ్వర పెయింట్ షాపు (రంగుల దుకాణం) అగ్నికి ఆహుతైంది. శుక్రవారం ఉదయం దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించి మొత్తం కాలిపోయింది. బిచ్చాలి వీరేశ్‌బాబు అనే వ్యాపారి వివిధ కంపెనీల పెయింట్లు విక్రయిస్తుంటారు. తెల్లవారుజామున ప్రమాదం జరగటం, దుకాణం లోంచి పొగబయటకు వచ్చే వీలులేకుండా భవన నిర్మాణం చేయడంతో లోపల మంటలు, పొగ బయటికి కనిపించలేదు. దుకాణం లోపల వస్తువులన్నీ కాలిబూడిద అయిపోయాయి. అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలు పక్కదుకాణాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ఆకస్మిక ప్రమాదంలో రూ.లక్షలు విలువైన రంగుల డబ్బాలు, తిన్నర్లు, బ్రష్‌లు ఇతర సామగ్రి మొత్తం కాలిపోయాయి.

కమిషనర్‌పై దౌర్జన్యం తగదు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: శిడ్లఘట్ట నగరసభ కమిషనర్ అమృతగౌడపై దౌర్జన్యానికి పాల్పడి, నిందించిన రాజీవ్‌గౌడను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పౌర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరసభ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నగరసభ కమిషనర్ గంగాధర్, సంఘం పదాధికారులు అమరేశ్, రంగస్వామి, రమేశ్, తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ విధి నిర్వహణలో భాగంగా బ్యానర్ తొలగించినందుకు శిడ్లఘట్ట నగరసభ కమిషనర్ అమృతగౌడను రాజీవ్‌గౌడ అనే వ్యక్తి దుర్భాషలాడి, బెదిరింపులకు పాల్పడటంతో ఉద్యోగులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని కోరుతూ తహసీల్దార్ గౌసియాబేగంకు వినతిపత్రం అందించారు. ఉద్యోగులు, సంఘం ప్రతినిధులు, పౌరకార్మికులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

17-01-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1604.40	1622.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,210	12,002
నీటి నిల్వ (టి.ఎం.సి)	27.767	68.261

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

తెలుగింట .. సంబరాల క్రాంతి

కళకళలాడిన లోగిళ్లు

బళ్లారి గ్రామీణ : లక్ష్మీ బాలాజీ పద్మావతికి అలంకరణ సిరుగుప్ప శ్రీనగర్ క్యాంపులో సీతారామ లక్ష్మణ విగ్రహమూర్తులకు పూజలు

బళ్లారి గ్రామీణ: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బాలాజీ క్యాంపులో వెలసిన లక్ష్మీ బాలాజీ పద్మావతి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. ఆలయంలో రంగవల్లులు వేశారు. స్వామి అమ్మవార్లను పుష్పాలతో అలంకరించారు. ఈ ఏడాది వర్షాలు కురిసి..రైతుల ఇంట సిరులు పండాలని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ ధర్మకర్త వి.రాధాప్రసాద్ తెలిపారు. క్యాంపు వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు. సంజీవరాయన కొటె ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాలు ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళాకారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవిచెళ్లగుర్కి,

బళ్లారి గ్రామీణ : నృత్య కళాకారులను అభినందిస్తున్న రవిచెళ్లగుర్కి తదితరులు

ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: తాలూకా వ్యాప్తంగా సంక్రాంతి పండగను వైభవంగా ఆచరించారు. సిరుగుప్ప, తెక్కెలకోట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు, తెలుగు క్యాంపుల్లో సందడి నెలకొంది. ఇళ్లముంగిట రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించి పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి బంధువులు, కుటుంబ సభ్యులు తరలిరావడంతో ఇళ్లన్నీ కళకళలాడాయి. గ్రామాల్లో పాండవుల విగ్రహమూర్తులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. జంగమ స్వాములు సంప్రదాయబద్ధంగా జోలె పట్టుకుని శివ శివ జంగమ జోళిగె భిక్ష అడిగారు. ధాన్యం, కూరగాయలు, నువ్వులు, బెల్లం, దక్షిణ చెల్లించి స్వాముల ఆశీర్వాదం తీసుకొన్నారు. సిరిగేరి గ్రామంలో ఎస్.ఎం.నాగరాజ స్వామి సంక్రాంతి విశిష్టతను వివరించారు.

కంప్లి: మకర సంక్రాంతి సందర్భంగా కంప్లి హౌసింగ్ బోర్డు కాలనీ బన్ని మహంకాళి దేవి ఆలయ ఆవరణలో రంగోలి పోటీ నిర్వహించారు. ఆధునికత మోజులో సంప్రదాయాలు కనుమరుగవుతున్న దృష్ట్యా మహిళల్లో చైతన్యం కోసం ఈ పోటీ నిర్వహించామని ఆలయ సమితి అధ్యక్షుడు రామదాసు తెలిపారు. పి.హర్షిత ప్రథమ స్థానంలో నిలవగా కావేరి, ఎం.ప్రియాంక ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఆలయ సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మాన్వి: తాలూకా వ్యాప్తంగా వివిధ క్యాంపుల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగువారు రంగవల్లులు (ముగ్గులు), భోగి మంటలు, పిండి వంటలతో సందడి చేశారు. గంగానగర్ క్యాంపులో మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. ప్రజలు స్థానిక దేవాలయాల్లో పూజలు చేశారు. స్థానిక కన్నడ సోదరులు సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సమేతంగా నదీ స్నానాలు ఆచరించి, నదీ తీరంలోనే సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. నదీ స్నానానికి వచ్చే భక్తులకు నిర్మల తుంగభద్ర అభియాన్ సభ్యులు శనగ పిండి పాకెట్లను పంపిణీ చేశారు. నది నీటి కాలుష్యంపై అవగాహన కల్పించారు.

శ్రీరామనగర్: ఎడ్లబండిపై వివిధ వేషధారణల్లో ఉన్న చిన్నారులు

శ్రీరామనగర్: గంగావతి తాలూకా జంగమర కల్గుడిలో తెలుగు వారు సమైక్యంగా శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. సంబరాలు జరిగే ప్రాంతాన్ని రంగుల ముగ్గులతో అలంకరించారు. ఉదయం భోగి మంటలు, వినాయక పూజ అనంతరం పిల్లలకు రేగు పండ్లు పోశారు. వేంకటేశ్వర స్వామి, నారద మహర్షి, హరి దాసు తదితర వేషధారణల్లో చిన్నారులు అలరించారు. ఎడ్ల బండిపై చిన్నారులను ఊరేగించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక భోజనాలు జరిగాయి. గ్రామంలోని తెలుగు వారు కలిసికట్టుగా పండగను ఆచరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

మాన్వి: నదీ తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న ప్రజలు

మాన్వి: నదీ తీరంలో సామూహికంగా భోజనాలు చేస్తున్న జనం

చెళ్లకెర: గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

చెళ్లకెర(చిత్రదుర్గం): సంక్రాంతి, కనుమ పర్వదినాలను జిల్లా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎద్దులు, పశువులను వ్యాధులు సోకకుండా మంటలపై దాటించారు. ఉత్తరాయణ పుణ్య కాలం సందర్భంగా నాయకనహట్టి తిప్పేరుద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, నీలకంఠేశ్వర, వెంకటేశ్వర తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నూతన దుస్తులను ధరించిన భక్తులు దేవాలయాలను సందర్శించి మొక్కులను తీర్చుకొన్నారు.

సిరుగుప్ప: సిరిగేరిలో సంక్రాంతి భిక్షాటన చేస్తున్న చేస్తున్న స్వామి కుటుంబసభ్యులు

కంప్లి: బహుమతి అందుకుంటున్న హర్షిత

చెళ్లకెర: నాయకనహట్టి తిప్పేరుద్ర స్వామికి ప్రత్యేక అలంకారం

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఉత్తమ సమాజ నిర్మాణ సారథులు ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

కంప్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాణ సారథులని కంప్లి ఎమ్మెల్యే గణేశ్ వ్యాఖ్యానించారు. కంప్లి వీరశైవ భవనంలో శుక్రవారం తాలూకా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రి బాయి పులే జయంతి కార్యాక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కంప్లిలో విద్యా శాఖ కార్యాలయం ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నానని, తాలూకాలోని ఎమ్మిగనూరు, దేవసముద్ర గ్రామాలకు కర్ణాటక పబ్లిక్ పాఠశాలలు మంజూరయ్యాయన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు హనుమంతప్ప మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సత్కరించారు. బీఈవో సిద్ధలింగమూర్తి, టీపీ అధికారి శ్రీకుమార్, మల్లన గౌడ, టి.ఎం.బసవరాజ్, దొడ్డ బసప్ప, సునీత పూజారి, అంబిగర మంజునాథ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర అన్న దాసోహానికి 43 క్వింటాళ్ల బియ్యం

కారటగి, న్యూస్‌టుడే: నిజశరణ అంబిగర చౌడయ్య జాతర అన్న దాసోహానికి తాలూకాలోని గంగామత సముదాయ నాయకులు, ప్రజలు 43 క్వింటాళ్ల బియ్యం పంపించారు. హావేరి జిల్లా నరసీపుర నిజశరణ అంబిగర చౌడయ్య గురుపీఠానికి బియ్యం తరలించారు. స్థానిక దేవమ్మ దేవి ఆలయంలో పూజలు నిర్వహించి వాహనంలో బియ్యాన్ని తరలించారు. స్థానిక నాయకులు, తాలూకాలోని గంగామత సముదాయ ప్రజల సహకారంతో బియ్యాన్ని పంపిస్తున్నామని సముదాయ నాయకులు తెలిపారు.

అంబిగర చౌడయ్య గురుపీఠానికి వాహనంలో బియ్యం తరలిస్తున్న గంగామత సముదాయ నాయకులు

కారటగి పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో మంత్రి శివరాజ్ తంగడగి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక శుక్రవారం జరిగింది. బీసీ ఏ వర్గానికి కేటాయించిన అధ్యక్ష స్థానానికి కాంగ్రెస్ నుంచి మంజునాథ మేగూరు, భాజపా నుంచి మౌనిక ధనుంజయ, దళిత వర్గానికి కేటాయించిన ఉపాధ్యక్ష స్థానానికి కాంగ్రెస్ నుంచి సుజాత నాగరాజ్, భాజపా నుంచి ఆనంద దొడ్డమని నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తలా 13 ఓట్లు భాజపా అభ్యర్థులకు 11 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా మంజునాథ మేగూరు, ఉపాధ్యక్షురాలిగా సుజాత నాగరాజ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దార్ కుమారస్వామి ప్రకటించారు. మొత్తం 23 మంది సభ్యులున్న పురసభ లో 11 మంది కాంగ్రెస్, 11, మంది భాజపా, ఒకరు జేడీఎస్ సభ్యులున్నారు. ముగ్గురు భాజపా సభ్యులు గైర్హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శివరాజ్ తంగడగి, ఎంపీ రాజశేఖర హిట్నాళ ఎన్నికల్లో పాల్గొన్నారు.

కనకగురుపీఠం సిద్ధరామానందపురి మహాస్వామీజీ శివైక్యం

స్వామీజీ అంత్యక్రియలకు హాజరైన మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు

శివైక్యం పొందిన సిద్ధరామానందపురి మహాస్వామీజీ

మాన్వి, న్యూస్‌టుడే: కాగినెలె మహాసంస్థాన కనకగురుపీఠం (తింథిణి బ్రిజ్) కలబురగి విభాగ పీఠం సిద్ధరామానందపురి మహాస్వామీజీ శివైక్యం పొందారు. ఆయన నిష్ఠూరవాదిగా పేరుగాంచారు. తింథణి బ్రిజ్ పీఠం అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. హాలుమత సముదాయం ప్రజల సమస్యల సాధనకు ఆయన విశేషంగా శ్రమించారు. గురువారం స్వామీజీ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బైరతి సురేష్, చిన్ననీటి, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు. రాష్ట్ర పంచగ్యారంటీ యోజన అధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు, హాలుమత సముదాయం ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ అంబులెన్స్ చోదకుడిగా శివగేని

సిరివార, (మాన్వి): తాలూకా అంబులెన్స్ ఉత్తమ చోదకుడిగా శివగేనిని ఎంపిక చేశారు. తాలూకా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారి సేవలను గుర్తించి ప్రశస్తికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో శివగేనిని ఉత్తమ చోదకుడి విభాగం నుంచి ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాసిన్ బి గణేకల్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో బెట్టదేశ్వర స్వామి రథోత్సవం

బెట్టదేశ్వర స్వామి

రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకా జంగమర కల్గుడిలో బెట్టదేశ్వర స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ ఆవరణ నుంచి ప్రారంభమైన రథోత్సవం పాదగట్టె వరకు వెళ్లి తిరిగి యథా స్థానానికి చేరుకుంది. ప్రజలు భక్తితో రథానికి పూలు, పండ్లు సమర్పించుకున్నారు. ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి.

పేదల భూమిని ఆక్రమించుకోవడం సరికాదు

బళ్లారి, న్యూస్‌టుడే: కౌల్‌బజార్‌లోని దానప్ప వీధి, బండిహట్టి ప్రదేశంలో దశాబ్దాల క్రితం ప్రభుత్వం పేదలకు కేటాయించిన వందలాది ఎకరాల భూమిని బుడా మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని దళిత సంఘాలు ఆరోపించాయి. శుక్రవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు కుమార్ నమతల, కరియప్ప గుడిమని మాట్లాడారు. ప్రతాప్‌రెడ్డి చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ, జిల్లా యంత్రాంగం మౌనంగా ఉందన్నారు. జిల్లా యంత్రాంగం ప్రతాప్‌రెడ్డి చేతిలో కీలుబొమ్మలా మారిందన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం మౌనంగా ఎందుకు ఉందో చెప్పాలన్నారు. 70 ఏళ్ల క్రితం పేదలకు భూమిని కేటాయించారు. పేదలు 40 ఏళ్లుగా జవనోపాధి పొందారు. ట్రైబ్యునల్ స్వయంగా ఈ భూమిని కేటాయించింది. వహిణిలో ప్రజల పేర్లు ఉన్నాయన్నారు. 2003లో జోక్యం చేసుకున్న ప్రతాప్‌రెడ్డి ఆ భూమి తమకు చెందినదని తీసుకున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించారని వారు ఆరోపించారు. 2015లో రాష్ట్రంలోని వివిధ సంస్థలు పోరాడి భూమిని కాపాడాయని గుర్తు చేశారు. పోలీస్ శాఖ ప్రతాప్‌రెడ్డి దురాగతాలను ఆపాలి, వారు కళ్లు మూసుకుంటున్నారని ఆరోపించారు. బాధితులు ఈరేష్, వసంతరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వివాదం కోర్టులో ఉంది

ఈ భూమి వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఫైనల్ సర్వే చేస్తున్నారు. దీనిపై నేను మాట్లాడటం కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

(c) eenadu

సంక్రమణ వేళ.. సంభ్రమ హేల

గవి గంగాధరేశ్వరుడిని తాకుతున్న సూర్య కిరణాలు

మారేనహళ్లి శివాలయంలో పూజ చేస్తున్న అర్చకుడు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాజధాని నగరం బెంగళూరులోని అన్ని ప్రాంతాల్లో తీపి పొంగళ్లు నోరూరించాయి. జయనగరలో లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య, ఆయన భార్య శివశ్రీ స్కంద ప్రసాద్ నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సీకే రామ్మూర్తి, ఇతర నేతలు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు, తెలుగు, తమిళ ప్రజలు, సంఘాల ప్రతినిధులు సామూహిక ఉత్సవాలను నిర్వహించారు. గవి గంగాధరేశ్వరుని ఆలయంలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకడాన్ని వీక్షించేందుకు గురువారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన నివాసంలో గోపూజ చేసుకున్నారు. కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ పాత మైసూరు బ్యాంకు నుంచి మెజెస్టిక్ వరకు రథంలో తిరుగుతూ శనగపప్పు, బెల్లం, కొబ్బరి, నువ్వుల పొట్లాలను పంచి పెట్టారు. బుధవారం వరకు రద్దీగా ఉన్న మార్కెట్లు, వీధులు గురువారం నుంచి ఖాళీగా మారాయి. శుక్రవారం పలు వీధులు ఖాళీగా కనిపించగా, పండగలకు సొంతూళ్లకు వెళ్లిన నగరాసులు ఆదివారం నుంచి నగరానికి తిరిగి వచ్చే అవకాశం ఉంది. సిటీ బస్సులు, మెట్రో రైళ్లలో శుక్రవారం రద్దీ తక్కువగా కనిపించింది. కనుమను పురస్కరించికొని పలు హోటళ్లలో ప్రత్యేకంగా వంటకాలను తయారు చేసి వడ్డించారు. మాంసాహార హోటళ్లలో శుక్రవారం రద్దీ కనిపించింది. నగరం చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో గడ్డికి మంట పెట్టి, దాని పైనుంచి పశువులను దాటించారు. నగరానికి చేరువలోని రామచంద్ర విశ్వేశ్వరయ్య లేఅవుట్‌లో ఇలాంటి వేడుక అబ్బురగొలిపింది.


అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన లక్ష దీపోత్సవం

రామచంద్ర విశ్వేశ్వరయ్య లేఅవుట్‌లో మంటలను దాటుతున్న ఆవులు

సంస్కృతి, సంప్రదాయాలకు రక్ష

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్.నవీన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇక్కడ చిత్రదుర్గం శివారులోని మేదేహళ్లి అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత మన సంస్కృతి, ఆచార విచారాలు, పర్వదినాలపై ఆసక్తి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు భక్తుల మధ్య అవినావభావ సంబంధం ఉందన్నారు. రెండు నెలల కాలంలో అయ్యప్ప స్వామి భక్తులకు దేవాలయంలో నిర్వహించిన అన్న సంతర్పణలో సుమారు 2 లక్షల మంది భక్తులు సేవలను పొందారన్నారు. ప్రతినిధులు అరుణ్‌కుమార్, లింగారెడ్డి, బదరీనాథ్, ద్యామణ్ణ పాల్గొన్నారు.

శనగపప్పు, బెల్లం, కొబ్బరి, నువ్వులను పంచుతున్న వాటాళ్ నాగరాజ్

గోపూజ చేసుకుంటున్న డీకే శివకుమార్

పొంగలి తయారు చేస్తున్న శివశ్రీ స్కంద ప్రసాద్. చిత్రంలో తేజస్వి సూర్య, సీకే రామ్మూర్తి తదితరులు

భక్త దివిటీ.. మేలుకోటె

మండ్య, న్యూస్‌టుడే : మకర సంక్రాంతిని పురస్కరించుకుని మేలుకోటె చెలువనారాయణస్వామి ఆలయంలో మకర సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యతిరాజదాసర్ గురుపీఠం నుంచి పుష్ప కైంకర్య సేవలను అందించగా, బదరీనారాయణ స్వామి ఆలయంలో పంచపుష్పాలు, ఎండు ఫలాలతో నైవేద్యాలను సమర్పించారు. స్థానాచార్యుడు శ్రీనివాస నరసింహన్ గురూజీ అనూచాన సంప్రదాయానికి, పరంపరకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించారు. గురువారం సాయంత్రం గోధూళి వేళ చెలువ నారాయణ స్వామి, రామానుజాచార్యుల విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలతో తయారు చేసిన హారాలను వేశారు. రాత్రి ఆలయ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత చెలువనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. శుక్రవారం కూడా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.


శ్రీదేవి, భూదేవి సమేతంగా ఊరేగుతున్న చెలువ నారాయణస్వామి

చెలువరాయస్వామికి అర్పించేందుకు పూలహారాలతో వేచి ఉన్న యతిరాజదాసర్ గురుపీఠం ప్రతినిధులు

బడుగు జీవులను వీధిన పడేస్తారా?

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : కోగిలు వద్ద ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి బీటీ లలితానాయక్ డిమాండ్ చేశారు. ఇళ్లను కూల్చి మూడు వారాలవుతున్నా, ఇప్పటి వరకు వారికి పునరావాసం కల్పించలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకున్న వారిలో అర్హులకు, నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా వారిని కూల్చివేయడం దురదృష్టకరమన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆమె బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా కోగిలు చుట్టుపక్కల గుడిసెలు, తాత్కాలిక షెడ్లు వేసుకున్న వారు ప్రభుత్వ చర్యతో వీధిన పడ్డారని ఆక్రోశించారు. కూల్చిన ఇళ్ల చిరునామాతోనే ఆధార్, నీరు, విద్యుత్తు బిల్లులు, ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయని తెలిపారు. ఆరు నెలల కిందటే వారు ఇక్కడకు వచ్చి ఉంటే అవన్నీ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మానవతా దృష్టితో ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచి, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	60
బీరకాయలు-	50
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	75
కాకర కాయలు-	55
టమాటా(సాధారణ)-	55
టమాటా-	45
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	45
ఉల్లి(మేలురకం)-	40
ఉల్లి(సాధారణ)-	35
వెల్లుల్లి-	180
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	110

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

బనశంకరి.. భవ్యరూపం!

సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని బనశంకరి అమ్మవారికి చెరకు గడలు, బెల్లం ముద్దలు, వేరుసెనగ, అనపగింజలు, నువ్వులు తదితరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాజధాని నగరంలోని ఆలయం ఆవరణలోని శాకంబరి అమ్మవారు, పర్వత మల్లికార్జున స్వామికీ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అలంకరణకు ఉపయోగించిన ధాన్యం, బెల్లం, చెరకు గడలను భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు భక్తులు రాహుకాల పూజలు చేసుకున్నారు. **-న్యూస్‌టుడే, జయనగర**

ఉద్యాననగరిలో తెనుగింటి వేడుక!

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని ఎలక్ట్రానిక్‌సిటీ తెలుగు సంఘం బుధ, గురువారాల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ముచ్చటగొలిపాయి. వివిధ ప్రాంతాల నుంచి కదలివచ్చిన మూడు వేల మంది ఈ వేడుకలను ఆస్వాదించారు. సాంస్కృతిక, జానపద, సంగీత, క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం భోగిమంటలతో ప్రారంభమైన వేడుకలు.. గురువారం సంక్రాంతి, శుక్రవారం కనుమ సంబరాలతో పరిసమాప్తమయ్యాయి. మహిలకు ముగ్గుల పోటీలు, బాలలకు భోగి పండ్లు పోయడం, పల్లె ఆటలు, ఎద్దుల బండ్లపై విహారం, బసవన్న విన్యాసాలు, ఉట్టి కొట్టడం, పాడుతాతీయగా.. అంటూ సంగీత తరంగాలు, బుల్లి తెర కళాకారులతో నాటికలు.. ఇలా అనేకానేకం మెప్పించేవే. తెలుగువిజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాధాకృష్ణరాజు, ఆయన సతీమణి రాధారాజులకు జీవన సాఫల్య పురస్కారం అందించి సత్కరించారు. తెలుగువారి సమైక్యత, సంగీభావానికి ఈ వేడుకలు ప్రతీకలని ఈ సందర్భంగా రాజు వ్యాఖ్యానించారు. కన్నడిగుల రాజధాని నగరిలో తెలుగింటి వాతావరణం, పల్లె సొబగులు ఆకట్టుకునే అంశాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో తెలుగు భాష మాట్లాడేవారు 12 కోట్ల మంది ఉన్నారని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో తెలుగుభాషకు పట్టం కట్టిన పద్మశ్రీ ఎన్.టి.రామారావు, పద్మభూషణ్ రామోజీరావు సేవలను ప్రస్తావించారు. మాధ్యమ రంగంలో సేవలందిస్తున్న యుగంధర్ తదితరులనూ సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రముఖులు భాస్కరరావు విల్లా, మహేష్, శంకరరావు, శ్రీనివాస విల్లా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై బాలల విహారం

డాక్టర్ రాధాకృష్ణరాజు దంపతులను సత్కరిస్తున్న తెలుగు సంఘం ప్రముఖులు

తెలుగువారి పండగ వేళ.. బెంగళూరులో బసవన్న విన్యాసాలు

మెట్రో పరుగులకు జపాన్ సాయం!

మూడో దశ నిర్మాణానికి ముందడుగు

మూడోదశ మెట్రో మార్గంలో సంచరించే 'నారింజ' రంగు రైలు

రాజధాని వీధుల్లో 28 కిలోమీటర్ల పొడవునా నిర్మించే డబుల్‌డెక్కర వంతెన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఉద్యాననగరి పేరుచెబుతూనే ఏ ప్రాంతం వారైనా ట్రాఫిక్‌ను గుర్తుచేసుకుని హడలిపోతారు. అలాంటి రద్దీ ప్రాంతాల్లో కీలకమైన జేపీనగర- కెంపాపుర మధ్య కీలకమైన మెట్రో పనులకు సర్కారు పచ్చజెండా ఊపింది. మెట్రో మూడో దశలో నారింజ రంగు రైళ్లు పరుగులు తీయనున్నాయి. జేపీనగర నాలుగో స్టేజీ నుంచి కెంపాపుర (హెబ్బాళ), హొసహళ్లి- కడబగెరె కారిడార్ మధ్య నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియను బీఎంఆర్‌సీఎల్ ప్రారంభించింది. జేపీనగర కెంపాపుర మధ్య వలయ వర్తుల మార్గం (అవుటర్ రింగ్ రోడ్డు) మీదగా 32.3 కిలోమీటర్లు, హొసహళ్లి- కడబగెరె మధ్య 12.15 కిలోమీటర్ల పనులను ఎనిమిది ప్యాకేజీలుగా విభజించారు. మొదటి కారిడార్‌లో భాగంగా ఆరు ప్యాకేజీలు, రెండో కారిడార్‌లో రెండు ప్యాకేజీల పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఈ నిర్మాణ పనుల కోసం రూ.9692.33 కోట్లు వ్యయం చేస్తారు. ఈఏడాది జూన్‌లో మొదలుపెట్టి.. 2031 నాటికి రైలును పట్టాలెక్కిస్తారు. జపాన్ అంతర్జాతీయ సహకార బ్యాంకు సహకారంతో నిధులు సమకూరగా.. తొలిదశలో రూ.4187.41 కోట్లతో వివిధ నిర్మాణాలు కొలిక్కితెస్తారు.

- మొదటి కారిడార్ మార్గంలో డాల్మియా కూడలి నుంచి హెబ్బాళ వరకు 28.48 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ (రెండంతస్తుల) ఉపరితల వంతెన నిర్మిస్తారు. రెండో కారిడార్ మార్గంలో కె.హెచ్.బి. కాలనీ-కడబగెరె మధ్య 8.63 కిలోమీటర్ల పొడవునా ఇదే తరహా నిర్మాణానికి శ్రీకారం చుడతారు. ఈ రెండంతస్తుల వంతెనలకు అనుబంధంగా ఐదు ప్రదేశాల్లో ర్యాంప్‌లను, తొమ్మిది ప్రదేశాల్లో అనుబంధ మార్గాలు ఉండేలా చూస్తారు.
- జేపీనగర నాలుగో స్టేజీ, డాల్మియా కూడలి, జేపీనగర ఐదోస్టేజీ, జేపీనగర, కదిరేనహళ్లి, కామాక్షిపాళ్య కూడలి, హొసకెరె హళ్లి, నాగరభావి, మైసూరు రోడ్డు, నాగరభావి, వినాయక లేఔట్, సుంకదకట్ట, వినాయకలేఔట్, పాపరెడ్డిపాళ్య పరిధిలో మెట్రో ప్రయాణ ప్రాంగణాలు నిర్మించాలనేది ప్రాథమిక ప్రతిపాదన. ఇతర నిర్మాణాలు, వాణిజ్య కేంద్రాలు ఆయా ప్రాంగణాల్లో రూపుదాల్చనున్నాయి.

దేశంలోనే తొలిసారిగా రూపుదాల్చనున్న 'వలయ వర్తుల మెట్రో' సేతువు

హైకోర్టుకు కొత్త భవనంపై ప్రజాహిత వ్యాజ్యం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : కర్ణాటక ఉన్నత న్యాయస్థానానికి కొత్త భవంతులను నిర్మించేందుకు నగర కేంద్ర భాగంలో 30 ఎకరాల భూమిని కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ శరణ్ దేశాయి అనే వ్యక్తి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశాడు. గత ఏడాది అక్టోబరు 26న ఉప ముఖ్యమంత్రి శివకుమార్ నిర్వహించిన వాక్ విత్ బెంగళూరు కార్యక్రమంలో హైకోర్టు విస్తరణకు భూమి అవసరమని ప్రకటించారు. ఇప్పటికే ఉన్న భవంతి సరిపోతుందని, అదనపు భూమి అవసరం లేదంటూ శరణ్ వేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ విభు బఖ్రు, సీఎం పుణచ్ఛల పీఠం విచారణకు స్వీకరించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి, అడ్వకేట్ జనరల్‌కు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఈళిగనూరులో మద్యంపై సమరం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకా ఈళిగనూరులో ఆదివారం నుంచి మద్యం విక్రయాలు జరపవద్దని గ్రామస్థులు నిర్ణయించారు. ఈ విషయమై గ్రామంలోని మారుతేశ్వర ఆలయంలో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయాల వల్ల యువకులు మద్యానికి అలవాటుపడడం, తదితర దుష్పరిణామాలతో మద్యం అమ్మకాలు నిషేధించాలని నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్

విద్యార్థి ఎన్నికలకే మొగ్గు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో మూడున్నర దశాబ్దాల అనంతరం కళాశాలల్లో విద్యార్థుల సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా తల్లిదండ్రులు, ప్రజల అభిప్రాయాలను సేకరించాలని తీర్మానించామని వైద్య విద్యాశాఖ మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ తెలిపారు. విద్యావేత్తలు, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలతో చర్చాగోష్ఠుల అనంతరం ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 22న ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభిస్తామని తెలిపారు. మొదటి సభలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎమ్మెల్యేలు ఎం కృష్ణప్ప, రిజ్వాన్ అర్షద్, సలీం అహ్మద్, పుట్టణ్ణ, మాజీ మంత్రి వినయ్ కుమార్ సొరకె, కేపీసీసీ సామాజిక మాధ్యమ ప్రతినిధి ఐశ్వర్య మహదేవ్, ఎన్ఎస్‌యూ ప్రతినిధులు కీర్తి గణేశ్, లక్ష్య రాజ్ తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds
REAL ESTATE
PLOT FOR SALE
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్లారి : 9121167525
బెంగళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

హంపీ వేడుకలకు ఐదు వేదికలు

హొసపేటె, న్యూస్‌టుడే: వచ్చే నెల 13 నుంచి మూడు రోజులపాటు జరిగే హంపీ ఉత్సవాల్లో కళాకారులందరికీ అవకాశం కల్పించేందుకు ఐదు వేదికలను నిర్మాణం చేస్తున్నామని మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం ఆయన హంపీలో ప్రధాన వేదిక నిర్మాణ స్థల పరిశీలన చేసిన తరువాత మాధ్యమాలతో మాట్లాడారు. 13న ముఖ్యమంత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు. దేశ, విదేశాల కళాకారులకు అవకాశం కల్పిస్తున్నాం, స్థానిక కళాకారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు. అశ్విని పునీత్‌రాజ్‌కుమార్, ధ్రువసర్జా ఉత్సవాలకు రావటానికి ఒప్పుకున్నారు, మరికొంతమంది స్యాండల్ వుడ్ కళాకారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యంగా క్రీడాపోటీలు, సాహసక్రీడలు, గాలిపటాలు ఎగురవేసే పోటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలిచ్చామన్నారు. డీసీ కవిత మన్నికేరి, ఎస్పీ ఎస్.జాహ్నవి, జడ్పీ సీఈవో మహ్మదలి అక్రమ్ షా తదితరులు పాల్గొన్నారు.

హంపీలో ఉత్సవ ప్రధాన వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్

బ్యాడిగి మిరప భళా!

హావేరి, న్యూస్‌టుడే : ఈ ఏడాది బ్యాడగి మిరపకాయకు చక్కని ధర లభిస్తోంది. మొదటి గ్రేడ్ మిరప క్వింటాల్‌కు రూ.40 వేల నుంచి రూ.55 వేల వరకు ధర పలకగా, తక్కువ గ్రేడ్ మిరప రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. గత ఏడాది ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్‌లలో ఉంచిన సరకును రైతులు బయటకు తీశారు. ఈ ఏడాది కూడా ధర ఉండదని తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో బ్యాడిగి మిరపకు డిమాండ్ మరింత పెరిగింది. బ్యాడగిలో రుద్ర జాతి ఒక్కటే చక్కని దిగుబడి ఇస్తోంది. మిగిలిన రకాలు రోగాల బారిన పడుతున్నాయి. చీడ పీడలను తట్టుకుంటూ అధిక దిగుబడి ఇచ్చే బ్యాడిగి నూతన వంగడాల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు.

హావేరి సమీపాన కల్లంలో మిరపను ఆరబెడుతున్న కార్మికులు

అల.. వాణిజ్యనగరిలో!

హుబ్బళ్లి వీధులకు సంక్రాంతి వేడుకలు కొత్త సంబరాన్ని తెచ్చి పెట్టాయి. నగరంలోని ఓ కూడలిలో పొంగలు వండివార్చడానికి నడుం బిగించిన నారీలోకం.. **-న్యూస్‌టుడే, హుబ్బళ్లి**

తోకలేని పిట్టలకు సింధూరం

మైసూరు, న్యూస్‌టుడే : రంగాయణ రజతోత్సవాల్లో భాగంగా మైసూరు (బహురూపి' ప్రాంగణంలోని సుచిత్ర ఆర్ట్ గ్యాలరీలో ప్రత్యేక తపాలా బిళ్లలు, ఫస్ట్‌డే కవర్లు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణేలు, రాజుల పాలనలోని నాణేలను ప్రదర్శనకు ఉంచారు. కోలారు జిల్లా ముళబాగిలు తాలూకాకు చెందిన హెచ్‌కే సతీశ్ హాసన జిల్లా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ద్వితీయశ్రేణి సహాయకునిగా సేవలు అందిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రం ఉన్న తపాలా బిళ్లలు, ఫస్ట్‌డే కవర్లు, అంబేడ్కర్ ఫొటోలను ఎక్కువగా సేకరించారు. వాటితో పాటు వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణేలను పదివేలకు పైగా సిద్ధం చేశారు. వీటిలో ఎక్కువ అంబేడ్కర్ నాణాలే ఉన్నాయి. రిజర్వు బ్యాంకు ఆయా సందర్భాల్లో ప్రముఖుల ముఖ చిత్రాలతో ముద్రించిన నాణేలు సతీశ్ సేకరణలో ఉన్నాయి. అంబేడ్కర్ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని 1965లో మొదటిసారిగా తపాలా శాఖ తపాలాబిళ్లను విడుదల చేసింది. వాటితో పాటు స్వాతంత్ర్య పోరాట యోధులు, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన 500 తపాలా బిళ్లలు ఆయన వద్ద చూడొచ్చు. ప్రపంచంలో మొదటి ఖాదీ పోస్టు, త్రీడీ, ప్లాస్టిక్ స్టాంపులు, తపాలా కవర్లను తీసుకువెళ్లేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన పట్టు సంచి తదితరాలు ముచ్చటగొలుపుతాయి. తన సేకరణకు ఇప్పటి వరకు నాలుగు జాతీయ పురస్కారాలు అందుకున్నానని సతీశ్ తెలిపారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్న ఆయన రానున్న రోజుల్లో లిమ్కా, గిన్నిస్ రికార్డు పుస్తకాల్లోనూ పేరు నమోదుకు ప్రయత్నిస్తున్నారు.

సందర్శకులకు తన సేకరణ వివరాలు చెబుతున్న సతీశ్

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

వేడుకల్లో పాల్గొన్న పాఠశాల సిబ్బంది, ఫౌండేషన్ ప్రతినిధులు

పాఠశాలలో సంక్రాంతి సుగ్గి

చిక్కబళ్లాపుర: మకర సంక్రాంతి పురస్కరించుకుని డిబ్బూరులోని న్యూసెంట్రల్ ఆంగ్ల పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం నిర్వహించిన సంక్రాంతి సుగ్గికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు తాము తీసుకువచ్చిన కూరగాయలు, తాము చేసిన బొమ్మలను ఇతర విద్యార్థులకు విక్రయించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు వ్యాపార కౌశల్యాన్ని ఒంటబట్టించుకునేందుకు ఈ తరహా కార్యక్రమాలు సహకరిస్తాయని ఎంఎం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎస్ ఉమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె మంజుల, ఇతర బోధకులు పాల్గొన్నారు.

బాలికను సత్కరించిన దర్శకురాలు

బెంగళూరు (మారతహళ్లి): అమెరికాలో నిర్వహించే విఖ్యాత సన్ డ్యాన్స్ చలనచిత్రోత్సవాలకు ఎంపికైన మొదటి కన్నడ లఘు చిత్రం 'పంకజ' దర్శకురాలు అనూయా స్వామి బెంగళూరుకు విచ్చేశారు. తన చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన అగరలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థిని పద్మశ్రీని బాలికకు తల్లి పాత్ర పోషించిన హర్షిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగస్వామి కలిసి సత్కరించారు. తాను అగరలోనే పుట్టి పెరిగానని, తాను తెరకెక్కించిన లఘు చిత్రం అమెరికాలో చలనచిత్రోత్సవాలకు ఎంపికై గుర్తింపు పొంది, ప్రశంసలు రావడం తనకు సంతోషాన్ని కలిగిస్తోందని అనూయా స్వామి పేర్కొన్నారు.

పద్మశ్రీని సత్కరించి అభినందిస్తున్న అనూయా స్వామి

హోసూరు కబుర్లు

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

హోసూరు, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ నివాసానికి వెళ్లిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయ భవనంలో ఈ సందర్భంగా ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉచితాలను తన చేతుల మీదుగా వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి మోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా కలెక్టరుకు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలిసిన హోసూరు మేయర్

హోసూరు, న్యూస్‌టుడే: పొంగల్ పండగ సందర్భంగా చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన హోసూరు మేయర్ ఎస్.ఎ.సత్య శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కాసేపు ఇద్దరూ ముచ్చటించుకున్నారు. హోసూరు అసెంబ్లీ స్థానంలో డీ.ఎం.కె. అభ్యర్థి విజయం సాధించడం తథ్యమని స్టాలిన్‌కు ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా కృష్ణగిరి జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో డీ.ఎం.కె. ఫ్రంటు అభ్యర్థులు గెలుపొందడం ఖాయం అని సత్య ధీమా వ్యక్తం చేశారు.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెల్పిన హోసూరు మేయరు సత్య

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిత: సీఎం

క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కళాకారులు

తుమకూరు, న్యూస్‌టుడే: ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ తదితర క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్లతో పాటు పోలీసు, అటవీశాఖల్లో 3శాతం రిజర్వేషన్లతో ఉద్యోగావకాశాలను కల్పిస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి క్రీడాకారులను ప్రోత్సహించే నేపథ్యంలో క్రీడల్లో బంగారు పతకాలు గెలుపొందిన వారికి రూ. 6కోట్లు, వెండి పతకాలు సాధించిన వారికి రూ. 4కోట్లు, కాంస్యపతక విజేతలకు రూ. 3 కోట్ల నగదు బహుమానం ఇవ్వనున్నట్లు పునరుద్ఘాటించారు. నగరంలోని మహాత్మాగాంధీ క్రీడాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు 2025-26 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం సిద్ధరామయ్య మాట్లాడారు. తుమకూరు క్రీడా పోటీల నుంచి క్రీడాకారులు ప్రపంచస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలోనే చదువులతో పాటు క్రీడలు సైతం అలవరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడల నుంచి క్రమశిక్షణ, ఐక్యత, సమయస్ఫూర్తి వంటి ఉత్తమ గుణాలు చేకూరతాయని చెప్పారు. ఇక్కడ క్రీడా పోటీలు జరగడానికి జిల్లా మంత్రి పరమేశ్వర్ చొరవ చూపారని స్వయంగా ఆయన ఓ అథ్లెట్ కావడం విశేషమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు విచ్చేశారు. మంత్రి పరమేశ్వర్ విజ్ఞప్తి మేరకు తుమకూరులో హాకీ క్రీడాంగణంతో పాటు అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్‌పూల్‌కు రూ. 25 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు సిద్ధరామయ్య తెలిపారు. సీఎంకి ఆరోగ్యసమస్య ఉన్నప్పటికీ క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి విచ్చేశారని మంత్రి పరమేశ్వర్ పేర్కొన్నారు. తుమకూరులో 27 ఒలింపిక్ క్రీడల్లో 25 ఇక్కడే నిర్వహిస్తున్నామని హాకీ, స్విమ్మింగ్ మాత్రం బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విధానపరిషత్ సభ్యుడు రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవిందరాజు, మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు టి.బి.జయచంద్ర, కె.ఎన్.రాజణ్ణ ఎమ్మెల్యేలు జ్యోతిగణేశ్, సురేశ్‌గౌడ, కృష్ణప్ప, షడాక్షరి హెచ్.వి.వెంకటేశ్, గుబ్బి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు రాజేంద్ర, రమేశ్‌బాబు విధానసభా ఛీఫ్‌విప్ అశోక్ పట్టణ్ జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ అశోక్, క్రీడా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే వివిధ క్రీడాపోటీలు ప్రారంభం అయ్యాయి. సుమారు 4500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

కన్యకా పరమేశ్వరికి పుష్పాలంకరణ

పట్టణంలోని బజార్ వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో మకర సంక్రాంతి రోజున దేవీకి విశేష అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, అయ్యప్పస్వామి భజన మండలి వాసవి సేన సభ్యులు పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, ముళబాగిలు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

భూమిపూజ చేస్తున్న సురేశ్‌కుమార్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: రాజరాజేశ్వరినగర విధానసభ క్షేత్రంలో ప్రజ్ఞావంతులు, విద్యావంతులు ఉన్న క్షేత్రం, ప్రజల సమస్యలను పరిష్కరించి సేవ చేయాలనే దృక్పథంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం క్షేత్రంలోని దయానందనగర వార్డ్ ఆర్.జి.ఐ కాలనీ ఆశ్వత్థకట్టె రోడ్డు, ఆలయం రోడ్డుకు తారు రోడ్డు పనులు, మురికి కాల్వల శుభ్రత, శ్రీరామపుర ఏవో మెయిన్‌లో తారు రోడ్డు పనులకు పూజా కార్యక్రమాన్ని సురేశ్‌కుమార్, పాలికె మాజీ సభ్యుడు ఎం.మునిరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలి. జనసేవ జనస్పందన కార్యక్రమాలను ప్రతివారం ఒక్కో వార్డులో ఉదయం నడకతో నిర్వహిస్తున్నామన్నారు. జనస్పందన కార్యక్రమంలో సమస్యలను పరిష్కారం లభించాలన్నారు. ఈ సందర్భంగా జీబీఏ అధికారులు, భాజపా నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

కెమెరాలను దారి తప్పిస్తున్న నంబరు ప్లేట్లు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: నగరంలోని పలు కూడళ్లలో మోటారు వాహన నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులను గుర్తించేందుకు ఏఐ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఏర్పాటు చేసిన అనంతరం పలువురు నిబంధనలను ఉల్లంఘించేందుకు భయపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి వెళ్లే వాహనాలపై ఉన్న నంబర్లను ఈ ఏఐ కెమెరాలు తక్కున పట్టేస్తాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు కొందరు నంబరు ప్లేటును తలకిందులుగా బిగించుకోవడం, నంబరు కనిపించకుండా కాగితాన్ని, వస్త్రాన్ని అడ్డుపెట్టడం, తప్పుడు నంబరు ప్లేటు బిగించుకోవడం, అంకెలను దిద్దడం చేస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. అటువంటి వారికి జరిమానాలు విధించేందుకు ప్రత్యేక కార్యాచరణను కొనసాగిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గత మూడేళ్లలో దోషపూరిత నంబరు ప్లేట్లతో వాహనాలు నడుపుతూ 4.2 లక్షల మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక కెమెరా వద్ద ట్రాఫిక్ పోలీసులు

ఉవ్వెత్తున ఉత్సాహం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలో పండగ సంబరాలు ఘనంగా జరిగాయి. మకర సంక్రాంతి ఇంటింటా ఆనందం వెల్లివిరిసింది. ఏవేవో కొత్త ఆశల చిగురింపులు. అంతా ఈ సంబరాల్లో సంబరంతో పరస్పరం ఒకరినొకరు అభినందించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ భక్ష్యాలు పండ్లు, పసుపు, కుంకుమలు, నువ్వులు బెల్లం మిశ్రమాన్ని పంచుకుంటూ బాలికలు, యువతులు, ముత్తైదువుల సందడి పండగకు మరింత శోభనిచ్చాయి. వివిధ సంఘాలు,. సంస్థలు ఆటపాటలు నిర్వహించటంతో ఈ పండగ మరింత కళ సంతరించుకుంది. సాయంత్రం గోధూళివేళ పేరంటాల హడావుడి..యువతుల కేరింతలతో ఆత్మీయత వెల్లివిరిసింది. పశువులను సర్వాంగ సుందరంగా అలంకరించి వాటికి పండ్లు తినిపించి, దిష్టి తీసే క్రమంలో నిప్పులపై దాటించటం..యువకులకు సాహసాల సంబరమే అయింది. మూడ్రోజులుగా నగర వాసులు పండగ సందడిలో మునిగితేలారు.

ఇవన్నీ పంచాలా.. వద్దు నేనే తినేస్తా..

ఎళ్లు బెల్ల పంచటానికి వచ్చిన బాలికలు..

మఠాధిపతికి తులాభారం

ఉడుపి, న్యూస్‌టుడే: నాల్గో పర్యాయాన్ని ముగించిన పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థకు యతికుల చక్రవర్తి బిరుదును శుక్రవారం ప్రదానం చేశారు. మఠం ఆవరణలో భక్తులు ఆయనకు నాణేలతో తులాభారం చేశారు. గత రెండేళ్లుగా తనకు పూర్తి సహకారాన్ని అందించిన అదమారు మఠాధిపతి విశ్వప్రియ తీర్థకు శ్రీకృష్ణ ప్రియకృతం పురస్కారాన్ని సుగుణేంద్ర తీర్థ ప్రదానం చేశారు. కృష్ణుని ఉత్సవ మూర్తికి భగవద్గీతతో తులాభారాన్ని నిర్వహించారు.

విధానసౌధ వద్ద కుటుంబ సభ్యులతో హెజ్జె సభ్యులు

సైకిళ్లపై ప్రయాణించిన కార్పొరేటు ఉద్యోగులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఉద్యాననగరిలో ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వినియోగించుకోవాలని, సైకిళ్లను వినియోగించాలని కోరుతూ కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు హెజ్జె (అడుగు) గ్రూపుగా ఏర్పడ్డారు. విధానసౌధ నుంచి నగరంలోని వివిధ మార్గాల్లో సైకిళ్లపై సంచరిస్తూ జాగృతి కల్పించారు. సైకిళ్లను వినియోగించుకోవడం, దగ్గరి ప్రదేశాలకు నడిచి వెళ్లడం, ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలన్న పిలుపుతో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు టెకీలు, అంకుర పరిశ్రమల సీఈఓలు పాల్గొన్నారు.

సాహస జల క్రీడా విజేత నగర వనిత

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: జాతీయ జూనియర్ కయాక్ స్లాలోమ్ సాహస జలక్రీడా పోటీల్లో కర్ణాటక తరపున పాల్గొన్న ప్రాంజలాశెట్టి కాంస్యపతకాన్ని సాధించి తన సత్తాను నిరూపించుకొన్నారు. నదీ ప్రవాహంలో పడవ సహాయంతో అడ్డంకులను దాటి ప్రయాణించడం ప్రవాహంలో అమర్చిన గేట్ల మధ్య నుంచి దూసుకెళ్లడమే ఈ సాహస జలక్రీడా పోటీ. ఇందులో పాల్గొని పతకం సాధించి ప్రాంజలా కర్ణాటక పేరును నిలబెట్టారని ప్రశంసలు వెల్లువెత్తాయి. శుక్రవారం కర్ణాటక కయాకింగ్ కెనోయింగ్-పడవ సంఘం కార్యదర్శి కెప్టెన్ దిలీప్‌కుమార్ ఆ వివరాలు తెలిపారు. మధ్యప్రదేశ్ మహేశ్వరలో గురువారం ముగిసిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా జూనియర్ పడవ క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రాంజలాశెట్టి పతకం సాధించాలనే పట్టుదలతో కఠోరంగా శ్రమించి పతకాన్ని ఖాతాలో వేసుకున్నారు. సాహస జలక్రీడలో పతకం సాధించిన ప్రాంజలా శెట్టి యువతరాలకు స్ఫూర్తిగా నిలిచారని, ఆమెకు శిక్షణనిచ్చిన కోచ్‌ను కూడా రాష్ట్ర కయాకింగ్, కనోయింగ్ సంఘం అభినందించింది.

కాంస్య పతకం సాధించిన ప్రాంజలాశెట్టి

కేఓఎఫ్ వాహనాలపై వాణిజ్య ప్రకటనలకు రూ.2 వేల పన్ను

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: చిత్రదుర్గంలో కల ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ (కేఓఎఫ్) సంస్థకు చెందిన వాహనాలపై ఆ సంస్థ వాణిజ్య ప్రకటనలను ఏర్పాటు చేయడానికి ప్రతి వాహనానికి రూ.2 వేలు చొప్పున ప్రభుత్వానికి పన్నులు చెల్లించి అనుమతులు తీసుకోవాలని జిల్లా పాలనాధికారి వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ తన కార్యాలయంలో నిర్వహించిన రహదారి సురక్షతా సమితి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో సంచరిస్తున్న 15 ప్రయివేటు బస్సు రూట్ల సేవలను విస్తరించాలని వచ్చిన ప్రతిపాదనలను ఆర్టీఓ పరిశీలించి నియమాల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోగలరని తెలిపారు. సభలో ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఆర్టీఓ భరత్, ఆర్టీఓ కార్యాలయం సూపరింటెండెంట్ హేమంతకుమార్ పాల్గొన్నారు.

రహదారి సురక్షతా సమితి సభకు అధ్యక్షత వహించిన జిల్లా పాలనాధికారి వెంకటేశ్

ఆలయాల్లో విశేష పూజలు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే: తాలూకాలోని డెంకణీకోట, తళి, అంచెట్టి కెలమంగలం, రాయకోట ప్రాంతాల్లో పొంగల్ పండగ సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఇందులో భాగంగా కెలమంగలం జీవా నగర్‌లోని శ్రీ వెక్కాలియమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ఆరాధన, అర్చన, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. పూజల్లో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయం తరపున అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు.

మానసిక చికిత్సాలయాన్ని సందర్శించిన జిల్లా పాలనాధికారి

ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్

కృష్ణగిరి (డెంకణీకోట) న్యూస్‌టుడే: కృష్ణగిరి పాత ఆసుపత్రి ఆవరణలోని మానసిక చికిత్స కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అందరికీ నూతన వస్త్రాలను అందించి మిఠాయిలు, పొంగలు పంచారు. సమానత్వ పొంగల్‌ను జిల్లా కలెక్టర్ కొనియాడారు. చికిత్స పొంది సంపూర్ణ ఆరోగ్యం పొందిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బోలాకుమార్‌కు ఆయన ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం ఆరోగ్యాధికారి మధు, వైద్యులు, కృపానిధి, వాణిశ్రీ, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన ఆభరణాలు స్వాధీనం

ముళబాగిలు, న్యూస్‌టుడే: కేజీఎఫ్ పోలీసులు భారీ నగల చోరీ కేసును ఛేదించి రూ.కోటి విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు శివాన్షు రాజ్‌పుత్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 4 న బంగారుపేట నివాసి, నగల వ్యాపారి కె.ఎం.సునీల్‌కుమార్ చోరీపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు తన ఇంట్లోకి ప్రవేశించి సుమారు 1355 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ. 95000 నగదును దోచుకొని పారిపోయారన్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం డీఎస్పీ లక్ష్మయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వాసి 45 ఏళ్ల రాయపాటి వెంకయ్య అలియాస్ వెంకన్నగా గుర్తించారు. నిందితుడు అప్పటికే చిత్తూరు జైలులో..పలమనేరులో జరిగిన ఒక నేరానికి సంబంధించి నిర్బంధంలో ఉన్నట్లు తెలిపారు. విచారణ కోసం కేజీఎఫ్ పోలీసుల ద్వారా అతణ్ని బయటకు తీసుకువచ్చి సుమారు రూ. కోటి 5 లక్షల 48 వేల విలువైన 879 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

మానసిక ఒత్తిడి తగ్గడానికి క్రీడలు చక్కని ఔషధం

పావగడ, న్యూస్‌టుడే: తాలూకాలోని కరియమ్మనపాళ్య గ్రామంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని గురు,శుక్రవారం రెండు రోజులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలలో ఐదు జట్లు పాల్గొనగా ఫైనల్‌కు తిరుమల బాయ్స్, పవర్ హిట్టర్స్ జట్లు చేరాయి. శుక్రవారం ఫైనల్ పోటీలో తిరుమల బాయ్స్ జట్టు విన్నర్‌గా, కె.పాళ్య పవర్ హిట్టర్స్ రన్నర్స్‌గా నిలిచాయి. మాజీ గ్రామ పంచాయతీ సభ్యుడు కె.హెచ్.అంజననాయక గెలుపొందిన వారికి బహుమతులను అందచేసిన అనంతరం మాట్లాడుతూ కళ,సాహిత్య, సంగీత, క్రీడలలో పాల్గొన్న వారందరికి మానసిక ఒత్తిడి నుండి బయటపడి మంచి ఆరోగ్యం పొందుతారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తిప్పేస్వామి, గ్రామ యువ నాయకులు ఓంకారనాయక, కె.చిన్నప్ప, గోపాల, న్యాయనిర్ణేతలుగా కె.పి.కరియణ్ణ, రాజగోపాల, గోవిందరాజు, తిమ్మరాజు, మారుతి తదితరులు వ్యవహరించారు. క్రీడలకు అంజననాయక, ధను,మోహన్,హేమంత్, గ్రామ యువత మహిళలు సహాయ సహకారాలు అందచేశారు.

విజేతలకు ట్రోఫీ అందచేస్తున్న ప్రముఖులు

ట్రస్టు నేతృత్వంలో గోపూజలు

సంప్రదాయక వేడుకల్లో అంబిక, కేటీ చంద్రు తదితరులు

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే: నగరాల్లో ఉంటున్నా సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయడం మర్చిపోకూడదని కర్ణాటక ఆర్ట్ కల్చరల్ ఎడ్యుకేషనల్ ఎన్‌లైట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సి.అంబిక పేర్కొన్నారు. సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని రాష్ట్ర ఒక్కలిగర డైరెక్టరీ ట్రస్టు వ్యవస్థాపకుడు కేటీ చంద్రుతో కలిసి రాజరాజేశ్వరినగరలో గోపూజను నిర్వహించి మాట్లాడారు. ఉద్యాననగరికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చినా, స్థానికులు ఇప్పటికీ తమ మూలాలను మర్చిపోకుండా పండగలు ఆచరించుకుంటూ, కళలు, కళాకారులను ఆదరించడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాది ఆర్ఎల్ఎన్ మూర్తి, వివిధ సంస్థల ప్రతినిధులు కేసీ రక్షిత, ఆచార్య యతీశ్, వెంకటప్ప, డాక్టర్ హర్ష నింగప్ప తదితరులు గోపూజ, ఇతర వేడుకల్లో పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే: డెంకణీకోట శివారు కారండపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప కొడుకు అమరేశ్(28) అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. బోడిచిపల్లి వద్ద కారైకాల్ పాసింజర్ రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. 10 ఏళ్లుగా తమ్మాండ్రపల్లి గ్రామంలోని ప్రైవేటు కర్మాగారంలో కాంట్రాక్ట్ పనికి వెళ్లేవాడు. అతనికి ఆన్‌లైన్ గేమ్, జూదం ఆడే అలవాటు ఉంది. దీంతో అప్పులు చేసి అవి తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే రైల్వే పోలీసులు వచ్చి శవాన్ని స్వాధీనం చేసుకొని శవపరీక్షలకు హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసి వివాహిత దారుణ హత్య

ముళబాగిలు. న్యూస్‌టుడే: కోలార నగర శివార్లలోని బంగారుపేటలోని జిగ్‌జాగ్ రోడ్డు సమీపంలో గురువారం వివాహిత సుజాత(28) దారుణహత్యకు గురయింది. ప్రియుడే ఆమె గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. బంగారపేట దాసర్హొసహళ్లి గ్రామానికి చెందిన ఈమె యలబుర్గి గ్రామానికి చెందిన తనకన్నా ఏడాది చిన్న వాడైన చిరంజీవి వలలో పడింది. ఘటనా స్థలంలోనే నిందితుణ్ని పట్టుకున్న స్థానికులు తీవ్రంగా కొట్టి కోలార నగర పోలీసులకు అప్పగించారు. హొసకోటెలోని ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న నిందితుడు డబ్బు వసూలు చేయడానికి వెళ్తూ సుజాతతో పరిచయం పెంచుకున్నాడు. వారు ప్రేమించుకున్నారు. వారిద్దరు వివాహితులే. ఆమెకు ఒక బిడ్డ ఉంది..అతనికి కూడా ఒక బిడ్డ ఉంది. భర్తను వదిలేసిన సుజాత విడిగా జీవించేది. స్థానికుల దాడిలో గాయపడిన నిందితుడు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్పీ కన్యకా సిక్రివాల్ తెలిపారు.

డైరెక్టరీని ప్రదర్శిస్తున్న రామలింగారెడ్డి, గోపాలయ్య, విఠలమూర్తి, కిరణ్, ప్రహ్లాద్ తదితరులు

ఇతర అంశాలపై దృష్టి పెట్టండి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రచార మాధ్యమాలకు సూచించారు. అధికార మార్పిడికి సంబంధించిన కథనాలే నిత్యం ప్రచురించినా, టీవీలలో చర్చించినా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం కల్గదన్నారు. బెంగళూరు పాత్రికేయుల గిల్డ్ సువర్ణ మహోత్సవాల్లో భాగంగా కర్ణాటక లాన్ టెన్నిస్ సంస్థలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టరీని విడుదల చేసి మాట్లాడారు. పాత్రికేయులు, ప్రచారమాధ్యమాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను అవలోకించుకోవలసిన అవసరం ఉందని గిల్డ్ పూర్వ అధ్యక్షుడు ఏఎం సురేశ్ పేర్కొన్నారు. సంఘటిత పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మాధ్యమ అకాడమి పూర్వ అధ్యక్షులు ఎం.సిద్ధరాజు, సదాశివ శెణై, సీనియరు విలేకరులు బీపీ మల్లప్ప, మైసీ పాటిల్, బెళగూరు సమీవుల్లా, శాంతలా ధర్మరాజు, మాజీ మంత్రి కె గోపాలయ్య, గిల్డ్ అధ్యక్షుడు విఠలమూర్తి, గిల్డ్ వ్యవస్థాపక సభ్యుడు ప్రహ్లాద్ కుళలి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

In the Court of the Prl. Sr. Civil Judge Kurnool
I.A No- 119/2025 - In I.P.No- 59/2018

K.Venkateswarlu and others - **Petitioners**

-Vs-

K.Nagi Reddy and anothers - **Respondents**

Notice to Respondent No-2 Under Section 53 and 54 of Provincial Insolvency ACT

2) U.Malleswari Devi W/o U.Naresh Kumar, R/o Marison Layout, Near Sapthagiri Hospital, Chikkasandra, Banglore, North, Banglore, Karnataka
పై నెంబర్ I.P లో అర్జీదారు ఈ క్రింద కనపరచిన అంశముల పైన పైఅర్జీ దాఖలు చేసినాడు.
Hence as per the orders in the above I.P we are filing this Petition to annual the Regd gift deeds executed by the Respondent No-2, in favour of the Respondent No-2 dt: 27-08-2018 Pertaining to the schedule mentioned properties
ఇందుపైన 2వ రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ ఉన్న 29-01-2026 తేదీన పగలు 10.30 గం॥కు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.
షెడ్యూలు: Residential flat bearing No- 408(Physically in third floor) with House No- 87/1380-3-408, In Sy No- 665 of Kalluru called as Sai Vasanth Vihar Apartment, Located in Dhanalakshmi Nagar of Kurnool with in Sub- Registration of Kalluru and Registration District of Kurnool and bounded as follows
Boundaries for total Apartment: East- Land of Joharapuram people, **West-** Nandyal Road, **North-** Land of Laver Ibrahim in the same Sy. No, **South-** Land of Laver Ibrahim in the same Sy.No.
Boundaries for Flat No- 408: East- 6.6 feet corridor, Flat No.401, **West-** Set back open place, **North-** open sky Lift or Flat No- 407, **South-** 6.6 feet corridor and Flat No- 403, **Total Site extent:** 2308.05 sq.yards, out of it undivided share of 49.38 sq.yards with Flat Plinth area of 1095 sq.feet
2) Open Site in Sy.No: 192 of Laxmipuram Village, Kalluru Mandal, Kurnool Dist. Measuring about AC- 0.97 Cents (Southern Site Plot) with in Sub- Registration office of Kalluru and Registration District of Kurnool and bounded as follows: **East-** Land of Kuruva Pullana, G.Pullanna, G.Venkatramudu, **West-** Land of Gorolla Sunkanna, **North:** Land of K.Venkateswar Reddy, **South-** Land of Kuruva Bazaru and Shapur Maddilety.
కోర్టువారి ఉత్తర్వు మేరకు
B.V.రమణా రెడ్డి, అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు, ఏ.పి. సెల్: 94400 79646

నాగరభావి చెరువు పునర్ధురణ..

పర్యావరణ పరిరక్షణ

జలకళ సంతరించుకొన్న చెరువు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: మొన్నటి వరకు ఎండిపోయి చెత్తతో నిండి ఉన్న నాగరభావి చెరువును గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) అభివృద్ధి చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి జలకళ వచ్చింది. చుట్టుపక్కల భూగర్భ జలాల మట్టం పెరిగింది. బోరుబావులకు జలకళ వచ్చినట్లు అధికారులు గుర్తించారు. 6.5 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు బాగు చేశారు. చెరువు చుట్టూ నడక దారి అభివృద్ధి చేశారు. పక్కన చిన్నపాటి మొక్కలు నాటి ఉద్యానవనంగా మార్చారు. ఆక్రమణలకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేశారు. వాతావరణంలో మార్పులు రావడంతో చల్లదనం ఏర్పడటంతో పక్షులు రాక ప్రారంభమై చెరువు గట్టుపై ఉన్న చెట్లపై పక్షులు గూళ్లు కట్టుకున్నాయి. మొన్నటి వరకు పాడుబడిన మురికి గుంతలా ఉండేది. చుట్టుపక్కల ప్రజలు చెరువు బాగు చేయాలని సంబంధిత అధికారులను కలిసి విన్నవించుకున్నారు. ఎట్టకేలకు అధికారులు చెరువు మరమ్మతులు చేపట్టారు. వాననీరు నిలబడే విధంగా పూడిక తొలగించారు. గట్టు ఎత్తు పెంచి ఎక్కువ నీరు నిలబడే విధంగా చర్యలు తీసుకున్నారు. నీరు ఉండటంతో చుట్టుపక్కల వాతావరణంలో మార్పు రావడంతో పాటు భూగర్భజలాల మట్టం పెరిగినట్లు ప్రాధికార అధికారులు తెలిపారు.

నీరు నిలబడేందుకు పూడిక తొలగించారు

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి

క్రీడాకారుడు తిప్పేస్వామి యాదవ్‌కు చెక్కు అందజేస్తున్న సుజాత సత్యప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: మంగళూరులో జరిగిన పరుగు పోటీల్లో కుడితిని పట్టణానికి చెందిన తిప్పేస్వామి యాదవ్ 42 కిలోమీటర్ల పరుగులో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. యువకుడి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఆర్.సుజాత సత్యప్ప రూ.30 వేలు ప్రోత్సాహ ధనం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో విజేతగా నిలవాలని కోరారు.

రాయచూరు ఉత్సవ్ వాయిదా

విడుదల చేసిన లోగో

రాయచూరు: నెలాఖరులో జరగాల్సిన రాయచూరు ఉత్సవ్ వాయిదా పడింది. ఫిబ్రవరి 6 నుంచి 8వరకు నిర్వహించాలని జిల్లా యంత్రాంగం తీర్మానించింది. జిల్లా పాలనాధికారి నితీశ్ ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ కుమారనాయక్, హట్టి గోల్డ్‌మైన్ పాటిల్ లేఖ ద్వారా తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వరకు నిర్వహించాలని ప్రత్యేక సమావేశం జరగనున్న నేపథ్యంలో వాయిదా వేశారు. రెండు దశాబ్దాల తర్వాత ఉత్సవ్ నిర్వహించే విషయం తెలిసిందే. కేవలం వారం రోజులు ఆలస్యంగా నిర్వహిస్తుండడం ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం కాలేదు. ఉత్సవ్ వాయిదా పడినా నిర్వహణ పనులు కొనసాగించాలని జిల్లా పాలనాధికారి అధికారులకు నిర్దేశించారు. సమితులు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. జనవరి 31, ఫిబ్రవరి 1న బాలల ఉత్సవాన్ని జరపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి

సింధనూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని వీబీ జీ రామ్ జీగా మార్చిన కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి తెలిపారు. ఆయన శుక్రవారం సింధనూరు గాంధీ కూడలిలో కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ, వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఒక రోజు ఉపవాస సత్యాగ్రహం చేపట్టారు. ఆయనతో పాటు ఆయన అనుచరులు కూడా ఈ దీక్షలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద ప్రజల పొట్ట కొట్టినట్లయిందని అన్నారు. పథకం పేరు మార్పుతో జాతిపితను కూడా అవమానించిందని విమర్శించారు. తక్షణం ఈ పథకాన్ని రద్దు చేయాలి..లేకుంటే మా ఆందోళన మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

సంక్రమణ వేళ.. సంభ్రమ హేల

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాజధాని నగరం బెంగళూరులోని అన్ని ప్రాంతాల్లో తీపి పొంగళ్లు నోరూరించాయి. జయనగరలో లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య, ఆయన భార్య శివశ్రీ స్కంద ప్రసాద్ నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సీకే రామ్మూర్తి, ఇతర నేతలు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు, తెలుగు, తమిళ ప్రజలు, సంఘాల ప్రతినిధులు సామూహిక ఉత్సవాలను నిర్వహించారు. గవి గంగాధరేశ్వరుని ఆలయంలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకడాన్ని వీక్షించేందుకు గురువారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇవి ముఖ్య నుంచి ఖాళీగా మారాయి. శుక్రవారం పలు వీధులు ఖాళీగా కనిపించాయి. పండగకు సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు ఆదివారం నుంచి నగరానికి తిరిగి వచ్చే అవకాశం ఉంది. సిటీ బస్సులు, మెట్రో రైళ్లలో శుక్రవారం రద్దీ తక్కువగా కనిపించింది. కనుమ పురస్కరించిన పలు హోటళ్లలో ప్రత్యేకంగా వంటకాలను తయారు చేసి వడ్డించారు. మాంసాహార హోటళ్లలో శుక్రవారం రద్దీ కనిపించింది. నగర చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో గడ్డికి మంట పెట్టి, దాని పైనుంచి పశువులను దాటించారు. నగరంలోని చేరువలోని రామచంద్ర విశ్వేశ్వరయ్య లేఅవుట్‌లో ఇలాంటి వేడుక అబ్బురపరిచింది.

రామచంద్ర విశ్వేశ్వరయ్య లేఅవుట్‌లో మంటలను దాటుతున్న వృషభాలు

మంత్రి డీకే శివకుమార్ తన నివాసంలో గోపూజ చేసుకున్నారు. కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ పాత మైసూరు బ్యాంకు నుంచి మెజెస్టిక్ వరకు రథంలో తిరుగుతూ సెనగపప్పు, బెల్లం, కొబ్బరి, నువ్వుల పొట్లాలను పంచి పెట్టారు. బుధవారం వరకు రద్దీగా ఉన్న మార్కెట్లు, వీధులు గురువారం

గవి గంగాధరేశ్వరుడిని తాకుతున్న సూర్య కిరణాలు

గోపూజ చేస్తున్న డీకే శివకుమార్

శోభాయమానంగా మకర సంక్రాంతి

తుంగభద్రమ్మలో పుణ్య స్నానాలు

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాంతిని సంప్రదాయ పద్ధతిలో జరుపుకొన్నారు. పల్లె, పట్నం, నగరం అనే తేడా లేకుండా పండగ సందడితో తొణికిసలాడాయి. కన్నడ, ప్రవాసాంధ్రుల లోగిళ్లు శోభాయమానంగా అలరారాయి. అతివృష్టి, ధరల పెరుగుదల పండగపై ఏమాత్రం ప్రభావం చూపలేదు. సాయంత్రం నుంచి దేవాలయాలను దర్శించుకున్నారు. గురువారం ఉత్తరాయణ కాలం ప్రవేశించిన నేపథ్యంలో తుంగభద్ర, కృష్ణా నదీ తీరాలు రద్దీగా మారాయి. దేవదుర్గ తాలూకాలోని వీరగోట, లింగదహళ్లి, హూవిన హెడగి, అణ్ణే మల్లేశ్వర, గూగల్‌కు దగ్గర్లోని కృష్ణానది, కలబురగి, యాదగిరి జిల్లాలోని బీమా నది భక్తుల సమూహంతో నిండింది. కుటుంబ సమేతంగా పుణ్య స్నానాలు చేసి పునీతులయ్యారు. పితృదేవతలకు తర్పణం వదలి నైవేద్యం పెట్టారు. అనంతరం గట్టుపైన సద్ద రొట్టెలు, ఓలిగలు, నూనె వంకాయ, చిత్రాన్నం ఆరగించారు. జిల్లాలో పేరుగాంచిన ధార్మిక క్షేత్రాలైన కొప్పర లక్ష్మీ నరసింహస్వామి, గూగల్ ప్రభు దేవస్థానం (దేవదుర్గ తాలూకా), దత్తాత్రేయ, నారదగడ్డ, ఎలిబ్చొలి, పంచముఖి ఆంజనేయ, దేవసూగూరు(రాయచూరు), గురుగుంటా అమరేశ్వర(లింగసూగూరు), కల్లూరు లక్ష్మీదేవి(సిరివార), నీరమాన్వి ఎల్లమ్మ(మాన్వి), అంబా భవానీ(సింధనూరు) ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. రాయచూరుకు 42 కిలోమీటర్ల దూరంలోని మంత్రాలయం రాఘవేంద్ర స్వామి బృందావనం కర్ణాటక భక్తులతో కిక్కిరిసింది. జిల్లా నుంచి శ్రీశైలం, మహానంది, హంపీ, కూడల సంగమానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పండగ ముగిసినందున ప్రయాణాలు చేసే వారితో రాయచూరు బస్టాండ్ కిటకిటలాడుతోంది.

సంప్రదాయబద్ధంగా..

నదీ తీరంలో సామూహికంగా భోజనాలు చేస్తున్న జనం

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకా వ్యాప్తంగా వివిధ క్యాంపుల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగువారు రంగవల్లులు (ముగ్గులు), భోగిమంటలు, పిండి వంటలతో సందడి చేశారు. గంగానగర్ క్యాంపులో మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. ప్రజలు స్థానిక దేవాలయాల్లో పూజలు చేశారు. స్థానిక కన్నడ సోదరులు సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సమేతంగా నదీ స్నానాలు ఆచరించి, నదీ తీరంలోనే సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. నదీ స్నానానికి వచ్చే భక్తులకు నిర్మల తుంగభద్ర అభియాన్ సభ్యులు సెనగ పిండి పాకెట్లను పంపిణీ చేశారు. నది నీటి కాలుష్యంపై అవగాహన కల్పించారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

రాయచూరు, న్యూస్‌టుడే: ఉపాధి పథకం ప్రధాన ఉద్దేశాన్ని నీరు గార్చేందుకే ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును మార్చిందని వైద్య విద్యాశాఖ, జిల్లా బాధ్య మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీలకు ఉన్న అధికారాన్ని నియంత్రించి, అవసరమైతే కేంద్రం ఆధ్వర్యంలో పనులు జరిగేలా మార్పులు చేశారని, దీని వల్ల అందరికీ పని కల్పించలేని పరిస్థితి తలెత్తగలదన్నారు. వంద రోజుల పని దినాల వల్ల కూలీల, కార్మికుల వలసలు తగ్గిపోయాయని, కేంద్రం అనాలోచిత విధానం వల్ల పథకం భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్నారు. ఆర్‌ఎస్ఎస్ భావజాలాన్ని పరోక్షంగా రుద్దేందుకే కొత్త పేరును పెట్టారని సందేహాన్ని వ్యక్తం చేశారు. ఒక్కూట (ఫెడరల్) వ్యవస్థలో అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే చట్టంలో మార్పులు తీసుకురావాలని, అయితే ఎటువంటి చర్చలు చేయకుండా హడావుడిగా బిల్లును ఆమోదించుకోవాల్సిన అవసరమేముందని? నిలదీశారు. రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచిన కారణంగా ఆర్థిక భారాన్ని మోయడం కష్టమవుతుందన్నారు. మహాత్మాగాంధీ పేరును పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ ఆందోళన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, హంపయ్యనాయక్, ఎమ్మెల్సీలు వసంతకుమార్, శరణేగౌడ బయ్యాపుర, డీసీసీ అధ్యక్షుడు బసవరాజ పాటిల్ ఇటగి, ఆర్‌డీఏ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ నాయకులు జయణ్ణ, శివమూర్తి, పామయ్య మురారీ, ఆంజనేయ కురుబదొడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాశ్

పాత్రికేయుల నిధి అభినందనీయం

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరు రిపోర్టర్స్ గిల్డ్ రూపొందించిన 2026 నూతన కాలమానిని విడుదలైంది. గురువారం పత్రికా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గిల్డ్ మాజీ అధ్యక్షుడు సురేంద్రచార్ కొర్తకుంద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి క్యాలెండర్ విడుదలకు కారణమైన అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ హూగార, కార్యవర్గం, సంస్థాపక సభ్యులను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో విలేకర్లకు ఆర్థిక సాయం చేసేందుకు నిధిని ఏర్పాటు చేయడం శ్లాఘనీయమని పేర్కొన్నారు. దాతలు నిధికి సాయం చేయాలని కోరారు. కాలమానినికి డిజైన్ చేసిన ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్ ఇనాందార్‌ను సత్కరించారు. విలేకరులు సణ్ణ ఈరణ్ణ, జయరామ్, రఘునాథరెడ్డి మన్సలాపూరు, చెన్నబసవ, చంద్రకాంత్ హాజరయ్యారు.

కాలమానిని విడుదల చేస్తున్న సురేంద్రచార్ తదితరులు

తుంగభద్ర నది వద్ద శనగ పిండి పంపిణీ

స్వచ్ఛత కరపత్రాలు ప్రదర్శిస్తున్న అభియాన్ ప్రతినిధులు

కంప్లి: కంప్లి నిర్మల తుంగభద్ర అభియాన ప్రతినిధులు మకర సంక్రాంతి రోజు కోటె తుంగభద్ర నది వద్ద శనగ పిండి పంపిణీ చేశారు. అభియాన సంచాలకుడు డాక్టర్ భట్టా రామాంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి ఉత్తరాయణ ప్రారంభం నాడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో నదీ స్నానానికి వస్తారు. సబ్బులు, షాంపూ తదితరాలను వాడడం వల్ల నది నీరు కలుషితమవుతుంది. వాటికి బదులు శనగ పిండిని వాడాలంటూ పంపిణీ చేశామని తెలిపారు. నది స్వచ్ఛతను కాపాడాలంటూ కర పత్రాలను ప్రదర్శించారు. అభియాన ప్రతినిధులు అమరే గౌడ, ఇటిగి విరుపాక్షి, బి.వి.గౌడ, నిరంజన గౌడ, పత్రయ్య స్వామి పాల్గొన్నారు.

సదా భక్తుల సేవలో రుద్రమునీశ్వర మఠం

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలో ప్రసిద్ధి గాంచిన చికల్‌పర్వి రుద్రమునీశ్వర మఠం, కరేగుడ్డ మహంతేశ్వర మఠం భక్తుల సేవల్లో తరిస్తున్నాయి. ఇక్కడ నిత్య అన్నదానం జరుగుతోంది. భక్తులు ఏ సమయంలో మఠానికి వచ్చినా వారికి ప్రసాద వితరణ చేయనిదే పంపరు. ఈ క్రమంలో తుంగభద్ర నది తీరంలో ఉన్న రుద్రమునీశ్వర మఠానికి మూడు రాష్ట్రాల భక్తులు వస్తుంటారు. నది అవతల ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి తెప్పలు, అరగోలు మీద ఇక్కడి వచ్చి మఠాన్ని సందర్శించుకుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సందర్భంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు, ప్రజలు, పాదచారులు వస్తుంటారు. వీరికి ఇబ్బంది కలగకుండా మఠం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు పండుగ వంటకాలతో విశేష అన్నసంతర్పణ చేశారు. సదాశివమహా స్వామీజీ పర్యవేక్షణలో మఠం అభిమానులు, భక్తులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మఠంలో నిర్వహిస్తున్న అన్నసంతర్పణ

ఉత్తమ అంబులెన్స్ చోదకుడిగా శివగేని

సిరివార,(మాన్వి):తాలూకా అంబులెన్స్ ఉత్తమ చోదకుడిగా శివగేనిని ఎంపిక చేశారు. తాలూకా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వారి సేవలను గుర్తించి ప్రశస్తికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో శివగేనిని ఉత్తమ చోదకుడి విభాగం నుంచి ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాసిన్ బి గణేకల్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సాంస్కృతిక ప్రదర్శనల్లో కళాకారుల సందడి

కార్యక్రమాలను వీక్షిస్తున్న జగ్గీ వాసుదేవ్

అన్నదాతకు దన్నుగా నిలవండి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ఆహార పరిస్థితి, నీటి కొరత, క్షీణిస్తున్న భూసారం, అన్నదాతల దుస్థితికి సంబంధించిన అంశాలపై మేధావులు నిత్యం కనీసం రెండు నిమిషాలు మాట్లాడాలని ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్ పిలుపునిచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని చిక్కబళ్లాపుర సమీపంలోని ఈషా ఫౌండేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడం, సేద్యాన్ని లాభదాయక ప్రక్రియగా మార్చవలసిన అవసరం ఉందన్నారు. మన దేశంలో పండగల ఆచరణ వెనుక ప్రత్యేకత ఉంటుందని చెప్పారు. ప్రకృతితో మమేకమై భారతీయులు పండగలు చేసుకుంటారని గుర్తు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరులో బెంగళూరులో లింగభైరవి, నవగ్రహ ఆలయాలు, తీర్థ కుండల ప్రతిష్ఠను చేపడుతున్నామని ప్రకటించారు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 2 వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈషా ఫౌండేషన్‌కు వెళ్లే మార్గంలో భద్రత కోసం ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్పీ కుశాల్ చౌక్సీ భద్రతను పర్యవేక్షించారు.

కనకగురు పీఠం స్వామీజీ కన్నుమూత

సిద్ధరామనంద స్వామీజీ

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా దేవదుర్గ తాలూకాలోని కాగినెలె గురుపీఠం మహాసంస్థానం కలబురగి విభాగం పీఠాధిపతి సిద్ధరామనందపురి(49) శివైక్యమయ్యారు. గురువారం తెల్లవారుజామున గుండె నొప్పి రావడంతో భక్తులు లింగసూగూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక పరమపదించారు. స్వామీజీ సింధనూరులో తొలుత గురుపీఠాన్ని నెలకొల్పారు. దేవదుర్గ పరిధిలోని తింతిణి వంతెనకు దగ్గర్లో 2001లో కలబురగి విభాగ పీఠాన్ని స్థాపించారు. పలు మఠాల స్వామీజీలు, ప్రజా ప్రతినిధులు, అసంఖ్యాక భక్తులు స్వామీజీ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 14 వరకు పీఠం ఆవరణలో జరిగిన పాలు మత సాహిత్య వైభవం కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్రదుర్గం జిల్లా చెళకెర తాలూకా కలమరహళ్లిలో జన్మించిన ఆయన తన 18వ ఏటే ఆధ్మాత్మిక బాట పట్టారు. పూర్వాశ్రమంలో స్వామీజీ పేరు మోహన్. చెళ్లకెరె ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు.

హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు

అంత్యక్రియలకు హాజరైన ప్రజాప్రతినిధులు

మాన్వి,న్యూస్‌టుడే: రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బైరతి సురేష్, చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు. రాష్ట్ర పంచగ్యారంటీ యోజన అధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు హాలు మత సముదాయం ప్రముఖులు స్వామీజీ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

భాగ్యనగరానికి బస్సుల కొరత

రాయచూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్‌కు తెలంగాణ ఆర్టీసీ తగినన్నీ బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. మాములు రోజుల్లోనైతే బస్టాండ్‌లోకి ప్రవేశించగానే బస్సులు సిద్ధంగా ఉండేవి. రెండు రోజులుగా ఆ పరిస్థితి లేదు. ఒక బస్సు కూడా కన్పించడం లేదు. హైదరాబాద్‌లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే రాయచూరు వాసులు చాలా మంది ఉన్నారు. పండగ చేసుకుని తిరిగి వెళ్లే వారితో భాగ్యనగరం బస్సుల ప్లాట్‌ఫారం రద్దీగా ఉంటోంది. తగినన్ని బస్సులు లేక ప్రయాణికుల సంఖ్య ఎక్కువై సీట్ల కోసం ఎగబడుతున్నారు. ఐదు నిమిషాలకే బస్సు పూర్తిగా నిండిపోతోంది. మరో బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక నిలబడే ప్రయాణం చేస్తున్నారు. ఉదయం పూట కర్ణాటక వాహనాలు అంతగా లేవు. సాయంత్రం రాయచూరు-కాచిగూడ, పర్బాని ఎక్స్‌ప్రెస్‌లు బయలుదేరుతాయి. ఈ రైళ్లు రాత్రి 9 తర్వాత చేరుతున్నందున వీటిలో వెళ్లేందుకు మొగ్గు చూపడంలేదు. దీంతో గత్యంతరం లేక తెలంగాణ బస్సులను ఆశ్రయిస్తున్నారు. తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 10 గంటల వరకు 53 తెలంగాణ బస్సులు సంచరిస్తాయి. వీటిలో చాలా వాహనాలను సంక్రాంతి సందర్భంగా కోసాంధ్ర జిల్లాలకు నడుపుతుండడంతో కొరత ఏర్పడింది. ఏటా ఈ సమయంలో బస్సులు మళ్లిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. పండగ ముందు మూడు రోజులు, తర్వాత నాలుగు రోజులు ప్రత్యామ్నాయ వాహన వ్యవస్థ కల్పించాలని డిమాండు చేస్తున్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణ సారథులు ఉపాధ్యాయులు

సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు

కంప్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాణ సారథులని కంప్లి ఎమ్మెల్యే గణేశ్ వ్యాఖ్యానించారు. కంప్లి వీరశైవ భవనంలో శుక్రవారం తాలూకా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రి బాయి పులే జయంతి కార్యాక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కంప్లిలో విద్యా శాఖ కార్యాలయం ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నాను. తాలూకాలోని ఎమ్మిగనూరు, దేవసముద్ర గ్రామాలకు కర్ణాటక పబ్లిక్ పాఠశాలలు మంజూరయ్యాయన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు హనుమంతప్ప మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సత్కరించారు. బీఈవో సిద్ధలింగమూర్తి, టీపీ అధికారి శ్రీకుమార్, మల్లన గౌడ, టి.ఎం.బసవరాజ్, దొడ్డ బసప్ప, సునీత పూజారి, అంబిగర మంజునాథ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర అన్న దానానికి 43 క్వింటాళ్ల బియ్యం

కారటగి, న్యూస్‌టుడే: నిజశరణ అంబిగర చౌడయ్య జాతర అన్న దానానికి తాలూకాలోని గంగామత సముదాయ నాయకులు, ప్రజలు 43 క్వింటాళ్ల బియ్యం పంపించారు. హావేరి జిల్లా నరసీపుర నిజశరణ అంబిగర చౌడయ్య గురుపీఠానికి బియ్యం తరలించారు. స్థానిక దేవమ్మ దేవి ఆలయంలో పూజలు నిర్వహించి వాహనంలో బియ్యాన్ని తరలించారు. స్థానిక నాయకులు, తాలూకాలోని గంగామత సముదాయ ప్రజల సహకారంతో బియ్యాన్ని పంపిస్తున్నామని సముదాయ నాయకులు తెలిపారు.

అంబిగర చౌడయ్య గురుపీఠానికి వాహనంలో బియ్యం తరలిస్తున్న గంగామత సముదాయ నాయకులు

రంగుల దుకాణం దగ్ధం

మాన్వి,న్యూస్‌టుడే: స్థానిక బసవ కూడలి వద్ద ఉన్న లక్ష్మీవెంకటేశ్వర పెయింట్ షాపు (రంగుల దుకాణం) అగ్నికి ఆహూతైంది. శుక్రవారం ఉదయం దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించి మొత్తం కాలిపోయింది. బిచ్చాలి వీరేశ్‌బాబు అనే వ్యాపారి వివిధ కంపెనీల పెయింట్లు విక్రయిస్తుంటారు. తెల్లవారుజామున ప్రమాదం జరగటం, దుకాణంలోంచి పొగబయటకు వచ్చే వీలులేకుండా భవన నిర్మాణం చేయడంతో లోపల మంటలు, పొగ బయటికి కనిపించలేదు. అంగడి లోపల వస్తువులన్నీ కాలిబూడిద అయిపోయాయి. అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలు పక్కదుకాణాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్షలు విలువైన రంగుల డబ్బాలు, తిన్నర్లు, బ్రష్‌లు ఇతర సామగ్రి మొత్తం కాలిపోయాయి.

ముగ్గురు మహిళల అదృశ్యం

సిద్ధమ్మ గిరిజమ్మ విశాలాక్షి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి మహిళా పోలీస్ స్టేషన్ వ్యాప్తికి చెందిన సిద్ధమ్మ(61) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

● బళ్లారి: బళ్లారి నగర మహిళా పోలీస్‌స్టేషన్ వ్యాప్తికి చెందిన గిరిజమ్మ (78) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గిరిజమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

● బళ్లారి: బళ్లారి మహిళా పోలీస్ స్టేషన్ వ్యాప్తికి చెందిన విశాలాక్షి(55) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలుగు, కన్నడ భాషల్లో మాట్లాడుతుంది. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

16-01-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1604.40	1622.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,210	12,002
నీటి నిల్వ (టి.ఎం.సి)	27.767	68.261

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

పాలికె సమరానికి సన్నాహాలు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) పరిధిలోని ఐదు నగరపాలికెల పరిధి 368 వార్డులకు జూన్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఈనెల 20న రాష్ట్ర ఎన్నికల సంఘం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలా? ఈవీఎంలు ఎంచుకోవాలా? అనే అంశంపై చర్చిస్తారు. నోడల్ అధికారులు, జీబీఏ చీఫ్‌కమిషనర్, ఐదు పాలికెల కమిషనర్లు, నగరాభివృద్ధిశాఖ అధికారులు పాల్గొంటారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ చేపడతారు. రిజర్వేషన్ల కేటాయింపు, అభ్యంతరాలు, బీఎల్‌ఓల నియామకం, పోలింగు కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి, భద్రతాంశాలు చర్చిస్తారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ పరీక్షల నిర్వహణ తేదీలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల తేదీ ప్రకటిస్తారు.

రక్షణ దళాలే యువతకు ఆదర్శం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : భారతీయ రక్షణ దళాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ పిలుపునిచ్చారు. సైన్యంలో చేరడం అంటే వ్యక్తిగత హితాసక్తిని పక్కన పెట్టి, దేశసేవకు అంకితం కావడమేనని గుర్తుచేశారు. హలసూరు మద్రాసు ఇంజినీరింగ్ గ్రూపు ఆవరణలోని యుద్ధ స్మారకం వద్ద గురువారం నిర్వహించిన 78వ సేనా దినోత్సవంలో విశ్రాంత సైనికులు, అమరవీరుల కుటుంబాలకు స్మరణికలు, బహుమతులను వితరణ చేసి మాట్లాడారు. నేటి యువతకు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వం, అందరితో కలిసి పని చేసే విలువలు అత్యంత అవసరమని తెలిపారు. సేవే పరమాత్మ అనేది భారతీయ సైన్యానికి ధ్యేయవాక్యమని గుర్తు చేశారు. సైనికులు దేశ సరిహద్దుల వద్ద ఉండడంతోనే దేశ పౌరులు అందరూ ప్రశాంతంగా ఉంటున్నారని పేర్కొన్నారు. రక్షణ శాఖ అధికారులు మేజర్ జనరల్ వీటీ మ్యాథ్యూ, అజయ్ సింగ్ ఠాకూర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల కుటుంబ సభ్యులకు స్మరణికలు, బహుమతులు అందిస్తున్న గహ్లోత్

ఈతకు వెళ్లి నీటిపాలు

మాన్వి,న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు నీటిపాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సంక్రాంతి పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, యువతీ, యువకులు నదీ స్నానాలు చేసేందుకు చికల్‌పర్వి గ్రామం సమీపంలో ప్రవహించే తుంగభద్ర నదికి వచ్చారు. కర్ణాటక (మాన్వి తాలూకా) వైపున నది ఎండిపోయి గుంతల్లో మాత్రమే నీరు నిల్వ ఉండగా ఆంధ్రప్రదేశ్ వైపు నదీ పాయలో నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది యువకులు నదిలో ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు అటువైపునకు వెళ్లారు. మాన్వి తాలూకా రాజలదిన్ని గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి కుమారుడు వంశీరెడ్డి(17) ఈత కొట్టేందుకు నదిలో దూకాడు. ఆ ప్రాంతం లోతుగా ఉండటాన్ని గమనించకపోవటంతో నీట మునిగిపోయాడు. అక్కడ స్నానాలు చేస్తున్న వారు వంశీని రక్షించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.


వంశీరెడ్డి మృతదేహం

(c) eenadu

ఇద్దరు బిజద ఎమ్మెల్యేల సస్పెన్షన్

సనాతన్ మహంకుడో

అరవింద మహాపాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద అధినేత నవీన్ పట్నాయక్ ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారు. గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేందుఝర్ జిల్లా చంపువా ఎమ్మెల్యే సనాతన్ మహంకుడో, కేంద్రపడ జిల్లా పట్కురా శాసనసభ్యుడు అరవింద మహాపాత్ర్‌లు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో చర్యలు తీసుకున్నామని నవీన్ పేర్కొన్నారు.

★ సనాతన్ చంపువాలో విలేకరులతో మాట్లాడుతూ... తాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని చెప్పారు. బిజద 25 ఏళ్ల పాలనలో కేందుఝర్ జిల్లా నిర్లక్ష్యానికి లోనైందని, అభివృద్ధి జరగలేదని పేర్కొన్నానని, తాను చెప్పింది వాస్తవమేనని అన్నారు. తాను అధినేత (నవీన్)ను ధిక్కరించలేదన్నారు. భువనేశ్వర్‌లో అరవింద మాట్లాడుతూ... తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తాను తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులపైనే దృష్టి సారించానని, పార్టీకి విధేయంగా ఉన్నానని చెప్పారు. తనను సస్పెన్షన్ చేయడం వెనక కారణాలు అంతు చిక్కడం లేదన్నారు.

పండగపూట రైతన్నకు కన్నీళ్లు

మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితి గారబంద పంచాయతీ పరిధిలోని కోయి కొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర సబర్ మూడు ఎకరాలలో పండించిన ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అందరూ సంక్రాంతి పండుగలో సందడిగా ఉన్న సమయంలో ఇలా ఏడాది కాలం పండించిన పంట కళ్లముందే బూడిద కావడంతో ఆ రైతు పడిన బాధ వర్ణనాతీతం. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సందడిగా సంక్రాంతి ఉత్సవాలు..

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామ్‌నగర్‌లో హైటెక్ ప్లాజా భవనం ప్రాంగణంలో మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయి. పరలా కళా సంస్కృతి సేవా ట్రస్ట్ హైటెక్ సంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రహి, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. గంజాం జిల్లా సన్నాఖెముండి ఎమ్మెల్యే రమేష్ జెనా, రాయగడ జిల్లా గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, సినీ నటుడు ఆలీ, జబర్దస్త్ బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో నృత్యాలు అందరినీ అలరించాయి.

మణిపూర్ కళాకారుల సాహస నృత్యం

ఆలీని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

18న చిలికాలో పక్షుల లెక్కింపు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం, పూరీ, ఖుర్దా జిల్లాల్లో విస్తరించిన చిలికా సరస్సులో ఈ నెల 18న పక్షుల లెక్కింపు జరుగుతుందని చిలికా వన్యప్రాణి డివిజన్ అధికారి (డీఎఫ్‌వో) అమ్లాన్ నాయక్ తెలిపారు. శుక్రవారం బల్లుగాంలోని చిలికా ఒడ్డున ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. మొత్తం 22 బృందాలు లెక్కింపుల్లో పాల్గొంటాయని, శనివారం లెక్కింపుల్లో పాల్గొనే వారికి శిక్షణ కల్పిస్తామని డీఎఫ్‌వో నాయక్ వివరించారు. ఏటా శీతాకాలంలో దేశ, విదేశాల నుంచి వివిధ జాతులకు చెందిన లక్షలాది పక్షులు చిలికాకు వలస వస్తున్న సంగతి తెలిసిందే.

20న డాల్ఫిన్లు.. చిలికాలో ఎరావడి జాతి డాల్ఫిన్లున్నాయి. వీటిని ఈ నెల 20న లెక్కిస్తామని డీఎఫ్‌వో నాయక్ పేర్కొన్నారు. ఇందుకోసం 18 బృందాల్ని నియమిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19న లెక్కింపుల్లో పాల్గొనే వారికి శిక్షణ ఇస్తామని ఆయన వెల్లడించారు.

అవినీతి చేపలకు విజిలెన్స్ చెక్..!

2025లో రికార్డు స్థాయిలో దాడులు

జయపురంలో విజిలెన్స్ కార్యాలయం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లంచం తీసుకుంటున్న ఉద్యోగులపై విజిలెన్స్ విభాగం కన్నేసింది. ఒకదాని తరువాత ఒకటి దాడులు కొనసాగిస్తుండటంతో లంచగొండులకు ఊపిరి ఆడటం లేదు.

◆ 2025లో అధికారులు కొరాపుట్ డివిజన్ పరిధిలోని 41 మందిపై కేసులు పెట్టి, జైలుకు పంపించింది. దీంతో పాటు 74 కేసుల్లో 168 మంది ప్రభుత్వ ఉద్యోగులు, వ్యక్తులపై ఛార్జ్ షీట్లు దాఖలు చేశారు.

◆ జయపురం, భవానీపట్న విజిలెన్స్ కోర్టులలో 8 కేసుల్లో 8 మంది అవినీతిపరులు దోషులుగా తీర్పు ఇచ్చారు. విజిలెన్స్ చిక్కిన వారి నుంచి భారీగా సొత్తును స్వాధీనం చేసుకుని, ఊచలు లెక్కపెట్టించారు.

◆ మల్కాన్‌గిరి వాటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంతను మహాపాత్ర్‌పై దాడి చేసి ఆస్తులతో పాటు రూ.2.8 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

◆ డిప్యూటీ రేంజర్ రామచంద్ర ఇంటి నుంచి రూ.1.43 కోట్ల విలువైన నగదు 3 బహుళ అంతస్తుల భవనాలు, 2 ప్లాట్లు, 1.504 కిలోల బంగారం, 4.06 గ్రాముల వెండి, 2 ద్విచక్రవాహనాలు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు.

◆ రాయగడ వాటర్ ప్రాజెక్టు డైరెక్టర్ దయానిధి బాగ్‌కు చెందిన నవరంగ్‌పూర్‌లోని 84 ఎకరాల భూమి, 46 ఎకరాల ఫామ్ హౌస్, 2 భవనాలు, భువనేశ్వర్‌లో ఒక ఫ్లాట్, కారుతో పాటు రూ.58 లక్షలకు పైగా బ్యాంక్ డిపాజిట్లు జప్తు చేశారు.

◆ జయపురం ట్రెజరీ షియాన్ హరిశ్చంద్ర మహాపాత్ర్‌కు చెందిన రూ.46 లక్షల పోస్టల్ డిపాజిట్‌తో పాటు 229.14 గ్రాముల బంగారం, మల్కాన్‌గిరి బ్లాక్ జూనియర్ ఇంజినీర్ నిహార్ రంజన్ మూడు అంతస్తుల భవనం, 8 ప్లాట్లు, 71 గ్రాముల బంగారం ఆధీనంలోకి తీసుకున్నారు.

◆ సీడీపీవో సుశీలా షబార్, క్లర్క్ రామచంద్ర పాత్ర్ రూ. 80,000 లంచం తీసుకుని పట్టుబడగా, లక్ష్మీపూర్ బ్లాక్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకా పట్నాయక్ రూ. 50,000 లంచం తీసుకుని దొరికారు.

◆ బిసింగ్‌పూర్ పోలీస్ ఏఎస్సై నర్సింగ్ రూ.40,000 లంచం, దశమంత్‌పూర్ రాణా అధికారిణి సుకుమా హడా 20, 000 తీసుకుంటూ అధికారులను పట్టుకున్నారు. డిసెంబరులో సిమిలిగుడ రేంజర్ శత్రుఘ్న లెక్కకు మించి ఆస్తులు కలిగినట్లు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై దాడులు చేశారు.

జగన్నాథుని సన్నిధిలో శిల్పాశెట్టి పూజలు

ప్రముఖ బాలీవుడ్ తార శిల్పా శెట్టి గురువారం సాయంత్రం తల్లితో కలసి పూరీ వచ్చారు. శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో పూజలు చేశారు. సేవాయత్‌లు వారికి స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. –న్యూస్‌టుడే, గోపాలపూర్

వైద్యుడిగా నమ్మించి రూ.22 లక్షలు కాజేశాడు

పోలీసుల అదుపులో నిందితుడు

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: వివాహ వెబ్‌సైట్‌లో ఓ మహిళను వైద్యుడిగా నమ్మించి, ఆమె నుంచి రూ.22 లక్షలు కాజేసిన నిందితుడిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. భువనేశ్వర్ శివారులోని పహల్ పోలీస్‌స్టేషన్‌లో దీనికి సంబంధించి కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు బాధిత మహిళ 2021లో ఓ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్‌ను పోస్టు చేశారు. ఇదే వెబ్‌సైట్‌లో నిందితుడు వైద్యునిగా ఆమెను పరిచయం చేసుకొని తన సోదరుడి కోసం వధువు కావాలని ప్రతిపాదించాడు. ఇందుకు ఆమె అంగీకారం తెలిపిన నేపథ్యంలో 2021 జూన్, డిసెంబర్‌ల మధ్య పెళ్లి ప్రస్తావన పేరుతో వివిధ కారణాలు చెప్పి బాధితురాలి నుంచి రూ.22.70 లక్షలను కాజేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి విచారణ చేపట్టగా, నిందితుడు రెండు చరవాణులు వినియోగిస్తూ వైద్యుడు బ్యాంకు ఉద్యోగిగా నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు బయటపడింది. నిందితుడి వలలో ఇంకెంతమంది బాధిత మహిళలు ఉన్నారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉత్సవాలకు సన్నద్ధమవుతున్న గోపాల్‌పూర్ తీరం

తీర సంబరాలు తేదీల మార్పు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ తీర సంబరాలు తేదీలు మారాయి. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే వేడుకలు 30 వరకు (4రోజులు) వేడుకలు జరపాలని నిర్ణయించారు, గతంలో 22 నుంచి 27 వరకు (5రోజులు) జరుగుతాయని ఉత్సవ సంఘం అధ్యక్షుడు, వాణిజ్య రవాణా శాఖ మంత్రి బిభూతి భూషన్ జెనా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అనివార్య కారణాల వల్ల స్వల్ప మార్పులు చేశామని, దీనిపై గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్ ఇతర అధికారులతో చర్చించినట్లు మంత్రి న్యూస్‌టుడేకు చెప్పారు. 27న గవర్నరు కంభం పాటి హరిబాబు ఉత్సవాలను ప్రారంభిస్తారని, ముగింపు వేడుకలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పాల్గొంటారన్నారు. సముద్ర హారతులు, ఓలీవుడ్, బాలీవుడ్ తారల స్టార్‌నైట్ కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు ఉంటాయన్నారు.

ధరలు వింటే దడే..!

కూరగాయలు	ధర (కిలో) (రూ.ల్లో)
వంకాయలు	50
టమాట	60
బెండకాయలు	80
క్యాబేజీ	100
కాకర	100
ఉల్లిపాయలు	30
అల్లం	80
బంగాళా దుంపలు	25

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వ్యవసాయానికి అనుకూల ప్రాంతమైన కొరాపుట్ జిల్లాలో కూరగాయలు అందుబాటు ధరల్లో లభ్యమవుతుంటాయి. శీతాకాలంలో కూరగాయల పంటలపై తీవ్రమైన మంచు కురవడంతో పంటలు పాడయ్యాయి. దీంతో ఎన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి. ప్రజలకు ధరలు విని చుక్కలు కనిపిస్తున్నాయి.

★ శీతాకాలంలో పంట పాడై దిగుబడి తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణమని రైతులు చెబుతున్నారు. మరోవైపు పంట చేతికి అందగానే విక్రయించాల్సిందేనని దాచుకునేందుకు శీతల గిడ్డంగులు లేవని దీంతో డిమాండ్ ఎక్కువై రేట్లు పెరిగాయన్నారు. ★ పంట కాపాడుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు కూరగాయాల పంట వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉత్పత్తి సైతం తగ్గిపోతోంది.

సిమిలిగుడలో కూరగాయలు విక్రయిస్తున్న గిరిజనులు

★ ఇంతింత ధరలు పెరుగుతుంటే సామాన్య మానవులు కూరగాయలు ఎలా కొనుగోలు చేయగలరని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

సీత కొండపై రద్దీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితి గారబంద గ్రామ ప్రాంతంలో ఉన్న సీత కొండపై గురు, శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేలాది మందితో ఆ ప్రాంతం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అనేక రకాల చర్యలు చేపట్టారు. ఈ కొండ ప్రత్యేకత రావణుని వధించిన అనంతరం శ్రీరామచంద్రుడు ఇక్కడికి విజయ యాత్ర చేసుకొని వచ్చాడని, ఆ సమయంలో సీతమ్మవారు. ఈ కొండపైనే బస చేసుకొని ఉండేవారని మహేంద్రగిరి లక్ష్మీ బాబా తెలిపారు. ఏటా కనుమ, ముక్కనుమ రోజున గజపతి జిల్లాతో పాటు శ్రీకాకుళం జిల్లా నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొని అక్కడి అమ్మవారిని దర్శించుకుంటూ, సంతోషంగా గడుపుతున్నట్లు తెలిపారు.

కొండపైకి కాలినడకన వస్తున్న భక్తులు

బౌద్ధ సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాంతి, సమత, మమత, సమైక్యతలకు ప్రతీకగా నిలుస్తున్న బౌద్ధ సంస్కృతి పరిరక్షణ, బౌద్ధ రామాల వికాసానికి ప్రభుత్వం ప్రాధాన్యతిచ్చిందని ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. జాజ్‌పూర్ జిల్లాలోని ఉదయగిరిలో వారం రోజుల అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనం గురువారం రాత్రి జరిగింది. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాతి మాట్లాడుతూ... జగన్నాథ సంస్కృతికి నిలయమైన ఒడిశా అన్నిధర్మాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోందన్నారు. ఇక్కడ బౌద్ధ సంస్కృతికి బీజం పడిందని, బౌద్ధరామాలు వెలిశాయని, పురాతనమైన చారిత్రక కట్టడాలు ఆధునీకీకరణకు పర్యాటక, సాంస్కృతికశాఖలు సన్నాహాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో యువజన క్రీడలు, సాంస్కృతిశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, బౌద్ధ గురువులు పాల్గొన్నారు. 1,700 మంది బౌద్ధ గురువులు, భిక్షువులు పాల్గొంటున్న సంగతి తెలిసిందే.

జ్యోతి వెలిగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి, మంత్రి సూర్యవంశీలు

భువనేశ్వర్‌లో రగ్బీ పోటీలు ప్రారంభం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రగ్బీ ఇండియా సౌజన్యంతో రాష్ట్ర క్రీడా శాఖ, ఒడిశా రగ్బీ సంఘాల ఆధ్వర్యంలో పదో సబ్‌జూనియర్ జాతీయ రగ్బీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో 21వరకు నిర్వహిస్తున్న వీటిని రాష్ట్ర క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్రాల జట్లు పోటాపోటీగా ఆడి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని మంత్రి చెప్పారు. అనంతరం ఆయన వివిధ రాష్ట్రాల జట్ల కెప్టెన్లతో కరచాలనం చేశారు. ప్రారంభ వేడుకల్లో క్రీడా శాఖ కార్యదర్శి సచిన్ యాదవ్, అదనపు కార్యదర్శి బీకే స్వయిన్, సంచాలకుడు విజయ్ ఎద్దుల, రగ్బీ ఇండియా, ఒడిశా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అండర్-15 బాలికల జట్లు తలపడుతున్నాయి. తొలిరోజు జరిగిన ప్రారంభ మ్యాచులో ఒడిశా బాలికల జట్టు 35-0 గోల్స్‌తో ఉత్తర్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందింది.

ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సూర్యవంశీ, క్రీడాశాఖ అధికారులు. చిత్రంలో క్రీడాకారులు

సుందర్‌గఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు

రిజెంట్ మార్కెట్ కూడలిలో భద్రతా బలగాల కాపలా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం పట్టణంలోని రిజెంట్ మార్కెట్ వద్ద రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులపై రాళ్లు విసిరారు. ఒక కానిస్టేబుల్‌కు గాయమైంది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో 163వ చట్టం అమలు చేసింది. ఇంటర్‌నెట్ సేవలు 24 గంటలు నిలిపివేస్తున్నట్లు డీఐజీ బ్రిజేష్ రాయ్ ప్రకటించారు. 13 ప్లటూన్ల బలగాలు నియమించారు. మరోవైపు పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర్ శాంతి సంఘం ఏర్పాటు చేసి పరిస్థితి చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం సుందర్‌గఢ్‌లో అల్లర్లు తగ్గినా, ఉద్రిక్తత కొనసాగుతోంది. విద్యా సంస్థలు, దుకాణాలు మూతపడ్డాయి. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ... పట్టణంలో శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని, శుక్రవారం ఎలాంటి ఘటనలు జరగలేదన్నారు.

బడ్జెట్ పద్దులు సిద్ధం చేయండి: సీఎస్

అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) బడ్జెట్ పద్దులు రూపకల్పన సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ అన్ని ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో రానున్న ఆర్థిక సంవత్సరం బడ్జెట్ గురించి సీఎస్ కార్యదర్శులతో కూలంకషంగా చర్చించారు. అనంతరం అనూగార్గ్ విలేకరులతో మాట్లాడుతూ... అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సమీపించడంతో పద్దుల తయారీపై కసరత్తు జరుగుతోందని, దీనిపై మాట్లాడామన్నారు. సీఎం మోహన్‌చరణ్ మాఝి 15 అభివృద్ధి అంశాల అమలుపై ఉత్తర్వులు జారీ చేయగా, వీటిపై సమీక్షించామన్నారు ఇకపై ప్రతినెల 16న కార్యదర్శులు, జిల్లాల పాలనాధికారులతో నిర్మాణాలు, పురోగతి గురించి సమీక్షిస్తామన్నారు. ప్రతినెల 3వ మంగళవారం ఏకగవాక్ష సంఘం (సింగిల్ విండో) సమావేశం జరుగుతుందని పరిశ్రమలు, అవసరాలపై చర్చిస్తామన్నారు.

గంగాగుడి పీఠం.. మసకబారుతున్న ప్రాశస్త్యం..!

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్‌లోని గంగాగుడి పీఠం నిర్లక్ష్యానికి గురి కావడంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కొరాపుట్ జిల్లాలో నందపూర్ ప్రాంతం పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడ అద్భుతమైన పర్యాటక స్థలాలతో పాటు అనేక పురాతన విగ్రహాలు ఉన్నాయి. ఆయా విగ్రహాల పరిస్థితి దేవాదాయ శాఖ పట్టించుకోవడం లేదు. భీతార్‌గడ్‌లోని కొడిమాలి పర్వతం దిగువన ఉన్న గంగాగుడి పీఠం నిర్లక్ష్యానికి గురైంది. నందపూర్‌లోని ప్రసిద్ధ గ్రామ దేవతగా చెబుతారు. ఇక్కడ ప్రజలు పూజించే విగ్రహాలు రాజుల కాలం నాటివైనా.. విస్మరిస్తున్నారు. గంగాగుడి పీఠాన్ని దేవాదాయ శాఖలో చేర్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విగ్రహాలు శిథిలావస్థకు చేరుతున్నాయని వాపోతున్నారు. సమితి అభివృద్ధి అధికారి దుర్గా ప్రసాద్ దొరను ప్రశ్నించగా ప్రతిపాదన సిద్ధం చేసి దేవాదాయ శాఖకు నివేదిక అందించామన్నారు.

దేవతామూర్తుల విగ్రహాలను పూజిస్తున్న గ్రామస్థులు

ఆపరేషన్ స్ట్రైక్‌తో 189 మంది అరెస్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి ఉత్సవాలు సజావుగా జరగాలన్న ఉద్దేశంతో పోలీసు యంత్రాంగం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఆపరేషన్ స్ట్రైక్' అనే ప్రత్యేక డ్రైవ్‌తో 189 మందిని అరెస్టు చేశారు. ప్రజల భద్రత, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని 34 పోలీసు జిల్లాల్లో దీనిని నిర్వహించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మాదక ద్రవ్యాలు, అక్రమాయుధాల స్మగ్లింగ్, జూదం, పశు అక్రమరవాణా తదితర నేర కార్యకలాపాలు లక్ష్యంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ డ్రైవ్ ద్వారా 367 ఆబ్కారీ సంబంధిత కేసులు నమోదు చేసిన పోలీసులు, 35,599 లీటర్ల నాటుసారా, 571 లీటర్లకు పైగా విదేశీ మద్యం, 38 సీసాల దగ్గు మందును స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడానికి సంబంధించి 272 కేసులు నమోదు చేసి, రూ.11.89 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు.

వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ఖమ్మం యువకుడి దేశ పర్యటన

ఫాజిల్ హిందూస్థానీని సత్కరిస్తున్న సాహితీవేత్త విజయచంద్ర

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'భారత్‌లో భద్రత.. రాష్ట్రాల మధ్య సామరస్యం.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ఎలా తదితర అంశాలు పరిశీలనకు సైకిల్‌పై భారత్-నేపాల్ యాత్ర చేపట్టాన'ని ఖమ్మం (తెలంగాణ)కు చెందిన ఫాజిల్ హిందూస్థానీ (23) చెప్పాడు. పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన ఆయనకు స్థానిక నీలకంఠనగర్ హౌసింగు బోర్డులో సారథీనగర్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి విజయచంద్ర అతడికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. దేశంలో సంప్రదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఆహారపు అలవాట్లు తదితరాలు పరిశీలించేందుకు డిసెంబరు ఒకటిన ఖమ్మం నుంచి సైకిల్‌పై భారత్-నేపాల్ యాత్ర ప్రారంభించానని చెప్పాడు. సుమారు 2,300 కి.మీ. ప్రయాణం లక్ష్యమని, ప్రతిరోజు 40-50 కి.మీ. దూరం యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు రూ.70-100లు ఖర్చవుతోందని, తాను ఉద్యోగాలు చేసినప్పుడు పొదుపు చేసుకున్న సొమ్మును వాడుకుంటున్నానని అన్నాడు. ఇంతవరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో యాత్ర జరిపానని, ఒడిశాలో తనకు మంచి ఆదరణ లభించిందన్నారు.

'నిఫా' వైరస్ భయం లేదు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 'నిఫా' వ్యాప్తి లేదని, ఎక్కడా బాధితులను గుర్తించలేదని ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ చెప్పారు. ఒడిశా సరిహద్దు రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లో నిఫా వైరస్ బాధితులు నమోదు కావడంతో శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ఆరోగ్యశాఖ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ముందు జాగ్రత్తగా టెక్నికల్ సంఘం ఏర్పాటు చేసి పరిస్థితి సమీక్షిస్తున్నట్లు తెలిపారు. బెంగాల్‌కు చేరువలో ఉన్న జిల్లాల్లోని ఆసుపత్రుల్లో నమూనా పరీక్షలు జరుగుతున్నాయని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

ఏనుగు మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అనుగుల్ జిల్లా బంతతా అటవీ రేంజ్‌లో అయిదేళ్ల వయసున్న ఏనుగు మృతి చెందింది. ఈ నెల 13న పేలుడు పదార్థం కలిగిన ఆహారం తిన్న ఈ వన్యప్రాణి తీవ్రంగా గాయపడింది. అనుగుల్ డీఎఫ్వో నితీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు... ఏమీ తినలేక బలహీనంగా తిరుగుతున్నట్లు గమనించిన అటవీ సిబ్బంది కపిలాస సహాయ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలింపు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో వృద్ధుని మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న హృదయవిదారక ఘటన గజపతి జిల్లా గుమ్మ సమితిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గుమ్మ సమితి సెరంగో గ్రామానికి చెందిన చంద్రో బోడో సింగ్ (63) అనారోగ్యంతో గుమ్మ ఆరోగ్య కేంద్రంలో గురువారం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి మృతదేహం తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం, స్థానికంలో ఉన్న ఆటోలు రూ. 9 వేలు అడగడంతో మృతుడు నిరుపేద కావడం వల్ల గ్రామస్థులు మృతదేహాన్ని సుమారు 8 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై తరలించారు. ప్రస్తుతం ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ద్విచక్ర వాహనంపై మృతదేహం తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

(c) eenadu

నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిథ, తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) నాణ్యత కలిగిన ఉత్పత్తులు సాధించి మన్ననలందుకుంటున్న తరుణంలో మరింత నైపుణ్యం సాధించేందుకు మిషన్‌శక్తి శాఖ నైపుణ్యాభివృద్ధి శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం సాయంత్రం భువనేశ్వర్‌లోని జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ, మిషన్‌శక్తి సంచాలకురాలు మోనికా ప్రియదర్శిని, నైపుణ్యాభివృద్ధి పరిషత్ సీఈవో రాజిన్ బహదూర్, ప్రిన్సిపల్ కార్యదర్శి గిరీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. మహిళా సంఘాల శిక్షణకు రూ.9.3కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దశల వారీగా శిక్షణ జరుగుతోందని, తొలుత 4,000 మందికి వివిధ రంగాల్లో శిక్షణ కల్పిస్తామన్నారు.

గంజాం జిల్లాలో ఈడీ దాడులు

బ్రహ్మపురలో అంబికానగర్‌లోని గుత్తేదారు ఇంట్లో సోదాలు, బయట సాయుధ బలగాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ‘ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్’ (ఈడీ) అధికారులు ముమ్మరంగా దాడులు చేశారు. జిల్లాలోని బ్రహ్మపురతోపాటు శెరగడ, అస్కా తదితర చోట్ల పలువురు గుత్తేదారులు, మద్యం, ఇసుక వ్యాపారులు తదితరులపై అయిదుకుపైగా ఈడీ బృందాలు ఆయా దాడులు చేశాయి. హింజిలికాటు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని శెరగడలో బిజద నాయకుడు, గుత్తేదారు హృషికేష్ పాఢి నివాస భవనం, బ్రహ్మపురలో జయప్రకాష్ నగర్‌లోని హృషికేష్ కుమారుడు సచిన్ పాఢి ఇంట్లో, లంజిపల్లి ఉమానగర్‌లోని ఇసుక వ్యాపారి కృపాసింధు ముదులి కార్యాలయం, గాంధీనగర్, అంబికానగర్‌లోని గుత్తేదారు పాఢి ఇళ్లు, కొణిసి, బెజ్జిపురం కాళువా వీధిలోని వ్యాపారుల ఇళ్లు, అస్కా సమితిలో ఖారియా సర్పంచి భర్త, మద్యం, ఇసుక వ్యాపారి భగవాన్ సాహు తదితరుల ఇళ్లల్లో ఈడీ దాడులు కొనసాగుతున్నాయి.

ఖోఖోలో పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కాజీపేట (తెలంగాణ)లోని రైల్వే మైదానంలో ఈ నెల 11 నుంచి 15వరకు జరిగిన 58వ జాతీయ సీనియర్ పురుషులు, మహిళా ఖోఖో పోటీల్లో ఒడిశాకు రెండు పతకాలు వరించాయి. తుది పోరులో రాష్ట్ర మహిళా జట్టు మహారాష్ట్ర జట్టుతో ఆడి ఓటమి పాలై రెండోస్థానం దక్కించుకుని రజత పతకం గెలుచుకుంది. పురుషుల మ్యాచులో తృతీయ స్థానం పొందిన రాష్ట్ర జట్టు కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేసింది. అర్చనా మాఝి ఉత్తమ క్రీడాకారిణిగా ప్రత్యేక బహుమతి అందుకుంది. ఒడిశా ఖోఖో సంఘం కార్యదర్శి ప్రద్యుమ్న మిశ్ర ఇతర ప్రతినిధులు ఇరు జట్లకు అభినందనలు తెలిపారు.

రజత పతకం, ట్రోఫీతో మహిళా జట్టు క్రీడాకారిణులు, చిత్రంలో మిశ్ర తదితరులు

అమరవీరుల స్తూపం నిర్మాణానికి శంకుస్థాపన

వేదికపై మాట్లాడుతున్న మంత్రి నిత్యానంద్ గొండ్

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని పపదహండిలో గిరిజన మ్యూజియం మైదానంలో అమర వీరుల స్తూపం, ఉద్యానం నిర్మాణానికి గురువారం ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నిత్యానంద్‌గొండ్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి భవనంతో పాటు పార్కు, మినార్ నిర్మాణానికి రూ. 6 కోట్లు మంజూరైనట్లు గొండ్ తెలిపారు. పాలనాధికారి డా. మహేశ్వర్ స్వయి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి నవరంగపూర్ ఎమ్మెల్యే మనోహర్ రంధారి, గౌరీ శంకర్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

బాగా ఆడండి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో కొద్ది రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో భారత మహిళా రగ్బీ జట్టు క్రీడాకారిణులు తర్ఫీదు పొందారు. గురువారం రాష్ట్ర క్రీడా శాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల, అదనపు కార్యదర్శి బిజయ్‌కుమార్ స్వయిన్‌లు శిబిరానికి హాజరై క్రీడాకారిణులతో కాసేపు మాట్లాడారు. శిక్షణ, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రానున్న రోజుల్లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో ఉత్తమ ఆట ప్రదర్శించాలని శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారిణులతో మాట్లాడుతున్న క్రీడాశాఖ అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక సద్భావన సభాగృహంలో రోడ్ సురక్ష బోర్డు కమిటీ సమావేశం నిర్వహించారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రోడ్ సురక్ష నియమావళి పై ప్రత్యేకంగా విస్తృ ప్రచారం చేయాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి: 16 మందికి గాయాలు

ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనం

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పఖాన్‌జూర్‌లో జరుగుతున్న మేళను చూసేందుకు నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది ఒక వాహనంలో గురువారం బయలుదేరారు. కురిటా జిల్లా కులగావ్ వద్ద వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనా స్థలంలో చోదకుడితో పాటు ఒక మహిళ మృతి చెందగా 16 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను కురిటా, రాయ్‌పూర్ ఆసుపత్రులకు తరలించారు. మృతులు రాయ్‌ఘర్‌కు చెందిన ఓం ప్రకాష్ కర్ర (50) మినతి మజుందార్ (55)గా గుర్తించారు. పరీక్ష అనంతరం పోలీసులు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మరో ఇద్దరు..

నవరంగపూర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా దాబుగావ్ రహదారి దాడిగూడ గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జోరిగావ్‌కు చెందిన సాగర్ దొలాయి (21), ఉమ్మరకోట్ సమితి కుసుమగుడ గ్రామానికి చెందిన నవీన్ జానీ(21)లు బంధువుల ఇంటికి శుభకార్యానికి రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా, దాడిగూడ రహదారిపై ఆగివున్న ట్రక్కును ఢీకొన్నారు. ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వారిద్దరూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరీక్ష అనంతరం పోలీసులు శుక్రవారం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జలపాతంలో ఒకరి మృత్యువాత

బాబులా కోరా మృతదేహం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: విహార యాత్రకు వెళ్లి జలపాతం వద్ద ఫొటో తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలు జారి జలపాతంలో పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన లక్ష్మీపూర్ సమితిలోని మీటింగి జలపాతం వద్ద చోటుచేసుకుంది. లక్ష్మీపూర్ ఠాణా అధికారిని సుజిని సాహు అందించిన వివరాల ప్రకారం.. సిమిలిగుడకు చెందిన కొంతమంది హోటల్‌లో పనిచేసే సిబ్బంది గురువారం తోలో మీటింగి జలపాతానికి విహారయాత్రకు వెళ్లారు. జలపాతం వద్ద ఫొటో తీసుకోవడానికి బాబులా కోరా(30) ప్రయత్నించగా కాలు జారి జలపాతంలో పడిపోయాడు. చుటుపక్కల వారు రక్షించే ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. చాలా సమయం తర్వాత మృతదేహం లభ్యమయింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహం బంధువులకు అప్పగించారు.

కాలువలో పడి మరొకరు..

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని సాలియాసాహి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా, గురువారం నిసు గురు రాయ్ (35) అనే యువకుడు రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో క్యాపిటల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ఏడుగురి నేరస్థుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో రాకేష్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి అడవా ఠాణా పరిధిలో గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించి ఏడుగురు నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్డీపీవో రాకేష్ కుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు ఠాణా పరిధిలోని గుండిమా గ్రామ ప్రాంతంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా కారును ఆపి తనిఖీ చేస్తున్నా అందులో ఉన్న ఏడుగురిపై అనుమానం వచ్చిందని వివరించారు. కారు మొత్తం సోదా చేయగా ఓ గన్ తో పాటు మూడు బుల్లెట్లు, మారణాయుధాలు, 7 చరవాణిలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిపై గంజాం జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు తెలిపారు. నేరస్థులు గంజాం జిల్లా నుంచి గుమ్మ వైపు వెళుతున్నట్లు.. వీరంతా పట్టపూర్, జోడిగోడ ఠాణాలకు చెందిన వారిగా గుర్తించినట్లు, దరకోట్ ఠాణా పరిధిలోని తేల పట్టన గ్రామానికి చెందిన సాగర్ నాయక్, దామోదర్ పొల్లి గ్రామానికి చెందిన లిక్ నె శెత్, ఐటోబా బిల్లికి చెందిన మిథున్ నాయక్, దొరకోట్ గ్రామ ని చెందిన జిగోర నాయక్, హరిపూర్ గ్రామానికి చెందిన చిక్కుబిసాయి, డెంగా ఉస్తా గ్రామానికి చెందిన మిలన్ దొర, గాంధీ చొకో కు చెందిన సిద్ధాంత్ సమల్ గా గుర్తించినట్లు మీరు పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

చోరీ కేసులో నిందితుడు

పోలీసుల అదుపులో నిందితుడు, చోరీ సామగ్రి

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదర్శ్ నగర్‌లో ఉన్న కొరియర్ కంపెనీలో జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. నిందితుడు లమతపుట్ సమితికి చెందిన మహేంద్ర పంగిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12న కంపెనీలో చోరీ కాగా సామాగ్రిని నిందితుడు దోచుకున్నారు. సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలప తరలింపు ఘటనలో ఒకరు..

నవరంగపూర్, న్యూస్‌టుడే: అక్రమంగా చేస్తున్న కలప రవాణాను నవరంగపూర్ జిల్లా పపడహండి సమితి మైదల్‌పూర్ అటవీ శాఖ అడ్డుకుంది. ఫారెస్టర్ మధుసూదన్ పాత్రో నేతృత్వంలో శాఖ సిబ్బంది శుక్రవారం మైదల్‌పూర్ వద్ద తనిఖీలు నిర్వహించారు, ఆమ్‌పాని ఠాణా పరిధిలో మంబగూడ నుంచి భద్రాచలంకి కలప రవాణా చేస్తుండగా అధికారులు అడ్డగించారు. కలప రవాణాకు సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో కలపను, ట్రక్కును స్వాధీనం చేసుకుని చోదకుడిని అరెస్టు చేశారు. నిందితుడు మల్కన్‌గిరి ఎమ్‌వీ-37 గ్రామానికి చెందిన బాబుదాస్ (27)గా గుర్తించారు.

ఆయుధాలు స్వాధీనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్, కటక్ జంటనగరాల్లో పిస్తోళ్లు, ఇతర మారణాయుధాలు విక్రయిస్తున్న పోలీసుల స్పెషల్ టాస్క్ ఫోర్స్ సవాల్‌గా మారిన మరో రాకెట్‌ను అరెస్టు చేసినట్లు కమిషనర్ ఎస్.దేవదత్త సింగ్ శుక్రవారం భువనేశ్వర్‌లో విలేకరులకు చెప్పారు. నిందితుని వద్ద నుంచి 6 పిస్తోళ్లు, తూటాలు, ఇతర మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడిపై మారణ యుధాలతో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక బైద్యనాథ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తబస్టాండు కాళీ మందిరం సమీపంలో గురువారం ఉదయం ఆదిత్ ముఖి అనే యువకుడిపై ఆరుగురు యువకులు మారణాయుధాలతో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన ముఖిని స్థానికులు ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కొందరు దుండగుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. స్థానిక ధనమెరా వీధికి చెందిన ముఖి పారిశుద్ధ్య పనుల పర్యవేక్షకుడిగా పని చేస్తున్నాడు. పాతకక్షల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి ముగ్గురు ఒడిశా క్రీడాకారిణులు

యశోద ముండా

ప్యారీ ఖాఖా

జులీ కిసాన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: టర్కీలో జరుగుతున్న ఏఎఫ్‌సీ మహిళా ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి భారత సీనియర్ మహిళా జట్టు సిద్ధమైంది. ఈ మేరకు భారత జట్టులో ముగ్గురు రాష్ట్ర క్రీడాకారిణులు యశోద ముండా (మిడ్‌ఫీల్డర్), ప్యారీ ఖాఖా (ఫార్వర్డ్), జులీ కిసాన్ (డిఫెండర్)లు స్థానం పొందారు. ఇటీవల హరియాణాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న వీరు భారత జట్టుకు ఎంపికైనట్లు జాతీయ రిఫరీ సుజిత్‌కుమార్ పాత్ర్ శుక్రవారం ‘న్యూస్‌టుడే’కు చెప్పారు. జట్టు క్రీడాకారులు టర్కీకి బయల్దేరి వెళ్లినట్లు ఆయన తెలిపారు. టోర్నీలో ఈ నెల 18, 21, 24 తేదీల్లో నిర్వహించనున్న మ్యాచులో మెటలిస్ట్ ఎఫ్‌సీ (ఉక్రెయిన్), జురిక్ ఎఫ్‌సీ (స్విట్జర్లాండ్), సిలిరెన్ ఎఫ్‌సీ (స్విట్జర్లాండ్) జట్లతో భారత జట్టు తలపడుతుందని రిఫరీ పాత్ర్ పేర్కొన్నారు.

గవర్నరును కలిసిన కేంద్రమంత్రి ధర్మేంద్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో గవర్నరు కంభంపాటి హరిబాబును మర్యాద పూర్వకంగా కలుసుకొని కొద్దిసేపు ముచ్చటించారు. తరువాత మంత్రి నిత్యానంద గొండ్, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. కేంద్ర విద్యా విధానం (ఎస్‌ఈపీ) ఎలా అమలవుతోందన్నదీ సమీక్షించారు.

జగన్నాథుడి ప్రత్యేక దర్శనం

అలంకరణలో నల్లనయ్య

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో శబరి శ్రీ క్షేత్రంలో మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. పవిత్ర మకర సంక్రాంతి పర్వదినాన సవర ఆదివాసీలు దేవదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిలికా అందాలు తిలకించిన గవర్నరు దంపతులు

గవర్నరు దంపతుల పడవ షికారు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గవర్నరు కంభంపాటి హరిబాబు భార్య జయశ్రీతో కలిసి గురువారం సాయంత్రం ఖుర్దా జిల్లా పరిధిలోని మంగళజోడి ప్రాంతం సందర్శించారు. చిలికా సరస్సులోని పడవలో విహరించి అందాలు తిలకించారు

ఇంటింటికీ కుళాయి నీరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్, వసుధ పథకాల ద్వారా అన్ని గ్రామాలకు మంచినీరు సరఫరా చేయడమే లక్ష్యమని, అందుకు సంబంధించిన ప్రాజెక్టుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. శుక్రవారం బొలంగీర్ జిల్లాలోని ఖోప్రాఖోల్ సమితి పత్రాపల్లి గ్రామంలో మంచినీటి సరఫరా ప్రాజెక్టు ప్రారంభించిన సింగ్‌దేవ్ మాట్లాడారు. 2027 మార్చి నాటికి ఇంటింటికీ కుళాయినీరు సరఫరా ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

మంచినీటి సరఫరా ప్రాజెక్టు ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి

సామంత ప్లానిటోరియం ఆధునికీకరణకు ఒప్పందం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని పఠానిసామంత ప్లానిటోరియానికి మహర్దశ కలగనుంది. ఆధునికీకరణ, విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కోల్‌కతాలోని కేంద్ర సాంస్కృతికశాఖ పరిధిలోని బిర్లా ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియం (బీఐటీఎం) పనుల బాధ్యత తీసుకుంది. కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజీవ్‌కుమార్ మిశ్ర, ఇడ్కో సంచాలకుడు డి.ప్రశాంతకుమార్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

గజపతి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని గజపతి క్రీడా మైదానంలో ఈనెల 18 నుంచి ఐదు రోజులపాటు జరగనున్న గజపతి ఉత్సవాల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోడ పోస్టర్‌ను సబ్ కలెక్టర్ అనూప్ పండా ఆవిష్కరించారు.

పనితీరు సరిగా లేని అధ్యాపకుల జాబితా పంపండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లోని పనితీరు సరిగా లేని అధ్యాపకుల జాబితా ఈ నెల 31లోగా పంపించాలని ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవింద అగర్వాల్ శుక్రవారం అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లు, కళాశాలల ప్రిన్సిపల్‌కు లేఖలు రాశారు. కేంద్ర విద్యావిధానం (ఎన్‌ఈపీ) అమలు చేస్తున్న ప్రభుత్వం విద్యాప్రమాణాలకు ప్రాధాన్యతిచ్చింది. ఉన్నత విద్యా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల్లో కొంతమంది పనితీరు తీసికట్టుగా ఉంది, వారికి వీఆర్‌ఎస్ చెప్పాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం జాబితా పంపాలని ఆదేశించింది.

వృద్ధులు తీర్థయాత్రకు వెళ్లే అవకాశం

తీర్థయాత్రకు వెళ్లే వృద్ధులతో రాజేంద్ర

సిమిలిగుడ, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: అయోధ్య తీర్థయాత్రకు సునాబెడ పుర పాలక సంస్థ పరిధి నుంచి 25 మంది వృద్ధులు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులను తీర్థయాత్రకు తీసుకువెళ్లే ఏర్పాట్లు చేస్తుండగా తాజాగా అయోధ్యకు వెళ్లే అవకాశం కల్పించారు.

ప్రాజెక్టు ప్రదర్శనలో శత్రూప మొదటి స్థానం

ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న శత్రూప

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్‌లో జరిగిన జిల్లా స్థాయి మోడల్ ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొని బొరిగుమ్మ సమితి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని శత్రూప మహాపాత్ర్ మొదటి స్థానంలో నిలిచింది.

దిల్లీ కవాతులో పాల్గొనేందుకు ఎంపిక

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాకు చెందిన క్రీడా ఉపాధ్యాయుడు ప్రియరంజన్ రౌత్ దిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొనేందుకు ప్రత్యేక అతిథిగా ఎంపికయ్యారు.

జాగ్రత్తగా వాహనం నడపండి

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో జాతీయ రహదారి సురక్ష మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలనాధికారి కార్యాలయం నుంచి భారీ ర్యాలీ జరిగింది. పాలనాధికారి డా. మహేశ్వర్ స్వయి, ఎస్పీ సందీప్ సంపత్ పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రహదారిపై వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి నినాదాలు చేస్తూ విద్యార్థులు మిషన్ శక్తి భవనం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఫకీర్ మోహన్ సాధారణ కవి కాదు: మాజీ ఎంపీ

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జ్యోతి కల్యాణ మండపంలో ‘భానుమతి’ సంస్థ తరపున ప్రముఖ కవి ఫకీర్ మోహన్ జయంతి కార్యక్రమంలో గురువారం జరిగింది. సమాజాన్ని చైతన్య పరచడానికి ఆయన స్వరం ఎంతో ఉపయోగపడిందని, ఆయన సాధారణ కవి కాదని మాజీ మంత్రి రబినారాయణ నందో కొనియాడారు.

జేఈఈ మెయిన్స్ పరీక్ష వాయిదా

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్ష జనవరి 23న జరగవలసి ఉంది. జనవరి 23న సరస్వతీ పూజ కావడంతో ఈ పరీక్ష వాయిదా పడినట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.

రుషియా కాలనీ వాసులకు ఆశ్రయం కల్పించండి

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని రుషియా కాలనీలో నివాసం ఉంటున్న 8 కుటుంబాలను ఇటీవల పురపాలిక ఖాళీ చేయించిన విషయం తెలిసిందే. నిరాశ్రయులయ్యి ఇతరుల ఇంటి ఆవరణలో చలిలో అతి కష్టంగా ఆశ్రయం పొందుతున్నారు. ఇలా చేయడం సరికాదని, వారికి వెంటనే ప్రభుత్వం స్థావరం కల్పించాలని పొర్జా సంఘ అధ్యక్షుడు రామ్‌చంద్ర నాయక్ సబ్ కలెక్టర్ సస్యరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిల్చున్న బాధితులు

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

శ్రీకాకుళం పట్టణంలో ప్రశాంతమైన గేటెడ్ కమ్యూనిటీ, స్వగృహ టీచర్స్ కాలనీలో 2BHK ఇండిపెండెంట్ ఇల్లు (26x50) మరియు ఖాళీస్థలములు అమ్మకమునకు కలవు. Cont:9440168546.

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చిత్ర కళపై శిక్షణ శిబిరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ‘ఎక్స్‌జెన్ కాలేజ్ ఆఫ్ విజువల్ ఆర్ట్’ ఆధ్వర్యంలో ‘ఉత్కళిక పెయింటింగ్ శిబిరం-2026’ పేరిట మూడు రోజుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. నగర శివారున ఖొడాసింగి బొడొగుమ్మల రోడ్డులోని సంస్థ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఎక్స్‌జెన్‌తోపాటు రాష్ట్రంలోని పది ఆర్ట్స్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, చిత్రకారులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. నిర్వాహక సంస్థ ప్రధానాచార్యుడు ఉజ్వల్ కుమార్ సాహు ఇతర ప్రతినిధులు పర్యవేక్షిస్తున్న ఈ శిబిరం శనివారం ముగుస్తుంది.

ఆలిండియా డీఎస్‌వో నిరసన ప్రదర్శన

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్లస్‌టూ ధ్రువపత్రం, మార్క్‌షీట్ పరిశీలనకు ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా ఆలిండియా డీఎస్వో శుక్రవారం నిరసన చేపట్టింది. స్థానిక హిల్‌పట్నాలోని మాధ్యమిక విద్యా పరిషత్ బ్రహ్మపుర కార్యాలయం బయట ఆ సంస్థ గంజాం జిల్లా కమిటీ ప్రతినిధులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తక్షణం ఫీజులు ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అలరించిన కచేరి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ, 11వ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ 2026 వేడుకలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా పద్మభూషణ్ అర్జద్ అలీ ఖాన్ సరోద్ వాయిద్య కచేరి చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఇళ్ల పట్టాలు అందించకపోతే ఆందోళన తప్పదు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ సమితి బిరిగుడా కాలనీ ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించకపోతే ఆందోళనకు దిగుతామని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత హెచ్చరించారు. సమితి పరిధిలో ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

ఐకమత్యంగా పనిచేయండి

వేదికపై ఎంపీ సప్తగిరి, ఎమ్మెల్యే కడం, రూపక్ నేతలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రతిష్ఠ నిలిపేలా కార్యకర్తలంతా ఐకమత్యంగా పనిచేయాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక పిలుపునిచ్చారు. సిమిలిగుడలోని హన్నా గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్ బంక తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యలపై చర్చ

ఉద్యోగ సంఘ ప్రతినిధులతో రైల్వే అధికారులు.

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్ రైల్వే కార్యాలయం భవన సమావేశ భవనంలో గురువారం పీఎన్‌ఎం(పర్మినెంట్ నెగోషియేషన్ మిషనరీ) సమావేశం జరిగింది. ఇందులో ఉద్యోగుల పలు సమస్యలపై చర్చలు జరిగాయని డీఆర్ఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

జడ్పీ అధ్యక్షురాలి సస్పెన్షన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: జాజ్‌పూర్ జిల్లా జడ్పీ అధ్యక్షురాలు నళిని ప్రభజెనాను బిజద నుంచి సస్పెన్షన్ చేస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున చర్యలు తీసుకున్నట్లు జారీ చేసిన ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ కార్యాలయం నిర్మించండి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్ర సమితి ఆస్న పంచాయతీ కార్యాలయాన్ని ఆస్న గ్రామంలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆస్న గ్రామస్థులు బీడీవో పి.మనస్మితకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం పంచాయతీలో ఒక ప్రభుత్వ భవనం కూడా లేదు. ఆస్న పంచాయతీ కార్యాలయం ఉదలగూడలో నిర్మిస్తున్నారు. వాటితోపాటు కెరమెటి, ఫుల్‌భట్టా పంచాయతీ కార్యాలయాలు ఆ గ్రామాల్లో నిర్మిస్తున్నారు. కానీ ఆస్న పంచాయతీలో అలా జరగటం లేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆస్నలో స్థలం గుర్తించి భవనం నిర్మించకుంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యను అందించడం అందరి బాధ్యత

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక పరబ్ ఉత్సవ మైదానంలో జిల్లా స్థాయి పీఎం శ్రీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పీఎం శ్రీ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థులు. ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక ముఖ్య అతిథిగా పాల్గొని నాణ్యతమైన విద్య అందించడం అందరి బాధ్యత అన్నారు.

అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

ఖరగ్‌పూర్‌లో ముగ్గు వేస్తున్న తెలుగు యువతి

సంక్రాంతి పండుగ అందరికీ ఎంతో ప్రత్యేకమైనది ..కొత్త బట్టలు, చిన్న పిల్లల అల్లర్లు, కొత్త అల్లుడి సందడి ఇలా... మాటల్లో చెప్పలేని ఆనందం ప్రతి ఇంటా ఉంటుంది. రాష్ట్రంలో సంక్రాంతిని తెలుగువారంతా వైభవంగా జరుపుకున్నారు.

కొరాపుట్: జవహర నవోదయ విద్యాలయ ప్రాంగణంలో..

భువనేశ్వర్: కూచిపూడి కళాకారుల నృత్యాలు

(c) eenadu

స్వయం సహాయక సంఘాల సభ్యులతో అవినాష్

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ శక్తితో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని మిషన్ శక్తి రాష్ట్ర అదనపు కమిషనర్ అవినాష్ రౌత్ అన్నారు. నందపూర్ సమితిలో ఆయన గురువారం సందర్శించారు. వివిధ ప్రాంతాల్లో సందర్శించి మిషన్ శక్తి పనితీరు సమీక్షించారు.

గేటు బజారు వ్యాపారులకు తీపి కబురు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వారం కిందట రైల్వే అధికారులు దుకాణాలు తొలగిస్తామని 15 రోజుల్లోగా ఖాళీ చేయమని గేట్ బజార్లో పలుచోట్ల నోటీసులు అతికించడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. రైల్వే అధికారులు నిర్ణయాన్ని మార్చుకొని నోటీసులు తొలగించారు. అధికారుల నిర్ణయానికి వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

రహదారి భద్రతకోసం డాష్‌బోర్డ్

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: రహదారి భద్రత కోసం ఐఐటీ మద్రాస్ 'ఇంటిగ్రేటెడ్ రోడ్ సేఫ్టీ డాష్‌బోర్డ్'ను రూపొందించింది. ఐఐటీఎం ఆర్బీజీ ల్యాబ్స్‌లో అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతికతను ఒడిశా ప్రభుత్వం అక్కడి కియోఝార్‌లో 'జీరో యాక్సిడెంట్ డే' నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రారంభించింది. ఆ రాష్ట్ర రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రాణాలు కాపాడటానికి, రోడ్లను సురక్షితం చేయడానికి డాష్‌బోర్డ్ ఉపయోగపడగలదని చెప్పారు. విశ్లేషణలు, పర్యవేక్షణ కూడా అందించగలదన్నారు. ఐఐటీఎం డైరెక్టర్, ఆచార్యులు వి. కామకోటి మాట్లాడుతూ రహదారి భద్రత అనేది సమన్వయంతో కూడిన చర్య అన్నారు. డాష్‌బోర్డ్ కేవలం సాంకేతిక వేదిక మాత్రమే కాదని, పాలనా సంస్కరణ సాధనం, ఇ-గవర్నెన్స్‌లాంటిదని ఆర్బీజీ ల్యాబ్స్ అధిపతి, ఆచార్యులు వెంకటేష్ బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. ఈ సాంకేతికత ప్రత్యక్షంగా ప్రాణాలను కాపాడేందుకు దోహద పడుతుందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఎంపీలు సుజిత్ కుమార్, అనంత నాయక్, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా, ఐఐటీ మద్రాస్ ఆర్బీజీ ల్యాబ్స్ ఆచార్యులు వెంకటేష్ బాలసుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, హద్దులు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ మనిషారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెంకంపేటలో పెద్దలు, యువతతో చర్చలు జరిపారు. గ్రామంలో భోగి పండగ రాత్రి తెలగవీధి రామమందిర కూడలిలో ఏసుక్రీస్తు శిలువను ఎగతాళి చేసి, వ్యంగ్యంగా మాట్లాడిన వీడియో వాట్సప్ గ్రూపులు, స్టేటస్‌లో పెట్టారు. ప్రశ్నించినందుకు కులం పేరిట దూషించారని అయిదుగురిపై గోవింద, శంకర్ ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామీణ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు ఏఎస్పీ విచారణ చేపట్టారు. చర్చల్లో రూరల్ సీఐ రంగనాథం, సర్పంచి కృష్ణారావు, పెద్దలు, యువత ఉన్నారు.

వెంకంపేట ప్రజలతో మాట్లాడుతున్న ఏఎస్పీ మనీషారెడ్డి

తులసి రావు మృతికి నివాళులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ గోల్ బజార్ భాజపా పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఇటీవల హత్యకు గురైన సివిక్ వాలంటరీ తులసి రావు మృతికి నివాళులర్పిస్తూ భాజపా వారు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. 100 మందికి దుప్పట్లు అందజేశారు.

దుప్పట్లు అందజేస్తున్న భారతీ ఘోష్

– న్యూస్‌టుడే, తాటిపూడి(గంట్యాడ), సీతంపేట

పండక్కొచ్చాం.. ప్రకృతిని పలకరిద్దాం!!

తెలుగునేలపై పెద్ద పండగ సంక్రాంతి.. అందుకే ఎక్కడెక్కడో ఉన్నవారంతా పల్లెల్లో వాలిపోతారు.. పిల్లాపాపలతో కలిసి సందడి చేస్తారు.. రాత్రి, పగలు మరిచి ఆటలాడేస్తారు.. కొందరైతే స్నేహితులతో ప్రకృతి ఒడిలోకి వెళ్లి మురిసిపోతారు.. అలాంటి వారికి మంచి అనుభూతి మిగిల్చేందుకు సిద్ధమయ్యాయి గంట్యాడ మండలంలోని తాటిపూడి, ఎకో టూరిజం కేంద్రం, సీతంపేటలోని ఐటీడీఏ సాహస ఉద్యానం. ఏటా ఇక్కడ పెద్దఎత్తున సందడి చేస్తారు. మీరూ ఓ లుక్కేయండి..

సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో హై సైకిల్ తొక్కుతున్న యువతి

ధరలు ఇలా..(రూ.లలో)

రకం	పరిమితి	టికెట్
వాటర్ టాక్సీ	20	100
ఫన్ యాక్	5	200
స్పీడ్‌బోట్	5	250
గల్ఫ్ కోర్ట్	10	150
పెడల్‌బోట్	4	100
స్వాన్	2	150
కయాక్	2	150
వాటర్‌రిక్షా	2	150

తాటిపూడి జలాశయంలో స్పీడ్ బోటింగ్

నిశ్శబ్ద ప్రపంచం..

తాటిపూడికి ఆవలున్న గిరివినాయక ప్రాంతం ప్రశాంతతకు పెట్టింది పేరు. ప్రధాన రహదారికి 7 కిలోమీటర్ల దూరంలో గోస్తనీ నది చెంతన కొండపై ఉంటుంది. ఇక్కడి గిరిశిఖరంపై 16 అడుగుల వినాయకుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. పది ఏసీ కాటేజీలున్నాయి. రోజుకు రూ.2500 వసూలు చేస్తారు. ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం ఉంది. ఆర్డర్‌పై కావాల్సిన వంటకాలు సిద్ధం చేస్తారు. బొంగుచికెన్ స్పెషల్. విద్యుత్తు అంతరాయం లేకుండా జనరేటర్ సౌకర్యం కూడా ఉందని కాటేజీ మేనేజర్(99519 72246) తెలిపారు.

★ అత్యాధునికంగా తాటిపూడి, సీతంపేట

★ ఒక్కసారైనా చూడాల్సిందే

అక్కడ ఉద్యానమే ప్రత్యేకం..

రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యానం(అడ్వెంచర్ పార్కు) పర్యాటకులను రా..రమ్మని పిలుస్తోంది. లోపలికి వెళితే అదో అద్భుత ప్రపంచంలా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు రోజంతా సందడి చేసేయొచ్చు.

బోటు షికారు..

తాటిపూడి జలాశయం అనగానే ఠక్కున గుర్తొచ్చేది బోటు షికారే. వాటర్ స్పోర్ట్స్ సింపుల్ సంస్థ ఆధ్వర్యంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు 8 రకాల 18 బోట్లు తిరుగుతాయి. సాధారణ ధరల్లోనే అందుబాటులో ఉంటాయని పర్యవేక్షకుడు కృష్ణ((92814 12738) తెలిపారు.

దేనికి ఎంతంటే..(రూ.లలో)

- ప్రవేశం: 30 (అయిదేళ్ల లోపు వారికి ఉచితం)
- ఫొటో షూట్: 1000
- మోటార్ బోట్: 50, కయాకింగ్: 70, సెల్ఫ్ బోట్: 60
- క్లైంబింగ్ వాల్: 60, కమాండో నెట్: 30
- ఆల్ టెర్రైన్ రైడ్: 300
- జెయింట్ స్వింగ్: 200
- ఊగే వంతెన: 30
- హై సైకిల్: 100, లో సైకిల్: 40
- ఆర్చరీ: 40, గన్ షూటింగ్: 50
- చిల్డ్రన్ ట్రైన్: 40, గైరో: 50, బుల్‌రైడ్: 60, బంగీ రన్నింగ్: 40
- 5డీ థియేటర్(మూవీ), 3డీ వరల్డ్‌కు రూ.100 వసూలు చేస్తారు.

– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

లక్షణంగా పిండి వంటల వ్యాపారం..

సంక్రాంతి అనగానే గంగిరెద్దులు.. హరిదాసులు.. ముత్యాల ముగ్గులతో పాటు ఘుమఘుమలాడే పిండి వంటలు కూడా ఉండాల్సిందే.. పండక్కి ఇంటికొచ్చే కుమారుడు, కుమార్తె, కోడళ్లు, అల్లుళ్లు, మనవల్ల కోసం ఒకప్పుడు గ్రామాల్లో రకరకాలు తయారు చేసేవారు. ఆ పరిస్థితి చాలా వరకు తగ్గిపోయింది. స్వీట్ షాపుల్లోనే ఎక్కువగా కొనేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో సంక్రాంతికి పిండి వంటల వ్యాపారం రూ.లక్షల్లో సాగుతోంది.

నగరంలో విక్రయిస్తున్న పిండివంటల కాంబో ప్యాక్

దీంతో మిఠాయి దుకాణాల యజమానులు సంక్రాంతి పిండివంటలు ప్రత్యేకంగా తయారు చేయించి మరీ విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి లభ్యమవుతున్నాయి. కొందరు చిరుధాన్యాలతో కూడా పిండి వంటలను ఆన్‌లైన్‌లో అమ్ముతున్నారు. శ్రీకాకుళం నగరంలోని కొన్ని దుకాణాల్లో పది రకాల పండివంటలను కాంబో ప్యాక్ పేరుతో విక్రయిస్తున్నారు.

జిల్లాలోని ప్రధాన పట్టణాల నుంచి ఈ సంస్కృతి గ్రామీణ ప్రాంతాలకూ వచ్చేసింది. ఒకప్పుడు అరిసెలు, పొంగడాలు, పాకుండలు, గులాబి పువ్వులు, కజ్జికాయలు, జంతికలు వంటివి ఇంట్లోనే చేసి.. ఇరుగు పొరుగువారికీ ఇచ్చేవారు. ప్రస్తుతం మహిళలకు ఓపిక లేకపోవడం, అనారోగ్య సమస్యలు, వివిధ కారణాలతో వండేందుకు ఆసక్తి చూపట్లేదు.

ఆర్డరిస్తే చాలు.. వంటకాలు వాలు

న్యూస్‌టుడే: పార్వతీపురం, బాడంగి

సంక్రాంతి పండగ వచ్చిందంటే ఇళ్లలో మహిళలకు తీరిక ఉండేది కాదు. పొయ్యి ఆరేది కాదు.. పెనం దిగేది కాదు. ప్రతి ఇంట్లో అరిసెలు, చక్కిరాలు, చేగోడియాలు, వెన్నప్పాలు, కజ్జికాయలు వంటివి తయారు చేసేవారు. సమయమంతా వంట గదిలోనే గడిచిపోయేది. ఇప్పుడు కాలం మారింది. పెనం సెగ తెలియకుండానే చాలా ఇళ్లలో పండగ వెళ్లిపోతోంది. ఇప్పుడంతా అప్పటికప్పుడు తయారు చేసి విక్రయించే వ్యవస్థలు జిల్లాలో అందుబాటులోకి వచ్చాయి.

పార్వతీపురంలో పిండి వంటలు తయారు చేస్తున్న ఫుడ్‌గార్డెన్ నిర్వాహకులు

తీపి వంటకాలు సిద్ధం

ఏం చెబితే.. అది

పిండి వంటలు, తీపి వస్తువులు తయారీ కేంద్రాలు ఇప్పుడు అన్నిచోట్లా వెలిశాయి. ఒకప్పుడు దుకాణాలుగా ఉండే కేంద్రాలు ఇప్పుడు కుటీర పరిశ్రమలుగా మారాయి. ఇంటిలోనే మహిళలు పిండి వంటలు తయారుచేసి, ఆర్డర్లపై సరఫరా చేస్తున్నారు. ఎక్కువ మంది అరిసెలు, చక్కిరాలు, చేగోడియాలు, కజ్జికాయలు తయారు చేయిస్తున్నారని పార్వతీపురంలోని పిండివంటల తయారీదారులు చెబుతున్నారు. తొలినాళ్లలో వ్యాపారం బాగా జరిగేది, ఇప్పుడు ప్రతి కాలనీలో వంటలు తయారుచేసే, సరఫరా చేసేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పట్టణ కేంద్రం, వైకేఎం కాలనీ నుంచి జగన్నాధపురం వరకు అన్నిచోట్లా పిండి వంటలు ఆర్డరిస్తే.. తయారు చేసి పండగ చేస్తున్నాయి. అందించేవారు ఎంతో మంది ఉన్నారు.

ఇంటివద్దే..

బాడంగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సత్యవతికి పుట్టుకతో అంగవైకల్యం. డిగ్రీ వరకు చదివిన ఆమె ఓ పెద్ద అంతర్జాల కేంద్రం నడుపుతూ మరోవైపు ఇంటి వద్దే పిండి వంటల తయారీ ప్రారంభించింది. తనతో పాటు మరో మహిళను పెట్టుకుని వంటకాలు తయారు చేస్తున్నారు. ఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకుని, వండి అందజేస్తున్నారు. పండగ నేపథ్యంలో జంతికలు, చేగోడీలు, శెనగ ఉండలు, నువ్వుల ఉండలు, అప్పడాలు, గులాబీ పువ్వులు, మిక్చరు, అరిసెలు వంటివి సిద్ధం చేసి, కావాల్సినవారికి విక్రయిస్తున్నారు.

అంతర పంట.. ఆరు రకాల అనాస

జీడి తోటలో అంతర పంటగా వేసిన మేలైన అనాస రకాలు

గిరిజన ప్రాంతాల్లో సాధారణంగా జీడిపంట చేతికొచ్చిన తర్వాత తోటలను ఖాళీగా వదిలేస్తున్నారు. సీతంపేట ప్రాంతంలో మాత్రమే సుమారు 5 వేల ఎకరాల్లో అనాస అంతర పంటగా వేస్తున్నారు. మిగిలిన సుమారు 60 వేల ఎకరాల్లో తోటలు ఖాళీగా ఉంటున్నాయి. జీడి చెట్లకింద తగ్గిన తర్వాత అనాస వేసి, ఏడాది మొత్తం దిగుబడులు పొందవచ్చుని కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలోని రైతులు కేవలం సింహాచలం రకాన్ని మాత్రమే పండిస్తున్నారు. ఇవి జూన్-ఆగస్టు వరకు మాత్రమే దిగుబడి వస్తాయి. పులుపు ఎక్కువగా ఉండడంతో గిరాకీ ఎక్కువ ఉండటం లేదు.

ఫలించిన ప్రయోగం

వీటికి ప్రత్యామ్నాయంగా అధిక దిగుబడి, రుచికరంగా ఉండే 6 రకాలు క్వీన్, ఎండీ-2, క్యూ, మారిషస్, స్పానిష్, అమృత వంటి రకాలను కేవీకేలోని జీడి తోటలో ఏడాదిన్నర కిందట ప్రయోగాత్మకంగా వేసి, ఫలితాలు సాధించారు. మేలైన రకాలను రైతులకు పరిచయం చేయనున్నట్లు ఉద్యాన విభాగ శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

సాగునీరు విడిపెట్టాలని వినతి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి పద్మపూర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో సాగునీరు విడిచిపెట్టే విషయంలో ఈ ఏడాది రెండు వర్గాల రైతులు మధ్య వివాదం తలెత్తింది. ఓ వర్గం కాలువ మరమ్మతులు పూర్తయ్యాక విడిచిపెట్టాలని డిమాండ్ చేయగా, మరో వర్గం ఇప్పుడే విడిచిపెట్టాలని కోరుతున్నారు. నీరు విడిచిపెడితే కోర్టును ఆశ్రయిస్తామని కొందరు హెచ్చరించగా, మరికొందరు విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాలనాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

పాలనాధికారి కార్యాలయం వద్ద రైతులు

ప్రమాదవశాత్తు కిందపడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

అల్వాల్, న్యూస్‌టుడే: సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిన ఓ కార్మికుడు మృతి చెందాడు. అల్వాల్ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన బీమా(27) ఆర్నెల్ల క్రితం నగరానికి వలసొచ్చి అల్వాల్‌లోని శివయ్యకాలనీ-లక్ష్మితఎన్‌క్లేవ్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో ఉంటున్నాడు. అదే భవనంలో గురువారం సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఐదో అంతస్తు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

పల్లెల్లో ప్రగతి పండగ..!

రూ.319 కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు

కూటమి అధికారంలోకి వచ్చాక పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.కోట్లు వెచ్చించి గ్రామాల్లో కొత్త రహదారులు నిర్మించింది. తాజాగా పల్లె పండగ-2.0తో మరిన్ని ఊళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధమవుతోంది. పండక్కి పల్లెకు వచ్చిన వారంతా బాగుపడిన తమ ఊరి రోడ్లను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

■ జిల్లాలో పల్లె పండగ తొలి విడతలో భాగంగా చేపట్టేందుకు 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9,558 పనులను గుర్తించారు. అందులో రూ.319.77 కోట్లు ఖర్చు చేసి దీనిలో 3,382 పనులు పూర్తి చేశారు. నిధుల వినియోగంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిపారు.

■ పాడి రైతులు మేలుకోరుతూ జిల్లాలో 1,480 మినీ గోకులాలు ప్రారంభించారు. 810 పూర్తయ్యాయి. 90 శాతం రాయితీపై యూనిట్లు మంజూరు చేశారు.

నరసన్నపేట నియోజకవర్గంలో లుకలాం కొమనాపల్లి నుంచి అల్లాడపేట వరకు రూ.3.20 కోట్లతో నిర్మించిన రహదారి

■ మెళియాపుట్టి, కొత్తూరు, హిర మండలం, పాతపట్నం మండలాల్లోని గిరిజన గ్రామాల్లో డోలీ మోతల నుంచి మోక్షం కల్పించారు. గర్భిణులు, వృద్ధులను ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా గిరిజన ప్రాంతాల్లో 195 పనులకు రూ.99 కోట్లు మంజూరు చేశారు. వాటిలో 22 పనులు పూర్తికాగా 121 వివిధ దశల్లో ఉన్నాయి.

■ గుంతలు పూడ్చడం, గ్రామాల్లో పక్కా రహదారి నిర్మాణాలు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు, పాఠశాలకు ప్రహరీల నిర్మాణం వంటి పనులు చేశారు. జిల్లాకు మంజూరైన ప్రతి రూపాయి వినియోగించేలా వివిధ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

చెరువుల తోడుగా.. వరి సాగు మెండుగా

సాగునీటి సౌకర్యం ఉంటే ఏ కాలంలోనైనా పంటలు సాగు చేయాలనే ఆలోచన ప్రతి రైతులో కలుగుతుంది. ఖరీఫ్ మినహా మిగతా కాలంలో పంటలు సాగు చేసేందుకు నీటి కొరత ప్రధాన సమస్యగా మారింది. దీంతో 95 శాతం గ్రామాల్లో ఒక్క పంటే పండిస్తున్నారు. తిత్లీ తుపాను తర్వాత తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు.

★ వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి రైతులకు మాత్రం వారికున్న పెద్ద చెరువు పలు రకాల పంటలు పండించేందుకు అవసరమైన నీటిని అందిస్తుంది. 120 ఎకరాల చెరువు ప్రస్తుతం పూర్తిగా నీటితో నిండి ఉండటంతో తిత్లీ తుపానులో తలెత్తిన నష్టాన్ని పూడ్చుకునేందుకు స్థానిక రైతులు వరి సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఇప్పటికే 50 ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేపట్టారు. మరో 200 ఎకరాల వరకు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దచెరువు

నీరు-చెట్టు పనులతో ఉపయోగం

300 ఎకరాల్లో వరి సాగుకు సమాయత్తం

గతేడాది రూ.30 లక్షలతో నీరు-చెట్టు పనుల ద్వారా పెద్ద చెరువును అభివృద్ధి చేశారు. దీంతో గతేడాది వర్షాలు, వంశధార నీరు ఇందులోకి చేరింది. ఈ నీటి ఆధారంగా పాతటెక్కలితోపాటు వల్లభరాయుడుపాడు, ఎస్‌జేపురం, లింగాలపాడు రైతులు వరి సాగు చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ వరి దిగుబడులు బాగానే రావడంతో వేసవి సాగు చేపడుతున్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు సాగు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇదే ఆధారం

ఏటా ఖరీఫ్, రబీలో వరితోపాటు అనేక పంటలకు చెరువు ఎంతో ఉపయోగపడుతోంది. చాలా వరకు ఆక్రమణకు గురైంది. వీటిని తొలగిస్తే తమకు మేలు చేకూరుతుంది. ప్రస్తుతం నేను 5 ఎకరాల్లో ఎద పద్ధతిలో వరి సాగు చేస్తున్నాను. కావాల్సిన ఎరువు కూడా ప్రభుత్వం ద్వారా రాయితీపై అందించారు.

– బాలక కనకరాజు, రైతు, పాతటెక్కలి

వేసవి పంటలు గుర్తించాం..

వేసవిలో రైతులు సాగుచేస్తున్న పంటలను గుర్తించాం. మండలంలో ప్రస్తుతం ఒక్క పాతటెక్కలి ప్రాంతంలోనే 300 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అక్కడ సాగుకు నీటి సౌకర్యం ఉండటంతో వేసవి పంటకు అనుకూలంగా ఉంది. పూర్తిస్థాయిలో వేసిన పంటను నమోదు చేస్తాం. పంట నష్టం జరిగే సమయంలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.ధనుంజయ్, వ్యవసాయాధికారి, వజ్రపుకొత్తూరు

వచ్చే నెల 5న చలో దిల్లీ

సీతంపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 5వ తేదీన చలో దిల్లీ కార్యక్రమం అఖిల భారత జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐజేఏసీటీవో) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ టెట్ మినహాయింపు, పాత పెన్షన్ పునరుద్ధరణ, పాఠశాల విలీన ప్రక్రియ నిలిపివేత, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ, బోధనేతర పనుల రద్దు వంటి డిమాండ్ల సాధనే లక్ష్యంగా కార్యచరణ చేపడుతున్నామన్నారు. రాష్ట్ర గిరిజన విభాగం కో-కన్వీనర్ కె.ప్రమోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మురళీబాబు, నాయకులు ఎం.ప్రసాద్, ఎం.అప్పలనాయుడు, బి.ఆనందరావు, ఎ.కేశవరావు, బాబూరావు, జగన్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల రద్దీ

సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు ప్రయాణికులతో రద్దీగా మారింది. బస్సులు కిక్కిరిశాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లి వద్ద రైలు వంతెన మీదుగా విశాఖకు నేరుగా రాకపోకలు సాగుతుండడంతో రద్దీ పెరిగింది. –న్యూస్‌టుడే, పాలకొండ

సరస్వతి శిశు మందిర్‌లో చోరీ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నారాయణ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం శిశు మందిర్‌లో దొంగలు ప్రవేశించి 40 వేల రూపాయల నగదు, కంప్యూటర్ మానిటర్ తదితర వస్తువులు చోరీ చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

యాదవ్ మాఝి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం: నవరంగపూర్: నవరంగపూర్ జిల్లా చందహండి సమితి దండముండా క్రీడా మైదానంలో పల్లెశ్రీ యువక సంఘం తరపున యాదవ్ మాఝి స్మారక అంతర్జిల్లా క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమయ్యింది. మాజీ ఎంపీ రమేష్ చంద్ర మాఝి టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఏకామ్రనాథస్వామికి తిరువీధి మహోత్సవం

సాలూరు, న్యూస్‌టుడే: ధనుర్మాస పూజల్లో భాగంగా సంక్రాంతి సందర్భంగా గురువారం కామాక్షి సమేత ఏకామ్రనాథ స్వామి ఉత్సవ విగ్రహాలకు పురవీధుల్లో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అర్చకుడు సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి రథోత్సవం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా గోపూజ

పాలకొండ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవమైన కోట దుర్గమ్మ ఆలయంలో కనుమ సందర్భంగా అర్చకుడు లక్ష్మీప్రసాద్ శుక్రవారం గోపూజ నిర్వహించారు. పార్వతీపురం ఎస్సై వామనరావు, జోగినాయుడు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులకు ఆర్థిక దన్ను..!

■ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

న్యూస్‌టుడే, పొందూరు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వైకాపా పాలనలో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కేటాయించిన ఆసుపత్రి అభివృద్ధి నిధుల్ని (హెచ్‌డీఎస్) ఇతర అవసరాలకు మళ్లించడంతో కనీస అవసరాలకూ ఇబ్బంది తలెత్తాయి. వివిధ రకాల ప్రోత్సాహకాలు నిలిపివేయడంతో వైద్య సేవలపై ప్రభావం పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంది. సేవల్లో ఆదర్శంగా నిలిచిన వైద్యశాలలకు నజరానాలు అందించడం.. ప్రసవాలను ప్రోత్సహించేలా నిధులు అందజేస్తోంది. తొలి దశలో ఆరోగ్య కేంద్రాలకు రూ.30 వేలు అందజేయగా రెండో విడతలో ఇటీవల రూ.70 వేలు చొప్పున మంజూరు చేసింది

జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణికి భోజనం పొట్లం అందజేస్తున్న వైద్యురాలు

వినియోగం ఇలా..

- ఏటా పీహెచ్‌సీలకు రూ.1.75 లక్షలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రూ.లక్ష కేటాయిస్తారు. వీటితో రోగులకు తాగునీటి వసతి, ఫినాయిల్, స్టేషనరీ కొనుగోలు, ఓపీ చీటీలు, దస్త్రాలు, కంప్యూటర్ మరమ్మతులు, ప్రింటర్ క్యాట్రిడ్జ్, ఇంటర్నెట్ బిల్లులు చెల్లిస్తారు.
- అత్యవసర సమయంలో మందులు కొనుగోలు, ఆసుపత్రులకు వచ్చిన గర్భిణులకు రవాణా ఖర్చులు భరించాలి.
- జిల్లా కేంద్రం నుంచి ఔషధాలు తెచ్చుకునేందుకు రవాణా ఖర్చులు, ఆసుపత్రుల్లో చిన్నపాటి మరమ్మతులు చేయించడం, గ్రామాలకు టీకాల తరలింపు, ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చినప్పుడు ఏర్పాట్లు, ఇతర పనులకు ఈ నిధుల నుంచే ఖర్చు చేస్తారు.

వసతులు సక్రమంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నాం.. ఆసుపత్రుల అభివృద్ధికి సంబంధించి రెండో విడత నిధులు ఇటీవల జమ చేశాం. మార్చి లోపు వినియోగించేలా పర్యవేక్షిస్తున్నాం. ఎలా ఉపయోగించాలో వైద్యాధికారులకు సూచనలు చేశాం. వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. – కె.అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

● జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 66 ● పట్టణ ఆరోగ్య కేంద్రాలు: 13

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

అట్టహాసంగా జల్లికట్టు పోటీలు

పాలమేడు జల్లికట్టును ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

ఎద్దులను అదుపు చేస్తున్న క్రీడాకారులు

ప్యారిస్‌, న్యూస్‌టుడే: మదురై జిల్లాలోని పాలమేడు జల్లికట్టు పోటీలను శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ ప్రారంభించారు. 1000కి పైగా ఎద్దులు, 600 మందికి పైగా క్రీడాకారులకు అనుమతిచ్చారు. పోటీలను సినీ నటులు సూరి, అశోక్‌ సెల్వన్‌, ఆయన భార్య, నటి కీర్తి పాండియన్‌, నటుడు, మాజీ ఎమ్మెల్యే అరుణ్‌ పాండియన్‌, జీవ తదితరులు వీక్షించారు.

ప్యారిస్‌: అవనియాపురం జల్లికట్టు పోటీలు సందడిగా సాగాయి. గురువారం తొలి పోటీని మంత్రులు మూర్తి, పళనివేల్‌ త్యాగరాజన్‌ ప్రారంభించారు. 939 ఎద్దులు, 564 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 22 ఎద్దులను అదుపుచేసి బాలమురుగన్‌ మొదటిస్థానంలో నిలిచి కారు, 17 ఎద్దులను అదుపుచేసి కార్తిక్‌ రెండో స్థానంలో నిలిచి ద్విచక్ర వాహనాన్ని అందుకున్నాడు. విరుమాండి సహోదరుల ఎద్దు ఉత్తమంగా నిలవడంతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ తరపున ట్రాక్టర్‌ బహుమతిగా ఇచ్చారు. ఒక్కో రౌండ్‌లో గెలిచిన క్రీడాకారులకు, ఎద్దులకు బీరువా, మంచం, వెండి వస్తువులను బహుమతులుగా మంత్రి మూర్తి ఇచ్చారు. మదురై జిల్లా కలెక్టరు ప్రవీణ్‌కుమార్‌, కార్పొరేషన్‌ కమిషనర్‌ చిత్ర విజయన్‌, పోలీసు కమిషనర్‌ లోకనాథన్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలమురుగన్‌కు కారు తాళం ఇస్తున్న మంత్రి మూర్తి

అవనియాపురంలో ..

ఉత్సాహంగా రేక్లా రేస్‌

తిరుత్తణి, న్యూస్‌టుడే: పొంగల్‌ను పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తిరువాలంగాడులో శుక్రవారం నిర్వహించిన రేక్లా రేస్‌(గుర్రపు పందెం) అట్టహాసంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే ఎస్‌.చంద్రన్‌ పోటీలు ప్రారంభించారు. తిరువాలంగాడు నుంచి ముత్తుకొండాపురం వరకు సుమారు 15 కి.మీ మేర పందెం ఉత్సాహభరితంగా సాగింది. విజేతలకు చంద్రన్‌ ట్రోఫీలు అందించారు.

ఇక్కడి పొంగల్‌.. పురుషులకు మాత్రమే

సంబరాల్లో పాల్గొన్న పురుషులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుప్పురం జిల్లా వానూర్‌ పంచాయతీ నైనార్‌ మంటపం గ్రామంలో గురువారం నిర్వహించిన పొంగల్‌లో పురుషులు మాత్రమే పాల్గొన్నారు. గ్రామంలో 40కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. పురుషులు కొత్తకుండలు ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువు గట్టున పొయ్యి తవ్వి తాటి ఆకులతో మండించి పొంగలి వండి అయ్యనార్‌ ఆలయంలో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ఆ పొంగలిని ఇంటికి తీసుకెళ్లకుండా పురుషులు మాత్రమే ప్రసాదంగా స్వీకరించారు. వ్యవసాయం, పశువులు, పిల్లలు తరతరాలుగా వర్ధిల్లడానికి వీలుగా ఇలా చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

విదేశీయుల సందడి

ఆర్కేనగర్‌, న్యూస్‌టుడే: తంజావూర్‌ సమీప నంజికోట్టై గ్రామంలో నిర్వహించిన పొంగల్‌ వేడుకల్లో ఫ్రాన్స్‌, ఆస్ట్రేలియా, నెదర్లాండ్‌, ఇంగ్లాండ్‌, ఇజ్రాయేల్‌, అమెరికా తదితర పలు దేశాలకు చెందిన వంద మందికి పైగా పాల్గొన్నారు. స్థానికులు వారికి ఉత్సాహంగా స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాల నడుమ ఎద్దులబండ్లలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. వెళ్లసామి ఆలయంలో స్థానిక మహిళలతో కలిసి విదేశీయులు పొంగళ్లు వండారు. కబడ్డీ, సిలంబం, ఇలవట్టకల్‌, మయిలాట్టం, ఓయిల్హాటం, భరతనాట్యం, తప్పాట్టం తదితర కార్యక్రమాలను విదేశీ పర్యాటకులు ఆసక్తిగా వీక్షించారు.

పొంగల్‌ వండుతున్న విదేశీ పర్యాటకులు

5 టన్నుల చెరకు గడలతో రథం

చెరకు గడలతో తయారు చేసిన రథం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప కీళ్‌ కదిర్‌పూర్‌ పంచాయతీ గుండుపెరుంబేడు గ్రామంలో పొంగల్‌ను పురస్కరించుకుని రైతు కుటుంబానికి చెందిన సెంథిల్‌కుమార్‌ మొదటిసారి ఆరేళ్లుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులను గౌరవించేలా 5 టన్నుల చెరకు గడలతో 21 అడుగుల ఎత్తు, 10 అడుగుల వెడల్పుతో రథాన్ని రూపొందించారు. ప్రజలు రథం వద్ద నిల్చుని సెల్ఫీలు తీసుకొని ముచ్చటపడుతున్నారు.

డీఎంకేతో మాత్రమే కాంగ్రెస్‌ చర్చలు

పొంగల్‌ కానుక అందిస్తున్న కార్తి పి.చిదంబరం

చెన్నై, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో డీఎంకేతో మాత్రమే కాంగ్రెస్‌ అధికారికంగా చర్చలు జరుపుతోందని శివగంగై ఎంపీ కార్తి పి.చిదంబరం తెలిపారు. టీఎన్‌సీసీ థౌజండ్‌ లైట్స్‌ తరపున చూళైమేడులో శుక్రవారం జరిగిన సమానత్వ పొంగల్‌ కార్యక్రమంలో కార్తి పి.చిదంబరం పాల్గొని పలువురికి కానుకలు అందించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వంలో, అధికారంలో భాగస్వామ్యం అనే నినాదాన్ని రాష్ట్రంలో వినిపించడం కొత్తేమీ కాదన్నారు. ఇది అన్ని రాజకీయ పార్టీల్లోనూ కనిపించే సాధారణ విషయమేనని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే నాయకత్వంలోని 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్‌ ఉందన్నారు.

ఒకే రోజు ఐదున్నర లక్షల మంది ప్రయాణం

ఆర్కేనగర్‌, న్యూస్‌టుడే: చెన్నైలో నివాసం ఉంటున్న బయట ప్రాంతాల వాసులు పండుగ సమయంలో సొంతూర్లకు 9వ తేది నుంచి తరలివెళ్లారు. గురువారం పొంగల్‌ పండుగ కావడంతో ఒక్క రోజు సొంతూర్లకు వెళ్లేవారి సంఖ్య మరింత పెరిగింది. చెన్నై ఎగ్మోర్‌, చెన్నై సెంట్రల్‌, తాంబరం రైల్వేస్టేషన్‌లలో గురువారం కట్టడి చేయలేనంతగా ప్రయాణికుల రద్దీ కనిపించింది. ముఖ్యంగా మదురై, తిరుచ్చి, నెల్లై, కన్నియాకుమరి తదితర దక్షిణ జిల్లాలకు వెళ్లే రైళ్ల ప్రయాణికులతో కాలు పెట్టలేనంతగా బోగీలు నిండిపోయాయి. గురువారం ఒక్కరోజు మాత్రమే రైళ్లలో 1.35 లక్షల మంది, ప్రభుత్వ బస్సుల్లో 2.50 లక్షల మంది, ప్రైవేట్‌ ఆమ్ని బస్సుల్లో 60,700 మంది, కార్లు, కాల్‌ ట్యాక్సీలు, ద్విచక్రవాహనాల్లో సుమారు లక్ష మంది మొత్తం 5,45,700 మంది స్వగ్రామాలకు తరలి వెళ్లారు.

పెంపుడు కుక్కలతో ప్రాణహాని

☛ పదేళ్లలో రేబిస్‌తో 74 మంది మృత్యువాత

వీధి కుక్కలే కాదు.. పెంపుడు కుక్కలూ ప్రమాదకరమేనని తాజాగా సమాచారహక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన నివేదిక స్పష్టం చేస్తోంది. సుమారు 30శాతం మరణాలు పెంపుడు కుక్కలతోనే జరుగుతున్నాయన్నది అందులో కీలకాంశంగా ఉంది.

ఈనాడు -చెన్నై

ఏడాది	రేబిస్‌తో మరణాలు	పెంపుడు కుక్కకాటుతో
2016	22	4
2017	26	6
2018	31	6
2019	23	12
2020	20	5
2021	19	11
2022	28	6
2023	31	9
2024	47	10
2025	8	5

(సెప్టెంబరు వరకు)

సమాచార హక్కుచట్టం ద్వారా చెన్నైకు చెందిన సామాజిక కార్యకర్త ఆంటోనీ క్లైమెంట్‌ రూబిన్‌ కీలక సమాచారాన్ని ఆరోగ్యశాఖ నుంచి తీసుకున్నారు. అధికారుల సమాధానాల ప్రకారం.. పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రేబిస్‌ ప్రభావంతో ఏకంగా 255 మంది మృత్యువాతపడ్డారు. రేబిస్‌ జంతువుల ద్వారా వస్తున్నా ప్రధానంగా కుక్కలే కారణంగా ఉన్నాయి. దశాబ్దకాలంలో అత్యధిక మరణాలు 2024లో 47 చోటుచేసుకున్నాయి.

ఇంట్లోనే ముప్పు

విచారకర విషయమేంటంటే.. తమ ఇంట్లోని పెంపుడు కుక్కలు కరవడంతోనే పదేళ్లలో 74మంది తీవ్ర వేదనతో మృత్యువాతపడ్డారు. మొత్తం మరణాల్లో ఇవే 29.02శాతం ఉన్నాయి. తద్వారా పెంపుడు కుక్కలతోనూ ప్రమాదం ఉందని హెచ్చరించినట్లైంది.

ఖర్చు చేసినా..

10 ఏళ్లలో యాంటీ రేబిస్‌ వ్యాక్సిన్‌ (ఏఆర్‌వీ)లకు, వ్యాధిని నియంత్రించే రేబిస్‌ ఇమ్యూనోగ్లోబులిన్‌(ఆర్‌ఐజీ) వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చుచేసింది. మరోవైపు వ్యాక్సిన్‌ వేసే సామర్థ్యాన్ని సైతం రాష్ట్రం పెంచుకుంది. 2015-16లో 3.87 లక్షల వ్యాక్సిన్‌లు వేయగా.. 2024-25లో 9.36 లక్షలకు పెరిగింది. ఖర్చు భారీగా పెరుగుతున్నా రేబిస్‌ మరణాలు నియంత్రణలోకి రాకుండటం ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది.

పర్యవేక్షణ లోపాలే ఎక్కువ

మరణాల్ని నియంత్రించడంలో ప్రభుత్వం నుంచి చురుకైన స్పందన ఉండటంలేదనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. రేబిస్‌ను అదుపుచేసేందుకు కచ్చితమైన విధానాల్ని రూపొందించాల్సిన అవసరమూ ఉందంటున్నారు సామాజిక కార్యకర్త రూబిన్‌. వ్యాధి ముప్పు తీవ్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవడంలేదని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం కోసం ఖర్చుచేయడం బాగానే ఉన్నా.. ముప్పు రాకముందే నియంత్రణ చర్యల్ని, పర్యవేక్షణ విధానాల్ని మెరుగుపరచుకోవడంలో విఫమవుతున్నారని ఆరోపించారు. రేబిస్‌ను పకడ్బందీగా నియంత్రించడంలో గోవా చాలా ముందుందని అక్కడ 92శాతం మేర వ్యాధి కేసుల్ని నియంత్రించగలిగారని గుర్తుచేశారు. అక్కడి విధానాల్ని రాష్ట్రం అందిపుచ్చుకోవాలని సూచించారు.

కొత్త పింఛన్‌ పథకం.. కంటితుడుపు చర్య

సేలం, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన కొత్త పింఛన్‌ విధానం కేవలం కంటితుడుపు చర్యేనని, ఇది ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసే హైడ్రామా అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. సేలం జిల్లా మేచ్చేరిలో గురువారం జరిగిన 108 కుండల పొంగల్‌ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. వచ్చే ఏడాది పొంగల్‌ నాటికి రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వమే ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమి బలంగా ఉందని త్వరలో మరికొన్ని పార్టీలు మాతో జతకట్టనున్నాయని పేర్కొన్నారు. డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌ కొనసాగుతుందా లేదా అన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో డీఎంకే విఫలమైందని విమర్శించారు. అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాక పరిస్థితులను అనుసరించి ఉద్యోగుల ప్రయోజనం కోసం మంచి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేచ్చేరిలో జరిగిన వేడుకల్లో ఈపీఎస్‌ ఎద్దుల బండిపై ఊరేగుతూ రాగా కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

ఎడ్లబండి నడుపుతున్న ఎడప్పాడి పళనిస్వామి

బోడినాయకనూర్‌లో పోటీని ప్రజలే నిర్ణయించాలి: ఓపీఎస్‌

ట్రిప్లికేన్‌, న్యూస్‌టుడే: బోడినాయకనూర్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయాలా, వద్దా అనేది ప్రజలే నిర్ణయించాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీరుసెల్వం తెలిపారు. ముల్లైపెరియార్‌ డ్యాం నిర్మించిన జాన్‌ పెన్నిక్విక్‌ జయంతిని గురువారం తేని జిల్లా లోయర్‌ క్యాంప్‌లోని మణిమండపంలో జరుపుకొన్నారు. పెన్నిక్విక్‌ విగ్రహానికి ఓపీఎస్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ముల్లైపెరియార్‌ ఆనకట్ట నీటిమట్టాన్ని పెంచడానికి జయలలిత ఆమె పాలనలో పోరాడిందని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో పొత్తుపై విలేకరులు ప్రశ్నించగా ఇంకా 30 రోజులు ఉన్నాయని అప్పటికి మంచి నిర్ణయం తీసుకుంటామని సమాధానమిచ్చారు.

మహానందికి ప్రత్యేక అలంకరణ

ఆర్కేనగర్‌, న్యూస్‌టుడే: కనుమ పండుగ సందర్భంగా ప్రసిద్ధి చెందిన తంజావూర్‌ బృహదీశ్వర ఆలయంలోని మహానందికి భక్తులు సమర్పించిన 2 వేల కిలోల కూరగాయలు, పండ్లు, పువ్వులు, స్వీట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. 108 గోవులకు పసుపు, కుంకుమ, చందనం పెట్టి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వాటికి చక్కెర పొంగలి ఆహారంగా పెట్టారు. జిల్లా కలెక్టర్‌ ప్రియాంక పంకజం కుటుంబంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

అభిమానులకు తలైవర్‌ శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: అభిమానులకు అగ్రనటుడు రజనీకాంత్‌ పొంగల్‌ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏటా ఆంగ్ల సంవత్సరాది, దీపావళి, పొంగల్‌ తదితర సందర్భాల్లో పోయెస్‌ గార్డెన్‌లోని సూపర్‌స్టార్‌ నివాసానికి పెద్దసంఖ్యలో అభిమానులు తరలి వస్తుంటారు. పొంగల్‌ సందర్భంగా పలు జిల్లాల నుంచి అభిమానులు చేరుకోగా రజనీకాంత్‌ బయటికొచ్చి అభివాదం చేసి శుభాకాంక్షలు తెలిపి వెళ్లిపోయారు. ఆయన్ను సరిగా చూడలేని కొందరు అభిమానులు 'తలైవా.. తలైవా' అంటూ బిగ్గరగా అరవడంతో మరోసారి వచ్చి అభివాదం చేసి వెళ్లిపోయారు. మళ్లీ అభిమానులు గట్టిగా కేకలు వేస్తూ ఉండటంతో మూడోసారి కూడా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

అభివాదం చేస్తున్న రజనీకాంత్‌

పశువుల పండుగ సందర్భంగా చెన్నై టీనగర్‌ గోశాలలో గోవులకు ఆహారం అందజేస్తున్న ప్రజలు -వేళచ్చేరి, న్యూస్‌టుడే

వీరరాఘవ పెరుమాళ్‌ ఆలయంలో తై బ్రహ్మోత్సవాలు

హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గిండి, న్యూస్‌టుడే: 108 దివ్యక్షేత్రాల్లో ఒకటైన తిరువళ్లూరు జిల్లాలోని శ్రీ వైద్య వీరరాఘవపెరుమాళ్‌ గుడిలో ఏడాదికి రెండు సార్లు బ్రహ్మోత్సవాలు జరగడం విశేషం. తాజాగా మొదలైన 'తై' బ్రహ్మోత్సవాలు గురువారం మొదలై పది రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారిని హంసవాహనంపై ఊరేగించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు చేపట్టారు. శనివారం తెల్లవారుజామున గరుడసేవ, రాత్రి హనుమంత వాహనసేవ ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈనెల 21న రథోత్సవం జరగనున్నట్లు చెప్పారు.



తిరువళ్లువర్‌ డే సందర్భంగా శుక్రవారం గిండిలోని లోక్‌భవన్‌లో ఉన్న తిరువళ్లువర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్‌ ఆర్‌.ఎన్‌.రవి
-చెన్నై, న్యూస్‌టుడే

వరుస సెలవులు.. ఖాళీగా రహదారులు

అన్నాసాలైలో అతి తక్కువ సంఖ్యలో వెళుతున్న వాహనాలు

ప్యారిస్‌, న్యూస్‌టుడే: పొంగల్‌ సందర్భంగా చెన్నై వాసులు సొంతూళ్లకు వెళ్లడంతో నగరంలోని రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. గురువారం పొంగల్‌, శుక్రవారం మాట్టు పొంగల్‌ జరుపుకోగా శనివారం కానుం పొంగల్‌ జరుపుకోనున్నారు. వరుస సెలవులతో చెన్నైలో ఉంటున్న ఇతర జిల్లాలకు చెందిన వారు సొంతూళ్ల వెళ్లడంతో చెన్నై, శివారు ప్రాంతాల్లో రోడ్లపై ట్రాఫిక్‌ గణనీయంగా తగ్గింది. రహదారులు ఖాళీగా కనిపిస్తున్నాయి.

తమిళులను అర్థం చేసుకోలేని భాజపా

☛ మంత్రి టీఆర్బీ రాజా

వడపళని, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా తమిళ ప్రజలను, తమిళనాడును అర్థం చేసుకోలేదని మంత్రి టీఆర్బీ రాజా విమర్శించారు. తమిళనాడు, తమిళుల పండుగపై దిల్లీకి ఎలాంటి అవగాహన లేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం రాష్ట్ర ప్రజలకు 'పొంగల్‌'కు బదులు 'తిరువళ్లువర్‌ దినోత్సవ' శుభాకాంక్షలు తెలిపిన నేపథ్యంలో మంత్రి పైవిధంగా ఓ సోషల్‌ మీడియాలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో తమిళ 'తై' మాసం ప్రారంభం రోజున పొంగల్‌ వేడుకలు, రెండో రోజున తిరువళ్లువర్‌ దినోత్సవం జరుపుకొంటారని మంత్రి గుర్తు చేశారు. డీఎంకే సీనియర్‌ నాయకుడు టీకేఎస్‌ ఇలంగోవన్‌ కూడా అమిత్‌షాను విమర్శించారు. తమిళ సంస్కృతిపై భాజపాకు అవగాహన లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ పురస్కారాలు ప్రదానం

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తరపున 2025, 2026 సంవత్సరాల పురస్కారాలను 13 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్‌ ప్రదానం చేశారు. నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని 2026వ ఏడాది తిరువళ్లువర్‌ పురస్కారాన్ని సత్యవేల్‌ మురుగనార్‌, 2025వ ఏడాది తందై పెరియార్‌ పురస్కారాన్ని న్యాయవాది అరుళ్‌మొళి, అంబేద్కర్‌ పురస్కారాన్ని చింతనై సెల్వన్‌, అన్నా పురస్కారాన్ని మంత్రి దురైమురుగన్‌, కామరాజర్‌ పురస్కారాన్ని ఇదయతుల్లా, మహాకవి భారతియార్‌ పురస్కారాన్ని కవి నెల్లై జయంత, పావేందర్‌ భారతిదాసన్‌ పురస్కారాన్ని కవి యుగభారతి, తిరు.వి.క పురస్కారాన్ని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఇరైయన్బు, కి.ఆ.పె.విశ్వనాథం పురస్కారాన్ని చెల్లప్ప, కలైఙర్‌ పురస్కారాన్ని విడుతలై విరుంబికి ప్రదానం చేశారు. 2025వ ఏడాదికి గాను ఇలక్కియ మామణి పురస్కారాలను రామలింగం, మహేంద్రన్‌, నరేంద్రకుమార్‌లకు అందించారు. పురస్కార గ్రహీతలకు రూ.5 లక్షల నగదు, సవరం బంగారు పతకం అందించి శాలువాతో సత్కరించారు.

ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పురస్కార గ్రహీతలు

సందడిగా నమ్మ ఊరు తిరువిళా

చెన్నై, న్యూస్‌టుడే: పొంగల్‌ పర్వదినం సందర్భంగా 'చెన్నై సంగమం-నమ్మ ఊరు తిరువిళా'ను ముఖ్యమంత్రి స్టాలిన్‌ ప్రారంభించారు. కళలు, సాంస్కృతికశాఖ తరపున నగరంలోని 20 చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎగ్మూర్‌ రాజరత్నం స్టేడియంలో జరిగిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. స్టాలిన్‌ డప్పు వాయించడం పలువురిని అబ్బురపరిచింది. అనంతరం తన సతీమణి దుర్గా స్టాలిన్‌, సోదరి ఎంపీ కనిమొళితో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. బెసెంట్‌ నగర్‌లోని ఎలియట్స్‌ బీచ్‌, తిరువాన్మియూర్‌ బీచ్‌, మెరినా బీచ్‌, సెమ్మొళి పార్కు, రాయపురంలోని రాబిన్‌సన్‌ పార్కు, ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియం, రాజరత్నం స్టేడియం, నుంగంబాక్కంలోని వళ్లువర్‌ కోట్టం, త్యాగరాయనగర్‌లోని నటేశన్‌ పార్కు, రాజా అన్నామలైపురంలోని ప్రభుత్వ మ్యూజిక్‌ కళాశాల, గిండిలోని కత్తిపారా జంక్షన్‌, అన్నానగర్‌ టవర్‌ పార్కు తదితర 20 ప్రాంతాల్లో 18 వరకు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటలు వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

డప్పు వాయిస్తున్న సీఎం స్టాలిన్‌

(c) eenadu

కార్యక్రమంలో పాల్గొన్న ఒడిశా ప్రభుత్వ అధికారులు, ఐఐటీఎం ప్రతినిధులు

రహదారి భద్రతకు డాష్‌బోర్డ్

అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాస్

వడపళని, న్యూస్‌టుడే: రహదారి భద్రత కోసం ఐఐటీ మద్రాస్ 'ఇంటిగ్రేటెడ్ రోడ్ సేఫ్టీ డాష్‌బోర్డ్'ను రూపొందించింది. ఐఐటీఎం ఆర్బీజీ ల్యాబ్స్‌లో అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతికతను ఒడిశా ప్రభుత్వం అక్కడి కియోఝూర్‌లో 'జీరో యాక్సిడెంట్ డే' సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రారంభించింది. ఆ రాష్ట్ర రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రాణాలు కాపాడటానికి, రోడ్లను సురక్షితం చేయడానికి డాష్‌బోర్డ్ ఉపయోగపడగలదని చెప్పారు. విశ్లేషణలు, పర్యవేక్షణ కూడా అందించగలదన్నారు. ఐఐటీఎం డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి మాట్లాడుతూ రహదారి భద్రత అనేది సమన్వయంతో కూడిన చర్య అన్నారు. డాష్‌బోర్డ్ కేవలం సాంకేతిక వేదిక మాత్రమే కాదని, పాలనా సంస్కరణ సాధనం, ఇ-గవర్నెన్స్‌లాంటిదని ఆర్బీజీ ల్యాబ్స్ అధిపతి, ఆచార్యులు వెంకటేష్ బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. ఈ సాంకేతికత ప్రత్యక్షంగా ప్రాణాలను కాపాడేందుకు దోహద పడుతుందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఎంపీలు సుజీత్ కుమార్, అనంత నాయక్, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా, ఐఐటీ మద్రాస్ ఆర్బీజీ ల్యాబ్స్ ఆచార్యులు వెంకటేష్ బాలసుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్టీఎస్ పొడిగింపు పనులు పూర్తి

'సీఆర్ఎస్' అనుమతి కోసం దక్షిణ రైల్వే నిరీక్షణ

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్ స్టేషను నుంచి వేళచ్చేరి వరకున్న మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఎమ్మార్టీఎస్) మార్గాన్ని సెయింట్ థామస్ మౌంట్ వరకు పొడిగించే పనులు పూర్తయ్యాయి. ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. సేవలను ప్రారంభించేందుకు దక్షిణ ప్రాంత కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) ట్రయల్ రన్ ఎప్పుడు నిర్వహిస్తుందా అని అధికారులు ఎదురు చూస్తున్నారు.

రూ.834 కోట్లతో..

వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు సేవలు ప్రారంభించేందుకు పొంగల్‌కు ముందే ధ్రువీకరణపత్రం పొందాలని దక్షిణ రైల్వే ప్రణాళిక రచించింది. జనవరి నాటికి ప్రారంభించడం అసంభవమని సీనియర్ అధికారులు పేర్కొన్నారు. వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 4.5 కి.మీ. మేర పొడిగింపు మార్గాన్ని రూ.834 కోట్లతో పూర్తి చేశారు. గత నెలలో ప్రాజెక్టు పూర్తయినప్పటి నుంచి డీజిల్ ఇంజిన్‌తో సరకు రవాణా రైళ్లను, ట్రయల్ రన్‌లు విజయవంతంగా నిర్వహించారు. వేళచ్చేరి నుంచి పొడిగించిన మార్గం మధ్యలో పుళుదివాక్కం, ఆదంబాక్కం రెండు స్టేషన్లు ఉండటంతో భద్రతా ధ్రువీకరణపత్రం కోసం దక్షిణ రైల్వే దరఖాస్తు సమర్పించింది.

పూర్తయిన మార్గం

తగ్గిన ఫ్రీక్వెన్సీ..

బీచ్ నుంచి వేళచ్చేరి వరకు నడుస్తున్న ఎమ్మార్టీఎస్ మార్గంలో రద్దీ సమయంలో 15 నిమిషాలకో సర్వీసు నడిచింది. ఎగ్మోర్ నుంచయి బీచ్ వరకు నాలుగో లైను నిర్మాణం పూర్తై, సేవలు తిరిగి ప్రారంభమైన తర్వాత 25 నిమిషాలకో సర్వీసు నడుస్తోంది. రద్దీ సమయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మార్టీఎస్ నెట్‌వర్క్‌ను మెట్రోకు దీటుగా ఉండాలనే ఆలోచనతో సీఎంఆర్‌ఎల్ ఆరు స్టేషన్ల స్థాయిని పెంచాలని ఆలోచిస్తోంది. ఇందుకోసం త్వరలో టెండర్లను కూడా ఆహ్వానించనుంది. నెలాఖరుకు తమిళనాడు ప్రభుత్వం, దక్షిణ రైల్వేల మధ్య ఒప్పందాలు జరిగే అవకాశాలున్నాయని సీఎంఆర్‌ఎల్ పేర్కొంది. ■ తొలుత ఇందిరానగర్, కస్తూర్బానగర్, వేళచ్చేరి, తరమణి, పెరుంగుడి, తిరువాన్మియూరు ఎమ్మార్టీఎస్ స్టేషన్లలో పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. ఫ్లోరింగ్ మార్చడం, మెరుగైన నిర్వహణ, లిఫ్టులు, ఎస్కలేటర్లు వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. వాటితో పాటు ఇతరత్రా పునరుద్ధరణ పనులు కూడా జరుగుతాయని, మొత్తం రెండేళ్ల సమయం పట్టొచ్చని అధికారులంటున్నారు.

అన్బుమణిపై మంత్రి పన్నీర్‌సెల్వం మండిపాటు

టీనగర్, న్యూస్‌టుడే: పాట్టాలి మక్కల్ కట్చి నేత అన్బుమణి రామదాస్‌పై వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం విరుచుకుపడ్డారు. రైతుల హృదయాల్లో సంతోషం ఉందా అంటూ అన్బుమణి విడుదల చేసిన ప్రకటన కేవలం ప్రచారం కోసమేనని, వాస్తవాలకు విరుద్ధమని మంత్రి కొట్టిపారేశారు. సొంత పార్టీ నుంచే బహిష్కరణకు గురైన అన్బుమణికి అబద్ధాలు తప్ప మరేమీ తెలియదని విమర్శించారు. నగర జీవితానికి అలవాటు పడి, పొలం గట్లపై నడవడం తెలియని అన్బుమణి, తన ఇంటి కిటికీ నుంచి సముద్రంలో డాల్ఫిన్ల ఆటలను చూస్తూ ప్రకటనలు ఇస్తుంటారన్నారు. అందుకే ఆయన్ని డాల్ఫిన్ అన్బుమణిగా పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఐదేళ్లలో ప్రభుత్వం వ్యవసాయ రంగం కోసం అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం పెరిగి దిగుబడి గణనీయంగా వృద్ధి చెందిందని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

పశువుల పండుగకు వస్తువుల విక్రయం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా విరుధాచలం పట్టణంలో పశువుల పండుగను పురస్కరించుకొని రంగురంగుల తాళ్లు, మెడలో కట్టే గంటలు, ప్లాస్టిక్ దండలు వంటి వస్తువులను వ్యాపారులు విక్రయానికి ఉంచారు. వ్యవసాయానికి సాయపడే పశువులకు కృతజ్ఞత తెలిపేలా తైమాసం రెండో రోజున పశువులను శుభ్రం చేసి కుంకుమ, గంధంతో అభిషేకించి పూజలు చేస్తారు. ఈ పండుగకు అవసరమైన సామగ్రిని విరుధాచలం పట్టణంలో అనేక ప్రాంతాల్లో రూ.50 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు.

రైలులో వస్తువులు పోగొట్టుకున్న మహిళ

గుర్తించి అప్పగించిన ఆర్పీఎఫ్ సిబ్బంది

వడపళని, న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికురాలు పోగొట్టుకున్న విలువైన వస్తువులను ఆర్పీఎఫ్ పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించారు. విల్లివాక్కం ఆర్పీఎఫ్ పోలీసు ఆర్.గుణశేఖరన్ గురువారం మధ్యాహ్నం పెరంబూర్ క్యారేజ్ వర్క్స్ స్టేషన్లో విధుల్లో ఉండగా మద్రాస్ నుంచి తిరువళ్లూరు వెళ్లే సబర్బన్ రైలు తలుపు వద్ద అనాథగా ఉన్న సంచి, మహిళలు ఉపయోగించే హ్యాండ్ బ్యాగ్ గమనించారు. ప్రయాణికులను వాటి గురించి అడగ్గా సరైన సమాధానం రాలేదు. గుణశేఖరన్ వాటిని స్వాధీనం చేసుకుని విల్లివాక్కం ఆర్పీఎఫ్ ఉన్నతాధికారికి అందించారు. ఏఎస్ఐ ఎం.జాన్‌సాలమన్ నేతృత్వంలోని బృందం సంచులను తనిఖీ చేయగా 8 సవర్ల బంగారం, మొబైల్ ఫోను, మహిళల చేతి గడియారంతో పాటు 8 కొత్త చీరలు గుర్తించారు. మధ్యాహ్నం 2.30 సమయంలో ఆర్పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోనుకు వి.అరుల్‌మొళి(40) నుంచి ఫోను వచ్చింది. సేలం నుంచి పెరంబూరుకు 12680 ఎక్స్‌ప్రెస్‌లో వచ్చానని, ఆ తర్వాత 43227 మద్రాస్-తిరువళ్లూరు రైలు పెరంబూరు చేరుకున్నప్పుడు, అంబత్తూర్ వెళ్లడానికి లగేజీని రైలులో ఎక్కించి తాను ఎక్కేలోగా బయలుదేరిందని తెలిపింది. అనంతరం ఆమె విల్లివాక్కం ఆర్పీఎఫ్ సిబ్బందిని కలవగా రూ.8.2 లక్షల విలువైన వస్తువులను తిరిగి అందజేశారు. ఆమె వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అరుల్‌మొళికి సంచి అందిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

డీఎంకేకు ఎన్నికల భయం

అరక్కోణం, న్యూస్‌టుడే: ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ డీఎంకే భయపడుతోందని భాజపా నేత తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. చెన్నై సాలిగ్రామంలోని తన నివాసంలో పొంగల్ జరుపుకొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... డిల్లీలో తమిళుల సంప్రదాయ పొంగల్ పండుగలో ప్రధాని మోదీ పాల్గొన్నారని చెప్పారు. పరాశక్తి బృందం రాకతో భాజపాకు అధిక బలం చేకూరిందని తెలిపారు.

మాట్లాడుతున్న తమిళిసై సౌందరరాజన్

నాడీ వ్యవస్థపై పని ఒత్తిడి ప్రభావం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: పని ఒత్తిడి నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుందని వైద్యులు చెప్పారని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో న్యూరాలజీ ఓపీడీ కోసం కొత్త భవనాన్ని ఆయన ప్రారంభించారు. ప్రపంచ జనాభాలో 40శాతం మంది నాడీ సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిస్తోందని ఉప రాష్ట్రపతి తెలిపారు. దేశాభివృద్ధికి యువత ఆరోగ్యం చాలా ముఖ్యమని చెప్పారు.

ప్రసంగిస్తున్న ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

ప్రధాని సభావేదిక నిర్మాణానికి భూమిపూజ

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఎన్డీయే తరఫున 23న నిర్వహించనున్న సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఆ వేదిక నిర్మాణ పనులకు అన్నాడీఎంకే తరఫున గురువారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మరకదం కుమారవేల్, పార్టీ జిల్లా కార్యదర్శులు, నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న అన్నాడీఎంకే నిర్వాహకులు

జల్లికట్టు స్టేడియం ప్రారంభం

[illegible], న్యూస్‌టుడే: తిరుచ్చి జిల్లా తిరువెరుంబూర్ సూరియూర్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన క్రీడామైదానాన్ని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం వాడివాసల్ నుంచి ఆలయ ఎద్దులను విడిచి జల్లికట్టు పోటీలను ప్రారంభించారు. అంతకుముందు జమాల్ ముహ్మద్ కళాశాల అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రాంభించారు. తిరుచ్చి అభివృద్ధి కోసం మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ కృషి చేస్తున్నారని చెప్పారు.

స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

19న విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా 19వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యాసార్పాడి ప్రాంతంలో సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్తు శాఖ ప్రకటనలో తెలిపింది.

మాంసం దుకాణాల మూత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తిరువళ్లువర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చెన్నై నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న కబేళాలను మూసేశారు. పెరంబూర్, విల్లివాక్కం, సైదాపేట, కళ్ళికుప్పం ప్రాంతంలో నగరపాలక సంస్థ తరపున కబేళాలను నిర్వహిస్తున్నారు. వాటిని ప్రభుత్వం ప్రకటించిన మేరకు శుక్రవారం మూసేశారు.

వండలూర్ జూలో సందర్శకుల సందడి

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా వండలూర్‌లోని జువాలజికల్ పార్క్ సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ వన్యప్రాణులతో పాటు రకరకాల పక్షులు ఉన్నాయి. పొంగల్ వరుస సెలవులతో రెండు రోజులుగా పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. సందర్శకులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, పాలిచ్చే తల్లుల కోసం ప్రత్యేక గదులు, బ్యాటరీ వాహనాలను నిర్వాహకులు సిద్ధం చేశారు.

సందర్శకులతో కిటకిటలాడుతున్న వండలూర్ జూ

18 వరకు ఆదివారం తరహాలో మెట్రో సేవలు

వడపళని, న్యూస్‌టుడే: పొంగల్ దృష్ట్యా మెట్రో రైళ్లు ఆదివారం నడిచిన విధంగా 18వ తేదీ వరకు నడుస్తాయని సీఎంఆర్‌ఎల్ ప్రకటనలో పేర్కొంది. తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 10 నిమిషాలకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏడు నిమిషాల సర్వీసు నడుస్తుంది. రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు 15 నిమిషాలకు ఒక సర్వీసు ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ మెట్రో నుంచి వింకోనగర్ వరకు రద్దీ పెరుగుతున్నందున ఇటీవల బ్లూలైన్‌లో సేవలు పెంచింది. ఉదయం 8 గంటల నుంచి 11, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రతి ఆరు నిమిషాలకొక రైలు, ఆలందూరు నుంచి వాషర్‌మెన్‌పేట వరకు మూడు నిమిషాలకు, వాషర్‌మెన్‌పేట నుంచి వింకోనగర్ డిపో వరకు ఆరు నిమిషాలకొక సర్వీసులుంటాయి.

నేటి నుంచి నాగర్‌కోయిల్ అమృతభారత్ వీక్లీ రైళ్ల సేవలు

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ కారణంగా 06178 తిరునెల్వేలి-తాంబరం ప్రత్యేక రైలుకు 18వ తేదీన అదనంగా రెండు స్లీపర్ బోగీలు జత చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటలో పేర్కొంది.

● **నాగర్‌కోయిల్-న్యూజల్‌పాయ్‌గురి, తిరుచ్చిరాపల్లి-న్యూజల్‌పాయ్‌గురి అమృత భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ సేవలు శనివారం ప్రారంభం కానున్నాయి.**

● ప్రారంభ సందర్భంగా 02603 పశ్చిమబెంగాల్ 'రంగపాణి'లో 17న 13.45కు బయలుదేరి మూడో రోజు 19.15కు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. ఆ తర్వాత 20604/20603 నెంబర్లతో నాగర్‌కోయిల్-న్యూజల్‌పాయ్‌గురి-నాగర్‌కోయిల్ మధ్య నడుస్తుంది. 02603 నెంబరుతో నడిచే రైలు గూడూరు, రేణిగుంట, కాట్పాడి, కోయంబత్తూర్, విరుదునగర్, తిరునెల్వేలి మీదుగా నాగర్‌కోయిల్ చేరుతుంది. ● 02609 న్యూజల్‌పాయ్‌గురిలో 17న 13.45కు బయలుదేరి మూడో రోజు తిరుచ్చిరాపల్లికి 14.15కి చేరుతుంది. ఆ తర్వాత 20610/20609 నెంబరుతో తిరుచ్చిరాపల్లి-న్యూజల్‌పాయ్‌గురి-తిరుచ్చిరాపల్లి మధ్య వీక్లీ రైలు నడుస్తుంది.

నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక రైలు

● 06160 నాగర్‌కోయిల్‌లో 18వ తేదీ 17.00కు బయలుదేరి మరుసటి రోజు 04.10కి తాంబరానికి వస్తుంది. శనివారం రిజర్వేషన్లు ప్రారంభమవుతాయి.

నేడు 'ఎమ్మార్టీఎస్' మార్గంలో ప్రత్యేక సర్వీసులు

వడపళని, న్యూస్‌టుడే: 'కానుం పొంగల్' రద్దీ కారణంగా మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఎమ్మార్టీఎస్) మార్గంలో శనివారం ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు దక్షిణ రైల్వే శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ● **చెన్నై బీచ్‌లో** 14.50, 16.55, 18.50కి బయలుదేరే రైళ్లు వేళచ్చేరికి 15.35, 17.40, 19.35 గంటలకు చేరుకుంటాయి. ● **వేళచ్చేరిలో** 13.30, 16.00, 17.45కి బయలుదేరే రైళ్లు చెన్నై బీచ్‌కు 14.18, 16.48, 18.33 గంటలకు చేరుతాయి.

కానుం పొంగల్ సందర్భంగా ట్రాఫిక్‌లో ఆంక్షలు

ప్యారిస్, న్యూస్‌టుడే: కానుం పొంగల్ సందర్భంగా గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసుల తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం చెన్నైలో అన్ని రహదారుల్లో ముఖ్యంగా కామరాజర్ సాలైలో ఉదయం 11 గంటల నుంచి ట్రాఫిక్‌లో మార్పులు చేశారు. ● ప్యారిస్ నుంచి గాంధీ విగ్రహం వచ్చే వాహనాలు, వార్ మెమోరియల్ వద్ద ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు వైపుగా మళ్లించి, వాలాజా పాయింట్-అన్నాసాలై-అన్నా విగ్రహం- స్పెన్సర్ జంక్షన్ వైపుగా వెళ్లి తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చు(మహానగర బస్సులకు మినహాయింపు). ● వార్ మెమోరియల్ నుంచి బీచ్‌కి వచ్చే వాహనాలు ప్రయాణికులను దించి ఆడమ్స్ జంక్షన్ నుంచి స్వామి వివేకానంద సాలైలో వాహనాలను పార్క్ చేసుకోవాలి. ● శ్రామికుల విగ్రహం నుంచి కన్నగి విగ్రహం వరకు రోడ్డుని వన్‌వేగా చేశారు. బస్సులు శ్రామికుల విగ్రహం జంక్షన్ నుంచి వాలాజా సాలైలో కుడివైపు వెళ్లేందుకు అనుమతి లేదు. ● శ్రామికుల విగ్రహానికి వెళ్లే బస్సులు కణ్ణగి విగ్రహం జంక్షన్ నుంచి భారతిసాలై- బెల్స్‌రోడ్డు- వాలాజాసాలై- అన్నావిగ్రహం వైపుగా గమ్యాన్ని చేరుకోవచ్చు. ● గాంధీ విగ్రహం నుంచి కణ్ణగి విగ్రహం వద్దకు బస్సులకు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదు. అందుకు బదులు అవి ఆర్కే సాలై-మ్యూజిక్ అకాడమీ జంక్షన్- అన్నాసాలై వైపుగా వెళ్లొచ్చు. ● విక్టోరియా హాస్టల్ రోడ్డు, బెల్స్ రోడ్డుని భారతి సాలై జంక్షన్ నుంచి వన్‌వేగా మార్చారు. వాలాజాసాలై జంక్షన్‌లో వాహనాలకు అనుమతి లేదు. ● భారతిసాలైలో కణ్ణగి విగ్రహానికి వెళ్లే వాహనాలు, రత్న కేఫ్‌జంక్షన్ నుంచి ట్రిప్లికేన్ హైవే- వాలాజా సాలై- అన్నాసాలై వైపు వెళ్లొచ్చు. ● పెరియార్ విగ్రహం జంక్షన్‌లో బీచ్‌కు వెళ్లే వాహనాలకు మాత్రమే స్వామి శివానంద సాలైలో అనుమతిస్తారు. మిగిలినవి అన్నా విగ్రహం- అన్నాసాలై వైపు వెళ్లొచ్చు.

మెరీనా బీచ్‌లో శుక్రవారం ప్రజల సందడి

కోలాహలంగా కామాక్షమ్మ రథోత్సవం

కాంచీపురం, న్యూస్‌టుడే: తై పొంగల్‌ను పురస్కరించుకొని గురువారం రాత్రి కాంచీపురం కామాక్షి అమ్మవారికి స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి సన్నిధి, ఉత్సవమూర్తుల సన్నిధిని రకరకాల పుష్పాలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ఆరాధనలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి 7 గంటలకు లక్ష్మీ సరస్వతి సమేత కామాక్షి అమ్మవారి ఉత్సవరులను అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వర్ణరథంలో కొలువు దీర్చి నాలుగు రాజా వీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు నక్షత్ర వృక్ష వినాయకుడి ఆలయంలో గోపూజ

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప ఉక్కం పెరుంబాక్కం గ్రామంలో ప్రసిద్ధి చెందిన 27 నక్షత్ర వృక్ష వినాయకుడి ఆలయంలో సంక్రాంతి చివరి పండుగ కనుమ రోజున 108 గోపూజ, మహాలక్ష్మి పూజలను నిర్వహించడం ఆనవాయితీ. ఆ క్రమంలో శనివారం ఉదయం 7 గంటలకు నక్షత్ర వృక్ష వినాయకుడు, వల్లి దేవసేన మురుగన్, 27 నక్షత్రాలకు సంబంధించిన ఆది దేవతలకు శనీశ్వరుడు, రాహు కేతు, గురు భగవాన్, నాగమ్మకు ప్రత్యేక అభిషేకం ఆరాధనలు నిర్వహిస్తారు. 11 గంటలకు మహాలక్ష్మి, 108 గోవులకు పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు 27 నక్షత్రాలకు సంబంధించిన వృక్ష హోమం, రాగి, వేప చెట్టుకు కళ్యాణోత్సవాన్ని నిర్వహించి రాత్రి నక్షత్ర వృక్ష వినాయకుడిని పరివార దేవతలను వాహనాల్లో గ్రామంలో ఊరేగిస్తారు.

ముగిసిన ఉత్తరాయణ పుణ్యకాల ఉత్సవాలు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో ఉత్తరాయణ పుణ్యకాల ఉత్సవాలు ముగిశాయి. పదిరోజులుగా నిత్యం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. వివిధ రకాల అలంకరణతో ఉత్సవమూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. గురువారం చంద్రశేఖర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో ఉన్న తామరకుంట వద్దకు తీసుకొచ్చారు. పండితులు స్వామివారికి తీర్థవారి నిర్వహించడంతో ఉత్తరాయణ పుణ్యకాల ఉత్సవాలు ముగిశాయి. శుక్రవారం ఉదయం మూలమూర్తులను సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయం నుంచి బయటకు తెచ్చి సూర్యనమస్కారం చేశారు.

తీర్థవారి నిర్వహిస్తున్న పండితుడు ● అలంకరణలో ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి

వైభవంగా ప్రదోషోత్సవం

పళ్లిపట్టు: పళ్లిపట్టులోని పార్వతీ సమేత సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రదోషోత్సవం వైభవంగా జరిగింది. మూలవర్లకు సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉన్న నంది విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. ఉత్సవమూర్తులైన పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు.

అలంకరణలో పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి

ఎన్నికల ప్రచార కమిటీని ప్రకటించిన విజయ్

చెన్నై, న్యూస్‌టుడే: రాబోయే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో టీవీకే ఎన్నికల ప్రచార కమిటీని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. ఆయన విడుదల చేసిన ప్రకటన మేరకు... రాష్ట్రంలోని 234 శాసనసభ నియోజకవర్గాల్లో సమాలోచనలు, ప్రచార సభలు వంటివాటిని నిర్వహించడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో బుస్సి ఆనంద్, ఆదవ్ అర్జున, సెంగోట్టైయన్ ఉన్నారు.

అధికారంలో భాగస్వామ్యం కోరడం తప్పేమీ కాదు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభుత్వంలో, అధికారంలో భాగస్వామ్యం కోరడం తప్పేమీ కాదని కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలెట్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. తమ పార్టీకి మొదటి నుంచి ప్రత్యేక ఓటు బ్యాంకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో భాజపా కూటమి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా గెలవలేదని ధీమా వ్యక్తం చేశారు. ఇతర పార్టీ నిర్వాహకులు కోరుతున్నట్లే కాంగ్రెస్ నిర్వాహకులు కూడా ప్రభుత్వంలో, అధికారంలో భాగస్వామ్యం కావాలని కోరుతున్నారన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో సామాన్యులు ఇబ్బంది పడ్డారన్నారు.

EENADU Classifieds
REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067.

'జన నాయగన్' సినిమా వ్యవహారం

నిర్మాణ సంస్థ అప్పీల్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: 'జన నాయగన్' సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ వ్యవహారమై నిర్మాణ సంస్థ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ చివరి సినిమాగా ప్రకటించిన 'జన నాయగన్' ఈనెల 9న విడుదల కానున్నట్లు ప్రకటించారు. సెన్సార్ సర్టిఫికెట్ లభించకపోవడంతో థియేటర్లలోకి రాలేదు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా సన్నివేశాలు ఉండడంతో సినిమాను మళ్లీ సమీక్షకు పంపిన తర్వాతే సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు తెలిపింది. ఇందుకు వ్యతిరేకరంగా సినిమా నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ తరపున మద్రాసు హైకోర్టులో కేసు దాఖలైంది. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఆషా సినిమాకు వెంటనే సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ సెన్సార్ బోర్డు తరపున దాఖలు చేసిన అప్పీల్ మద్రాసు హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ సింగిల్ జడ్జి ఉత్తర్వులకు స్టే విధించారు. అప్పీల్‌పై జవాబివ్వాలని సినిమా నిర్మాణ సంస్థకు ఉత్తర్వులిచ్చి విచారణ వాయిదా ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా కేవీఎన్ ప్రొడక్షన్స్ తరపున సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలైంది. ఈ అప్పీల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం ముందు గురువారం విచారణకు వచ్చింది. 'జన నాయగన్' వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అప్పీల్‌ను విచారించేందుకు నిరాకరించారు. 20న ఈ కేసును మద్రాసు హైకోర్టు విచారిస్తుందని తెలిపిన న్యాయమూర్తులు హైకోర్టు ధర్మాసనంలో వాదనలు వినిపించాలని సూచించారు.

తిరువళ్లువర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ● మంత్రులు, మేయర్ తదితరులు

ధార్మిక మార్గంలో పయనిద్దాం

తిరువళ్లువర్‌కు ఘన నివాళి

చెన్నై, న్యూస్‌టుడే: తిరువళ్లువర్ డే సందర్భంగా గిండిలోని లోక్‌భవన్‌లో ఉన్న తిరువళ్లువర్ విగ్రహానికి గవర్నర్ ఆర్.ఎన్.రవి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టంలోని తిరువళ్లువర్ విగ్రహానికి ముఖ్యమంత్రి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. వెంట మంత్రులు, ఉన్నతాధికారులు తదితరులు ఉన్నారు. కామరాజర్‌రోడ్డు మెరినా బీచ్‌లోని తిరువళ్లువర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి మంత్రులు, అధికారులు పుష్పాంజలి ఘటించారు. ● తిరువళ్లువర్ డే సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన 4 హామీలు ఇస్తున్నట్లు ప్రకటనలో ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. సామాజిక అన్యాయం, మతవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడే తెగువ, సామాన్యుల జీవన ప్రమాణాలు పెంపొందించే మానవత్వ పథకాలు, యువ సమాజం మేధోశక్తిని పెంపొందించే ప్రయత్నాలు, వ్యాపార వృద్ధి, మహిళల అభ్యున్నతిని ప్రోత్సహించే క్రియాశీలక చర్యలు రాష్ట్రంలో కొనసాగుతాయంటూ హామీ ఇచ్చారు. 'ఎక్స్' పేజీలో.. 2వేల ఏళ్లు గడిచినా ఇంకా నిలిచిన సాహిత్యంగా ఉన్న తిరుక్కురళ్‌ను రచించిన తిరువళ్లువర్‌ను కీర్తిద్దామని పిలుపునిచ్చారు. ఆయన చూపించిన ధార్మిక మార్గంలో జీవితం రూపొందాలని ఆకాంక్షించారు.

అరక్కోణం: అరక్కోణం గాంధీరోడ్డు టౌన్ హాల్ వద్ద తిరువళ్లువర్ విగ్రహానికి తమిళ్ పడిపాలర్ సంఘం అధ్యక్షుడు సి.మోహన్ పుష్పాంజలి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. సంఘం నిర్వాహకులు సుందర్‌రాజ్, ఆర్.వెంకటరమణన్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ పన్నీరుసెల్వం, నరశింహన్, పూకడ సాయి తదితరులు పాల్గొన్నారు. **టీనగర్:** సేలం జిల్లా వాళప్పాడిలో 'వాళప్పాడి సాహిత్య పరిషత్' ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. 50 మందికి పైగా సాహితీవేత్తలు, స్థానికులు పాల్గొని తిరువళ్లువర్ రథంతో పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

తిరువళ్లువర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సి.మోహన్

(c) eenadu

'జైలర్-2'లో విజయ్ సేతుపతి



చెన్నై, న్యూస్‌టుడే: నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ ప్రధాన పాత్రధారిగా నటించిన 'జైలర్' 2023లో విడుదలై భారీ విజయం సొంతం చేసుకుంది. ప్రస్తుతం రెండో భాగం తెరకెక్కుతోంది. రజనీకాంత్‌కు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించగా జూన్ 12న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మొదటి భాగంలో నటించిన నటీనటులతో పాటు మరికొందరు రెండో భాగంలో నటిస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా చిత్రబృందంలో చేరినట్లు, గోవా చిత్రీకరణ సమయంలో ఆయన సెట్‌లో పాల్గొన్నట్లు సమాచారం. విజయ్ సేతుపతి మాట్లాడుతూ... తనకు రజనీకాంత్ అంటే చాలా ఇష్టమన్నారు. ఆయన కోసమే 'జైలర్-2'లో కామియో రోల్‌లో నటించానని తెలిపారు. పలు విషయాలను ఆయన్నుంచి నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందు రజనీకాంత్‌తో కలిసి 'పేట్ట' (2019)లో విజయ్ సేతుపతి నటించడం గమనార్హం.

వడివేలుతో నవ్వులు పూయించిన ప్రభుదేవా

వీడియోలోని ఓ సన్నివేశ దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రముఖ నృత్యదర్శకుడు, నటుడు ప్రభుదేవా, హాస్యనటుడు వడివేలు జంట వెండితెరపై గతంలో నవ్వులు పూయించింది. 2001లో విడుదలైన 'మనదై తిరుడివిట్టాయ్' తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించలేదు. ఈ నేపథ్యంలో వడివేలుతో కలిసి వ్యాయామం చేసే సరదా వీడియోను ప్రభుదేవా తన 'ఎక్స్' పేజీలో పంచుకున్నారు. దానికి... తై మాసం పుడితే మార్గం పుడుతుంది. వ్యాయామం చేస్తే శరీరం మెరుగవుతుందంటూ వ్యాఖ్యను జోడించారు.

'లెనిన్ పాండియన్' నుంచి కొత్త పోస్టర్

చెన్నై, న్యూస్‌టుడే: సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, సుబ్బు పంజు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్ పాండియన్'. బాలచంద్రన్ దర్శకుడు. దివంగత నటుడు శివాజీ గణేశన్ మనవడు దర్శన్ గణేశన్, శ్రద్ధ రావు, ఆడుకళం నరేన్, యుగేంద్రన్, బోస్ వెంకట్, జార్జ్ మరియన్, అర్చన తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సంగీత దర్శకుడు గంగై అమరన్, సీనియర్ నటి రోజా కీలక పాత్రల్లో కనిపిస్తారు. సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కొత్త పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది.

'కరుప్పు పల్సర్' 30న విడుదల

పొంగల్ సంబరాల్లో చిత్రబృందం

చెన్నై, న్యూస్‌టుడే: వర్ధమాన దర్శకుడు మురళీ క్రిష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కరుప్పు పల్సర్'. యోషో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డాక్టర్ సత్య మురళీకృష్ణ నిర్మించారు. 'గెత్తు' దినేశ్ కథానాయకుడిగా రెండు విభిన్నమైన పాత్రల్లో నటించారు. ఆయనకు జంటగా రేష్మ వెంకట్, మదునిక, ప్రతినాయకుడిగా ప్రిన్స్ అజయ్, ఇతర ముఖ్యపాత్రల్లో మన్సూర్ అలీఖాన్, శరవణన్ సుబ్బయ్య, శక్తివరసన్ కన్నుసామి తదితరులు నటించారు. ఇన్స సంగీతం అందించారు. మదురై నేపథ్యంలో జీవించే యువకుడు, చెన్నైలో పల్సర్‌తో జీవించే యువకుడు కలిసినప్పుడు వారి జీవితంలో చోటుచేసుకునే సమస్యలు, వాటికి అతీతంగా ఎలా జీవిస్తున్నారన్నదే కథ సారాంశం. పొంగల్ సందర్భంగా సంబరాలు చేసుకున్న చిత్ర బృందం 30న సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

'మరగత నాణయం-2' ప్రోమో

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ చిత్రసీమలో ఫ్యాంటసీ, హాస్యం కలబోతతో రూపొంది విజయవంతమైన చిత్రాల్లో 'మరగత నాణయం' ఒకటి. ఎ.ఆర్.కె.శరవణన్ దర్శకత్వంలోని ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది. ప్రస్తుతం రెండో భాగం రూపొందుతోంది. ఎ.ఆర్.కె.శరవణన్ దర్శకత్వంలోనే రూపొందుతోంది. ఆది, నిక్కీ గల్రాని, ప్రియా భవానీశంకర్, మునీశ్‌కాంత్, సత్యరాజ్ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. పేషన్ స్టూడియోస్, ఆల్విన్ ఫిలిమ్ ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి దిబు నినన్ స్వరాలు అందిస్తున్నారు. పొంగల్ పర్వదినం సందర్భంగా చిత్రబృందం ప్రోమో విడుదల చేసింది.

నిర్వాసితులను చూసి చలించిన ముఖ్యమంత్రి

నిర్వాసితులతో మాట్లాడుతున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మూడో బీచ్ రోడ్డులోని పట్టణ సంక్షేమ కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన పొంగల్ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని కానుకలు అందించారు. ఈ సందర్భంగా నేతాజీ రోడ్డు నారాయణప్ప వీధిలో రోడ్డువెంబడి నివసిస్తున్న ప్రజలను చూసి చలించిపోయారు. వారికి తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు నివాసాల్లో కొత్త ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు.

స్టాలిన్ పాట వైరల్.. ఆనాటి మధుర గీతాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పాడటం ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'వైబ్ విత్ ఎంకేఎస్' పేరిట ముఖ్యమంత్రి ఇప్పటికే క్రీడాకారులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ప్రస్తుతం సంగీత కళాకారులు, గాయకులతో ఇష్టాగోష్ఠి నిర్వహించిన సందర్భంగా 'దైవత్తిన్ దైవం' సినిమాలోని 'నీ ఇల్లాద ఉలగత్తిలే నిమ్మది యిల్లై..' అనే నాటి మధురగీతాన్ని ఆలపించారు. ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది.

సినిమాను రాజకీయ కోణంలో చూడకూడదు

విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైరముత్తు

చెన్నై, న్యూస్‌టుడే: సినిమాను రాజకీయ కోణంలో చూడకూడదని ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు తెలిపారు. తిరువళ్లువర్ దే సందర్భంగా బెసెంట్ నగర్‌లోని టైగర్ వరదాచారి రోడ్డు పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి వెట్రి తమిళర్ పేరవై తరఫున వైరముత్తు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సాహిత్య అకాడమీ స్వయంప్రతిపత్తిని హరించినట్లు దేశంలోని అన్ని భాషలవారు భావిస్తున్నారని, ఇది రచయితలు, వారి రచనా స్వేచ్ఛకు వ్యతిరేకమని పేర్కొన్నారు. సినిమాను కళలు, సాంస్కృతిక విలువలతో చూడాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా సామాజిక కళగా సినిమాను చూడాలంటూ ఇటీవలి కాలంలో సెన్సార్ బోర్డు వ్యవహారశైలిపై స్పందించారు.

▸ తిరు.వి.క నగర్ జోన్ కార్యాలయంలో పొంగల్ వండుతున్న కార్పొరేషన్ సిబ్బంది ▸ కోడంబాక్కం జోన్ కార్యాలయంలో... ▸ స్టాలిన్‌తో ఉదయనిధి తదితరులు ▸ శుభాకాంక్షలు చెబుతున్న మంత్రులు

ఘనంగా పొంగల్ సంబరాలు

టీనగర్: సేలం జిల్లా సెవ్వాయ్‌పేటలో మహిళకు బహుమతి అందిస్తున్న మంత్రి రాజేంద్రన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళుల ప్రీతిపాత్రమైన పొంగల్ సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మెరినా తీరంలోని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధులను సందర్శించి నివాళులర్పించారు. అక్కడి ప్రజల నుంచి శుభాకాంక్షలు స్వీకరించారు. క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, దుర్గా స్టాలిన్ దంపతులను వారి కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుటుంబ సమేతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, మంత్రులు కూడా ముఖ్యమంత్రిని కలిసి పొంగల్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రిప్లికేన్: పొళ్లాచ్చి వద్ద శిబిరంలో ఏనుగులకు స్నానం చేయించి, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం వాటికి చెరకు, అరటి పండ్లు, కొల్లు, రాగి, బియ్యం అన్నం వంటి ఆహారాలు అందించారు.

గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

టీనగర్: శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ధర్మ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కనుమ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని పలు రకాల విదేశీ, స్వదేశీ పుష్పాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలక మండలి సభ్యులు దేసు లక్ష్మీనారాయణ, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

▸ టీనగర్: తిరునెల్వేలిలో సూర్యభగవానుడికి హారతి ఇస్తున్న రాష్ట్ర భాజపా అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ▸ ట్రిప్లికేన్: పొళ్లాచ్చి ఏనుగుల శిబిరంలో.. ▸ వేలూరు: లత్తేరి పనమడంగిలో ఎద్దుల పోటీలు

ఇళయరాజా ఫొటో, పాటల ఉపయోగానికి నిషేధంపై సన్ టీవీ పిటిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: సంగీత దర్శకుడు ఇళయరాజా పేరు, ఫొటో, పాటలను ఉపయోగించేందుకు నిషేధం విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఫొటో, పేరు, పాటలు, స్వరం తన అనుమతి లేకుండా ఉపయోగించేందుకు నిషేధం విధించాలని, ఇదివరకే పోస్టుచేసిన వాటిని వెంటనే తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఇళయరాజా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు సామాజిక మాధ్యమాల్లో ఇళయరాజా పేరు తదితర వాటిని ఆయన అనుమతి లేకుండా ఉపయోగించేందుకు నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. ఇళయరాజా పాటలను ప్రసారం చేసేందుకు నిషేధం విధించకూడదని, కోర్టు నిషేధ ఉత్తర్వుల కారణంగా ఇళయరాజా ఫొటో, పేరుని ఉపయోగించడం కుదరలేదన్నారు. ఉత్తర్వులను మార్చాలని తెలిపారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

'జన నాయగన్' విడుదలపై స్టాలిన్‌కు దిగులెందుకో?

గిండి, న్యూస్‌టుడే: 'జన నాయగన్' సినిమా విడుదలపై విజయ్‌కు లేని దిగులు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఎందుకని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సినిమా నిర్మాణ సంస్థ పెద్దఎత్తున ఆదాయార్జన కోసం 5 వేల థియేటర్లలో విడుదల చేయాలనుకున్నారని వివరించారు. పిల్లలతో కలిసి చూడలేని విధంగా ఉన్న సీన్లను తొలగించకపోవడం వల్లే ఆ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ సమస్యలు వచ్చాయని వివరించారు. ఓ పక్క విజయ్ రాజకీయ ప్రభావం, మరో వైపు నిర్మాణ సంస్థ చర్యలతో సినిమా ఆగిందనే విషయం విజయ్‌కి కూడా తెలుసని, అందుకే ఆయన మౌనంగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రం ప్రజా సమస్యలు వదిలేసి ఈ సినిమా ఆగేందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమన్నట్లు రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతలను, కమల్‌హాసన్‌ను రంగంలోకి దించి రెచ్చగొడుతున్నారని వివరించారు.

పోలీసు వాహనం ఢీకొని మాజీ కౌన్సిలర్ మృతి

అరెస్టయిన కృపాకరన్

సేలం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ ప్రాణాలు కోల్పోయాడు. సేలం చుక్కంబట్టి కొంబేరికాడ్ ప్రాంతానికి చెందిన బాలయ్య(66) విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, డీఎంకే మాజీ కౌన్సిలర్. ఆయన ద్విచక్ర వాహనంపై మిన్నంపల్లి వంతెనపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. నడిచి వెళ్తున్న పెరుమాళ్(65) అనే వ్యక్తిని కూడా ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బాలయ్య మృతి చెందాడు. పెరుమాళ్ అత్యవసర చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం తర్వాత బాలయ్య మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబీకులు అంగీకరించక పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో మృతదేహాన్ని తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కున్నూర్ ప్రాంతానికి చెందిన పోలీసు అధికారి కృపాకరన్‌ను శుక్రవారం అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ దంపతులు...

ప్యారిస్: శబరిమలకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన అయ్యప్పమాల ధరించిన దంపతులు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్రాంతానికి చెందిన పాలకుర్తి సత్యనారాయణ(62), ఆయన భార్య రమ(60) సహా 50 మంది అయ్యప్ప భక్తులు బస్సులో శబరిమలకు వెళ్లి గురువారం రాత్రి కన్నియాకుమరికి వచ్చారు. బస్సును కన్నియాకుమరి బైపాస్‌లో ఆపి అందరు అక్కడి పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వెళ్లారు. సత్యనారాయణ, రమ రోడ్డు దాటుతుండగా అటువైపు వచ్చిన టెంపో లారీ ఢీకొంది. గాయపడిన వారిని స్థానికులు కన్నియాకుమరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు.

ఏనుగు దాడిలో రైతు...



సిత్తురాజ్

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా కడంబూర్ కొండప్రాంతం కాడగనల్లి గ్రామానికి చెందిన రైతు సిత్తురాజ్ పంటకు కాపలాగా ఉంటున్నాడు. గురువారం ఉదయం రైతు^న తోటలో ఉన్న సమయంలో లోపలికి ప్రవేశించిన అడవి ఏనుగు పంటను ధ్వంసం చేయసాగింది. ఏనుగును తరిమేందుకు యత్నించగా అది సిత్తురాజ్‌పై తొండంతో దాడి చేసి కాళ్లతో తొక్కి చంపింది. సమాచారం మేరకు కడంబూర్ అటవీ శాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ఉపాధ్యాయుడు...

ప్యారిస్: ఆందోళన సమయంలో ఆత్మహత్యకు యత్నించిన పార్ట్‌టైం ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేతనం పెంచాలని, ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని కోరుతూ చెన్నైలో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. డీపీఐ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేసి తిరువాన్మియూర్, మైలాపూర్, వానగరం మొదలైన ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలకు తరలించారు. వానగరంలోని కల్యాణ మండపంలో ఉన్న పెరంబలూర్‌కు చెందిన కణ్ణన్(50) అనే ఉపాధ్యాయుడు విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే సహచర ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కీళ్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అన్నాడీఎంకే ఏరియా కార్యదర్శి ఆత్మహత్య

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ఏరియా కార్యదర్శి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చెన్నై సైదాపేట పశ్చిమ ఏరియా అన్నాడీఎంకే కార్యదర్శి సైదై సుకుమార్(47) కార్యాలయం సైదాపేట పిళ్లైయార్ కోవిల్ వీధిలో ఉంది. శనివారం ఎంజీఆర్ జయంతి కోసం ఏర్పాట్లు చేస్తున్నాడు. తర్వాత రాత్రి పార్టీ కార్యాలయంలో నిద్రపోవడానికి వెళ్తున్నట్లు స్నేహితులతో చెప్పగా వారు ఇళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున కార్యకర్తలు, స్నేహితులు కార్యాలయానికి రాగా సైదై సుకుమార్ ఉరేసుకుని కనిపించాడు. సమాచారం మేరకు కుమరన్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేకేనగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అప్పుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తి...

ఆనందన్ (పాతచిత్రం)

ట్రిప్లికేన్: పోలీసులను కత్తితో దాడిచేసి పారిపోయిన వ్యక్తి భయంతో ఆత్మహత్మ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మైలాడుతురై జిల్లా కుత్తాలం వద్ద మేలమంగైనల్లూర్‌లో తాగిన మత్తులో ఓ వ్యక్తి ప్రజలపై కొడవలితో గొడవ చేస్తున్నాడు. సమాచారం మేరకు పెరంబూర్ ఫస్ట్‌క్లాస్ కానిస్టేబుల్ సామినాథన్, ఇంటెలిజెన్స్ డివిజన్ కానిస్టేబుల్ సతీశ్ అక్కడికి చేరుకుని అతని నుంచి కొడవలిని లాక్కోగా మరొక కత్తితో దాడి చేసి పారిపోయాడు. గాయాలకు గురైన పోలీసులు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. దాడి చేసిన వ్యక్తి మేలమంగైనల్లూర్‌కు చెందిన ఆనందన్(40)గా తెలిసింది. పారిపోయిన ఆనందన్ పోలీసులకు భయపడి గురువారం తెల్లవారుజామున ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను లారీ డ్రైవర్ అని, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

పోలీసులపై దాడికి పాల్పడిన రౌడీపై తుపాకీ కాల్పులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా కురింజిపాడి సమీపంలో రమేష్ అనే వ్యక్తి కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద సుభాస్కర్ అనే రౌడీ గురువారం ఉచితంగా కూరగాయలను అడిగాడు. వ్యాపారి నిరాకరించడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సుభాస్కర్ తన వద్ద ఉన్న కత్తితో వ్యాపారిపై దాడి చేసి పారిపోయాడు. గాయపడిన రమేష్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కురింజిపాడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అతను కత్తితో పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు ఆత్మరక్షణ కోసం తుపాకీతో కాల్పులు జరుపగా రెండు కాళ్లకు తూటాలు తగిలి కిందపడటంతో అరెస్టుచేసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

యువకుడి దారుణ హత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలబడి ఉన్న ఓ యువకుడిని దుండగులు నరికి చంపిన ఘటన తిరుచ్చిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుచ్చి తెన్నూర్ పట్టాభిరామన్ వీధికి చెందిన చంద్రు(26) పెయింటర్. గురువారం రాత్రి ఇంటి వద్ద నిల్చుని ఉండగా అక్కడికొచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తులతో నరికి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చంద్రు సోదరిని పుత్తూర్ వన్నారపేట్టైకు చెందిన ఓ యువకుడు ప్రేమించాడని, అతను ఆకస్మికంగా చనిపోయినట్లు దర్యాప్తులో తెలిసింది. దీంతో ఏర్పడిన పాతకక్షల కారణంగా ఆ యువకుడి తమ్ముడు, స్నేహితుడు కలిసి చంద్రును హత్య చేసినట్లు గుర్తించారు.

సీఎంసీ వైద్యుల అపార్టుమెంట్‌లో ఈడీ తనిఖీ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సమీపంలోని తోటపాళయం పిళ్లయార్ కోవిల్ వీధిలో సీఎంసీ వైద్యులు నివసించే అపార్టుమెంట్ ఉంది. శుక్రవారం చెన్నై నుంచి రెండు కార్లలో ఏడుగురు ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు వచ్చి అపార్టుమెంట్ లోపలికి వెళ్లి తలుపులు మూసివేశారు. ఎవరినీ వెళ్లనివ్వలేదు. కేరళ రాష్ట్రానికి చెందిన ఒక వైద్యుడు సీఎంసీ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆయన గదిలో వారం రోజులుగా నలుగురు వ్యక్తులు బస చేసినట్లు అనుమానంతో అతనికి ఆ నలుగురు వ్యక్తులతో ఉన్న సంబంధంపై ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ అధికారులు తనిఖీలు చేపట్టి విచారణ చేస్తున్నారు.

ప్రేమికురాలిని మోసం చేసిన ప్రేమికుడి అరెస్టు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా బన్రుట్టి సమీప సిరు తొండమా దేవి ప్రాంతానికి చెందిన దురైరాజ్ చెన్నైలో ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న దిండివనంకు చెందిన 27 ఏళ్ల యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి సుమారు 5 ఏళ్లుగా ప్రేమించుకున్నారు. దురైరాజ్ ఆ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడు. అనంతరం దురైరాజ్ ఆ యువతితో మాట్లాడటం మానేసి వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. తాను మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దురైరాజ్‌ను అరెస్టు చేశారు.

అగ్నిప్రమాదంలో వాహనాలు దగ్ధం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సమీపంలోని కాగితపట్టరై ప్రాంతంలో రవి అనే వ్యక్తి ప్రైవేటు వాహన పార్కింగ్ నిర్వహిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి పార్కింగ్ నుంచి అకస్మికంగా మంటలు వచ్చాయి. 10 ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఓ షాపులోని ఫర్నిచర్ కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు వేలూరు, కాట్పాడి నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటల్ని అదుపు చేశాయి. ఆస్తి నష్టం దాదాపు రూ.45 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా చిరుత మృతి

విల్లివాక్కం: ధర్మపురి జిల్లా హొగినేకల్ అటవీ ప్రాంతంలోని పెన్నాగరం బీట్ సుత్తుకోడు ప్రాంతంలో చిరుత మృతి చెందినట్లు మేకల కాపరులు అటవీ శాఖకు సమాచారం అందించారు. హొగినేకల్ సర్కిల్ శాఖాధికారి శివకుమార్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. చిరుత వయసు పదేళ్లు ఉంటుందని, ఎలాంటి గాయాలు లేకపోవడంతో మృతికి కారణాలు తెలియలేదన్నారు. శవపంచనామా నివేదిక అందిన తర్వాత వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన మహిళా ఇన్‌స్పెక్టర్ అరెస్టు

ప్యారిస్: ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరించిన మహిళా పోలీసు ఇన్‌స్పెక్టరు అరెస్టయ్యారు. విరుదునగర్ జిల్లా రాజపాళెయంకి చెందిన మాలతి వద్ద 33 సవర్ల నగలు తీసుకుని మోసానికి పాల్పడిన రామ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ శ్రీవిల్లిపుత్తూర్ కోర్టులో కొనసాగుతోంది. కేసు వెనక్కి తీసుకోవాలని రామకుమార్ మాలతిని బెదిరించాడు. మాలతికి ఫోన్‌చేసిన సత్యశీల తాను కూడా రామ్‌కుమార్ కారణంగా మోసపోయినట్లు, తనతో పాటు వచ్చి ఫిర్యాదు చేస్తే కోల్పోయిన నగలను దక్కించుకోవచ్చని తెలిపారు. ఇది నమ్మి శ్రీవిల్లిపుత్తూర్ వచ్చిన మాలతిని రామ్‌కుమార్, సత్యశీల ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరించారు. ఈ విషయమై మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రామ్‌కుమార్, సత్యశీలను అరెస్టు చేశారు. దర్యాప్తులో సత్యశీల రామనాథపురం జిల్లా మండపం శరణార్థుల శిబిరంలో ఇన్‌స్పెక్టరుగా పని చేస్తుండగా శ్రీవిల్లిపుత్తూర్‌లో జరిగిన హత్య కేసులో రామ్‌కుమార్‌తో పాటు అరెస్టైనట్లు, ఆ తర్వాత సస్పెండైన నేపథ్యంలో ప్రస్తుతం మళ్లీ అరెస్టైంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

కనులపండువగా.. శ్రీవారి కనుమ మహోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చిన వెంకన్న కనుమ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణలు.. పండితుల వేద మంత్రాల నడుమ వేడుకగా నిర్వహించారు. దొరసానిపాడు కనుమ మండపంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని తిలకించిన భక్తకోటి పునీతమైంది. తొలుత కనుమ మండపాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం సమయంలో ద్వారకాతిరుమల ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడ్ని రాజాధిరాజ వాహనంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి ఊరేగింపుగా దొరసానిపాడులోని కనుమ మండపం వద్దకు పయనమయ్యారు. స్వామి, అమ్మవార్లను కనుమ మండపం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు, పండితులు స్వామికి హారతులు పట్టారు.

తరలి వచ్చిన భక్తులు


రాజాధిరాజ వాహనంపై ఊరేగింపుగా వస్తున్న స్వామి, అమ్మవార్లు

నేత్రపర్వం.. ప్రభల ఉత్సవం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలో ప్రభల ఉత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. కరుగోరుమిల్లి, పెనుమంచిలి, కందరవల్లి, వల్లూరు, కోడేరు, భీమలాపురం తదితర గ్రామాల్లో శైవక్షేత్రాల్లో ఉత్సవ మూర్తులను రంగు రంగుల ప్రభలపై కొలువు దీర్చి వరిచేలు, పంట కాలువలు దాటుకుంటూ తీర్థాల పుంత వద్దకు చేర్చి పూజలు చేశారు.

కోట్లు దాటిన కోడీ

- సంప్రదాయం మాటున భారీగా పందేలు
- చేతులు మారిన వందల కోట్లు
- మూడు రోజులు పండగ సందడి

ఈనాడు-ఏలూరు, నూజివీడు: ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు.. సంప్రదాయ క్రీడలు.. కోడి పందేలు.. జూదాలు.. బరులకు సినిమా సెట్టింగ్‌లు, ఎల్ఈడీ తెరలు.. ప్రత్యక్ష ప్రసారాలతో ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సంక్రాంతి పండగ మూడు రోజులూ సందడిగా సాగింది. సంప్రదాయం మాటున ఉమ్మడి జిల్లాలో కోడిపందేలు, కోతాట, గుండాట తదితర జూదాలు రికార్డు స్థాయిలో జరిగాయి. పెద్ద, చిన్నవి కలిపి 300కు పైగా బరులు వాటిల్లో వెయ్యి దాకా జూద శిబిరాలు నడిచాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఫ్లడ్ లైట్ల కాంతిలో కొనసాగాయి. మూడు రోజుల్లో కలిపి రూ.వందల కోట్లు చేతులు మారాయి. డబ్బులు పోగొట్టుకున్న వాళ్లు కొందరు బరుల వద్దే రభస సృష్టించారు. మీర్జాపురం, గౌరవరం బరుల్లో వివాదం ఏర్పడి కొంతసేపు పందేలు నిలిచాయి. ఇలాంటి స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగియటంతో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం, నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

పండగకు సొంతూళ్లకు వచ్చి పూర్వవిద్యార్థులు సమ్మేళనాలు పెట్టుకున్నారు. చింతలపూడి మండలం శివాపురంలో ఎన్నారై వాసు 80 మంది విద్యార్థులకు రూ.3 వేల చొప్పున ఉపకార వేతనమిచ్చారు. దాసరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గులు, సైకిల్ పోటీలు నిర్వహించి విద్యార్థులు, మహిళలు 500 మందికి చేయూతనిచ్చారు. అప్పనవీడు, ఆకివీడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు పండగ సందర్భంగా వచ్చి సమావేశాలు పెట్టుకున్నారు.

యలమంచిలి : ఉన్నత పాఠశాలలో 1994- 95 బ్యాచ్

బహుమతులుగా కార్లు, బైకులు

మీర్జాపురం, దుగ్గిరాల, చేబ్రోలు, నారాయణపురం, తాడేపల్లిగూడెం, తణుకు, పెదఅమిరం, ఐ.భీమవరం, వెంప, నరసాపురం తదితర ప్రాంతాల్లో రూ.కోటికిపైగా పందెం ఒకటి, రూ.25 లక్షల పందేలు మూడు జరిగాయి. మిగిలినవి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల దాకా మరికొన్ని రూ.50 వేల నుంచి రూ.5 లక్షల మధ్య జరిగాయి. గెలిచినోళ్లు పందెం సొమ్ముతోపాటు ప్రోత్సాహక బహుమతులుగా కార్లు, ఖరీదైన మోటారు బైకులు దక్కించుకున్నారు. మండవల్లి మండలానికి చెందిన ఓ రొయ్యల వ్యాపారి తన కోళ్లు ఐదు పందేలు నెగ్గటంతో నగదుతోపాటు రూ.11 లక్షల కారు ఒకటి దక్కింది.



విచ్చలవిడిగా...

పగలు, రాత్రి తేడా లేకుండా బరుల్లో కోడి పందేలు, జూద క్రీడలు విచ్చల విడిగా సాగితే ఏ ఒక్క చోట అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. ఓ ప్రజా ప్రతినిధి బరి నిర్వహించగా మరో ప్రజా ప్రతినిధి అన్నీ తానే చూసుకుంటానని నిర్వాహకుల నుంచి రూ.3 కోట్లు జేబులో వేసుకున్నారు. మరో ముఖ్యనేత అండతో అతి పెద్ద బరి ఏర్పాటైంది. నేతలకు బరులు కాసులు కురిపించాయి. బరులను తొలగించాలంటూ శుక్రవారం సాయంత్రం నుంచి పోలీసుల హడావుడి ప్రారంభించారు.

సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుప్రయాణమవుతున్నారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. ఏలూరు ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించారు. -ఈనాడు, ఏలూరు.

కారుకు 200.. బైక్‌కు 100

పందేలను చూసేందుకు వెళ్తున్న వారికి పార్కింగ్ ఫీజు వసూలు చేయడం పెదవేగి మండలం దుగ్గిరాలలో కనిపించింది. కారుకు రూ.200, ద్విచక్రవాహనానికి రూ.100 చొప్పున బౌన్సర్లతో వసూలు చేశారు. - ఈనాడు, ఏలూరు.



భీమవరం దుర్గాపురం బరిలో ఒకేసారి ఐదింటిని ఓడించిన కోడిపుంజుకు 15 కాసుల బంగారు గొలుసుతో సన్మానం.

కోళ్లకు వైద్యం.. కలిదిండి, న్యూస్‌టుడే : వరంగల్ నుంచి వచ్చిన 20 మంది మిత్ర బృందం జిల్లాల్లో పర్యటించింది. ఆ బృందంలోని పశు వైద్యులు పాపాని వంశీ, బొల్లా రాజేశ్‌రెడ్డి చనిపోతున్న కోళ్లను చూసి చలించిపోయారు. దీంతో గాయపడిన పుంజులకు చికిత్స అందించారు. రెండ్రోజులపాటు ఐదు శిబిరాల్లో 30 పుంజులకు చికిత్స చేయగా, వాటిలో 18కి పైగా ప్రాణాలు నిలుపుకొన్నాయి.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కోడి పందేల నేపథ్యంలో పలు ప్రధాన మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. భీమవరం-నరసాపురం, భీమవరం-లోసరి మార్గాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. తాడేరు, డేగాపురం, గొల్లవానితిప్ప వద్ద ప్రధాన రహదారులను ఆనుకొని బరులు ఏర్పాటు చేయడంతో అక్కడికి భారీ సంఖ్యలో వచ్చిన వాహనాలతో సమస్య జటిలంగా మారింది.

భీమవరం గునుపూడి పరిధిలో ఇలా..

ప్రముఖుల సందడి

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన బరి వద్ద సినీ తారలు సందడి చేశారు. శుక్రవారం ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ప్రముఖ సినీ నిర్మాత దగ్గుపాటి సురేష్, నటీనటులు హేమ, రోషన్, డింపుల్ హయాతితో పాటు టీవీ యాంకర్లు, హాస్యనటులు హాజరయ్యారు. పోటీలో గెలుపొందిన వారికి రోషన్, డింపుల్‌తో నగదు బహుమతి ఇప్పించారు.

పెదఅమిరం బరిలో నగదు అందిస్తున్న సినీనటి డింపుల్ హయాతి, నటుడు రోషన్

పెద అమిరం : ఉప సభాపతి రఘురామ, ఎమ్మెల్యే కామినేని, దగ్గుపాటి సురేష్

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, **మాల కుల** అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **80086 21414 & 91549 18858** ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

పోటెత్తిన భక్తులు.. చేతులెత్తేసిన అధికారులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఉత్సవాల్లో ఆలయ అధికారుల ఆలసత్వం బయట పడింది. కొత్త కమిటీ తమ దర్పం ప్రదర్శించేందుకు లెక్కకు మించి భక్తులను తీసుకురావడంతో సామాన్య భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చామని.. కనీసం వృద్ధులకు, పిల్లలకు మంచినీరిచ్చే నాథుడే కరవయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుమ రోజు కావడంతో భక్తులు మొక్కులు చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు కిలో మీటర్ దూరం వరకు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులను అదుపు చేయలేకపోవడంతో పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. క్యూలో ఉన్నవారు గంటల తరబడి ఎండలో నిల్చొని అవస్థలు పడ్డారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మరో పక్క ఓ ధర్మకర్తను పోలీసులు పంపించకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. భక్తులను పంపించే క్రమంలో మహిళతో అనుచితంగా ప్రవర్తించిన పోలీసులకు ప్రధానార్చకుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

అంతరాలయంలో దర్శించుకుంటున్న భక్తులను లాగుతున్న సీఐ, మహిళ పోలీసులు

దోమల దండయాత్ర..
జనానికి జ్వరం మాత్ర

అటక దిగని ఫాగింగ్ యంత్రాలు

ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: పల్లెల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వాటి నివారణ కోసం గ్రామ పంచాయతీల్లో జనం సొమ్ముతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. ఆరోగ్య శాఖ యంత్రాలకు అవసరమైన రసాయనాల సరఫరాను నిలిపివేయడంతో అవి మూలకు చేరాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పక యంత్రాన్ని వినియోగించాల్సి ఉండగా కొన్నిచోట్ల అసలు బయటకే తీయలేదు. మరికొన్ని చోట్ల మూలన పెట్టేశారు. అవి మెట్ల కింద, అటకలపై, స్టోర్ రూములలో ఉంటున్నాయి.

ఆగిరిపల్లిలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

ఆగిరిపల్లి: మండలంలో 25 పంచాయతీల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ప్రజలకు రోగాలు ప్రబలుతున్నా సిబ్బంది ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేవు.

ముసునూరు: మండలంలోని 16 పంచాయతీల్లో 6 చోట్ల మాత్రమే ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని కూడా ఎక్కడా వినియోగించిన పాపాన పోలేదు.

చాట్రాయి: మండలంలోని 18 పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు మూలకు చేర్చారు. మండలంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది.

కైకలూరు: ఆటపాక, కైకలూరు పంచాయతీలను మినహాయించి మిగిలిన 24 చోట్ల కనీసం ఫాగింగ్ యంత్రాలను బయటకు తీసి వినియోగించింది లేదు.

మండవల్లి: భైరవపట్నం, లోకుమూడిలో యంత్రాలు అటకెక్కాయి. ఏడాది నుంచి కనీసం ఒకసారి కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. మిగతా 29 గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

ఒక రోజు ఫాగింగ్ యంత్రం వినియోగిస్తే డీజిల్, వాహనం ఇతర ఖర్చులు కలిపి రూ.5 వేల నుంచి 7 వేల వరకు ఖర్చవుతోంది. ఇంత మొత్తం వెచ్చించ లేక చిన్న పంచాయతీలు చేతులెత్తేస్తున్నాయి. మేజర్ పంచాయతీల్లో ఒకసారి ఫాగింగ్ చేయాలంటే రూ.50 వేల వరకు ఖర్చవుతోందని సిబ్బంది చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకమైన ఫాగింగ్ యంత్రాలు అంటగట్టినట్లు ఆరోపణలున్నాయి. రూ.45 వేల చొప్పున కొనుగోలు చేసిన పొగ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

'గ్రామాల్లో దోమల నియంత్రణకు చర్యలు చేపడతాం. ఫాగింగ్ యంత్రాలపై అన్ని మండలాల డిప్యూటీ ఎంపీడీవోలతో మాట్లాడి వెంటనే గ్రామాల్లో చేసేలా చర్యలు తీసుకుంటాం.' అని డీపీవో కె.అనురాధ తెలిపారు.

జిల్లా సమాచారం ఇలా.. ● మండలాలు 27 ● గ్రామాలు 624 ● ఫాగింగ్ యంత్రాలు 468

తూస్తున్నారా.. చూస్తున్నారా?

లబ్ధిదారుల సంతృప్తి స్థాయి పరిశీలనకు సర్వే

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'మీకు రేషన్ సరకులు సక్రమంగా అందుతున్నాయా? చౌక దుకాణంలో పంపిణీ చేసే వస్తువుల్లో నాణ్యత ఉంటోందా? అంటూ కార్డుదారుల సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. ఆర్టీజీఎస్ విధానంలో మొబైల్ యాప్ ద్వారా కార్డుదారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. డీఎస్వో, ఏఎస్వోలు, పౌరసరఫరాల సంస్థ ఉప తహసీల్దార్లు(సీఎస్ డీటీ) రేషన్ దుకాణాల కెళ్లి సరకుల పంపిణీ తీరు, సరకుల కంటే ఎక్కువ లేదా తక్కువ పరిమాణంలో ఉన్నదీ.. లేనిదీ పరిశీలిస్తున్నారు. కార్డుదారులకు నాణ్యమైన సరకుల అందజేత, రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంపునకు ప్రభుత్వం ఈ విధానం అమలు చేస్తోంది.

ఆరు మండలాల్లో..

ఐవీఆర్ఎస్ సర్వేలో టి.నరసాపురం, చాట్రాయి, లింగపాలెం, చింతలపూడి, మండవల్లి, జంగారెడ్డిగూడెం మండలాలు వెనుకబడి ఉన్నాయి. సర్వే నిర్వహణపై జేసీ అభిషేక్ గౌడ పౌరసరఫరాల అధికారులతో తరచూ సమీక్షిస్తున్నారు. నెలాఖరుకు అన్ని మండలాల్లో నూరు శాతం సర్వే పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్వో విలియమ్స్ తెలిపారు.



దీపం పథకం పైనా..

దీపం పథకం ద్వారా వంట గ్యాస్ సిలిండర్లు పొందే లబ్ధిదారులతోనూ సర్వే చేస్తున్నారు. జిల్లాలో కింద 4.2 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఆర్టీజీఎస్ విధానంలో సర్వే చేస్తున్నారు.



మరికొన్ని ప్రత్యేక రైళ్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సంక్రాంతి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 18న విశాఖపట్నం-చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) రైళ్లు నడుస్తాయని చెప్పారు. మార్గం మధ్యలోని దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, రాయనపూడి, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ-పంట.. ఏఐ అండ!

వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే యాప్ తీసుకురాగా.. తాజాగా రబీలో కృత్రిమ మేధ(ఏఐ)ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అత్యధికంగా వరి.. జిల్లాలో పంట కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలు అందాలన్నా.. ఈ-పంట నమోదు తప్పనిసరి. ప్రస్తుతం సర్వే నంబర్లను ల్యాండ్ పార్సిల్స్‌గా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు.

లింక్ ఓపెన్ చేయగానే.. రైతుల ఫోన్లకు సంక్షిప్త సందేశం(మెసేజ్) పంట వివరాల నమోదు ముందు, చేసిన రోజు, ఆ తర్వాత ధ్రువీకరణతో సమాచారం వస్తోంది. రైతులకిచ్చిన సంక్షిప్త సందేశంలో లింక్ ఓపెన్ చేసి ఈ- పంటలో నమోదైన వివరాలు సరిచూసుకోవచ్చు. భూ విస్తీర్ణం తగ్గిన, పంట రకం తప్పుగా నమోదైతే.. అందులోనే నేరుగా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించింది.

జిల్లా రబీ సమాచారమిలా(ఎకరాల్లో).. సాధారణ సాగు విస్తీర్ణం: 2,38,605, ఇప్పటి వరకు సాగైంది: 1,01,600, ఈ-పంట నమోదుకు గుర్తింపు: 3,54,476, ఇప్పటి వరకు నమోదైంది:15,069, ఈ-పంటలో నమోదు:24,620, రైతులు:8,844

అధికారి పోస్టు ఖాళీ.. ఇన్‌ఛార్జికి లేదు

ఏ శాఖలోనూ పూర్తిస్థాయిలో అందని సేవలు

☆ కొయ్యలగూడెంలోని హోమియో వైద్యశాలలో వైద్యాధికారి పోస్టు కొన్ని నెలలుగా భర్తీకి నోచుకోలేదు. వైద్యం కోసం దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ మధ్య జరిగిన బదిలీల్లో ఇక్కడి వైద్యాధికారి బదిలీపై వెళ్లారు. కాంపౌండరు పోస్టు కూడా ఖాళీగానే ఉంది. అటెండరు పోస్టు మాత్రమే భర్తీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు డాక్టరు గారు లేరు అని చెప్పడానికే ఆమె పరిమితమయ్యారు. జిల్లాలో మూడు చోట్ల ఆయుర్వేద, రెండు చోట్ల హోమియో వైద్యాధికారి పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

☆ ఉంగుటూరు మండల తహసీల్దారు స్థానం 15 నెలలుగా ఖాళీగానే ఉంది. డిప్యూటీ తహసీల్దారుకు బాధ్యతలు అప్పగించి చోద్యం చూస్తున్నారు. రీసర్వే బాధ్యతలు కూడా చూడాల్సి రావడంతో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు తగిన న్యాయం జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాట్రాయి మండలంలోనూ కీలకమైన తహసీల్దారు, ఎంపీడీవో స్థానాలు కొన్ని నెలలుగా ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటీ ఎంపీడీవోగా మారిన ఈవోపీఆర్డీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, ఉంగుటూరు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో కీలకమైన పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్లుగా భర్తీకి నోచుకోకపోవడంతో ప్రజలకు సేవలు అందడంలేదు. ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఒక్కో అధికారికి నాలుగైదు మండలాల బాధ్యతలను అప్పగించడంతో ఎవరికీ అందుబాటులో లేక, సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

✦ కొయ్యలగూడెంలో ఉద్యానశాఖ అధికారికి జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల బాధ్యతలను అప్పగించారు. జలవనరుల శాఖలోనూ ఇదే పరిస్థితి. ఉపాధిహామీ పథకం ఏపీవోకు చింతలపూడికు ఇన్‌ఛార్జిగా నియమించారు. కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు వైద్య సెలవుపై వెళ్లడంతో కొన్ని నెలలుగా ఆ స్థానం ఖాళీగా ఉండి చదువరులు కేవలం పత్రికల పఠనానికే పరిమితమయ్యారు.

✸ ఆయుష్ వైద్యశాలల్లో ఖాళీలు ఉన్న చోట్ల ప్రభుత్వ నియామకాలు జరిపే వరకు ఇన్‌ఛార్జులను నియమిస్తామని ఆయుష్ ఆర్డీడీ కుమార్‌బాబు చెప్పారు. గ్రంథాలయాల్లో ఖాళీ స్థానాల్లో ఇన్‌ఛార్జులను నియమించడానికి కూడా అవకాశం లేకుండా ఉందని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆయన తన స్వగ్రామమైన ఆగర్తిపాలెంలో శుక్రవారం పొలం పనుల్లో పాల్గొన్నారు. వ్యవసాయ కార్మికులతో కలిసి పొలంలో దిగి ఎరువు చల్లారు. అనంతరం ఎరువుల వినియోగంపై రైతులు, కార్మికులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని, అపార ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

పొలంలో ఎరువు చల్లుతున్న మంత్రి నిమ్మల

దారిద్ర్యం నుంచి దశ తిరిగి

తాడేపల్లిగూడెం పట్టణానికి రావాలంటే గుంతలమయమైన రహదారులతో గత అయిదేళ్లలో వాహన చోదకులు, ప్రయాణికులు నరకయాతన పడ్డారు. తరచూ ప్రమాదాల బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఈ దుస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతూ 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పట్టుబట్టి మరీ ఈ రహదారిని బాదంపూడి పెట్రోల్ బంకు నుంచి ప్రత్తిపాడు వై జంక్షన్ వరకు 12 కిలోమీటర్ల దారిని రూ11.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. దీంతో వాహన చోదకులు, స్థానికులు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- ఈనాడు, తాడేపల్లిగూడెం, న్యూస్‌టుడే, ప్రతిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

తాడేపల్లిగూడెం దారిద్ర్యమే ఇది!!

రహదారి నిర్మాణం తర్వాత ఇలా..

బయనేరు.. బాధ తీర్చేదెవరు

వేదాంతపురం సమీపంలో బయనేరు వాగుపై సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన ఆ తర్వాత కొద్ది కాలానికే వరదలకు కొట్టుకుపోయింది. శ్లాబ్ ఎక్కడికక్కడ విరిగి మూడు ముక్కలైంది. వేదాంతపురం పరిసర గ్రామాల నుంచి బుట్టాయగూడెం మండలం కంగాలవారిగూడెం, తదితర గిరిజన గ్రామాలకు వెళ్లడానికి వీలుగా ఈ వంతెన నిర్మించారే కానీ ఆశించిన ప్రయోజనం నెరవేర లేదు. రైతులు, వ్యవసాయ కూలీలకు అగచాట్లు తప్పడం లేదు. చేసేది లేక విరిగిన వంతెన స్థానంలో సిమెంట్ స్తంభాలను అడ్డుగా వేసి వాటిపై ప్రమాదకరంగా దాటుతున్నారు. వాహనాలు తిరిగే అవకాశం లేక కొందరు లక్ష్మడుగూడెం వెళ్లే మార్గంలో కాలువను దాటుతూ గమ్యం చేరుతున్నారు. తమ ఇక్కట్లు తీరేలా వంతెనను పునర్ నిర్మించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

గంగానమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

అమ్మవారి సన్నిధిలో జస్టిస్ మన్మథరావు తదితరులు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తూర్పువీధి గంగానమ్మ జాతర నేత్రపర్వంగా కొనసాగుతోంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు గురువారం మేడలోని అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్‌ఆర్‌ఐ కమిటీ సభ్యుడు జిల్లెళ్లమూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆహ్వానం మేరకు ఏలూరు వచ్చి, గ్రామ దేవతను దర్శించుకున్నట్లు చెప్పారు. అంతకుముందు జస్టిస్ కె.మన్మథరావుకు జాతర కొలుపుల కమిటీ సభ్యులు మేళతాళాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాశ్, సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, శ్రీనివాస్, పి.దుర్గాప్రసాద్, సత్యనారాయణ, శ్రీకృష్ణ సాయితేజ, సాయిబాబా, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేంకన్నను దర్శించుకున్న జస్టిస్ సుధీర్‌కుమార్

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రిసప్త బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం జస్టిస్ సుధీర్ కుమార్‌ను పాలకమండలి ఛైర్‌పర్సన్ పాలడుగు రమాదేవి దంపతులు సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

అవే తప్పులు.. తప్పని తిప్పలు

☛ పెదపాలపర్రుకు చెందిన వెంకటరమణకు నాలుగెకరాలు ఉండగా గత రీసర్వేలో కేవలం 3.69 ఎకరాలతో పాస్ పుస్తకం అందించారు. తప్పును సరిదిద్దడానికి రోవర్ తీసుకొచ్చి ఎకరానికి రూ. 8,500 తీసుకుని సర్వే చేశారు. నూతన పాస్ పుస్తకంలోనైనా విస్తీర్ణం మారుతుందని రైతు భావించగా పాత వివరాలతోనే ముద్రించారు.

☛ కైకలూరు మండలం శీతనపల్లిలో 15 మందికి అందించిన పాస్ పుస్తకాల్లో జాయింట్ ఎల్‌పీఎం, 22 ఎ సమస్యలు అలానే ఉన్నాయంటూ గ్రామసభలో అధికారులను రైతులు ప్రశ్నించారు. రాజముద్ర తప్ప పాత పాస్ పుస్తకానికి, దీనికి మార్పులేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ముదినేపల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి రైతులకు నూతన పాస్ పుస్తకాలు పంపిణీ చేసింది. గత వైకాపా ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఇచ్చిన పాస్ పుస్తకాల స్థానంలో రాజముద్రతో ఉన్న వాటిని అందజేసింది. వీటిలో అచ్చుతప్పులతోపాటు ఫొటోలు, నంబర్లు మారిపోయాయి. విస్తీర్ణంలో సైతం లోపాలు కనిపిస్తుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

రీసర్వే లోపాలతో.. వైకాపా హయాంలో జరిగిన భూముల రీసర్వేలో పొరపాట్లు సరిదిద్దకుండానే పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశారు. జాయింట్ ఎల్‌పీఎంలతో చాలా చోట్ల చిక్కులు ఏర్పడ్డాయి. మ్యుటేషన్ ప్రక్రియ సక్రమంగా చేపట్టకపోవడంతో మృతుల పేరిట కూడా జారీ అయ్యాయి. దీంతో వారి వారసులు ఆందోళన చెందుతున్నారు.

శీతనపల్లి గ్రామసభలో తప్పులతో వచ్చిన పాస్ పుస్తకాలపై ప్రశ్నిస్తున్న రైతులు

జిల్లా సమాచారం..	
మండలాలు : 27	గ్రామాలు : 168
ఇచ్చిన పాస్ పుస్తకాలు : 82,500	

హడావుడిగా అందించి.. గ్రామ సభలకు సంబంధిత రైతులు హాజరుకాకపోయినా.. ఆ కుటుంబంలో ఎవరైనా తీసుకోవాలంటూ రెవెన్యూ అధికారులు హడావుడిగా ఓటీపీ తీసుకుని పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అందులో తప్పులు ఉండటంతో వాటిని తీసుకోవడానికి వారు నిరాకరించారు. కానీ అధికారులు బలవంతంగా అందించి చేతులు దులుపుకొన్నారు. దీనిపై ఆర్డీవో అచ్యుత అంబరీశ్ మాట్లాడుతూ రైతులు అర్జీ పెట్టుకుంటే అధికారులు తప్పులను సవరిస్తారని తెలిపారు.

రేవ్ పార్టీకి తెరతీసి.. పోలీసులకు చిక్కి..

ముఖ్యనేత ఒత్తిడితో జూదంగా కేసు నమోదు

ఈనాడు-ఏలూరు, గణపవరం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో సంక్రాంతి పండగ వేళ రేవ్ పార్టీకి తెరతీసిన నిర్వాహకులు పోలీసులకు చిక్కారు. అయితే పోలీసులు వాస్తవాలు దాచి వక్రీకరించి చెప్పారు. ఈ వ్యవహారంలో ముఖ్యనేత ఒకరు జోక్యం చేసుకుని తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడంతో పోలీసులు తల్లొగ్గి జూదం ఆడుతూ పట్టుబడ్డారని పొంతన లేని కేసు నమోదు చేసి కథ సుఖాంతం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం..

★ భోగి పండగ నాడు అర్ధరాత్రి వేళ (తెల్లవారితే గురువారం) గణపవరం- పెంటపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఓ ఆక్వా చెరువు వద్దకు సుమారు 30 మంది పురుషులు, నలుగురు యువతులు ఖరీదైన కార్లలో చేరుకున్నారు. వైకాపా హయాంలో గుడివాడలో నిర్వహించిన క్యాసినో తరహాలో యువతులతో అశ్లీల నృత్యాలు చేయించుకునేందుకు అర్ధరాత్రి వేళ అక్కడ ఏర్పాట్లు చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకున్నారు. నిర్వహణ పనుల్లో ఉన్నవారిని వారి కార్లను అదుపులోకి తీసుకున్నారు. నృత్యాలు చేయటానికి తీసుకొచ్చిన యువతులను మాత్రం తప్పించేశారు. వారిని ఎందుకు తప్పించాల్సి వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. అయితే అక్కడ ఉన్న వారంతా ప్రముఖుల కుటుంబాలకు చెందిన వ్యక్తులు, ఆపై వారంతా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఉన్నతోద్యోగులు.. వ్యాపారులుగా తెలిసింది. దీంతో ఒకరిద్దరు నేతలు జోక్యం చేసుకుని పొంతన లేని కేసు పెట్టి కథ సుఖాంతం చేశారని సమాచారం.

ఖరీదైన కార్లు.. [illegible] అర్ధరాత్రి వేళ కొల్లేరు రొయ్యలు, చేపల చెరువుల వద్దకు జూదం ఆడటానికి వచ్చారంటే నమ్మశక్యం కావటం లేదు. [illegible] నిజంగా జూదం ఆడుతున్నట్లు పట్టుకుంటే ఆ సమయంలో [illegible] పట్టుకున్న వారి నుంచి రూ.25 వేలు మాత్రమేనని పేర్కొన్నారు. 16 కార్లలో వచ్చిన 28 మంది నుంచి లభ్యమైంది ఆ కొద్దిమొత్తమేనా.

ఎస్సై ఏమన్నారంటే.. గణపవరం ఎస్సై మణికుమార్ మాట్లాడుతూ ఘటనా స్థలంలో యువతులు ఎవరూ లేరని, మద్యం తాగుతూ పలువురు యువకులు జూదం ఆడుతుండగా పట్టుకుని వారి నుంచి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అది నంద్యాల సాయికి చెందిన ఆక్వా చెరువు అని చెప్పారు.

ఉత్కంఠగా ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు డీఏఆర్ కళాశాల ఆవరణలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆక్రో బాస్కెట్ బాల్ అసోసియేషన్ 49వ కళా ప్రపూర్ణ ఆర్‌వీఏబీ మెమోరియల్ బాస్కెట్ బాల్ పోటీలు ఉత్కంఠగా ముగిశాయి. సంక్రాంతి నేపథ్యంలో 11 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు జరిగాయి. మహిళా విభాగంలో కేఎల్ యూనివర్సిటీ, ఏలూరు జట్ల మధ్య జరిగిన పోరులో 61-48 పాయింట్లతో కేఎల్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్‌ఆర్‌ఎం చెన్నై, సదరన్ కమాండ్ పుణె జట్ల మధ్య జరిగిన పోటీల్లో 49-35 పాయింట్లతో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చెన్నై జట్టు విజేతగా నిలిచింది. విశిష్ట అతిథిగా హాజరైన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ డైరెక్టర్ మండవ ఆశ ప్రియ చేతుల మీదుగా మహిళా జట్టు బహుమతి అందుకుంది. పురుషుల జట్టుకు మాజీ ఎమ్మెల్యే ఎంపీ ప్రతాప అప్పారావు బహుమతులు అందించారు. నూజివీడు సీడ్స్ డైరెక్టర్ మండవ వెంకట్రామ్ చౌదరి, కిమ్స్ ఆస్పత్రి ఫౌండర్ బొల్లినేని కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కృష్ణా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జీఎస్‌సీ బోస్, టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎండీ అంజాద్ అలీలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 2027లో జరిగే 50వ గోల్డెన్ జూబ్లీ టోర్నమెంట్ కర్టెన్‌రైజర్‌ను నిర్వహించారు.

విజేతలకు బహుమతి అందించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప అప్పారావు

వైమానిక దళంలో ఉద్యోగావకాశాలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'అగ్నిపథ్' ప్రవేశపెట్టాక భారత వైమానిక దళంలో క్లరికల్/టెక్నికల్ కేడర్లతో నాలుగేళ్ల కాల వ్యవధికి సేవలందించేలా కొత్త ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్రబాబు తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 2006 జనవరి 1 నుంచి 2009 జులై 1 మధ్య జన్మించి, 152 సెంటీమీటర్ల ఎత్తున్న వారు అర్హులన్నారు. ఫిబ్రవరి 1లోపు https:///iafrecruitment.edcil.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జనగణనకు ఏర్పాట్లు

కార్యనిర్వాహక అధికారుల నియామకం

కుక్కునూరు, న్యూస్‌టుడే: జనగణన 2027 కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దీనికి సంబంధించి జిల్లా, మండల, పురపాలికల్లో అధికారులను నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా జనాభా లెక్కల ముఖ్య అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. అదనపు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా జేసీని నియమించారు. జనగణన అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి ఉంటారు. అదనపు సెన్సెస్ అధికారులుగా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి, విద్యాశాఖాధికారి, పంచాయతీ, అటవీశాఖ అధికారులు, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీలు, జిల్లా ఉప సెన్సెస్ అధికారిగా స్టాటిస్టికల్ అధికారి వ్యవహరిస్తారు. జనగణనకు అధికారుల నియామకం పూర్తిచేయాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

సబ్ జిల్లాస్థాయి బృందం.. సబ్ కలెక్టర్/ఆర్డీవో సబ్ డివిజినల్ సెన్సెస్ అధికారిగా ఉంటారు. ఛార్జ్ సెన్సస్ అధికారులుగా తహసీల్దార్లు, అదనపు అధికారులుగా ఎంపీడీవోలు, సహాయ అధికారులుగా క్లర్క్, ఇన్‌ఛార్జి అధికారులుగా ఉప తహసీల్దార్/అంతకంటే తక్కువ స్థాయి అధికారులుంటారు.

పట్టణ స్థాయిలో.. మున్సిపాలిటీ/నగర పంచాయతీ అధికారులు ఛార్జ్ సెన్సెస్ అధికారులుగా వ్యవహరిస్తారు. అదనపు అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారి/టీపీఎస్/డీఈఈ/ఏఈఈ/మున్సిపాల్టీలోని రెవెన్యూ అధికారి ఉంటారు. మున్సిపల్/కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఇతర అధికారులు పట్టణ సెన్సస్ అధికారులుగా పనిచేస్తారు.

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ఇలా..	
మొత్తం జనాభా	: 20,02,658
మహిళలు	: 10,02,398
పురుషులు	: 10,00,268
గ్రామీణ జనాభా	: 16,18,288 (80.70%)
10 ఏళ్లలో జనాభా పెరుగుదల రేటు	: 3.5%
రెవెన్యూ గ్రామాలు	: 655
జనవాసాలు	: 624
నిర్జీవ గ్రామాలు	: 31

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: అయిదు నుంచి పదో తరగతి వరకు పూర్తి చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీలలో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షలకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిఐఆర్‌యుఎంఎఎల్‌ఎఈడీయు.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వ్యర్థాలతో విజ్ఞానం

పంట ఉత్పత్తులతో ఆకర్షణీయ వస్తువుల తయారీ

కేవీకేలో ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు

ఉండి, న్యూస్‌టుడే: కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు.. పనికిరాని ప్రతి వస్తువుతో కళారూపాలు సృష్టించవచ్చని నిరూపిస్తున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. వివిధ పంట ఉత్పత్తుల నుంచి వెలువడే వ్యర్థాలతో ఆకర్షణీయ వస్తువులు తయారు చేస్తున్నారు ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు.

వరి కంకులతో ఫ్లవర్ వాజ్

దేశంలో పండే వివిధ పంటలపై కేవీకేలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ప్రధానంగా వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తి కోసం కేళీలు ఎప్పటికప్పుడు తొలగిస్తుంటారు. కాండం తొలిచే పురుగు ఆశించి తెల్లకంకులు (తాలు, తప్పలొచ్చిన) వాటిని తీసేస్తారు. వాటిని ఒకే సైజులో కత్తిరించి వివిధ రంగులద్ది ఆరబెట్టారు. కూజాను పోలిన పెద్ద సీసాలో రాగి, జొన్న, మొక్కజొన్న తదితర (చిరుధాన్యాల) విత్తనాలు వరుసల్లో పోశారు. ఆపై రంగులద్దిన పనికిరాని కంకులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఫ్లవర్‌వాజ్ కేవీకేకి వచ్చేవారందర్నీ ఆకట్టుకుంటోంది.

చిరుధాన్యాల ప్రాధాన్యం తెలియజేస్తూ..

ఆనప కాయలు వివిధ రూపాల్లో ఉత్పత్తి అవుతుంటాయి. వాటి లోపలుండే విత్తనాలు సేకరించి ప్రదర్శనా క్షేత్రాల్లో ఉంచారు. ఎండిన సొరకాయ డిప్ప సగ భాగంలోపల కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, ఊదలు తదితర చిరుధాన్యాల కంకులు ఉంచారు. ఆహార పదార్థాల్లో చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించేందుకు ఈ ఫ్లవర్‌వాజ్ బాగా ఉపయోగపడుతోంది. ఈ పంటలు పండని రోజుల్లో రైతులు, విద్యార్థులు, సందర్శకులొచ్చినా విత్తన రకాలు, పంటల తీరును ప్రత్యక్షంగా తెలియజేసేందుకు వ్యర్థాలతో విజ్ఞానాన్ని అందించే విధంగా వివిధ వస్తువులు తయారు చేస్తున్నామని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు.

ఆహారం కల్తీ అయ్యిందని ఘర్షణ

హోటల్‌లో ధ్వంసమైన సామగ్రి

రైల్వేస్టేషన్ కూడలి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఆహారం కల్తీ అయ్యిందని ఆరోపిస్తూ గురువారం తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ కూడలిలోని ఇబ్బూస్ కింగ్స్ హోటల్ నిర్వాహకుడు ఇబ్రహీంతో పెంటపాడు గ్రామానికి చెందిన సాయిరెడ్డి, వెంకటరెడ్డి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి సుమారు 100 మందితో వచ్చి తమ హోటల్‌పై దాడి చేశారని నిర్వాహకుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిరెడ్డి, వెంకటరెడ్డిలతో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తాడేపల్లిగూడెం పట్టణ ఎస్సై నాగరాజు తెలిపారు.

పండగ వేళ.. కబళించిన మృత్యువు

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

సంక్రాంతి పండగ వేళ జరిగిన ప్రమాదాలు పలు కుటుంబాల్లో పెను విషాదం నింపాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనల్లో ముగ్గురు యువకులు, ఓ చిన్నారి సహా అయిదుగురు దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వీధికుక్క అడ్డురావడంతో..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వీధి కుక్క అడ్డురావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం ఆర్యపేటకు చెందిన జి.వెంకట తాతాజీ (20), తన స్నేహితుడు బి.కమలాకర్ కలిసి ఈ నెల 12న రాత్రి ద్విచక్ర వాహనంపై మేడపాడులో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మేడపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఒక్కసారిగా శునకం అడ్డు రావడంతో దానిని తప్పించబోయి కింద పడిపోయారు. ఈ ఘటనలో తాతాజీకి తలకు తీవ్ర గాయమైంది. కమలాకర్ కాళ్లు, చేతులకు సాధారణ గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తాతాజీని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

అమ్మ లేదు.. నువ్వూ వెళ్లిపోయావా నాన్నా!

రంగారావు (పాతచిత్రం)

కలిదిండి, న్యూస్‌టుడే : 'మమ్మల్ని వదిలేసి అమ్మ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అమ్మా, నాన్న.. నువ్వే అయ్యావు. ఇప్పుడు నువ్వూ మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా నాన్నా?' అంటూ ఆ చిన్నారులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. హాయిగా సంక్రాంతి నిర్వహించుకోవాల్సిన వేళ.. ఆ కుటుంబాన్ని విషాదం ముంచెత్తింది. రోడ్డు ప్రమాదం తండ్రిని బలికోరడంతో చిన్నారులు విలవిల్లాడిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడినాడకు చెందిన గాదేపల్లి రంగారావు(34) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన భార్య ఏడాది కిందట మృతి చెందారు. అప్పటి నుంచి అన్నీ తానే అయ్యి పిల్లలను గారాబంగా చూసుకుంటున్నారు. ఈ నెల 14న రాత్రి 9.30 గంటల సమయంలో పని మీద ద్విచక్ర వాహనంపై ఆకివీడు వెళ్తుండగా.. మార్గం మధ్యలో చినతాడినాడ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో రంగారావు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం అయ్యింది. స్థానికులు ఆకివీడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే రంగారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్సై తెలిపారు. దీనిపై రంగారావు సోదరుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో సంక్రాంతి కళ తప్పింది.. నిశ్శబ్దం తాండవిస్తోంది.

సినిమాకు వెళ్తూ...

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కనుమ పర్వదినాన సరదాగా సినిమాకు వెళ్తున్న ఇద్దరిపై విధి కన్నుకుట్టింది. ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కొయ్యలగూడెం మండలం శ్రీరంగపట్నానికి చెందిన మాణికల శ్రీనివాసరావు(45), దొంగల మధు బంధువులు. శుక్రవారం వీరు సినిమాకని జంగారెడ్డిగూడెం వెళ్తుండగా.. బయ్యనగూడెం- నరసన్నపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై వారి వాహనం అదుపు తప్పి.. కిందపడిపోయారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా.. మధుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనం ఢీకొని...

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పదహారో నంబరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. పాదచారుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పెదవేగి ఎస్సై మాదల హరిగోపాల్ కథనం మేరకు.. ఆగిరిపల్లికి చెందిన నాగులపల్లి సుబ్బారావు మద్యానికి బానిసై గత నెల 15న ఇంటి వద్ద నుంచి కూలి పనుల నిమిత్తం పెదవేగి మండలం అమ్మపాలెం వచ్చారు. ఇక్కడ పనులు చేస్తూ గురువారం రాత్రి జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్నారు. ఆయన్ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని చిన్నారి..

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం-ఉండి మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని సుమారు నాలుగేళ్ల బాలిక మృతి చెందడంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉండి రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన గూడూరి మోహన ఈశ్వర సాయి (31) విజయవాడలోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య ముగ్గురు సంతానం ఉన్నారు. పండగ సెలవుల నేపథ్యంలో ఈనెల 14న మోహన ఈశ్వర సాయి జంగారెడ్డిగూడెంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. కాగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన తన మిత్రుల కోసం పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. స్నేహితులతో చాలాసేపు గడిపిన మోహన ఈశ్వరసాయి గురువారం రాత్రి గ్యాస్ నొప్పిలా రావడంతో బయటకు వెళ్తున్నానని స్నేహితులతో చెప్పి బయలుదేరారు. అయితే గ్యాస్ నొప్పి మాత్రలు తెచ్చుకునేందుకు లాడ్జి సిబ్బందితో కలిసి సెంటర్‌లోకి వెళ్లగా.. దుకాణాలు మూసివేయడంతో తిరిగి వచ్చేసి.. రిసెప్షన్‌లోని ఓ వ్యక్తి వద్ద ఉన్న గ్యాస్ మాత్రను వేసుకున్నారు. అనంతరం బయట కూర్చున్న మోహన ఈశ్వరసాయి శుక్రవారం ఉదయం మృతి చెంది ఉన్నారు. దీంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అదుపు తప్పిన బస్సు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

సురక్షితంగా బయటపడిన 26 మంది ప్రయాణికులు

డ్రైవర్, కండక్టర్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్టీసీ అధికారి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పొగ మంచు కారణంగా రహదారి సరిగా కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కుడి వైపు మార్జిన్ దిగింది. ఈ ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పెదగొన్నూరు నుంచి శుక్రవారం ఉదయం గుడివాడకు 26 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పెదపాలపర్రు ఉన్నత పాఠశాల సమీపంలో ఇటీవల వేసిన హైవే బైపాస్ వద్ద పొగమంచు వల్ల దారి కనిపించలేదు. దీంతో కుడివైపు మార్జిన్ దిగడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేయడంతో కాలవ గట్టుపై నిలిచింది. ప్రయాణికులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. కంట్రోలర్ విజయ్ ప్రమాదం వివరాలు సేకరించారు.

కొన్నంగుంట వద్ద వాహనంలో మంటలు

నిప్పు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు మండలం బోర్వంచ శివారు కొన్నంగుంట వద్ద టాటా మ్యాజిక్ వాహనంలో మంటలు చెలరేగాయి. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అడవినెక్కలంకు చెందిన జుజ్జవరపు ఆనందరావు తన సతీమణితో కలిసి నూజివీడు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో టాటా మ్యాజిక్ పూర్తిగా దగ్ధమైంది. నూజివీడు అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. ఆటోలో ప్రయాణిస్తున్న దంపతులు ఇరువురు ప్రమాదం నుంచి బయట పడ్డారు. అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు, జరిమానా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన దారపురెడ్డి సురేశ్ చంద్ర కుమార్ రాజాకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. బాపులపాడుకు చెందిన యర్రగొర్ల రామయ్య 2022 జూన్ 12న ముద్దాయి చంద్రకుమార్ రాజాకు రూ.3.50 లక్షలు అప్పుగా ఇచ్చారన్నారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని రామయ్య కోరగా ముద్దాయి 2023 జనవరి 9న రూ.3.50 లక్షలకు చెక్కు ఇచ్చినట్లు చెప్పారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారన్నారు. తరువాత కోర్టులో కేసు వేయగా చంద్రకుమార్ రాజాకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

★ బాకీ తీర్మాన నిమిత్తం ఇచ్చిన చెక్కు చెల్లని నేరానికి నూజివీడుకు చెందిన సొంగా లూర్దుమాతకు ఆరు నెలల జైలు, రూ.2లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన పందేటి రామారావు 2021 ఆగస్టు 3న లూర్దుమాతకు రూ.6 లక్షలు అప్పుగా ఇచ్చారన్నారు. కొంత కాలం తరువాత బాకీ చెల్లించాలని రామారావు కోరగా లూర్దుమాత రూ. 2021 డిసెంబరు 18న రూ.6లక్షల చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును నగదు నిమిత్తం బ్యాంకులో వేయగా ఆమె ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారన్నారు. తరువాత పందేటి రామారావు కోర్టులో వేయగా.. విచారణ అనంతరం లూర్దుమాతకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

వైద్యురాలిపై దాడి యత్నం

బాధ్యుడైన జడ్పీ పాఠశాల పీడీపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న వైద్యురాలిని దుర్భాషలాడి.. ఆమెపై దాడికి యత్నించిన ఓ ప్రభుత్వ ఉద్యోగిపై జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన దీప్తి స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం కంసాలికుంటలో జరిగిన కోడి పందేల్లో కారం శేఖర్ అనే వ్యక్తికి కోడి కత్తి తగిలి కాలికి గాయమైంది. దీంతో ఆయన్ను బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తీసుకొచ్చారు. అయితే అక్కడ ఆ సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు దీప్తి క్షతగాత్రుడు శేఖర్‌ను పరిశీలించి చికిత్స అందిస్తుండగా.. శేఖర్ బంధువు అయిన బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ తెల్లం శ్రీనివాసరావు సదరు వైద్యురాలితో వాగ్వాదానికి దిగాడు. మద్యం తాగి ఉన్న శ్రీనివాసరావు.. వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దుర్భాషలాడి దాడికి యత్నించాడు. దీనిపై వైద్యురాలు దీప్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ॥ రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
98486 67454

LAND FOR SALE
2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప॥ గో॥ జిల్లా. సెల్: 8500405678, 9885912559

JOBS
ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ నందు పాలకొల్లు, నరసాపురం ఏరియాలలో పనిచేయుటకు, సెక్యూరిటీ ఆఫీసర్, (Ex. సర్వీస్‌మేన్) సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, 8 గం॥ డ్యూటీ, PF, ESI కలదు. సెల్: 83096 50572, 74167 12755, 94937 86599.

PLOT FOR SALE
Near Velpur Petrol Bunk 250 Square Yards N/F from Tanuku to Velpur Main Road 50 Feet Distance. 8500268603.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

భీమవరం, PP రోడ్, భీమవరం విద్యానికేతన్ స్కూల్ దగ్గరలో 200 చ.గజాల స్థలం [illegible] అమ్మబడును. సెల్: 9392122526.

RK Township వారి రాజమండ్రి వెంచర్లో సంక్రాంతి Gold ఆఫర్ [illegible] వివరాలకు: [illegible] మేనేజర్, Contact Cell: 99490 91197.

గమనిక
[illegible]

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

నేటి సూచించిన కోడిగుడ్ల ధర
For the Information of Trade & Industry
[illegible] రూ. 5.50 [illegible] 08819-224254

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 180, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 380

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

భక్తిశ్రద్ధలతో గోపూజ

గోవుకు నమస్కరిస్తున్న ఆదిలక్ష్మి

నాచుగుంట(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కనుమ సందర్భంగా నాచుగుంట గోపాలకృష్ణ గోశాలలో శుక్రవారం గోపూజ నిర్వహించారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి హాజరై గోవుకు పట్టు వస్త్రం సమర్పించి పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో గోవుకు విశిష్ట స్థానం ఉందన్నారు. గోవును పూజించడం మన బాధ్యతని ఆమె పేర్కొన్నారు. గోశాల కార్యదర్శి పరిమి వెంకట రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

కనులవిందుగా కళా ప్రదర్శన

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని కళా వేదికపై శుక్రవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఏలూరు పణి ప్రియ నృత్య కళా బృందం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం మంత్రముగ్ధుల్ని చేసింది.

కాళ్లకు కత్తి కట్టి.. కోళ్లపై కోట్లుపెట్టి!

భీమడోలు మండలం గుండుగొలనులోని ఓ బరి వద్ద జనం

సంక్రాంతి సందర్భంగా.. దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. చిన్నా పెద్ద, ఆడామగ తేడా లేకుండా బరుల వద్దకు తరలివచ్చారు. కోళ్లకు కత్తి కట్టి.. పెద్ద ఎత్తున పందెం కాశారు. పలువురు యువకులు, మహిళలు పుంజులు పట్టుకొని సందడి చేశారు. కోళ్ల కొట్లాటను పలువురు తమ ఫోన్లలో చిత్రీకరించారు. బరుల ప్రాంగణాలంతా కిటకిటలాడాయి. - **న్యూస్‌టుడే, ఏలూరు**

లక్ష్మీ నగరంలో తలపడుతున్న పుంజులు

మాదేపల్లి శివారు ప్రాంతంలో..

సెల్‌ఫోన్‌లో పందేలు చిత్రీకరిస్తున్న యువతులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్: 80085 74486	ఏలూరు టూటౌన్: 80085 74487
దెందులూరు: 80085 74535	పెదపాడు, పెదవేగి: 80085 74483
భీమడోలు: 80085 74527	నిడమర్రు (గ్రామీణ): 97040 21765
ఉంగుటూరు: 94939 90333	గణపవరం: 99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లోని పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. శివారు కావడంతో రాత్రివేళ విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటోంది. చీకట్లో ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నాం. - **జాన్, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి బిగిస్తాం. - **పవన్, విద్యుత్తు ఏఈ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? సోమవరప్పాడు శివారు ఆర్టీసీ కాలనీలో పందుల బెడదతో అవస్థలు పడుతున్నాం. చెత్తాచెదారం చిందరవందర చేస్తున్నాయి. కాలనీలో పారిశుద్ధ్యం లోపిస్తోంది. - **వెంకటేశ్వరరావు**

✔ పందుల పెంపకందారులకు నోటీసులిస్తాం. మరోమారు రోడ్లపైకి వదిలేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. - **స్టానిష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

కుక్కలున్నాయ్.. పిక్కలు పీకుతున్నాయ్!

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఏలూరు నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బయటకెళ్తే ఎక్కడ దాడి చేస్తాయో అనే భయం వెంటాడుతున్నాయి. రోడ్డుపై నడిచి వెళ్లేవారితో పాటు ఇళ్లలోకి చొరబడి కరుస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు వీధుల్లోకి వెళ్లాలంటేనే వణికిపోతున్నారు.

ఏలూరు పడమరవీధి పాల తూము కూడలిలో వీధి కుక్కలు సంచరిస్తున్న దృశ్యమిది. ఇటీవల అయిదో తరగతి చదువుతున్న ఓ బాలిక సైకిల్‌పై బడికెళ్తుండగా.. అక్కడి కుక్కలు దాడికి యత్నించాయి. చిన్నారి కేకలు వేయడంతో.. స్థానికులు అప్రమత్తమై వాటిని తరిమేశారు.

ఎక్కడెక్కడ అంటే..? నగరంలోని పడమర వీధి, దక్షిణపు వీధి, వైఎస్సార్ కాలనీ, వంగాయగూడెం, గొల్లాయిగూడెం, ఆముదాల అప్పలస్వామి కాలనీ, తంగెళ్లమూడి, రాజీనగర్, కబడీగూడెం, కుమ్మరేవు, లంకపేట, లక్ష్మమ్మ చెరువుగట్టు తదితర ప్రాంతాల్లో శునకాల బెడద ఎక్కువ ఉంటోంది. నిత్యం ఏదో ఒక మూల కుక్కల దాడిలో గాయపడి.. రోజుకు సగటున 20 మందికి పైగా బాధితులు సర్వజన ఆసుపత్రికి వస్తున్నారు. మరో పది మంది వరకు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.

బెంబేలెత్తుతున్న నగర వాసులు

డివిజన్లు: 50	నగర జనాభా: 2.80 లక్షలు
వీధి కుక్కలు: 20 వేలకు పైగా	పెంపుడు శునకాలు: 5 వేలు
రోజూ కుక్కకాటుకు గురవుతున్నవారు: 30 మందికి పైగా	

శస్త్రచికిత్సలెక్కడ? కుక్కల బెడదను అరికట్టేందుకు సంతాన నివారణ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాల్సి ఉండగా.. దీన్ని ఎక్కడా పూర్తిగా అమలు చేయడం లేదు. అక్కడక్కడ అరకొరగా చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఫలితంగా వీటి సంతతి పెరిగిపోతోంది. ఇప్పటి వరకు కేవలం 1,900 శునకాలకు మాత్రమే శస్త్రచికిత్సలు చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. తమకు ఫిర్యాదు అందిన ప్రాంతాలకు సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న ఉరుసు మహోత్సవాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కోటదిబ్బ ప్రాంతంలో సయ్యద్ బాబాజీ మహాత్ములవారి దర్గా ఉరుసు మహోత్సవాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మహాత్ములవారిని దర్శించుకున్నారు. కే-అష్టన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు శుక్రవారం మహాత్ములవారికి చాదర్ సమర్పించి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు పెదబాబుకు ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ స్వాగతం పలికారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా నిర్వాహకులు సాబీర్ హుస్సేన్, షబీర్ హుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.

చాదర్ తీసుకొస్తున్న పెదబాబు

కొత్త అల్లుడికి పసందైన విందు

వివాహమైన తర్వాత మొదటి సంక్రాంతి పండగకు అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడికి ఏకంగా 1,116 రకాల వంటకాలతో భోజనం వడ్డించి ఆశ్చర్యపరిచారు అత్తామామలు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా హనుమాన్‌బాబు, కల్యాణి దంపతుల కుమార్తె శ్రీజను పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన నారాయణం సంజయ్‌కిచ్చి అక్టోబరులో వివాహం చేశారు. మొదటి సంక్రాంతి పండుగకు అత్తారింటికి రావడంతో 1,116 రకాల వంటకాలతో పసందైన విందు ఏర్పాటు చేశారు. పిండి వంటలు, తెల్లన్నంతోపాటు పలు రకాల వంటకాలు, చాక్లెట్లు, బిస్కెట్లు, శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లు, కేక్‌లు, పండ్లు తదితరాలు వడ్డించారు. - **న్యూస్‌టుడే, ఉంగుటూరు**

వంటకాల వద్ద నవ వధూవరులు, బంధువులు

హేతువాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: యువతలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తూ.. హేతువాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని విశ్రాంత న్యాయమూర్తి అడబాల లక్ష్మి అన్నారు. ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో హేతువాద రచయిత, న్యాయవాది త్రిపురనేని రామస్వామి జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముత్యాల సాంబశివరావు అధ్యక్షత వహించారు. సీనియర్ న్యాయవాది పీపీ శాస్త్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు ఏలూరులో హేతువాద ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందని గుర్తు చేశారు. ఇప్పుడు శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని సమర్థంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. జిల్లా హేతువాద సంఘం అధ్యక్షుడు కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, చిలుకూరి రమేశ్‌కుమార్; డి.రవికుమార్, గంగాధర్, న్యాయవాది వాకాడ రాజారావు, నాయకులు ఆర్.ఎస్.డాంగే, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మి

కల్పవల్లీ.. సిరులతల్లి!

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేషాలంకరణలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ● సత్రంపాడు సౌభాగ్య లక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి

వేడుకగా కల్యాణోత్సవాలు

నిడమర్రు: పెదనింద్రకొలను పెద్దింట్లమ్మ ఆలయంలో జలదుర్గ గోకర్ణేశ్వర స్వామి కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొని పూజలు చేశారు. ఏర్పాట్లను నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఊరేగింపులో గన్ని, మహిళలు

దెందులూరు: వైష్ణాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. ఆపై మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పరిణయోత్సవం నిర్వహించారు.

వేంకన్నకు వెండి గిన్నెలు

ఏపూరు(పెదపాడు), న్యూస్‌టుడే: ఏపూరు- నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి తెదేపా నాయకురాలు వడ్డి వాసవీదేవి శుక్రవారం రూ. 1.15 లక్షలు విలువైన రెండు వెండి తీర్థం గిన్నెలను కానుకగా ఇచ్చారు. తన మనుమడు పసుపులేటి మాన్విత సాయికృష్ణ తొమ్మిదో పుట్టిన రోజు సందర్భంగా.. వెండి వస్తువులను అందజేసినట్లు ఆమె తెలిపారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం

భీమడోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శ్రీపార్వతి సమేత భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శేషభట్టాచార్యులు, విజయశంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవర్లను వేర్వేరుగా ఊరేగించారు. గుండుగొలను వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని అశ్వ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు.

రైతు సేవ.. నిర్లక్ష్య తోవ

నిడమర్రు కాలనీలో రైతు సేవా కేంద్ర భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వం చివరి దశలో బిల్లులు చేయకపోవడంతో.. గుత్తేదారులు అర్థాంతరంగా పనులు ఆపేశారు. ప్రస్తుతం అరకొర వసతులున్న గ్రామ సచివాలయంలో సేవలందిస్తుండటంతో రైతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. - **న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

మట్టి నిండి.. ప్రమాదమేనండి

పెదవేగి మండలం నడిపల్లి నుంచి పేదల కాలనీకెళ్లే మలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడి రోడ్డంతా మట్టితో నిండిపోయి జారుడు బల్లలా తయారైంది. ఈ మార్గంలో వేగంగా రాకపోకలు సాగించే వాహనదారులు మలుపు వద్ద అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. - **న్యూస్‌టుడే, నడిపల్లి(పెదవేగి)**

ముళ్ల కంప.. సాగేదెలాగప్పా!

పెదపాడు నుంచి వట్లూరుకెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఎదురొచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు, వ్యవసాయోత్పత్తులు తరలించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముళ్లకంపల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ర.భ.శా. ఏఈ శేషకుమార్ తెలిపారు. - **న్యూస్‌టుడే, వట్లూరు(పెదపాడు)**

చెత్త తొలగదు.. మురుగు పారదు

ఏలూరు సత్రంపాడు ప్రధాన రహదారిలోని వంతెన కింద డ్రెయిన్‌లో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో మురుగు ముందుకెళ్లడం లేదు. మినీ డంపింగ్ యార్డులా మారడంతో దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

గోడ లేక.. రక్షణ కల్పించక!

ఏలూరు - కైకలూరు ప్రధాన రహదారిలోని పడమర వీధి కొబ్బరితోటలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇక్కడ ఫ్యూజ్ చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. అది కాస్తా దెబ్బతినడం. తక్కువ ఎత్తులో ఉండటంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఫ్యూజ్‌కు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, ఏలూరు**

జూద స్థావరాలపై కేసులు

గణపవరం, న్యూస్‌టుడే: మండలంలోని పలు జూద స్థావరాలపై గురు, శుక్రవారాల్లో దాడులు చేసినట్లు ఎస్సై ఎ.మణికుమార్ తెలిపారు. జూదం, గుండాట, కోడి పందేల నిర్వాహకులపై 31 కేసులు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

పెదవేగి(పెదపాడు): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేలపై శుక్రవారం దాడి చేసి 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పెదవేగి ఎస్సై మాదల హరి గోపాల్ తెలిపారు. వారి వద్ద నుంచి పది కోడి పుంజులు, రూ.2,800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పెదపాడు: పలు గ్రామాల్లో కోడి పందేలు, జూద శిబిరాలపై నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. మొత్తం 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28,730, ఎనిమిది పుంజులు, కోడి కత్తులు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

దుష్ప్రచారంపై అంబికా కృష్ణ ఫిర్యాదు

ఏలూరు గ్రామీణ: తనపై గుర్తుతెలియని వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారంటూ పారిశ్రామికవేత్త, అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరిట వాట్సాప్‌లో అవాస్తవ సంక్షిప్త సందేశాలు పంపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	మన శంకర వరప్రసాద్ గారు
అంబిక మినీ	మన శంకర వరప్రసాద్ గారు
సాయి బాలాజీ	మన శంకర వరప్రసాద్ గారు
బాలాజీ	రాజాసాబ్
సత్యనారాయణ 1	మన శంకర వరప్రసాద్ గారు
సత్యనారాయణ 2	అనగనగా ఒక రాజు
సత్యనారాయణ 3	భర్త మహాశయులకు విజ్ఞప్తి
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అనగనగా ఒక రాజు
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	భర్త మహాశయులకు విజ్ఞప్తి
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అనగనగా ఒక రాజు

అంచులు వదిలేసి.. అవస్థల్లో పడేసి!

దెందులూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదకొండు పనులకు రూ.200 కోట్ల ఎన్‌డీబీ నిధులు మంజూరయ్యాయి. అందులో దెందులూరు రైల్వే గేటు సమీపం నుంచి శ్రీరామవరం వరకున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు స్థానం దక్కింది. గత సర్కారు గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో.. వారు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. విస్తరణ పనులు ప్రారంభించారు.

నెలలు గడుస్తున్నా.. ఎట్టకేలకు పనులు మొదలు కావడంతో.. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు సంతోషించారు. వారి ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. గుత్తేదారులు రహదారి అంచులు తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా అభివృద్ధి చేయకపోవడంతో.. వాహనదారులు, ప్రయాణికులు అంచుల్లో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు.

శ్రీరామవరం మార్గంలో మట్టి సంచులు

రద్దీ మార్గమిది.. దెందులూరు నుంచి పంగిడిగూడెం మీదుగా ద్వారకాతిరుమల వెళ్లే మార్గం కావడంతో.. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అంచులు తవ్వేసిన చోట ఎదురుగా వాహనాలొస్తే పక్కకు తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ దారిలో విద్యుద్దీపాలు సైతం లేకపోవడంతో.. రాత్రివేళ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దాంతో మట్టితో నింపిన సంచులను అంచుల్లో పెట్టేసి చేతులు దులుపుకొన్నారు. ఈ విషయమై రోడ్లు, భవనాలశాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. వారు స్పందించకపోవడం గమనార్హం.

రంగవల్లులు.. గ్రామాల్లో సందళ్లు!

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పోణంగిలో వెలమ సంఘం ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు రంగవల్లులు, పిల్లలకు లెమన్ స్పూన్, మ్యూజిక్ ఛైర్స్, డాన్స్ బేబీ డాన్స్ పోటీలు చేపట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

గణపవరం: మొయ్యేరు, అప్పన్నపేట గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు. మొయ్యేరు సహకార సంఘాధ్యక్షుడు కానుమిల్లి చంటి, మాజీ సర్పంచి ఇంటూరి చంద్రమోహనరావు పాల్గొన్నారు.

వేంపాడు(పెదపాడు): కొక్కిరపాడు పంచాయతీ వేంపాడులో రామాలయం యూత్ కమిటీ ఆధ్వర్యాన రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా.. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

భీమడోలు: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎల్.తనూజ తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు సమకూర్చారు. వాటిని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పంపిణీ చేశారు.

రేయింబవళ్లు.. జోరుగా పందేలు!

మూడ్రోజులపాటు యథేచ్ఛగా కార్యకలాపాలు

దెందులూరు, పెదపాడు, గణపవరం, భీమడోలు- న్యూస్‌టుడే

సంక్రాంతి పండగ సందర్భంగా రేయింబవళ్లు తేడా లేకుండా కోడి పందేలు జోరుగా సాగాయి. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ పందేలు, జూదం జరగనివ్వమని అధికారులు బీరాలు పలికినా.. క్షేత్ర స్థాయిలో మాత్రం పందెగాళ్లు పైచేయి సాధించారు. మూడ్రోజులపాటు కార్యకలాపాలు యథేచ్ఛగా సాగాయి.

జనం తరలివచ్చి

చేబ్రోలులోని ఓ బరిలో ఫ్లడ్ లైట్లు

మినీ స్టేడియాల తరహాలో.. ఏలూరు గ్రామీణ మండలం జాలిపూడి, చాటపర్రు ప్రాంతాల్లో బరులను మినీ స్టేడియాల తరహాలో ఏర్పాటు చేశారు. ఎక్కడా గొడవలు జరగకుండా బౌన్సర్లను పెట్టారు. మాదేపల్లిరోడ్డు, కొమడవోలు, పోణంగి, చొదిమెళ్ల, శివనగర్; దెందులూరు మండలం గాలాయిగూడెం, దోసపాడు, పోతునూరు ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందేలు, జూదం నిర్వహించారు. బరుల వద్ద జాతరను తలపించేలా వేలాదిగా జనం తరలివచ్చి తిలకించారు.

పెదపాడు మండలం పాతపెదపాడు, కలపర్రు, కొక్కిరపాడు, వసంతవాడ, వీరమ్మకుంట, ఏపూరు తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. పెదవేగి మండలం లక్ష్మీపురం, దిబ్బగూడెం, కొండలరావుపాలెం, కూచింపూడి, భోగాపురం, పెదకడిమి, విజయరాయి తదితర గ్రామాల్లో గుండాట, జూదం యథేచ్ఛగా సాగాయి. జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కలపర్రులో అనంతపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పందేలను తిలకించారు.

అగ్రహార గోపవరంలో ఉద్రిక్తత

గణపవరం మండలం అగ్రహార గోపవరం, చిలకంపాడు, కేశవరం గ్రామాల్లో కోడిపందేలు, జూదం, గుండాట యథేచ్ఛగా సాగాయి. అగ్రహార గోపవరం గుండాట శిబిరం వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలు కొట్లాటకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. చిలకంపాడు, కేశవరం, అప్పన్నపేట గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందే జూదం నిర్వహించారు. గణపవరం శివారులోని బరిలో కోడి పందేలను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తిలకించారు.

విజేతలకు వాహనాలు.. ఉంగుటూరు మండలంలో రూ.లక్షల్లో పందేలు నిర్వహించారు. నారాయణపురం బరిలో ఎక్కువ పందేలు గెలిచిన వారికి బుల్లెట్, టీవీఎస్ జూపిటర్ ద్విచక్ర వాహనాలను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అందజేశారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలను, తోకలపల్లి గ్రామాల్లోనూ పందేలు కొనసాగాయి. భీమడోలు మండలం గుండుగొలను, పూళ్ల, భీమడోలు, కురెళ్లగూడెం, పోలసానిపల్లి, అంబరుపేట గ్రామాల్లోని బరుల వద్దకు వేల మంది జనం తరలివచ్చారు.

చదువుల్లో రాణులం.. క్రీడల్లో విజేతలం!

భీమడోలు, న్యూస్‌టుడే

వారంతా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ.. గురుకులంలో విద్యనభ్యసిస్తున్నారు. ఓవైపు చదువులో రాణిస్తూనే.. మరోవైపు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఏకంగా రాష్ట్ర, జాతీయ స్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై భళా అనిపిస్తున్నారు. వారికి ప్రధానాచార్యురాలు ఎన్.భారతి, వ్యాయామోపాధ్యాయిని ప్రమీల తోడ్పాటునందిస్తున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులపై కథనం.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

నా పేరు ఆర్.రోసిలీన. పదో తరగతి చదువుతున్నా. మాది మొండూరు గ్రామం. అమ్మానాన్న వ్యవసాయ కూలీలు. నాకు బాల్యం నుంచీ చదువుతో పాటు క్రీడలంటే మక్కువ ఎక్కువ. నాకున్న ఆసక్తిని వ్యాయామోపాధ్యాయిని గుర్తించారు. సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ క్రీడాంశాల్లో రోజూ తర్ఫీదు ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా సాధన చేస్తున్నాం. భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగమే సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

స్వర్ణ పతకమే ధ్యేయం

నా పేరు ఆర్.సౌమ్య. పదో తరగతి చదువుతున్నా. మాది భీమడోలు మండలం గుండుగొలను గ్రామం. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ పనులకు వెళ్తారు. నాకు చిన్నతనం నుంచి క్రీడలంటే ఇష్టం. గురుకుల పాఠశాలలో చేరాక, ఆటలపై మరింత శ్రద్ధ పెట్టా. బేస్‌బాల్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నా. తాజాగా జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. అక్కడా స్వర్ణ పతకమే ధ్యేయంగా సాధన చేస్తున్నా.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మరింత రాణిస్తా

నా పేరు బి.కీర్తన. ఎనిమిదో తరగతి చదువుతున్నా. మాది కోడూరుపాడు గ్రామం. అమ్మానాన్న కూలీ పనులకు వెళ్తుంటారు. వారు కష్టపడితేనే ఇల్లు గడుస్తుంది. బాల్యం నుంచీ క్రీడలంటే ఇష్టం. గురుకుల పాఠశాలలో చేరాక సాఫ్ట్‌బాల్ నేర్చుకున్నా. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇటు చదువు, అటు క్రీడల్లో రాణిస్తున్నా. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటా. అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో మరింత రాణిస్తా.

కారు అద్దం ధ్వంసం.. చోరీ

ఉంగుటూరు: నారాయణపురంలో కోడి పందేలు తిలకించేందుకు గణపవరం మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కారులో వచ్చారు. కారు పార్కింగ్‌లో నిలిపి బరి వద్దకెళ్లారు. కాసేపటి తర్వాత కారు వద్దకొచ్చారు. అప్పటికే అద్దం బద్దలై ఉంది. అందులోని ల్యాప్‌టాప్, నగదు కనిపించకపోవడంతో చేబ్రోలు పోలీసులను ఆశ్రయించారు.

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

మద్ది క్షేత్రంలో గోపూజ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కనుమ పండగ సందర్భంగా గోపూజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా క్రతువులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఈవో ఆర్వీ చందన తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామి సేవలో సినీ దర్శకుడు వి.వి.వినాయక్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని సినీ దర్శకుడు వి.వి.వినాయక్ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఆయన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్‌గా నియామకం పొందిన డా.నక్కా వెంకటేశ్వర్లు జంగారెడ్డిగూడెం న్యాయస్థానంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. చట్టానికి లోబడి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానన్నారు.

ప్రధాన రహదారి శుభ్రం

పోలవరం, న్యూస్‌టుడే: ఈనెల 13న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వచ్చిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ స్పందించారు. సిబ్బందిని పంపి రెండు రోజుల పాటు పోలవరం ప్రధాన రహదారిపై డ్రెయినేజీ నిర్మాణానికి తీసుకొచ్చిన ఇసుకను శుభ్రం చేయించారు.

బరిలో కోళ్లు.. చేతిలో కోట్లు

న్యూస్‌టుడే బృందం: పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో సంక్రాంతి పండగ వైభవంగా జరిగింది. బంధువులు, మిత్రుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొయ్యలగూడెంలో సుమారు 80 రకాలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. కోడి పందేల బరుల వద్ద కోలాహలం నెలకొంది. పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తిలకిస్తున్నారు. చింతలపూడి మండలం చింతంపల్లిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పందేలను చూసేందుకు వచ్చారు. రూ.లక్షల్లో నగదు చేతులు మారింది. రావికంపాడు సమీపంలో నిర్వహించిన బరి వద్ద మద్యం అమ్మకాలు జోరుగా జరిగాయి. పందెంలో పోరాడి చనిపోయిన కోడి(కోస)కి డిమాండ్ పెరిగింది. కోసాను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. ఒక్కో కోసా రూ.అయిదు వేల వరకు పలికింది. బుట్టాయగూడెం మండలం కంసాలికుంట బరిలో అత్యధిక పందేలు గెలిచిన నిమ్మలగూడేనికి చెందిన బిటికెంద అంజిబాబును నిర్వాహకులు సన్మానించారు. అంజిబాబు బృందం 30 పందేల్లో పాల్గొని 24 పందేలు గెలిచినట్లు తెలిపారు.

చింతంపల్లి: పందేల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కంసాలికుంట బరిలో సందడి

జంగారెడ్డిగూడెంలో తలబడుతున్న కోళ్లు

కొయ్యలగూడెంలో బొమ్మల కొలువు

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి, న్యూస్‌టుడే: ? నగర పంచాయతీలోని భట్టువారిగూడెం, వడ్డెరగూడెంలో డ్రెయినేజీలను నిర్మించకపోవడంతో ఇళ్లలో వాడిన మురుగు మొత్తం రహదారిపైకి వచ్చేస్తుంది. **- కిశోర్, చింతలపూడి**

✔ నగర పంచాయతీలో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే మంజూరవుతాయి. **- అంబటి రాంబాబు, కమిషనర్**

? డిగ్రీ కళాశాల వద్ద బస్టాప్‌లో ఆకతాయిలు రాత్రి సమయంలో మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తున్నారు. **- సురేశ్, విద్యార్థి, చింతలపూడి**

✔ రాత్రి సమయంలో కానిస్టేబుల్స్ పెట్రోలింగ్‌లో భాగంగా బీట్‌కు తిరుగుతుంటారు. ఎవరైనా బస్టాప్‌లో మద్యం తాగితే కేసులు పెడతాం. **- సతీశ్, ఎస్సై**

నూకాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. కనుమ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి గోమాతకు పూజలు చేశారు. అమ్మవారి వెండి చీర తయారీ, పుష్పాలంకరణ నిమిత్తం పలువురు విరాళాలు అందించారు.

ఇచ్చి పదేళ్లు.. పనిచేయలేదు ఏ రోజూ

పదేళ్ల కిందట పట్టిసీమ పంచాయతీకి జిల్లా అధికారులు చెత్త సేకరణ కోసం రూ.1.75 లక్షల విలువైన బ్యాటరీ వాహనం అందజేశారు. అది ఇచ్చిన నాటి నుంచి మూలనే ఉంది. బ్యాటరీ పాడైన కారణంగా.. పంచాయతీ అధికారులు పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి నేటి వరకు దానిని పట్టించుకునే వారు లేక తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతుంది. మధ్యలో ఒకసారి మెకానిక్ వచ్చి ఇక ఈ వాహనం పనిచేయదని తెల్చి చెప్పడంతో.. దాని దిశలు మార్చుతూ.. ప్రస్తుతం పాడైన మరో వాహనం చెంతకు చేర్చారు. **- న్యూస్‌టుడే, పోలవరం**

కనుమ మహోత్సవంలో ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో శ్రీవేంకటేశ్వరస్వామి కనుమ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరై, ఆలయ ఈవో భద్రాజీతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముందుగా ఆయనకు అర్చకులు శాలువా కప్పి స్వాగతం పలికారు.

పూజలో మద్దిపాటి వెంకటరాజు

ఆకట్టుకున్న రంగవల్లులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పాల్గొని రంగు రంగుల రంగవల్లులు వేసి ప్రతిభ కనబరిచారు. ఇందులో ప్రథమ స్థానం సాధించిన పి.సాయి ప్రవల్లికకు మాజీ జడ్పీటీసీ సభ్యుడు బుసనబోయిన సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, వంశీ, పావని రూ.5 వేలు బహుమతి ఇచ్చారు. నీలపాల రత్తమ్మ గారి జ్ఞాపకార్థం విజేతలకు ఆమె కుటుంబ సభ్యులు రూ.10వేల విలువైన బహుమతులు అందజేశారు. పాకనాటి భరత్ కుమార్ సహకారంతో విజేతలకు జ్ఞాపికలు అందించారు.

సంక్షేమం ఉదాసీనం.. భద్రత దైవాధీనం

అస్తవ్యస్తంగా గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల

వేలేరుపాడు, న్యూస్‌టుడే: గత కొన్నేళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది వేలేరుపాడు మండలం శివకాశీపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల. విద్యార్థినుల కనీస అవసరాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

నరికేసిన భారీ వృక్షాలు

కొరవడిన పర్యవేక్షణ

పాఠశాలలో 186 మంది విద్యార్థినులున్నారు. వీరంతా మన్యంలోని వివిధ మండలాల నుంచి వచ్చి ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. విద్యాలయంలోకి ఇతరులకు అనుమతి లేదనే నిబంధనలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత కొన్ని నెలలుగా బియ్యం, ఇతర నిత్యావసరాలను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో బాలికలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. వారి కనీస భద్రత గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఆవరణలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల భారీ వృక్షాలను నరికేయడంతో పాఠశాలలో నిలువ నీడ కరవైంది. ప్రహరీ కుప్పకూలి నెలలు గడుస్తున్నా.. దాని వైపు కన్నెత్తి చూడటం లేదు.

ఎమ్మెల్యే హెచ్చరించినా..

ఏడాదిన్నర కిందట ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాఠశాలను సందర్శించి మౌలిక వసతులు, ఆహారం, ఇతర విషయాలపై ఆరా తీసి సిబ్బందిని హెచ్చరించారు. అయినప్పటికీ మార్పు రాలేదు. ఇటీవల డిప్యూటీ వార్డెన్ బి.పోశమ్మ పాఠశాల నుంచి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా కారులో బియ్యం, ఇతర నిత్యావసరాలను తరలిస్తూ పట్టుబడి సస్పెన్షన్‌కు గురవ్వగా.. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కల్యాణికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

మార్పు కనిపించడం లేదు

కొన్నేళ్లుగా పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై తల్లిదండ్రుల సమావేశాల్లో సిబ్బందిని నిలదీస్తూనే ఉన్నాం. అయినప్పటికీ వారిలో మార్పు కనిపించడం లేదు.' అని తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు మచ్చా కన్నయ్య తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

'పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాం. విద్యార్థినులకు అందించే ఆహార మెనూ, చదువు, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవు.' అని జీలుగుమిల్లి ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య పేర్కొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మారుమూల ఉప్పరిల్లలో కొండరెడ్డి తెగ గిరిజన వృద్ధులకు పులిరాముడుగూడేనికి చెందిన తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. గిరిజన సహకార సంస్థ రాష్ట్ర డైరెక్టర్ మడకం కన్నపరాజు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి జారం చాందిని, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు కోర్స వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పూనెం బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో అగ్నిప్రమాదం

పోలవరం, న్యూస్‌టుడే: పండగ నేపథ్యంలో బంధువుల ఇంటికి వెళ్లిన కుటుంబం అగ్నిప్రమాదం జరిగిందన్న విషయం తెలిసి వెంటనే వెనుదిరిగి వచ్చేసరికి సామగ్రి మొత్తం కాలిపోయింది. పోలవరంలో శుక్రవారం ఉదయం ఓ డాబా ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి లోపల సామాన్లు, దుస్తులు కాలిపోయాయి. చుట్టు పక్కల వారు కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి మంటలు అదుపు చేశారు. తహసీల్దార్ సాయిరాజు అక్కడకు వచ్చి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. రాచమళ్ల గౌతమికి చెందిన ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2 లక్షల విలువైన సామాన్లు కాలిపోయినట్లు తహసీల్దార్‌కు నివేదించినట్లు వీఆర్వో గాంధీ చెప్పారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం సమకూరింది. హైదరాబాద్ పంజాగుట్టకు చెందిన ఎం.లక్ష్మీప్రసన్న కుమారి రూ.లక్ష, తాడేపల్లిగూడేనికి చెందిన పసుమర్తి ధన వెంకట సూర్యనారాయణ రూ.లక్ష విరాళాలను ఆలయ కార్యాలయంలో శుక్రవారం జమ చేశారు. దాతలకు ఆలయాధికారులు నిత్యాన్నదాన పత్రాల్ని అందజేశారు.

సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోండి: తుమ్మల

దమ్మపేట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో అధునాతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. చింతలపూడి మండలం మేడిశెట్టివారిపాలెంలో సెన్సార్ ద్వారా పనిచేసే బిందుసేద్య పరికరాల వాల్వ్‌లను ఆయన గురువారం పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. రైతులు నేరుగా తమ చరవాణి ద్వారా ఈ వాల్వ్‌లను ఇంటి నుంచే మార్చుకునే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. ఈ పద్ధతిలో రైతులు తోటలోకి వెళ్లకుండా సక్రమంగా నీటి తడులు అందించుకోవచ్చన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రధానంగా ఆయిల్‌పామ్, కొబ్బరి వంటి ఉద్యాన పంటలకు ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుందన్నారు. వీటిని తెలంగాణ రైతులు అమర్చుకునేలా అవగాహన కల్పించాలని ఆయిల్‌పామ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్‌కు సూచించారు. ఆయిల్‌ఫెడ్ ఓఎస్డీ కిరణ్‌కుమార్, రైతు దొడ్డా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

డ్రిప్ వాల్వ్‌లను పరిశీలిస్తున్న మంత్రి నాగేశ్వరరావు

సూచికలు లేవు.. జాగ్రత్తగా వెళ్లాల్సిందే!

ప్రమాదకరంగా మలుపులు

టి.నరసాపురం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పలుచోట్ల రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహన చోదకులు జాగ్రత్తగా తమ వాహనాలు నడపకుంటే ప్రమాదాల బారిన పడినట్టే. పాడైన రహదారులతో పాటు ఇటీవల మరమ్మతులు పూర్తి చేసిన రహదారుల్లోనూ మలుపుల వద్ద హెచ్చరిక సూచికలు, వేగ నిరోధకాలను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

కొయ్యలగూడెం మండలం ధర్మారావుపేట-వేదాంతపురం మార్గంలో మలుపు ఇలా..

'ఇటీవల కొత్తగా నిర్మించిన బొర్రంపాలెం-మల్లుకుంట రహదారిలో ఓ మలుపు వద్ద ముగ్గురు యువకులు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఒకరు మృత్యువాత పడ్డారు. దీంతో అప్పటి వరకు ఆ ప్రాంతంలో లేని వేగ నిరోధకాలు, సూచికలను అధికారులు హడావుడిగా ఏర్పాటు చేయడం గమనార్హం.'

టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి కామవరపుకోట వెళ్లే రహదారిలో పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. టి.నరసాపురం నుంచి మక్కినవారిగూడెం, బండివారిగూడెం నుంచి అప్పలరాజుగూడెం, వెలగపాడు నుంచి బొర్రంపాలెం, కేతవరం నుంచి కొత్తగూడెం అడ్డ రోడ్డు చేరే రహదారి, కేతవరం నుంచి రాజుపోతేపల్లి, బొర్రంపాలెం నుంచి మల్లుకుంట, సీతంపేట నుంచి మర్రిగూడెం, బండివారిగూడెం నుంచి పుట్రేపు చేరే రహదారుల్లో మలుపులు అధికంగా ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో తుప్పలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వారు కనిపించని పరిస్థితి.

కొయ్యలగూడెం మండలంలోనూ ఇదే పరిస్థితి. అచ్యుతాపురం-త్రినాథపురం, నరసన్నపాలెం-రామానుజపురం, యర్రంపేట-రాజవరం, ఆరిపాటిదిబ్బలు-కుంతలగూడెం రహదారుల్లో ప్రమాదకర మలుపులు చోదకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

ఏర్పాటు చేయిస్తాం..

'రహదారి మలుపుల వద్ద వెంటనే హెచ్చరిక సూచికలు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయిస్తాం. రహదారి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడతాం.' ఆర్అండ్‌బీ జంగారెడ్డిగూడెం డీఈఈ హరికృష్ణ తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మాజీ సర్పంచి తల్లాడ సత్తిపండు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె గీతానారాయణ జంగారెడ్డిగూడెం పట్టణంలోని మాదిగ సంక్షేమ సంఘానికి ఫ్రీజర్ బాక్సును శుక్రవారం అందించారు. తల్లాడ సత్తిపండు జయంతి సందర్భంగా రూ.70వేల విలువైన ఫ్రీజర్ బ్యాక్సును అందించడం ఆనందంగా ఉందని గీతానారాయణ తెలిపారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మానవత మూర్తి, తల్లాడ నేతాజీ శ్రీనివాస్, ముప్పిడి శ్రీనివాస్, ముప్పిడి అంజి, నేకూరి కిశోర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, **NATTE ESWARARAQ** (Old Name) S/o **NATTE SRINIVASARAO,** Resident of 1-25, rachanna gudem, jilugumilli, Lankalapalle, West Godavari District - 534456, Andhra Pradesh, India. I have Changed my name as **NATTE ESWAR RAO** (New Name), S/o **NATTE SRINIVASARAO,** Hereafter my name is known as **NATTE ESWAR RAO** (New Name), S/o **NATTE SRINIVASARAO.**

కరాటేలో ప్రతిభ చూపిన బాలికకు సత్కారం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కరాటేలో అంతర్జాతీయ పోటీల్లో రాణించి ప్రతిభ కనబరిచి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న బాలిక దాసరోజు అలేఖ్యను సంక్రాంతి సందర్భంగా గురువారం పలువురు అభినందించారు. కొయ్యలగూడెంలో చింతాలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిన శ్రీనివాస్, మదన గోపాలస్వామి ఆలయ ట్రస్టు ఛైర్మన్ మద్దు గోపాలకృష్ణ, చింతాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు రాచూరి మదన్, జుంగా బాబ్జీ, తదితరులు బాలికను సత్కరించారు. బయ్యనగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం సందర్భంగా బాలికను, ఆమె తండ్రి కరాటే శిక్షకుడు శ్రీధర్‌ను పలువురు అభినందించారు.

తలలు తెగిన తరువులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల నిర్మాణం చెట్ల ప్రాణం మీదకొస్తోంది. కొమ్మలను తొలగించడమో లేక చెట్లకు దూరంగా లైన్లను నిర్మించడానికి బదులు ఎదిగిన చెట్లను విచక్షణారహితంగా తొలగిస్తున్నారు. నీడను ఇచ్చే చెట్లు, పర్యావరణ పరిరక్షణ కోసం రూ.లక్షలు వెచ్చించి రహదారుల పక్కన మొక్కలను నాటి పెంచుతున్న వైనం. ఒకవైపు, విద్యుత్తు లైన్ల కోసం చెట్లను మొదళ్లకు తెగ నరకడం. . మరోవైపు శాఖల మధ్య సమన్వయ లోపం పర్యావరణానికి చేటు తెస్తోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజవరం సమీపంలో విద్యుత్తు లైన్ల కోసం నరికేసిన చెట్లు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. రేపల్లిలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కారం రాఘవ, గోగుల లలిత, కెచ్చెల పద్మ, సర్పంచి కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, స్థానికుల ప్రదర్శన

జూదరుల అరెస్టు

టి.నరసాపురం, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: టి.నరసాపురం, తిరుమలదేవిపేట, బందంచర్ల గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలపై పోలీసులు శుక్రవారం జరిపిన దాడుల్లో ఆరుగురు నిర్వాహకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2850ల నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు. ●ద్వారకాతిరుమల, పి.కన్నాపురం, కప్పలకుంట, తూర్లలక్ష్మీపురం, పంగిడిగూడెం గ్రామాల్లో జూద స్థావరాలపై దాడులు చేసి 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సుధీర్ తెలిపారు. ● జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు జూద స్థావరాలపై బుధ, గురు, శుక్రవారాలు దాడులు నిర్వహించి 24 కేసులు నమోదు చేసి 73 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. ● లక్కవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 కేసులు నమోదు చేసి 21 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

పీపీపీ విధానం రద్దు చేయాలని నిరసన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వైద్యవిద్యలో పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు టి.నరసాపురంలో శుక్రవారం నిరసన తెలిపారు. పార్టీ జిల్లా నాయకుడు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో సుధారాణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక (బహిరంగ ప్రకటన)

ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు ఏలూరు జిల్లా (పూర్వపు ప.గో.జిల్లా) జంగారెడ్డిగూడెం మండలం జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు శ్రీ జయవరపు నాగయ్య గారి కుమారుడు సత్యనారాయణ గారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని ఏలూరు జిల్లా (పూర్వపు ప.గో.జిల్లా), జంగారెడ్డిగూడెం మండలం జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు మరియు ఈయన సోదరుడు అయిన జయవరపు వెంకట భాస్కర కృష్ణమోహన్ గారి వద్ద నుండి ది: 25-08-2018 తేదీ గల రిజిస్టర్డ్ సెటిల్మెంట్ దస్తావేజు, జంగారెడ్డిగూడెం స.రి. ఆఫీసు దస్తావేజు నం: 5350/2018 రీత్యా దఖలు పొంది వారి నుండి అదే రోజున సర్వ హక్కులతో స్వాధీనం పొంది ఉన్నారు. అప్పటినుండి సదరు ఆస్తి మా క్లయింటు యొక్క స్వాధీన హక్కు భుక్తములలో ఉండిఉన్నది. సదరు ఆస్తి నా క్లయింట్ అన్నగారైన జయవరపు మల్లిఖార్జున రావు గారి పర్యవేక్షణలో ఉండి నా క్లయింటు స్వాధీనము కలిగి ఉన్నారు. సదరు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి మా క్లయింటుకు తప్ప మరి ఎవరికి ఏవిధమైన హక్కులు లేవు. మా క్లయింటుకు తెలిసిన సమాచారం ప్రకారం కొంతమంది వ్యక్తులు చట్టవిరుద్ధంగా ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిపై కొన్ని అక్రమ లావాదేవీలు చేయుటకు ప్రయత్నం చేయుచున్నట్లు తెలియవచ్చినది. మా క్లయింటు తప్ప మరి ఎవరైనా ఏ విధమైన లావాదేవీలు జరిపిన మా క్లయింటును ఏ విధముగాను బైండు చేయవు. సదరు లావాదేవీలకు నా క్లయింటు ఎట్టి బాధ్యత వహించరు. కావున భవిష్యత్తు చిక్కులు లేదా వివాదాలను నివారించుటకు ఈ బహిరంగ ప్రకటన జారీ చేయడమయినది.

షెడ్యూలు ఆస్తి వివరము: పూర్వపు ప.గో.జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం S.R.O., జంగారెడ్డిగూడెం స.డి. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ జంగారెడ్డిగూడెం పట్టణం తాలూకు జిరాయితీ మెరక R.S. నం. 108/2 రులో ఉన్న చ.గ. 383.3 లేక చ.మీ. 320.48 ర్లు ఖాళీ స్థలంనకు హద్దులు: **తూర్పు:** అ.53 లు కలిదిండి జగన్నాధరాజు గారి స్థలం., **దక్షిణం:** అ.60 లు బత్తిన అర్జున రావు గారి స్థలం, తాటియాకుల ఇల్లు., **పడమర:** అ. 62 రోడ్డు గ.8 లు వెడల్పున., **ఉత్తరం:** అ.60 లు జ్ఞాన దృష్టి భాస్కర రావు గారి స్థలం కొంత బోడా వెంకట రావు గారి ప్రహరీ గోడ కొంత.

ఈ హద్దులు మధ్య ఉన్న చ.గ. 383.3 ల స్థలం.

Sd/- **P.S.R.K. లక్ష్మణరావు** B.A.B.L.,
Jangareddigudem అడ్వొకేటు, 10-4-101, సుబ్బారెడ్డి కాలనీ,
Date: 16-1-2026 జంగారెడ్డిగూడెం, Mobile No: 9440328779.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. లక్కవరం ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడేనికి చెందిన గాడి వెంకట దుర్గారావు స్థానిక నిమ్మలగూడెం వైపు గురువారం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో నిమ్మలగూడెం సమీపానికి వచ్చేసరికి.. ద్వారకాతిరుమల మండలం రాఘవాపురానికి చెందిన దాకారపు లక్ష్మణరావు ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి దుర్గారావును ఢీకొట్టారు. దీంతో కింద పడిపోయిన ఆయనకు గాయాలవ్వడంతో స్థానికులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వెంకటదుర్గారావు మృతి చెందారు. దీనిపై మృతుడి సోదరుడు మాధవరావు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు తీగలు తెగి పడి చూడి గేదె..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: లక్ష్మడుగూడెంలో శుక్రవారం మధ్యాహ్నం మడకం సోమరాజు అనే పశు పోషకుడికి చెందిన చూడి గేదె ఒక పొలంలో మేత మేస్తుండగా.. ప్రమాదవశాత్తు పై నుంచి విద్యుత్తు తీగలు తెగి పడి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బయ్యనగూడెం పెట్రోలు బంకు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కేతవరం వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం జాతీయ రహదారిపైకి రాగా బయ్యనగూడెం వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొన్నాయి. కేతవరానికి చెందిన జమ్మిశెట్టి దుర్గారావు కాలు విరిగిపోవడంతో పాటు తలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆయన్ను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ మరో వ్యక్తిని ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లారు.

కోడి కత్తి తగిలి వ్యక్తికి..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కంసాలికుంటలో కోడి పందేలు తిలకించేందుకు వచ్చి ప్రమాదవశాత్తు కోడి కత్తి తెగి శేఖర్ అనే వ్యక్తి గురువారం గాయపడ్డారు. ఆయన్ను స్థానికులు చికిత్సకు బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం తరలించారు.

రెండు ఘటనల్లో..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మండలంలో శుక్రవారం వివిధ చోట్ల జరిగిన ఘటనల్లో పలువురు గాయపడ్డారు. మర్లగూడెంలో మంచినీళ్ల ట్యాంకు నుంచి నీటి సరఫరాకు గేట్ వాల్ విప్పుతూ ప్రమాదవశాత్తు పడిపోయి నాగు అనే వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. నందాపురం సమీపాన ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు పడిపోయి ముగ్గురు గాయపడ్డారు. మరో చోట జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లాయిగూడేనికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రులకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడేనికి చెందిన బొబ్బిలి రత్నంరాజు జంగారెడ్డిగూడెం మండలం పుల్లేపూడి అగ్రహారంలో ఉంటున్న మామయ్య ఇంటికి ద్విచక్రవాహనంపై బుధవారం బయలుదేరారు. మైసన్నగూడెం సమీపానికి వచ్చేసరికి.. జంగారెడ్డిగూడెం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న వాసంశెట్టి సంతోశ్‌కుమార్ ఎదురెదురుగా వచ్చి రత్నంరాజును ఢీకొన్నారు. దీంతో రత్నంరాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై క్షతగాత్రుడు రత్నంరాజు మామయ్య కండెల్లి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని శోభనాచలుడి కొండపై ఉన్న దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం పుష్యమాసం బహుళ త్రయోదశి సందర్భంగా పంచామృత, ఫలామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరాహ పుష్కరిణి సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో లలితా సహస్ర నామార్చన, కుంకుమ పూజలను అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనుమ

వడాలిలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతిలో మూడో రోజు శుక్రవారం కనుమను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వడాలి జగన్నాథస్వామి ఆలయాల్లో గోవులకు పూజ చేశారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ గోవులను అలంకరించి పూజలు చేశారు. పలు గ్రామాల్లో పశువుల కొమ్ములకు రంగులు వేసి, మెడలో రంగురంగుల పూసలు, గంటలు కట్టి, పసుపు కుంకుమలతో బొట్లు పెట్టి సంప్రదాయాల ప్రకారం పూజలు చేశారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు

బంధువులతో కళకళలాడిన గ్రామాలు

పెద్దేరు బరి వద్ద ద్విచక్రవాహనాలు

భాజపా నేత కోటప్రోలుకు బైకు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: సంబరాల్లో జబర్దస్త్ నటుడు ముక్కు అవినాష్

నూజివీడు మండలం మీర్జాపురంలో జబర్దస్త్ అప్పారావు తదితరులు

నూజివీడు: పెదజాజారు.. చినజాజారు ఆట ఆడుతున్న యువతీ యువకులు

న్యూస్‌టుడే బృందం: తెలుగువారి పెద్ద పండుగైన సంక్రాంతిని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకున్నారు. హరిదాసు, బసవన్నల విన్యాసాలు.. ఆకతాయిల తీర్చిదిద్దిన రంగవల్లులు, దివ్వెల వెలుగులు, గాలిపటాలు, నోరూరించే పిండి వంటలు, కొత్త అల్లుళ్ల సందడితో సంక్రాంతి కనులపండువగా నిర్వహించుకున్నారు. సంక్రాంతికి ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న, ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న వారంతా సొంత గ్రామాలకు రావడంతో పల్లెలు కళకళలాడాయి. బంధుమిత్రులతో కలిసి సకుటుంబ సపరివార సమేతంగా విందు వంటలతో కలిసి భోజనాలు చేసి సందడి చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కోడి పందేలు, సినీ నటుల సందడి పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోతురెడ్డిపల్లిలో సినీ నటుడు ఉత్తేజ్, నిర్మాత రాంబాబు తదితరులు

కొల్లేరు బరిలో కోడి పందేలు కాసేందుకు గుమిగూడిన పందెంరాయుళ్లు

మీర్జాపురంలో పందేలను వీక్షిస్తున్న సినీ నటుడు శుశాంత్(మాస్క్ పెట్టుకున్న వ్యక్తి)

అమ్మవారిగూడెంలో తలపడుతున్న పందెం కోళ్లు

మండవల్లి: చావలిపాడు బరి వద్ద మాజీ ఎంపీ మాగంటి బాబు

నూజివీడు పందేల వద్ద పూర్వ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

అత్తగారింట విందు.. మహా పసందు..

కొత్త అల్లుడికి 251 రకాల వంటకాలతో భోజనం

కైకలూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు తొలిసారి అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడికి పసందైన వంటకాలను అందించారు అత్తమామలు. కైకలూరుకు చెందిన భాస్కర వెంకటేశ్వరరావు - శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె హనీషాను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మండా జ్ఞానేశ్ శివసాయి వెంకట్‌తో వివాహం జరిగింది. తొలి ఏడాది పండగకు వచ్చిన అల్లుడికి పిండి వంటలతో కలిపి గురువారం 251 రకాల వంటకాలతో విందు భోజనం వడ్డించారు. అంతకు ముందు పాతతరాల జ్ఞాపకాలను గుర్తు చేసేలా కూతురు, అల్లుడిని ఎడ్ల బండిలో ఊరేగింపుగా తీసుకువచ్చి కోలాటం, నృత్యాలతో ఘన స్వాగతం పలికారు.

తెలుగు సంప్రదాయాలు గొప్పవి: జయమంగళ

కైకలూరు, న్యూస్‌టుడే: తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని దొడ్డిపట్ల గ్రామ యువత ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇటీవల గ్రామంలోని మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. భారీగా మహిళలు పాల్గొని సంప్రదాయం ఉట్టి పడేలా అందమైన ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జయమంగళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పంతగాని స్వాతి మొదటి స్థానం సాధించగా రిఫ్రిజిరేటర్, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పి.అరుణదేవి, జొన్నలగడ్డ మణిలకు గ్రైండరు, మిక్సీలు అందించారు.

ప్రథమ స్థానంలో నిలిచిన స్వాతికి రిఫ్రిజిరేటర్ అందిస్తున్న ఎమ్మెల్సీ వెంకటరమణ, గ్రామస్థులు

మండవల్లి, న్యూస్‌టుడే: హిందూ సమాజం ఆధ్వర్యంలో మండవల్లి శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భారీగా మహిళలు పోటీల్లో పాల్గొని అందమైన రంగవల్లులు వేశారు. ఈ సందర్భంగా తొలి మూడు స్థానాలు సాధించిన జడ్డు భాగ్యలక్ష్మి, తోట నాగలక్ష్మి, నల్లమోతు భానుప్రియకు బహుమతులు అందించారు. ఎస్సై రామచంద్రరావు, ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, గుడివాడ మురళి, వై.శ్రీనివాస్ బహుమతులు అందించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి నెలవని, అలాంటి పండగలో ఆహ్లాదకర పోటీలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. దేవపూడిలో మాజీ సర్పంచి దాసరి గోపాలకృష్ణమూర్తి(చిన్నబ్బాయి) జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం 10వ వార్షిక సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు, స్లోసైక్లింగ్ పోటీలు నిర్వహించారు. సుమారు 300 మంది పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు. వారందరికి చీరలు పంపిణీ చేశారు. నిర్వాహకులు దాసరి రమేశ్, సర్పంచి దాసరి కాశీఅన్నపూర్ణాదేవి, విఠల్ దంపతులు, జనసేన నాయకురాలు తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు చీర, దుప్పటి అందిస్తున్న నాయకులు

పేదలకు సేవలందించడం అభినందనీయం

మట్టగుంట(కలిదిండి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఫౌండేషన్లు ఏర్పాటు చేసి పేదలకు సేవలందించడం అభినందనీయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. తిరుమాని ఫౌండేషన్ ఆధ్వర్యాన మట్టగుంటలో శుక్రవారం మహిళలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ తిరుమాని గోపాలకృష్ణ, నరసింహస్వామి, బస్వాని భూపతి మహేశ్ వర్మ, బొమ్మిడి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కార్పం టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

కైకలూరు, న్యూస్‌టుడే: చిత్రీకరణ దశలో ఉన్న తెలుగు చలనచిత్రం కార్పం చిత్ర బృందం మండలంలోని భుజబలపట్నంలో సందడి చేసింది. గురువారం కోడి పందేల బరుల వద్దకు వచ్చిన దర్శకుడు, ఇతర నటులు కొంత సమయం పందేలను వీక్షించారు. ఈ సందర్భంగా చిత్రం టైటిల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అంతర్జాల వేదికగా ఆవిష్కరించారు. రాకేశ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రవీంద్రారెడ్డి, బలగం సంజయ్, భాను, తిరుపతి, షాని, దక్షి, రేఖా నిరోష, మౌనిక డింపుల్, టోనిషా, రాయల హరిచంద్ర ముఖ్య భూమికలను పోషిస్తున్నారు. గ్రామానికి చెందిన పేరిచర్ల వినయ్‌వర్మ దర్శకుడికి స్నేహితుడు కావడంతో ఈ బృందం ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. సినీ నిర్మాత పైడిపాటి శివశంకర్, సంక్రాంతి సంబరాల వేడుక నిర్వాహకులు పాల్గొన్నారు.

'హేతువాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం'

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: యువతలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తూ.. హేతువాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని విశ్రాంత న్యాయమూర్తి అడబాల లక్ష్మి అన్నారు. ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో హేతువాద రచయిత, న్యాయవాది త్రిపురనేని రామస్వామి జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముత్యాల సాంబశివరావు అధ్యక్షత వహించారు. సీనియర్ న్యాయవాది పీపీ శాస్త్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు ఏలూరులో హేతువాద ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందని గుర్తు చేశారు.

అద్దె భవనంలో తపాలా కార్యాలయం

ఆదాయం ఘనం.. వసతులు శూన్యం

ఏళ్లుగా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

మండవల్లి, న్యూస్‌టుడే: నిత్యం ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలు ఏళ్లుగా అద్దె భవనాల్లోనే మగ్గి పోతున్నాయి. అరకొర సౌకర్యాలతో ఇరుకైన గదుల్లో ఉద్యోగులు కాలం వెళ్లదీస్తున్నారు. సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా ఫలితం లేదు. దీంతో సంవత్సరానికి రూ.లక్షల్లో అద్దెలు చెల్లించినా ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్నా సొంత భవనాలు నిర్మించడంలో తాత్సారం చేస్తున్నారు.

30 సంవత్సరాలుగా...

మండవల్లి, ముదినేపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు 30 ఏళ్లుగా అద్దెభవనాల్లోనే మగ్గుతున్నాయి. నేటికీ సరైన వసతులు లేక ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టుపని పది మంది వస్తే కూర్చోవడానికి కుర్చీలు లేవు. రిజిస్ట్రేషన్ల కోసం రెండు పార్టీలకు చెందినవారు ఒకేసారి వస్తే కార్యాలయం కిక్కిరిసిపోతోంది. ఒక్కో కార్యాలయం ఏడాదికి రూ.10 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నా నేటికీ సొంత భవనాలు నిర్మించలేదు. కార్యాలయాలకు ప్రభుత్వం చెల్లించే అద్దె తక్కువగా ఉండటంతో భవనాలను అద్దెకు ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు.

గ్రంథాలయానికి స్థల సమస్య...

మండవల్లి గ్రంథాలయాన్ని 3 దశాబ్దాలుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. 12 సంవత్సరాల క్రితం సొంత భవన నిర్మాణానికి రూ.11 లక్షలు మంజూరైనా స్థల సమస్యతో నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీంతో అద్దె భవనంలోనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు.

ఇరుకు గదుల్లో తపాలా కార్యాలయం

మండవల్లి హెడ్ పోస్టాఫీసు మండలంలోని గ్రామాలతోపాటు, ముదినేపల్లిలోని కొన్ని గ్రామాల ప్రజలకు సేవలందిస్తోంది. సిబ్బంది ఇరుకైన, అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆధార్ కార్డులు, ఇతరత్రా పనులను తపాలా కార్యాలయాలకు అప్పగించడంతో ఖాతాదారులు రోజురోజుకూ పెరుగుతున్నారు.

వైభవంగా.. నమ్మళ్వార్ అధ్యయన ఉత్సవాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని శోభనాచలుడి ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నమ్మళ్వార్ అధ్యయన ఉత్సవం, పరంపరోత్సవాలు శుక్రవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, దివ్య ప్రబంధ పారాయణ, పల్లకి సేవ, తదితర కార్యక్రమాలను పంచాంగం రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు.. వడాలి (ముదినేపల్లి), న్యూస్‌టుడే: గత నెల రోజులుగా వైష్ణవాలయాల్లో నిర్వహిస్తున్న ధనుర్మాస పూజలు గురువారంతో ముగిశాయి. నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో తిరుప్పావై నిర్వహించారు. ముగింపు సందర్భంగా స్వామి వారి, అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చిన్నపూరీగా ప్రసిద్ధి గాంచిన వడాలిలోని సుభద్రా బలరామ సహిత జగన్నాథ స్వామి ఆలయంలో స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని, అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు వారికి నీరాజనాలు పడుతూ స్వామివారిని కనుల పండువగా తిలకించారు. అన్నవరంలోని రాములోరికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఇందులో ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

చనుబండలో గోదాదేవి కల్యాణం.. చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండ కోదండ రామాలయంలో గురువారం గోదాదేవికల్యాణ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. కల్యాణ క్రతువును పూజారులు నిర్వహించగా ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కొండముచ్చుతో వానరాలకు చెక్..!

వాహనంపై కొండముచ్చును తీసుకు వెళ్తున్న రైతు

చాట్రాయి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై కొండముచ్చును తీసుకు వెళుతున్న రైతును చూశారా.. ఇలాంటి దృశ్యాలు చాట్రాయి మండలంలో పొలాల వెంబడి కనిపిస్తుంటాయి. ఇవి లేకుండా రైతులు వ్యవసాయ భూముల్లోకి వెళ్లలేరు. పైరును కాపాడుకోవాలంటే కొండముచ్చుతో వెళ్లక తప్పడం లేదు. రబీ సీజన్‌లో విస్తృతంగా మొక్కజొన్న సాగు చేసిన రైతులకు వానరాల గుంపుతో పంట నష్టాలకు గురవుతోంది. వందల సంఖ్యలో ఇవి మొక్కజొన్న పైరుపై దాడి చేస్తున్నాయి. లేత ఆకును ఆహారంగా తీసుకుంటూ మొక్కలను పీకి వేస్తున్నాయి. మొక్కజొన్న పైరులో రైతు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా క్షణాల్లోనే ఇవి దాడికి దిగుతాయి. కొండముచ్చును చేత బట్టుకుని రైతు పొలం చుట్టూ నిరంతరం తిరగాల్సి వస్తోంది. మొక్కజొన్న పైరును కాపాడుకునేందుకు రైతులు వీటి పెంపకాన్ని చేపట్టారు.

జూనియర్ అసిస్టెంట్‌కు నివాళులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్య చేసుకున్న ఎంవీ సుబ్బారావుకు గురువారం సాయంత్రం అంతిమ వీడ్కోలు పలికారు. పోస్టుమార్టం అనంతరం ముదినేపల్లిలో ఆయన నివాసం వద్ద నుంచి అంతిమ యాత్ర నిర్వహించారు. ముదినేపల్లి, మండవల్లి ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి రాము, ఎంపీడీవోలు వై.రామకృష్ణ, రమణబాబు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు, ఎంపీటీసీ సభ్యుడు జంపాన కోటయ్య, సేవా నాగజగన్‌బాబూరావు తదితరులు నివాళి అర్పించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

దివ్య పూజా బలి నిర్వహిస్తున్న ఫాదర్లు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: లోక రక్షకుడైన ఏసు క్రీస్తు మార్గం, ఆయన బోధనలు అనుసరణీయమని రెవ.ఫాదర్ ప్రశాంత్ తెలిపారు. ఈదర సహాయమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు నాలుగో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్లు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు క్రీస్తు చూపిన ప్రేమను ఇతరులకు పంచాలని సూచించారు. దివ్యపూజా బలిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెవ.ఫాదర్ ఎం.ప్రకాశ్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

'ఉపాధి చట్టాన్ని నీరస పరుస్తున్నారు'

చిత్తపూరులో ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు

చాట్రాయి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ చట్టాన్ని నీరసపరుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భవిష్యత్తులో కూలీలకు ఉపాధి కరవవుతుందని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు విమర్శలు చేశారు. చిత్తపూరులో శుక్రవారం కూలీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మోదీ పాలనలో కార్మిక, రైతు వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటూ కార్పొరేట్ వ్యవసాయానికి మేలు చేసేలా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర నాయకులు డి.హరనాథ్ మాట్లాడుతూ వ్యవసాయానికి రైతుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలను కల్పించాలని కోరారు. నాయకులు చాట్ల బాబూరావు, వేముల బక్కయ్య, కలపాల వెంకటేశ్వరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక్కడ అవస్థల ప్రయాణమే

ధ్వంసమైన సిమెంటు తూరలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రామీణ అంతర్గత రహదార్లే కాదు పట్టణంలోని సిమెంటు రహదార్లపైన ప్రజలకు, వాహనదారులకు అవస్థల ప్రయాణం తప్పడం లేదు. నూజివీడులోని మన వంటిల్లు హోటల్ వెనుక వైపు పలు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అటుగా వెళ్లే సిమెంటు రహదారి మధ్యలో ఓ ఇంటి యజమాని మురుగు పోయేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు తూర పగిలి మూడు నెలలు గడుస్తోంది. అప్పటి నుంచి ఈ రహదారిలో ప్రయాణించే కార్లు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు పాదచారులు పడుతున్న అవస్థలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

కలిదిండి, న్యూస్‌టుడే: యునైటెడ్ పాస్టర్ల అసెంబ్లీ(యూపీఏ) మండల స్థాయి నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక లోడిదలంకలో శుక్రవారం నిర్వహించారు. యూపీఏ మండల ఛైర్మన్‌గా రెవ.పి.ఫిలిప్, గౌరవ అధ్యక్షులుగా కె.గాబ్రియేలు, డి.వేదరత్నం, జి.జోసఫ్, అధ్యక్షుడిగా పి.డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షులుగా బి.విజయ్‌కుమార్, ఎన్.జోసెఫ్, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన యూపీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	అనగనగా ఒక రాజు
సత్యనారాయణ మినీ	రాజాసాబ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	భర్త మహాశయులకు విజ్ఞప్తి
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మన శివశంకరవరప్రసాద్ గారు
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	నారీ నారీ నడుమ మురారి
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	
	మన శివశంకరవరప్రసాద్ గారు
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	రాజాసాబ్
మాగంటి సినిమాస్	భర్త మహాశయులకు విజ్ఞప్తి
శ్రీవెంకటరమణ సినిమాస్	మన శివశంకరవరప్రసాద్ గారు
ముదినేపల్లి: పూర్ణిమ	రాజాసాబ్

కనువిందు చేస్తున్న విదేశీ విహంగాలు

పక్షుల కేంద్రంలో పర్యాటకులు

ఆటపాక(కైకలూరు) న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం సందర్శకుల రాకతో సందడిగా మారింది. సంతానోత్పత్తి కోసం ఇక్కడకు చేరుకున్న విదేశీ విహంగాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన రాష్ట్రంలోని పలు జిల్లాల వాసులే కాకుండా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు.. పక్షులు చేసే విన్యాసాలను చూసి పరవశించిపోతున్నారు. చెట్లు, గ్రిల్స్‌పై ఉన్న పలు రకాల పక్షులను యువతీ యువకులు తమ చరవాణుల్లో బంధించేందుకు ఆసక్తి కనబరిచారు. కృత్రిమ పక్షుల మ్యూజియం ఉన్న పక్షుల జాతుల నమూనాలను సందర్శించి కొల్లేరు సరస్సులో కుటుంబ సభ్యులతో కలిసి బోటు షికారు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి పార్కులో ఉల్లాసంగా ఆడిపాడారు.

పార్కులో ఆటలాడుతున్న చిన్నారులు, సందర్శకులు

కోడిపందేలపై పోలీసుల దాడులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలపై రూరల్ ఎస్.ఐ.లు లక్ష్మణబాబు, జ్యోతిబాసుల ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో దాడులు నిర్వహించారు. రావిచర్ల, మిట్టగూడెం, తుక్కులూరు, మీర్జాపురం, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించి 21 కేసులు నమోదు చేశారు. 88 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.1.20 లక్షల నగదు, 17 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ★ పట్టణంలో నిర్వహించిన కోడి పందేలపై పట్టణ ఎస్.ఐ. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధ, గురు, శుక్రవారాల్లో 15 కేసులు నమోదు చేసి 47 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.12,090, ఏడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తాళం పగలగొట్టి ఇంటిలో చోరీ.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలి శివారు కొలికోడు సమీపంలో నివాసముంటున్న రాజులపాటి వెంకట్రామయ్య ఇంటి తాళం పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనం ఇది. బాధితుడి వివరాల ప్రకారం.. సంక్రాంతి పండగ సందర్భంగా వెంకట్రామయ్య భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లారు. అతను పనికి వెళ్లి తిరిగి గురువారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న రూ.50వేలు, టీవీ అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేశారు. శుక్రవారం క్లూస్ బృంద సభ్యులు సంఘటనా స్థలంలో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు.

(c) eenadu

జన వినోదం

కాకినాడ గ్రామీణ సూర్యారావుపేట వద్ద బీచ్‌లోని శిల్పారామంలో సంబరాలు అంబరా న్నంటాయి. పదపోలాదేవిణి మోహనరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారుల వేషధారణ నృత్యాలతో అల రించారు. నాట్య వేద కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, కోట పద్మావతి బృందం, శ్రీవైష్ణవి నాట్యాలయ బృంద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, సర్పవరం(కరప)

జల విహారం

కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం శుక్రవారం జనసంద్ర మైంది. చొల్లంగి నుంచి సముద్ర మొగ వరకు బోట్లపై జనం విహారం చేశారు. చెక్కల వంతెనలపై పర్యాటకుల సందడి నెలకొంది. స్థాని కులతోపాటు రాష్ట్ర ఇతర ప్రాంతాల వారు సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

కుంతీమాధవం.. శోభాయమానం

పిఠాపురంలోని కుంతీమాధవ, వేణు గోపాలుడి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి గ్రామోత్సవం జరిపారు. అర్చకులు విజయజనా ర్దనాచార్యులు, ఈవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం

కోడీ.. ఎక్కడా తగ్గలే!

విస్తృతంగా బరులు.. భారీ పందేలు

ఈనాడు, రాజమహేంద్రవరం: సంప్రదాయాల పండుగ సంక్రాంతిని ఆసరాగా చేసుకుని ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిం చారు.. రూ.వందల కోట్లు చేతులు మారాయి. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని దాదాపు ప్రతి మండలంలో కనీసం పది చొప్పున బరులు ఏర్పాటుచేశారు. ఈ మూడు రోజుల్లో దాదాపు రూ.500 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా వేస్తు న్నారు. కొవ్వూరు ఫ్లడ్‌లైట్ల వెలుగులో డ్రోన్ కెమెరాల చిత్రీక రణతో ఎల్ఈడీ తెర లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ తరహా ఏర్పా ట్లలో ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి ముందు వరుసలో ఉంది. ఇక్కడ సుమారు 20 ఎకరాల్లో భారీ బరి నిర్వహించారు. పెద్ద ఎత్తున నగదు చేతులు మారింది. 50 మంది వరకు బౌన్సర్లను బందోబస్తుగా నియమిం చగా, నగదు లెక్కింపునకు పదుల సంఖ్యలో మెషిన్లు తీసుకువ చ్చారు. ఆత్రేయపురం మండ లంలోని బొబ్బర్లంక, పేరవరం, లొల్ల, ర్యాలీ, తాటిపూడిలో పోటీలు నిర్వహిం చారు. కొత్తపేట, లొల్లలో అశ్లీల నృత్యాలు సైతం ఏర్పాటుచేయడం గమనార్హం. పందేల మూడు రోజుల పాటు నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగాయి. పోలీసులు ఆటువైపు కన్నెత్తి చూడలేదు.

కరప మండలం పెనుగుదురులో కోడిపందేల నిర్వహణ.. ఎల్ఈడీల ద్వారా ప్రసారం

- ప్రతి బరిలోనూ ఆరు నుంచి 10 వరకు గుండాట బోర్డులు ఏర్పాటుచేశారు. రూ.500కు తక్కువ కాకుండా కాసేలా నిబంధనలు పెట్టారు. గుండాట ఏర్పాటు చేసేందుకు గోపాలపురం, కాకినాడ గ్రామీణంలో రూ.30 లక్షల వరకు చెల్లించి దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ● ప్రతి బరిలోనూ గొలుసు దుకాణాలు ఏర్పాటుచేసి నచ్చిన ధరకు మద్యం విక్రయించారు.
- కాకినాడ గ్రామీణం కరప-పెనుగుదురు సరిహద్దులో నిర్వహించిన కోడిపందేల బరిలో విశాఖ జిల్లాకు చెందిన వర్మ బృందం విజేతగా నిలిచి ఇన్నోవా కారును కైవసం చేసుకుంది. జోగేంద్ర కొండలరావు ఆధ్వర్యంలో 60 కోడిపందేలు నిర్వహించగా అందులో విశాఖ వర్మ, కొండబాబు, యానాం వర్మ, దూడల నాగేంద్ర(గోల్డ్‌మ్యాన్), పెంటపాటి శ్రీను, అవినాష్ వర్మలు 31 పందేలను గెలిచి ఇన్నోవా కారు దక్కించుకున్నారు. - న్యూస్‌టుడే, సర్పవరం (కరప)

హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సంక్రాంతికి హైదరాబాద్ నుంచి వచ్చి పండగ అనంతరం తిరిగి బయలుదేరే ప్రయాణికుల కోసం తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 20 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధి కారులు నిర్ణయించారు. ఈ నెల 19 వరకు హైద రాబాద్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళి కను సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 17, కొవ్వూరు డిపో నుంచి రెండు, నిడదవోలు డిపో నుంచి ఒక ప్రత్యేక బస్సును హైదరాబాద్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వై.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంటే హైద రాబాద్‌కు మరిన్ని ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నం, విజయవాడ తదితర దూరప్రాంతాలకు కూడా రద్దీకి అనుగుణంగా అప్ప టికప్పుడు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

గంగలకుర్రు ప్రభను కౌశికనది దాటిస్తున్న గ్రామస్థులు

ముక్కామల నుంచి తీసుకొస్తూ..

కౌశికా తీరంలో వంతెనపై కిక్కిరిసిన జనం

జగ్గన్న తోట.. రుద్రుల కోట

వేడుకగా ప్రభల తీర్థం

అంబాజీపేట మండలం జగ్గన్న తోట జనసంద్రమైంది. ఏకాదశరుద్రులను ఏక కాలంలో చూసేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఏకాదశరుద్రుల గ్రామాల్లో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం జగ్గన్నతోటలోని తీర్థ స్థలికి తీసుకువచ్చారు. తొలుత ఉదయం 10.30 గంటలకు మొసలపల్లి ప్రభను తీసుకొచ్చారు. అనం తరం ఒక్కొక్కటిగా వివిధ గ్రామాల నుంచి ప్రభలు వచ్చాయి. చివ రిగా గంగలకుర్రు ప్రభ చేరుకుంది. అక్కడ భక్తుల దర్శనం అనంతరం తిరిగి ఒక్కొక్కటి గ్రామాలకు మరలాయి. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు సాయంత్రం వరకు తండోపతండాలుగా జనం తరలివస్తూనే ఉన్నారు. కొబ్బరితోటల్లో ఆధ్యాత్మిక వేడుకను తిలకించేందుకు లక్షలాది మంది రాష్ట్రం నలుమూలల నుంచి కుటుంబ సమేతంగా రావడంతో తీర్థ స్థలి నిండిపోయింది. - న్యూస్‌టుడే, అంబాజీపేట

పొలంలోంచి ప్రభను తీసుకొస్తున్న యువకులు

ఎత్తైన ప్రభల కొలువు

అత్యంత ఎత్తుగా తయారు చేసిన అంబాజీపేట మండలంలోని వాకలగ రువు, తొండవరం ప్రభలు ఆకట్టుకున్నాయి. అంబాజీపేట మండ లంలోని వాకలగరువు నుంచి ఉమాపా ర్వతీ సమేత సోమేశ్వరస్వామి, తొండ వరం నుంచి ఉమా తొండేశ్వరస్వామి, అమలాపురం గ్రామీణ మండలం సాకు ర్రుగున్నేపల్లి నుంచి ఉమాపార్వతీ రామేశ్వరస్వామి ప్రభలను యువకులు భుజాలపై మోసుకుంటూ రావి చెట్టుకూడలికి తీసుకువచ్చారు.

ట్రాఫిక్ చిక్కులు.. జనం ఇబ్బందులు

జగ్గన్నతోటకు లక్షలా దిగా భక్తులు తరలిరావ డంతో మొసలపల్లి, ఇరు సుమండ, ముక్కామల రోడ్లలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. పుల్లేటికుర్రు-ఇరుసు మండ ప్రధాన రహదా ర్లలో సమస్య ఏర్పడింది. ప్రజాప్రతినిధులు, అధికా రులకు సంబంధించిన వాహనాలు తీర్థం జరిగే వంతెన వద్ద నిలుపుదల చేయడంతో చాలా సేపటి వరకు చిక్కుముడి వీడ లేదు. దీంతో భక్తులు ఇబ్బందులు చవిచూశారు. వాకలగరువులో రావిచెట్టు కూడలికి ప్రభలను తీసు కువచ్చే సమయంలోనూ పెద్దఎత్తున వాహనాలు ఆగిపోయాయి.

జగ్గన్నతోట తీర్థస్థలిలో కొలువైన ఏకాదశ రుద్ర ప్రభలు

ఉత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన అశేష జనం (డ్రోన్ చిత్రం)

సీఎం పర్యటనకు పటిష్ఠ భద్రత

భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, ఇన్‌ఛార్జి కలెక్టర్ తదితరులు

కాకినాడ కలెక్ట రేట్, మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ముఖ్య మంత్రి నారా చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం కాకినాడ వస్తున్న సందర్భంగా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందుమాధవ్, సీఎం భద్రతా అధికారులతో కలిసి వాకలపూడిలో సీఎం శంకుస్థాపన చేయనున్న ఏఎం గ్రీన్ అమోనియా ప్లాంటు స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదే శించారు. ఆర్డీవో, ఏఎస్పీ, ఎస్బీ డీఎస్పీ, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ పోర్టులో జెట్టీ విస్తరణ

- రూ.200 కోట్ల వరకు వ్యయమయ్యే అవకాశం
- సరకు రవాణాకు మరింత అనుకూలంగా నిర్మాణాలు

ఈనాడు, కాకినాడ

కాకినాడ డీప్ వాటర్ పోర్టును మరింత విస్తరించనున్నారు. ప్రస్తుతం ఉన్న జెట్టీకి అనుబం ధంగా మరో రెండు చిన్నపాటి ఫింగర్ జెట్టీలను నిర్మిస్తారు. ఇందుకు దాదాపు రూ.200 కోట్ల వరకు వెచ్చించనున్నారు. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం ఈ కొత్త నిర్మాణాల వల్ల సమీప గ్రామా లపై పర్యావరణ ప్రభావిత అంశాలపై ఫిబ్రవరి 6న మారిటైం బోర్డు కార్యా లయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారు. జెట్టీల విస్తరణతో సరకు రవాణాలో మరిన్ని మైలురాళ్లు అధిగ మించడానికి అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి తెలిపారు.

అదనంగా 4 మిలియన్ టన్నుల రవాణా..

కాకినాడ పోర్టులో ప్రస్తుతం ఏడు బెర్తులు ఉండగా 17.5 మిలియన్ టన్నుల సరకు రవాణా చేస్తున్నారు. ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినియం, బాక్సైట్, ఎరువులు ఈ పోర్టు ద్వారా దేశ, విదేశాలకు చేరవేస్తున్నారు. కొత్తగా విస్తరించబోయే జెట్టీ ద్వారా అదనంగా మరో 4 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు అవకాశం ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. పెరుగుతున్న సముద్ర వాణిజ్యం, సాగర గర్భంలో అన్వేషణ, సాగరమాల కింద కేంద్ర ప్రభుత్వం ఓడ రేవు ఆధారిత పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం ఇవ్వ డంతో ఇక్కడ మౌలిక సదుపాయాలకు మరింత అవకాశం కలగనుంది.

కాకినాడ పోర్టులో జెట్టీ విస్తరించనున్న ప్రాంతం

360 మీటర్ల మేర పొడిగించి..

ప్రస్తుత మున్న జెట్టీని 360 మీటర్ల మేర పొడిగి స్తారు. తద్వారా సరకు ఎగుమతి, దిగుమతుల సామర్థ్యం పెరగ నుంది. జెట్టీకి తూర్పు దిశగా 275 మీటర్ల పొడవునా ఫింగర్ జెట్టీ నిర్మించనున్నందున ఎక్కువ నౌకలు ఒకేచోట నిలపొచ్చు. నౌకల దగ్గరకు పైపులు వేయడం, రాకపోకలకు అనువుగా ఉంటుంది. గ్యాస్, చమురు నిల్వల రవాణా, సరఫరాకు ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి. నౌకలు తిరిగి వెళ్లే సమయం, రవాణా ఖర్చులు తగ్గుతాయి. లాజి స్టిక్ హబ్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. సాధారణంగా సము ద్రంలో నిర్మాణాలు చేపట్టేముందు సమీప గ్రామాల్లో పర్యావరణ ప్రభా వంపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తారు. జెట్టీల విస్తరణలో భాగంగా పది కి.మీ. పరిధిలో గ్రామాలపై 2024 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు విశాఖకు చెందిన సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీ లించి నివేదిక ఇచ్చారు. పీఎం-10, పీఎం-2.5 వంటి ధూళి కణాలు పరి మిత స్థాయిలోనే ఉంటాయని.. గాలి, నీరు, శబ్ద కాలుష్యాలకు ఆస్కారం లేవని పేర్కొన్నారు. ఈ నివేదికనే వచ్చే నెల 6న ప్రజాభిప్రా య సేకరణ సభలో వినిపించి, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సౌర ఫలకం.. వారికి ఉచితం

ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఏర్పాటుకు చర్యలు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల ఇళ్లపై ఉచితంగా సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూఫ్‌టాప్ అనువుగా ఉన్న వారి గృహాలకు రెండు కిలో వాట్ల సామర్థ్యంతో సౌరవిద్యుత్తు అందించనున్నారు. జిల్లాలో 19,592 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు వీటి ఏర్పాటుకు ముందుకు రాగా, రూ.235కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఏపీఈపీడీసీఎల్ సంబంధించిన కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట డివి జన్ల వారీగా టెండర్లు పిలవనున్నారు. సంక్రాంతికి ముందే పెద్దాపురంలో గుత్తేదారులు సర్వే మొదలు పెట్టారు. మార్చి నెలాఖరు లోగా గుర్తించిన అన్ని ఇళ్లకు సౌర విద్యుత్తు కనెక్షన్లు వేస్తా మని ఏపీఈపీడీసీ ఎల్ ఎస్ఈ జి. ప్రసాద్ తెలిపారు.

- జిల్లాలో మూడు డివిజన్లలో 6,69,949 గృహఅవసరాల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో ఉచిత విద్యుత్తు పొందుతున్న ఎస్సీలు 48,865 మంది, ఎస్టీలు 4,128 మంది ఉన్నారు. వీరిలో 26 వేల మంది ఇళ్లపై రూఫ్‌టాప్ అను వుగా ఉండగా, 19,592 మంది ముందుకు వచ్చారు.

పెద్దాపురం పట్టణంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఒక ఇంటిపై కొలతలు వేస్తున్న సిబ్బంది

డివిజన్	వినియోగదారులు
పెద్దాపురం	6,468
జగ్గంపేట	7,992
కాకినాడ	5,132

ఇదీ ప్రయోజనం

రెండు కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్యానల్స్ ద్వారా నెలకు 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవు తుంది. ప్రభుత్వం ఈ వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచి తంగా విద్యుత్తు అమలు చేస్తోంది. ఇప్పుడు వీటి ఏర్పాటుతో మరో 40 యూనిట్ల వరకు వినియో గించుకోవచ్చు. వీటిని అమర్చిన ఇంటికి నెలకు రూ.200 చొప్పున విద్యు త్తుశాఖ అద్దె కూడా చెల్లి స్తుంది. కేంద్ర ప్రభుత్వ సూర్యఘర్ పథకం ద్వారా 2 కిలోవాట్లకు రూ.60వేలు రాయితీ ఇస్తోంది. మరో రూ.60వేలు వినియోగదారుడు భరించాల్సి ఉంది. ఇదే పథకంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్తులో వీరు స్మార్ట్‌మీటర్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

వెద సాగుకే మొగ్గు..!

జిల్లాలో ఇప్పటివరకు ఈ రబీ సీజన్‌లోనే అధికం

కాకినాడ నగరగం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ వరి సాగును 1,77,490 ఎకరాల్లో డిసెంబర్ మొదటి వారంలోనే చేపట్టారు. కొన్ని చోట్ల సాగునీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర కారణాలతో నిర్దేశిత ప్రణాళిక అమలు కాలేదు. ఎక్కువ మంది వెద సాగు ఆచ రించడంతో ఆ జాప్యం సర్దుబాబు కానుంది. మొత్తం రబీ సాగులో 1,10,007 ఎకరాల్లో వెదజల్లే విధానాన్నే అమలు చేస్తున్నారు. గతంలో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. గత ఖరీఫ్ సీజన్‌లో 70 వేల ఎకరాల్లోనే చేశారు. అంతకుముందు రబీలో కేవలం 45 వేల ఎకరాల్లో అవలంబిం చారు. ఈ సారి 67 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేస్తున్నారు.

అధికారులు చెప్పే ప్రయోజనాలు ఇవీ..

✤ పంట సమయం కలిసివస్తుంది. ✤ పెట్టుబడులు తగ్గుతాయి. ✤ కూలీల కొరతను అధిగమించవచ్చు. ✤ సాగు నీటి వాడకమూ తగ్గుతుంది. ✤ కలుపు సమస్య తగ్గుతుంది. ✤ ఎకరాకు 12 కేజీల వరి వంగడాలు సరిపోతాయి. ✤ దిగుబడి 10 నుంచి 15 శాతం పెరుగుతుంది.

స్వచ్ఛందంగా ముందుకొచ్చారు..

ఈ దఫా రబీలో వెదజల్లు సాగుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరం. కూలీల కొరత, కూలి రేట్ల పెరుగుదల కూడా ఈ విధానానికి దోహపడింది. వెదజల్లు విధానంపై వ్యవసాయశాఖ తరపున విస్తృత ప్రచారం సాగించాం.

- డా.ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

అట్టుడికిన అల్లిపూడి

- మాటువేసి కత్తులతో రెచ్చిపోయిన వైకాపా శ్రేణులు
- తెదేపా కార్యకర్త మృతి.. ఆసుపత్రిలో మరికొందరు బాధితులు

లాలం బంగారయ్య (పాతచిత్రం)

న్యూస్‌టుడే, తుని, కోటనందూరు, అన్నవరం: తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లి పూడి గ్రామం శుక్రవారం రాత్రి వణికిపోయింది. వైకాపా శ్రేణులు కత్తులతో చేసిన దాడులతో తెదేపా కార్యకర్త మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. తమ పార్టీకి చెందిన యువకుడిపై ఏదో అంశమై తెదేపా నాయకులు వ్యాఖ్యలు చేశారని మనసులో పెట్టుకొని ఈ దారుణకాండకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన ఓ తెదేపా నాయకుడి జన్మదిన వేడుకలకు అదే పార్టీకి చెందిన కొంతమంది వెళ్లి తిరిగివస్తుండగా కత్తులతో మాటువే సిన వైకాపా శ్రేణులు దాడులకు దిగారు. ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న లాలం బంగారయ్య(38)కు లోతైన కత్తిపోట్లు తగి లాయి. తెదేపాకే చెందిన చింతకాయల శ్రీరామ్మూర్తి, రుత్తల దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స అందిస్తున్నారు. ఇదే ఘర్షణలో వైకాపాకు చెందిన ఇద్దరు కార్యకర్తలు కూడా గాయపడ్డారు. స్థానిక వైకాపా నేత చింతకాయల చినబాబు, అతని శ్రేణులు ఈ గొడవకు దిగినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహి స్తున్నారు. మాజీ మంత్రి యనమల, ఎమ్మెల్యే దివ్య ఆదేశాలతో తెదేపా నేతలు హుటాహుటిన తుని ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. బాధితులను సీని యర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు తదితరులు పరామర్శించారు. బంగా రయ్య కుటుంబాన్ని తెదేపా ఆదుకుంటుందని రాజేష్ వెల్లడించారు. ఘటనపై పోలీసులతో మాట్లాడారు.

బాధిత పక్షం నుంచి వివరాలు సేకరిస్తున్న తుని గ్రామీణ సీఐ చెన్నకేశవరావు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఆకాశయానం.. మూడింతలు ప్రియం

కోరుకొండ, న్యూస్‌టుడే

ఆకాశయానం టికెట్ ధర అమాంతం పెరిగింది. సంక్రాంతి పండగ సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణి కుల సంఖ్య భారీగా పెరగ డమే ఇందుకు కారణంగా కని పిస్తోంది. పండగ ప్రారంభ మైన వరుసగా మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంది. తరువాత మరో మూడు రోజులూ ఇదే పరిస్థితి కొనసా గుతుందని విమానాశ్రయవ ర్గాలు అంటున్నాయి.

పండగ వేళ పెరిగిన టికెట్ ధరలు

వచ్చేటప్పుడు... వెళ్లేటప్పుడు

దేశం నలుమూలల నుంచి విమాన సర్వీసులు అందుబాటు లోకి రావడంతో పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరి గింది. పండగకు ముందు 3 రోజులూ ఇక్కడికి చేరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో విమాన సర్వీసులు రద్దీగా వచ్చాయి. తరువాత ఇక్కడ నుంచి వెళ్లేవారి సంఖ్యా అదే స్థాయిలో ఉండడంతో అదే రద్దీ కొనసాగనుంది. పెద్ద సంఖ్యలో రాకపోకలతో సందడిగా మారింది.

అమ్మో ధర..

ఇతర దేశాల నుంచి కనెక్టివిటీతో విమాన సర్వీ సుల ద్వారా ఇక్కడికి చేరుకున్న ప్రయాణికులు టికెట్ ధర తెలుసుకుని అవాక్కవుతున్నారు. ఇంతకు ముందు ఎన్నడూలేని విధంగా ధరల్లో చాలా వ్యత్యాసం ఉందని అంటున్నారు. సాధా రణ రోజుల్లో ప్రయాణంతో పోలిస్తే దాదాపుగా మూడు రెట్లు ధర పెరిగిం దని అంచనా వేసుకుంటున్నారు.

ధరల వివరాలు ఇలా... (సుమారు రూ.వేలల్లో)

ప్రాంతం	సాధారణ రోజుల్లో	ప్రస్తుతం
హైదరాబాద్	4 – 6	12 – 18
దిల్లీ	6 – 8	10 – 16
ముంబయి	6 – 8	8 – 14
బెంగళూరు	5 – 8	8 – 12
చెన్నై	5 – 8	8 – 14
తిరుపతి	4 – 8	6 – 12

రూ.18 వేలు చెల్లించా..

హైదరాబాద్ నుంచి రాజమ హేంద్రవరం రావడానికి రూ. 18 వేలు చెల్లించాల్సి వచ్చింది. మా కుటుంబ సభ్యులందరూ కలిసి వారం రోజులు ముందుగా టికెట్ బుక్ చేసు కున్నాం. మా బంధువులు కొందరు టికెట్లు తీసుకుందా మని ప్రయత్నిస్తే రూ. 14 వేలు, 18 వేలు పలికిందని, రూ. 20 వేలు కూడా దాటిం దని చెప్పారు.

- మార్ని శ్రీనివాసరావు, హైదరాబాద్

భారీగా పెంచేశారు...

సంక్రాంతికి వచ్చేందుకు ముందుగా టికెట్లు బుక్ చేసు కున్నాం. యుఎస్‌కి ట్రిప్‌కు వెళ్లడంతో వచ్చేటప్పుడు హైద రాబాద్ నుంచి రాజమహేంద్ర వరం విమానాశ్రయానికి చేరు కున్నాను. టికెట్టు ధర ఇంతకు ముందు కన్నా మూడు రెట్లు పెరిగింది. సంక్రాంతికి డిమాండ్ ఉండ టంతో టిక్కెట్ల ధర కూడా భారీగానే పెంచేశారు.

- నెక్కంటి వెంకట్, వైజాగ్

(c) eenadu

రత్నగిరిపై ఆధ్యాత్మిక ప్రభ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని ప్రభోత్సవం శుక్రవారం రాత్రి వేడుకగా జరిగింది. సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో గ్రామంలోని చిన్నరావిచెట్టు వద్ద పురాతన రామాలయం వద్దకు తీసుకువచ్చి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుందరంగా తీర్చిదిద్దిన ప్రభపై స్వామి, అమ్మవార్లను ఆసీనులను చేసి గ్రామంలో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కబడ్డీ టోర్నీ విజేత 'గొల్లపాలెం'

తలపడుతున్న సుంకరరేవు, కాకినాడ జట్ల క్రీడాకారులు

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ సుంకర రేవులో రైజింగ్ స్టార్స్ స్పోర్ట్స్ క్లబ్ యువకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ప్రథమ స్థానం గొల్లపాలెం, ద్వితీయ స్థానం పత్తిగొంది, తృతీయ స్థానం సుంకరరేవు జట్టు నిలిచాయి. విజేతలకు బహుమతులను శుక్రవారం అందించారు. కాకినాడ జిల్లా పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి మాధవరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, తాళ్లరేవు జోన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, జట్లు ప్రసాదబాబు, దున్నా సింహాద్రమ్మ, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ నివాసంలో వేడుకలు

కేకు కోస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్

గొల్లప్రోలు: చేబ్రోలులోని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నివాసంలో గురువారం సాయంత్రం భారీ కేకు కోసి వేడుకలు జరిపారు. పవన్‌కల్యాణ్‌కు అంతర్జాతీయ స్థాయిలో టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అవార్డు ద్వారా విశిష్ట గుర్తింపు లభించిన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని భారీ కేకు కోసి అందరికీ పంచారు. నియోజకవర్గంలోని జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 1,574 వంటకాలతో విందు

మామిడికుదురు మండలం ఆదుర్రులో సంక్రాంతి పండక్కి వచ్చిన కొత్త అల్లుడికి 1574 రకాల ఆహార పదార్థాలతో గురువారం విందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విజ్జెపు వెంకటరత్నం, సుశీల దంపతులు గత ఏప్రిల్‌లో తమ కుమార్తె కీర్తిశ్రీని పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయికార్తిక్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్లుడికి వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, శీతలపానీయాలతో విందు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

పాదగయలో దర్శకులకు ఆశీర్వచనమిస్తున్న అర్చకులు

ఆలయాల్లో సినీ దర్శకుల పూజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలోని ప్రముఖ ఆలయాలను సినీ దర్శకులు సందర్శించారు. గురువారం సంక్రాంతి రోజున దర్శకులు మారుతి, బుచ్చిబాబు శ్రీపాద వల్లభ, పాదగయ క్షేత్రం, కుంతీమాధవస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి క్షేత్రాల విశిష్టతను వివరించారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించారు.

వ్యవసాయానికి ప్రాణం నీటి కుంటలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: సాగునీరు దక్క రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతానికి చెందిన రైతు ఎంత శ్రమించినా కరవును జయించలేకపోతున్నారు. దీంతో పంట భూములు సైతం బీడు వారుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఈ ఏడాది నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం కింద పంట కుంటలు(ఫారం పాండ్స్) తవ్వకాలు చేపట్టింది. దీంతో ఈసారి రైతులకు చింత లేకుండా వ్యవసాయాన్ని సాగుచేసుకోవచ్చు. పంట కుంటల వల్ల వరికి ప్రత్యామ్నాయంగా జీడిమామిడి, మామిడి, ఇతర కూరగాయలు పండించవచ్చు. నీరు లభ్యమవ్వడంతో దిగుబడులూ పెరుగుతాయి. కాకినాడ జిల్లాలోని నియోజకవర్గాల్లో పంట కుంటల వివరాలు..

పంట కుంటలు తవ్వుతున్న శ్రామికులు

నియోజకవర్గం	లక్ష్యం	మంజూరు	పని ప్రారంభం	పూర్తయినవి
పిఠాపురం	165	84	65	38
పెద్దాపురం	165	94	63	49
కాకినాడ రూరల్	30	33	10	07
తుని	613	559	319	269
ప్రత్తిపాడు	680	479	141	175
జగ్గంపేట	560	364	164	112

చర్యలు చేపడుతున్నాం

ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట కుంటలు ఏర్పాటు లక్ష్యాలను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. పనులు ఏ విధంగా జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పనులు వేగవంతంగా సాగేలా చేస్తున్నాం. పంట కుంటలతో భూగర్భ జలాలు నిల్వ ఉండి బోరు బావులు నుంచి సైతం నీటి కొరతను తీర్చగలం.

- ఎం. భానుప్రకాష్, ఏపీడీ, ప్రత్తిపాడు

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు **8008621414 & 9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

అలా ఉండి...ఇలా మిగిలి

సార్లంక చిత్రం

అగ్ని ప్రమాదం అనంతరం సార్లంక గ్రామం

పచ్చని గిరుల మధ్య ప్రకృతి సోయగంతో అందంగా కనిపించే సార్లంక గ్రామానికి అగ్నిప్రమాదం విషాదాన్ని నింపింది. దాదాపు పూరిపాకలే ఉండే ఆతండాలో విద్యుతాఘాతంతో రేగిన నిప్పు ఊరంతా బుగ్గి చేసింది. ఈప్రమాదంలో 26 తాటాకిళ్లు దగ్ధమవగా...33 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. కొండల మధ్య అందంగా కనిపించే ఇళ్లు ప్రస్తుతం మొండి గోడలతో కనిపిస్తున్నాయి ఇలా..!

– న్యూస్‌టుడే, రౌతులపూడి

వాలీబాల్ పోటీల విజేతగా మాతవారిపాలెం

తొండంగి: కొత్తపాకలులో సంక్రాంతి సందర్భంగా దివిస్ సంస్థ సహకారంతో సర్పంచి అంగులూరి సుధాకర్, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ఎనిమిది జట్లు సెమీస్‌కు చేరాయి. ఫైనల్ పోటీల్లో కొత్తపాకలు -మాతవారిపాలెం జట్ల మధ్య పోటీ జరిగింది. జట్టు విజేతగా మాతవారిపాలెం నిలిచింది. కొత్తపాకలు జట్టు ద్వితీయ, విశాఖపట్టణం తృతీయ, కాకినాడ నాలుగో స్థానం దక్కించుకున్నాయి. మొదటి బహుమతి రూ.1 లక్ష, షీల్డ్, రెండో బహుమతి రూ.70 వేలు, షీల్డ్, మూడో బహుమతి రూ. 50 వేలు, షీల్డ్, నాలుగో బహుమతి రూ.30 వేలు షీల్డ్ అందించారు. ఈ బహుమతులను తెదేపా సీనియర్ నాయకుడు యనమల రాజేష్, నాసా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సోనీవుడ్, అంబేడ్కర్ యూత్, దివిస్ యాజమాన్యం అందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులు పాల్గొనడం విశేషం.

విజేతలకు బహుమతి ఇస్తున్న రాజేష్, నిర్వాహకులు

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: అయిదు నుంచి పదోతరగతి వరకు పూర్తి చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీలలో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షలకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిఐఆర్‌యుఎంఎఎల్ఎఈడీయు.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మహారాజశ్రీ కాకినాడ 1వ అదనపు సివిల్ జడ్జి వారి కోర్టు (సీనియర్ డివిజన్)

IP 31/2025

మధ్య

Korati Kiran Kumar
S/o Salman Raju
D.No: 70-15-34, NFCL Road,
Suresh Nagar, Kakinada Urban,
Kakinada District ...పిటీషనర్

మరియు

1) Vuta Venakateswara Rao
S/o Apparao, D.No.2-292,
B.Prathipadu (Village), Prathipadu Mandal Kakinada District
2) R.Narayana Reddy
S/o Veerabrahmam, D.No: 4-1-97/1T,
Padmanabha Colony, Peddapuram,
Kakinada District
3) Akula Yesu
S/o Venkataratnam, C/o Maranatha Body Building, Peddapuram,
Kakinada District.
4) Kondru Subhalaxman Raju
S/o Srimannarayana, Yathi Bites Backside, Samalkot, Kakinada District. ..రెస్పాండెంట్లు

కోర్టు నోటీసు

పై పిటీషనర్ IP 31/2025 నెంబరున కోర్టులో తనను ఇన్‌సాల్వెంటుగా ప్రకటించమని డెటార్ పిటీషన్ దాఖలు చేసినారు. ఎవరికైనా అభ్యంతరములున్న ది. 30-1-2026 సం॥ తేదీ ఉదయం 10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు ఉన్నా తెలియజేయగలరు.

జి.ఎస్. ప్రభాకరరావు
కాకినాడ, **బి.కన్నయ్య**, న్యాయవాదులు
తేది. 16-1-2026. కాకినాడ, సెల్: 94417 12729

వద్దన్నా.. వినిపించుకోలేదు

● ప్రభలపై వైకాపా జెండాలు.. నేతలు, నటుల ఫొటోలు

పోలీసులను ప్రశ్నిస్తున్న తేజశ్వి

ప్రభల ఉత్సవంలో వైకాపా జెండాతో ఇలా..

అంబాజీపేట: పరమశివుడి ప్రతిరూపాలుగా కొలిచే సంక్రాంతి ప్రభలకు పార్టీల జెండాలు, రాజకీయ నాయకులు, సినీ నటుల చిత్రాలు వద్దని ముందుగానే సూచించినా కొందరు పట్టించుకోలేదు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలో కొందరు యువకులు వైకాపా జెండాలతో హల్‌చల్ చేశారు. ఎగువ కౌశిక నదిని ప్రభలు దాటే సమయంలో వారు వీటిని ప్రదర్శించారు. ఇంకొందరు అభిమాన నటుల ఫ్లెక్సీలు, బొమ్మలను ప్రభలతో పాటు ఊరేగింపులో ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ప్రభల తీర్థాల్లో ఈ తరహా పోకడలు వద్దని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజశ్వి పొడపాటి పోలీసులకు సూచించారు. ఈ అంశంపై పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజుతో మాట్లాడారు. వైకాపా జెండాల ప్రదర్శనపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

శతాబ్దాల చరిత్ర కొత్తపేట ప్రభల తీర్థం

కొత్తపేట, న్యూస్‌టుడే: కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న ప్రభలతీర్థాలకు శతాబ్దాల చరిత్ర ఉంది.. కోనసీమలో పలుచోట్ల ప్రభల ఉత్సవాలు కనుమ రోజు జరుగుతుండగా ఎప్పటిలానే సంప్రదాయ ప్రకారం సంక్రాంతి రోజున కొత్తపేటలో నిర్వహించారు. పాత, కొత్త రామాలయాలు, బోడిపాలెం తదితర 12 ప్రభలతో ఏకాదశ రుద్ర రూపాలతో కొలువుదీరగా.. వేలాది సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గురువారం కొత్తపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో ప్రజల దర్శనార్థం వివిధ రకాల దేవుని ప్రతిరూపాలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో ఊరేగింపుగా ఏర్పాటు చేశారు. ● కొత్తపేట జూనియర్ కళాశాల మైదానంలో ప్రభల తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి సుమారు నాలుగు గంటల పాటూ నిరంతరంగా నిర్వహించిన బాణాసంచా ప్రదర్శన ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చింది. కాంతులు విరజిల్లుతున్న మల్లెపందిరిలు, మనస్సును ఆకట్టుకునే విధంగా ఈత చెట్టులు, బుసలు కొడుతున్న పాములు, గదలు, మరెన్నో రకాల బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణసంచా కాల్పులను అనేకమంది చరవాణుల్లో బంధించారు.

అబ్బురపరుస్తున్న బాణసంచా

కొత్తపేటలో కొలువుదీరిన ప్రభలు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	157-00
రిటైల్ లైవ్	184-00
డ్రెస్డ్	267-00
స్కిన్‌లెస్	304-00

సత్యదేవుని దర్శించుకున్న హోంమంత్రి

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామిని హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన ఆమెకు ఈవో వి.త్రినాథరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చిత్రపటం, ప్రసాదం మంత్రికి ఈవో అందించారు.

మంత్రికి సత్యదేవుని చిత్రపటం అందిస్తున్న ఈవో

విజేతలకు బుల్లెట్ బండి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ పరిధిలోని గోపులంకలో వేగేశ్న శ్రీనురాజు ఆధ్వర్యంలో కోడి పందేలు జరిగాయి. అందులో వరుసగా ఆరు పందేలను హైదరాబాద్‌కు చెందిన రమణ బృందం గెలుపొందింది. విజేతకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నిర్వాహకుడు వేగేశ్న శ్రీనురాజు చేతుల మీదుగా బుల్లెట్ బండిని శుక్రవారం బహూకరించారు. దడాల అప్పారావు, దొరబాబు, శీలం అంజి పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

బాల్యం గుర్తుకొచ్చింది.. స్నేహం పలకరించింది

అనపర్తి గ్రామీణం: కాలం సంవత్సరాలుగా కరిగిపోవచ్చు.. ఒక్కొక్కరు వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఉండొచ్చు. కానీ వారి మధ్య స్నేహం మాత్రం ఎన్నేళ్లయినా నిత్యనూతనంగా కొనసాగుతూనే ఉంది. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978-79 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు పూర్వ విద్యార్థులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒకే వేదికపై కలిశారు. టీజీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి విద్యార్థుల మధురస్మృతుల పరిమళాలు వెదజల్లాయి. తరగతి గదిలో మొదలైన చెలిమి, కాలం గడిచేకొద్దీ గట్టిపడిందని నిరూపించింది. ఆపాత మధురాలను గుర్తుచేసుకుంటూ కొందరు భావోద్వేగానికి గురవగా.. మరికొందరు అప్పటి సంగతులతో మిత్రుల్లో నవ్వులు పూయించారు. ఆనాటి గురువుల సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. కార్యక్రమంలో డా. తేతలి దశరథ రామారెడ్డి, టి. సుధాకర్, గంగిరెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, సత్తి శ్రీవెంకటరెడ్డి, హోతా శర్మ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సమ్మేళనంలో కలిసిన విద్యార్థులు

20 నుంచి క్షేత్రపాలకుడి కల్యాణం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్ర పాలకుడు పార్వతీనీలకంఠేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈనెల 20న రాత్రి 7గం.లకు అంకురార్పణతో ప్రారంభమవుతుంది. 21న దివ్య కల్యాణం, 22, 23న ప్రత్యేక పూజలు, 24న శ్రీపుష్పోత్సవంతో ముగిస్తారు. 25నుంచి లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలు ప్రారంభమై ఫిబ్రవరి2తో ముగుస్తాయని ఏసీ తెలిపారు.

BUSINESS SERVICES

BUSINESS OFFER

మేముచేయుచున్న బిజినెస్ మీరు వ్యక్తి గతంగా గాని మాతో కలిపి చేయుట ద్వారా మంచి లాభాలను పొందండి. వివరాలకు: 9391717772.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి: శ్రీ సాయిలక్ష్మీ లాడ్జిలో, SVG మార్కెట్, ఆర్.టి.సి. కాంప్లెక్ ఎదురుగా ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY

సంక్రాంతి శుభాకాంక్షలు
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
24-1-2026న (శనివారం) 11 Am to 5 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద ఫోన్: 94929 41177
మరియు
25-1-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ (ICAS చెన్నై Regd.) వారి జ్యోతిష్య, వాస్తు కోర్సులకు ప్రవేశ ఆహ్వానము. ★ అమలాపురం ★ రాజమండ్రి కాకినాడ సెంటర్లలో 1) గీతా విద్యాలయం, అమలాపురం ★ 9492813554, 2) సరస్వతీ ఘాట్, గోదావరి గట్టు, రాజమండ్రి. సెల్: 9966666659. J.శ్రీనివాస్ www.icasindia.org

EENADU for Advertisement Contact: 8008597607

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY

FLATS FOR SALE కాకినాడ సురేష్ నగర్ శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు తూర్పు మరియు పడమర ఫేసింగ్ 2 BHK FLATS అమ్మకానికి కలవు.
Contact 63031 73055 90103 85888

HOUSE FOR SALE

GENERAL

ఖండపల్లి గ్రామంలో కాముట్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం, పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. Cell: 9392122526.

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30కి.మీ. దూరం మురారి గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60సెంట్లు భూమి అమ్మకం. (నో బ్రోకర్స్). 9032988265.

KAKINADA RURAL

1.15ఎకరముల పొలంఅమ్మకం కాకినాడ, కరప మండలం, వేములవాడ రామచంద్రపురం హైవేకు, లేఫుట్‌నకు, ఇళ్లకు అనుకుని గొడౌన్, ఇండస్ట్రీస్‌కు అనువైనది అమ్మకం. నో బ్రోకర్స్. 9399934499.

GENERAL

1.10 Acre N/E Corner Full Tar Road Facing Commercial Land Opp. to N.T. Rajapuram Sachivalayam. 1.8KM from Gandapalli Highway. 8500268603.

PLOT FOR SALE

BHOGAPURAM

Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

EENADU Classifieds

KAKINADA CITY

★★★ కాకినాడదగ్గరలో Plot కొనండి, Plot గెలవండి భారీ సంక్రాంతి ఆఫర్లు గజం కేవలం 9,999/- రూ. నుంచి ప్రారంభం. ✆ 8886663196

కాకినాడకు అతిదగ్గరలో తక్కువ రేట్లకే సైట్లు, బిల్డింగ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు అమ్మబడును. ✆ 77806 73892.

అన్నవరం సెంటు: 11 లక్షలు, మాధవపట్నం సెంటు: 9 లక్షలు, పెద్దాపురం సెంటు: 7 లక్షలు, ఉండూరు ఊరు మధ్య: 4 లక్షలు, బ్యాంక్ లోన్. 9063385043.

KAKINADA RURAL

కాకినాడ బైపాస్‌కు 1కి.మీ.దూరం మాధవపట్నం- రామేశ్వరం కొత్తూరులో 125, 135, 145, 275 చ॥గ॥లు, 40అ॥ల రోడ్లతో టీచర్లు, లాయర్లు, బ్యాంకు ఉద్యోగుల ఇళ్లతో అభివృద్ధి చెందిన లేఅవుట్, ✆ 98481 33799.

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చ॥గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/ వాట్సాప్: 80748 57055.

RK Township వారి రాజమండ్రి వెంచర్లపై సంక్రాంతి Gold ఆఫర్ కలదు. వివరాలకు: బ్రాంచ్ మేనేజర్, Contact Cell: 99490 91197.

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి సమీపం రాజానగరం పంచాయతీ "చక్రద్వారబంధం" రోడ్డు సాయినగర్‌లో 191.5 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 9704193649, 8019227241

GENERAL

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET

COMMERCIAL

4BHK flat with 2 car parking near GAIL office in Rajahmundry. Suitable for corporate Office/ Guest House. Cont: 9347146720

JOBS

WANTED MARKETING MANAGERS/ Asst. Managers, Qualification: Degree, Age: Above 30 Years, Salary: Above 30K. Cont. Cell: 90108 09384.

కాకినాడ, హోటల్-రెస్టారెంట్‌లో బిర్యానీ, సౌత్ ఇండియన్, చైనీస్, టిఫిన్స్ మాస్టర్స్, సప్లయర్స్, హెల్పర్స్ (బాయ్స్ & గర్ల్స్) కావలెను. Contact Cell: 99493 43008.

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-50 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 22, 24, వంకాయలు- 30, 36, 50, బెండకాయలు- 54, పచ్చిమిర్చి- 48, 50, 56, కాకరకాయ- 56, బీర- 50, 56, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 24, క్యారెట్- 44, 46, దొండకాయలు- 50, 54, బంగాళాదుంపలు- 18, 24, ఉల్లి- 25, 33, దోసకాయలు- 36, చిక్కుళ్లు- 20, చేమదుంపలు- 30, 34, బీట్‌రూట్- 26, కీరదోస- 34, బీన్స్‌కాయలు- 60, అల్లం- 70, క్యాప్సికం- 66, బొబ్బర్లు- 24, చిలకడదుంపలు- 44, ఒకటి చొప్పున ఆనపకాయ- 30, 35, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 6, 8, మునగకాడ- 13, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 18, 24.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల పంపిణీ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు కరణంగారితోట వీధిలోని రైస్‌మిల్లులో శుక్రవారం బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 11 నుంచి జరిగిన పోటీల్లో 80 జట్లు పాల్గొన్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పడాల దుర్గాజీ, బహుమతులు అందించిన దాతలు పాల్గొన్నారు. సింగిల్స్ విన్నర్స్‌గా రాయులు, రన్నర్స్‌గా సుబ్బు, డబుల్స్ విన్నర్స్‌గా ప్రసాద్, స్వామి, రన్నర్స్‌గా బుజ్జి, రాయుడు నిలిచారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

స్పందనకు వందనం

దీపాలకు మరమ్మతులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ శ్రీరామ్‌నగర్‌లోని ఓ వీధిలో వీధిదీపం వెలగడం లేదని ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేసి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

ఎత్తు పెంచారు.. సమస్య పరిష్కరించారు

కాకినాడ ఆర్టీసీ డిపో ప్రాంగణంతోపాటు బస్సులు ప్రవేశించే ద్వారం వద్ద పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోంది. దీనిపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి బస్టాండు అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రాంగణంతోపాటు బస్సులు ఔట్, ఇన్ మార్గాల ఎత్తు పెంచారు. బస్టాండు వెనుక వైపు ప్లాట్‌ఫాంల వద్ద కూడా ఎత్తు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

జిమ్నాస్టిక్స్‌లో అదుర్స్

సత్తా చాటుతున్న బాలబాలికలు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు.. కాకినాడకు చెందిన బాలబాలికలు. ఒంటిని వింటిలా మార్చి విన్యాసాలతో అలరిస్తున్నారు. రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌లో సత్తాచాటుతున్నారు. డీఎస్ఏలో కోచ్ సురేష్‌కుమార్ వద్ద సాధన చేస్తున్నారు. గతనెలలో కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పతకాలతో మెరిశారు. ఆ ప్రతిభతో ఈ నెల 18 నుంచి కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తాచాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోజూ నాలుగు గంటల సాధన

నేను 8వ తరగతి చదువుతున్నా. నాన్న లలిత్‌రాజు ప్రైవేటు ఉద్యోగి, అమ్మ అరుంధతి గృహిణి. గత 7 ఏళ్ల నుంచి జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. ప్రతి రోజూ 4గంటల పాటు సాధన చేస్తా. అనేక రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఇటీవల డీఎస్ఏ జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో బార్, ఫ్లోర్, వాల్ట్, పేరలల్ బార్, రింగ్, పామెల్ హార్స్ తదితర కేటగిరీల్లో 4 రజత, 3 కాంస్య పతకాలు సాధించా. జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తాచాటడానికి కృషి చేస్తున్నా. వైద్యుడిగా స్థిరపడాలనేది నా లక్ష్యం. - బి.కార్తికేయ, క్రీడాకారుడు

జాతీయస్థాయి పతకం సాధిస్తా

8వ తరగతి చదువుతున్నా. నాన్న సచిన్‌జైన్ వ్యాపారి, అమ్మ నందిత ప్రైవేట్ టీచర్. గత 3 ఏళ్ల నుంచి జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. రాష్ట్రస్థాయిలో 4 పతకాలు సాధించా. రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఎస్‌జీఎఫ్ పోటీల్లో 3 బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించా. అథ్లెటిక్స్‌లోని రన్నింగ్, ఇతర విభాగాల్లో పాల్గొని జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తాచాటాను. జాతీయస్థాయిలో పతకం సాధించాలనేది నా లక్ష్యం. ఆ దిశగా సాధన చేస్తున్నా. - అన్యజైన్, క్రీడాకారిణి

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నగరంలోని వివేక్‌భవన్‌లో శుక్రవారం సంఘ సమావేశం జరిగింది. కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తగినంత సిబ్బంది లేకపోవడంతె ముగ్గురు చేసే పనిని ఒక్కరి చేత చేయిస్తున్నారని ఆరోపించారు. కాలువల శుభ్రత, పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదని, దీంతో నగరంలో ఎటుచూసినా దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లపై సేకరించిన వ్యర్థాలను తగలబెట్టడం నిత్యకృత్యంగా మారిందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు మంగరాజు రాంబాబు, నూకరాజు, సతీష్, కిరణ్, సత్తిబాబు, మార్కండేయులు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సత్కళావాహినిలో వివేకానంద జయంతి

సూర్యారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ సత్కళావాహినిలో వివేకానంద జయంతి, ఇన్నర్మేషన్ అవార్డ్స్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొని మాట్లాడారు. వివేకానందుని రూపకంలో విశ్రాంత పోస్టుమాస్టర్, కళాకారుడు తురగా సూర్యారావు నటించి ఆకట్టుకున్నారు. దాట్ల మాస్టర్ శ్రీనివాస్, అడ్డంకి రాజా, గోపాల నరసరాజు, పి.సత్యానందం, కేవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు ప్రశంసనీయం

కుట్టుమిషను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బర్రె నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డా. వంశీకృష్ణ అన్నారు. కాకినాడ జగన్నాథపురంలో ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్టీ వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ఎస్ఎస్‌పీఎల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో విస్తృతి స్మృతులు గుర్తుకు తెచ్చుకుంటూ గడిపారు. కుటుంబ, సామాజిక పరిస్థితులపై ముచ్చటించుకున్నారు. 45 మంది పూర్వ విద్యార్థులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. గొల్లప్రోలులోని ఇదే పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదివినవారంతా సంక్రాంతి రోజున కలుసుకున్నారు. ఏటా సంక్రాంతి రోజున కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ● కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలం మూలపేట జడ్పీ పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం అదే పాఠశాలలో నిర్వహించుకున్నారు. నాటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. 30 ఏళ్ల తర్వాత వారందరూ కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు.

మూడు రోజులు.. యథేచ్ఛగా జూదశిబిరాలు

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ ముసుగులో కాకినాడ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో కోడి పందేలు అడ్డూ అదుపు లేకుండా సాగాయి. మూడు రోజులపాటు సామాన్య ప్రజలు తమ జేబును గుల్ల చేసుకున్నారు. గొడారిగుంట-డెరిఫాం సెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, శశికాంత్‌నగర్ బైపాస్ రహదారి, పళ్లంరాజునగర్ ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారంగా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ శిబిరాల వద్ద కొందరు మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. తాగిన మైకంలో కొందరు బస్సులు, కార్లకు అడ్డంగా ఉంటూ నానా హంగామా సృష్టించారు. ఇదిలా ఉంటే.. తూరంగిలోని ఓ బరి వద్ద శుక్రవారం కొందరు వ్యక్తులు మద్యంతో దిగారు. ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకోవడంతో అందులో ఒకరికి చెవి భాగం ఊడి పడింది. మరికొందరికి గాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రి తరలించినట్లు సమాచారం.

కోళ్ల పందేల బరి వద్ద పందెంలో తలపడుతున్న కోళ్లు

శిబిరంలో గుండాట

ఎవరిష్టం వారిది..

కాకినాడ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైతుబజారు ఐదురోడ్ల కూడలి వద్ద ద్విచక్రవాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు లోపల వాహనాలు బజారులోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కూడలి అవతలవైపు నివాసిత గృహాలు ఉండటంతో వెళ్లేందుకు వారూ అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

చెట్టుకో చరిత్ర.. తెలుసుకో సులువుగా

ఔషధ చెట్లు, మొక్కల విశిష్టత, ప్రాధాన్యం తెలుసుకోవాలంటే పుస్తకాలు చదవనక్కర్లేదు. చరవాణితో వృక్షాలకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సరిపోతుంది. కాకినాడ జగన్నాథపురం అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వీటిని ఏర్పాటు చేశారు. వృక్షశాస్త్రం విభాగం అధ్యాపకులు ఈశ్వరి, సుక్షణ, పుష్ప వీటిని రూపొందించారు. గతంలో ప్రాంగణంలో ఉన్న కొన్నింటికి ఏర్పాటు చేశామని, ఇప్పుడు మిగిలిన వాటికీ ఈ సౌకర్యం కల్పించామని ప్రిన్సిపల్ డా. వి.అనంతలక్ష్మి తెలిపారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఉద్యోగుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రాయితీలు విడుదల చేస్తుందని ఏపీఎన్జీజీవో మాజీ నాయకులు ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టిందన్నారు.

కొత్త అల్లుడికి విందు భళా..

తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో పాలూరి వారి ఇంట కొత్త అల్లుడు కోసం 165 రకాల పిండి వంటలు తయారుచేశారు. అత్తమామలు పాలూరి భీమేశ్వరరావు, తిరుమల తనూజ వీటిని తయారు చేసి ప్రత్తిపాడుకు చెందిన అల్లుడు ఉదయ రామకృష్ణ, కుమార్తె సత్య మాధురిలకు శుక్రవారం విందు భోజనం ఏర్పాటు చేశారు. ః తాళ్లరేవుకు చెందిన సామా నరేష్, అన్నపూర్ణ దంపతుల కుమార్తె రోషిణికి భీమవరానికి చెందిన సుమంత్‌కు కొన్ని నెలల క్రితం వివాహమైంది. తొలి సంక్రాంతి సందర్భంగా అత్తింటికి వచ్చిన అల్లుడికి 158 రకాల పిండి వంటలు వడ్డించారు.

- న్యూస్‌టుడే, తాళ్లరేవు

స్లాబురాయిని సరిచేయరూ..

కాకినాడ టూటౌన్ వెనుక వీధిలో ఓ కూడలి వద్ద కాలువపై ఉన్న స్లాబురాయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. గతకొంత కాలంగా ఇదే పరిస్థితి నెలకొని ఉందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ప్రయాణం.. అదుపు తప్పితే ప్రమాదం

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అటు రవాణా శాఖ అధికారులు.. ఇటు ట్రాఫిక్ అధికారులు ఆటోవాలాలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా.. కొందరిలో మాత్రం మార్పు రావడం లేదు. గొడారిగుంట ప్రధాన రహదారిలో ఓ ఆటోలో 15 మందికిపైగా ప్రయాణికులు, లగేజీతో ప్రయాణిస్తున్నారు. వెనుక వైపు ప్రమాదకరంగా వేలాడుతున్నారు. గుంతల్లో పడినప్పుడు జారితే పెను ప్రమాదం తప్పదు. ఇలాంటి ప్రయాణాలపై అధికారులు దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అధ్వాన రహదారితో అవస్థలు

కాకినాడ రామారావుపేటలోని తెలుగుతల్లి కూడలి వద్ద రహదారి అధ్వానంగా ఉంది. గతంలో మంచినీటి పైపు లైను మరమ్మతుల కోసం ఇక్కడ తవ్వారు. తర్వాత తూతూమంత్రంగా పూడ్చి వదిలేశారు. దాంతో అక్కడ రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వాహనదారులు పడిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

తగిలితే.. తప్పదు తంటా..!

కాకినాడ శాంతినగర్ నుంచి భాస్కర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద విద్యుత్తు బాక్సు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. చేతికి అందేలా తక్కువ ఎత్తుతో ఉంది. బాక్సుకు రక్షణగా ఓ వైపు తలుపు లేకపోవడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

సైనికుల త్యాగాలు మరువలేనివి

సర్పవరం(కరప): దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికుల త్యాగాలు మరువలేనివని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో సైనిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అడబాల ట్రస్ట్ ప్రతినిధులు మాజీ సైనికులను సత్కరించారు. రత్నప్రసాద్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణచౌదరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మసీదుసెంటర్: గుర్తుతెలియని వ్యక్తి మృతిపై కాకినాడ మూడో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కాకినాడ, కల్పనాసెంటర్ వద్ద ఆటో స్టాండ్ సమీపంలో సుమారు 45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల వారిని విచారించగా ముందు రాత్రి మద్యం తాగి రిక్షాలో పడుకున్నాడని, అతని వివరాలు తెలియవని చెపారు. ఆ వార్డుసచివాలయ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే గోదాం సమీపంలో మరొకరు..

కాకినాడ సూర్యనారాయణపురం రైల్వే గోదాం సమీపంలో సుమారు 27 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండగా, స్థానికుల సమాచారంతో ఈనెల 12న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై ఆ వార్డు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి ..

మసీదుసెంటర్: జగ్గంపేట మండలం ఇర్రిపాకకి చెందిన బి.లక్ష్మణరావు(58) కిర్లంపూడి పరిధిలో రోడ్డుప్రమాదానికి గురైన ఘటనలో తీవ్రగాయాలు కావడంతో శుక్రవారం జీజీహెచ్‌లో చేర్చారు. అతను చికిత్సపొందుతూ మృతిచెందాడు.

ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్: కాకినాడ గ్రామీణం తూరంగికి చెందిన జి.చిట్టియ్య అనే వ్యక్తి వ్యక్తిగతకారణాలతో ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో అస్వస్థతకు గురవడంతో చికిత్సనిమిత్తం శుక్రవారం జీజీహెచ్‌లో చేర్చారు.

ద్విచక్రవాహనం చోరీ

మసీదుసెంటర్: ద్విచక్రవాహనం చోరీపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కాకినాడ, పోస్టల్‌కాలనీకి చెందిన కె.కామేశ్వరరావు గత నెల 25న స్థానిక రామారావుపేటలోని ఓ చర్చికి వెళ్లారు. కొంత సేపటి తరువాత వచ్చి చూడగా బయట పార్క్ చేసిన వాహనం కనపడలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యానం.. నిర్వహణ అధ్వానం

శిథిలమైన ప్రధాన ద్వారం

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఆకర్షణీయ నగరం కాకినాడలో రూ.లక్షలు ఖర్చు చేసి ఉద్యానాలు అభివృద్ధి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా క్షేత్రస్థాయిలో చర్యలు కానరావడం లేదు. ఆహ్లాదం కోసం ప్రజలు ఉద్యానాల్లో అడుగు పెడితే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కాకినాడ 8వ డివిజన్ పరిధిలోని సాంబమూర్తినగర్ సెవెన్ హిల్స్ ప్రాంతంలో నగరపాలక ఉద్యానం నిర్వహణకు నోచుకోక అధ్వానంగా తయారైంది. ఆవరణ మొత్తం చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో నిండి ఉంది. కూర్చునే సిమెంటు బల్లలు సైతం శిథిలమయ్యాయి. సాయంత్రం పాములు సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చిన్నారులు ఆడుకునేందుకు ఒక్క ఆట పరికరం కూడా లేదు. శిథిలమైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో మరో ఉద్యానానికి స్థలం ఉన్నా ఇంతవరకూ అభివృద్ధి చేయలేదు.

పిచ్చిమొక్కలతో ఇలా..

అందుబాటులోకి తేవాలి

ఈ ప్రాంతంలో ఉద్యానం గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా పడి ఉంది. అభివృద్ధికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఉద్యానాన్ని అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టాలి.

- సెవెన్ హిల్స్ ప్రాంత వాసులు

'నగరపాలకసంస్థ ఎన్నికలపై ముఖ్యమంత్రి స్పందించాలి'

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు కాకినాడ పర్యటనకు వస్తున్న సందర్భంలో నగరపాలకసంస్థ ఎన్నికలపై స్పందించాలని సీపీఎం కాకినాడ నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీగా తొలి దశలోనే ఎంపికైనా లక్ష్యాలు పూర్తిగా నెరవేరలేదన్నారు. టిడ్కో గృహాలను పూర్తిస్థాయిలో నిర్మించి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. కాకినాడ పరిసర 6 గ్రామాలు విలీనం పేరుతో గత 15 ఏళ్లుగా ఎన్నికల లేకుండా ఉండిపోయాయని, వీటన్నింటిపై స్పందించాలని కోరారు.

శబరిగిరీశునికి పడిహారతి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: భోగిగణపతి పీఠంలో శుక్రవారం పీఠం అధిదేవత శబరిమల అయ్యప్ప స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. 18 మెట్లకు పూజలు చేసి జ్యోతుల వెలిగించి పడి హారతితో నీరాజనాలందించారు. శ్రీవారి సేవా సమాజం సభ్యులు అయ్యప్ప భజన గీతాలను ఆలపించారు. భక్తులు పాల్గొన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న త్రిపుర సుందరి కోనేటిలో శివుని విగ్రహం

పిండాల చెరువు.. చూస్తే బేజారు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జిల్లాలోనే ప్రముఖ ఆలయం....ఆపైన ఎదురుగా అందమైన కోనేరు...అందులో అందమైన శివుడి విగ్రహం.. భక్తులు ఆహా అనుకుందామనుకుంటే ప్రస్తుతం అక్కడ పరిస్థితులు అయ్యో అనేలా చేస్తున్నాయి. నగరంలోని సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరంతా చెత్తాచెదారంతోపాటు, మద్యం సీసాలతో నిండిపోయింది. త్రిపుర సుందరి కోనేటిలో నీరంతా దుర్గంధ భరితంగా మారాయి. పిండాల చెరువుగా పిలిచే ఇక్కడ గతంలో రూ.35 లక్షల మున్సిపల్ నిధులతో బాగు చేయించి, లైట్లు, వాకింగ్ ట్రాక్ వంటి వాటిని ఏర్పాటు చేశారు. తర్వాత దీని నిర్వహణను ఇటు దేవాదాయ శాఖ, అటు నగర పాలక సంస్థలు పట్టించుకోకపోవడంతో పుష్కరిణి కాస్తా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చుట్టూ ఉన్న దేవతా విగ్రహాలన్నీ ఎండకు ఎండుతూ వానకు తడుసూ చెత్తలో దర్శనమిస్తున్నాయి. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేటిని పరిశుభ్రం చేయడంతో పాటు, చుట్టూ పడిపోయిన స్తంభాలను సరి చేసి, దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

కాకినాడ గ్రామీణ మండలం వాకలపూడి సమీపంలో ఏఎం గ్రీన్ అమోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా పాల్గొననున్నారు. ప్లాంట్ వద్ద ఏర్పాట్లు, వేదిక, ఇతర కార్యక్రమాలపై శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, అధికారులతో సమీక్షించారు.

- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

వి.ఎల్.పురం: పండగ అనంతరం ఆయా ప్రాంతాలకు బయలుదేరే తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్య స్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను కొనసాగిస్తోంది. ● శని, ఆది వారాల్లో జిల్లా మీదుగా విశాఖపట్నం-విజయవాడ(08567), విజయవాడ-విశాఖపట్నం(08568) జన్‌సాధారణ్(అన్‌రిజర్వ్డ్) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ● ఈ నెల 17, 19న విశాఖపట్నం-చర్లపల్లి(08511), 18, 20న చర్లపల్లి-విశాఖపట్నం(08512) అదనపు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఆగుతాయి. ● ఈ నెల 18న విశాఖపట్నం- చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 18న అనకాపల్లి-చర్లపల్లి(07479), 19న చర్లపల్లి-అనకాపల్లి(07477), అనకాపల్లి-చర్లపల్లి(07478) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 19న చర్లపల్లి-కాకినాడ టౌన్(07480), కాకినాడ టౌన్-చర్లపల్లి(07482) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

CHANGE OF NAME

I, **Venkatesh Sasitula**, S/o Anantha Ramarao, Residence of D.No. 20-11-30, Cinema Road, Majestic Street, Kakinada Urban, Kakinada District, Kakinada, Andhra Pradesh, India, Pin: 533001. I have changed my name from **Venkatesh Sasitula** (Old Name) to **SASIHITHLU VENKATESH** (New Name) as per affidavit dated:13-01-2026. here after all my documents and correspondence will be continued with my new name **SASIHITHLU VENKATESH.**

(c) eenadu

సత్తెమ్మకు డీసీపీ పూజలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు కేజీవీ సరిత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకుడు పెద్ద తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పందేలు.. వాహన కానుకలు

కరప: సంక్రాంతి కోడి పందేల బరుల్లో భారీ కానుకలే ప్రకటించారు. కనుమ రోజున విజేతలకు అందించారు. కొరిపల్లి నిర్వహించిన కోడిపందేల బరి వద్ద కరపకు చెందిన ముద్రగడ రమేష్ టీం ఎన్‌ఫీల్డ్ బైక్ కైవసం చేసుకోగా, కొంగోడులో నిర్వహించిన పందేల్లో మణిరాజు టీం మరో ఎన్‌ఫీల్డ్ బైక్ సొంతం చేసుకుంది. యాళ్ల పండు, బండారు మురళి, నక్కా బాబులు, కోన వీరభద్ర రావు, నక్కా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అందుకుంటున్న ముద్రగడ రమేష్ టీం

యూరియా ఉత్పత్తి చేయండి

సర్పవరం(కరప): కాకినాడ గ్రామీణంలోని ఆప్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. యూరియా ఉత్పత్తితో 3 వేల మందికి ఉపాధి, రైతులకు కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ఏఎం గ్రీన్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి నేడు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రానున్న నేపథ్యంలో సమస్యలపై వినతిపత్రం ఇస్తామన్నారు. సంచీ, సతీష్, రాజు, చిట్టిబాబు, శివ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

సర్పవరం(కరప): దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికుల త్యాగాలు మరువలేనివని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో సైనిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అడబాల ట్రస్ట్ ప్రతినిధులు మాజీ సైనికులను సత్కరించారు. రత్నప్రసాద్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణచౌదరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలు సమాప్తం

గొల్లప్రోలు: గొల్లప్రోలు కరణంగారితోట వీధిలోని రైస్‌మిల్లులో శుక్రవారం బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 11 నుంచి జరిగిన పోటీల్లో 80 జట్లు పాల్గొన్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పడాల దుర్గాజీ, బహుమతులు అందించిన దాతలు పాల్గొన్నారు. సింగిల్స్ విన్నర్‌గా రాయులు, రన్నర్‌గా సుబ్బు, డబుల్స్‌లో ప్రసాద్, స్వామి, రన్నర్స్‌గా బుజ్జి, రాయుడు నిలిచారు.

సంక్రాంతి.. సాంస్కృతిక సందడి

పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, కాకినాడ గ్రామీణం, కరప, పెద్దాపురం, సామర్లకోట పరిధిల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పిఠాపురం కందరాడలో శుక్రవారం కనుమ సందర్భంగా బండి సాయికుమార్ ఇంటివద్ద అరటి ఆకులపై కుటుంబమంతా కలిసి భోజనం చేశారు. ● **గొల్లప్రోలు:** చేబ్రోలులో దేవతామూర్తుల వేషధారణలతో ఎడ్లబళ్లపై సంక్రాంతి రోజున భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎడ్ల బండ్లు, చిన్నారుల కోలాటం గొల్లప్రోలు శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడు దర్శిపూడి సురేష్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారామ స్వామి, వేంకటేశ్వరులను భక్తులు ఊరేగించారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం, కరప, గొల్లప్రోలు, కొత్తపల్లి

● **పెద్దాపురం:** డీవైఎఫ్ఐ, పీసీసీ, పీఎన్ఎం, ఐద్వా, సీఐటీయూ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఆటల పోటీలు విజేతలకు కౌన్సిలర్ అమ్మాజీ, వీర్రాజు, సూర్యనారాయణమూర్తి, తాతారావు, భాస్కరరావు బహుమతులు అందజేశారు. ● **పెద్దాపురం:** శతాబ్ది పార్కు వద్దనున్న సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గొల్లప్రోలు: తాటిపర్తిలోని అపర్ణాదేవి అమ్మవారికి కోర్టు సినిమాలో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి వివరించి, ఆమెకు జ్ఞాపిక అందజేశారు. ● **కొత్తపల్లి:** కొత్తపల్లి మండలంలో సినీ దర్శకుడు సానా బుచ్చిబాబు సందడి చేశారు. ● **సామర్లకోట:** సామర్లకోటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జాన్‌మోజెస్, శ్రీకాంత్, కుమారస్వామి, జార్జిచక్రవర్తి, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో చిన్నారుల కోలాటం

సినీ నటి శ్రీదేవికి రక్ష కడుతున్న ప్రభాకరశాస్త్రి

ఆంక్షల ఊసు లేదు.. పందెం ఆగలేదు

గొల్లప్రోలు: పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 14న ప్రారంభమైన కోడిపందేలు, గుండాట శుక్రవారం రాత్రి వరకు యథేచ్ఛగా సాగాయి. గతం కన్నా అధికంగా కోడిపందేల బరులు ఏర్పాటయ్యాయి. భారీగా నగదు చేతులు మారింది. గొల్లప్రోలులో మూడుచోట్ల కోడిపందేలు, గుండాట నిర్వహించారు. చేబ్రోలు, వన్నెపూడిలో రెండుచోట్ల వర్గాలుగా కోడిపందేలు జరిపారు. దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి, చినజగ్గంపేట, కొడవలిలోనూ అదే తీరు. అధికారులెవరూ కట్టడి చేసే యత్నాలు చేపట్టింది లేదు. ✦ **కొత్తపల్లి:** యు.కొత్తపల్లి మండలంలో జూదాలు యథేచ్ఛగా సాగాయి. ✦ **సర్పవరం(కరప):** కాకినాడ గ్రామీణ మండలం సర్పవరం, తిమ్మాపురం, చీడిగ, అచ్చంపేట, తూరంగి తదితర గ్రామాల్లో కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించారు. బరుల వద్ద గుండాట శిబిరాలతోపాటు మద్యం విక్రయించారు. చికెన్ పకోడి, జాయింట్ బిర్యానీలు విక్రయించారు. ✦ **కరప:** కరప మండలంలో కోడి పందేలను రాజకీయ ఒత్తిళ్లతో పోలీసుశాఖ అరికట్టలేకపోయింది. సుమారు రూ.10 కోట్లు చేతులు మారినట్లు సమాచారం. ✦ **పిఠాపురం:** కందరాడలో పెద్దఎత్తున పందేలు జరిగాయి. థార్ కార్, జీపు, మూడు బుల్లెట్లు విజేతలకు ఇస్తామని ఫ్లెక్సీలు పెట్టారు. భీమవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చినవారు పోటీల్లో తలపడ్డారు. ✦ **పెద్దాపురం:** పెద్దాపురం పట్టణం, మండలంలోని పులిమేరు, గోరింట, గుడివాడ, ఆర్బీ పట్నం, కాండ్రకోట, దివిలి, ఆర్బీకొత్తూరు, జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో కోడి పందేలు, గుండాట నిర్వహించారు. ✦ **కాజులూరు:** కాజులూరు మండలంలో కోడి పందాలు గుండాటలు జోరుగా సాగాయి.

గొల్లప్రోలులో..

పిఠాపురంలో పందెం బరి

కాకినాడ గ్రామీణం వాకలపూడిలో గుండాట

యువకుల రక్తదానం

తాళ్లరేవు: రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల ప్రాణాలను రక్తదానంతో కాపాడవచ్చని తాళ్లరేవు జస్టిస్ సభ్యుడు డొమ్మేటి సామ్యూల్ సాగర్ పేర్కొన్నారు. నీలపల్లిలో చర్చి ఫాదర్ పంపన దావీదు జ్ఞాపకార్థం ఆయన కుమారులు శ్యాం ప్రసాద్, ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 80 మంది రక్తదానం చేశారు.

గ్రామాభివృద్ధికి శ్రీకారం

పెదపూడి: గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా తోడ్పడాలని కరకుదురు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. గురువారం గ్రామ పెద్దలు, ప్రజలతో తొలి సమావేశం నిర్వహించారు. ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారితో అసోసియేషన్ ఏర్పాటు చేయడమైందన్నారు. సభ్యులు సవరపు ఆనంద్, యండ్ర వీర్రాజుచౌదరి, చిక్కాల రమేష్, జెజ్జబరపు అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి దారి.. నిధులు ఏరికోరి..!

గ్రామీణ రహదారులు మెరుగుపడనున్నాయి. గత వైకాపా పాలనలో ఛిద్రమైన వాటిని బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లెపండగ పేరుతో సందుల్లోనూ సైతం సీసీ రోడ్లు నిర్మించారు. అదే తరహాలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో గ్రామీణ పంచాయతీరాజ్ రహదారులకు నిధులు కేటాయించారు. ఉపాధి హామీ పథకంలో రూ.22 కోట్లు, సాస్కీలో రూ.90 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి.

- న్యూస్‌టుడే, పిఠాపురం

● పిఠాపురం నియోజకవర్గంలో 52 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో వేల కిలోమీటర్ల వీధులు, రోడ్లు, పుంతరోడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ఒక్క రోడ్డును కూడా మెరుగుపరచలేదు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏ వీధినీ బాగు చేయలేదు. మరోపక్క అప్పట్లో 'ఇంటింటికీ వైకాపా' పేరుతో గ్రామానికి రూ.20 లక్షలు కేటాయించారు తప్పితే పనులు పూర్తి చేయలేదు. దాంతో ఏ గ్రామంలో చూసినా రోడ్లు ఛిద్రమై, గతుకులమయంగా మారాయి. ప్రజలు రోడ్లు వేయించాలని ఫిర్యాదులు చేసి అలసిపోయారు. నిరసన తెలిపినా స్పందించకపోవడంతో చేసేదిలేక మిన్నకుండిపోయారు. రాష్ట్రంలో ప్రస్తుత కూటమి సర్కారు వచ్చి 18 నెలలు గడుస్తోంది. నిత్యం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేస్తూ వస్తోంది. గతేడాది పల్లెపండగ పేరుతో ప్రభుత్వ పెద్దలు రూ.కోట్లు వెచ్చించారు.

పి.దొంతమూరు చెరువు గట్టు పుంత రోడ్డు

ఇప్పుడు తాజాగా ఉపాధి హామీ, సాస్కీ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యాయి. ఈ పనులు మొదలు పెట్టేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా శంకుస్థాపనలు పూర్తి చేశారు. పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిధులు గతం కంటే ఎక్కువగా నియోజకవర్గ అభివృద్ధికి పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదలయ్యాయన్నారు. దశల వారీగా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

	ఉపాధి హామీ ద్వారా (రూ.కోట్లలో) ఇలా..		సాస్కీ ద్వారా (రూ.కోట్లలో)..	
మండలం	పనులు	నిధులు	పనులు	నిధులు
పిఠాపురం	62	7.50	23	34.08
గొల్లప్రోలు	95	6.69	20	32.93
కొత్తపల్లి	122	8.01	23	25.33

స్థలం కాపాడాలని వినతి

తాళ్లరేవు: సీతారామపురంలో రామాలయం స్థలాన్ని ఆక్రమించుకుని అనధికారికంగా విక్రయిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకుడు ఈశ్వరరావు, పల్లు రాజబాబు డిమాండ్ చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో గురు, శుక్రవారాలు పూజలు జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భాస్కరరామారావుకు నివాళి

పెదపూడి: మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కర రామారావు జయంతిని పెద్దాడ గ్రామంలో గురువారం నిర్వహించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేక్ కోశారు. గంగాధర, గణేష్, వీరవెంకట సత్యనారాయణ, శ్రీను, సత్యనారాయణ తదితరులు నివాళి అర్పించారు.

ట్యాంకు శుభ్రం చేసేనా..?

యండమూరు శివారు వడ్డిపాలెంలో మంచి నీటి ట్యాంకును సరిగా శుభ్రం చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. 15 రోజులకోసారి శుభ్రపరచడంతో పాటు వివరాలు నమోదు చేయాల్సిఉండగా ఎప్పుడో ఓసారి చేస్తున్నారని అంటున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడగ్గా ట్యాంకుల వద్ద వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- న్యూస్‌టుడే, కరప

గొయ్యి.. స్తంభంతో యాతన

గొల్లప్రోలు పెదవీధిలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత, పక్కనే ఇనుప విద్యుత్తు స్తంభం ఉన్నాయి. దీంతో రాత్రిపూట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న గుంతను పూడ్చి, ఇనుప విద్యుత్తు స్తంభాన్ని తొలగించి పక్కన సిమెంటు స్తంభం ఏర్పాటు చేయాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ప్రమాదకరంగా వంతెన

గొల్లప్రోలు శివారు సూరంపేట మార్గంలో కాలువపై ఉన్న వంతెన రెండువైపులా రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉంది. ఈవంతెన పైనుంచే సూరంపేట ప్రజలు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. వంతెనను పరిశీలించి ప్రతిపాదనలు రూపొందిస్తామని ఏఈ అలీషా తెలిపారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అయ్యో.. కాలువ బాలేదు

పెద్దాపురంలోని చానల్ వీధిలో ప్రధాన కాలువ ఛిద్రమైంది. రక్షణ గోడలు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉందని అక్కడి వారు వాపోతున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, ఏమాత్రం పక్కకు వెళ్లినా పడిపోయే పరిస్థితి ఉంది. ఈ సమస్య గురించి అడగ్గా కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

పాదగయ ఆలయం వద్ద ట్రాఫిక్

పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద ఆర్.టి.శాఖ రహదారి నిత్యం రద్దీగా మారుతోంది. ప్రయాణికుల రాకపోకలు, వాహనాలు పార్కింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. దీంతో ఆలయం దాటి ఇటు పిఠాపురం, అటు సామర్లకోట వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. దీనిపై అడగ్గా సీఐ శ్రీనివాస్ పోలీసులు నిత్యం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం

మహిళలకు చీరల పంపిణీ

తాళ్లరేవు: పి.మల్లవరం పత్తిగొందికి చెందిన మాజీ సర్పంచి కుడుపూడి శివన్నారాయణ చీరలు పంపిణీ చేశారు. పి.మల్లవరం, పత్తిగొంది, జార్జిపేట, చొల్లంగి, తాళ్లరేవు గ్రామాలకు చెందిన 700 మంది మహిళలకు రూ.2లక్షల విలువైన చీరలను అందజేశారు. వారికి విందు భోజనం ఏర్పాటు చేశారు. నీలపల్లి సర్పంచి చిట్టూరి నాగమణి, కుడుపూడి శ్రీనివాస్, చిట్టూరి కలికిమూర్తి, కాట్నం సత్తిబాబు, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ✦ **తాళ్లరేవు:** ఇంజరం పంచాయతీలో సర్పంచి ముద్దన వెంకట శివ రామ ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాలు, సామగ్రిని శుక్రవారం అందించారు. తాళ్లరేవు, జి.వేమవరం, పోలేకుర్రు, కోరింగ పంచాయతీల్లోనూ పంచారు. ✦ **కాజులూరు:** అయితపూడిలో వెంకన్న ఫౌండేషన్ అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో 500 మంది వృద్ధులకు చీరలు, వస్త్రాలు, దుప్పట్లు, పిండి వంటలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో శివన్నారాయణ తదితరులు

పూర్వ విద్యార్థుల సందడి

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ఎస్ఎస్‌పీఎల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో చిన్ననాటి స్మృతులు గుర్తుకు తెచ్చుకుంటూగడిపారు. కుటుంబ, సామాజిక పరిస్థితులపై ముచ్చటించుకున్నారు. 45 మంది పూర్వ విద్యార్థులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. గొల్లప్రోలులోని ఇదే పాఠశాలలో 1985-86లలో పదో తరగతి చదివినవారంతా సంక్రాంతి రోజున కలుసుకున్నారు. ఏటా సంక్రాంతి రోజున కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ● **కొత్తపల్లి:** యు.కొత్తపల్లి మండలం మూలపేట జడ్పీ పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం అదే పాఠశాలలో నిర్వహించుకున్నారు. నాటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. 30 ఏళ్ల తర్వాత వారందరూ కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు.

మూలపేట పాఠశాలలో సందడి

గొల్లప్రోలులో ముచ్చటించుకుంటున్న 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు

విందు భళా..

తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో పాలూరి వారి ఇంటా కొత్త అల్లుడు కోసం 165 రకాల పిండి వంటలను తయారుచేశారు. అత్తమామలు పాలూరి భీమేశ్వరరావు, తిరుమల తనూజ వీటిని తయారు చేసి పత్తిపాడుకు చెందిన అల్లుడు ఆకుల రామకృష్ణ, కుమార్తె సత్య మాధురిలకు శుక్రవారం వివిధ రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ● తాళ్లరేవుకు చెందిన సామా నరేష్, అన్నపూర్ణ దంపతుల కుమార్తె రోషిణికి భీమవరంనకు చెందిన సుమంత్‌కు కొన్ని నెలల క్రితం వివాహమైంది. తొలి సంక్రాంతి సందర్భంగా అత్తింటికి వచ్చిన అల్లుడికి 158 రకాల పిండి వంటలు వడ్డించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా ఆనందంగా గడిపారు. సామా ప్రకాష్, లావణ్య, సామా సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తాళ్లరేవు

బాల్య వివాహాలపై అవగాహన

పెద్దాపురం: పెద్దాపురం జామియా మసీదులో శుక్రవారం ముస్లిం సోదరులకు బాల్య వివాహాలతో అనర్థాలపై పారాలీగల్ వలంటీర్లు అవగాహన కల్పించారు. అప్పలకొండ, లక్ష్మి, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పండగ

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయంలో పశువుల పండగ కార్యక్రమం ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం కనుమ వేడుకల్లో ఛైర్మన్ జగదీష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

తాళ్లరేవు: సార్లంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 30 గృహాలు కాలిపోయాయి. స్నేహశీలి ఛారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు యేసుదాస్, ఛైర్మన్ డాక్టర్ రంజిత్ ఓఫిర్ న్యాయకత్వంలో బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 ఫోన్ చేయండి: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: గొల్లప్రోలు కరణంగారి తోటలో వ్యర్థాలతో కాలువ పూడుకుపోయి మురుగు నీరు ప్రవహించడం లేదు. - స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్‌కు చెప్పగా సిబ్బందితో చెత్త ఎత్తించారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురం సీతయ్యగారి తోటలో పైపులైన్లు దెబ్బతిన్నాయి. నీరు వృథాగా పోతోంది. - రాజేష్

పరిష్కారం: పర్యవేక్షణాధికారి జనార్దన్‌కు చెప్పగా లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపట్టారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: కస్పాపేటలోని కాలువల్లో చెత్త పేరుకుని దుర్వాసన వస్తోంది. చర్యలు తీసుకోవాలి. - ప్రసాద్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కరప ప్రధాన సెంటర్‌లో ఆటోలు నిలిపి ఉంచడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం. - వీర్రాజు

పరిష్కారం: ఎస్సై సునీతను అడగ్గా ఆటోలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, కరప

రహదారులా.. పశువుల పాకలా..!

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నడి రోడ్లపై మూగజీవాలు తిష్టవేస్తున్నాయి. అవి నిత్యం ప్రధాన మార్గాల్లోనే ఉంటుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు, కూడళ్లలో పశువులు, కుక్కలు, కోతుల గుంపులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాల కారణంగా పలువురు క్షతగాత్రులవుతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంటలకొద్దీ కదలకుండా..

గొల్లప్రోలు ప్రధాన రహదారిపై బస్టాండు, రాయవరం రోడ్డు, సొసైటీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఎటుచూసినా పశువులు కనిపిస్తున్నాయి. పిఠాపురంలోని ఆర్టీసీ బస్టాండ్, కోటగుమ్మం కూడలి, ఉప్పాడ బస్టాండు ప్రాంతాల్లో రోడ్డుపైనే ఉంటున్నాయి. దాంతో వాహన చోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రాత్రిళ్లు రహదారులా.. పశువుల పాకలా అన్నట్లు పరిస్థితి ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలోంచి పశువులు కదలకపోవడంతో భారీ వాహనాలు కాసేపు నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. యజమానులు తెలియక ఆయా పశువులను ఎవరికి అప్పగించాలోననే అయోమయస్థితిలో అధికారులు సతమతమవుతున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కల సమస్య రోజురోజుకూ అధికమవుతోంది. కోతులు గుంపులుగా ఆవాస ప్రాంతాలకు వస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాహనదారులను వెంట పడి తరుముతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గొల్లప్రోలులో రోడ్డుపక్కన ఉన్న కార్యాలయాలు, గృహాల్లోకి తరచూ పశువులు ప్రవేశిస్తున్నాయి. కార్యాలయాల్లోకి రాకుండా తాళ్లు వంటివాటిని కట్టి ఏర్పాట్లు చేస్తున్నారు. ✦ జూన్‌లో పిఠాపురం శివారు బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని పశువు ఢీకొనడంతో గొల్లప్రోలులోని మాధురి విద్యాలయ ప్రిన్సిపల్ మమత మృతిచెందారు. అయిదు నెలల క్రితం గొల్లప్రోలు శివారు బైపాస్ రోడ్డులో వెళుతున్న మోటారు సైకిల్‌కు గేదె తగలడంతో కిరాణా వ్యాపారి మృతిచెందగా, అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొస్తున్న పశువులు వాహనదారులను ఢీకొడుతుండడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారులు, కూడళ్లలో పశువుల సంచారం లేకుండా చర్యలు చేపట్టి ప్రమాదాలు అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ఆ మేరకు చర్యలు చేపడతామని నగర పంచాయతీ పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు.

రహదారిపైనే పశువు ఉండడంతో నిలిచిన ఆర్టీసీ బస్సు

ఘర్షణలో చాకుతో దాడి

సామర్లకోట గ్రామీణం: సర్పవరానికి చెందిన బొండాడ అరుణ్‌ప్రకాష్, అదే గ్రామానికి చెందిన దొరపూడి అరుణ్‌సాయి, తనుష్‌సాయి, అనుబొను సత్తిబాబు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనసపాడులోని మద్యం దుకాణం వద్ద గురువారం ఘర్షణ పడ్డారు. ఆ క్రమంలో చాకుతో జరిగిన దాడిలో అరుణ్‌ప్రకాష్ గాయపడగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మందిపై కేసులు నమోదు

గొల్లప్రోలు: గొల్లప్రోలు, తాటిపర్తి, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లో కోడి పందేలు, గుండాట, పేకాట శిబిరాలపై గురువారం దాడులు నిర్వహించి జూదం ఆడుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. రూ.9,130 నగదు, నాలుగు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనపరుచుకున్నట్లు చెప్పారు.

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

జగ్గంపేటలో రావులమ్మ జాతరలో వేషదారణలు

రావులమ్మతల్లి జాతర మహోత్సవం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన జగ్గంపేట గ్రామదేవత శ్రీరావులమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. జాతరను పురస్కరించుకుని బాణసంచా, విద్యుత్తు దీపాలంకరణ, వేషదారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లోవలో ఘనంగా గోపూజోత్సవం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగా గోపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారి విశేషపూజలు చేసిన అర్చకులు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కనుమ విశిష్టతను భక్తులకు వివరించారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గోపూజ చేస్తున్న ఆలయ అర్చకులు

సత్వర సేవలకు సత్కారం

రౌతులపూడి, న్యూస్‌టుడే: సార్లంకలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అధికార యంత్రాంగం చేపట్టిన సహాయక చర్యలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. ప్రమాద సమయంలో ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి తండాకు చేరుకొని సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఎస్వీనరేష్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ బాధితులందరినీ శిబిరానికి తరలించారు. వీరి చర్యలను ప్రశంసిస్తూ ఎమ్మెల్యే వారిని సత్కరించారు. కత్తిపూడి సత్రం ఛైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, వీఆర్వో శ్రీరాములు, ఆంధ్రా మినరల్స్ ప్రతినిధులకు ఆమె అభినందించారు. సార్లంక తండాలో జరిగిన ప్రమాదంలో 33 కుటుంబాలు నిరాశ్రయిలయన విషయం తెలిసిందే.

ఎస్సై వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తెదేపా నాయకులు

నిత్యావసరాల అందజేత

సార్లంక గ్రామంలోని ప్రజలకు ఆంధ్రా సంస్థ, రెడ్‌క్రాస్ సంస్థలు వారం రోజులకు సరిపడా నిత్యావసరాలు, వంట సామగ్రి వంటి సమకూర్చిన కిట్లను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బాధితులకు గురువారం అందించారు.

ఎవరిష్టం వారిది.. సిబ్బంది తీరిది

• సచివాలయాల్లో సమయానికి సేవలందక ప్రజలకు ఇబ్బందులు

గండేపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాలు ఇలా ఏ వివరాలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాలకే వెళ్తారు. తీరా అక్కడికి వెళ్లి చూసేసరికి సిబ్బంది సమయానికి రాకపోవడం.. కార్యాలయాల్లో లేకపోవడం వంటి కారణాలతో గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. సింగరంపాలెం, సూరంపాలెం, యల్లమిల్లి, యర్రంపాలెం, మల్లేపల్లి, తాళ్లూరు, బొర్రంపాలెం తదితర గ్రామాల్లో మధ్యాహ్నమైతే సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని.. అతి తక్కువ మంది మాత్రమే బాధ్యతగా విధులకు వస్తున్నారని గ్రామస్థులు, అర్జీదారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు:

మండలం	పంచాయతీలు	సచివాలయాలు
గండేపల్లి	18	18
జగ్గంపేట	24	16
కిర్లంపూడి	19	26

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి..

గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది ఎప్పుడంటే అప్పుడు రావడం, అందుబాటులో ఉండకపోవడం వంటి సమస్యలు తలెత్తేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులను ఒక చోట నుంచి మరోచోటికి బదిలీ చేసింది. నేటికి కొంత మంది తీరుమారకపోవడంతో ముఖ ఆధారిత హాజరు తప్పని సరి చేసింది. ఈనెల 1వ తేదీ నుంచి ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసింది. దీని ద్వారా చరవాణిలో ఉన్న యాప్‌లో ఉదయం 9.30 నుంచి 11గంటల్లోపు, సాయంత్రం 5నుంచి 5.30గంటల మధ్య నమోదు చేయేచ్చు. సచివాలయాలకు 250మీటర్ల దూరంలో ఉంటేనే యాప్ తెరుచుకుంటోంది.

ఉప్పలపాడు సచివాలయంలో పూర్తిస్థాయి సిబ్బంది లేని వైనం

మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చెయ్యాలి

యాప్‌లో అటెండెన్స్ వెయ్యకపోతే సీఎల్ (క్యాజువల్ లీవ్) ఏడాదిలో 15 రోజులు పోతాయి. అప్పటికీ మార్పు రాకపోతే ఈఎల్ (ఎరన్ లీవ్) ఏడాదిలో 10 రోజులు పోతాయి. బయటికి ఎక్కడికి వెళ్లినా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చెయ్యాలి.

- శిరీష మండలగ్రామ వార్డు సచివాలయ అధికారి గండేపల్లి

ముందుకు కదలని వాహనాలు

తుని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్ నుంచి డీమార్ట్‌కు వెళ్లే మార్గంలో శుక్రవారం ట్రాఫిక్ నిలిచింది. స్థానికంగానే రెండు కార్యక్రమాలు ఉండటంతో చూడడానికి వచ్చిన వారు రోడ్డుపైనే తమ వాహనాలు నిలిపివేశారు. దీంతో అటు జగన్నాథగిరి, ఇటు జాతీయ రహదారి వైపునకు వెళ్లేందుకు అవకాశం లేకపోయింది.

అండర్‌పాస్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

కిక్కిరిసిన తీరం

తొండంగి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ చివర రోజు కావడంతో శుక్రవారం దానవాయిపేట సముద్ర తీరం సందర్శకులతో కిక్కిరిసింది. జనం పెద్ద ఎత్తున తరలివచ్చి స్నానాలు చేస్తూ సందడి చేశారు. తీరమంతా పండగ వాతావరణం నెలకొంది.

అలరించిన ఆటలు

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, కోటనందూరు, రౌతులపుడి, తొండంగి, న్యూస్‌టుడే: మల్లిసాలలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడాపోటీలు నిర్వహించారు. ● కిర్లంపూడి మండలంలోని గోనేడ, కృష్ణవరం, చిల్లంగి తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మార్కెట్‌కమిటీ డైరెక్టరు బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జ్యోతుల మణి బహుమతులు అందజేశారు. ● కె.కొట్టాంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అధిక సంఖ్యలో యువకులు పాల్గొని వేడుకను మరింత ఉల్లాసంగా మార్చారు. ● రౌతులపూడి, ములగపూడి, ఎన్.ఎన్.పట్నం, ఎస్.పైడిపాల తదితర గ్రామాల్లో పలు పోటీలను నిర్వహించారు. ● కేపీపురంలో చిన్నారులకు లెమన్ స్పూన్, జానపద నృత్యాలు, భరత నాట్యం, కుర్చీలాట తదితర ఆటలు నిర్వహించారు.

మల్లిసాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎన్.ఎన్.పట్నంలో మేముసైతం సేవా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ సందడి

రౌతులపూడిలో బ్యాడ్మింటన్ క్రీడాకారులతో నాయకులు

కేపీపురంలో లెమన్ స్పూన్ ఆటలో పాల్గొన్న చిన్నారులు

తొండంగిలో ఆకట్టుకున్న నాటకం

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగి గాంధీ సెంటర్‌లో గురువారం రాత్రి రామలింగేశ్వర నాట్య మండలితో సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కళాకారులు పౌరాణిక నాటకాల గొప్పతనం వివరించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గ్రామస్థులు నాటకాన్ని తిలకించారు. హరిశ్చంద్రుడుగా కోటి నారాయణరావు, విశ్వామిత్రుడిగా సీహెచ్ నరసింహ, చంద్రమతిగా కె.అశ్విని తదితరులు తమ నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ట్రస్టు సేవలు ప్రశంసనీయం

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బర్రె నాగేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డా.వంశీకృష్ణ అన్నారు. కాకినాడ జగన్నాథపురంలో ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్టీ వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేస్తున్న ముఖ్యఅతిథులు

అనుబంధం.. ఆరుతరాలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడిలోని సంక్రాంతి పండగను పురస్కరించుకుని పేర్ల కుటుంబ ఆరు తరాల వారు 125మంది సభ్యులు ఒక్కచోటచేరి సందడి చేశారు. వివిధ కార్యక్రమాలను నిర్వహించి వయసు తారతమ్యం లేకుండా అందరూ ఆడుతూ పాడుతూ సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడినవారు కిర్లంపూడి చేరుకుని పండగను నిర్వహించుకున్నారు.

నగరపాలకసంస్థ ఎన్నికలపై సీఎం స్పందించాలి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు కాకినాడ పర్యటనకు వస్తున్న సందర్భంలో నగరపాలకసంస్థ ఎన్నికలపై స్పందించాలని సీపీఎం కాకినాడ నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీగా తొలి దశలోనే ఎంపికైనా లక్ష్యాలు పూర్తిగా నెరవేరలేదన్నారు. టిడ్కో గృహాలను పూర్తిస్థాయిలో నిర్మించి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. కాకినాడ పరిసర 6 గ్రామాలు విలీనం పేరుతో గత 15 ఏళ్లుగా ఎన్నికలు లేకుండా ఉండిపోయాయని, వీటన్నింటిపై స్పందించాలని కోరారు.

ఉద్యోగుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రాయితీలు విడుదల చేస్తుందని ఏపీఎన్‌జీవో మాజీ నాయకులు ఆచంట రామరాయుడు, బూరిగ ఆశీర్వాదం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టిందన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

కోటనందూరు, న్యూస్‌టుడే: కోటనందూరులో కేఏఆర్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి డబుల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాయి పాఠశాల దగ్గరలోని కేబీసీ క్రీడా స్థలంలో నిర్వహించిన ఈపోటీల్లో మొత్తం 37 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నగరంలోని వివేక్ భవన్‌లో శుక్రవారం సంఘ సమావేశం జరిగింది. కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తగినంత సిబ్బంది లేకపోవడంతె ముగ్గురు చేసే పనిని ఒక్కరి చేత చేయిస్తున్నారని ఆరోపించారు. కాలువల శుభ్రత, పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదని, దీంతో నగరంలో ఎటుచూసినా దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లపై సేకరించిన వ్యర్థాలను తగలబెట్టడం నిత్యకృత్యంగా మారిందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు మంగరాజు రాంబాబు, నూకరాజు, సతీష్, కిరణ్, సత్తిబాబు, మార్కండేయులు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా శబరిమలలో మకరజ్యోతి దర్శనం

ఘనంగా సీతారాముల ఊరేగింపు

తొండంగి, ప్రత్తిపాడు, కిర్లంపూడి, కోటనందూరు, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: హనుమాన్ దళ్ ఆధ్వర్యంలో రావికంపాడులో నగర సంకీర్తన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆ బృందం సీతారాములను పల్లకిలో ఉంచి గ్రామమంతా ఊరేగించారు. ప్రత్తిపాడు గ్రామదేవత, రైతుల ఆరాధ్య దైవం పాదాలమ్మ తీర్థం శుక్రవారం జరిగింది. అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు విశేష పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ●జగన్నాథపురంలోని సోమరాజుపేట రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా తయారుచేయించి పల్లకీతో ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ●పి.కొట్టాంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉభయదారి మహిళలు సారె సమర్పించారు. ●ఏలేశ్వరంలోని అనంతలక్ష్మీసమేత సత్యనారాయణస్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామిలకు అర్చకులు విశేష అలంకరణ చేశారు.

ప్రత్తిపాడులో అలంకరణలో పాదాలమ్మ

పి.కొట్టాంలో గ్రామోత్సవంలో భక్తులు

శంఖవరం, న్యూస్‌టుడే: ఆంధ్రా శబరిమలలో సంక్రాంతి సందర్భంగా మకరజ్యోతి దివ్య దర్శనం జరిగింది. మండలంలోని సిద్దివారిపాలెంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఛైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, పడిమెట్ల పూజలు చేశారు.

సిద్దివారిపాలెంలో అయ్యప్పస్వామి

తుని, న్యూస్‌టుడే: షబే మేరాజ్ శుభదినం సందర్భంగా ముస్లిమ్ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం చేశారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు పెద్ద మసీదులో ఇస్లామ్ మత ప్రవక్త మొహమ్మద్ జీవిత విశేషాలు ఇమామ్ కబీరుద్దీన్ వివరించారు.

ప్రమాదకరంగా కల్వర్టు

రాజపూడి ప్రధాన రహదారిని ఆనుకుని కాలనీలోకి వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టు అసౌకర్యంగా మారింది. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాకపోకలకు వీలుగా కల్వర్టు వద్ద చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

శబరిగిరీశునికి పడిహారతి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: భోగిగణపతి పీఠంలో శుక్రవారం పీఠం అధిదేవత శబరిమల అయ్యప్ప స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. 18 మెట్లకు పూజలు చేసి జ్యోతులు వెలిగించి పడిహారతిని నీరాజనాలందించారు. శ్రీవారి సేవా సమాజం సభ్యులు అయ్యప్ప భజన గీతాలను ఆలపించారు. భక్తులు పాల్గొన్నారు.

కార్మికులకు సత్కారం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: లింగంపర్తి గ్రామంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను శుక్రవారం సత్కరించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరి సుబ్బారావు, స్థానికులు హనుమాన్ మందిరం వద్ద సిబ్బందిని సన్మానించారు. కార్మికులు మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. వల్లరెడ్డి కొండయ్య, పిల్లా రాంబాబు పాల్గొన్నారు.

మూడురోజుల్లో 24మందిపై కేసు

గండేపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల పేరిట జూద క్రీడలను నిర్వహించిన వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. బుధ, గురు, శుక్ర వారాల్లో రోజుకు ఎనిమిది మంది చొప్పున వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులను మొత్తం 24మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బసవేశ్వరుడికి పిండి వంటలతో అలంకరణ

రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన దేవస్థానంలో కనుమ పండగ నాడు బసవేశ్వరుడుకి పలు రకాల పిండి వంటలు నివేదించి అలంకరించారు. అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరునికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ మండపంలో కొలువైన నందీశ్వరుడికి అర్చనలు జరిగాయి. భక్తులంతా పిండి వంటలు తీసుకొచ్చి సమర్పించారు. వాటితో బసవేశ్వరుడు ప్రత్యేక ఆహార్యంతో దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

రూ. లక్షలు చేతులు మారాయి

తుని గ్రామీణం, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: సంక్రాంతి వేడుకల్లో మండలంలో జూదాల జోరు కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడిపందేలు, గుండాట నిర్వహించారు. దీంతో చాలా వరకు నగదు చేతులుమరాయి. గత రెండు రోజుల వ్యవధిలో కోడి పందేలపై దాడులు నిర్వహించి సుమారు 13 కేసులు నమోదు చేసి 15 కోళ్లను, రూ. 20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ● ఏలేశ్వరం, గ్రామీణ మండలంలోని పలు పల్లెల్లో కనుమ రోజు శుక్రవారం పెద్ద ఎత్తున పందేలు జరిగాయి. రూ. లక్షలు చేతులు మారాయి.

ఏలేశ్వరంలో కోడిపందేలా వద్ద జన సందోహం

తేటగుంటలో పందేల బరివద్ద వాహనాల తాకిడి

కోతుల బెడద లేకుండా చర్యలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కృష్ణవరం గ్రామంలోని విజయశ్రీ సమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించిన ఆలయ ధర్మకర్తల మండలి జగ్గంపేట మార్కెట్‌కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు చొరవతో సుమారు రూ.1.25లక్షలతో సోలార్ పెన్సింగ్‌ను ఏర్పాటుచేశారు. కనుమ పండగ రోజున సుబ్బారావు ప్రారంభించారు.

సోలార్ ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సుబ్బారావు

పౌరాణిక ప్రదర్శనలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ధర్మవరంలో గౌరీ శంకరుల మహోత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటకాలు అలరిస్తున్నాయి. గ్రామంలో 89 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తుండగా పౌరాణిక నాటకాలను రాష్ట్రంలోని ప్రముఖ రంగస్థల నటులతో ఈ ప్రదర్శనలు సాగుతున్నాయి. గురువారం రాత్రి రామాంజనేయ యుద్ధం ప్రదర్శించగా శుక్రవారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని పెద్ద సంఖ్యలో కళాభిమానులు తిలకించారు. హరిశ్చంద్రులుగా ఉప్పాల రాజేశ్వరరావు, డీవీ సుబ్బారావు, చంద్రమతిగా కిలారి లక్ష్మి, నక్షత్రకులుగా నందం సత్యం, పైడి భీమవరం వాసు తదితర ప్రముఖ కళాకారులు అభినయించారు.

చెట్టుకో చరిత్ర.. తెలుసుకో సులువుగా

ఇక్కట్లు చెట్లు, మొక్కల విశిష్టత, ప్రాధాన్యం తెలుసుకోవాలంటే పుస్తకాలు చదవనక్కర్లేదు. చరవాణితో వృక్షాలకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సరిపోతుంది. కాకినాడ జగన్నాథపురం అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వీటిని ఏర్పాటు చేశారు. వృక్షశాస్త్రం విభాగం అధ్యాపకులు ఈశ్వరి, సుక్షణ, పుష్ప వీటిని రూపొందించారు. గతంలో ప్రాంగణంలో ఉన్న కొన్నింటికి ఏర్పాటు చేశామని, ఇప్పుడు మిగిలిన వాటికీ ఈ సౌకర్యం కల్పించామని ప్రిన్సిపల్ డా.వి.అనంత లక్ష్మి తెలిపారు.

-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

సత్కళావాహినిలో వివేకానంద జయంతి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ సత్కళావాహినిలో వివేకానంద జయంతి, ఇన్ఫర్మేషన్ అవార్డ్స్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొని మాట్లాడారు. వివేకానందుని రూపకంలో విశ్రాంత పోస్టుమాస్టర్, కళాకారుడు తురగా సూర్యారావు నటించి ఆకట్టుకున్నారు. డాన్స్ మాస్టర్ శ్రీనివాస్, అద్దంకి రాజా, గోపాల నరసరాజా, పి.సత్యానందం, కేవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

ద్విచక్రవాహనం చోరీ

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం చోరీపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కాకినాడ, పోస్టల్‌కాలనీకి చెందిన కె.కామేశ్వరరావు గత నెల 25న స్థానిక రామారావుపేటలోని ఓ చర్చికి వెళ్లారు. కొంత సేపటి తరువాత వచ్చి చూడగా బయట పార్క్ చేసిన వాహనం కనపడలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్: కాకినాడ గ్రామీణం తూరంగికి చెందిన జి.చిట్టియ్య అనే వ్యక్తి వ్యక్తిగతకారణాలతో ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో అస్వస్థతకు గురవడంతో చికిత్సనిమిత్తం శుక్రవారం జీజీహెచ్‌లో చేర్చారు.

కోడి కత్తి తగిలి ఒకరికి గాయం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పండగ మూడు రోజులూ జూదాలు జోరుగా సాగాయి. కోడిపందేల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటయ్యాయి. ధర్మవరం, శరభవరం, రాచపల్లి, ఉత్తకరంచి, పెద్దిపాలెం ఇలా పలు చోట్ల అనుమతులు ఇచ్చినట్టే ఆడుకున్నారు. రూ.లక్షల్లో పందాలు సాగాయి. గజ్జనపూడిలో జి.సత్యనారాయణ అనే వ్యక్తికి కోడికి కట్టిన కత్తి తగలడంతో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు.

గిరిజన తండాలో అగ్నిప్రమాదం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: బురదకోట కొండలపై ఉన్న గిరిజన తండాలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. కాకూరి లక్ష్మికి చెందిన కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విద్యుదాఘాతం వల్ల జరిగిందని స్థానికులు చెపుతున్నారు. రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామానికి చెందిన రమేష్ చెప్పారు.

బురదకోట కొండలపై ఉన్న కొండపల్లిలో దగ్ధమవుతున్న ఇల్లు

చిన్నారులు.. క్రీడా కుసుమాలు

రోలింగ్ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

తుని, తుని పట్టణం , న్యూస్‌టుడే: రోలింగ్ స్కేటింగ్‌లో విద్యార్థులు తమ ప్రతిభచూపుతూ దూసుకుపోతున్నారు. చదువుతోపాటు రోజూ కొంత సమయం దీన్ని నేర్చుకునేందుకు కేటాయిస్తున్నారు. ప్రత్యేక దుస్తులు, కాలికి చక్రాల బూట్లు, శిరస్త్రాణం ధరించి 4-15 ఏళ్ల వయసున్న పిల్లలు కోచ్ ఈశ్వర్ వద్ద శిక్షణ పొందుతున్నారు. తుని పట్టణంలోని రాజా రాజబాబు పార్కు ఆవరణలో మూడేళ్ల క్రితం రూ.40 లక్షలకు పైబడి వెచ్చించి పురపాలక సంఘం ద్వారా స్కేటింగ్ రింక్‌ను అభివృద్ధి చేయగా.. సాయంత్రం అయ్యేసరికి విద్యుత్తు దీపాలు, చిన్నారుల కేరింతలు, తల్లిదండ్రుల ఆనందాలతో సందడి నెలకొంటోంది.

స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కొత్త అనుభూతినిస్తోంది

ఇతర క్రీడలు ఆడినప్పటికీ టీవీ, సినిమాల్లో చూసి ఆనందించే స్కేటింగ్ చేస్తుంటే ఒకొత్త అనుభూతి కలుగుతోంది. కాకినాడ, అమలాపురంలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాను. **- జి.జశ్విన్, తుని**

మూడు పతకాలు సాధించాను

గతేడాది కాలంగా స్కేటింగ్‌లో శిక్షణ పొందుతూ వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని మూడు రజత, కాంస్య పతకాలు సాధించాను. మరింత కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనాలని భావిస్తున్నాను. **- వి.నిషాన్, తుని**

(c) eenadu

నాణ్యతకు పరీక్ష

● అక్కరకు రాని అగ్రిల్యాబ్‌లు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామంటూ గత వైకాపా ప్రభుత్వం హంగామా చేసింది. రూ.కోట్లు ఖర్చు చేసి అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించింది. సిబ్బంది లేక.. పరికరాలు కానరాక భవనాలు నిరుపయోగంగా మారాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల

ఆళ్లగడ్డలోని అగ్రిల్యాబ్‌లో అలంకారప్రాయంగా పరికరాలు

నిరుపయోగంగా భవనం

ఉమ్మడి జిల్లాలో అగ్రిల్యాబ్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి రాలేదు. నిర్మించిన భవనాల్లో సదుపాయాలు కరవయ్యాయి. కోవెలకుంట్లలో సబ్ డివిజన్ పరిధిలో వరి, పత్తి, జొన్న, వేరుసెనగ పంటలు సాగవుతాయి. ఈ నేపథ్యంలో కోవెలకుంట్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.48 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించారు. సిబ్బంది కొరతతో గత మూడేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా మారింది. ఇద్దరు జూనియర్ అనలిస్టులు, ఇన్‌ఛార్జి ఏవో ఉండాలి. అగ్రిల్యాబ్‌ను మరో ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నారు. బనగానపల్లి నియోజకవర్గానికి అగ్రిల్యాబ్ సేవలు అవసరమని, సదుపాయాలు కల్పించి ఇక్కడే కొనసాగించాలని రైతులు పేర్కొంటున్నారు.

సేవలు అంతంతమాత్రమే..

ఆళ్లగడ్డలో రూ.70 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించినప్పటికీ ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. విత్తనాలు, ఎరువుల నమూనాలను పరీక్షించే ల్యాబ్ సహాయకుడు గతేడాది నవంబరు నుంచి సెలవుపై వెళ్లారు. దీంతో సేవలు ఆగిపోయాయి. గతేడాది నవంబరు వరకు ల్యాబ్‌లో 155 విత్తన, 123 ఎరువులు, ఆర్ఎస్‌కే, రైతుల నుంచి వచ్చిన 8 విత్తన నమూనాలు, విత్తన వ్యాపారులు ఇచ్చిన 16 నమూనాలను మాత్రమే పరీక్షించారు.

అవగాహన కరవై..

● అగ్రిల్యాబ్‌ల్లో విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షించుకోవడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. రుద్రవరం మండల పరిధిలో నకిలీ మొక్కజొన్న విత్తనాలతో రైతులు నష్టపోయారు. ల్యాబ్‌లలో విత్తన పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిసినా రైతులు స్పందించడం లేదు. ఒక్కో వీఏవో కనీసం ఐదు నమూనాలను సేకరించాలని పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో స్పందన కానరావడం లేదు.

● ఆళ్లగడ్డ, డోన్ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో లక్ష మంది రైతులు ఉండగా 50 మంది లోపే పరీక్షలకు తీసుకురావడం గమనార్హం.

విద్యుత్తు వెలుగులు.. చామంతి విరులు

వెలుతురులో పంట బాగా ఎదుగుతుందన్న సూచనలతో ఓ రైతు తన చామంతి తోటలో పెద్ద ఎత్తున విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. హొళగుంద మండలం మూస క్యాంపునకు చెందిన షమీవుల్లా రెండు ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ప్రస్తుతం చామంతులు మార్కెట్లో కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ఉందని తెలిపారు. రైతు కొత్తగా ఆలోచించి చామంతికి విద్యుత్తు వెలుగులు ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి, ఆలూరు గ్రామీణం

గుత్తగా కట్టబెట్టి.. గుట్టుగా కట్టిపెట్టి

● ఇష్టానుసారంగా బిల్లుల చెల్లింపు
● పనులపై పర్యవేక్షణ కరవు

శ్రీశైల మహాక్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి లోపిస్తోంది. ఏ పని తలపెట్టినా కాలయాపన జరుగుతోంది. నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయకున్నా గుత్తేదారులకు ఇంజినీర్లు వంత పాడుతున్నారు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

శ్రీశైలంలో ఏటా వివిధ పనుల పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వ్యయంతో తరచూ సివిల్ వర్క్‌ల కోసం టెండర్లు పిలుస్తుంటారు. క్లాస్-1, 2, 3, 4, 5 అర్హత కలిగిన గుత్తేదారులు పాల్గొంటారు. గడువులోపు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గుత్తేదారులు సకాలంలో పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం


దోర్నాలలో ఆగిపోయిన కల్యాణ మండపం పనులు

అధికారుల అత్యుత్సాహం

శ్రీశైల దేవస్థానానికి సంబంధించి దోర్నాలలో శ్రీశైల సదన్ ఉంది. రెండేళ్ల కిందట షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణానికి టెండర్లు పిలిచారు. షాపింగ్ కాంప్లెక్స్ పూర్తైనా కల్యాణ మండపం పనులు మందగించాయి. గుత్తేదారు పునాదులు వేసి పిల్లర్లు వేయడానికి ప్రయత్నం చేశారు. ఆలోపే ఇంజినీర్లు రూ.40-50 లక్షల మేర బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత గుత్తేదారుడు పనులు ఆపేశారు.

నిబంధనలు పట్టక..

● రూ.1.20 కోట్లతో చేపట్టిన నక్షత్ర వనం పనులు అస్తవ్యస్తంగా జరిగాయి. కొండ ప్రాంతాన్ని అంచనా వేసి అక్కడ '0' లెవల్ నుంచి డ్రాయింగ్ ఇవ్వాల్సి ఉండగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. పనుల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. నక్షత్ర వనానికి ప్రీకాస్ట్‌తో ప్రహరీ పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేయని గుత్తేదారును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల నక్షత్ర వనం వద్ద భారీ ఎత్తున అర్ధనారీశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ధర్మకర్తల మండలిలో తీర్మానం చేయడం కొసమెరుపు.

● రెండేళ్ల కిందట గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రూ.80 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆ తర్వాత దాని స్థానంలో భ్రమరాంబాదేవి ఆలయం వెనుక గ్యాలరీ నిర్మించారు. మరలా గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు బీటీ రోడ్డు నిర్మించారు. తర్వాత కాలయాపన చేసి బీటీ రోడ్డును పక్కన పెట్టి సిమెంటు నిర్మాణాలు చేపట్టారు. కాలువల నిర్మాణాలను గాలికొదిలేశారు.

● గణేశ్ సదన్ పక్కన 'ఈవో బంగ్లా' నిర్మించారు. ఇది సాంకేతిక అనుమతుల వివాదంలో చిక్కుకుంది. ప్రహరీ ఊసే లేకుండా పోయింది.

కష్టాలు మోస్తూ.. కన్నీళ్లు దాస్తూ

ఆ తల్లి.. తొమ్మిది నెలలపాటు గర్భంలో మోసింది. పండంటి బిడ్డలకు జన్మనిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా వారి నోట మాట రాలేదు.. అడుగు వేయలేరు. ఆకలి, దప్పులను అమ్మ గుర్తించాల్సిందే. తల్లి సాయం లేనిదే నిలబడలేరు. అడుగడుగునా ఎదురవుతున్న అష్టకష్టాలు చూసిన ఆమె ఈ లోకాన్ని వీడిపోవాలని భావించారు. కన్న పేగు కదలాడి.. కదల్లేని పిల్లల కోసం కుటుంబ భారం మోస్తూ.. జీవనయానం సాగిస్తున్నారు.. ఆమె పెరవలికి చెందిన మణెమ్మ.

● మద్దికెర మండలం పెరవలికి చెందిన గోపాల్, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. మగపిల్లలు పుట్టారన్న సంతోషం ఆ తల్లిదండ్రులకు ఎంతో కాలం నిలవలేదు. వయసు పెరిగే కొద్దీ వారిలో మానసిక ఎదుగుదల లేదు. చికిత్స కోసం శక్తికి మించి అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం పెద్ద కుమారుడు భరత్‌కు 27 ఏళ్లు. ఎవరైనా పట్టుకుంటే తప్ప నిలబడలేడు. చిన్న కుమారుడు శరత్ వయసు 23 ఏళ్లు. కనీసం కూర్చోలేక ఓవైపు ఒరిగిపోతాడు. అతనికి రెండు కళ్లు కనిపించవు. దీనికితోడు రేయింబవళ్లు నోట్లో చేయి పెట్టుకొని కొరుక్కుంటాడు. చేతికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో శస్త్రచికిత్స చేయించారు. – న్యూస్‌టుడే, పత్తికొండ

● భర్త గోపాల్ 17 ఏళ్ల కిందటే ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లల భారమంతా తల్లి మణెమ్మపై పడింది. దుస్తులు కుట్టడం తెలియడంతో దాన్ని వృత్తిగా మార్చుకొన్నారు. వారికి ప్రభుత్వం ఇస్తున్న పింఛను కొంత ఆసరా అవుతోంది. కష్టాలు కలవరపెడుతుంటే.. ఎన్నోసార్లు చనిపోవాలని అనిపించినా.. తర్వాత తన పిల్లల పరిస్థితి ఏంటని గుర్తుచ్చుకొని బతుకుతున్నానని చెబుతున్నారు మణెమ్మ.

రావణ వాహనంపై ఆది దంపతుల విహారం


రావణ వాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల దేవస్థానంలోని గోశాల గోవులకు పూజలు చేసి నివేదనలు సమర్పించారు. రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుడు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి మండపంలో ఉత్సవమూర్తులను రావణ వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి మధ్య గ్రామోత్సవం జరిగింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి 7 గంటలకు పార్వతీ సమేత మల్లికార్జునస్వామివార్లను ముస్తాబు చేసి నంది వాహనంపై గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో బ్రహ్మోత్సవ కల్యాణం కనులపండువగా జరిగింది. స్థానిక చెంచు గిరిజనులు అటవీ వనరులు, వెదురుతో అల్లిన ఆభరణాలు, నూతన వస్త్రాలను ఐటీడీఏ అధికారుల సమక్షంలో ఉత్సవ మూర్తులకు సమర్పించారు.

కళాకారుడి విన్యాసం

● శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు జరగనున్నాయి. 18వ తేదీ రాత్రి అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఉద్యోగుల ఇళ్లలో సంక్రాంతి వెలుగులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉద్యోగులకు సంబంధించిన 60 నెలల బకాయిలను కూటమి ప్రభుత్వం ఒకేసారి చెల్లించి వారి ఇళ్లలో సంక్రాంతిని తీసుకొచ్చిందని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జవహర్‌లాల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగులకు 2018, 2019 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పోలీసు ఉద్యోగులకు సరెండర్ లీవ్ బకాయిలను సైతం ప్రభుత్వం ఇచ్చిందని పేర్కొన్నారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో లేకుండా అన్నీ చెల్లించడంతో సంక్రాంతి పర్వదినాన ఒక్కో ఉద్యోగికి రూ.20 వేల నుంచి రూ.80 వేల వరకు అందిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశన్న, సహాధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి సుధాకర్, కర్నూలు తాలూకా సహాధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సాయిరాం, కోడుమూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ వేగంతో ర్యాంకు

నంద్యాల పట్టణానికి చెందిన దూదేకుల రిహాన్ ఏడో తరగతి చదువుతున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి క్రీడలపై ఎనలేని ఆసక్తి. తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించడం ప్రారంభించారు. అతను బెంగళూరులోని ఓ అకాడమీలో గత నాలుగేళ్లుగా షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఆటలో వేగంగా నైపుణ్యం సాధించి కోర్టులో తన రాకెట్‌తో సత్తా చాటుతున్నాడు. ఇప్పటివరకు ఆరుసార్లు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించి బహుమతులు సాధించాడు. అండర్-13 విభాగంలో ఆలిండియా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు రిహాన్ చెబుతున్నాడు. గతేడాది డిసెంబరులో బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో వెండి పతకం పొందాడు. గతేడాది ఐదు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి అందరి ప్రశంసలు అందుకొన్నాడు. – న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

దారిన పడేదెన్నడో

■ రూపు కోల్పోయిన రహదారులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : పత్తికొండ మండల పరిధిలోని పత్తికొండ-ప్యాపిలి రహదారి అధ్వానంగా మారింది.

అధ్వానంగా మారిన చక్కరాళ్ల రోడ్డు

మరోవైపు చక్కరాళ్ల, పులికొండకు వెళ్లే మార్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పత్తికొండ పట్టణం నుంచి ప్యాపిలి రోడ్డులో సుమారు 10 కి.మీ. మేర రహదారిపై తారు లేచిపోయి గుంతల మయంగా మారింది. గత కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోకపోవటంతో రోజురోజుకు పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఫలితంగా వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో మరింత ప్రమాదకరంగా మారింది. దీనికితోడు అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. జనం మరమ్మతులకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోంది.

గత ప్రభుత్వం పట్టించుకోక..

పత్తికొండ-దేవనకొండ ప్రధాన రహదారి నుంచి పులికొండకు వెళ్లే మార్గంలో 5 కిలోమీటర్లు, పత్తికొండ-ప్యాపిలి మార్గంలో 3 కి.మీ. మేర చక్కరాళ్లకు వెళ్లే రహదారి సైతం అధ్వానంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వం రహదారులకు మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం వహించింది. జనం విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదు. చివరికి దెబ్బతిన్న రహదారులపైనే జనం ప్రయాణిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

● "పంచాయతీరాజ్ పరిధిలోని పత్తికొండ-ప్యాపిలి రోడ్డు నుంచి చక్కరాళ్ల, పత్తికొండ-దేవనకొండ మార్గంలో పులికొండ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మరమ్మతులు చేపడతాం" అని పత్తికొండ పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ, డీఐజీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పీఎం కిసాన్, ముద్ర రుణాలు, సూర్యఘర్ తదితర పథకాల పేర్లతో లింకులు పంపి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారన్నారు. ఆయా లింకులను క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందన్నారు. ఓటీపీ తదితర వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

నృసింహ వైభవం.. చూసిన కనులదే భాగ్యం


పార్వేటకు బయలుదేరుతున్న ఉత్సవమూర్తులు

పూజలందుకుంటున్న ప్రహ్లాదవరద స్వామి, జ్వాలా నృసింహస్వామి

పార్వేటకు స్వామివార్ల పయనం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : నల్లమలలో కొలువుదీరిన నారసింహుడు భక్తుల చెంతకు కదిలాడు. తన వివాహానికి ఆహ్వానించేందుకు, ప్రియ భక్తులను కలిసేందుకు పయనమయ్యాడు. పార్వేటోత్సవంలో భాగంగా 35 రోజుల పాటు ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లోని 32 గ్రామాల్లో స్వామి పర్యటించనున్నారు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు స్వామి పార్వేటోత్సవం ఆరంభమవుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం దిగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా పార్వేటోత్సవ తంతు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, జ్వాలా నృసింహస్వామి, మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ ఉత్సవమూర్తులను పార్వేట మండపంలో కొలువుంచారు. స్వామివార్ల ముందు 35 రోజులకు సరిపడా అన్నం రాసిగా పోసి అన్నకూటోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచారు. చెంచులు సమర్పించిన కొబ్బరి కాయలు కొట్టి పార్వేట పల్లకిని ఊరేగింపుగా బయటకు తీసుకొచ్చారు. ఆలయ రాజగోపురం చేరుకున్న పల్లకికి చెంచులు బాణాలు సంధించారు. అనంతరం పల్లకి గ్రామ వీధుల్లో తిరుగుతూ బాచేపల్లె గ్రామానికి బయలుదేరింది. ఫిబ్రవరి 19వ తేదీన స్వామివార్లు తిరిగి అహోబిలం చేరుకుంటారు. ఆలయ ఏవో రామానుజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మనియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవం జరిపారు.

అక్రమాల లింకేజీ

● అతివలకు రుణాలిప్పించడంలో నిర్లక్ష్యం
● క్షేత్రస్థాయిలో భారీగా అక్రమాలు

డ్వాక్రా సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విరివిగా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. క్షేత్రస్థాయిలో పొదుపు మహిళలకు రుణాలు ఇప్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. రుణాల పంపిణీ లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు వెనుకపడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కింది స్థాయి సిబ్బంది అందినకాడికి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

మైక్రో క్రెడిట్ ప్లాన్-I కింద బ్యాంకు లింకేజీ రుణాల వివరాలు (డిసెంబరు- 2025)

జిల్లా	పొదుపు సంఘాలు	లింకేజీ లక్ష్యం (రూ.కోట్లలో)	తీసుకున్న సంఘాలు	చేరిన లక్ష్యం (రూ.కోట్లలో)
కర్నూలు	17,877	1,510.15	8,988	868.35
నంద్యాల	14,771	1,526.66	7,450	879.45

వేలల్లో సంఘాలు..

● కర్నూలు జిల్లాలో 966 గ్రామైక్య సంఘాలు, 25 మండల మహిళా సమాఖ్యలు, ఒక జిల్లా సమాఖ్య ఉంది. వీటి పరిధిలో 32,025 డ్వాక్రా సంఘాలు ఉండగా 3,22,944 మంది పొదుపు సభ్యులు ఉన్నారు.

● నంద్యాల జిల్లాలో 1,095 గ్రామైక్య సంఘాలు, 29 మండల మహిళా సమాఖ్యలు, ఒక జిల్లా మహిళా సమాఖ్య ఉంది. వీటి పరిధిలోని 31,205 డ్వాక్రా సంఘాల్లో 3,18,040 మంది పొదుపు మహిళలు సభ్యులుగా ఉన్నారు.

జిల్లా కేంద్రాల్లోనే నిఘా

అవకతవకలను అడ్డుకునేందుకు గతంలో సామాజిక ఆడిట్ విభాగాన్ని తీసుకొచ్చారు. ప్రత్యేకంగా లీగల్‌సెల్ సైతం ప్రారంభించారు. ఈ రెండు జిల్లా కేంద్రాలకే పరిమితం అవుతున్నాయి. డీఆర్డీఏ-వెలుగు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అప్రమత్తమై బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఫిబ్రవరిలోగా ఇస్తేనే..

● కర్నూలు జిల్లాలో 8,889 సంఘాలకు రూ.641.80 కోట్లు, నంద్యాల జిల్లాలో 7,321 సంఘాలకు రూ.647.21 కోట్లను ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలోగా ఇప్పించాల్సి ఉంటుంది. మార్చిలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపవు.

● మైక్రో క్రెడిట్ ప్లాన్-2 కింద స్వయం సహాయ సంఘాల్లోని సభ్యులకు రుణాలు ఇప్పించాలని లక్ష్యాలు నిర్దేశించారు. రానున్న మూడు నెలల్లో ఉమ్మడి జిల్లాలో 1,455 మంది పొదుపు మహిళలకు వ్యక్తిగతంగా రూ.156.52 కోట్ల రుణాలు ఇప్పించాల్సి ఉంది.

● డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా వీవోఏలు, ఏపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు జాప్యం చేస్తున్నారు. వెలుగు నుంచి ఇచ్చే ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) రుణాలు సైతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

ఆగిన నీటితడి.. అందేనా దిగుబడి

■ అయోమయంలో పశ్చిమ రైతులు

హాలహర్వి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే తుంగభద్ర దిగువ కాల్వకు నీటి సరఫరా ఆపేశారు. తుంగభద్ర జలాశయం కొత్త గేట్ల ఏర్పాటు కోసం రెండో పంటకు నీటి విడుదల ఉండదని బోర్డు అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 10న ఆపేయాల్సి ఉండగా.. తాగునీటి అవసరాల నిమిత్తం మరో మూడు రోజుల పాటు విడుదల చేశారు. ఈనెల 13న నీటి మట్టం తగ్గించి.. 14న పూర్తిగా నిలిపేశారు. ప్రస్తుతం కాలువలో ప్రవాహం తగ్గుతూ వస్తోంది. దీంతో మిరప రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం డ్యాంలో 27.77 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

బాపురం వద్ద దిగువ కాల్వలో తగ్గిన ప్రవాహం

అన్నదాతల్లో దిగులు

ఎల్లెల్సీ పరిధిలో ప్రస్తుతం 30 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. రూ.లక్షల పెట్టుబడి పెట్టిన పంటలకు నీరందకపోతే అప్పుల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో హాలహర్వి, హొళగుంద, ఆదోని, కౌతాళం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు వరకు దిగువ కాలువ వెళుతుంది. ఆయా ప్రాంతాల పరిధిలో సాధారణంగా రైతులు ఎక్కువగా వరి, మిరప, పత్తి తదితర పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం మిరప సాగవుతోంది. ఈ పంటకు నీటి అవసరం ఎక్కువగా ఉంది.

● మరో నెల రోజులపాటు పంటను కాపాడుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో నీటి సరఫరా ఆపేస్తే పంటలు పూర్తిగా దెబ్బతింటాయని చెబుతున్నారు. ఇప్పటికే ఖర్చు తడిసి మోపెడైందని.. ఈ నెలాఖరు వరకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ 27న

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో ఈనెల 27న కర్నూలు జిల్లా దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు నేరుగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని తమ అభిప్రాయాలను ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డికి తెలియజేయాలని కోరారు.

పైపైన చేసిపోతారు

● రహదారి నిర్మాణంలో నాణ్యత కరవు

డోన్ నుంచి ఓర్వకల్లు మండల పరిధిలోని సోమయాజులపల్లె వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి అధ్వానంగా మారింది. 54 కి.మీ. మేర దీనిని నిర్మిస్తున్నారు. 340బి ఎన్‌హెచ్‌లో భాగంగా డోన్ యు.కొత్తపల్లె సర్కిల్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, డోన్

డోన్ ఆస్పత్రి సమీపంలో దెబ్బతిన్న రహదారి

భారీగా నిధుల వెచ్చింపు

● రహదారి నిర్మాణానికి సుమారు రూ.450 కోట్ల వరకు చేస్తున్నారు. డోన్ పరిధిలోని ఆస్పత్రి ప్రాంతంలో రహదారి దెబ్బతింది. ఒకవైపు పనులు జరుగుతుండగా.. మరోవైపు రూపు కోల్పోతోంది. ఈ మార్గంలో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి.

● యు.కొత్తపల్లె సర్కిల్ ప్రాంతంలో రహదారి దెబ్బతినడంతో ఇటీవల వామపక్ష పార్టీల నాయకులు సైతం నాణ్యతపై ఆందోళన చేశారు. అధికారులు స్పందించి పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా మరో లేయర్ వేయాల్సి ఉంది.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా...

ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం
నేడు రేపు ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు
ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రాజ్‌విహార్ సెంటర్‌లో రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న ఈనాడు కార్యాలయం వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు(శనివారం, జనవరి 17న), రేపు(ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం॥ నుంచి సాయంత్రం 5.30 గం॥ వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ వధూవరుల బయోడేటా & ఫొటోలను క్రింద తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చూసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91543 66099 & 91547 72006**

వైభవంగా ఉమామహేశ్వరుని ఉత్సవం

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించే యాగంటి ఉమామహేశ్వరస్వామి పార్వేట ఉత్సవం వైభవంగా సాగింది. సమీప గ్రామాలైన పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లి గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల పల్లకిని ఘనంగా ఊరేగించారు. శుక్రవారం పాతపాడులో ప్రత్యేక పూజల అనంతరం యాగంటి ఆలయానికి సంప్రదాయరీతిలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోటాపోటీ.. పొట్టేళ్లు ఢీకొట్టి

బలప్రదర్శన పోటీల్లో పాల్గొన్న పొట్టేళ్లు

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని శుక్రవారం శ్రీఅన్నపూర్ణ కాశీశ్వర స్వామి ఆలయ మైదానంలో పొట్టేళ్ల బలప్రదర్శన నిర్వహించారు. 8 జతల పొట్టేళ్లు పోటీల్లో బలాన్ని ప్రదర్శించాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులుగా రూ.10 వేలు, 8వేలు, 5వేలు, 3వేల నగదును అందజేశారు.

చదువులో ఫలితాలు.. ఆటల్లో పతకాలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: సాధన ఉంటే అనుకున్నది సాధిస్తారు. పట్టుదల ఉంటే లక్ష్యం చేరుకుంటారు. పల్లె విద్యార్థులు బేస్‌బాల్ క్రీడల్లో పట్టు సాధిస్తున్నారు. చదువులో ఫలితాలు.. క్రీడల్లో పతకాలు ఒడిసిపడుతున్నారు. మండల కేంద్రమైన చాగలమర్రి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బేస్‌బాల్‌లో రాణిస్తున్నారు. ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయుల సహకారం, వ్యాయామ ఉపాధ్యాయుడి తర్ఫీదుతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ముందుకు సాగుతున్నారు.

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

- నిరంజన్, తొమ్మిదో తరగతి

చాగలమర్రి పట్టణానికి చెందిన తెల్లన్న, వీరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీ కుటుంబం. వీరి కుమారుడైన నిరంజన్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బేస్‌బాల్‌పై ఆసక్తితో వివిధ స్థాయిల్లో రాణిస్తున్నాడు. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రాన్ని పొందాడు. 2025 ఆగస్టులో ఒంగోలులో జరిగిన బేస్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడు. 2025 నవంబరులో అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పతకమే లక్ష్యమని చెబుతున్నాడు నిరంజన్.

పోలీసు కొలువే ధ్యేయం

- వెంకటసుశాంత్, ఎనిమిదో తరగతి

చాగలమర్రి పట్టణానికి చెందిన సుబ్బయ్య, సుహాసిని దంపతుల కుమారుడు వెంకటసుశాంత్ చాగలమర్రి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి ప్రోత్సాహంతో బేస్‌బాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. 2024 ఆగస్టులో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపాడు. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాడు. 2025 నవంబరులో అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో భాగంగా అండర్-14 పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. చదువులో రాణించి భవిష్యత్తులో పోలీసు కొలువు సాధిస్తానని వెంకటసుశాంత్ చెబుతున్నాడు.

ప్రత్యేక పూజలో హైకోర్టు న్యాయమూర్తి

స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్

పగిడ్యాల, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్, ఆయన సతీమణి తన స్వగ్రామం ప్రాతకోట గ్రామంలోని శ్రీగంగా పార్వతి సమేత నాగేశ్వర స్వామి, శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో వారికి ఘనస్వాగతం పలికారు. కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహస్వామి దీక్ష

నృసింహస్వామి దీక్ష స్వీకరణలో మాలధారులు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలంలో నృసింహస్వామి దీక్ష కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా స్వామి పార్వేట ఆరంభ సమయంలో భక్తులు స్వామి మాలధారణ వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ఆవరణలోని గోదాదేవి సన్నిధిలో జ్వాలా నృసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామిని ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచారు. స్వామికి ఎదురుగా హోమగుండం ఏర్పాటు చేసి అర్చకులు సుదర్శన హోమం జరిపారు. అనంతరం మాలధారులకు అర్చకులు స్వామి దీక్షను అనుగ్రహించారు. వేలాది సంఖ్యలో మాలధారులు పసుపు వస్త్రాలు ధరించి దీక్షను స్వీకరించారు. 41 రోజుల పాటు మాలధారులు దీక్షను భక్తిశ్రద్ధలతో చేపట్టనున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, అర్చకులు కల్యాణరంగన్ స్వామి దీక్ష ప్రాధాన్యాన్ని వివరించారు.

ఆలయాభివృద్ధికి భక్తుల విరాళాలు



ఆలయ ఛైర్మన్ కుమార్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన ఆర్.చేతన కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు. చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు చెందిన ప్రదీప్‌కుమార్, తేజస్విని కుటుంబ సభ్యులు రూ.30 వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఆదోని జిల్లా సాధనకు బంద్ 24న

సమావేశంలో పాల్గొన్న ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఆదోని డివిజన్‌లోని ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాలు బంద్ చేపడుతున్నట్లు ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు పిలుపునిచ్చారు. ఆదోనిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐకాస నాయకులు రఘురామయ్య, అశోకానందరెడ్డి, కృష్ణమూర్తి, నూర్ అహ్మద్, దస్తగిరి మాట్లాడారు. ఆదోని జిల్లా సాధన కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలంతా కలిసికట్టుగా ఈ బంద్ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమావేశంలో నాయకులు వీరేష్, సుజ్ఞానమ్మ, కోదండ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలులోని జిల్లా కోర్టు న్యాయసేవాసదన్‌లో రికార్డు అసిస్టెంట్-1, ఫ్రంట్ ఆఫీస్ కో ఆర్డినేటర్-1, డేటా ఎంట్రీ ఆపరేటర్-1 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా 'ఛైర్మన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కోర్టు ఆవరణం, కర్నూలు' చిరునామాకు పంపాలన్నారు. రిజిస్టర్ పోస్టు లేదా స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే దరఖాస్తులు పంపాలన్నారు. నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తు కోసం www.ecourtskurnool.com & kurnool.dcourts.gov.in లను సంప్రదించాలన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో మాజీ ఎంపీ, భగవత్‌సేవా సమాజ్ సభ్యులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో భగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని రథోత్సవ కార్యక్రమాన్ని సంజీవనగర్ రామాలయం నుంచి నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని నృత్యాలు, కోలాటం చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ చాన్‌బాషా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.రవికృష్ణ, ప్రసాద్, అధ్యక్షులు సూరయ్య, సభ్యులు మధుసూదన్‌గుప్తా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

తెదేపా నాయకుడిపై దాడి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు నాగేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు మోహన్ సుదర్శన్‌రెడ్డిలపై అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకులు చెన్నారెడ్డి, ఆయన కుమారుడు కేశవరెడ్డి, మరికొందరు దాడి చేసి గాయపరిచినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం నంద్యాల నుంచి మోహన్ సుదర్శన్‌రెడ్డి ఇంటికి వస్తుండగా చెన్నారెడ్డి కుమారుడు కేశవరెడ్డి ద్విచక్రవాహనానికి అడ్డంగా నిలబడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మోహన్ సుదర్శన్‌రెడ్డి, కేశవరెడ్డిలు వెళ్లిపోయారు. ఇంటికెళ్లిన తర్వాత కేశవరెడ్డి, తండ్రి చెన్నారెడ్డితో కలిసి మరికొంత మందితో నాగేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. నాగేశ్వరరెడ్డి, మోహన్ సుదర్శన్‌రెడ్డిలపై దాడి చేసి గాయపరిచారు. దాడిలో గాయపడిన వారు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు వీరిరువురు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఘర్షణ సమాచారం తెలుసుకున్న సీఐ ఈశ్వరయ్య గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. పాతకక్షల కారణంగానే గ్రామంలో ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుసుకొని.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఆదోని చిత్రబృందం

చిత్రీకరణలో సభ్యులు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: లఘు చిత్రాలు తీస్తూ.. ప్రజలను చైతన్యవంతం చేయాలని భావించారు. ప్రజలకు అవసరమైన సామాజిక అంశాలు జోడిస్తూ.. ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఇటీవల 'ది డార్క్ ప్యాసెంజర్' అనే చిత్రం తీసి, ఆదోని సినిమా థియేటర్‌లో ప్రదర్శించి.. శభాష్ అనిపించుకున్నారు. వీరెవరో పేరెన్నికగన్న దర్శకులు, నటీనటులు, సాంకేతికత నిపుణులు అనుకుంటే పొరపాటే. వీరంతా ఆదోనికి చెందిన మిత్ర బృందం సభ్యులే.

ఆదోని పట్టణానికి చెందిన దర్శకుడు మన్సూర్, కళాకారులు డ్రాగన్ రంగా, కీరా, సంతోష్, అల్తాఫ్, దినేశ్, మధు, మర్రిస్వామి, ఐశ్వర్య, లావణ్య తదితరులు మిత్ర బృందంగా ఏర్పడ్డారు. మిత్ర బృందం.. చిత్ర బృందంగా మారి గత ఐదారేళ్ల నుంచి సమాజానికి అవసరమైన సందేశం ఇస్తూ.. లఘుచిత్రాలు తీస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే 2023 సంవత్సరంలో ఈ బృందం తీసిన 'పరీక్ష' అనే లఘుచిత్రానికి విజయవాడలో స్టార్ సినీ అవార్డ్స్ వారు ఉత్తమ లఘుచిత్రంగా ఈ బృందానికి అవార్డు ప్రదానం చేశారు. అదే స్ఫూర్తితోనే ఈ బృందం సభ్యులు వ్యామ్ క్రియేషన్స్‌ను స్థాపించి పూర్తి స్థాయి చిత్రం తీయాలని లక్ష్యం పెట్టుకున్నారు.

చిత్రం వాల్‌పోస్టర్

నెరవేరిన లక్ష్యం

వ్యామ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'ది డార్క్ ప్యాసెంజర్' పేరుతో దర్శకుడు మన్సూర్ ఓ చిత్రాన్ని రూపొందించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా మిత్ర బృందం సభ్యులు డ్రాగన్ రంగా, కీరా, సంతోష్, అల్తాఫ్, దినేశ్, మధు, మర్రిస్వామి తదితరులు కలిసి వ్యామ్ క్రియేషన్స్ ద్వారా చిత్రీకరణ ప్రారంభించారు. పోస్టు ప్రొడక్షన్, డిజిటల్ మేకింగ్ తదితరాలు అన్నీ ఈ బృందం సభ్యులు కష్టపడి తీశారు. అనుమతులు, కెమెరా, తదితర సామగ్రి సేకరణ తదితర అవసరాల కోసం సుమారు రూ.6లక్షలు ఖర్చు అయింది. ఇదంతా బృంద సభ్యులు భరించారు. గత వారం 'ది డార్క్ ప్యాసెంజర్' చిత్రాన్ని ఆదోని పట్టణంలోని థియేటర్‌లో విడుదల చేశారు. ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో మిత్ర బృందం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదోని కళాకారులచే ఓ పూర్తి స్థాయి చిత్రం 'అమరత్వం' సినిమా తీసి రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేస్తామని చెబుతోంది ఈ చిత్ర బృందం సభ్యులు.

నకిలీ పీటీ వారెంట్ కేసులో మూడేళ్ల జైలు

ఆదోని గ్రామీణం, నేరవార్తలు, న్యూస్‌టుడే: నకిలీ పీటీ వారెంటు తయారు చేసి, సబ్ జైలులో రిమాండులో ఖైదీని తప్పించిన కేసులో నిందితులకు శుక్రవారం ఆదోని కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించింది. అప్పట్లో ఈ కేసు సంచలనం సృష్టించింది. ఆదోని రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2013 జులై 17వ తేదీన ఆదోని సబ్ జైలులో ఓ కేసులో నిందితుడిగా ఉన్న జగపతి మహేష్‌ను తప్పించేందుకు ఆదోనికి చెందిన శాంతరాజు, కర్నూలుకు చెందిన మధుసూదన్, ఎమ్మిగనూరుకు చెందిన ముల్లా ఖాజా, కర్నూలుకు చెందిన సుంకిరెడ్డి, హనుమంతు, ముగతి గ్రామానికి చెందిన కృష్ణ, కర్నూలు సమీపంలోని పందిపాడుకు చెందిన రఘునాథ్ నకిలీ పీటీ తయారు చేసుకొని, ఆదోని సబ్‌జైలుకు వెళ్లి.. ముద్దాయిని మహేష్‌ను ఆత్మకూరు కోర్టులో హాజరు పరచాలని చెప్పి అక్కడి నుంచి తీసుకెళ్లారు. నిందితుడు జైలుకు తిరిగి రాకపోవడంతో.. నకిలీ పీటీ వారెంట్ అని గుర్తించిన అప్పటి డిప్యూటీ జైలర్ రత్నం ఫిర్యాదు మేరకు 2013 జులై 27వ తేదీన ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో కోర్టు సిబ్బంది, పోలీసు కానిస్టేబుల్ మాధవరం పోలీసు స్టేషన్‌లో ఒకరు ఉన్నారు. ఆదోని కోర్టులో నిందితులపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఆదోని జ్యుడిషియల్ మొదటి శ్రేణి కోర్టు న్యాయమూర్తి సాయి సుభాష్ తీర్పు ఇచ్చారు. మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.

నిందితులతో సీఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు

రహదారి ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల చెక్ పోస్టు పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా కర్నూలు నగరానికి చెందిన ఈడిగ జయచంద్ర గౌడ్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీ కొట్టాడు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కర్నూలు తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నమ్మ (50) మృతి చెందింది. ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రత్నమ్మ తెల్లవారుజామున జాతీయ రహదారి దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని చెప్పారు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించినట్లు చెప్పారు. రత్నమ్మకు ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

శంకలాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని శంకలాపురం గ్రామానికి చెందిన వ్యక్తి రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ఎస్సై కేసీ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బి.దస్తగిరి(33) శంకలాపురం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బేతంచెర్లకు వస్తుండగా సీతారాంపురం గ్రామ శివారులో బొలెరో వాహనం ఢీకొట్టింది. కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దస్తగిరి (పాత చిత్రం)

ద్విచక్రవాహనం ఢీకొని..

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పాములపాడు మండలంలోని వానాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపాలు తెలిపిన వివరాల మేరకు వానాల గ్రామానికి చెందిన జీవమ్మ(45) గ్రామంలో జరిగే కూరగాయల సంతకు వెళ్లింది. సంత చేసుకుని తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దాంతో తీవ్ర గాయాలైన జీవమ్మను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరొదిలిన అన్నదాతలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్తాపానికి గురైె కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం గోనెగండ్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని అచ్చుకట్ల వీధికి చెందిన ముల్లా జైనుద్దీన్(51) రైతుకు నలుగురు కుమార్తెలు వారిలో ముగ్గురికి పెళ్లి చేశారు. అందుకు రూ. 7.50లక్షలు అప్పు తెచ్చారు. నాలుగో కుమార్తె మానసిక దివ్యాంగురాలు. తనకున్న ఎకరా 25 సెంట్ల పొలాన్ని అమ్మి కొంత అప్పు తీర్చారు. మిగతా అప్పు తీర్చడం కోసం రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. గత ఏడాది మినుములు సాగు చేశారు. ఆశించినంత పండ లేదు. ఈ ఏడాది మొక్కజొన్న పంట వేశారు. పెట్టుబడికి తెచ్చిన అప్పుల భారం ఎక్కువైంది. ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య నూరాన్‌బి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు.

ముల్లా జైనుద్దీన్ (పాత చిత్రం)

పంట చేతికి రాక..

పుసులూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి పుసులూరు గ్రామానికి చెందిన డి.జయరామిరెడ్డి (45) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న నాలుగెకరాల భూమిలో పత్తిపంట సాగు చేసేందుకు గాను అప్పు చేశారు. పంట చేతికి రాకపోవడంతో అప్పులు ఎక్కువై బాధతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

☛ మూడు నెలల కిందట భార్య బలవన్మరణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: భార్య ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో మనస్తాపానికి గురైన భర్త తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన నగరంలోని చాణక్యపురి కాలనీలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని చాణక్యపురి కాలనీకి చెందిన జి.రామకృష్ణ(51) రాయలసీమ యూనివర్సిటీలో ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య విష్ణువందనదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన భార్య గతేడాది అక్టోబర్‌లో రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. భార్య దూరం కావటంతో రామకృష్ణ మానసికంగా కుంగిపోయారు. గురువారం ఉదయం బయటకు వెళ్లి వస్తానంటూ కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయారు. స్థానిక కోట్ల రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఉద్యోగులు సమాచారం ఇవ్వటంతో కర్నూలు రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో తల్లిదండ్రులిద్దరూ దూరం కావటంతో పిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు.

రామకృష్ణ (పాత చిత్రం)

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని బైపాస్ జాతీయ రహదారి సమీపంలో వెంకటేశ్(42) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానిక కార్వన్‌పేటలో నివాసం ఉంటున్న వెంకటేశ్‌కు భార్య సునీత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా బెంగళూరులో బెల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం వెంకటేశ్ తనకుటుంబ సభ్యులతో ఆదోనికి వచ్చారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేశ్ శుక్రవారం ఉదయం శవమై కనిపించాడు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వెంకటేశ్ (పాత చిత్రం)

భార్య పుట్టింటికెళ్లిందని..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని పాతబస్తీ కాలనీ ఖండేరి ప్రాంతానికి చెందిన శివకుమార్(33) గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన నగరపాలక సంస్థ కార్యాలయం వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తీరు నచ్చక భార్య సుజాత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శివకుమార్ గురువారం సాయంత్రం ఉరేసుకున్నారు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కర్నూలు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

EENADU Classifieds

REAL ESTATE

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలి పసుపుల గ్రామ పరిధిలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్:99853 43829.

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET

COMMERCIAL

కర్నూలు మద్దూరు నగర్ దగ్గర, OCM టైలర్ షాపు ప్రక్కన 2+4 షాపులు బాడుగకు కలవు. షాపులకు, క్లీనిక్స్ కు అనుకూలం. సంప్ర: 98492 26953.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్/ టెలీకాలర్స్ కావలెను. జీతం: 10,000/- నుండి 15,000/- ఫిక్స్‌డ్ సాలరీ, నో టార్గెట్. సంప్ర:63007 25354.

ACCOUNTING

కర్నూలులోని విద్యా సంస్థలో అకౌంటెంట్ గా పనిచేయుటకు అనుభవం గల స్త్రీ అభ్యర్థి కావలెను. అర్హత:ఎమ్ డిగ్రీ. సంప్ర: 73309 24873, 98854 85281.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

● ఆదోని ● ఆలూరు ● పత్తికొండ

కందులు క్వింటాలు రూ.8వేలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలో ఎన్‌సీసీఎఫ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందులు క్వింటా రూ.8 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా తెలిపారు. కందులు విక్రయించే రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో కంది పంట నమోదు చేసుకున్న వారు ఎకరానికి 5.45 క్వింటాళ్ల ప్రకారం విక్రయించవచ్చన్నారు.

సర్వే శాఖలో పలువురికి పదోన్నతులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా పనిచేస్తున్న విజయభాస్కర్‌కు పదోన్నతి లభించింది. ఆయనను ఆదోని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోనిలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వేణుసూర్యకు పదోన్నతి కల్పిస్తూ సత్యసాయి జిల్లాకు కేటాయించారు.

గుండె జబ్బులకు ఉచితంగా ఇంజెక్షన్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి గుండె జబ్బుతో వచ్చే పేద రోగులకు అత్యవసర క్రిటికల్ కేర్ కింద రూ.50 వేల విలువైన ఇంజెక్షన్‌ను కూటమి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని వైద్యులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు, యంత్రాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వరకు కుక్కల బెడద అధికంగా ఉంది. దాడి చేస్తున్నాయి. రాత్రిళ్లు ఒంటరిగా వెళ్లలేకపోతున్నాం.

- తాళికోట శేఖర్, ఎల్ఐజీ 1-12, ఆదోని

✔: త్వరలో కుక్కల పట్టివేత, వ్యాక్సినేషన్ పనులు ఆరంభించి సమస్య పరిష్కరిస్తాం.

- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని దర్గాకు వెళ్లే రహదారిలో ఉన్న మినీ ట్యాంకు నుంచి నీరు నిత్యం వృథాగా పోతోంది. **- శంకరయ్య, మద్దికెర**

✔: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- మయాంక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మద్దికెర

హొళగుంద, న్యూస్‌టుడే: ?: హొళగుంద ప్రధాన రహదారి తేరు బజారు మార్గంలో, కొన్ని వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. **- రాజు, హొళగుంద** ✔: వాటిని పరిశీలించి, వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- రాజశేఖర్, పంచాయతీ అభివృద్ధి అధికారి, హొళగుంద**

హాలహర్వి, న్యూస్‌టుడే: ?: హాలహర్వి జాతీయ రహదారిపై పైపు లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. **- బసప్ప, హాలహర్వి** ✔: రహదారి తవ్వి మరమ్మతులు చేయాలి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి, హాలహర్వి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ?: వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారిలోని చెరుకులపాడు కూడలిలో తుంగభద్ర పథకం తాగునీటి పైపులైను దెబ్బతింది. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలి. **- దుర్గ, వెల్దుర్తి**

✔: సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.

- లక్ష్మీనాథ్, పంచాయతీ ఈవో

జిల్లా సాధనకు పల్లెల మద్దతు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు ఈనెల 24న ఐదు నియోజకవర్గాల బంద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఐకాస నాయకులు తెలిపారు. ఆదోని ప్రకటించే వరకు తమ మద్దతు ఉంటుందని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు బంటనహాలు నాగరాజు, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు నరసప్ప స్పష్టంచేశారు. ఆలూరులో శుక్రవారం నిట్రవట్టి, గూళ్యం గ్రామస్థులు దీక్షలో పాల్గొన్నారు. ఆదోని జిల్లా చేయాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యానికి ఆదోనిని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు కత్తిరా మాంజినేయులు, భూపేష్, ఎల్లప్ప, పూలరామాంజినేయులు, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న నిట్రవట్టి, గూళ్యం గ్రామస్థులు

అందని వేతనం.. ఆమోదం అయోమయం

◆ కార్మికులకు అందని జీతాలు
◆ పట్టించుకోని కౌన్సిల్ సభ్యులు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘంలో ప్రజారోగ్య విభాగంలో తాత్కాలికంగా సేవలందిస్తున్న వంద మంది కార్మికుల వేతనాల చెల్లింపు అగమ్యగోచరంగా మారాయి. పెరుగుతున్న జనాభాతో కార్మికుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో పొరుగు సేవల కింద వంద మంది కార్మికులను నియమించారు. కార్మికుడికి ఈపీఎఫ్, ఈఎస్ఐ లేకుండా రూ.12 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. రెండు శాతం ఐటీ మినహాయించి, రూ.11,760 ఒక్కో కార్మికుడికి వేతనం ఇస్తున్నారు. అవసరాలను బట్టి వీరి సేవలు పొడగిస్తూ వస్తున్నారు. గతేడాది కార్మికుల ఒప్పంద గడువు తీరడంతో.. కౌన్సిల్ ముందు ఉంచారు. అది కూడా మూడు నెలలు ఆలస్యం కావడంతో సభ్యులు వ్యతిరేకించారు.

పట్టణం: ఆదోని, వార్డులు	: 42
జనాభా	: 2లక్షలు
500 మందికి ఉండాల్సిన కార్మికులు: 1	
అవసరమైన వారు: 400 మంది	
శాశ్వత కార్మికులు: 104 మంది	
పొరుగు సేవల కింద: 184 మంది	
అదనపు కార్మికులు: 111	
సమస్య: వేతనాలు అందకపోవడం	

ఎందుకిలా చేశారు..

2025 అక్టోబరు 5 నుంచి 2026 మార్చి 30 వరకు ఆరు నెలలు కార్మికుల సేవలు పొడగించేందుకు అనుమతివ్వాలని గతేడాది డిసెంబరు 31న జరిగిన కౌన్సిల్ సమావేశ అజెండాలో పొందుపర్చారు. ప్రజారోగ్యం.. అదీ అత్యవసర విభాగంలో సేవలందిస్తున్న వంద మంది కార్మికుల సేవలు పొడగించేందుకు.. ఇలా నిర్లక్ష్యంగా మూడు నెలలు కార్మికుల సేవలు ఆలస్యంగా పొందుపర్చడమేంటని ప్రశ్నించారు. ఇందులో ఏ మతలబు ఉందో అని సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు కార్మికుల సేవల గడువు గుర్తించి, ముందుగానే పురధరణపై దృష్టి సారించాల్సిన యంత్రాంగం ఇలా నిర్లక్ష్యం చేయడమేంటని, ప్రశ్నించి సభ వాయిదా వేసి వెళ్లిపోయారు. తిరిగి ఈ నెల 13న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలో మొదటి అంశంగా పొందుపర్చారు. ఈ సమావేశం సైతం వాయిదా పడటంతో, వేతనాల చెల్లింపునకు అడ్డుకట్ట పడినట్లైంది.

ప్రజారోగ్య పనుల్లో కార్మికులు

రెండు నెలలే సమయం

ప్రస్తుతం కౌన్సిల్ కాలపరిమితి రెండు నెలలే మిగిలి ఉంది. అంటే, ఈ ఏడాది మార్చి 17వ తేదీతో ముగుస్తుంది. ఆపై ప్రత్యేక అధికారుల పాలన మొదలవుతుంది. ప్రస్తుతం సభ్యులు ఆమోదించకపోతే, వచ్చే అధికారులు.. ఏం ఆమోదిస్తారనే అనుమానాలున్నాయి. ఒక్క విభాగంలో ఇంత మంది కార్మికుల గడువు తీరినా. . పొడగించకుండా ఎలా పనిచేయిస్తున్నారని ప్రశ్నిస్తే.. సమాధానం లేదు. దీనిపై అభ్యంతరాలు లేవదీసి.. పెండింగ్‌లో పెడితే కార్మికుల పరిస్థితి ఏంటనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా సభ్యులు పట్టువీడి.. కార్మికుల శ్రేయస్సు కోసం ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు. ఆమోదం కోసం ఏదో ఆశిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్సాహంగా ఆత్మీయ కలయిక

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కలిసి చదువుకున్న విద్యార్థులు, వారికి పాఠాలు బోధించిన అధ్యాపకులు ఎక్కడెక్కడో స్థిర పడినా ఆత్మీయ కలయికతో వారి ఉన్నతమైన స్నేహానికి పునాదులు వేస్తుందని కాకతీయ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ వాసం శ్రీనివాసులు, విశ్రాంత గణిత అధ్యాపకుడు నాగేశ్వరరావు అన్నారు. పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2002-2005 బీఎస్సీ (ఎంపీసీ) బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థినీ, విద్యార్థులు, అప్పటి అధ్యాపక బృందం శుక్రవారం కళాశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల్లో స్థిర పడిన సహాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశంతో తిరిగి స్నేహభావం వెల్లివిరిసిందన్నారు. ఎక్కడ ఉన్నా చదివిన కళాశాల, గురువులను, సహాధ్యాయులను మర్చిపోరాదన్నారు. అవసరమైనప్పుడు స్నేహితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 20 ఏళ్ల అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికతో మరి కొన్నేళ్లపాటు మరచిపోలేని జ్ఞాపకాలుగా ఉంటాయన్నారు. తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని వారు సూచించారు. పరస్పరం పలకరించుకొని కష్ట సుఖాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి అధ్యాపకులు రాఘవేంద్ర, రామకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు

కంకర దారి.. ప్రమాదకారి

హొళగుంద నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి ఢణాపురం వరకు అధ్వానంగా మారింది. హొళగుంద నుంచి 28 కి.మీ. ప్రయాణించాలంటే రెండు గంటల సమయం పడుతోంది. వాహనదారులు ఈ దారి వెళ్లలేక దూరాభారమైనా ఎల్లార్తి, కమ్మరచేడు మీదుగా 8 కి.మీ. రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి సరిగా లేక పాఠశాల, కళాశాలకు విద్యార్థులు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని రహదారి పనులు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, హొళగుంద**

సంచుల్లో పొంచి ఉన్న ముప్పు

అసలే ఇరుకు దారి.. ఆ పై పంట దిగుబడుల సంచులు ఇలా పేరిస్తే.. ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హొళగుంద మండలం గూళ్యం గ్రామంలో హాలహర్వికి వెళ్లే ప్రధాన రహదారిపై జొన్న బస్తాలను ఇలా దారి పక్కన నిల్వ చేశారు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా ఒకేసారి వాహనాలు వస్తే పరిస్థితి చెప్పనవసరం లేదు. ఎలాంటి సూచికలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతాయని చెబుతున్నారు అన్నదాతలు. **- న్యూస్‌టుడే, హాలహర్వి**

పెచ్చుమీరిన నిర్లక్ష్యం

మద్దికెర మండలం పెరవలి ఎస్సీ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. గ్రామంలో ఉన్న 12 వేలకు మందికి పైగా జనాభా అవసరాలు తీర్చేందుకు అవసరమైన నీటి వనరులు లేవు. 80వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ ట్యాంకు నిర్మించి 20ఏళ్లు గడుస్తోంది. ప్రస్తుతం పెచ్చులూడిపడుతోంది. నీరునిల్వ చేసేచోటు కింది భాగం అధ్వానంగా మారింది.

☛ ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పెరవలి(మద్దికెర)**

మురుగు పారే దారిది..!

ఆదోని పట్టణ శివారు తిరుమలనగర్ ప్రాంతంలో కర్నూలు రహదారిపై మురుగు చేరుతోంది. ఈ రహదారిపై నిత్యం పది వేలకు పైగా వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిపై హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు, ఇళ్లు, చిన్న పాటి మోటారు మరమ్మతు దుకాణాలు ఏర్పడ్డాయి. రహదారిపై ఇరువైపులా కాల్వలు లేక మురుగంతా చేరి, అపరిశుభ్రంగా మారుతోంది. వర్షం వస్తే వ్యర్థాలన్నీ రహదారిపైకి కొట్టుకొస్తుంటాయి. మోకాలి లోతులో మురుగు నిలిచి, రాకపోకలకు అంతరాయం ఏర్పడేలా చేస్తోంది. ఇప్పటికైనా ర.భ.శాఖ. అధికారులు స్పందించి ఆర్ట్స్ కళాశాల నుంచి బసవేశ్వర కూడలి వరకు రహదారి విస్తరించి, ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించాలని పుర వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం**

సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర

ఆదోని ఎస్కేడీ.కాలనీ, న్యూస్‌టుడే: సీపీఐకి వందేళ్ల పోరాట చరిత్ర ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభకు సన్నాహకంగా ఆదోనిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మంగళాంజనేయస్వామి ఆలయం నుంచి పుర రహదారుల మీదుగా ర్యాలీ కొనసాగింది. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చాలనే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుదర్శన్, అజయ్‌బాబు, భూపేష్, రామచంద్ర, వెంకన్న, బసాపురం గోపాల్, లక్ష్మీనారాయణ, సాబిర్‌బాషా, దస్తగిరి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

పండగలు సంప్రదాయాన్ని గుర్తుచేస్తాయి

చిప్పగిరి, న్యూస్‌టుడే: పండగలు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాన్ని గుర్తుచేస్తాయని ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. సంక్రాంతి సందర్భంగా చిప్పగిరి భోగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి రైతుల సంతోషానికి ప్రతీకగా నిలిచే పండగ అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శ్రీరాములు, వెంకటేశ్, ఆలూరు తాలూకా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సర్వర్‌ఖాన్, ఉప సర్పంచి పెద్దపెద్దయ్య, ధర్మకర్త చెరువు తిమ్మప్ప, హనుమంతు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, మాజీ నాయకులు లక్ష్మన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి అన్నారు. ఆదోని పట్టణం తిక్కస్వామి దర్గా ప్రాంతంలో రెండు రోజులుగా సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈరప్ప, వినోద్, నాగరాజు, కైలాస్, వీరేష్, కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

విజేతలతో సీఐటీయూ జిల్లా నాయులు ఈరన్న, తదితరులు

ద్విచక్రవాహనం చోరీ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఎస్కేడి కాలనీలో ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు బాధితుడు ఉమాకాంత్ తెలిపారు. వాహనాన్ని తీసుకెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి. బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించాడు.

ఇద్దరిపై గొడ్డలితో దాడి..కేసు నమోదు

ఆస్పరి, న్యూస్‌టుడే: స్థలం విషయంలో ఓ వ్యక్తి ఇద్దరిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని కారుమంచి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసన్న స్థలం విషయంలో మల్లికార్జున, కన్నయ్యను దూషించి గొడ్డలితో దాడి చేశాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆదోని ఆస్పత్రిని తరలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శాకంబరిగా లక్ష్మమ్మవ్వ

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో వెలసిన మహాయోగి లక్ష్మమ్మవ్వ శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ కూరగాయలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది.

వైభవంగా దీపోత్సవం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని సంతపేటలో కొలువైన నాగలింగేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. నెల రోజుల పాటు ధనుర్మాస పూజలు చేసి, చివరి రోజు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శివమూర్తి, ఈరన్న, జగదీష్, సజ్జన్ వీరభద్రప్ప, బసవరాజు, మణికంఠ, మంజునాథస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శబరిమలకు తరలివెళ్లిన భక్తులు

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: మండల దీక్ష పూర్తిచేసిన అయ్యప్ప భక్తులు శబరిమలకు బయల్దేరి వెళ్లారు. మండలంలోని పెరవలిలో శుక్రవారం పలువురు భక్తులు స్థానిక రంగనాథస్వామి వారి ఆలయంలో గురుస్వాములు ఇరుముడి ధరించి స్వామి వారి దర్శనానికి తరలివెళ్లారు.

మతసామరస్యమే నిజమైన భక్తి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివమాల దీక్ష తీసుకున్న భక్తులకు వెల్దుర్తికి చెందిన ముస్లిం సోదరుడు షేక్ జాకీర్ హుసేన్ అన్నదానం చేశారు. పాలిష్ కటర్‌గా పనులు చేస్తున్న ఆయన కులమతాలకు అతీతంగా స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడంతో పలువురు అభినందించారు. దీక్షాపరులకు స్వయంగా వడ్డించి స్నేహభావం చాటుకున్నారు.

వాసవిదేవి దీక్షా విరమణ పూజలు 20న

పూలబజారు(ఆదోని పాతపట్టణం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నగరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిదేవి దీక్షా విరమణ పూజలు నిర్వహించనున్నారు. చివరి రోజు పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఆరోజు వాసవిదేవి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని పదకొండు రోజుల పాటు 71 మంది వాసవిదేవి దీక్షలు స్వీకరించారు.

పెద్దహరివాణంలో కొనసాగుతున్న దీక్షలు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో పెద్దహరివాణం మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు సాగుతున్నాయి. శుక్రవారం 18వ రోజుకు చేరాయి. ఎల్ఐసీ ఏజెంట్లు, హమాలీ సంఘం నాయకులు దీక్షలో కూర్చున్నారు. పెద్దహరివాణం మండలం సాధించే వరకు పోరాటం ఆగదని కమిటీ సభ్యులు ఆదినారాయణ, కరియప్ప, సున్నుసాబ్, నాగరాజు, మధు అన్నారు. సంక్రాంతి సందర్భంగా పెద్దహరివాణం మండలం కావాలని ఇళ్ల ముందు ముగ్గులు వేసి, ప్రభుత్వానికి తమ వాణి వినిపించారు.

దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు

సైనికుల త్యాగాలు మరవరాదు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేశ సరిహద్దుల్లో సైనికుల కర్తవ్యాలు సేవలను, అమరుల త్యాగాలను మరవకూడదని ఐడీఎస్ఈ సాయికుమార్ దత్తు, ఆర్మీ మాజీ కెప్టెన్ నరసింహులు అన్నారు. జాతీయ సైనిక దినోత్సవం పురస్కరించుకొని దేవనకొండలో మాజీ సైనికులు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో యువకులు, సైనికులు ర్యాలీ చేపట్టారు. సైన్యంలో చేరేందుకు సిద్ధమవుతున్న 20 మంది యువకులకు గ్రామానికి చెందిన సైనికులు, మాజీ సైనికులు అభ్యసన సామగ్రి, షూస్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సైనికులు గోవిందు, వెంకటేశ్వర్లు, బూసల రామాంజనేయులు, అంకిరాజు, మాజీ హెచ్ఎం ఉచ్చీరప్ప, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాజీ సైనికులు

నాణ్యత నీరుగారింది

■ అధ్వానంగా ఎస్ఎస్ ట్యాంకు నిర్వహణ

హొళగుంద, న్యూస్‌టుడే: ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో మండల పరిధిలోని కడ్లమాగి వద్ద సీపీడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచి నీటి పథకాన్ని నిర్మించారు. దీని ద్వారా హొళగుందతోపాటు మార్లమడికి, ముద్దటమాగి, హొన్నూరు, హొన్నూరు కొట్టాల, వందవాగిలి తదితర ఎనిమిది గ్రామాల ప్రజలకు తాగునీరు అందాల్సి ఉంది. 6.30 లక్షల క్యూబిక్ లీటర్ల సామర్థ్యంతో ఎస్ఎస్ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సుమారు 5 లక్షల క్యూబిక్ లీటర్ల నిల్వ ఉంది.



దెబ్బతిన్న బండపరుపు

పూర్తిస్థాయిలో నింపలేక..

ట్యాంకు లోపల పరిచిన బండలు చెదిరిపోయాయి. దీనికితోడు ట్యాంకు కట్ట కోతకు గురైంది. 2023 డిసెంబరులో కట్ట దెబ్బతినగా అప్పట్లో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి మమ అనిపించారు. పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో ట్యాంకు నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో అప్పటినుంచి పూర్తిస్థాయిలో నీటిని నిల్వ ఉంచడం లేదు. ఈ ఏడాది డిసెంబరులో తుంగభద్ర జలాశయానికి సంబంధించిన గేట్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఫలితంగా దిగువ కాలువకు త్వరలో నీటి సరఫరా ఆపేసే పరిస్థితి ఏర్పడుతుంది.

తాగునీటికి కష్టాలే..

రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు తాగునీటి ట్యాంకు గట్టుకు శాశ్వత పనులు చేపట్టలేదు. ఫలితంగా జనం ఆందోళన చెందుతున్నారు. దిగువ కాలువ నుంచి నీటి సరఫరా ఆగిపోతే ఇబ్బందులు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ఎస్ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాలని విన్నవించారు.

☛ ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌నీలా మాట్లాడుతూ మంచినీటి కుంటను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే త్వరలోనే టెండర్లు పిలిచి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

శివారు కాలనీలు.. తప్పని అవస్థలు

పట్టణం: పత్తికొండ, వార్డులు: 13, 14, కుటుంబాలు: 1400
జనాభా: 4,700, కాలనీలు: చింతకాయల వీధి, శ్రీరాముల పేట, ఎస్సీ కాలనీ, ఆంజనేయనగర్, బొగ్గుల చావిడి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని 13, 14 వార్డుల్లోని కాలనీ వాసులు నిత్యం అవస్థల మధ్య జీవనం సాగిస్తున్నారు. చింతకాయల వీధికి ఎదురుగా ఉన్న ఆంజనేయ నగర్ కాలనీలో సుమారు ఏడాది కిందట సీసీ రహదారుల ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టినా.. కేవలం డ్రైనేజీ కాల్వలతోనే సరిపెట్టారు. దీంతో ఆంజనేయ నగర్ ఎగువ నుంచి మురుగు, వర్షం నీరు దిగువకు ప్రవహించి ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిపైకి చేరుతోంది. దీంతో ఇళ్ల ముందు నిత్యం మురుగు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని సమీప నివాస గృహాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన మురుగు కాల్వలు లేకపోవటంతో మహిళలు, వృద్ధులు, వాహనదారులు రాకపోకలు సాగించాలంటే అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కొన్ని వీధుల్లో ఇళ్ల ముందు రోడ్డుపై ఎత్తుగా వేయడం వల్ల వర్షపు నీరు మురుగు కాల్వలోకి సక్రమంగా వెళ్లక తిష్ఠవేసే పరిస్థితి నెలకొందంటున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కల్లపరి వీరేష్‌కు నామినేటె పదవి

ఆస్పరి, న్యూస్‌టుడే: కల్లపరి గ్రామానికి చెందిన వీరేష్ సౌత్ సెంట్రల్ రైల్వేజోన్ యూజర్ కన్సల్టింగ్ కమిటీ సభ్యుడిగా వీరేష్ ఎంపిక అయ్యారు. దీంతో శుక్రవారం గ్రామస్థులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తెదేపా నాయకులు కిష్టప్ప, నాగరాజు, మునిస్వామి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, గద్వాల

O.S. No. 244 of 2020

Between:
Kantha Reddy and others ...Plaintiffs
V/s
Smt. Saralamma & Others ...Defendants

To,
D11 Smt. Varalaxmamma W/o V.Srinivasa Reddy, D/o Late Pedda Ranga Reddy, aged 68 years, R/o Sudapally Village, Veldurthy Mandal, Kurnool district.

NOTICE

పై కేసులో వాదులు అగు కాంతారెడ్డి మరియు ఇతరులు ప్రతివాదులు అయిన మీకు కోర్టు నుంచి పలుమార్లు నోటీసులు పంపినా మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోవడం లేదు.
కావున కోర్టువారి ఆదేశానుసారం పై కేసు తేది 21-01-2026 ఉదయం 10-30 ని॥లకు మీరు ప్రత్యక్షంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులతో..
ఇట్లు

K.Krishna Mohan Reddy,
Advocate, Gadwal

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

దుకాణాల తొలగింపు

ఆదేశాలిస్తున్న డీఎస్పీ భార్గవి

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: మంత్రాలయంలో జాతీయ రహదారిపై రాఘవేంద్ర కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఏర్పాటు చేసుకున్న అక్రమ దుకాణాలు, తోపుడు బండ్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. దాంతో డీఎస్పీ భార్గవి శుక్రవారం పరిశీలించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఎస్సై మల్లికార్జున పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాలను తొలగించారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

ఎమ్మిగనూరు గ్రామీణం: ఎమ్మిగనూరు మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం నందవరం తహసీల్దారు శ్రీనివాసులు అక్కడ ఇన్‌ఛార్జి తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ పని చేస్తున్న తహసీల్దారు శేషఫణి బదిలీ అయి నెల రోజులవుతోంది. సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: 34వ వార్డులో ఉన్న కల్వర్టుతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చర్యలు చేపట్టాలి. **- బాషా, కాలనీవాసి** ✔: కల్వర్టుకు మరమ్మతులకు చేయిస్తాం. **- గంగిరెడ్డి, కమిషనర్**

?: ఎమ్మిగనూరులోని క్లబ్ ఏరియాలో కల్వర్టు పనుల త్వరగా పూర్తి చేయాలి. **- ఆంజనేయులు, కాలనీవాసి** ✔: సమస్యను పరిశీలించి గుత్తేదారుడికి చెప్పి పనులు పూర్తి చేయిస్తాం. **- నాయక్, డీఈఈ**

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగి మండలంలోని దొడ్డిబెళగల్ గ్రామంలో డ్రైనేజీ కాల్వలో మురుగు నీరు నిండి దుర్వాసన వస్తోంది. **- ఈరన్న, స్థానికుడు**

✔: కార్మికులను పంపించి కాల్వలోని మురుగు నిటిని తొలగిస్తాం. **- పద్మమ్మ, సర్పంచి , దొడ్డిబెళగల్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: చిన్నతుంబళం గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. రాత్రిళ్లు దాంతో దోమల బెడద ఎక్కువైంది. **- హనుమంతు, గ్రామస్థుడు**

✔: సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు**

సి.బెళగల్: ?: పోలకల్ గ్రామంలో కోళ్ల పారాల్లో మౌలిక వసతులు కల్పించాలి. **- శ్రీనివాసులు కాలనీవాసి** ✔: సమస్యను ఏఈ వెంకట ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వర, సి.బెళగల్**

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: గ్రామంలో ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న రెండు అదనపు గదులను పూర్తిచేయాలి. **- రాజ్ ఎస్సీ కాలనీ పోలకల్** ✔: సర్వశిక్ష అభియాన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి సమస్య తీసుకుంటాం. **- ఎంపీడీవో, రాణెమ్మ, సి.బెళగల్**

ఈర్లదిన్నె, (సి.బెళగల్) న్యూస్‌టుడే: ?: ఈర్లదిన్నె గ్రామం నుంచి మునగాల గ్రామానికి వెళ్లే రహదారిని పూర్తి చేయాలి. **- వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్థుడు** ✔: రహదారి విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ కర్రెన్న దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీవో రాణెమ్మ సి.బెళగల్**

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం రైతులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వం మాత్రం వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అన్నదాతలు సంక్రాంతి సంబరాలు సంతోషంగా జరుపుకోనేలా పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసి, ఉల్లికి నష్టపరిహారం అందించిందన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లయ్య, నాయకులు ఈరన్నగౌడ్, తిరుపతయ్యనాయుడు, కేజీ వెంకటేష్, చంద్రశేఖర్, లక్ష్మనరసింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బు రోగులకు ఉచితంగా ఇంజక్షన్

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె జబ్బుతో వచ్చే పేద రోగులకు అత్యవసర క్రిటికల్ కేర్ కింద రూ.50 వేల విలువైన ఇంజక్షన్‌ను కూటమి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసుపత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాలు, యంత్రాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లయ్య, సూపరింటెండెంట్ ఆదినాగేష్, మహేష్, రామకృష్ణ, అంబేడ్కర్, నరసింహులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు.. ★ అనుమతులు లేకుండానే క్రయవిక్రయాలు

కొనుగోలుదారులకు పాట్లు

పట్టణ శివారులో వేస్తున్న అక్రమ లే అవుట్లు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నిబంధనలు తుంగలో తొక్కారు. అనుమతులు లేకుండా అక్రమ లేవుట్లు వేశారు. వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వాటిని కొనుగోలు చేస్తే ఇబ్బందులే. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వ్యవసాయ భూమిని మార్చాలంటే మార్కెట్ విలువకు తగ్గట్లు ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. ఇవేమీ లేకుండానే క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో భారీగా అనుమతి లేని అక్రమ లేఅవుట్లతో దందాలు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి

వ్యవసాయ భూమిని కమర్షియల్(నాన్‌అగ్రికల్చర్ ల్యాండ్)గా మార్చాలంటే కన్వర్షన్ ప్రక్రియ తప్పనిసరి. నిబంధనల ప్రకారం సుమారు పది శాతం రిజర్వ్ స్థలాన్ని ఖాళీగా ఉంచాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఆ తర్వాత కుడా నుంచి అనుమతి పొందాలి. ప్లాట్లు వేసుకుని విక్రయించుకోవచ్చు. గత వైకాపా హయాంలో ఇవేవీ పట్టించుకోలేదు. వారికి నోటీసులు జారీ చేసిన మమ అనిపించి వదిలేశారు.

సెంటు రూ.7 - నుంచి రూ.50 లక్షలు

గత వైకాపా హయాంలో గుడేకల్లు రహదారిలో దాదాపు 60 ఎకరాల్లో పైగానే అక్రమ లే అవుట్లు వేశారు. అధికారులు కనీసం నోటీసులతో సరిపుచ్చుకున్నారు. ఇప్పటికైనా అక్రమ లేఅవుట్లు వేస్తున్న అధికారులు రాళ్లు తొలగించి మమ అనిపిస్తున్నారు. దాంతో సెంటు స్థలాన్ని రూ.7 నుంచి రూ.50లక్షలు విక్రయిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

పట్టణంలో మూడు ఎకరాల్లో లేఅవుట్లతో విక్రయిస్తున్నారు. సాయినగర్, లక్ష్మణ్‌టాకీస్ ఏరియా, అబ్బాస్ టాకీస్ ఏరియా ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లు జోరుగా ఊపు అందుకున్నాయి. మంత్రాలయంలో సూగూరు, కల్లుదేవకుంటలో దాదాపు 26 ఎకరాల్లో అక్రమంగా దందాలు సాగిస్తున్నారు.

● మైనార్టీ కాలనీ రహదారిలో మూడు ఎకరాల్లో అనుమతి లేకుండా రోడ్లు వేస్తున్నారు. టిప్పర్ రూ. 6వేల చొప్పున మాసు మట్టిని కొండ నుంచి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్లాట్లల్లో రహదారి, విద్యుత్తు వంటి సదుపాయాలు కల్పించకుండా అక్రమ లేఅవుట్లతో జేబులు నింపుకుంటున్నారు. గూడూరు రోడ్డు, మైనార్టీ కాలనీలో దాదాపు ఎకరంలో అక్రమ లేవుట్లు వేయగా.. 20 అడుగుల రహదారి లేదు. మిలటరీ కాలనీకి వెళ్లే దారిలో ఎనిమిది ఎకరాల్లో ముప్పై అడుగుల రోడ్లు వేసినా ట్యాంకు, పార్కుకు స్థలాలు కేటాయించలేదు. సాయిగణేష్ కాలనీలో దాదాపు ఐదు ఎకరాల్లో అక్రమ లే అవుట్లు వేశారు. కర్నూలు రహదారిలో కల్వ పక్క [illegible]

చర్యలు తీసుకుంటాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు వేస్తే రాళ్లు తొలగిస్తాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వేస్తే చర్యలు తప్పవు. యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. గతంలో కొందరికి నోటీసులు పంపించాం.

అసంపూర్తి నిర్మాణం.. తాగునీటికి కష్టం

తాగునీటి పథకం పనులపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏడేళ్లు కావస్తున్న నీటి ట్యాంకు పనులు పూర్తి చేయలేదు. ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా కాలనీలో నిర్మిస్తున్న నీటి ట్యాంకు అసంపూర్తిగా వదిలేశారు. వెంకటాపురం, సాయినగర్, శిల్పా కాలనీ, కొత్త ఇందిరానగర్, మిలటరీ కాలనీల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును పూర్తి చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

అలంకారప్రాయంగా విశ్రాంతి భవనం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన రెండు అంతస్తుల భవనం అలంకారప్రాయంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఉద్యానశాఖ కార్యాలయాన్ని ఓ గదిలో ఏర్పాటు చేశారు. సీజన్‌ సమయంలో మార్కెట్‌కు దిగుబడులు అమ్మేందుకు 300 నుంచి 400 మంది రైతులు వస్తుంటారు. అధికారులు భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

వసూళ్లు చేస్తారు.. వసతులు కల్పించరు

జాతీయ రహదారిలో వాహనదారుల విశ్రాంత గది, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించాలి. అయితే రుసుం ద్వారా ప్రతిరోజూ దాదాపు రూ.2 లక్షలు వసూళ్లు చేస్తున్నా అధికారులు వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి 167 బళ్లారి-ఆదోని- ఎమ్మిగనూరు- రాయచూరు రహదారిలో అనేక వాహనాలు వెళ్తున్నాయి. బనవాసి ఫారం వద్ద ఏర్పాటు చేసిన విశ్రాంత గదిలో మరుగుదొడ్డు, తాగునీటి కుళాయిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రోజూ ఈ దారి గుండా దాదాపు పదివేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

జలం వృథా.. జనం వ్యధ

మండలంలోని నౌలేకల్ గ్రామంలో పాఠశాల సమీపాన లీకేజీతో తాగునీరు వృథాగా పారుతోంది. దీంతో దిగువ కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. చాలా రోజుల నుంచి పరిస్థితి ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 3 వేల జనాభా ఉంది. సంబంధిత పంచాయతీ అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దకడబూరు

కాలమానిని ఆవిష్కరణ

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో శుక్రవారం రజకసంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్ ఆ సంఘం కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల సంక్షేమం కోసం ఐక్య పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలంలో దోబీఘాట్లు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి బాలు, మండల కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న గురుశేఖర్ తదితరులు

ముత్యాల ముగ్గులు.. రంగుల హరివిల్లు

ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, గూడూరు, న్యూస్‌టుడే: నింగిలోని నక్షత్రాలు నెల వాలాయి.. ప్రజల ముందు చుక్కలై మెరుస్తున్నాయి.. వాటిని ఆడపడుచులు చక్కటి అల్లికలతో ముత్యాల ముగ్గులుగా.. రత్నాల రంగవల్లులుగా.. తీర్చిదిద్దారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో వివిధ ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న మల్లికార్జున

ఆలయ పరిసరాల్లో వేసిన ముగ్గులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన శివశంకర్ టీం, ఉదయ్ టీంలకు బహుమతులు ప్రదానం చేశారు. డీవైఎఫ్ఐ నాయకుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా సి.బెళగల్ యూత్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో చనుగొండ్ల ప్రథమ, పెద్దనాటూరు జట్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వాటికి గ్రామానికి చెందిన ఈ.గోవిందగౌడ్, స్థానిక ఫుడ్‌బాల్ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

బహుమతులు ఇస్తున్న ఎంజీబీ యూత్ సభ్యులు

విజేతగా నిలిచిన చనుగొండ్ల జట్టు

రమణీయం రామలింగేశ్వర రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉత్సవ మూర్తిని తీసుకొస్తున్న సీతారామిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: మంత్రాలయం మండలం రాంపురంలో తుంగభద్ర నదీతీరంలో వెలసిన రామలింగేశ్వర స్వామి జాతర రథోత్సవం వైభవంగా కొనసాగింది. రాంపురం రెడ్డి సోదరులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యుడు సీతారామిరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకుల వేద మంత్రోచ్చారణలతో ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చారు. అనంతరం రథోత్సవం అంగరంగా వైభవంగా సాగింది. మంత్రాలయం, కోసిగి సీఐ రామాంజులు, మంజునాథ్, ఎస్సైలు విజయకుమార్, మల్లికార్జున, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 60 మందితో బందోబస్తు నిర్వహించారు.

ఆలయంలో గోపూజ

కె.నాగలాపురం (గూడూరు), న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరీ అలయంలో కనుమను పురస్కరించుకొని శుక్రవారం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పురోహితులు మంత్రోచ్చారణలో నిర్వహించిన గోపూజలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

ఈర్లదిన్నె(సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని ఈర్లదిన్నెలో వెలసిన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం అభిషేక పూజలు చేశారు. ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో చేరి కుంకుమార్చన, పుష్పార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా దస్తగిరయ్య ఉరుసు

పెంచికలపాడు (గూడూరు), న్యూస్‌టుడే: మండలంలోని పెంచికలపాడులో దస్తగిరయ్య స్వామి ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జియారత్ 13వ పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ ఉరుసులో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని వీధుల్లో పీఠాధిపతిని భక్తులు అశ్వ వాహనంపై ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. కె.నాగలాపురం ఎస్సై అఖిల్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

మహోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతి, భక్తులు

హోరాహోరీగా గిరకలాగుడు పోటీలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మండలంలోని గుడేకల్‌లో గురువారం నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎద్దుల బండి గిరకలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గుడేకల్ రామయ్య వృషభాలు ప్రథమ స్థానం, అదే గ్రామానికి చెందిన చాకలినల్లయ్య ద్వితీయ స్థానం, కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రంగ్‌దాల్‌కు చెందిన నబిసాబ్ వృషభాలు తృతీయ స్థానం, రచ్చుమర్రికి చెందిన మరియాగౌడ్ నాలుగో స్థానం, గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసికి చెందిన తోకనరసన్న ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 30వేలు, రూ. 25వేలు, రూ. 20వేలు, 15వేలు, రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్, మాజీ సర్పంచి పురుషోత్తంగౌడ్, కుమార్‌గౌడ్, డాక్టర్ నవీన్, మాదన్న, గొల్లతిక్కయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరకలాగుతున్న వృషభాలు

శ్రమలో భాగస్వామి ★ సేంద్రియ సాగులో రాణిస్తూ..

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: భర్తకు, భార్య మాత్రమే కాదు.. వ్యవసాయంలో భాగస్వామిగా మారి కుటుంబ ఆదాయానికి తోడ్పడుతోంది. కష్టకాలంలో వెనుకడుగు వేయకుండా, భర్త భుజం తట్టి వ్యవసాయంలో తోడుగా నిలిచింది. ప్రస్తుతం సేంద్రియ మందులు, ఎరువులతోనే వ్యవసాయం చేస్తున్నారు. దేశ విదేశాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. భర్త చేసే పనిలో భార్య తోడుగా అండగా నిలిచింది.

ఆరిమిల్లి అనూషరాణి

గోవులను పోషిస్తూ... పనిలో సహకరిస్తూ

కర్నూలు జిల్లా కోసిగి మండలం కోల్‌మాన్‌పేటకు చెందిన ఆరిమిల్లి క్రిష్ణ సతీమణి ఆరిమిల్లి అనూషరాణి రైతు కుటుంబంలో జన్మించింది. ఆమె బీఎస్సీ పూర్తి చేసింది. వివాహం తర్వాత భర్తకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలుస్తోంది. సుమారు 12 సంవత్సరాల క్రితం రసాయనిక ఎరువులతో సాగు చేసిన పంటల వల్ల ఆరోగ్యానికి ముప్పు ఉందని తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తే బాగుంటుందని అనుకున్నారు. ఆ విషయంపై పలుచోట్ల అవగాహన పొందారు. వారు సేంద్రియ సాగుకు కావలసిన గోమూత్రం, పేడ అవసరమని.. 12 ఏళ్ల వ్యవధిలో 100కు పైగా దేశీయ ఆవులను పెంచారు. వాటికి గడ్డి, దోమతెర తదితర వాటిని ఏర్పాటు చేశారు. నిత్యం వాటి నుంచి వంద లీటర్లకు పైగా మూత్రం సేకరిస్తారు. దాంతో పాటు పేడను ఉపయోగించి సేంద్రియ ఎరువులు, మందుల తయారు చేస్తున్నారు. ఒక లీటరు మూత్రాన్ని సుమారు రూ.20 విక్రయిస్తారు. సేంద్రియ మందులు తయారీలో ఉపయోగిస్తారు. ఈ పనుల్లో ఆరిమిల్లి ఆనూషరాణి భర్తకు వెన్నుదన్నుగా ఉంటోంది. రోజూ వందకు పైగా దేశీయ ఆవుల బాగోగులను ఆమె పర్యవేక్షిస్తూ వాటి పోషణ చూసుకుంటోంది. భర్త సేంద్రియ వ్యవసాయానికి అన్నివిధాలుగా అండగా ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలిచింది.

కబడ్డీ పోటీల్లో ఎరిగేరి విద్యార్థుల ప్రతిభ

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలం ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గడివేముల మండలం చింతకూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జిల్లాస్థాయి అండర్ - 17 విభాగంలో కబడ్డీ టోర్నమెంటు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 56 జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో ఎరిగేరి జడ్పీ పాఠశాల జట్టు వెలుగోడు జట్టుపై విజయం సాధించి కప్పు కైవసం చేసుకుంది. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు రాము, గ్రామస్థులు అభినందించారు.

పోటీల్లో విజేతగా నిలిచిన ఎరిగేరి జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు

రసాయన రంగులతో పర్యావరణానికి ముప్పు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రసాయనాలతో తయారుచేసిన రంగులు పర్యావరణానికి ముప్పు అని ఎమ్మిగనూరు సచివాలయ ఉద్యోగాలు పేర్కొన్నారు. ఆర్గానిక్ రంగులపై ప్రతి ఒక్కరూ మొగ్గు చూపాలన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరులో గురువారం తేరు బజార్, లక్ష్మీపేట, ఎన్టీఆర్, ముగతి పేట కాలనీలోని ప్రజలకు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

జాతరలో వసూళ్లపై చర్యలకు డిమాండు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: జాతరలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ నాయకులు రంగన్న డిమాండు చేశారు. స్థానిక సోమప్ప కూడలిలో శుక్రవారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. రంగన్న మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారస్తుల నుంచి రూ.6 వేలు పైగానే వసూళ్లు చేస్తున్నారన్నారు. నీలకంఠేశ్వరస్వామి రథోత్సవంలో గజం రూ.6 వేలకు పైగానే వసూళ్లు చేస్తున్నారన్నారు. తేరు బజార్ దాదాపు రూ. లక్షల్లో వసూళ్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిమ్మగురుడు, విజయేంద్ర, మల్లికార్జునగౌడ్, మాలిక్, ఖాజా, ఇస్మాయిల్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకుడు రాజేష్ డిమాండు చేశారు. ఆదోనిని పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. సోమప్ప కూడలిలో శుక్రవారం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాజేష్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు ప్రాంతంలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుకూలమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రంగయ్య, చిన్నిప్రసాద్, రాముడు, నాని, రాజోలప్ప, కేటయ్య, ఓబులేశు, ఏసురాజు, రమేష్ పాల్గొన్నారు.

సోమప్ప కూడలిలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జిల్లా సాధనకు ఉద్యమాలు ఉద్ధృతం చేస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఆదోని జిల్లా ఏర్పాటు చేయకుంటే ఉద్యమాలు మరింత ఉద్ధృతం చేస్తామని ప్రజా సంఘాల కన్వీనర్ గణేష్ హెచ్చరించారు. పట్టణంలోని వైఎస్సార్ కూడలిలో శుక్రవారం నాయకులు దీక్షలు చేపట్టారు. ఆదోని జిల్లా చేయాలని నినాదాలు చేశారు. గణేష్ మాట్లాడుతూ.. పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టులు, విద్య పరంగా పశ్చిమప్రాంతం అభివృద్ధి చెందాలంటే జిల్లా కేంద్రంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసేబు, రామలింగప్ప, బతకన్న, నీలకంత, నాగరాజు, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కూడలిలో దీక్షలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సేవా కార్యక్రమాలు చేపడతాం

రక్తదానం చేస్తున్న జవాన్లు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఇండియన్ ఆర్మీ దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా జై జవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పర్యవేక్షణలో 20 మంది జవాన్లు కర్నూలు మున్సిపల్ కార్యాలయ సమీపంలోని కర్నూలు సహకార ట్రస్ట్‌లో రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షరీఫ్, జవాన్లు గంగాధర్, మధుసూదన్‌రెడ్డి, రాజు, రాజశేఖర్, సభ్యులు, కర్నూలు బ్లడ్ బ్యాంకు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

కర్నూలు బి.క్యాంపు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వీబీజీ రాంజీ పథకాన్ని, లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ రైతు, కార్మిక, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీఐటియూ నగర కార్యదర్శి పి.నరసింహులు అధ్యక్షత వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ :?: కుమ్మరి వీధి, నేతాజీ వీధి ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాహనదారులు, పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. - స్థానికులు ?: ఏ క్యాంపు, బుధవారపేట వీధుల్లో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. వెంటనే శుభ్రం చేయాలి. - వెంకట్, ✔: ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాం. - నగరపాలక అధికారులు

ప్రగతిశీల భావాలకు ఆద్యుడు త్రిపురనేని

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ డా.ఎ.సిరి

కర్నూలు సచివాలయం: తెలుగు సాహిత్యంలో సామాజిక సంస్కరణలకు ప్రతీకగా నిలిచిన కవిరాజు త్రిపురనేని రామస్వామిని స్మరించుకోవడం తెలుగువారికి గర్వకారణమని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. త్రిపురనేని రామస్వామి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ డా.ఎ.సిరి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకుని సమాజంలో ఆలోచనా విధానానికి బీజం వేసిన మహనీయుడు త్రిపురనేని అని కొనియాడారు. ప్రగతిశీల భావాలకు ప్రాణం పోశారన్నారు. సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ.. త్రిపురనేని రామస్వామి ప్రజలను మేల్కొలిపే హేతువాద భావాలతో రచనలు చేసి, ఆచరణాత్మక మార్పునకు దారి చూపారన్నారు. కార్యక్రమంలో సెట్కూరు కార్యాలయ సిబ్బంది, స్పెషల్ కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఇటీవల జరిగిన 2026 ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో డోన్‌కు చెందిన కె.వినోద్‌కుమార్ 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను కర్నూలు జిల్లా జై జవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ సమక్షంలో రెడ్ క్రాస్ సభ్యులు సన్మానించారు. రామకృష్ణ మాట్లాడుతూ వినోద్‌కుమార్‌ను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్రీడాకారులు బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించాలని కోరారు. ఉపాధ్యక్షుడు షరీఫ్, సభ్యులు పాల్గొన్నారు.

ఇంత చేసి ఉపయోగమేంటి?

☛ కనీస వసతులు లేక ముందుకు రాని లబ్ధిదారులు
☛ రహదారులు అధ్వానం.. తాగునీటికి ఇక్కట్లు

పునాదుల దగ్గరే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు 16 ఏళ్ల కిందట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పందిపాడు గ్రామ పరిధిలో ఇందిరమ్మ కాలనీ పేరుతో 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 2500 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. అయితే ఈ ప్రాంతం నగరానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో గతంలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత వైకాపా ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీని జగనన్న కాలనీగా పేరు మార్చింది. కాలనీకి పేర్లు మారుతున్నా వసతుల్లేక ఇళ్ల నిర్మాణాలు కనీసం పునాదులు దాటడం లేదు.

● కాలనీలో ఇప్పటివరకు వంద మందికి పైగా ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. వైకాపా హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ఆర్థిక సాయం అందించడంతో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమం కింద ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందిస్తుండటంతో ఇప్పుడిప్పుడే ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తున్నారు.

ప్రధాన సమస్యలు ఇవే..

- కల్లూరు పారిశ్రామికవాడ నుంచి, ముజఫర్ నగర్ ప్రాంతాల నుంచి ఈ కాలనీ 3 కి.మీ దూరంలో ఉంది. నగరంలో నుంచి ఇక్కడకు రావాలంటే ఐదారు కి.మీ దూరం ఉంది. కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం లేదు. చెన్నమ్మ కూడలి నుంచి ఒక్కో వ్యక్తికి వంద రూపాయలు ఇస్తామన్నా ఆటోలు ఈ కాలనీకి రాని పరిస్థితి.
- నగరపాలక సంస్థ నుంచి రహదారి నిర్మాణానికి రూ.30 లక్షలు నిధులు మంజూరైనట్లు చెబుతున్నా.. ఏళ్లు గడుస్తున్నా దారుల రూపురేఖలు మారడం లేదు.
- కాలనీవాసులకు తాగునీటి వసతి లేదు. రోజుకు రెండు క్యాన్లు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వాడుక నీటికోసం కాలనీలో అక్కడక్కడా బోర్లు వేయించారు. ఒక్కో కుటుంబం నెలకు రూ.200 చెల్లిస్తేనే నీరందుతుంది.
- కాలనీలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి వదిలేయడంతో ఒక్కొక్కరు రూ.500 వెచ్చించి వీధిదీపాలు ఏర్పాటు చేయించుకుంటున్నారు. రాత్రిళ్లు ఆకతాయిలు, మందుబాబులు ఈ కాలనీని అడ్డాగా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాలనీలో మౌలిక వసతుల కల్పన దిశగా అధికారులు చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

హరిహర క్షేత్రానికి రూ.లక్ష విరాళం

బ్రాహ్మణ సంఘం ప్రతినిధులకు చెక్కును అందచేస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఈ నెల 19 నుంచి 29 వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు నగర బ్రాహ్మణ సంఘం ప్రతినిధులకు శుక్రవారం చెక్కు అందచేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు వసతులు కల్పించాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. టీజీని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు దుర్గాప్రసాద్, చల్లా నాగరాజు, కంచుగంటల శ్యాంసుందర రావు, రాజశేఖర్, టీవీ రవిచంద్ర తదితరులు ఉన్నారు.

ప్రమాదాలకు ఏం సమాధానం చెబుతారు

నగరంలోని బి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టుకు వెళ్లే వందడుగుల రోడ్డులో రహదారికి ఓ వైపు కంకర పరిచారు. అయితే తారు వేయకుండా గత కొన్ని రోజులుగా వదిలేశారు. దీంతో రాకపోకలు సాగే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. - కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే

కళాశాలను గుర్తుపట్టేదెలా?

స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని కర్నూలు ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ శారద సంగీత నృత్య కళాశాల ఉంది. ఈ కళాశాల బోర్డును చెట్ల కొమ్మలు కప్పేశాయి. కళాశాలను సందర్శించేవారికి ఈ బోర్డు కనిపించడక ఇబ్బంది పడుతున్నారు. కళాశాల యాజమాన్యం స్పందించి కళాశాల బోర్డు కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నాణ్యత చూసి నవ్విపోదురు గాక

ఈ నెల 6వ తేదీన స్థానిక బళ్లారి చౌరస్తాలోని పెట్రోల్ బంకు మలుపు వద్ద ప్రధాన రహదారిపై గుంతను బీటీ తారుతో మరమ్మతులు చేశారు. 24 గంటలైనా గడవక ముందే తారు లేచిపోయి.. గుంత యథాతథంగా మారింది. శుక్రవారం గుత్తేదారు, ఇంజినీర్లు గుంతలను పూడ్చిన ప్రదేశాలను టేపుతో కొలతలు వేశారు. మరమ్మతు పనుల్లో నాణ్యతా లోపాలపై ప్రజలు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

డ్రాగన్ బోట్ క్రీడలను ప్రోత్సహిస్తాం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలో డ్రాగన్ బోట్ క్రీడాభివృద్ధికి సహకరిస్తామని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. జనవరి 12, 13 తేదీల్లో ఆత్రేయపురంలో జరిగిన జాతీయస్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు రన్నర్స్ ట్రోఫీని సాధించారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన జిల్లా క్రీడాకారులను తన ఛాంబర్‌లో అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీల్లో రాణించి జిల్లా పేరును నిలబెట్టాలని సూచించారు. క్రీడాకారులకు అన్ని విధాలా సహకారాలు అందించేందుకు తాము ఎలప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ వాటర్ స్పోర్ట్స్ శిక్షకుడు చంద్రశేఖర్, రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ కార్యదర్శి అవినాశ్‌శెట్టి, ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

సూర్యనారాయణ ఆలయంలో మూలవిరాట్టు ప్రత్యేకాలంకరణ

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కర్నూలులో సంక్రాంతి, కనుమ పండగ వేడుకలను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గడ్డ రోడ్డులోని సూర్యనారాయణస్వామి ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. పాతబస్తీ దక్షిణ శిర్డీ సాయిబాబా ఆలయంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మహాబలేశ్వర్ సజ్జనార్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారి పల్లకిసేవ, గంగిరెద్దు విన్యాసం, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ పేర్కొన్నారు. మండలంలోని కేతవరం, ఓర్వకల్లు గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పలు ఆటల పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, శ్రీధర్, పాషా హుస్, సుధాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్యామలమ్మ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ, గ్రామీణ పరిధిలో వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రజా సంఘాలు, ఆయా రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు ఆటలపోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

పందిపాడులో...

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వెంకాయపల్లిలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా మల్లేశ్వరి, మహేశ్వరి, పావని వరుస స్థానాల్లో నిలిచారు. వారికి ఆలయ ఈవో రాధాకృష్ణ, గ్రామ సర్పంచి మాధురి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు టి.చిన్న మద్దిలేట్టి బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ఈవో రాధాకృష్ణ, సర్పంచి మాధురి

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

వరసిద్ధి వినాయక ఆలయంలో అతిథులను సత్కరించిన వెంకటరాజారెడ్డి

కర్నూలు నగరం: స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో తెలుగు కల్లం సాహితీసమితి ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కవులు, అతిథులు కమలాకర్, నాగయ్య, బలరామయ్య, ఈశ్వరరెడ్డి, జయరామిరెడ్డిలను సమితి అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి సత్కరించారు. అనంతరం రాజారెడ్డి వినిపించిన పలు కవితలు ఆకట్టుకున్నాయి.

ఇద్దరు మహిళా దొంగల అరెస్టు

నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ విక్రమ్‌సింహ సిబ్బంది

కర్నూలు నేరవిభాగం: మహారాష్ట్రలోని అకోలా జిల్లాకు చెందిన రోజీసుల్తానా(45), షేక్ రఫీకా(65) అనే ఇద్దరు మహిళా దొంగలను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గతేడాది నవంబర్ 30వ తేదీన కోడుమూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని శారద, రాజశేఖర్‌రెడ్డి దంపతులు హైదరాబాద్ నుంచి స్వస్థలానికి వెళ్లి కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో వీరి తొమ్మిది తులాల బంగారు ఆభరణాల బ్యాగు అపహరణకు గురైంది. కర్నూలు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మహిళలు చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బ్యాగులో సెల్‌ఫోన్ ఉండటంతో పోలీసులు టవర్ లొకేషన్ ద్వారా రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లగా అక్కడ ఖాళీ బ్యాగు దొరికింది. దొంగలు రైల్లో హైదరాబాద్‌కు వెళ్లినట్లు గుర్తించారు. చోరీకి పాల్పడిన రోజీసుల్తానా, షేక్ రఫీకాలను గుర్తించి అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో చార్మినార్ ప్రాంతానికి చెందిన వ్యక్తికి బంగారు ఆభరణాలు విక్రయించినట్లు తెలుసుకున్నారు. గతేడాది జనవరిలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బ్యాగు దొంగతనానికి పాల్పడినట్లు తెలుసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు శుక్రవారం సీఐ విక్రమ్‌సింహ తెలిపారు.

దాడి ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో వెంకటరమణ కాలనీకి చెందిన సునీల్ మోహన్‌పై దాడి ఘటన ఉత్కంఠగా మారింది. ఈ నెల 9వ తేదీ రాత్రి స్థానిక స్వామిరెడ్డినగర్‌లో ఈయనపై గుర్తుతెలియని వ్యక్తులు 20 మంది దాడి చేసి గాయపరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు కోడుమూరు నియోజకవర్గ బాధ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరుడు కావటంతో రాజకీయంగానూ వివాదంగా మారింది. కేసు దర్యాప్తు బాధ్యతలను సీఐ కంబగిరిరాముడికి అప్పగించారని తెలిసింది. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించే యత్నం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని జోహరాపురానికి చెందిన మహ్మద్ వహాబ్(33) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన ఓ మసీదులో పనిచేసేవారు. ఈ నెల 13వ తేదీన ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: జనవరి 21 నుంచి 28వ తేదీ వరకు మణిపూర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థి శ్రీహిత ఎంపికైనట్లు లక్ష్య ఫుట్‌బాల్ శిక్షకుడు బ్రహ్మకుమార్ శుక్రవారం తెలిపారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: షరీన్‌నగర్‌లోని శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో విశ్వహిందూ పరిషత్, సామాజిక సమరసత దివస్ పురస్కరించుకొని చిన్నారులకు శ్రీరాముడు, కృష్ణుడు గురించి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో హరికకు మొదటి, ప్రభకు ద్వితీయ, మేఘనకు తృతీయ బహుమతులు లభించాయి. వారికి వీహెచ్‌పీ మహిళా నాయకురాలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాళిగి అనంత అభిరామ్, చిట్టర్స్ అధర్వ, ఈశ్వర్, మహాలక్ష్మి, ఉమా, జయమ్మ, కవిత, హేమలత, అరుణ, సోమేశ్వరి, భార్గవి, మంజుల, రాజేశ్వరి, పుల్లమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ కోరారు. శుక్రవారం ఓర్వకల్లులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానించి పోరాటాలు కొనసాగించిన మొట్టమొదటి పార్టీ సీపీఐ అన్నారు. ఈ ఉత్సవాలకు కార్మికులు, కర్షకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు కోస్తాంధ్రలో జరిగే సంక్రాంతి వేడుకలు తిలకించేందుకు తరలివెళ్లారు. తితిదే పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, తెదేపా నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు పుసులూరు ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో వారంతా తరలివెళ్లారు.

రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అవధూత రామిరెడ్డి తాత సేవాసంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరులో రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అన్నదాన కార్యక్రమంలో భోజనం చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో కిస్తీలు

హుసేనాపురంలో కిస్తీలలో పాల్గొన్న భక్తులు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని హుసేనాపురంలో వెలసిన మీరసావలి దర్గాలో శుక్రవారం కిస్తీలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని దర్గా గురువు మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. కాల్వ, హుసేనాపురం, సోమయాజులపల్లె, చెన్నంశెట్టిపల్లె తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు.

టీజీవీ కళాక్షేత్రంలో పుస్తకావిష్కరణ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం 'గవిచెట్టు కథలు' పుస్తకాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, రాయలసీమ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అరుణ్ తదితరులు ఆవిష్కరించారు. జిల్లా పశ్చిమప్రాంతంలో నెలకొన్న సమస్యలు, వలసలు తదితర అంశాలపై పుస్తకంగా సమగ్రంగా వివరించారని వక్తలు అన్నారు. రచయితలు నాగేశ్వరాచారి, వెంకటకృష్ణ, అజీజ్, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న మోహన్, అరుణ్ తదితరులు

జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు: జనవరి 18 నుంచి 23వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రిడ్జి పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పాఠశాల సీఈవో జి.గోపినాథ్ క్రీడాకారులను అభినందించారు. క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి రాష్ట్రానికి పతకాలు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. పాఠశాల కో సీఈవో సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

విజయతీరాలకు చేరుకుని..

☛ డ్రాగన్ బోట్ పోటీల్లో కర్నూలు క్రీడాకారుల సత్తా

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: డ్రాగన్ బోట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేశారు. 2025-26 సంవత్సరంలో జరిగిన జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రదర్శనతో పాటు.. పతకాలు సాధిస్తూ పలువురిని ఆకర్షిస్తున్నారు. వారిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం..

‘హేమా’హేమీలతో తలపడి..

కల్లూరుకు చెందిన హేమారెడ్డి ఎంబీఏ పూర్తి చేశారు. తల్లిదండ్రులు హేమలత, పాపిరెడ్డి. తండ్రి డ్రైవర్. ఈయన 2025 సెప్టెంబర్‌లో నగర శివారులోని గార్గేయపురంలో జరిగిన జిల్లాస్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో రాణించారు. 2025 అక్టోబర్‌లో గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి డ్రాగన్ బోటింగ్‌లో 500 మీటర్ల మిక్స్‌డ్ విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల పురుషుల విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల మిక్స్‌డ్ విభాగంలో రజతం, 500 మీటర్ల పురుషుల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని లోయర్ లేక్ వద్ద జరిగిన 14వ సీనియర్ జాతీయ స్థాయి డ్రాగన్ బోటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈ నెల 12, 13 తేదీల్లో ఆత్రేయపురంలో నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ గోదారి ట్రోఫీలో 500 మీటర్ల విభాగంలో రన్నర్స్ ట్రోఫీ అందుకున్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడం కోసం నిత్యం సాధన చేస్తున్నట్లు వెల్లడించారు.

నవీన్ జోరు.. జట్టుకు హుషారు

కల్లూరుకు చెందిన నవీన్‌కుమార్ బీఎడ్ చదువుతున్నారు. తల్లిదండ్రులు పుణ్యవతి, బి.శ్రీనివాసులు. తండ్రి దినసరి కూలి. 2025 సెప్టెంబర్ 25వ తేదీన కర్నూలు శివారులోని గార్గేయపురంలో జరిగిన జిల్లా స్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో రాణించారు నవీన్‌కుమార్. 2025 అక్టోబర్‌లో గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 500 మీటర్ల మిక్స్‌డ్‌లో స్వర్ణం, 500 మీటర్ల పురుషుల విభాగంలో రజతం, 200 మీటర్ల పురుషుల విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల మిక్స్‌డ్ విభాగంలో వెండి పతకం సాధించారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ సమీపంలోని లోయర్ లేక్ వద్ద నిర్వహించిన 14వ సీనియర్ జాతీయ స్థాయి డ్రాగన్ బోటింగ్ పోటీల్లో బి-10 పురుషుల విభాగంలో నాలుగో స్థానంలో నిలిచారు. అలాగే ఆత్రేయపురంలో జరిగిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీల్లో 500 మీటర్ల విభాగంలో రన్నర్స్ ట్రోఫీతో పాటు.. నగదు బహుమతి కైవసం చేసుకున్నారు.

వాతావరణ కేంద్రంలో వేడుకలు

కర్నూలు సచివాలయం: భారత వాతావరణ విభాగం ఏర్పడి 151 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని వాతావరణ కేంద్రాల్లో వేడుకలు నిర్వహించారు. నగరంలోని బిర్లాగేట్ వద్ద ఉన్న వాతావరణ విభాగాన్ని గురువారం వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సందర్శించారు. పరికరాల గురించి కేంద్ర అధికారులు పి.ప్రభాకర్, నాగలింగయ్య, ఉదయ్ కిరణ్ వారికి వివరించారు.

భాజపా సంబరాలు

కర్నూలు బి.క్యాంపు: మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో భాజపా కూటమి విజయం సాధించడంతో నగరంలోని బాలాజీనగర్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతామాధురి ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కుర్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

సంబరాల సంక్రాంతి

గుడ్లూరులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వస్థలాలకు రావడంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఏ వీధిలో చూసినా రంగవల్లులు కనువిందు చేశాయి. పలు గ్రామాల్లో ఆటలపోటీలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ క్షేత్రాల్లో నిర్వహించిన పార్వేట ఉత్సవం కనుల పండువగా సాగింది.

– న్యూస్‌టుడే, బృందం

జేపీ చెరువులోని క్షేత్రం నుంచి పార్వేటకు బయలుదేరిన రంగనాయకస్వామి

జిల్లా కేంద్రం... కళాశాల విద్యకు దూరం!

▶ మార్కాపురంలో పరిస్థితి ఇది ▶ పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్నత చదువులు

ఈనాడు, ఒంగోలు

పశ్చిమ ప్రకాశంలో ఉన్నత విద్యావకాశాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. నూతన జిల్లా కేంద్రం మార్కాపురంలో పరిస్థితి మరీ దారుణం. ప్రభుత్వం పరంగా డిగ్రీ, జూనియర్ కళాశాలలు అందుబాటులో లేవు. దీంతో పేద విద్యార్థులు ముఖ్యంగా బాలికలు పై చదువులకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఈ లోటును భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

దశాబ్దాలుగా పట్టించుకోక...

కొత్త జిల్లా పరిధిలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. దశాబ్దాలుగా పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో మార్కాపురం నియోజకవర్గంలో మాత్రం లేదు. కాస్త స్థోమత ఉన్నవారు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరుతున్నా... వేలకు వేలు ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల వారు అక్కడితో చదువు ఆపేస్తున్నారు. అబ్బాయిల్లో కొందరు నరసరావుపేట, ఒంగోలు తదితర ప్రాంత కళాశాలల్లో చేరుతున్నా... అమ్మాయిలను అంత దూరం పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో వారి చదువు మధ్యలోనే ఆగిపోతోంది.

ఇంటర్‌దీ అదే దుస్థితి...

జూనియర్ కళాశాలల పరంగానూ మార్కాపురం నియోజకవర్గంలో అదే పరిస్థితి కొనసాగుతోంది. పొదిలిలో మినహా మరెక్కడా ఆ ఊసు లేదు. నియోజకవర్గాల పరంగా చూస్తే యర్రగొండపాలెంలో నాలుగు, గిద్దలూరులో నాలుగు, కనిగిరిలో మూడు కళాశాలలున్నాయి. ఉన్నత పాఠశాలల్లోనే ప్లస్ 2 ఏర్పాటు చేశారు. మార్కాపురంలో ఆ భాగ్యమూ లేక సమస్య నెలకొంది. ఈ విషయమై ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి స్పందిస్తూ... జిల్లా కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటు ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మాట్లాడి స్థానికంగా ఉన్నత విద్యావకాశాలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

తొడగొట్టిన కోడి

▶ గోదావరి జిల్లాలను తలపించిన పందెం బరులు

కోడి తొడగొట్టింది... పొట్టేలు కాలు దువ్వింది... పెద్ద ఎత్తున కరెన్సీ కట్టలు చేతులు మారాయి. సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా... గోదావరి జిల్లాలను తలపించే స్థాయిలో బరులు ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో పందేల రూపంలో రూ.వంద కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా.

–న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

కందుకూరు, ఉలవపాడు ప్రాంతాల్లో పండగ రోజులకు ముందు పోలీసులు దూకుడుగా వ్యవహరించారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన బరులను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. తీవ్ర స్థాయిలో పోటీలు జరిగే ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్న వారే నేరుగా కోళ్లు పట్టుకుని పందేలు వేయడంతో స్థానిక నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీరప్రాంత మండలాలతో పాటు సంతనూతలపాడు, చీమకుర్తి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. పోటీలు వీక్షించేవారి నుంచి ఎంట్రీ ఫీజులు వసూలు చేసి... బరుల వద్దే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. భోజన వసతి కల్పించారు. ఒంగోలు సమీప నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పాటు తెలంగాణ నుంచి వచ్చిన మరో ఎమ్మెల్యే పోటీల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పశ్చిమ ప్రకాశంలోనూ కొండలు, అటవీ పరిసరాల్లో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించారు. మార్కాపురంలో బరి ఏర్పాటు చేసినా కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో చెడ్డ పేరు వస్తుందని చివరి నిమిషంలో వెనక్కు తగ్గినట్లు తెలిసింది.

చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలెం బరిలో తలపడుతున్న కోళ్లు

మార్కాపురం, ప్రకాశం జిల్లాల పరిధిలో 20కి పైగా పెద్ద బరులు ఏర్పాటయ్యాయి. మూడు రోజుల్లో దాదాపు రూ.వంద కోట్లు చేతులు మారినట్లు అంచనా. పెద్ద శిబిరాల్లో కొన్ని పందేలు రూ.కోటికి పైగా జరిగినట్లు సమాచారం.

ఒంగోలు మండలం ఉలిచిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శనలో... పొట్టేళ్ల కొమ్ములకు రాజకీయ పార్టీల రంగులు పూశారు. వాటి చర్మంపై ఉన్న వెంట్రుకలనూ కత్తిరించి బాస్, డాన్ అన్న పేర్లు తీర్చిదిద్దారు.

ముగ్గుల్లో ముచ్చటైన సందేశం

ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కనిగిరి శివనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో... బ్యాల వివాహాలు, బాలికా విద్య ప్రాధాన్యం, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను కళ్లకు కట్టేలా తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆలోచింపజేశాయి. విజేతలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యుడు గుత్తి శ్రీధర్ బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కనిగిరి

సమన్వయ లోపం... అందని రక్షిత జలం

న్యూస్‌టుడే – యర్రగొండపాలెం పట్టణం

శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణా కొరవడడంతో యర్రగొండపాలెం వాసులకు రక్షిత జలాలు సక్రమంగా అందడం లేదు. వివరాల్లోకి వెళ్తే... త్రిపురాంతకం మండలం నడిగడ్డలోని ఎస్.ఎస్.ట్యాంకు ద్వారా యర్రగొండపాలెం పట్టణంతో పాటు మండలంలోని పన్నెండు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా చేస్తున్నారు. పథకం నిర్వహణ చూస్తున్న గుత్తేదారుకు జిల్లా పరిషత్ నుంచి ఏటా దాదాపు రూ.కోటి చెల్లిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత నాలుగేళ్లుగా పైపులు దెబ్బతిన్నా, కుళాయిలు విరిగినా, పెద్ద మొత్తంలో జలాలు వృథాగా పోతున్నా పట్టించుకున్న వారు కరవయ్యారు. నీటి శుద్ధి, క్లోరినేషన్ సైతం పెద్దగా చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల స్థానికులే పైపులైనుకు మరమ్మతులు చేయిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా ఇటు పంచాయతీ వారు కాని, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆర్‌డబ్ల్యూఎస్ X పంచాయతీ

పైపులైను దెబ్బతిని వృథాగా పోతున్న నీరు

సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు స్పందిస్తూ... 'పథకం పనులు పూర్తయ్యాక నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలకు అప్పగించాం. పైపులైను మరమ్మతులు వంటివి వారే చూసుకోవాలి. మాకు సంబంధం లేద'ని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య మాట్లాడుతూ... పథకాన్ని అప్పగించలేదని, మరమ్మతులతో మాకు సంబంధం ఉండదని తెలిపారు. నీరందక కొన్ని ప్రాంతాల వారు ఇబ్బంది పడుతుంటే... మానవతా దృక్పథంతో స్పందించి బాగు చేయిస్తున్నట్లు వెల్లడించారు. విషయం ఏదైనా శాఖల మధ్య సమన్వయం లేక ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉన్నతాధికారులైన స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉపాధి ఇక భారమే!

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు, చేర్పులు చేసి.. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' (వీబీ జీ రామ్ జీ) పేరుతో ఏప్రిల్ 1 నుంచి అమలుకు నిర్ణయించింది. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పంచాయరాజ్‌శాఖ ఆదేశాలతో ఈ నెల 5న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కొత్త పథకంలో కూలీల పని దినాలు పెంచడం కొంత ఉపశమనం కలిగిస్తున్నా... ఇప్పటి వరకు పది శాతంగా ఉన్న రాష్ట్ర వాటాను 40 శాతానికి పెంచడం అదనపు భారం కానుంది. – న్యూస్‌టుడే, కలెక్టరేట్

2007 నుంచి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.403.29 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనాల కింద రూ.253.55 కోట్లు చెల్లించారు. ప్రస్తుతం రాష్ట్ర వాటా కింద ఈ మొత్తం వ్యయంలో పది శాతం అంటే రూ. 40.30 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది. కొత్త పథకంలో అయితే ఇదే పరిస్థితుల్లో రూ.

పథకంలో మార్పుల ఫలితం

161.20 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కూలీల వేతనాల చెల్లింపుల ఆధారంగా ఈ భారం ఉంటుంది. కూలీల వేతన బడ్జెట్‌లో 60:40 కింద మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కేటాయించనున్నారు.

కాంపొనెంట్ నిధులు పెరుగుతాయ్...

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం పరిధిలో 3.59 లక్షల ఉపాధి కార్డులు జారీ చేయగా... 6.22 లక్షల మంది కూలీలు పనులకు వచ్చారు. పల్లెల్లో ప్రభుత్వ భవనాలు మొదలు అన్ని రకాల రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద విడుదలయ్యే మెటీరియల్ కాంపొనెంట్ నిధులే ప్రధాన ఆధారం. 'వీబీ జీ రామ్ జీ' పథకం అమల్లోకి వచ్చాక కూలీల పనిదినాలు 100 నుంచి 125కు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంపొనెంట్ నిధులు సైతం పెరగనున్నాయి. తద్వారా పల్లెల్లో సీసీ, గ్రావెల్, బీటీ రోడ్లు, మురుగు కాలువలు, పండ్లతోటలు, మొక్కల పెంపకంతో పాటు... ఇంకుడు గుంతలు వంటి జల సంరక్షణ పనులకు మరింత ఊతం లభించనుంది.

నాలుగేళ్లలో ఉపాధి నిధుల వినియోగం...

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2022-23	595.41
2023-24	520.39
2024-25	402.71
2025-26	403.29 (ఇప్పటివరకు)

(c) eenadu

పశ్చిమ ప్రకాశం..ప్రమాదాల ప్రయాణం..

❖ సూచిక బోర్డులు లేవు, మరమ్మతులు కానరావు
❖ చోద్యం చూస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, మార్కాపురం:

పశ్చిమ ప్రకాశం (మార్కాపురం జిల్లా)లోని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ప్రధాన రహదారులు (మేజర్ రోడ్లు), రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో పాటు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

తాడివారిపల్లె వద్ద రక్షణ గోడ లేని రోడ్డు

తిప్పాయిపాలెం దాటితే చాలు..

మార్కాపురంలో ఉన్న అమరావతి- అనంతపురం జాతీయ రహదారి (544-డి)లో మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామం దాటిన తర్వాత, మిట్టమీదపల్లె అడ్డరోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఎత్తుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు చెబుతున్నారు.

❖ ఈ రహదారిలో అయిదేళ్లలో ఇప్పటి వరకు 15 మంది వరకు మృతి చెందగా వందల మంది గాయపడ్డారు. మండలంలోని చింతకుంట, కోమటికుంట సమీపంలోని జంక్షన్ వద్ద అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం మరో కారణం.

❖ జాతీయ రహదారి 565పై మండలంలోని దేవరాజుగట్టు- దరిమడుగు గ్రామాల మధ్య ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోయారు.

పెద్ద పెద్ద గుంతలు, భారీ మలుపులు

మార్కాపురం- తర్లుపాడు రహదారిలో సీతానాగులవరం నుంచి తర్లుపాడు వరకు రహదారి పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా ఉండి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి.

❖ ఒంగోలు- కర్నూలు హైవే రోడ్డులో తాడివారిపల్లె గ్రామం దాటిన తర్వాత ఘాట్ రోడ్డులో భారీ మూలమలుపు వద్ద తరచూ లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు ప్రమాదానికి గురి అవుతున్నాయి.

❖ కొనకనమిట్ల మండలంలోని పొదిలి- గిద్దలూరు రహదారిలోని చిన్నారికట్ల వద్ద ఆరు నెలల్లో 15 ప్రమాదాలు జరిగాయి. చిన్నారి కట్ల జంక్షన్ కాగా, ఎలాంటి సూచికలు లేవు.

❖ పొదిలి- ఒంగోలు రహదారిలోని మర్రిచెట్లపాలెం వద్ద ఉన్న ముసి వంతెన ప్రాంతం అంతా గుంతలమయం. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో అయినా అధికారులు మరమ్మతులు చేపట్టి, సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..

యాదవ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు యాదవ కుల అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' యాదవ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతోపాటు సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.



మరిన్ని వివరాలకు
9154772006,
9154366099
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

✪ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సాప్ ద్వారా చేసుకోవచ్చు. అందుకు సంబంధించిన వధూవరుల బయోడేటా & ఫొటోలను పక్కన ఇచ్చిన నంబర్లకు వాట్సాప్‌లో పంపవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

అంబరాన్నంటిన భవనాశి తెప్పోత్సవం

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. రెండు దేవాలయాల పాలకమండలి ఛైర్మన్లు మందలపు మురళీ సుధాకర్‌రావు, గుంజి శ్రీనివాస్ నేతృత్వంలో సహాయ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, మల్లినేని లక్ష్మయ్య ఉత్సవాలను నిర్వహించారు. అద్దంకితోపాటు సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అందంగా తయారు చేసిన హంస వాహనంపై ఉభయ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి భవనాశిలో తెప్పోత్సవం జరిపించారు. ముందుగా రెండు ఆలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షిణ చేశారు. కూష్మాండ బలి హరణ కార్యక్రమాన్ని ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ నిర్వహించారు. అనంతరం భవనాశిలో తెప్పోత్సవం భక్తుల కోలాహలం మధ్య ముగిసింది.

భవనాశి తటాకంలో ఊరేగుతున్న దేవతామూర్తులు

దర్శి డీఎస్పీ ఆధ్వర్యంలో లైవ్‌జాకెట్ల రక్షణ మధ్య..

దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ నేతృత్వంలో అద్దంకి, అద్దంకి గ్రామీణ సీఐలు ఏ.సుబ్బరాజు, సీహెచ్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెప్పపై కూర్చున్న ప్రతి వ్యక్తి కచ్చితంగా లైవ్ జాకెట్లు వేసుకోవాలనే నిబంధనతో కొంతమేర రద్దీని తగ్గించగలిగారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి పారువేట ఉత్సవం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి పారువేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను ఉత్సవాన్ని నిర్వహించారు. హిందూ ధర్మాన్ని ప్రచారంచేసిన హరిదాసులను స్థానిక ఆలయంలో ఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలపాతం వద్ద భక్తులు

భైరవకోనలో పర్యాటకుల సందడి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శైవ పుణ్య క్షేత్రం భైరవకోన పర్యాటకులతో కళకళలాడింది. గురు, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. జలపాతం వద్ద స్నానాలు ఆచరించి సందడి చేశారు. కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భైరవకోన ట్రస్టుబోర్డు ఛైర్మన్ ముప్పాళ్ల శ్యామ్‌సుందరర్‌రాజు, సిబ్బంది పర్యవేక్షించారు. దాతల సహకారంతో భోజన వసతి కల్పించారు.

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

❒ కరవదిలో ఉత్సాహంగా బీచ్ కబడ్డీ పోటీలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టు, 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సూచించారు. సంక్రాంతి క్రీడా సంబరాలు, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ క్రీడాపరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు మండలం కరవది గ్రామంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు, క్రీడల్లోనూ యువత రాణించాలని ఆకాంక్షించారు. విశాఖ-కృష్ణా, గుంటూరు-బాపట్ల జిల్లాలకు చెందిన కబడ్డీ జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఎన్టీఆర్ క్రీడాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి రంగారావు, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కర్‌రావు, ఎన్నారై సాధినేని సురేష్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, ఆర్టీసీ కంట్రోలర్ సుంకర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

చిన్న కొత్తపల్లిలో బయల్పడిన ఉండ్రాళ్ల గణపతి

అద్దంకి మండలం చిన్న కొత్తపల్లి పొలాల్లో గురువారం మధ్యాహ్నం 'ఉండ్రాళ్ల గణపతి' విగ్రహం బయల్పడింది. చారిత్రక పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి పరిశీలించి క్రీ.శ. 14వ శతాబ్దం నాటిదిగా గుర్తించారు. మూడు అడుగుల ఎత్తు, ఒకటిన్నర అడుగుల వెడల్పుతో... తొండం కుడివైపు తిరిగి, స్వామి చేతిలోని ఉండ్రాళ్లు తింటున్న రీతిలో ఉంది. స్థానికులు పూజాదికాలు నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం గ్రామ ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, అద్దంకి

ఉలిచి.. బరిలో పొట్టేళ్లు నిలిచి!

పొట్టేళ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 25 పొట్టేళ్లు పాల్గొన్నాయి. వీటి యజమానులైన కంచరగుంట శ్రీనివాసరావు, ఉలిచి, విల్లా పెద్దమ్మ నేకునంబాదు, నాలి వెంకట ప్రసాద్ నాగంబొట్లపాలేనికి చెందిన పొట్టేళ్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వారికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులతోపాటు, ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చుంచు సింగయ్య, మండువ సుబ్బారావు, మన్నె హరిబాబు, చుంచు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

ఒంగోలు నేరవిభాగం: ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఒంగోలు బస్టాండ్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. టీఎస్‌ఆర్టీసీకి చెందిన బస్సు దేవరకొండ నుంచి తిరుపతి వెళ్తూ రాత్రి 9.35 గంటలకు ఒంగోలు డిపోకు చేరింది. ఆ సమయంలో పూర్తిగా మద్యం మత్తులో ఉన్న ఎం.నాగార్జున అనే వ్యక్తి కావలికి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సు కావలి పట్టణంలోకి వెళ్లదని చెప్పడంతో ఆగ్రహించాడు. డిపోలోకి వెళ్లాల్సిందేనని పట్టుబట్టాడు. కుదరదని చెప్పడంతో డ్రైవర్ లక్ష్మయ్యతో గొడవపడి ముఖంపై దాడి చేశాడు. రెండో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు అతడిని అడ్డుకుని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

ఉత్సాహంగా పోలు రాధా పోటీలు

పోలు రాధా పోటీల్లో బండిని లాగుతున్న ఎడ్లు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటుబండి పోలు రాధా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో మొత్తం పది జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం పెదపూడికి చెందిన అలహరి కృష్ణయాదవ్‌కు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన పాలపర్తి మూగయ్యకు చెందిన ఎడ్లు రెండో స్థానం దక్కించుకొని రూ.30 వేల నగదు బహుమతి సాధించాయి. చెరుకుపల్లికి చెందిన జజ్జర యలమందల వెంకట గోపాలకృష్ణకు చెందిన ఎడ్ల జత మూడో స్థానం కైవసం చేసుకొని రూ.20 వేల నగదు బహుమతి సొంతం చేసుకొన్నాయి. కొత్త మద్దిబోయినవారిపాలేనికి చెందిన పిన్నబోయిన మణీంద్ర యాదవ్‌కు చెందిన, నెల్లూరు జిల్లా రాజుపాలేనికి చెందిన బొట్ట బాలకృష్ణ యాదవ్‌కు చెందిన, ఉప్పుగుండూరులో జ్ఞానసాయి దీపక్‌కు చెందిన ఎడ్లు తరువాత స్థానాల్లో నిలిచాయి. వారికి కూడా నగదు బహుమతులు అందించారు. ఈ పోటీలకు వ్యాఖ్యతగా శేఖర్‌రెడ్డి వ్యవహించారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులకు సరస్వతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నార్నె నాగభూషణం సత్కరించారు. గ్రామంలోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి యువకులు, మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని ఆసక్తిగా పోటీలను తిలకించారు. కాకతీయ సేవాసమితి అధ్యక్షుడు కనగాల రామకృష్ణ, సభ్యులు బెల్లం రాఘవయ్య, శేషయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 164, రిటైల్ లైవ్ - 191, చికెన్ విత్ స్కిన్ - 277, చికెన్ స్కిన్‌లెస్- 315

నేను ఫోన్ చేసినా తీయరా?

❖ మార్కాపురంలో ఓ ప్రజాప్రతినిధి తమ్ముడు కుమారుడి రచ్చ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒక ప్రజాప్రతినిధి సోదరుడి కుమారుడు ఆగ్రహించారు. నేను ఫోన్ చేసినా తీయరా..? అంటూ స్థానిక పోలీసు అధికారులను ఉద్దేశించి బూతులతో రెచ్చిపోయాడు. మార్కాపురం జిల్లాలో గురువారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇదే జిల్లాలోని ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మార్కాపురంలో గురువారం రాత్రి గస్తీ పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో ఒక యువకుడు పట్టుబడ్డాడు. అతని ద్వారా సమాచారం అందుకున్న ప్రజాప్రతినిధి తమ్ముడి కుమారుడు రంగంలోకి దిగాడు. అప్పటికే అక్కడి నుంచి సదరు సీఐ వెళ్లిపోగా.. అక్కడున్న క్షేత్రస్థాయి పోలీసులపై అతను బూతులతో విరుచుకుపడ్డాడు. స్థానిక అధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదని వారిని సైతం పరుష పదజాలంతో దూషించాడు. ఆ అన్నగారి తమ్ముడి కొడుకు వ్యవహారం మార్కాపురం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పురాతన కామాక్షి ఆలయంలో చోరీ

❖ నిందితుడి పట్టివేత

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీఎస్.పురంలోని పురాతన కామాక్షి చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అతి తక్కువ వ్యవధిలో పట్టుకున్నారు. ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి కామాక్షి ఆలయ హుండీలో నగదు చోరీకి గురైంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఆలయాన్ని సందర్శించి ధ్వంసమైన హుండీ, గడ్డపారను పరిశీలించారు. ఈ మేరకు అనుమానితుల గురించి ఆరా తీశారు. అందులో భాగంగా స్థానిక వడ్డెపాలేనికి చెందిన బండారు రాంప్రసాద్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి తమదైన శైలిలో విచారించగా..తానే ఆలయంలో నగదు చోరీ చేసినట్లు నేరం అంగీకరించాడు. ఆ నగదును జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద చిల్లచెట్లలో దాచినట్లు చెప్పడంతో అక్కడికి వెళ్లి రూ.64,836 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర నాయక్ చెప్పారు. ఆలయ అర్చకులు కె.శ్రీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు రాంప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంతకుముందు సంఘటనా స్థలంలో ఒంగోలు క్లూస్ టీం సీఐ రవీంద్రనాథ్‌రెడ్డి, పోలీసులు ఆధారాలు సేకరించారు.

స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్సై వెంకటేశ్వర నాయక్

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం

జిల్లాలోని పలుగ్రామాలు రహదారులు, ఇతర ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఎనిమిది మంది మృతిచెందారు. పండుగ వేళ ఇలా జరగడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారులు..

తాడి వెంకయ్య మహాలక్ష్మి

పి.గుడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో తల్లి, కుమారుడు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం..పి.గుడిపాడుకు చెందిన తాడి మహాలక్ష్మి(73), తాడి వెంకయ్య (55) తల్లీ కుమారులు. ఇద్దరూ ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే పి.గుడిపాడు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తాడి వెంకయ్య కండక్టర్‌గా అద్దంకి డిపోలో పనిచేస్తున్నారు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని విశ్రాంత చోదకుడు..

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ **కోమటిగుంట చెన్నకేశవులు** (65)దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఏఎస్సై సైదయ్య అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామ్‌నగర్ వద్ద కుటుంబ సభ్యులతో నివాసముంటున్న ఆయన ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్. పక్షవాతంతో రోజూ ఇంటి నుంచి బస్టాండ్ వరకు చేతికర్ర సాయంతో నడుచుకుంటూ వచ్చి వెళుతుంటారు. శుక్రవారం కూడా బస్టాండ్‌కు వచ్చారు. ఇదే సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు ఒంగోలు నుంచి 44 మంది ప్రయాణికులతో అద్దంకి బస్టాండ్‌లోని పాయింట్ వద్దకు వస్తూ ముందు భాగంనుంచి ఆయనను ఢీకొట్టగా వెనుక చక్రాల కింద పడి నుజ్జయ్యారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య వీరనారాయణమ్మ, బంధువులు చేరుకుని మృతదేహాన్ని చూసి తల్లడిల్లారు. సీ.ఐ.సుబ్బరాజు ఆధ్వర్యంలో మృతదేహానికి పంచనామా జరిపారు. కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్.ఐ. తెలిపారు.

సాగర్ కాలువలో పడి యువకుడు..

పుల్లలచెరువు (యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: సాగర్ కాలువలోకి నీటికోసం దిగిన యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పుల్లలచెరువు మండలం ఐటి.వరం గ్రామానికి చెందిన మారాసు బలరాం(17) గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి నీటికోసం కాలువలోకి దిగాడు. కాలుజారి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించగా శుక్రవారం ఎన్ఎస్‌పీ లాకులవద్ద మృతదేహం బయటపడింది. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ ...

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు సమీపంలోని జాతీయ రహదారి పక్కన పొలాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. కొరిశపాడు ఎస్సై సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పొలంలో పనికి వెళ్లిన కూలీలకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఎస్సై మృతదేహాన్ని పరిశీలించారు. పూర్తిగా పాడైపోయి ఉంది. రోడ్డుపై దుస్తులకు సంబంధించిన గోనేసంచి ఉంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు మృతురాలిని యాచకురాలిగా పోలీసులు భావిస్తున్నారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లుగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని..పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

కారు అదుపు తప్పి... తెదేపా మైనార్టీ సెల్ నేత మృతి

మహమ్మద్ జాఫర్ షరీఫ్ (పాత చిత్రం)

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరుకు చెందిన తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్ (54) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పదహారో నంబరు జాతీయ రహదారిపై కొరిశపాడు మండలం తిమ్మనపాలెంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. తెదేపా మైనార్టీ సెల్ నేత జాఫర్ షరీఫ్ (54) పని నిమిత్తం విజయవాడ వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుగు పయనమయ్యారు. 8.45 గంటల సమయంలో తిమ్మనపాలెంలో వీరి కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాఫర్ షరీఫ్‌తో పాటు కారు నడపుతున్న ఎస్కే.జబీర్ అహ్మద్, ఎస్కే. బషీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జాఫర్ షరీఫ్ మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పడవ బోల్తా పడి జాలరి..

కంభం, న్యూస్‌టుడే : పడవ బోల్తా పడి జాలరి మృతి చెందారు. ఈ సంఘటన యర్రబాలెం సమీపంలోని కంభం చెరువులో చోటుచేసుకుంది. ఎస్సై శివ కృష్ణారెడ్డి కథనం మేరకు..బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామచంద్రాపురానికి చెందిన వాయుల శేషయ్య (25) కంభంలోని పెద్దనల్లకాలువ ప్రాంతంలో ఉంటున్నారు. ఆయన స్థానిక చెరువులో చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నారు. బుధవారం రాత్రి కంభం చెరువులో చేపలు పట్టేందుకు పడవలో వెళ్లారు. చెరువులో ఉన్న ఓ చెట్టు మొద్దును ఢీకొని పడవ బోల్తా పడటంతో గల్లంతయ్యారు. ఆయన మృతదేహం గురువారం నీటిపై తేలియాడుతుండగా, బాధితుడి తండ్రి కనకయ్య గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి రైతు బలి..

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: పొలం అతనికి జీవనం.. అదే పొలం అతని ప్రాణాలను కూడా తీసుకుంది.. రోజులాగే పంటకు నీరు పెట్టాలని వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన **దూదేకుల పెద్ద చాంద్‌బాషా** (55) తన పొలంలో వరి పంట వేశాడు. ఈ క్రమంలో పంటకు నీరు పెట్టి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో పాటు చరవాణి ద్వారా కూడా అందుబాటులోకి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా.. మోటారు వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండడాన్ని గుర్తించి స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి చేరుకున్న ఎస్సై శివ బసవరాజు వివరాలు సేకరించారు. కుమారుడు మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి..మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు మృతితో పండుగ పూట గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఆనంద్ విహార్ వెంచర్స్‌లో ఓపెన్ సైట్‌తో పాటు 3BHK ఇండివిడ్యువల్ హౌస్ కేవలం 60 లక్షలు మాత్రమే. ✆ 6303004748

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

TO LET

ఒంగోలు EKB ప్రక్కన ZUDIO షోరూమ్ ఎదురు 2000Sft బిల్డింగులో 2nd ఫ్లోర్ కమర్షియల్స్ అద్దెకు ఇవ్వబడును. 97409 03676.

COMMERCIAL

ఒంగోలు సౌత్‌బైపాస్‌రోడ్ అన్నాబత్తిన (రిలయన్స్‌మార్ట్ +SBI వున్న) కాంప్లెక్స్‌లో 3rd ఫ్లోర్(10000SFT) గలది బ్యాంక్, జిమ్, రెస్టారెంట్, హోటల్స్, ఆఫీసులకు అద్దెకుఇవ్వబడును. ✆ 98660 73868, 81421 46612.

JOBS

చిరంజీవ చిట్‌ఫండ్స్ ప్రై॥ లి॥లో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పనిచేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం॥ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 7288870101, 7288887707.

కీర్తిమెడికల్ స్టోర్స్, కనిగిరి, ఒంగోలులో పనిచేయుటకు ఆపరేటర్స్ మరి॥ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత కలదు. జీతం: 15K to 30K. సంప్ర॥ 9154569446.

ఒంగోలులో రియల్ ఎస్టేట్ అప్రూవల్ వెంచర్‌లో మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన కమీషన్లతోపాటు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ 98660 94114.

SECURITY GUARDS

కిమ్స్‌హాస్పిటల్ ఒంగోలు నందు ఆన్‌రోల్‌లో పనిచేయుటకు లేడీస్ & జంట్స్ సెక్యూరిటి గార్డ్స్ కావలెను. జీతం రూ. 14,000/- కాంటాక్ట్ నంబర్: 8074854975.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు

80087 09902

మార్కాపురం

80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500

Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •గిద్దలూరు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బొమ్మలతో..

పామూరు, న్యూస్‌టుడే : పామూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లో స్లో సైక్లింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది.

ఆలోచింపజేసిన ప్రదర్శన

బేస్తవారపేట మండలంలోని పందిళ్లపల్లి, పరిసర ప్రాంతాల్లో పురుషులు, మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. రాత్రి మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ వృత్తుల గొప్పదనాన్ని తెలిపే స్కిట్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

స్కిట్‌తో అలరిస్తున్న బాలికలు

పడకేసిన ఫైబర్‌నెట్

☛ కార్యాలయాల్లో అందని సేవలు

న్యూస్‌టుడే, బేస్తవారపేట

మార్కాపురం జిల్లాలో ఏపీ ఫైబర్‌నెట్ సేవలు నామమాత్రంగా మారాయి. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఈ వ్యవస్థ గాడి తప్పడంతో కార్యాలయాల్లో సేవలందక అవస్థలు తప్పడం లేదు.

2017లో తెదేపా ప్రభుత్వం ఏపీ ఫైబర్‌నెట్‌కు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రజలకు ఈ సేవలందించింది. రూ.149కే బేసిక్ ప్లాన్ అందుబాటులోకి తేవడంతో చాలామంది ఆసక్తి కనబరిచారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం తదితర నియోజకవర్గాల్లోని మొత్తం 269 గ్రామ సచివాలయాలను ఫైబర్‌నెట్ పరిధిలోకి తీసుకొచ్చినా తదనంతరం ఈ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. బేసిక్ ప్లాన్‌ను రూ.149 నుంచి ఏకంగా రూ.350కి పెంచింది. అనంతరం దాని నిర్వహణను గాలికొదిలేయడంతో సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సేవలందలేదు. వాటిల్లో ఏర్పాటుచేసిన బాక్సులన్నీ ఎక్కడికక్కడ మరమ్మతులకు గురికావడంతో నెట్‌వర్క్ పూర్తిగా పడిపోయింది. అనంతరం విజయవాడలో ఏర్పాటుచేసిన మరమ్మతుల కేంద్రాన్ని సైతం తొలగించడంతో వినియోగదారులకు సేవలందించే పరిస్థితే లేకుండాపోయింది.

ప్రత్యామ్నాయం వైపు దృష్టి

ఫైబర్‌నెట్ సేవలు దాదాపుగా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత రెండేళ్లుగా ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. చేసేదేమీ లేక తమ చరవాణుల్లో వైఫై ఆన్‌చేసి కంప్యూటర్లను వాడుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఎదురవుతోందని డిజిటల్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల పంచాయతీ నిధులను వెచ్చించి ప్రైవేటు సంస్థల ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఏపీ ఫైబర్‌నెట్ సమస్యపై ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన స్పందించి గాడిన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బేస్తవారపేట సచివాలయం-2 లో నిరుపయోగంగా పరికరాలు

చర్యలు తీసుకుంటాం..

మార్కాపురం జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో గత రెండేళ్ల నుంచి ఫైబర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. సాంకేతిక సిబ్బందితో మాట్లాడి త్వరలోనే అన్ని సచివాలయాల్లో తిరిగి కొనసాగించేలా చూస్తాం.
– బి.బాలునాయక్, డీఎల్‌డీవో, మార్కాపురం.

పులకించిన పల్లెలు

సంక్రాంతి వేడుకల వేళ..పల్లెలు పులకించాయి. దేశ విదేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో కిటకిటలాడాయి. సంక్రాంతి, కనుమ సందర్భంగా గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని పల్లెల్లో క్రికెట్ షటిల్ పోటీలు నిర్వహించారు. యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. - న్యూస్‌టుడే బృందం

పొదలకుంటపల్లెలో కోలాట ప్రదర్శన

కనిగిరి : కొత్తపేటలో గాలి పటాలు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

రాచర్ల : ఎడ్ల బల ప్రదర్శన

రాచర్ల : జేపీ చెరువులో ముగ్గుల పోటీల్లో మహిళలు

నాటి స్మృతులు నెమరువేసుకుని..

సి.ఎస్.పురం: హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె తదితర దూరప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వారు స్వగ్రామాలకు రావడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. దీంతో కార్లు బారులు తీరుతున్నాయి. యువత, విద్యార్థులు, ఉద్యోగులు సంక్రాంతికి స్వగ్రామానికి వచ్చి తమ స్నేహితులు, బంధువులను కలిసి పలకరించి మాట్లాడి యోగక్షేమాలను తెలుసున్నారు. తాము కలిసి చదువుతున్న పాఠశాల వద్దకు వెళ్లి స్వీయచిత్రాలు దిగారు.

సి.ఎస్.పురం పాఠశాల వద్ద స్నేహితులు

పొగమంచులో ప్రయాణ అవస్థలు

కంభం, కనిగిరి, న్యూస్‌టుడే : అనంతపురం - అమరావతి జాతీయ రహదారిని గురు, శుక్రవారాల్లో పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ దట్టంగా మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణాలు సాగించారు. దగ్గరగా వచ్చే వరకూ వాహనాలు కనిపించలేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనిగిరి ప్రాంతంలోనూ పెద్దఎత్తున మంచు కమ్మేసింది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలను రోడ్ల పక్కన నిలిపేశారు. కొందరు హారన్ మోగిస్తూ మెల్లగా ముందుకు సాగారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

ఎనిమిదేళ్లుగా పేదల ఆకలి తీరుస్తూ..

☛ రూ.లక్షలు వెచ్చిస్తున్న రమణారెడ్డి

న్యూస్‌టుడే, రాచర్ల

స్ఫూర్తి

రమణారెడ్డి స్ఫూర్తి పయనం ఎందరికో ఆదర్శం. ఆయన యడవల్లి గ్రామంలోని నిరుపేదల ఆకలి తీరుస్తున్నారు. గిద్దలూరు మండలం పొదలకొండపల్లికి చెందిన చేరెడ్డి వెంకట రమణారెడ్డి ముంబయిలో పలు వ్యాపారులు చేస్తూ స్థిరపడ్డారు. తమ ప్రాంతంలో ఉన్న పేదలకు చేయూతనివ్వాలని భావించి స్నేహితుడు ఆర్.పోలయ్యను ఆయన సంప్రదించారు. ఈ మేరకు యడవల్లి గ్రామంలో నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారని ఆయన చెప్పారు. వారి క్షుద్బాధ దూరం చేస్తే బాగుంటుందని 2017లో సలహా ఇచ్చారు. దాంతో గ్రామంలో నిరుపేదలను గుర్తించారు. అదే ఊరిలోని రమణమ్మ ఇంటి వద్ద భోజనం వండి మధ్యాహ్నం వేళ క్యారియర్లు కట్టి ఇచ్చే ఏర్పాట్లు చేశారు. అందుకు ప్రతి నెల రూ.13,500 ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించారు. ఇది తనకు ఎంతో ఆత్మసంతృప్తినిస్తోందని ఆయనంటున్నారు.

భోజన క్యారియర్లు అందుకున్న వృద్ధులతో దాత వెంకటరమణారెడ్డి

సీఎం సహాయనిధితో పేదలను చేయూత

కనిగిరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు చేయూతనిస్తున్నట్లు ఎమ్మెల్యే, తెదేపా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక అమరావతి మైదానంలో నియోజకవర్గంలోని 60 మందికి రూ.48 లక్షలకు పైగా సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సీఎం సహాయనిధి చెక్కులను తమ నియోజకవర్గ పరిధిలో అందించినట్లు చెప్పారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చులకు నిధులు మంజూరుచేసి ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గాయం తిరుపతిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, ఎర్రయ్య పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

తెదేపాలో చేరిక : లింగారెడ్డిపల్లికి చెందిన 17 వైకాపా కుటుంబాలు స్థానిక అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సమక్షంతో తెదేపాలో చేరారు. తెదేపా నాయకులు కొండాకృష్ణారెడ్డి, చెంచిరెడ్డి, కిశోర్, బాలిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

కనిగిరి, న్యూస్‌టుడే: తర్లుపాడు మండలం జగన్నాథపురంలోని పురాతన వీరభద్ర దేవాలయంలోని నంది విగ్రహాన్ని ధ్వంసంచేసిన వారిని శిక్షించాలని భాజపా నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరాల శ్రీనివాసరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, మనోజ్‌రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, తదితరులు డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంది విగ్రహం ధ్వంసం చేయడమంటే ప్రత్యక్షంగా హిందూ సమాజంపై దాడి చేయడమేనన్నారు. వెంటనే దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

18న రక్తదాన శిబిరం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న గిద్దలూరు విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శిబిరాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కోరారు.

భుజంగేశ్వర ఆలయంలో జేసీబీతో పనులు

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

పామూరు, న్యూస్‌టుడే : పామూరులోని శ్రీవల్లి భుజంగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకున్నారు. విరాట్‌నగర్‌లోని సర్వే నంబర్ 442/2లో ఉన్న 2.23 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు పనులు చేపడుతున్నారు. సమాచారం అందుకున్న దేవాదాయ సిబ్బంది శుక్రవారం హుటాహుటిన అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు అడ్డుకుంటుంటే మరోవైపు ఆక్రమణలకు దిగుతున్నారని వారు వాపోయారు. దీనిపై ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగిస్తామని తెలిపారు.

ఫ్లెక్సీ ఉంది..అక్షరాలే లేవు

కనిగిరి పట్టణంలోని సామాజిక వైద్యశాలలోని డయాలసిస్ కేంద్రానికి వెళ్లాలంటే రోగులు గందరగోళానికి గురవుతున్నారు. అయిదేళ్లక్రితం సీహెచ్‌సీ ప్రవేశమార్గంలో బోర్డు ఏర్పాటుచేసి దానిపై ఫ్లెక్సీని బిగించారు. వర్షాలకు ఆ ఫ్లెక్సీపై ఉన్న అక్షరాలు కాస్తా వెలిసిపోయాయి. దీంతో డయాలసిస్ చేయించుకునేందుకు కొత్తగా వచ్చేవారు ఈ కేంద్రాన్ని గుర్తించలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి వెంటనే బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కనిగిరి, న్యూస్‌టుడే

డ్రైనేజీల్లో మంచినీటి పైపులు

కనిగిరి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పైపు లైన్ మురుగు కాలువల్లో ఏర్పాటు చేశారు. అయితే కొన్నిచోట్ల పైపులైన్ దెబ్బతినడంతో మురుగునీరు మంచినీటిలో కలుస్తోంది. ఇలాంటి పరిస్థితి పెద్ద మసీదు ప్రాంతం, రామాలయం వీధి, దొరువు బజారు, అంకాలమ్మ వీధిలో ఎక్కువగా ఉందని స్థానికులంటున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడంతో పాటు డ్రైనేజీల్లోంచి వెళ్లకుండా ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు. కనిగిరి, న్యూస్‌టుడే

చురుగ్గా పాములపల్లె రోడ్డు

గిద్దలూరు పట్టణంలోని పాములపల్లెకు వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఆ మార్గంలో కనీసం ఆటోలు కూడా నడపడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవ తీసుకొని రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం గుత్తేదారుడు పాత తారు రహదారిని తొలగించి, దానిపై వెట్ మిక్స్ పరిచి ముమ్మరంగా చేపడుతున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గిద్దలూరు పట్టణం, నూస్‌టుడే

నరవలో నరసింహస్వామి ఊరేగింపు

కనిగిరి : అమ్మవారికి సారె పెడుతున్న ఆర్యవైశ్య మహిళలు

మిట్టపాలెం : పూజలు చేస్తున్న భక్తులు

గ్రామోత్సవాలు.. పార్వేట సంబరాలు..

కనిగిరి: సంక్రాంతి సందర్భంగా గ్రామోత్సవాలు.. పార్వేట సంబరాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కనిగిరి పట్టణంలో వెంకటేశ్వర దేవస్థానం, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సాయిబాబా దేవస్థానాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని కొత్తపేటలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి తెదేపా నాయకులతో కలిసి గాలిపటాలను ఎగురవేశారు.

◗ **కంభం :** రావిపాడు, కంభం, జంగంగుంట్ల, యర్రబాలెం, పెద్దనల్లకాలువ, చిన్నకంభం తదితర గ్రామాల్లో పార్వేటలు నిర్వహించారు. కంభంలో శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవాలను నిర్వహించారు.

◗ **రాచర్ల:** జేపీ చెరువు గ్రామంలో రంగనాయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాచర్ల, అనుమలపల్లి, చోళ్లవీడు, అనుమలవీడు, పాలకవీడు, సోమిదేవుపల్లి, గుడిమెట్ట తదితర గ్రామాల్లో స్వామివారి పార్వేట నిర్వహించారు.

◗ **సి.ఎస్.పురం:** మిట్టపాలెం నారాయణస్వామి, పవిత్ర శైవ పుణ్యక్షేత్రం భైరవకోనను భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. నారాయణస్వామి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి, సమేత విష్ణుమూర్తి, నారాయణస్వామి వార్ల మూలవిరాట్టును అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ◗ **గిద్దలూరు పట్టణం:** గిద్దలూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైభవంగా పార్వేట మహోత్సవం నిర్వహించారు. గిద్దలూరులో వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు. నరవలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం చేపట్టారు.

◗ **బేస్తవారపేట:** కోనపల్లిలో లక్ష్మీ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం శేషవాహనంపై సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగింపు నిర్వహించారు.

◗ **హనుమంతునిపాడు:** ఆటాపాటలు, ముగ్గుల, క్రికెట్ క్రీడలతో హనుమంతునిపాడు మండలంలోని పల్లెల్లో హడావుడి కన్పించింది. వేములపాడు, దాసరిపల్లి గ్రామాల్లో కత్తులుకట్టి భారీగా కోడిపందేలు నిర్వహించారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగినా పోలీసులు ఎక్కడా అడ్డుకున్న దాఖలాలు కన్పించలేదు.

కంభం : కోటా సత్యమాంబదేవి ఆలయంలో సత్యమణికంఠస్వామి తెప్పోత్సవం

బేస్తవారపేట : కోనపల్లిలో గజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కనిగిరి : లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అలంకరణ



దేవదాయ ధర్మదాయ శాఖ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

శ్రీ భైరవేశ్వరస్వామి వారి దేవస్థానము

భైరవకోన, అంబవరం కొత్తపల్లి(గ్రా), సి.యస్.పురం(మం), మార్కాపురం జిల్లా.

టెండర్ నోటీసు నెం:నిల్/2025–2026, తేది.16.01.2026.

మార్కాపురం జిల్లా, సి.యస్.పురం మండలం, అంబవరం కొత్తపల్లి గ్రామము, భైరవకోనలో వెంచేసియున్న శ్రీ భైరవేశ్వరస్వామి వారి దేవస్థానములో తేది.15.02.2026న జరుగు శ్రీ స్వామివారి మహాశివరాత్రి మహోత్సవమునకు

1.ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, మైకులు ఏర్పాటు చేయుటకు,
2.గుడ్డపందిర్లు, షామియానాలు, హైరర్స్ వగైరాలు సప్లై చేయుటకు,
3.మహాశివరాత్రి సందర్భముగా పుష్పములు సరఫరా, గుడి అలంకరణ,
4.రంగులు, సున్నపు పూతలు వేయుట (మెటీరియల్ & లేబర్ ఛార్జీలు),
5. భక్తుల సౌకర్యార్థం ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయుటకు,
6. పార్కింగ్ ప్లేస్ క్లియరెన్స్, జంగిల్ క్లియరెన్స్ చేయుటకు,
7. ఎస్.యం.ఆర్ & సానిటేషన్ సిబ్బందిని సరఫరా చేయుటకు,
8.భక్తుల రాకపోకలకు ఉచిత వాహనములను ఏర్పాటు చేయుటకు,
9. నూతన సి.సి.కెమెరాలు బిగించుట కొరకు,
10. రుత్వికులను మరియు వంట మనుషులను ఏర్పాటు చేయుటకు,
11.వివిధ మరమ్మతుల నిమిత్తము మైనర్ వర్క్స్ చేయుటకు,
12.సాంస్కృతిక కార్యక్రమములను మరియు ఈవెంట్స్ ఏర్పాటు చేయుటకు,
13. ఫోటోలు, వీడియోలు తీయుటకు.

సీల్డుటెండర్లు/ కొటేషన్లు కోరడమైనది.

సీల్డుటెండర్లు ఫామ్స్‌ను తేది: 24.01.2026 న శనివారము మధ్యాహ్నం 12.00 గంటల వరకు స్వీకరించి, అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో కార్యనిర్వాహణాధికారి వారిచే సీల్డుటెండర్లు తెరవబడును. దేవస్థానము కార్యాలయము పనిచేయు వేళలలో రూ.500/- చెల్లించి సీల్డుటెండర్లు ఫామ్స్ ను పొందగలరు. పూర్తి చేసిన సీల్డు టెండరు ఫామ్స్ ను తేది: 24.01.2026 శనివారము మధ్యాహ్నం12.00 గంటల లోపల 1వ ఐటమ్ నుండి 2వ ఐటమ్ వరకు రూ.10,000/-, 3వ ఐటమునకు రూ.5,000/-, 4వ ఐటమ్ నుండి 13వ ఐటమ్ వరకు రూ.2,000/- చొప్పున నగదు చెల్లించవలెను. 4వ ఐటమ్ నుండి 13వ ఐటమ్ వరకు కొటేషన్లు కూడా కోరడమైనది. మరిన్ని వివరములకు దేవస్థానము కార్యాలయములో సంప్రదించి తెలుసుకొనగలరు.

ఛైర్మన్ మరియు ధర్మకర్తలమండలి సభ్యులు | భైరవకోన తేది: 16.01.2026 | కార్యనిర్వహణాధికారి సెల్: 73307 48208

(c) eenadu

మార్కాపురం
•మార్కాపురం •యర్రగొండపాలెం

కలిసొస్తుందనుకోకు.. కష్టాల పాలుకాకు!

అధిక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

పొగాకు క్యూరింగ్‌లు జరుగుతుండటంతో పొదిలి, మార్కాపురం తదితర ప్రాంతాల్లోని బ్యారన్లకు కర్రలను ట్రాక్టర్లలో ఇలా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. పరిమితికి మించి ట్రాలీలో మొద్దులు, కర్రలువేసుకుని తీసుకెళ్తున్నారు. మలుపుల వద్ద, వేగనిరోధకాల వద్ద ఏమాత్రం జాగ్రత్తగా వెళ్లకపోయినా కర్రలు జారి పక్కన వెళ్లే వాహనదారులపై పడే ప్రమాదం ఉంది. రాత్రివేళల్లో అయితే ఈ ట్రాక్టర్ల వెనుక లోడు కనిపించక ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వాహన చోదకులు, ట్రాక్టర్ల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పొదిలి

పారిశుద్ధ్య లోపం.. సమస్యలు తీవ్రం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణ శివారులోని ప్రాంతాల ప్రజలు పారిశుద్ధ్య లోపంతో దోమలు, మురుగుతో నిత్యం అవస్థలు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దుర్వాసనతో పాటు దోమలతో సావాసం చేస్తున్నారు. ● మార్కాపురంలోని సప్లయ్ ఛానల్ పట్టణ పరిధిలోని కొండేపల్లి రోడ్డు నుంచి దొడ్డవారి మీదుగా చెరువులోకి వెళ్తుంది. దొడ్డవారి వీధి శివారులో ఉన్న సప్లయి ఛానల్‌లో చెత్తాచెదారం, పాచి పూర్తిగా పేరుకుపోవడంతో స్థానికులు దుర్వాసనతో పాటు దోమలతో ఉండలేకపోతున్నారు. ప్రతి రోజు నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ● అంతేకాకుండా పట్టణ శివారులోని లక్ష్మీచెన్న కేశవనగర్‌లో రహదారికి ఎదురుగా నివాసాలు ఉన్నాయి. ఈ రహదారికి ఎదురుగా ఉన్న నివాసాల వారు ప్లాట్లలో నిల్వ చేసిన

దొడ్డవారి వీధిలోని సప్లయి ఛానల్‌లో నివాసాల ముందు పేరుకున్న చెత్తాచెదారం

నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే సిబ్బందిని పంపి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, చెత్త తొలగింపజేయాలని ప్రజలు, నివాసితులు కోరుతున్నారు. దోమలు, ఈగలు మరింత పెరిగి రోగాల బారిన పడకముందే అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ఆలయ భూముల్లో నిర్మాణాలకు అడ్డుకట్ట

పామూరు, న్యూస్‌టుడే : పామూరులోని శ్రీవల్లి భుజంగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకున్నారు. విరాట్‌నగర్‌లోని సర్వే నంబర్ 442/2లో ఉన్న 2.23 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు పనులు చేపడుతున్నారు. సమాచారం అందుకున్న దేవాదాయ సిబ్బంది శుక్రవారం హుటాహుటిన అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి ఆక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

చిత్రం కొత్తది.. సమస్యలు పాతవి

❑ లోపాలు సవరించకుండానే పాసుపుస్తకాల పంపిణీ

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం:

వైకాపా ప్రభుత్వ హయాంలో 'రీ సర్వే' తప్పులతడకగా సాగింది. భూ విస్తీర్ణం, పేర్లు, సర్వే నంబర్లు మారిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిని సరిచేసి కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన కొత్త పుస్తకాలు ఇస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా అనేకచోట్ల పాత సమస్యలతో ఉన్న వాటినే కొత్త పుస్తకంగా ఇస్తున్నారు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తోంది.. త్రిపురాంతకం మండలం.

సగానికి సగం ఆపాల్సి వచ్చింది

రాజముద్రతో వస్తున్న పట్టాదారు పాసుపుస్తకాల్లో జేఎల్‌పీఎం, విస్తీర్ణం నమోదులో తప్పులు ఉండవని రైతులు భావించారు. మండలంలోని దువ్వలి 282, కంకణాపల్లి 2,370, మాధవానిపల్లి(రామసముద్రం) 144, మిరియంపల్లి గ్రామానికి 554 రాజముద్రతో వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను ఇటీవల పంపిణీ చేశారు. రీసర్వే చేసిన గ్రామాల్లో కొత్తగా వచ్చిన 3,350 పట్టాదారు పాసుపుస్తకాలకు గాను సగం మేర పుస్తకాల్లో తప్పులు ఉండటంతో వాటి పంపిణీ ఆపేసి బాగున్న వాటిని ఇస్తున్నారు. తప్పులతడకగా వచ్చిన

దువ్వలిలో రైతులకు అందజేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలు

పాసుపుస్తకాలపై తహసీల్దారు సీహెచ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ లోపాలను సవరించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామని తెలిపారు.

అమ్ముకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం

నాకు ఇచ్చిన కొత్త పాసు పుస్తకంలో మొత్తంగా ఎ.4.70 సెంట్లు ఉండాల్సి ఉండగా ఎ.54.52సెంట్లుగా చూపించారు. ఇప్పుడు మారింది ఒక్క జగన్ బొమ్మ మాత్రమే. పాత తప్పులు అలాగే ఉన్నాయి. దీంతో భూములను అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒంగోలు, మార్కాపురం కార్యాలయాల్లో వినతులు సమర్పించాను. సమస్య వెంటనే పరిష్కరించాలి.
– జోగి పెద్ద వెంకటసుబ్బయ్య, రైతు, దువ్వలి, త్రిపురాంతకం మండలం

రైతులందరి పేర్లు ముద్రించారు



నాకు ఎ.4.05 సెంట్లు భూమి ఉండగా కొత్తగా ఇచ్చిన పాసుపుస్తకంలో సంయుక్త ఎల్పీఎం నంబరులో 36 మంది రైతుల పేర్లతో 65 ఎకరాలు ముద్రించారు. ఇప్పుడేం చేయాలో తెలియడంలేదు. వీటిని వెంటనే సరిచేసి ప్రభుత్వం న్యాయం చేయాలి. –లాగా చిన్న గురవయ్య, రైతు, దువ్వలి, త్రిపురాంతకం

సుగాలీల హక్కుల సాధనకు పోరు

పెద్దదోర్నాల: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సుగాలీల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరనాయక్ అన్నారు. నల్లగుంట్లలో సంఘం ఆధ్వర్యంలో గురువారం మకర సంక్రాంతి పురస్కరించుకుని సుగాలికాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.కాశీరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళకు బహుమతి అందజేస్తున్న వెంకటేశ్వరనాయక్ తదితరులు

జూద శిబిరంపై దాడి

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులో జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివారులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో గురువారం జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎం.సైదుబాబు సిబ్బందితో వెళ్లి శిబిరంపై దాడి చేశారు. రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకుని నలుగురు జూదరులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: మండలంలో పెదారికట్ల బస్టాండ్ సెంటర్ నుంచి విరసల గుండం వెళ్లే రహదారిపై నీరు నిలుస్తోంది. అందులో నుంచే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించగలరు. – గురవయ్య, స్థానికుడు
✓: నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. సమస్యలు తొలగిస్తాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ

పెద్దారవీడు, న్యూస్‌టుడే:

?: ఇంటి పక్కనే చెత్త కుప్పలుగా వేస్తున్నారు. మృతిచెందిన కళేబరాలను నివాసాలకు దగ్గరగా వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించగలరు.
– రాజయ్య, స్థానికుడు, సుంకేసుల.
✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. – జాన్ సుందరం, ఎంపీడీవో, పెద్దారవీడు.

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

?: పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో ప్రధాన వీధిలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రహదారిపై నిలిచిపోతుంది. దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగు నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు, తిమ్మాపురం
✓: మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – శివకోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, పెద్దదోర్నాల.

అయినముక్కలలో సీతారాముల విగ్రహాల గ్రామోత్సవం

తర్లుపాడులో ముగ్గుల పోటీల నిర్వహణ

పొదిలి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, పోటీలను తిలకిస్తున్న మాజీ ఎంపీపీ విజయగౌరి

పొదిలి ఆర్టీసి బస్టాండ్‌లో..

ఇంటింటా వెల్లివిరిసిన సంక్రాంతి

న్యూస్‌టుడే, మార్కాపురం, మార్కాపురం గ్రామీణం, మార్కాపురం పట్టణం, వై.పాలెం: మార్కాపురం, వై.పాలెం డివిజన్లలో మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. మహిళలు మూడురోజులపాటు ఇళ్లముందు ప్రత్యేక ముగ్గులు వేసి పండుగ ప్రత్యేకతను చాటారు. సంక్రాంతి పండుగరోజు ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి పలు దేవాలయాలను సందర్శించి పూజలు, అభిషేకాలు చేశారు.
● పొదలి: కాటూరివారిపాలెంలో జనసేన నాయకులు శ్రావణి యూత్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. ఎన్ఆర్ఐ హరిప్రసాద్, డి.రమేష్, జి.రమేష్ కార్యక్రమం నిర్వహణకు సహకారం అందజేశారు. మాజీ ఎంపీపీ విజయగౌరి, వెలిశెట్టి వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఐల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పొదిలి పట్టణంలో పొదిలమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను, సాయిమందిరాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.
● పెద్దదోర్నాల: దోర్నాల మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.
● త్రిపురాంతకం గ్రామీణం: మేడపిలో సంతూర్ కంపెనీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. త్రిపురాంతకంలో పొట్టి ఇంటి పేరు కలిగిన వారి ఇలవేల్పు యల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఇళ్ల ముందు రథం ముగ్గులు వేసి కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు.
● తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ బహుమతులను అందించారు.

పెద్దదోర్నాల: మేడపిలో ముగ్గుల పోటీలు

చీరలే పంట రక్షణకు ఆయుధం..

త్రిపురాంతం మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 20వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. పైరు కండె దశకు వచ్చే సరికి అడవి పందులు పంటను నాశనం చేస్తున్నాయి. పొలం గట్ల చుట్టూ రంగు రంగుల చీరలు కడుతుండటంతో బెదిరిపోయి పొలంలోకి రావడం లేదు. దీంతో రైతులు పట్టణాల్లోని చీరల దుకాణాలకు వెళ్లి పాత వాటిని కొనుగోలు చేసి పంటలకు రక్షణగా కడుతున్నారు. - త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే:

కుళాయిలు బాగుచేయించరూ...

పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామంలో నీటిని సరఫరా చేసే పైపులకు కుళాయిలు మరమ్మతులకు గురై నీరంతా వృథాగా పోతోంది. దీంతో స్థానికులు కర్ర, వస్త్రాలు అడ్డు కట్టి నీటి వృథాను తాత్కాలికంగా అరికట్టారు. నీళ్లు పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని, దిమ్మె మొత్తం పాచి పట్టి అధ్వానంగా ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నూతన కుళాయిలు ఏర్పాటు చేసి, దిమ్మెకు పేరుకుపోయిన పాచిని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.
- పెద్దారవీడు, న్యూస్‌టుడే:

రోడ్లపై మూగ జీవాలతో చిక్కులు

పట్టణంలో యజమానులు పటించుకోక ఇష్టారీతిన సంచరిస్తున్న ఆవులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. ఇవి ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా నిలుస్తున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. గడియార స్తంభం సెంటర్, మున్సిపాలిటీ ఏరియా, కూరగాయల మార్కెట్, నాయుడువీధి, అమ్మవారిశాల వీధి తదితర ప్రాంతాల్లో ఆవులు సంచారం ఎక్కువగా ఉండటంతో సమస్య నెలకొంటోంది.
-మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

జాతీయ దారి.. అంధకారంగా మారి



జాతీయ రహదారి 565 అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. కొనకనమిట్ల గ్రామ సమీపంలో ఈ రహదారిపై దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

దాతల సహకారం.. షెడ్డు నిర్మాణం

పెద్దదోర్నాల చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో దాతల సహకారంతో ఆధ్మాత్మిక షెడ్డును ఏర్పాటు చేశారు. కార్తిక మాసం, మహాశివరాత్రి, దసరా, ఉగాది పర్వదినాల్లో అధిక సంఖ్యలో భక్తులు చెన్నమల్లేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వస్తారు. శివ మాల ధారులు దీక్షలో ఉన్నన్ని రోజులు అక్కడే ఉంటారు. వారికి నీడను కల్పించి అవసరమైన సౌకర్యాలు కల్పన కోసం దాతల సహకారాన్ని తీసుకున్నారు. రూ.10 లక్షలతో షెడ్డును ఏర్పాటు చేశారు. పొదిలి, న్యూస్‌టుడే:

ఆశ్రమానికి నిత్యావసర సరకుల అందజేత

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: పట్టణంలోని సన్‌జో అనాథాశ్రమానికి యువ ప్రభుత్వ ఉపాధ్యాయుడు జమ్మోజు సుబ్బనాచారి నిత్యావసరాలు అందించారు. రూ.పదివేల విలువైన బియ్యం, పప్పులు, సబ్బులు, వంటనూనె తదితరాలను నిర్వాహకులకు ఇచ్చారు. నిర్వాహకులు గిరిబాబు, ప్రసాద్, నాగేంద్ర, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముడికి ప్రత్యేక అలంకరణ

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రిపురాంతకంలోని కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. కోదండరామ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, గోపూజ నిర్వహించారు.

ఆలయాలకు వెళ్లే దారేదీ..

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రిపురాంతకం ఆలయాలకు వెళ్లే దారి కోసం భక్తులు నానాపాట్లు పడుతున్నారు. జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరీ దేవి ఆలయాలకు నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. గతంలో యర్రగొండపాలెం దారిలో ఆలయాల పేరుతో పెద్ద అక్షరాలతో ఇనుప కడ్డీలతో తయారు చేసిన ముఖద్వారం ఆర్చి ఉండేది. 2015లో గ్రామ శివారు వరకు రహదారి విస్తరణ చేయడంతో ఆర్చి అడ్డుగా ఉందని తొలగించారు. తర్వాత ఏర్పాటు చేస్తామని చెప్పినా దాని ఊసే లేదు. ముఖ్యంగా శ్రీశైలం వెళ్లే వారు, వచ్చే వారు భక్తులు త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకునేందుకు ఎక్కువ మక్కువ చూపుతుంటారు. ఆర్చి లేకపోవడంతో ఆలయాలకు ఎటు వైపు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఈవో అనిల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను ఉన్నతాధికారులకు వివరించి ఆర్చ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నందీశ్వరుడి విగ్రహం ధ్వంసం బాధాకరం: భాజపా

విగ్రహాన్ని పరిశీలిస్తున్న భాజపా నాయకులు శ్రీనివాసులు తదితరులు

తర్లుపాడు, న్యూస్‌టుడే: దాదాపు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయంలోని నందీశ్వరుడి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని భాజపా నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, కృష్ణారావు, సరోజినీ, తదితరులు అన్నారు. తర్లుపాడు మండలంలోని ఓబాయిపల్లె, మంగళకుంట, జగన్నాథపురం గ్రామాల మధ్య ఉండే వీరభద్రుడి నందిని గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగలగొట్టారు. ఈ నేపథ్యంలో భాజపా నేతలు ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఏళ్ల నాటి చరిత్ర కలిగిన హిందూ దేవాలయాలపై కొందరు కావాలనే విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా దేవాలయాలపై నిఘా పెంచాలని డిమాండ్ చేశారు. నందీశ్వరుడి విగ్రహాన్ని పగలగొట్టిన వారిని గుర్తించి, కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఫైబర్‌నెట్ సేవలు నామమాత్రం

పొదిలి, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాలో ఏపీ ఫైబర్‌నెట్ సేవలు నామమాత్రంగా మారాయి. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఈ వ్యవస్థ గాడితప్పడంతో కార్యాలయాల్లో సేవలందక అవస్థలు తప్పడం లేదు. 2017లో తెదేపా ప్రభుత్వం ఏపీ ఫైబర్‌నెట్‌కు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రజలకు ఈ సేవలందించింది. రూ.149కే బేసిక్ ప్లాన్ అందుబాటులోకి తేవడంతో చాలామంది ఆసక్తి కనబరిచారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం తదితర నియోజకవర్గాల్లోని మొత్తం 269 గ్రామ సచివాలయాలను ఫైబర్‌నెట్ పరిధిలోకి తీసుకొచ్చినా తదనంతరం ఈ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. బేసిక్ ప్లాన్‌ను రూ.149 నుంచి ఏకంగా రూ.350కి పెంచింది. అనంతరం దాని నిర్వహణను గాలికొదిలేయడంతో సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సేవలందలేదు. వాటిల్లో ఏర్పాటుచేసిన బాక్సులన్నీ ఎక్కడికక్కడ మరమ్మతులకు గురికావడంతో నెట్‌వర్క్ పూర్తిగా పడిపోయింది. అనంతరం విజయవాడలో ఏర్పాటుచేసిన మరమ్మతుల కేంద్రాన్ని సైతం తొలగించడంతో వినియోగదారులకు సేవలందించే పరిస్థితే లేకుండాపోయింది.

ప్రత్యామ్నాయం వైపు దృష్టి

ఫైబర్‌నెట్ సేవలు దాదాపుగా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత రెండేళ్లుగా ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. చేసేదేమీ లేక తమ చరవాణుల్లో వైఫై ఆన్‌చేసి కంప్యూటర్లను వాడుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఎదురవుతోందని డిజిటల్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల పంచాయతీ నిధులను వెచ్చించి ప్రైవేటు సంస్థల ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఏపీ ఫైబర్‌నెట్ సమస్యపై ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన స్పందించి గాడిన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉజ్వల యోజన గ్యాస్ సిలిండర్ల పంపిణీ

యర్రగొండపాలెం పట్టణం: పుల్లల చెరువు గిరిజన తండా, బీసీ కాలనీకి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద వచ్చిన గ్యాస్ సిలిండర్లను తెదేపా నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. భారత్ గ్యాస్‌కు చెందిన ఈ గ్యాస్ సిలిండర్లు బీసీ కాలనీ, గిరిజనతండాకు మంజూరు అయ్యాయి. గ్యాస్ ఏజెన్సీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మేడికొండ అనిల్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు కొలకులూరి కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



చెరువుల అనుసంధానం... ప్రజలకు ప్రయోజనం

☛ రూ.16 లక్షలతో గండి- వెన్నాపాపిరెడ్డి కాలువ పనులు షురూ

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

నల్లమలలో కురిసిన వర్షం నీరు వృథాగా పోకుండా ప్రజలకు ఉపయోగపడేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా దోర్నాల మండలంలోని పెద్దబొమ్మలాపురం అటవీ ప్రాంత సమీపంలో ఉన్న గండి చెరువు నుంచి గ్రామంలోని వెన్నా పాపిరెడ్డి చెరువు అనుసంధాన పనులు చేపట్టారు. పూడిపోయి ఆక్రమణకు గురైన కాలువ ఆధునికీకరణకు రూ.16 లక్షలు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది. దీంతో పెద్ద, తూర్పు, పడమటి బొమ్మలాపురాల్లోని ప్రజలు తాగు, సాగు నీటి కష్టాలు తీరతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భయపెట్టిన మొంథా తుపాను

జిల్లాలోని పెద్ద చెరువుల్లో పెద్దబొమ్మలాపురం గండి చెరువు ఒకటి. నల్లమలలో కురిసిన వర్షపు నీరు ఆ చెరువుకు చేరుతుంది. ఆ నీరు పెద్దబొమ్మలాపురం, జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు, తమ్మడపల్లి, సానికవరం గ్రామాల్లోని పంట పొలాలకు ఉపయోగపడుతోంది. రెండున్నర నెలల క్రితం కురిసిన మొంథా తుపాను వరదతో చెరువు పొంగింది. చెరువు కట్టకు ముప్పు ఏర్పడుతుందని గేట్లు ఎత్తారు. దీంతో నీరు సమీప పొలాలను ముంచెత్తి సమీపంలోని సానికవరం గ్రామం లోతట్టు ప్రాంతానికి చేరి అక్కడి ప్రజలను భయపెట్టింది. ఆ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు ఆ సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా వృథా నీరు పెద్దబొమ్మలాపురంలోని వెన్నా పాపిరెడ్డి చెరువుకు తరలింపుపై దృష్టి సారించారు.

ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం తవ్వారు

దాదాపు రెండు దశాబ్దల కిత్రం తీసిన కాలువ ఆక్రమణకు గురవడంతో పాటు పూడిపోయింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కాలువను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కాలువ ఆధునికీకరణకు అడ్డంకులు తొలగించారు. రూ.16 లక్షల నిధులతో మరమ్మతులు చేపట్టారు. వెన్నా పాపిరెడ్డి చెరువుకు నీరు చేరితే భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు, పశువులకు తాగునీటి సమస్య తీరుతుంది. తమ చిరకాల కోరిక నెరవేరే దిశగా అడుగులు పడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలువను శుభ్రం చేస్తున్న జేసీబీ యంత్రం

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. 8/2021 in O.S. 201/2017
మీసాల వెంకటస్వామి - DHR.
Vs
సయ్యద్ యాసిన్ భాష @ యాసిన్ - JDR.
వేలం ప్రకటన
పై నెంబరు E.P. షెడ్యూలు ఆస్తిని DHR బాకీ రాబట్టు నిమిత్తం ఘనమైన కోర్టులో తేది: 6-02-2026 ఉదయం గం 10:30 నిలకు బహిరంగ వేలం వేయుటకు కోర్టువారు నిర్ణయించడమైనది. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు వేలంలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు: ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, పొదిలి సబ్-రిజిస్ట్రేషన్, తర్లుపాడు మండలం, సీతానాగులవరం గ్రామం, in .S.No.61/4, విస్తీర్ణం 100చ.గ.లు, ప్లాటు నెం: 99 హద్దులు. తూర్పు: ప్లాటు నెంబరు 104, దక్షిణం: ప్లాటు నెంబరు 100, పడమర: 18 వెడల్పు రస్తా, ఉత్తరం: ప్లాటు నెంబరు 98. తూర్పు-పడమర: 45 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 20 అడుగులు.
DHR విలువ: 50,000/- మార్కెట్ విలువ: 52,500/-
అమీనా విలువ: 60,000/- వేలం తేది: 6-02-2026.
ఫర్దర్ హియరింగ్: 13-02-2026. ఇట్లు/- E. శారద అడ్వకేటు, మార్కాపురం, 523 316

(c) eenadu

నాణ్యతకు పరీక్ష

● అక్కరకు రాని అగ్రిల్యాబ్‌లు

నిరుపయోగంగా భవనం

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామంటూ గత వైకాపా ప్రభుత్వం హంగామా చేసింది. రూ.కోట్లు ఖర్చు చేసి అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించింది. సిబ్బంది లేక.. పరికరాలు కానరాక భవనాలు నిరుపయోగంగా మారాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల

ఉమ్మడి జిల్లాలో అగ్రిల్యాబ్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి రాలేదు. నిర్మించిన భవనాల్లో సదుపాయాలు కరవయ్యాయి. కోవెలకుంట్లలో సబ్ డివిజన్ పరిధిలో వరి, పత్తి, జొన్న, వేరుసెనగ పంటలు సాగవుతాయి. ఈ నేపథ్యంలో కోవెలకుంట్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.48 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించారు. సిబ్బంది కొరతతో గత మూడేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా మారింది. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఏవో ఉండాలి. అగ్రిల్యాబ్‌ను మరో ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నారు. బనగానపల్లి నియోజకవర్గానికి అగ్రిల్యాబ్ సేవలు అవసరమని, సమీపాలు కల్పించి ఇక్కడే కొనసాగించాలని రైతులు పేర్కొంటున్నారు.

ఆళ్లగడ్డలోని అగ్రిల్యాబ్‌లో అలంకారప్రాయంగా పరికరాలు

సేవలు అంతంతమాత్రమే..

ఆళ్లగడ్డలో రూ.70 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మించినప్పటికీ ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. విత్తనాలు, ఎరువుల నమూనాలను పరీక్షించే ల్యాబ్ సహాయకుడు గతేడాది నవంబరు నుంచి సెలవుపై వెళ్లారు. దీంతో సేవలు ఆగిపోయాయి. గతేడాది నవంబరు వరకు ల్యాబ్‌లో 155 విత్తన, 123 ఎరువులు, ఆర్ఎస్‌కే, రైతుల నుంచి వచ్చిన 8 విత్తన నమూనాలు, విత్తన వ్యాపారులు ఇచ్చిన 16 నమూనాలను మాత్రమే పరీక్షించారు.

అవగాహన కరవై..

● అగ్రిల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. రుద్రవరం మండల పరిధిలో నకిలీ మొక్కజొన్న విత్తనాలతో రైతులు నష్టపోయారు. ల్యాబ్‌లో విత్తన పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిసినా రైతులు స్పందించడం లేదు. ఒక్కో ఏవో కనీసం ఐదు నమూనాలను సేకరించాలని పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో స్పందన కానరావడం లేదు.

● ఆళ్లగడ్డ, డోన్ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో లక్ష మంది రైతులు ఉండగా 50 మంది లోపే పరీక్షలకు తీసుకురావడం గమనార్హం.

సాగుకు అడ్డుకట్ట



బనగానపల్లి పట్టణ శివారులోని 10వ బ్లాక్ ఎస్సార్బీసీ అధ్వానంగా మారింది. పలుచోట్ల కాలువ కోతకు గురైంది. ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ప్రధాన కాల్వ దెబ్బతింది. లైనింగ్ సైతం చెదిరిపోయింది. రాళ్లు, సిమెంటు పలకలు ప్రవాహానికి అడ్డుగా ఉంటున్నాయి. ఈ బ్లాక్ కింద 23,356 ఎకరాల ఆయకట్టు ఉంది. నీరు సరిగా ప్రవహించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

గుత్తగా కట్టబెట్టి.. గుట్టుగా కట్టిపెట్టి

● ఇష్టానుసారంగా బిల్లుల చెల్లింపు

● పనులపై పర్యవేక్షణ కరవు

శ్రీశైల మహాక్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తికి నోచుకోవడం లేదు. ఏ పని తలపెట్టినా కాలయాపన జరుగుతోంది. నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయకున్నా గుత్తేదారులకు ఇంజినీర్లు వంత పాడుతున్నారు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

శ్రీశైలంలో ఏటా వివిధ పనుల పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వ్యయంతో తరచూ సివిల్ వర్క్స్ కోసం టెండర్లు పిలుస్తుంటారు. క్లాస్-1, 2, 3, 4, 5 అర్హత కలిగిన గుత్తేదారులు పాల్గొంటారు. గడువులోపు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఐదారుగురు బాగానే ఉన్నప్పటికీ గుత్తేదారులు సకాలంలో పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.
– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం



దొర్నాలలో ఆగిపోయిన కల్యాణ మండపం పనులు

అధికారుల అత్యుత్సాహం

శ్రీశైల దేవస్థానానికి సంబంధించి దొర్నాలలో శ్రీశైల సదన్ ఉంది. రెండెకరాల కొండంత షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణానికి టెండర్లు పిలిచారు. షాపింగ్ కాంప్లెక్స్ పూర్తైనా కల్యాణ మండపం పనులు మందగించాయి. గుత్తేదారు పునాదులు వేసి పిల్లర్లు వేయడానికి ప్రయత్నం చేశారు. ఆలోపే ఇంజినీర్లు రూ.40-50 లక్షల మేర బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత గుత్తేదారుడు పనులు ఆపేశారు.

నిబంధనలు పట్టక..

● రూ.1.20 కోట్లతో చేపట్టిన నక్షత్ర వనం పనులు అస్తవ్యస్తంగా జరిగాయి. కొండ ప్రాంతాన్ని అందంగా చేసి '0' లెవెల్ నుంచి డ్రాయింగ్ ఇవ్వాల్సి ఉండగా పునాదులు నిర్మించారు. పనుల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. నక్షత్ర వనానికి ప్రహరీ పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేసిన గుత్తేదారును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల నక్షత్ర వనం వద్ద ఆరేళ్ల ఎత్తున అర్ధనారీశ్వర విగ్రహం ఏర్పాటు చేసేందుకు ధర్మకర్తల మండలిలో తీర్మానం చేయడం కొసమెరుపు.

● రెండేళ్ల కిందట గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రూ.80 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆ తర్వాత దాని స్థానంలో భ్రమరాంబాదేవి ఆలయం వెనుక గ్యాలరీ నిర్మించారు. మళ్లీ గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు బీటీ రోడ్డు నిర్మించారు. తర్వాత కాలయాపన చేసి బీటీ రోడ్డును పక్కన పెట్టి సిమెంటు నిర్మాణాలు చేపట్టారు. కాలువల నిర్మాణాలను గాలికొదిలేశారు.

● గణేశ్ సదన్ పక్కన 'ఈవో బంగ్లా' నిర్మించారు. ఇది సాంకేతిక అనుమతుల వివాదంలో చిక్కుకుంది. ప్రహరీ ఊసే లేకుండా పోయింది.

కష్టాలు మోస్తూ.. కన్నీళ్లు దాస్తూ

ఆ తల్లి.. తొమ్మిది నెలలపాటు గర్భంలో మోసింది. పండంటి బిడ్డలకు జన్మనిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా వారి నోట మాట రాలేదు.. అడుగు వేయలేరు. ఆకలి, దప్పులను అమ్మ గుర్తించాల్సిందే. తల్లి సాయం లేనిదే నిలబడలేరు. అడుగడుగునా ఎదురవుతున్న అష్టకష్టాలు చూసిన ఆమె ఈ లోకాన్ని వీడిపోవాలని భావించారు. కన్నపేగు కదలాడి.. కదల్లేని పిల్లల కోసం కుటుంబ భారం మోస్తూ.. జీవనయానం సాగిస్తున్నారు.. ఆమె పెరవలికి చెందిన మణెమ్మ.

● మద్దికెర మండలం పెరవలికి చెందిన గోపాల్, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. మగపిల్లలు పుట్టారన్న సంతోషం ఆ తల్లిదండ్రులకు ఎంతో కాలం నిలవలేదు. వయసు పెరిగే కొద్దీ వారిలో మానసిక ఎదుగుదల లేదు. చికిత్స కోసం శక్తికి మించి అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం పెద్ద కుమారుడు భరత్‌కు 27 ఏళ్లు. ఎవరైనా పట్టుకుంటే తప్ప నిలబడలేడు. చిన్న కుమారుడు శరత్ వయసు 23 ఏళ్లు. కనీసం కూర్చోలేక ఓవైపు ఒరిగిపోతాడు. అతనికి రెండు కళ్లు కనిపించవు. దీనికితోడు రేయింబవళ్లు నోట్లో చేయి పెట్టుకొని కొరుక్కుంటాడు. చేతికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో శస్త్రచికిత్స చేయించారు. – న్యూస్‌టుడే, పత్తికొండ

● భర్త గోపాల్ 17 ఏళ్ల కిందటే ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లల భారమంతా తల్లి మణెమ్మపై పడింది. దుస్తులు కుట్టడం తెలియడంతో దాన్ని వృత్తిగా మార్చుకొన్నారు. వారికి ప్రభుత్వం ఇస్తున్న పింఛను కొంత ఆసరా అవుతోంది. కష్టాలు కలవరపెడుతుంటే.. ఎన్నోసార్లు చనిపోవాలని అనిపించినా.. తర్వాత తన పిల్లల పరిస్థితి ఏంటని గుర్తుతెచ్చుకొని బతుకుతున్నానని చెబుతున్నారు మణెమ్మ.

రావణ వాహనంపై ఆది దంపతుల విహారం



రావణ వాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల దేవస్థానంలోని గోశాల గోవులకు పూజలు చేసి నివేదనలు సమర్పించారు. రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుడు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి మండపంలో ఉత్సవమూర్తులను రావణ వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి మధ్య గ్రామోత్సవం జరిగింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి 7 గంటలకు పార్వతీ సమేత మల్లికార్జునస్వామివార్లను ముస్తాబు చేసి నంది వాహనంపై గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో బ్రహ్మోత్సవ కల్యాణం కనులపండువగా జరిగింది. స్థానిక చెంచు గిరిజనులు అటవీ వనరులు, వెదురుతో అల్లిన ఆభరణాలు, నూతన వస్త్రాలను ఐటీడీఏ అధికారుల సమక్షంలో ఉత్సవ మూర్తులకు సమర్పించారు.

● శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు జరగనున్నాయి. 18వ తేదీ రాత్రి అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

కళాకారుడి విన్యాసం

ఉద్యోగుల ఇళ్లలో సంక్రాంతి వెలుగులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉద్యోగులకు సంబంధించిన 60 నెలల బకాయిలను కూటమి ప్రభుత్వం ఒకేసారి చెల్లించి వారి ఇళ్లలో సంక్రాంతిని తీసుకొచ్చిందని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జవహర్‌లాల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగులకు 2018, 2019 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పోలీసు ఉద్యోగులకు సరెండర్ లీవ్ బకాయిలను సైతం ప్రభుత్వం ఇచ్చిందని పేర్కొన్నారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో లేకుండా అన్ని చెల్లించడంతో సంక్రాంతి పర్వదినాన ఒక్కో ఉద్యోగికి రూ.20 వేల నుంచి రూ.80 వేల వరకు అందిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశన్న, సహాధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి సుధాకర్, కర్నూలు తాలూకా సహాధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సాయిరాం, కోడుమూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ వేగంతో ర్యాంకు

నంద్యాల పట్టణానికి చెందిన దూదేకుల రిహాన్ ఏడో తరగతి చదువుతున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి క్రీడలపై ఎనలేని ఆసక్తి. తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించడం ప్రారంభించారు. అతను బెంగళూరులోని ఓ అకాడమీలో గత నాలుగేళ్లుగా షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఆటలో వేగంగా నైపుణ్యం సాధించి కోర్టులో తన రాకెట్‌తో సత్తా చాటుతున్నాడు. ఇప్పటివరకు ఆరుసార్లు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించి బహుమతులు సాధించాడు. అండర్-13 విభాగంలో ఆలిండియా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు రిహాన్ చెబుతున్నాడు. గతేడాది డిసెంబరులో బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో వెండి పతకం పొందాడు. గతేడాది ఐదు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి అందరి ప్రశంసలు అందుకొన్నాడు. – న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

భక్తులకు టోల్‌మోత

● నిబంధనలకు విరుద్ధంగా వసూలు

ఆళ్లగడ్డ మండల పరిధిలోని అహోబిలం గ్రామంలో వాహనాలకు సంబంధించి టోల్‌గేట్ రుసుము అధికంగా వసూలు చేస్తున్నారు. అయినా అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక సతమతమవుతున్నారు.
– న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

పంచాయతీ కార్యాలయ ముద్ర లేని రసీదు

ఉత్సవం నేపథ్యంలో..

అహోబిలంలో శుక్రవారం పార్వేటోత్సవం ప్రారంభమైంది. తన వివాహానికి ప్రజలను ఆహ్వానించేందుకుగాను స్వామివారు గ్రామాలకు పయనమయ్యారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఫలితంగా క్షేత్రం కిక్కిరిసింది. చాలా మంది వాహనాల్లో వచ్చారు. ఇదే అదనుగా భావించిన టోల్‌గేట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక వసూళ్లకు పాల్పడ్డారు.

కానరాని బోర్డులు

సాధారణంగా పంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారం ఆటోకు రూ.75, కారు రూ.100, లారీ, బస్సుకు రూ.150 వసూలు చేయాలి. కానీ శుక్రవారం కార్లకు రూ.200 చొప్పున తీసుకోవడం గమనార్హం. వాహనదారులకు ఇచ్చే రసీదులో పంచాయతీకి సంబంధించిన ముద్రలు కూడా కానరాలేదు. ఏ వాహనానికి ఎంత ధర ఉందో సూచించే బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు. చివరికి నిర్వాహకులు అడిగినంత మొత్తాన్ని భక్తులు ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విషయం మా దృష్టికి రాలేదని, పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ, డీఐజీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పీఎం కిసాన్, ముద్ర రుణాలు, సూర్యఘర్ తదితర పథకాల పేర్లతో లింకులు పంపి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారన్నారు. ఆయా లింకులను క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందన్నారు. ఓటీపీ తదితర వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

నృసింహ వైభవం.. చూసిన కనులదే భాగ్యం



పార్వేటకు బయలుదేరుతున్న ఉత్సవమూర్తులు

పూజలందుకుంటున్న ప్రహ్లాదవరద స్వామి, జ్వాలా నృసింహస్వామి

పార్వేటకు స్వామివార్ల పయనం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : నల్లమలలో కొలువుదీరిన నారసింహుడు భక్తుల చెంతకు కదిలాడు. తన వివాహానికి ఆహ్వానించేందుకు, ప్రియ భక్తులను కలిసేందుకు పయనమయ్యాడు. పార్వేటోత్సవంలో భాగంగా 35 రోజుల పాటు ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లోని 32 గ్రామాల్లో స్వామి పర్యటించనున్నారు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు స్వామి పార్వేటోత్సవం ఆరంభమవుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం దిగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా పార్వేటోత్సవ తంతు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, జ్వాలా నృసింహస్వామి, మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ ఉత్సవమూర్తులను పార్వేట మండపంలో కొలువుంచారు. స్వామివార్ల ముందు 35 రోజులకు సరిపడా అన్నం రాసిగా పోసి అన్నకూటోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచారు. చెంచులు సమర్పించిన కొబ్బరి కాయలు కొట్టి పార్వేట పల్లకిని ఊరేగింపుగా బయటకు తీసుకొచ్చారు. ఆలయ రాజగోపురం చేరుకున్న పల్లకికి చెంచులు బాణాలు సంధించారు. అనంతరం పల్లకి గ్రామ వీధుల్లో తిరుగుతూ బాచేపల్లె గ్రామానికి బయలుదేరింది. ఫిబ్రవరి 19వ తేదీన స్వామివార్లు తిరిగి అహోబిలం చేరుకుంటారు. ఆలయ ఏవో రామానుజన్, ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మనియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవం జరిపారు.

అక్రమాల లింకేజీ

● అతివలకు రుణాలిప్పించడంలో నిర్లక్ష్యం

● క్షేత్రస్థాయిలో భారీగా అక్రమాలు

డ్వాక్రా సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విరివిగా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. క్షేత్రస్థాయిలో పొదుపు మహిళలకు రుణాలు ఇప్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. రుణాల పంపిణీ లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు వెనుకపడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కింది స్థాయి సిబ్బంది అందినకాడికి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

మైక్రో క్రెడిట్ ప్లాన్-I కింద బ్యాంకు లింకేజీ రుణాల వివరాలు (డిసెంబరు- 2025)

జిల్లా	పొదుపు సంఘాలు	లింకేజీ లక్ష్యం (రూ.కోట్లలో)	తీసుకున్న సంఘాలు	చేరిన లక్ష్యం (రూ.కోట్లలో)
కర్నూలు	17,877	1,510.15	8,988	868.35
నంద్యాల	14,771	1,526.66	7,450	879.45

వేలల్లో సంఘాలు..

● కర్నూలు జిల్లాలో 966 గ్రామైక్య సంఘాలు, 25 మండల మహిళా సమాఖ్యలు, ఒక జిల్లా సమాఖ్య ఉంది. వీటి పరిధిలో 32,025 డ్వాక్రా సంఘాలు ఉండగా 3,22,944 మంది పొదుపు సభ్యులు ఉన్నారు.

● నంద్యాల జిల్లాలో 1,095 గ్రామైక్య సంఘాలు, 29 మండల మహిళా సమాఖ్యలు, ఒక జిల్లా మహిళా సమాఖ్య ఉంది. వీటి పరిధిలోని 31,205 డ్వాక్రా సంఘాల్లో 3,18,040 మంది పొదుపు మహిళలు సభ్యులుగా ఉన్నారు.

జిల్లా కేంద్రాల్లోనే నిఘా

అవకతవకలను అడ్డుకునేందుకు గతంలో సామాజిక ఆడిట్ విభాగాన్ని తీసుకొచ్చారు. ప్రత్యేకంగా లీగల్‌సెల్ సైతం ప్రారంభించారు. ఈ రెండు జిల్లా కేంద్రాలకే పరిమితం అవుతున్నాయి. డీఆర్డీఏ-వెలుగు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అప్రమత్తమై బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఫిబ్రవరిలోగా ఇస్తేనే..

● కర్నూలు జిల్లాలో 8,889 సంఘాలకు రూ.641.80 కోట్లు, నంద్యాల జిల్లాలో 7,321 సంఘాలకు రూ.647.21 కోట్లను ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలోగా ఇప్పించాల్సి ఉంటుంది. మార్చిలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపవు.

● మైక్రో క్రెడిట్ ప్లాన్-2 కింద స్వయం సహాయ సంఘాల్లోని సభ్యులకు రుణాలు ఇప్పించాలని లక్ష్యాలు నిర్దేశించారు. రానున్న మూడు నెలల్లో ఉమ్మడి జిల్లాలో 1,455 మంది పొదుపు మహిళలకు వ్యక్తిగతంగా రూ.156.52 కోట్ల రుణాలు ఇప్పించాల్సి ఉంది.

● డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా వీవోఏలు, ఏపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు జాప్యం చేస్తున్నారు. వెలుగు నుంచి ఇచ్చే ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) రుణాలు సైతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

జుర్రేరు.. సుందరీకరణకు అడుగులు

● సుమారు రూ.5 కోట్లతో పనులు

జుర్రేరు వాగు ఆనుకుని తొలగించిన ఆక్రమణలు

బనగానపల్లి పట్టణం నడిబొడ్డున ఉన్న జుర్రేరు వాగుకు మంచి రోజులు రానున్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగించి వెడల్పు చేశారు. భూగర్భ డ్రైనేజీ నీటిని వాగులోకి మళ్లించేలా పనులు చేపట్టారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి

తప్పనున్న వరద ముప్పు

భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతోపాటు వాగు సుందరీకరణ పనులకు మైనర్ ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. దద్దణాల చెరువు నుంచి కోవెలకుంట్ల మండలం కుందూ నది వరకు 30 కి.మీ. మేర వాగు విస్తరించి ఉంది. మొదటి విడతలో భాగంగా ఎస్సార్బీసీ నుంచి ప్రారంభించారు. పనులు పూర్తైతే కాలనీలకు వరద ముప్పు తప్పుతుంది.

మట్టికట్టల బలోపేతం

భారీ వర్షాలు కురిస్తే జుర్రేరు వాగు పక్కనే ఉన్న కొండపేట, తెలుగుపేటతో పాటు పలు కాలనీలు జలమయమవుతాయి. ఈ ముప్పును తప్పించేందుకు రూ.5 కోట్లతో పనులు చేస్తున్నారు. వాగుకు రెండు వైపులా సుమారు 1.25 కి.మీ.మేర మట్టికట్టలు వేస్తారు. లోపల రాళ్లతో కట్టను పటిష్ఠం చేస్తారు. అడుగు భాగాన 12 నుంచి 16 మీటర్ల వెడల్పు ఉంటుంది. కట్ట పైభాగంలో 4 మీటర్ల వెడల్పున నడకదారి ఏర్పాటు చేస్తారు. మొదటి విడతలో భాగంగా యాగంటిపల్లె రోడ్డులోని ఎస్సార్బీసీ కాలువ వంతెన నుంచి పాత బస్టాండు సమీపంలోని జుర్రేరు వంతెన వరకు పనులు చేపట్టారు.

"మైనర్ ఇరిగేషన్ పరిధిలో అక్రమ కట్టడాలు తొలగించాం. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. అవి పూర్తయితే వాగు సుందరంగా మారుతుంది" అని మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ 27న

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో ఈనెల 27న కర్నూలు జిల్లా దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు నేరుగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని తమ అభిప్రాయాలను ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డికి తెలియజేయాలని కోరారు.

పైపైన చేసిపోతారు

● రహదారి పనుల్లో నాణ్యత కరవు

డోన్ నుంచి ఓర్వకల్లు మండల పరిధిలోని సోమయాజులపల్లె వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి అధ్వానంగా మారింది. 54 కి.మీ. మేర దీనిని నిర్మిస్తున్నారు. 340బి ఎన్‌హెచ్‌లో భాగంగా డోన్ యు.కొత్తపల్లె సర్కిల్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, డోన్



డోన్ ఆస్పత్రి సమీపంలో దెబ్బతిన్న రహదారి

భారీగా నిధుల వెచ్చింపు

● రహదారి నిర్మాణానికి సుమారు రూ.450 కోట్ల వరకు చేస్తున్నారు. డోన్ పరిధిలోని ఆస్పత్రి ప్రాంతంలో రహదారి దెబ్బతింది. ఒకవైపు పనులు జరుగుతుండగా.. మరోవైపు రూపు కోల్పోతోంది. ఈ మార్గంలో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి.

● యు.కొత్తపల్లె సర్కిల్ ప్రాంతంలో రహదారి దెబ్బతినడంతో ఇటీవల వామపక్ష పార్టీల నాయకులు సైతం నాణ్యతపై ఆందోళన చేశారు. అధికారులు స్పందించి పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా మరో లేయర్ వేయాల్సి ఉంది.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా...

ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం

నేడు రేపు ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రాజ్‌విహార్ సెంటర్‌లో రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న ఈనాడు కార్యాలయం వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబికులు నేడు(శనివారం, జనవరి 17న), రేపు(ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం॥ నుంచి సాయంత్రం 5.30 గం॥ వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ వధూవరుల బయోడేటా & ఫొటోలను క్రింద తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చూసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91543 66099 & 91547 72006**

వైభవంగా ఉమామహేశ్వరుని ఉత్సవం

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించే యాగంటి ఉమామహేశ్వరస్వామి పార్వేట ఉత్సవం వైభవంగా సాగింది. సమీప ప్రాంతాలైన పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల పల్లకిని ఘనంగా ఊరేగించారు. శుక్రవారం పాతపాడులో ప్రత్యేక పూజల అనంతరం యాగంటి ఆలయానికి సంప్రదాయరీతిలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోటాపోటీ.. పొట్టేళ్లు ఢీకొట్టి

బలప్రదర్శన పోటీల్లో పాల్గొన్న పొట్టేళ్లు

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని శుక్రవారం శ్రీఅన్నపూర్ణ కాశీశ్వర స్వామి ఆలయ మైదానంలో పొట్టేళ్ల బలప్రదర్శన నిర్వహించారు. 8 జతల పొట్టేళ్లు పోటీల్లో బలాన్ని ప్రదర్శించాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులుగా రూ.10 వేలు, 8వేలు, 5వేలు, 3వేల నగదును అందజేశారు.

చదువులో ఫలితాలు.. ఆటల్లో పతకాలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: సాధన ఉంటే అనుకున్నది సాధిస్తారు. పట్టుదల ఉంటే లక్ష్యం చేరుకుంటారు. పల్లె విద్యార్థులు బేస్ బాల్ క్రీడల్లో పట్టు సాధిస్తున్నారు. చదువులో ఫలితాలు.. క్రీడల్లో పతకాలు ఒడిసిపడుతున్నారు. మండల కేంద్రమైన చాగలమర్రి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బేస్‌బాల్‌లో రాణిస్తున్నారు. ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయుల సహకారం, వ్యాయామ ఉపాధ్యాయుడి తర్ఫీదుతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ముందుకు సాగుతున్నారు.

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

- నిరంజన్, తొమ్మిదో తరగతి

చాగలమర్రి పట్టణానికి చెందిన తెల్లన్న, వీరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీ కుటుంబం. వీరి కుమారుడైన నిరంజన్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బేస్‌బాల్‌పై ఆసక్తితో వివిధ స్థాయిల్లో రాణిస్తున్నాడు. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రాన్ని పొందాడు. 2025 ఆగస్టులో ఒంగోలులో జరిగిన బేస్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడు. 2025 నవంబరులో అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పతకమే లక్ష్యమని చెబుతున్నాడు నిరంజన్.

పోలీసు కొలువే ధ్యేయం

- వెంకటసుశాంత్, ఎనిమిదో తరగతి

చాగలమర్రి పట్టణానికి చెందిన సుబ్బయ్య, సుహాసిని దంపతుల కుమారుడు వెంకటసుశాంత్ చాగలమర్రి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి ప్రోత్సాహంతో బేస్‌బాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. 2024 ఆగస్టులో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపాడు. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాడు. 2025 నవంబరులో అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో భాగంగా అండర్-14 పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. చదువులో రాణించి భవిష్యత్తులో పోలీసు కొలువు సాధిస్తానని వెంకటసుశాంత్ చెబుతున్నాడు.

ప్రత్యేక పూజలో హైకోర్టు న్యాయమూర్తి

స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్

పగిడ్యాల, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్, ఆయన సతీమణి తన స్వగ్రామం ప్రాతకొట గ్రామంలోని శ్రీగంగా పార్వతి సమేత నాగేశ్వర స్వామి, శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సంప్రదాయ ఆలయ మర్యాదలతో వారికి ఘనస్వాగతం పలికారు. కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి భక్తుల విరాళాలు

ఆలయ ఛైర్మన్ కుమార్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన ఆర్.చేతన కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు. చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు చెందిన ప్రదీప్‌కుమార్, తేజస్విని కుటుంబ సభ్యులు రూ.30 వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహస్వామి దీక్ష



నృసింహస్వామి దీక్ష స్వీకరణలో మాలధారులు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలంలో నృసింహస్వామి దీక్ష కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా స్వామి పార్వేట ఆరంభ సమయంలో భక్తులు స్వామి మాలధారణ వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ఆవరణలోని గోదాదేవి సన్నిధిలో జ్వాలా నృసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామిని ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచారు. స్వామికి ఎదురుగా హోమగుండం ఏర్పాటు చేసి అర్చకులు సుదర్శన హోమం జరిపారు. అనంతరం మాలధారులకు అర్చకులు స్వామి దీక్షను అనుగ్రహించారు. వేలాది సంఖ్యలో మాలధారులు పసుపు వస్త్రాలు ధరించి దీక్షను స్వీకరించారు. 41 రోజుల పాటు మాలధారులు దీక్షను భక్తిశ్రద్ధలతో చేపట్టనున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, అర్చకులు కల్యాణరంగన్ స్వామి దీక్ష ప్రాధాన్యాన్ని వివరించారు.

ఆదోని జిల్లా సాధనకు బంద్ 24న

సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఆదోని డివిజన్‌లోని ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాలు బంద్ చేపడుతున్నట్లు ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు పిలుపునిచ్చారు. ఆదోనిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐకాస నాయకులు రఘురామయ్య, అశోకానందరెడ్డి, కృష్ణమూర్తి, నూర్ అహ్మద్, దస్తగిరి మాట్లాడారు. ఆదోని జిల్లా సాధన కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలంతా కలిసికట్టుగా ఈ బంద్ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమావేశంలో నాయకులు వీరేష్, సుజ్ఞానమ్మ, కోదండ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలులోని జిల్లా కోర్టు న్యాయసేవాసదన్‌లో రికార్డు అసిస్టెంట్-1, ఫ్రంట్ ఆఫీస్ కో ఆర్డినేటర్-1, డేటా ఎంట్రీ ఆపరేటర్-1 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా 'ఛైర్మన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కోర్టు ఆవరణం, కర్నూలు' చిరునామాకు పంపాలన్నారు. రిజిస్టర్ పోస్టు లేదా స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే దరఖాస్తులు పంపాలన్నారు. నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తు కోసం www.ecourtskurnool.com & kurnool.dcourts.gov.in లను సంప్రదించాలన్నారు.

ఘనంగా రథోత్సవం

రథోత్సవంలో మాజీ ఎంపీ, భగవత్‌సేవా సమాజ్ సభ్యులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో భగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని రథోత్సవ కార్యక్రమాన్ని సంజీవనగర్ రామాలయం నుంచి నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని నృత్యాలు, కోలాటం చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ చాన్‌బాషా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మాజీ ఎంపీ పోచబ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.రవికృష్ణ, ప్రసాద్, అధ్యక్షులు సూరయ్య, సభ్యులు మధుసూదన్‌గుప్తా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

తెదేపా నాయకుడిపై దాడి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు నాగేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు మోహన్ సుదర్శన్‌రెడ్డిలపై అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకులు చెన్నారెడ్డి, ఆయన కుమారుడు కేశవరెడ్డి, మరికొందరు దాడి చేసి గాయపరిచినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం నంద్యాల నుంచి మోహన్ సుదర్శన్‌రెడ్డి ఇంటికి వస్తుండగా చెన్నారెడ్డి కుమారుడు కేశవరెడ్డి ద్విచక్రవాహనానికి అడ్డంగా నిలబడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మోహన్ సుదర్శన్‌రెడ్డి, కేశవరెడ్డిలు వెళ్లిపోయారు. ఇంటికెళ్లిన తర్వాత కేశవరెడ్డి, తండ్రి చెన్నారెడ్డితో కలిసి మరికొంత మందితో నాగేశ్వరరెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. నాగేశ్వరరెడ్డి, మోహన్ సుదర్శన్‌రెడ్డిలపై దాడి చేసి గాయపరిచారు. దాడిలో గాయపడిన వారు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు వీరిరువురు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఘర్షణ సమాచారం తెలుసుకున్న సీఐ ఈశ్వరయ్య గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. పాతకక్షల కారణంగానే గ్రామంలో ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుసుకొని.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఆదోని చిత్రబృందం

చిత్రీకరణలో సభ్యులు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: లఘు చిత్రాలు తీస్తూ.. ప్రజలను చైతన్యవంతం చేయాలని భావించారు. ప్రజలకు అవసరమైన సామాజిక అంశాలు జోడిస్తూ.. ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఇటీవల 'ది డార్క్ ప్యాసెంజర్' అనే చిత్రం తీసి, ఆదోని సినిమా థియేటర్‌లో ప్రదర్శించి.. శభాష్ అనిపించుకున్నారు. వీరెవరో పేరెన్నికగన్న దర్శకులు, నటీనటులు, సాంకేతికత నిపుణులు అనుకుంటే పొరపాటే. వీరంతా ఆదోనికి చెందిన మిత్ర బృందం సభ్యులే.

ఆదోని పట్టణానికి చెందిన దర్శకుడు మన్సూర్, కళాకారులు డ్రాగన్ రంగా, కీరా, సంతోష్, అల్తాఫ్, దినేశ్, మధు, మర్రిస్వామి, ఐశ్వర్య, లావణ్య తదితరులు మిత్ర బృందంగా ఏర్పడ్డారు. మిత్ర బృందం.. చిత్ర బృందంగా మారి గత ఐదారేళ్లు నుంచి సమాజానికి అవసరమైన సందేశం ఇస్తూ.. లఘుచిత్రాలు తీస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే 2023 సంవత్సరంలో ఈ బృందం తీసిన 'పరీక్ష' అనే లఘుచిత్రానికి విజయవాడలో స్టార్ సినీ అవార్డ్స్ వారు ఉత్తమ లఘుచిత్రంగా ఈ బృందానికి అవార్డు ప్రదానం చేశారు. అదే స్ఫూర్తితోనే ఈ బృందం సభ్యులు వ్యామ్ క్రియేషన్స్‌ను స్థాపించి పూర్తి స్థాయి చిత్రం తీయాలని లక్ష్యం పెట్టుకున్నారు.



చిత్రం వాల్‌పోస్టర్

నెరవేరిన లక్ష్యం

వ్యామ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'ది డార్క్ ప్యాసెంజర్' పేరుతో దర్శకుడు మన్సూర్ ఓ చిత్రాన్ని రూపొందించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా మిత్ర బృందం సభ్యులు డ్రాగన్ రంగా, కీరా, సంతోష్, అల్తాఫ్, దినేశ్, మధు, మర్రి స్వామి తదితరులు కలిసి వ్యామ్ క్రియేషన్స్ ద్వారా చిత్రీకరణ ప్రారంభించారు. పోస్టు ప్రొడక్షన్, డిజిటల్ మేకింగ్ తదితరాలు అన్నీ ఈ బృందం సభ్యులు కష్టపడి తీశారు. అనుమతులు, కెమెరా, తదితర సామగ్రి సేకరణ తదితర అవసరాల కోసం సుమారు రూ.6లక్షలు ఖర్చు అయింది. ఇదంతా బృంద సభ్యులు భరించారు. గత వారం 'ది డార్క్ ప్యాసెంజర్' చిత్రాన్ని ఆదోని పట్టణంలోని థియేటర్‌లో విడుదల చేశారు. ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో మిత్ర బృందం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆదోని కళాకారులచే ఓ పూర్తి స్థాయి చిత్రం 'అమరత్వం' సినిమా తీసి రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేస్తామని చెబుతోంది ఈ చిత్ర బృందం సభ్యులు.

నకిలీ పీటీ వారెంట్ కేసులో మూడేళ్ల జైలు

ఆదోని గ్రామీణం, నేరవార్తలు, న్యూస్‌టుడే: నకిలీ పీటీ వారెంటు తయారు చేసి, సబ్ జైలులో రిమాండులో ఖైదీని తప్పించిన కేసులో నిందితులకు శుక్రవారం ఆదోని కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించింది. అప్పట్లో ఈ కేసు సంచలనం సృష్టించింది. ఆదోని రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2013 జులై 17వ తేదీన ఆదోని సబ్ జైలులో ఓ కేసులో నిందితుడిగా ఉన్న జగపతి మహేష్‌ను తప్పించేందుకు ఆదోనికి చెందిన శాంతరాజు, కర్నూలుకు చెందిన మధుసూదన్, ఎమ్మిగనూరుకు చెందిన ముల్లా ఖాజా, కర్నూలుకు చెందిన సుంకిరెడ్డి, హనుమంతు, ముగతి గ్రామానికి చెందిన కృష్ణ, కర్నూలు సమీపంలోని పందిపాడుకు చెందిన రఘునాథ్ నకిలీ పీటీ తయారు చేసుకొని, ఆదోని సబ్‌జైలుకు వెళ్లి.. ముద్దాయిని మహేష్‌ను ఆత్మకూరు కోర్టులో హాజరు పరచాలని చెప్పి అక్కడి నుంచి తీసుకెళ్లారు. నిందితుడు జైలుకు తిరిగి రాకపోవడంతో.. నకిలీ పీటీ వారెంట్ అని గుర్తించిన అప్పటి డిప్యూటి జైలర్ రత్నం ఫిర్యాదు మేరకు 2013 జులై 27వ తేదీన ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో కోర్టు సిబ్బంది, పోలీసు కానిస్టేబుల్ మాధవరం పోలీసు స్టేషన్‌లో ఒకరు ఉన్నారు. ఆదోని కోర్టులో నిందితులపై సాక్షాధారాలతో నేరం రుజువు కావడంతో ఆదోని జ్యుడిషియల్ మొదటి శ్రేణి కోర్టు న్యాయమూర్తి సాయి సుభాష్ తీర్పు ఇచ్చారు. మూడెళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.

నిందితులతో సీఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు

రహదారి ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల చెక్ పోస్టు పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా కర్నూలు నగరానికి చెందిన ఈడిగ జయచంద్ర గౌడ్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీ కొట్టాడు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కర్నూలు తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నమ్మ (50) మృతి చెందింది. ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రత్నమ్మ తెల్లవారుజామున జాతీయ రహదారి దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని చెప్పారు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించినట్లు చెప్పారు. రత్నమ్మకు ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

శంకలాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని శంకలాపురం గ్రామానికి చెందిన వ్యక్తి రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ఎస్సై కేసీ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బి.దస్తగిరి(33) శంకలాపురం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బేతంచెర్లకు వస్తుండగా సీతారాంపురం గ్రామ శివారులో బొలెరో వాహనం ఢీకొట్టింది. కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



దస్తగిరి (పాత చిత్రం)

ద్విచక్రవాహనం ఢీకొని..

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పాములపాడు మండలంలోని వానాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపాలు తెలిపిన వివరాల మేరకు వానాల గ్రామానికి చెందిన జీవమ్మ(45) గ్రామంలో జరిగే కూరగాయల సంతకు వెళ్లింది. సంత చేసుకుని తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దాంతో తీవ్ర గాయాలైన జీవమ్మను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరొదిలిన అన్నదాతలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం గోనెగండ్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని అచ్చుకట్ల వీధికి చెందిన ముల్లా జైనుద్దీన్(51) రైతుకు నలుగురు కుమార్తెలు వారిలో ముగ్గురికి పెళ్లి చేశారు. అందుకు రూ.7.50లక్షలు అప్పు తెచ్చారు. నాలుగో కుమార్తె మానసిక దివ్యాంగురాలు. తనకున్న ఎకరా 25 సెంట్ల పొలాన్ని అమ్మి కొంత అప్పు తీర్చారు. మిగతా అప్పు తీర్చడం కోసం రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. గత ఏడాది మినుములు సాగు చేశారు. ఆశించినంత పండలేదు. ఈ ఏడాది మొక్కజొన్న పంట వేశారు. పెట్టుబడికి తెచ్చిన అప్పుల భారం ఎక్కువైంది. ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య నూరాన్‌బి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు.



ముల్లా జైనుద్దీన్ (పాతచిత్రం)

పంట చేతికి రాక..

పుసులూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి పుసులూరు గ్రామానికి చెందిన డి.జయరామిరెడ్డి (45) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న నాలుగెకరాల భూమిలో పత్తిపంట సాగు చేసేందుకు గాను అప్పు చేశారు. పంట చేతికి రాకపోవడంతో అప్పులు ఎక్కువై బాధతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోఆర్క్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానం గోశాలలో గోఉత్పత్తులు చేసే ఉద్యోగి రాజు గురువారం ఆత్మహత్యాయత్నానికి పడ్డారు. తన ఇద్దరు పిల్లలతో కలిసి గోశాలకు వెళ్లి గదిలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై కాపాడారు. బాధిత ఉద్యోగి రాజు సెల్ఫీ వీడియో ద్వారా తన గోడును వెళ్లబోసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మూడు నెలల నుంచి తనకు దేవస్థానం అధికారులు జీతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానం గోశాలలో యంత్రం పని చేయకుండా మరమ్మతులకు గురైనప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పర్యవేక్షకులు రాజశేఖర్ ఎటువంటి కారణం తెలపకుండానే హాజరుకు సంబంధించిన బయోమెట్రిక్ వేలిముద్రల నమోదును యంత్రంలో నిలిపివేశారని వాపోయారు. ప్రైవేటు గో ఉత్పత్తుల విషయంలో జోక్యం చేసుకున్నందుకు దేవస్థానం అధికారులు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మూడు నెలల నుంచి దేవస్థానం తరఫున గో ఉత్పత్తుల తయారీ నిలిచిపోయిందని బాధితుడు వెల్లడించారు. ఈ ఘటనపై దేవస్థానం అధికారులతో పాటు పోలీస్ అధికారులు విచారణ చేపట్టారు.

వేధింపులు తాళలేక..

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పనిచేసే చోట అధికారుల వేధింపులు తాళలేక ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్లకు చెందిన మధుబాబు(51) 12 ఏళ్లగా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ)లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఆయన బుధవారం ఇంట్లో రసాయనిక ద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందాడు. నంద్యాల దగ్గర మిట్నాల పాఠశాల ప్రిన్సిపల్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, సచివాలయ ఇంజినీరు, డీఈ, ఈఈల వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య సుజాత, కుమారుడు మంజునాథ్‌లు ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు. మిట్నాల ఆదర్శ పాఠశాలలో మూడేళ్ల క్రితం నాడు-నేడు కార్యక్రమం నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వచ్చాయి.



మధుబాబు (పాత చిత్రం)

EENADU Classifieds

REAL ESTATE

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలి పసుపుల గ్రామ పరిధిలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్:99853 43829.

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET

COMMERCIAL

కర్నూలు మద్దూరు నగర్ దగ్గర, OCM టైలర్ షాపు ప్రక్కన 2+4 షాపులు బాడుగకు కలవు. షాపులకు, క్లీనిక్స్ కు అనుకూలం. సంప్ర: 98492 26953.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్/ టెలీకాలర్స్ కావలెను. జీతం: 10,000/- నుండి 15,000/- ఫిక్స్‌డ్ సాలరీ, నో టార్గెట్, సంప్ర:63007 25354.

ACCOUNTING

కర్నూలులోని విద్యా సంస్థలో అకౌంటెంట్ గా పనిచేయుటకు అనుభవం గల స్త్రీ అభ్యర్థి కావలెను. అర్హత:ఎమ్ డిగ్రీ. సంప్ర: 73309 24873, 98854 85281.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

కాలమాన పట్టికలను ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

కాలమాన పట్టికల ఆవిష్కరణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆల్‌మేవా, జమీఅతే ఉలమాయే హింద్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కాలమాన పట్టికలను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్ ఆవిష్కరించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన వేర్వేరు కార్యాలయంలో ఆయన ఈ మేరకు వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ.ఫిరోజ్, జిల్లా జమీఅతే ఉలమాయే హింద్ అధ్యక్షులు హాఫీజ్ అంజాద్ బాషా సిద్ధికి, అబ్దుల్ సలాం, మౌలానా అబ్దుల్ సలాం, ముక్తి అబ్దుల్ గఫార్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ మహ్మద్ ఫరూక్, షేక్ మహ్మద్ గౌస్, సయ్యద్ నబీరసూల్, మహ్మద్ రఫీ, స్టీఫెన్ ఎమ్మెస్, సయ్యద్ అమిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో శుక్రవారం కనుమ పండగను పురస్కరించుకుని శ్రీఅన్నపూర్ణ కాశీశ్వర స్వామి ఆలయ మైదానంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని అన్నారు. ఇతర ప్రాంతాలు నుంచి ఎద్దులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు శ్రీనువాసులు, నాగశేషులు, ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఉత్సవాలతో గ్రామ ఐక్యత

కొత్తపల్లి, న్యూస్‌టుడే: పండుగ, ఉత్సవాలు గ్రామ ఐక్యతకు గుర్తని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల ముగింపు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పారువేటలో గెలుపొందిన సుధీర్ అనే యువకుడ్ని అభినందించారు.

★ గతంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో నియంత్రిక దగ్గర పడిన బంతిని తీసుకోవడానికి వెళ్లిన విద్యార్థి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తర్వాత అధికారులు నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేశారు.

★ గత ఏడాది పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఓ విద్యార్థిని ఇంటిపై దుస్తులు ఆరేస్తుండగా.. విద్యుత్తు తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు.

పొంచిన ప్రమాదం..

★ భయపెడుతున్న నియంత్రికలు, విద్యుత్తు తీగలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా మారింది. చాలా స్తంభాలు ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కొందరు గృహ యజమానులు, వ్యాపారస్తులు స్తంభాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పట్టణంలో చాలా నియంత్రికలకు రక్షణ గోడలు, కంచెలు లేవు. నియంత్రికల దిమ్మెలకు పగుళ్లు ఏర్పడి, చుట్టూ కంప చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారింది. గృహాల మీదుగా విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వెళ్తున్నాయి. గతంలో విద్యుత్తు తీగలు, నియంత్రికలు తగిలి ప్రమాదాలు, మరణాలు సంభవించాయి. ఇప్పటికైనా అధికారులు ఒరిగిన స్తంభాలను బాగు చేయించి, నియంత్రికల దిమ్మెలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ నగర్‌లో నియంత్రిక దిమ్మెకు పగుళ్లు

గృహ కనెక్షన్లు 78 వేలు

నంద్యాల పట్టణంలో 6,700 విద్యుత్తు స్తంభాలు, 850 నియంత్రికలు, 41 ఫీడర్లు, 19కి.మీ. 33కేవీ, 170 కి.మీ. 11 కే.వీ. విద్యుత్తు లైన్లు ఉన్నాయి. గృహ కనెక్షన్లు 78 వేలు, వాణిజ్య కనెక్షన్లు 14,750 ఉన్నాయి. పట్టణంలోని నూనెపల్లె మార్కెట్ యార్డు, పీవీ నగర్‌లలో కొత్తగా సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్తు శాఖ ఈఈ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ఈ ప్రాంతాల్లో..

● పట్టణంలోని ఎంఎస్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, విజయపురి, బొగ్గులైన్, కాంతినగర్, జ్ఞానాపురం, విశ్వనగర్ ప్రాంతాల్లో చెట్ల మధ్యలో నుంచి విద్యుత్తు తీగలు వెళ్తున్నాయి. దీంతో పెద్ద గాలి వీచినప్పుడు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి మంటలు వచ్చి విద్యుత్తు సరఫరా నిలిచిపోతుంది. సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి పునరుద్ధరించే వరకు చాలా సమయం పడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు తీగల వద్ద పెరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగిస్తే సమస్య ఉండదని ప్రజలు చెబుతున్నారు.

● పట్టణంలోని ఎస్బీఐ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, వైఎస్సార్ నగర్, బుడగజంగాల కాలనీ, విశ్వనగర్, రైతునగరం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇవి కూలి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఒరిగిన విద్యుత్తు స్తంభాలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

● పట్టణంలో మూలసాగరం, వైఎస్సార్‌నగర్, నౌమాన్‌నగర్, దేవనగర్, విశ్వనగర్ ప్రాంతాల్లో నియంత్రికల దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా నియంత్రికలకు కంచెలు లేవు. వీటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. పిచ్చి మొక్కలు తొలగించి, దిమ్మెలకు మరమ్మతులు చేయించి, కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● పట్టణంలోని బైర్మల్ వీధి, ఎన్జీవోస్ కాలనీ, వీసీ కాలనీ, దేవనగర్, సాయిబాబా నగర్, బాలాజీ కాంప్లెక్స్, బర్మశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు ఇళ్ల మీద నుంచి వెళ్తున్నాయి. వీటి వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాల ఉత్పత్తిదారులకు బహుమతులు

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని పీరు సాహెబ్‌పేట పాల ఉత్పత్తిదారులకు సంక్రాంతి సందర్భంగా భోజనం క్యారియర్లను పంపిణీ చేసినట్లు ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మండల తెదేపా అధ్యక్షుడు కాతా రమేష్ రెడ్డి మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకరంగా విజయ డెయిరీ తరపున భోజనం క్యారియర్లను అందజేసినట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం: ?: ఎస్పీజీ పాలెంలో పీతిరివాగుకు రక్షణ గోడ లేదు. అధిక వర్షాలకు నీళ్లు కాలనీలోకి ప్రవహిస్తున్నాయి. - **మల్లయ్య, స్థానికుడు.** ✔: రక్షణ గోడ అంశం పరిశీలిస్తాం. -**రమేష్‌బాబు, కమిషనరు.**

?:అంబేద్కర్ నగర్‌లో ఎన్జీవో హోం సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. విష పురుగులు సంచరిస్తున్నాయి.- **రాజు, స్థానికుడు.** ✔:పిచ్చి మొక్కలు తొలగిస్తాం. - **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.**

నంద్యాల పురపాలకం: ?: నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వినాయకనగర్‌లో కాల్వలు సరిగా శుభ్రం చేయడంలేదు. -**రాజేష్, స్థానికుడు** ?:నివర్తినగర్‌లో కాల్వలు శుభ్రం చేయడంలేదు. దోమల బెడద అధికమైంది. -**శివన్న, స్థానికుడు.**?:పట్టణంలోని నౌమాన్ నగర్ వీధి కుక్కల బెడద ఎక్కువైంది.- **రాయుడు, స్థానికుడు.**

?: పట్టణంలోని సాయిబాబా నగర్ చిన్నపిల్లలపై కుక్కలు దాడి చేస్తున్నాయి. - **జీవన్, స్థానికుడు.**

✔:సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తాం. ఫాగింగ్ చేయిస్తాం. కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. - **లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈఈ ప్రభాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇదే విధంగా బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లోని విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని ప్రాంతాల్లో అవసరమైన పనులు చేయించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 12 నుంచి జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ పనులు చేపడుతున్నామని వివరించారు.

శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

కార్డులు అందజేస్తున్న రైతుసంఘం కార్యదర్శి రాజు

మహానంది, న్యూస్‌టుడే: ఖమ్మంలో జరిగే సీపీఐ పార్టీ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని, ఇందుకు అందరూ తరలిరావాలని మండల రైతు సంఘం కార్యదర్శి రాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మహానంది మండలం అబ్బీపురం గ్రామంలోని చెంచుకాలనీలో మండల సీపీఐ కార్యదర్శి ఆర్.సామేల్ ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ ద్వారా రెన్యూవల్ గుర్తింపు కార్డులను అందజేశారు. మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు మహిళలు పాల్గొన్నారు.

అడవి పందిని చంపిన ఇద్దరిపై కేసు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: అడవిపందిని చంపిన కేసులో ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి నాసిర్‌ఝా తెలిపారు. శుక్రవారం గడివేముల మండలంలోని ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానపల్లె పెద్దరాయుడు, ఎర్రగుంట్ల సుంకన్న అడవిపందిని చంపి సంచిలో వేసుకొని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్నారన్న సమాచారం మేరకు కేసీకెనాల్ వెంట గస్తీ నిర్వహించామన్నారు. ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

నీరు నిలిచి.. అవస్థలు పెరిగి

నంద్యాల శివారులోని వైఎస్సార్ నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రెండో ట్యాంకు వద్ద రోడ్డు గుంతలమయంగా మారి నీరు నిలిచి బురద, చిత్తడిగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పరిమితికి మించితే.. ప్రమాదం

కొత్తపల్లి మండలం సంగమేశ్వరం నుంచి ఆత్మకూరు వెళ్లే దారిలో ఆటో, చిన్న వ్యాన్లలో పరిమితికి మించి ప్రయాణికులను చేర వేస్తున్నారు. చిన్న వ్యాన్‌లో చెక్కలు ఏర్పాటు చేసి కింద, పైన పరిమితికి మించి ఎక్కించుకొని ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

నిరుపయోగంగా చేతి పంపు

నంద్యాల ఎన్జీవోస్ కాలనీ పురపాలక పార్కు రోడ్డులో రహదారి పక్కన ఏర్పాటు చేసిన చేతి పంపు నిరుపయోగంగా మారింది. గత కొన్నేళ్లుగా దీనికి మరమ్మతులు చేయించడం లేదు. వేసవి కాలం సమీపిస్తుండటంతో చేతి పంపునకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల

పగలగొట్టి.. అలాగే వదిలేసి..

నంద్యాల ఎస్సార్బీసీ టిడ్కో గృహాల్లో పైప్‌లైన్ మరమ్మతుల కోసం రోడ్డును పగలగొట్టారు. పనులు పూర్తయ్యాక పూడ్చకుండా గుంతను అలాగే వదిలేశారు. ఈ దారి నుంచి రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు రాత్రిళ్లు గుంతను గమనించకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

డీఏ బకాయిల విడుదలపై హర్షం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు రూ.1100 కోట్లు విడుదల చేసి ఒక రోజు ముందుగానే సంక్రాంతి సంబరాలను ఉద్యోగులకు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీసీ.హుస్సేన్‌రెడ్డి, నరసారెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. బకాయిలు విడుదల చేయడంపై వారు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగుల కళ్లలో ఒక్క రోజు ముందుగానే సంక్రాంతి వెలుగులు నిండాయని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డిలను కృతజ్ఞతలు తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ పేదలకు సాయం చేసే సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు రమాదేవి అన్నారు. గురువారం చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన మద్దినేని నవీన్‌బాబు, ప్రసన్న లక్ష్మీ దంపతుల కుమారుడు హేమచంద్ జన్మదిన వేడుకల సందర్భంగా నారపురెడ్డి కుంట గిరిజన గూడానికి చెందిన 50 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. గిరిజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ సంప్రదాయాలు పాటించాలి

భరతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: దేశంలోని ప్రతి ఒక్కరూ ఆచార, సంప్రదాయాలను పాటించాలని కర్నూలు విభాగ్ ఇతిహాస సంకలన ప్రముఖ్ వేణుగోపాల్, కురవ సంఘం పట్టణ అధ్యక్షులు విజయ్ కిరణ్, మాజీ కౌన్సిలర్ కత్తి శంకర్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని కురవపేట చిన్న రామాలయం వద్ద ఆర్‌ఎస్‌ఎస్ చిత్తులూరి బస్తి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందువులు సంఘటితం కావాలన్నారు. మహిళలు, చిన్నారులు గీత పఠనం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సేవ ప్రముఖ్ సంఘ శ్రీనివాసులు, వెంకటేష్, మల్లికార్జున, కొండా రమేష్, భాను, యోగి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలో వైజాగ్ క్యాంపులోని కనకదుర్గమ్మ ఆలయం వీధిలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నమారెన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మల్లికార్జున, మండలాధ్యక్షులు డి.నాగరాజులు హాజరయ్యారు. పోటీల్లో 20 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. నాగవెంకటేష్, చిన్నగంగులు, ముగెన్న, నారాయణ, భీమలింగడు, పాల్గొన్నారు.

మహిళలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

అంతర్రాష్ట్ర వాలీబాల్ క్రీడలు ప్రారంభం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని సెంట్రల్ లోకాలిటీ పాఠశాల మైదానంలో సన్‌రైజ్ వాలీబాల్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి, రెండవ పట్టణ సీఐ జి.సుబ్బారావు, ఎస్పీఎఫ్ ఆర్ఐ రాజేష్, డాక్టర్ వినయ్‌లీలారెడ్డి, తెదేపా నాయకులు ఉమామహేశ్వరరావు, వైకాపా నాయకుడు పాపారావు, జనసేన నాయకులు నాగసాయిరాం, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కాకా, రాయల్ రమేష్‌లు గురువారం ప్రారంభించారు. ఈ పోటీలకు పలు జిల్లాల నుంచి జట్లు వస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు శ్రీను, బాబులు తెలిపారు.

పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కొత్తూరులో స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

గడిగరేవులలో శ్రీదుర్గాభోగేశ్వరస్వామి వారిని పల్లకీ సేవ

మహానంది క్షేత్రంలో తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రత్యేక అలంకరణలో గుడిపాటిగడ్డ వేంకటేశ్వరస్వామి

మహానంది: నందీశ్వరునికి ప్రదోషకాల పూజల్లో భక్తులు, అర్చకులు

పగిడ్యాల: రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, తెదేపా ఇన్‌ఛార్జి మాండ్ర

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలు ఊరూరా అంబరాన్నంటాయి. మూడు రోజులు పాటు వేడుకలు ఘనంగా సాగాయి. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పూజలు, వేడుకలు, గ్రామోత్సవాలతో సందడి నెలకొంది. కనుమ పండగ సందర్భంగా శుక్రవారం పారువేట ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. బంధుమిత్రులతో ప్రజలు ఆనందంగా గడిపారు. యువతకు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి సరిగెత్తు

లింగాపురం (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: మండలంలోని లింగాపురం గ్రామంలో మౌలాలీ స్వామి సరిగెత్తు కార్యక్రమాన్ని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి కొలువుదీరిన మౌలాలి స్వామి పీరుకు ప్రత్యేకంగా అలంకరించి, ఫాతెహాలు నిర్వహించారు. శుక్రవారం అంగరంగ వైభవంగా, మేళతాళాల మధ్య పీర్లకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ మేరకు పీర్లకు ఏటికి తరలించారు.

లింగాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ముగిసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

పెద్దదేవళాపురం (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ముగిశాయి. గురువారం నిర్వహించిన న్యూ కేటగిరి వృషభ పోటీల్లో మిడ్తూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన రోళి వృషభాలు అత్యధిక దూరాన్ని లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, జయదేవ్‌దత్తులు తెలిపారు. ద్వితీయ స్థానంలో వైఎస్సార్ జిల్లా పెద్దముడియం గ్రామానికి చెందిన రాచమల్లు శాన్వికరెడ్డి, తృతీయ స్థానంలో ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి, నాల్గవ స్థానంలో బిల్లలాపురం గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి వృషభాలు నిలిచాయి. కృష్ణనాయక్, విష్ణుశర్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి

కేసీ కాలువలో వృద్ధుడి గల్లంతు

పగిడ్యాల, న్యూస్‌టుడే: కేసీ కాలువలో వృద్ధుడు గల్లంతైన సంఘటన పడిగ్యాల మండలంలోని ప్రాతకోటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాలు.. లచ్చన్న(70) గడివేముల నుంచి మనవరాలు గ్రామమైన ప్రాతకోటకు సంక్రాంతి తిరునాళ్లకు వచ్చారు. బహిర్భూమికి వెళ్లి కాలు జారి పడి గల్లంతయ్యాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గడివేముల, న్యూస్‌టుడే: నంద్యాలకు వెళ్తున్న ఆటో కుందూనది వంతెన మలుపు వద్ద అదుపుతప్పి కిందపడటంతో మౌలాలీ, అర్షియా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

నందిపల్లెలో పశుగ్రాసం దగ్ధం

నందిపల్లె,న్యూస్‌టుడే:నందిపల్లె గ్రామంలో వీరశేఖర్ అనే రైతుకు చెందిన పశుగ్రాసం దగ్ధమైంది. శుక్రవారం రాత్రి రేకుల షెడ్లో ఉన్న పాడి పశువులను దోమల నుంచి కాపాడేందుకు పొగ పెట్టినందున ప్రమాదవశాత్తు పశుగ్రాసం కాలిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

ప్రహరీ లేదు.. రక్షణ కానరాదు

★ బడికి పంపేందుకు భయపడుతున్న తల్లిదండ్రులు

ప్రహరీ లేని ముసలిమడుగు జడ్పీ పాఠశాల

నందికొట్కూరు గ్రామీణం, నంద్యాల విద్య: నంద్యాల జిల్లాలో జడ్పీ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. పాఠశాల ముగిశాక, సెలవు దినాల్లో ఆకతాయిలు ప్రవేశించి పొగ, మద్యం తాగేందుకు అడ్డాగా ఏర్పాటు చేసుకుంటున్నారు. దాంతో పాటు పాఠశాల కిటికీలు, తలుపులు ఇతర సామగ్రిలను ధ్వంసం చేస్తున్నారు. గ్రామాల చివర పొలాల సమీపంలో పాఠశాలలు ఉండటంతో ప్రహరి లేక విష సర్పాలు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఎక్కువ రోజులు వరుస సెలవులు వచ్చి పాఠశాలలు మూతపడితే పాఠశాల ప్రారంభమయ్యే రోజు ఎక్కడ ఏ విష పురుగులు కనిపిస్తాయోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

ఏళ్లుగా ఇబ్బందులు

నంద్యాల జిల్లాలో 216 జడ్పీ పాఠశాలలు ఉండగా 141 పాఠశాలలకే ప్రహరీలు ఉన్నాయి. 75 పాఠశాలలకు లేవు. ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి.

● కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగు జడ్పీ పాఠశాలలో ప్రహరీ లేదు. పలుమార్లు పాములు, తేళ్లు పాఠశాలలోకి వచ్చాయి. ఆకతాయిలు సాయంత్రం, రాత్రివేళల్లో మద్యం తాగేందుకు అడ్డాగా ఏర్పాటు చేసుకుంటున్నారు. శివపురం జడ్పీ పాఠశాలలో గత ఏడాది సెలవు దినాల్లో దుండగులు ప్రవేశించి కిటికి అద్దాలను పగలగొట్టారు. ప్రహరీ లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపు నీరు కాలనీల్లో నుంచి పాఠశాల ప్రాంగణంలో పారుతోంది.

● గోకవరం జడ్పీ పాఠశాల కూడ గ్రామ శివారులో పొలాల సమీపంలో ఉంది. దాంతో వర్షాకాలంలో పలుమార్లు పాఠశాలలో విష పురుగులు, పాములు ప్రవేశించాయి.

● జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం జడ్పీ పాఠశాల ఊరి చివరన పొలంలో ఉంది. రక్షణ గోడ లేకపోవడంతో విష సర్పాలు ఆట మైదానంలో పలుమార్లు కనిపించాయని విద్యార్థులు చెబుతున్నారు.

● నందికొట్కూరు మండలంలోని మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల ఊరి చివర ఉంది. ప్రహరీ లేక పొలాలకు వెళ్లే వారు పాఠశాల ప్రాంగణంలో నడుచుకుంటూ వెళ్తుంటారు. దాంతో పాఠశాల సమీపంలో చెట్ల పొదలు ఉండటంతో పాములు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

పాములు, తేళ్లు వస్తున్నాయి

- వెంకటేశ్వర్లు, ముసలిమడుగు, కొత్తపల్లి



ముసలిమడుగు జడ్పీ పాఠశాలలో నా ఇద్దరు కుమారులు చదువుతున్నారు. పాఠశాల ఊరి చివరన ఉంది. పాఠశాల పక్కన పొలాలు ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో పొలాల్లో నుంచి పలుమార్లు విష సర్పాలు ప్రవేశించాయి. దాంతో పాఠశాలకు పంపేందుకు భయంగా ఉంది. వర్షాకాలంలో తేళ్లు ఎక్కువగా కనబడతాయి. అధికారులు స్పందించి పాఠశాలకు రక్షణ కల్పించి ప్రహరీ గోడలు నిర్మించాలి.

రహదారులపై వాహనాలు నిలిపితే చర్యలు

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో రహదారులపై అడ్డంగా వాహనాలను నిలిపితే చర్యలు తప్పవని నంద్యాల ట్రాఫిక్ సీఐ చాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వివేకనంద సెంటర్, బైర్మల్ వీధితో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. రహదారులపై వాహనాలు నిలపకూడదని దుకాణదారులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తోపుడు బండ్లు, ఆటోలు ఇష్టానుసారం రహదారులపై నలిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

భవనం అద్దెకు ఇవ్వబడును

నంద్యాల, సంజీవనగర్, సూరజ్ హోటల్ దగ్గర, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీస్ ప్రక్కన, 30 రూమ్స్ గల, 5000 స్క్వేర్ ఫీట్స్ విస్తీర్ణం కలిగిన బిల్డింగు హాస్పిటల్‌కు గాని, ఆఫీసులకు మరియు హాస్టల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. కావలసిన వారు సంప్రదించండి.

డా॥ లక్ష్మీబాయి

సెల్ నెంబర్: 94419 90623.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

విజ్ఞాన భాండాగారం.. కొలువు కల సాకారం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని అంటారు. అటువంటి గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకుని ముందుకు సాగుతున్నారు. బనగానపల్లి పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అన్నిరకాల దిన, మాస పత్రికలు వస్తున్నాయి. ఇక్కడి పత్రికలు, పుస్తకాలు చదివి ప్రపంచం, దేశం, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు అర్థం చేసుకుంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వార్తా పత్రికలు చదువుతున్న పాఠకులు

అందుబాటులో 12 వేల పుస్తకాలు

బనగానపల్లి పట్టణంలోని గ్రంథాలయంలో దాదాపుగా 12 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల వసతులు ఉండటంతో పోటీపడే అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధిస్తున్నారు. గ్రంథాలయంలో నీటి వసతి, టేబుళ్లు, కుర్చీలు ఉండటంతో పాటు అంతర్జాలం సౌకర్యంతో కూడిన కంప్యూటర్ అందుబాటులో ఉంది. దీంతో తెలియని వాటిని తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉండటంతో యువతకు ఎంతో ఉపయోగపడుతుంది.

సాధన చేస్తే మంచి ఫలితం - ప్రతాప్, ఉపాధ్యాయుడు

మాది బనగానపల్లి మండలం చిన్నరాజుపాలెం డిగ్రీతో పాటు డీఎడ్ పూర్తి చేశాను. విద్య పూర్తి అయిన తర్వాత రెండేళ్లుగా బనగానపల్లిలోని గ్రంథాలయానికి ప్రతి రోజూ వెళ్తున్నా. పలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదువుకొని డీఎస్సీకి సన్నద్ధమయ్యా. ఇటీవల ఉపాధ్యాయునిగా ఎంపికయ్యా. సాధన చేస్తే మంచి ఫలితం ఉంటుంది. యువత సద్వినియోగం చేసుకోవాలి.

కష్టపడి చదివి ఉద్యోగం సాధించా - సంతోష్, కానిస్టేబుల్

మాది బనగానపల్లి. గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వెళ్లాను. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదివాను. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి. తల్లిదండ్రుల ఆశయాల్ని నెరవేర్చాలి.

వడ్డెరల సమస్యలు పరిష్కరిస్తాం

అవుకు, న్యూస్‌టుడే: వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెదేపా సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి అన్నారు. మహానందీశ్వర వడ్డె రాజుల సేవాసమితి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం రామాపురంలో పక్కీరారెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బనగానపల్లి మండలం పసుపల గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో మురుగు రహదారిపై నిలుస్తోంది. చర్యలు తీసుకోవాలి. **- మద్దిలేటి, గ్రామస్థుడు.** ✔: పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లి.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల నుంచి బనగానపల్లి దారిలో బ్రహ్మంగారి మఠం వద్ద కుళాయి దెబ్బతిని నీరంతా వృథా అవుతోంది. **- రాజు, స్థానికుడు.** ✔: సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని జమ్మలమడుగు మలుపు దగ్గర నుంచి కానాల అంకిరెడ్డి కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన మురుగు కాల్వ నిర్మించాలి. **- నారాయణ.** ✔: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.** ?: పట్టణంలోని జెండా మాను వీధికి వెళ్లే దారి గుంతలమయమై అధ్వానంగా ఉంది. **- హుస్సేన్.** ✔: సీసీ రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

ప్యాపిలి, న్యూస్‌టుడే: ?: రామకృష్ణాపురం గ్రామంలో సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రావణి, గ్రామస్థురాలు.** ✔: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. **- పద్మావతమ్మ, సర్పంచి.** ?: పట్టణంలోని కుంటగడ్డ వీధిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటోంది. **- రామాంజి, కాలనీవాసి.** ✔: క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. సిబ్బందితో మరమ్మతులు చేయించి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. **-లక్ష్మీదేవి, సర్పంచి.**

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ?: తుడుమలదిన్నె గ్రామంలో వీరభద్రస్వామి ఆలయ సమీపంలో చేతి బోరు పనిచేయటం లేదు. **- వెంకటసుబ్బారెడ్డి, రైతు.** ✔: త్వరలో మరమ్మతులు చేయిస్తాం. **- ఉమామహేశ్వర రావు, పంచాయతీ కార్యాలయ అధికారి.**

సంజామల, న్యూస్‌టుడే: ?: గిద్దలూరు- మిక్కినేపల్లె రహదారిలో గిద్దలూరు గ్రామం దాటిన గోతులమయంగా మారింది. **- వెంకటేశ్వరరెడ్డి, మిక్కినేనిపల్లె.** ✔: రహదారి నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. **- రెడ్డి గోవింద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

నిషేధమున్నా ఆగని రవాణా

○ నల్లమలలో యథేచ్ఛగా వెదుర్ల తరలింపు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నల్లమల పులుల అభయారణ్యంగా చేసి ప్రజలు అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని అటవీ శాఖ నిషేధించింది. కనీసం వెదుర్లు నరికేందుకు సైతం అనుమతించలేదు. పులుల సంరక్షణ కోసం వెదుర్ల ద్వారా వచ్చే రూ.కోట్ల ఆదాయాన్ని వదిలేశారు. వెదురుపై ఆధార పడ్డ వేల మందికి ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. నిషేధం ఎత్తేయాలని మేదర్లు రోడ్డెక్కారు.

ఆళ్లగడ్డ పట్టణంలో సైకిల్‌పై తరలిస్తున్న వెదుర్లు

అభయారణ్యంగా ప్రకటించినా..

◆ నిషేధం పకడ్బందీగా అమలు చేస్తామని అటవీ శాఖ వారు ఓ వైపు అంటుండగా మరోవైపు వెదురు అక్రమ రవాణా మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి 8 గంటల సమయంలో నల్లమల నుంచి ఆళ్లగడ్డ మీదుగా సైకిళ్లపై వెదుర్లను అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. కనీసం 25 కి.మీ. దూరం వెదుర్లతో ప్రయాణిస్తున్నా ఎవరూ పట్టుకోకపోవడం గమనార్హం.

◆ అహోబిలం, రుద్రవరంలోని నల్లమల ప్రాంతం నాగార్జున సాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంగా ప్రభుత్వం గుర్తించింది. పులుల అభయారణ్యం కావడంతో ఈ అడవిలోకి వెళ్లడం కాదు కదా కనీసం రోడ్డుపై నిలవ కూడదన్న నిబంధనలు పెట్టారు. కఠిన నిబంధనలు ఉన్నా అక్రమంగా అటవీ సంపదను దోచుకునే వారు దర్జాగా అడవిలో వెళ్తున్నారు, సంపదను కొల్లగొట్టేస్తున్నారు.

పట్టని అధికార యంత్రాంగం

◆ నల్లమల నుంచి వెదుర్లు బాచేపల్లె తండా, ఆర్.కృష్ణాపురం మీదుగా అటు చాగలమర్రికి ఇటు ఆళ్లగడ్డకు వస్తున్నాయి. మరోవైపు నరసాపురం మీదుగా ఆళ్లగడ్డకు చేరుకుని అక్కడి నుంచి నేరుగా జాతీయ రహదారి నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. ఇంతలా అక్రమ రవాణా జరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం ఆందోళనకరం.

◆ 2023లో చెలిమ, రుద్రవరం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాలను నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలోకి తెచ్చారు. ఇందులో భాగంగానే వెదుర్ల సేకరించే గుత్తేదార్లు కూలీలను అడవిలోకి పంపించి వారి ద్వారా వెదుర్లు కొట్టే పద్ధతిని కూడా అటవీ శాఖ నిషేధించింది. ఈ ప్రాంతం టైగర్ రిజర్వు ఫారెస్టుగా ప్రకటించడంతో రూ.కోట్ల ఆదాయాన్ని కూడా అటవీ శాఖ వదులుకుంది.

పంట కాల్వ అధ్వానం.. చర్యలు శూన్యం

కోవెలకుంట్ల నుంచి గుల్లదుర్తి వైపు వెళ్లే రహదారిలో ఉన్న ఎస్సార్బీసీ 14వ ఎడమ పంట కాల్వ పరిస్థితి అధ్వానంగా ఉంది. కాల్వ పొడవునా కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిని తొలగించకపోవడంతో కాల్వ వెంట విస్తరించి సాగునీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. కాల్వ కింద పంటలు సాగు చేసిన రైతులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వీటిని తొలగించి సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

దారిపై చెత్త.. ప్రయాణానికి అవస్థ

ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై స్థానికులు చెత్త పడేస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగక పోవడంతో హైవేతో పాటు సర్వీస్ రోడ్డులో చెత్త వేస్తున్నారు. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతుండటంతో పోలీసులు బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. హైవే నిర్వాహకులు దృష్టి సారించి రోడ్డుపై చెత్తను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం)

మురుగు కుంట కాదు.. రహదారే

ఉయ్యాలవాడ మండలం మాయలూరు బస్టాండు నుంచి శివాలయం వరకు ఉన్న సీసీ రహదారి మురుగు కుంటను తలపిస్తోంది. గతేడాది ఫిబ్రవరిలో రూ 6.50 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. నిత్యం కుళాయి నీరు, మురుగు ప్రవాహంతో రోడ్డుపై నిలుస్తోంది. దీంతో రహదారి పూర్తిగా దెబ్బతింది. రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కుళాయి నీరు, మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మాయలూరు(ఉయ్యాలవాడ)

శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణం

బనగానపల్లి పట్టణంలోని కొండపేటలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.కోటి మంజూరు చేయించారు. ఆలయం నిర్మాణం కోసం వెనుకభాగంలో సుమారు రూ.30 లక్షలు విలువ చేసే స్థలాన్ని బీసీ ఇందిరమ్మ ఇతరుల నుంచి కొనుగోలు చేశారు. అనంతరం స్థలాన్ని ఆలయానికి విరాళంగా ఇచ్చారు. మరో ఏడాది లోపు ఆలయం పూర్తికానుంది. - న్యూస్‌టుడే, బనగానపల్లి

పాఠశాల ప్రాంగణం.. అవస్థల నిలయం

పసుపల (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం పసుపల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఎక్కడ చూసిన ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలకు సెలవు ఉన్నప్పుడు, పనివేళలు ముగిసిన సమయంలో మద్యం బాబులు ప్రాంగణంలోనికి చేరుకుని మద్యం తాగుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్రాంతి సంబరాలు.. ఆకట్టుకున్న పోటీలు

పల్లెలు, పట్టణాలు సంక్రాంతి సంబరాల్లో మునిగి తేలాయి. రంగవల్లులతో ముంగిళ్లు స్వాగతం పలికాయి. ప్రతి ఇల్లు బంధువులతో సందడిగా మారింది. డోన్, బనగానపల్లి, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో క్రీడా పోటీలు మరింత ఉత్సాహాన్ని నింపాయి. ముగ్గులు, క్రికెట్, కబడ్డీ, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. డోన్ మండలం కొత్తకోట గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. నారాయణపురానికి చెందిన షేక్‌మహ్మద్ వృషభాలు, దుబ్బన్న వృషభాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్.

బేతంచెర్ల: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

డోన్: కొత్తకోటలో బండలాగుడు పోటీలు

ఉయ్యాలవాడలో మహిళలకు బహుమతుల పంపిణీ

డోన్: సీసంగుంతలలో పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

కోవెలకుంట్ల: గుల్లదుర్తిలో చెన్నకేశవస్వామికి పూజలు

దొర్నిపాడు: రామచంద్రాపురంలో తెప్పోత్సవం

పార్వేట ఉత్సవం.. ఆనంద పరవశం

సంక్రాంతిని పురస్కరించుకొని పల్లెల్లో పార్వేట ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట ఉత్సవంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. బుగ్గానిపల్లె గ్రామంలో చెన్నకేశవస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భారీ జన సందోహం మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. మద్దూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి, మల్లెవేముల గ్రామంలో సంజీవరాయ, చెన్నకేశ్వస్వామి, ముత్యాలపాడులో మూర్తిలక్ష్మీనరసింహస్వామి, గొడిగనూరులో సీతారాముల గ్రామోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

ఆళ్లగడ్డ గ్రామీణం: అహోబిలం పార్వేట ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ

పోలీసుల బందోబస్తు మధ్య..

అవుకులో శుక్రవారం నిర్వహించిన చెన్నకేశవస్వామి పార్వేట ఉత్సవం ఘనంగా ముగిసింది. దొర్నిపాడు మండలంలోని రామచంద్రాపురం, భాగ్యనగరం, అమ్మిరెడ్డినగర్, వెంకటేశ్వరనగర్, ఉమాపతినగర్ గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సౌదరదిన్నె, అమడాల, బిజనవేముల గ్రామాల్లో శుక్రవారం పాండురంగ, చెన్నకేశవ స్వాముల పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేటోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడు మంది ఎస్సైలతో పాటు ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లోని మొత్తం 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తుకు హాజరైనట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. రుద్రవరంలో భాస్కర నందీశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, బేతంచెర్ల, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, రుద్రవరం, డోన్.

బేతంచెర్ల: బుగ్గానిపల్లెలో చెన్నకేశవస్వామి గ్రామోత్సవం

చాగలమర్రి: మల్లెవేములలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

డీఏ బకాయిల విడుదలపై హర్షం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు రూ.1100 కోట్లు విడుదల చేసి ఒక రోజు ముందుగానే సంక్రాంతి సంబరాలను ఉద్యోగులకు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీసీ హుస్సేన్ రెడ్డి, నరసారెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. బకాయిలు విడుదల చేయడంపై వారు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డిలను కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని సెంట్రల్ లొకాలిటీ పాఠశాల మైదానంలో సన్‌రైజ్ వాలీబాల్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు పలు జిల్లాల నుంచి జట్లు వస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు శ్రీను, బాబులు తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి, రెండవ పట్టణ సీఐ జి. సుబ్బారావు, ఎస్పీఎఫ్ ఆర్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజముద్రతో భరోసా.. తప్పులతో నిరాశ

చాగలమర్రి, సంజామల, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో భూ రీసర్వే పనులు చేసిన సమయంలో గ్రామాల్లో రైతుల పొలాల విషయంలో తప్పులు జరిగాయి. అయితే వీటన్నింటికి సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి భూ రీసర్వే పనులు చేపట్టి రాజముద్రతో కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులు తప్పిదాలతో మళ్లీ తప్పులు పునరావృతం అవుతున్నాయి. చాగలమర్రి మండలంలో 19 పంచాయతీలు ఉండగా. . 15 పంచాయతీల్లో భూరీసర్వే పనులు పూర్తయ్యాయి. ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించింది. అధికారుల తప్పిదాల వల్ల చిత్రాలు, భూముల కొలతల్లో ఎక్కువ, తక్కువ తప్పులు వస్తున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిత్రం మారింది - నరసింహారెడ్డి, రైతు, చిన్నవంగలి

చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామ పరిధిలో ఖాతా నంబరు 800, సర్వే నంబరు 139లో 1.9 ఎకరాల భూమి నాకు ఉంది. భూ రీసర్వేలో భూమి కొలత కచ్చితంగానే వచ్చినా పట్టాదారు పాసుపుస్తకంలో నా చిత్రం బదులు వేరొకరిది వచ్చింది. ఆధార్‌లో కరెక్టుగానే ఉన్నా పాసుపుస్తకంలో తప్పుగా వేరే వ్యక్తి చిత్రం ప్రచురితమైంది. ఇదేందని అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది స్పందించాలని కోరుతున్నా.

పాసుపుస్తకం తిరిగిచ్చేశా - జీసీ ఎర్రమల, ఎగ్గోని

సంజామల మండలం ఎగ్గోని గ్రామంలో సర్వే నంబరు 129-1బీలో 1.07 ఎకరాల పొలం నాకు ఉండగా 0.32 ఎకరాలు, అలాగే సర్వే నంబరు 140-1లో 0.58 ఎకరాలు ఉండగా 0.34 ఎకరాలు, సర్వే నంబరు 140-2లో 0.41 ఎకరాలకు గాను 0.77 ఎకరాలు ఉన్నట్లు అధికారులు పట్టాదారు పాసు పుస్తకం అందించారు. భూమి తక్కువగా ఉన్నట్లు పాసుపుస్తకం అందించటంతో పంటలు సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ కారణంగా బ్యాంకుల ద్వారా తక్కువ పెట్టుబడి సాయం తక్కువగా వస్తోంది. పాసు పుస్తకంలో దొర్లిన తప్పులను అధికారులకు విన్నవించటంతో పాటు ఇచ్చిన పాసుపుస్తకాన్ని కూడా తీసుకోకుండా అధికారులకే తిరిగిచ్చేశా. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

సంక్షిప్త సమాచారం

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో చిన్న, సన్నకారు రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. బస్తా రూ.500 అయినా యూరియా దొరకడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.

ముకుందాపురం(రుద్రవరం), న్యూస్‌టుడే: ముకుందాపురంలో లక్ష్మీదేవికి చెందిన గుడిసెకు గురువారం నిప్పు అంటుకుని రెండు గేదెలు, రెండు లేగ దూడలు కాలినట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.మనోరంజన్‌ప్రతాప్ తెలిపారు. చికిత్స అందించామన్నారు.

డోన్, న్యూస్‌టుడే: అభివృద్ధిపై ప్రజల అండదండలు ఉంటాయని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు హేమసుందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌లు అన్నారు. డోన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, రాజ్‌పుత్ కమలేష్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

యు.కొత్తపల్లె(డోన్), న్యూస్‌టుడే: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని గ్రామ తెదేపా నాయకులు వడ్ల శ్రీనివాసులు, రసూల్‌లు అన్నారు. యు.కొత్తపల్లె గ్రామంలో యువకులకు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలో యువతకు క్యారం బోర్డు పోటీలను నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు నగదును అందజేశారు. పూజారి శ్రీను, రహంతుల్లా, సుధాకర్, ఎస్ఎం బాషా, వరుణ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిబుగ్గ వద్ద వృషభాల బండలాగుడు పోటీలను నిర్వహించారు. జలదుర్గం గ్రామంలో సీఐటీయూ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: గొరుమానుకొండ తండా గ్రామానికి చెందిన పాపారాయుడు నాయక్, పార్వతిబాయి దంపతుల కుమారుడు వినోద్‌కుమార్‌నాయక్ సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు ఎంపికయ్యాడు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి రిమాండ్

సంజామల, న్యూస్‌టుడే: ఆకుమల్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాలింగరి మహేష్ సి.బెళగల్ మండలానికి చెందిన ఓ మహిళను ప్రేమించి గుడిలో వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెను పట్టించుకోకపోవడంతో బాధితురాలు సంజామల పోలీసులను ఆశ్రయించగా మహేష్‌పై కేసు నమోదైంది. ఎస్సై రమణయ్య శుక్రవారం ఆల్వకొండ క్రాస్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

ప్రమాదాల్లో పలువురికి గాయాలు

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఇటిక్యాల శివారులోని పెద్దమ్మ దేవాలయం సమీపంలో ఆదివారం మూడు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. తాడిపత్రి పట్టణానికి చెందిన ఉదయ్‌కాంత్, అతడి స్నేహితుడు పని నిమిత్తం అవుకు గ్రామానికి వెళ్లి తిరిగి తాడిపత్రికి వెళ్తున్నారు. అదే సమయంలో మీర్జాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై తాడిపత్రికి, తాడిపత్రి నుంచి మరొకరు ద్విచక్రవాహనంపై బెలుం గుహలకు వెళ్తున్నారు. ఈ మూడు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తాడిపత్రి వైద్యశాలకు తరలించారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి ఈద్గానగర్‌కు చెందిన షేక్ మాబాషా ద్విచక్ర వాహనంపై యాగంటిపల్లె వెళుతుండగా అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలైన బాధితుడిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

బనగానపల్లి, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లిలో నియోజకవర్గం స్థాయిలో గ్రామ పంచాయతీ పరిశీలకుల నియామక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. ప్రతీ కార్యకర్త గ్రామాల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాటసాని ఓబుళరెడ్డి, గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

అల్లూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ మండలం ఎస్.కొత్తపల్లె-అల్లూరు గ్రామాల మధ్యలో కుందూ నదిలో గురువారం ఓ వృద్ధురాలి మృతదేహం గుర్తించినట్లు ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మృతురాలు వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం పెద్దజోలాపురం గ్రామానికి చెందిన శూలం వీరయ్య భార్య లక్ష్మీదేవి(75)గా గుర్తించామన్నారు. మృతికి కారణాలు తెలియరాలేదన్నారు. శుక్రవారం ఆమె కుమారుడు పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రహదారి కల.. నెరవేరుతున్న వేళ

పూర్తయిన సీసీ రోడ్డు పనులు

ఆర్ఎస్.రంగాపురం (బేతంచెర్ల), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, వీధి దీపాలు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలకు నోచుకోక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి జాడ కనిపించలేదు. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధి మరిచింది. నిధుల కోసం సర్పంచుల సంఘం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

రూ.30 లక్షలతో పనులు

గ్రామాల్లో అంతర్గత రహదారుల ఊసే లేదు. రహదారులు అధ్వానంగా పలు చోట్ల గుంతలు పడడం, రాళ్లు పైకి లేచి దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌డ్డి ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.30 లక్షలు ఉపాధి నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులు మంజూరు కావడంతో సచివాలయం వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

(c) eenadu

సందడిగా ఊయల ఉత్సవం

సంక్రాంతి సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉత్సవాలు, పూజలు నిర్వహించారు. వినుకొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రత్యేక మండపంలో ఊయల ఉత్సవం నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఆర్యవైశ్య సదావర్తి సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ బాల్జీ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వినుకొండ

సంబరాలు అదిరె.. సంతోషం విరిసె..

జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణాలు, గ్రామాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించి మహిళలు, యువత, చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం

వైద్యులు ఉండరు.. వైద్యం అందదు!

నరసరావుపేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ వైద్య సేవల్లో జవాబుదారీతనం పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతోంది. సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోంది. అయితే రోజూ అధిక సంఖ్యలో రోగులొచ్చే ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండట్లేదని ప్రభుత్వం గత నెలలో నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో ఎక్కువ మంది రోగులు వెల్లడించారు. ఎన్ని చర్యలు తీసుకున్నా వైద్య సేవలకు డబ్బుల వసూళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. రూ.లక్షలు కేటాయిస్తున్నా పరిశుభ్రతలో వెనుకంజలోనే ఉన్నాయి. ఇలా రోగుల సంతృప్తిలో జిల్లా అట్టడుగున ఉంది. వైద్యులు, సిబ్బంది కృషితో సేవలపరంగా మెరుగవ్వాలని రోగులు కోరుతున్నారు.

సత్తెనపల్లి ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో ఇలా..
- ❖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 39
- ❖ పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 26
- ❖ సామాజిక వైద్యశాలలు (సీహెచ్‌సీ) : 7
- ❖ ప్రాంతీయ వైద్యశాలలు : 3 (నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట)
- ❖ రోజు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య సుమారు 6 – 7 వేలు

❖ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో రోగుల సంతృప్తిలో జిల్లా 15వ స్థానంలో ఉంది. సామాజిక, ప్రాంతీయ వైద్యశాలలకు వచ్చే రోగి సంతృప్తి ర్యాంక్ మరీ తక్కువ. కిందకు పడిపోయి 16వ స్థానంలో నిలిచింది. సేవల్లో తిరోగమనంలో ఉన్న ఆసుపత్రులపై పర్యవేక్షక అధికారులు దృష్టి సారించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

అంశం (రోగుల అభిప్రాయం శాతాల్లో)	పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో		సీహెచ్‌సీ, ఆర్‌హెచ్‌ల్లో	
	అవును	లేదు	అవును	లేదు
ఆసుపత్రిలో డాక్టర్ అందుబాటులో ఉన్నారా?	73.5	26.5	70.0	30.0
డాక్టర్ రాసిన మందులు ఉచితంగా ఇచ్చారా?	63.5	36.5	69.1	30.9
వైద్య సేవలకు డబ్బులు అడిగారా?	36.2	63.8	28.6	71.4
ఆసుపత్రిలో పరిశుభ్రత బాగుందా?	58.9	41.1	61.3	38.7

డబ్బు ఎప్పుడు ఇస్తారు?

పత్తి రైతుల ఖాతాల్లో జమ చేయని సీసీఐ

రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నగదు జమ చేయడంలో జాప్యం చేస్తోంది. గత 20 రోజులుగా ఇదే పరిస్థితి. సంక్రాంతికైనా సీసీఐ నుంచి డబ్బు వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర దక్కకపోవడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. సాధ్యమైనంత తొందరగానే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఆచరణలో జాప్యం చేస్తోంది.

ఈనాడు – అమరావతి

గ్రామాల నుంచి రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలించిన తరువాత.. అక్కడ అధికారులు నాణ్యత పరిశీలించి ధర నిర్ణయిస్తారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని మార్కెటింగ్‌శాఖ అధికారులు లెక్కించి సీసీఐ అధికారులకు బిల్లులిస్తారు. ఒకట్రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ బిల్లులను సీసీఐ ప్రధాన కార్యాలయంలో పరిశీలించి.. రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తారు. ఈ ఏడాది కొంతమందికి మూడు వారాలు దాటినా నగదు జమ కాలేదు. దీనిపై రైతులు సీసీఐ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు.

జీరో ఖాతాలకు సమస్య

పత్తి రైతుల్లో కొంతమంది మహిళలున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఈ-క్రాప్.. వారి పేర్లతో ఉన్నాయి. వీరిలో కొందరికి బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలున్నాయి. ఇంకొందరికి పోస్టాఫీసు ఖాతాలు కూడా ఉన్నాయి. వాటిల్లో కనీస నగదు నిల్వలు లేకపోవడం వల్ల నగదు జమ చేయలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

రూ.2 లక్షలకంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన ఖాతాల విషయంలో సీసీఐ అధికారులు పలు మార్లు పరిశీలన చేస్తున్నారు. ఈ కారణాల వల్లనే నిర్ణీత సమయంలోగా నగదు జమ కావడం లేదు. సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి నగదు తొందరగా జమ చేయాలని గుంటూరు గ్రామీణ మండలంలోని పలు గ్రామాలతోపాటు మరికొన్ని మండలాల రైతులు కోరుతున్నారు.

స్లీపర్ కోచ్ టికెట్లపై థర్డ్ ఏసీలో ప్రయాణం

ఈనాడు, అమరావతి: సంక్రాంతి సేవల్లో డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రైల్వేశాఖ నుంచి అనుకోని బంపర్ ఆఫర్ లభించింది. స్లీపర్ కోచ్‌లో టికెట్లు తీసుకున్న అనేకమంది ప్రయాణికులకు అనూహ్యంగా అప్‌గ్రేడేషన్‌లో భాగంగా థర్డ్ ఏసీలో సీట్లు కేటాయించడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఒకరో ఇద్దరో కాదు.. ఏకంగా 120 మందికి పైగా ఈ అవకాశం రావడంతో పండగ పూట జాక్‌పాట్‌గా సంబరపడ్డారు. వివరాలిలా.. కాచిగూడ-రేపల్లె, రేపల్లె- వికారాబాద్ మధ్యన డెల్టా ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. మార్గంలో భాగంగా తాజాగా ఎస్10, ఎస్11 స్లీపర్ కోచ్‌లలో టికెట్లు బుక్ అయిన ప్రయాణికులకు థర్డ్ ఏసీ కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నట్లు రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఢీ అంటే ఢీ

కనుమ పండగను పురస్కరించుకుని బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. 12 పొట్టేళ్లు పాల్గొనగా.. ఆరు జతలుగా పోటీలు చేపట్టారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పోటీలను తిలకించారు. – న్యూస్‌టుడే, పర్చూరు

పొలం తడవాలంటే.. పైపులు పరవాల్సిందే

రొంపిచర్లలో మిర్చి సాగు చేసిన రైతులు పంటకు నీటి తడులు అందించేందుకు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. తంగేడుమల్లి మేజర్ కాలువ కట్టపై ఇంజిన్లు ఏర్పాటుచేసుకుని కిలోమీటరు దూరం పైపులువేసి నీటిని అందిస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడం, పగటి పూట ఎండ ఎక్కువగా ఉండటంతో ఎకరా పొలానికి నీరు పెట్టడానికి 4 నుంచి 5 గంటల సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

సాగర్ నీటిమట్టం 554 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 7 గంటలకు 554.00 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 16,110 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ ప్రధాన జల విద్యుత్తు కేంద్రానికి నీటిని నిలిపివేశారు. కుడి కాలువకు 6500, ఎడమ కాలువకు 7110, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2200, లోలెవల్ కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

చిన్నారులకు వైద్య భరోసా

అంగన్‌వాడీలకు మెడిసిన్ కిట్లు

నరసరావుపేట, న్యూస్‌టుడే

పిల్లలు ఆడుకుంటూ కిందపడి గాయాల పాలైతే పుండుపై రాసేందుకు ఆయింట్‌మెంట్‌ను కూడా గత వైకాపా ప్రభుత్వం ఇవ్వలేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా మెడిసిన్ కిట్లు సరఫరా చేసేవారు. వైకాపా పాలనలో కిట్ల పంపిణీని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం చిన్నారులకు వైద్య భరోసా కలిగేలా తాజాగా అంగన్‌వాడీ కేంద్రాలకు మెడిసిన్ కిట్లు సరఫరా చేసింది.

మెడిసిన్ కిట్ పరిశీలిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఒక్కో కిట్లో 11 రకాల వ్యాధులకు సంబంధించి మందులు అందజేశారు. చేతుల శుభ్రతకు క్రిమిసంహారక ద్రావణం, కట్టు కట్టేందుకు రోలర్ బ్యాండేజ్, దూది అందించారు. ఏ ఔషధం ఎలా వాడాలి, ఎంత మోతాదులో పిల్లలకు ఇవ్వాలో కిట్‌లోనే వివరాలు పొందుపర్చారు. చిన్నారులే కాకుండా గర్భిణులు, బాలింతలకు కూడా మెడిసిన్ కిట్లు ఉపయోగపడతాయని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తెలిపారు.

- జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 9
- అంగన్‌వాడీ కేంద్రాలు : 2,031
- గర్భిణుల సంఖ్య: 8,987
- బాలింతలు : 10,073
- 0–6 నెలల చిన్నారులు : 10,123
- 6–1 ఏడాదిలోపు పిల్లలు : 9,591
- 1–3 ఏళ్లలోపు పిల్లలు : 42,268
- 3–5 ఏళ్లలోపు చిన్నారులు : 40,057

జాతీయ స్థాయి ఎడ్ల పందేలకు సన్నద్ధం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో చిలకలూరిపేటలోని గోల్కొండ గార్డెన్స్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రాంగణంతో పాటు ఎడ్లను ఉంచేందుకు షెడ్లు, వ్యవసాయ స్టాళ్లు... ఇలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి పోటీల నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. మొత్తం తొమ్మిది విభాగాల్లో రూ.25 లక్షల బహుమతులు అందజేయనున్నారు.

మంచు ముంచుతుంది జాగ్రత్త!

సత్తెనపల్లి, రొంపిచర్ల, వినుకొండ, న్యూస్‌టుడే

అటు చలి.. ఇటు పొగమంచు.. పల్నాడు వాసుల్ని వణికిస్తోంది. రోజురోజుకు ఉష్ణోగ్రత పడిపోతోంది. వాతావరణ మార్పు.. వైరస్‌ల వ్యాప్తితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గట్లేదు. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి శీతల గాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రయాణాలు వద్దు

జిల్లావ్యాప్తంగా మంచులోనూ వాహన ప్రయాణాలు జరుగుతున్నాయి. అత్యవసరమైతే తప్ప తెల్లవారుజామున ప్రయాణాలు చేయకపోవడం శ్రేయస్కరం. పరిమిత వేగంతో లైట్లతో వాహనాలు నడపాలి. రహదారుల వెంట నిలుపుదల చేసే వాహనాల విషయమై జాగ్రత్తగా ఉండాలి.

పిల్లలు.. పెద్దలపై శ్రద్ధ అవసరం

పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిపై శ్రద్ధ తీసుకోవాలి. శ్వాస సంబంధ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి. చలి గాలి తగలకుండా ఉన్ని దుస్తులు వేసి బయటకు పంపాలి. వయోవృద్ధులు మంచు కురిసేటప్పుడు బయటకు వెళ్లకపోవడమే మంచిది. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, పక్షవాతం, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు ఎండ వచ్చేవరకు బయటకు వెళ్లకపోవడం మేలని ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు తెలిపారు.

సత్తెనపల్లి : తాలుకా సెంటర్‌లో ఉదయం 9 గంటలకు ఇలా..

తిండి.. ఇలా తిందాం

త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవాలి. బయట ఆహారానికి వీలైనంత దూరంగా ఉండాలి. గోరువెచ్చని నీళ్లు తాగాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలితే న్యుమోనియా, హైపటైటిస్-బి వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సాధారణ రోజుల్లాగా కాకుండా శీతాకాలంలో ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, తీపి పదార్థాల వినియోగం తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సూచించారు.

అప్రమత్తతతోనే ఆరోగ్యం పదిలం

➻ పెంపుడు జంతువులు వంట, పడక గదుల్లోకి రాకుండా చూసుకోవాలి. ఈ కాలంలో వివిధ రకాల వైరస్‌లు సోకి.. వాటిద్వారా ఇంట్లో ఉన్నవారికి వ్యాప్తి చెందే అవకాశముందని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రామారావు తెలిపారు.

ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	కనిష్ఠ	గరిష్ఠ
13	16	22
14	14	21
15	15	20
16	14	21

ఆడబిడ్డకు కానుక సంక్రాంతిపాడు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం సంక్రాంతిపాడు గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. గ్రామానికి ఆ పేరెలా వచ్చిందంటే.. కొండవీడు దుర్గం 1542 వరకు విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు ఆధీనంలోనే ఉండేది. అనంతరం వచ్చిన రెడ్డి రాజుల్లో పరాక్రమవంతుడైన పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సామ్రాజ్యాన్ని ప్రజారంజకంగా పరిపాలించారు. ఆయన కుమార్తె వేమాంబకు సంక్రాంతి రోజు కానుకగా కొంత భూమిని ఇచ్చారు. అక్కడో గ్రామం ఏర్పడింది. అదే 'సంక్రాంతిపాడు'. గ్రామ విస్తీర్ణం 3.8 చదరపు మైళ్లు, జనాభా 3,615 మంది. అందులో పురుషులు 1813, స్త్రీలు 1802 మంది. 1100 కుటుంబాల వరకు ఉన్నాయి. సంక్రాంతిపాటి ఇంటి పేరుతో గ్రామం ఏర్పడిందని పెద్దలు చెబుతుంటారు. ఆంగ్లేయుల పాలనలో కళ్లేపల్లి రాఘవరాజు గ్రామ పెద్దగా ఉండేవారు. అప్పట్లోనే గ్రామానికి దక్షిణ భాగాన చెరువు నిర్మించారు.



ముక్క తగ్గనంటోంది ముద్ద దిగనంటోంది

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గుడ్డు ధర కాస్తంత తగ్గింది.. ముక్క తగ్గనంటోంది.. ముద్ద దిగనంటోంది. కోడిగుడ్డు ఈసారి రికార్డు స్థాయిలో ఒకటి రూ.8కి చేరింది. ఇప్పుడు క్రమంగా తగ్గుతూ హోల్‌సేల్‌లో రూ.6.30కి పడిపోయింది. గుడ్డు ధర తగ్గినా, కోడి మాంసం ధర చుక్కలు చూపిస్తోంది. కొన్ని నెలలుగా పెరుగుతూ కొత్త సంవత్సరంలో కిలో ధర రూ.300కి చేరింది. శుక్రవారం కనుమ రోజు రూ.320 పలికింది.

కిలో కోడి మాంసం ధర రూ.320

❖ కార్తిక మాసంలో బ్రాయిలర్ స్కిన్‌లెస్ రూ.240 నుంచి రూ.260 వరకు ఉండగా.. క్రిస్మస్ నాటికి రూ.270 నుంచి రూ.280కి చేరింది. ప్రస్తుతం రూ.320 పలుకుతోంది.

❖ మేత ధరల పెరుగుదల, వ్యాధులతో గిట్టుబాటు కాక కోళ్ల పెంపకం కొంత మేరకు తగ్గింది. ఫలితంగా ఉత్పత్తి తగ్గి గిరాకీ పెరగడంతో కోళ్లఫారాల నిర్వాహకులు ధరలు పెంచేశారని వ్యాపారులు చెబుతున్నారు.

సందడిగా సరస్

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సరస్ ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల్ని ప్రదర్శించారు. వాటిని తిలకించి కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కూడా సందర్శకుల రాకపోకలతో సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో సరస్ ప్రదర్శన కిక్కిరిసింది. సందర్శకులు స్టాళ్లను తిలకించేందుకు ఇబ్బంది కలగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఆంక్షల ఫలితం.. బర్లీకి దూరం

గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఈనాడు – అమరావతి

ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం తగ్గింది. గతేడాది 30,822 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవగా... ప్రస్తుతం 4,391 హెక్టార్లకే పరిమితమైంది. రైతులను అప్రమత్తం చేయడం, విత్తనాలు, నారు విక్రయం, పెంపకంపై ఆంక్షలు విధించడంతోపాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం.. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో పర్యవేక్షణ పెంచడంతో ఇది సాధ్యమైంది. నష్టాలు భరించైనా సాగుకు సిద్ధమంటూ ముందుకొచ్చిన రైతులకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. ఈ చర్యలకు ప్రధాన కారణం.. గతేడాది అనుభవాలు. పెద్దఎత్తున పంటను సాగు చేయడంతో సగానికిపైగా ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రంగంలోకి దిగి.. మంచి ధరకు పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

పొగాకు పూర్తిగా ఎగుమతులపై ఆధారపడడం, ఎక్కువ రోజులు నిల్వ చేసే వెసులుబాటు లేకపోవడం, డిమాండ్‌కు మించి దిగుబడులు వస్తే రైతులకు ధర లేక నష్టాలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠినంగానే వ్యవహరించింది.

అధికారిక ఒప్పందం ఉంటేనే.. మంచి ధరలే ఉంటాయన్న వ్యాపారుల హామీ మేరకు కొంతమంది రైతులు తెల్లబర్లీ వేశారు. కంపెనీలు రైతులతో ఒప్పందాలు అధికారికంగా చేసుకున్నచోట ప్రభుత్వం సాగుకు అనుమతిచ్చింది. ఏటా సాగు చేస్తున్న ప్రాంతాల్లోనే రైతులు ముందుకొచ్చారు. కంపెనీల నుంచి బాండ్లు ఉన్నాయా? లేదా? అని అధికారులు తనిఖీ చేశారు. తాజా అనుభవాల ఆధారంగా వచ్చే ఏడాదిలోనూ పంటల సరళిలో మార్పులు సూచించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం హెక్టార్లలో..

	గుంటూరు	బాపట్ల	పల్నాడు	మొత్తం
గతేడాది	3,369	22,770	4,683	30,822
ప్రస్తుతం	544	3,114	733	4,391

ఇక ఇంటి నుంచే పోస్ట్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారులను ఆకట్టుకోవడానికి తపాలా శాఖ సరికొత్త హంగులు సమకూర్చుకుంటోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే వివిధ సేవలు పొందేలా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. డాక్ సేవా యాప్ ద్వారా ఉన్నచోటు నుంచే అవసరమైన సేవలు, పనులు చక్కబెట్టుకునే వెసులుబాటు కల్పించింది. ❖ రిజిస్టర్, స్పీడ్ పోస్టు చేయాలంటే ఇప్పటి వరకు తపాలా కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇకపై డాక్ సేవా యాప్‌లో అవసరమైన వివరాలు నమోదు చేస్తే సిబ్బంది వచ్చి పోస్టు చేయాల్సిన వాటిని తీసుకుని పంపాల్సిన చిరునామాకు చేరవేస్తారు. ❖ ఈ యాప్ ద్వారా సులువుగా మనీయార్డర్ కూడా పంపొచ్చు. పార్సిల్ ఎక్కడ ఉందో క్షణాల్లో తెలుసుకునే వీలుంది. ❖ బీమా పాలసీ తీసుకోవడం, డిపాజిట్లు చేయడానికి ఈ యాప్ సహకరిస్తుంది. ❖ ఫిర్యాదులు, బీమా చెల్లింపులు, నెట్ బ్యాంకింగ్, పాస్ పుస్తకాల నవీకరణ, పొదుపు ఖాతాలో నగదు జమ, తపాలా కార్యాలయాల చిరునామా తెలుసుకోవడం.. ఇలా అన్ని రకాల సేవలు యాప్ ద్వారా పొందొచ్చు.

అందుబాటులోకి డాక్ సేవా యాప్

పట్టుబడితే.. రూ.10 వేల జరిమానా

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మందుబాబులూ పారాహుషార్.. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులతో పాటు భారీగా జరిమానా చెల్లించాల్సిందే. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర రహదారులపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో రూ.2 వేలు మాత్రమే జరిమానా ఉండేది. దాన్ని ప్రస్తుతం రూ.10 వేలకు పెంచారు. కొత్త నిర్ణయాలతో న్యాయస్థానాల్లో పలువురికి జరిమానాతో పాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

దూరాభారం!

ఎఫ్‌సీ కోసం వాహనదారులకు పాట్లు

గురజాల, న్యూస్‌టుడే

జిల్లాలో లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు సామర్థ్య పత్రం (ఎఫ్‌సీ) పొందాలంటే వాహనదారులకు భారంగా మారింది. ప్రధానంగా 100 నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరులోని ఫిట్‌నెస్ స్టేషన్ (ప్రైవేటు ఆధ్వర్యంలో) పరిధిలో తనిఖీలు నిర్వహించిన అనంతరం ఎఫ్‌సీ అందజేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రవాణా శాఖ కార్యాలయాల్లో కాకుండా ప్రైవేటు ఆధ్వర్యంలో నడిచే ఫిట్‌నెస్ స్టేషన్లలో ఎఫ్‌సీలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావడంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాకో కేంద్రం ఏర్పాటు చేయాలని భావించినా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయలేదు. సెంటర్లు ఏర్పాటు కాని జిల్లాలకు చెందిన వాహనదారులు దగ్గరలోని ఫిట్‌నెస్ స్టేషన్‌కు వెళ్లాలని డిసెంబరు ఒకటి నుంచి నిర్ణయం తీసుకున్నారు. దీంతో వాహనదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

కొన్నిచోట్లే ఏర్పాటు

ఇప్పటివరకు మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేట, చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, మంగళగిరి పట్టణాల్లోని రవాణా శాఖ కార్యాలయాల్లో ఎఫ్‌సీ పొందేవారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసేవారు. కేంద్రం నిర్ణయంతో ప్రైవేటు ఆధ్వర్యంలో జిల్లాలో ఫిట్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని భావించారు. అయితే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని గుంటూరు, నెల్లూరులో మాత్రమే వీటిని ప్రారంభించారు. నరసరావుపేట, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఏర్పాటు కాలేదు. గతేడాది నవంబరు 31 వరకు ఆయా జిల్లాల్లో నూతన సెంటర్లు అందుబాటులోకి వచ్చేవరకు రవాణా శాఖ కార్యాలయాల్లో ఎఫ్‌సీ పొందే అవకాశం కల్పించారు.

డిసెంబరు ఒకటో తేదీ నుంచి దగ్గర్లోని ఫిట్‌నెస్ సెంటర్లకు వెళ్లాల్సిందే అని ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు వెళ్లడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాచర్ల, గురజాల, దాచేపల్లి, కారంపూడి వంటి ప్రాంతాల నుంచి 140 నుంచి 100 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, తదాయవరా సమయంతో పాటు ఖర్చులు పెరిగాయని వారు వాపోతున్నారు. జిల్లా కేంద్రాల్లో స్టేషన్లు ప్రారంభించే వరకు రవాణాశాఖ కార్యాలయాల్లో తీసుకునే విధంగా పాతపద్ధతి అమలు చేయాలని లారీ యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
ఆర్యవైశ్య కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. గుంటూరు ఈనాడు కార్యాలయంలో (9వ లైన్, పోలీస్ స్టేషన్ ఎదురుగా, అరండల్‌పేట) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026, శనివారం, ఆదివారం)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్ ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.
★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
92475 20500 & 95501 28306
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

కంది రైతుకు భరోసా

● పంట కొనుగోలు ప్రారంభం

నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల, న్యూస్‌టుడే

కందులు

రైతు పండించిన కందులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.6,200 నుంచి రూ.6,500 వరకు పలుకుతుండగా.. ప్రభుత్వం అంతకన్నా ఎక్కువగా రూ.8 వేలు చెల్లిస్తుంది. జిల్లాలోని 28 మండలాల పరిధిలో 350 రైతు సేవా కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలుకు చర్యలు చేపట్టింది.
◆ జిల్లా రైతులు ఖరీఫ్‌లో 39,547 హెక్టార్లలో కంది సాగు చేశారు. కందుల కొనుగోలు విషయంలో వ్యర్థాలు రెండు శాతం, ఇతర గింజలు ఒక్క శాతం, దెబ్బతిన్నవి, రంగు మారినవి, పక్వానికి రానివి మూడు శాతం వరకు అనుమతిస్తారు. తేమ శాతం 12లోపు ఉంటే పూర్తి మద్దతు ధర లభిస్తుంది. కందుల కొనుగోలుకు ప్రభుత్వం రంగంలోకి రావడంతో మార్కెట్లో ధరలో పెరుగుదల కనిపించింది. కాగా, పూత దశలో మంచు, కారుమబ్బులు పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నదాతలు తెలిపారు.

జిల్లాలో కంది సాగు విస్తీర్ణం:	39,547 హెక్టార్లు
దిగుబడి అంచనా:	82,067 మెట్రిక్ టన్నులు
మద్దతు ధర క్వింటాకు:	8 వేలు

సీఎం యాప్‌లో నమోదు తప్పనిసరి

కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ-పంటలో నమోదు చేయించుకున్న కంది సాగు చేసిన రైతులు మద్దతు ధర పొందేందుకు సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై 20 నుంచి ప్రజాభిప్రాయసేకరణ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారు జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. పాల్గొనే వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల్లో చైతన్యం నింపిన కళాదీపికలు

కన్నీటికి విలువెంత నాటికలో సన్నివేశం

యద్దనపూడి, మార్టూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు గ్రామీణ ప్రజల్లో చైతన్యం నింపాయి. యద్దనపూడి మండలం అనంతవరంలో శుక్రవారం రాత్రి 4వ వార్షిక పోటీలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, సినీ దర్శకుడు అనిల్ రావిపూడి ఆరంభించారు. ఈసందర్భంగా తొలి రోజు మూడు నాటికలను ప్రదర్శించారు. కాకినాడ వారి కన్నీటికి విలువెంత..?, విజయవాడ వారి ప్రపంచతంత్రం, ఇదేనా ధర్మం ఇదే నాదర్శం నాటికలను ఆయా సమాజాల వారు ప్రదర్శించారు.

నారాయణ హాస్పిటల్ | శ్రీకాంత్ స్పైన్ సెంటర్ Bringing Expertise To spinal Solutions
ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ !
ఇప్పుడు మన గుంటూరులో!
నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 83, ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు-522001
డా॥ శ్రీకాంత్ రెడ్డి దుంపా
M.S (Ortho), DNB (Ortho), FNB (Spine Surgery), FISS (USA)
వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణులు
మరిన్ని వివరాలకు సంప్రదించండి : +91 95974 00472

వైకాపా అరాచకాలపై బ్యానర్లు

పిన్నెల్లి ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పిన్నెల్లి(మాచవరం), న్యూస్‌టుడే : వైకాపా కార్యకర్త మందా సాల్మన్(65) చనిపోయిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పిన్నెల్లి వస్తున్నారని తెలుసుకున్న తెదేపా నేతలు గ్రామంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఆపార్టీ రౌడీ మూకలు, నేతలు, కార్యకర్తలు చేసిన అరాచకాలు, ఆగడాలు, దౌర్జన్యాలు, దాడులకు గురైన వారి చిత్రాలతో బ్యానర్లు ఏర్పాటు చేశారు. అందులో బాధితుల పేర్లు పేర్కొంటూ దీనికి ఏం సమాధానం చెబుతారని మహేష్‌రెడ్డిని ప్రశ్నించారు.

ప్రసన్నాంజనేయుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మండలంలో బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో జాతీయస్థాయి నాటికల పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి వెళ్తూ మార్గంమధ్యలో తన సొంత గ్రామమైన బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఆగి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా హైకోర్టు జడ్జి దంపతులకు చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్రరెడ్డి, ఆలయ ఈవో సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ గుంటు కోటేశ్వరరావు, బొప్పూడి అప్పారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలతో పాటు స్వామి చిత్రపటాన్ని అందించి అర్చకులు ఆశీర్వదించారు.

త్రికోటేశ్వరుడి సేవలో ముఖ్య కార్యదర్శి

ప్రత్యేక పూజల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ దంపతులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో చంద్రశేఖరరావు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. వారు స్వామికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈవో చంద్రశేఖరరావు ప్రిన్సిపల్ సెక్రటరీని శాలువాతో సత్కరించారు.

దంతాలు లేవా? అన్ని రకాల ఆహార పదార్థాలు తినలేకపోతున్నారా?
ఇంప్లాంట్స్‌తో దృఢమైన పళ్ళు మీ సొంతం చేసుకోండి
డా. మానసరెడ్డి గారు
ఉచిత దంత చికిత్సలు
EHS (ఎంప్లాయిస్ హెల్త్) కార్డు, CGHS & ఆరోగ్య భద్రత ద్వారా
EMI సౌకర్యం కలదు
Dr. Kiran's SMILE GROUP of Dental Hospitals Pvt. Ltd.
Andhra Pradesh | Telangana | Karnataka | Kuwait
అయ్యప్పస్వామి గుడి ఎదురుగా, బృందావన్ గార్డెన్స్, గుంటూరు
కాల్: 95502 31862

ముగిసిన తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు

నరసరావుపేట వశిష్ఠ కళాశాల జట్టు విజేత

విజేతలకు బహుమతి అందిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఈపూరు మండలం ముప్పాళ్లలో మూడ్రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 16 జట్లు పోటీల్లో పాల్గొనగా తెలంగాణ, కాకినాడ, పల్నాడు రెడ్‌బుక్, నరసరావుపేట వశిష్ఠ కళాశాల జట్లు ఎక్కువ పాయింట్లు సాధించి సూపర్‌లీగ్‌లోకి ప్రవేశించాయి. ఈ జట్ల మధ్య నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో నరసరావుపేట వశిష్ఠ కళాశాల జట్టు విజేతగా నిలిచి రూ.లక్ష నగదు బహుమతి కైవసం చేసుకుంది. తెలంగాణ జట్టు రెండో బహుమతి (రూ.75 వేలు), పల్నాడు రెడ్‌బుక్ జట్టు మూడో స్థానం (రూ.50 వేలు), కాకినాడ జట్టు నాలుగో స్థానం(రూ.25 వేలు)లో నిలవగా, హైదరాబాద్ కాసాని జట్టు, ఎన్టీఆర్ జిల్లా జట్టు సంయుక్తంగా అయిదో బహుమతి దక్కించుకున్నాయి. వశిష్ఠ కళాశాల జట్టుకు చెందిన రాంబాబు బెస్ట్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు. విజేతలకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జీడీసీసీబీ ఛైర్‌పర్సన్ మక్కెన మల్లికార్జునరావు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి బోర్డు డైరెక్టరు రాపర్ల జగ్గారావు, న్యాయవాది రామకోటేశ్వరరావు, వడ్లమూడి వెంకట కిషోర్, కంచేటి చంద్రరావు, కబడ్డీ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు, మద్దినేని శ్రీనివాసరావు, సూరే ప్రసన్నాంజనేయులు, అంపైర్లు వైవీ చిరంజీవిరావు, కుర్రా హరికృష్ణ, వై.సురేష్ పాల్గొన్నారు.

పందేలకు.. పగ్గాల్లేవ్

చిలకలూరిపేట: జోరుగా కోడి పందేలు

రొంపిచర్ల: ఓ బరి వద్ద గుండాట

నరసరావుపేట వ్యవసాయం, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్రాంతి సంప్రదాయం పేరిట రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం, చిలకలూరిపేట నియోజకవర్గం రాజాపేట, చందవరం, చంఘిజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం సమీపంలో రెండు బరులు ఏర్పాటు చేసి మూడు రోజులపాటు కోడి పందేలు నిర్వహించారు. రూ.వేలల్లో పందేలు కాశారు. కోతముక్క, గుండాట, కాయ్‌రాజా కాయ్ తదితర జూద క్రీడల్లో రూ.లక్షల్లో నగదు చేతులు మారింది.

బకాయిల చెల్లింపుపై ఉద్యోగుల హర్షం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాం ఎగ్గొట్టిన, ఇక వస్తాయో రావో అని ఎదురు చూస్తున్న డీఆర్ బకాయిలను కూటమి ప్రభుత్వం పండగ పూట చెల్లించడంపై ఉద్యోగులు ఆనందం వెలిబుచ్చారు. బకాయిలు వచ్చేందుకు కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణకు పల్నాడు జిల్లా అధ్యక్షుడు మర్లపాటి రామకృష్ణ, కార్యదర్శి మాదాసు ఆనందనాథ్ అభినందనలు తెలిపారు. డీఆర్ బకాయిలలో మొదటి విడత 30 నెలల బకాయిలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేయటం హర్షణీయమన్నారు.

పిన్నెల్లిలో ఉద్రిక్తత.. భారీ బందోబస్తు

సాల్మన్ (పాతచిత్రం)

గ్రామంలో పోలీసుల మోహరింపు

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నెల్లిలో ప్రత్యర్థుల దాడిలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వైకాపా కార్యకర్త మందా సాల్మన్(65) మృతి చెందడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 10న ప్రత్యర్థులు ఇనుపరాడ్డుతో దాడి చేయగా గుంటూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు 12న వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. సాల్మన్ మృతికి తెదేపా నేతలు, పోలీసుల అండదండలే కారణమని వైకాపా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించడం, మృతదేహాన్ని అంబులెన్సులో తీసుకువస్తుండగా బ్రహ్మణపల్లి సమీపంలోని ఫ్యాక్టరీ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళం ఏర్పడింది. మహేష్‌రెడ్డితో పాటు మరికొంతమందిని మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పడంతో కాసు రోడ్డుపై ధర్నాకు దిగారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. పోలీసుల తీరు, జరిగిన పరిణామాలు వివరించారు. అనంతరం పోలీసులు అనుమతి ఇవ్వడంతో అంబులెన్సుతో పాటు వాహనశ్రేణి పిన్నెల్లికి చేరుకుంది. సాల్మన్ మృతదేహానికి కాసుతో పాటు ఆ పార్టీ నేతలు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.
● సాల్మన్ అంత్యక్రియలకు వస్తానని కాసు మహేష్‌రెడ్డి ఒకరోజు ముందుగానే ప్రకటించినా కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వచ్చాయి. అతి సమస్యాత్మక గ్రామంలో గొడవలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, నరసరావుపేట మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణతో పాటు సీఐలు, ఎస్సైలు, దాదాపు 250 మంది సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.

హత్య కేసుగా మార్పు

మాచవరం, న్యూస్‌టుడే : మాచవరం మండలం పిన్నెల్లిలో వ్యక్తిగత కారణాలతో మందా సాల్మన్(65)పై దాడి చేసి, అతని మరణానికి కారణమైన నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న సాల్మన్, అదే గ్రామానికి చెందిన మోటమర్రి పేతురు పరస్పరం దాడి చేసుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. సాల్మన్ మృతిచెందడంతో హత్య కేసుగా మార్చినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఎడ్ల పందేలు చూసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



వేణుగోపాలకృష్ణ (పాతచిత్రం)

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ... నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన గాంధ్రు వేణుగోపాలకృష్ణ (48) భార్య పండగకు గొట్టిపాడులోని పుట్టింటికి వెళ్లింది. దీంతో కుమార్తె ఆరాధ్యను ఆమె వద్ద వదిలిపెట్టేందుకు వెళ్లి, అక్కడ నుంచి బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంభొట్లవారిపాలెం వద్ద జరుగుతున్న ఎడ్ల పందేలను చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈవూరివారిపాలెం వద్ద చిలకలూరిపేట - చీరాల జాతీయ రహదారిపై అపసవ్య దిశలో వస్తున్న మరో ద్విచక్రవాహనం ఇతను నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతను మృతి చెందాడు. సంక్రాంతి పండగ తమ కుటుంబంలో విషాదం నింపిందని భార్య, కుమార్తె కన్నీటిపర్యంతమయ్యారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వేలూరుకు చెందిన దంపతులు కింద పడటంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 164, రిటైల్ ధర - 191, చికెన్ విత్‌స్కిన్ - 277, చికెన్ స్కిన్‌లెస్ - 315.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267, చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

కంభం చెరువులో పడవ బోల్తా

జాలరి మృతి

కంభం, న్యూస్‌టుడే : బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామచంద్రాపురానికి చెందిన వాయుల శేషయ్య (25) కంభంలోని పెద్దనల్ల కాలువ ప్రాంతంలో ఉంటున్నారు. ఆయన స్థానిక చెరువులో చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నారు. బుధవారం రాత్రి కంభం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. ఆయన మృతదేహం గురువారం నీటిపై తేలియాడుతుండగా, బాధితుడి తండ్రి కనకయ్య గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం - మంగళగిరి - గుంటూరు జిల్లా
లేఖ నెం. బి2/54/2026, తేదీ: 16.01.2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమైన (1) చిల్లర సరుకులు మరియు (2) పూలు, పూల దండలు, సదరు రెండు ఐటములకు టెండరు నందు పొందుపరచిన విధముగా ది. 01.04.2026 నుండి ది. 31.03.2027 వరకు సప్లయి చేయుటకు అర్హులైన టెండరుదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వివరములకు 08645-232945 ద్వారా లేదా https://apeprocurement.gov.in వెబ్‌సైట్ చూడగలరు.
ఇట్లు : సహాయ కమీషనరు మరియు, కార్యనిర్వహణాధికారి

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మద్యం తాగొద్దని భర్తకు ఎంత చెప్పినా అతను వినకపోవడంతో మనస్తాపానికి గురై భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొప్పుకొండలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొటారి అరుణ (28) భర్త పెద్ద బ్రహ్మ వెంకట నాగాంజనేయులు రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. మద్యం మానేయాలని అతనికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చూసేసరికి ఆమె మృతి చెందింది. వీరికి 8, 5 ఏళ్ల వయసు గల ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయలక్ష్మి తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు..

శావల్యాపురం, న్యూస్‌టుడే : గుంటూరు - నంద్యాల రైలు మార్గంలో శావల్యాపురం రైల్వే వంతెనకు అతి సమీపంలో సుమారు 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం విజయవాడ నుంచి బెంగళూరు వైపు వెళ్లే ప్రత్యేక రైలు కింద పడి ఇతను మృతి చెందాడు. మృతుడి ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. దీనిపై నరసరావుపేట రైల్వే పోలీసులకు సమాచారం అందజేసినట్లు స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రేమ విఫలమై మరొకరు..

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం... కాచిగూడ-విద్యానగర్ స్టేషన్ల మధ్య పట్టాల పక్కన యువకుడి కుళ్లిన మృతదేహాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అతన్ని ఏపీ పల్నాడు జిల్లా, సత్తెనపల్లికి చెందిన రవి కుమారుడు విక్టర్‌పాల్ (22)గా గుర్తించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న అతను ప్రేమ వైఫల్యం కారణంగా ఈ నెల 13న తండ్రికి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్ చేశాడు.

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని వైద్య విద్యార్థి మృతి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాలు ఢీకొని ఎంబీబీఎస్ విద్యార్థి మృతి చెందిన సంఘటన అద్దంకి-దర్శి ప్రధాన రహదారిలో శుక్రవారం పెదఉల్లగల్లు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పల్నాడు జిల్లా నూజండ్ల మండలం ముప్పరాజుపాలెం గ్రామానికి చెందిన ఉప్పుటూరి మోహన్‌రావు, నాగసుబ్బులు కుమారుడు ప్రసన్నకుమార్(24) హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. పండగ సందర్భంగా తన అమ్మమ్మ ఊరైన ముండ్లమూరు మండలం కెల్లంపల్లి వచ్చారు. తన స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై పులిపాడు వెళుతున్నాడు. ఇదే సమయంలో దర్శి మండలం తూర్పుచౌటపాలేనికి చెందిన ఏసుబాబు దర్శి నుంచి అద్దంకి వెళ్తున్నారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రసన్నకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసుబాబును ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. చేతికందొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

91.9FM Vijayawada | ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES
BUSINESS OFFER
Third Eye Consultancy - Guntur GST Registration in 1 Hour No Physical Office Required Contact: 7893270607.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
సంక్రాంతి శుభాకాంక్షలతో... అతితక్కువ ధరలకే గృహప్రవేశానికి సిద్ధంగా 2&3 BHK FLATS
Sri Sai Fortune Heights
❖ క్వాలిటీ కన్‌స్ట్రక్షన్ ❖ 100% వాస్తు ❖ 8 లిఫ్టులు ❖ సెమీ & ఫుల్ ఫినిష్ ❖ స్పాట్ రిజిస్ట్రేషన్ ❖ బ్యాంక్ లోన్ సౌకర్యం
హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎదురు, నల్లపాడు రోడ్డు, గుంటూరు.
9440 777 999, 99499 29060

గ్రేటర్ గుంటూరుకు ఆనుకొని లాల్‌పురంలో ఇళ్లకు ఆనుకొని ఇల్లు నిర్మించుకొనుటకు అనువైన 167 గజాల స్థలం అమ్మబడును. సం: 9059115854.

PLOT FOR SALE
INNER RING ROAD
రెసిడెన్షియల్ జోన్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన GMC పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 నందు బాష్యం ఇంటర్నేషనల్ స్కూల్, నారాయణ, NRI, SR, సంకల్ప కాలేజీలకు అతిచేరువ లోను మరియు అమరావతి రోడ్, పొన్నెకల్లు నందు రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు బాగా రీజనబుల్ ధరలో కలవు. ✆ 7799334555.

SATTENAPALLI
అమరావతి ORR దగ్గరగా, సత్తెనపల్లి పట్టణంలో CRDA, RERA అప్రూవ్డ్‌తో, మంచినీటి భూగర్భ జలాలలో, 80% లోన్ సౌకర్యంతో కల ప్లాట్లు అమ్మబడును. Cont: 9912353046.

GENERAL
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067.
సంక్రాంతి ఆఫర్: రిజిస్ట్రేషన్ ఫ్రీ. గుంటూరు-Hyd హైవేఫేసింగ్ మేడికొండూరులో గేటెడ్‌కమ్యూనిటీ వెంచర్‌లో CRDA&RERA అప్రూవ్డ్‌తో రెసిడెన్షియల్ ప్లాట్లు గజం 11వేలే. 7416161625.
తాడికొండ - IRR కి దగ్గరగా తారు రోడ్ ఫేస్ CRDA అప్రూవల్ గల ప్లాట్స్ అమ్మకం. (లోన్ సౌకర్యం కలదు). స్పాట్ రిజిస్ట్రేషన్. సం|| 9985227799.

COMMERCIAL SPACE FOR SALE
GENERAL
304 Sft shop in upcoming biggest mall in Guntur with immediate Rent of 30000/- for sale. Call: 9573454266.

TO LET
COMMERCIAL
Nice Commercial Building for Long Term Rent 3Fls with Lift & Cellar N/E Corner of 6/1 Arundelpet-Ravi, GNT. ✆ 7330724620.

JOBS
Walk-In Interviews for Sales relationship Managers Fresher/Exp. Jayalakshmi Nexa Auto Nagar, Guntur, Whatsapp: 9100787054.
Wanted exp Telecallers/ Computer Operators (F) in Edu Consultancy in Lakshmipuram, Sal: 15K to 20K, Q: Deg. 9052975353.
చిరంజీవ చిట్‌ఫండ్స్ ప్రై॥ లి॥లో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పని చేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం||ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 72888 70101, 72888 87707.
ఒంగోలులో రియల్ ఎస్టేట్ అప్రూవల్ వెంచర్‌లో మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన కమీషన్లతోపాటు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ 98660 94114.
నరసరావుపేట, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను Ph: 7989476799.
బుడంపాడు బైపాస్‌లో ఉన్న హాస్పిటల్‌లో పనిచేయుటకు ఆయమ్మలు, వార్డ్‌బాయ్స్ కావలెను. జీతం 13, 14 వేలు. 4సెలవులు. Ph: 9390304288, 9121014216.
ఇండస్ ఇండ్ నిప్పాన్ లైఫ్ఇన్సూరెన్స్ (రిలయన్స్) తెనాలిబ్రాంచ్‌కు మహిళా ఉద్యోగులు కావలెను. Q:డిగ్రీ, 21-50 సం|| తెనాలికి 5 కి.మీ. లోపు వారు. 9246417319.
ప్రముఖ కాలేజీలో మార్కెటింగ్ చేయుటకు డిగ్రీ అర్హత గల PRO's మరియు ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్స్ కావలెను. శ్రీ వర్షిని కాలేజీ, 2/6, బ్రాడీపేట, Gnt. 9440214612, 9652146801.
అకౌంటెంట్ కమ్ అకౌంట్స్ మేనేజర్ కావలెను. బీకాం, 10 సం||లు అకౌంట్స్‌లోఅనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్ వేయగలిగినవారు kamathamjob@gmail.com కు పంపగలరు.
బాపట్ల సమీపంలో వివిధకంపెనీలో సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు, లేడి సెక్యూరిటీగార్డులు అర్జంటుగా కావలెను. 8 H డ్యూటీ వివరములకు ✆: 9394110108.
రేపల్లె - సజ్జావారిపాలెం, భారత్ పెట్రోల్ బంకులో పనిచేయుటకు ఆసక్తి కలవారు కావలెను. పని నేర్పించబడును. + మంచి జీతం. 9246164672.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- | 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- | 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

గ్యాస్ కనెక్షన్‌కు నగదు వసూలు తగదు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: తెల్లరేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద అందించే గ్యాస్ కనెక్షన్లకు కొన్ని ఏజెన్సీలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని, దీనిని అరికట్టాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని జొన్నలగడ్డలో నాయకులు రామారావు, వెంకటేశ్వరరావు విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుతున్నారని ఆరోపించారు. దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పౌరసరఫరాల శాఖ అధికారులు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ డెలివరీ సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసరావు తదితరులున్నారు.

వైభవంగా గోకనకొండ తిరునాళ్ల

అలంకరణలో స్వామి మూలవిరాట్

గ్రామస్థులు ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: గోకనకొండ కొండపై వేంచేసిన అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము 4 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. 10గంటల సమయంలో పురోహితులు తిరుమలాచార్యుల ఆధ్వర్యంలో పద్మావతీ శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామిని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థుల సహకారంతో అన్నదానం చేశారు. నాగులవరం జడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అంకారావు ఆధ్వర్యంలో విద్యార్థినులు చేసిన డీజే కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రికి భారీ విద్యుత్తు ప్రభలు నిర్మించి వాటిపై పౌరాణిక, జానపద నాటికలు, నృత్యాలు ఏర్పాటు చేశారు. నాలుగు మండలాల (వినుకొండ, నూజండ్ల, బాపట్ల జిల్లా సంతమాగులూరు, బల్లికురవ) సరిహద్దులో ఉండటంతో పాటు నూతన ఏడాదిలో తొలి తిరునాళ్ల కావడంతో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. నాగులవరం, ఉమ్మడివరం, పిట్టంబండ, నూజండ్ల మండలం పువ్వాడ, కొండలరాయునిపాలెం, ములకలూరు, సంతమాగులూరు మండలం కుందుర్తి, మామిళ్లపల్లి, పరిటాలవారిపాలెం, బల్లికురవ మండలం గొర్రెపాడు, కూకట్లపల్లి తదితర గ్రామాల నుంచి మహిళలు వచ్చి పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కూటమి నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే దారిలో విద్యుద్దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు రాకపోకలు సాగించలేని ఇబ్బంది మారింది. - **రామకృష్ణ** ✔ ఆ మార్గంలో త్వరలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **అల్తాఫ్, పురపాలక సంఘ ఏఈ**

? చిలకలూరిపేట పట్టణంలో పురుషోత్తమపట్నం నుంచి కోట ప్రకాశం వెళ్లే దారిలో ఆర్టీఓ కార్యాలయం వద్ద దుకాణాల ముందు పలు వాహనాలు రోడ్డుపైనే నిలుపడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. - **వెంకటేశ్వరరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి వాహనాలు రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకుంటాం. - **చెన్న కేశవులు, ఎస్సై** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో జోసూరు ఆసుపత్రి సమీపంలో డ్రైనేజీ పూడిక తీయడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. - **శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. - **రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి** - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? ముటికిపూడి బ్రహ్మంగారి గుడి వెనుక భాగంలో పెద్ద కాలువ పూడిపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద పెరిగింది. - **అజయ్, ముటికిపూడి** ? యడవల్లి ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక ఇబ్బందులు నెలకొన్నాయి. రాత్రిళ్లు వీధుల్లో అంధకారం అలుముకుంటోంది. - కొండయ్య, ఎస్సీ కాలనీ, యడవల్లి ✔ రెండ్రోజుల్లో కాలువను పూర్తిగా శుభ్రం చేసి మురికినీటి ప్రవాహం ఏర్పాటు చేస్తాం. ✔ వారం రోజుల్లో యడవల్లి ఎస్సీ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. - **ప్రభుదాసు, ఇన్‌ఛార్జి కార్యదర్శి** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

? మండలంలోని ఉప్పలపాడు ఎస్సీ కాలనీలో ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ ఉండి తటాకాలను తలపిస్తోంది. రాత్రయితే దోమల స్వైరవిహారంతో కంటి మీద కునుకు ఉండటం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. - **కోటేశ్వరరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మురుగు తటాకాలు తొలగించి బ్లీచింగ్ చల్లిస్తాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తాం. - **ప్రసూనాంబ, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, ఉప్పలపాడు(నరసరావుపేట సెంట్రల్)

? వినుకొండ కారంపూడి రోడ్డు నుండి బ్రాహ్మణపల్లి వెళ్లే రోడ్డులో వంతెనకు రంధ్రం పడటంతో పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **గ్రామస్థులు, బ్రాహ్మణపల్లి** ✔ ఇప్పటికే మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేయిస్తాం. - **శ్రీనివాసరావు, ఏఈ పీఆర్, వినుకొండ** - న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

? మార్కాపురం రోడ్డులో చెక్‌పోస్టుకు సమీపంలో మురుగు కాలువ నీరు రోడ్డును ముంచెత్తింది. ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. - **సుబ్బారావు** ? కారంపూడి రోడ్డులో వంతెన దిగువన ఎన్నెస్పీ కాలువలో వ్యర్థాలు పారబోస్తున్నారు. - **శ్రీను** ? పట్టణంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట మురుగు నీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. - **కోటేశ్వరరావు** ? ఏనుగుపాలెం రోడ్డులో రైలు గేటు వద్ద చేపల దుకాణాల నుంచి నీరు ప్రధాన రహదారిపైకి చేరి, ప్రజలకు ఇబ్బందిగా ఉంది. - **రాజారావు** ✔ చెక్‌పోస్టు వద్ద కాలువ ఆక్రమణ కారణంగా నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఎన్నెస్పీ కాలువలో వ్యర్థాలు పోయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం. పీఆర్ కార్యాలయం వద్ద కాలువ పూడికను తొలగిస్తాం. రైలు గేటు వద్ద నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం. - **ఇస్మాయిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వినుకొండ పురపాలక సంఘం** - న్యూస్‌టుడే, వినుకొండ

? జడ్డావారిపాలెం నుంచి ముప్పాళ్లపాడు వెళ్లే పీడబ్ల్యూడీ రోడ్డు అధ్వానంగా తయారైంది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి అవకాశం లేదు. రైతులు పొలాలకు వెళ్లాలన్నా నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. - **చిన్న, జడ్డావారిపాలెం** ✔ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే వెంటనే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. - **అల్లాభక్షు, ఏఈ, పీఆర్**

? కమ్మవారిపాలెం నుంచి ఎస్టీ కాలనీకి వచ్చే విద్యుత్తు లైన్‌లో తీగలు వేలాడుతున్నాయి. ప్రమాదం పొంచి ఉంది. - **నారాయణ, కమ్మవారిపాలెం** ✔ వేలాడుతున్న తీగలను సరిచేయిస్తాం. ప్రమాదాలు జరగకుండా వెంటనే చర్యలు తీసుకుంటాం. - **సుధాకర్, ఏఈ, విద్యుత్తు శాఖ** - న్యూస్‌టుడే, నూజండ్ల

సవరణలకు సదవకాశం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాసు పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి బొమ్మ ముద్రించటం, సర్వేలో ఒకరి పొలం మరొకరి పేరుతో రావటం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉండటం వంటి తప్పులతో రైతులు పాట్లు అన్నీఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ప్రభుత్వ హయాంలో దొర్లిన తప్పులను సరిదిద్ది రాజముద్రతో పాసు పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల సంయుక్త ఎల్పీ నంబర్లు రావటం మినహా మిగిలిన విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, పొలం ఎవరిదైతే వారి ఫొటో వంటి సమస్యలు పరిష్కారమయ్యాయి. సంయుక్త ఎల్పీ సంఖ్యతో వచ్చిన పాసు పుస్తకాలను సరిదిద్దేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలో సంయుక్త ఎల్పీ నెంబర్లతో వచ్చిన పాసు పుస్తకాలు సుమారు 450వరకు ఉన్నాయి.

జొన్నలగడ్డలో నిర్వహించిన సదస్సులో అర్జీలు ఇస్తున్న రైతులు

అవసరమైతే మళ్లీ సర్వే

పాసు పుస్తకాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సుల్లో తప్పులు దొర్లిన రైతుల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. తప్పులున్న పాసు పుస్తకాలను పరిశీలించి అధిక సంఖ్యలో ఏం తప్పు జరిగిందో తెలుసుకొని ఆ తప్పును సరిదిద్దేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సంబంధిత పొలాలు సర్వే నిర్వ

19 నుంచి ప్రత్యేక సదస్సులు

హించి వారి సమస్యలు పరిష్కరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గ్రామస్థుల సహకారం

పొలాలు సర్వే చేసేందుకు వినియోగించే రోవర్లు మండలం మొత్తానికి ఒకటి మాత్రమే ఉంది. ఒక యంత్రంతో సర్వే పనులు ఆలస్యమవుతున్నాయని రెవెన్యూ సదస్సుల్లో అధికారులు వివరించారు. దీంతో రైతులు యంత్రాలు కొనుగోలుకు తాము సహకారం అందిస్తామని, తమ భూములు, పాసు పుస్తకాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. జొన్నలగడ్డ, ఇక్కుర్రు, అల్లూరివారిపాలెం, రావిపాడు గ్రామాల రైతులు రోవర్లు కొనుగోలుకు ముందుకు వచ్చారని, ఈనెల 19 నుంచి ఆయా గ్రామాలతో పాటు అవసరమైన అన్ని చోట్ల సదస్సులు నిర్వహించి పాసుపుస్తకాల్లో తప్పులను సరిదిద్దుతామని తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.

రొంపిచర్ల: విప్పర్లలో వల్లభేశ్వరస్వామి

నూజండ్ల: ప్రత్యేక అలంకారలో స్వామి వారు

వినుకొండ గుంటి ఆంజనేయుడు

ఆలయాల్లో సంక్రాంతి పూజలు

మకర సంక్రాంతి, కనుమ పండగను పల్లెల్లో అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. తెలుగింట పెద్దల పండగగా చెప్పుకునే సంక్రాంతికి బంధువుల రాకతో తెలుగు వారి లోగిళ్లన్నీ కళకళలాడాయి. ఇళ్ల ముందు వేసిన రంగవల్లులు నూతన శోభను తెచ్చిపెట్టాయి. సంప్రదాయ దుస్తులు ధరించి పెద్దలు, పిల్లలు అలరించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూజండ్ల లక్ష్మీచెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, రామయోగిస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ✦ వినుకొండలోని గుంటి ఆంజనేయస్వామిని సంక్రాంతి సందర్భంగా చామంతి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడు ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కొత్తపల్లి దొంక వద్ద వేంచేసి ఉన్న శ్రీ సంజీవ ఆంజనేయస్వామి, విప్పర్ల వల్లభేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. రొంపిచర్ల శంకర స్వామి, మదన వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. హరిదాసుల కీర్తనలతో పాటు, ఉమ్మడి కుటుంబాల కలయిక, బంధువుల రాకతో పల్లెలు సంక్రాంతి శోభ సంతరించుకున్నాయి. **గోపూజ మహోత్సవం..** కనుమ పండగ సందర్భంగా నూజండ్ల లక్ష్మీ చెన్నకేశవ దేవాలయంలో ప్రత్యేక గోపూజ కార్యక్రమం నిర్వహించారు. నూజండ్ల గ్రూప్ దేవాలయాల ప్రధాన అర్చకుడు రామ్మోహనాచార్యులు కనుమ పండగ, గోపూజ విశిష్టతను వివరించారు. భక్తులచే గోవులకు పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చిలకలూరిపేట: పసుమర్రులో స్వామి ఉత్సవ విగ్రహాలు

యడ్లపాడు: లింగారావుపాలెం చెరువులో స్వామి ఉత్సవ విగ్రహాలతో తెప్పోత్సవం

చిలకలూరిపేట: తాతపూడి చెరువులో హంస వాహనంపై..

తెప్పోత్సవం.. నయనానందం

యడ్లపాడు, న్యూస్‌టుడే: మకర సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గురువారం మండలంలో రెండు గ్రామాల్లో తెప్పోత్సవాలను వైభవంగా నిర్వహించారు. లింగారావుపాలెంలో శ్రీగంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, శ్రీ సీతారామస్వామి ఆలయాల్లో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని హారతులిచ్చారు. అనంతరం దేవతా మూర్తులకు ఊరి నడిబొడ్డున ఉన్న చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాలను నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. జాలాది గ్రామంలో శ్రీహరిహర దత్తక్షేత్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీ గంగా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసి ఊరేగించారు. అనంతరం గ్రామ చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామపెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. సొలసలో శ్రీభూసమేత రంగనాయక స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

చిలకలూరిపేట గ్రామీణ: చిలకలూరిపేట మండలం పసుమర్రు, తాతపూడి గ్రామాల్లోని చెరువుల్లో సంక్రాంతి, కనుమ పండగలు పురస్కరించుకుని నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. పసుమర్రులో రాజ్యలక్ష్మి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, తాండవేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై చెరువులో ఉత్సవం ఘనంగా జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కనులారా స్వామిని తిలకించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ✦ తాతపూడి చెరువులో తెప్పోత్సవం ఈ ఏడాది ప్రత్యేకత సంతరించుకుంది. గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల ఉత్సవ విగ్రహాలను ఊరిలో ప్రత్యేకంగా ఊరేగించారు. అనంతరం తన తల్లిదండ్రులు ధూళిపాళ్ల శ్రీహరి, రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ప్రవాసాంధ్రుడు సాంబశివరావు (అమెరికా) యానాంలో ప్రత్యేకంగా రూ.1.50 లక్షలతో తయారు చేయించిన హంస వాహనంపై స్వామివార్లను ఊరేగించారు. ఊరంతా తరలివచ్చి తెప్పోత్సవాన్ని వీక్షించారు.

రొంపిచర్ల: లెమన్ స్పూన్ పోటీలో..

రొంపిచర్ల: రంగవల్లులు దిద్దుతూ..

శావల్యాపురం: ప్రథమ స్థానంలో నిలిచిన శేషసీసీ జట్టుకు..

ఉత్సాహం పంచుతూ.. ఉత్తేజం నింపుతూ

ఆటల పోటీలతో పల్లెల్లో సందడి

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల, వినుకొండ రూరల్, యడ్లపాడు, శావల్యాపురం, ఈపూరు, నూజండ్ల, న్యూస్‌టుడే : సంక్రాంతి పురస్కరించుకుని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో నిర్వహించిన ఆటల పోటీలతో పట్టణాలు, గ్రామాలు సందడిగా మారాయి. మహిళలకు ముగ్గులు, కుర్చీలాట తదితర పోటీలు నిర్వహించారు. యువకులకు క్రికెట్, కబడ్డీ, టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కొన్ని చోట్ల వినూత్నంగా ట్రాక్టర్ వెనుకకు నడిపే పోటీలు పెట్టారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి. రజిని, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొని బహుమతులు అందజేశారు. ఈపూరు, రొంపిచర్ల మండలాల్లో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, అరవింద బాబు పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. జనసేన ఆధ్వర్యంలో నరసరావుపేటలోని 32, 33 వార్డుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. యడ్లపాడులో గ్రామస్థుల ఆధ్వర్యంలో ముత్తవరపు సురేష్‌బాబు సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. సాంబ జట్టు (విజయవాడ) విజేతగా నిలిచింది.

నూజండ్ల: నరగాయపాలెంలో ముగ్గుల పోటీలో మహిళలు

యడ్లపాడు: విజేతలకు బహుమతులు ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజిని

చిలకలూరిపేట: క్రికెట్‌లో సత్తా చాటిన జట్టుకు బహుమతి ఇస్తున్న తెదేపా నాయకుడు సాంబశివరావు

చిలకలూరిపేట: మానుకొండవారిపాలెంలో..

రొంపిచర్ల: విజేతకు డ్రెస్సింగ్ టేబుల్ అందిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, జనసేన రాష్ట్ర కార్యదర్శి జిలానీ తదితరులు

చిలకలూరిపేట: ట్రాక్టర్ వెనుకకు నడిపి బహుమతి పట్టేసి..

యడ్లపాడు: సాంబ జట్టు (కబడ్డీ ప్రథమ)కు ట్రోఫీ అందిస్తున్న దాత సురేష్‌బాబు

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం, దాతల సహకారంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. దాతల సహకారంతో సమకూరిన సుమారు రూ. 9లక్షల విలువైన చెత్త సేకరణ వాహనాన్ని కేశానుపల్లిలోని కార్యాలయంలో పంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆ వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో చెత్త సమస్యను సమర్థవంతంగా పరిష్కరించాలంటే ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గట్టుపల్లి సత్యనారాయణ, షరీఫ్, నాగేశ్వరరావు, వీరయ్య, వెంకట్, బంగారం తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామానికి అవసరమైన వసతులు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తెలిపారు. మండలంలోని వీరవట్నంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్లను స్థానిక పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. రైతులు పశుపోషణ ద్వారా స్వయం ఉపాధి సాధించేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చల్లా సుబ్బారావు, గాడిపర్తి సురేష్, షరీఫ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నూజండ్ల, న్యూస్‌టుడే: దేశం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని ఏసుపాదం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. కంభంపాడులో ఎస్.ఏసుపాదం మాస్టారు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంస్మరణ సభలో అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడి సేవలకు గుర్తింపుగా విద్యార్థులు విగ్రహం ఏర్పాటు చేసి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. తొలుత ఏసుపాదం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు రూ. 50 వేల ఉపకార వేతనాలు, పాటలు, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్టు కార్యదర్శి శ్రీనివాసరావు, కార్మిక సంఘ నేత వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వాక్ ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు

నడకకు సమయమిద్దాం

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో నాదెండ్ల నుంచి 56 మంది ఉత్సాహంగా శుక్రవారం 10కే నడకలో పాల్గొన్నారు. నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు దీనికి పచ్చజెండా ఊపారు. ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ రోజుకొక అరగంట నడకకు కేటాయించాలని హరిబాబు సూచించారు. నడకలో వేగంగా చిలకలూరిపేటకు ముందుగా చేరుకున్న వారిని సత్కరించి బహుమతులు అందజేశారు.

వెంకట సుబ్బారావుకు శాలువా కప్పిన బ్రాహ్మణ సంఘాల సభ్యులు

గోకనకొండ కోదండ రామాలయ ఛైర్మన్‌గా వెంకట సుబ్బారావు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: గోకనకొండ కోదండ రామాలయం ఛైర్మన్‌గా పోలూరి వెంకట సుబ్బారావు, ఇతర సభ్యులతో గ్రామస్థులు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆలయంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజ పెద్దలు మాట్లాడుతూ అన్ని విధాలా సమర్థుడు, కష్టపడే తత్వం కలవాడు ఆలయానికి ఛైర్మన్‌గా రావడం శుభపరిణామమన్నారు. తెదేపా నాయకుడు పీవీ సురేష్, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ శర్మ, మంత్రిరాజు సత్యనారాయణ, భాగవతుల రవికుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిపురనేని జయంతి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో హేతువాది, రచయిత, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతిని గురువారం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ త్రిపురనేని రాసిన వీరగంధము తెచ్చినారము వీరు డెవ్వరో తెల్పుడి అంటూ రాసిన పలు గేయాలు జాతీయోద్యమంలో యువత ఉవ్వెత్తున చేరేలా ప్రేరేపించాయన్నారు. ముందుగా త్రిపురనేని చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గార్డ్స్ సంస్థ కార్యదర్శి బొంత అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, పొనుగుబాటి బుల్లిబాబు, డాక్టర్ చుక్కా విన్సెంట్‌పాల్, తియ్యగూర ప్రతాపరెడ్డి, కరీముల్లా, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, బాషా, నలమాల దానయ్య తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి చౌదరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీ వేత్తలు, గార్డ్స్ సంస్థ సభ్యులు

మంచినీటి వృథా పట్టదా..?

పట్టణంలో రామిరెడ్డిపేట-పాలపాడు రోడ్డులో మంచినీటి పైపులకు లీకులు పడ్డాయి. దీంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో సరఫరా సమయంలో నీరు వృథాగా మురుగు కాలువల్లోకి చేరుతోంది. శివారు ప్రాంతంలో ప్రజలకు పూర్తి స్థాయిలో మంచి నీరందే పరిస్థితి కనిపించటం లేదు. ఇదిలా ఉంటే లీకుల కారణంగా నీరు కలుషితమై ఆ నీటిని తాగి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కళ్లెదుటే విలువైన నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ జ్యోతిని వివరణ కోరగా తక్షణమే పైపులైనుకు మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, మల్లమ్మసెంటర్ (నరసరావుపేట)**

ద్విచక్ర వాహనాల ఢీ ముగ్గురికి గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ బస్టాండ్ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెంకు చెందిన పులిపాటి పవన్ తన తల్లి అన్నామేరితో కలిసి వినుకొండ బస్టాండ్‌కు వెళ్తుండగా అదే సమయంలో వెల్లటూరుకు చెందిన రవి ద్విచక్ర వాహనంపై ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో పవన్, అన్నామేరికి తీవ్ర గాయాలు కాగా రవికి స్వల్ప గాయాలయ్యాయి. వినుకొండ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం తల్లీకొడుకును గుంటూరు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామకోటి తెలిపారు.

(c) eenadu

సత్తెనపల్లి

నేడు తురకపాలెం చర్చి తిరునాళ్ల

విద్యుత్తు వెలుగులో చర్చి

ముప్పాళ్ల: మండలంలోని తురకపాలెం గ్రామంలోని అంతోనివారి దేవాలయ మహోత్సవం(చర్చి తిరునాళ్ల) శనివారం జరగనుంది. ఈ నెల 8 నుంచి చర్చిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతోని వారి మహోత్సవంలో భాగంగా సమష్టి దివ్య పూజాబలి-వాక్యోపదేశం, కానుకల సమర్పణ, రాత్రి 10 గంటలకు అంతోనివారి స్వరూప తేరు ప్రదక్షిణ నిర్వహించనున్నారు. దేశ, విదేశాల నుంచి ఈ తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

పిడుగురాళ్ల, న్యూస్టుడే: జానపాడులోని పురవీధుల్లో రథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఏర్పాటు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఒకవైపు మహిళల కోలాటం, మరోవైపు మేళతాళాలతో రథాన్ని గ్రామస్థులు లాగుతూ ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

గోశాలలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన గోసంరక్షణశాలలో కనుమ సందర్భంగా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. సకల దేవతలకు నిలయం గోమాత అని, సనాతన ధర్మంలో గోసేవ ప్రధానమని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు(కొండలు), గోశాల అధ్యక్షుడు కాశీమల్లేశ్వరరావు అన్నారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు శ్రీనివాసరావు, వెంకటరమణ, శివన్నారాయణ, రత్తయ్య, రామకోటేశ్వరరావు, నరసింహారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు, న్యూస్టుడే: పెదకూరపాడు నడిగడ్డ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు జరిగాయి. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పోటీల్లో మహిళలు, యువతులు, బాలికలు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు తీర్చిదిద్దారు. పోటీలకు ఉపాధ్యాయురాలు శశికళ న్యాయనిర్ణేతగా వ్యవహరించగా చెన్నంశెట్టి అమల ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. నడిగడ్డ ఫ్రెండ్స్ ప్రతినిధులు బహుమతులు అందించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

కబడ్డీ ఆడుతున్న యువకులు

పణిదం, రెంటపాళ్ల(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్టుడే: సంక్రాంతి పర్వదినం సందడి సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో కనిపించింది. ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు ఆధ్వర్యంలో పణిదంలో వివిధ ఆటల పోటీలు జరిగాయి. కబడ్డీ, మ్యూజికల్ ఛైర్, లెమన్ స్పూన్, ముగ్గులు, కుర్చీలాట, పరుగు పందెం తదితర పోటీల్లో యువకులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వంగర తులసీరామ్, నాయకులు షేక్ హుస్సేన్, నిశాంత్‌బేగ్, కరీముల్లా, మక్కపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రెంటపాళ్లలో శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలతో బాలబాలికలు అలరించారు. ముగ్గుల పోటీలు, వివిధ రకాల గ్రామీణ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

అంబరాన్నంటిన.. సంక్రాంతి సంబరాలు

న్యూస్‌టుడే, బృందం: సత్తెనపల్లి, పెదకూరపాడు, మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, క్రీడా పోటీలు, నృత్య ప్రదర్శనలు, వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతుల పంపిణీతో సందడిగా సాగాయి.

మొక్కపాడులో ముగ్గుల పరిశీలన

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణం, పరిసర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించి మహిళలు, యువత, చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చామర్రులోని శ్రీవరసిద్ధివినాయక దేవాలయంలో మకరసంక్రాంతి సందర్భంగా గురువారం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, విశేషద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అచ్చంపేటకు చెందిన నరసింహారావు భజన కార్యక్రమం, రెండుకిలోల కర్పూరంతో జ్యోతి దర్శనాన్ని భక్తులు తిలకించారు. అచ్చంపేటలోని శ్రీఅచ్చంపేరంటాళ్లమ్మ అన్నదానసేవాసమితి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం కూడలిలో అయ్యప్పస్వామి మకరజ్యోతి కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

నార్నెపాడులో తాడు లాగుడు పోటీలు

అలరించిన నృత్య ప్రదర్శన

రెంటచింతల, న్యూస్‌టుడే : సంక్రాంతి వేడుకలు మండలంలో ఉత్సాహంగా నిర్వహించారు. రెంటచింతలలో నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ పోటీల్లో బి. నాగ వర్షితరెడ్డి ప్రథమస్థానం సాధించింది. ప్రియ, లక్ష్మి వరుసగా రెండో స్థానంలో నిలిచారు. రెంటాలలో కోలాటం పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా తెదేపా సోషల్ మీడియా సమన్వయకర్త లక్ష్మణ్ ఆధ్వర్యంలో పాలువాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో విజేతలకు లక్ష్మణ్, గోపిరాజు, సుధాకర్‌రెడ్డి, జెట్టిపాలెంలో కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది బండి లక్ష్మయ్య సత్రశాలలో ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన వేడుకలు

రాజుపాలెం, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు సాగిన సంక్రాంతి సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. రాజుపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. మొక్కపాడులో సర్పంచి కణదం పద్మశ్రీనివాస్ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయగా విజేతలకు నియోజకవర్గ మహిళా నాయకురాలు తోట అంబిక బహుమతులను అందజేశారు.

ఊరూరా ముగ్గుల పోటీలు

మాచవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా మాచవరం, వేమవరం, కొత్తపాలెం గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాచవరంలో రైతులకు తైవాన్ రివర్స్ వాకింగ్ పేరుతో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

దుర్గి, న్యూస్‌టుడే : సంక్రాంతి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుగ్రామాల్లో ముగ్గులపోటీలు, కోలాటప్రదర్శనలు, క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆత్మకూరులో కబడ్డీ పోటీలు, పోలేపల్లిలో ముగ్గులపోటీలు నిర్వహించారు. దుర్గిలో షటిల్, క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. కల్యాణ వీరబ్రహ్మేంద్రస్వామిని రథంలో ఊరేగించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. • మండలంలో కనుమ పండుగను అన్నదాతలు ఆనందంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయాన్నే పశువులను కడిగి పసుపు కుంకుమలతో అలంకరించారు. గోమాతలను పూజించారు.

వెండి కిరీటాల ఊరేగింపులో దాతలు

వెండి కిరీటాల బహూకరణ

ధూళిపాళ్ల(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని రామాలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమంత, విఘ్నేశ్వరుడికి వెండి కిరీటాలను ఆలయ నిర్మాణ దాతలు, విజన్ గ్రూపు అధినేతలు బొర్రా వెంకట అప్పారావు, సురేష్‌బాబు అందజేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నుంచి భక్తి గీతాలు, కోలాటాలతో కిరీటాలను దాతలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగిస్తూ రామాలయానికి చేరుకున్నారు. ఆలయంలో విశేష పూజల అనంతరం కిరీటాలు దేవతామూర్తులకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, మాజీ ఎంపీపీ బొర్రా కోటేశ్వరరావు, తెదేపా నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బీమనేని వందనాదేవి, జనసేన నాయకులు సయ్యద్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. ప్రగతికి సోపానం

పుస్తకాలు పరిశీలిస్తున్న డాక్టర్ సాయికృష్ణ, నాగేశ్వరరావు తదితరులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పుస్తక పఠనం ప్రగతికి సోపానం అవుతుందని సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని వావిలాల పార్కులో ఏర్పాటుచేసిన ఓపెన్ బుక్ రీడింగ్ సెషన్‌ను వారు సందర్శించి మాట్లాడారు. ఫోన్లు వదలండి.. పుస్తకాలు పట్టండి అనేది అందరూ ఆచరించాల్సిన నినాదం అన్నారు. తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌వలి, జానిబాబు, నిర్వాహకుడు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు వెన్నుదన్ను

గోకులం షెడ్లు సిద్ధం

సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు, న్యూస్‌టుడే

పాడి పోషణకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తోంది. పశువుల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న రైతులకు గోకులం షెడ్ల నిర్మాణాల్ని చేపట్టింది. షెడ్లు పశు పోషకులకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి. అన్ని మండలాల్లో వాటి ప్రారంభోత్సవానికి డ్వామా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక్కో గోకులం షెడ్డును రూ.2 లక్షలతో నిర్మించారు. ఉపాధి హామీ నిధులకు తోడు లబ్ధిదారుల వాటాతో పూర్తి చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇప్పటికే పల్లె పండగ 2.0 గోకులం షెడ్లను ప్రారంభించారు. సత్తెనపల్లిలోనూ ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు డ్వామా ఏపీడీ నారాయణ తెలిపారు.

క్రోసూరు మండలం పీసపాడులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మండలం	పంచాయతీలు	గోకులాల లక్ష్యం	మంజూరు	పూర్తి
సత్తెనపల్లి	25	40	33	16
ముప్పాళ్ల	14	20	23	12
రాజుపాలెం	18	30	32	14
నకరికల్లు	17	30	25	11
అచ్చంపేట	22	40	38	20
అమరావతి	20	30	25	9
బెల్లంకొండ	13	20	32	15
క్రోసూరు	18	30	33	16
పెదకూరపాడు	20	30	28	11

ఆర్మీ జవాన్‌కు సత్కారం

అనుపమ్ కుమార్‌ను సత్కరిస్తున్న సేవాసంస్థ బాధ్యులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : భారత ఆర్మీ డే సందర్భంగా పట్టణంలోని అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఆర్మీ జవాన్ పాటిబండ్ల అనుపమ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. దేశ గౌరవానికి జవాన్లు ప్రతీకలని వక్తలు అన్నారు. సేవాసంస్థ బాధ్యులు వీరాంజనేయులు, రవిరాజా, నాగమల్లేశ్వరరావు, షారోన్‌కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నోరు తెరిచిన ప్రమాదం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలోని తారకరామసాగర్ వద్ద మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదాలు నోరు తెరిచినట్లుగా పరిస్థితులు ఉన్నాయి. నడకదారి వెంట మ్యాన్‌హోల్స్‌ను చూసుకోకుంటే అందులో పడిపోయే ప్రమాదముంది. ప్రమాదాలు నిలువరించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగుతో అవస్థలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : మండలంలోని ఇరుకుపాలెం ఎస్టీ కాలనీలోని తిరుపతమ్మతల్లి పక్కనే ఉన్న వీధిలో మురుగు కాల్వ అధ్వానంగా ఉంది. దోమల వ్యాప్తితో వ్యాధులు ప్రబలుతున్నాయి. కాల్వను శుభ్రం చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కృష్ణానది పరిరక్షణకు ఉద్యమిస్తాం

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి మండలం తంగెడ గ్రామ సరిహద్దులోని కృష్ణానది పరివాహ ప్రాంతంలో నీటి కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ కౌన్సిల్ ఛైర్మన్ అంబటి నవకుమార్ ఆధ్వర్యంలో సమగ్ర పరిశీలన చేపట్టారు. నదిలో నీటి స్థితిగతులు, రసాయనాల ప్రభావం, కలుషితానికి గల కారణాలపై ఆరా తీశారు. జాలర్లు, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో నది నీరు కలుషితమై ఉందన్నారు. ఇది పంటల సాగు, మత్స్యకారుల జీవనంపై ప్రభావం చూపుతుందన్నారు. ఆంధ్ర-తెలంగాణ ప్రభుత్వాలు సమన్వయంతో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే నది పరిరక్షణకు ప్రజా ఉద్యమం చేపడతామన్నారు.

కలుషిత నీటిని పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ కౌన్సిల్ ఛైర్మన్ నవకుమార్

సాల్మన్ మృతికి పాతగొడవలే కారణం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పిన్నెల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవలను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీలకు పులుముతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తెదేపా పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు అన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పేతురు, సాల్మన్‌లకు గొడవ జరిగి సాల్మన్ మృతిచెందినట్లు చెప్పారు. ఈఘటనపై మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గొడవ జరిగింది పార్టీల మధ్య అని, దీనికి కారకులు పోలీసు అధికారులు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

వైకాపా నేతల ఆందోళన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పిన్నెల్లిలో జరిగే మందా సాల్మన్ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైకాపా శ్రేణులు శుక్రవారం వాహనాల్లో వెళుతుండగా కామేపల్లి రంగుల మిల్లు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అరగంట తరువాత గురజాల డీఎస్పీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డితో మాట్లాడి వాహనాలను అక్కడ నుంచి పంపించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

హాజరైన గ్రామస్థులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గుత్తికొండలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. గ్రామస్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా రాయల్‌ఫ్రెండ్స్, మాస్టర్ సీసీ జట్ల పోరు ఉత్కంఠంగా జరిగింది. ప్రథమ బహుమతి రాయల్‌ఫ్రెండ్స్, ద్వితీయ బహుమతి మాస్టర్‌సీసీ జట్టు సాధించాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాల స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలో గుత్తికొండ జట్టు ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి పిడుగురాళ్ల జట్టు గెలుపొందాయి. తాడు లాగుడు పోటీలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. శుక్రవారం గుత్తికొండ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు, పంగులూరి విష్ణుబాబు, ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

పద్మశాలీల ఐక్యత చాటాలి

గారపాడు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: సామాజిక, రాజకీయ, వ్యాపార రంగాల్లో పద్మశాలీలు ఐక్యంగా ఉండాలని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు గోలి యలమందయ్య అన్నారు. గురువారం రాత్రి గారపాడు గ్రామంలో పద్మశాలీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హక్కుల సాధనకు, సంఘం బలోపేతానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఉమ్మడిగా కలిసి రావాలని ఆయన కోరారు. రాష్ట్ర కమిటీలో కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితులైన యలమందయ్య దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. నేతలు చిల్లాపల్లి సత్యం, గణేష్ మాధవరావు, మునగోటి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న గోలి యలమందయ్య

గోశాలల నిర్వహణకు ప్రభుత్వ ప్రోత్సాహం

గోశాల నిర్వాహకుడు కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న కౌన్సిల్ ఛైర్మన్ పీవీ లక్ష్మయ్య

ముప్పాళ్ల న్యూస్‌టుడే: గోశాలల నిర్వహణ, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కౌన్సిల్ ఛైర్మన్ పీవీ లక్ష్మయ్య అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో అమరావతి గో సంరక్షణ శాలను శుక్రవారం ఆయన సందర్శించారు. గోశాల నిర్వాహకుడు గోగినేని కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. గోశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన పట్టణంలోని శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. క్రోసూరుకు చెందిన షరీఫ్, ఫరీద్, జానీబాషా మరో ఇద్దరు సత్తెనపల్లిలో సెకండ్ షో సినిమా చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. సినిమా అనంతరం తిరిగి స్వగ్రామం వెళుతుండగా అచ్చంపేట రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనం పంక్చరై కింద పడిపోయారు. ఫరీద్‌కు తీవ్ర గాయలయ్యాయి. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఫరీద్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైకాపాలో అంతర్గత పోరు

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి మండలంలో వైకాపా అంతర్గత రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. మండల ఇన్‌ఛార్జి ఎంపీపీ కందుల జాన్ కుమారుడు జానేష్ గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గాలకు న్యాయం జరగలేదని అగ్రకులాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. తమ కుటుంబం 30 ఏళ్లుగా కాలువ నిర్వహణ పనులు చేస్తున్నప్పటికీ వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ బాధ్యతల నుంచి తొలగించారని జానేష్ ఆరోపించారు. రూ.42 లక్షలకు పైగా బిల్లులు పెండింగ్ ఉన్నా చెల్లింపులు జరగలేదని, కుల వివక్ష కారణంగానే తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. గంటల వ్యవధిలోనే తండ్రి కందుల జాన్‌తో కలిసి జానేష్ కాసు మహేష్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి తమకు దేవుడితో సమానమని, ఎంపీపీ పదవితో పాటు పార్టీలో గౌరవస్థానం కల్పించారని పేర్కొన్నారు. గతంలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుని కల్యాణం

కారంపూడి, (మాచర్ల), న్యూస్‌టుడే : మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంలో మకర సంక్రాతిని పురస్కరించుకొని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయం నుంచి చెన్నకేశవుల స్వామిని, లక్ష్మీదేవి మిద్దెల నుంచి శ్రీ లక్ష్మీ అమ్మవారిని ఎదురుగా వచ్చి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. సింగం గణపతి, పద్మావతి, వడ్లపట్ల ఉదరు సాయికిరణ్, ప్రత్యూష దంపతులు కూర్చుని వేదమంత్రాల నడుమ కల్యాణం వైభవంగా నిర్వహించారు.

నడకకు సమయమిద్దాం

10కే నడకను ప్రారంభిస్తున్న హరిబాబు

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ): ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో నాదెండ్ల నుంచి 56 మంది ఉత్సాహంగా శుక్రవారం 10కే నడకలో పాల్గొన్నారు. నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు దీనికి పచ్చజెండా ఊపారు. ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ రోజుకొక అరగంట నడకకు కేటాయించాలని హరిబాబు సూచించారు. నడకలో వేగంగా చిలకలూరిపేటకు ముందుగా చేరుకున్న వారిని సత్కరించి బహుమతులు అందజేశారు.

ధర్మవరం చెరువులో మొసలి కలకలం

దుర్గి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ధర్మవరం చెరువులో వారం రోజుల నుంచి మొసలి హడలెత్తిస్తోంది. అప్పుడప్పుడు చెరువు నుంచి బయటకు వచ్చి కనిపిస్తుండటంతో గ్రామంలోని పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చెరువులో ఉన్న మొసలిని పట్టి ఇతర ప్రాంతానికి తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మాచర్ల అటవీ రేంజర్ విజయలక్ష్మి దృష్టికి తీసుకు వెళ్లగా విషయం తన దృష్టికి వచ్చిందని, సిబ్బందిని అప్రమత్తం చేసి పట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొసలి సంచరిస్తున్న ప్రాంతానికి దూరంగా ఉండాలని, పశువుల కాపరులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా ఉంటే మంచిదన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, న్యూస్‌టుడే: క్రోసూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వరిధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. క్రోసూరు మండలంలో రెండు, అచ్చంపేట మండలంలో ఒకటి, బెల్లంకొండ మండలంలో మూడు కేంద్రాలు, రాజుపాలెం మండలం పరిధిలో 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో సాగర్ కాలువ చివరి భూముల్లో వరి ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజనులో వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 5,380 హెక్టార్లలో వరి వేశారు. తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉన్న ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మార్కెటింగ్ సిబ్బంది ఆయా రైతుల అభ్యర్థన మేరకు కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం పరిశీలిస్తున్నారు. ఈ-పంట నమోదు చేసిన రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం గోనె సంచులు, వాహన సౌకర్యం కల్పిస్తుంది. సరకును కేంద్రం నుంచి ఆయా మిల్లర్ల వద్దకు చేరుస్తున్నారు. మిల్లర్ల వద్దకు చేరిన 48 గంటల్లో రైతుల ఖాతాకు డబ్బు జమ అవుతోంది.

◆ క్రోసూరు మండలంలో 700 మెట్రిక్ టన్నులు, బెల్లంకొండ మండలంలో 173 మెట్రిక్ టన్నులు, అచ్చంపేటలో 31 మెట్రిక్ టన్నులు చొప్పున ధాన్యం కొనుగోలు చేశామని మార్కెటింగ్ శాఖ ఉద్యోగి నాంచారయ్య తెలిపారు.

ధాన్యం బస్తాల వివరాలు నమోదు చేస్తున్న మార్కెటింగ్‌శాఖ ఉద్యోగులు

అభివృద్ధి పథంలో మాచర్ల

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రామిశెట్టి సైదారావునాయుడు, మాజీ జడ్పీటీసీ శేరెడ్డి గోపిరెడ్డి, సర్పంచి దేరంగుల కోటేశ్వరరావు, రూరల్ ఎస్సై సంధ్యారాణి, డాక్టర్ బృంగ ప్రసన్న, రాయవరం సర్పంచి కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సైదారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కొండ హుస్సేన్ యాదవ్, జనసేన నాయకులు నజూర్‌యాదవ్, జూకూరి అరుణ, సత్యం, రాంబాబుయాదవ్, పిచ్చయ్యయాదవ్, మోహన్‌రావు యాదవ్, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కూటమి నాయకులు

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

తూర్పు కాపు/గాజుల కాపు అవివాహితులకు సువర్ణావకాశం
నేడు, రేపు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, తూర్పు కాపు/ గాజుల కాపు అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఈనాడు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026 శనివారం), రేపు (18 జనవరి 2026 ఆదివారం)ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్ ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80086 21414ను సంప్రదించవచ్చు. ఫోన్/ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నవారు వధూవరుల బయో డేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

5న చలో దిల్లీ

సీతంపేట: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 5న చలో దిల్లీ కార్యక్రమం అఖిల భారత జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐజేఏసీటీవో) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చలో దిల్లీ-మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమం చేపడతామన్నారు. టెట్ మినహాయింపు, పాత పెన్షన్ పునరుద్ధరణ, విలీన ప్రక్రియ నిలిపివేత, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, బోధనేతర పనుల రద్దు వంటి డిమాండ్లతో దీన్ని చేపడుతున్నామన్నారు. రాష్ట్ర గిరిజన విభాగం కో కన్వీనర్ కె.ప్రమోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మురళీబాబు, నాయకులు ఉన్నారు.

మీ సామగ్రి.. మా బాధ్యత

ప్రయాణికులకు అండగా రైల్వేశాఖ

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో సామగ్రి, బ్యాగులు, విలువైన వస్తువులు మరిచిపోతుంటారు. కొందరు రైలెక్కాక మరి దొరకదేమోనన్న ఆలోచనతో వదిలేస్తున్నారు. మరికొందరు కంగారులో బండి దిగి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆ పరిస్థితి లేకుండా తామే తీసుకొచ్చి అందిస్తామని చెబుతోంది రైల్వే శాఖ. మీ సామగ్రి.. మీ బాధ్యత.. అని కాకుండా.. మీ సామగ్రి బాధ్యత మాదే అని పేర్కొంటోంది.

బ్రహ్మపురకు చెందిన ఓ యువకుడు ముఖాముఖి కోసం హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బంధువుల ఇంటికని విజయనగరంలో రైలు దిగాడు. తొందరలో విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు విలువైన వస్తువులు మరిచిపోయాడు. అప్రమత్తమయ్యేసరికే బండి కదిలిపోవడంతో రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు వివరాలు పరిశీలించి, కొన్ని గంటల్లోనే అందించారు.

విజయవాడ వెళ్లేందుకు ఓ కుటుంబం విజయనగరం స్టేషన్‌కు వచ్చింది. రైలు ఎక్కే హడావుడిలో ఓ బ్యాగు వదిలేశారు. కొంతదూరం వెళ్లాక 139కు కాల్ చేసి విషయం చెప్పారు. హెల్ప్‌లైన్ సిబ్బంది సమాచారంతో సిబ్బంది బ్యాగును తీసుకుని విశాఖ పంపించి, అక్కడ అందేలా చూశారు.

మర్చిపోతే ఏం చేయాలి..

రైలు.. స్టేషన్లలో లగేజీ, విలువైన వస్తువులు మర్చిపోతే సమీపంలోని జీఆర్పీ లేదా ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేయాలి. వారు స్పందించకపోతే ఉన్నతాధికారులకు చెప్పొచ్చు. రైలులో ప్రయాణిస్తుంటే 139ను సంప్రదించవచ్చు. వివరాల ఆధారంగా సకాలంలో వస్తువులు చేరేలా చూస్తారు.

మర్చిపోయిన వస్తువులు ప్రయాణికుడికి అందిస్తున్న ఆర్పీఎఫ్ అధికారి

వీడియో కాల్..

139ను సంప్రదిస్తే నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. పేరు, చరవాణి నంబరు, రైలు పేరు, బెర్తు సంఖ్య తదితర వివరాలు చెప్పాలి. వారు ప్రయాణికుల సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తెలియజేస్తారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగి వస్తువులను గుర్తిస్తారు. సరిపోల్చడానికి వీలుగా వీడియో కాల్ చేస్తారు.

అప్రమత్తత అవసరం..

రైలు ప్రయాణాల్లో చాలామంది చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలను మరిచిపోతుంటారు. కొందరు బ్యాగులను వదిలేస్తారు. అప్రమత్తంగా ఉంటే ఆ పరిస్థితి ఉండదు. ఒకవేళ పొరపాటున వదిలేసినా మేం అండగా ఉంటున్నాం. గతేడాది జనవరి నుంచి ఈనెల 13 వరకు 139 మంది ప్రయాణికులు ఇలా వస్తువులు పోగొట్టుకున్నారు. రూ.28.34 లక్షల విలువైనవి తిరిగి అందించాం.

– ఆర్కే రావు, రైల్వే ఇన్‌స్పెక్టర్

ఆ ఊళ్లో వీధికో వకీల్‌సాబ్

గ్రామంలో 16 మంది ప్లీడర్లు

– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

మనం ఒకే గ్రామంలో అధిక శాతం ఉపాధ్యాయులు, సైనికులు, పోలీసులు ఉండడం చూస్తుంటాం. కానీ ఈ గ్రామంలో మాత్రం న్యాయవాదులు ఎక్కువ. ఆ వృత్తిపై ఉన్న మక్కువతో పదుల సంఖ్యలో దీన్ని ఎంచుకుంటున్నారు పాలకొండ మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన పలువురు.

2011 జనాభా లెక్కల ప్రకారం లుంబూరు గ్రామ జనాభా 1,872. మొత్తం 472 గృహాలున్న ఈ గ్రామంలో 16 మంది న్యాయవాదులుగా ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో మొట్టమొదటిగా లోలుగు అప్పారావు న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. ఈయన ప్రేరణతో పలువురు ఈ కోర్సు పూర్తిచేసి వృత్తిలో రాణిస్తున్నారు. లోలుగు నాగభూషణరావు ప్రస్తుతం శ్రీకాకుళంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. కవల సోదరులైన కిమిడి సూర్యకుమార్, చంద్రకుమార్ ఏపీపీలుగా సేవలందిస్తున్నారు. గ్రామ సర్పంచిగా ఉన్న తిర్లంగి ఉపేంద్రకుమార్ సైతం న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఇలా ఈ వృత్తిలో గ్రామానికి చెందిన రౌతు అన్నాజీరావు, ఎన్.సత్యనారాయణ, ఎస్.సత్తిబాబు, ఎల్.సత్తిబాబు, వి.లక్ష్మున్నాయుడు, వి.కిరణ్, టి.సుధాకర్, ఎల్.రామచంద్ర, బి.రామలక్ష్మి, ఎం.సంతోష్, కృష్ణవేణి రాణిస్తున్నారు.

ఏపీపీలుగా పనిచేస్తున్న సూర్యకుమార్, చంద్రకుమార్

వృత్తిపై మక్కువ ఎందుకంటే..

గతంలో గ్రామంలో అధికంగా వివాదాలు చోటుచేసుకునేవి. తరచూ పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఎన్నికల సమయాల్లో ఎక్కువగా ఘర్షణలుండేవి. ఇలా పలు పరిస్థితుల మధ్య నలిగిపోయిన యువత.. ఊరిని మార్చేందుకు న్యాయవాదులు అయ్యేందుకు నిర్ణయించుకున్నారు. దీంతోపాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉండి, తమవంతు ప్రజలకు న్యాయసేవలు అందించే అవకాశం ఉంటుందని వీరంతా చెబుతున్నారు.

నదీతీరంలో సందడి కనుమ

మండలంలోని అరసాడ గ్రామస్థులు ఏటా సువర్ణముఖినది తీరంలో కనుమ పండగను నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి చిన్నాపెద్దా అంతా కలిసి నది ఒడ్డుకు చేరుకున్నారు. యువత ఆట పాటలతో సందడి చేశారు. – న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం

కబడ్డీ.. కబడ్డీ..

మండలంలో తాడికొండలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. ప్రజలతో మమేకమై పండగ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

పచ్చని గూడు చెదిరింది.. పట్టాలపై ప్రాణం వీడింది..

వివాహమై ఆరేళ్లయిన నేపథ్యంలో..

కలకాలం ఒకటిగా సాగాలని.. ఆరేళ్ల కిందట ఏడడుగులు వేశారు. ఆమె ఒక్క తప్పటడుగు.. పచ్చని జీవితంలో మంటలు రేపింది. కడివెడు పాలలో ఉప్పు చుక్క వేసినట్లయింది. తెలిసీతెలియని తప్పిదం తనువు చాలించేంత వరకు తీసుకెళ్లింది. సౌభాగ్యంతో ఇంట కాలు పెట్టిన వేళ ఆ ఇంటి సంతోషం పట్టాలపై ప్రాణం తీసుకుంది తన నుదుటిన రాతను రాసుకుంది. మాయ వల.. మమతానుబంధాలను దూరం చేసింది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, కొత్తవలస[?] గ్రామీణం

పార్వతీపురం-సీతానగరం స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గురువారం రైల్వే పోలీసులు మహిళ మృతదేహాన్ని గుర్తించారు. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చేసి ప్రాణాలు తీసుకుంది. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి శవాగారానికి తరలించారు. శుక్రవారం మృతురాలి బంధువులు ఆనవాళ్లను చూసి గుర్తించారు. ఇదే విషయాన్ని వారు రైల్వే పోలీసులకు తెలియజేశారు. మండల మేజిస్ట్రేట్ సమక్షంలో ధ్రువీకరిస్తే తప్ప ఆమె ఎవరనే విషయాన్ని తాము తెలియజేయలేమని రైల్వే పోలీసు వర్గాలు చెప్పాయి.

చట్ట ప్రకారం వివాహం జరిగి ఏడేళ్లలోపు మరణిస్తే మండల మేజిస్ట్రేట్ సమక్షంలో శవపంచనామా నిర్వహించి, గుర్తించాల్సి ఉంటుందని రైల్వే పోలీసులు చెబుతున్నారు. మృతురాలికి పెళ్లి జరిగి ఆరేళ్లు అయ్యింది. అందువల్ల తహసీల్దారు సమక్షంలో గుర్తించాల్సి ఉంటుంది. ఈ కారణంగానే వివరాలు వెల్లడించడం లేదు. స్వగ్రామంలో ఆమె మరణానికి సంబంధించి భిన్నవాదనలు వినిపించాయి. భర్త ఓ చిరుద్యోగి. ఈ దంపతులకు సంతానం లేదు.

కలపకు కాళ్లొస్తున్నాయి..

● నకిలీ ఎన్‌వోసీలతో నరికివేత

– న్యూస్‌టుడే, భామిని

ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన కొందరు ప్రభుత్వ సిబ్బంది అక్రమ సంపాదన ఆశతో అడ్డదారుల్లో వెళ్తున్నారు. పలువురు కర్రల వ్యాపారులతో చేతులు కలిపి మండలంలోని వివిధ గ్రామాల్లో తప్పుడు పత్రాలతో అనుమతులు ఇస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న సంఘటనలు భామిని మండలంలో చోటుచేసుకుంటున్నాయి.

మండలంలోని సింగిడి గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు ప్రదేశంలో అక్రమంగా రవాణా చేసేందుకు కలప నిల్వ ఉంచి.. అనంతరం లారీల ద్వారా జిల్లా దాటిస్తున్నారు. కొందరు వ్యాపారులు రెవెన్యూ శాఖ అధికారులకు కావాల్సిన పనులు చేసిపెడుతూ వారిని మచ్చిక చేసుకుంటున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి యథేచ్ఛగా టేకు, జీడిమామిడి తదితర చెట్లను నరికేస్తున్నారు. రైతుల భూముల్లో ఇవి ఉన్నట్లు చూపి వివిధ ప్రాంతాల్లో ఉన్న చెట్లను నరికేస్తున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇటీవల అక్రమంగా కలప తరలిస్తున్న పలు వాహనాలను పట్టుకున్న అధికారులు నగదు వసూలు చేసి వాటిని విడిచిపెట్టేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించడం, చెట్ల నరికివేత, స్థానిక గిరిజనులను బెదిరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

సింగిడి సమీపంలో తరలించేందుకు సిద్ధం చేసిన టేకు దుంగలు

అనుమతుల మేరకే..

విషయాన్ని భామిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణి ప్రభాకర్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో చెట్లను నరికేందుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు ఇచ్చామన్నారు. అనుమతుల మేరకే కలపను తరలిస్తున్నట్లు వివరించారు.

కరుణించు కోటదుర్గమ్మ

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ శుక్రవారం స్వర్ణకాంతులతో దర్శనమిచ్చారు. అమ్మవారిని బంగారు ఆభరణాలు, కిరీటంతో ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మను దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

ఆనందం.. అంబరం

స్కై సైక్లింగ్‌లో యువతి

సీతంపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి నేపథ్యంలో పర్యాటక ప్రదేశాలు కిటకిటలాడాయి. సీతంపేట మన్యంలో ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో పర్యాటకులు శుక్రవారం సందడి చేశారు. బోటింగ్, కయాకింగ్ చేస్తూ, ఆనంద వేదిక వద్ద సినిమా పాటలకు స్టెప్పులేస్తూ హుషారుగా గడిపారు. ఊగే వంతెనపై నడుస్తూ, సాహస క్రీడలు ఆడుతూ, 5డీ థియేటర్‌లో ప్రదర్శనలు వీక్షిస్తూ తన్మయం చెందారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, ఈతమానుగూడ, బెనరాయి జలపాతాల వద్ద జలకాలాడారు. ఆడలి, జగతిపల్లి వ్యూ పాయింట్‌ల వద్ద ఆనందంగా గడిపారు.

కలల మడి.. కన్నీటి సుడి

జాయింట్ ఎల్పీఎంలతో ఇబ్బందులు

పాలకొండ ప్రాంతానికి చెందిన అప్పారావుకు ఒకే గ్రామ పరిధిలో 1.85 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. గతంలో ఆ విస్తీర్ణం అంతా ఒకే ఎల్పీఎంలో ఉండేది. రీ సర్వే తర్వాత నాలుగైదు జాయింట్ ఎల్పీఎంలు ఉత్పన్నమయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో సొంత భూమి అమ్మకానికి పెట్టారు. కొనుగోలుకు ముందుకొచ్చిన వారు విషయం తెలిశాక వెనక్కి తగ్గారు. దీంతో ఆయన అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

– ఈనాడు, పార్వతీపురం మన్యం

గత ప్రభుత్వం భూముల రీసర్వే ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయలేకపోయింది. ఇందులో తప్పిదాల వల్ల జాయింట్ ఎల్పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లతో కొత్త చిక్కులు ఏర్పడ్డాయి. దీనివల్ల రైతులు తమ భూములను అమ్ముకోలేకపోతున్నారు. బ్యాంకుల నుంచి అవసరమైన రుణం పొందలేకపోతున్నారు. చివరకు అన్ని అర్హతలుండీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

రీ సర్వే చేస్తున్న ఉద్యోగులు

రుసుము చెల్లిస్తే సేవలు.. సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు జేఎల్పీఎంల విభజనకు దరఖాస్తు చేసుకోవచ్చని రెండు జిల్లాల సర్వేశాఖ అధికారులు తెలిపారు. రూ.50 రుసుము చెల్లించాలన్నారు.

రెండు జిల్లాల్లో ఇలా.. (సుమారు)

అంశం	విజయనగరం	మన్యం
జేఎల్పీఎంలు	లక్ష	50 వేలు
ఫిర్యాదులు	27,412	14,591
పరిష్కారం	26,504	13,556
పెండింగ్	908	1,035

సమస్యలివీ..

- జాయింట్ ఎల్పీఎం అంటే ఒకే సర్వే నంబరులో ఎక్కువ మంది రైతుల భూముల ఖాతాలు కలిపి ఉండటం. దీంతో ఆన్‌లైన్‌లో ఒకే భూమి అందరికీ కనిపిస్తుంది. లేదా కొందరిది వేరొకరికి చూపిస్తుంది.
- గతంలో జరిగిన రీ సర్వేలో ఒకచోట అయిదు సబ్ డివిజన్లు ఉంటే, దానంతటినీ ఒక మడిగా పరిగణించి డ్రోన్ మ్యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అందులో గట్లు లేకపోవడంతో ఒకే ఎల్పీఎంగా గుర్తించారు. ఆ ఎల్పీఎంకి ఒకే రైతు అనుభవదారుడిగా ఉంటారు. కానీ వెబ్‌ల్యాండ్‌లో అలా ఉండవు. అందులో కొన్ని సబ్ డివిజన్లలో ఒకరి పేరు, మరికొన్ని సబ్ డివిజన్లలో ఇంకొందరి పేర్లు కనిపిస్తాయి.
- సకాలంలో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి.
- గతంలో పక్కపక్క పొలాలను మారకం చేసుకునేవారు. అవి రెవెన్యూ దస్త్రాల్లో మార్చలేదు. ఇలా చాలావరకు ఇలానే జాయింట్ ఎల్పీఎంలు పుట్టుకొచ్చాయి.
- తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత పిల్లలకు వారి భూమి వారసత్వంగా దక్కుతుంది. ఇద్దరు పిల్లలుంటే వారి పేర్లు వెబ్‌ల్యాండ్‌లో కనిపిస్తాయి. అయితే ఎవరికెంతనేది ఉండదు. ఇలా కొందరు చిక్కుకున్నారు.

నేడు కొటారుబిల్లి కనకదుర్గమ్మ జాతర

కొటారుబిల్లి(గంట్యాడ), న్యూస్‌టుడే: భక్తుల కొంగుబంగారం కొటారుబిల్లి కనకదుర్గమ్మ జాతరకు గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా ముక్కనుమ నాడు ఈ వేడుక నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నూతన ఆలయం నిర్మించాక తొలి జాతర కావడంతో గ్రామస్థులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలివస్తారు. కనీసం 50 వేలమంది పాల్గొంటారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వేడుక ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

సైబర్ ఉచ్చు.. చిక్కితే చిత్రహింసలే

● మయన్మార్ నుంచి వచ్చిన బాధితుల ఆవేదన ఇది

ఈనాడు, విజయనగరం

'విదేశాల్లో కొలువుల ఆశచూపి సామాజిక మాధ్యమాల్లో వల విసురుతారు. రూ.లక్షల్లో వేతనం చెల్లిస్తామంటూ ప్రలోభపెడతారు. అలాంటి ప్రకటనలు చూసి నమ్మి వారి ఉచ్చులో పడితే చిత్రహింసలకు గురి కావాల్సిందే. పైగా ప్రాణాలతో బయటపడే అవకాశాలూ తక్కువ..' అని సైబర్ నేరగాళ్లకు చిక్కుకుని మయన్మార్ నుంచి బయటపడిన విజయనగరానికి చెందిన ఇద్దరు సోదరులు తాముపడ్డ అవస్థలు చెప్పారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో ఇంటికి చేరిన వీరు 'ఈనాడు'కు తమ అనుభవాలను వివరించారు.

- ఇంటర్ తర్వాత ప్రత్యేకంగా కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన ఈ సోదరులు ఇన్‌స్టాగ్రామ్‌లో విదేశాల్లో కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల కొలువుల ప్రకటన చూసి ఆకర్షితులయ్యారు. కడప జిల్లాకు చెందిన స్నేహితులతో కలిసి తొలుత గత మే 16న ఒకరు, వారం తర్వాత మరొకరు థాయ్‌లాండ్ వెళ్లారు. సైబర్ నేరగాళ్ల ముఠా అక్కడ వారం పాటు హోటల్‌లో ఇచ్చిన ఆతిథ్యానికి సంబరపడిపోయారు. ముందు ఒక బృందాన్ని కిడ్నాప్ తరహాలో మయన్మార్ తరలించారు. కి.మీ. దూరం అడవుల్లో నడిపించారు. చేతులపై బ్యాట్లతో కొట్టారు.
- ఆ తర్వాత మరో బృందంలో మరొకరు వెళ్లారు. ఇలా మన దేశం నుంచి తీసుకెళ్లిన వారందరినీ మయన్మార్‌లోని ప్రత్యేక భవనాల్లో బంధించారు. వారికి ఇన్‌స్టాగ్రామ్‌లో నూతన ఐడీలు సృష్టించి సైబర్ నేరాలు చేయించారు.

బిడ్డలిద్దరూ వస్తారనుకోలేదు..

మాది పేద కుటుంబం. భర్త మృతితో ఇద్దరు కుమారులను ఉన్నంతలో చదివించా. విదేశాల్లో నెలకు రూ.1.20 లక్షల ఉద్యోగమంటే ఆశపడ్డారు. ఇప్పట్లో నా బిడ్డలు వస్తారనుకోలేదు. కొడుకులిద్దరూ నా ఒడికి చేరుకునేలా చేసిన మంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు... అని బాధితుల తల్లి పేర్కొన్నారు.

రెండో చరవాణే కాపాడింది..

పరిస్థితి అర్థమైన తర్వాత ఎలా బయటపడాలో తెలియక భయంతో వణికిపోయారు. వారి వద్ద చరవాణులను నేరగాళ్లు స్వాధీనం చేసుకున్నారు. సోదరులిద్దరూ తీసుకెళ్లిన రెండు చరవాణుల్లో ఒకటి అప్పగించి. రెండోది వారి కంట పడకుండా భద్రపర్చుకున్నారు. వీడియో కాల్ ద్వారా తల్లికి అక్కడ బందీలైనట్లు వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు సైతం మొర పెట్టుకున్నారు. లొకేషన్ షేర్ చేశారు. ఈ విషయం తెలిసి రెండో చరవాణిని దుండగులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర మంత్రి చొరవ చూపి ఆ దేశ రాయబారులతో సంప్రదింపులు జరిపించడంతో నవంబరు 18న మయన్మార్ పోలీసులు నేరగాళ్ల ఉచ్చు నుంచి వారికి విముక్తి కల్పించారు. రెండో చరవాణి సాయంతో మిగతావారి ఉనికి గుర్తించి బయటకు తీసుకురాగలిగారు. విదేశాంగ అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత దిల్లీకి, అక్కడ నుంచి ఇంటికి చేరారు.

సంక్రాంతి.. సూపర్ సిక్స్

జామి మండలం రామయ్యపాలెం గ్రామంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి సంక్రాంతి సంబరాల్లో భాగంగా తన ఇంటి ముందు వేసిన రంగవల్లి ప్రత్యేకంగా నిలిచింది. సీఎం చంద్రబాబునాయుడు బొమ్మతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇలా వివరించారు. సూపర్ సిక్స్ ప్రయోజనాలు కళ్లకు కట్టారు. - న్యూస్‌టుడే, జామి

ఆకట్టుకున్న కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ముగ్గు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు క్లాసిఫైడ్స్
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
అంత్యక్రియలు,
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

సంబరం.. అంబరం

ఆటలు.. పాటలు.. వేషధారణలు.. ఊరేగింపులు.. పోటీలు.. మొక్కులు.. కోలాటాలు.. నృత్య ప్రదర్శనలు.. ఇలా ఒక్కటేమిటి గ్రామగ్రామాన ఒకటే సందడి.. ఏ వీధికెళ్లినా.. ఏ కూడలిలో ఉన్నా సంక్రాంతి శోభ ఉట్టిపడింది.. ఉమ్మడి జిల్లాలో ఊరూవాడా సంబరాలు మిన్నంటాయి. బాడంగి, కొత్తవలస, పాలకొండ మండలాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అలరించారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం, పాలకొండ, బాడంగి, కొత్తవలస

సంక్రాంతి సందర్భంగా కొత్తవలస మండలం మంగళపాలెంలో నాగ సాధువుల వేషధారణలో పలువురు సందడి చేశారు. గ్రామానికి చెందిన శివయ్య సేవా పీఠం ఆధ్వర్యంలో భక్తులు శివలింగంతో ఊరేగింపు నిర్వహించారు. అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి రామాలయం నృత్యాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. – న్యూస్‌టుడే, కొత్తవలస

వీరఘట్టం మండలం కిమ్మి గ్రామంలో విలయ ప్రళయ మూర్తి గీతానికి నృత్యం చేస్తున్న గ్రామస్థులు

మంగళపాలెం కూడలిలో పాతకాలపు పనిముట్ల ప్రదర్శన

బాడంగి మండలం గజరాయునివలసలో కోలాటం పోటీలు

పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో ఆకట్టుకున్న వేషధారణలు

కిమ్మిలో..

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో కొలువుదీరిన స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వాదంతో పాటు తీర్థప్రసాదాన్ని అందించారు.

జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులకు ఆశీర్వదిస్తున్న అర్చకులు, చిత్రంలో అధికారులు

మంత్రి కొండపల్లి ఇంట సంక్రాంతి శోభ

గంట్యాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వగ్రామంలో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. మాజీ ఎంపీ కొండపల్లి పైడితల్లినాయుడు కుటుంబ సభ్యులంతా కలిసి ఒకేచోట పండగ నిర్వహించుకున్నారు. పెద్దలకు కొత్త దుస్తులు చూసి పొత్తర్లు ఇచ్చారు. అందరూ ఫొటోలు దిగి ఆనందంగా గడిపారు. అనంతరం తాటిపూడి జలాశయంలో కుటుంబ సభ్యులంతా కలిసి బోటు షికారు చేశారు. మాజీ ఎమ్మెల్యే డా.కేఏ.నాయుడు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, సాంబమూర్తి, సంతోష్, రఘుమండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోటులో విహరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	162	294	304

విద్యలనగరానికి.. పచ్చని తోరణం

నగరపాలికలో భారీగా మొక్కల పెంపకం | రక్షణకు ట్రీగార్డుల ఏర్పాటు

అవకాశాలివీ..

❖ నగరంలో 12 వరకు భారీ సెంటర్ డివైడర్లు, 100 వరకు ఉద్యానాలున్నాయి. మరో 12 చెరువులున్నాయి. వీటిల్లో నాటేందుకు అవకాశం ఉంది.

❖ కోమటి చెరువు, పెద్ద చెరువు, బుచ్చెన్నకోనేరు, అయ్యకోనేరు, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో సుందరీకరణ చర్యల్లో భాగంగా పచ్చదనాన్ని పెంచాలి.

❖ ఉడాకాలనీ, ప్రదీప్‌నగర్, అయ్యన్నపేట, కొత్తపేట నీళ్ల ట్యాంకు దారి, ఐదిరా నగర్, కంటోన్మెంట్, కలెక్టరేట్ నుంచి కామాక్షినగర్ మీదుగా గుర్ల రోడ్డు, బీసీ కాలనీ, వైఎస్సార్ నగర్, పోర్టు సిటీ పాఠశాల ప్రాంతాల్లో కొత్తగా వేయనున్నారు.

❖ ఇప్పటికే ఉద్యాన శాఖను ఏర్పాటు చేశారు. ఏడీగా సంతోష్‌కుమార్ ఇటీవల విధుల్లో చేరారు. పని చేసేందుకు 44 మంది సిబ్బందిని సైతం నియమించారు. నిత్యం రెండు ట్యాంకర్లతో నీళ్లు పోస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం జిల్లా కేంద్రాన్ని పచ్చగా మార్చుతున్నారు.. ఇప్పటికే తాగునీటి కొరతను అధిగమించేందుకు అత్యాధునిక రీచార్జ్ పిట్లను ఏర్పాటు చేశారు.. మరోవైపు వేడిని, కాలుష్యాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీగా మొక్కలు నాటుతున్నారు. తాజాగా వాటికి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

40 ప్రాంతాల్లో..

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం కరవైంది. వేల్లో మొక్కలేసినట్లు చూపించినా.. క్షేత్రస్థాయిలో కానరాలేదు. ట్రీగార్డులు, శిలాఫలకాల పేరిట పెద్దఎత్తున దోచేశారనే ఆరోపణలొచ్చాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. నగరపాలికలో 40 ప్రాంతాలను గుర్తించింది. గతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనం- మనం కార్యక్రమం కింద ఆయా చోట్ల 50 వేల వరకు నాటాలని నిర్ణయించారు. ఇప్పటికే 3 వేల వరకు వేశారు.

రక్షణ ఇలా..: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాల కింద పెద్దచెరువు, కంటోన్మెంట్ ఉడాకాలనీ, ఎత్తుబ్రిడ్జి, బస్‌షెల్టర్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలేశారు. వాటిని రక్షించేందుకు ఇటీవల 1000 వరకు ట్రీగార్డులు చేయించారు. ఒక్కోదానికి రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

నగరంలోని పెద్దచెరువు సమీపంలోని మొక్కలకు ట్రీగార్డులు పెడుతున్న కార్మికులు

పండ్ల రకాలే ఎక్కువ..

ఇటీవల 1000 ట్రీగార్డులు వచ్చాయి. 50 వరకు పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేశాం. ప్రాంతాలకు అనుగుణంగా మిగిలినవి పెడతాం. కాలుష్యం తగ్గించడం, పచ్చదనం, నీడ పెంపులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే వర్షాకాలం నాటికి వివిధ వారీగా 50 వేల వరకు మొక్కలు నాటుతాం. ఇందులో పండ్ల రకాలే అధికంగా ఉన్నాయి. ఇప్పుడు వేల వరకు వచ్చాయి. – ప్రసాద్, ఈఈ, నగరపాలక సంస్థ

గతంలో దోచేశారిలా..

★ గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'జగనన్న హరిత నగరాలు' కార్యక్రమం కింద 2,650 మొక్కలకు గానూ రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు.

★ మెగా ప్లాంటేషన్ ద్వారా 10 వేలు నాటామని పేర్కొన్నారు. ఇవేవీ క్షేత్రస్థాయిలో కానరాలేదు.

★ కేవలం ట్రీగార్డుల కోసమే రూ.18.20 లక్షల వరకు వెచ్చించారు. ★ నామ ఫలకాల ఏర్పాటుకు మరో రూ.8.75 లక్షలను గుత్తేదారుకు ముట్టజెప్పారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలపై నిఘా

ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

విద్యార్థి దశలో ఎంతో కీలకమైన ఇంటర్ విద్యలోనే ఉన్నత లక్ష్యానికి బాటలు పడతాయి. అందుకే విద్యార్థులు పుస్తకాలతో కుస్తీలు పడుతుంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొత్త సంస్కరణలు చేపడుతోంది. ఇప్పటికే ఉత్తమ ఫలితాల సాధనకు 'సంకల్పం' పేరుతో వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. మరోవైపు ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వృత్తి విద్య(ఒకేషనల్), ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జనరల్(ఎంపీసీ, బైపీసీ) వారికి ప్రయోగ పరీక్షలు జరుగనున్నాయి. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా నిఘా నీడలో జరిపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు పెడుతున్నారు.

జిల్లాలో ముందుగా వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. సంబంధిత విద్యార్థులకు 44 కేంద్రాలు, సాధారణ సబ్జెక్టుల వారికి 41 కేంద్రాలు కేటాయించారు. జనరల్‌లో 1,916 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 2,597 మంది హాజరుకానున్నారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా లైవ్ స్ట్రీమింగ్ చేసి కలెక్టరేట్, ఇంటర్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేస్తారు. తద్వారా ఎక్కడా అవకతవకలు, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీఐఈవో వై.నాగేశ్వరరావు తెలిపారు.

- జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 14
- కేజీబీవీలు, సాంఘిక, గిరిజన సంక్షేమ కళాశాలలు: 28
- మోడల్ స్కూళ్లు: 4
- ప్రైవేటు కళాశాలలు: 36
- ప్రథమ, ద్వితీయ విద్యార్థులు: 17,530
- ప్రయోగ పరీక్షలకు హాజరయ్యేవారు: 7,362 మంది

శివారు ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షణ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి నేపథ్యంలో నేరాల నియంత్రణకు డ్రోన్లను వినియోగిస్తున్నామని విజయనగరం ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రద్దీ ప్రాంతాలు, శివారు గ్రామాలపై దృష్టిపెట్టామన్నారు. సంబంధిత పుటేజీల సాయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, జూదం ఆడినా, పందేలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈత రాక.. ఊపిరి వదిలి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: కాలువలో పడి ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన గరుగుబిల్లి మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై ఫకృద్దీన్ వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్ సమితికి చెందిన సూర్యనారాయణ(33) సుంకి పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ పార్కు సమీపంలో ఉన్న ఇటుక బట్టీలో పనిచేస్తున్న చెల్లిని చూసేందుకు వచ్చాడు. శుక్రవారం ఉదయం బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తూ నాగావళి నది ఎడమ కాలువలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై రాజేష్ వివరాల ప్రకారం.. పెదంకలాం గ్రామానికి చెందిన చింతాడ సంతోష్(29) వ్యాపారం చేసేవాడు. గతనెల 28న పార్వతీపురం నుంచి ఇంటికి వెళ్తూ నర్సిపురం శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు స్పందించి విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ ఇళ్లన్నీ కన్నీళ్లతో నిండిపోయాయ్

పండగ వేళ సంతోషం నిండాల్సిన ఆ ఇళ్లన్నీ కన్నీళ్లతో నిండిపోయాయి. గత రెండు రోజుల్లో వేర్వేరు ఘటనల్లో జిల్లాకు చెందిన ఆరుగురు మృత్యువాత పడడంతో తీవ్ర విషాదం నెలకొంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

మక్కువ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మక్కువ మండల కేంద్రానికి చెందిన డోల మధు(19) మృతిచెందాడు. ఎస్సై వెంకటరమణ వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే మధు, కొయ్యాన కార్తీక్, గూనాన కార్తీక్ గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై ములక్కాయవలస బయలుదేరారు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పింది. మధు తలకు తీవ్రగాయం కాగా మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మధును మక్కువ పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మధు (పాతచిత్రం)

వేపాడ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వలస కూలీ మృతిచెందిన ఘటన వేపాడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. క్వారీలలో వలస కూలీగా పనిచేస్తున్న నర్సిపల్లిమెట్ట ప్రాంతానికి చెందిన గోపు రామదాసు(27) సోదరుడు రామచంద్రరావుతో ఆహారం కోసం ద్విచక్రవాహనంపై బొద్దాం గ్రామానికి వెళ్లాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తిరిగి వస్తుండగా కోనేరు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో రామదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. రామచంద్రరావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత తండ్రి రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వల్లంపూడి ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

పెనుబాకలో తాపీమేస్త్రీ..

రాజాం, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని తాపీ మేస్త్రీ మృతిచెందిన ఘటన రాజాం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెనుబాక గ్రామానికి చెందిన మూకళ్ల రాము(44), బలగ శ్రీరాములు శుక్రవారం బొద్దాం సమీపంలో జరిగిన ఉత్సవాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ స్వగ్రామం వస్తుండగా.. పెనుబాక సమీపంలో రాజాం పురపాలిక పరిధిలోని కొత్తవలసకు చెందిన గేదెల శేఖర్ వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. శ్రీరాములు క్షేమంగా బయటపడగా, రాము, శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాము అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివరాలు సేకరిస్తున్నట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృత్యువాత

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన విజయనగరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ చౌదరి వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఆర్‌జేవీ కాలనీకి చెందిన ఎస్.సత్యం(64) అక్కడే సెక్యూరిటీగార్డుగా పనిచేసేవారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని విజయనగరం వచ్చారు. పండగ సందర్భంగా బంధువుల ఇంటికని వీటీ.అగ్రహారానికి నడిచి వెళ్తుండగా.. ఎత్తువంతెన సమీపంలోని ఎంఆర్‌ఎఫ్ టైర్ల దుకాణం వద్ద ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆయన కుమారుడు ఎస్.గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహన చోదకుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామన్నారు.

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ICAS ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్, జ్యోతిష్యంలో డిప్లొమా కోర్సులు నేర్పబడును అడ్మిషన్లు ప్రారంభం సెంట్రల్ స్కూల్ బాలాజీనగర్ VZM 9966666659, 9394789246

REAL ESTATE

FLAT FOR SALE

అయ్యకోనేరు దక్షిణ గట్టు, ఉత్తర గట్టు వద్ద మరియు ధర్మపురి 80Ft. రోడ్డుకు అతి దగ్గరలో ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. 7995588192.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

HOUSE FOR SALE

Independent House for Sale 267 Sq.Y N/F, Ground / First Floor, at K.L.Puram, VZM C: 8074031348, 9705563456.

విజయనగరం ప్రియనగర్ కాలనీ D మార్ట్‌దగ్గర 167 (30x50) గజాలు G+2 ఉత్తరం ఫేస్ ఇల్లు అమ్మకం. SBI బ్యాంక్‌లోన్ సౌకర్యం ✆ 9441749727.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE

CMR Layout 267 Sq.Y (40X60) S/F, Vuda Site for Sale,. Near to Vizag Road, Vizianagaram C: 8074031348, 9705563456.

200 Sq.y. East Facing Plot in SVN Layout Near Saraswati Temple, Vizianagaram. Direct Parties only. ✆ 9121782266.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Newly Launched Commercial Venture at Bhogapuram all Facings & 366 Sq.Yds. Tagarapuvalasa "Y" Jn. towards Airport Road. Suitable for all types of Business. 9992273747.

విశాఖలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చుట్టు ప్రక్కల అప్రూవ్డ్ ఇండ్ల స్థలాలు బ్యాంక్‌లోన్‌తో అమ్మకం. గరిమెళ్ళ శ్రీధర్ 9493640600,9246678028.

JOBS

మీమీ గ్రామాలలో మా కంపెనీ వాలంటీర్స్ కావలెను. జీతం నెలకు 10,000/- సంప్రదించండి సెల్: 9949483153.

వేణుగోపాలుని ఉత్సవం

పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

జామి, న్యూస్‌టుడే: జామి మండలం అన్నమరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా ముగిశాయి. గోదాదేవి, వేణుగోపాలస్వామికి నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు పార్వేటు ఉత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

రాజవేణుగోపాలుని జాతర..

రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలం పనసలవలసలో రాజవేణుగోపాలస్వామి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ఏటా కనుమ రోజున నిర్వహించడం ఆనవాయితీ. దీంతో గురువారం సాయంత్రం నుంచి సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

పుష్పాలంకరణలో రాజవేణుగోపాలుడు

జీతాలివ్వండి సారూ

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు.. స్వచ్ఛ సంక్రాంతి పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించిన కార్మికుల కళ్లల్లో పండగ కనిపించలేదు. వ్యర్థాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న వారికి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీల్లో 2 నుంచి 6 నెలల వరకు జీతాలు రావాలి. ఈమేరకు రూ.1.51 కోట్ల మేర బకాయిలున్నాయి. కొన్నిచోట్ల రెండు నెలలకు బిల్లులు పెట్టినా చెల్లింపునకు అనుమతి రాలేదు. పెద్ద పంచాయతీ అయిన ఎస్.కోటలో ఆరు నెలలు, కొత్తవలసలో 2 నుంచి అయిదు నెలలు బకాయిలున్నాయి.

ఎస్.కోటలో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జిల్లాలో పరిస్థితి ఇదీ..

పంచాయతీ	సిబ్బంది	నెలలు	బకాయిలు (రూ.లక్షల్లో)
ఎస్.కోట	44	6	72
కొత్తవలస	69	3-5	47.83
చీపురుపల్లి	52	2	15.8
గరివిడి	56	2	14.00
జామి	13	2	2.34

సాధారణ నిధుల్లేకే..

పంచాయతీల్లో రెగ్యులర్, ఒప్పంద కార్మికులు, క్లాప్‌మిత్రలు పేరుతో కార్మికులు పనిచేస్తున్నారు. రెగ్యులర్, ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పంచాయతీ సాధారణ నిధులు(జనరల్ ఫండ్), క్లాప్‌మిత్రల వేతనాలు ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లిస్తారు. సాధారణ నిధుల్లేక బకాయిలు పేరుకుపోయాయి. క్లాప్‌మిత్రలకు ఆర్థిక సంఘం నిధుల నుంచి డ్రా చేస్తున్నా ప్రభుత్వ అనుమతులు రావడం లేదు.

ఇల్లు గడిచేదెలా..

తెలుగింటి పండగల్లో ప్రధానమైనది సంక్రాంతి. కొత్త దుస్తులు, పిండివంటలు, కూతుళ్లు, అల్లుళ్లకు కానుకలు ఇలా అధికంగా ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీ వచ్చే సరికి జీతం రాకపోతే అప్పులు, వాయిదాలు వాళ్ల ఒత్తిడి అధికంగా ఉంటుంది. దీంతో ఇల్లు ఎలా గడుస్తుందని సతమతమవుతున్నారు. వేతనాల సమస్యపై పంచాయతీల ఈవోలతో మాట్లాడుతామని విజయనగరం డీపీవో మల్లికార్జునరావు తెలిపారు. త్వరితగతిన చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

సీతారాంపురంలో ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన లక్కవరపుకోట మండలం సీతారాంపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం. . 25 ఏళ్ల కిందట ముక్కా ముత్యాలనాయుడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన వర్ధంతి కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. పాలకేంద్రానికి సంబంధించిన క్యాన్లు, రాళ్లతో ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం తెదేపా శ్రేణులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గోవిందరావు చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరించారు. పార్టీపై వ్యతిరేకత ఉన్న వారే దీనికి కారణమని, స్థానికంగా ఇలాంటి ఘటనలు పలుమార్లు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ముత్యాలనాయుడు కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను త్వరితగతిన పట్టుకొని, కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

క్షేమంగా వెళ్లండి

సంక్రాంతి నేపథ్యంలో పల్లెలకు రాకపోకలు పెరిగాయి. ఈక్రమంలో అన్ని మార్గాల్లోనూ రద్దీ నెలకొంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసు శాఖ ప్రయాణికులను అప్రమత్తం చేస్తోంది. 'రిటర్న్ జర్నీ- సేఫ్ జర్నీ' పేరిట వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. మూడు రోజుల పాటు ప్రధాన మార్గాలు, పట్టణాల్లో తమ సిబ్బంది ప్లకార్డులతో సూచనలు చేస్తారన్నారు. శిరస్త్రాణం ధరించడం, వేగనియంత్రణ, రోడ్డు భద్రతా నియమాలను తెలియజేస్తూ నిబంధనల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఆదివారం వరకు కొనసాగుతుందని చెప్పారు. – న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

విజయనగరంలో అవగాహన

(c) eenadu

కనుమ పండగ.. కనుల విందుగా

సీతానగరం: చిన్నారాయుడుపేటలో గోపూజ చేస్తున్న గిరిజనులు

పార్వతీపురం గ్రామీణం, తాళ్లబురిడిలో ఏర్పాటు చేసిన సంక్రాంతి మండపం

ఆచారాలు, సంప్రదాయాల నడుమ శుక్రవారం కనుమ పండగ ఘనంగా నిర్వహించుకున్నారు. గోపూజ అనంతరం నదీ తీర ప్రాంతాల్లో వేడుక చేసుకున్నారు. రంగవల్లికలు, పంతగుల పోటీలు నిర్వహించుకుని సందడిగా గడిపారు. పలువురికి సత్కారాలు చేశారు. బలిజిపేట మండలంలోని పెదపెంకిలో ఆనవాయితీ ప్రకారం దేవర కొండపై వెలసిన శ్రీ నృసింహస్వామిని గ్రామస్థులు దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే బృందం

నూకలవాడలో రంగవల్లికల పోటీల్లో మహిళలు

కొమరాడ: జంఝావతి నదీ తీరాన సందడి

సీతంపేట: ఘనసరలో అమృత కలశాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

మిర్తివలసలో బోనాల సంక్రాంతి

బలిజిపేట గ్రామీణం: మిర్తివలసలో తెలంగాణలో జరుపుకొనే బోనాల పండగ మాదిరి మకర సంక్రాంతిని నిర్వహించుకున్నారు. దశాబ్దాలుగా వస్తున్న ఆచారం. కొత్త మట్టి బోనాలను తెచ్చి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు పట్టుకొని మేళ తాళాలతో ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా పేరంటాల ఆలయానికి చేరుకున్నారు.

బలిజిపేట గ్రామీణం: బోనాలతో చిన్నారులను దాటుతూ..

షిప్‌యార్డులో శిక్షణ, ఉపాధి

పార్వతీపురం, న్యూస్‌టుడే: విశాఖ నౌకానిర్మాణ కేంద్రం (షిప్‌యార్డు)లో నిరుద్యోగ యువతకు వెల్డింగ్‌లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించనున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, పద్దెనిమిది ఏళ్లు నిండిన యువకులు దీనికి అర్హులన్నారు. మూడునెలల పాటు శిక్షణ ఇస్తారని, ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి కూడా కల్పిస్తారని, ఆసక్తి గలవారు 70320 60773 నంబర్‌కు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ప్రయాణికుల రద్దీ

సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు ప్రయాణికులతో రద్దీగా మారింది. బస్సులు కిక్కిరిశాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లి వద్ద రైలు వంతెన మీదుగా విశాఖకు నేరుగా రాకపోకలు సాగుతుండడంతో రద్దీ పెరిగింది. –న్యూస్‌టుడే, పాలకొండ

ప్రత్యామ్నాయ దారి రాత్రయితే ప్రమాదకారి

న్యూస్‌టుడే, సాలూరు

పట్టణ ప్రత్యామ్నాయ దారి ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు ఆరు కిలోమీటర్ల పొడవున రూ.45కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఆంధ్ర, ఒడిశాతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన వాహనాలు వందల సంఖ్యలో నిత్యం ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. దుగ్గసాగరం, జీగిరాం కూడలి వద్ద దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో బైపాస్ రోడ్డు రాత్రివేళ అంధకారంలో ఉంటోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

దీపాలు లేని జీగిరాం కూడలి

ఇవీ ఘటనలు..

✦ గతేడాది మార్చి 23న దుగ్గసాగరం కూడలి వద్ద ద్విచక్ర వాహనంతో రోడ్డుపై ఆగి ఉన్న వంగరగుడ్డివలసకు చెందిన భార్యాభర్తలను టిప్పరు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

✦ డంపింగ్‌యార్డు సమీపంలో బైపాస్ రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఎదురుగా వస్తున్న మరో వాహనం కనిపించక ప్రమాదానికి గురై మృతి చెందాడు.

✦ రెండు నెలల కిందట సాలూరు పట్టణంలోని అక్యాన వీధికి చెందిన ఓ రైతు స్కూటీపై కల్లానికి వెళ్తుండగా జీగిరాం కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో రైతు మృతి చెందగా, అతని కుమారుడికి గాయాలయ్యాయి.

ప్రతిపాదనలో ఎన్నాళ్లు..

ప్రత్యామ్నాయదారిలో విద్యుత్తు దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏడాది కిందట ప్రతిపాదించారు. కానీ, ఇప్పటి వరకు పనులు కాలేదు. దీనికోసం పురపాలిక, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా ప్రమాద స్థలాలను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా చర్యల్లేవు. నిధులు మంజూరు చేయక విద్యుత్తు దీపాలు వేయడం లేదని చెబుతున్నారు. దీంతో అంధకారం అలుముకుంటోంది. ప్రస్తుతం బైపాస్ రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు నిలపడంతోపాటు ఆక్రమణలు పెరిగాయి. దీనికి తోడు రహదారి పక్కనే గృహ నిర్మాణ సామగ్రి కుప్పలుగా వేసేస్తున్నారు. దీంతో ప్రమాదాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిధులొస్తే పనులు చేస్తాం.. : ప్రత్యామ్నాయ దారి కూడళ్లలో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు కేటాయించిన వెంటనే పనులు చేపడతాం.

– రత్నకుమార్, పుర కమిషనర్

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటేదీ?

దళారుల చేతిలో నలుగుతున్న గిరిజన రైతులు

భామిని, న్యూస్‌టుడే: గిరిజన రైతులు ఎత్తయిన తువ్వ కొండల్లో పండిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం అంతంత మాత్రమే. దీంతో ఇబ్బందులు పాలవుతున్నారు.

భామిని మండలం పరిధిలో సుమారు 40 గ్రామాల ప్రజలతోపాటు సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా చింతపండు, కొండ చీపుర్లు, అరటి, కుంకుడు, నరమామిడి, ఉసిరి, కర్ర పెండలం, పసుపు, కంది, గుమ్మడికాయలు, ఏరు పనస, పనస, బత్తాయి, జీడిములు, బొప్పాయి, మునగకాయలు పండిస్తున్నారు. గిట్టుబాటు లేక, మైదాన ప్రాంతాలకు ఉత్పత్తులు తీసుకుని వెళ్లలేక తక్కువ ధరకు దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి. జీసీసీ అధికారులు గిరిజనుల ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెప్పింది. కానీ దళారులతో కుమ్మక్కైపోవడంతో రైతుకు నష్టం తప్పడం లేదు.

వారపు సంతల్లో అటవీ ఉత్పత్తుల ధరల పట్టికను పెడుతున్నాం. వాటి ఆధారంగానే గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. చాలామంది దళారుల చేతిలో మోసపోతున్నారు. అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– కృష్ణ, జీసీసీ మేనేజర్, సీతంపేట

రహదారి భద్రతపై అవగాహన అవసరం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: రహదారి భద్రతపై అవగాహన అవసరమని చినమేరంగి ఎస్సై పి.అనీష్ అన్నారు. ప్రభుత్వానికి చెందిన ఈ-గవర్నెన్స్ యాప్‌పై శుక్రవారం మండలంలోని దాసరిపేటలో అవగాహన కల్పించారు. చోదకుల వద్ద అన్ని దస్త్రాలు ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, హద్దులు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ మనీషారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెంకంపేటలో పెద్దలు, యువతతో చర్చలు జరిపారు. గ్రామంలో భోగి పండగ రాత్రి తెలగవీధి రామమందిర కూడలిలో ఏసుక్రీస్తు శిలువను ఎగతాళి చేసి, వ్యంగ్యంగా మాట్లాడిన వీడియో వాట్సప్ గ్రూపులు, స్టేటస్‌లో పెట్టారు. ప్రశ్నించినందుకు కులం పేరిట దూషించారని అయిదుగురిపై గోవింద, శంకర్ ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామీణ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు ఏఎస్పీ విచారణ చేపట్టారు. చర్చల్లో రూరల్ సీఐ రంగనాథం, సర్పంచి కృష్ణారావు, పెద్దలు, యువత ఉన్నారు.

వెంకంపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఏఎస్పీ మనీషారెడ్డి

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బర్లి, పెదపెంకి గ్రామాల్లో సంక్రాంతి పండగ సందర్భంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. బర్లి గ్రామంలో ఏగిరెడ్డి నానినాయుడు తండ్రి వెంకినాయుడు, మరదలు భారతి జ్ఞాపకార్థం వెయ్యి మందికి చీరలు, దుస్తులు తదితరాలు పంపిణీ చేశారు. సర్పంచి గుల్లిపల్లి అప్పలనాయుడు, ఏగిరెడ్డి గౌరి, అన్నపూర్ణ ఉన్నారు. పెదపెంకిలో చీకటి గోపాల్‌నాయుడు, అప్పలనాయుడు, లక్ష్మణరావు, జగదీష్, అలబోను లక్ష్మణ్ నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. సర్పంచి నగిరి పాపారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవినాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ పాలకొండ గ్రామీణం: మండలంలోని ఎన్‌కేరాజపురానికి చెందిన ఎం.సూర్యనారాయణ 145 మందికి దుస్తులు పంపిణీ చేశారు. సాహితీసుధ అభివృద్ధి సొసైటీ సమన్వయకర్త ఎస్వీ ప్రసాదరావు ఉన్నారు.

బర్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న నానినాయుడు, కుటుంబ సభ్యులు

సొంతూరుపై మమకారం వెలకట్టలేనిది

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కన్నతల్లి ప్రేమ, సొంతూరుపై మమకారం వెలకట్టలేనిదని విశ్రాంత ఎస్పీ బి.ప్రసాదరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నర్సిపురం చిన్నవీధిలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టాపు గౌరి ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ప్రసాదరావు, వై.రామకృష్ణ, కె.సింహాచలంను గ్రామస్థులు సత్కరించారు. తెదేపా ఇన్‌ఛార్జి జీవీ రమణ, పెద్దలు పాల్గొన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ★ జియ్యమ్మవలస: గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డొంకాడ రామకృష్ణ, మంగమ్మ దంపతులను మండలంలోని చినకుదమలో గ్రామస్థులు సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డొంకాడ మాట్లాడుతూ తనపై అభిమానం చూపిన ప్రజలకు, మాజీ మంత్రి విజయరామరాజుకు, విప్ జగదీశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు ఉన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ఎస్పీ ప్రసాదరావు

సర్కారు సేవకులకు సత్కారం

వీరఘట్టం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం పనసనందివాడ గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా పలువురు పోలీస్ అధికారులు, 108 ఉద్యోగులను స్థానికులు గురువారం సత్కరించారు. విశ్రాంత ఏసీపీ రవీంద్రపాత్రుడు, ఎక్సైజ్ సీఐలు చిన్నంనాయుడు, బంగార్రాజు, అటవీశాఖ సీఐ చంద్రశేఖర్, ఏఎస్సై రమేష్, హెచ్‌సీ రాము, కానిస్టేబుల్స్, 108 ఉద్యోగులను సన్మానించారు.

క్రికెట్ టోర్నీ విజేత పెదపెంకి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా వారం రోజులపాటు గ్రామ యువత నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ప్రథమ స్థానంలో నిలిచిన పెదపెంకి జట్టుకు ట్రోఫీతోపాటు రూ.10వేలు నగదు బహుమతిని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవినాయుడు అందజేశారు. తర్వాత స్థానాల్లో నిలిచిన బొబ్బిలి, కుసుమూరు జట్లకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేశారు.

విజేతలకు ట్రోఫీ అందిస్తున్న సంజీవినాయుడు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

పాలకొండ, న్యూస్‌టుడే: మండలంలోని యరకరాయపురం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. తెదేపా నాయకులు శ్రీనివాసరావు, నీలకంఠంనాయుడు తదితరులున్నారు.

బహుమతులతో విజేతలు

ముక్కు మూసుకుని నివాసం.. దోమలతో సహవాసం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణ, నగరాల్లోని మురికివాడల్లోని ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది. కనీస సదుపాయాల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లేక మురుగు నిలిచి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నారు. కనీసం తాగునీరు అందని పరిస్థితి.

తాగునీటికి వెతలు..

ఇరుకు వీధులు అందులోనూ మురుగు నీరు బయటకు పోయే పరిస్థితి లేదు. నందమూరికాలనీ, పాతరెల్లి వీధి, పెదమాదిక వీధి, జనశక్తి కాలనీ, మణికంఠ కాలనీలో నివాసాల మధ్య కాలువ ఉండడంతో మురుగు ఇళ్ల ముందు నిలుస్తోంది. దేవినగర్, పెదమాదిక వీధి, కుద్దల వీధిలో ఇంతే. 13, 24, 25 వార్డులు మినహా ఏ ప్రాంతాల్లోనూ సామాజిక మరుగుదొడ్లు లేవు. దశాబ్దకాలంగా ఇక్కడి ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. బెలగాం బంగారమ్మ కాలనీలో మూడు వీధులకు పైపులైన్లు లేవు. జనశక్తి కాలనీ శివారు, బైపాస్ కాలనీ, రాజీవ్ కొత్తపోలమ్మ కాలనీ, గూడ్స్ షెడ్ రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీ, సౌందర్య సినిమా హాల్ వెనుక, గంగసాగరం చెరువుగట్టు, కొత్తవలస విజయరామరాజు కాలనీ, పార్వతీనగర్, వైకేఎం నగర్, గ్రీన్‌ఫీల్డు కాలనీలో కుళాయిలు లేక ఆరేళ్లుగా ఇక్కట్లే. రెండు వేలు కుటుంబాలకు పురపాలక సంఘం ట్యాంకర్ నీరే ఆధారం. కొత్తవలస, గిజబ, నవిరి, బంగారమ్మ కాలనీల్లో అధ్వాన రహదారులే ఉన్నాయి. కొత్తవి నిర్మించలేదు. గతేడాది 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ప్రతిపాదించినా పనులు కాలేదు.

నందమూరి కాలనీలో నిలిచిన మురుగు నీరు

నిలిచిన నిధులు.. : గతంలో పట్టణాల్లోని మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ఎస్‌డీపీ, ఎస్‌జేఎస్‌ఆర్‌వై, ఏపీయూఆర్ఎంఎస్ నిధులు మంజూరయ్యేవి. వీటిని రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ఖర్చు చేసేవారు. ప్రభుత్వం మారిన తర్వాత నిధుల కేటాయింపు నిలిచిపోయింది. ఆర్థిక సంఘంపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ నిధులతో చేపట్టే పనులు సకాలంలో ప్రారంభం కానందున ఇబ్బందులు తప్పడం లేదు.

సదుపాయాలు కల్పిస్తాం..

మురికి వాడల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతానికి 13 పనులకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాసరాజు, డీఈ, పురపాలక

మురికివాడలు: 36, జనాభా: 24వేలు, కాలువల పొడవు: 26కి.మీ, కచ్చా కాలువలు: 16కి.మీ

దుప్పట్లు అందజేత

సాలూరు: సంక్రాంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సభ్యులు తాతాజీ, రమేష్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గోపూజ

పాలకొండ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవమైన కోటదుర్గమ్మ ఆలయంలో కనుమ సందర్భంగా అర్చకుడు లక్ష్మీప్రసాద్ శుక్రవారం గోపూజ నిర్వహించారు. పార్వతీపురం ఎస్సై వామనరావు, జోగినాయుడు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ: ఏడుగురికి గాయాలు

కొమరాడ, న్యూస్‌టుడే: ఆటో, లారీ ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలైన ఘటన మండలంలో గురువారం జరిగింది. పార్వతీపురం నుంచి గుణానపురం వైపు వెళ్తున్న ఆటో, ఒడిశా నుంచి అనపర్తికి తౌడు లోడుతో వస్తున్న లారీ సూర్యపీఠం సమీపంలో ఢీకొన్నాయి. ఆటో చోదకుడు బి.రాజుతో సహా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. నలుగురు పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో, ఇద్దరు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ చోదకుడు ఆపకుండా వెళ్లిపోయాడు. ఎస్సై జగదీష్‌నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా లారీని గుర్తించారు. బొబ్బిలి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడ చోదకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

భామిని, న్యూస్‌టుడే: మండలంలోని బాలేరు జడ్పీ పాఠశాలలో 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత కలిసిన వారంతా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనందంగా గడిపారు. వారికి చదువు చెప్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

ఏజెన్సీలో గజగజ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సంగంవలస పంచాయతీ నడిమిగడబ వలస, రంగాలగూడల సమీపంలో ఏనుగుల గుంపు శుక్రవారం తిష్ఠ వేసింది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతనెలా ఇదే సమయంలో తమ ప్రాంతాల్లో బీభత్సం సృష్టించాయని పేర్కొన్నారు. మోనిటరింగ్ అధికారి మణికంఠేష్ వద్ద ప్రస్తావించగా పరిస్థితి అదుపులో ఉందన్నారు. 30 మంది ట్రాకర్లతో కరిరాజుల కదలికలు పరిశీలిస్తున్నామన్నారు.

ఏకామ్రనాథుని తిరువీధి మహోత్సవం

సాలూరు, న్యూస్‌టుడే: ధనుర్మాస పూజల్లో భాగంగా సంక్రాంతి సందర్భంగా గురువారం కామాక్షి సమేత ఏకామ్రనాథ స్వామి ఉత్సవ విగ్రహాలకు పురవీధుల్లో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అర్చకుడు సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి రథోత్సవం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

రథంపై ఊరేగిస్తున్న భక్తులు

చెత్త తరలించేదెప్పుడో?

పాలకొండ పట్టణంలో స్వచ్ఛత కానరావడం లేదు. పండగ పూటా వీధులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. సకాలంలో చెత్త తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోతుంది. దీంతో వీధుల్లో ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లుంబూరు గ్రామ కూడలి, కోమటిపేట కూడలితోపాటు కాపువీధి రహదారుల్లో సమస్య అధికంగా ఉంది. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యర్థాలు తొలగిస్తామని నగర పంచాయతీ ఏఈ దేవీవరప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మొరాయిస్తే.. గొంతెండాల్సిందే

అంపావల్లిలోని రక్షిత తాగునీటి ప్రాజెక్టు వద్ద ఒకటే మోటారు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని నుంచి బలిజిపేట మండలంతోపాటు బొబ్బిలికి నీరు సరఫరా అవుతోంది. సాంకేతిక సమస్యల వల్ల మొరాయిస్తే రోజుల తరబడి ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. దీనికితోడు భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతోంది. అదనపు భవనం నిర్మించాల్సి ఉంది. దీనిపై నీటిసరఫరా విభాగం జేఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

బోర్లు మూలకు.. ఇక్కట్లు ప్రజలకు

పాలకొండ పట్టణ పరిధిలోని చేతిబోర్లు ఎందుకూ ఉపయోగపడటం లేదు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. పలు చోట్ల ఇవి పాడయ్యాయి. సకాలంలో వాటిని బాగు చేయకపోవడంతో చాలా వీధుల్లో ఇవి మూలకు చేరాయి. దీంతో పట్టణ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. రావాడవీధి, కాపువీధి, గారమ్మకాలనీలో మూడు చోట్ల, కొత్తవీధి, యాతవీధి, దేవరపేట, ఆసుపత్రి రహదారుల్లో సమస్య ఉంది. పాడైనవి బాగు చేయిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

శిథిలం.. భయం భయం

బలిజిపేట మండలంలోని చిలకలపల్లి గ్రామంలో ఆరున్నర దశాబ్దాల కిందట నిర్మించిన పశువైద్య కేంద్రం కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం బీటలు వారింది. వర్షమొస్తే కారుతోంది. మందులు తడిచిపోతున్నాయి. దీని ద్వారా పది గ్రామాలకు చెందిన పశువులకు వైద్య సేవలు అందుతున్నాయి. పాడై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయడంలేదు. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై మండల పశువైద్యాధికారి గణేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

దారంతా.. పొగ.. మంచు

పార్వతీపురం, సాలూరు పరిసరాల్లో శుక్రవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలు దాటినా భానుడి దర్శనం కాలేదు. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసినా వాహనాలు కనిపించని పరిస్థితి. మరోవైపు సాలూరు పట్టణ ప్రత్యామ్నాయ దారి పక్కన డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పంటించడంతో దట్టమైన పొగ అలుముకుంది. సుమారు కిలోమీటరు పొడవున పొగ వ్యాపించడంతో రాకపోకలు సాగించేవారు ఊపిరాడక నానా అవస్థలు పడ్డారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం, సాలూరు

(c) eenadu

ఈనాడు పోలవరం

శనివారం జనవరి 17, 2026 5

మురమళ్లలో పందెం గెల్చుకున్న విజేతలకు బహుమతులందిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

పందేలను తిలకిస్తున్న సినీనటి హేమ

హెచ్చరికలు గాల్లోకి.. పందెందారులు బిరుల్లోకి

ముంపు మండలంలోని గ్రామంలో...

ఈనాడు, పోలవరం: కోడిపందేలు, జూద క్రీడల విషయంలో జిల్లాలో అధికారుల హెచ్చరికలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఓ పక్క నాటుసారా, మద్యం యథేచ్ఛగా, మరోపక్క బిర్యానీ సెంటర్లు, మద్యంలో బిరులు, వాటిమధ్యా గుండాట, జూదం యథేచ్ఛగా సాగాయి. రూ.లక్షల పందేలు కాశారు. నాలుగు విలీన మండలాలతోపాటు, ఏలూరు జిల్లాలోని రెండు విలీన మండలాల్లోనూ ఈ ఏడాది ఎప్పుడూ లేనంత సంఖ్యలో బిరులు ఏర్పాటు కావటం గమనార్హం. వీటి ప్రభావంతో వీఆర్‌పురంలో హడావుడి తగ్గింది. గ్రామాలకు దూరంగా మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేయటంతో కేవలం కూనవరం, వీఆర్‌పురం మండలాల వారే పాల్గొన్నారు. ఈ ఏడాది కొత్తగా బిరుల వద్ద ఆధార్ కార్డు, వేలిముద్ర సాయంతో సొమ్మును అందించే పాయింట్లు ఏర్పాటు చేశారు. ● రెండు పందెం కోడిపుంజులు, నలుగురు జూదరులపై కేసులు నమోదు చేసినట్లు వీఆర్‌పురం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు. ● రంపచోడవరం ఏజెన్సీలో గంగవరం, రాజవొమ్మంగి, దేవీపట్నం.. ఇలా అన్ని మండలాల్లోనూ ఈసారి కోడిపందేలు నిర్వహించారు.

కోనసీమలో..: అమలాపురం కలెక్టరేట్, ఐ.పోలవరం: ఎన్ని హెచ్చరికలు చేసినా.. నిబంధనలు పెట్టినా.. పందెం దారులు లెక్కచేయలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు, జూద క్రీడల్లో రూ.కోట్లు చేతులు మారాయి. పందేల నిర్వాహకులు రూ.లక్షల సొమ్ము లెక్కల్లో వేసుకున్నారు. 20 మండలాల్లో ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేశారు. అమలాపురం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కొన్ని బరుల వద్ద అశ్లీల నృత్యాలు చేయడం విమర్శలకు తావిచ్చింది. ● ఐ.పోలవరం మండలం మురమళ్లలో క్రికెట్ స్టేడియాన్ని తలపించేలా భారీ ఏర్పాట్లు చేశారు. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం, సినీనటులు హేమ, శివారెడ్డి తదితరులు పందేలను తిలకించారు. ఫ్లడ్‌లైట్లు పెట్టి రాత్రిపూట కూడా పందేలు నిర్వహించారు. ఎక్కడా వివాదాలకు తావు లేకుండా సజావుగా జరిగేలా పర్యవేక్షించారు. ● గుండాట నిర్వాహకుల నుంచి కోడి పందేల నిర్వాహకులు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారు. బరిలో నిర్వహించే ప్రతి పందెంలో 10 నుంచి 15 శాతం కమిషన్‌గా తీసుకున్నారు. అల్లవరం మండలం గుండెపల్లి బరి వద్ద దొంగనోట్లను గుర్తించిన మహిళలు పోటు చేసుకున్నారు. ● జిల్లాలో అత్యధికంగా మురమళ్ల బరిలో రూ.లక్షల్లో పందేలు జరిగాయి.

భజగోవిందం.. జగదానందం

ఆత్రేయపురం: భక్తజన వరదా.. వందన స్వరూపా నమోస్తుతే స్వరంతో కోనసీమ తిరుమల వాడపల్లి పులకించింది. శ్రీమన్నారాయణుడు దివ్యాలంకార శోభితుడై భక్తులకు జగన్మోహనంగా దర్శనమిచ్చారు. శుక్రవారం కనుమ పండగ కావడంతో వెంకన్న క్షేత్రం వేలాది మంది భక్తజనంతో అలరారింది. మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు, స్వామివారి మూల విరాట్టు, ఆరుబయట విమాన వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు.

తామర తెగులు.. నల్లితో దిగులు

▲ చింతూరు డివిజన్‌లో మిరప దిగుబడిపై ప్రభావం

– న్యూస్‌టుడే, ఎటపాక

ముంపు మండలాల్లో ఈసారి నాలుగు నెలలకు పైగా సాగు ఆలస్యమైంది. ప్రధాన పంట మిరప చేతికొచ్చే సమయానికి వీచే గాలులు ఆశిస్తుండటంతో తెగుళ్లను కట్టడిచేసే కనుక లేకుండా పోతోంది. పూత దశలో తామర పురుగు, నల్లి ప్రభావంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ● రాష్ట్రంలోనే మిరప పంట సాగులో విలీన మండలాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కేవలం ఎటపాక మండలంలోనే 5,250 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది గోదావరి వరద నాలుగుసార్లు పైగా గ్రామాలను చుట్టుముట్టాయి. నారుమడి దశలో ఎకరాకు రూ.వేలల్లో నష్టపోయారు. రెండోసారి నారుమడి వేయాల్సి వచ్చింది. ఆలస్యంగా పంట కాలం మొదలు కావ...

పూతపై వ్యాపించిన నల్లి

ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న పైరును తామర పురుగు, నల్లి ఆశించి విస్తరిస్తోంది. తామర పురుగు ప్రభావంతో ఆకులు ముడత పడుతున్నాయి. నల్లి మచ్చలతో కాయ దశకు రాకముందే పూత రాలిపోతుంది. ఎటపాక మండలంలోని గొల్లగూడెం, గౌరిదేవిపేట, మురుమూరు, గన్నవరం, నందిగామ, నెల్లిపాక, రాయనపేట, బోదవరం, గుండాల కాలనీ, కన్నాయిగూడెం, ఎటపాక గ్రామాల్లో, కూనవరం మండలం పోలిపాక, కాచవరం, పోచవరం, నర్సింగపేట, మర్రిగూడెం గ్రామాల్లో స్వల్పకాల వర్షాలు చేసినా ఫలితం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఎకరాకు కనీసం క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితి లేదంటున్నారు.

డివిజన్‌లో మిరప పంట సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	
ఎటపాక	5,250
కూనవరం	2,500
వరరామచంద్రపురం	1,300
చింతూరు	150

గౌరిదేవిపేటలో సాగులో ఉన్న మిరప పంట

● కౌలుదారులు ఎకరాకు రూ.40 వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. సాధారణ పంటల సాగుతో వచ్చే దిగుబడి కనీసం కౌలు మొత్తంకు సరిపోదు. దీంతో వాణిజ్య పంటలపైనే వారు దృష్టి సారిస్తున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి..

ఒకే పంట సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతిని తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంట మార్పిడిపై దృష్టి సారించాలి. మోతాదు మించి రసాయన ఎరువుల వాడకం వద్దు. వ్యవసాయ అధికారులు పరిస్థితిని పరిశీలించి అవగాహన కల్పిస్తున్నారు. - ముత్యయ్య, జిల్లా ఉద్యాన శాఖాధికారి

జగ్గన్న తోట.. రుద్రుల కోట

జగ్గన్నతోట జనసంద్రమైంది. ఏకాదశరుద్రులను ఏకకాలంలో చూసేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఏకాదశరుద్రుల గ్రామాల్లో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం జగ్గన్నతోటలోని తీర్థ స్థలికి తీసుకువచ్చారు. తొలుత ఉదయం 10.30 గంటలకు మొసలపల్లి ప్రభను తీసుకొచ్చారు. అనంతరం ఒక్కొక్కటిగా వివిధ గ్రామాల నుంచి ప్రభలు వచ్చాయి. చివరిగా గంగలకుర్రు ప్రభ చేరుకుంది. అక్కడ భక్తుల దర్శనం అనంతరం తిరిగి ఒక్కొక్కటి గ్రామాలకు మరలాయి. – న్యూస్‌టుడే, అంబాజీపేట

జలపాతం 'ఉరక'..

మన్యంలో ప్రకృతి అందాలకు, సెలయేటి పరవళ్లకు కొదవే ఉండదు. జడ్డంగి స్వయంభూ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో మడేరు వాగు ఎత్తైన రాళ్ల నుంచి జాలువారుతూ ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. 'ఉరక' జలపాతంగా పేరొందిన ఈ వెన్నెల మడుగు వద్దకు అనేకమంది పర్యాటకులు వచ్చి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రస్తుతం పర్యాటకులతో కళకళలాడుతుంది. – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

పాపికొండలు బోట్లు ఫుల్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటకుల బోట్లు నిండిపోయాయి. దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం బోట్ పాయింట్ నుంచి గురువారం 15 బోట్లు, శుక్రవారం 15 బోట్లలో మొత్తం 2వేల మందికి పైగా పర్యాటకులు పాపికొండల అందాలను తిలకించడానికి వెళ్లారు. అంతకుముందు కొండపై నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూ కట్టారు. ఈ క్రమంలో బోటు పాయింట్ కళకళలాడింది. శనివారానికి సైతం మొత్తం 15 బోట్లు ఇప్పటికే రిజర్వు అయ్యాయని బోటు నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, దేవీపట్నం

ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మండలంలోని కిండ్రలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల, సాంస్కృతిక పోటీలను ఏర్పాటుచేశారు. ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే పరిశీలించారు. యువకులకు పలు క్రీడా పోటీలు ఏర్పాటుచేశారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ్ భాస్కర్, ఎంపీపీ వెంకటలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర ఘనం.. ప్రాచుర్యం కనం

కుమారస్వామిగూడెంలో కాకతీయులు నిర్మించిన ఆలయం

న్యూస్‌టుడే, కూనవరం

ముంపు మండలాల్లో చారిత్రక ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. చాలా ప్రాంతాలకు ఆధ్యాత్మిక నేపథ్యమూ ఉంది. ఇక ప్రకృతి సౌందర్యం చెప్పే అవసరం లేదు. చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక సంపదకు సరైన ప్రాచుర్యం దక్కకపోవటంతో స్థానికుల నమ్మకాలుగానే మిగిలిపోతున్నాయి. కొత్త జిల్లాలో అయినా పర్యాటక శాఖ అధికారులు, దేవాదాయ శాఖను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తే రామాయణ మధుర ఘట్టాలు, కాకతీయుల వైభవ చిహ్నాలనూ వీక్షించవచ్చు.

కాకతీయుల నాటి ఆలయం

కూనవరం మండలం కుమారస్వామిగూడెంలో కాకతీయుల నాటి వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉంది. దీన్ని 11వ శతాబ్దంలో నిర్మించినట్టు తెలుస్తోంది. ఇక్కడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బాలుడి రూపంలో వచ్చి గ్రామంలోని పిల్లలతో ఆడుకునేవాడని, ఆయనలో దైవశక్తిని గుర్తించి గ్రామస్థులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కోరిక మేరకు ఆయన పాల చెంబును విసరగా అది పడిన ప్రాంతంలో గ్రామాన్ని నిర్మించుకున్నారన్నది నమ్మకం. వల్లీ అనే గిరిజన యువతిని వివాహమాడడంతో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరునిగా ప్రచారం అందుకున్నారు. నాటి నుంచి స్వామి కల్యాణానికి గిరిజనులే తలంబ్రాలు తీసుకొస్తున్నారు. వివాహానంతరం స్వయంభూలింగంగా ఆవిర్భవించడంతో అక్కడే కాకతీయ రాజులు ఆలయాన్ని నిర్మించారన్నది చరిత్ర.

శబరి, గోదావరి సంగమం

రెండు జీవనదుల సంగమాన్ని భక్తులు పుణ్య స్థలంగా భావిస్తారు. పలు రాష్ట్రాలను దాటి వస్తున్న గోదావరి నదిలోకి దాని ప్రధాన ఉపనది శబరి కూనవరం వద్దే కలుస్తుంది. పాపికొండల పర్యాటకం కూనవరం మీదుగా సాగుతున్నా ఆ శాఖ అధికారులు సంగమానికి ప్రాధాన్యం ఇవ్వటం లేదు. సంగమ విశిష్టత చెప్పుకుండానే తీసుకెళ్తున్నారు. కొంత ప్రదేశాన్ని శుభ్రం చేసి ప్రచారం కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది.

వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో..

1. వేడినీళ్ల బావి: ఎటపాక మండలంలో గుండాల వద్ద ఉంటుంది. వనవాస సమయంలో సీతమ్మ వేడినీటితో స్నానం చేయాలని తలచింది. రాముడు తన బాణంతో నీటిని రెండుగా విభజించగా, వేడినీటి బావి ఏర్పడిందని ఐతిహ్యం. ఏటా శ్రీరామ కల్యాణానికి వస్తున్న భక్తులు భద్రాచలం నుంచి ప్రత్యేకంగా ఇక్కడకు వచ్చి ఆ బావి నీటిని తీసుకుంటారు.

2. రేఖపల్లి, చొక్కనపల్లి: వీఆర్‌పురం మండలంలోనూ రామాయణ ఆనవాళ్లు ఉన్నాయి. సీతాదేవిని రావణాసురుడు అపహరించుకెళ్తున్న సమయంలో జటాయువు నిలువరించడానికి పోరాడుతుంది. దాని రెక్క పడిన ప్రాంతమే నేడు రేఖపల్లిగా ప్రచారంలో ఉంది. రాముడు బంగారు లేడిని సొక్కించి చంపిన ప్రాంతమే చొక్కనపల్లిగా ప్రచారంలో ఉంది. సీతాన్వేషణలో రాముడు చొక్కనపల్లి వద్ద ఓ బండపై కూర్చుని తపస్సు చేయగా అక్కడ రామ పాద ముద్రలు పడినట్టు భక్తుల నమ్మకం వాలీ సుగ్రీవుల గుట్టలున్నాయి.

కొత్తదనమేది..!

▲ 'గుర్తేడు'లో నేటికీ అందుబాటులో రాని కార్యాలయాలు

న్యూస్‌టుడే, వై.రామవరం

నూతన మండలం ఏర్పాటును పురస్కరించుకుని ఇటీవల వెలిసిన ఫ్లెక్సీ

అయిదు పంచాయతీలతో నూతనంగా గుర్తేడు మండలాన్ని ఏర్పాటు చేస్తూ మూడు నెలల క్రితం గెజిట్ విడుదల చేశారు. మండల కేంద్రంలో ఇంకా తాత్కాలిక అధికారులు, కార్యాలయాలూ అందుబాటులోకి రాలేదు. పండగ నాటికైనా గుర్తేడు కేంద్రంగా పాలన సాగుతుందని ఆశించినా ఫలితం లేదు. వై.రామవరం మండలంలోని 17 పంచాయతీల్లో 5 పంచాయతీలను విడదీసి, వాటితో గుర్తేడు మండలం ప్రకటిస్తూ అక్టోబరు 15, 2025లో గెజిట్ విడుదల చేశారు. మారుమూల కావడం, మండల కేంద్రంలో కనీస వసతులు లేని కారణంగా పరిపాలన మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. అధికారుల నిర్లిప్త ధోరణి జాప్యానికి మరో కారణమవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం..

'ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి, పీవోకు నివేదించాం. పంచాయతీ కార్యాలయాల్లో తాత్కాలిక ఆఫీసులను నిర్వహించే చర్యలు తీసుకుంటాం.' -వేణుగోపాల్, తహసీల్దార్

గుర్తేడు మండలం ఇలా..		
పంచాయతీలు	:	05
గ్రామాలు	:	59
మండల జనాభా	:	12526
సరిహద్దు	:	రెండు రాష్ట్రాలు (ఒడిశా, ఛత్తీస్‌గఢ్), రెండు జిల్లాలు (అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లా సరిహద్దుల వరకు).

ఇదీ చేసింది..

▲ మండలానికి కావలసిన వివిధ శాఖల సిబ్బంది, భవనాలు, వసతులు తదితర అంశాలపై ఉన్నతాధికారులకు మండల అధికారులు నివేదించారు. ఎంత మంది సిబ్బంది కావాలో సమాచారం ఇచ్చారు. ఈ ప్రక్రియ కూడా పది రోజుల క్రితం పూర్తయినట్టు సమాచారం. ▲ కొత్త మండలంగా ఏర్పాటుకాక ముందే పోలీసు స్టేషను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. మిగిలిన కార్యాలయాల స్థల సేకరణకు ప్రయత్నాలు చేపట్టారు.

ఇంకా మిగిలి ఉంది..

● పూర్తి స్థాయి అధికారుల సంగతి అటుంచి కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతలూ అప్పగించలేదు. పేరుకే కొత్త మండలం అన్న భావన నెలకొంది. నేటికీ వై.రామవరం కేంద్రంగానే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ● ప్రభుత్వ విద్యాలయాల్లో తాత్కాలిక కార్యాలయాలు నిర్వహిస్తామని చెబుతున్నా కనీసం బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ● అన్నీ సవ్యంగా సాగితేనే మరో రెండు నెలల సమయం పట్టొచ్చని అంచనా.

కాటమస్వామీ.. కరుణించవా

● నేడు జాతర ప్రారంభం

న్యూస్‌టుడే, గంగవరం

కాటమస్వామి ఆలయం

గంగవరం మండలం మొల్లేరులోని కోర్కెలు తీర్చే దేవుడు కాటుమల్లేశ్వర స్వామి (కాటమస్వామి), బంగారు పాపాయమ్మతల్లి జాతర నేడు ప్రారంభం కానుంది. శివారు గ్రామాలైన మొల్లేరు - బి.శివరామపట్నం మధ్య ఈ స్వామి వెలిశారు. ఏటా నిర్వహించే వేడుకలకు రంపచోడవరం ఏజెన్సీలో పలు మండలాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై కాటమస్వామిని, పాపాయమ్మను దర్శించుకుంటారు. పరిసర గ్రామాల ప్రజలు జాతరను వైభవంగా నిర్వహిస్తారు. నిర్వాహకులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ నెల 17 నుంచి 21వరకు అయిదు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. కనుమ రోజు రాత్రి గ్రామస్థులంతా జాగారం చేస్తారు. స్వామివారిని ఊరేగింపుగా గరగలు, తాడిపెద్దు, భజన నడుమ దేవాలయం వద్దకు చేరుస్తారు. అనంతరం జాతర ప్రారంభమవుతుంది. బంగారుపాపాయమ్మ కాటుమల్లేశ్వర స్వామికి సోదరి అని ఇక్కడి ప్రజల నమ్మకం. అయిదు రోజులు ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహిస్తారు.

● జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు తీసుకున్నట్టు ఎస్సై బి.వెంకటేష్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. యువత, గ్రామస్థులు సహకరించాలని పిలుపునిచ్చారు.

23న 'పర్యావరణ విద్య' పరీక్ష

న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 'నైతిక, మానవ విలువలు', 'పర్యావరణ విద్య' సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే మిగతా పరీక్షలు రాసే అర్హత ఉంటుంది. ప్రధాన పరీక్ష రోజే ప్రాక్టికల్స్‌లో భాగంగా విద్యార్థులు రూపొందించిన రికార్డులు పరిశీలిస్తారు. ఏటా ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ అవుతున్నా పాస్ మార్కులు తెచ్చుకొని మమా అనిపించే పరిస్థితులే ఇప్పటిదాకా చాలాచోట్ల కనిపిస్తున్నాయి.

2,728 మంది విద్యార్థులు..

ఈ నెల 21న నైతిక, మానవ విలువలు, 23న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష సమయం. జిల్లాలో 32 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2728 మంది ఉన్నారు. పండగ సెలవుల అనంతరం వచ్చే వీటిని మర్చిపోయే అవకాశం ఉన్నందున అధికారులు ఇప్పటికే విద్యార్థులను అప్రమత్తం చేశారు.

ప్రయోగ పరీక్షకు 40 మార్కులు..

వంద మార్కుల పరీక్షల్లో ప్రాక్టికల్స్‌కు 40, నాలుగు థియరీ ప్రశ్నలకు 60 (ఒక్కో ప్రశ్నకు 15) ఉంటాయని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి భీమశంకరరావు తెలిపారు. పరిసరాల శుభ్రత, ఇంధన పొదుపు, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై ప్రాజెక్టులను ప్రాక్టికల్స్‌గా పరిగణించి మార్కులు వేస్తారని వివరించారు. అన్నిచోట్లా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పిల్లల్లో నైతిక విలువలు, మానవత్వం, పెద్దలపై గౌరవ మర్యాదలతో పాటు, సామాజిక బాధ్యతలను పెంపొందించడమే పరీక్షల ముఖ్య ఉద్దేశమన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్‌టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు

వి.ఎల్.పురం: పండగ అనంతరం ఆయా ప్రాంతాలకు బయలుదేరే తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్య స్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను కొనసాగిస్తోంది. ● శని, ఆదివారాల్లో జిల్లా మీదుగా విశాఖపట్నం-విజయవాడ(08567), విజయవాడ-విశాఖపట్నం(08568) జన్‌సాధారణ్(అన్‌రిజర్వ్డ్) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ● ఈ నెల 17, 19న విశాఖపట్నం-చర్లపల్లి(08511), 18, 20న చర్లపల్లి-విశాఖపట్నం(08512) అదనపు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఆగుతాయి. ● ఈ నెల 18న విశాఖపట్నం- చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 18న అనకాపల్లి-చర్లపల్లి(07479), 19న చర్లపల్లి-అనకాపల్లి(07477), అనకాపల్లి-చర్లపల్లి(07478) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ● 19న చర్లపల్లి-కాకినాడ టౌన్(07480), కాకినాడ టౌన్-చర్లపల్లి(07482) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

ప్రథమ వర్ధంతి నివాళులు

లేటు శ్రీ కారం బాపన్నదొర - EX MLA
లేటు వీరాయమ్మ గార్ల ఏకైక దత్తపుత్రుడు..

కీ॥శే॥ డా.కారం బాబురావు దొర గారు
MBBS
Rtd. Deputy Civil Surgeon, APSEB A.P.GENCO Medical
Board Member (AP Genco & AP Transco)
మరణం: 17-1-2025
జగ్గంపాలెం గ్రామం, గంగవరం మండలం

(లేటు) కారం బాపన్నదొర - వీరాయమ్మ గార్లు
Ex. MLA, ఎల్లవరం తాలుకా, భద్రాచలం నియోజకవర్గం
S/o. లేటు కారం వీరన్నదొర (మునసబు)

మామగారు: (లేటు) పూనెం రామచంద్రయ్య
Ex. MLA (Congress) బూర్గంపాడు

భార్య: కారం శిరోమణి
కూతుళ్ళు - అల్లుళ్ళు
హిమబిందు - సమ్మయ్య
సింధు-కిరణ్‌కుమార్
అరుణశ్రీ
మనుమళ్ళు - మనుమరాలు: జ్ఞాప్తిశ్రీ
హర్షిత్‌కుమార్ దొర, గౌతమ్ కార్తికేయదొర
ఇట్లు.. కుటుంబ సభ్యులు
మరియు మెడికల్ బోర్డు ఎంప్లాయిస్
మిత్రులు, శ్రేయోభిలాషులు

(c) eenadu

కళాకారులతో చిందేసిన ఎమ్మెల్యే

సంక్రాంతి సందర్భంగా పి.గన్నవరం మండలం బోడపాటి వారిపాలెంలో కొండాలమ్మఅమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడురోజులపాటు ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా సాగాయి. సంక్రాంతిరోజు గురువారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కళాకారులతో కలిసి నృత్యంచేస్తూ కాసేపు సందడి చేశారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

సచిత్రంగా సంక్రాంతి



మలికిపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన సంక్రాంతి చిత్రాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, గంగిరెద్దు, కోడిపందేలు, పతంగులు, హరినామ కీర్తనలతో హరిదాసుల గ్రామోత్సవం తదితర అంశాలు ఇందులో పొందుపరిచారు. ఇవి పలువురిని ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, మలికిపురం

చిరు సోదరీమణుల సందడి

కోనసీమలో సంక్రాంతి సంబరాలను వీక్షించేందుకు మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు సినీహీరో చిరంజీవి సోదరీమణులు డాక్టర్ మాధవి, విజయదుర్గ కుటుంబ సమేతంగా గురువారం విచ్చేశారు. గ్రామంలో జరిగిన ప్రభల ఊరేగింపు, తీర్థంలో పాల్గొన్నారు. స్థానికంగా మండవా లోగిలిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మమేకమయ్యారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

కొత్త అల్లుడికి 1,574 వంటకాలతో విందు

మామిడికుదురు మండలం ఆదుర్రులో సంక్రాంతి పండక్కి వచ్చిన కొత్త అల్లుడికి 1,574 రకాల ఆహార పదార్థాలతో గురువారం విందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విజ్ఞప వెంకటరత్నం, సుశీల దంపతులు గత ఫిబ్రవరిలో తమ కుమార్తె కీర్తిశ్రీని పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయికరణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్లుడికి వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, శీతలపానీయాలతో విందు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు **8008621414** & **9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

9 రోజులు.. 14 క్షేత్రాలు

20న ఆర్టీసీ 'కర్ణాటక - మైసూర్ యాత్ర' ప్రత్యేక బస్సు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు దర్శించుకునే భక్తుల కోసం 'కర్ణాటక-మైసూర్ యాత్ర' పేరిట రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు ఇక్కడ డిపో నుంచి బయలుదేరుతుంది. తొమ్మిది రోజులపాటు సాగే యాత్రలో భాగంగా 14 క్షేత్రాల్లోని ఆలయాలను భక్తులు దర్శించుకోవచ్చు. ఈ బస్సులో పుష్‌బ్యాక్ సీట్లు, టీవీ సౌకర్యం ఉంటుందని, టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.11,500లుగా నిర్ణయించినట్లు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తామన్నారు. మార్గమధ్యలో విశ్రాంతి కోసం హోటల్లో గదులు తీసుకుంటే దానికయ్యే అదనపు చార్జీని భక్తులే భరించాల్సి ఉంటుందని తెలిపారు. పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారు ఆర్టీసీ కల్పిస్తున్న ఈ ప్రత్యేక యాత్ర బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మాధవ్ కోరారు.

యాత్రకు ఏర్పాటు చేసే సూపర్‌లగ్జరీ బస్సు

దర్శించే క్షేత్రాలివి..

కర్ణాటక - మైసూర్ యాత్రలో భాగంగా శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబిక, మహానందిలో మహానందీశ్వర, మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి, హంపిలో విరూపాక్ష ఆలయం, గోకర్ణంలో ఆత్మలింగం, మురుడేశ్వర్‌లో మురుడేశ్వరస్వామి, కొల్లూరులో మూకాంబికాదేవి ఆలయాలు, ఉడిపిలో కృష్ణదేవాలయం, శృంగేరిలో శారదాంబ దేవాలయం శక్తిపీఠం, హొర్నాడులో అన్నపూర్ణేశ్వరిదేవి, ధర్మస్థలంలో మంజునాథస్వామి, కుక్కేలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీరంగపట్నంలో రంగనాథస్వామి ఆలయాలు, మైసూర్‌లో చాముండేశ్వరిదేవి శక్తిపీఠాన్ని భక్తులు దర్శించుకోవచ్చు.

మరిన్ని వివరాల కోసం..

ఈ యాత్రకు సంబంధించి మరిన్ని వివరాలు, సమాచారం, టికెట్ల బుకింగ్ కోసం స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారులను లేదా 95023 00189, 99666 66544, 98660 45588 చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చు.

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: ఐదు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీలలో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పించాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టిఐఆర్‌యుఎంఎఎల్ఎఈడీయు. కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

'సత్య'లో 18 వరకు పండగ ఆఫర్లు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా తమ షోరూమ్‌ల్లో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై భారీ తగ్గింపుతో ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక విక్రయాలు కొనసాగిస్తున్నట్లు సత్య సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆఫర్లలో భాగంగా టెలివిజన్లు రూ. 7,990 నుంచి, ఫ్రిజ్‌లు రూ. 13,990, ఏసీలు 29,990, వాషింగ్‌మెషీన్లు రూ. 10,990 నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. 5జీ మొబైల్స్ ఫోన్లపై 7,990 నుంచి 60 శాతం వరకు డిస్కౌంట్, రూ. 12 వేల వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో వంటగది అవసరాలన్నీ ఒకసారి పొందేందుకు కంప్లీట్ కిచెన్ కాంబోను కేవలం రూ. 10,999కే అందిస్తున్నామని, ఇందులో గ్యాస్‌స్టౌవ్, కుక్కర్, గ్రైండర్, మిక్సీ వంటి ఉత్పత్తులు ఉన్నాయని తెలిపారు. వాటర్ హీటర్లు రూ. 3,300 నుంచి, ల్యాప్‌ట్యాప్‌లు రూ. 25,490 నుంచి అందుబాటులో ఉన్నాయని, ప్రతి కొనుగోలుపై బహుమతులు కూడా అందిస్తున్నామని తెలిపారు.

బాల్యం గుర్తుకొచ్చింది.. స్నేహం పలకరించింది

అనపర్తి గ్రామీణం: కాలం సంవత్సరాలుగా కరిగిపోవచ్చు.. జుట్టు నెరిసిపోవచ్చు.. కానీ ఆ మనుషుల మధ్య స్నేహం మాత్రం ఇంకా పదో తరగతిలో జ్ఞాపకాల్లోనే నిలిచిపోయింది. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978-79 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు పూర్వ విద్యార్థులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒకే వేదికపై కలిశారు. టీజీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి విద్యార్థుల మధురస్మృతులు పరిమళాలు వెదజల్లాయి. తరగతి గదిలో మొదలైన చెలిమి, కాలం గడిచేకొద్దీ గట్టి పడిందని నిరూపించింది. ఆపాత మధురాలను గుర్తుచేసుకుంటూ కొందరు భావోద్వేగానికి గురవగా.. మరికొందరు అప్పటి ఘటనలు గుర్తుచేస్తూ మిత్రుల్లో నవ్వులు పూయించారు. ఆనాటి గురువుల సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. డా. తేతలి దశరథ రామారెడ్డి, టి. సుధాకర్, గంగిరెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, సత్తి శ్రీవెంకటరెడ్డి, హోతా శర్మ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో కలిసిన విద్యార్థులు

శతాబ్దాల చరిత్ర కొత్తపేట ప్రభల తీర్థం

కొత్తపేట, న్యూస్‌టుడే: కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న ప్రభలతీర్థాలకి శతాబ్దాల చరిత్ర ఉంది.. కోనసీమలో పలుచోట్ల ప్రభల ఉత్సవాలు కనుమ రోజు జరుగుతుండగా ఎప్పటిలానే సంప్రదాయ ప్రకారం సంక్రాంతి రోజున కొత్తపేటలో నిర్వహించారు. పాత, కొత్త రామాలయాలు, బోడిపాలెం తదితర 12 ప్రభలతో ఏకాదశ రుద్ర రూపాలతో కొలువుదీరగా.. వేలాది సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గురువారం కొత్తపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో ప్రజల దర్శనార్థం వివిధ రకాల దేవుని ప్రతిరూపాలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో ఊరేగింపుగా ఏర్పాటు చేశారు. ● కొత్తపేట జూనియర్ కళాశాల మైదానంలో ప్రభల తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి సుమారు నాలుగు గంటలపాటూ నిరంతరంగా నిర్వహించిన బాణాసంచా ప్రదర్శన ఉత్సావాలకు మరింత శోభను చేకూర్చింది. కాంతులు విరజిల్లుతున్న మల్లెపందిరిలు, మనస్సును ఆకట్టుకునే విధంగా ఈత చెట్టులు, బుసలు కొడుతున్న పాములు, గదలు, మరెన్నో రకాల బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణసంచా కాల్పులను అనేకమంది చరవాణుల్లో బంధించారు.

అబ్బురపరుస్తున్న బాణసంచా

కొత్తపేటలో కొలువుదీరిన ప్రభలు

20 నుంచి క్షేత్రపాలకుడి కల్యాణం

అంతర్వేది: అంతర్వేది క్షేత్ర పాలకుడు పార్వతీనీలకంఠేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు దేవాదాయశాఖ, ఆలయ ఈవో, ఏసీ నాగ వరప్రసాద్, సిబ్బంది ఘనంగా చేస్తున్నారు. లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలకు ముందు ఐదు రోజుల పాటు ఈ స్వామి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఈ క్షేత్రంలో ఆనవాయితీ. ఈనెల 20న రాత్రి 7గం. లకు అంకురార్పణతో ప్రారంభమవుతుంది. 21న దివ్య కల్యాణం, 22, 23న ప్రత్యేక పూజలు, 24న శ్రీపుష్పోత్సవంతో ముగిస్తారు.

వేడుకగా సత్యదేవుని ప్రభోత్సవం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని ప్రభోత్సవం శుక్రవారం వేడుకగా జరిగింది. సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో గ్రామంలోని చినరావిచెట్టు వద్ద పురాతన రామాలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వద్దన్నా.. వినిపించుకోలేదు

● ప్రభలపై వైకాపా జెండాలు.. నేతలు, నటుల ఫొటోలు

అంబాజీపేట: పరమశివుడి ప్రతిరూపాలుగా కొలిచే సంక్రాంతి ప్రభలకు పార్టీల జెండాలు, రాజకీయ నాయకులు, సినీ నటుల చిత్రాలు వద్దని ముందుగానే సూచించినా కొందరు పట్టించుకోలేదు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలో కొందరు యువకులు వైకాపా జెండాలతో హల్‌చల్ చేశారు. ఎగువ కౌశిక నదిని ప్రభలు దాటే సమయంలో వారు వీటిని ప్రదర్శించారు. ఇంకొందరు అభిమాన నటుల ఫ్లెక్సీలు, బొమ్మలను ప్రభలతో పాటు ఊరేగింపులో ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ప్రభల తీర్థాల్లో ఈ తరహా పోకడలు వద్దని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి పోలీసులకు సూచించారు. ఈ అంశంపై పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజుతో మాట్లాడారు. వైకాపా జెండాల ప్రదర్శనపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభల ఉత్సవంలో వైకాపా జెండాతో ఇలా..

పోలీసులను ప్రశ్నిస్తున్న తేజస్వి

రాష్ట్రంలో 5 వేల ఆలయాల నిర్మాణం

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని తితిదే పాలక మండలి సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో తితిదే పాలకమండలి సమావేశం ఇటీవల నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5000 కొత్త ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి తీర్మానం చేసినట్లు చెప్పారు. కొత్తగా ఆలయాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే నిధులు మంజూరు చేస్తామన్నారు. దేవరపల్లి వెంకన్న సన్నిధి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు, అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తితిదే పాలకమండలి సభ్యుడు మునికోటేశ్వరరావుకు చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు

BUSINESS SERVICES

BUSINESS OFFER

మేముచేయుచున్న బిజినెస్ మీరు వ్యక్తి గతంగా గాని మాతో కలిపి చేయుట ద్వారా మంచి లాభాలను పొందండి. వివరాలకు: 9391717772.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాల్లో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మి లాడ్జిలో, SVG మార్కెట్, ఆర్.టి.సి. కాంప్లెక్ ఎదురుగా ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY

సంక్రాంతి శుభాకాంక్షలు
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
24-1-2026న (శనివారం) 11 Am to 5 PM వరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
25-1-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 10 AM to 5 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ (ICAS చెన్నై Regd.) వారి జ్యోతిష్య, వాస్తు కోర్సులకు ప్రవేశ ఆహ్వానము. ★ అమలాపురం ★ రాజమండ్రి కాకినాడ సెంటర్లలో 1) గీతా విద్యాలయం, అమలాపురం ★ 9492813554, 2) సరస్వతీ ఘాట్, గోదావరి గట్టు, రాజమండ్రి. సెల్: 9966666659. J.శ్రీనివాస్ www.icasindia.org

EENADU for Advertisement Contact: **8008597607**

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY

FLATS FOR SALE కాకినాడ సురేష్ నగర్ శ్రీ ప్రకాష్ సిటీ స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు తూర్పు మరియు పడమర ఫేసింగ్ 2 BHK FLATS అమ్మకానికి కలవు. Contact **63031 73055 90103 85888**

HOUSE FOR SALE

GENERAL

ఖండపల్లి గ్రామంలో కాముట్ల వీధిలో డబుల్ స్టేర్ బిల్డింగ్ క్రింద నివాసం, పైన షాపు అమ్మకము గానీ, అద్దెకు గానీ కలదు. Cell: 9392122526.

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30కి.మీ. దూరం మురారి గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60సెంట్లు భూమి అమ్మకం. (నో బ్రోకర్స్). 9032988265.

KAKINADA RURAL

1.15ఎకరముల పొలంఅమ్మకం కాకినాడ, కరప మండలం, వేములవాడ రామచంద్రపురం హైవేకు, లేవుట్‌నకు, ఇళ్లకు ఆనుకుని గొడౌన్, ఇండస్ట్రీస్‌కు అనువైనది అమ్మకం. నో బ్రోకర్స్. 9399934499.

GENERAL

1.10 Acre N/E Corner Full Tar Road Facing Commercial Land Opp. to N.T. Rajapuram Sachivalayam. 1.8KM from Gandapalli Highway. 8500268603.

PLOT FOR SALE

BHOGAPURAM

Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

EENADU e Classifieds

KAKINADA CITY

★★★ **కాకినాడదగ్గరలో** Plot కొనండి, Plot గెలవండి భారీ సంక్రాంతి ఆఫర్లు గజం కేవలం 9,999/- రూ. నుంచి ప్రారంభం. ✆ 8886663196

కాకినాడకు అతిదగ్గరలో తక్కువ రేట్లకే సైట్లు, బిల్డింగ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు అమ్మబడును. ✆ 77806 73892.

అన్నవరం సెంటు: 11 లక్షలు, మాధవపట్నం సెంటు: 9 లక్షలు, పెద్దాపురం సెంటు: 7 లక్షలు, ఉండూరు ఊరు మధ్య: 4 లక్షలు, బ్యాంక్ లోన్. 9063385043.

KAKINADA RURAL

కాకినాడ బైపాస్‌కు 1కి.మీ. దూరం మాధవపట్నం- రామేశ్వరం కొత్తూరులో 125, 135, 145, 275 చ॥గ॥లు, 40అ॥ల రోడ్లతో టీచర్లు, లాయర్లు, బ్యాంకు ఉద్యోగుల ఇళ్లతో అభివృద్ధి చెందిన లేఅవుట్, ✆ 98481 33799.

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చ॥గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/ వాట్సాప్: 80748 57055.

RK Township వారి రాజమండ్రి వెంచర్లపై సంక్రాంతి Gold ఆఫర్ కలదు. వివరాలకు: బ్రాంచ్ మేనేజర్, Contact Cell: 99490 91197.

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి సమీపం రాజానగరం పంచాయతీ "చక్రద్వారబంధం" రోడ్డు సాయినగర్‌లో 191.5 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 9704193649, 8019227241

GENERAL

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067.

TO LET

COMMERCIAL

4BHK flat with 2 car parking near GAIL office in Rajahmundry. Suitable for corporate Office/ Guest House. Cont: 9347146720

JOBS

WANTED MARKETING MANAGERS/ Asst. Managers, Qualification: Degree, Age: Above 30 Years, Salary: Above 30K. Cont. Cell: 90108 09384.

కాకినాడ, హోటల్-రెస్టారెంట్‌లో బిర్యాని, సౌత్ ఇండియన్, చైనీస్, టిఫిన్స్ మాస్టర్స్, సప్లయర్స్, హెల్పర్స్ (బాయ్స్ & గర్ల్స్) కావలెను. Contact Cell: 99493 43008.

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ల వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-50 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	157-00
రిటైల్ లైవ్	184-00
డ్రెస్డ్	267-00
స్కిన్‌లెస్	304-00

92.7 FM Rajamahendravaram — ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి దుర్గేష్

రామచంద్రపురం: రామచంద్రపురం కేంద్రంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరాలయాన్ని రూ. 4కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వి.ఎస్.ఎం కళాశాలలో జరుగుతున్న కోనసీమ సంక్రాంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆనందం సంతోషం పెంపొందించేందుకు ప్రభుత్వం సంక్రాంతి, గండికోట సంబరాలు అమరావతి ఆవకాయ, డ్రాగన్ పడవ పోటీలు, జగ్గన్నతోట ప్రభల తీర్థం నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ జరగని విధంగా సంక్రాంతి సంబరాలు మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ప్రజల్లో సామాజిక ఐక్యత, సమానత్వానికి మంత్రి సుభాష్ చేస్తున్న కృషిని దుర్గేష్ ప్రశంసించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకునేందుకు నిత్యం పనిచేస్తానన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మంత్రులు దుర్గేష్, సుభాష్, నాయకులు

కోటిపల్లి- ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధనే లక్ష్యం

కోనసీమ జిల్లా ప్రజల వాంఛ అయిన కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి నిర్మాణ లక్ష్యమే ధ్యేయంగా పనిచేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. వి.ఎస్.ఎం కళాశాలల ప్రాంగణం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి ఉత్సవ్-2026 ముగింపు సభలో మంత్రి మాట్లాడారు.

గోదావరిలో స్నానానికి దిగి బాలుడి మృతి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు గోదావరిలో దిగిన బాలుడు మృతి చెందడం ఆ ఇంట్లో తీరని విషాదం నింపింది. కనుమ పండుగ వేళ బాలుడు విగతజీవిగా మారిన ఘటన అందరినీ కలచివేసింది. పెనకనమెట్టకు చెందిన వేములూరి దినేష్ (17) రాజమహేంద్రవరంలోని ఓ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతున్నాడు. ఖమ్మంలో ఉండే మావయ్య పసలపూడి రాజీవ్‌గాంధీ పెనకనమెట్ట రాగా దినేష్, బంధువుల పిల్లలు అయిదుగురు) శుక్రవారం ఉదయం కొవ్వూరు వచ్చారు. 11.30 గంటల సమయంలో స్నానం చేసేందుకు దండకుంట రేవులో గోదావరిలోకి దిగారు. దినేష్ గోదావరిలో కొద్దిగా లోపలికి వెళ్లగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ విషయం అగ్నిమాపక సిబ్బంది, పట్టణ పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో దినేష్ మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. దినేష్‌కు తల్లి లేనందున అమ్మమ్మ వద్ద పెనకనమెట్టలో ఉంటున్నాడు.

వేములూరి దినేష్ (పాత చిత్రం)

బస్సును ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరం - పి.ఎర్రగొండ రహదారిలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.ఎర్రగొండ గ్రామానికి చెందిన నైని బాబూరావు(42) సంక్రాంతి సందర్భంగా వై.రామవరంలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా.. ఏలేశ్వరం నుంచి వై.రామవరం వస్తున్న బస్సును ఢీకొట్టాడు. బైక్ పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకుని బాబూరావు కాలిపోయి మృతి చెందాడు. దీనిపై ఎస్సై పృధ్వీయాదవ్ కేసు నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | రంపచోడవరం 9490877172 | అడ్డతీగల 9491575045 | దేవీపట్నం 7673936638 | గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లిలో నిర్మించిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం నిరుపయోగంగా మారింది. నిధులు నిరుపయోగంగా మారాయి.
-మణికంఠ, మారేడుమిల్లి

సమాధానం: సంపద సృష్టి కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం. **- రవికిశోర్, ఎంపీడీవో – న్యూస్‌టుడే, మారేడుమిల్లి**

సమస్య: పెదగెద్దాడ నుంచి సోకులగూడెం వెళ్లే రహదారి రాళ్లు లేచి ఛిద్రంగా మారింది.
-ముర్ల బుల్లబ్బాయిరెడ్డి, సోకులగూడెం

సమాధానం: రెండు గ్రామాల మధ్య రోడ్డు మంజూరైంది. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
-రమేష్, డీఈ, పంచాయతీరాజ్ (పీఐయూ), రంపచోడవరం

– న్యూస్‌టుడే, రంపచోడవరం

సమస్య: బోయపాడు నుంచి తాళ్లపాలెం వెళ్లే దారి రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. వాహనదారులు నరకం చూస్తున్నారు. **-చరణ్, రాజవొమ్మంగి**

సమాధానం: రహదారి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడతాం. **-ప్రదీప్, ఏఈఈ. ర.భ.**

– న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

ఆ నిపుణులు ఎవరో..?

✦ అంధకారంలో సున్నంమట్కా గ్రామం
✦ మూడు కేంద్రాల్లో 73 బ్యాటరీల తరలింపు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రభుత్వం సమకూర్చే వనరులు అపహరణకు గురవుతున్నాయి. మరమ్మతు పనులు చేపట్టేందుకు వచ్చామని.. నిపుణులమని.. స్థానికులను నమ్మించి పలువురు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ వనరులు దోచుకుంటున్నారు. ఎవరు నిపుణులో... ఎవరు దొంగలో తెలియక గ్రామస్థులు భయాందోళనకు గురవతున్నారు.

✦ మండలంలోని సున్నంమట్కా గ్రామంలో ఆరేళ్ల క్రితం మూడు సోలార్ విద్యుత్తు కేంద్రాలను సోలార్ విద్యుత్తు పథకంలో భాగంగా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోని 55 కుటుంబాలకు ఇంటింటికి విద్యుత్తు, వీధి దీపాలు, విద్యుత్తు కేంద్రాల్లో సెల్‌ఫోన్, ఇతర విద్యుత్తు ఉపకరణాలు ఛార్జింగ్ పెట్టుకునేందుకు పాయింట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటి వరకు చీకట్లో మగ్గిన సున్నంమట్కా ప్రజలకు సోలార్ విద్యుత్తు కాంతులు అందాయి. అయితే ఏడాదిన్నర క్రితం వచ్చిన గాలి వాన, పిడుగులకు ఓ ఛార్జింగ్ కేంద్రంలో సమస్యలు తలెత్తాయి. తరవాత మరో కేంద్రంలో బ్యాటరీల సమస్య వచ్చింది. విషయాన్ని గ్రామస్థులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఖాళీగా ఉన్న ఇన్వెర్టర్ దిమ్మె, బ్యాటరీ స్టాండ్

✦ సాంకేతిక నిపుణులు వస్తారంటూ అధికారులు చెప్పుకొచ్చారు. అయిదు నెలల క్రితం కొంత మంది వ్యక్తులు ఓ కారు, వ్యాన్‌లో వచ్చి తాము మెకానిక్‌ల మని, బ్యాటరీలు మార్చాలని చెప్పి మూడు కేంద్రాల్లోని 73 బ్యాటరీలను తీసుకొని వెళ్లిపోయారు. అయితే తీసుకెళ్లిన వారు నిపుణులా.. మోసగాళ్లా.. అన్న విషయాన్ని స్థానికులు గుర్తించలేకపోయారు. నెలలు గడుస్తున్నా వారు ఎప్పటికీ రాకపోవడంతో విషయాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. అధికారులను ఆరా తీశారు. దీనిపై ఐటీడీఏ అధికారులు దృష్టి సారించి గ్రామంలో విద్యుత్తు వెలుగులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ చీకట్లోనే..

రాత్రివేళ చీకట్లోనే మగ్గాల్సిన పరిస్థితి మళ్లీ నెలకొంది. రేషన్ దుకాణాల్లో కిరోసిన్ అందించకపోవడంతో డీజిల్‌తో దీపాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. ఆ వెలుగుల్లోనే రాత్రి వేళల్లో భోజనాలు చేస్తున్నాం. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. నిద్రపోలేకపోతున్నాం. జ్వరాలు వస్తున్నాయి. **- మడకం దేవా**

న్యాయం చేయండి..

చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. విష పురుగులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. **- వంజం గంగరాజు**

తెలిసిన వారి సహకారంతోనే..

అపహరణకు గురైన బ్యాటరీల విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లాం. వారి సలహాతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. తెలిసిన వారి సహకారంతోనే బ్యాటరీల అపహరణకు గురై ఉంటాయి.
- పిట్టా రామారావు, సర్పంచ్, చిన్న మట్టపల్లి పంచాయతీ

తిరుగు ప్రయాణాలు మొదలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పండగ అనంతరం శుక్రవారం సాయంత్రం నుంచి దూరప్రాంత ప్రయాణాలు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ సర్వీసులతోపాటు రెండు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులు బయలుదేరినట్లు డిపో అధికారులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌కు మరో నాలుగు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ, విశాఖపట్నం తదితర దూరప్రాంతాలకు మాత్రం ప్రస్తుతం తిరుగుప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండటంతో షెడ్యూల్ సర్వీసులనే నడిపిస్తామని, శనివారం నుంచి తిరుగు ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. భోగి పండగ రోజు వరకు ఇక్కడి ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడగా సంక్రాంతి రోజున మాత్రం వెలవెలబోయింది. ఇప్పుడు దూరప్రాంత సర్వీసుల్లో కొంచెం రద్దీ మొదలవగా ఉమ్మడి జిల్లా పరిధిలో తిరిగే లోకల్ సర్వీసుల్లో మాత్రం ఇంకా మొదలు కాలేదు. శనివారం సాయంత్రం నుంచి లోకల్ సర్వీసుల్లో కూడా రద్దీ మొదలయ్యే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోకి వస్తున్న ప్రయాణికులు

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

ఎటపాక: మండలంలోని పాలమడుగు గ్రామ యూత్ ఆధ్వర్యంలో పర్శిక వైశాలి జ్ఞాపకార్థం మండల స్థాయి వాలీబాల్, విలువిద్య పోటీలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు పీఈటీ లక్ష్మణ్, సురేశ్ శుక్రవారం తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.600 ఉంటుందన్నారు. వాలీబాల్ పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి బహుమతి కింద నగదు రూ.8000, రూ.5000, రూ.2500 ఇవ్వడం జరుగుతుందన్నారు. విలు విద్యలో మొదటి రెండు స్థానాల్లో గెలుపొందిన వారికి రూ. 2000, రూ.1000 ఉంటుందని తెలిపారు. ఉదయం గం.9.00ల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

పొగమంచు కమ్మేస్తోంది

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: చలితో మన్యం వణుకుతోంది. రాజవొమ్మంగిలో రెండు రోజులుగా జాతీయ రహదారిపై దట్టమైన పొగమంచు కురుస్తోంది. ఉదయం 8 గంటలు దాటినా మంచు తెరలు వీడడం లేదు. వాహనదారులు వాహనాల వెలుగుల్లోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. చిన్నారులు, వృద్ధులు, పాదచారులు చలిని తట్టుకోలేకపోతున్నారు. జాతీయ రహదారిపై పలుచోట్ల పోలీసులు పర్యాటకులకు, వాహనదారులకు భద్రతపై సూచనలు చేస్తున్నారు.

రాజవొమ్మంగిలో జాతీయ రహదారిపై పడుతున్న మంచు

సందర్శకుల సందడితో పుష్కరవనం

సంక్రాంతి పండగ కనుమ సందర్భంగా శుక్రవారం గోదావరి మహాపుష్కరవనం సందర్శకులతో సందడిగా మారింది. చిన్నారులతో వనమంతా సరదాగా విహరించారు. రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో

శిక్షణ పొందుతున్న సిక్కిం విద్యార్థినులు వనంలో ఏర్పాటు చేసిన ఆర్చరీ, షూటింగ్‌లలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

ఆక్రమణలు తొలగించినా అదే పరిస్థితి..!

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా, ఆక్రమణదారులు వాటికి తూట్లు పొడుస్తూనే ఉన్నారు. ఫలితంగా రహదారులపై వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. పోలవరం జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మారేడుమిల్లిలో ప్రధాన రహదారుల వెంబడి ఏడాది క్రితం ఆక్రమణలు తొలగించారు. ఏడాది గడవక ముందే యథావిధిగా నిర్మాణాలు ముందుకు వస్తుండటంతో పరిస్థితులు షరామామూలుగా మారుతున్నాయి.

ఇదీ పరిస్థితి...

రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన మార్గాన్ని అంతర్రాష్ట్ర రహదారిగా గుర్తించడంతో వాహన రద్దీ పెరిగిపోయింది. ఈ మార్గంలోనే విలీన మండలాలతోపాటు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో పగలూ రాత్రి విరామం లేకుండా భారీ వాహనాలు సంచరిస్తున్నాయి. మారేడుమిల్లి నుంచి బోదులూరు, బొడ్లంక మీదుగా గుర్తేడు, పాతకోట వెళ్లే రహదారి కూడా రద్దీగా మారింది. నిత్యం పర్యాటకులు వందలాదిగా తరలి వస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంబులెన్సులు సైతం నిలిచిపోతుండటంతో ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. గత ఏప్రిల్ నెలలో మారేడుమిల్లిలో ఆయా ప్రధాన రహదారుల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించారు. పరిస్థితులు చక్కబడతాయని భావించినా పరిస్థితుల్లో మార్పులేదు. పూర్తిగా ఏడాది గడవక ముందే పరిస్థితులు షరామామూలుగా మారుతున్నాయి. క్రమంగా రహదారిపైకి నిర్మాణాలు చేరుతున్నాయి. కొన్ని పర్యాటక వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపేస్తుండటంతో అంతరాయం ఏర్పడుతుంది.

మారేడుమిల్లి- బోదులూరురోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

వేటుకూరు కూడలి..

మారేడుమిల్లి నుంచి లోతట్టు గ్రామాలకు వెళ్లే రహదారుల కూడళ్లలో రక్షణ చర్యలు కరవయ్యాయి. మారేడుమిల్లి శివారు నుంచి పూజారిపాకలు, వేటుకూరు, పందిరిమామిడికోట, ఇవ్వంపల్లి, భీమవరం మీదుగా చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం అనేక వాహనాలు తిరుగుతుంటాయి. ఆయా గ్రామాల్లో పర్యాటకుల ఆతిథ్యం కోసం నిర్మించిన రిసార్టులు ఉండడంతో పర్యాటకుల వాహనాలు భారీగా తిరుగుతున్నాయి. మారేడుమిల్లి-వేటుకూరు కూడలిలో తుప్పలు పెరిగిపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రక్షణ ఏర్పాట్లు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

రహదారి భద్రతపై అవగాహన

ఏవీఏ రోడ్డు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు రాజమహేంద్రవరంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బొమ్మూరు కూడలిలో ఆటో రిక్షా కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం నిషేధమని స్పష్టం చేసినట్లు తెలిపారు. వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని సూచించినట్లు వివరించారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అవసరంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఒనువులమ్మకు ప్రత్యేక పూజలు

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: తొర్రేడులోని ఒనువులమ్మ ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. గరగల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం భక్తుల సమక్షంలో చండీ హోమం జరిపించారు.

ఆలయానికి ఉపకరణం

ఎటపాక, న్యూస్‌టుడే: గౌరిదేవిపేట పంచాయతీ గన్నేరుకొయ్యపాడులోని రామాలయానికి మద్దిబోయిన వీరప్రకాశ్ శుక్రవారం మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు.

వైభవంగా సారంగధరుడి తీర్థం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం సమీపంలోని సారంగధరమెట్టపై కొలువైన స్వామివారి తీర్థం వైభవంగా జరిగింది. కనుమ పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం సారంగధరేశ్వరుని ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, మధ్యాహ్నం 3 గంటలకు త్రయోదశి సందర్భంగా నందీశ్వరుడికి అభిషేకం జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతనామ పూజ, నీరాజన మంత్రపుష్పం, వేదాశీర్వాదం నిర్వహించారు. తీర్థం కావడంతో ఆలయాన్ని, ఆవరణలోని సారంగధరుడి చరిత్రకు సంబంధించిన విగ్రహాలను పూలతో అలంకరించారు. ఆలయ మేనేజర్ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కె.వి.డి.ఎస్.సి.వి. చౌదరి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఏలేశ్వరానికి బస్సు సదుపాయం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం సమకూరేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించాలని సీఎం చంద్రబాబుని కోరినట్లు ఆమె తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కింద్ర రింగ్ రోడ్డు(లబ్బర్తి, లాగరాయి, కింద్ర, తాళ్లపాలెం), కాకరపాడు, రాజవొమ్మంగి మీదుగా ఏలేశ్వరం వెళ్లే బస్సు సౌకర్యం కల్పించారు. గతంలో నర్సీపట్నం, ఏలేశ్వరం వెళ్లాలంటే ఆయా గ్రామాల ప్రజలు రాజవొమ్మంగి రావాల్సిందే. ఇక్కట్లు తీరడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు వద్ద ఆయా గ్రామాల ప్రజలు

కుక్కల బారి నుంచి జింకను కాపాడిన గ్రామస్థులు

మోతుగూడెం (రంపచోడవరం): చింతూరు అటవీ డివిజన్ లక్కవరం రేంజ్ అటవీ ప్రాంతంలో ఓ జింకను శునకాలు తరుముతుండగా గ్రామస్థులు రక్షించారు. మోతుగూడెం జగదాంబ సెంటర్ వద్ద ఉన్న మర్రి చెట్టు వద్దకు జింక చేరుకోవడంతో స్థానికులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. స్వల్ప గాయాల పాలైన జింకను రేంజ్ కార్యాలయానికి తీసుకొని వెళ్లారు. వైద్యం చేయించి తిరిగి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్లు డీఆర్వో భానుప్రకాశ్ తెలిపారు.

జింకను కాపాడిన గ్రామస్థులు

నిత్యావసర సరకులు అందిస్తున్న హెచ్‌ఎం బాలరాజు, తదితరులు

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

రంపచోడవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు రంపచోడవరం మండలం ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.బాలరాజు, సీఆర్‌ఎంటీ శివ, యూత్ ప్రెసిడెంట్ జగదీష్‌రెడ్డి నిత్యావసర సరకులు, కూరగాయలు, నూతన వస్త్రాలను బాధితులకు అందజేశారు. ప్రతి మహిళకు రూ.500ల చొప్పున రూ.42,500లను అందించారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంక గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం సంబవించి పలువురు నిరాశ్రయులయ్యారు.

వీధులన్నీ రంగవల్లులై..

వేటుకూరులో చెక్క భజన చేస్తున్న గిరిజనులు

కృష్ణవరంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు

జగ్గవరంలో ముగ్గును పరిశీలిస్తున్న కూటమి నాయకులు

పీఎంకోటలో ప్రతిభ చాటిన వారికి బహుమతుల అందజేత

నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లా రంపచోడవరం మన్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గిరిజనులు భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రంగులతో ముగ్గులు వేసి గొబ్బిళ్లను ఉంచారు. రేల, థింసా నృత్యాలతో మహిళలు ఆనందంగా గడిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కోడి పందేలు నిర్వహించారు. మహిళలు పిండి వంటల తయారీలో.. యువత క్రీడల్లో ఉల్లాసంగా గడిపారు. వాలీబాల్, క్రికెట్ టోర్నమెంటులు నిర్వహించారు.

వరరామచంద్రాపురం: వీఆర్‌పురం, రేఖపల్లి పంచాయతీల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మోతుగూడెం: లోయర్ సీలేరు ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో వేకువజామున పశువులకు నదిలో స్నానాలు చేయించి, కొమ్ములకు రంగులు పూసి పూజలు చేశారు. ఎడ్ల బండ్లపై చిన్నారులను ఎక్కించి వీధుల్లో ఊరేగించారు.

కూనవరం: మండలంలోని జగ్గవరం, నర్సింగపేట, కూటూరు, ముళ్లూరు, పోచవరం కాలనీ తదితర గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జగ్గవరంలో ముగ్గులను కూటమి నాయకులు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రంపచోడవరం: సోకులగూడెం, గోగుమిల్లి, సీతపల్లి, బూసిగూడెం, వాడపల్లి, కాకవాడ గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భాజపా మండల మాజీ అధ్యక్షుడు ముర్ల బాలురెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పెదగెద్దాడలో యువత క్రికెట్, మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల, డాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కృష్ణవరం పంచాయతీలో మహిళా ఉద్యోగులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వీఆర్‌పురంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఆనందోత్సాహాలు

మారేడుమిల్లి: మన్యంలోని కుట్రవాడ, వేటుకూరు, పందిరిమామిడికోట, గుజ్జుమామిడివలస, బొడ్లంక గ్రామాల్లో కోలాటాలు, సంప్రదాయ గిరిజన నృత్యాలు చేశారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. వేటుకూరు, గుర్తేడులో చెక్క భజనలు ఆకట్టుకున్నాయి.

పర్యాటకుల కోలాహలం.. మారేడుమిల్లిలోని పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. గురువారం సాయంత్రం నుంచే సందర్శకులు పోటెత్తారు. జలతరంగిణి, అమృతధార, వలస జలపాతాల వద్ద సందడిగా గడిపారు. అవసరమైన సామగ్రి తెచ్చుకుని రోడ్డు పక్కనే వంటలు చేసుకున్నారు.

సీతపల్లిలో బాపనమ్మతల్లి ఆలయం వద్ద..

వైభవంగా చెన్నకేశ్వరస్వామి సంబరం

కూనవరం: చెన్నకేశ్వరస్వామి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా సంప్రదాయ బద్ధంగా స్వామివారికి శబరి గోదావరి సంగమం వద్ద పుణ్య స్నానం చేస్తారు. కూనవరం, టేకులబోరులో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

రంపచోవవరం: మన్యం ముఖద్వారం సీతపల్లి బాపనమ్మతల్లి ఆలయాన్ని పర్యాటకులు ముందుగా దర్శించుకొని అనంతరం పర్యాటక ప్రాంతాలను వీక్షించారు. సీతపల్లి వాగు వద్ద ఉన్న ఉద్యాన పార్కు, రంపకొండపై, భూపతిపాలెంలోని జలాశయాలు పర్యాటకులతో నిండిపోయాయి.

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

శిథిలమైపోతున్నాయి..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని.. పెచ్చులు ఎక్కడ మీద పడతాయోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉండడం, ప్రాంగణాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి.

✦ ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని ఉద్యోగుల నివాస గృహాల్లో ఒక దానిని రైతు సేవా కేంద్రంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే గదులు చెమ్మెక్కుతున్నాయి. పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. రైతులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు విత్తనాలు, ఎరువులు, యూరియా నిల్వచేసేందుకు భవనం లేకపోవడంతో వ్యవసాయ అధికారి, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం సమీపాన నిర్మాణం చేపట్టిన రైతు సేవా కేంద్రం భవనం పనులు పూర్తిచేసి ఇంకా సంబంధిత శాఖకు అప్పగించలేదు. దీంతో సమస్య ఇంకా అలానే ఉంది.

✦ స్థానిక పశువైద్యశాల దుస్థితి మరింత దారుణంగా ఉంది. గోడలు చెమ్మెక్కుతున్నాయి. పెచ్చులు పడిపోతున్నాయి. మందుల గది పరిస్థితి మరీ అధ్వానం. చిన్న వర్షం పడినా దస్త్రాలు తడిచిపోతున్నాయి. సంబంధిత శాఖాధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రాజవొమ్మంగిలో శిథిలావస్థలో ఉన్న రైతు సేవా కేంద్రం

నిర్వహణ కొరవడి..

మారేడుమిల్లి: మారేడుమిల్లి ప్రజలకు నీటిని సరఫరా చేసే ట్యాంకు నిర్లక్ష్యానికి గురైంది. నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. మండల కేంద్రమైన మారేడుమిల్లిలోని ప్రజలకు మంచినీటిని అందించే లక్ష్యంతో 1978లో మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. దీనిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సుమారు 70వేల లీటర్ల సామర్థ్యంతో స్థానిక కొండపై దీనికి సంబంధించి ట్యాంకును నిర్మించారు. సత్యసాయి రక్షిత మంచినీటి పథకం నీటిని, అలాగే రూ.1.47 కోట్ల వ్యయంతో నిర్మించిన మంచినీటి పథకానికి చెందిన నీటిని ఈ ట్యాంకులోకి నింపి, దాని ద్వారా గ్రామంలో సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో మంచినీటి పథకం నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. శుభ్రం చేసే తేదీని ట్యాంకుపై నమోదు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా ట్యాంకును శుభ్రం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ట్యాంకుపై మొక్కలు పెరిగిపోయాయి. క్రమంగా పెద్దవై ట్యాంకు పగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి పాత ట్యాంకు పక్కనే మరో ట్యాంకును నిర్మించింది. అది కూడా వినియోగంలోకి రావడంతో కొంత మేర నీటి ఇబ్బందులు తొలగాయి. పాత ట్యాంకు పూర్తిగా శిథిలమైపోతే మాత్రం మళ్లీ ఇబ్బందులు తలెత్తుతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మారేడుమిల్లిలో శిథిలస్థితికి చేరిన నీటి ట్యాంకు

గోదారోళ్లతో మామూలుగా ఉండదు

కడియం, న్యూస్‌టుడే: రాష్ట్రం నలుమూలల్లోనూ గోదారోళ్లంటే ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇక్కడి వాళ్లంతా మాటల్లో వెటకారం, భోజనం వడ్డించడంలో ప్రేమను కురిపిస్తారని పేరు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తోరాటి శివసూర్యకు అదే మండలంలోని జేగురుపాడుకు చెందిన రంకిరెడ్డి లీలాదేవితో గతేడాది వివాహమైంది. అతడి మామ రంకిరెడ్డి సుబ్రహ్మణ్యం తొలిసారి పండక్కి ఇంటికి వచ్చిన కొత్త అల్లుడికి ఒకటి కాదు, రెండు కాదు దాదాపు 70 రకాల వంటకాలతో ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. దీంతో గోదారోళ్ల మర్యాదలంటే అంతేగా అంటూ పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

70 రకాల వంటకాలతో నూతన దంపతులు

బొమ్మూరు: సంక్రాంతి అంటే కొత్త అల్లుళ్లకు పండగే. బొమ్మూరు వెంకటగిరికొండకు చెందిన ముద్దాల తిరుపతిరావు, శ్రీదేవిల అల్లుడికి 51 రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన దంపతులైన వరుణ్, ప్రత్యూషలకు ప్రత్యేకంగా వండి, వడ్డించామని తిరుపతిరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నరసన్న గ్రామోత్సవం

కోరుకొండ : ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామివారి గ్రామోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. గురువారం పశ్చిమ గోనగూడెం, శుక్రవారం రాత్రి జంబూపట్నంలో పుల్లి బుజ్జిబాబు స్వగృహం వద్ద అర్చన, విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలు ముగియడంతో ఏటా సంప్రదాయబద్ధంగా ఈ రెండు గ్రామాలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆయా గ్రామాలకు తీసుకెళ్లారు. గిరిధరాచార్యులు, సంతోష్, వంశీ, అర్చక స్వాములు పాల్గొన్నారు.

(c) eenadu

తెప్పోత్సవం... చూసిన కనులదే భాగ్యం

కనుమ పర్వదినం సందర్భంగా రంగాయుడు చెరువులో శుక్రవారం రాత్రి నిర్వహించిన స్వామివారి తెప్పోత్సవం కనులపండువగా సాగింది. శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. ముందుగా రాజ్యలక్ష్మీ సమేత ప్రసన్న చెన్నకేశవస్వామి, గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, రమా వసుంధరా సమేత సత్యనారాయణ స్వామి, సీతారామ స్వామి వార్ల నగరోత్సవం వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిర్వహించిన తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ రాచగర్ల వెంకటరావు, ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం

రంగరాయుడు చెరువులో అమ్మవార్లతో కలిసి తెప్పపై విహరిస్తున్న చెన్నకేశవస్వామి

జిల్లాకు ఉపాధి భారమే!

◗ పథకంలో మార్పుల ఫలితం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు, చేర్పులు చేసి... 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' (వీబీ జీ రామ్ జీ) పేరుతో ఏప్రిల్ 1 నుంచి అమలుకు నిర్ణయించింది. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పంచాయరాజ్‌శాఖ ఆదేశాలతో ఈ నెల 5న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కొత్త పథకంలో కూలీల పని దినాలు పెంచడం కొంత ఉపశమనం కలిగిస్తున్నా... ఇప్పటి వరకు పది శాతంగా ఉన్న రాష్ట్ర వాటాను 40 శాతానికి పెంచడం అదనపు భారం కానుంది. – న్యూస్‌టుడే, కలెక్టరేట్

2007 నుంచి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.403.29 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనాల కింద రూ.253.55 కోట్లు చెల్లించారు. ప్రస్తుతం రాష్ట్ర వాటా కింద ఈ మొత్తం వ్యయంలో పది శాతం అంటే రూ.40.30 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది. కొత్త పథకంలో అయితే ఇదే పరిస్థితుల్లో రూ.161.20 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కూలీల వేతనాల చెల్లింపుల ఆధారంగా ఈ భారం ఉంటుంది. కూలీల వేతన బడ్జెట్‌లో 60:40 కింద మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కేటాయించనున్నారు.

నాలుగేళ్లలో ఉపాధి నిధుల వినియోగం...

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2022-23	595.41
2023-24	520.39
2024-25	402.71
2025-26	403.29 (ఇప్పటివరకు)

కాంపొనెంట్ నిధులు పెరుగుతాయ్...

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం పరిధిలో 3.59 లక్షల ఉపాధి కార్డులు జారీ చేయగా.. 6.22 లక్షల మంది కూలీలు పనులకు వచ్చారు. పల్లెల్లో ప్రభుత్వ భవనాలు మొదలు అన్ని రకాల రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద విడుదలయ్యే మెటీరియల్ కాంపొనెంట్ నిధులే ప్రధాన ఆధారం. 'వీబీ జీ రామ్ జీ' పథకం అమల్లోకి వచ్చాక కూలీల పనిదినాలు 100 నుంచి 125కు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంపొనెంట్ నిధులు సైతం పెరగనున్నాయి. తద్వారా పల్లెల్లో సీసీ, గ్రావెల్, బీటీ రోడ్లు, మురుగు కాలువలు, పండ్లతోటలు, మొక్కల పెంపకంతో పాటు... ఇంకుడు గుంతలు వంటి జల సంరక్షణ పనులకు మరింత ఊతం లభించనుంది.

తొడగొట్టిన కోడి

◗ గోదావరి జిల్లాలను తలపించిన పందెం బరులు

కోడి తొడగొట్టింది... పొట్టేలు కాలు దువ్వింది... పెద్ద ఎత్తున కరెన్సీ కట్టలు చేతులు మారాయి. సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా... గోదావరి జిల్లాలను తలపించే స్థాయిలో బరులు ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో పందేల రూపంలో రూ.వంద కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా.

–న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలెం బరిలో తలపడుతున్న కోళ్లు

కందుకూరు, ఉలవపాడు ప్రాంతాల్లో పండగ రోజులకు ముందు పోలీసులు దూకుడుగా వ్యవహరించారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన బరులను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. తీవ్రస్థాయిలో పోటీలు జరిగే ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్న వారే నేరుగా కోళ్లు పట్టుకుని పందేలు వేయడంతో స్థానిక నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీర ప్రాంత మండలాలతో పాటు సంతనూతలపాడు, చీమకుర్తి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. పోటీలు వీక్షించేవారి నుంచి ఎంట్రీ ఫీజులు వసూలు చేసి... బరుల వద్దే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. భోజన వసతి కల్పించారు. ఒంగోలు సమీప నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పాటు తెలంగాణ నుంచి వచ్చిన మరో ఎమ్మెల్యే పోటీల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పశ్చిమ ప్రకాశంలోనూ కొండలు, అటవీ పరిసరాల్లో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించారు. మార్కాపురంలో బరి ఏర్పాటు చేసినా కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో చెడ్డపేరు వస్తుందని చివరి నిమిషంలో వెనక్కు తగ్గినట్లు తెలిసింది.

మార్కాపురం, ప్రకాశం జిల్లాల పరిధిలో 20కి పైగా పెద్ద బరులు ఏర్పాటయ్యాయి. మూడు రోజుల్లో దాదాపు రూ.వంద కోట్లు చేతులు మారినట్లు అంచనా. పెద్ద శిబిరాల్లో కొన్ని పందేలు రూ.కోటికి పైగా జరిగినట్లు సమాచారం.

ఒంగోలు మండలం ఉలిచిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శనలో... పొట్టేళ్ల కొమ్ములకు రాజకీయ పార్టీల రంగులు పూశారు. వాటి చర్మంపై ఉన్న వెంట్రుకలనూ కత్తిరించి బాస్, డాన్ అన్న పేర్లు తీర్చిదిద్దారు.

ముగ్గుల్లో ముచ్చటైన సందేశం

ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కనిగిరి శివనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో... బ్యాల వివాహాలు, బాలికా విద్య ప్రాధాన్యం, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను కళ్లకు కట్టేలా తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆలోచింపజేశాయి. విజేతలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యుడు గుత్తి శ్రీధర్ బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కనిగిరి

సపోటా... పడిపోతున్న ధర!

◗ నష్టం తప్పదని రైతుల్లో ఆందోళన

సపోటా ధరలు దిగజారడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉలవపాడు మార్కెట్‌కు తక్కువగానే సరకు వస్తున్నా ధరలు ఆశాజనకంగా లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల రైతులు మార్కెట్‌కు ఉత్పత్తిని తరలిస్తారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాదు తదితర నగరాలకు ఎగుమతవుతాయి. మార్కెట్ ప్రారంభంలో పాల సపోటా యాభై కిలోల బస్తాకు రూ.700, ఫారిన్ రకానికి రూ.800 చొప్పున ధర లభించింది. తరువాత మరింత పెరిగి రూ.వెయ్యి వరకు పలికింది. అంతా ఆశాజనకంగా ఉందనుకుంటున్న తరుణంలో పరిస్థితి తలకిందులైంది. వారం రోజుల్లోనే దిగజారి రూ.600కు చేరింది. కోత కూలీ, రవాణా ఖర్చులకే అవి చాలడం లేదని సాగుదారులు వాపోతున్నారు. ప్రస్తుతం రోజుకు 150 బస్తాల్లోపే సరకు వస్తోంది. సీజన్‌లో రెండు వేల నుంచి మూడు వేల బస్తాలు వస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టం తప్పదని ఆందోళన చెతున్నారు. – న్యూస్‌టుడే, ఉలవపాడు

మార్కాపురం... కళాశాల విద్యకు దూరం!

◗ పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్నత చదువులు

ఈనాడు, ఒంగోలు

పశ్చిమ ప్రకాశంలో ఉన్నత విద్యావకాశాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. నూతన జిల్లా కేంద్రం మార్కాపురంలో పరిస్థితి మరీ దారుణం. ప్రభుత్వం పరంగా డిగ్రీ, జూనియర్ కళాశాలలు అందుబాటులో లేవు. దీంతో పేద విద్యార్థులు ముఖ్యంగా బాలికలు పై చదువులకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఈ లోటును భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

దశాబ్దాలుగా పట్టించుకోక...

కొత్త జిల్లా పరిధిలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. దశాబ్దాలుగా పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో మార్కాపురం నియోజకవర్గంలో మాత్రం లేదు. కాస్త స్థోమత ఉన్నవారు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరుతున్నా... వేలకు వేలు ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల వారు అక్కడితో చదువు ఆపేస్తున్నారు. అబ్బాయిల్లో కొందరు నరసరావుపేట, ఒంగోలు తదితర ప్రాంత కళాశాలల్లో చేరుతున్నా... అమ్మాయిలను అంత దూరం పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో వారి చదువు మధ్యలోనే ఆగిపోతోంది.

ఇంటర్‌దీ అదే దుస్థితి...

జూనియర్ కళాశాలల పరంగానూ మార్కాపురం నియోజకవర్గంలో అదే పరిస్థితి కొనసాగుతోంది. పొదిలిలో మినహా మరెక్కడా ఆ ఊసు లేదు. నియోజకవర్గాల పరంగా చూస్తే యర్రగొండపాలెంలో నాలుగు, గిద్దలూరులో నాలుగు, కనిగిరిలో మూడు కళాశాలలున్నాయి. ఉన్నత పాఠశాలల్లోనే ప్లస్ 2 ఏర్పాటు చేశారు. మార్కాపురంలో ఆ భాగ్యమూ లేక సమస్య నెలకొంది. ఈ విషయమై ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి స్పందిస్తూ... జిల్లా కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటు ఆవశ్యతకను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మాట్లాడి స్థానికంగా ఉన్నత విద్యావకాశాలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

సంబరాల సంక్రాంతి

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వస్థలాలకు రావడంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఏ వీధిలో చూసినా రంగవల్లులు కనువిందు చేశాయి. పలు గ్రామాల్లో ఆటలపోటీలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. పై చిత్రం గుడ్లూరులో నిర్వహించిన కబడ్డీ పోటీలది. – న్యూస్‌టుడే, బృందం

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..

యాదవ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు యాదవ కుల అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' యాదవ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతోపాటు సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
9154772006,
9154366099
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

✪ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సప్ ద్వారా చేసుకోవచ్చు. అందుకు సంబంధించిన వధూవరుల బయోడేటా & ఫొటోలను పక్కన ఇచ్చిన నంబర్లకు వాట్సప్‌లో పంపవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

కబడ్డీ పోటీల విజేత గోకనకొండ జట్టు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దాతలు

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని వీ.కొప్పెరపాడులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. గోకనకొండ జట్టు రూ.15,116 (ప్రథమ) కొలలపూడి జట్టు రూ.10,116 (ద్వితీయ) కొమ్మాలపాడు రూ.7,116 (తృతీయ) కొప్పెరపాడు జెడ్పీహెచ్ఎస్ రూ.3,116 నాలుగో బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులను దాతలు యర్రా మునలయ్య, గుంజి జీవరత్నం, కుంచపు ఏడుకొండలు, పందిరి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు నగదును అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు గోపీకృష్ణ, రామకృష్ణ, శ్రీను, దానారివు, మస్తాన్‌వలీ, అంజయ్య నిర్వహించారు.

అంబరాన్నంటిన భవనాశి తెప్పోత్సవం

భవనాశి తటాకంలో ఊరేగుతున్న దేవతామూర్తులు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. రెండు దేవాలయాల పాలకమండళ్ల ఛైర్మన్‌లు చుండూరి మురళీ సుధాకరరావు, గుంజి శ్రీనివాస్ నేతృత్వంలో సహాయ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, మద్దినేని శ్రీనివాస్‌లు ఉత్సవాలను నిర్వహించారు. అద్దంకితోపాటు సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అందంగా తయారు చేసిన హంస వాహనంపై ఉభయ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి భవనాశిలో తెప్పోత్సవం జరిపించారు. ముందుగా రెండు ఆలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షిణ చేశారు. కూష్మాండ బలిహరణ కార్యక్రమాన్ని ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ నిర్వహించారు. అనంతరం భవనాశిలో తెప్పోత్సవం భక్తుల కోలాహలం మధ్య ముగిసింది.

దర్శి డీఎస్పీ ఆధ్వర్యంలో లైవ్‌జాకెట్ల రక్షణ మధ్య..

దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ నేతృత్వంలో అద్దంకి, అద్దంకి గ్రామీణ సీఐలు ఏ.సుబ్బరాజు, సీహెచ్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెప్పపై కూర్చున్న ప్రతి వ్యక్తి కచ్చితంగా లైవ్ జాకెట్లు వేసుకోవాలనే నిబంధనతో కొంత మేర రద్దీని తగ్గించగలిగారు.

చిన్న కొత్తపల్లిలో బయల్పడిన ఉండ్రాళ్ల గణపతి

అద్దంకి మండలం చిన్న కొత్తపల్లి పొలాల్లో గురువారం మధ్యాహ్నం 'ఉండ్రాళ్ల గణపతి' విగ్రహం బయల్పడింది. చారిత్రక పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి పరిశీలించి క్రీ.శ. 14వ శతాబ్దం నాటిదిగా గుర్తించారు. మూడు అడుగుల ఎత్తు, ఒకటిన్నర అడుగుల వెడల్పుతో... తొండం కుడి వైపు తిరిగి, స్వామి చేతిలోని ఉండ్రాళ్లు తింటున్న రీతిలో ఉంది. స్థానికులు పూజాదికాలు నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం గ్రామ ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, అద్దంకి

20 నుంచి విద్యుత్తు ఛార్జీలపై ప్రజాభిప్రాయసేకరణ

నెల్లూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయం; 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం; 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నేరుగా హాజరు కాలేని వారు... ఆయా జిల్లాల్లోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. హాజరయ్యేవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను అందరూ వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని... వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. ఎ.పి. website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. ONGL2TF1502280001

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **25-02-2023 తేదీన డిమాండ్** నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) దామచర్ల శ్రీనివాసరావు, తండ్రి : వెంకయ్య, డోర్ నెం.4-2, ఎం.నిడమానూరు, కె ఉప్పలపాడు, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా.
2) దామచర్ల మాధవీ లత, భర్త : శ్రీనివాస రావు, డోర్ నెం.4-2, ఎం.నిడమానూరు, కె ఉప్పలపాడు, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా.
3) వాకా శ్రీనివాస రెడ్డి, తండ్రి : హనుమారెడ్డి, డోర్ నెం.5-49, కె ఉప్పలపాడు, కొండపి, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, **రూ.1,36,66,682/- (అక్షరాల ఒక కోటి ముప్పై ఆరు లక్షల అరవై ఆరు వేల ఆరు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **24-06-2023** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **13-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.1,36,66,682/- (అక్షరాల ఒక కోటి ముప్పై ఆరు లక్షల అరవై ఆరు వేల ఆరు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

ఈ ఆస్తి దస్తావేజు నెం.1635/2015 ప్రకారం దామచర్ల శ్రీనివాసరావు, తండ్రి : వెంకయ్య గారి పేరున కలదు.
ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ జిల్లా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అన్నవరప్పాడు గ్రామ అకౌంట్స్ సర్వే నెం.123 ఇందులో మొత్తం విస్తీర్ణం ఎకరాలు 6-23 సెంట్లు, అందులోని ఎకరాలు 2.00 సెంట్ల భూమిని లేఅవుట్ చేసి ఇళ్ల స్థలాలుగా మార్పబడిన ఆ లేఅవుట్ నందలి ప్లాట్ నెం.1 దీనికి **హద్దులు : తూర్పు** : ఇదే సర్వే నెంబర్ లోని కవర్తపు నరేంద్ర కుమార్ గారి భూమి – 81.9 అడుగులు, **పడమర** : 40 అడుగుల వెడల్పు గల రోడ్డు – 81.9 అడుగులు, **ఉత్తరం** : డొంక – 121 అడుగులు, **దక్షిణం** : కొత్తపల్లి వెంకయ్య గారికి చెందిన ప్లాట్ నెం.2.
ఈ సరిహద్దుల మధ్య 9892 చ॥అడుగులు లేద 137 గదుల 28 చ॥ అడుగులు లేదా 1099.1/9 గజాలు లేదా 918.55 చ॥మీటర్ల ఖాళీ స్థలం మాత్రమే.

తేది : 13-01-2026
ప్రదేశం: ఒంగోలు
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

□ కరవదిలో ఉత్సాహంగా బీచ్ కబడ్డీ పోటీలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టు, 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సూచించారు. సంక్రాంతి క్రీడా సంబరాలు, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ క్రీడాపరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు మండలం కరవది గ్రామంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు, క్రీడల్లోనూ యువత రాణించాలని ఆకాంక్షించారు. విశాఖ-కృష్ణా, గుంటూరు-బాపట్ల జిల్లాలకు చెందిన కబడ్డీ జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఎన్టీఆర్ క్రీడాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి రంగారావు, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దు భాస్కర్‌రావు, ఎన్నారై సాధినేని సురేష్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, ఆర్టీసీ కండక్టర్ సుంకర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా పోలు రాధా పోటీలు

పోటీల్లో బండి లాగుతున్న ఎద్దులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటు బండి పోలు రాధా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో మొత్తం పది జతల ఎద్దు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం పెదపూడికి చెందిన అబ్బూరి కృష్ణధరకు చెందిన ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన పాలపర్తి మూగయ్యకు చెందిన ఎద్దు రెండో స్థానం దక్కించుకొని రూ.30 వేల నగదు బహుమతి సాధించాయి. చెరుకుపల్లికి చెందిన ఉజ్వల్ యాదవ్, దాసరి వెంకట గోపాలకృష్ణకు చెందిన ఎద్ల జత మూడో స్థానం కైవసం చేసుకొని రూ.20 వేల నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. కొత్త మల్లికార్జునవారిపాలెనికి చెందిన పిన్నబోయిన మండ్రుల యాదవ్‌కు చెందిన, నెల్లూరు జిల్లా రాజుపాలెనికి చెందిన బొట్ల బాలకృష్ణ యాదవ్‌కు చెందిన, ఉప్పుగుండూరుకు చెందిన జ్ఞానసాయి దీపక్‌కు చెందిన ఎద్ల తరువాత స్థానాల్లో నిలిచాయి. వారికి కూడా నగదు బహుమతులు అందించారు. ఈ పోటీలకు వ్యాఖ్యతగా శేఖర్‌రెడ్డి వ్యవహించారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులకు సరస్వతి ఉన్నత పాఠశాల కరస్పాడెంట్ నార్నె నాగభూషణం సత్కరించారు. గ్రామంలోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి యువకులు, మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని ఆసక్తిగా పోటీలను తిలకించారు. కాకతీయ సేవాసమితి అధ్యక్షుడు కనగాల రామకృష్ణ, సభ్యులు బెల్లం రాఘవయ్య, శేషయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేను ఫోన్ చేసినా తీయరా?

❖ పోలీసులపై ఓ ప్రజాప్రతినిధి తమ్ముడి కుమారుడు రచ్చ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒక ప్రజాప్రతినిధి సోదరుడి కుమారుడు ఆగ్రహించారు. 'నేను ఫోన్ చేసినా తీయరా?' అంటూ స్థానిక పోలీసు అధికారులను ఉద్దేశించి బూతులతో రెచ్చిపోయారు. మార్కాపురం జిల్లాలో గురువారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆ జిల్లాలోని ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ మార్కాపురంలో గురువారం రాత్రి గస్తీ పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో ఒక యువకుడిని పట్టుకున్నారు. అతని ద్వారా సమాచారం అందుకున్న ప్రజాప్రతినిధి తమ్ముడి కుమారుడు రంగంలోకి దిగాడు. అప్పటికే అక్కడి నుంచి సదరు సీఐ వెళ్లిపోగా.. అక్కడున్న క్షేత్రస్థాయి పోలీసులపై అతను బూతులతో విరుచుకుపడ్డాడు. స్థానిక అధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదని వారిని సైతం పరుష పదజాలంతో దూషించాడు. ఆ అన్నగారి తమ్ముడి కొడుకు వ్యవహారం మార్కాపురం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం

ముండ్లమూరు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఎంబీబీఎస్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన అద్దంకి-దర్శి ప్రధాన రహదారిలో శుక్రవారం ఉల్లగల్లు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ముప్పరాజుపాలెం గ్రామానికి చెందిన ఉప్పుటూరి మోహన్‌రావు, నాగసుబ్బులు కుమారుడు ప్రసన్నకుమార్(24) హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. పండగ సందర్భంగా తన తాతయ్య ఇంటికి ముండ్లమూరు మండలం కెల్లంపల్లి వచ్చారు. తన స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై పులిపాడు వెళుతున్నాడు. ఇదే సమయంలో దర్శి మండలం తూర్పుచౌటపాలెనికి చెందిన ఏసుబాబు దర్శి నుంచి అద్దంకి వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ప్రసన్నకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసుబాబుకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. చేతికి అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఉలిచి.. బరిలో పొట్టేళ్లు నిలిచి!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 25 పొట్టేళ్లు పాల్గొన్నాయి. వీటి యజమానులైన కంచరగుంట శ్రీనివాసరావు, ఉలిచి, విల్లా పెద్దమ్మ నేకునంబాదు, నాలి వెంకట ప్రసాద్ నాగంబొట్లపాలేనికి చెందిన పొట్టేళ్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వారికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులతోపాటు, ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చుంచు సింగయ్య, మండువ సుబ్బారావు, మన్నె హరిబాబు, చుంచు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పొట్టేళ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 164, రిటైల్ లైవ్ - 191, చికెన్ విత్ స్కిన్ - 277, చికెన్ స్కిన్‌లెస్- 315

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. ఎ.పి. website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. ONGL2TF1906140001

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **21-12-2023 తేదీన డిమాండ్** నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) చాగంటి శ్రీహరి రావు, తండ్రి: కోదండ రామయ్య, రెసిడెన్స్ ఎ.ఆర్.కె టవర్స్, ఇ-243, మయూరి నగర్, మియాపూర్, హైదరాబాద్, తెలంగాణ.
2) చాగంటి శ్రీలక్ష్మి, భర్త: శ్రీహరి రావు, రెసిడెన్స్ ఎ.ఆర్.కె టవర్స్, ఇ-243, మయూరి నగర్, మియాపూర్, హైదరాబాద్, తెలంగాణ.
3) పోతు కోటేశ్వరమ్మ, భర్త: క్రిష్ణయ్య, రెసిడెన్స్ హోమ్ నెం. 7-23-0-23, రెవిన్యూ కాలని, 1వ లైను, వివేకానంద విద్యా విహార్ దగ్గర, యం.యం.రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
4) గాలి పద్మావతి, భర్త: పార్థసారధి, రెసిడెన్స్ డోర్ నెం. 1-43, వర్ధినేనివారిపాలెం, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
5) లెక్కల సుజాత, భర్త: గిరిధరరావు, వీరన్నకొల్లు (వి), కలిగిరి మండలం, యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా.
6) బెల్లం వినీల, భర్త: ప్రవీణ్ కుమార్, రెసిడెన్స్ డోర్ నెం.7-7/1, చింతలపాలెం (వి), జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, **రూ.74,53,491/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల నాలుగు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **19-06-2024** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **13-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.74,53,491/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల నాలుగు వందల తొంబై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

ఈ ఆస్తి దస్తావేజు నెం.**1735/2019** ప్రకారం చాగంటి శ్రీహరిరావు, **తండ్రి:** కోదండ రామయ్య, **పోతు కోటేశ్వరమ్మ, భర్త: కృష్ణయ్య, గాలి పద్మావతి, భర్త:** పార్థసారధి, **లక్కెల సుజాత, భర్త:** గిరిధర రావు వారి పేరుతో కలవు.
ఐటం నెం.1: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.0.47 సెంట్లు మరియు సర్వే నెం.145/1బి3 నందలి మొత్తం ఎ.3.85 సెంట్లలోని ఎ.1.02 సెంట్లు మొత్తం కలిపి ఎ.1.49 విస్తీర్ణం గల ప్రక్కప్రక్కన గల ప్లాట్లకు సంబంధించిన యావదాస్తి. దీనికి **హద్దులు: తూర్పు:** చాగంటి వెంకట సుబ్బారావు యొక్క భూమి, **పడమర** : కొండెపి రోడ్డు, **ఉత్తరం:** చాగంటి కోదండ రామయ్య యొక్క భూమి, **దక్షిణం:** చాగంటి నరసింహ, తండ్రి: వెంకటేశ్వర్లుకు అమ్మిన భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.1.49 సెంట్లు భూమి మాత్రమే.
ఐటం నెం.2: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.0.78 సెంట్ల విస్తీర్ణం గల భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** మల్లబోయిన ఆదెయ్య యొక్క భూమి, **పడమర** : రోడ్డు, **ఉత్తరం:** చాగంటి కోదండ రామయ్య యొక్క భూమి, **దక్షిణం:** మల్లెబోయిన ఆదెయ్య యొక్క భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.0.78 సెంట్లు భూమి మాత్రమే.
ఐటం నెం.3: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.2.34 సెంట్ల విస్తీర్ణం గల భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** మల్లబోయిన ఆదెయ్య యొక్క భూమి, **పడమర:** జడ్.పి రోడ్డు, **ఉత్తరం:** నంబూరి నరసయ్య యొక్క భూమి, **దక్షిణం:** మల్లెబోయిన ఆదెయ్య యొక్క భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.2.34 సెంట్లు భూమి మాత్రమే.

తేది : 13-01-2026
ప్రదేశం: ఒంగోలు
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : డి.నెం.37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001. ఎ.పి. website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. ONGL3TF1806280010

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ డి.నెం.37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **21-12-2023 తేదీన డిమాండ్** నోటీసు జారీ చేయబడినది.
ఋణగ్రహీతలు : 1) భట్టిప్రోలు వెంకట శివమ్మ, భర్త: దగ్గుమాటి శ్రీనివాసరావు, రెసిడెన్స్ ఫ్లాట్ నెం.7, 4వ అంతస్థు, ఉషా రెసిడెన్సి, బి.ఆర్.హోమ్స్ ఎదురు, మంగమూరుడొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
2) దగ్గుమాటి శ్రీనివాసరావు, తండ్రి: సుబ్బారాయుడు, రెసిడెన్స్ ఫ్లాట్ నెం.7, 4వ అంతస్థు, ఉషా రెసిడెన్సి, బి.ఆర్.హోమ్స్ ఎదురు, మంగమూరుడొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
3) దగ్గుమాటి సుబ్బారాయుడు, తండ్రి: శేషయ్య, రెసిడెన్స్ డోర్ నెం.41, సాదువారిపాలెం విలేజ్, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, **రూ.86,00,409/- (అక్షరాల ఎనభై ఆరు లక్షల నాలుగు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **19-06-2024** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **13-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.86,00,409/- (అక్షరాల ఎనభై ఆరు లక్షల నాలుగు వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

ఈ ఆస్తి దస్తావేజు నెం.2264/2018 ప్రకారం భట్టిప్రోలు వెంకట శివమ్మ, భర్త : దగ్గుమాటి శ్రీనివాసరావు గారి పేరున కలదు.
షెడ్యూలు 1: ప్రకాశం జిల్లా, శింగరాయకొండ సబ్ జిల్లా, జరుగుమల్లి మండలం, జరుగుమల్లి గ్రామపంచాయతీ మరియు గ్రామము అకౌంట్స్, పట్టా నెం.1008 మరియు 1010, డ్రై సర్వే నెం.366/1 మరియు సబ్ డివిజన్ తరువాత సర్వే నెం.366/1ఎ1 నందు ఎ.0.21 1/2 సెంట్ల విస్తీర్ణము మరియు సర్వే నెం.366/1ఎ2 నందు ఎ.0.21 1/2 సెంట్ల విస్తీర్ణము, రెండు కలుపుకొని ఎ.0.43 సెంట్ల విస్తీర్ణము ఏకఖండముగా గల ఆస్తి. **దీనికి హద్దులు : తూర్పు** : గుండూరి విమల మరియు ఇత్తడి సుబ్బయ్య మరియు ఇతరుల యొక్క భూమి, **పడమర** : దగ్గుమాటి శ్రీనివాసరావు యొక్క భూమి, **ఉత్తరం** : దగ్గుమాటి శ్రీనివాసరావు యొక్క భూమి, **దక్షిణం** : కామేపల్లి నుండి టంగుటూరు వెళ్ళు రోడ్. ఈ హద్దుల మధ్యగల ఎ.0.43 సెంట్లు లేదా 0.174 హెక్టార్ల విస్తీర్ణముగల భూమి అన్ని అనుభుక్తపు హక్కులతో కలుపుకొని ఆస్తి.
షెడ్యూలు 2 : ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, శింగరాయకొండ సబ్ జిల్లా, జరుగుమల్లి మండలం, జరుగుమల్లి గ్రామపంచాయతీ మరియు గ్రామము అకౌంట్స్, డ్రై సర్వే నెం.366/1ఎ నందు మొత్తం ఎ.22.12 సెంట్ల విస్తీర్ణముమరియు అందులో ఎ.1.50 సెంట్ల విస్తీర్ణము లేదా 0.607 హెక్టార్ల విస్తీర్ణము పట్టాదారు పాస్ బుక్ ప్రకారం మరియు 1బి నందు ఎ.1.33 సెంట్ల విస్తీర్ణముగల భూమికి సంబంధించిన ఆస్తి. **దీనికి హద్దులు : తూర్పు** : కాప శివరావమ్మ మరియు ఇతరుల యొక్క భూమి, **పడమర** : బాపులూరి పోతురాజు మరియు పాలపర్తి తిరుపతమ్మ యొక్క భూమి, **ఉత్తరం** : వాకా కోటిరెడ్డి యొక్క భూమి, **దక్షిణం** : జిల్లా పరిషత్ రోడ్. ఈ హద్దుల మధ్యగల ఎ.1.50 సెంట్ల విస్తీర్ణము లేదా 0.607 హెక్టార్ల విస్తీర్ణము పట్టాదారు పాస్ బుక్ ప్రకారం మరియు 1బి నందు ఎ.1.33 సెంట్ల విస్తీర్ణముగల భూమి అన్ని అనుభుక్తపు హక్కులతో కలుపుకొని ఆస్తి.

తేది : 13-01-2026
ప్రదేశం: ఒంగోలు
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కారు అదుపు తప్పి... తెదేపా మైనార్టీ సెల్ నేత మృతి

మహమ్మద్ జాఫర్ షరీఫ్

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరుకు చెందిన తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్ (54) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పదహారో నంబరు జాతీయ రహదారిపై కొరిశపాడు మండలం తిమ్మనపాలెంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. తెదేపా మైనార్టీ సెల్ నేత జాఫర్ షరీఫ్ (54) పని నిమిత్తం విజయవాడ వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుగు పయనమయ్యారు. 8.45 గంటల సమయంలో తిమ్మనపాలెంలో వీరి కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాఫర్ షరీఫ్‌తో పాటు కారు నడపుతున్న ఎస్కే జబీర్ అహ్మద్, ఎస్కే బషీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జాఫర్ షరీఫ్ మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారులు..

తాడి వెంకయ్య

మహాలక్ష్మి

పి.గుడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో తల్లి, కుమారుడు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. పి.గుడిపాడుకు చెందిన తాడి మహాలక్ష్మి(73), తాడి వెంకయ్య (55) తల్లీ కుమారులు. ఇద్దరూ ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే పి.గుడిపాడు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తాడి వెంకయ్య కండక్టర్‌గా అద్దంకి డిపోలో పనిచేస్తున్నారు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని విశ్రాంత చోదకుడు..

చెన్న కేశవులు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ కోమటిగుంట చెన్నకేశవులు(65)దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఏఎస్సై సైదయ్య అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామ్‌నగర్ వద్ద కుటుంబ సభ్యులతో నివాసముంటున్న ఆయన ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్. పక్షవాతంతో రోజూ ఇంటి నుంచి బస్టాండ్ వరకు చేతికర్ర సాయంతో నడుచుకుంటూ వచ్చి వెళుతుంటారు. శుక్రవారం కూడా బస్టాండ్‌కు వచ్చారు. ఇదే సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు ఒంగోలు నుంచి 44 మంది ప్రయాణికులతో అద్దంకి బస్టాండ్‌లోని పాయింట్ వద్దకు వస్తూ ముందు భాగంనుంచి ఆయనను ఢీకొట్టగా వెనుక చక్రాల కింద పడి నుజ్జయ్యారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య వీరనారాయణమ్మ, బంధువులు చేరుకుని మృతదేహాన్ని చూసి తల్లడిల్లారు. సీ.ఐ.సుబ్బరాజు ఆధ్వర్యంలో మృతదేహానికి పంచనామా జరిపారు. కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్.ఐ. తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఆనంద్ విహార్ వెంచర్స్‌లో ఓపెన్ సైట్‌తో పాటు 3BHK ఇండివిడ్యువల్ హౌస్ కేవలం 60 లక్షలు మాత్రమే. ✆ 6303004748

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

TO LET

ఒంగోలు EKB ప్రక్కన ZUDIO షోరూమ్ ఎదురు 2000Sft బిల్డింగులో 2nd ఫ్లోర్ కమర్షియల్స్ అద్దెకు ఇవ్వబడును. 97409 03676.

COMMERCIAL

ఒంగోలు సౌత్‌బైపాస్‌రోడ్ అన్నాబత్తిన (రిలయన్స్‌మార్ట్ +S BI వున్న) కాంప్లెక్స్‌లో 3rd ఫ్లోర్(10000SFT) గలది బ్యాంక్, జిమ్, రెస్టారెంట్, హోటల్స్, ఆఫీసులకు అద్దెకుఇవ్వబడును. ✆ 98660 73868, 81421 46612.

JOBS

చిరంజీవ చిట్‌ఫండ్స్ ప్రై॥ లి॥లో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పనిచేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం॥ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 7288870101, 7288887707.

కీర్తిమెడికల్ స్టోర్స్, కనిగిరి, ఒంగోలులో పనిచేయుటకు ఆపరేటర్స్ సీ॥ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత కలదు. జీతం: 15K to 30K. సంప్ర॥ 9154569446.

ఒంగోలులో రియల్ ఎస్టేట్ అప్రూవల్ వెంచర్‌లో మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన కమీషన్లతోపాటు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ 98660 94114.

SECURITY GUARDS

కిమ్స్‌హాస్పిటల్ ఒంగోలు నందు ఆన్‌రోల్‌లో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం రూ. 14,000/- కాంటాక్ట్ నంబర్: 8074854975.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds
అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కందుకూరు

• కందుకూరు • కొండపి

జమ్ములపాలెంలో వాలీబాల్ పోటీ

వల్లూరమ్మ ఆలయంలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు

పండగ సంబరం.. ఊరంతా ఉల్లాసం..!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సంబరాలు నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించారు. కందుకూరు మార్కండేయస్వామి ఆలయ కూడలిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. శుక్రవారం కనుమ సందర్భంగా అంకమ్మగుడి ఆలయ ఆవరణలో పారువేట ఉత్సవం నిర్వహించారు. పలు ఆలయాల్లోని ఉత్సవమూర్తులను ఊరేగించి, అనంతరం అంకమ్మ ఆలయ ఆవరణలో భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని. ప్రత్యేక పూజలు చేశారు.

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని బడేవారిపాలెంలో క్రికెట్ తుది పోటీని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. విజేతగా నిలిచిన బడేవారిపాలెం జట్టును అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. శాఖవరం, పోకూరు, వలేటివారిపాలెం, నలదలపూరు, కలవళ్ల తదితర గ్రామాల్లో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వహణ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

కందుకూరు గ్రామీణం: ఓగూరు గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఒంగోలు డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

కందుకూరు:అంకమ్మ ఆలయ ఆవరణలో పారువేట ఉత్సవం

కందుకూరు: మార్కండేయస్వామి కూడలిలో రంగవల్లుల పోటీ

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు మండలంలో సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. పలు చోట్ల డీజేలు ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. ముగ్గుల పోటీలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జమ్ములపాలెంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు మండలంలోని పలు గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కరేడు పంచాయతీ రామకృష్ణాపురం, ఆకుతోట సంఘంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సురమౌళి, శేఖర్, కావ్య, రామయ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

పాత నిల్వలు కరిగేనా.. గిట్టుబాటు ధర దక్కేనా!

టంగుటూరు, న్యూస్‌టుడే

సరైన గిట్టుబాటు ధరల లేక రైతులు సాగుచేసిన శనగ పంట శీతల గిడ్డంగుల్లో మగ్గుతోంది. రెండేళ్లుగా ఈ పరిస్థితి ఎదురవుతోంది. పాత నిల్వలు అలాగే ఉన్నప్పటికీ భూములు ఖాళీగా ఉంచడం ఇష్టం లేక.. కొత్తగా సాగు చేశారు. ఈ ఏడాదైన ప్రభుత్వం ఆదుకోకుంటే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో శనగ సాధారణ విస్తీర్ణం 11,781 హెక్టార్లు కాగా.. 2025-26 పంట కాలానికి 4,424 హెక్టార్లలో సాగు చేశారు. ఓవైపు పొగాకులో నష్టాలు, శనగ ధరలు పడిపోవడంతో ఈ ఏడాది ఎవరూ పెద్దగా ఆసక్తి కనబరచలేదు. అత్యధికంగా కొండపి మండలంలో 1,310 హెక్టార్లలో సాగు చేయగా.. టంగుటూరులో 1,234, జరుగుమల్లిలో 742, పొన్నలూరు 670, మర్రిపూడి 448, సింగరాయకొండలో 20 హెక్టార్ల చొప్పున వేశారు.

89 వేల టన్నులు

జిల్లాలో పొగాకు అనంతరం అధికంగా సాగుచేసే పంట శనగ. గతేడాది మద్దతు ధర రూ.5,650 ఉండగా.. మార్కెట్‌లో రూ.6,200 పలికింది. దీంతో రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా విక్రయించేందుకు ఆసక్తి చూపలేదు. పశ్చిమ ప్రకాశంలోని కొందరు మాత్రమే 82 టన్నులు విక్రయించారు. దీంతో జిల్లా అంతటా నిల్వలు పేరుకుపోయాయి.

టంగుటూరులో ఓ శీతల గిడ్డంగిలో శనగల బస్తాలు

అధికారిక లెక్కల ప్రకారం 89 వేల టన్నులు ఉన్నట్లు గుర్తించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా విక్రయించేందుకు మొగ్గు

ఈ ఏడాది మార్కెట్‌లో ధరలు దిగజారాయి. క్వింటా రూ.5,200 వరకు పలకగా.. ప్రభుత్వ మద్దతు ధర రూ.5,878గా ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2025-26 పంట కాలం సాగు ద్వారా 75 వేల టన్నుల శనగల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పాత నిల్వలతో పాటు కొత్త వాటిని మార్క్‌ఫెడ్ ద్వారా విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతారు. ఫిబ్రవరి నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తామని డీఎం హరికృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624

కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?: మండలంలోని తుమాడు గ్రామంలో దోమల సమస్య అధికంగా ఉంది. రాత్రుళ్లు కంటిమీద కునుకు ఉండటం లేదు. రోగాల బారిన పడే ప్రమాదం నెలకొంది. -హరిబాబు, స్థానికుడు

✓: దోమల నివారణ చర్యలు చేపడతాం. -మౌనిక, పంచాయతీ కార్యదర్శి

లింగసముద్రం, న్యూస్‌టుడే

?: లింగసముద్రం ఎస్సీ కాలనీలో దోమల అధికంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. నివారణ చర్యలు చేపట్టాలి. -మాలకొండయ్య, స్థానికుడు

✓: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. -మాధవరావు, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: టంగుటూరు-పొదిలి రహదారిలో జువ్విగుంట ఎస్సీ బ్యాంక్ సమీపంలో రహదారి అంచులో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. -వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. -నాగూర్‌వలి, ఎంపీడీవో

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే

?: చుండి పంచాయతీలో ఆసుపత్రిగా ఉన్న హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాల ఎదుట వర్షాలు పేరుకుపోయాయి. ఆ ప్రాంతంలో పందులు చేరి అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నాయి. -కోటయ్య, స్థానికుడు

✓: వర్షాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. -రవికుమార్, పంచాయతీ కార్యదర్శి

గుడ్లూరు, న్యూస్‌టుడే

?: గుడ్లూరు ఎంఎస్ఆర్ కళాశాల కాలనీ మొదటి వీధిలో దీపాలు వెలగడం లేదు. -మల్లీశ్వరి, గృహిణి

✓: పరిశీలించి.. మరమ్మతులు చేయిస్తాం. -నరేశ్, పంచాయతీ కార్యదర్శి

వైభవం.. తెప్పోత్సవం!

వల్లూరమ్మ తెప్పోత్సవం

ఉలవపాడు కోనేరులో వేణుగోపాలస్వామి..

సంక్రాంతి సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధ వల్లూరమ్మ ఆలయం, ఉలవపాడు వేణుగోపాలస్వామి, కొండపి ప్రసన్న వేణుగోపాలస్వామి, రాముల వారి ఆలయాల్లో గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కొండపిలో ప్రత్యేకంగా ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఆలయాల ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. **న్యూస్‌టుడే, టంగుటూరు, ఉలవపాడు, కొండపి గ్రామీణం,**

కొండపి చెరువులో..

ఎన్టీఆర్ వర్ధంతికి తరలిరావాలని పిలుపు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం ఈ నెల 18న పట్టణంలోని వెంగమాంబ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన అభిమానులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మల్లేశ్వరరావు, నాగరాజు, కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, పిడికిటి వెంకటేశ్వర్లు, రాంబీ, రాయపాటి శ్రీను, ఉన్నం వీరాస్వామి, ముప్పు శ్రీను పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మీరు వెళ్లే మార్గం కాదు, మే చెప్పిన మార్గంలో వెళ్లాలంటూ ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఒంగోలు బస్టాండ్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. టీఎస్ ఆర్టీసీకి చెందిన బస్సు దేవరకొండ నుంచి తిరుపతి వెళ్తూ రాత్రి 9.35 గంటలకు ఒంగోలు డిపోకు చేరింది. ఆ సమయంలో పూర్తిగా మద్యం మత్తులో ఉన్న ఎం.నాగార్జున అనే వ్యక్తి కావలికి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సు కావలి పట్టణంలోకి వెళ్లదని చెప్పడంతో ఆగ్రహించాడు. డిపోలోకి వెళ్లాల్సిందేనని పట్టుబట్టాడు. కుదరదని చెప్పడంతో డ్రైవర్ లక్ష్మయ్యతో గొడవపడి ముఖంపై దాడి చేశాడు. రెండో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు అతడిని అడ్డుకుని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

తాగునీటి వనరు.. పట్టించుకోరు ఎవరు..!

గతంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన చేతి పంపు అధికారులు, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. వలేటివారిపాలెం బీసీ కాలనీలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన చేతి పంపు పనిచేయడం లేదు. గతంలో కాలనీ వాసులకు తాగునీటి కష్టాలను తీర్చిన దీన్ని ప్రస్తుతం పట్టించుకునే వారు కరవయ్యారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

అంచుల్లో చెత్త.. దుర్వాసనతో తంటా!

మండలంలోని బిట్రగుంట గ్రామంలో పలు రహదారులపై చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసనతో పాటు రాత్రిళ్లు దోమల బెడదతో కంటిమీద కునుకు ఉండటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సిబ్బంది రోజూ రావడం లేదని చెబుతున్నారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి షఫీ మాట్లాడుతూ సిబ్బందితో చెత్త తొలగించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని చెప్పారు. ప్రజలకు కూడా పరిశుభ్రత విషయంలో సహకరించాలని కోరారు. -న్యూస్‌టుడే, జరుగుమల్లి

దారి.. అధ్వానంగా మారి!

తిమ్మారెడ్డిపాలెం-గంగపాలెం గ్రామాల మధ్య తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. చాలాచోట్ల దెబ్బతింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లింగసముద్రం

అసంపూర్తి నిర్మాణాలు.. చుట్టూ వ్యర్థాలు!

మండల కేంద్రం గుడ్లూరు-1 సచివాలయ భవనం పనులు 2021లో రూ.40 లక్షలతో చేపట్టారు. అయిదేళ్లు అవుతున్నా.. ఇంకా అసంపూర్తిగానే ఉంది. నిధులు సరిపోకపోవడంతో గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుతం ఆ భవనంలో పందుల పెంపకం చేస్తున్నారు. పక్కనే బీసీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. చుట్టూ వ్యర్థాలు పేరుకుపోవడంతో వారికి అసౌకర్యంగా మారింది. పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రం భవనం కూడా పూర్తికాలేదు. గ్రామంలోని వ్యర్థాలు వాటి చుట్టూ వేస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు చేసే వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

ఉత్తమ రైతుగా వెంకటశేషయ్య

టంగుటూరు: జమ్ములపాలెం గ్రామ ఉత్తమ రైతుగా కాకుమాని వెంకటశేషయ్య ఎంపికయ్యారు. వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధిస్తున్న రైతులకు గ్రామానికి చెందిన గడ్డం పుల్లయ్య మెమోరియల్ అధ్యక్షుడు సుబ్బారావు.. గత రెండేళ్లుగా అవార్డులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వెంకటశేషయ్య వరి సాగులో దేశీయ రకాలైన బహురూపి, చిట్టిముత్యాలు, రత్నచోలి, నవ్వారా.. వంటి రకాలు సాగు చేయడంతో పాటు పలువురి రైతులకు సూచనలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ క్రమంలో 2024-25 ఏడాదికి ఉత్తమ రైతుగా ఎంపికయ్యాడు. శుక్రవారం పురస్కారం అందించి, శాలువాతో సత్కరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం రైల్వేగేటు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. కొత్తపట్నం మండలం రాజుపాలేనికి చెందిన వేల్పూరి మహేష్.. ఒంగోలులోని ఓ జీవిత బీమా సంస్థలో పనిచేస్తాడు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా.. ఘటనా స్థలికి రాగానే మరో ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహేశ్‌కు గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు. క్షతగాత్రుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లిక్ చేయొద్దు.. మోసపోవద్దు

జరుగుమల్లి, న్యూస్‌టుడే: వాట్సప్ గ్రూపులో నాకు రూ.5000 వచ్చాయి.. మీరు కూడా ప్రయత్నించండి.. అంటూ.. సైబర్ నేరగాళ్లు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని ఎస్సై మహేంద్ర గురువారం హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లింకులను పది మందికి ఫార్వర్డ్ చేయాలని చెప్పడం.. మోసానికి స్పష్టమైన సంకేతంగా పేర్కొన్నారు.

గుడ్లూరు: కమ్మపాలెం ప్రధాన వీధిలో తీర్చిదిద్దిన రంగవల్లులు

సందడిగా ముగ్గుల పోటీలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రం గుడ్లూరు కమ్మపాలెం రామాలయం వద్ద, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనను ప్రదర్శించారు. విజేతలుగా గొల్ల భాగ్యలక్ష్మి, శిల్ప నిలిచారు. నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు.

లింగసముద్రం, న్యూస్‌టుడే: లింగసముద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో కనుమ పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు దాతలు బహుమతులు అందజేశారు.

పొన్నలూరు, న్యూస్‌టుడే: పొన్నలూరు వినాయకనగర్‌లో గుంటూరు శ్రీను(నంద్యాల) ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, మండవ ప్రసాద్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ● బాలిరెడ్డిపాలెంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేత బాలిరెడ్డిపాలెం జట్టుకు రూ.30,116, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,116 ప్రదానం చేశారు. బెజవాడ వెంకటేశ్వర్లు, కొండాబత్తిన మాధవరావు, దుద్దుగుంట మల్లికార్జున, సానేపల్లి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

లింగసముద్రంలో విజేతలకు బహుమతుల అందజేత

బాలిరెడ్డిపాలెంలో క్రికెట్ విజేతకు నగదు, ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

మోడ్రన్ కబడ్డీ పోటీలు ప్రారంభం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బాలబాలికల జాతీయ స్థాయి మోడ్రన్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నిర్వాహకులు క్రీడాకారులతో గ్రామ ప్రధాన రహదారిపై కేరళ డప్పు వాయిద్యాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. పోటీలు శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మోడ్రన్ కబడ్డీ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌సాహు, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ ప్రధాన రహదారిపై క్రీడాకారుల ప్రదర్శన

కబడ్డీ విజేత గుడ్లూరు జట్టు

గుడ్లూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా గుడ్లూరు ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీల్లో గుడ్లూరు మిట్టపాలెం జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలు శుక్రవారం ముగిశాయి. తుది పోటీలో గుడ్లూరు జట్టు.. అన్నెబోయినపల్లి జట్టుపై 15-8 తేడాతో విజయం సాధించింది. ప్రథమ బహుమతిగా రూ.15,116, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10,116, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు.

శిక్షణ ఇచ్చారు.. ఉపాధి మరిచారు!

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్థిక స్వావలంబనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. తక్కువ వడ్డీకి రుణాలు అందించి వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహించారు. దీనిలో భాగంగా కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏడు నెలల క్రితం గ్రామీణ ప్రాంత మహిళలు సుమారు 500 మందికి బీసీ కార్పొరేషన్ ద్వారా వెలుగు కార్యాలయాల్లో మూడు నెలల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. ఆ సమయంలో ఉచితంగా యంత్రాలు అందజేసి, ఉపాధి కల్పిస్తామని అధికారులు తెలిపారు. కానీ నేటి వరకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో వారంతా ఎదురు చూస్తున్నారు. యంత్రాలు పంపిణీ చేస్తే తాము ఉపాధి పొందుతామని, తద్వారా కుటుంబాలకు భరోసా ఏర్పడుతుందని చెబుతున్నారు. శిక్షణ సమయంలో ప్రభుత్వం అందించిన నూతన యంత్రాలు ఆయా కార్యాలయాల్లో తుప్పు పడుతున్నాయని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాటిని పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై ఏపీఎం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతి వచ్చిన వెంటనే కుట్టు యంత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

సింగరాయకొండ వెలుగు కార్యాలయంలో మహిళలకు కుట్టు శిక్షణ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కందుకూరు గ్రామీణం: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మోపాడు సాయి సౌందర్యలహరిలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. మాచవరం వీరాంజనేయస్వామిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. పలుకూరు గ్రామంలోని ఆలయాలను పూలతో అలంకరించారు.

మర్రిపూడి, న్యూస్‌టుడే: స్థానిక శివాలయంలో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. అనంతరం రాత్రికి పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

మోపాడులో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ సింహాచలంగా పేరొందిన సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ నరసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేసి, పూలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కనుమ సందర్భంగా శుక్రవారం సాయంత్రం భవనాసి చెరువులో స్వామి, దేవేరులను పూలతో అలంకరించి పడవల్లో విద్యుత్తు కాంతుల నడుమ పారువేట ఉత్సవం నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామ స్మరణ చేస్తూ తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై మహేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

(c) eenadu

అద్దంకి
•అద్దంకి • దర్శి

దర్శిలోని అన్న క్యాంటీన్

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

దర్శి: పేద ప్రజలకు రూ.5 లకే భోజనం, అల్పాహారం అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తుంది. ఈ క్రమంలో దర్శిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను 18వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఎంతో కాలంగా దర్శి ప్రజలు ఎదురు చూస్తున్న అన్నక్యాంటీన్ ప్రారంభం జరగనున్న నేపథ్యంలో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు దర్శిలో మంత్రుల పర్యటన

దర్శి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయటానికి ఇద్దరు మంత్రులు శనివారం పర్యటించనున్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి, ఒంగోలు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్‌రావు, రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే పాపారావు పాల్గొంటారని తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దర్శిలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించే విద్యుత్తు డివిజనల్ కార్యాలయ భవనానికి, ముండ్లమూరు మండలం ఉల్లగల్లులో రూ.3.9 కోట్ల వ్యయంతో నిర్మించే విద్యుత్తు ఉపకేంద్రం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. పసుపుగల్లులో బస్ షెల్టర్ ప్రారంభిస్తారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభలో పాల్గొంటారు.

ఎల్ఈడీ స్క్రీన్‌పై వివరాలు తెలియజేస్తున్న జాగర్లమూడి రాజేష్, సొసైటీ ఛైర్మన్ జయకృష్ణ

గ్రామాభివృద్ధికి ఏకతాటిపై నడుద్దాం

పమిడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా 'మన ఊరు మనందరం' అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాగర్లమూడి రాజేష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అందరం ఏకతాటిపై నిలుద్దామని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి ప్రణాళిక రూపొందించారు. గ్రామస్థులకు ఎల్ఈడీ స్క్రీన్‌లో అభివృద్ధిపనులకు సంబంధించిన వివరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన సీసీ కెమెరాలను గ్రామానికి బహూకరించారు. గ్రామంలో స్థలం కేటాయిస్తే యువత కోసం జిమ్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి ఆదినారాయణ, కొప్పర్తి మోహన్‌రావు, చేబ్రోలు కోటేశ్వరరావు, జాగర్లమూడి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 18 లక్షల విరాళం అందజేత

జె.పంగులూరు: రేణింగవరంలోని మూలస్థానేశ్వరాలయంలో పురాణ కాలక్షేప మండపం నిర్మాణానికి... కుమ్మిత్త రామిరెడ్డి, పుష్పావతి దంపతుల కుమారుడు శివ కోటిరెడ్డి రూ. 18 లక్షలు విరాళంగా ఇచ్చారు. సంబంధిత చెక్కును కార్యనిర్వహణాధికారి శైలేంద్ర కుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఓబుల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈవోకు చెక్కు అందజేస్తున్న దాతలు

ఆసుపత్రికి ప్రవాస భారతీయుడి వితరణ

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి సామాజిక ఆరోగ్యకేంద్రంకు ఉత్తరఅమెరికా తెలుగుసంఘం, కూకట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.35 లక్షల విలువైన రెండు ఆక్సిజన్ సిలిండర్‌లు, ఒక ఫ్రిజ్‌ను బహూకరించారు. తిమ్మాయపాలెంకు చెందిన తానా ఫౌండేషన్ ట్రస్టీ కూకట్ల శ్రీనివాస్ (ప్రవాస భారతీయుడు)కుటుంబసభ్యులు వైద్యశాలకు అందించారు. అనంతరం రోగులకు పండ్లు, సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. పుట్టినభూమికి సేవాకార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. త్వరలో రూ.25 వేల వాటర్ కూలర్‌ను అందించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట తల్లిదండ్రులు సుబ్బారావు - వింధ్యావళి, కుటుంబసభ్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వాహెలా చౌదరి ఉన్నారు.

ఫ్రిజ్ అందిస్తున్న దాత కుటుంబీకులు

శింగరకొండ ఆలయ ప్రాకారానికి విరాళం

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ప్రాకారమండపాలు, రాజగోపురాల నిర్మాణానికి తాళ్లూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కైపు రామచంద్రారెడ్డి-నాగలక్ష్మి దంపతులు, కుమారుడు హరీశ్వర్‌రెడ్డి, కుమార్తె నాగదివ్య రూ.1,11,111లు విరాళం అందించారు. ఈ మేరకు నగదును దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ చుండూరు మురళీసుధాకర్, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడుకు అందించారు. అనంతరం దాత కుటుంబసభ్యులకు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం అందించి సత్కరించారు.

విరాళం అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

ముండ్లమూరు: పూరిమెట్లలో క్రికెట్ విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

అద్దంకి: కాకానిపాలెంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల అందజేత

జె.పంగులూరు: చందలూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉత్తర అద్దంకి కాకానిపాలెం యువత ఆధ్వర్యంలో ముగ్గులు, ఇతర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. జె.పంగులూరు మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు, కుర్చీలాట, స్లోబైకింగ్, ఉట్టికొట్టడం వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముండ్లమూరులో 'నా ఊరే- నా ఇల్లు' కమిటీ ఆధ్వర్యంలో ముగ్గులు, కబడ్డీ, క్రికెట్, కుర్చీలాట, పరుగుపందేలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి గంగన్నపాలెం శ్రీకాంత్‌రెడ్డి జట్టుకి రూ. 25,116 బహుమతి అందజేశారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి విశ్రాంత ఎస్సై సోమా ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు వి.సుబ్బయ్య, ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

సుమారు 35 సంవత్సరాల తరువాత అద్దంకి ఊరచెరువులో లక్ష్మీనరసింహస్వామి, మాధవ స్వామి వార్ల తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఉత్తర అద్దంకి బలిజపాలెం వాసులు తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేశారు. అర్చకులు భాగవతుల శ్రీమంతాచార్యులు నేతృత్వంలో కనుమ పండగ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కనుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. సీఐ ఏ. సుబ్బరాజు ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యనిర్వహణాధికారి పి.శైలేంద్ర కుమార్, ఉత్తర బలిజపాలెం తెదేపా నేతలు కీలక పాత్ర పోషించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల వద్ద ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు.

- బల్లికురవ మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ముత్యాల ముగ్గులు, రంగవల్లుల, కోడి పందెలు, యడ్ల బలప్రదర్శనలు, యువత ఉత్సాహ కేరింతలతో పల్లెలు పులకించాయి. కొణిదెన గ్రామంలోని శ్రీభూ,నిలా సమేత చెన్నకేశవస్వామి వార్లను గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.
- దర్శి పట్టణంతో పాటు మండలంలో సంక్రాంతి, కనుమ పర్వదినోత్సవ వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రజలు సమీపంలోని ఆలయాలకు క్యూకట్టారు.

–న్యూస్‌టుడే, బృందం

ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

దర్శిలో విశేషాలంకరణలో పోలేరమ్మ

కొణిదెనలో గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి

అద్దంకి ఊరచెరువులో తెప్పోత్సవం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

తాళ్లూరు: ఈ లింకును క్లిక్ చేస్తే రూ.అయిదు వేల నగదు ఉచితంగా అందుతుంది. ఇది ఫేక్ కాదు కచ్చితంగా నిజమేనంటూ గత రెండు, మూడ్రోజులుగా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు వస్తున్నాయి. అధిక మంది సభ్యులుండే గ్రూపుల్లోకి ఆ మెసేజ్ వచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. అవి ఫేక్ మెసేజ్‌లని, ఎవరూ వాటిని క్లిక్ చేయకుండా తొలగించాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు సూచించారు. ఎవరు అయినా సైబర్‌దాడులకు గురైతే తమను సంప్రదించాలని కోరారు.

అరుదైన గ్రూప్ రక్తం దానం

దర్శి, న్యూస్‌టుడే: ఒంగోలులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో గుండె శస్త్రచికిత్స నిమిత్తం వచ్చిన వ్యక్తికి ఏబీ నెగిటివ్ గ్రూప్ రక్తం అవసరమయింది. ఈ గ్రూప్ రక్తం కోసం రోగి కుటుంబ సభ్యులు వారం నుంచి ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకుని శ్రీగాయత్రి కళాశాల ఛైర్మన్ వై.వి.సుబ్బయ్య ఒంగోలు వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఆయన్ని పలువురు అభినందించారు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P నెంబరు 61/2019 ఇన్ ఒ.యస్.నెంబరు 37/2018

బిట్వీన్:
పుసుకూరి పద్మావతి ...డి.హెచ్.ఆర్
వర్సెస్
మూకర జనార్దన్ ...జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పి. దాఖలా డి.హెచ్.ఆర్ తన డిక్రీ బాకీ రాబట్టుకొను నిమిత్తం జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని వేలపు యిస్తిహారు షరతులకు లోబడి ది 4-2-2026న ఉదయం 10.30 గంటల లగాయితు పై కోర్టునందు బహిరంగవేలము జరుపబడును. కావున సదరు వేలం పాటలో పాల్గొనదలిచినవారు పై కోర్టులో పై తెలిపిన సమయమునకు హాజరై వేలం షరతులు తెలుసుకొని వేలంలో పాల్గొనవలెయును.

ఐటం-2 E.P షెడ్యూలు: ప్రకాశం జిల్లా - ప్రకాశం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్ - జె. పంగులూరు మండలం - అలవలపాడు గ్రామము. అలవలపాడు గ్రామ పంచాయతీ ఏరియా - సర్వేనెం 112 - ఫస్ట్ ప్లాట్ Ac 0-48 సెంట్లు మాగాణి భూమి హద్దులు. **తూర్పు:** పంటకాలువ. **దక్షిణం మరియు పడమర:** ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు గారి మాగాణిభూమి. **ఉత్తరం:** షేక్ ప్రత్తిపాటి మస్తాన్ మాగాణి భూమి కొంతవరకు మరియు ఇమ్మడి శెట్టి వెంకటేశ్వర్లు మాగాణి భూమి కొంత వరకు పై హద్దులలోని Ac 0-48 సెంట్లలో JDRకి హక్కు గల అన్‌డివైడడ్ సగం పై ఆస్థిని శ్రీ కోర్టు వారు జప్తు చేయునాటికి ఇ.సి.దాఖలా ఎలాంటి అన్యాక్రాంతములు లేవు.

డి.హెచ్.ఆర్.విలువ : రూ. 2,00,000-00
అమీనా విలువ : రూ. 2,50,000-00
మార్కెట్ విలువ : రూ. 2,40,000-00
వేలం తేది: 4-2-2026
ఫరదర్ హియరింగ్ 11-2-2026
"శ్రీ కోర్టువారి అనుమతితో"

ఇట్లు/- పంచాగ్నుల రమేష్
డి.హెచ్.ఆర్ తరపు అడ్వకేట్
అద్దంకి - ప్రకాశంజిల్లా.
సెల్: 9948788290

అద్దంకి
తేది: 15-1-2026

గోవు విక్రయంపై వివాదం

కురిచేడు, న్యూస్‌టుడే: గ్రామ దేవతకు వదిలిన గోవును స్థానికులు కొందరు వేరే వ్యక్తులకు విక్రయించారని తెలుసుకుని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని నమశ్శివాయపుర అగ్రహారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామ దేవత అంకాల పరమేశ్వరీ అమ్మవారి ఆలయానికి గ్రామస్థులంతా కలిసి కొన్నేళ్ల క్రితం ఓ గోవును ఊరిపై వదిలారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

విద్యార్థుల ఇబ్బందులు తీరాయి

తాళ్లూరు, న్యూస్‌టుడే: తాళ్లూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం వద్ద ప్రహరీ గోడ నిర్మాణంతో విద్యార్థుల ఇబ్బందులు తీరాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రహరీగోడ నిర్మించటంతో వసతిగృహంలోకి దుమ్ము, ధూళి పడకుండా ఉండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెదేపా నేత కోనేటి కన్నుమూత

అద్దంకి: ఉత్తరఅద్దంకి తొలితరం తెదేపా నేత **కోనేటి అంజయ్య** (80) గురువారం ఇంటి వద్ద కన్నుమూశారు. తెదేపా ఆవిర్భావం నుంచి జనసమీకరణలో చురుగ్గా, పార్టీ అధిష్ఠానం వద్ద చురుకైన కార్యకర్తగా ముద్రపడిన అంజయ్య మృతి పట్ల పలువురు తెదేపా నేతలు సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం ఉత్తర అద్దంకి హిందూ శ్మశానవాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.

అభ్యసన సామగ్రి పంపిణీ

దర్శి: యూటీఎఫ్ నాయకులు దాచూరి రామిరెడ్డి జయంతి సందర్భంగా సంఘ ఉపాధ్యాయులు రామారావు కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్ తయారు చేసిన మెటీరియల్‌ను అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాత రామారావు

పోటీ పడుతున్న పొట్టేళ్లు

రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల పోటీలు

పమిడిపాడు (మేదరమెట్ల): సంక్రాంతి సందర్భంగా కొరిశపాడు మండలం పమిడిపాడులో రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బలప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీలను పమిడిపాడు సొసైటీ ఛైర్మన్ జాగర్లమూడి జయకృష్ణ- యాదవ్ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పోటాపోటీగా జరిగిన ఈ బల ప్రదర్శన చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ పోటీల్లో కాకుమానుకు చెందిన ముత్యాల నాగయ్యకు చెందిన పొట్టేలు రూ.50వేలు (ప్రథమ) రేణింగవరం సూర్య పొట్టేలుకు రూ.30వేలు (ద్వితీయ) రేణింగివరం గ్రామానికి చెందిన పొట్టేళ్లుకు రూ.20వేలు, (తృతీయ ఉల్లగల్లు గ్రామానికి చెందిన నాగార్జున పొట్టేళ్లు రూ.10 వేలు నాలుగో బహుమతి గెలుచుకున్నారు.

రావినూతలలో ముగిసిన క్రికెట్ సందడి

రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం రావినూతలలో ఈ నెల 9 నుంచి నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ కప్-2026 పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం మూడో బహుమతి కోసం ఎంఆర్‌సీసీ చెన్నై-సౌత్ జోన్ సీసీ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోటీల్లో ఎంఆర్‌సీసీ జట్టు విజయం సాధించింది. అనంతరం మధ్యాహ్నం శ్రీసీసీ చెన్నై-ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఈ జట్టులో విశాల్ 61 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌కేఎం సీసీ జట్టు 19 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌట్ అయి పరాజయం పాలైంది. ఈ జట్టులో నితిన్ 71 పరుగులు చేశాడు. శ్రీ సీసీ జట్టు బౌలర్లు శంకర్ గణేష్ 4, ఫయాజ్ 3 వికెట్లు తీసి రాణించారు. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు అధిక సంఖ్యలో క్రీడాభిమానులు రావినూతలలోని ఆర్ఎస్‌సీఏ స్టేడియానికి తరలివచ్చారు.

శ్రీసీసీ- ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

సమస్యల వివరణ.. తప్పుల సవరణ..

- కొత్త పాసుపుస్తకాల్లో మార్పులకు చర్యలు

న్యూస్‌టుడే, జె.పంగులూరు:

రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో రైతువారీ పట్టా భూములను ఈనాం భూములుగా నమోదు చేయడంతో డివిజన్లోని రైతులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరిస్తూ రాజముద్రతో కూడిన కొత్త పాసు పుస్తకాలు ఇస్తోంది. దీనివల్ల కొంత ఉపశమనం కలిగినట్లవుతోందని రైతులు పేర్కొంటున్నారు.

2,416 ఎకరాల్లో సమస్య ఉత్పన్నం

పంగులూరు మండలంలో అత్యధికంగా కొటపాడు, తూర్పుకొప్పెరపాడు, అలవలపాడు, చందలూరు గ్రామాలలో 1,943 మంది రైతులకు చెందిన 2,416 ఎకరాలు రైతు వారీ పట్టాల భూములను ఈనాం భూములుగా నమోదు చేయడంతో సమస్య ఉత్పన్నం అయింది. కూటమి ప్రభుత్వం కొత్త పాసుపుస్తకాలు ఇవ్వడంతో భూమి మీద హక్కు పత్రం పొందడంతో పాటు, ప్రభుత్వం అందించే సంక్షేమ లబ్ధి పొందడానికి వీలు కలిగింది.

కోటపాడులో పాసుపుస్తకాల పంపిణీ

సమస్యకు శాశ్వత పరిష్కారం

నాది చందలూరు. 2022లో జరిగిన రీసర్వే తరువాత 2.80 ఎకరాల భూమి ఈనాం భూమిగా నమోదై రుణం పొందే వీలు లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం తప్పులను సరిచేసి కొత్త పుస్తకం ఇవ్వడంతో మా భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది. – కరి వెంకట సుబ్బయ్య, రైతు

కొత్త పుస్తకాలతో ప్రయోజనం

నాకున్న 1.30 ఎకరాల భూములు ఈనాంకింద నమోదు అయ్యాయి. ప్రభుత్వం నుంచి అందే లబ్ధికి దూరం అయ్యాం. బ్యాంకు రుణాలు ఇవ్వకపోవడంతో ఎక్కువ వడ్డీతో తీసుకొని వ్యవసాయం చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం తప్పులను సరిచేసి పుస్తకాలు ఇవ్వడంతో సమస్య తీరినట్లయింది.
నాయిపాము రామస్వామి, రైతు, చందలూరు

ప్రత్యేక దృష్టి సారించాం



నేను బాధ్యతలు చేపట్టిన తరువాత ఎక్కువగా ఈనాం భూముల సమస్య అని అర్జీలు రావడంతో ప్రత్యేక దృష్టి సారించాం. రీ సర్వే జరిగిన 4 గ్రామాలలో ఈనాం భూములుగా నమోదైన వివరాలను తీసుకుని మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాం. – శింగారావు, తహసీల్దారు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

కురిచేడు, న్యూస్‌టుడే:

?: మండలంలోని పడమర నాయుడుపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో మహిళలు, చిన్నారులు రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలి.

– అనిల్, స్థానికుడు

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం.

– మహేష్, సర్పంచి

(c) eenadu

కొప్పోలు చెరువులో చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

చీమకుర్తి: అగ్రహారంలో వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

మృదంగ యోగి చంద్రశేఖరం జయంతి వేడుకలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మృదంగ యోగి దొడ్డవరం చంద్రశేఖరం జయంతి వేడుకలు స్థానిక సీతారాంపురంలోని సమితి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతారాంపురం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు శింగంశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎదురులేని మహా మృదంగ విద్వాంసుడిగా ఖ్యాతి గడించి, తన సంపాదన అంతా త్యాగరాజస్వామి ఉత్సవాలకు, శిష్యగణానికి, సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారని కొనియాడారు. ఆయన శిలా విగ్రహాన్ని మద్దిపాడు మండలం దొడ్డవరంలో ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. విశ్రాంత హెచ్‌ఎం బెజవాడ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మృదంగయోగి జీవనయానం నేటి యువతకు మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో సాయికృష్ణ, శ్రీదత్తు, చల్లా నిఖిలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం.. పులకించిన భక్తజనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని కె.అగ్రహారంలో గల ప్రసన్న వేంకటేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. సంక్రాంతి పర్వదినం రోజున నిర్వహించిన ఈ వేడుకలో భారీగా భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి రథాన్ని భక్తి శ్రద్ధలతో లాగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిద్దా వెంకటేశ్వరరావు, సూర్యప్రకాశరావు, హనుమంతరావు, భరత్, ఉదయ్, రవిరామానుజాచార్యులు, కె. బాలకృష్ణ తదితరులు పూజలు నిర్వహించారు.

అప్పాయికుంటలో సీతారామచంద్రస్వామి

విహరించిన చెన్నకేశవస్వామి..

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని ఒంగోలు నగరపరిధిలోని కొప్పోలు చెరువులో గురువారం గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెళ్లూరులోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హోమం ఏర్పాటు చేశారు. దశరాజుపల్లెరోడ్డులోని అప్పాయికుంటలో గురువారం సాయంత్రం సీతారామచంద్ర స్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. కమ్మపాలెంతోపాటు, దశరాజుపల్లె గ్రామానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తెప్పోత్సవాన్ని తిలకించారు. అనంతరం కుంట పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో పెళ్లూరులోని జ్వాలాముఖి అమ్మవారు

వేణుగోపాలస్వామి వేడుక..

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఉప్పుగుండూరులోని వేణుగోపాల స్వామి వారి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీధరాచార్యులు స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ మాగులూరి సత్యనారాయణ, ఈవో రామకృష్ణలు పర్యవేక్షించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

బరిలో దిగిన కోడి!

న్యూస్‌టుడే, కొత్తపట్నం, చీమకుర్తి, సంతనూతలపాడు

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పొట్టేళ్ల పోటీలు జోరుగా సాగాయి. కోడి పందేలు అయితే గోదావరి జిల్లాలను తలపించాయి. టెంట్లు, షామియానాలు, విద్యుద్దీపాలు వేసి మరీ బరులను సిద్ధం చేశారు.

ఎస్‌ఎన్‌పాడు: మాచవరంలో కోడిపందేలు

బహుమతిగా పల్సర్ బైక్..

కొత్తపట్నం మండలం గమళ్లపాలెం, మోటుమాల, గుండమాల, మడనూరు సముద్ర తీరాల్లో కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. వీటికి తోడు జూదం, గుండాట వంటివి కూడా నిర్వహించారు. పోలీసుల ఆంక్షలను ఎవరూ పట్టించుకోకుండా బరుల్లో కోళ్లకు కత్తికట్టి పందేలు వేశారు. ఈ పందేల్లో రూ.లక్షలు చేతులు మారాయి. పందేలు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి కారుల్లో సైతం తరలివచ్చారు. పందేలు కమీషన్ తరహాలో నిర్వహించారు. రూ.లక్షకు పది వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా బరుల వద్ద జనం కిక్కిరిసిపోయారు. రాత్రి ఎనిమిది గంటల వరకు పందేలు కొనసాగించారు. గమళ్లపాలెంలో విజేతలకు పల్సర్ బైకు బహుమతిగా ప్రకటించారు. గురువారం రాత్రి కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళ్లే ప్రధాన రహదారి అల్లూరు శివారున కోటేశ్వరరావు అనే వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంక్షలు ఉన్నా కోడి పందేలు నిర్వహించడం ఏమిటని ప్రజలు మండిపడ్డారు.

కొత్తపట్నం: గమళ్లపాలెం తీరం వద్ద బరి

అక్కడే బిర్యానీలు తినేలా..

చీమకుర్తి, మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండగ మూడు రోజులు కోడి పందేలు జోరుగా సాగాయి. చీమకుర్తి, గాడిపర్తివారిపాలెంలో గోదావరి జిల్లాలను తలపించే రీతిలో భారీగా బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. గాడిపర్తివారిపాలెంలో ప్రవేశ టిక్కెట్ ఏర్పాటు చేసి బరిలోపల తాగునీరు, బిర్యాని లాంటి ఏర్పాట్లు చేయడం విశేషం. చంద్రపాడు, బూసరపల్లి, గుడిపూడివారిపాలెం తదితర గ్రామాల్లో కోడిపందేలు జరిగాయి. కొన్ని బరుల వద్ద రూ.లక్షలు చేతులు మారాయి.

● సంతనూతలపాడు మండలంలో కోలాహలంగా కోడి పందేలు జరిగాయి. మాచవరంలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి మరీ కత్తికట్టి కోడి పందేలు చేపట్టారు. ఇక్కడ రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది. ఇక్కడే కాయ్ రాజా కాయ్ వంటి క్యాషినో తరహాలో జూదాలు సైతం నిర్వహించారు. సంతనూతలపాడులో టెంట్లు ఏర్పాటు చేసి కోడి పందేలు పెట్టారు.

వైభవంగా గంధ మహోత్సవం

మద్దిపాడు, న్యూస్‌టుడే: పెదకొత్తపల్లి హజరత్ సయ్యద్ కరీముల్లా షా ఖాదరి 42వ ఉరుసు (గంధ) మహోత్సవం గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుల మతాలకు అతీతంగా ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అందరూ ఐక్యంగా ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, నర్రా సురేష్, రాయపాటి పవన్, జనసేన నాయకుడు తిరుమలశెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పుగుండూరు కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి నాటుజాతి పోలు రాధా పోటీలను ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సందర్భంగా ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన సుధీర్, వి.వి.ఐస్‌క్రీమ్ బెల్లం నరేష్, జాలాది అయ్యప్ప చౌదరి, కోట ఆదినారాయణ కంబైండ్ జోడి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. వారు రూ.25 వేల నగదు బహుమతి అందుకొన్నారు. చవటపాలేనికి ఈదర సుబ్బయ్య చౌదరి ఎడ్లు రెండో స్థానంలో నిలిచి రూ.20 వేల బహుమతి సాధించాయి. ఒమ్మెవరానికి చెందిన భీమవరపు బ్రహ్మయ్యకు చెందిన ఎడ్లు మూడో స్థానంలో రూ.15 వేలు నగదు బహుమతి అందుకొన్నాయి. ఉప్పుగుండూరుకు బెల్లం రాఘవయ్య ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచి రూ.10 వేలు బహుమతి అందుకొన్నాయి. విజేతలకు ఎమ్మెల్యే, నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు కాట్రగడ్డ చంద్రబాబు, జాన్సన్, కాకతీయ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలు రాధా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

అందరి కృషితోనే పర్యావరణ పరిరక్షణ

మద్దిపాడు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ సూచించారు. శ్రీవారి వనం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరుకు చెందిన అమరా సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు వేణు, మధులు మొక్కలను పంపిణీ చేశారు. పంచారు. తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి రూ. 50,000 ఖర్చుతో 500 మొక్కలను సంక్రాంతి పర్వదినాన ఆలయానికి వచ్చిన భక్తులకు వీటిని ఇచ్చి స్ఫూర్తిగా నిలిచారు. ముఖ్య అతిథిగా వచ్చిన డ్వామా పీడీ మొక్కలను పంపిణీ చేసి దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పొగాకు పెంపకందారుల సమాఖ్య ఛైర్మన్ మండవ జయంత్‌బాబు, మల్లవరం వేంకటేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్ రాఘవ, శ్రీవారివనం గౌరవాధ్యక్షుడు కావూరి వాసు, అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీలో పాల్గొన్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు, డ్వామా పీడీ జోసెఫ్

ఘనంగా పార్వేట ఉత్సవం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కనుమ పండగను పురస్కరించుకొని ఒంగోలు నగరంలోని గద్దలగుంటపాలెంలో పారువేట ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నగరంలోని 32 ఆలయాల నుంచి దేవతామూర్తులు మేళతాళాల నడుమ ఊరేగింపుగా గద్దలగుంట ప్రాంతానికి తరలివచ్చాయి. ఈ సందర్భంగా దారి పొడవునా భక్తులు కర్పూర హారతులతో నీరాజనం పడుతూ స్వాగతం పలికారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరిలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గద్దలగుంట గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులో పెద పార్వేటు వేడుకలను నిర్వహించారు. త్రిపురాంతకస్వామి, చెన్నకేశవ స్వామి, జెండా చెట్టు వద్దనున్న ప్రసన్నాంజనేయస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతారాముల స్వామి, పెద్ద బజారులోని సీతారామస్వాములకు ముందుగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జడ్పీ హెచ్ఎస్ వద్ద పెద్ద పార్వేటుకు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకొన్నారు.

ఒంగోలు: దేవతామూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడులో కొలువు దీరిన స్వామివార్లు

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: మద్దిపాడు మండలం కొలచనకోట ఎస్సీ కాలనీలో షాలెము చర్చి సమీపంలో వీధి దీపాల ఆన్, ఆఫ్ చేసే స్విచ్ బోర్డు తక్కువ ఎత్తులో ఉంది. చిన్నారులు అటుగా వెళితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.
–జె.మస్తాన్‌రావు, స్థానికుడు
✓: విద్యుత్తు సిబ్బందిని పంపించి స్విచ్ బోర్డును ఎక్కువ ఎత్తులో అమర్చడానికి చర్యలు తీసుకుంటాం.
–చెన్నారెడ్డి, విద్యుత్తు ఏఈ

?: మద్దిపాడు ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం నెలకొంది. పండగ రోజుల్లో చీకటిపడితే బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకోగలరు.
–ఎం.రామాంజనేయులు, కాలనీవాసి
✓: వెంటనే పరిశీలించి విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
–నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు పంచాయతీ పరిధిలో అరుంధతీ నగర్‌లోని సైడు కాలువల్లో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుంది. దుర్వాసనతో పాటు, దోమలు పెరిగిపోయి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.
– పాటిబండ్ల లాబాను, గ్రామవాసి
✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు నీరు తొలగించి బ్లీచింగ్ చల్లిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.
–నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు మండలం మల్లవరం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో విద్యుద్దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. పగటిపూట వెలగకుండా స్విచ్‌లు ఏర్పాటు చేయాలి. – ఎం.ఆదినారాయణ, స్థానికుడు
✓: వెంటనే పరిశీలించి పగటిపూట విద్యుద్దీపాలు వెలగకుండా ఏర్పాట్లు చేస్తాం.
–చెన్నారెడ్డి, ఏఈ – న్యూస్‌టుడే, మద్దిపాడు

పక్కకు జరిగితే గాయాలే!

చంద్రపాలెం-మంగమూరు రోడ్డును చిల్లచెట్లు పూర్తిగా కమ్మేశాయి. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ఒంగోలు నగరానికి వెళ్తుంటారు. కొండపి మండలంతో పాటు, సంతనూతలపాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అధికారులు చిల్లచెట్లను తొలగించాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సంతనూతలపాడు

మరమ్మతులు చేసినా మళ్లీ లీకులే!

ఒంగోలు నగరంలో పైపులైన్ల లీకులు కొలిక్కి రావడం లేదు. ఏబీఎం కళాశాల ఎదుట ఇటీవల ఏర్పడిన లీకును బాగు చేశారు. అందుకు తీసిన గుంతను సైతం పూడ్చివేశారు. మళ్లీ అక్కడే సోమవారం లీకు పడి నీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య దృష్టికి తీసుకెళ్లగా.. రెండు రోజుల్లో లీకు లేకుండా మరమ్మతులు చేపడతామన్నారు. దీనివల్ల కళాశాల ప్రాంగణంలో ఆటలాడుకునేందుకు వెళుతున్న విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.
–న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఆలయాల్లో భక్తుల సందడి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం స్వామి వారి తిరువీధి ఉత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో తరలి వచ్చిన స్వామివారికి భక్తులు మంగళహారతులు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అద్దంకి స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం భక్తులను అలరించింది.

◗ మద్దిపాడు: మల్లవరం గుండ్లకమ్మ జలాశయం వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మద్దిపాడులోని పలు ఆలయాల్లోనూ భక్తుల రద్దీ నెలకొంది. దొడ్డవరంలో వడియ రాజుల ఆధ్వర్యంలో అంకమ్మతల్లి గుడిలో పూజలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. గుండ్లకమ్మ జలాశయం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

◗ సంతనూతలపాడు: పేర్నమిట్టలో పోలేరమ్మ దేవస్థానం వద్ద సీతారాముల కల్యాణం చేసి గ్రామోత్సవం చేపట్టారు. సంతనూతలపాడు, చిలకపాడు, మంగమూరు తదితర గ్రామాల్లో దేవతామూర్తుల ఊరేగింపు సందడిగా సాగింది.

ఒంగోలు శ్రీగిరి వేంకటేశ్వర స్వామివారు

పేర్నమిట్టలో గ్రామోత్సవంలో సీతారాములు

చీమకుర్తి: రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

కొప్పులులో బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల వేడుకలో పాల్గొన్న స్థానికులు

పెద్ద పండగ... ఆనందం మెండుగ

న్యూస్‌టుడే, బృందం

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో పెద్ద పండగ సంక్రాంతిని ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంటా బంధువులు, స్నేహితులతో సందడి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ముగ్గులు, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

❒ ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలులో నిర్వహించిన సంప్రదాయ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం రాత్రి జరిగిన సభలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బహుమతులు పంపిణీ చేశారు. ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకటరావు, తెదేపా నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్ తదితరులు పాల్గొన్నారు.

❒ గద్దలగుంట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లోని విజేతలకు ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ బహుమతుల పంపిణీ చేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడు కొల్లా నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

❒ డైఫీ, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఒంగోలులోని గోపాలనగర్, బలరామ్ కాలనీ, దారావారికుంట ప్రాంతాల్లో ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు డైఫీ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న చేతుల మీదగా బహుమతులు అందజేశారు. డైఫీ, ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణపురంలో నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ సీఐ జగదీష్, వైద్యుడు అనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

❒ చీమకుర్తి గాంధీనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అందంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు అందజేశారు. దేవరపాలెంలో ఎన్.శివనాగేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, యు.తిరుపతిరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు న్యాయమూర్తి లావణ్య, గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, పాలకొల్లులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న పెండేల లావణ్యను ఘనంగా సత్కరించారు.

❒ సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట, మైనంపాడు, మంగమూరు, సంతనూతలపాడులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మైనంపాడులో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, చిన్నారుల భరత నాట్యం ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

❒ మద్దిపాడు మండలం కొలచనకోట ఎస్టీ కాలనీలో ప్రజా సంఘాల నాయకులు మోరబోయిన వెంకటరవి, ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఉబ్బా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పేర్నమిట్టలో చిన్నారి నృత్యం

రోడ్డు ప్రమాదంలో అయిదుగురికి గాయాలు

చీమకుర్తి: చీమకుర్తి యర్రగుడిపాడు చినరాస్తా రహదారిలో ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అయిదుగురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఎల్.అశోక్‌రెడ్డి, పి.అంజిబాబులు ఒంగోలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చినరాస్తా రహదారిలో మంచికలపాడు శివారులో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న సంతనూతలపాడు మండలం పి.గుడిపాడుకి చెందిన అశోక్ రెడ్డి, అంజిబాబులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ప్రయాణికుడి దౌర్జన్యం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మీరు వెళ్లే మార్గం కాదు, మే చెప్పిన మార్గంలో వెళ్లాలంటూ ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఒంగోలు బస్టాండ్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. టీఎస్‌ఆర్టీసీకి చెందిన బస్సు దేవరకొండ నుంచి తిరుపతి వెళ్తూ రాత్రి 9.35 గంటలకు ఒంగోలు డిపోకు చేరింది. ఆ సమయంలో పూర్తిగా మద్యం మత్తులో ఉన్న ఎం.నాగార్జున అనే వ్యక్తి కావలికి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సు కావలి పట్టణంలోకి వెళ్లదని చెప్పడంతో ఆగ్రహించాడు. డిపోలోకి వెళ్లాల్సిందేనని పట్టుబట్టాడు. కుదరదని చెప్పడంతో డ్రైవర్ లక్ష్మయ్యతో గొడవపడి ముఖంపై దాడి చేశాడు. రెండో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు అతడిని అడ్డుకుని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

రావినూతలలో ముగిసిన క్రికెట్ పోటీలు

రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం రావినూతలలో ఈ నెల 9 నుంచి నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ కప్-2026 పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం మూడో బహుమతి కోసం ఎంఆర్‌సీసీ చెన్నై-సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోటీల్లో ఎంఆర్‌సీసీ జట్టు విజయం సాధించింది. అనంతరం మధ్యాహ్నం శ్రీసీసీ చెన్నై-ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఈ జట్టులో విశాల్ 61 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌కేఎం సీసీ జట్టు 19 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌట్ అయి పరాజయం పాలైంది. ఈ జట్టులో నితిన్ 71 పరుగులు చేశాడు. శ్రీ సీసీ జట్టు బౌలర్లు శంకర్ గణేష్ 4, ఫయాజ్ 3 వికెట్లు తీసి రాణించారు. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు అధిక సంఖ్యలో క్రీడాభిమానులు రావినూతలలోని ఆర్ఎస్‌సీఏ స్టేడియానికి తరలివచ్చారు.

శ్రీసీసీ- ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం జనవరి 17, 2026

రాకాసి అల.. మింగేసింది!

ఇద్దరి మృతి.. మరో ఇద్దరు గల్లంతు

న్యూస్‌టుడే, అల్లూరు

ఇంట్లో పరిస్థితులు అనుకూలంగా లేవు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినా చదువుకోవాలనే తపన వారిది(?). ఆదొక్కటే తమ జీవితాలకు వెలుగునిస్తుందన్న నమ్మకం. ఎంత మొరపెట్టుకున్నా పెద్దలు పట్టించుకోకపోవడంతో వీరు ఆశ్రమ పాఠశాలలో చేరారు. ఇంకేం పర్వాలేదనుకుంటున్న సమయంలో రాకాసి అలలు వారి కలలనే కాదు.. ఏకంగా ప్రాణాలనూ చిదిమేశాయి. అల్లూరు మండలం ఇస్కపల్లిపాలెం సముద్ర తీరంలో ఇద్దరు మృతి చెందడం.. మరో ఇద్దరు గల్లంతవడం.. జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది.

మృతదేహాల వద్ద విషణ్న వదనాలతో స్థానికులు

సరదాగా గడిపేందుకు వచ్చి..

పండగ పూట సరదాగా గడిపేందుకు అమ్ములు, బాలకృష్ణ, అభిషేక్, సుధీర్, వెంకటేశు, చిన్నబ్బయ్య అనే ఆరుగురు శుక్రవారం ఇస్కపల్లి పాలెం తీరానికి వచ్చారు. నీటిలో దిగి సరదాగా గడుపుతున్నారు. అలా కొద్దిసేపు గడిచిన వెంటనే.. ఓ రాకాసి అల వీరిని ఉక్కిరిబిక్కిరి చేసి తనలో కలిపేసుకునే ప్రయత్నం చేసింది. అప్రమత్తమైన స్థానిక మత్స్యకారులు వెంకటేశు, చిన్నబ్బయ్యను కాపాడగా- మిగిలిన నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఈగ అమ్ములు(14), బాలకృష్ణ(15) మృతదేహాలు లభ్యమవగా- అభిషేక్, సుధీర్ కోసం గాలిస్తున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. గాలింపు కోసం కాకినాడ నుంచి కోస్ట్ గార్డు ప్రత్యేక పడవ వస్తోందని అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

మృతుల్లో అన్నాచెల్లెలు

బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన ఈగ చిన్నబ్బయ్య, ఈగ బాలకృష్ణ, అమ్ములు, పోతమ్మలు ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరిలో పెద్దవాడైన చిన్నబ్బయ్య అల్లూరు మండలం గొల్లపాలెం(?) ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. గత ఏడాది పదో తరగతి ఉత్తీర్ణుడై.. మరో ప్రాంతంలో ఇంటర్లో చేరాడు. అనంతరం తమ్ముడు బాలకృష్ణను, ఇద్దరు చెల్లెళ్లను తాను చదివిన ఆశ్రమ పాఠశాలలోనే చేర్పించాడు. శుక్రవారం పండగ సెలవు కావడంతో నలుగురు అల్లూరుపేట(?) సమీపంలోని ఎర్రబొట్లగుంటలో(?) ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో అమ్ములు, బాలకృష్ణ.. ఇతర స్నేహితులు, బంధువులతో కలిసి తీరానికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లారు.

స్నేహితుల ఆచూకీ కోసం..

గల్లంతైన 16 ఏళ్ల కొమరిగిరి అభిషేక్, 17 ఏళ్ల గండ్ల సుధీర్ ఇద్దరూ స్నేహితులు. ఆత్మకూరులో చదువుకుంటున్నారు. బాలాయపల్లి ప్రాంతానికి చెందిన అభిషేక్ ప్రస్తుతం ఇస్కపల్లి బీసీకాలనీలో ఉంటున్నాడు. పదో తరగతి చదువుతున్నాడు. సుధీర్ చేజర్ల.. ప్రస్తుతం అక్కడే ఇంటర్ చదువుతున్నాడు. మిగిలిన స్నేహితులు, బంధువులతో కలిసొచ్చి.. గల్లంతయ్యారు.

సముద్ర స్నానానికి వెళ్లి.. యోగా గురువు

బిట్రగుంట: సముద్ర స్నానానికి వెళ్లిన యోగా గురువును రాకాసి అల కబళించింది. కావలి పట్టణానికి చెందిన యోగా గురువు కొండా అరుణరెడ్డి(35) గురువారం కుటుంబ సమేతంగా బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద ఉన్న సముద్రం వద్దకు వెళ్లారు. భర్త మనోహర్‌రెడ్డి, పిల్లలు, బంధువులతో కలిసి సముద్ర స్నానం ఆచరిస్తుండగా.. ఒక్కసారిగా భారీ అలలు ఎగసిపడ్డాయి. తాటిచెట్లపాలేనికి చెందిన స్థానిక జాలర్లు అయిదుగురిని కాపాడినా.. అరుణ అలల్లో చిక్కుకుని చనిపోయారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులతో పాటు ఆమె శిష్యబృందం కన్నీరు పెట్టారు. బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు తప్పిన పాలవ్యాగన్లు

కావలి, న్యూస్‌టుడే: నిజామాబాద్ నుంచి రేణిగుంట వెళుతున్న పాల వ్యాగన్ బోగీలు కావలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున పట్టాలు తప్పాయి. లూప్ లైన్ నుంచి ప్రధాన ట్రాక్‌లోకి వెళుతుండగా మూడు బోగీలు పట్టాలు తప్పి.. గూడ్స్ వేగం ఒక్కసారిగా తగ్గిపోయింది. ఈ విషయాన్ని స్టేషన్ మాస్టర్‌తో గుర్తించిన లోకో పైలెట్ రైలు నిలిపివేశారు. బిట్రగుంట స్టేషన్‌లోని యాక్సిడెంట్ రిలీఫ్ బృందం వెనువెంటనే అప్రమత్తమై కావలికి చేరుకుంది. సహాయ చర్యలు ముమ్మరం చేయడంతో తిరిగి వ్యాగన్లను రేపట్టెక్కించి(?) పంపారు. అత్యవసరంగా ఆ ట్రాక్‌లో వెళ్లాల్సిన రైళ్లను మరో మార్గంలో పంపించారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది.. పట్టాలు తప్పిన బోగీ

నగర డీఎస్పీగా దీక్ష బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు నగర డీఎస్పీగా ఐపీఎస్ దీక్ష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీ అయిన విషయం తెలిసిందే. నగర ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె ఎస్పీ అజిత వేజెండ్లను మర్యాదపూర్వకంగా కలిశారు.

తెప్పోత్సవం.. భక్తజన పరవశం

కిక్కిరిసిన మైపాడు గేట్ ప్రాంతం

బాలల మధ్య కూర్చొని తిలకిస్తున్న మంత్రి నారాయణ

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కనుమ సందర్భంగా శుక్రవారం నెల్లూరు నగరంలోని వివిధ ఆలయాల నుంచి దేవతామూర్తులు ఊరేగింపుగా తరలిరాగా.. నవలాకుతోట ప్రాంతంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. భారీగా భక్తులు తరలివచ్చారు. మంత్రి నారాయణతోపాటు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ ఉత్సవాన్ని ప్రారంభించారు. నవలాకులతోట, జాఫర్‌సాహెబ్ కాలువ ప్రాంతాలు జనసంద్రాన్ని తలపించాయి. -న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

రైలు పరుగుకు.. పొగమంచు కళ్లెం

రైళ్ల పరుగుకు దట్టమైన పొగమంచు కళ్లెమేసింది. దగ్గరకు వెళ్లేంత వరకు సిగ్నల్స్ కనిపించే పరిస్థితి లేదు. లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు, ఏఎస్ఎమ్‌లు సమన్వయంతో వేగాన్ని తగ్గించి నడపాల్సి వస్తోంది. ఇంజిన్ హెడ్‌లైట్ కాంతి పట్టాలపై ఫర్లాంగ్ దూరం అలవోకగా కనిపించేది. అలాంటిది పొగమంచు ప్రభావం హెడ్‌లైట్ కాంతి కూడా చిన్నబోయింది. కనీసం దగ్గరలో ఉన్న పట్టాలపై కూడా పడే పరిస్థితి లేని దృశ్యాన్ని బిట్రగుంట వద్ద శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో న్యూస్‌టుడే తన కెమెరాలో బంధించింది. – న్యూస్‌టుడే, బిట్రగుంట

తోడేస్తూ పోతే.. కన్నీళ్లు తాగాల్సిందే!

ఈనాడు, నెల్లూరు, జడ్పీ, న్యూస్‌టుడే

జిల్లాలో భూగర్భ జల వినియోగం విపరీతంగా పెరిగింది. అవసరానికి మించి తోడేస్తుండటంతో కొన్ని గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. సోమశిల, కండలేరు జలాశయాలు, సంగం, నెల్లూరు బ్యారేజీలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ నీటి లభ్యత పుష్కలంగా ఉన్నా.. తగిన జాగ్రత్తలు, పరిరక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

15 గ్రామాల్లో దారుణం

ఒక నీటి సంవత్సరంలో.. ఒక గ్రామంలో సగటున 100 యూనిట్ల భూగర్భ జలాలు రీఛార్జి అయ్యాయనుకుంటే.. ఆ ఊరిలో ఆ ఏడాది 70 యూనిట్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు వాడుతున్నట్లు లెక్క. అంటే వినియోగం సమర్థంగా ఉన్నట్లు లెక్కిస్తారు. అదే 70-80 యూనిట్ల మధ్య తోడేస్తుంటే 'ప్రమాదకర(సెమీ క్రిటికల్)' సంకేతంగా, 90 నుంచి 100 యూనిట్ల మధ్య తోడేస్తుంటే.. 'అత్యంత ప్రమాదకర(క్రిటికల్) ధోరణిగా నిర్ణయిస్తారు. కొన్ని పల్లెల్లో 110 యూనిట్లు కూడా వాడుతున్నారు. దీన్ని 'అతి దారుణ' స్థాయిగా గుర్తిస్తారు. గత నీటి సంవత్సరంలో చేసిన అధ్యయనం మేరకు.. జిల్లాలోని 15 గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితులు, మరో 35 గ్రామాల్లో పరిధిని మించి నీళ్ల వాడుతున్నట్లు గుర్తించారు.

కృష్ణపట్నం: భూగర్భజలాలు అడుగంటి నీటి కోసం ఇంటిముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

జిల్లాలో సరాసరి...

నెల	భూగర్భ నీటి లభ్యత (మీటర్లలో)
డిసెంబరు, 2024	5.63
మే, 2025	6.54
డిసెంబర్, 2025	4.51

గత మూడేళ్లలో..

సంవత్సరం	వినియోగం (టీఎంసీల్లో)
2022-23	12.5
2023-24	13.1
2024-25	15.3

ప్రస్తుత లభ్యత

మీటర్లు	మండలాలు
0-3	13
3-8	17
8-15	08

ప్రత్యేక దృష్టిసారిస్తేనే...

జిల్లాలోనూ వేసవిలో తాగునీటికి తహతహలాడే పల్లెలు, కి.మీ. దూరం నుంచి నీళ్లు తెచ్చుకునే దృశ్యాలు కనిపిస్తాయి. తీరంలో భూగర్భంలోకి ఉప్పునీరు చొచ్చుకొస్తోంది. సుమారు పది మండలాల్లోని 150 గ్రామాల్లో బోరునీరు తాగే పరిస్థితి లేదు. ఇప్పటికీ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. ముత్తుకూరు మండలంలోని ఆరు గ్రామాల్లో నిత్యం తాగునీటికి ఎదురు చూడాల్సిన పరిస్థితి. పశ్చిమ నెల్లూరులోనూ బోర్లు ఒట్టిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.

అత్యంత లోతులో నీరున్న ప్రాంతం : 10.2 మీటర్లు, దుత్తలూరు ● అత్యంత సమీపంలో లభ్యత : 0.5మీటర్లు, నాగులవెల్లటూరు

ఆరు వరుసలు.. దుమ్ముదారులు

నెల్లూరు నగరం వెంటేశ్వరపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం దుమ్ము మయంగా మారుతోంది. ఇటీవల ఈ మార్గాన్ని ఆరులైన్ల రహదారిగా విస్తరించారు. పడుగుపాడు, జమ్మిపాలెం సెంటర్ వద్ద పలు కారణాలతో నిర్మాణం చేపట్టలేదు. దీంతో రహదారిపై వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము విపరీతంగా రేగుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్

రైతేరాజు వేరుసెనగ.. పండాలంటే! 6 లో..

కదలని దస్త్రం.. మారని రూపు

రూ. 72.595 కోట్ల అంచనాల తీరిది

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా మారాయి. ఇటీవలి వర్షాలకు గుంతలు పెద్దవై రాకపోకలు సాగించలేని పరిస్థితి. దీంతో ప్యాచ్ పనులకు వీలుకాని రహదారులను గుర్తించి శాశ్వత పనులు చేయాలని అధికారులు తలచారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 133.39 కి.మీ. వరకు కొత్తగా రోడ్లు వేయాలని గుర్తించి.. సి- కేటగిరీ కింద రూ. 72.595 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. ఇవి సాకారమైతే 20 మండలాల్లో ఇక్కట్లు తీరుతాయి. కానీ, ఆ దస్త్రం కదలక.. అనుమతుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

నెల్లూరు గ్రామీణ పరిధిలో రాళ్లు తేలిన రహదారి

32గా విభజించి..

ప్రధానంగా నెల్లూరు గ్రామీణం, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల పరిధిలో ప్యాచ్ పనులకు కూడా వీలుకాని రోడ్లను గురించి.. 32 పనులుగా విభజించారు. మూడు నెలల కిందట ప్రతిపాదనలు పంపారు. చిల్లకూరు, చిట్టమూరు, గూడూరు, నాయుడుపేట, దొరవారిసత్రం, డక్కిలి, ఇందుకూరుపేట, సంగం, ఉదయగిరి, కావలి, వింజమూరు, దగదర్తి తదితర మండలాలు ఈ జాబితాలో ఉన్నాయి.

వేగంగా స్పందిస్తేనే...

ఇటీవలి జడ్పీ సమావేశంలో మర్రిపాడు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో రోడ్ల తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వారికి సమాధానం ఇచ్చారు. ప్రతిపాదనలు ఆచరణలోకి వచ్చి.. రోడ్లు బాగుపడితే అంతేచాలని, ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్కడ.. సమస్యలే పాఠాలు!

ఈనాడు, నెల్లూరు

జిల్లాలో ఏకైక మహిళా పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి

జిల్లాలోనే ఏకైక మహిళా పాలిటెక్నిక్ కళాశాల.. అక్కడ 400 మందికిపైగా విద్యను అభ్యసిస్తున్నారు. కానీ, మూడున్నర దశాబ్దాల కిందట నిర్మించిన కళాశాల భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉండటం.. స్తంభాలు, బీమ్స్, స్లాబ్‌లోని ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా కనిపిస్తుండటంతో.. విద్యార్థిను పాఠాలు సైతం బిక్కుబిక్కుమంటూ వినాల్సి వస్తోంది. అలాగని ఇదెక్కడో మారుమూల కాదు. నెల్లూరు నగరంలోనే... తీవ్రతను గుర్తించిన అధికారులు పరిస్థితిని చక్కదిద్దేందుకు రూ. 9.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. బడ్జెట్‌లో నిధులు లేవని చెబుతుండటం అందరినీ విస్తుగొలుపుతోంది.

వర్షం పడితే అంతే..

కళాశాల.. పరిసర ప్రాంతాల కన్నా తక్కువ ఎత్తులో ఉండటంతో.. కొద్దిపాటి వర్షం కురిసినా గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం నీటితో మునుగుతోంది. ప్రిన్సిపల్ ఛాంబర్‌తో పాటు ప్రయోగశాలలు, డ్రాయింగ్ హాల్ వరకు మట్టి, మురికి నీటితో నిండిపోతుంది. ఆ నీరు రెండు, మూడు రోజులు ఉంటుండటంతో విద్యార్థినులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. 2020లో నిర్మించిన కొత్త హాస్టల్ భవనంలో 70 మందికి మాత్రమే వసతి ఉండగా.. ప్రస్తుతం అందులో 180 మంది ఉంటున్నారు. దీంతో వారితో పాటు మిగిలిన వారూ ఇబ్బంది పడుతున్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ ఏసుదాసు మాట్లాడుతూ గత అక్టోబరులో ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే భవన నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.

అధ్వానంగా ఉన్న భవనం

ఏళ్ల కల.. మనకేదీ ఆ కళ!

ముందుకు కదలని నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే

నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు పక్కనున్న ప్రకాశం జిల్లాలో పూర్తికాగా- జిల్లాలో మాత్రం ఇంకా పీటముడి వీడలేదు. భూసేకరణ ప్రక్రియలో ప్రతిబంధకాలు తొలగలేదు. అధికారులు ప్రక్రియ చెల్లింపుల దశకు చేరినట్లు చెబుతున్నా... ప్రజాప్రతినిధులు సైతం వీటిపై దృష్టిసారించి వేగవంతం చేస్తేనే పనుల్లో కదలిక వస్తుందన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

బొగ్గేరుపై ఆగిన వంతెన పనులు

జిల్లాలో 146.11 కి.మీ.

శ్రీకాళహస్తి- నడికుడి రైల్వేలైన్ పొడవు 309 కి.మీ. కాగా- జిల్లాలో 146.11 కి.మీ. నిర్మించాల్సి ఉంది. రైల్వే లైన్ పరిధిలో 33 స్టేషన్లు ఉండగా- జిల్లాలో ఆ సంఖ్య 15గా ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వం 2018 నాటికే భూసేకరణ పనులు కొలిక్కి తేగా.. అనంతరం ఏర్పడిన వైకాపా ప్రభుత్వం.. అక్కడితో ఆ ప్రక్రియను ఆపేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా చూస్తే మరో రూ. వంద కోట్లు అవసరమని తేలింది. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో పనులు పూర్తి కాగా- జిల్లాలో మిగిలే ఉన్నాయి. పెన్నానది, బొగ్గేరుపై వంతెన పనులు ఆగగా..నిధుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఆత్మకూరు డివిజన్‌లోనే 1160 ఎకరాలు

ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే కాగా.. ఒక్క ఆత్మకూరు డివిజన్‌లోనే 1160 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

● దీనిపై ఆత్మకూరు ఆర్డీవో పావని మాట్లాడుతూ.. రైల్వే లైను భూసేకరణ ప్రక్రియ అన్ని దశలు పూర్తి చేసుకుంది. చెల్లింపులు మాత్రమే మిగిలాయి. ప్రభుత్వం ఆ దిశగా సిద్ధం చేస్తోంది.

కార్యాచరణ లేని పనులు.. వృథాగా నిధులు

ఉపాధి హామీలో ఇదీ పరిస్థితి

"గౌరవరం పరిధిలో ఇళ్ల వెంకటయ్యగుంట నుంచి పొలాలకు సాగునీరు వెళ్లే డొంకకాలువలో గత ఏడాది సరిగా పూడికలేని సందర్భంలో తీసిన చిత్రమిది. డొంక మైలు దూరం కూడా లేకపోయినా ఆరువందలవరకు పనిదినాలు లెక్కల్లో చూపించారు. ఇందు కోసం రూ.1.94 లక్షలు ముందస్తు అంచనాలు రూపొందించారు."

జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో..

పనిదినాల లక్ష్యం: 66 లక్షలు

చేసినవి: 99.57 లక్షలు

ఖర్చు చేసిన నిధులు రూ.344.37కోట్లు

కావలి, న్యూస్‌టుడే : ఉపాధి పనులు చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తే సమస్య తీవ్రతను అనుసరించి చేసేందుకు వీలుంటుంది. అందరికీ తెలిసేలా గ్రామసభలు నిర్వహించకుండా, అంతా పక్కాగా జరుగుతున్నట్లు రికార్డులు నమోదు చేస్తున్నారు. అందరికీ ఉపయోగపడేలా పనులు జరగడం లేదు. దీనివల్ల ఉపయోగం లేనిచోట్ల కూడా పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఏదీ కార్యాచరణ?.. నరేగా పనుల్లో సార్థకత కరవవుతోంది. నిధులు ఖర్చు చేయడమే తప్పా, పదుగురికి అక్కరకొచ్చేలా కార్యాచరణ సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకం పనులు పకడ్బందీగా నిర్వహిస్తే గ్రామాల్లో ఉండే సమస్యలు కొలిక్కి వస్తాయంటున్నారు.

మార్పులు వాస్తవమే..

మృథుల, ఏపీడీ, డ్వామా.. కొన్ని పనులకు జలవనరులశాఖ అభ్యంతరం తెలుపుతోంది. అందువల్ల చేపట్టలేకపోతున్నాం.

చెప్పిందే ధర.. ఇచ్చిందే సీటు!

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, నెల్లూరు(ఆర్టీసీ), కావలి

అధికారులు ఎన్ని సమావేశాలు పెట్టినా.. ఎన్ని హెచ్చరికలు చేసినా.. ప్రైవేటు ట్రావెల్స్ యజమానుల తీరు మాత్రం మారలేదు. సంక్రాంతి రద్దీని అనుకూలంగా చేసుకుని అధిక ఛార్జీలతో దోపిడీకి తెరదీశారు. ఒక్కో ట్రావెల్స్.. ఒక్కో రీతిలో ప్రయాణికుల జేబుకు చిల్లులు పెడుతోంది. శుక్రవారం నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు నాన్ ఏసీ స్లీపర్‌లో రూ. 1200 నుంచి రూ. 1400 వరకు, ఏసీ స్లీపర్‌లో రూ. 1400 నుంచి రూ. 1600 ఛార్జీ వసూలు చేశారు. రద్దీకి అనుగుణంగా ఈ మొత్తాలు అప్పటికప్పుడే పెంచేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఆ క్రమంలోనే శనివారం నాన్‌ఏసీ స్లీపర్‌లో రూ. 2000 వరకు, ఏసీ స్లీపర్‌లో రూ. రూ.2,500 వరకు వసూలు చేస్తున్నారని.. ఆదివారం టిక్కెట్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కావలికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు రిజర్వేషన్‌కు ప్రయత్నించగా.. ఏసీ బస్ టిక్కెట్ ధర రూ. నాలుగు వేలు చెప్పారు. అదీ కావలిలో బస్సు ఎక్కుతామని చెప్పినా.. ధర మారదని, పైగా హైవేపైకే వచ్చి బస్సు ఎక్కాలని సూచించడం గమనార్హం.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

సంక్రాంతిని పురస్కరించుకుని సొంతూర్లకు వచ్చిన ప్రయాణికుల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. హైదరాబాద్‌కు 10, బెంగళూరుకు 8, చెన్నైకి 6, కర్నూలుకు 2, కడపకు 6, విశాఖపట్టణానికి 2, విజయవాడకు 10 బస్సులు వేశారు. ఇవి శనివారం నుంచి సోమవారం వరకు నడుస్తాయని జిల్లా ప్రజా రవాణా అధికారి షమీమ్ తెలిపారు. రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని వివరించారు.

కేసులు నమోదు చేస్తున్నాం

ప్రైవేటు బస్సులు తనిఖీ చేస్తున్నాం. ప్రయాణికులతో మాట్లాడి.. ఛార్జీలపై ఆరా తీస్తున్నాం. అధిక ఛార్జీలు వసూలు చేసినట్లు నిరూపణ అయితే కేసులు నమోదు చేస్తాం. ఒక్కో బస్సు రూ. పది వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

– కరుణాకర్, సహాయ మోటారు ఇన్‌స్పెక్టర్

(c) eenadu

నెల్లూరు ముంబయి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదం

ట్రామా.. ఏదీ చిరునామా?

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం), సంగం, కావలి, గూడూరు పట్టణం

రాష్ట్ర వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో అత్యధికంగా జరుగుతున్న అయిదు జిల్లాల్లో ఒకటిగా నెల్లూరు ఉంది. జిల్లాలో 2024లో 843, 2025లో 928 ప్రమాదాలు జరిగాయి. 2025లో మృతులు 514 మందికాగా.. క్షతగాత్రులు 894 మందిగా ఉన్నారు. ఏటా పెరుగుతున్న ప్రమాదాల్లో బాధితులకు అత్యవసరంగా వైద్యసాయం లభిస్తే ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. ఇందుకు ట్రామా సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయి. జిల్లాలో ఎక్కడా ఒక్క కేంద్రం కూడా లేదు.

జిల్లాలో జాతీయ రహదారులు		
రహదారి	పేరు	పొడవు (కి.మీ)
కావలి- చిల్లకూరు	ఎన్‌హెచ్16	130
నెల్లూరు- జిల్లా సరిహద్దు	ఎన్‌హెచ్67	120
వెంకటగిరి- పామూరు	ఎన్‌హెచ్565	150
సీతారామపురం- దుత్తలూరు	167బిజి	30

పేరుకే సేవలు

ట్రామాకేర్ సెంటరు నెల్లూరులోని సర్వజన ఆసుపత్రిలో కేవలం కాగితాల్లోనే ఉంది. ప్రత్యేక పరికరాలు లేవు, ఆపరేషన్ థియేటర్లు లేవు. సీటీ స్కాన్ వంటి అత్యాధునిక పరికరాలు కావాల్సి ఉంది. ట్రామాకేర్‌కు కేటాయించిన సిబ్బందిని ఆసుపత్రి సేవలకు వినియోగించుకుంటున్నారు. ఎంతో కీలకమైన ఈ వ్యవస్థ ఆసుపత్రిలో లేకపోవడం గమనార్హం.

ప్రాథమిక చికిత్సకే పరిమితం

రెండు జాతీయ రహదారులకు కూడలిగా ఉన్న కావలి ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రస్తుతం ట్రామాకేర్ సెంటర్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులు సకాలంలో చికిత్సలు పొందలేకపోతున్నారు. రోజూ ఒకటి రెండు ప్రమాదాలు జరుగుతుండటంతో క్షతగాత్రుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో స్థానిక ఆసుపత్రికి తీసుకొస్తే ప్రాథమిక చికిత్స అనంతరం 'రెఫర్ టూ నెల్లూరు' అంటున్నారు. మార్గమధ్యంలోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన కావలి- సీతారామపురం హైవే 167 బీజీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గూడూరు పట్టణంలో కూడా ట్రామాకేర్ సెంటర్ లేకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి నెల్లూరు జీజీహెచ్‌కు పంపుతున్నారు.

గోల్డెన్ అవర్ చికిత్స దూరం

ప్రమాదం జరిగిన తొలిగంటలో బాధితులకు లభించే చికిత్సనే గోల్డెన్ అవర్ అంటారు. ట్రామాసెంటర్‌లో అది లభ్యమవుతుంది. ఉమ్మడి జిల్లాలో నాయుడుపేటలో ట్రామా కేర్‌ను మంజూరు చేశారు. జాతీయ రహదారి ఉండటంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో అక్కడ కేటాయించారు. విభజన అనంతరం జిల్లాలో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదాల సమయంలో ప్రాణాలు గట్టెక్కాలంటే.. కేంద్రం ఏర్పాటుపై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

వేరుసెనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వేరుసెనగ.. పండాలంటే!

న్యూస్‌టుడే, సీతారామపురం

వేరుసెనగలో తెగుళ్లు సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాసా కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రధానంగా మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్లు పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయన్నారు.

మొవ్వకుళ్లు: నివారణకు కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందు 4 మి.లీ నీటిలో కలిపి విత్తనశుద్ధి చేయాలి. అనంతరం 3గ్రాముల మాంకోజెబ్, కార్బండిజం 2 గ్రాముల చొప్పున కలిపి విత్తాలి. రబీలో వేరుసెనగతో సజ్జను 7:1 నిష్పత్తిలో అంతర పంటగా వేయాలి. పంట విత్తిన 20 రోజుల తరువాత తామర పురుగుల (థ్రిప్స్) వ్యాప్తిని అరికట్టేందుకు థయోక్లోప్రిడ్ 60 మి.లీ, 60 రోజులకు అసిటామిప్రిడ్ 40 గ్రాముల మందు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు: వయ్యారి భామ, ఉత్తరేణి, ఎన్నెదురులాకు, కుక్కమట్ట, గడ్డి చేమంతి, గరిటకమ్మ పువ్వుల్లోని పుప్పొడి రేణువులతో సోకుతుంది. ఈ మొక్కలను పూతదశకు రాక ముందే తీసివేయాలి. పొలం చుట్టూ సజ్జ లేదా జొన్న లేదా మొక్కజొన్న వేసుకోవాలి. అంతరపంటగా సజ్జ లేదా జొన్న లేదా మొక్కజొన్న వేసుకోవాలి. కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 4 మి.లీ చొప్పున నీటిలో కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొలకెత్తిన 30 రోజుల తరువాత ఎకరాకు 400 మి.లీ డైమిథోయేట్ లేదా 80 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కోళ్లు.. రోగాలు రాకుండా

రైతేరాజు

న్యూస్‌టుడే, వరికుంటపాడు

పెరటి కోళ్లను ప్రధానంగా కొక్కెర తెగులు ఆవరిస్తోంది. దీంతో పెద్ద మొత్తంలో చనిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు నష్టపోయే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధిని గుర్తించి తగు జాగ్రత్తలు పాటిస్తే సమస్యను అధిగమించవచ్చని పశుసంవర్ధకశాఖ డాక్టర్ ఎన్వీ రామచంద్రారెడ్డి పెంపకందారులకు సూచించారు. ఇటీవల నాటుకోళ్ల పెంపకానికి రైతులు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మంది జాతి కోళ్ల పెంపకం చేపట్టి లాభాలు పొందుతున్నారు. ఈనేపథ్యంలో వ్యాధులు రాకుండా.. వస్తే నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు.

వ్యాధి లక్షణాలు: కోళ్లకు తలలు వాయడం, ముక్కుల్లో కారడం, నల్లబడడం, పారడం, ముడుచుకోవడం, మేత మేయకపోవడం వంటి లక్షణాలతో మరణాలు సంభవిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో కొక్కెర తెగులు అధికమైంది. కోళ్లలో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలు వేయించాలి. షెడ్లు, ఫారాల్లో పెంపకం చేసే రైతులు జాగ్రత్తలు పాటిస్తూ నష్టాల బారిన పడకుండా చూసుకోవాలి.

ఇవి పాటిస్తే నివారించినట్టే: వ్యాధి సోకిన తర్వాత చేసే చికిత్స కన్నా వ్యాధి రాకముందు కోళ్లకు టీకాలు వేయించడం ఉత్తమం. వ్యాధితో చనిపోయిన వాటిని కాలువలు, చెరువులు, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో వేయరాదు. వాటి కళేబరాలను పూడ్చడం, కాల్చివేయడం చేస్తే ఇతర ఆరోగ్యకరమైన కోళ్లకు ప్రబలకుండా కాపాడుకోవచ్చు. బాగా ఉడకబెట్టిన మాంసం, కోడిగుడ్లను తినడంతో మనుషులకు సంక్రమించదు.

విజయవాడ కేంద్రంగా కొబ్బరి బోర్డు కొనసాగుతున్నా.. తెలంగాణలోనూ కొబ్బరి తోటల విస్తరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని కొబ్బరి అభివృద్ధి మండలి (సీడీబీ) ఉపసంచాలకుడు డాక్టర్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొత్తగా 500 హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించాలని ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అశ్వారావుపేటకు శుక్రవారం వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

కొబ్బరి తోటల విస్తరణకు ప్రాధాన్యం

సీడీబీ ఉప సంచాలకుడు మంజునాథరెడ్డి

హెక్టారుకు రూ.56 వేల రాయితీ

కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.56 వేల రాయితీని సీడీబీ అందజేస్తుంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు రాయితీ లభిస్తుంది. ఆరునెలల వయసున్న తోటల నుంచి కొత్తగా తోటల పెంపకానికి సిద్ధమవుతున్న రైతులందరూ అర్హులే. కొత్తగా తోటలు వేసేవారు మొక్కలు నాటి క్షేత్రంలో జియోట్యాగ్ ఫొటోతో దరఖాస్తుకు జతపరచాలి. కొబ్బరి నర్సరీల ఏర్పాటుకూ సీడీబీ రాయితీ ఇస్తుంది. ఒక్కో నర్సరీలో గరిష్ఠంగా 10 వేల మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్కకు రూ.22 రాయితీ వర్తిస్తుంది.

అందుబాటులో బీమా పథకం

కొబ్బరి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కేరా సురక్ష పథకం కింద రైతుకు రూ.143, కూలీకి రూ.143 కలిపి ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తే సీడీబీ రూ.813 భరిస్తుంది. ప్రమాదంలో మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ.7లక్షల చొప్పున పరిహారం అందుతుంది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.3లక్షలు, పెద్ద పరిశ్రమలకు 25 శాతం లేదా రూ.3కోట్ల వరకు రాయితీ పొందే వీలుంది. ఉద్యాన శాఖ ద్వారా అంతరపంటల సాగు, బిందు సేద్యం పరికరాలకూ సాయం పొందొచ్చు.

తీరిక వేళ.. మంత్రి సరదాగా సినిమాకు..

అభివృద్ధి కార్యక్రమాలు, సమీక్షలతో నిత్యం తీరికలేకుండా ఉండే రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ నగరంలోని ఎస్2 థియేటర్‌లో సందడి చేశారు. గురువారం కుటుంబ సభ్యులు, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో కలిసి చిరంజీవి నటించిన శంకర్ వరప్రసాద్ సినిమా చూశారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

కోడూరు తీరం.. జనసంద్రం

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: పండగల నేపథ్యంలో శుక్రవారం కనుమ రోజు కోడూరు తీరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కోలాహలంగా మారింది. కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదంగా గడిపారు. సముద్రస్నానాలు చేస్తూ సందడి చేశారు. యువకులు ఆటలు ఆడుతూ సరదాగా గడిపారు. మహిళలు, చిన్నారులు సందడి చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జలాశయానికి 4,633 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: సోమశిల జలాశయంలో శుక్రవారానికి నుంచి 4,633 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 71.895 టీఎంసీల నీరు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 1,200, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పశువులను పూజించడం మన సంస్కృతి

కోవూరు, న్యూస్‌టుడే: పశువులను పూజించడం మన సంస్కృతి, వాటిని గౌరవించుకునేది కనుమ పండగ రోజని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండల పరిధిలోని లేగుంటపాడులోని వారి వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం గోవులకు పూజలు చేశారు. కనుమ పండగ రోజు ప్రకృతి, మూగ జీవాలను పూజించడం భారతీయ జీవన విధానానికి ప్రతీక అని వేమిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. అనంతరం స్థానికులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గోవును పూజిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

20 నుంచి విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయసేకరణ

నెల్లూరు(విద్యుత్తు) : ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారి కోసం జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. పాల్గొనే వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సతీష్‌రెడ్డికి క్యాలెండర్ అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత ఉండాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత ఉండాలని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి. సతీష్‌రెడ్డి అన్నారు. స్వగ్రామమైన మహిమలూరులో సంక్రాంతి పండగ జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసాంబశివ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూరల్ మండలంలో మృతులకుటుంబాలకు రూ. పదివేలు సాయం అందజేసే కరపత్రంతోపాటు 2026సంవత్సరం క్యాలెండర్‌లు సతీష్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఇతర నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు భూములు ఇవ్వకుంటే పోరాడతాం

చిల్లకూరు, న్యూస్‌టుడే: పేదల ఆక్రమణలో ఉన్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ నాయకులు నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని నక్కల కాలువ కండ్రిగ వద్ద ఉన్న మిగులు భూములను స్థానిక నాయకులు, రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. నిరుపేద రైతుల ఆధీనంలో యాభై ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వారి పక్షాన నిలబడి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ట్రాక్టర్‌తో దుక్కిదున్ని వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు శశికుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల్లో పర్యటిస్తున్న సీపీఐ నేత నారాయణ

బంతి.. లాభాలు పూసింది

అల్లూరు, న్యూస్‌టుడే : ఎకరం పొలంలో బంతి పూల తోట వేసి లాభాలు పొందారు అల్లూరుకు చెందిన పల్లిపాడు రామయ్య. పండగ సమయంలో కోతకు వచ్చే విధంగా తోట వేశారు. ముందుగా పొలాన్ని సరైన పద్ధతిలో సేద్యం చేయించారు. చివరి దశలో డీఏపీ వేసి కలియదున్నారు. బోదెలుగా తయారు చేయించారు. పలమనేరు ప్రాంతం నుంచి మొక్కలను తీసుకొచ్చారు. మొక్క రూ.రెండు చొప్పున కొనుగోలు చేశారు. ఎకరానికి సుమారు నాలుగు వేల వరకు మొక్కలు నాటారు. ఆరంభంలో కూలీలతో నీరు పోయించారు. అనంతరం అవసరం ప్రకారం పెట్టారు. పురుగులు వ్యాపించకుండా వేపనూనె పిచికారీ చేశారు. ప్రారంభంలో రోజుకు రెండు బస్తాల చొప్పున పూలు వచ్చాయి. తరువాత రెట్టింపయ్యాయి. కేజీ రూ.30 చొప్పున దాదాపు 2500 కేజీలు విక్రయించారు. రూ.75 వేలు రాగా, పెట్టుబడి రూ.25 వేలు పోను ఆదాయంగా రూ.50 వేలు మిగిలాయి. తోటలో పని సొంతంగా చేసుకోవడంతో ఆదాయం పెరిగినట్లు రైతు రామయ్య వివరించారు.

కారు అదుపు తప్పి...

తెదేపా మైనార్టీ సెల్ నేత దుర్మరణం

జాఫర్ షరీఫ్

నెల్లూరు(టౌన్), మేదరమెట్ల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరుకు చెందిన తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్ (54) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం వద్ద జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. జాఫర్ షరీఫ్ పనుల నిమిత్తం విజయవాడ వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరుగు పయనమయ్యారు. ఉదయం 8.45 గంటల సమయంలో తిమ్మనపాలెంలో వీరి కారు అదుపుతప్పి డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో జాఫర్ షరీఫ్‌తో పాటు కారు నడుపుతున్న ఎస్కే జబీర్ అహ్మద్, ఎస్కే బషీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జాఫర్ షరీఫ్ మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి ఫోన్‌లో పరామర్శ

జాఫర్ షరీఫ్ (జాకీర్) మృతికి సీఎం చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. మంత్రి నారాయణ ద్వారా ఫోన్‌లో షరీఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మంత్రి నారాయణ ఒంగోలులోని ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. ఆయన మృతి తెదేపాకు, స్థానిక ప్రజలకు తీరని లోటని.. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు. మంత్రి ఆనం, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, నుడా ఛైర్మన్ శ్రీనివాసులు, తెదేపా నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలిపారు. నెల్లూరు జెండావీధిలోని నివాసంలో జాకీర్ భౌతికకాయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 13,567
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,08,536
వెండి గ్రాము :	రూ. 296.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	181
లేయర్	100
బ్రాయిలర్స్	314
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	344
లేయర్ మాంసం	170

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణ శివారు ప్రాంతంలోని కావలి మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన **సయ్యద్ మజహార్** (19) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాల మేరకు.. దాసరిపల్లికి చెందిన సయ్యద్ సాహెర కుటుంబం ఉదయగిరిలో నివాసముంటున్నారు. ఆమె కుమారుడు మజహార్‌తో కలిసి బుధవారం దాసరపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి ఉదయగిరికి వస్తున్నారు. ఆ క్రమంలో ప్రమాదం జరగగా సాహెర మృతిచెందారు. తీవ్రగాయాలైన మజహార్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం తొలుత నెల్లూరుకు తరలించారు. అక్కడ నుంచి చెన్నైకి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. తల్లీకుమారుడు మృతిచెందటంతో దాసరిపల్లి, ఉదయగిరిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి..

కావలి, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగిన యువకుడు కాలువలో పడి తీవ్రగాయాలై మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నాయపాలెంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. చౌటూరు ప్రభుదాస్ (30) అనే గురువారం సంక్రాంతి సందర్భంగా మూలంపేట వద్ద ఉన్న మద్యం దుకాణంలో పూటుగా మందు తాగారు. అనంతరం ఇంటికి వెళుతుండగా.. అదుపుతప్పి రహదారికి పక్కనే ఉన్న కాలువలో పడ్డారు. ఆ సందర్భంలో నుదుటిపై గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

సంగం: తరుణవాయి సమీపంలో నెల్లూరు ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందారు. వివరాల మేరకు కొడవలూరు మండలం నాయుడుపాళేనికి చెందిన డి.పోలమ్మ (65) కుటుంబసభ్యులతో కలిసి పొదలకూరు మండలం ప్రభగిరి పట్నంలోని ఆంజనేయస్వామిని దర్శించుకుని ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో తరుణవాయి గ్రామానికి చెందిన జి.వినయ్ తన ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మంచు పట్టి ఉండడంతోపాటు ముందు వెళ్లే లారీని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. వాహనంలో ఉన్న పోలమ్మను బలంగా గుద్దుకోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వినయ్ చిన్న గాయాలతో బయటపడ్డారు. సంగం ఎస్సై పి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంసం కొందామని వెళ్లి..

మద్యం మత్తులో పోలీసులపై దాడి

కలిగిరి, న్యూస్‌టుడే: కనుమ పండగ సందర్భంగా మాంసం కొందామని వచ్చిన వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు వెళ్లిన పోలీసు సిబ్బందిపైనే దాడి జరిగింది. ఈ సంఘటన శుక్రవారం కలిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుటే చోటుచేసుకోవడం గమనార్హం. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మెయిన్‌రోడ్డుపై, స్టేషన్ ఎదుట ఉన్న చికెన్ దుకాణం ఎదుట షామియానాలు వేసి మాంసం విక్రయాలు చేపడుతున్నారు. కొనుగోలు చేసేందుకు వచ్చిన హజరత్ అనే వ్యక్తితో మద్యం మత్తులో ఉన్న బ్రహ్మయ్య, శేఖర్‌లు గొడవపడ్డారు. దీంతో హజరత్ పోలీసులకు చెప్పడంతో కానిస్టేబుల్ దొరబాబు అక్కడకు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆ ఇద్దరు ఆయనపై తిరగబడి యూనిఫాం, బ్యాడ్జీలు పీకేసి దాడి చేశారు. అనంతరం కానిస్టేబుల్ అశోక్ అక్కడికి చేరుకుని వారిని ప్రశ్నిస్తుండగా ఆయన చేతిపై రక్కడంతో గాట్లు పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఉమాశంకర్, సిబ్బంది.. వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కానిస్టేబుల్స్ ఎస్సైకు ఫిర్యాదు చేశారు.

వస్త్ర దుకాణంలో రూ.2.30 లక్షల చోరీ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణ పరిధిలోని రాజావీధిలోని ఒక వస్త్ర దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2.30 లక్షలు, చరవాణిని అపహరించిన ఘటన గురువారం జరిగింది. ఒకటో పట్టణ ఎస్సై మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెమిర్తి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గూడూరులో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. పండగల సీజన్ కావడంతో బుధవారం రాత్రి ఎప్పటిలాగే వ్యాపారం ముగిసిన తరువాత దుకాణానికి తాళాలు వేసుకొని స్వగ్రామానికి వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా తాళాలు ధ్వంసం చేసి ఉండడం, లాకర్‌లో ఉంచిన రూ.2.30 లక్షల నగదు, చరవాణి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..

యాదవ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు యాదవ కుల అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి', యాదవ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహంకోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (జనవరి 17, శనివారం) రేపు (జనవరి 17, ఆదివారం) ఉ. 9 గం. నుంచి సా. 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91547 72006 91543 66099 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సప్ ద్వారా చేసుకోవచ్చు. అందుకు వధూవరుల బయోడేటా & ఫొటోలను పక్కన ఇచ్చిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు లేదా క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, MBA, MCA, M.Sc, B.Sc, BCA, BBA, B.Com, B.A, B.Lisc, M.Lisc, Ph.D, Paramedical, B.Voc, M.Voc, RIPS, Nellore. ✆ 80080 10144

REAL ESTATE

ధనలక్ష్మీపురం, కాకుపల్లి ఎంట్రన్స్‌లో ఫార్చ్యూన్ హైట్స్ లేఅవుట్ నందు 21.5 అం॥లలో అద్భుతమైన డూప్లెక్స్ విల్లా & G+1 విల్లా అమ్మబడును. & ఓపెన్ ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్స్ సౌకర్యం & టెలికాలర్స్ కావలెను. Contact ✆ 93469 48665

అం॥ 50 వేల నుండి 3 లక్షల వరకు. ద్వారకామయి, కాకుపల్లి, 6వ మైలు, NTR నగర్ హైవే, సాక్షి హైవేలలో ప్లాట్లు, కమర్షియల్ ప్లాట్లు, ప్లాట్లు అమ్మ. ✆7702023359

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

నెల్లూరు ముత్తుకూరు రోడ్ బ్రహ్మదేవిలో NUDA అప్రూవల్‌తో అన్ని డెవలప్‌మెంట్ అం. కేవలం: 44,900 /- మాత్రమే & హరనాథపురంలో అపార్ట్‌మెంట్స్ మధ్యలో కార్నర్ బిట్ 33అం॥లు, 1అం॥ 3,50,000/- ✆8523059539

46 అంకణాల ఈస్ట్ ఫేసింగ్ ప్లాట్ వరిగొండ నందు నెల్లూరు- ముత్తుకూర్ రోడ్డుకు 100 మీటర్ల దూరంలో 11వ మైలురాయి దగ్గర అమ్మకానికి కలదు. Ph: 9246883568.

నెల్లూరు విజయమహల్ గేట్ దగ్గర హాస్పిటల్స్‌కి, హోటల్స్‌కి, షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనువైన 60 అం॥ల కమర్షియల్ స్థలం అమ్మకమునకు కలదు. ✆ 85901 59371, 78933 77001

TO LET

TO-LET 9000 Sft. available (Suitable for Banks & Corporate offices) @ G.V.R. Enclave, G.T.Road, Nellore. Above Valli Silks, Lift Facility available 98850 11223

JOBS

Wanted Tellicallers to SV Educational Services, Nellore. Salary: 12K to 15K + Incentives. Ph: 63026 74482, 92949 06666

నెల్లూరులో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు క్రింది డిపార్ట్‌మెంట్‌లకు 40 సం॥లోపు జెంట్స్ స్టాఫ్ కావలెను. అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్, డ్రైవర్లు, ఫోటోషాప్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్. ✆8555993478

కారు లేదా వ్యాన్ నడుపుటకు లైట్ మోటర్ వెహికల్ లైసెన్స్ ఉన్న డ్రైవర్ కావలెను. జీతం:13,000 to 15,000/-. Cont: 6302451781.

కేరళ ఆయుర్వేద, పంచకర్మ చికిత్స చేయుటకు అనుభవమున్న డాక్టరు ఫుల్ టైం (ఇండివిడ్యువల్ పర్సన్‌కు) కావలెను. నెల్లూరు. Contact: 91212 82909

రియల్‌ఎస్టేట్ ఆఫీస్‌లో పని చేయుటకు కొంత కంప్యూటర్ తెలిసిన స్త్రీ 9.30-2PM వరకు పనిచేయుటకు ఒకరు మరియు రియల్ ఎస్టేట్ ఆఫీస్ వర్క్ ఇంటివద్దే ఉంటూ పనిచేయుటకు ఇద్దరు స్త్రీలు కావలెను. Cont: 99665 05777

అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కావలి

• కావలి • ఉదయగిరి • ఆత్మకూరు

మంత్రి లోకేశ్‌తో రవీంద్రనాయుడు

మంత్రి లోకేశ్‌తో మాలేపాటి కుటుంబ సభ్యుల భేటీ

దగదర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మాలేపాటి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉండవల్లిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మాలేపాటి రవీంద్రనాయుడు, దివంగత సుబ్బానాయుడు కుమారుడు లోకేశ్, సుధాకర్‌నాయుడు, సునీల్‌తో రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. వారి కుటుంబానికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా మాలేపాటి సోదరులు శుక్రవారం రాత్రి మండల తెదేపా కార్యకర్తలు, వారి కుటుంబ అభిమానులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

ఘనంగా కళుగోళమ్మ ఊరేగింపు

సంగం : గ్రామోత్సవంలో అమ్మవారు.. కలిగిరి : ప్రత్యేకాలంకారంలో పోలేరమ్మ.. నర్రవాడలో వెంగమాంబ దంపతులు

కావలి, ఆత్మకూరు, కలిగిరి, సంగం, వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా కావలి గ్రామదేవత కళుగోళ్ళ శాంభవి అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం జరిగాయి. ఈ సందర్భంగా కళుగోళ్ళమ్మ ఊరేగింపు చేశారు. కావలి పట్టణంలోని బృందావనకాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆత్మకూరులోని కాశినాయన ఆశ్రమంలో దుర్గా మల్లేశ్వర ఆలయంలో సాయంత్రం మకరజ్యోతిని వెలిగించారు. అన్నారెడ్డిపాళెంలో శుక్రవారం రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్థులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి కొండ తిరుగుడు ఉత్సవం వైభవంగా ప్రారంభమైంది. వింజమూరులో మకర సంక్రాంతి సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఎర్రబల్లిగడ్డ కాశినాయన ఆశ్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మంగారిమఠం ఆచార్యులు ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సాకారవాహ గద్దం తిరుమల తదితరులు పాల్గొన్నారు. పోలంపాడులోని పోలేరమ్మ ఆలయం ప్రాంగణంలో భక్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టి పూజలు జరిపారు. నర్రవాడలోని శ్రీ వెంగమాంబ అమ్మవారి దేవస్థానం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

కలిగిరి, న్యూస్‌టుడే: వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న పలువురికి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు శుక్రవారం స్వగ్రామమైన పెద్దపాడులో ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన షేక్ ఖలీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.20వేల నగదు అందించారు. సీతారామపురం మండలం సింగారెడ్డిపల్లికి చెందిన తెదేపా కార్యకర్త బాలగురవయ్య కుమార్తె సాలమ్మ అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకుని వైద్య ఖర్చులకు రూ.25వేలు ఇచ్చారు. ఉదయగిరిలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహకులకు తొలి బహుమతి కింద రూ.20వేలు అందించారు. మరికొందరికి సైతం ఆర్థిక సాయం అందజేశారు.

సమగ్ర సమాచారం... ప్రగతికి సోపానం

పారదర్శకంగా ఏకీకృత కుటుంబ సర్వే

న్యూస్‌టుడే, దుత్తలూరు: వైకాపా ప్రభుత్వంలో వాలంటీర్ల ద్వారా నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పులు దొర్లడంతో చాలా మంది అర్హులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏకీకృత సర్వేతో పారదర్శకంగా పథకాలు అందించడమే కాకుండా ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించేలా చర్యలు చేపట్టింది.

ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది మండలాలుండగా 143 పంచాయతీలున్నాయి. అలాగే 95 సచివాలయాల పరిధిలో 769 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మొత్తంగా 1,09,264 కుటుంబాలున్నాయి. ఇంట్లో ఎంత మంది ఉన్నారు, ఏం చేస్తుంటారు, ఏ రకమైన అవసరాల కోసం ఎదురు చూస్తున్నారు, కుటుంబ సభ్యుల్లో ఎంత మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు.. వంటి సమాచారాన్ని సచివాలయ సిబ్బంది సేకరిస్తున్నారు.

దుత్తలూరులో కుటుంబ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

250 కుటుంబాల చొప్పున పరిశీలన

సర్వేలో భాగంగా సచివాలయ సిబ్బంది ఒక్కొక్కరూ 250 కుటుంబాల చొప్పున పరిశీలిస్తున్నారు. ప్రతి ఇంటిలోని ఆధార్, పేర్లు, చరవాణి నంబరు, జనన తేదీ, ఉమ్మడి కుటుంబ స్థాయిలో స్థితి, భర్త, తండ్రి పేరు, కులం, మతం, విద్యార్హత నమోదు చేస్తున్నారు. ఆదాయం, నైపుణ్యత, ఉపాధి, గ్యాస్ కనెక్షన్లు, వాహనాలు, పశు సంపద, ఆస్తుల వంటి సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది సిబ్బంది ఈ సర్వే పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రయోజన కార్డులతో పథకాలు

సర్వే అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ ప్రయోజిత(ఫ్యామిలీ బెనిఫిట్) కార్డులను అందించనుంది. వీటి ఆధారంగా ఏయే పథకాలు.. ఎవరికి అందుతున్నాయో వాటిలో పొందుపరుస్తారు. సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకార భృతి, ఆటో డ్రైవర్ల సేవ తదితర పథకాలను అర్హులు అందుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ప్రజలు సహకరించాలి:

సర్వే విషయమై ప్రజలు సచివాలయ ఉద్యోగులకు సహకరించాలి. అందుకు అవసరమైన వివరాలను వారికి తెలిపాలి. ప్రభుత్వం అందించే కుటుంబ ప్రయోజిత కార్డు ద్వారా పథకాలు అందుతాయి. ఎలాంటి తప్పులు లేకుండా సమగ్రంగా సర్వే ప్రక్రియ సాగేలా సిబ్బందికి అవగాహన కల్పించాం. ఇళ్లకు వెళ్లకుండా సచివాలయాల్లో కూర్చొని సర్వే చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

– చెంచమ్మ, ఎంపీడీవో, దుత్తలూరు

రక్తదానంతో ప్రాణదానం

అప్పసముద్రంలో రక్తదానం చేస్తున్న యువకులు

జలదంకి, న్యూస్‌టుడే: ఎలాంటి అపోహలు పడకుండా క్రమం తప్పకుండా యువత రక్తదానం చేయటం ద్వారా ఆపదలో ఉన్న పలువురి ప్రాణాలు కాపాడవచ్చునని మదర్ థెరిస్సా ట్రస్ట్ చైర్మన్ గాలి శ్రీనివాసులు అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగరాజు అగ్రహారంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 26 మంది రక్తదాతలు రక్తదానం చేశారు.

ఉదయగిరి, చేజర్ల: ఉదయగిరి మండలం అప్పసముద్రంలో యువత ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 37 మంది యువకులు రక్తదానం చేశారు. తలసేమియా బాధితులను ఆదుకునేందుకు చేజర్ల మండలంలోని యువత ఆదూరుపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించింది.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

వింజమూరు, న్యూస్‌టుడే: మండలంలోని చాకలకొండ క్రికెట్ మైదానంలో కనుమ పండుగ సందర్భంగా శుక్రవారం ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా జరిగాయి. 1300 కేజీల బండను 100 మీటర్లు వేగంగా లాగడంతో వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన బొగ్గుల రాముడు చెందిన ఎడ్లు మొదటిస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం రూ.5.5 లక్షల వ్యయంతో క్రీడా మైదానం వద్ద నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. కూనల వెంకటేశ్వర్లు, సర్పంచి ఉప్పిరెట్ల సుబ్బలక్ష్మీకుమారి, వెంకటేశ్వర్లు, దిండు మహేష్, మబ్బు బుచ్చయ్య తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాకలకొండలో బండ లాగుతున్న ఎడ్లు

అనంతసాగరం : సంక్రాంతి పర్వదినం సందర్భంగా అనంతసాగరం మండలంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా మిడతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోళి కుటుంబానికి చెందిన రెండు ఎడ్ల జతలు ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలవగా.. రూ.40 వేలు, రూ.30 వేల చొప్పున అందుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు మూడో బహుమతిగా రూ.20 వేలు, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం పీఆర్ కాలనీ గ్రామానికి రామ్మోహన్ రెడ్డి నాల్గో బహుమతిగా రూ.10 వేలు గెలుపొందారు. ఆత్మకూరు డీఎస్పీ వేణు గోపాల్, సీఐ గంగాధర్‌లు, తెదేపా నాయకులు క్రిష్ణారెడ్డి, కార్యనిర్వాహకులు వెంకట రమణయ్య, రమేష్ నాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, సీఐ, నిర్వాహకులు

కాశినాయన ఉత్సవాలు విజయవంతం చేయాలి

సీతారామపురం : బెడుసుపల్లిలో ఆదివారం నిర్వహించనున్న కాశినాయన జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని భాజపా నియోజకవర్గ నాయకులు రమేష్‌రెడ్డి, కాశినాయన మనవడు ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

In The Court of the Civil Judge (Senior Division), Kavali

S.OP.No. 2/2025

Between:

1. Kapaganti Naga Lakshmi
W/o Late Balaji, Hindu, Aged about 44 years

2. Kapaganti Sai Satwik @Venkata Sai Satwik,
S/o Late Balaji, Hindu, aged about 22 years

3. Kapaganti Anitha,
W/o Reddenna, Hindu, aged about 65 years,
All are R/o, C/o Reddenna, D.No. 8-14-1,
Analavari Street, Kavali Town, SPSR Nellore (Dt).
... Petitioners

And

Nil .. Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, యీ నెంబరున పిటిషనర్లు 1 to 3 లు అయిన, చనిపోయిన **కాపగంటి బాలాజీ** S/o రెడ్డన్న అనువారికి తాము వారసులమని, సదరు కాపగంటి బాలాజీ, కావలి సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.No. 7/2011 నెంబరు Specific Performance దావా దాఖలు చేయబడి, సదరు దావా అగ్రిమెంట్ ఆఫ్ సేల్ తేది : 13-12-2010ది కొరవ క్రయధనం Rs. 2,35,000/- (అక్షరములా రెండు లక్షలా ముప్పది అయిదు వేలు రూపాయలు) కోర్టు అకౌంట్‌లో డిపాజిట్ చేయబడి, తద్వారా తే. 24-08-2019దిన సదరు దావా లోక్-అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా, కోర్టు డిపాజిట్‌లో ఉన్నటువంటి, మొత్తం పైకము Rs. 4,57,073/- (అక్షరములా నాలుగు లక్షలా యాభై ఏడు వేలా డెబ్బై మూడు రూపాయలు)లను వడ్డీతో సహా తీసుకొనుటకు తాము వారసత్వ హక్కు కలిగి ఉన్నామని Section 372 of Indian Succession Act ప్రకారం Succession Certificate కోరి, పిటిషన్ దాఖలు చేసుకున్నందున తే. 23–1–2026ది వాయిదా వేయబడి ఉన్నది. కనుక ఇందు విషయమై ఎవరికైననూ అక్షేపణలు ఉన్న యెడల పై తేదీన పగలు గం॥ 10.30 ని॥పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుసుకొనవలసినది. వాయిదా : 23–1–2026

ఇట్లు : **పోట్లూరు శ్రీనివాసమూర్తి**, M.Com., LL.B పిటిషనర్లు తరఫు న్యాయవాది

కాలువ ఇలా.. నీరు పారేదెలా !

ఏపిలగుంట చెరువు నుంచి పొలాల్లో నీరు వచ్చే కాలువ పూడికతో నిండిపోయింది. దాంతో చెరువు ఆయకట్టు కింద సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ పూడిక తీతకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)**

నడిరేయి.. రోడ్డు మాదేనోయి

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండల పరిధిలోని నారాయణప్పపేట 167బి జాతీయరహదారిపై సేదదీరిన ఆవుల మంద గుంపు. నిత్యం రాత్రివేళ కనిపించే పరిస్థితి ఇది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా.. ప్రమాదానికిగురై ఆసుపత్రికి చేరాల్సిందే. దీంతో పక్కగా వాహనాదారులు వెళ్లాల్సి వస్తోంది. ఆవుల యజమానులు వాటిని కట్టేయకుండా వదిలేస్తుండటంతో నడిరోడ్డుపై దర్శనమిస్తున్నాయి. - **న్యూస్‌టుడే, సీతారామపురం**

కమ్మేసిన పొగ మంచు

మండలంలో శుక్రవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు మంచు ఉద్ధృతి చాలా ఎక్కువగా ఉంది. పరిసరాలను కమ్మేయడంతో నెల్లూరు ముంబయి జాతీయరహదారిపై సంగం కొండ మీద అరకు లోయలా సుందర దృశ్యం కనిపించింది. కానీ వాహనదారులకు దారి కనపడక ఇబ్బందులు పడ్డారు. దీపాల సాయంతో రాకపోకలు సాగించారు. - **న్యూస్‌టుడే, సంగం**

గోదాం... నిరుపయోగం

పంట ఉత్పత్తులు భద్రపరిచేందుకు గత వైకాపా ప్రభుత్వం హయాంలో ఒక్కో గోదామును రూ. 40 లక్షలతో నిర్మించారు. మూడేళ్లు పూర్తి అయినా ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకువచ్చిన దాఖలాల్లేవు. పంట ఉత్పత్తులను దాచుకునేందుకు స్థలాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సొసైటీ సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ గోదాముల విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. - **న్యూస్‌టుడే, దుత్తలూరు**

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలం నందవరం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయకుండా నేరుగా కుళాయిలకు నీరు వదులుతున్నారు. దుర్వాసన వస్తున్నాయి. –బాష

సమాధానం: ట్యాంకును శుభ్రం చేసి మంచి నీరందిస్తాం. –రమేష్, పంచాయతీ కార్యదర్శి

? మండలకేంద్రమైన ఏఎస్‌పేటలో దోమల బెడద అధికంగా ఉంది. నివారణ చర్యలు వెంటనే చేపట్టగలరు. –ఖలీల్, స్థానికుడు

✓ గ్రామంలో సీజనల్ వ్యాధులు, దోమల నివారణకు పారిశుద్ధ్య సిబ్బందితో చర్యలు చేపడతాం. –షరీఫ్, పంచాయతీ కార్యదర్శి.

? సంగం మండలం సిద్దీపురం గ్రామం నుంచి దువ్వూరు బ్రాంచి కాలువకు చేరే సిమెంటు రహదారి నిర్మాణం ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.–రాజా, సిద్దీపురం

✓ ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో నిర్మాణం చేపట్టాం. వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం. – **షాలెట్, ఎం.పి.డి.వో**

? సంగం మండలం సిద్దీపురంలో నెల్లూరు ముంబయి జాతీయ రహదారిపై వేసిన ఇసుక గుట్ట కారణంగా ప్రమాదం పొంచి ఉంది. వెంటనే తొలగించాలి. **స్థానికుడు**

✓ వెంటనే అక్కడ ఇసుక తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

? అనంతసాగరం మండలం గౌరవరం శివారులో అనంతసాగరం- బద్వేల్ రహదారి మార్గంలో మలుపుల వద్ద ముళ్ల చెట్లు భారీగా పెరిగాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **సురేష్**

✓ సంబంధిత అధికారులకు తెలియజేస్తాం.
-సూర్యప్రకాశ్ రెడ్డి, ఎస్సై, అనంతసాగరం

? మర్రిపాడు మండలం, పొంగూరు కండ్రికలో జలజీవన్ మిషన్ పనులు నాసిరకంగా చేపట్టారు. దీంతో పైపుల నుంచి నీరు లీక్ అవుతుంది. - **వెంకట్, స్థానికుడు**

✓ పరిశీలించి, వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. - **కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ**

అంబరాన్నంటిన పండగ సంబరాలు

చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కావలి మండలం మన్నంగిదిన్నె పంచాయతీలో ముగ్గుల పోటీలు

ఆత్మీయ అనుబంధాలు, సాంప్రదాయ ఆచారాలు. భక్తి ఉప్పొంగే ఉత్సవాలతో సంక్రాంతి సంబరాలు మూడురోజులపాటు గ్రామాల్లో వైభవంగా సాగాయి. పలుచోట్ల ఉత్సవాలు జరిగాయి. పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలుగా బహుమతులు అందజేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తూర్పుదూబగుంట కాలనీల్లోని 250 మంది మహిళలకు స్థానిక నాయకులు పి. చలపతి, బి. నాగరాజులు సమకూర్చిన చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దుత్తలూరు మండలం కొత్తపేటలో క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మర్రిపాడులో ఆంధ్ర విద్యార్థి సంఘం, ఎంఎస్‌కే ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీ విజేతలకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి-శాంతకుమారి దంపతులు ట్రోఫీలతో పాటు, నగదు బహుమతులు అందజేశారు. ఆత్మకూరు మండలం కరటంపాడులో ఎమ్మెల్సీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర దంపతులు దుక్కిదున్నారు. తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. అనంతసాగరం మండల పరిధిలోని లింగంగుంట గ్రామంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు సుమారు 500కి పైగా పేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. - **న్యూస్‌టుడే, బృందం**

జలదంకి : పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

లింగంగుంటలో చీరల పంపిణీ.. దుక్కి దున్నుతున్న బీదరవిచంద్ర దంపతులు.. వింజమూరులో కబడ్డీ పోటీల్లో యువత.. విజేతలతో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి- శాంతకుమారి దంపతులు

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి కారు ఢీకొట్టడంతో బైకుపై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వేంపాడు సమీపంలో 565 వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు ఉదయగిరికి చెందిన షేక్ ఫయాజ్ వరికుంటపాడు పెట్రోల్ బంకులో విధులు నిర్వహిస్తున్నారు. భోజనం కోసం భోగ్యం వారిపల్లెకు వచ్చి తిరుగు ప్రయాణంలో వెళుతుండగా పామూరు నుంచి తెడ్డుపాడు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఆయన తలకు తీవ్ర గాయమవడంతో 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు. అనంతరం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

థియేటర్ అద్దాల ధ్వంసం

కావలి : పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ వద్ద కొందరు వీరంగం సృష్టించారు. శుక్రవారం సాయంత్రం సినిమా చూసేందుకు వచ్చిన వారికి అక్కడ కౌంటర్‌లో టిక్కెట్లు అయిపోయాయని చెప్పారు. అదే సందర్భంలో బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్నారంటూ థియేటర్ వద్ద అద్దాలను ధ్వంసం చేశారు. ఇదేమని ప్రశ్నించిన మేనేజర్ రమణరావుపై తీవ్రంగా దూషించి దాడియత్నానికి సైతం పాల్పడ్డారు. థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

మర్రిపాడు, ఆత్మకూరు : డీసీపల్లి ప్రాథమిక పాఠశాలలో సొంత నిధులతో నిర్మించిన సరస్వతిదేవి విగ్రహాన్ని శ్రీ సాంబశివ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పలువురు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం.. చికిత్సపొందుతూ మృతి

కావలి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. వివరాల మేరకు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బొట్టా శ్రీనివాసరావు (31) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో ఈనెల 11వ తేదీ ఎలుకల మందు తిన్నారు. కుటుంబ సభ్యులు గమనించి తొలుత స్థానికంగా, అనంతరం చెన్నై తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి నేత్రాల దానం

కావలి : పట్టణంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు మరణించగా, స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో నేత్రాలను సేకరించారు. శుక్రవారం కావలి తుపాన్‌నగర్‌కు చెందిన ఏసుపదం (48)అనారోగ్యంతో మరణించారు. మృతదేహం నుంచి నెల్లూరుప్రభుత్వాసుపత్రి వైద్యులు కార్నియా స్వీకరించారు. కోఆపరేటివ్‌కాలనీవాసి శ్రీనివాసులురెడ్డి (80)మృతిచెందడంతో వనిత లెజెండ్ జోనల్ ఛైర్మన్ హేమలత సహకారంతో జెండావీధికి చెందిన మస్తానమ్మ (68) నేత్రాలను అభయం సంస్థ వైద్యులు సేకరించారు.

ఆపదలో సత్వర స్పందన

మర్రిపాడు : మైదుకూరు నుంచి నెల్లూరుకు కారులో ఓ కుటుంబం వెళుతుండగా మర్రిపాడు అటవీ ప్రాంతంలో డీజిల్ అయిపోడంతో అర్ధరాత్రి వాహనం 67 జాతీయ రహదారిపై ఆగిపోయింది. 112 ఫోన్ చేయడంతో మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు స్పందించారు. సిబ్బందితో కలిసి డీజిల్ తీసుకొని వెళ్లారు. కారుకు ఆయిల్ నింపుకొన్న వారు ఎస్సైకు వారు కృతజ్ఞతలు తెలిపి సురక్షితంగా గమ్యస్థానానికి చేరారు.

శిథిలావస్థలో గ్రంథాలయాలు

అనంతసాగరంలో తెదేపా హయాంలో 1986లో మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత పంచాయతీ స్థలంలో రేకుల భవనం నిర్మించి గ్రంథాయాలన్ని ఏర్పాటు చేశారు. 40 ఏళ్లుగా అదే భవనంలో కార్యకలాపాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఏళ్లుగా పాలకులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. గోడలు పగుళ్లలిచ్చాయి. రేకులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పాఠకులు కూర్చొని చదవడానికి అరకొర సదుపాయాలే దిక్కయాయి. నూతన భవనాన్ని నిర్మించాలని ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను స్థానికులు కోరినా పట్టించుకున్న వారే లేరు.

అనంతసాగరంలోని గ్రంథాలయ భవనం

అనంతసాగరం, న్యూస్‌టుడే: నిరుద్యోగులతోపాటు పదిమందికి విజ్ఞానాన్ని అందించిన గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరాయి. సరైన సౌకర్యాలు, కావాల్సిన పుస్తకాలు సమకూర్చకపోగా దాతలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో పాఠకులు, నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఆరు గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో ఆత్మకూరులోని గ్రంథాలయం గ్రేడ్-2 కాగా దీని కోసం దాతలు భవనాన్ని ఏర్పాటు చేశారు. మర్రిపాడులోని భవనాన్ని ఇటీవల మండల నిధులతో మరమ్మతులు చేశారు. అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం మండలాల్లోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మోస్తారు వర్షం కురిస్తే సామగ్రి, పుస్తకాలు తడిసి పోతున్నాయి.

పన్నులు వసూలు కావాల్సి ఉంది

కుమార్ రాజా, జిల్లా కార్యదర్శి, గ్రంథాలయ సంస్థ

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ పన్నులు రూ.కోట్లు బకాయిలు ఉండటంతో పరిస్థితి దుర్భరంగా ఉంది. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేక అవస్థలు పడుతున్నాం. జిల్లాలో పలుచోట్ల గ్రంథాలయాల మరమ్మతులు, నూతన భవన నిర్మాణాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. ఎ.పి. website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. ONGL2TF1906140001

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **21-12-2023 తేదీన** డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) చాగంటి శ్రీహరి రావు, తండ్రి: కోదండ రామయ్య, రెసిడెన్స్ ఎ.ఆర్.కె టవర్స్, ఇ-243, మయూరి నగర్, మియాపూర్, హైదరాబాద్, తెలంగాణ.
2) చాగంటి శ్రీలక్ష్మి, భర్త: శ్రీహరి రావు, రెసిడెన్స్ ఎ.ఆర్.కె టవర్స్, ఇ-243, మయూరి నగర్, మియాపూర్, హైదరాబాద్, తెలంగాణ.
3) పోటు కోటేశ్వరమ్మ, భర్త: క్రిష్ణయ్య, రెసిడెన్స్ హోమ్ నెం. 7-23-0-23, రెవిన్యూ కాలని, 1వ లైను, వివేకానంద విద్యా విహార్ దగ్గర, యం.యం.రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
4) గాలి పద్మావతి, భర్త: పార్థసారథి, రెసిడెన్స్ డోర్ నెం. 1-43, పర్ధినేనివారిపాలెం, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
5) లెక్కల సుజాత, భర్త: గిరిధరరావు, వీరన్నకొల్లు (వి), కలిగిరి మండలం, యస్.పి. యస్.ఆర్ నెల్లూరు జిల్లా.
6) బెల్లం వినీల, భర్త: ప్రవీణ్ కుమార్, రెసిడెన్స్ డోర్ నెం.7-7/1, చింతలపాలెం (వి), జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న **చెల్లించవలసిన మొత్తము, రూ.74,53,491/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల నాలుగు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ ఛార్జీలతో కలిపి** నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **19-06-2024** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **13-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.74,53,491/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల యాభై మూడు వేల నాలుగు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

ఈ ఆస్థి దస్తావేజు నెం.1735/2019 ప్రకారం **చాగంటి శ్రీహరిరావు, తండ్రి: కోదండ రామయ్య, పోతు కోటేశ్వరమ్మ, భర్త: కృష్ణయ్య, గాలి పద్మావతి, భర్త: పార్థసారథి, లక్కెల సుజాత, భర్త: గిరిధర రావు వారి పేరుతో కలవు.**
ఐటం నెం.1: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.0.47 సెంట్లు మరియు సర్వే నెం.145/1బి3 నందలి మొత్తం ఎ.3.85 సెంట్లలోని ఎ.1.02 సెంట్లు మొత్తం కలిపి ఎ.1.49 విస్తీర్ణం గల ప్రక్కప్రక్కన గల ప్లాట్లకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** చాగంటి వెంకట సుబ్బారావు యొక్క భూమి, **పడమర :** కొండెపి రోడ్డు, **ఉత్తరం:** చాగంటి కోదండ రామయ్య యొక్క భూమి, **దక్షిణం:** చాగంటి నరసింహ, తండ్రి: వెంకటేశ్వర్లుకు అమ్మిన భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.1.49 సెంట్లు భూమి మాత్రమే.
ఐటం నెం.2: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.0.78 సెంట్ల విస్తీర్ణం గల భూమికి సంబంధించిన యావదాస్థి. **దీనికి హద్దులు: తూర్పు:** మల్లబోయిన ఆదెయ్య యొక్క భూమి, **పడమర :** రోడ్డు, **ఉత్తరం:** చాగంటి కోదండ రామయ్య యొక్క భూమి, **దక్షిణం:** మల్లెబోయిన ఆదెయ్య యొక్క భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.0.78 సెంట్లు భూమి మాత్రమే.
ఐటం నెం.3: ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ జిల్లా, ప్రస్తుతం సింగరాయకొండ సబ్ జిల్లా, కొండెపి మండలం, ఇలవర గ్రామ పంచాయతి, నేతివారిపాలెం, ఇలవర కుగ్రామ అకౌంట్స్ పట్టా నెం.61, మెట్ట సర్వే నెం.145/1బి2 నందలి మొత్తం ఎ.3.59 సెంట్లలోని ఎ.2.34 సెంట్ల విస్తీర్ణం గల భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** మల్లబోయిన ఆదెయ్య యొక్క భూమి, **పడమర:** జడ్.పి రోడ్డు, **ఉత్తరం:** నంబూరి నరసయ్య యొక్క భూమి, **దక్షిణం:** మల్లెబోయిన ఆదెయ్య యొక్క భూమి.
పైన తెలిపిన హద్దుల మధ్య ఎ.2.34 సెంట్లు భూమి మాత్రమే.

తేది : 13-01-2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : ఒంగోలు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

గూడూరు
•గూడూరు •కోవూరు •సర్వేపల్లి

వెంకయ్యనాయుడును కలిసిన సోమిరెడ్డి

వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. శుక్రవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. రాత్రి ట్రస్టులోనే బస చేశారు.

క్రీడల్లో సత్తాచాటాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో ఆసక్తిగా పాల్గొని రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీలల్లో గెలుపొందిన విజేతలకు ట్రస్టు వ్యవస్థాపకుడు కనుమూరు హరిచంద్రారెడ్డితో కలిసి గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామీణ సీఐ కిషోర్‌బాబు, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● ఏరూరు శివగణేష్ క్రీడా మైదానంలో రామసీత వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవూరు చెంచురామయ్య జ్ఞాపకార్థం సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఏపీ అవెంజర్స్, పుట్టయ్య జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. చిల్లకూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాగరాజు జ్ఞాపికలు, రూ.25వేలు, రూ.12,500 వంతున నగదు బహుమతులను అందజేశారు.

బహుమతి ఇస్తున్న ఎమ్మెల్యే పాశం, నిర్వాహకులు

తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచనల మేరకు గూడూరు నియోజకవర్గ పట్టణ, మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వాటంబేడు హరికుమార్, గూడూరు మండల అధ్యక్షుడిగా కొండూరు వెంకటేశ్వర్లు రాజు, ప్రధాన కార్యదర్శిగా ముమ్మడి అమరేంద్ర, చిల్లకూరు మండలాధ్యక్షుడిగా దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నెలటూరు చిరంజీవి, కోట మండలాధ్యక్షుడిగా పలగాటి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి కోటేశ్వరరావు, వాకాడు మండలాధ్యక్షుడిగా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దోసకాయల కృష్ణమూర్తి, చిట్టమూరు మండలాధ్యక్షుడిగా గణపర్తి కిషోర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి గుంపర్ల చిన్నరావులను నియమించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

ఆశయం ఉన్నతం.. ఆచరణ శూన్యం

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అధికారులేరీ..!

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

సాగులో మెలవైన సూచనలు, సలహాలివ్వడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తోంది. వ్యవసాయాధికారులు, సిబ్బంది తప్ప వాటి అనుబంధ శాఖల అధికారులు వీటికి హాజరు కాకపోవడంతో క్షేత్రస్థాయిలో నామమాత్రంగా కొనసాగుతుందనే విమర్శలున్నాయి. ● సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 35 వేల ఎకరాల్లో వరి, అయిదు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో వరితో పాటు అరటి, వేరుసెనగ తదితర పంటలు పండిస్తున్నారు. రైతులకు సకాలంలో సలహాలు అందించి అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని మండలాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున నాలుగు చోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమం జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్వహణకు ఒక్కో మండలానికి రూ.10 వేల వరకు నిధులు మంజూరు చేస్తోంది. గ్రామాల్లో వ్యవసాయాధికారులతో పాటు ఉద్యాన, రెవెన్యూ, పశుసంవర్ధక, మార్కెటింగ్, మత్స్యశాఖల అధికారులు పాల్గొనాలి. నవంబరు నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినా వ్యవసాయశాఖ తప్ప మిగిలిన శాఖలు సంబంధించిన అధికారులు పాల్గొనడం లేదు. మిగతా వారి గైర్హాజరుతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

పొలం వద్ద పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో కొన్ని చోట్ల మాత్రమే నిర్వహిస్తున్నారు. జిల్లాకు మారుమూల ప్రాంతాలైన రాపూరు, సైదాపురం, తోటపల్లిగూడూరు, చిల్లకూరు, కోట, ముత్తుకూరు, బుచ్చి, కొడవలూరు మండలాల్లో ఎక్కడా సరిగా జరగడం లేదన్న విమర్శలున్నాయి.

● ఏడీఏ రఘునాధరెడ్డి మాట్లాడుతూ.. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొనాలని సమాచారం ఇస్తున్నామన్నారు. అందరూ హాజరై రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహాలివ్వాలని పేర్కొన్నారు.

పద్మశ్రీ బాలకృష్ణారెడ్డి జయంతి వేడుకలు

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, విద్యాప్రదాత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జయంతి వేడుకలను ఎన్బీకేఆర్ ఐఎస్ట్ అధ్యాపకులు, సిబ్బంది, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పలు విభాగాల విభాగాధిపతులు మాట్లాడుతూ ఆయన విద్యాసేవలు చిరస్మరణీయమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980

సమస్య: కోట మండలం కొత్తపాలెం సమీపంలోని ర.భ రోడ్డు ఎల్ ఆకారంలోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ రేడియం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – బాలకృష్ణ, వాహనచోదకుడు
సమాధానం: త్వరలో సమస్య పరిష్కరిస్తాం. – మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని శ్రీనివాస లేఅవుట్‌లో కాలువ వ్యర్థాలతో అధ్వానంగా మారింది. – రఘువ, స్థానికుడు
✓ శుభ్రం చేయిస్తాం. – అనిల్, ఈఓపీఆర్డీ

? గూడూరు రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – నాని, గూడూరు
✓ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

? తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాలెం నుంచి కోడూరుపాలెం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – శ్రీనివాసులు, స్థానికుడు
✓ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులు చేపడతాం. – రమేశ్, పీఆర్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం వరిగొండ పంచాయతీ పరిధిలో విద్యుత్తు తీగలపై మొక్కలు అల్లుకున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశముంది. –ఆంజనేయులు,స్థానికుడు
✓ తొలగిస్తాం. – సుకుమార్, విద్యుత్తు ఏఈ

? పొదలకూరు పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిర్మించిన మురుగు కాలువల్లో నీరుచేరి దోమలు పెరిగి జ్వరాలబారిన పడుతున్నారు. కాలువల్లో పేరుకున్న మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లించాలి. – ప్రభాకర్, స్థానికుడు
✓ నీరు సాఫీగా పోయేలా చర్యలు తీసుకుంటాం. – యశ్వంత్ సింగ్, కార్యదర్శి

? కోట మండలం పరిధిలోని ఇలకూరుపాడు మార్గంలోని ర.భ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. – మోహన్, వాహనచోదకుడు
✓ త్వరలో మరమ్మతులు చేపడతాం. – మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ

? పొదలకూరు మండలం మహ్మదాపురం-విరువూరు గ్రామాల మధ్య రహదారి కొన్ని చోట్ల గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలి. – చిన్నయ్య, స్థానికుడు
✓ రోడ్డు అంచుల్లో చెట్లు, గుంతలు పూడ్చే పనులు చేపట్టాం. సమస్య పరిష్కరిస్తాం. – శ్రీనివాసులు, ర.భ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు వద్ద చెరువుకట్ట రోడ్డు దిగే సమయంలో మలుపు ఉంది. అక్కడ కాలువపై ఇరు పక్కల ఎలాంటి హద్దులు లేవు. అదుపుతప్పి వాహనదారులు పడిపోతున్నారు. – వెంకటేశ్వర్లు, స్థానికుడు
✓ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – అలీ, నీటిపారుదల శాఖ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ పరిధిలోని చెన్నపల్లిపాలెం వద్ద రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో దుర్గంధంగా మారుతోంది. – నరేంద్ర, స్థానికుడు
✓ సత్వరం తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

పట్టించుకునేదెవరు..!

తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరు గ్రామం వద్ద ప్రధాన రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టరు నిరుపయోగంగా మారింది. స్థానిక పాలకుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు నీడనివ్వాల్సింది పోయి ఎవరికీ ఉపయోగపడడం లేదు. ప్రధాన రోడ్డులో ఉన్నా పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా స్పందించి బస్సుషెల్టరు చుట్టూ వ్యర్థాలు తొలగించి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

మరమ్మతులు జాప్యం

కోవూరు పశువైద్యశాల భవనం అధ్వానంగా ఉంది. అయిదేళ్ల క్రితం వచ్చిన వరదల కారణంగా రక్షణగా ఉన్న ప్రహరీ కూలింది. నీరంతా కార్యాలయంలోకి రావడంతో ఫ్లోరింగ్ పూర్తిగా కుంగిపోయి వినియోగంలో లేదు. అదే ప్రాంగణంలో ఉన్న రైతుల ట్రైనింగ్ సెంటర్ కార్యాలయంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. రాత్రి సమయాల్లో కొందరు మద్యం తాగి వ్యర్థాలు అక్కడే వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యశాలను బాగుచేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

కట్టినవి కూల్చి.. మళ్లీ నిర్మించి

కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ఇనమడుగు సెంటర్ సమీపంలో చేపట్టిన కాలువల నిర్మాణం అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా నిర్మించారు. పనులు పూర్తయినప్పటికీ మురుగు నీరు పోయే మార్గం లేక నిర్మాణాన్ని తొలగించి పనులు చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడమే సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. అధికారుల స్పందించి నాణ్యమైన పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

మైదానం కాదు చెరువు దుస్థితి

పొదలకూరు నరసారెడ్డి కాలనీ మీదుగా చిట్టేపల్లి వెళ్లే మార్గంలో ఉన్న చెరువు ఇరువైపులా పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. కనుచూపు మేరలో ఎక్కడా నీరు కనిపించడం లేదు. పశువులు నీటి కోసం వెళ్లి చిక్కుకుపోతున్నాయని, బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నామని పశుపోషకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

బాబోయ్ కుక్కలు

మనుబోలులోని కోదండ రామపురంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పాత సినిమా హాలు వీధి, వైఎస్సార్ కూడలి, దేవాంగుల వీధి, పిడూరు రోడ్డు ప్రాంతాల్లో కుక్కల గుంపు సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని వెంబడించి భయపెడుతున్నాయి. కుక్కల బెడదను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మనుబోలు

పొంచి ఉన్న ప్రమాదం

పొదలకూరు- రాపూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న మర్రిపల్లి గ్రామ చెరువు నీరు రెండువైపులా రోడ్డు అంచులను తాకుతోంది. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో మలుపుల వద్ద ప్రమాదం పొంచి ఉందని, ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

సంక్రాంతి వేడుక.. ఆనంద వీచిక

గూడూరు పట్టణం, కోట, చిల్లకూరు, ముత్తుకూరు, రాపూరు, సైదాపురం, కోవూరు న్యూస్‌టుడే: గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గూడూరులోని చెన్నూరు- తిప్పవరపాడు గ్రామాల ఆరాధ్యదైవం కటాలమ్మ తల్లి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● గూడూరు కోనేటిమిట్టలోని కోందరామాంజనేయస్వామి దేవస్థానం వద్ద కోనేరులో సీతారాములవారి తెప్పోత్సవం కనుమూరు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ● కోటలోని కోటమ్మదేవతకు, మహాలక్ష్మిదేవికి, కన్యకాపరమేశ్వరిదేవికి, గంగమ్మకు, గొబ్బెమ్మకు విశేషపూజలు నిర్వహించారు. ● చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో గోపూజ, కోలాటం, రంగవల్లుల పోటీలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఈవో నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ● రాపూరు మండలం పెంచలకోన ఆలయంలో పూలంగి సేవ చేశారు. వెంకటాచలం, మనుబోలు, సైదాపురం, ముత్తుకూరు, కోవూరు, బుచ్చి మండలాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాపూరు, ముత్తుకూరు మండలాల్లో సందడి నెలకొంది. ● తోటపల్లిగూడూరు మండలం విలుకానిపల్లి వద్ద గోసంరక్షణ కేంద్రంలో కనుమ వేడుకలు నిర్వహించారు. గోశాల నిర్వాహకులు పాంచజన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

గూడూరులో తెప్పపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

కోటలో విశేషాలంకరణలో మహాలక్ష్మిదేవి

గోనుపల్లిలో బంగారు గరుడ సేవ..

కోటలో ముగ్గులు వేస్తున్న మహిళలు..

చిల్లకూరులో దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ ఏదీ..?

కోట, న్యూస్‌టుడే: కోటలోని మెయిన్ ఆర్టీసీ బస్టాండులో వాహనాలు పార్కింగ్ చేసే సౌకర్యం లేక పలువురు అవస్థలు పడుతున్నారు. అయిదేళ్లుగా పార్కింగ్ స్టాండ్ లీజ్‌కు ఇచ్చేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చడం లేదు. ఆదాయం వచ్చే అవకాశమున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నుంచి వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు పలు ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేందుకు వాహనాలు బస్టాండులో పార్కింగ్ చేసి వెళుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడతో పలు వాహనాలను అపహరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆదాయం సమకూరే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

పేరుకున్న చెత్త.. దుర్వాసనతో సతమతం

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరులోని శ్రీరామ మందిరం, శివాలయంతో పాటు ఆర్టీసీ బస్టాండు, పెంచలకోన రోడ్డు, సీహెచ్‌సీ సమీపంలోని వివిధ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రభుత్వం స్వచ్ఛ సంక్రాంతి పేరుతో అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నా రాపూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పట్టించుకునే వారే లేరు. అన్నిశాఖల అధికారులు ఉండే మండల కేంద్రంలోనే ఇలా ఉంటే మిగతా గ్రామాల్లో ఎలా ఉంటుందో తెలుస్తోంది. సమీపంలో నివాసముంటున్న వారంతా ఇళ్లలోని చెత్త, వ్యర్థాలు రోడ్లపై వేయడంతో దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. వ్యాధులు ప్రబలకముందే ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం

తడ, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా తడ మండలంలోని చేనిగుంట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి డివైడరును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... వరదయ్యపాళెం మండలం సిద్ధమ అగ్రహారానికి చెందిన చెరివి మునిచంద్రయ్య (40) తడ నుంచి బుచ్చినాయుడు కండ్రిగ మండలం గాజులపెళ్లూరుకు వెళ్లేందుకు బయల్దేరాడు. మార్గమధ్యలో చేనిగుంట వద్ద ఆటో అదుపుతప్పి జాతీయ రహదారి పనులు చేస్తున్న సిబ్బందిని ఢీకొట్టింది. ఆటో నడుపుతున్న ముని చంద్రయ్య కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హైవే పనులు చేస్తున్న చిల్లకూరు మండలం ముత్యాలపాడుకు చెందిన వలిపి వెంకటరమణయ్య, దొరవారిసత్రం మండలం నెల్లూరుపల్లికి చెందిన సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు మునిచంద్రయ్య స్వగ్రామం గాజుల పెళ్లూరు కాగా అత్తగారి ఊరైన సిద్ధమ అగ్రహారంలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. పండగకు సొంతూరుకు రెండు రోజుల ముందు భార్య పిల్లల్ని పంపించాడు. తను ఊరెళ్లే క్రమంలో ప్రమాదంలో కన్నుమూశారు. భార్య, పిల్లలు తమకు ఇక దిక్కెవరంటూ విలపించారు. ఈ మేరకు కేసునమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిత

మనుబోలు, పొదలకూరు, న్యూస్‌టుడే : విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని వైద్యుడు సాయిరాం పేర్కొన్నారు. ఇస్కపాలెం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండగ సందర్భంగా ఇస్కపాలెం లెర్నింగ్ సర్కిల్ ఆధ్వర్యంలో విజ్ఞాన పరీక్ష నిర్వహించారు. పోటీల్లో జల్ది చరితాంత్, గణేశ్, లక్ష్మీప్రసన్నలు ప్రథమ స్థానాల్లో నిలిచారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ● పొదలకూరు మండలం అంకుపల్లిలో బాల్‌బ్యాడ్మింటన్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. చంద్రా జట్టు ప్రథమ స్థానం, పొదలకూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. ● మనుబోలు ఉన్నత పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో గేమ్ ఛేంజర్‌పై యాచవరం జట్టు, కొమ్మలపూడి హెచ్‌సీసీపై మనుబోలు సంగమేశ్వర జట్టు, స్టార్ లెవెన్స్‌పై అక్కంపేట జట్టు, బద్దెవోలుపై మనుబోలు జట్లు విజయం సాధించాయి.

విజేతలతో వైద్యుడు సాయిరాం

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సంపాదించిన దానిలో కొంత పేదలకు సేవ చేసేందుకు వినియోగించడం సంతోషంగా ఉందని, పెద్దలకు సేవ చేయడం ట్రస్టు అదృష్టంగా భావిస్తున్నామని రాజినేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రాజినేని శ్రీనివాసులునాయుడు తెలిపారు. గూడూరులోని ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని గురువారం ఆ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ట్రస్టు కో-ఫౌండర్ శిరీషా, కార్యదర్శి రామానాయుడు, ప్రతినిధులు వెంకటేశ్వర్లు నాయుడు, యమున, బాబు, భాస్కర్, రాజేష్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పోలీసు స్టేషన్ సమీపంలోనే కోడిపందేలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరుపేట పోలీసుస్టేషన్ సమీపంలోని కూతవేటు దూరంలో ఉన్న అత్తిరేవు ప్రాంతంలో శుక్రవారం కోడిపందేలు జోరుగా జరిగాయి. వైకాపా నాయకుడి ఆధ్వర్యంలో నిర్వహించడంతో యువకులు భారీ సంఖ్యలో చేరుకొని కోళ్లపై రూ.లక్షల్లో పందేలు వేశారు. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు. సదరు నాయకుడు గత వైకాపా పాలనలో జూద స్థావరాలు, బెట్టింగులు ప్రోత్సహించిన తీరుపై అప్పట్లో తీవ్ర విమర్శలొచ్చాయి. దీనిపై ఎస్సై నాగార్జున రెడ్డిని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కూటమి నాయకులు ఎస్పీ, డీఎస్పీ, సీఐకి ఫిర్యాదు చేశారు.

భారీ సంఖ్యలో పాల్గొన్న యువకులు

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వీధుల్లో తిరుగుతూ చీపుర్లు విక్రయిస్తాడు. ఆ సమయంలో ఏ ఇంటికైనా తాళం వేసి ఉంటే దాన్ని పగులగొట్టి నగలు, నగదు దోచుకెళ్లే దొంగను చీరాల పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్నారు. కేసు వివరాలను ఒకటో పట్టణ పోలీసు స్టేషనలో డీఎస్పీ మహ్మద్ మొయిన్ వెల్లడించారు. గత నెల 19న దేశాయిపేట పంచాయతీ కేపాల్ కాలనీలో నివసించే ఫణి రాజ ఇంటికి తాళం వేసి, చీరాలలో వైద్యశాలకు వెళ్లగా తాళాలు పగులగొట్టి, చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో విచారణ పోలీసులకు స్థానిక రైల్వేస్టేషను సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రామనాథం కిరణ్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. 2023 సెప్టెంబరు మొదటి వారంలో రేపల్లెలోని ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి దాని తాళాలు పగులగొట్టి, బీరువాలోని నగలు తస్కరించి, వాటిని కరిగించి ముక్కగా చేశాడు. గత ఏడాది నవంబరు 11న కడప జిల్లా సిద్ధవటం మండలం నలందా నగర్‌లోనూ ఇదే తరహాలో చోరీ చేసి ఆ బంగారాన్ని కరిగించాడు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో ఇతనిపై 65 కేసుల వరకు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. 156 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు స్వాధీనం చేసుకొని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మైపాడుకు చెందిన జహీర్, కాలేషా బుధవారం రాత్రి గంగపట్నంలోని మద్యం కొనుగోలు చేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఎదురుగా నడిచి వస్తున్న యువకుడిని ఢీకొట్టి రోడ్డుపై అదుపు తప్పిపడ్డారు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా జహీర్ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూద స్థావరాలపై దాడులు

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెర్లోపల్లిలో శుక్రవారం రాపూరు పోలీసులు కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులతో పాటు మూడు పందెం కోళ్లు, రూ3,500 నగదు సీజ్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటరాజేశ్ పేర్కొన్నారు.

మహారాజశ్రీ కోవూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No. 15/2009
O.S.No. 31/2006
M/s శ్రీ మౌనిక ఎంటర్ ప్రైజస్
రెప్రజెంటెడ్ బై ఇట్స్ సోల్ ప్రొప్రైటర్
చెన్నారెడ్డి శశికుమారి ... DHR
Vs
కాకుటూరు శివరామిరెడ్డి ... JDR
వేలం ప్రకటన
ఈ క్రింది షెడ్యూలు దాఖలా JDR తాలూకా స్థిరాస్తిని తే. 09-02-2026దిన ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రము 5 గం॥లోగా పై కోర్టులో బహిరంగ వేలము జరుపబడును. పాటదారులు పై వేలములో పాల్గొని పాడుకొనవచ్చును.
షెడ్యూలు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ ఇలాకా కోవూరు సబ్ - రిజిస్ట్రేషన్‌లో చేరిన కోవూరు మండలం కోవూరు టౌన్‌లోని పట్టా నెం. 369లోని సర్వే నెం. 679లోని య 0.20 సెంట్లు లేక 120 అంకణముల ఖాళీ స్థలములోని, 15 అంకణముల సిమెంటు రేకుల షెడ్డునకు హద్దులు. **తూర్పు :** NH-5 రోడ్డు, **దక్షిణం :** పడుగుపాడు గ్లేజ్‌డ్ పాటరీ ఇండస్ట్రియల్ వర్కర్స్ సొసైటీ భూమి, **పడమర :** పారుదల కాలువ, **ఉత్తరం :** మలిదేవి డ్రైన్.
DHR క్రయము : Rs. 7,00,000/-
అమీనా క్రయము : Rs. 10,00,000/-
వేలము తేదీ : 09-02-2026
ఇట్లు : బత్తిన రామకృష్ణారెడ్డి, M.A.,L.L.B., అడ్వకేట్, కోవూరు, SPSR నెల్లూరు జిల్లా.

వేలము నోటీసు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
డిప్యూటి రిజిస్ట్రార్ / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ - నెల్లూరు వారి ఉత్తర్వులు మేరకు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం, పొదలకూరు పట్టణము నందలి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, పొదలకూరు బ్రాంచి నందు ఈ క్రింద తెలుపబడిన బకాయిదారులు తమ కుటుంబ అవసరముల నిమిత్తం అప్పు తీసుకొని ఇంతవరకు పూర్తిగా చెల్లించనందున వారిపై బ్యాంక్ వారు డిక్రీ పొందియున్నారు. సదరు డిక్రీ మొత్తములు రాబట్టుకొనుటకు గాను ఈ క్రింద చూపబడిన స్థిరాస్తులను సేల్ ఆఫీసరు, డిఆర్ / ఓయస్‌డి వారి కార్యాలయము, నెల్లూరు వారిచే ఈ క్రింద తెలుపబడిన విధంగా బహిరంగ వేలము వేయబడును. వేలము పాటకు సంబంధించిన ఇతర షరతులను బ్రాంచి మేనేజరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, పొదలకూరు బ్రాంచి, పొదలకూరు వారి నుండి గాని లేక సేల్ ఆఫీసర్ డి.ఆర్./ ఓ.ఎస్.డి.వారి కార్యాలయము, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, గాంధీబొమ్మ వద్ద, ట్రంక్‌రోడ్డు, నెల్లూరు వారి నుండి గాని పొందవచ్చును.

వరుస సంఖ్య	తీర్పు బకాయిదారుని పేరు, చిరునామా	జప్తు పిటిషను నెంబరు	రావలసిన బకాయి మొత్తము	వేలము వేయబడు స్థిరాస్తి వివరములు: సర్వే నెంబరు	వేలము వేయబడు స్థిరాస్తి వివరములు: విస్తీర్ణం ఎకరాలలో	వేలము వేయబడు తేది మరియు సమయము	వేలము వేయబడు స్థలము
01.	శ్రీ నలగట్ల వెంకటేశ్వర్లు, S/o. రామచంద్రయ్య, వావింటపర్తి గ్రామం, పొదలకూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా **మరియు**	239/25-26	రూ. 33,77,342 + వడ్డీ + ఇతర ఖర్చులు	217-ఎ 184-1బి 171-బి 17-5ఎ 17-1 170 41-బి	1-70 2-20 1-15 0-70 0-62 0-35 0-42	తేది 22-01-2026 ఉదయం 11.00 గం॥లకు	గ్రామ సచివాలయం వావింటపర్తి గ్రామం, పొదలకూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా
02.	శ్రీ నలగట్ల వెంకట రమణయ్య S/o. రామచంద్రయ్య, వావింటపర్తి గ్రామం, పొదలకూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా			వెరశి	7-14 ఎ.సి.		

సం/- ఎ.ఫణీంద్రబాబు, చీఫ్ మేనేజర్/ సేల్ ఆఫీసర్
నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, నెల్లూరు.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ముఖ్యమంత్రితో గిరిధర్‌రెడ్డి

సీఎం దృష్టికి అభివృద్ధి కార్యక్రమాలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నారావారిపల్లెలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరురూరల్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. పొట్టేపాలెం కలుజుతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: నగరంలోని రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే దిశలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మనుమసిద్ధినగర్, పోర్టు కట్ట, పుట్టాఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: హరనాథపురం రెండో వీధిలో కుళ్లాయిల బెడద ఎక్కువగా ఉంది. అలాగే కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. భోగి మంటలకు వేసిన చెత్తను తొలగించలేదు. - కార్తీక్

సమస్య: చంద్రమౌళినగర్ ప్రాంతం 10, 11 వీధుల్లో కుక్కలబెడద అధికంగా ఉంది. - గౌతమ్

సమాధానం: కుక్కలను పట్టించడంతో పాటు కాలువలను శుభ్రం చేయిస్తాం. - నందన్, నగరపాలక సంస్థ కమిషనర్

? నగరంలోని నవాబుపేట ఎపీఎస్ కాలనీలో దోమల విపరీతంగా ఉన్నాయి. ఫాగింగ్ చేయించాలి. - ప్రేమ్, స్థానికుడు

✓ దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. - నందన్, నగరపాలక సంస్థ కమిషనర్

? నవాబుపేట సమీపం వీధిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - కరిముల్లా, స్థానికుడు

✓ కాలువలను వెంటనే శుభ్రం చేయిస్తాం. - డాక్టర్ చైతన్య, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి - న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

పెద్దలను స్మరించుకోవడం మన ఆచారం..

నెల్లూరు(టౌన్): సంక్రాంతి వేళ పెద్దలను స్మరించుకోవడం మన ఆచారమని మంత్రి నారాయణ తెలిపారు. గురువారం సంక్రాంతి పండగ సందర్భంగా బారాషహీద్ దర్గాలో జరిగిన పెద్దల పండగ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన నగరవాసులు తమ పూర్వీకుల సమాధులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తాను మేయర్‌గా ఉన్న సమయంలో మంత్రిగా నారాయణ నగరంలోని శ్మశాన వాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పెద్దల పండగ సందర్భంగా ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి ఏర్పాట్లు చేశారని, ప్రభుత్వ ఖర్చుతో సమాధులకు సున్నాలు వేయించి, పది ఎకరాల్లో పార్కింగ్ వసతి కల్పించారన్నారు. 42వ డివిజన్ మన్సూర్‌నగర్ ఆర్చి వద్ద జరిగిన సంక్రాంతి సంబరాల్లో సమీఖాతి రమాదేవి, కుమార్తె షణితో కలిసి మంత్రి పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం.. పల్లెపథం

చెత్త ఇచ్చి.. ప్రతిఫలం పొందేలా వినూత్న కార్యక్రమం

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గృహాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ వేయడంతో స్వచ్ఛ లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు స్వచ్ఛ రథాలను తీసుకొచ్చింది. పల్లెల్లో చెత్త, వ్యర్థాలు తీసుకుని.. తగిన ప్రతిఫలం పొందేలా నూతన ఆవిష్కరణకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీటి బాధ్యతలను ఆయా పంచాయతీలకు చూస్తాయి. మండల పరిషత్ నిధుల నుంచి డ్రైవర్లకు ప్రతినెలా రూ.25వేలు ఇస్తారు. ఈనెల 26వ తేదీ నుంచి వీటిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

స్వచ్ఛ రథం

వులు అందజేయనున్నారు. చాలా మంది పాత సామగ్రి విక్రయించేందుకు ఆసక్తి చూపుతారు. కొంత మంది ప్రైవేటు వ్యాపారులకు తక్కువగా తూకి తక్కువ మొత్తం ఇస్తారు. కొన్ని రకాల సామగ్రిని తీసుకోరు. కేవలం లాభాలు వచ్చే వాటినే తీసుకుంటారు. అలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛ రథాల్లో డిజిటల్ తూకాలు ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్, గాజు, స్టీలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కంప్యూటర్లు, కీ బోర్డులు ఇతర వస్తువులు ఇచ్చినా బరువుకు తగిన కిరాణా తీసుకోవచ్చు.

వస్తువులు బట్టి ఖరీదు ఇలా..

రకం (కిలో)	ధర (రూ.ల్లో)
ఇనుము	20
పేపర్లు	15
పుస్తకాలు	10
అట్ట పెట్టెలు	20
గాజు సీసాలు	2
స్టీల్ వస్తువులు	40
అల్యూమినియం	120

రుగా సేకరించనున్నారు. ఆ వ్యర్థాల బరువుకు విలువ కట్టి నిత్యావసరాలు, వస్తు

డిజిటల్ తూకాలు

జిల్లాలో 37 మండలాలు ఉండగా.. 722 పంచాయతీలు ఉన్నాయి. స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం 'స్వచ్ఛరథం' ప్రారంభించింది. పంచాయతీల్లో హరిత రాయబారులు వ్యర్థాలు సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఇకపై చెత్త, వ్యర్థాలను వేర్వే

17 రకాల నిత్యావసరాలు

పాత సామగ్రిని ఇచ్చి వివిధ రకాల కిరాణా సామగ్రి తీసుకోవచ్చు. కొబ్బరి నూనె, సర్ఫ్, కంఫర్ట్ ప్యాకెట్లు, దుస్తులు ఉతికే సబ్బులు, టీ, కాఫీ పొడి, పేస్ట్, షాంపు, ఉల్లిపాయలు, టూత్‌బ్రష్‌లు, పెన్సిలు, పెన్నిల్ వంటివి ఖరీదును బట్టి పొందవచ్చు. గోధుమ పిండి, వేరుసెనగ పప్పు, మినప పప్పు, కందిపప్పును కిలో ధర బట్టి తీసుకోవచ్చు.

సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఏటి పండగ నిర్వహణకు నగరపాలకసంస్థ నుంచి అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణతో పాటు భక్తుల అన్ని వసతులు కల్పించినట్లు నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కమిషనర్ వైవో నందన్ తెలిపారు. శుక్రవారం పోలీసులు, దేవాదాయ శాఖ, పిహరేస్ అధికారులతో కలిసి ఏటి పండగ నిర్వహించే పెన్నానది తీరం, మైపాడుగేటు తెప్పోత్సవ ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ సంప్రదాయం ఉట్టిపడేలా సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ప్రాముఖ్యత కలిగిన దేవాలయాల నమూనాలను సైతం ఏటి పండగలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రద్దీ ప్రాంతంపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

ఆత్మకూరు బస్టాండు.. నిత్యం వాహనాలు, ప్రజలతో రద్దీగా ఉంటోంది. వ్యాపార కూడలి కావడంతో నగరవాసులతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. అలాంటి చోట అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతం నుంచి స్టోన్‌హౌస్‌పేట, కోవూరు, మైపాడు, కొత్త కోడూరుతో పాటు పలు మండలాలకు వెళుతుంటారు. ఇక్కడి నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతంలో పలు సమస్యలు ప్రజలను ఆశాకర్యానికి గురి చేస్తున్నారు. ఇటీవల ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి వద్ద పనులను చేపట్టారు. సిమెంటు రోడ్డు నిర్మాణ సమయంలో నీరు నిలిచేందుకు మట్టితో కట్టలు వేశారు.

బ్రిడ్జి కింద ప్రమాదకరంగా పిల్లర్ల కమ్ములు

రోడ్డు పక్కనే మట్టి గుట్ట

పనులు పూర్తయ్యాక మట్టిని తీసి రోడ్డు పక్కన గుట్టగా నిల్వ చేశారు. వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పండగల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అండర్ బ్రిడ్జి కింద నుంచి వెళుతున్న తాగునీటి పైపులైనుకు పిల్లర్లు సగం పనులు చేసి ఆపేశారు. ఇనుప కమ్ములు ప్రమాదకరంగా మారాయి. అండర్ బ్రిడ్జిలో ఓ గోతులు నాలతో రద్దీగా ఉంటోంది. పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. కమ్ములు గుచ్చుకునే అవకాశం ఉంది. కనీసం రక్షణ చర్యలు కూడా చేపట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఏకే నగర్‌లో ఎన్ని సమస్యలో...

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ మండల పరిధిలోని పొదలకూరు రోడ్డు సమీపంలో ఏకే నగర్ ప్రాంతం సమస్యలకు నిలయంగా మారింది. ఆంధ్ర కేసరి నగర్‌కు ఓ వైపున దర్గామిట్ట, మరోవైపు పొదలకూరు రోడ్డు ప్రాంతాలు ఉన్నాయి. విలువైన భవనాలున్న ఈ ప్రాంతంలో జనం ఇక్కట్లు గురవుతున్నారు. ఇక్కడ పిచ్చికుక్కల సమస్య ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడో వేసిన రోడ్లు కావడంతో ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయి. కంకర లేచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చాలాసార్ల క్రితం రోడ్ల సమస్యపై 'ఈనాడు'లో వచ్చిన కథనంతో స్థానిక పోస్టాఫీసు ఉన్న కార్యాలయం వీధిలో తారు రోడ్డు నిర్మించారు. స్థానికంగా ఉన్న మూడు, నాలుగు వీధుల పారిశుద్ధ్య సమస్య దర్శనమిస్తోంది. పోస్టల్ కార్యాలయం వెనుక భాగాన చెత్త నిల్వ కేంద్రంగా మారిపోయింది.. రోడ్ల పక్కన పిచ్చి చెట్లు పెరిగిపోయాయి. స్థానికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆ ప్రాంతంలో అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడ్డాయి. దోమల బెడద తీవ్రంగా ఉందని, సాయంత్రం ఆరు గంటలు నుంచే ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. పలుచోట్ల మ్యాన్‌హోల్స్ మూతలు ఎత్తుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లకు కనీసం ప్యాచ్ పనులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్

పార్వీ సినిమాస్ (ఎం.1) **షెడ్యూల్:** స్ర్కీన్ 1...రాజాసాబ్, అనగనగా ఒక రాజు (తెలుగు) స్ర్కీన్ 2.. మన శంకర వరప్రసాద్ (తెలుగు) స్ర్కీన్ 3. మన శంకర వరప్రసాద్, భర్త మహాశయులకు విజ్ఞప్తి, అనగనగా ఒక రాజు (తెలుగు) **పార్వీ సినిమాస్ (స్క్రీన్):** స్క్రీన్..1. మన శంకర వరప్రసాద్ (తెలుగు) స్క్రీన్ 2. అనగనగా ఒక రాజు (తెలుగు) స్క్రీన్ 3. భర్త మహాశయులకు విజ్ఞప్తి, నారి నారి నడుమ మురారి (తెలుగు) స్క్రీన్.4.. రాజాసాబ్ (తెలుగు) స్క్రీన్.5..మన శంకర వరప్రసాద్ (తెలుగు) **రైన్ సినిమా షెడ్యూల్:** స్ర్కీన్..1. రాజాసాబ్ (తెలుగు) స్క్రీన్ 2. అనగనగా ఒక రాజు, భర్త మహాశయులకు విజ్ఞప్తి, (తెలుగు) స్క్రీన్ 3. మన శంకర వరప్రసాద్ (తెలుగు) స్క్రీన్.4..అనగనగా ఒక రాజు, నారి నారి నడుమ మురారి (తెలుగు)

పైపులైను లీకేజీ.. తాగునీరు వృథా

పొదలకూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్ స్కూల్ ఎదుట ప్రధాన తాగునీటి పైపులైను లీకవుతోంది. నీరంతా స్కూల్ గేటు ముందు నుంచి కలెక్టర్ బంగ్లా వరకు పారుతుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయం ఎదురుగానే పైపులైను లీకవుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. -న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

రాళ్లు తేలిన రహదారిపై అవస్థలు

నెల్లూరు నగరం రంగనాయకులపేట నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. తారు రోడ్డు కాస్త రాళ్ల రహదారిగా మారింది. గత కొన్ని నెలల నుంచి రోడ్డు దారుణంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే రహదారి రాళ్లమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(రైల్వే)

బస్టాండ్‌లోకి వెళ్లాలంటే బాధలే

నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల అండర్ బ్రిడ్జి ఆధునికీకరణ పనులు చేసేందుకు మెట్లు తొలగించారు. పనులు పూర్తయినా మెట్లు నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలపై ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, నెల్లూరు(అర్బన్)

అ'పూర్వ' సమ్మేళనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని తడికలబజార్ ప్రాంతంలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం పండగ వాతావరణంలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది. 1978, 1979, 1980 సంవత్సరాల్లో విద్యనభ్యసించిన వారు కార్యక్రమంలో పాల్గొన్నారు. గత మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ ఆట పాటలతో సరదాగా గడిపారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రస్తుత విశ్రాంత ఉపాధ్యాయులు వై.సాయిప్రసాద్, టి.రామకృష్ణ చంద్రమౌళి, ఎం.నాగభూషణంలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఎస్.ప్రకాష్ సింగ్, రాజాకిషోర్, కంకిపాటి గోపాల్, కె.రాధాకృష్ణ, కొండా ప్రవీణ్‌శంకర్, రవీంద్రబాబు, పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చదువు నేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గురు, శుక్రవారాల్లో నగర వ్యాప్తంగా ప్రతి ఇంటా వేడుకలు జరిగాయి. మహిళలకు ముగ్గులు, యువతకు ఆటల పోటీలు నిర్వహించారు. నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనుమ పండగ సందర్భంగా ఇరుకళల పరమేశ్వరి ఆలయం నుంచి ప్రత్యేక ఊరేగింపు జరిగింది. రంగనాథస్వామి ఆలయంలో కనుమ సంబరాలు జరిగాయి. పారువేట ఉత్సవం రాజరాజేశ్వరి గుడి నుంచి బయలుదేరింది. నగరంలోని మూలాపేట, నవాబుపేట తదితర ప్రాంతాల్లోని ఆలయాల నుంచి వేడుకగా ఊరేగింపు ఒకేసారి జరిగింది. నరసింహకొండ నుంచి లక్ష్మీనరసింహస్వామి అశ్వవాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని మూలాపేట ప్రాంతంలో బెస్త పాళెం పరిధిలో కొలువుదీరిన మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో గురువారం సంక్రాంతి మహాపూజను విశేషంగా నిర్వహించారు.

నెల్లూరు(సాంస్కృతికం): నగరంలోని మూలాపేట ప్రాంతంలో కొలువుదీరిన శ్రీ అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా సాగింది. బ్రాహ్మణ, ఫ్రణీత్ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. **నెల్లూరు (సాంస్కృతికం):** శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీరంగనాథస్వామి ఆలయాల్లో గోమాతలకు విశేషపూజలు నిర్వహించారు. కొత్తూరులోని భగవాన్ వెంకయ్యస్వామి, ఆనందస్వామి ఆశ్రమాల్లో గోవులకు పూలమాలలు వేసి పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. **నెల్లూరు(మాగుంట లే అవుట్):**

● నగరంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. 1వ డివిజన్‌లోని నవలాకుల తోట, ఆలేఖ్యరోడ్డు, దొరతోపుకాలనీల్లో గురువారం ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. గెలుపొందిన వారికి బీరేలు పంపిణీ చేశారు.

నెల్లూరు(పద్మావతిసెంటర్): నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ గోశాలలో శుక్రవారం జరిగిన గోపూజలో బాజపా నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీనేత మిడతల రమేష్, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. **నెల్లూరు(మాగుంట సెంటర్):** కనుమ పండగను పురస్కరించుకుని నెల్లూరులో జనసేన నాయకులు గోపూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నగరంలోని ఆమని గార్డెన్‌లో కార్యక్రమం వేడుకగా జరిగింది.

పార్వేటకు కదిలిన రంగనాథస్వామి

మూలాపేట శివాలయంలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు, పండితులు

వేదాయపాళెం త్యాగరాజ మందిరంలో వయోలిన్ కచేరీ

కాలువ.. ప్రమాదాలు చేరువ

నిత్య వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం వెంట ప్రమాదం పొంచి ఉన్నా అధికారులకు పట్టడం లేదు. సాగునీటి కాలువ వెంట ఈ పరిస్థితి నెలకొంది. కాలువ వెంబడి సిమెంటు గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా.. అసంపూర్తిగా ఉంది. - న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

నెల్లూరు నగరం ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పు వైపు ముఖద్వారం ఆవరణ నుంచి మినీబైపాస్ రోడ్డు ఉంది. ఈ మార్గం.. శెట్టిగుంట రోడ్డు నుంచి ఆత్మకూరు బస్టాండ్ వైపు రహదారి వెంబడి సర్వేపల్లి కాలువ వెళుతోంది. కావలి, అల్లూరు, రాజుపాలెం, బుచ్చి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వాహనాలు నగరంలోని ఈ మార్గం గుండా వస్తాయి.

మినీబైపాస్ రోడ్డే రైల్వేస్టేషన్ ఎదురుగా పలు చోట్ల రోడ్డు అంచు సర్వేపల్లి కాలువలోకి జారిపోతోంది. పెద్దపాటి గుంతలుగా మారాయి. కొంత రోడ్డు కింది భాగం కూడా జారిపోయి ఉంది. నగరం వైపు వచ్చే బస్సులు, ఆటోలు రైల్వేస్టేషన్ ఎదుట ప్రయాణికులను దింపేందుకు పక్కగా నిలుపుతారు. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా.. రోడ్డు చుకు జారిపోయి కాలువలోకి పడిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని సూచించే బోర్డులు ఏర్పాటు చేయలేదు. నెలలు తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా.. పట్టించుకునేవారు లేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

కాలువ సమీపంగా వస్తున్న బస్సు

పునాదుల్లోనే సిమెంట్ గోడ నిర్మాణం

కాగా సర్వేపల్లి కాలువకు ఇరువైపులా సిమెంట్‌తో వాల్ నిర్మిస్తున్నారు. రెండేళ్లుగా పనులు ఆగిపోయాయి. రెండు నెలల కొన్నిచోట్ల నిర్మాణం జరిగింది. రైల్వేస్టేషన్ ఎదుట పునాదులకే పరిమితమయింది. సిమెంట్ గోడ పూర్తయి ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(నేర విభాగం): గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నగరంలోని కొండాయపాలెం గేటు వద్ద చోటు చేసుకుంది. బులుగు గీతల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బులుగు రంగు గీతల లుంగీ ధరించి ఉన్నారు. 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది. రైల్వే ఎస్సై హరిచందన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారంతో ఉడాయింపు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: బంగారు హారం, మడిబంగారాన్ని గుర్తుతెలియని వారు అపహరించుకెళ్లిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంకర్ మండల్ ఆరెళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. కామాటి వీధిలో నివాసం ఉంటూ ఇంట్లోనే బంగారు ఆభరణాలు(హారాలు) తయారు చేస్తున్నారు. ఆ భవనంలోనే నివాసం ఉంటున్న మగ్గన్‌రామ్ బంగారు పని చేస్తూ ఉంటాడు. శంకర్ మండల్‌కు 70 గ్రాముల బంగారం ఇచ్చారు. 14వ తేదీ రాత్రి శంకర్ మండల్ తన సహాయకులు రోనిత్ మొస్కొ, రాకీబ్ బోల్‌తో కలిసి హారం తయారు చేశారు. ఆరేం దుకు టేబుల్‌పై పెట్టి బెడ్‌రూమ్ లోకి వెళ్లి నిద్రపోయారు. 15వ తేదీ ఉదయం నిద్ర లేచి చూడగా తలుపుకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. టేబుల్ మీద ఉండాల్సిన బంగారు హారం, కొంత బంగారం మొత్తంగా 70 గ్రాముల బంగారం కనిపించలేదు. దీంతో బాధితుడు చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

కుంచెపడితే.. అద్భుతాలే

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

మూడేళ్ల తరగతిలో సరదాగా దేవతామూర్తులు, చెట్లు, జంతువుల చిత్రాలను పెన్సిల్, చాక్‌పీస్, బొగ్గులతో గోడలు, అరుగులపై గీయడం ప్రారంభించారు. అలా ఆసక్తి పెంచుకున్న ఆ చిన్నారి.. తండ్రి ఇంటికి తీసుకొచ్చే చందమామ పుస్తకాలు చూసి బొమ్మలు గీస్తుండగా.. తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అలా మొదలైన చిన్నారి ప్రస్థానం.. ఊహల్లోనే కథను మలచుకుని ఏ చిత్రమైనా అద్భుతంగా గీస్తున్నారు. ఉద్యోగం చేసే సమయంలో, విరమణ అనంతరం కళను కొనసాగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. నెల్లూరుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి.. గుర్రం శ్రీనాథ్. అలాగే కాపీపాడితో చిత్రాలు గీస్తూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

55 ఏళ్లుగా చిత్రకళలో రాణిస్తున్న శ్రీనాథ్

నుంచి డిగ్రీ పూర్తి చేసి లా చదివేవరకు ఎన్నో అద్భుత కళాఖండాలను గీశారు. అలాగే చిత్ర కళకు సంబంధించి ప్రత్యేక కోర్సులను చెన్నైలో పూర్తి చేశారు.

ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పురస్కారం అందుకుంటున్న శ్రీనాథ్

తల్లిదండ్రుల ప్రోత్సాహం

జిల్లా పరిషత్‌లో పరిపాలనాధికారిగా పనిచేస్తూ 2024 లో ఉద్యోగ విరమణ చేసిన శ్రీనాథ్.. తల్లిదండ్రులు గుర్రం వెంకటసుబ్బయ్య, కృష్ణమ్మల ప్రోత్సాహంతో పసి ప్రాయం నుంచే బొమ్మలు గీయడం నేర్చుకున్నారు. ఉన్నత పాఠశాల



శ్రీనాథ్ గీసిన చిత్రం

అంతర్జాతీయ ప్రదర్శనకు..

పాల్గొన్న ప్రతి చిత్రకళా పోటీలో ప్రథమస్థానంలో నిలవాల్సిందే. 1988లో సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ వారు ఐరోపాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఆరు రాష్ట్రస్థాయి, నాలుగు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. ఆయన గీసిన చిత్రాలు అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో పురస్కారం అందుకున్నారు.

దివ్యాంగులకు అందని ఉపకరణాలు

నెల్లూరు (మాగుంట లే అవుట్ సెంటర్), న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఉపకరణాలు అందించాలని సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని జనసేన నాయకుడు గునుకుల కిషోర్ కోరారు. గురువారం ప్రకాశం జిల్లా కొండపిలో మంత్రిని కలిసి దివ్యాంగుల సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరులో 2023లో దివ్యాంగులకు క్యాంపు నిర్వహించి 1200 మందికి ఉపకరణాలు అందించాల్సి ఉండగా.. సాంకేతిక సమస్యలు, నిర్లక్ష్యం కారణంగా రెండున్నర సంవత్సరాలుగా ఉపకరణాలు అందకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉపకరణాలు ఎందుకు అందించలేదని వివరించి వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త మనోజ్‌కుమార్, సింగరాయకొండ మండల అధ్యక్షుడు రాజేష్, జరుగుమల్లి మండల అధ్యక్షుడు శశిభూషణ్, పొన్నలూరు మండల నాయకుడు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి సమస్యలు వివరిస్తున్న జనసేన నాయకులు

(c) eenadu

నేత్రపర్వం.. నారసింహుడి
పార్వేట ఉత్సవం

పార్వేటను తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు (అంతర చిత్రంలో) నారసింహుడు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పులిపార్వేట ఉత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సంక్రాంతిని పురస్కరించుకొని కనుమరోజు ఉదయం పూజల అనంతరం స్వామివారు ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో లఘువమ్మకొండ వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామిని పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వీవీఎస్‌శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామిక వాడలోని పాలపొంగుఉట్టికి చేరుకున్నారు. అక్కడ యాదవులు పాలపొంగులు వండి నైవేద్యంగా సమర్పించారు. ఆతర్వాత వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో పులిపార్వేట నిర్వహించారు. కుందేళ్లను పట్టుకునేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం రాయచోటి రోడ్డులోని శమీ మండపానికి చేరుకున్న స్వామిని అలంకరించి, పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం వెళ్లిన స్వామి సాయంత్రం ఆలయానికి చేరుకోవడంతో అమ్మవారు అలకబూనే సన్నివేశాన్ని అర్చకులు నిర్వహించారు.

సంతోషమే బలం..

ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గ్రామీణ క్రీడలను ప్రారంభించారు. చిల్లా కట్టి, బొంగరాలు, గోలీలు, తాడు లాగు, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో మంత్రి పాల్గొని సందడి చేశారు. యువకులు, నాయకులతో కలిసి నృత్యం చేశారు.
- న్యూస్‌టుడే, ధర్మవరం

అక్రమాలు ఆపరు.. బదిలీ చేసినా కదలరు
■ కేజీబీవీల్లో మారని తీరు

"జిల్లాలో సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా బాలికల విద్యాలయాల నిర్వహణ తీరు మారడం లేదు. ఇక్కడ కొందరు ఇష్టం వచ్చినట్లు విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు తనిఖీల్లో గుర్తించి క్రమశిక్షణా చర్యలు తీసుకున్నా.. రెండు రోజులు హడావుడి తప్ప ఆ తర్వాత 'షరామామూళ్లే'నని సిబ్బంది సర్దుకుపోతున్నారు."

ఈనాడు, పుట్టపర్తి: సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లిలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో గతేడాది జులై 4న ఆహారం విషతుల్యమై 30 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అధికారులు విచారణ చేసి సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పలువురిని ఇతర మండలాలకు బదిలీ చేస్తూ అప్పటి ఏపీసీ దేవరాజ్ గతేడాది డిసెంబరు 20న ఉత్తర్వులు జారీ చేశారు. సోమందేపల్లి ఎస్ఓ అనితను చిలమత్తూరుకు.. అక్కడ పని చేస్తున్న సునీతకుమారిని సోమందేపల్లికి, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌ను రొద్దంకు, అక్కడామెను ఇక్కడికి, ప్రధాన వంటమనిషి జగరాజుపల్లికి, అక్కడామెను ఇక్కడికి, స్వీపర్‌ను ముదిగుబ్బకు, అక్కడామెను పాపిరెడ్డిపల్లికి బదిలీ చేశారు. కానీ, నేటికీ అమలుకు నోచుకోలేదు.

జిల్లా:	శ్రీసత్యసాయి
కేజీబీవీలు:	30
మొత్తం విద్యార్థినులు:	7,766
ఉపాధ్యాయినులు:	378

ఎస్ఓపై ఆరోపణల వెల్లువ

హిందూపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఓ ఎస్ఓపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనిచేసేచోట నివాసం ఉండకుండా.. కదిరి నుంచి వచ్చి వెళుతున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. గతంలో ఆమె పని చేసిన పాఠశాలలో నాడు-నేడు పనుల్లో అవినీతికి పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ప్రస్తుతం పనిచేస్తున్నచోట సరకుల్లో నాణ్యత లేదనే సాకు చూపి నెలకు రూ.50 వేలు మామూలు ఇవ్వాలని డిమాండు చేస్తున్నారంటూ ఓ గుత్తేదారు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీట్ల కేటాయింపునకు డబ్బులు డిమాండు చేస్తోందని ఓ బాలిక, తనను వేధింపులకు గురిచేస్తోందని ఓ ఉపాధ్యాయిని ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ అటెండెన్సులో హాజరు లేకపోయినా.. పుస్తకంలో మాత్రమే సంతకాలు చేస్తున్నారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఇప్పటికే రెండుసార్లు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇన్ని ఆరోపణలున్న నేపథ్యంలో ఆమెను మరో చోటికి బదిలీ చేశారు. హిందూపురానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులతో ఒత్తిడి చేయిస్తూ బదిలీని అడ్డుకుంటున్నట్లు తెలిసింది.

చర్యలు తీసుకుంటాం

- క్రిష్ణప్ప, ఎస్ఎస్ఏ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి

ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ను ఇటీవలే మాతృశాఖకు పంపించారు. ఇన్‌ఛార్జిగా నాకు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఓలు, సిబ్బంది బదిలీలు, అవినీతి ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



సాయి పల్లకీతో విద్యార్థులు

ట్రోఫీ అందజేస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మానవతా విలువలతో కూడిన విద్యా బోధన, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు సాహసోపేతమైన క్రీడా విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పేర్కొన్నారు. హిల్‌వ్యూ స్టేడియంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈనెల 11న క్రీడా సమ్మేళనం నిర్వహించిన విషయం విదితమే. ఇందులో ప్రతిభ కనబర్చిన క్యాంపస్‌లు, విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. గురువారం ఉదయం యజుర్వేద మందిరం నుంచి విద్యార్థులు వేదపఠనంతో కవాతు నిర్వహించారు. బ్రాస్‌బ్యాండ్.. సాయి భక్తిగీతాలను ఆలపిస్తూ సాయికుల్వంత్ మందిరానికి చేరుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు, సాయి విద్యార్థులు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బంగారు, రజత, కాంస్య పతకాలు, ట్రోఫీలను ఆర్జే రత్నాకర్ తదితరులు అందజేసి, అభినందించారు. విద్యార్థులు సత్యసాయితో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపకులపతి రాఘవేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీకాంత్ ఇన్నా, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. చింతలరాయుడి కల్యాణం

తాడిపత్రిలోని చింతలరాయుని ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుడిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే, తాడిపత్రి**

పట్టుగూళ్ల మార్కెట్‌కు
త్వరలో మోక్షం

శిథిల భవనంలో విక్రయాలు

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిథిలావస్థకు చేరిన పట్టుగూళ్ల విక్రయ కేంద్రానికి త్వరలో మోక్షం రానుంది. రూ.8 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసే ఈ మార్కెట్‌కు దాదాపు నాలుగు మాసాల ముందే కేంద్ర ప్రభుత్వం రూ.4 కోట్లు విడుదల చేయగా.. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఖాతాలో జమ అయ్యాయి. ఈ పనులు ప్రారంభమైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా మిగిలిన రూ.4 కోట్లు విడుదల చేయనుంది. 1985, డిసెంబరు 1న అప్పటి చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి పట్టుపరిశ్రమశాఖ నిధులతో విక్రయకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 1987, సెప్టెంబరు 14న అప్పటి స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చింది. ఈ మార్కెట్‌కు ఉమ్మడి రాష్ట్రాలు, కర్ణాటక నుంచి పట్టుగూళ్లను రైతులు తీసుకొస్తుండటంతో ఏటా వీటి క్రయవిక్రయాలతో ప్రభుత్వానికి పన్ను రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది.

కేంద్రం- పట్టుగూళ్ల మార్కెట్, హిందూపురం
మంజూరైన నిధులు - రూ.4కోట్లు
ఇంకా కావాల్సినవి - రూ.4 కోట్లు

శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు

అయితే ఈ కేంద్రం దాదాపు దశాబ్దాకాలంగా శిథిలావస్థకు చేరటంతో మార్కెట్ నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో నీరు లోపలికి వస్తుండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ, సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యుడు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి రైతు సంఘం నాయకులు, అధికారులు తీసుకెళ్లడంతో నూతన విక్రయకేంద్రానికి కేంద్రం తన వాటాగా నిధులు అందించగా రాష్ట్రప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది.

తాత్కాలిక కేంద్రంలో సౌకర్యాలు

ప్రస్తుతం ఈ విక్రయకేంద్రం ఆవరణలోనే తాత్కాలిక మార్కెట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పట్టు గూళ్లు అధికంగా వచ్చినా భవనం ముందు, వెనకవైపు గూళ్లు వేసుకొనేలా రేకులు వేస్తారు. భవనంలోపల, ముందుభాగంలో పట్టుగూళ్లు, వెనకభాగంలో జల్లీ గూళ్లు విక్రయాలు జరిగేలా సిద్ధం చేస్తున్నారు. ఈపనులు దాదాపు వారంలో ముగిసే అవకాశం ఉంది. ఇతర ప్రాంతాల నుంచి గూళ్లు తీసుకొచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, భవనం లోపల వెలుతురు, ఫ్యాన్లు, కిటికీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ హంపయ్య దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక మార్కెట్ ఏర్పాటు పనులు ముగిసిన వెంటనే నూతన కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు.

ఆదాయానికి వెదురులేదిక..
■ వెయ్యి ఎకరాల్లో ప్రయోగాత్మక సాగు
■ నిర్వహణకు ఏటా రూ.2 లక్షలు మంజూరు

రాయదుర్గం, న్యూస్‌టుడే: అనంత జిల్లాలోని బంజరు భూములను వ్యవసాయాధారిత భూములుగా మార్చి రైతులకు నిరర ఆదాయాన్ని సమకూర్చేందుకు వెయ్యి ఎకరాల్లో వెదురు ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నట్లు సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు గంగాధర్ తెలిపారు. జిల్లాలో 10 వేల ఎకరాల్లో వెదురు సాగుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. త్వరలో రైతులకు అవగాహన కల్పించి సాగుకు సమాయత్తం చేస్తామన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఎక్కువ గిట్టుబాటు కావటం లేదు. అందుకే వెదురుతో రైతులను ఆదుకోవాలని నిర్ణయించారు. అన్ని నేలల్లో ఈ పంట సాగు చేయవచ్చు. రైతులకు టుల్డా వెరైటీ వెదురు మొక్కలను పంపిణీ చేస్తారు. ఒక మొక్క నాటితే ఏడాదికి 10 పిలకలు వస్తాయి. ఏటా పిలకలు రెట్టింపు అవుతాయి. మూడేళ్ల తర్వాత పంట కోతకు వస్తుంది. ఒకసారి నాటితే 25 ఏళ్లదాకా.. ఏటా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా ఆదాయం వస్తుంది. ఈ వెదురు పేపర్, సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. బైబ్యాక్ పద్ధతి ద్వారా కర్ణాటకకు చెందిన ఇండస్ట్రీ ఫౌండేషన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు తెలిపారు.

25 ఏళ్ల వరకు ఆదాయం

ఒక ఎకరాలో పంట సాగుకు ఉపాధి హామీ పథకం కింద ఏటా రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

విస్తారంగా వర్షాలు..

తెగులు సోకని పంట వెదురు. పశువులు, దొంగల బెడద ఉండదు. మూడేళ్ల వరకు వెదురులో అంతర పంటలు సాగు చేయవచ్చు. ఇప్పటికే చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఈ పంటను ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. మరో 15 జిల్లాల్లో అమలు చేయనున్నారు. వెదురు సాగుతో వర్షాలు బాగా కురుస్తాయి. నేలలు సారవంతం అవుతాయి. ఆసక్తి ఉన్న రైతులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

దండిగా నిధులు..
రోడ్డెక్కని పనులు

పుట్టపర్తి, కదిరి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. వీటిని చేపట్టి, పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లావ్యాప్తంగా 237 పనులకు రూ.55.15 కోట్లు మంజూరు చేసింది. ఇందులో నేటికీ దాదాపు 113 సీసీ రహదారులు ప్రారంభానికి నోచుకోలేదు. నాయకులు, పాలకుల మధ్య విభేదాలు ఇందుకు కారణంగా తెలుస్తోంది. మార్చి 31వ తేదీలోపు పనులు చేపట్టకపోతే నిధులు వెనక్కి పోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు సమన్వయంతో పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై పంచాయతీరాజ్ ఈఈ మురళి వివరణ కోరగా.. రహదారుల నిర్మాణాలు చేపట్టి, పూర్తి చేయిస్తాం. నిర్ణీత గడువులోగా నిధులు వినియోగించేలా చర్యలు చేపడతామన్నారు.

నియోజకవర్గం	పనులు	విలువ (రూ.కోట్లలో)
ధర్మవరం	97	3.72
పుట్టపర్తి	11	0.59
కదిరి	09	0.35

రైల్వేలైన్ల పటిష్ఠతపై దృష్టిపెట్టాలి

ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ సిస్టంను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలంటే రైల్వే లైన్లు పటిష్ఠంగా ఉండాలని, ఈ విషయంలో అధికారులు దృష్టిపెట్టాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన ఏడీఆర్ఎం సుధాకర్, వివిధశాఖల అధికారులతో కలిసి గుంతకల్లు-డోన్, డోన్-పాణ్యం సెక్షన్లలో తనిఖీలు చేశారు. లెవల్ క్రాసింగులను, రైల్వే స్టేషన్లలోని సిగ్నలింగ్‌కు చెందిన ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ విభాగాలను పరిశీలించారు. రైళ్లు స్టేషన్లకు చేరుకోగానే వివిధ ప్లాట్‌ఫారాల్లోకి వెళ్లాలంటే ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ చాలా ప్రధానం. ఇవి సక్రమంగా పనిచేయకుంటే ప్రమాదాలు జరుగుతాయని డీఆర్ఎం అన్నారు. వీటి నిర్వహణ విషయంలో తాత్సారం చేయకూడదని చెప్పారు. డోన్ రైల్వే స్టేషన్‌లో వాటి పనితీరును తనిఖీ చేశారు.

ప్రత్యేక రైళ్లున్నాయ్..
ఖాళీగా వెళ్తున్నాయ్..
అవగాహన లేక వినియోగించుకోలేని ప్రయాణికులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్న ప్రత్యేక రైళ్ల గురించి ఎక్కువ మందికి అవగాహన లేక వినియోగించుకోలేకపోతున్నారు. ఫలితంగా ప్రయాణికులు ప్రతిరోజూ ప్రయాణించే రైళ్లపైనే ఆధారపడుతున్నారు. ఈ రైళ్లలో స్థలం లేక గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. ప్రత్యేక రైళ్లను పది శాతానికి మించి ప్రయాణికులు వినియోగించడం లేదు. ఫలితంగా ఈ రైళ్లు ఖాళీగా వెళుతున్నాయి. అనంతపురం, తాడిపత్రి, కదిరి మీదుగా అధికారులు నడుపుతున్న ప్రత్యక రైళ్లపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

అనంతపురం మీదుగా

- ప్రతి శనివారం బెంగళూరు-కలబురగి మధ్య ప్రయాణించే రైలు (06207) అనంతపురానికి రాత్రి 11.38, గుంతకల్లుకు 1.15కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (06208) ప్రతి ఆదివారం గుంతకల్లుకు మధ్యాహ్నం 2 గంటలకు, అనంతపురానికి 3.03, ధర్మవరానికి మధ్యాహ్నం 3.35కు వెళుతుంది.
- మైసూరు - కాకినాడ మధ్య మంగళ, శనివారాల్లో ప్రయాణించే రైలు (07034) అనంతపురానికి రాత్రి 12.38, గుంతకల్లుకు రాత్రి 1.55కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (07033) సోమ, శుక్రవారాల్లో గుంతకల్లుకు ఉదయం 6.20, అనంతపురానికి ఉదయం 7.38కి వెళుతుంది.
- అనకాపల్లి - షోలాపూర్ మధ్య శనివారం ప్రయాణించే రైలు (01478) కదిరికి ఉదయం 10.58, ధర్మవరం 11.58, అనంతపురానికి మధ్యాహ్నం 12.43, గుంతకల్లుకు 1.55కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో (01477) ప్రతి శుక్రవారం షోలాపూర్‌లో బయలుదేరి గుంతకల్లుకు సాయంత్రం 4.05, అనంతపురం సాయంత్రం 5.18, ధర్మవరానికి 6.18కి వస్తుంది.
- బీదర్ - బెంగళూరు మధ్య ప్రతి సోమ, శనివారాల్లో తిరిగే రైలు (06540) గుంతకల్లుకు రాత్రి 8.40, అనంతపురానికి 9.48, ధర్మవరానికి రాత్రి 11.15కు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆది, శుక్రవారాల్లో అనంతపురానికి రాత్రి 12.38, గుంతకల్లుకు 1.55కు వస్తుంది.

తాడిపత్రి మీదుగా

- ప్రతి మంగళవారం చర్లపల్లి- కొల్లం మధ్య ప్రయాణించే రైలు అనంతపురానికి రాత్రి 7.54, గుత్తి 8.40, తాడిపత్రికి 9.32కు వస్తుంది. తిరుగు ప్రయాణంలో రైలు ప్రతి (07114) గురువారం ప్రయాణిస్తూ తాడిపత్రికి రాత్రి 1.08, గుత్తి 2.53, అనంతపురానికి రాత్రి 3.35కు వస్తుంది.
- ప్రతి మంగళవారం హిసార్ - తిరుపతి మధ్య ప్రయాణించే రైలు (07718) గుంతకల్లుకు తెల్లవారుజామున 5.45, తాడిపత్రి ఉదయం 7.20కు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో (07717) తాడిపత్రికి తెల్లవారుజామున 4.15, గుంతకల్లుకు ఉదయం 6.45కు వస్తుంది.
- ప్రతి మంగళవారం గుంతకల్లు- కడప మధ్య ప్రయాణించే రైలు గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కు బయలుదేరి తాడిపత్రికి 2.40కు వెళుతుంది.
- ప్రతి గురువారం అహమ్మదాబాద్- తిరుచిరాపల్లి మధ్య తిరిగే రైలు గుంతకల్లుకు ఉదయం 6.50కు వచ్చి తాడిపత్రికి ఉదయం 7.58కి చేరుతుంది.

ఎంపీఆర్ డ్యాంలో చేపలుపడుతున్న మత్స్యకారులు

మత్స్యకారులకు భరోసా
చేపల వేటలో మరణిస్తే రూ.10 లక్షల పరిహారం

4,330 అనంతపురం జిల్లాలో గుర్తింపు పొందిన మత్స్యకారులు
2,992 శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్నవారు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) పథకం కింద మత్స్యకారులతోపాటు లైసెన్సులు ఉన్న వారందరికీ వర్తింపజేశారు. ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. చేపల వేటలో మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు, బీమా పరిహారం అందజేస్తారు. మత్స్యకారుడు సాధారణ మరణంతోపాటు ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన వారికి కార్మికశాఖ ద్వారా రూ.2 లక్షల చొప్పున బీమా పరిహారం ప్రకటించారు. అయితే ఈ-శ్రమ్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

సద్వినియోగం చేసుకోండి

- చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా మత్స్యఅభివృద్ధిశాఖ అధికారి

పీఎంఎంఎస్‌వై పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల బీమా పరిహారం ప్రకటించింది. చేపల వేటలో మత్స్యకారుడు చనిపోతే రైతు సేవా కేంద్రాల్లో కాని, మత్స్య అభివృద్ధి అధికారులను (ఎఫ్‌డీవో) తక్షణమే సంప్రదించాలి.

పీఎంఎంఎస్‌వై అర్హులు ఎవరు?

మత్స్యసహకార సంఘంలో సభ్యులై ఉండాలి. చేపల వేట లైసెన్సు ఉన్నవారికి వర్తిస్తోంది. చేపల వేట ప్రమాదంలో మరణించిన మత్స్యకారుడికి రూ.10 లక్షల బీమా అందజేస్తారు. కార్మిక శాఖ ద్వారా ఈ-శ్రమ్ కార్డు పొందితే మత్స్యకారుడు సాధారణ, ఇతర ప్రమాదాల్లో మరణిస్తే రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తారు.

ఆధారాల సమర్పణ

ఆధార్‌కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, శవపంచనామా పత్రం, రేషన్‌కార్డు, మత్స్యసహకార సంఘం ధ్రువీకరణ పత్రం, సంఘం తీర్మానపత్రం సమర్పించాలి.

ఎక్కడ సమర్పించాలంటే..

జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలోని అధికారులకు కాని, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని గానీ కలిసి నకళ్లను సమర్పించాలి. అధికారులు వాటిని పరిశీలించి, విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు.

హెచ్చెల్సీకి
నీరు బంద్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలువకు కేటాయించిన నీటి వాటా పూర్తి కావడంతో జలాశయం వద్ద గురువారం సాయంత్రం హెచ్చెల్సీకి గేట్లు దించి నీటిని బంద్ చేశారు. గురువారం సాయంత్రం నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసినట్లు జలాశయం ఎస్ఈ నారాయణనాయక్ తెలిపారు. నీటిని సరఫరాను నిలిపివేయడంతో హెచ్చెల్సీ కింద మిరప సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెలాఖరు వరకు నీరు ఇస్తే తప్ప గట్టెక్కే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో 5 వేల ఎకరాలు, ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో జీబీసీ కింద 25 వేల ఎకరాల వరకు మిరప పంట సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని నీటిని విడుదల చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

వేమన జయంత్యుత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు

కదిరి, గాండ్లపెంట, న్యూస్‌టుడే: ప్రజాకవి వేమన జయంతిని రాష్ట్ర పండగగా జరిపేలా ప్రభుత్వం నిర్ణయం చేసింది. అధికార హోదాలో ఈనెల 19న కటారుపల్లిలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వీవీఎస్‌శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కదిరిలో వేడుకల లోగోను స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

● వేమన విహారానికి రంగులు, దెబ్బతిన్న ప్రాకార నిర్మాణం, బస చేసేందుకు గదులకు మరమ్మతు చేస్తున్నారు. ముందుభాగాన్ని పచ్చిక, మొక్కలతో అందంగా మారుస్తున్నారు. ఉత్సవానికి హాజరయ్యే జనానికి భోజనాలు, వాహన పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులతో పద్యగానం, నాటిక, గానకచేరి నిర్వహించనున్నారు.

వేదవతి హగరిపై వంతెనకు మోక్షం

రూ.6 కోట్ల పీఆర్ నిధులతో నిర్మాణం

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు-మాల్యం నడుమ వేదవతి హగరిపై రూ.6 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే భూమిపూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. వేదవతి హగరిపై రాకపోకలు సాగించేందుకు 60 ఏళ్లుగా వంతెన నిర్మాణానికి నోచుకోలేదు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని విన్నవించిన మేరకు.. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రూ.54 కోట్లతో వేదవతి హగరిపై రెండు వంతెనలు సాకారం కానుండటం శుభ పరిణామం. రూ.48 కోట్లతో హెచ్చెల్సీ వంతెనకు సమాంతరంగా నిర్మించే ర.భ. వంతెన పనులు ఏడాది కిందటే ప్రారంభమయ్యాయి. రూ.6 కోట్లతో 7.5 మీటర్ల వెడల్పు, 230 మీటర్ల పొడవైన వంతెన నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నారు. ఇది పూర్తయితే రాయదుర్గం-ఉరవకొండ నియోజకవర్గాల మధ్య రాకపోకలకు కష్టాలు తీరనున్నాయి.

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం

గత ప్రభుత్వం వేదవతి హగరిపై వంతెనల నిర్మాణాలకు నిధుల మంజూరులో ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శించింది. మాల్యం రోడ్డులో హగరిలో రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేసి ఆర్భాటపు ప్రచారం చేసుకొంది. 2021లో వేదవతి హగరికి పోటెత్తిన వరద దాటికి కోతకు గురై రోడ్డు ఆనవాళ్లు లేకుండా కొట్టుకొని పోవడంతో ప్రజాధనం గంగపాలైంది. గత ఐదేళ్లుగా వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచింది. త్వరలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శంకుస్థాపన చేయనున్నారని పీఆర్ డీఈ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు.

వారధి నిర్మించే ప్రదేశం

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా...



ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు

ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లి పందిరి', ఆర్యవైశ్య అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం|| నుంచి సాయంత్రం 5.30 గం|| వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91543 66099, 91547 72006 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చు.

వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలిపిన వాట్సప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్ యాప్ ద్వారా చేసుకోవచ్చు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి(శనివారం)ఉదయం ఆరు గంటలకు ఉంటుంది. 6.45 గంటల నుంచి 8.45 గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. తర్వాత 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

అంతరించిపోతున్న కళలకు జీవం పోయాలి

ప్రసంగిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఏ ఉద్యోగానికైనా పదవీ విరమణ ఉంటుందని, కళలకు, కళాకారులకు ఉండదని, దేశంలో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు పేర్కొన్నారు. గోరంట్లకు చెందిన విశ్వంభర కల్చరల్ సొసైటీ, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌లో చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి అధ్యక్షతన శుక్రవారం పారంభించిన రెండురోజుల గోరంట్ల కళోత్సవం కార్యక్రమంలో మొదటరోజు సినీదర్శకుడు ముఖ్య అతిథిగా పాల్గొని పలు విషయాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంప్రదాయాలు, కళలు, సంస్కృతిని ప్రేమిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు అలవాటు చేయాలని అప్పుడే పదికాలలపాటు జీవిస్తాయన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగపు ఆచార్యులు గుండ్లూరు బాలసుబ్రమణ్యం, సినీ నిర్మాత జీఎంసురేష్, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేఖర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, సుధాకరరెడ్డి ముఖ్యఅతిథులుగా పలువిషయాలను తెలియపరిచారు. సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి నాగభూషణ, పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కీలుగుర్రం, పులివేషం, జానపద గీతాలు, కూచిపూడి నృత్యం అలరించాయి. శనివారం మరికొన్ని కళల ప్రదర్శనతో రెండు రోజుల కార్యక్రమాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

20 నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారి కోసం జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. పాల్గొనే వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీబీ జీ రామ్‌జీ పథకంతో విప్లవాత్మక మార్పులు

మాట్లాడుతున్న రాష్ట్ర భాజపా ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, శ్రీనివాసులు, రాజేష్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం స్థానంలో కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ గ్రామీణ పథకంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ తెలిపారు. కొత్తగా రూపొందించిన ఈ చట్టంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతాయని వెల్లడించారు. ఉపాధి పనిదినాలను వంద నుంచి 125కు పెంచడమే కాకుండా ప్రజల జీవనోపాధులు మెరుగు పర్చి ఆస్తులను సృష్టించడానికి వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి జరగడమే కాకుండా కూలీలకు మెరుగైన వేతనాలు అందుతాయన్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకంతో ప్రజల జీవన విధానాల్లో మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.రాజేశ్ మాట్లాడుతూ.. కోట్ల మంది ప్రజలకు కొత్త పథకంతో ఎంతో మేలు జరగడమే కాకుండా అవినీతి అక్రమాలు పూర్తిగా నిర్మూలన చేయవచ్చని పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

సంక్రాంతి స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Penukonda Near KIA Car-Factory, Madakasira Highway 50x100 (4 Nos) Sites for Sale Resi Converted, Gated Community, 499/- PSft. Call: 8310681025.

హిందూపురంలో కిరికెర ఇంద్రప్రస్థ లేఅవుట్ ఎదురుగా Saz Gardensలో ప్లాట్స్ కలవు. Ready to Registration సం: 8143917999.

ATP కదిరి రోడ్‌కి విన్సెంట్ డిపాల్ స్కూల్ ఎదురుగా రోడ్ నుంచి 3వ బిట్ AHUDA అప్రూవ్డ్, ఉ: 40 అ||లరోడ్, ద: 30 అ||ల రోడ్, కార్నర్ 10 సెంట్ల ప్లాట్ అమ్మబడును. 9581196786

JOBS

ATP క్యూర్ కైరో ప్రాక్టిక్ సెంటర్ నందు మసాజర్లుగా పనిచేయడానికి స్త్రీలు, పురుషులు కావలెను. # 2-224, 4వ క్రాస్, 2వరోడ్, ATP. Cell 7780544424

మయూరిటైల్స్ & శానిటరీ షోరూంలో పనిచేయుటకు అనుభవంకల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (మేల్) కావలెను. జీతం: 16,000/- + ఇన్సెంటివ్స్. బళ్లారిరోడ్, సాయిబాబాగుడి దగ్గర, ATP. 9848189744.

FACULTY/ TEACHERS

Junior & Senior Lecturers in Maths, Physics, Chemistry, Botany, Zoology, English, Sanskrit Anantapur. Cell: 6302037812

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఏడేళ్ల కష్టం.. నెరవేరిన వేళ!

ముస్లింలకు న్యాయం చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

క్షీరాభిషేకం అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముస్లింలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ముస్లింలకు పవిత్రమైన జామియా మసీదు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే బాలకృష్ణ 2018లో రూ.2.5 కోట్లు మంజూరు చేయించారు. నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అయితే 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు ఇవ్వకుండా వేధించింది. బాలకృష్ణ చొరవతో ఎట్టకేలకు ఏడేళ్ల తరువాత బిల్లు మంజూరైంది. రూ.1.37 కోట్లు సొమ్ము శుక్రవారం ఖాతాలో జమ కావడంతో పట్టణంలోని ముస్లిం సోదరులు శుక్రవారం బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిగిలిన సొమ్ము త్వరలో మంజూరవుతుందని నాయకులు పేర్కొన్నారు.

వైభవం... చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

చౌడేశ్వరిదేవి మూలవిరాట్

ఆకట్టుకున్న వేషధారణ

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలో చేనేత వర్గాలైన దేవాంగులు, తొగటులు శుక్రవారం చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత దేవాంగులు రెండు, తొగటులు పంచమ జ్యోతుల ప్రదర్శన చేపట్టారు. జ్యోతులను తలపై పెట్టుకుని భజన గీతాలకు నృత్యాలు చేస్తూ ముందుకు కదలారు. దారి పొడవునా భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, జ్యోతులను దర్శించుకున్నారు. ఉత్సవంలో ప్రత్యేక వేషధారణల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఐదేళ్లకోసారి జరిగే ఈ జ్యోతుల ఉత్సవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, డీసీసీ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉరగాద్రి ఆలయ ఛైర్మన్ కొత్త శరత్ పాల్గొన్నారు.

పంచమ జ్యోతులతో తొగటుల ప్రదర్శన

పురం వాసికి ఇండియన్ ఐకాన్ అవార్డు

రామచంద్ర

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం కిరికెర పంచాయతీలోని సెరికల్చర్ కాలనీకి చెందిన కరాటే గ్రాండ్ మాస్టర్ ఎ.రామచంద్ర ఇండియన్ ఐకాన్ అవార్డుకు అర్హత సాధించారు. కరాటే శిక్షకుడిగా, వివిధ రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి ఇటీవల గిన్నీస్ వరల్డ్ రికార్డుగా నిలిచిన ఇతడిని ఎంపిక చేసినట్లు హైదరాబాద్‌లోని రుద్ర బెస్ట్ హెల్పింగ్ ఫౌండేషన్ వారు తెలియజేశారు. గణతంత్రదినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఈనెల 25న నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేస్తారు.

నిప్పు పెట్టిన కేసులో ముగ్గురి అరెస్ట్

అఖిల్‌ను తీసుకెళుతున్న పోలీసులు

కమలానగర్, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారు జాతీయ రహదారి సమీపంలో ఉన్న నంబూరి వైన్స్, మద్యం దుకాణానికి నిప్పు పెట్టిన కేసులో ముగ్గురిని నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జగదీష్ వివరాల మేరకు... ఈ నెల 12న సాయంత్రం అఖిల్, బాబాఫక్రుద్దీన్ మద్యం కొనుగోలు చేయటానికి వెళ్లారు. ఫోన్ పే చేసే క్రమంలో డబ్బులు రాలేదని సిబ్బంది చెప్పటంతో నిఖిల్ గొడవకు దిగి అక్కడ గాజు అద్దాన్ని పగలగొట్టారు. 13న తెల్లవారు జామున మద్యం దుకాణంలో మంటలు చెలరేగి 4 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు, సామగ్రి కాలిపోయినట్లు మద్యం దుకాణం యజమాని నంబూరి వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు వ్యక్తులు వచ్చి మద్యం దుకాణానికి నిప్పు పెట్టినట్లు సీసీటీవీలో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులకు అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మరుసటి రోజు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా మోహన్‌ను అరెస్ట్ చేశారు. మోహన్ తమ్ముడు అఖిల్, అతని మిత్రుడు బాబాఫక్రుద్దీన్ ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరూ పరారీలో ఉండటంతో వారి ఇంటికి వెళ్లి పోలీసులు నోటీసులు అందించి ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అఖిల్, బాబాఫక్రుద్దీన్ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు వారిని స్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

జీడిపల్లి జలాశయంలో చేపల వేట నిషేధం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : బెళుగుప్ప మండలం జీడిపల్లి జలాశయం రామసాగరం, జీడిపల్లి, అంకంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. జలాశయం మత్స్యశాఖ ఆధీనంలో ఉంది. చేపల వేలం పాటలు ఏటా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఈనెల 7 నుంచి జూన్ 30 వరకు చేపల వదలడం కానీ, చేపలు పట్టడం కానీ పూర్తిగా నిషేధించినట్లు జీడిపల్లి జలాశయం పరిసర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులకు పీఏబీఆర్ మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) డి.పెద్దబాబు నాయక్ తెలిపారు. ఆరునెలలపాటు నిషేధం అమలులో ఉంటుందని, నిబంధన అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో హెచ్చరించారు.

దంపతులపై యువకుల దాడి

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరసింగప్ప తదితరులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద పరిగి మండలం గొల్లపల్లికి చెందిన ఆరుగురు యువకులు గురువారం ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ, ముందు చక్రాలను పైకి ఎత్తి విన్యాసాలు చేశారు. ఓ వాహనం అదుపు తప్పడంతో మధు అనే యువకుడు కింద పడ్డాడు. అదే సమయంలో వారికి ఎదురుగా ద్విచక్ర వాహనంలో కొల్లకుంట చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు వెళుతున్నారు. వారు వాహనాన్ని ఆపి యువకులను మందలించి హితవు పలికారు. మాకు ఎదురు చెబుతావా అని యువకులు చంద్రశేఖర్‌రెడ్డిని కొట్టారు. రహదారి పక్కన ఇళ్ల వద్ద ఉన్న గ్రామస్థులు, బస్టాండ్‌లో ఉన్నవారు గమనించి దాడిని అడ్డుకొన్నారు. మద్యం మత్తులో ఉన్న యువకులు వారిపైన తిరగబడ్డారు. అయితే మరి కొంత మంది రావడంతో మధు మినహా మిగిలిన ఐదుగురు పరారయ్యారు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చి, మధు అనే యువకుడిని చితకబాది, అతడిని, ద్విచక్ర వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. అయితే ఇది వివాదంగా మారడం గమనార్హం.

నిర్లక్ష్యంగా నడిపితే కఠిన చర్యలు

వాహనాలు అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హిందూపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ నరసింగప్ప శుక్రవారం హెచ్చరించారు. గురువారం దాడులకు దిగిన యువకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజగోపాల్ నాయుడు, ఎస్సై శ్రీధర్‌లతో కలిసి సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వారంతా మద్యం తాగినట్లు పరీక్షల్లో తేలిందని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగేది లేదని కఠిన చర్యలు తీసుకొంటామని ప్రకటించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని సూచించారు. బైక్ రేసింగ్‌లు చేసే వారిపై నిఘా ఉంచామని హెచ్చరించారు.

పండగ పూట విషాదం

మేనత్త ఇంటికి వెళ్తూ యువకుడి దుర్మరణం

నవీన్‌కుమార్‌రెడ్డి

లేపాక్షి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ పూట మేనత్త, ఇతర బంధువులతో కలిసి సంతోషంగా గడపాలని కలలుగన్న ఆ యువకుడిపై విధి చిన్నచూపు చూసింది. మరో 10 నిమిషాల్లో గమ్య స్థానానికి చేరుకునేలోపే మార్గమధ్యలో జింక రూపంలో వచ్చిన మృత్యువు యువకుడి కుటుంబంలో విషాదం నింపింది. హృదయ విదారక సంఘటనకు సంబంధించి వివరాలిలా.. పరిగి మండలం ముళ్లమోతుకపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి(32) బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సంక్రాంతి పండగ కావడంతో స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో సరదాగా గడిపిన అతను మధ్యాహ్నం లేపాక్షి మండలం కొండూరులో ఉన్న మేనత్త బసమ్మ, బంధువులతో కలిసి గడపాలని ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మరో 10 నిమిషాల్లో మేనత్త ఇంటికి చేరుకునేలోపే విధి చిన్నచూపు చూసింది. మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో జింక అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి యువకుడు కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. యువకుడి మరణవార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు యువకుడి తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు.

విద్యుదాఘాతంతో బేకరీ దగ్ధం

రూ.40 లక్షల ఆస్తినష్టం

బేకరీ నుంచి సామగ్రిని వెలికితీస్తున్న జేసీబీ

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అజయ్ బేకరీ దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధమైంది. షాపు నుంచి తెల్లవారుజామున పొగలు వస్తుండటంతో పోలీసులు యజమాని అజయ్‌కు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని దుకాణ షటర్లను జేసీబీతో తొలగించి మంటలను అదుపులోనికి తీసుకొచ్చారు. అప్పటికే బేకరీలోని సామగ్రి, యంత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి బేకరీ భవనం దెబ్బతింది. రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని అజయ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు సుధాకర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపుతామని చెప్పారు.

రూ.30లక్షల బంగారం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

పట్టుబడిన ఆభరణాలు, నిందితులను చూపుతున్న డీఎస్పీ నరసింగప్ప, సిబ్బంది

పెనుకొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గోరంట్ల, సోమందేపల్లి, పెనుకొండ, పరిగి మండలాల పరిధిలో 2024 నుంచి 2026 మధ్య తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ.. శుక్రవారం గోరంట్ల మండలంలోని పాలసముద్రం కూడలి వద్ద షికారి శాలి, కోటయ్యలు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులైన అన్నదమ్ములిద్దరూ ప్రస్తుతం రామగిరి మండలంలోని పేరూరు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. వారి వద్ద నుంచి రూ.30లక్షలు విలువ చేసే 282 గ్రాముల బంగారం, 371గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని వివరించారు. నిందితులు పలుచోట్ల నివాసం ఉంటూ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఇళ్ల యజమానులు ఎవరైనా కొత్తవారు ఇంటి అద్దెకోసం వస్తే వివరాలు తెలుసుకుని ఇళ్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనపడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేసులో కీలకపాత్ర పోషించిన గోరంట్ల సీఐ శేఖర్, సీసీఎస్ సీఐ ఆర్వీ.సతీశ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన వివరించారు.

దాడి కేసులో వైకాపా నాయకులకు కౌన్సెలింగ్

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని పోట్లమర్రిలో బుధవారం వైకాపా నాయకులు తెదేపా నాయకుడు ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. గ్రామ సమీపంలోని చెరువులో వైకాపా నాయకులు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. అనంతరం వాటిని విడిపించుకున్న వైకాపా నాయకులు తమ వాహనాలను పోలీసులకు పట్టించినది తెదేపా నాయకుడు నాగరాజే అని నిర్ధారించుకున్నారు. అనంతరం ఆయన ఇంటిపై వైకాపా నాయకులు చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జ్ఞానేంద్రరెడ్డి దాడి చేశారు. ఇంటిలో ఉన్న చంద్రశేఖర్, తల్లి నాగలక్ష్మి, నాగజ్యోతిలను గాయపరిచారు. దాడికి పాల్పడిన వైకాపా నాయకులు ఏడుగురికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. విచారణ అనంతరం ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్ తెలిపారు.

జూదం ఆడుతున్న ఉద్యోగులు, కానిస్టేబుళ్లు అరెస్ట్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జూదం ఆడుతుండగా శుక్రవారం దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐ గణేష్ తెలిపారు. పట్టుబడిన వారిలో 8 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.26,180 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చుక్కలూరు గ్రామ సమీపంలో...

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి జూదం శిబిరంపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో శివమద్దిలేటి, నాగేంద్రుడు, మధుపాల్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.55,100లు రెండుకార్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఎస్సై ధరణిబాబు పాల్గొన్నారు.

మరదలిని హత్య చేసిన బావ

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మరదలిని బావ హత్య చేసిన సంఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన పవన్‌కుమార్(25)కు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి ఎల్లమ్మబండ సమీపంలోని శ్రీరామచంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు ఓ టింబర్ డిపోలో పనిచేస్తూ, చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు జరగడంతో భార్య పిల్లలతో సహా వెళ్లిపోయింది. అయితే పవన్‌కుమార్ అతని మరదలితో(17) ప్రేమాయణం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బాలిక అతను ఉంటున్న ఇంటికి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య గొడవ జరగడంతో సుత్తితో ఆమె తలపై బాది బయటకు వెళ్లిపోయాడు. తీవ్రగాయాలపాలైన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం సాయంత్రం పవన్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా బాలిక చనిపోయి ఉండటాన్ని గమనించి పరారయ్యాడు. ఈ మేరకు ఇంటి యజమాని ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడి బలవన్మరణం



తిప్పన్న

పెనుకొండ, న్యూస్‌టుడే: రొద్దంలోని ఎస్సీ కాలనీకి చెందిన తిప్పన్న(65) అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది గురువారం సాయంత్రం పెనుకొండ శివారులోని రాజేశ్వరీ కాలనీ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి వివరాలు సేకరించి మృతదేహాన్ని శవపరీక్షల కోసం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: పుట్టగూర్లపల్లిలో మహిళ శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని పరిగి ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. వివరాలిలా.. పుట్లగూర్లపల్లి గ్రామానికి చెందిన జ్యోతి(23) కర్ణాటక రాష్ట్రం మిడిగేసికి మండలం తాడికి చెందిన నాగార్జునతో మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్తతో ఉన్న విభేదాల కారణంగా జ్యోతి ఈ నెల 14న పుట్టింటికి వచ్చింది. మనస్తాపంతో ఇంట్లో జ్యోతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

(c) eenadu

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

నేత్రాల దానం.. మరొకరికి వెలుగు

శ్రీనివాసమూర్తి ఫౌండేషన్‌కు నేత్రాలు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

హిందూపురం సాంస్కృతికం: పట్టణంలోని బీటీ కాంపౌండ్‌కు చెందిన శ్రీలక్ష్మి అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేసే మరొకరి కళ్లలో వెలుగులు చూడవచ్చన్న శుభ సంకల్పంతో కుటుంబసభ్యులు స్థానిక కేవీ శ్రీనివాసమూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు జయంతి, సులేకలకు అందజేశారు. వారు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఉన్న డా. రాజ్‌కుమార్ నేత్రాలయానికి అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: పాత కూరగాయల మార్కెట్ నుంచి గాంధీ సర్కిల్ వరకు వ్యర్థపదార్థాలు పేరుకుపోయాయి తొలగించండి. **-ప్రవీణ్‌కుమార్**
పరిష్కారం: కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. **-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం**
-న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్య: కేసీపల్లి బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-లోకేశ్**
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం. **-లక్ష్మీదేవమ్మ, సర్పంచి, కేఎన్‌పల్లి**
సమస్య: మండలపల్లి కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **-ఇబ్రహీం**
సమాధానం: హరితరాయబారులతో తొలగిస్తాం. **- అశ్వర్థ, సర్పంచి, మండలపల్లి**
సమస్య: దేవరహళ్లి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు లేవు. **-అశ్వర్థనారాయణ**
సమాధానం: మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **-సతీశ్‌బాబు, సర్పంచి, దేవరహళ్లి**
సమస్య: మండలపల్లి బీసీ కాలనీలో కుళాయిల్లో నీరు సక్రమంగా రావడం లేదు. **-ఈరక్కాతప్ప**
సమాధానం: సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తాం. **- అశ్వర్థ, సర్పంచి, మండలపల్లి**
- న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: కదిరేపల్లి బీసీ కాలనీ వీధుల్లో మురుగు ప్రవహిస్తోంది. **- రంగధామప్ప**
సమాధానం: హరితరాయబారులతో శుభ్రపరుస్తాం. **- నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి**
సమస్య: భీమరాయునిపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-నరసింహప్ప**
సమాధానం: రెండు మూడు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి**
-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

సమస్యలు పరిష్కారం

స్పందనకు వందనం

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించగా సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు స్పందించారు. మదిగుబ్బలో సర్పంచి లక్ష్మీనారాయణ, గుడిబండలో ఎంపీడీఓ నాగరాజునాయక్, ఉప్పార్లపల్లిలో సర్పంచి నారాయణప్ప వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మద్దనకుంట బీసీ కాలనీలో కార్యదర్శి అమరేశ్ కుళాయిలకు నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎన్‌ఆర్ రొప్పం ఎస్సీకాలనీలో సర్పంచి లక్ష్మీనారాయణ మురుగు నీరును తొలగింపజేశారు. దాసరపల్లి ఇందిరమ్మకాలనీలో పంచాయతీ కార్యదర్శి కలందర్‌బాషా తాగునీటి సమస్య పరిష్కరించారు. దీంతో ఈనాడుకు స్పందించిన బాధ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూపురం సాంస్కృతికం: సిటీయూనియన్ బ్యాంకు పక్క వీధిలోని చెత్త, వ్యర్థపదార్థాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ధరల్లో వ్యత్యాసం.. పాడి రైతులకు అన్యాయం

గుడిబండ మండలం పీఎన్‌పాళ్యంలో డెయిరీకి పాలుపోస్తున్న రైతులు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: పాడి పెంపకాన్నే ప్రధాన జీవనాధారంగా వేల కుటుంబాలు ఎంచుకున్నాయి. రోజు ఉదయం, సాయంత్రం పాలను డెయిరీలకు వేసుకుని ఆదాయం పొందుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో హాట్సన్ కంపెనీ నియోజకవర్గ కేంద్రమైన మడకశిర, అమరాపురం మండలం హాలుకూరులో మిల్క్ చిల్లింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. మడకశిర చిల్లింగ్ సెంటర్‌కు మడకశిర, రొళ్ల, గుడిబండ మండలంలోని పలు గ్రామాల్లో పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి పాలను సేకరిస్తున్నారు. హాలుకూరు సెంటర్‌కు అమరాపురం, గుడిబండ, అగళి మండలాల్లోని పలు గ్రామాల్లోని కేంద్రాల ద్వారా పాలను సేకరిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు ఆరువేల మంది రైతులు 20వేల లీటర్ల పాలను ఈ డెయిరీకి పోస్తున్నారు. హాలుకూరు, మడకశిర చిల్లింగ్ కేంద్రాలలో ధరలలో వ్యత్యాసంగా ఇస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

ఒకే కంపెనీ ఒక్కోచోట ఒక్కోలా..

మడకశిర చిల్లింగ్ సెంటర్‌కు వేసే రైతులకు ఆవు పాలకు ఎస్‌ఎన్‌ఎఫ్, ఫ్యాట్ ఆధారంగా లీటరుకు రూ.30 నుంచి రూ.40లోపు, గేదె పాలకు రూ.35 నుంచి రూ.45 మాత్రమే ఇస్తున్నారు. అదే హాలుకూరు చిల్లింగ్ సెంటర్‌కు వేస్తే ఆవు పాలకు రూ.48 వరకు ఇస్తున్నారు. గేదె పాలకు రూ.45 నుంచి రూ.55వరకు ఇస్తున్నారు. ఇలా ధరలలో వ్యత్యాసంగా ఇస్తుండడంతో నష్టపోతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సగం బిల్లు పెంపకానికే సరిపోతుంది

మాకు నాలుగు పాడి ఆవులున్నాయి. ఉదయం 20 లీటర్లు సాయంత్రం 20 లీటర్లు మద్దనకుంట పాల సేకరణ కేంద్రానికి పోస్తున్నాం. లీటరుపై రూ.30 నుంచి రూ.40లోపే ధర ఇస్తున్నారు. ఈ ధరలతో గిట్టుబాటు కావడం లేదు. ఒక్కోపాడి ఆవుకు గడ్డి, దాణా, మందులు ఇతరత్రా రూ.6వేల వరకు వస్తుంది. ప్రతి నెలా 1200 లీటర్ల పాలువేస్తున్నాం. సగం డబ్బు ఖర్చులకే సరిపోతోంది. ఇలాగైతే జీవనం కష్టసాధ్యంగా ఉంటుంది. రూ.50లపైబడి ధర కల్పించి న్యాయం చేయాలి. **-దర్శన్, పాడి రైతు, మద్దనకుంట, గుడిబండ మండలం**

ధరలు పెంచి ఇస్తాం

త్వరలో హాలుకూరు చిల్లింగ్‌కేంద్రంలో ఇచ్చే మాదిరిగానే మడకశిర కేంద్రంలో కూడా ధరలు పెంచి రైతులకు ఇస్తామని తెలిపారు.
-రజని, హాట్సన్ మేనేజరు, హాలుకూరు

చౌడేశ్వరిదేవికి జ్యోతుల ఉత్సవం

జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, డప్పుల మోత, కళాకారుల నృత్య ప్రదర్శనల నడుమ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ, పూజలు చేపట్టారు. అనంతరం వివిధ రకాల జ్యోతులను తలపై ఉంచుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. మహోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులందరికి ఆలయ కమిటీ వారు భోజనవసతి కల్పించారు. ఆలయ ధర్మకర్త బీరే వేణుగోపాల్, కౌన్సిలర్ రామచంద్ర, ట్రెజరర్ మంజునాథబాబు, సభ్యుడు రమేశ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవం... పాండురంగడి గ్రామోత్సవం

ముద్దిరెడ్డిపల్లిలో శ్రీరుక్మిణీపాండురంగస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, (అంతరచిత్రంలో) ఉత్సవ విగ్రహాలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ముద్దిరెడ్డిపల్లి పాతూరులోని శ్రీరుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం రాత్రి వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

సోమందేపల్లి: సంక్రాంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గీతానగర్‌లో చౌడేశ్వరి దేవి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి కాలనీలోని విజ్ఞాన్ పాఠశాల వద్ద అమ్మవారి ఉత్సవ ప్రతిమను ఉంచి.. జ్యోతి కమిటీ సభ్యులు, వాలంటీర్లు నృత్యం చేశారు.

సోమందేపల్లి: గీతానగర్‌లో తెదేపా నాయకులు

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు

అంబేడ్కర్ సర్కిల్‌కు కుడివైపు చివర్లో కొన్నిరోజుల క్రితం నీటి పైపుల మరమ్మతులకు మున్సిపల్ సిబ్బంది గుంతను తవ్వారు.. పైపుల మరమ్మతు పూర్తి చేసినా ఇప్పటివరకు పూడ్చలేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

ముక్కుమూసుకుంటేనే ప్రయాణం

మల్లసముద్రంలో రెండు వారాల క్రితం మారెమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల అనంతరం భోజనం చేసిన ప్లాస్టిక్ ప్లేట్లను, వ్యర్థాలను కంఠీపురం వెళ్లే రోడ్డు పక్కనే పడేశారు. వాటిని తొలగించకపోవడంతో అటువైపు ప్రయాణం చేసే చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ సత్వరమే హరితరాయబారుల ద్వారా తొలగించి శుభ్రపరుస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

ట్యాంకున్నా నీరు రాదు

బీటీపల్లిలో ఉపరితల నీటి ట్యాంకు అలంకార ప్రాయంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ ట్యాంకుకు నీరు నింపి సరఫరా చేయకపోవడంతో వృథాగా మారింది. ఈ విషయమై సర్పంచి రంగస్వామి మాట్లాడుతూ నీరు నింపి సరఫరా చేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, గుడిబండ

కూలిపోయి మూడు నెలలైంది

అమరాపురం ఉన్నత పాఠశాల వెనకవైపు ప్రహరీ గోడ మూడు నెలల క్రితం కొంత భాగం కూలిపోయింది. దాన్ని నిర్మించకపోవడంతో ఆవరణలోకి పశువులు, పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఈ విషయమై ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో నిర్మాణం చేపట్టేలా చూస్తామన్నారు.
–న్యూస్‌టుడే, అమరాపురం

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

రొద్దం : ముగ్గుల పోటీల్లో మహిళలు

సంక్రాంతి సంబరాలను మూడు నియోజకవర్గాల్లోని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. హరిదాసు వేషధారణతో ఆయా వీధుల్లో హరినామ సంకీర్తనాలతో అలరించాయి. రంగురంగుల ముగ్గుల పోటీలు జరిగాయి. గెలుపొందిన మహిళలకు నగదు బహుమతులు అందజేశారు. ప్రతి ఇంటా పిండివంటలు చేసుకొని కుటుంబ సమేతంగా సంబరంగా గడిపారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ గోరంట్ల మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన ప్రపంచబ్యాంక్ విశ్రాంత ఉద్యోగి రఘువీర్‌శర్మ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు గురువారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. –న్యూస్‌టుడే బృందం

గోరంట్ల: నగదు బహుమతి అందజేస్తున్న సావిత్రమ్మ, చిత్రంలో రఘువీర్‌శర్మ

గౌడనకుంటలో ఆటలపోటీలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా మంత్రి సవిత జన్మదిన వేడుకలు

పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత జన్మదిన వేడుకలను గురువారం తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి పంచిపెట్టారు. ఆసుపత్రుల్లో రోగులకు రొట్టెలు పంచిపెట్టారు. కొన్ని చోట్ల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మంత్రి సవిత కుటుంబసభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి జన్మదినం సందర్భంగా అరుణాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు, గిరిప్రదక్షణలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తెదేపాజిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప, పార్టీశ్రేణులు అరుణాచలంలో మంత్రిని కలసి సత్కరించారు.
–న్యూస్‌టుడే, పెనుకొండ, గోరంట్ల, రొద్దం, సోమందేపల్లి, పరిగి

అరుణాచలంలో మంత్రిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప, తదితరులు

సోమందేపల్లి: ఎన్టీఆర్ కూడలిలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, న్యూస్‌టుడే: వానవోలు గ్రామానికి చెందిన మహేష్ శుక్రవారం విషపూరిత ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్సలు చేసి హిందూపురం పంపించారు. గ్రామంలోని ప్రైవేటు డెయిరీలో కొంతకాలం పనిచేశాడు. అందుకు సంబంధించి రావాల్సిన బకాయిపై శుక్రవారం వివాదం జరిగింది. దీంతో మనస్తాపం చెంది అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వినాయక నగర్‌లో గురువారం రాత్రి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. పలువురు జూదం ఆడుతున్నట్లు స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.15,200 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మల్లసముద్రం వద్ద ఐదుగురు..

రొళ్ల: మండలంలోని మల్లసముద్రం ప్రాంతంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గౌతమి తెలిపారు. వారి నుంచి రూ.5,280 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

లేపాక్షి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని కోడిపల్లిలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 7 జట్లు పాల్గొనగా ఛత్రపతి శివాజీ జట్టు విజేతగా, లోకల్ బాయ్స్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.5వేలు, రన్నరప్ జట్టుకు రూ.3వేలు నగదు ప్రోత్సాహకం అందించారు.

క్రికెట్ విజేత వెంకటాపురం జట్టు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని సి.వెంకటాపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాలతో తెదేపా మండల కన్వీనర్ అభిలాష్ ఆధ్వర్యంలో బాలయ్య ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీలకు మండల వ్యాప్తంగా 15 జట్లు పాల్గొనగా గురువారం వెంకటాపురం, నాగేపల్లి జట్ల మధ్య తుదిపోరు జరిగింది. వెంకటాపురం జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.20వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.10వేలతో పాటు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ మాలక్క, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాగేచెరువు జట్టు గెలుపు

రొద్దం, న్యూస్‌టుడే : పెద్దగువ్వలపల్లి గ్రామంలో మకర సంక్రాంతి సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య తనయుడు సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మాగేచెరువు జట్టు విజయం సాధించింది. కల్లుకుంట జట్టు రన్నర్‌గా, మూడోస్థానంలో పెద్దగువ్వలపల్లి జట్టు నిలిచింది. విజేత జట్టుకు చిన్నప్పయ్య కప్ అందజేశారు.

విజేత జట్టుకు సీల్డ్ అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య

నేడు బీచిగానపల్లిలో మంత్రి పర్యటన

కొడిగెనహళ్లి(పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని బీచిగానపల్లి నుంచి పాత్రగానపల్లి వరకు రూ.80లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత భూమి పూజ చేయనున్నట్లు సర్పంచి బాలాజీ, తెదేపా మండల కన్వీనర్ ఎస్‌ఎన్.గోవిందరెడ్డిలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: అఖిల భారత బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మాయావతి పుట్టిన రోజు వేడుకలను హిందూపురంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరాములు మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌కు మాయావతి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి అనేక సేవలు అందించారన్నారు. పార్టీని బలోపేతం చేస్తూ గ్రామ, పట్టణ, నగర ప్రాంతాలకు విస్తరించి బహుజనులకు రాజ్యాధికారం రావాలన్నదే లక్ష్యంగా తీవ్ర కృషి చేస్తోందన్నారు.

భారత సైన్యం ఎంతో శక్తివంతమైనది

సోమందేపల్లి, న్యూస్‌టుడే: భారత జాతీయ సైనిక దినోత్సవాన్ని సోమందేపల్లి జడ్పీ పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, యువకులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ జెండాను చేతబూని గ్రామ వీధుల్లో ప్రదర్శన చేపట్టారు. ప్రపంచ దేశాల్లో భారత సైన్యం ఎంతో శక్తివంతమైందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ అధికారి రమేశ్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు పరంధామ, యువకులు మారుతి, పురుషోత్తం, పవన్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లతో అధికారి రమేశ్, పలువురు యువకుల ప్రదర్శన

పల్లా నరసార్యుల ఆరాధనోత్సవం

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: ముద్దిరెడ్డిపల్లిలో జీవసమాధి అయిన పండరీపురం శ్రీపాండురంగస్వామి నామాంకితులు పల్లా నరసార్యుల 50వ ఆరాధనోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిష్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంకీర్తనలు, విశేషాలంకరణ సేవలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

హిందూపురం సాంస్కృతికం : పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో నిత్యం చెత్త, వ్యర్థ పదార్థాలను శుభ్రం చేస్తున్న కార్మికులకు శుక్రవారం 'పురం' రోటరీ క్లబ్ సభ్యులు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సుమంత్, అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన సీపీఎం మండల కార్యదర్శి

సోమందేపల్లి: సీపీఎం మండల కార్యదర్శి రంగప్ప గురువారం సీపీఐలో చేరారు. సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మండల కార్యదర్శి రాజగోపాల్, సభ్యుడు శ్రీకాంత్‌లు రంగప్ప, ఆయన భార్య కళావతికి కండువాలు వేసి పార్టీలోకి చేర్చుకొన్నారు.

నిర్మాణ లోపం.. ప్రయాణికులకు శాపం

సోమందేపల్లి పంచాయతీ పరిధిలోని చాకర్లపల్లి పాతూరులోని రైల్వే భూగర్భ వంతెన వద్ద వర్షపు నీరు నిలిచి వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామంలోని రహదారులు-భవనాల శాఖ ప్రధాన రహదారిపై తరచూ రైళ్ల రాకపోకల కారణంగా 5 నుంచి 10 నిమిషాల వరకు గేటు మూసి వేస్తుండటంతో అత్యవసరంగా భూగర్భ వంతెన కింద ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి రైల్వే శాఖ అవకాశం కల్పించింది. అయితే వంతెన వద్ద వర్షపు నీరు పూర్తిస్థాయిలో బయటకు వెళ్లడం లేదు. దీంతో కొంతకాలంగా నీరు నిలిచిపోయి పాచిపట్టి అపరిశుభ్రంగా మారుతున్నాయి. పొలాలకు వెళ్లడానికి గ్రామ రైతులు, కూలీలు ఇక్కట్లకు గురవుతున్నారు. నీటిలో రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, చోదకులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సోమందేపల్లి.

చాకర్లపల్లి రైల్వే భూగర్భ వంతెన వద్ద నిలిచిన నీరు

యువత మత్తుకు బానిస కారాదు

హిందూపురం గ్రామీణం : నేటి యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. అఖిల భారత యువజన సమైక్య జిల్లా నిర్వాహక కార్యదర్శి కమల్‌బాషా అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన యువతా మేలుకో.. నిన్ను నీవు కాపాడుకో డ్రగ్స్ సంబంధించి గోడప్రతులను ఆవిష్కరించారు. భాజపా నాయకుడు రమేశ్‌రెడ్డి, 2వ పట్టణ సీఐ అబ్దుల్‌కరీం, సీపీఐ కార్యదర్శి వినోద్‌కుమార్, కౌన్సిలర్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని దీపాలు.. తొలగని చీకట్లు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని 20వ వార్డు కోనాపురం ఎస్సీ కాలనీలో కొన్ని నెలలుగా వీధిదీపాలు మరమ్మతులకు గురవ్వడంతో చీకటి అలముకుంది. రాత్రులు శివారు వీధుల్లో పాములు, తేళ్లు వస్తుంటాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు ట్యూషన్లకు వెళ్లి చీకట్లో ఇళ్లకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండగ వేళైనా వీధుల్లో వెలుగులు నిండేనా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాలనీ అవస్థలపై పలుమార్లు నగరపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగలకు బంధువులు వస్తుంటారని, పండగపూట చీకట్లో అవస్థలు తప్పేలాలేవని ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మరమ్మతులకు గురైన 10 వీధిదీపాలను వెంటనే నూతన బల్బులు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

కోనాపురం ఎస్సీకాలనీలో వెలగని దీపాలు

కొత్తబల్బులు ఏర్పాటు చేస్తాం

ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగల షార్ట్‌సర్క్యూట్ కారణంగా బల్బులు కాలిపోయాయి. ప్రస్తుతం బల్బులు నిల్వ లేవు. ఆర్డర్ పెట్టాం. రాగానే సమస్యను పరిష్కరిస్తాం. **-సతీశ్‌కుమార్, కమిషనర్, నగరపంచాయతీ పెనుకొండ**

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడముఏమనగా మా క్లైంటు అయిన **శ్రీమతి కె.ప్రమీల,** W/o K.క్రిష్టప్ప, D.No. 26-3-309, విజయనగర్, మేళాపురం. హిందూపురం అనువారు క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్థిని మహమ్మద్ నయీమూర్ రెహ్మాన్ S/o అజ్మతుల్లా, హిందూపురం అనువారి నుండి Doc. No. 1287/2019 మరియు 1286/19గా కొనుగోలు చేసినారు. సదరి ఆస్థికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 2908/1999గా హిందూపురం SROలో రిజిష్టరు అయిన పత్రాన్ని పోగొట్టుకొన్నారు. సదరి విషయమై గోరంట్ల పోలీసు స్టేషను అధికారి గారికి ఫిర్యాదు చేసినారు. సదరి పోలీసు స్టేషను అధికారి గారు Doc. No. 2908/1999 గుర్తించబడలేదు అని ధృవీకరించినారు. కావున ఎవరికైనను ఒరిజినల్ Doc. No. 2908/1999 గుర్తించిన యెడల క్రింద తెలిపిన న్యాయవాదికి తెలుపగలరు మరియు షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు గాని, ఎటువంటి తాకట్టు గాని, బ్యాంకు రుణములు గాని, కోర్టు వ్యవహారములు గాని వున్నయెడల క్రింద కనబరచిన న్యాయవాదికి 10 రోజుల లోపల తెలియజేయవలెను.

షెడ్యూలు

శ్రీ సత్యసాయి జిల్లా మరియు రి.డి., హిందూపురం సబ్.రి.డి.కి చేరి కొట్నూరు గ్రామపొలం, హిందూపురం మున్సిపల్ ఏరియ గల ఆస్థిని

Item No.1: Govt Dry. Sy.No. 389-1, A.C. 3.65 పైకి ప్లాటు నెం. 13. ఇందుకు **కొలతలు: తూర్పు-పడమర:** 25 అ॥, **ఉత్తర-దక్షిణం:** 60 అ॥ గల ఆస్థికి చెక్కుబంది: **తూర్పు:** ప్లాటు నెం. 12, **పడమర:** ప్లాటు నెం. 13, **ఉత్తరం:** 33 అడుగుల రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 16.

Item No.2: Govt Dry. Sy.No. 389-1, A.C. 3.65 పైకి ప్లాటు నెం. 13. ఈపైకి **కొలతలు: తూర్పు-పడమర:** 15 అ॥, **ఉత్తర-దక్షిణం:** 60 అ॥ గల ఆస్థికి చెక్కుబంది: **తూర్పు:** ప్లాటు నెం. 13 పైకి బయలు, **పడమర:** ప్లాటు నెం. 14, **ఉత్తరం:** 33 అడుగుల రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 16.

ఇట్లు: **పి.వి.శ్రీనివాస రెడ్డి,** అడ్వకేటు, D.No. 26-4-1361/1, భవానీశంకర్‌నగర్, మేళాపురం, హిందూపురం. 9440746213

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

నల్లచెరువు: పల్లకిలో విహరిస్తున్న స్వామివారు

పార్వేట ఉత్సవం

నల్లచెరువు, న్యూస్‌టుడే: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామికి సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ రోజున ఆలయ ఇన్‌ఛార్జి ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో పార్వేట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమలపాకులతో పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పార్వేట ఉత్సవంలో యువత పెద్దసంఖ్యలో పాల్గొని కుందేలును పట్టుకోవడానికి పోటీ పడ్డారు. **నల్లమాడ, న్యూస్‌టుడే:** దొన్నికోట గ్రామంలో పులిపార్వేట మహోత్సవం వైభవంగా జరిగింది. సంక్రాంతిని పురస్కరించుకొని కనుమ నాడు నిర్వహించే ఉత్సవంలో గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల వారు తరలివచ్చారు.

హనుమంతుడిపై చెన్నకేశవస్వామి ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పురాతన చెన్నకేశవ ఆలయంలో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాసం ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహ ప్రతిమను ఆంజనేయుడిపై ఉంచి గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. శివమాలధారులు, ఆలయ కమిటీ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో భూదేవీ, శ్రీదేవి సమేత చెన్నకేశవస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: సీకేపల్లి మండలం ఒంటికొండలోని పలు వీధుల్లో విద్యుత్తు తీగలు నివాసాలను తాకే విధంగా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. - **నారాయణస్వామి, స్థానికుడు**

సమాధానం: తీగలు లాగి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. - **రామాంజనేయులు, మండల ఏఈ, విద్యుత్ శాఖ**

సమస్య: ఒంటికొండలో ధర్మవరం వెళ్లే దారి పక్కనున్న పురాతన బావిలోకి గ్రామంలోని మురుగంతా చేరుతోంది. దోమల బెడదతో పాటు చుట్టు పక్కల వ్యవసాయ బోర్లు ఉండటంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. - **రామకృష్ణ, స్థానికుడు**

సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. చంద్రిక, **పంచాయతీ కార్యదర్శి.**

- **న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**

సమస్య: కనగానపల్లి మండల కేంద్రం సచివాలయ సమీపంలో చెత్త సేకరణ వాహనం మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. - **శ్రీనివాసులు, స్థానికుడు.**

సమాధానం: వాహనానికి మరమ్మతు చేపడతాం. - **జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: తల్లిమడుగుల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రహరీ పూర్తిగా కూలిపోవడంతో పశువులు, మేకలు, గొర్రెలు పాఠశాలలోకి చొరబడి మొక్కలను నాశనం చేస్తున్నాయి. - **రామచంద్ర, స్థానికుడు.**

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే ప్రహరీ ఏర్పాటు చేయిస్తాం. - **అరుణమ్మ, ఎంఈఓ** - న్యూస్‌టుడే, కనగానపల్లి

సేవలు అందకపోయినా.. పన్ను చెల్లించాల్సిందే

● కుళాయి కనెక్షన్ లేకున్నా ఇళ్లకు నోటీసులు

కదిరి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు అందించే సదుపాయాలు, సేవలకు పన్నులు వసూలు చేయటం సర్వసాధారణం. పొందని సేవలకు పన్నులు చెల్లించాలనడం కదిరి పురపాలికలోనే కనిపిస్తోంది. కొన్నేళ్ల క్రితం ప్రతి ఇంటికీ కుళాయి కార్యక్రమంలో భాగంగా ప్రజలు దరఖాస్తు చేసుకోవడంతో కొన్నింటికి కనెక్షన్ ఇచ్చినా, మరికొందరికి ఇవ్వలేదు. కొందరు వ్యక్తిగత బోర్లు వేసుకోవడంతో కుళాయిల కనెక్షన్‌లకు దరఖాస్తు చేయలేదు. కనెక్షన్ పొందినా పైపులైన్లు దెబ్బతినడంతో కొన్నిచోట్ల నీరందలేదని బాధితులు వాపోతున్నారు. అయినా వినియోగదారులకు నీటిపన్ను కట్టాలని పురపాలిక అధికారులు నోటీసులు ఇస్తున్నారు. దీంతో ఏళ్ల కిందటే తమకు కుళాయి లేదని, కనెక్షన్ రద్దు చేయాలని మున్సిపల్ అధికారులను విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. అయినా నీటి పన్ను చెల్లించాలని అంటుండటంతో బాధితులు లబోదిబో మంటున్నారు. ఇలా కొన్నేళ్లుగా అందని సేవలకు పన్నులు వేస్తుండటంతో రూ.వేలల్లో బకాయిలు పేరుకుపోతున్నాయి. తాము వినియోగించని నీటికి పన్నులను రద్దు చేయాలని బాధితులు మొరపెట్టుకుంటున్నారు.

194 కుళాయిలకు రూ.38 లక్షల బకాయి

కదిరి పురపాలికలో సుమారు 22 వేల గృహాలు ఉన్నాయి. వీటిలో 194 నివాసాలకు నీటి సరఫరా లేదు. అయినా కొన్నేళ్లుగా పన్నులు విధిస్తుండటంతో బకాయిలు రూ.38 లక్షలకు చేరుకున్నాయి. ఇటీవల బకాయిలు చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు, రూ.15 వేలు ఉన్నట్లు చూపుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం మున్సిపాలిటీలో 417 కుళాయిలకు రూ.39 లక్షలు బకాయిలున్నట్లు అధికారులు గుర్తించారు.

తెల్ల కాగితం రాసుకొచ్చి ఇచ్చారు

మాకు మున్సిపాలిటీ కుళాయి లేదు. ఇటీవల నీటిపన్ను కట్టాలని మున్సిపల్ సిబ్బంది తెల్లకాగితం రాసుకొని వచ్చారు. ఆన్‌లైన్‌లో పేరు, ఇంటి నంబరు నమోదు చేసి చూస్తే రూ.10,800 బకాయి చూపుతోంది. నీటిపన్నును అధికారులు రద్దు చేయాలి. - **చంద్రశేఖర్, కదిరి**

బకాయిల రద్దుకు ప్రతిపాదించాం

పురపాలికలో కుళాయిలు లేని కనెక్షన్లను గుర్తించాం. వీటికి రూ.38 లక్షల బకాయి తేలింది. ఆయా వినియోగదారులు కట్టాల్సిన పన్నుల వివరాలతో బకాయి రద్దుకు డీఎంఏకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం. - **కిరణ్‌కుమార్, కమిషనర్**

క్రికెట్ పోటీల్లో విజేత వంకమద్ది జట్టు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: టీఎన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 3 రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వంకమద్ది జట్టు విజయం సాధించింది. టీఎన్‌పల్లి జట్టు పై వంకమద్ది జట్టు గెలుపొందింది. వంకమద్ది జట్టుకు తెదేపా నాయకులు దండే గంగశేఖర్, వేణుగోపాల్‌రెడ్డిలు బహుమతులను అందించారు.

విజేత జట్టుకు పురస్కారం అందజేస్తున్న గంగశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటతిమ్మాపురంలో శుక్రవారం సైబర్ నేరాలపై గ్రామస్థులకు గ్రామీణ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లలో వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు మండల సమావేశం

తనకల్లు, న్యూస్‌టుడే: మండలాభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ కౌసల్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రగతి నివేదికతో హాజరుకావాలని చెప్పారు.

కదిరి పట్టణం: విజేతకు నగదు అందిస్తున్న గ్రామస్థులు

ధర్మవరం పట్టణంలో

బత్తలపల్లి: సంజీవపురంలో

పంటల పండగ.. కనుల వేడుక

ధర్మవరం: కర్రసాము ఆడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

రైతులకు పంటల పండగ అయిన సంక్రాంతిని ఊరూవాడా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సంక్రాంతి సంబరాలను గోపూజ నిర్వహించి, అనంతరం గ్రామీణ క్రీడలను ప్రారంభించారు. బత్తలపల్లిలోని సంజీవపురం, కదిరి మండలంలోని మీటేనాయక్ తండా, జోడేనాయక్ తండా, శ్రీరామదాసునాయక్ తండాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నార్పలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోటీలు ఆకట్టుకున్నాయి. - **న్యూస్‌టుడే బృందం**

ధర్మవరం: ఆకట్టుకున్న యువతుల నృత్యం

మూడు గ్రామాలకు దారి.. గుల్లగా మారి

నల్లమాడ మండల కేంద్రానికి దూరంగా ఉన్న కటాలపల్లికి వెళ్లే రహదారి ఇది. ఈ దారి గుండా మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. నల్లమాడ- కుటాలపల్లి వరకు పలుచోట్ల రహదారి రాళ్లు తేలి, కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రానికి పనులపై వచ్చే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి రహదారిని బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, నల్లమాడ**

మురుగు తెచ్చిన తంటా

కదిరి పట్టణంలోని పిల్లలక కాలనీలో రోడ్డుపై మురుగు నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండగ వేళ ఇళ్ల ముందు కనీసం ముగ్గులు కూడా వేసుకోలేపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగు కాలువ ఏర్పాటు చేయకుండా రోడ్డు వేయడం వల్లే సమస్య ఎదురవుతోందని వారు చెబుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజు బాబు దృష్టికి తీసుకెళ్లగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, కదిరి పట్టణం**

అండర్‌-12 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక రేపు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి మండల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న అండర్‌-12 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు ఎల్లప్ప, విజయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ప్రక్రియ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉంటుందని వెల్లడించారు. 2013 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు.

బేకరీ దగ్ధంపై మంత్రి ఆరా

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద శుక్రవారం విద్యుదాఘాతంతో దగ్ధమైన అజయ్ బేకరీని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, భాజపా నాయకులు పరిశీలించారు. మంత్రి సత్యకుమార్ ఫోన్‌లో యజమాని అజయ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు తగిన నష్టపరిహారం అందే విధంగా రెవెన్యూ అధికారులు అంచనా వేసి పంపాలని మంత్రి ఆదేశించారు.

డ్రైవర్ మృతికి సంతాపం

కదిరి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవరుగా పని చేస్తూ మహబూబ్ బాషా అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమని డిపో ఇన్‌ఛార్జి మేనేజరు రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నివాళి అర్పించి, అంత్యక్రియలకు రూ.25 వేలు అందజేశారు. ఎన్‌ఎంయూఏ నాయకులు భైరిశెట్టి, హరిమోహన్, పెద్దన్న, షామీర్‌ఖాన్, సలీంబాషా, లక్ష్మీనారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, ఆంజనేయులు, రవీంద్ర పాల్గొన్నారు.

18న షష్ఠాంకముల నాటక ప్రదర్శన

ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 18న మాజీ సీఎం, దివంగత నేత నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, పరిటాల రవీంద్రల వర్ధంతిని పురస్కరించుకొని ఎన్డీయే కూటమి నాయకుల ఆధ్వర్యంలో షష్ఠాంకములు నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెదేపా నాయకుడు సుధా వీరాంజినేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి శ్రేణులు, పట్టణ ప్రజలు నాటక ప్రదర్శనకు విచ్చేయాలని కోరారు.

యువకుడి దుర్మరణం

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని కుణుతూరు వద్ద గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో వడ్ల సాయి కిరణ్(22) మృతి చెందగా, యోగానంద్ గాయపడ్డాడు. ధర్మవరం గ్రామీణ పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన సాయికిరణ్, యోగానంద్ ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి వైపు వెళ్తుండగా కుణుతూరు వద్ద రహదారి పక్కకు దూసుకెళ్లి స్తంభాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గాయపడిన యోగానంద్‌ను చికిత్స నిమిత్తం ధర్మవరం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సంఘటనా స్థలాన్ని ధర్మవరం గ్రామీణ ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లి సరోజమ్మ కన్నీటి పర్యంతమైంది..

రైలు కిందపడి ఉత్తరప్రదేశ్ వాసి ఆత్మహత్య

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని రాళ్ల అనంతపురం సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హర్దోయ్ జిల్లా బహూతికాలా గ్రామానికి చెందిన శివం(26) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాడు. కృష్ణాపురం గ్రామంలో ఓ కోళ్ల ఫారంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబపోషణ భారంగా మారింది. తీవ్ర మనోవేదనకు గురై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో శుక్రవారం చిన్నకుంటపల్లికి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సాధన, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బేల్దారి మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లిలోని ధర్మవరం రోడ్డులో అన్నపూర్ణ దాబా దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బేల్దారి నాగరాజు(55) చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన బేల్దారి నాగరాజు ఈనెల 7న బైక్‌పై బత్తలపల్లికి వచ్చాడు. పని ముగించుకొని ధర్మవరం వెళ్తుండగా అన్నపూర్ణ దాబా దగ్గర ఎదురుగా వస్తున్న బోర్‌వెల్ లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలంలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి రక్తగాయాలయ్యాయి. కర్ణాటకలోని తుముకూరు జిల్లాలోని దుబ్బాడ గ్రామం నుంచి కదిరి నరసింహస్వామి దేవస్థానానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గౌరపురం వద్ద కదిరి నుంచి బెంగళూరు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమాదేవి, దేవరాజ్, నరసింహరాజు గాయపడ్డారు. మరో వైపు నల్లమాడ మండలం బొగ్గిటివారిపల్లికి చెందిన వల్లిపి ఆదినారాయణ ద్విచక్ర వాహనంలో ఓడీసీ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మిట్టపల్లి వద్ద అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో గాయపడ్డ వీరిని 108 వాహనంలో సిబ్బంది హేమ, హరి కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని...

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని కుణుతూరు గ్రామ సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం నగరానికి చెందిన సంజప్ప అతడి కుమారుడు ఉమేష్ చంద్ర పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో ధర్మవరం వచ్చి తిరిగి అనంతపురం వెళ్తుండగా ఇదే మార్గంలో వస్తున్న గోవర్ధన్‌రెడ్డి, హేమంత్ రెడ్డిల బైక్ ఢీకొంది. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని ధర్మవరం గ్రామీణ పోలీసులు తెలిపారు.

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై ఆగ్రహం

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: బస్సు స్టేజి ఉన్నా బస్సు ఆపలేదని డ్రైవర్‌పై ప్రయాణికులు ఆగ్రహించిన సంఘటన మండలంలోని పగడాలవారిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. కదిరి నుంచి హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు పగడాలవారిపల్లి వద్ద స్టేజి ఉన్నప్పటికీ బస్సు ఆపకపోవడంతో ప్రయాణికులు, వారి బంధువులు ఆగ్రహించారు. ద్విచక్ర వాహనాల్లో బస్సును వెంబడించి, డ్రైవర్‌పై దూషణకు దిగారు. స్టేజి ఉన్నా ఎందుకు ఆపలేదంటూ డ్రైవర్‌ను నిలదీశారు. చివరకు తోటి ప్రయాణికులు, స్థానికులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు

క్రైం కార్నర్

గల్లంతైన యువరైతు ..



తలుపుల: హంద్రీనీవా కాలువలో గల్లంతైన యువరైతు ఎస్.మహమ్మద్ జిందేశ్(39) మృతి చెందినట్లు ఎస్సై చెన్నయ్య తెలిపారు. ఎస్సై తెలిపిన మేరకు వివరాల మేరకు కుమ్మరపేటకు చెందిన ఎస్.మహమ్మద్ జిందేశ్‌కు కొరుగుట్టపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువకు ఇరువైపులా మామిడితోట ఉంది. ఒక వైపు ఉన్న బోరుబావి నుంచి కాలువకు అవతలివైపున్న మామిడితోటకు పైపులైన్ ద్వారా నీరు అందించేవాడు. ఎప్పటిలానే బుధవారం నీటిని పెట్టే క్రమంలో కాలువలోని పైపులైన్ ఊడిపోవడంతో వాటిని సరిచేయడానికి పైపులైన్‌ను పట్టుకొని కాలువలోకి దిగాడు. ఆధారంగా ఉన్న పైపు ఊడిపోవడంతో కాలువలో గల్లంతయ్యాడు. హంద్రీనీవా అధికారులు కదిరి గ్రామీణ మండలం పట్నం వద్ద గురువారం సాయంత్రం నీటిని బంద్ చేయడంతో శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

కనగానపల్లి, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువలో కొట్టుకుపోయిన విద్యార్థి మృతదేహం గురువారం లభ్యమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతపురం పట్టణం ఎర్నాలకొట్టాలకు చెందిన బాషా, షకీలా దంపతుల కుమారుడు సోహెల్(17) ఈ నెల 12న తన మిత్రులతో కలిసి ఆటోలో రామగిరి మండలం నసనకోటలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. అదే రోజు రాత్రి అక్కడే నిద్రించి మరుసటి రోజు 13న మరొక్కసారి అమ్మవారి దర్శనం చేసుకొని ఇంటికి బయల్దేరారు. కనగానపల్లి మండలం బద్దలాపురం సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువలో ఈతకొట్టడానికి దిగుతున్న క్రమంలో కాలు జారి నీటిలో కొట్టుకుపోయాడు. గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం ఈనెల 15న రామగిరి మండలం చెర్లోపల్లి సమీపాన హంద్రీనీవా కాలువలో విద్యార్థి మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇలా చేతికందితే ప్రమాదమే

పట్టణంలోని సాయినగర్ ప్రధాన రహదారిలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. నియంత్రిక దిమ్మెను తక్కువ ఎత్తులో నిర్మించడంతో చేతికందేలా ఉంది. నియంత్రిక చుట్టూ విద్యుత్తు తీగలు బయటకు వచ్చి వేలాడుతున్నాయి. ఈ నియంత్రిక ఉన్న దారి గుండానే ప్రైవేటు పాఠశాల, ఆరోగ్య ఉప కేంద్రం, పట్టణ పురపాలిక కమిషనర్ నివాసం ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ నాగభూషణంతో మాట్లాడగా నియంత్రికను పరిశీలించి సరైన చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం**

బాధితులకు అండగా ప్రభుత్వం

కదిరి, న్యూస్‌టుడే: ప్రజారోగ్యమే లక్ష్యంగా బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 75 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద విడుదలైన రూ.31.83 లక్షలు విలువజేసే చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విద్యుదాఘాతంతో వ్యవసాయ పరికరాలు దగ్ధం

వెంకటాంపల్లి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: వ్యవసాయ మోటారు స్టార్టర్ పెట్టె విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ పరికరాలు దగ్ధమైన సంఘటన చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం స్టార్టర్ పెట్టె ఉన్నట్టుండి విద్యుదాఘాతానికి గురికావడంతో మంటలు చెలరేగాయన్నారు. అవి గడ్డికి వ్యాపించడంతో బిందు, తుంపర సేద్యపు పరికరాలు కాలిపోయాయన్నారు. మంటలు అదుపు లోకి రాకపోవడంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం..

వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డికి చెందిన మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం విద్యుదాఘాతానికి దగ్ధమైంది. బాధిత రైతు మాట్లాడుతూ.. హెచ్‌టీ లైన్ సమీపంలో పశుగ్రాస వామి వేశామన్నాడు. తీగలు రాపిడికి గురికావడంతో నిప్పురవ్వలు ఎగిసి మంటలు రాజుకున్నాయన్నారు. సమీపంలో ఉన్న గ్రాసానికి వ్యాపించడంతో కాలిపోయిందని వాపోయాడు. రూ. 30 వేలు వెచ్చించి ఇటీవలే గ్రాసం కొనుగోలు చేశానని గ్రాసం మొత్తం బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశాడు.

మురుగు పేరుకుంటోంది.. కదలనంటోంది

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పేరిట ప్రతి నెల మూడో శనివారం పట్టణ, గ్రామాల్లో స్వచ్ఛత పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆచరణలో విఫలమవుతోంది. అధికారులు మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహిస్తుండటంతో పట్టణం, గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో ఎక్కడికక్కడ మురుగు పేరుకుంటోంది.

మల్లేనిపల్లిలో వ్యర్థాలతో నిండిన కాలువ

కొరవడిన పర్యవేక్షణ

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆవాసాల చెంతనే మురుగు పారుతోంది. పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యానికి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. కొందరు ఉన్నతాధికారుల మెప్పు కోసం మురుగు ఉన్న ప్రదేశాల్లో నామమాత్రంగా బ్లీచింగ్ చల్లించి మమ అనిపిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారు గ్రామాలను సందర్శించకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో పల్లెల్లో దోమలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేసినా అవి ఎక్కడ ఖర్చు చేశారో తెలియని పరిస్థితి.

అస్తవ్యస్తంగా పనులు

ధర్మవరం మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో ఇరిగేషన్ కాలువ ఊరిలోని ప్రధాన వీధుల్లోంచి వెళ్తోంది. కాలువను శుభ్రం చేయకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. కాలువ సమీపంలోని ట్యాంకు ద్వారానే గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. కాలువలో మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. పోతుకుంట, చిగిచెర్ల, కుణుతూరు, రేగాటిపల్లి గ్రామాల్లో కూడా పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి.

● తాడిమర్రి మండలంలోని దాడితోట గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు మడుగులా చేరుతోంది. మురుగు చెంతనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.

● పేరుకే ముదిగుబ్బ మేజర్ పంచాయతీ. రద్దీగా ఉండే ప్రదేశాల్లో మురుగు పారుతున్నా పంచాయతీ అధికారులు కాలువలను శుభ్రం చేయడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చిన మురుగు సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశిస్తున్నాం. - **జనార్దన్ రావు, డీఎల్‌డీఓ**

వేమన జయంతి ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

నంబులపూలకుంట,న్యూస్‌టుడే: కటారుపల్లిలో ఈ నెల 19న యోగి వేమన రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికను మండల కేంద్రంలో తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దండే రవి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నరసింహులు, పాలగిరి బాషా, మౌళా, మనోహర్ పాల్గొన్నారు.

ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న శ్రీరాములునాయుడు

వైద్య శిబిరం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: గ్రామీణ అటవీప్రాంతమైన అమగోండపాళ్యంను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ జీవీ సుప్రజాచౌదరి పేర్కొన్నారు. గురు, శుక్రవారం పుట్టపర్తి మండలం పరిధిలోని సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమగోండపాళ్యంలో ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య సేవలందించి, మందులు అందించారు. వెంకటేష్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, రఘు, రమేష్, రామారావు, షీనా, ఇయాన్ పాల్గొన్నారు.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

తూర్పు కాపు/గాజుల కాపు అవివాహితులకు సువర్ణావకాశం
నేడు, రేపు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, తూర్పు కాపు/ గాజుల కాపు అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఈనాడు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026 శనివారం), రేపు (18 జనవరి 2026 ఆదివారం)ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్ ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80086 21414ను సంప్రదించవచ్చు. ఫోన్/ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నవారు వధూవరుల బయో డేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

23న రథసప్తమి సప్తాహ్ శోభాయాత్ర

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రథసప్తమి సప్తాహ్ ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలో ఈ నెల 23న మధ్యాహ్నం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది వేడుకలను శోభాయాత్రతో ప్రారంభించామని, అదే మాదిరిగా ఈ నెల 19న యాత్ర నిర్వహించాలని తొలుత నిర్ణయించామని పేర్కొన్నారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతి నేపథ్యంలో స్వల్ప మార్పులు చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌ను సంప్రదించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వారం రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో తొలి మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను తగ్గించామని తెలిపారు. సూర్యనారాయణస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

నరికేద్దాం.. అడిగితే చూద్దాం!

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ఎచ్చెర్ల నియోజకవర్గంలో అక్రమార్కులు నీలగిరి, ఆకేషి, టేకు, సరుగుడు, వెదురు తదితర చెట్లను ఇష్టానుసారం నరికి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న వారికి కొందరు తూనిక యంత్రాల నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. ఈ విషయమై అటవీ, రెవెన్యూ శాఖ అధికారులకు స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

కేశవరావుపేట సమీపంలో తరలించడానికి సిద్ధం చేసిన కలప

ఇదీ పరిస్థితి

◆ ఎచ్చెర్ల మండలంలో షేర్‌మహమ్మద్‌పురం కొండపై ఉన్న ఆకేషి, నీలగిరి చెట్లను అనుమతి లేకుండా నరికి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ◆ అక్రమార్కులకు కేశవరావుపేట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి ఆనుకుని ఉన్న తూనిక యంత్రాల నిర్వాహకులు కొందరు అండగా నిలుస్తున్నారు. ◆ జి. సిగడాం మండలం పెనసాం, సేతుబీమవరం, గడ్డకంచరాం, బాతువ, పున్నాం తదితర గ్రామాల్లో నిద్రగన్నేర్లు, వేప, కాయి, ఆకేషి ఇతర రకాల కలపను పెద్దఎత్తున అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి రాజాం, పొందూరులోని తూనిక యంత్రాల వద్ద వాహనాలకు లోడ్ చేసి రాత్రి వేళ డిపోలకు తరలిస్తున్నారు. ◆ రణస్థలం మండలం నారువ, మెంటాడ, అప్పయ్యపాలెం, కొచ్చెర్ల తదితర గ్రామాల్లోనూ అదే తంతు సాగుతోంది.

◆ కేశవరావుపేట, పదిదపేట, షేర్ మహమ్మద్‌పురం, సంత సీతారాంపురం, అజ్జరం, కుప్పిలి, బడివానిపేట తదితర గ్రామాల్లో రాత్రి వేళ దందా సాగుతోంది.

◆ లావేరు మండలం అప్పాపురం, వెంకటాపురం, బొంతుపేట పరిధిలో అక్రమ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

ఆకస్మిక తనిఖీలు చేస్తాం..: జిల్లా నుంచి కలప అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచాం. కొన్నిచోట్ల సిబ్బంది తక్కువగా ఉండటంతో కొందరు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. చెట్లు నరకడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమ రవాణా సాగిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. **- రాజశేఖర్, ఎఫ్ఆర్‌వో, అటవీ శాఖ**

ఇంటింటా 'సంక్రాంతి' వైభవం..!

ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో సంగమేశ్వరస్వామి జాతరకు వచ్చిన భక్తులు

జిల్లావ్యాప్తంగా గురువారం సంక్రాంతి వైభవంగా నిర్వహించారు. ఇంటింటా పండగ సందడి కనిపించింది. పొంగలి వండి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సాయంత్రం గాలిపటాలు ఎగరేశారు. శుక్రవారం కనుమ సందర్భంగా పాడి పశువులకు పూజలు చేశారు. గ్రామాల్లో జాతరలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో రహదారులు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. - ఆమదాలవలస గ్రామీణం, జి.సిగడాం, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం గ్రామీణం

జి.సిగడాం మండలం దవళపేటలో పొట్టేళ్ల పోటీ

ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లువడ కూడలిలో పొంగలి వండుతున్న మహిళలు

ఇంకెన్నాళ్లు సాగదీస్తారు..?

సీహెచ్‌సీల్లో నత్తనడకన అభివృద్ధి పనులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

● నరసన్నపేట సీహెచ్‌సీలో రోజూ 200 పైగా ఓపీ, 70 వరకు ఐపీ నమోదవుతోంది. 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి తెదేపా పాలనలో రూ.12.60 కోట్లు మంజూరు చేయగా పనులు ప్రారంభించి రూ.6.35 కోట్లు ఖర్చు చేశారు. అదనపు భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి.

● కొత్తూరులో 30 పడకల సామాజిక ఆసుపత్రికి నిత్యం 200 మంది ఓపీకి వస్తున్నారు. అదనపు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

● పొందూరులో 30 పడకల సామాజిక ఆసుపత్రికి రోజూ ఓపీకి 70 నుంచి 100 మంది వరకు వస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్యులు, రోగులు భయాందోళనలకు గురవుతున్నారు. కొత్త నిర్మాణం పూర్తయినప్పటికీ అంతర్గత పనులు చేయాలి.

కొత్తూరులో అందుబాటులోకి రాని అదనపు భవనం

సామాజిక ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2014-19 మధ్య, 2020లో నాబార్డు నిధులు మంజూరు చేసింది. అప్పట్నుంచి నత్తనడకన సాగుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. సౌకర్యాలు లేకపోవడంతో రోగులు, వైద్యులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి

★ జిల్లాలో 13 సామాజిక ఆసుపత్రులున్నాయి. నరసన్నపేట, బారువ, సోంపేట, ఆమదాలవలస, కొత్తూరు, పాతపట్నం, హరిపురం, పొందూరు, కోటబొమ్మాళి, పలాస సీహెచ్‌సీలకు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. సోంపేట, హరిపురం, పలాస, పాతపట్నంలో పనులు పూర్తికాగా మిగిలిన చోట్ల నత్తనడకన సాగుతున్నాయి.

★ అవసరమైన చోట అదనపు భవనాలు, విద్యుత్తు సౌకర్యం, అప్రోచ్ రోడ్లు, రంగులు, తాగునీరు, కాలువలు ఉండాలని నిర్ణయించారు. ఆయా పనులను వైద్య సేవల సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షిస్తోంది. చాలా వరకు చివరి దశలో ఉన్నాయి.



వేగవంతం చేస్తాం...: గతంలో బిల్లులు బకాయి ఉండటంతో పనులు నెమ్మదించాయి. ఇటీవల చెల్లింపులు జరగడంతో చివరి దశకు వచ్చాయి. మార్చి నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. వేగవంతమయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. **- ఎస్.సిమ్మన్న, కార్యనిర్వహణాధికారి, ఏపీఎంఎస్ఐడీసీ**

20 వేల మంది.. రూ. 55 కోట్ల మేర ప్రయోజనం!

న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

జిల్లాలో సీపీఎస్ ఉద్యోగులు, పింఛనుదారుల ఇళ్లలో సంక్రాంతికి అదనపు సంతోషం వెల్లివిరిసింది. వైకాపా పాలనలో ఇవ్వాల్సిన..రావాల్సిన కరవు భత్యం బకాయిలు కూటమి ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. రూ.25 వేల నుంచి రూ.55 వేల వరకు జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు వచ్చిన సందేశాలు చూసుకుని సంబరాల్లో మునిగిపోయారు. పెద్ద పండగ వేళ డబ్బులు రావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

30.39 శాతం జమ

2004 తర్వాత ప్రభుత్వ సర్వీసులో చేరిన వారందరినీ సీపీఎస్ ఉద్యోగులుగా పరిగణిస్తున్నారు. జిల్లాలో 14,400 మంది వరకు ఉన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని మినహాయిస్తే డీఏ పాత బకాయిలకు అర్హులైన వారు 8 వేల మంది వరకు ఉన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో విశ్రాంత ఉద్యోగులు 12 వేల మంది వరకు ఉండటంతో ప్రయోజనం పొందిన వారు 20 వేల మంది అవుతున్నారు. సుమారు రూ.55 కోట్ల మేర లబ్ధి అందుతుందని ఉద్యోగ సంఘాల నాయకుల అంచనా. జిల్లాలో 30.39 శాతం డీఏ బకాయిలు ప్రస్తుతానికి జమ అయ్యాయని.. 33.53 శాతం మేర శని, సోమవారాల్లో జమ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

చాలా సంతోషంగా ఉంది..: ఐదేళ్లు దాటిపోవడం..ప్రభుత్వం మారిపోవడంతో పాత బకాయిలు రావని ఉద్యోగులు, పింఛనుదారులు నిరుత్సాహంగా ఉండేవారు. ఎన్జీవో సంఘం, పింఛనుదారుల తరఫున మేం తరచుగా వినతిపత్రాలు అందించడం, సంప్రదించడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రావనుకున్న బకాయిలు విడుదల కావడంతో చాలా సంతోషంగా ఉంది. **- చౌదరి పురుషోత్తమనాయుడు, ఛైర్మన్, ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస**

సాంకేతిక చిక్కులతో సతమతం

టెక్కలి పాత జాతీయ రహదారి సమీపంలో రైల్వే గేటు వద్ద సాంకేతిక సమస్యతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బుధ, గురువారాల్లో సాయంత్రం రైలు వెళ్లిపోయాక గేటు తెరచుకోకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తరచూ ఈ సమస్య తలెత్తుతోందని.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఆర్టీసీకి పండగ రద్దీ

సంక్రాంతి నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు రద్దీగా నడుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత బంధువుల ఇళ్లకు వెళ్తున్న వారితో ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతూ కనిపించాయి. పల్లెవెలుగు సర్వీసులను ఎక్స్‌ప్రెస్‌లుగా తిప్పడంతో ప్రయాణికులు సీట్ల కోసం పోటీ పడ్డారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో బస్సు ఎక్కడానికి గుమికూడిన వారిని చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, పలాస

జీవన ధ్రువపత్రం ఇలా పొందొచ్చు..!

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, అనుబంధ రంగ సంస్థల్లో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వారు జిల్లాలో 15 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా ప్రతి నెలా పింఛను పొందుతున్నారు. ఏటా వారు జీవన ధ్రువపత్రం (లైఫ్ సర్టిఫికెట్) సంబంధిత ఖజానా కార్యాలయంలో అందజేయకుంటే పింఛను నిలిచిపోతుంది. ఆ తర్వాత ఇక్కట్లు తప్పవు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వయోధికులు పత్రాలు అందజేయడానికి మీసేవ కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. అలాంటి స్థితిలో ఉన్న పింఛనుదారులకు ఖజానా శాఖ ఉన్నతాధికారులు శుభవార్త ప్రకటించారు. అధునాతన సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా జీవన ధ్రువీకరణ పత్రాలను సమర్పించడానికి వెసులుబాటు కల్పించారు. వచ్చే నెల 28 లోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఇలా చేయాలి.. ◆ సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి జీవన్ ప్రమాణ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్, చరవాణి సంఖ్య, ఈమెయిల్ ఐడీ నమోదు చేయాలి. ◆ ఓటీపీ నమోదు చేయగానే తెరపై వృత్తాకారం (రౌండ్ సర్కిల్) వస్తుంది. తొలుత ముఖాధారిత నిర్ధారణ ద్వారా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, చరవాణి, ఈ-మెయిల్ వివరాలు నమోదు చేయగానే పింఛనుదారు వివరాలు తెరపై కనిపిస్తాయి. ◆ గతంలో జీవనపత్రం పొందని వారు పేరు, పీపీవో నంబరు, బ్యాంకు వివరాలు, ప్రభుత్వ శాఖ, పింఛను వివరాలు చేర్చాలి. అనంతరం వృత్తంలో ముఖం కనిపించేలా ఫొటో తీసుకోగానే పత్రం సమర్పించే ప్రక్రియ పూర్తయినట్లే. సెల్‌ఫోన్‌కు వచ్చిన సంక్షిప్త సందేశాన్ని భద్రపరచుకోవాలి.

చాలా మంచి అవకాశం: ప్రభుత్వ పింఛను పొందే వారు గతంలో జీవన ధ్రువపత్రం సమర్పించడానికి కొంత ప్రయాసకు గురయ్యేవారు. వయోధికులు, మహిళలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం జీవన్ ప్రమాణ్ యాప్ అందుబాటులోకి రావడంతో సులువుగా పని పూర్తి చేసుకుంటున్నారు. ఈ విషయమై ఖజానా శాఖ సిబ్బంది సహకారంతో అవగాహన కల్పిస్తున్నాం. **-ఎల్.రామారావు, ఎస్టీవో, ఇచ్ఛాపురం**

పట్టు తప్పితే ప్రమాదం.. ప్రాణాలతో చెలగాటం!

బోగీలో సీటున్నా.. కొందరు ద్వారం వద్ద నిల్చుని ప్రమాదకరంగా ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హ్యాండిళ్లు ఉన్నా పట్టుకోవడం నామోషీ అన్నట్లు విన్యాసాలు చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రీల్స్ చూస్తూ నిర్లక్ష్యంగా కూర్చుంటున్నారు. కుదుపు వచ్చినా.. పక్క నుంచి మరో రైలు వేగంగా వెళ్లినా ఏమరపాటులో పడిపోయి మృత్యుఒడికి చేరుకుంటున్నారు. గతేడాది ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల్లో సుమారు 40 మంది దుర్మరణం చెందారు. ఈ విషయమై పలాస జీఆర్‌పీ ఎస్సై కోటేశ్వరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా తరచూ తనిఖీల్లో తలుపులు వేయిస్తుంటామని.. ప్రమాదకరంగా ప్రయాణం చేయకూడదని ఎంత చెప్పినా కొందరిలో మార్పు రావడం లేదని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఎరువు.. బరువు!

పెరిగిన ధరలతో అన్నదాతల గగ్గోలు

న్యూస్‌టుడే, లావేరు

సాగు ఖర్చులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు లేక..మరో వైపు గిట్టుబాటు ధర రాక విలవిల్లాడుతున్న అన్నదాతల్ని ఎరువుల ధరలు మరింత కుంగదీస్తున్నాయి. ఖరీఫ్‌తో పోల్చితే భారీగా పెరిగిపోయాయి. అవసరం మేరకు యూరియా దొరక్క ఇబ్బందులు పడుతుండగా కాంప్లెక్సు రకాలకు సంబంధించి వ్యాపారులు అమాంతం పెంచేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లావేరు వద్ద ఓ ప్రైవేటు గోదాంలో నిల్వ చేసిన ఎరువులు

బస్తా రకం	ఖరీఫ్ ధర (రూ.ల్లో..)	రబీ
20:20:0:13	1,800	1,950
28:28:0	1,800	1,900
పొటాష్	1,700	1,800
14:35:14	1,800	1,858
16:16:16	1,450	1,600

ఇదీ పరిస్థితి

★ జిల్లాకు సంబంధించి రబీలో సాధారణ విస్తీర్ణం 70 వేల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ తదితర పంటలు సుమారు 57 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 15,991 హెక్టార్లు కాగా 19,669 హెక్టార్లలో వేశారు.

★ ఇప్పటివరకు 16,835 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 39 వేల మెట్రిక్ టన్నులు తీసుకొచ్చారు. ప్రస్తుతం డీఏపీ 4 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,200 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 1,400 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

★ వరి, మొక్కజొన్న, అపరాలు, కూరగాయలు, మామిడి, పామాయిల్ తోటలకు ఎక్కువగా కాంప్లెక్సు ఎరువులే వినియోగిస్తున్నారు. ఎకరాకు వరికి 7 బస్తాలు, మొక్కజొన్నకు 6, అపరాలకు 2, శనగకు 2, మామిడికి 4, పామాయిల్‌కు 3 బస్తాలు అవసరం. మూడు ఎకరాల్లో సాగు చేస్తే రైతుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు అదనపు భారం పడుతోంది.

ప్రైవేటు వ్యాపారుల దోపిడీ

ఎరువుల కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేస్తున్నాయి. తక్కువ ధర పలికే యూరియా వినియోగించాలనుకున్నా దొరకని పరిస్థితి నెలకొంది. కొందరు వ్యాపారులు యూరియాతో కాంప్లెక్సు ఎరువులకు ముడి పెట్టి విక్రయిస్తున్నారు. పొటాష్, తదితర ఎరువులు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఖరీఫ్‌తో పోలిస్తే బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు ధర పెరిగింది.

కొరత లేకుండా చూస్తున్నాం..: ప్రస్తుతం పెరిగిన కాంప్లెక్సు ఎరువుల ధరల సమాచారం రావాల్సి ఉంది. రబీలో రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందుబాటులో ఉంచాం. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. **- త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం**

కూరగాయల వ్యాపారి నిజాయతీ

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: బంగారు ఆభరణాలు, నగదుతో ఉన్న సంచి పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగించి ఓ కూరగాయల వ్యాపారి నిజాయతీ చాటుకున్నారు. నరసన్నపేట నుంచి సాసుపల్లి హేమలత దంపతులు శుక్రవారం విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసకు బయలుదేరారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం భైరిలో ఓ మిఠాయి దుకాణం వద్ద ఆగారు. ఆ సమయంలో రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదుతో ఉన్న సంచిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పక్కనే కూరగాయల దుకాణం నడుపుతున్న ఆర్.వాసుదేవరావు గమనించి.. దాన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. ఊరెళ్లాక హేమలత సంచి పోయిందని తెలియగానే వారు ఆగిన ప్రదేశాల్లో వాకబు చేసుకుంటూ వస్తున్నారు. మిఠాయి దుకాణం వద్ద అడగ్గా లేదని చెప్పడంతో గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆ సంచి వారిదేనని నిర్ధారించుకున్న తర్వాత వాసుదేవరావు సమక్షంలో ఎస్సై కె.రాము సంచి పోగొట్టుకున్న వారికి అందించారు.

వాసుదేవరావు సమక్షంలో నగలు, నగదు హేమలతకు అప్పగిస్తున్న పోలీసులు

మహేంద్రతనయకు అడ్డుకట్ట..!

ఒడిశా అధికారుల దుశ్చర్య

న్యూస్‌టుడే, పాతపట్నం

ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో మహేంద్రతనయ నది వద్ద ఒడిశా అధికారులు దురాక్రమణకు పాల్పడుతున్నారు. వరద వచ్చినప్పుడు ఆంధ్ర ప్రాంతానికి నీరు వదులుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తేలా వ్యవహరిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పద్ధతి అనుసరిస్తున్నారు. వారి చర్యలతో భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని ఆంధ్ర సరిహద్దు ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

వంతెన కింద నీరు రాకుండా ఒడిశా అధికారులు వేసిన ఇసుక బస్తాలు

■ నదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో పర్లాఖెముండి పట్టణంలోని మురుగు నీరు పాతపట్నం, గోపాలపురం గ్రామాల మీదుగా వచ్చి ఇక్కడ కలుస్తోంది. తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని.. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పని ఇక్కట్లు

■ మహేంద్రతనయ నది మెళియాపుట్టి నుంచి ఒడిశాలోని పర్లాఖెముండి మీదుగా రాష్ట్ర సరిహద్దులో ఉన్న పాతపట్నంలోకి ప్రవేశిస్తుంది.

■ పాతపట్నం, హిరమండలం మండలాల పరిధిలో సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది.

■ పర్లాఖెముండి సరిహద్దు వద్ద పాత వంతెన దిగువన అక్కడి అధికారులు భారీగా ఇసుక బస్తాలు వేసి ఆంధ్ర ప్రాంతం వైపు నీరు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.

■ ఈ నేపథ్యంలో ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పాతపట్నం, గోపాలపురం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది, హిరమండలంలోని పలు గ్రామాలు తాగునీటికి ఆధారపడుతున్నాయి.

■ పాతపట్నం, కొరసవాడ ఎత్తిపోతల పథకాలకు ఇక్కడి నుంచే నీరు అందాలి. వేసవికి ముందే అడ్డుకట్ట వేయడంతో వ్యవసాయానికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ నీటి లభ్యతను పరిశీలించిన అన్నదాతలు రబీలో వరి, ఇతర పంటల సాగు చేపట్టారు. సకాలంలో తడులు అందకపోతే నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..: ఒడిశా అధికారులు నదిలో నీరు రాకుండా అడ్డుకట్ట వేసిన ప్రాంతాన్ని పరిశీలించాం. సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం. **- రమణ, ఏఈ, జలవనరుల శాఖ, పాతపట్నం**

(c) eenadu

ఊదలతో చేగోడీలు.. కొర్రలతో అరిసెలు..!

– న్యూస్‌టుడే, లావేరు

ప్రజల ఆసక్తి, అభిరుచికి తగ్గట్లుగా అడుగులేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు కొందరు మహిళలు. ట్రెండ్‌కు అనుగుణంగా వంటకాలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు.

చిరుధాన్యాలతో చేసిన తినుబండారాలను ప్యాక్ చేస్తున్న సిబ్బంది

లావేరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు మారుతీ మిల్లెట్స్ పేరుతో 12 రకాల తినుబండారాలు తయారు చేస్తున్నారు. నాబార్డు రుణసాయంతో యూనిట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చిరుధాన్యాలతో తినుబండారాల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దాన్ని సద్వినియోగం చేసుకుని ఈ యూనిట్ నెలకొల్పారు కొర్రలతో అరిసెలు, ఊదలతో చేగోడీలు, పప్పు చెక్కలు, రాగిపిండితో జంతికలు, ఉండలు, చిరుధాన్యాల పిండితో గులాబీ పువ్వులు, గవ్వలు, బిస్కెట్లు, సేంద్రియ బెల్లంతో వేరుశనగ ఉండలు, నువ్వు ఉండలు, సున్నుండలతో పాటు మరికొన్ని ప్రత్యేక పదార్థాలు తయారు చేస్తున్నారు. వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

ఆదాయం బాగుంది...

చిరుధాన్యాలతో తిరుబండారాల తయారీ యూనిట్ ఏర్పాటు చేసిన తొలి ఏడాది ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. ఆర్డర్స్‌పై తయారు చేసి ఇస్తున్నాం. గతం కంటే ఆదాయం బాగుంది. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కూడా ఇస్తున్నాం.

– పైడి నాగమణి, యూనిట్ నిర్వాహకురాలు

ఆరు తరాల సంబరం

గార మండలం రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేటలో ఒకే కుటుంబానికి ఆరు తరాల వారు ఒకే చోట చేరి సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. వేరే ప్రాంతాల్లో స్థిరపడిన అంబటి కుటుంబ సభ్యులు సుమారు 180 మంది వేడుకకు హాజరయ్యారు. గ్రామంలో ఓ చోట వేదిక ఏర్పాటు చేసుకుని భోగి, సంక్రాంతి, కనుమ సందడిగా నిర్వహించుకున్నారు. – న్యూస్‌టుడే, గార

అరసవల్లిలో గోపూజ

కనుమ వేడుకల్లో భాగంగా శుక్రవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో గోపూజ కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆవులకు పూజలు చేశారు. ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ఉమంగ్.. ఉపయోగాలు అనేకం..!

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్, బలగ(శ్రీకాకుళం)

కేంద్ర ప్రభుత్వం అనేక నూతన సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అర్హులందరికీ వాటిని చేరువచేసేందుకు, ఇతర ప్రభుత్వ సేవలను ప్రజలు సులువుగా పొందేలా ఉమంగ్ యాప్‌ను రూపొందించింది. దాంతో కలిగే ప్రయోజనాలు, విధి విధానాల గురించి తెలుసుకుందాం రండి..

యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 30కిపైగా విభాగాల సేవలు అందుబాటులో ఉన్నాయి. వైద్యం, రవాణా, న్యాయ సహాయం, పోలీస్, రేషన్, ఆధార్, నైపుణ్య శిక్షణ, విద్య, ఉద్యోగం, ఉపాధి, బిల్లుల చెల్లింపు, వృద్ధుల సంరక్షణ, పిల్లలు, మహిళలు, ఈ-డిస్ట్రిక్ట్ సర్వీసు, వ్యవసాయం, రైతులు, సామాజిక భద్రత, ఉపాధి కల్పన, పింఛన్లు, ప్రజాఫిర్యాదులు.. ఇలా అనేక సేవలు పొందేందుకు అవకాశం కల్పించారు.

❖ ఉద్యోగుల, పింఛన్ భవిష్య నిధి(పీఎఫ్), జీవన్ ప్రమాణ్ డిజిటల్ సర్టిఫికెట్ సేవలు పొందొచ్చు.

❖ పుర, నగరపాలక, ఆస్తి పన్ను, కుళాయి, పన్ను చెల్లింపులు, బస్సు, రైల్వే, విమాన సర్వీసులు వివరాలు, టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు.

❖ అత్యవసర(హెల్ప్‌లైన్) సేవల నంబర్లను గుర్తుపెట్టుకోవాల్సిన పని లేకుండా అవసరమైనప్పుడు నేరుగా యాప్ నుంచే ఫోన్ చేయొచ్చు.

❖ డిజీలాకర్‌లో 64 రకాల ధ్రువపత్రాలను భద్రపరచుకోవచ్చు.

❖ గూగుల్ ప్లే స్టోర్‌లో ఉమంగ్ అని టైప్ చేస్తే యాప్ వస్తుంది. దాన్ని ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ ద్వారా రిజిస్టర్ అవ్వాలి.

వరదకు తెలీదుగా కరకట్టలేదని..!

– న్యూస్‌టుడే, కొత్తూరు

వంశధార నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ముంపు భయంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల కరకట్టల్లేక.. మరికొన్ని చోట్ల ఉన్నవీ శిథిలావస్థకు చేరడంతో ఏటా వర్షాకాలంలో వరద సమీప గ్రామాలను ముంచెత్తుతోంది. ఒడిశాలో వానలు కురిసినా జిల్లాలోని తీర గ్రామస్థులకు కష్టాలు తప్పట్లేదు. గతంలో తెదేపా ప్రభుత్వం కరకట్టల పనులకు రూ.600 కోట్లు కేటాయించింది. వైకాపా వచ్చాక వాటిని రద్దు చేసింది. కూటమి సర్కారు దీనిపై దృష్టి సారించి పనులను పునరుద్ధరించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, జలుమూరు, నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం గ్రామీణం, పోలాకి, గార మండలాల్లో ప్రవహిస్తూ కళింగపట్నం వద్ద వంశధార సముద్రంలో కలుస్తుంది. వరద సమయంలో ఆయా మండలాల్లోని తీర గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు ఉండట్లేదు. పనులు చేపట్టేందుకు ఇదే సరైన సమయమని, ఆ తర్వాత మళ్లీ వర్షాలు కురిస్తే వీలు పడదని భావిస్తున్నారు.

మండలవారీగా ఇదీ పరిస్థితి..

❖ కొత్తూరు: సిరుసువాడ, కుంటిభద్ర, వసప, నివగాం, మదనాపురం, ఆకులతంపర, అంగూరు, కడుము, పెనుగోటివాడ, హంస, మాతల, కుద్దిగాం, పొన్నుటూరు గ్రామాలకు వరద ముంపు పొంచి ఉంది. నదిలో 50 వేల క్యూసెక్కుల ప్రవాహం పెరిగితే పెనుగోటివాడ జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. ఏటా వేల ఎకరాల్లో పొలాలు నీట మునుగుతున్నాయి.

❖ హిరమండలం: వరద పోటెత్తితే జిల్లేడుపేట, రుగడ, కొమనాపల్లి, తంగతంపర, గులుమూరు, కొండరాగోలు, దుర్బలాపురం, భగీరథపురం, అక్కరాపల్లి, కోరాడ గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పట్లేదు.

కొత్తూరు: నివగాంలో కరకట్ట నిర్మించాల్సిన కుమ్మరి వీధి ప్రాంతం

ఎల్ఎన్‌పేట: మిరియాపల్లి, ఎల్ఎన్‌పేట, స్కాట్‌పేట, వాడవలస, బసవరాజుపేట గ్రామాలు ఏటా వర్షాకాలంతో

నీటమునుగుతున్నాయి..

నది తీరగ్రామాలను వణికిస్తున్న ముంపు భయం

❖ సరుబుజ్జిలి మండలం తెలికిపెంట, యరగాం, పురుషోత్తపురం, ఇసుకలపేట, ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట, జలుమూరులోని కరకవలస, ముఖలింగం, అందవరం, నరసన్నపేట మండలం గెడ్డవానిపేట, మడపాం, బైరి, కరజాడ, పోలాకి, శ్రీకాకుళం గ్రామీణ మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో కరకట్టల్లేవు.

రెండు ప్యాకేజీల్లో పనులు..

వంశధార నది తీర గ్రామాల్లో కరకట్టల నిర్మాణానికి రెండు ప్యాకేజీల్లో పనులు ప్రతిపాదించాం. అనుమతులు రాగానే పాత ఏజెన్సీలతోనే భామిని మండలంలో మొదట కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో రెండో ప్యాకేజీ పనులు చేయిస్తాం. తీర ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, ఈఈ, వంశధార కరకట్టల విభాగం

ఆదేశాలు రాగానే అర్హులందరికీ ఇళ్లు..!

గృహనిర్మాణ సంస్థ పీడీ రమాకాంత్

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ముఖాముఖి

'జిల్లాలో అర్హులైన పేదలందరి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రెండు దశల్లో అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశాం. ఎన్టీఆర్ హౌసింగ్, ఎన్టీఆర్ నగర్ లబ్ధిదారులు సకాలంలో గృహనిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం కూడా అందజేస్తోంది' అని గృహనిర్మాణసంస్థ పథక సంచాలకులు(పీడీ) డి. రమాకాంత్ తెలిపారు. శాఖాపరంగా చేపడుతున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.

శరవేగంగా పనులు..

పీఎంఏవై(ప్రధానమంత్రి ఆవాస్ యోజన) అర్బన్ 2.0లో భాగంగా శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో 2,399 మంది లబ్ధిదారులను డిమాండ్ సర్వేలో గుర్తించాం. వారిలో 811 మందికి కొత్త ఇళ్లు మంజూరయ్యాయి. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. మిగిలిన 1,558 గృహాలు త్వరలో మంజూరు చేస్తాం.

12,909 మంది కల నెరవేర్చాం..

2014-19 మధ్య కాలంలో మంజూరై వివిధ దశల్లో ఉన్న 37,213 ఇళ్లకు రూ. 50.34 కోట్లు త్వరలో రానున్నాయి. గతేడాది నవంబరులో జిల్లా వ్యాప్తంగా సామూహిక గృహప్రవేశాలు చేపట్టి 12,909 మంది లబ్ధిదారుల కల నేరవేర్చాం. గృహ నిర్మాణాలకు కూటమి సర్కారు బీసీ, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, ఆదివాసీలకు రూ. లక్ష అదనపు ఆర్థిక సాయం అందజేస్తుంది.

ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు..

ఉగాది నాటికి జిల్లాలో 13,400 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు అందిస్తున్నాం. పీఎం గ్రామీణ్ ఆవాస్ యోజన ప్లస్‌లో భాగంగా జిల్లాలో 75,117 మంది లబ్ధిదారులను గుర్తించారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే అర్హులందరికి ఇళ్లు మంజూరు చేస్తాం.

పండగ పూట విషాదం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తంగి సాయికుమార్ (పాత చిత్రం)

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని మోదుగువలస పునరావాస కాలనీ (చిన్నకొల్లివలస) గ్రామానికి చెందిన తంగి సాయికుమార్ (25) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సరుబుజ్జిలి ఎస్సై బి. హైమావతి తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువకుడు భోగి రోజు రాత్రి ఏబీ రహదారిలో మరో వ్యక్తితో కలిసి హిరమండలం వైపు ద్విచక్రవాహనంతో వెళ్తుండగా.. స్కాట్‌పేట గ్రామం వద్ద రోడ్డుపై నడుస్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. తల్లిదండ్రులు ఏకాశి, ముగతమ్మ, ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు పండగ పూట మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నాటుసారా కేసులో ఏడాది జైలు, రూ.2 లక్షలు జరిమానా

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండలం వీరన్నపేటకు చెందిన పాలకొండ మల్లేషు 20 లీటర్ల నాటుసారాతో 2022 ఏప్రిల్ 19న పట్టుబడ్డాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దీనిపై టెక్కలి కోర్టు న్యాయమూర్తి యు.మాధురి తీర్పు వెలువరించినట్లు ఎక్సైజ్ అధికారి షేక్ మేరా సాహెబ్ తెలిపారు. సదరు వ్యక్తికి ఏడాది జైలు, రూ. 2 లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు. రిమాండ్ కోసం శ్రీకాకుళం జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఏపీపీ కె.సుధారాణి వాదనలు వినిపించారు.

డీఏ బకాయిల చెల్లింపుల్లో ఇబ్బందులు తొలగించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డీఏ బకాయిల చెల్లింపుల్లో అసమానతలు, సాంకేతిక ఇబ్బందులు తొలగించాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2018, 2019 సంవత్సరాలకు సంబంధించిన డీఏ నగదును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు దాదాపు రూ. 1100 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఆ చెల్లింపుల్లో అసమానతలు, సాంకేతిక ఇబ్బందులను వెంటనే తొలగించి అందరికీ నగదు అందేలా చేయాలని అధికారులను కోరారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

నంది వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు

జలుమూరు, న్యూస్‌టుడే: శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కనుమ పండగ సందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త పర్లాఖెముండి మహారాజు పేరున స్వామికి ఏకవారాభిషేకం నిర్వహించారు. ఈవో ఏడుకొండలు అధ్యక్షతన రాత్రి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఊరేగించారు. వందలాది మంది భక్తుల నడుమ నగిరికటకం వరకు గ్రామోత్సవం సాగింది. ప్రధాన ఆలయానికి అర్ధ రాత్రి సమయానికి స్వామి చేరుకున్నారు. కనుమ, కార్తిక పౌర్ణమి, మహాశివరాత్రి పర్వదినాల్లో మాత్రమే నంది వాహనంపై స్వామిని ఊరేగిస్తారని అర్చకులు పేర్కొన్నారు.

సేవలు సులభం.. ఆదాయం ఘనం..!

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

కూటమి అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖలో వివిధ సంస్కరణలు తీసుకొచ్చింది. వాటి ఫలితంగా పారదర్శకత, జవాబుదారీతనం పెరగడంతో పాటు గణనీయమైన ఆదాయమూ లభిస్తోంది. గతేడాది ఏప్రిల్ తర్వాత రిజిస్ట్రేషన్లు నెమ్మదించినప్పటికీ డిసెంబరు నెలాఖరులో క్రమంగా పెరుగుదల కనిపించింది.

శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 30,055 దస్తావేజులకు రూ. 92.53 కోట్ల ఆదాయం సమకూరింది. సెప్టెంబర్ నుంచి డిసెంబరు 25 వరకు 15 వారాల్లో 20,656 దస్తావేజులకు రూ. 66.41 కోట్ల వసూళ్లతో 88.42% వృద్ధి సాధించారు. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 68,108 దస్తావేజులకు రూ. 189.47 కోట్ల ఆదాయం రాగా.. ఈసారి అంతకంటే పెరిగే అవకాశం ఉందని జిల్లా రిజిస్ట్రార్(ఎఫ్ఏసీ) ఎ.నాగలక్ష్మి తెలిపారు.

సంస్కరణలు ఇలా..

- కూటమి ప్రభుత్వ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురావడంతో కాలయాపన తగ్గింది.
- హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుతో క్రయవిక్రయదారులకు మధ్యవర్తులతో పనిలేకుండా సహాయ కేంద్రంలోని సిబ్బంది ద్వారా సేవలు పొందుతున్నారు.
- అదనపు చెల్లింపులు, అవినీతి కట్టడికి ఆధార్, చరవాణుల ఓటీపీలతో లావాదేవీలను అందుబాటులోకి తీసుకొచ్చింది.
- రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే పత్రాలు సాఫ్ట్ కాపీగా చరవాణికి రావడంతో మరోసారి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పని జరుగుతోంది.
- ఎవరైనా లంచం అడిగినా, అదనపు వసూళ్లకు పాల్పడినా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించడంతో సేవల్లో పారదర్శకత పెరిగింది.

చీర కొనలేదని బాలిక ఆత్మహత్య

పెదవాల్తేరు (విశాఖపట్నం), న్యూస్‌టుడే: పండగ పూట ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. తనకు నచ్చిన వస్త్రాలు కొనలేదని మనస్తాపానికి గురై ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాతవెంకోజీపాలేనికి చెందిన 8వ తరగతి విద్యార్థిని సంక్రాంతి సందర్భంగా తనకు చీర కొనాలని తల్లిని అడిగింది. ఆమె ఇప్పటి నుంచే చీర ఎందుకంటూ లంగా వోణి తీసుకోమని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని ఓ అపార్టుమెంటులో కాపలాదారుగా పనిచేస్తున్న తాత వద్దకు వెళ్లింది. అక్కడి వాచ్‌మెన్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె ఎప్పటికీ రాకపోవడంతో తల్లి తన పెద్ద కూతురిని అక్కడికి పంపించింది. ఆమె ఎంతగా తలుపు కొట్టినా స్పందన లేదు. కిటికీ తెరిచి చూడగా.. విగతజీవిగా కనిపించింది. సీఐ ప్రసాద్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతురాలి తండ్రి దర్జీ కాగా.. తల్లి ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి స్వస్థలం రణస్థలం మండలంలోని తిరుపతిపాలెం గ్రామం. కొన్నేళ్ల కిందట ఉపాధి కోసం విశాఖ నగరానికి వెళ్లారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	180	315	335

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపైర్‌గా ఎంపిక

అనంత్

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 15 నుంచి జరుగుతున్న జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపైర్‌గా నీలంపేట ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు అనంత్ వ్యవహరిస్తున్నారు. నాలుగురోజుల పాటు విజయవాడ సీతారామ గార్డెన్స్‌లో పోటీలు జరుగుతున్నట్లు అనంత్ వివరించారు. పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నకిలీ టికెట్లతో మోసపోయిన కార్మికులు

శంషాబాద్, న్యూస్‌టుడే: నకిలీ టికెట్లతో గల్ఫ్‌కు వెళ్లడానికి యత్నించిన ఎనిమిది మంది ప్రయాణికులను అదుపులోకి తీసుకున్న ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎనిమిది మంది కార్మికులు ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో కువైట్ వెళ్లడానికి అదే ప్రాంతానికి చెందిన ఓ ఏజెంట్ వద్ద టికెట్లు తీసుకున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆ ఏజెంట్ డబ్బు తీసుకుని నకిలీ టికెట్లను ఇచ్చాడు. వాటితో కువైట్ విమానం ఎక్కడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు పరిశీలించి ఎనిమిది టికెట్లు నకిలీవిగా తేల్చడంతో భద్రతాధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అధికారుల విచారణలో ఏజెంట్ మోసం చేసినట్లు తేలింది. న్యాయం కోసం శ్రీకాకుళం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో వారిని వదిలేశారు.

సూర్యనారాయణ నిబద్ధత స్ఫూర్తిదాయకం


మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తదితరులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అకాల మరణం తెదేపాకు తీరని లోటని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం అరసవల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి అప్పలసూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, నిజాయతీ, క్రమశిక్షణతో కూడిన సూర్యనారాయణ నాయకత్వం స్ఫూర్తిదాయకమని, ఆయన నిబద్ధత ఎప్పటికీ ప్రేరణ అందిస్తుందని పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మేముచేయుచున్న బిజినెస్ మీరు వ్యక్తి గతంగా గాని మాతో కలిపి చేయుట ద్వారా మంచి లాభాలను పొందండి. వివరాలకు: 9391717772.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

HOUSE FOR SALE

శ్రీకాకుళం పట్టణంలో ప్రశాంతమైన గేటెడ్ కమ్యూనిటీ, స్వగృహ టీచర్స్ కాలనీలో 2BHK ఇండిపెండెంట్ ఇల్లు (26x50) మరియు ఖాళీస్థలములు అమ్మకమునకు కలవు. Cont:9440168546.

PLOT FOR SALE

200 Sq.y. East Facing Plot in SVN Layout Near Saraswati Temple, Vizianagaram. Direct Parties only. ✆ 9121782266.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Newly Launched Commercial Venture at Bhogapuram all Facings & 366 Sq.Yds. Tagarapuvalasa "Y" Jn. towards Airport Road. Suitable for all types of Business. 9992273747.

విశాఖలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చుట్టు ప్రక్కల అప్రూవ్డ్ ఇండ్ల స్థలాలు బ్యాంక్‌లోన్‌తో అమ్మకం. గరిమెళ్ళ శ్రీధర్ 9493640600,9246678028.

శ్రీకాకుళం దరి కేంద్రీయ విద్యాలయం చేరువలో సుడా అప్రూవ్డ్ లేఔట్‌లో 20x60 సైజు S, N/F ఇంటి స్థలాలు సేల్‌కు కలవు. పార్టీస్ ఓన్లీ ✆7702032037

JOBS

Sri Ganesh Jet Spares, Sec-Bad హెల్పర్స్(M) మాత్రమే కావలెను. 0-10, ఇంటర్, డిగ్రీ. Age: 18 to 25లోపు ప్రాధాన్యత. Ph: 9246378105

కనుమ రోజున భోగి సందడి

నందిగాం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: నందిగాం మండలంలోని పెద్దతామరాపల్లి గ్రామంలోని చేనేత కార్మికులు కనుమ రోజున భోగి పండగ చేసుకున్నారు. ఒకప్పుడు చేనేత కార్మికులు నేత కోసం వినియోగించే కర్రతో చేసిన పరికరాలు పండగ రోజుల్లో శుభ్రం చేసి ఆరుబయట ఉంచేవారు. కొందరు ఆకతాయిలు వీటిని భోగి మంటలో వేసేవారని, అందుకే సంక్రాంతి రోజున పరికరాలు శుభ్రం చేసి, కనుమ రోజున భోగి పండగను జరుపుకొంటున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ కొనసాగుతున్నట్లు చెప్పారు. ❖ మెళియాపుట్టి మండలం కొసమాల దేవాంగుల వీధిలోనూ కనుమ నాడే భోగి వేడుకలు నిర్వహించారు.

పెద్దతామరాపల్లిలో భోగి మంట

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

బ్రహ్మపుర- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు తిలారులో హాల్టు

జలుమూరు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర నుంచి విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి తిలారు రైల్వేస్టేషన్‌లోనూ ఆగనుంది. హాల్టును కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు పాల్గొంటారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

❖ ఇచ్ఛాపురం మండలం బలరాంపురం గ్రామంలో సభ్యులు స్త్రీనిధి రుణాలు పొందారు. వారి నుంచి వీవోఏ సగం మొత్తం తిరిగి తీసుకుని సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. విషయం తెలిశాక అధికారులు ఎంతో శ్రమించి కొంత మేర వసూలు చేసి సభ్యులకు అందించారు. ఇంకా రూ. 4.09 లక్షలు రికవరీ కావాల్సి ఉంది.

❖ నరసన్నపేట మండలం చోడవరం గ్రామానికి చెందిన వీవోఏ, అక్కడ పని చేస్తున్న సీసీ సంఘ సభ్యుల పేరుతో రుణాలు తీసుకున్నారు. సభ్యులకు విషయం తెలిసి నిలదీసి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీని అధికారులు సస్పెండ్ చేయగా.. వీవోఏ ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

అవకతవకలకు తావు లేదిక..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

పారదర్శకంగా స్త్రీ నిధి రుణాల మంజూరుకు చర్యలు

డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు తెలియకుండా కొందరు విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు(వీవోఏ), కమ్యూనిటీ కోఆర్డినేటర్లు(సీసీ)లు చేతివాటానికి పాల్పడుతున్నారు. రుణం చెల్లింపుల సమయంలో విషయం బయటి రావడంతో కొత్తగా రుణాలు పొందే పరిస్థితి లేక మహిళలు నష్టపోతున్నారు. స్త్రీ నిధి రుణాల మంజూరులో అవినీతికి ఆస్కారం లేకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం సాంకేతికతను అమల్లోకి తీసుకొచ్చింది.

గార మండలం బూరవల్లిలో మార్పులపై సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆఫ్‌లైన్ పద్ధతిలో లావాదేవీలు జరగడంతోనే అవకతవకలకు ఆస్కారం కలుగుతోందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో స్త్రీ నిధి రుణాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసింది. ఇంత వరకు బ్యాంకుకే పరిమితమైన ప్రక్రియను మండల సమాఖ్యలు, సంఘాలకు అనుసంధానం చేశారు. సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించి అసలు ఎంత, వడ్డీ రూపంలో ఎంత చెల్లించారు, ఇంకా ఎంత చెల్లించాలనేది లెక్కించి ఆన్‌లైన్‌లో చూపించేలా చర్యలు చేపట్టారు. రుణాలను వీవోఏలు సెర్ప్ ఎస్‌హెచ్‌జీ యాప్‌లో ప్రతిపాదించాక.. సభ్యురాలి వేలిముద్ర తీసుకున్న తర్వాత రుణం మంజూరు చేస్తారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో పాటు సేవల్లో పారదర్శకత పెరుగుతుందని ఏజీఎం సత్యనారాయణ తెలిపారు.

రుణపరిమితికి నిబంధనలు

❖ రుణాలు పొందేందుకు రుణ పరిమితులు నిర్దేశించారు. ఒక సమాఖ్య రూ. 10 లక్షల వరకు స్త్రీనిధి నోడల్ ఖాతాకు జమ చేస్తే అంతే మొత్తంలో రుణం పొందడానికి వీలు కల్పించారు.

❖ మండలానికి రూ. 18 కోట్ల నుంచి రూ. 25 కోట్ల వరకు రుణాలివ్వాలని నిర్ణయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 32 వేల మందికి రూ. 240 కోట్లు చెల్లించారు.

❖ గతంలో 12 శాతం వడ్డీని 11 శాతానికి తగ్గించారు. అందులో 2 శాతం సమాఖ్యల నిర్వహణ, వీవోఏలకు చెల్లిస్తారు. మిగిలిన 9 శాతం వడ్డీని బ్యాంకుకు చెల్లిస్తారు.

జిల్లాలో వివరాలిలా.. ★ డ్వాక్రా సంఘాలు: 42,800 ★ సభ్యుల సంఖ్య: 4.90 లక్షలు ★ ఈ ఏడాది స్త్రీనిధి రుణ లక్ష్యం: రూ. 278 కోట్లు ★ సంఘాలు: 32 వేలు

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

వృథా.. పట్టదా?

వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానంసైనూరులో జల్‌జీవన్‌మిషన్ కుళాయిలు మరమ్మతులకు చేరడంతో సరఫరా సమయంలో నీరు వృథాగా పోతోంది. దీనిపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందించలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సుమారు 10 ట్యాపులు పాడవడంతో వీధుల్లో నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి దామోదరరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి ట్యాపులు ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

వైభవంగా సీతమ్మతల్లి జాతర

పలాస పట్టణ శివారులో సీతమ్మతల్లి జాతర వైభవంగా సాగింది. ఏటా కనుమ రోజున అమ్మవారి జాతరను ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వహిస్తుంది. శుక్రవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి సీతమ్మతల్లిని దర్శించుకున్నారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, తెదేపా పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి కృష్ణారావు, కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, అభివృద్ధికమిటీ సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం కవిటి మండలం బల్లిపుట్టుగలోని కాలనీ వద్ద మోటార్ బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి నాటికి అన్ని గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు చేసి నీటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చినబాబు, తెదేపా మండలాధ్యక్షుడు పొందల కృష్ణారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బల్లిపుట్టుగలో మోటార్ ప్రారంభించి మహిళకు నీటితో బిందెను అందజేస్తున్న విప్ అశోక్

విద్యార్థి ప్రాణాలు కాపాడిన మెరైన్ కానిస్టేబుల్

సోంపేట, న్యూస్‌టుడే: సముద్ర తీరంలో ఓ విద్యార్థి లోపలకు కొట్టుకుపోతుండగా మెరైన్ కానిస్టేబుల్ యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఘటన బారువ తీరంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మందసకు చెందిన బీటెక్ విద్యార్థి జగదీశ్ ఆచార్య సముద్ర స్నానం చేస్తూ లోపలకు కొట్టుకుపోతున్నాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మెరైన్ కానిస్టేబుల్ శేషయ్య గమనించారు. వెంటనే యువకుడిని రక్షించి ఒడ్డుకు చేర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా శేషయ్యను పోలీసు సిబ్బంది అభినందించారు.

భవితకు భరోసా..!

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

అందరి పిల్లల్లా వాళ్లు ఆడుకోలేరు. మాట్లాడలేరు. ఇలాంటి ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు వివిధ అంశాలపై తర్ఫీదునిచ్చి సాధారణ విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రాలు పలు సేవలందిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వీటిని పటిష్ఠం చేయడంతోపాటు అవసరమైన సిబ్బందిని నియమించి మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ప్రతి కేంద్రంలో అక్కడున్న చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఇద్దరు ఐఈఆర్పీలు, ఒక ఆయా, ఫిజియోథెరపిస్ట్‌ను నియమించింది. ప్రత్యేక అవసరాల చిన్నారులపై తల్లిదండ్రులు కొంత శ్రద్ధ వహిస్తే వారిలో అనూహ్యమైన మార్పులు చూడొచ్చని అధికారులు చెబుతున్నారు.

మండలం	ప్రత్యేక అవసరాల పిల్లలు
కవిటి	225
ఇచ్ఛాపురం	300
కంచిలి	232
సోంపేట	284

కవిటిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు వ్యాయామ చికిత్స చేస్తున్న వైద్యురాలు

అందుబాటులో సేవలు..

★ ప్రత్యేక అవసరాల చిన్నారులకు వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటు

★ చిన్నారులకు వైకల్యాన్ని బట్టి ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు పంపిణీ

★ మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి ఐఈఆర్పీలు ఇంటికే వెళ్లి సేవలు

★ చిన్నారులను భవిత కేంద్రాలకు తీసుకొస్తున్నందుకు ఏడాదికి ఎస్కార్ట్ అలవెన్సు రూ.6 వేలు

★ రవాణా ఛార్జీలు రూ. 6 వేలు, హోంటెస్ట్ అలవెన్సు రూ. 3 వేలు

★ బాలికలకు ప్రత్యేక అలవెన్సులో భాగంగా అదనంగా రూ.2 వేలు

సద్వినియోగం చేసుకోవాలి..

భవిత కేంద్రాల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల పరికరాలతోపాటు వారికి అవసరమైన బోధన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం. కేంద్రాల్లో ఉన్న చిన్నారులు సాధారణ విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారు.

– భావన అమూల్య, ఫిజియోథెరపిస్టు, కవిటి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య : ఇచ్ఛాపురం పట్టణం రథంవీధి శివారులో మురుగు కాలువలో వ్యర్థాలు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది. **-వి.నారాయణరావు, ఇచ్ఛాపురం** **సమాధానం :** పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం గంగువాడలోని పెద్దవీధి, కాలనీ, ఎస్సీ వీధుల్లో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

★ త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం: **ఆశ, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం.**

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

దీపాన్ని సరి చేయండి..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాశీబుగ్గ పాత్ర క్వార్టర్స్ వీధిలో స్తంభానికి ఉన్న దీపం కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. దీనికితోడు మొక్కలు అడ్డొచ్చి వీధిలో చీకటి నెలకొంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి దీపాన్ని సరిచేయించాలని కోరుతున్నారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

శిథిలం.. భయం భయం

మండపల్లి కూడలిలో శిథిల భవనం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గతంలో ఈ భవనంలో రైతు సేవా కేంద్రం నిర్వహించేవారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో సమీపంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏవో కె.రామారావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఆదమరిస్తే ప్రమాదమే..!

సోంపేట మండలం గీతామందిర్ రోడ్డుపై కాలువల పలకలు ముక్కలవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానరోడ్డు నుంచి పలు వీధులకు దీనిపైనే రాకపోకలు చేస్తుంటామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని వారు విన్నవిస్తున్నారు. సమస్యను పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం.శాంతికి వివరించగా సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

దుర్వాసన.. దోమల బెడద

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాశీబుగ్గ 16వ వార్డు శ్రీనివాసనగర్ సమీపంలో పాత సినిమాహాల్ పక్కనే ఉన్న వీధిలో మురుగు పారుతోంది. దీంతో దోమల బెడద తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మురుగు నిల్వ ప్రాంతాలను పరిశీలించి రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపడతామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి శేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

నిర్మించి.. నిరుపయోగం

ఇచ్ఛాపురం మండలం మండపల్లిలో పాలవెల్లువ కేంద్ర భవన నిర్మాణ పనులు తూతూమంత్రంగా పూర్తి చేశారు. విద్యుత్తు, మిషనరీ తదితర సాంకేతిక వసతులు లేక నిరుపయోగంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. పక్కనే పనికిరాని మొక్కలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైందన్నారు. పీఆర్ ఏఈ హిమసాగర్ మాట్లాడుతూ అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

గుంతలు పూడ్చారు..

వజ్రపుకొత్తూరు మండలం పూండి-పాతపటె కులి మధ్య ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిపై అడుగుకొక గుంతతో ప్రమాదకరంగా మారింది. దీనిపై గతంలో 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి పూడ్చివేశారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

ఇచ్ఛాపురం పట్టణం మీదుగా అక్రమంగా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కట్టడితోపాటు నేరగాళ్ల కదలికలను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ సమస్యపై ఈనెల 11న 'ఈనాడు'లో 'భారీ వాహనాల రాకతో అవస్థలు' శీర్షికన వచ్చిన వార్తకు సీఐ ఎం.చిన్నంనాయుడు స్పందించి చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పైపులకు మరమ్మతులు

పలాస మండలం బంటుకొత్తూరులో పైపులైన్లు పాడవడంతో వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీనిపై 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి రాజేశ్ స్పందించి మరమ్మతులు చేపట్టారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాలువ శుభ్రం

ఇచ్ఛాపురం పుర పరిధి బెల్లుపడకాలనీ శివారులో అధ్వానంగా ఉన్న కాలువను శుభ్రం చేశారు. కాలనీవాసులు ముందుకు వెళ్లేందుకు చెత్త అడ్డుగా ఉండటంతో స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ నల్లి రమేష్ స్పందించి, సిబ్బంది ద్వారా సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

విముక్తి కలిగింది

కంచిలి మండలం ఎంఎస్‌పల్లి-కొల్లూరు మార్గంలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులుపడ్డారు. దీనిపై ఈ నెల 9న 'చెత్త నుంచి విముక్తి కల్పించండి' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన వార్తకు పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

వాడవాడలా సంక్రాంతి సంబరాలు

కంచిలి మండలం బూర్జపాడులో

వజ్రపుకొత్తూరులో కళాకారుల ప్రదర్శన

పలాస మండలం రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో గోపూజ

మందస: కంబరి పాలిపేరులో కొండదేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు

పల్లెలు సొంతగూటికి చేరిన వారితో కళకళలాడాయి. ఇళ్లన్నీ రంగురంగుల ముగ్గులు, పిండివంటల ఘుమఘుమలతో ఆహ్లాదం పరిఢవిల్లింది. చిన్నారుల అల్లరి, యువత ఆటలు, పెద్దల హడావుడితో సంక్రాంతి పండగ కొత్త శోభ సంతరించుకుంది. మూడు రోజులపాటు ఈ వేడుకలను పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి రోజున పూర్వీకులకు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కనుమ నాడు కుటుంబ సభ్యులతో విందు భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా వివిధ చోట్ల జరిగిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమానందజేశారు. – న్యూస్‌టుడే, బృందం

కొత్తపాలెంలో మత్స్యకారుల సంబరాలు

కవిటి మండలం జి.గొనపపుట్టుగలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామస్థులు

పేదలకు వస్త్రదానం

హరిపురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలం వెంకట వరదరాజపురంలో శుక్రవారం గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు అధినేత కొర్ల కన్నారావు పేదలకు వస్త్రాలు, అన్నదానం చేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేడుకగా దేకురుకొండ యాత్ర

పలాస పట్టణ శివారులో దేకురుకొండ యాత్ర ఘనంగా జరిగింది. సంక్రాంతి పర్వదినం రోజున దేకురుకొండయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు చిన్నారుల నుంచి పెద్దల వరకు కొండపై అంతా సందడి చేశారు. పైనుంచి పలాసను వీక్షించి కేరింతలు కొట్టారు. – న్యూస్‌టుడే, పలాస

బెల్లుపడలో ఉత్సవం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బెల్లుపడలో దేవరులతో వేణుగోపాలుడి తిరువీధి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, విద్యుత్తు దీపాలంకరణలతో శ్రీమహాలక్ష్మీదేవిని గ్రామానికి తీసుకొచ్చారు. పులకించారు. శుక్రవారం ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి, గ్రామానికి ఆహ్వానించే కార్యక్రమాన్ని ఉత్సవ ప్రతినిధులు జరిపారు. జగన్నాథస్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి శ్రీహనుమాన్ మందిరానికి తిరువీధిగా తీసుకువెళ్లారు.

ముగ్గురికి సర్కారు కొలువులు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి కుత్తుమ గ్రామంలో పండగ వేళ వివిధ విభాగాల్లో ప్రభుత్వ కొలువులకు ముగ్గురు ఎంపిక కావటంతో ఈ సంక్రాంతి ప్రత్యేకంగా నిలిచింది. ఈ మేరకు గురువారం విడుదలైన ఐబీపీఎస్ ఫలితాల్లో ఇప్పిలి ఝాన్సీశ్రీ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పీవోగా ఎంపికవ్వగా... అదేరోజు వచ్చిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో కర్రి హేమంత్ జీడీ (బీఎస్ఎఫ్), గార శ్రీకాంత్ జీడీ(సీఐఎస్ఎఫ్) కు ఎంపికయ్యారు. వీరికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సెస్ వసూలు.. రైతు దిగాలు

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వ్యవసాయ మార్కెట్ కమిటీలు సెస్ వసూలుకే పరిమితమవుతుండటంతో పుంత రహదారుల తీరు మారడం లేదు. నానాటికీ అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుంత రోడ్లను పట్టించుకోని మార్కెట్ కమిటీలు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 30 వరకు పుంత రోడ్లు ఉన్నాయి. సుమారు 40 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఈ ఉత్పత్తులపై మార్కెటు కమిటీ ఏటా సెస్ వసూలు చేస్తుంది. ఇందులో కొంత మొత్తం పుంత రహదారుల అభివృద్ధికి, రైతులకు వసతుల కల్పనకు వెచ్చించాల్సి ఉండగా ఆ దిశగా ఎటువంటి చర్యలు కానరావడం లేదు. పొలాలకు విత్తనాలు, ఎరువుల తరలింపు, అక్కడ నుంచి పంట ఉత్పత్తులు ఇంటికి, మార్కెటుకు తేవడానికి ఈ రహదారులు ఎంతో కీలకం. ప్రస్తుతం ఇవి అధ్వాన స్థితిలో దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం అయితే చాలు ఈ మార్గాలు మొత్తం బురదగా మారి కర్షకులు నడవడానికీ ఇబ్బంది పడుతున్నారు. పంట ఉత్పత్తులను ఆ రహదారుల గుండా మోసుకుని ప్రధాన రహదారుల వద్దకు తీసుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు ఖర్చులు తప్పడం లేదని వాపోతున్నారు. అభివృద్ధి జరిగితే నేరుగా పంట పొలాలకు వెళ్లే అవకాశాలు ఉంటాయని రైతులు కష్టం నుంచి గట్టెక్కి ఖర్చు ఆదా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న నెలవంక పుంత రోడ్డు

చర్యలు తీసుకుంటాం..

పుంత రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్ ద్వారా కృషి చేస్తున్నాం. నిధులు వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. – మణిచంద్ర ప్రకాశ్, ఏఎంసీ ఛైర్మన్, ఇచ్ఛాపురం

రోడ్లు నిర్మించాలి..

పుంత రహదారులు అధ్వానంగా ఉండటంతో పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నాం. పంటలు ఇంటికి తెచ్చేందుకు అదనపు ఖర్చులు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి పుంత రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. – ఎస్.బీమారావు, రైతు, కవిటి మండలం.

పర్యావరణ రక్షణకు పాటుపడదాం

మొక్క నాటుతున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ రక్షణకు దోహదపడాలని ఏపీ ఎన్‌జీవోస్, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరులో గురువారం యువత, చిన్నారులకు పలు పోటీలను నిర్వహించారు. రహదారికి ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామ కూడళ్లు, ప్రధాన రహదారులపై మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మన్మథరావు, వెంకట్, మోహన్, కిశోర్, లక్ష్మీనారాయణ, ప్రదీప్, జోగారావు పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో ఉద్దానం తీరం ప్రాంతం సందడిగా మారింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డొంకూరు, కవిటి, ఒంటూరు, కళింగపట్నం, ఇసకలపాలెం, గొల్లగండి, బారువ, ఏడూళ్లపాలెం, ఎర్రముక్కాం, రట్టిసిగలపుట్టుగ, బేతాళపురం, అక్కుపల్లి, బైపల్లి తదితర బీచ్‌లు సందర్శకులతో నిండిపోయాయి. పండగ కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి అంతా ఆనందంగా గడిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

త్రినాథస్వామికి సామూహిక మేళా

ఇచ్ఛాపురం: పూజ చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం బెల్లుపడ శివానంద గిరిపై త్రినాథస్వామి ఆలయంలో గురువారం సామూహిక త్రినాథ మేళాను ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి, మహాగణపతికి అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సామూహిక వ్రతాలను చేయించారు. నూతన ఉత్సవ మండపంపై త్రినాథస్వామి వారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, విశేషంగా అలంకరించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురంలో గురువారం అభయాంజనేయస్వామి ఆలయంలో సువర్చల సమేత స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా స్వామిని పల్లకీలో ఊరేగించారు. దంపతులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఆహ్లాదం దూరం.. నిర్వహణ లేక అధ్వానం

– న్యూస్‌టుడే, సోంపేట

సాగు, మంచినీటి అవసరాలు తీర్చే సోంపేట చదంబాల చెరువు నానాటికీ అధ్వానంగా తయారవుతుంది. ఈ కాసారం నుంచి మూడోవంతు సోంపేట పంచాయతీ ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడం తోపాటు వందల ఎకరాలకు సాగునీటి సదుపాయం, వేసవిలో అవసరాలు తీర్చే ప్రధాన వనరుగా ఉండేది. నాలుగు చోట్ల నిర్మించిన స్నాన వాటికలను స్థానికులు సద్వినియోగపర్చుకుంటూ చెరువు ఆవరణను శుభ్రంగా ఉంచేవారు. దీని అభివృద్ధికి రెండు దశాబ్దాల నుంచి ప్రతిపాదనలు అమలుకు నోచుకోకపోగా కనీస నిర్వహణ లేక పరిసరాలు అధ్వానంగా మారాయి.

రూపుమారిన చదంబాల చెరువు

✤ నాలుగువైపులా 12 అడుగుల ఎత్తుతో పాటు 15 అడుగుల వెడల్పుతో ఉన్న గట్ల మధ్య కోనేరు మాదిరిగా చదంబాల చెరువు ఉండటంతో ఆక్రమణలకు అవకాశం లేకుండా పోయింది. నివాసిత గృహాలకు దగ్గరలో కవిటి రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రోడ్డు పక్కనే ఉండటంతో అందరికీ అందుబాటులో ఉన్న ఈ నీటివనరును సేదతీర్చే కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు గతంలో ప్రయత్నాలు చేపట్టారు. రెండు దశాబ్దాల కిందట చెరువు చుట్టూ 150 కొబ్బరిమొక్కలు నాటగా ఎనిమిదేళ్ల కిందట వరకు ఏటా రూ.లక్షకు పైగా ఆదాయం పంచాయతీకి సమకూరింది. తిత్లీ తుపానులో సగానికి పైగా కొబ్బరిచెట్లు నేలకొరగడంతో పరిస్థితి మారిపోయింది.

✤ ఎగువభాగం నుంచి వరదనీటితో పాటు గొల్లవాని చెరువు ద్వారా మిగులు నీరు చదంబాల చెరువులోకి చేరేది. మిగులు జలాలను పోలీసు చెరువులోకి అక్కడ నుంచి బీలప్రాంతానికి వరదనీరు వెళ్లే విధంగా అప్పట్లో ఏర్పాటు చేసిన కాలువ వ్యవస్థ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. వరదనీరు వీధుల్లోకి ప్రవేశిస్తుండగా చెరువులు నిండిన తరువాత రోడ్లపైకి నీరు చేరి నిర్మాణాలు నాశనమవుతున్నాయి.

✤ చదంబాల చెరువు గట్టుపై నడకమార్గంతోపాటు పాటు బోటుషికారు, కూర్చోడానికి బల్లలు ఏర్పాటు చేసేందుకు గతంలో ప్రతిపాదనలు చేశారు. రూ.26 లక్షల ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేశారు. పోలీసు చెరువు ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పనులు ముందుకు సాగక నిధులు వెనక్కి మళ్లాయి.

గుర్రపు డెక్కతో చదంబాల చెరువు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వవిప్ అశోక్‌తోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోటరీ, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదంబాల చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఆక్రమణల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవాలని విప్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

– ఎం.శాంతికుమారి, డిప్యూటీ ఎంపీడీవో

నేడు శ్రీరామహనుమత్ దర్శనోత్సవం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలో కొలువుతీరివున్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో హనుమత్ దర్శనోత్సవ వేడుకలను శనివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ధర్మకర్త ప్రత్తి శ్రీలక్ష్మి తెలిపారు. ఏటా కనుమ మరుసటిరోజున ఈ వేడుకలు నిర్వహించడం పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయమని ఆమె తెలిపారు.

మురుగు పరుగు..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో సాయి కాలనీ శివారులో కాలువ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు పారుతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు అందులో దిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మురుగునీరు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సిబ్బందిని పంపి మురుగునీటి ఇబ్బందులు తొలగిస్తామని పారిశుద్ధ్య విభాగ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

నేస్తమా.. కుశలమా..!

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం కరవంజ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుకుని పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు.

బకాయిల చెల్లింపుపై హర్షం

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉద్యోగులు ఎదురు చూసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం భోగి రోజున చెల్లించడం ద్వారా నిజమైన సంక్రాంతిని జరుపుకొన్నామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా శాఖ సంయుక్త కార్యదర్శి కత్తిరి మోహనరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఏడేళ్ల క్రితం నాటి డీఏలను చెల్లించి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా నిలిచిందని మోహనరావు ఉద్ఘాటించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: పోలాకి మండలం మబగాంలో కాలువలు శుభ్రం చేయడం లేదు. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.- **ఉమామహేశ్వరరావు, స్థానికుడు** ★ తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. కాలువల్లో చెత్త వేయకుండా స్థానికులు సహకరించాలి. - **శోభారాణి, పంచాయతీ కార్యదర్శి, మబగాం** - న్యూస్‌టుడే, పోలాకి

?: నందిగాం మండలం మద్దిలివానిపేట గ్రామంలోని బోరుబావి నెల రోజులుగా పనిచేయడం లేదు. తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. - **కె.చలపతి, గ్రామస్థుడు**
★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. - **లక్ష్మణరేఖ, పంచాయతీ కార్యదర్శి, పెద్దతామరాపల్లి** - న్యూస్‌టుడే, నందిగాం

సందడే.. సందడి..!

అతిథులను సత్కరించిన కళింగ కోమట్ల సంఘ ప్రతినిధులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక కళింగ కోమట్ల సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి వేళ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకలు సందడిగా జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి అల్లుళ్లు, కుమార్తెలు కుటుంబ సమేతంగా తరలిరావడంతో మైదానం కిక్కిరిసిపోయింది. బుల్లితెర నటుడు నూకరాజు స్కిట్‌లతో ఆకట్టుకున్నారు. నరసన్నపేటకు చెందిన పలువురు మహిళల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళింగ కోమట్ల సంఘ అధ్యక్షుడు ఊణ్న వెంకటేశ్వరరావు, ప్రతినిధులు పొట్నూరు రమేష్, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు, బోయిన బాలకృష్ణ, పట్నాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భవనం నిరుపయోగం.. స్థలం అన్యాక్రాంతం

కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీకాకుళం రహదారిలో పాత రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రైతు ఉత్పత్తిదారుల సంఘ భవనం నిరుపయోగంగా మారింది. దీనికి ఆనుకుని ఉన్న స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. భవనాన్ని మెరుగుపరిచి, వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై తహసీల్దార్ వై.జోగారావు మాట్లాడుతూ.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట గ్రామీణం, పోలాకి

భూగర్భ జలాలు పెంచాలనే ఆలోచనతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ప్రభుత్వ భవనాల పైకప్పులపై పడే వర్షం నీరు భూమిలోకి ఇంకే విధంగా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ పేరుతో కొన్ని నెలల కిందట ఇంకుడు గుంతలు నిర్మించారు. ఆశయం బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.

నిధులు వృథా

భవనాల పైకప్పులపై గోడలు లేకపోవడంతో వర్షం నీరు నిల్వ ఉండటం లేదు. ఇంకుడు గుంతల్లోకి చుక్క నీరు సైతం చేరే పరిస్థితి లేదు. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. గుంతలు తవ్విన తర్వాత వాటిపై పలకలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదకరంగా మారాయి. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

తవ్వకాలు ఇలా..

ఐసీడీఎస్ ప్రాజెక్టు	ఇంకుడు గుంతలు
సారవకోట	11
నరసన్నపేట	12

చిన్నకిట్టాలపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రమాదకరంగా ఇంకుడు గుంత

పైపులు ఎప్పుడు వేస్తారో

రెండున్నర మీటర్ల పొడవు, వెడల్పుతో వీటిని నిర్మించారు. గుంతల చుట్టూ గోడలు నిర్మించి లోపల గులకరాళ్లు, ఇసుక వేశారు. పైకప్పులపై పడే వర్షపు నీరు గుంతలోకి చేరడానికి పైపులు అమర్చలేదు. అరకొరగా పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సారవకోట మండలంలో సారవకోట, అలుదు, బుడితి, చిన్నకిట్టాలపాడు, శివరాంపురం, చిన్నగుజ్జువాడ తదితర కేంద్రాల పరిధిలో వీటిని నిర్మించారు. పోలాకి, నరసన్నపేట మండలాల్లో ఈదులవలస, ఈదులవలస కాలనీ, రాళ్లపాడు, తోటాడ, మబుగాం, సుసరాం-2, దశుమంతుపురం, లుకలాం-2 వంటి కేంద్రాల పరిధిలో పనులు చేపట్టారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఒక్కో ఇంకుడు గుంతను రూ.20 వేల అంచనా వ్యయంతో నిర్మించాం. నిధుల లభ్యత మేరకు పనులు జరిగాయి. పైకప్పుల చుట్టూ గోడ నిర్మిస్తే వర్షం నీరు గుంతల్లోకి చేరే అవకాశం ఉంటుంది. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం.

- జి.భార్గవి(పీఆర్), శ్రీనివాసరావు (ఆర్‌డబ్ల్యూఎస్), ఏఈలు, సారవకోట, పోలాకి

పేదలకు దుప్పట్ల అందజేత

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని నౌపడ గ్రామంలో నారీమణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మంది నిరుపేదలకు గురువారం దుప్పట్లు, నిత్యావసర సరకులను అందజేశారు. చెన్నూరు దుర్గారావు బాబ్జీ, లక్ష్మీ దంపతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

కొత్తూరు మండలం మెట్టూరు బిట్- 2 పంచాయతీ అడవికొత్తూరు గ్రామంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్ తెరచి ఉండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందినంత ఎత్తులో గృహాలకు దగ్గరగా పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

బోరు.. బేజారు

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో శిథిలమైన చేతిపంపు నిరుపయోగంగా మారింది. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. సమీపంలో బావులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటశ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్లాట్‌ఫాం మరమ్మతులను గుర్తించామని, త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఎప్పుడు పూర్తి చేస్తారో.?

పోలాకి మండలం తోటాడ నుంచి డీపీఎన్ రహదారికి అనుసంధానంగా ఉండే బీటీ రోడ్డు పనులు సగంలోనే వదిలేశారు. రూ.1.20 కోట్ల నిధులు మంజూరవడంతో గతేడాది ఎమ్మెల్యే రమణమూర్తి పనులు ప్రారంభించారు. కిలోమీటరు మేర అసంపూర్తిగా విడిచి పెట్టడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు చేపడతామని మండల ఇంజినీర్ గోవిందరావు అన్నారు. - న్యూస్‌టుడే, పోలాకి

అభివృద్ధికి ఆమడ దూరం

పాతపట్నంలోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం అభివృద్ధికి దూరంగా ఉంది. కొన్నేళ్ల క్రితం దీన్ని నిర్మించారు. నిర్వహణ గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారింది. ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం, వ్యాయామశాల అధ్వానంగా తయారయ్యాయి. సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో క్రీడాకారులు వెళ్లడం లేదు. నిధులు మంజూరు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, పాతపట్నం

ఎట్టకేలకు కొత్తరూపు

స్పందనకు వందనం

కొత్తూరు మండలం నివగాం నుంచి మదనాపురం మీదుగా సోమరాజపురం కూడలికి వెళ్లే జీవన్ రహదారి ఎట్టకేలకు మెరుగుపడింది. ఈ మార్గంలో కొత్తూరు, హిరమండలం పరిధిలోని సుమారు పదివేల మంది ప్రజలు రాకపోకలు సాగించే వారు. ఏళ్లుగా అభివృద్ధి చేయక పోవడంతో అవస్థలు ఎదుర్కొనే వారు. దీనిపై పలుమార్లు ఈనాడులో కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.2.1 కోట్లు మంజూరు చేయడంతో పనులు పూర్తయ్యాయి. - న్యూస్‌టుడే, కొత్తూరు

అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరం

నివగాంలో వేడుకల్లో పాల్గొన్న కేంద్ర, రాష్ట్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, కుటుంబ సభ్యులు

అబ్బాయిపేటలో లక్ష్మీపేరంటాల దర్శనానికి వెళ్తున్న గ్రామస్థులు

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ వేడుకలు సందడిగా నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి పెద్దలు, పిల్లలు, యువత సందడి చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగరేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వీకులను తలుచుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పశువులను సుందరంగా అలంకరించారు. - న్యూస్‌టుడే బృందం

మెళియాపుట్టి రాధాకాంత గోవిందస్వామి ఆలయంలో విజేతలకు బహుమతుల ప్రదానం

గొర్లెబందలో నృత్యం చేస్తున్న గిరిజనులు

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు

పోలాకి మండలం గొల్లలవలసలో వేడుకలు

ఘనంగా కలమట జన్మదినం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని మాతల గ్రామంలో కలమట వెంకటరమణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు మాతల చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తల మధ్య ఆయన కేక్ కోశారు. అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

కలమటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మండల ఎకరాలకు సాగునీరందిస్తున్న దర్శవరం అభివృద్ధికి నిధులు మంజూరవడం, తిలారు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా గురువారం తిలారులో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చిత్రపటాలను కొనేరు వరకు ఊరేగించారు. అనంతరం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, గ్రామస్థులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటలో కొలువైన ఉజ్జయినీ మహాకాళి (ఉజ్జిడమ్మ) ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచి కోరుకొండ శంకర్ బాబు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గాయాలు

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డినవలస వద్ద గురువారం రాత్రి బస్సు ఢీకొని గ్రామానికి చెందిన బి.రమణకు గాయాలయ్యాయి. కాలినడకన జాతీయ రహదారి దాటుతుండగా ఊరిలోకి వస్తున్న క్రమంలో విశాఖపట్నం నుంచి ఒడిశా రాష్ట్రం పర్లాఖిముండి మీదుగా భవానీపట్నం వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు హుటాహుటిన నరసన్నపేట, అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.అనిల్‌కుమార్ తెలిపారు.

పద్మనాభగిరిపై సందడిగా జాతర

పూజలందుకుంటున్న దేవతామూర్తులు

జలుమూరు, న్యూస్‌టుడే: శైవక్షేత్రం దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగేశ్వర స్వామి క్షేత్రపాలకుడు పద్మనాభగిరిపై వెలసిన శ్రీపద్మనాభస్వామి ఆలయం వద్ద కనుమ జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయానికి అర్చకులు కొండపై ఉన్న ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1500 మెట్లు ఎక్కి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జలుమూరు, సారవకోట, హిరమండలం, ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి మండలాలకు చెందిన వేలాది మంది పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక సంతతోటలో శుక్రవారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేద పండితుడు చామర్తి సాయి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం

సారవకోట, న్యూస్‌టుడే: కోదడ్డపనస మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు బోర ధర్మారావు (47) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయన 2013- 18 మధ్య సర్పంచిగా పనిచేశారు. కోదడ్డపనస అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా 2020 నుంచి కొనసాగుతున్నారు. తల్లి అన్నపూర్ణమ్మ, అక్కాచెల్లెళ్లు ఉన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సర్పంచి బాడాన కృష్ణారావు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు సంతాపం తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం సీది వంతెన వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టెక్కలికి చెందిన ఎస్.నర్సింహమూర్తి సీది నుంచి టెక్కలి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని పాతపట్నం సామాజిక ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ

సేవామార్గంలో నడుద్దాం

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.చిన్నప్పన్న, ఉపాధ్యక్షుడిగా చింతల సాయి, కార్యదర్శిగా ఆర్.పరమేశ్వరరావు, ఉప కార్యదర్శిగా జె.ఖగేష్, కోశాధికారిగా కె.వెంకటేశ్‌తో పాటు 8 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సేవామార్గంలో నడుస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఈ సందర్భంగా ప్రమాణం చేశారు. సంఘం ప్రతినిధులు వైకుంఠరావు, ఎర్రన్నాయుడు పాల్గొన్నారు.

కానరాని శుభ్రత

కొత్తూరు మండలం నివగాం కుమ్మరవీధిలోని తాగునీటి మినీ ట్యాంకు వద్ద కుళాయిలకు నాచు పట్టి, ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. స్థానికులు ఇక్కడ నుంచే తాగునీటిని తీసుకెళ్తున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తూతూమంత్రంగా చర్యలు చేపట్టి, వదిలేశారని పలువురు వాపోతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇబ్బందులు తీరుస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్ అన్నారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

యువత క్రీడల్లో రాణించాలి

జలుమూరు, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కరవంజలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించే జాతరలో గురువారం ఆయన పాల్గొన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పోలాకి జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, సర్పంచి జుత్తు నేతాజీ, నీటి సంఘం అధ్యక్షుడు జుత్తు అప్పలనాయుడు, సాయి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

పచ్చగడ్డి పెంచండి.. పైసలిస్తాం

పాడి రైతులకు వంద శాతం రాయితీ

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

ఉర్లాంలో సాగు చేస్తున్న పశుగ్రాసం

రైతులకు పాడి, పంటలు రెండు కళ్లలాంటివి. పాడిని ప్రోత్సహించి అన్నదాతలకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఉపాధిహామీ పథకం(వీబీజీ రామ్‌జీ) కింద పశుగ్రాసం పెంచే వారికి వంద శాతం రాయితీ అందిస్తోంది. ఈ అవకాశాన్ని అర్హులంతా వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖాధికారులు కోరుతున్నారు.

నియోజకవర్గ పరిధిలో పాడి పశువుల సంఖ్య (వేలల్లో)

మండలం	ఆవులు, గేదెలు	మేకలు, గొర్రెలు
నరసన్నపేట	25	12
పోలాకి	17	20
సారవకోట	9	13
జలుమూరు	20	30

50 సెంట్ల వరకు అనుమతి

ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంది. జాబ్‌కార్డు కలిగిన వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుంది. 5 ఎకరాల లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులు. వివరాలకు రైతు సేవాకేంద్రం, పశువైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు చేయాలి. పరిశీలించి నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారు. అనుమతి లభించిన వారు అధికారుల పర్యవేక్షణలో పశుగ్రాసం పెంచాల్సి ఉంటుంది.

ఆర్థిక స్థిరత్వానికి దోహదం

పచ్చగడ్డి వల్ల పాడి పశువులకు తగిన పౌష్టికాహారం సులభంగా లభిస్తుంది. పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుంది. సాగుచేసిన రైతులకు వ్యవసాయ, విత్తన, ఎరువుల ఖర్చులకు ప్రభుత్వం పూర్తి రాయితీ ఇస్తోంది.

- ఎస్.ఓంకార్, పశు వైద్యాధికారి(ఇన్‌ఛార్జి), నడగాం

రాయితీ ఇలా (రూ.ల్లో)

విస్తీర్ణం (సెంట్లలో)	కూలీల వేతనం	సామగ్రి ధర	ప్రభుత్వ ఆర్థిక సాయం
50	15,000	17,992	32,992
40	12,000	14,394	26,394
30	9,000	10,785	19,785
20	6,000	7,197	13,197
10	3,000	3,559	6,559



(c) eenadu

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

సంక్రాంతి శోభ

ఆమదాలవలస గ్రామీణం: నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. ఆమదాలవలస మండలం లొద్దలపేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం ముగ్గులు, క్విజ్, నృత్య, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పొందూరు మండలంలోని లైదాం గ్రామంలో పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. సరుబుజ్జిలి మండలంలో కనుమ రోజు పలు గ్రామాల్లో రైతులు గోవుల పండగను శుక్రవారం వైభవంగా చేశారు.

లొద్దలపేటలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్థులు

నిత్యాన్నదానానికి సామగ్రి వితరణ

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు శ్రీసత్య సాయి సేవా సమితి రోజూ 55 మంది నిరుపేదలకు భోజనాలు పంపిణీ చేస్తోంది. సంక్రాంతి పండగను పురస్కరించుకొని పొందూరు లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ యర్రా మల్లిబాబు దంపతులు వీటి కోసం క్యారేజ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వినర్ దున్నా రాధాకృష్ణతో పాటు, సేవాదళ్ కోఆర్డినేటర్ విజయసాయి పాల్గొన్నారు.

క్యారేజ్‌లు బహూకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కూర్మనాథుని సేవలో పట్నా హైకోర్టు జడ్జి

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గున్ను అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. అర్చకులు మర్యాదపూర్వకంగా వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వదించి.. స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

జస్టిస్ గున్న అనుపమ చక్రవర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

రణస్థలం, న్యూస్‌టుడే: గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం రణస్థలంలో శివాలయం నుంచి ఎస్సీ కాలనీ వరకు నిర్మించిన సిమెంటు రహదారిని ప్రారంభించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో రాష్ట్రం ముందడుగు వేస్తుందన్నారు. సర్పంచి పి.భానోజీ నాయుడు పాల్గొన్నారు.

అరకొర వసతులు.. అధ్వానంగా పార్కులు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నగర ప్రజలు సాయంత్రం సమయంలో పచ్చని చెట్లు, విద్యుత్తు కాంతుల నీడలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో సేదతీరేందుకు శ్రీకాకుళం నగరంలో చెప్పుకోదగ్గ ఒక్క పార్కు లేదు. గతంలో విద్యుత్తు కాంతులతో కూడిన ఫౌంటెయిన్లతో పచ్చని చెట్లు, పిల్లల ఆట వస్తువులతో ఆహ్లాదకరంగా ఉండే గాంధీ పార్కు, ఏడురోడ్ల కూడలివద్ద గల రివర్ వ్యూ పార్కు, కృష్ణా పార్కు, న్యూకాలనీలోని డైమండ్ పార్కులతో పాటు నగరం లోని అన్ని ప్రాంతాల్లో పార్కుల నిర్వహణను నగరపాలకసంస్థ అధికారులు విస్మరించారు. దీంతో పార్కుల్లో కనీస సౌకర్యాలు లేక, పిల్లలకు ఆట వస్తువులు లేక ప్రజలకు పార్కులకు దూరం అవుతున్నారు.

మౌలిక సదుపాయాలకు నోచుకోని ఎల్‌బీఎస్ పార్కు

అభివృద్ధికి చర్యలు

నగరంలో దశలవారీగా పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. ప్రతిపాదనలు పంపించి నిధుల ఆధారంగా అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

– కమలాకరరావు, నగరపాలక సంస్థ డీఈ, ఇన్‌ఛార్జి కమిషనర్

కనుమరుగైన ఫౌంటెయిన్‌లు

గతంలో పలు పార్కుల్లో ఉండే ఫౌంటెయిన్లు పూర్తిగా పాడైపోయాయి. పార్కుల్లో మొక్కలు ఎండిపోయి పచ్చదనం కనుమరుగైంది. గూనపాలెం, హడ్కోకాలనీ, జానకీరామ్ నగర్, డీసీసీబీ కాలనీ, తెలుగుముసలయ్య కాలనీల్లో పార్కులు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం అందుబాటులో ఉండే కొన్ని కాలనీల్లోని పార్కుల్లో ప్రహరీలు, ఆట వస్తువులు, కూర్చునే బెంచీలు విరిగిపోవడంతో ఎవరూ వెళ్లడం లేదు. ఆయా పార్కులు చెత్తతో అధ్వానంగా తయారయ్యాయి. ఇందిరా ప్రియదర్శిని, ఎల్.బి.ఎస్ వంటి పార్కుల్లో ప్రజలు కూర్చునే బెంచీల సమీపంలో పాముల పుట్టలు ఉన్నా వాటిని తొలగించే నాథుడే లేడు. పార్కుల్లో పూర్తిస్థాయిలో పిల్లల ఆట వస్తువులు, విద్యుత్తు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పార్కులకు దూరం అవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై యంత్రాంగం చర్యలు తీసుకొని అన్ని వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ), కీర్తిక, సన్‌మ్యాక్స్: **మన శంకరవరప్రసాద్‌గారు** ★ కిన్నెర – **భర్త మహాశయులకు విజ్ఞప్తి** ★ మారుతి, సూర్య, కీర్తిక: **అనగనగా ఒక రాజు** ★ సరస్వతి: **రాజాసాబ్** ★ కీర్తన: **నారీనారీ నడుమ మురారీ** – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో)

★ టమాటాలు 28 ★ వంకాయలు 40 ★ బెండ 58 ★ పచ్చిమిర్చి 70 ★ కాకర 46 ★ బీర 54 ★ క్యాలీఫ్లవర్ 25/30 ★ క్యాబేజీ బుట్ట 20 ★ క్యారెట్ 44 ★ దొండ 40 ★ బంగాళదుంపలు 20/22 ★ ఉల్లిపాయలు 20/25 ★ గోరు చిక్కుడు 60 ★ ఆనప 20 ★ అరటికాయ(జత) 16 ★ గోల్కొండ చిక్కుడు 30 ★ అల్లం 90 ★ వెల్లుల్లి 140 ★ బీట్‌రూట్ 30 ★ క్యాప్సికమ్ 70 ★ కీరదోస 40 ★ క్రమెండలం 30 ★ ముల్లంగి 26 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

భక్తజన జాతర

జి.సిగడాం: మెట్టవలస కొండపై మల్లికార్జునస్వామి జాతరలో రద్దీ

సరుబుజ్జిలిలోని దంతపురి జాతరలో..

శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల వ్యాప్తంగా సంక్రాంతి సందర్భంగా జాతర్లు జనంతో కిక్కిరిసి పోయాయి. ఎక్కడికక్కడ భక్తులు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకుని, తమ మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు ముర్రాటలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. – న్యూస్‌టుడే బృందం

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

పెద్దపాడు అప్పన్నమ్మతల్లి వారి కొత్తపం సందర్భంగా ఆలయం ముందున్న భక్తులు

పొగ మంచు.. ముంచేట్టు!

పొందూరు పట్టణ ప్రధాన రహదారైన శ్రీకాకుళం - రాజాం గురువారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం 8.30 అయినా దీని ప్రభావం తగ్గకపోవడంతో రహదారి కనిపించక వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక పాతపొందూరు, రాపాక, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో వాహనాలు రోడ్డుపై నిలిపివేశారు. ప్రైవేటు ట్రావెల్ బస్సులు, వాహనదారులు లైట్లు వేసుకుని మంచు తగ్గే వరకు రోడ్డు అంచున ఉండి, అనంతరం రాకపోకలు సాగించారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

పైడితల్లి జాతర ప్రారంభం

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలం గెడ్డకంచరాం గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర శుక్రవారం ప్రారంభమైంది. పల్లెలో ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి ముర్రాటలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూజలందుకుంటున్న అమ్మవారు

తాగునీరు వృథా

శ్రీకాకుళం నగరంలోని విలీన పంచాయతీ కిల్లిపాలెంలో తాగునీటి పైపు లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. ఫలితంగా శ్రీకాకుళం, గార మండలాల్లోని శివారు గ్రామాలకు సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదు. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

దుర్గాదేవి అమ్మవారికి పూజలు

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలం మదుపాం గ్రామంలో దుర్గాదేవి వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పల్లె చల్లదనం కోసం అమ్మవారికి గ్రామస్థులు ముర్రాటలను సమర్పించారు. మూడు రోజులపాటు జాతర నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు పేర్కొన్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం

పొందూరు మండలం బానాం గ్రామ పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం పునాదుల దశలోనే నిలిచిపోయింది. దీంతో వైద్యానికి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. చిన్న చిన్న సమస్యలకు కూడా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం పూర్తిచేయాలని కోరుకుంటున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

రక్షణ గోడ నిర్మించాలి

సరుబుజ్జిలి మండలంలోని అమ్మతలింగా నగరం రహదారిలో వంశధార కుడి ప్రధాన కాలువ వంతెన వద్ద రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రక్షణ గోడ లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై వంశధార జేఈ జగదీశ్వరరావు వద్ద 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలువ గట్టును పరిశీలించి రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పనికిరాని మొక్కలు తొలగించరూ..

జి.సిగడాం మండలం గొబ్బూరులోని ఉన్న చెరువు పనికిరాని మొక్కలతో నిండిపోవడంతో సాగునీరు సరిగా రావడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో పశువులు సైతం నీళ్లు తాగేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉందని వాటిని తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణతో ప్రస్తావించగా పరిశీలించి ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువులో పనికిరాని మొక్కలు తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

రహదారిపైనే చెత్త

జే ఆర్‌పురంలోని సీతంపేట వెళ్లే మార్గంలో సినిమా హాల్ పక్కన రహదారిపైనే చెత్త వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా మొన్ననే తీయించామని, మళ్లీ వేసేస్తున్నారని చెత్తను తొలగించి, అక్కడ మళ్లీ వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, రణస్థలం

మలుపులు.. పొంచి ఉన్న ప్రమాదాలు

బూర్జ మండలంలోని పలు గ్రామీణ రహదారుల్లో మలుపుల వద్ద ఇరువైపులా పనికిరాని మొక్కలు విస్తరించడంతో ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. బూర్జ-మామిడివలస రహదారి, బూర్జ-నీలాదేవిపురం, నీలాదేవిపురం-టీఆర్‌రాజుపేట, మదనాపురం- సరుబుజ్జిలి రహదారితో పాటు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్‌తో ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బూర్జ

పేదలకు దుస్తులు, బియ్యం పంపిణీ

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలో బరాటం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కనుమ సందర్భంగా శుక్రవారం పేదలకు దుస్తులు, బియ్యం, నగదు అందజేశారు. మూడు దశాబ్దాల నుంచి వస్తున్న ఆనవాయితీని కొనసాగించారు. బరాటం రామశేషు జ్ఞాపకార్థం ఆయన సతీమణి, పిల్లల చేతులు మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

దుస్తులు అందజేస్తున్న నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

చీరల వితరణ...

లావేరు, న్యూస్‌టుడే: మండలం అప్పాపురం గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు, మాజీ సర్పంచి గంట్యాడ మహేశ్వరరావు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పండగ సమయంలో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తామని తెలిపారు. కూటమి నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న మహేశ్వరరావు

సందడిగా సంక్రాంతి సంబరాలు

పొందూరు, పొందూరు గ్రామీణం: పొందూరులో నిర్వహిస్తున్న జోడు ఎద్దుల పోటీలు

లావేరు మండలం గుర్రాలపాలెం గ్రామంలో గంగిరెద్దు విన్యాసం

అన్ని గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోలాహలం నెలకొంది. పలు చోట్ల ముగ్గులు, క్విజ్, నృత్య పోటీలు జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని గోమాతలను పూజించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆనందంగా ఆడిపాడారు. – న్యూస్‌టుడే బృందం

గార: కె.మత్స్యలేశంలో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న కమిటీ సభ్యులు

గార(శ్రీకూర్మం): ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఇంటింటికీ తాగునీరు

ముఖాముఖి

రణస్థలం, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తే నీటి సమస్య తీరే అవకాశముంది. ఈ అంశంపై గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ దుర్యోధనరావుతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.

? నియోజకవర్గంలో ఎన్ని ఓవరు హెడ్ ట్యాంకులు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి.

★ 208 ఓవరు హెడ్ ట్యాంకులు మంజూరవ్వగా 47 పూర్తయ్యాయి.

? మంచినీటి బోర్లు అన్నీ పనిచేస్తున్నాయా..? ఎన్ని ఉన్నాయి.

★ ఎచ్చెర్ల 652, జి.సిగడాం 492, లావేరు 687, రణస్థలం 675 మంచినీటి చేతిపంపు బోర్లు ఉన్నాయి. అన్నీ బాగానే పనిచేస్తున్నాయి. ఎక్కడైనా పనిచేయలేదని ఫిర్యాదు అందిన వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం.

? నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరందించేందుకు ఎన్ని కి.మీ. పైపు లైన్లు వేస్తున్నారు. ఏమేరకు పూర్తయింది.

★ నియోజకవర్గంలో రణస్థలం 90, జి.సిగడాం 48, ఎచ్చెర్ల 95, లావేరు 80 కి.మీ. మేరే వేయాల్సి ఉండగా రణస్థలం 40, ఎచ్చెర్ల 40, జి.సిగడాం 12, లావేరు 15 కి.మీ. మేర వేయడానికి మెటీరియల్ వచ్చింది. పనులు ప్రారంభించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సంక్రాంతి సందర్భంగా సంగమేశ్వరస్వామి కొండ వద్ద జాతర శుక్రవారం జరిగింది. జిల్లాలో నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆమదాలవలస-హిరమండలం ప్రధాన రహదారిలో వాహనాలు రద్దీ ఏర్పడింది. దీంతో గాజులకొల్లివలస జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఆమదాలవలస ఎస్సైలు బాలరాజు, కాంతారావులు సిబ్బందితో వచ్చి సాధారణ స్థితికి తీసుకొచ్చారు.

గాజులకొల్లివలస జంక్షన్ వద్ద రద్దీ

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం బలరాంపురం, శ్రీకూర్మం పంచాయతీ పడపానపేట గ్రామాల మధ్య ఉన్న ఉప్పుగెడ్డపై వంతెన నిర్మాణం కల ఎట్టకేలకు సాకారమైంది. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి స్థానికులు కలలు కంటూ దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. వంతెన నిర్మాణం జరిగితే సముద్ర తీర గ్రామాలకు మెరుగైన అనుసంధాన రహదారి సౌకర్యం కలుగుతుంది. తీర ప్రాంత గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దూరం తగ్గుతుంది. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఇరు వైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది.

ఉప్పుగెడ్డపై పనులు పూర్తయిన వంతెన

వంతెన నిర్మాణానికి నేషనల్ సెంటర్ ఫర్ సస్టయినబుల్ ఆక్వాకల్చర్, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ(ఎం.పి.ఈ.డి.ఎ.) రూ.2.50 కోట్లు ఆర్థిక సహకారం చేసింది. దీంతో మరో రూ.1.50 కోట్లతో ఇరువైపులా అనుసంధాన రహదారులు, భూములు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి 2021లో పనులు ప్రారంభించారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 95 శాతం పనులు పూర్తయ్యాయి.

★ సీఎస్పీ రహదారి నుంచి సతివాడ పంచాయతీ యాళ్లపేట.. శ్రీకూర్మం మీదుగా పడపానపేట వరకు పీఎం గ్రామ సడక్ యోజన ద్వారా 7.05 కిమీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పడపానపేట నుంచి బలరాంపురం వరకు వంతెనకు ఇరువైపులా 4 కి.మీ. మేర మట్టిరోడ్డు నిర్మించారు. పనులు పూర్తి అవుతుండటంతో వంతెన కల సాకారం అవుతుందన్న సంతృప్తి స్థానికుల్లో నెలకొంది. పడపానపేట నుంచి బలరాంపురం వరకు ఉన్న 4 కి.మీ. మట్టి రహదారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..

పీఆర్‌ఎంఈ మహంతి మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయని, మట్టి రహదారులను వంతెనతో అనుసంధానం చేయాల్సిన పనులు ఉన్నాయని చెప్పారు. త్వరలో అవి కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలం దాలెమ్మరాజువలస గ్రామానికి చెందిన కుమరాపు చందు గత కొద్ది రోజులుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఆయన కుటుంబాన్ని తెదేపా మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్ పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. సర్పంచి కుమరాపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి కుమరాపు అప్పలనాయుడు, చంటి, సీతారాం ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నపాలెం గ్రామం పరిధిలో పిక్కలాట నిర్వహిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి ఎస్సై బి.హైమావతి తెలిపారు. దంతపురిలో జాతరలో గురువారం దాడులు నిర్వహించగా కొండవలస, రొట్టవలస గ్రామాలకు చెందిన గుజ్జల నర్సింగరావు, ఎండ సింహాచలంను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరి నుంచి రూ.2,690 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

తప్పిన ప్రమాదం

రణస్థలం, న్యూస్‌టుడే: మండలంలోని పైడిభీమవరం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం వేకువన విశాఖ నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీ బోల్తాపడింది. లారీలో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

మహారాజశ్రీ ఆముదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఆముదాలవలస

E.P No. 43 / 2023 in O.S. No. 1595 / 2022

మధ్య :

శ్రీ J.N.M. ప్రసాదు, ... డిక్రీ హోల్డర్

మరియు

శ్రీమతి బత్తుల లక్ష్మి & Anr. ...జడ్జిమెంట్ రుణగ్రహీత

అమ్మకపు ప్రకటన

పైన పేర్కొన్న ఈ గౌరవనీయ న్యాయస్థానం యొక్క ఆదేశం ద్వారా, క్రింద పేర్కొన్న షెడ్యూల్లో పేర్కొన్న ఆస్తిని, క్రింద పేర్కొన్న డిక్రీ హోల్డర్ యొక్క క్లెయిమ్‌ను సంతృప్తిపరచడానికి, పైన పేర్కొన్న తీర్పు రుణగ్రహీతకు వ్యతిరేకంగా పైన పేర్కొన్న దావాలో అమ్మకం తేదీ వరకు రూ: 20,00,000/- (ఇరువది లక్షల రూపాయలు మాత్రమే) మొత్తానికి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించబడిందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది.

అందువల్ల ఈ అమ్మకం బహిరంగ వేలం ద్వారా జరుగుతుందని మరియు అదే తేదీ 20-02-2026న ఉదయం 10-30 గంటలకు పబ్లిక్ కోర్టులో గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జి, ఆముదాలవలస, శ్రీకాకుళం వారి కోర్టులో, వద్ద జరుగుతుందని ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయబడుతున్నది.

అమ్మకం సమయంలో, ప్రజలు సాధారణంగా వ్యక్తిగతంగా లేదా అధికారం కలిగిన ఏజెంట్ ద్వారా బిడ్ చేయమని తెలియజేస్తారు, అమ్మకపు నిబంధనలు మరియు షరతులకు లోబడి, చిరునామా వివరాలను ఇక్కడ అందించిన డిక్రీ హోల్డర్ న్యాయవాది నుండి పొందవచ్చు.

ఆస్తి షెడ్యూల్:

శ్రీకాకుళం జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని, తురకపేట, ఆముదాలవలస మండలం, వేదుళ్లవలస గ్రామం యొక్క సర్వే నంబర్ 74-1 ద్వారా కవర్ చేయబడింది, ఇంటి నెం. 1-44, మొత్తం విస్తీర్ణం: 633.33 చదరపు అడుగులు, ఇంటి నిర్మాణ విస్తీర్ణం 700 చదరపు అడుగులు ఆర్.సి.సి. స్లాబ్ ఇల్లు. ఆముదాలవలస జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం యొక్క రిజిస్ట్రేషన్ సబ్-డిస్ట్రిక్ట్‌లో ఉంది మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు ఉన్నాయి : **తూర్పు:** ఆర్.సి.సి. ఇల్లు మరియు పేట తవుడు ఖాళీ స్థలం; **పడమర:** బత్తుల సత్తికి చెందిన ఖాళీ స్థలం; **దక్షిణం:** 12 అడుగుల ఉమ్మడి దారి; **ఉత్తరం:** తారు రోడ్డు తురకపేట వరకు

ఆస్తి యొక్క సుమారు విలువ రూ. 20,00,000/-

అమ్మకపు తేదీ: 20-02-2026;

డిక్రీ హోల్డర్ విలువ: రూ.20,00,000/-; ఫీల్డ్ అసిస్టెంట్ విలువ: రూ. 20,00,000/- జడ్జిమెంటు డెటారు విలువ: జడ్జిమెంటు డెటారు అని తెలియనివారు దానిని అందించడానికి ముందుకు రాలేదు.

బి. శ్రీనివాస రెడ్డి, న్యాయవాది,
విశాఖపట్నం: డోర్ నెం. 10-88/7, సాయి దుర్గానగర్, R.R.V.పురం పోస్ట్,
తేదీ:16.01.2026 నాయుడు తోట దగ్గర, విశాఖపట్నం 530029, A.P. సెల్ నెం. 8008333321

(c) eenadu

పర్యావరణ గీతిక

సూళ్లూరుపేట పట్టణానికి చెందిన వెంకటేశన్, భారతి దంపతుల కుమార్తె గీతికకు పర్యావరణాన్ని కాపాడాలన్న ఆశయం తొమ్మిదేళ్ల ప్రాయంలోనే చిగురించింది. 2019లో యాదుమది ఇంటిగ్రేటెడ్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీని స్థాపించడంతో తన ఆశయం కార్యరూపం దాల్చింది. వారాంతపు, సెలవు రోజుల్లో మొక్కలు నాటడం ప్రారంభించింది. ఇప్పటిదాకా వేలాది మొక్కలు నాటింది. అంతేకాదు పర్యావరణాన్ని కాపాడుకోవాలి, ప్లాస్టిక్‌ను విడనాడాలి, వ్యవసాయాన్ని కాపాడుకోవాలి, భూగర్భ జలాలు పెంపొందాలి, నదులు కాలుష్యం బారిన పడకుండా కాపాడాలి వంటి నినాదాలతో విద్యార్థులతో కలిసి ర్యాలీలు, సదస్సులు చేయడం ప్రారంభించింది. ఎక్కడ పది మంది కూడే చోటున్నా అక్కడ తన నినాదం తెలిసేలా ప్లకార్డు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తోంది. దేశ, విదేశాల్లో ఎన్నో అవగాహన సదస్సుల్లో పాల్గొని 20కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకుంది. పక్షుల పండగలో భీములవారిపాళెం రేవులో ఇలా అందరి దృష్టిలో పడింది.

– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం, తడ

సర్వదర్శనానికి 14 గంటలు

ఆలయం ఎదుట సేద తీరుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. వరుస సెలవులతో పెద్దఎత్తున భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రానికి భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి క్యూలైన్‌లో శిలాతోరణం వరకు వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. గురువారం శ్రీవారిని 64,064 మంది దర్శించుకున్నారు. రూ.3.80 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ పెరిగింది. యాత్రికుల వసతి సముదాయంలో భక్తులు సేదతీరాలని తితిదే ప్రకటిస్తోంది. తిరుమలలో చలి తీవ్రత పెరిగింది.

శశాంక్ ఉంటే గెలుపు వెన్నంటే

- అండర్– 23లో రాష్ట్రంలోనే అత్యధిక స్కోరర్‌గా నమోదు
- క్రికెట్‌లో రాణిస్తున్న యువకుడు

పరుగుల వేటలో కోహ్లీని తలపిస్తాడు. వికెట్ల వెనుక ధోనీని మైమరిపిస్తాడు. తను బరిలో దిగితే బంతులు బౌండరీల వైపు పరుగులు పెట్టాల్సిందే. ఇలా క్రికెట్‌లో అదరగొడుతున్నాడు తిరుపతికి చెందిన యువ క్రికెటర్ శశాంక్.

తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంటకు చెందిన జయదేవ్, జయశ్రీ దంపతుల కుమారుడు శశాంక్ శ్రీవత్స. క్రికెట్‌పై ఆసక్తి ఉండటంతో 8వ తరగతిలో స్థానిక నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో శిక్షకుడు మస్తాన్ వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ప్రస్తుతం వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు. 2025లో జరిగిన అండర్- 23 టెస్ట్ మ్యాచుల్లో 230 పరుగులతో రాష్ట్రంలోనే అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. భారత క్రికెటర్ నితీష్‌కుమార్ జట్టులో సభ్యుడిగా వ్యవహరించాడు. సెప్టెంబరులో జరిగిన రంజీ ప్రాబబుల్స్‌లో రాణించి తిరుపతి వేదికగా జరిగిన చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో 200 పైగా స్ట్రైక్‌రేట్, 16 బంతుల్లో 50 పరుగులతో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందాడు. ఇటీవల 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన ఈఎస్ఎల్ పోటీల్లోనూ కీలకంగా వ్యవహరించి జట్టు విజయానికి బాటలు వేశాడు.

- న్యూస్‌టుడే, తిరుపతి (క్రీడలు)

సొంతగడ్డపై సంబరం.. సామాన్యుడికి అభయం

ముగిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నారావారిపల్లె పర్యటన

ఈనాడు డిజిటల్, తిరుపతి, చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: అధికార బాధ్యతల బరువు ఎంత ఉన్నా.. పుట్టి పెరిగిన మట్టి వాసన ఆ బరువును దింపేస్తుంది. సంక్రాంతి సంబరాల వేళ సొంతగడ్డ నారావారిపల్లెకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. చివరి రోజు పర్యటనలో ఆత్మీయుల మధ్య గడిపారు. పచ్చని పల్లెలో పండగ వాతావరణం ఒకవైపు.. కన్నవారి, తోడబుట్టిన వారి జ్ఞాపకాలు మరోవైపు ఆయన్ను భావోద్వేగానికి గురి చేశాయి. గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకుంటూ, పెద్దల సమాధుల వద్ద నివాళులర్పిస్తూ, తన కోసం వచ్చిన జననేస్తాల కష్టాలను వింటూ.. ముఖ్యమంత్రి తన పర్యటనను మమతల పందిరిలా మార్చారు.


ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద నారా, నందమూరి కుటుంబ సభ్యుల నివాళి

అర్జీలు పరిశీలిస్తున్న చంద్రబాబు

సీఎం భావోద్వేగం

సొంతూరిలో కుటుంబంతో కలిసి పండగ చేసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని భావోద్వేగంతో సీఎం వివరించారు. గతంలో గ్రామాలకు వెళ్లడానికి భయపడ్డారు. ఈ ఏడాది ఉత్సాహంగా వెళ్లారు. మన పూర్వీకులను గౌరవించుకోలేకపోతే మనకు, జంతువులకు తేడా ఉండదు. మన పండగలు ప్రకృతి వాతావరణానికి అనుగుణంగా రూపొందాయి.' అని సీఎం వివరించారు. ● వ్యవసాయంలోనే కాదు, పాడి పరిశ్రమలోనూ డ్రోన్లను వాడుతున్నాం. ఇది పనిని సులభతరం చేస్తుంది. కచ్చితమైన ఫలితాలను ఇస్తోంది. తిరుపతిలో చెరువుల సుందరీకరణ చేపడతాం. శెట్టిపల్లి భూ సమస్యను పారదర్శకంగా పరిష్కరించాం. భూ రికార్డులపై సాంకేతికతతో కూడిన 'రాజముద్ర' పడుతుంది. దాన్ని ట్యాంపరింగ్ చేయడం ఎవరి తరమూ కాదు.' అని సీఎం పేర్కొన్నారు.

స్వర్ణ నారావారిపల్లె సాధన ఇలా..

తల్లిదండ్రుల సమాధుల వద్ద పూలు చల్లుతున్న సీఎం చంద్రబాబు

'స్వర్ణ నారావారిపల్లె లక్ష్యంతో ఇక్కడి మూడు పంచాయతీలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. 248 మందికి ఇళ్లు లేవని గుర్తించాం. వీరిలో 187 మందికి కనీసం ఇళ్ల స్థలాలు కూడా లేవు. అందుకే 2+1 లేదా 1+1 పద్ధతిలో ఇళ్లు నిర్మించాలని అధికారులకు సూచించా.' అని సీఎం స్పష్టం చేశారు. ' అని సీఎం తెలిపారు. మధ్యాహ్నం చంద్రగిరి మండలంలోని యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

జనం కోసం.. జనంలోనే..

జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల వద్దకు సీఎం స్వయంగా వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను సావధానంగా విని, అర్జీలను స్వీకరించారు. తక్షణమే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి లోకేశ్, భువనేశ్వరి మధ్యాహ్నం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, ఏఎంసీ ఛైర్మన్ గౌస్ బాషా, మండల అధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, కో-ఇన్‌ఛార్జ్ దేవీలాల్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు

ముంగిళ్లలో ఇంద్రధనస్సు.. ఆనందాల ఉషస్సు

నాయుడుపేట గాంధీ పార్కు వద్ద రంగవల్లుల్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కూటమి నాయకులు

వేదాంతపురం అగ్రహారం పంచాయతీ విజయనగర కాలనీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తూపిలిపాళెం బీచ్‌లో సందడి

సంక్రాంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్ని తాకాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇంద్రధనస్సు నేలకు దిగిందా అన్నట్లుగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు ముచ్చటగొలిపాయి. కొన్ని గ్రామాల్లో జల్లికట్టు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆలయాలు సైతం కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు చేశారు. చిన్ననాటి స్నేహితులను కలిసి రోజంతా ఆనందంగా గడిపారు.

– న్యూస్‌టుడే బృందం

అంచనాకు మించి.. ప్రయాణించి

రికార్డు స్థాయిలో మహిళల ఆర్టీసీ వినియోగం

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంలో అంచనాలకు మించి మహిళలు ప్రయాణం సాగించారు. గత ఏడాది ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ పథకాన్ని భారీసంఖ్యలో మహిళలు వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 11 డిపోలు ఉండగా అలిపిరి, తిరుమల డిపోలు మినహా మిగిలిన తొమ్మిదింటి పరిధిలో గతేడాది డిసెంబరు నెలాఖరు నాటికి 1.23 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. రాష్ట్రంలో తిరుపతి జిల్లా ఏడో స్థానంలో నిలిచింది.

సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తాం

ఉచిత బస్సు సౌకర్యంతో మహిళా ప్రయాణికుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. ఉన్న బస్సులు చాలడం లేదు. ఆక్యుపెన్సీ రేషియో సైతం రికార్డు స్థాయిలో ఉంది. అందరికీ సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తున్నాం – **జగదీష్, జిల్లా ప్రజా రవాణాధికారి**

వివరాలు ఇలా..

డిపో	ప్రయాణికులు	మహిళలు
తిరుపతి	26,18,281	15,20,524
మంగళం	23,98,788	12,89,628
శ్రీకాళహస్తి	33,98,800	16,07,904
పుత్తూరు	33,86,163	20,23,808
సత్యవేడు	28,55,242	14,78,626
సూళ్లూరుపేట	18,56,496	10,79,390
వెంకటగిరి	32,01,951	17,96,409
వాకాడు	26,56,633	15,60,894

● జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 800 బస్సులు ఉండగా స్త్రీశక్తి పథకంలో భాగంగా 356 బస్సులు తిరుగుతున్నాయి. ● పుత్తూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి డిపో బస్సుల్లో ఎక్కువగా మహిళలు ప్రయాణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ● పథకం అమలుకు ముందు ఆక్యుపెన్సీ 60 శాతం ఉండేది. ఇప్పుడు 105 నుంచి 110 శాతం వరకు నమోదవుతోంది. ● ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి తొలివిడతగా రూ.400 కోట్ల ఉచిత ప్రయాణం టికెట్ల సొమ్ము జమచేసింది.

పశువుల పండగ.. పోటీ దండిగా..



చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లెలో నిర్వహించిన పశువుల పండగకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. ఏటా సమీపంలోని రంగంపేటలో ఈ పండగ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కనుమ రోజు గ్రామంలో వేర్వేరు కారణాలతో ఇద్దరు చనిపోవడంతో పండగను వాయిదా వేశారు. దీంతో వీరితోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జనం తండోపతండాలుగా వచ్చారు. పశువుల కొమ్ములకు కట్టిన చెక్క పలకలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. పలువురికి స్వల్పగాయాలు కాగా.. ప్రథమ చికిత్స అందించారు.

– న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ

సచివాలయ సేవలు.. సరిగా లేవండీ!

కుప్పం, సత్యవేడు, చంద్రగిరి, గంగాధరనెల్లూరులో..

పౌరులకు తక్కువ సమయంలో అవినీతి రహితంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సచివాలయాలు గాడి తప్పాయి. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడం, ఉన్నా వారి వ్యవహారశైలి బాగా లేకపోవడంతో అంతిమంగా ప్రజలే ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు కలెక్టర్ హెచ్చరించినా పరిస్థితిలో మాత్రం మార్పు లేదు.

– ఈనాడు, చిత్తూరు, తిరుపతి

సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాలి. గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్న కుప్పం, గంగాధరనెల్లూరు, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో వీరు పెద్దగా అందుబాటులో ఉండటంలేదు. అదేమని అడిగితే ఉన్నతాధికారులు.. వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సర్వేలు చేయాలని ఆదేశించారని సమాధానమిస్తున్నారు. ఒకవేళ అలా బయటకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టాల్సి ఉన్నా పాటించడం లేదు. తిరుపతి నగరంలోని సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లోనే ఉండాలని పేర్కొన్నా కొన్ని చోట్ల వారు కూడా దొరకడంలేదు.

ఐవీఆర్ఎస్‌లో ప్రజల అసంతృప్తి / అందుబాటులో ఉండని సిబ్బంది

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సచివాలయ ఉద్యోగుల వ్యవహారశైలిపై చర్చకు వచ్చింది. ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలంటే తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లోని సిబ్బంది నుంచి సంతకం పెట్టించుకుని వస్తేనే వాటిని స్వీకరిస్తామని చెబుతున్నారని ఉన్నతాధికారులే స్పష్టం చేశారు. ప్రధానంగా సర్వేయర్లు, వీఆర్వోలు ఇలా చెబుతున్నారు. ఈ రెండు శాఖల్లోని ఉద్యోగులే అవినీతిలోనూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లాలంటే ముందుగానే లంచం ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలంలోని సర్వేయర్.. డబ్బులు తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడటమే దీనికి నిదర్శనం.

సంతకం పెట్టించుకుని రావాలంటూ..

ఇంజినీరింగ్ అసిస్టెంట్లూ అదే మార్గంలో..

ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖలో పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సైతం రెవెన్యూ యంత్రాంగం బాటలోనే వెళుతున్నారు. వివరాలు నమోదు చేయాలంటే తప్పక ఎంతోకొంత చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు. దాంతో ఎంతో సదుద్దేశంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ అభాసుపాలవుతోంది.

తిరుపతి జిల్లాలో సచివాలయ సిబ్బందిపై ఐవీఆర్ఎస్‌లో వెల్లడైన అభిప్రాయాలు ఇలా.. (శాతాల్లో..)

ప్రశ్న	సమాధానం	శాతం
సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నారా?	ఉన్నారు	66.1
	లేరు	33.9
సిబ్బంది ప్రవర్తన బాగుందా?	బాగుంది	72.9
	బాగాలేదు	27.1
ఉద్యోగులు లంచాలు తీసుకుంటున్నారా?	తీసుకుంటున్నారు	27.8
	లేదు	72.2

కైలాసగిరి.. 'భక్తజన' ఝురి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఓం నమః శివాయ.. హరహర మహాదేవ దివ్య నామ స్మరణలతో కైలాసగిరులు పులకించిపోయాయి. కనుమ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున శుక్రవారం నిర్వహించిన కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి భక్తులు ప్రవాహంలా తరలివచ్చారు. బ్రహ్మాండనాయకుడైన భవుని కల్యాణోత్సవానికి రావాలంటూ తన దేవేరితో కలసి కైలాసగిరుల్లో కొలువుదీరిన పరివార దేవతలు, మునులు, సాధువులు, రుషులను ఆహ్వానించడం ఈ విశేషోత్సవ పరమార్థం. స్వయంగా ఆది దంపతులు పెళ్లిపిలుపులకు రావడంతో 24 కిలోమీటర్ల ప్రదక్షిణ మార్గం భక్తజన సంద్రంగా మారింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

పురవీధుల్లో సాగుతున్న ఉత్సవమూర్తుల దివ్యశోభ

మనోన్మణి.. సింహవాహన రూపిణి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గొబ్బి మహాలక్ష్మిగా పూజలందుకునే మనోన్మణి అమ్మవారు సింహవాహనాన్ని అధిరోహించి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గురువారం ఉదయం అమ్మవారు చతుర్మాడ వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉత్సవం ఘనంగా సాగింది.

20న విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 20న అభిప్రాయాన్ని సేకరించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఏపీఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులు తిరుపతి, విజయవాడ, కర్నూలులో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 20న తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చన్నారు. పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

104FM Tirupati
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజి స్టైల్	సా॥ 5 - రా॥ 9
ఈఎఫ్‌ఎమ్ సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in. జోనల్ కార్యాలయం : డి.నెం. టి.కె.స్ట్రీట్, తిరుపతి-2 - 517501

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) క్రింద 30 రోజులు తర్వాత అమ్మకం గురించి సమాచారమిస్తూ ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు / గ్యారంటార్ల వివరాలు:-

1) **పాలడుగు ప్రభాకర్,** తండ్రి పాలడుగు పార్థసారథి నాయుడు, డి.నెం.8-18, అంజని టెక్ టైల్స్, ఎస్.ఎస్.ఏజెన్సీస్, పద్మావతిపురం మెయిన్‌రోడ్డు, మాయాబజార్ తిరుపతి, తిరుపతి జిల్లా
2) **పాలడుగు సుమలత** భర్త పాలడుగు ప్రభాకర్, డి.నెం.8-18, అంజని టెక్ టైల్స్, ఎస్.ఎస్.ఏజెన్సీస్, పద్మావతిపురం మెయిన్‌రోడ్డు, మాయాబజార్ తిరుపతి, తిరుపతి జిల్లా
3) **ఎం.జనార్ధన్ నాయుడు,** తండ్రి మోహన్ క్రిష్ణ నాయుడు, డి.నెం.4-25, కమ్మపల్లి, ఆర్.సి.పురం మండలం, చిత్తూరు జిల్లా

సర్/ మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002తో చదువబడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కి రావలసిన మొత్తం రాబట్టుకొనుటకు **ఋణగ్రహీత పాలడుగు ప్రభాకర్ గార్లకు** చెందిన ఆస్తుల అమ్మకం గురించి ఉద్దేశిత అమ్మకం ప్రకటన

సూచిక : ఋణ అగ్రిమెంటు నెం. TRPT2TF1305310012

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ " (మునుపటి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్"గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిస్టర్ కార్యాలయం: శ్రీ టవర్స్ ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై -600032, పరిపాలనా కార్యాలయం: 6వ అంతస్తు, లెవల్2, బిల్డింగ్‌నెం.క్యూ2, ఔరం క్యూపార్క్, జెన్4/1, టీటీసీ, థానే, బేలాపూర్ రోడ్డు,ఘన్‌సోలి, నవి ముంబయి- 400710 మరియు **జోనల్ /శాఖ కార్యాలయం టి.కె.స్ట్రీట్, తిరుపతి-2 -517501** కలదు

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది: 07.03.2023**న జారీ చేసిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న తేది: **07.03.2023 నాటికి బకాయి రూ.71,21,231/- (డెబ్బై ఒక్క లక్షల ఇరవై ఒక్క వేల రెండు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) తో**పాటు ఇటీవల వడ్డీ/ ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితి లోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8తో చదువుకొనేటి సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది: 06.07.2023**న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది: 15.12.2025**న భౌతికంగా స్వాధీనం చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేది నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీస్ ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

కావున శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి చెల్లించాల్సిన బకాయి మొత్తం, తదుపరి వడ్డీ, ఖర్చులు, వ్యయాలలతో సహా విక్రయ ప్రకటన ప్రచురితమయ్యే లోపు చెల్లించిన యెడల విక్రయానికి సంబంధించిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా రుణగ్రహీత చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించమైనదని గమనించగలరు. మీరు ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు బకాయి మొత్తం చెల్లించడంతో విఫలమైనా లేక విస్మరించినా దిగువ సంతకం దారు బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించడం మినహా ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు ఉండవని గమనించగలరు. అది కూడా మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి బకాయిలను రాబట్టుకునేందుకు పైన తెలిపిన రుణసౌకర్యానికి సంబంధించి మాత్రమే చెల్లించాలి.

ఈ ఉద్దేశిత అమ్మకం ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్),2002 లోని రూల్ 8(6) వీరుద్ధంగా జారీ చేయబడినది.

ఈ ఆర్థిక సంస్థకు అందుబాటులో ఉన్న హక్కులు మరియు నివారణలకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయబడినది.

స్థిరాస్తి వివరములు

పాలడుగు ప్రభాకర్ పేరున పేరున వున్న పత్రం నెం. 2404/2013 లోని స్థిరాస్తి వివరములు

చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్‌జిల్లా, తిరుపతి రూరల్ సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, పాడి గ్రామలెక్కదాఖలా, మాగాణీ సర్వేనెం.350/1సిలో ఎ.0.62 సెంట్లు లేదా 0.215 హెక్టార్లు, మాగాణీ సర్వేనెం.350/2సిలో ఎ.0.28 సెంట్లు లేదా 0.114 హెక్టార్లు మరియు మాగాణి సర్వేనెం.350/1బిలో ఎ.0.45 సెంట్లు లేదా 0.182 హెక్టార్లు వెరశి మొత్తం విస్తీర్ణం ఎ.1.35 సెంట్లు లేదా 0.547 హెక్టార్లు మరియు ఇందున ఎ.0.90.67 సెంట్లు లేదా 0.367 హెక్టార్ల భూమి మరియు ఇందున వున్న ఖాళీ స్థలం విస్తీర్ణం 1722.22 చ.గ. హద్దులు: తూర్పు: 33అ. వెడల్పు గల రోడ్డు, పడమర: ముక్కంటి వీరమ్మ భూమి, ఉత్తరం: పి.సుమలతకు కె.జయచంద్రా రెడ్డి విక్రయించిన భూమి. దక్షిణం: ముక్కంటి క్రిష్ణయ్య మరియు ఇతరుల భూమి.ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు:125అ. లేదా 38.125మీ. దక్షిణం: వైపు: 75అ. లేదా 22.875మీ. ఉత్తరం నుండి దక్షిణం: ఇరువైపులా 155అ. లేదా 47.275మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 15500 చ.అ. లేదా 1722.22 చ.గ ఖాళీ స్థలం మాత్రమే

ప్రదేశం: తిరుపతి-2 సం/- అధీకృత అధికారి,
తేది: 13.01.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in. శాఖ కార్యాలయం : డి.నెం. 8-8-80ఎ, 1వ అంతస్తు, చల్లాతమ్మ టవర్స్, ఎన్‌జీఓ కాలనీ ఎదురుగా, అరక్కోణం రోడ్డు, పుత్తూరు,, తిరుపతి జిల్లా- 517583

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) క్రింద 30 రోజులు తర్వాత అమ్మకం గురించి సమాచారమిస్తూ ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు / గ్యారంటార్ల వివరాలు:-

1) **వి.గుణశేఖర్,** తండ్రి ఆనందయ్య, డి.నెం.22-173, కొత్త వేవర్స్ వీధి, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517583
2) **వి.లక్ష్మి,** భర్త వి.గుణశేఖర్ డి.నెం.22-173, కొత్త వేవర్స్ వీధి, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517583
3) **ఎం.జనార్ధన్,** తండ్రి బలరాం, డి.నెం.17-111, ఆర్టీసీ కాలనీ, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517583

సర్/ మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002తో చదువబడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కి రావలసిన మొత్తం రాబట్టుకొనుటకు **ఋణగ్రహీత వి.గుణశేఖర్** కు చెందిన ఆస్తుల అమ్మకం గురించి ఉద్దేశిత అమ్మకం ప్రకటన

సూచిక : ఋణ అగ్రిమెంటు నెం. PUTTRTF2106300002

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ " (మునుపటి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్"గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిస్టర్ కార్యాలయం: శ్రీ టవర్స్ ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై -600032, పరిపాలనా కార్యాలయం: 6వ అంతస్తు, లెవల్2, బిల్డింగ్‌నెం.క్యూ2, ఔరం క్యూపార్క్, జెన్4/1, టీటీసీ, థానే, బేలాపూర్ రోడ్డు,ఘన్‌సోలి, నవి ముంబయి- 400710 మరియు **జోనల్ / శాఖ కార్యాలయం డి.నెం. 8-8-80ఎ, 1వ అంతస్తు, చల్లాతమ్మ టవర్స్ ఎన్‌జీఓ కాలనీ ఎదురుగా, అరక్కోణం రోడ్డు, పుత్తూరు, తిరుపతి జిల్లా - 517583** కలదు.

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది: 25.07.2024** న జారీ చేసిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న తేది: **25.07.2025 నాటికి బకాయి రూ.20,87,934/- (ఇరవై లక్షల ఎనభై ఏడు వేల తొమ్మిది వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే)తో** పాటు ఇటీవల వడ్డీ/ ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితి లోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8తో చదువుకొనేటి సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది:26.10.2024** న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది: 19.09.2025**న భౌతికంగా స్వాధీనం చేసుకొనిరి.

కావున శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి చెల్లించాల్సిన బకాయి మొత్తం, తదుపరి వడ్డీ, ఖర్చులు, వ్యయాలలతో సహా విక్రయ ప్రకటన ప్రచురితమయ్యే లోపు చెల్లించిన యెడల విక్రయానికి సంబంధించిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా రుణగ్రహీత చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించమైనదని గమనించగలరు. మీరు ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు బకాయి మొత్తం చెల్లించడంతో విఫలమైనా లేక విస్మరించినా దిగువ సంతకం దారు బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించడం మినహా ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు ఉండవని గమనించగలరు. అది కూడా మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి బకాయిలను రాబట్టుకునేందుకు పైన తెలిపిన రుణసౌకర్యానికి సంబంధించి మాత్రమే చెల్లించాలి.

ఈ ఉద్దేశిత అమ్మకం ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్),2002 లోని రూల్ 8(6) విరుద్ధంగా జారీ చేయబడినది.

ఈ ఆర్థిక సంస్థకు అందుబాటులో ఉన్న హక్కులు మరియు నివారణలకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయబడినది.

స్థిరాస్తుల వివరములు

హోల్డరు పేరు: వి.గుణశేఖర్ పేరున ఉన్న పత్రంనెం.2134/2021లోని స్థిరాస్తి వివరములు

షెడ్యూలునెం.1:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్ జిల్లా, పుత్తూరు మండలం, పుత్తూరు టౌన్ మరియు మున్సిపాలిటీ నెం.76 నందిమంగళం గ్రూపు, వార్డునెం.38, చిన్న తిమ్మరాజునెత్తం గ్రామలెక్కదాఖలా సర్వేనెం.4లో ఎ.10.80 సెంట్లు లేదా 4.406 హెక్టార్లు మరియు ఇందున ఎ.0.86 సెంట్లు లేదా 0.348 హెక్టార్ల భూమి మరియు సబ్ డివిజన్ అనంతరం 4-సి మరియు 4-డి భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్ల లేఔట్‌లోని ప్లాటునెం.25-పార్ట్ మరియు 26 పార్ట్ ఖాళీ ఇంటి స్థలాలు.: హద్దులు: తూర్పు: ప్లాటు నెం.24 మరియు ప్లాటు నెం.23 స్థలంలో అర్థభాగం వాటా. పడమర: రోడ్డు,ఉత్తరం: ప్లాటు నెం.27 మరియు ప్లాటు నెం.26 స్థలంలో అర్థభాగం వాటా. దక్షిణం: అయ్యప్ప ఇల్లు మరియు ఇతరులు. ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర:20అ. లేదా 6.096 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 35అ. లేదా 10.669మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 700 చ.అ. లేదా 77.7 చ.గ. ఖాళీస్థలం, షెడ్యూలు ఆస్తి చుట్టూ కాంపౌండ్ గోడతో సహా.

షెడ్యూలునెం.2:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్ జిల్లా, పుత్తూరు మండలం, పుత్తూరు టౌన్ మరియు మున్సిపాలిటీ నెం.76 నందిమంగళం గ్రూపు, వార్డునెం.38, చిన్న తిమ్మరాజునెత్తం గ్రామలెక్కదాఖలా సర్వేనెం.4లో ఎ.10.80 సెంట్లు లేదా 4.406 హెక్టార్లు మరియు ఇందున ఎ.0.86 సెంట్లు లేదా 0.348 హెక్టార్ల భూమి మరియు సబ్ డివిజన్ అనంతరం 4-సి మరియు 4-డి భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్ల లేఔట్‌లోని ప్లాటునెం.25, 26 మరియు 27- పార్ట్ ఖాళీ ఇంటి స్థలాలు.: హద్దులు:తూర్పు: వెంచుగస్ ఇల్లు పడమర: ప్లాటు నెం.25, 26 మరియు 27- పార్ట్, ఉత్తరం: శాంతి ఇల్లు, దక్షిణం: రోడ్డు, ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 20అ. లేదా 6.096 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 70అ. లేదా 21.336 మీ. వెరశి 1400 చ.అ. లేదా 155.55 చ.గ. ఖాళీ స్థలం మరియు షెడ్యూలు ఆస్తి చుట్టూ కాంపౌండ్ గోడతో సహా.

ప్రదేశం: పుత్తూరు సం/- అధీకృత అధికారి,
తేది:13.01.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రహదారి పనులు రైతుల కష్టాలు

భూసేకరణలో వివాదాలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: సాగరమాల రహదారి నిర్మాణానికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో నెలకొన్న తేడాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాయుడుపేట నుంచి చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు వరకు క్రిబ్కో సాగరమాల ప్రాజెక్టులో భాగంగా 38 కి.మీ.లు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తున్నారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ పనులు రెండేళ్ల కిందట రెవెన్యూ అధికారులు చేపట్టారు. భూసేకరణ రెవెన్యూ రికార్డుల్లో క్లియర్ టైటిల్ ఉన్న రైతులందరికీ పరిహారం చెల్లించారు. కొందరు అధికారులు చేతివాటం చూపించి రికార్డులు తారుమారు చేశారు. ఉన్నతాధికారులు వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం చెల్లించాలి. భూములు ఎక్కువ విస్తీర్ణంలో తీసుకుని తక్కువ పరిహారం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. మరికొన్ని రికార్డుల్లో పేర్లు, భూసర్వేనంబర్లలో తేడాలు ఉన్నాయి. వీటి అన్నింటికీ పరిష్కారం చూపుతామంటూ రెవెన్యూశాఖ ఎన్‌హెచ్ఏకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పగించింది.

పుదూరులో వరిపంటను తొక్కేస్తున్న యంత్రాలు

పరిహారం ఇవ్వకుండానే..

భూములు తీసుకున్న రైతులకు పరిహారం చెల్లింపుల్లో పలుచోట్ల వివాదం ఉన్నప్పటికీ రహదారి నిర్మించడం పలుచోట్ల వివాదంగా మారింది. నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో 40 ఏళ్లుగా పది మంది సన్న, చిన్నకారు రైతులు సాగు చేస్తున్నారు. భూములు రెవెన్యూ రికార్డుల్లో గర్భకండ్రిగగా నమోదు కావడంతో దీన్ని అధికారులు పరిశీలించి పరిహారం చెల్లించిన తరువాతనే రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ పొలాల్లో రహదారి పనులు చేపట్టడంతో ఇబ్బంది రైతులు పనులు అడ్డుకున్నారు.

వరి పైరు ధ్వంసం..

శీనల బాస్కర్ అనే రైతు నుంచి రహదారి నిర్మాణానికి ఎక్కువ విస్తీర్ణం భూమి తీసుకున్నారు. తక్కువ పరిహారం ఇవ్వడంతో భూమి స్వాధీనం చేసేందుకు నిరాకరించారు. అధికారులు తన భూమి రికార్డులు సరిచేసిన తర్వాతే రహదారికి భూమి ఇస్తానన్నారు. వివాదం పరిష్కారం చేయకుండానే రెవెన్యూ, హైవే అధికారులు రహదారి నిర్మాణానికి పచ్చని వరిపైరు ధ్వంసం చేయడంతో ఈ ప్రాంత రైతులంతా ఆగ్రహానికి గురిచేసింది. హైవే అధికారులు మొండిగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని తహసీల్దార్ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా.. రైతుల సమస్యను తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోసంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

గోవుకు అరటి పండు తినిపిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఎల్ఎస్‌నగర్ వద్ద ఉన్న తితిదే ఎస్వీ గోసంరక్షణ శాలలో కనుమ పండగను పురస్కరించుకుని గోపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఈవో అనిల్ కుమార్ సింఘాల్ దంపతులు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గోవుపేడతో రూపొందించిన బొమ్మలకు వద్ద కాటమరాజుకు పూజ, గోరీపూజ, తులసిపూజ నిర్వహించారు. గజరాజు, అశ్వాలు, వృషభాలకు పూజ చేసి వాటికి దాణా తినిపించారు. తర్వాత గోమందిరంలో పుంగనూరు గోవుకు గోపూజ చేసి, కర్పూర హారతి సమర్పించారు. తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గోసంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ గోసంరక్షణ కోసం జాతీయ విధానం రూపొందించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన దీనికి అంగీకరించారని, వందే గోమాతరం పేరుతో తితిదే పెద్దఎత్తున నిర్వహించనుందని తెలిపారు.

ఈవోకు పుంగనూరు గోవుకు పూజ: ఏటా సాధారణ జాతి ఆవులకు గోపూజ నిర్వహించేవారు. ఈ సారి ప్రత్యేకంగా పుంగనూరు జాతికి చెందిన ఆవుకు ఈవో గోపూజ నిర్వహించారు. దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన భజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి నృత్యాలు, హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్వీ గోసంరక్షణ శాల సంచాలకుడు శివకుమార్, గోశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

13 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు శుక్రవారం 13 వేల టోకెన్లు జారీ చేశారు. వీటికి శనివారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగుతుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

అంతమందిని ఎలా కుక్కావురా బుజ్జీ!

'అతడు' సినిమాలో మనుషులను వాహనంలో కుక్కినట్లు శుక్రవారం తిరుమలలోని తితిదే పార్కింగ్ కాంప్లెక్స్ సమీపంలో ఓ ప్రైవేటు మినీ వ్యాన్ డ్రైవర్ వాహనంలో 20 మందిని ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణించాడు. చివరికి వ్యాను డోర్ కూడా వేయలేని పరిస్థితి. ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తులను తరలించేందుకు కొందరు ప్రైవేటు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. - న్యూస్‌టుడే, తిరుమల

శ్రీవారి ఆలయంలో కాకబలి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా కనుమ పండగను పురస్కరించుకుని ఉదయాస్తమాన్య నిర్వహించే కాకబలి కార్యక్రమం శుక్రవారం వైదికోక్తంగా జరిగింది. అర్చకులు పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు. ❖ శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తితిదే మాజీ జేఈవో శ్రీనివాసరాజు, డ్రమ్స్ శివమణి, కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు.

స్వామిని దర్శించుకున్న చాగంటి కోటేశ్వరరావు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : తిరుపతి-1

భౌతిక స్వాధీనతా ప్రకటన (రూల్8(3) ప్రకారం)

(సర్ఫేసి చట్టం లోని 13(4) ప్రకారం స్థిరాస్తి యొక్క భౌతిక స్వాధీనత)

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ **లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన** తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన** తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పుసకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది.**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారము లను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.09.01.2026**న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:

1) **పి.ధరణి,** భర్త పి.వెంకటేశ్వర్లు, డి.నెం.5-115/1, శ్రీ పద్మావతి నిలయం, తిరుపతి, చిత్తూరు జిల్లా - 517501
2) **ముప్పల భావన,** భర్త ముప్పల జయచంద్రరాజు డి.నెం.12-30, తిమ్మరాజు కండ్రిగ, పుత్తూరు, తడుకు, చిత్తూరు జిల్లా
3) **ముప్పల శివరాజు,** తండ్రి ముప్పల జయచంద్రరాజు డి.నెం.12-30, తిమ్మరాజు కండ్రిగ, పుత్తూరు, తడుకు, చిత్తూరు జిల్లా
4) **ఎం.లోకేష్,** తండ్రి నాగిరెడ్డి, డి.నెం.18-4-53, రైల్వే కాలనీ, తిరుపతి, చిత్తూరు జిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము:రూ. **26,75,760/-** (ఇరవై ఆరు లక్షల డెబ్బై ఐదు వేల ఏడు వందల అరవై రూపాయలు మాత్రమే)

ఋణఖాతా నెం. **TRPTITF1803310004** డిమాండ్ నోటీసు తేది:**03.02.2023**

స్థిరాస్తుల వివరములు:-

షెడ్యూలు-1:- (భావన పేరున వున్న రిజిష్టర్డ్ విక్రయపత్రంనెం.1581/2015 ప్రకారం) చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్ జిల్లా, పుత్తూరు మండలం, నెం.30, పుత్తూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, సర్వేనెం.215/4, రజక కాలనీ ఎక్స్‌టెన్షన్, పాత వార్డునెం.10, కొత్త వార్డునెం.18 డి.నెం.18-100కు సమీపంలోని చిన్నబ్బనగర్ రెసిడెన్షియల్ ఏరియా లోని ప్లాటు నెం.11 యొక్క విస్తీర్ణం ఎ.1.42 సెంట్లు,హద్దులు: తూర్పు: ప్లాటు నెం.1 స్థలం, పడమర: 20అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటునెం.11, దక్షిణం: ప్లాటు నెం.9. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 40అ. లేదా 12.192మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 20అ. లేదా 9.096మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 800 చ.అ. లేదా 88.88 చ.గ. ఖాళీ స్థలం.

షెడ్యూలు-2:- (భావన పేరున వున్న రిజిష్టర్డ్ విక్రయపత్రంనెం.1582/2015 ప్రకారం) చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్ జిల్లా, పుత్తూరు మండలం, నెం.30, పుత్తూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, సర్వేనెం.215/4, రజక కాలనీ ఎక్స్‌టెన్షన్, పాత వార్డునెం.10, కొత్త వార్డునెం.18 డి.నెం.18-100కు సమీపంలోని చిన్నబ్బనగర్ రెసిడెన్షియల్ ఏరియా లోని ప్లాటు నెం.8 & 9 యొక్క విస్తీర్ణం ఎ.1.42 సెంట్లు,హద్దులు: తూర్పు: ప్లాటు నెం.2 & 3 లోని స్థలం, పడమర: 20అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.10, దక్షిణం: శివరాజుకు చెందిన ప్లాటు నెం.7. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 40అ. లేదా 12.192మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 40అ. లేదా 12.192మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 1600 చ.అ. లేదా 177.77చ.గ. ఖాళీ స్థలం.

షెడ్యూలు-3:-(ఎం.శివరాజు పేరున వున్న రిజిష్టర్డ్ విక్రయపత్రంనెం.1583/2015 ప్రకారం): చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, పుత్తూరు సబ్ జిల్లా, పుత్తూరు మండలం, నెం.30, పుత్తూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, సర్వేనెం.215/4, రజక కాలనీ ఎక్స్‌టెన్షన్, పాత వార్డునెం.10, కొత్త వార్డునెం.18 డి.నెం.18-100కు సమీపంలోని చిన్నబ్బనగర్ రెసిడెన్షియల్ ఏరియా లోని ప్లాటు నెం.6 & 7 యొక్క విస్తీర్ణం ఎ.1.42 సెంట్లు, హద్దులు: తూర్పు: ప్లాటు నెం.4 & 5 లోని స్థలం, పడమర: 20అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ఎం.భావనకు చెందిన ప్లాటునెం.8, దక్షిణం: 20అ. వెడల్పు గల రోడ్డు. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 40అ. లేదా 12.192మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 40అ. లేదా 12.192మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 1600 చ.అ. లేదా 177.77చ.గ. ఖాళీ స్థలం.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొన్న స్థిరాస్తులను స్వాధీనం తీసుకొనినాము. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించడం గాని, ట్రాన్స్‌ఫర్ చేయడం గాని చేయరాదు. [illegible]

ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి,
తేది: 16.01.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఐసర్ ఆచార్యులకు పురస్కారం

విజయ మోహనన్ పిళ్లైను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆచార్యులు విజయమోహనన్ పిళ్లై చిరంతన్ రసయన్ సంస్థ(సీఆర్ఎస్)నుంచి జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రోకెమిస్ట్రీలో వివిధ ప్రయోగాలు చేపట్టడంతో పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఐసర్ ఆచార్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మరెన్నో పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

క్లాసికల్ కార్యశాల..

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐసర్ క్లాసికల్ ఆర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పిక్ మెకే విరాసిత్-2026 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ కళాకారుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. యువతలో భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, శాస్త్రీయ కళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపతాయని ఆచార్యులు అభిప్రాయపడ్డారు. ఆర్కే శ్రీరామ్‌కుమార్, గానకంఠ బొర్రా, జ్యోతి హెగ్డే వంటి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

పండగ వేళ విషాదం

వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి

సంక్రాంతి పండగ వేళ.. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు.

● **లారీ ఢీకొని యువతి.. బైరెడ్డిపల్లె:** మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో నెల్లిపట్ల క్రాస్ వద్ద పొలంలో ఉన్న ఆవుల నుంచి పాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి నడిచి వెళ్తుండగా బైరెడ్డిపల్లెలోని కురవవీధికి చెందిన జయచంద్ర కుమార్తె హేమప్రియ (17)ను వెనక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మరణించింది. వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండే కుమార్తె మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరయ్యారు.

హేమప్రియ (పాతచిత్రం)

● **పండగకు చెల్లి ఇంటికొచ్చి వెళ్తుండగా.. బంగారుపాళ్యం:** వినాయకపురంలో చెల్లి ఇంటికి వచ్చి వెళ్తుండగా గంగవరం మండలం బూడిదపల్లెకు చెందిన లక్ష్మమ్మ(70)ను శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని కారు ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

● **డివైడర్‌ను ఆటో ఢీకొని.. తడ:** చేనిగుంట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వరదయ్యపాళెం మండలం సిద్ధమ అగ్రహారానికి చెందిన ఆటో డ్రైవర్ చెరివి మునిచంద్రయ్య (40) మృతి చెందారు. ఈ ఘటనలో జాతీయ రహదారి నిర్వహణ పనులు చేస్తున్న వలిపి వెంకటరమణయ్య, చెంబేటి సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. పండగ సందర్భంగా మునిచంద్రయ్య సొంతూరుకు భార్యాపిల్లల్ని ముందుగా పంపాడు. తనూ ఊరెళ్లే క్రమంలో కన్నుమూశాడు.

మునిచంద్రయ్య (పాత చిత్రం)

● **రైలు నుంచి జారిపడి.. దొరవారిసత్రం:** పోలిరెడ్డిపాలెం సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎగ్మోర్ నుంచి బర్మాపూర్ వరకు తీసుకున్న జనరల్ టికెట్ లభించింది. మృతుని వయసు 40 - 45 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● **విహారయాత్రకు వచ్చి గుండెపోటుతో.. కేవీబీపురం, న్యూస్‌టుడే:** కుటుంబ సభ్యులతో కేవీబీ పురం మండలం ఆరే సిద్ధేశ్వర కోన జలపాతంలో సరదాగా గడిపిన చెన్నైకు చెందిన శరవణన్(55) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది.

రైతు బలవన్మరణం

కలకడ: దిగువపాలెంకు చెందిన రైతు అమ్మయ్య (50), భాగ్యమ్మ దంపతులు పదేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. ఇటీవలే భాగ్యమ్మ భర్త వద్దకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామ సమీపంలోని అటవీలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న అమ్మయ్యను గుర్తించారు. రాయచోటి వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు.

జీవనోపాధికి వచ్చి..

రొంపిచెర్ల: బొమ్మయ్యగారి పల్లె కోళ్లఫారంలో పని చేస్తున్న పశ్చిమబంగాకు చెందిన రవీంద్ర (29) శుక్రవారం ఉరేసుకున్నాడు.

కడుపునొప్పి తాళలేక..

పెనుమూరు: కడుపు నొప్పి తాళలేక ఎరుగానిపల్లెకు చెందిన లోకయ్య (50) శుక్రవారం ఉరేసుకున్నాడు.

చికిత్స పొందుతూ బాలుడు..

గాలివీడు: ఇంటి వద్ద ఆడుకుంటూ శుద్ధజల క్యాన్ల ఆటో ఢీకొనడంతో గాయపడిన దేవాలయం వీధికి చెందిన కల్యాణి, భద్రయ్య దంపతుల కుమారుడు చిన్న (1) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

వారంలోగా మామిడి బకాయిల చెల్లింపు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వారం లోగా తోతాపురి మామిడి బకాయిల మొత్తాన్ని రైతులకు చెల్లించేందుకు చర్యలు చేపట్టామని ఉద్యానశాఖ ఇన్‌ఛార్జి జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. 'మామిడి రైతుకు సంక్రాంతి కరవు' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రూ.20 కోట్లు వారంలోగా చెల్లించాలని కలెక్టర్ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారని, తదనుగుణంగా బకాయిలు చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారన్నారు. కొందరు రైతులు గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఖాతా నంబర్లు సమర్పించకపోవడంతో నిధుల జమ ఆలస్యమైందని, వివరాలు ఈ నెల 20లోగా అందజేయాలని కోరారు.

ఈనాడు కథనానికి స్పందన

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న మహిళను ద్విచక్ర వాహనంలో ఇద్దరు యువకులు వెంబడించి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. తిరుపతి రూరల్ పీఎస్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. రూరల్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో లెక్కల గణేంద్ర నాయుడు, శశిరేఖ దంపతులు కాపురం ఉంటున్నారు. వారు సమీపంలో మిల్క్ పార్లర్ నడుపుతుంటారు. శుక్రవారం ఉదయం దుకాణం నుంచి శశిరేఖ, ఆమె కుమార్తె చరితతో కలసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వారిని వెంబడిస్తూ.. శశిరేఖ మెడలోని 36 గ్రాముల బంగారు గొలుసును వెనుక నుంచి లాగేశారు. ఆమె తేరుకుని అరిచేలోపు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైళ్లలో చోరీ చేసే దొంగ అరెస్టు

నిందితుడిని చూపుతున్న రైల్వే పోలీసులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు, పాకాల, కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలోని ప్లాట్‌ఫామ్‌లు, కదులుతున్న రైళ్లలో చోరీలకు పాల్పడే నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు రైల్వే పోలీసుస్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్సైలు ధర్మేంద్ర రాజు, మధుసూదన్‌రావు.. నిందితుడిని చూపి నేరాల వివరాలు వెల్లడించారు. రైల్వే స్టేషన్ పరిధిలో నమోదవుతున్న చోరీ కేసులను నియంత్రించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో బృందాలుగా ఏర్పడి నిఘా ఏర్పాటు చేశాం. కొన్ని చోరీల పక్కా సమాచారంతో శుక్రవారం చిత్తూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం-1 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కుప్పానికి చెందిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించాం. రైలులో నిద్రిస్తున్న వారి చరవాణులు, బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు అతడు నేరం అంగీకరించాడు. అతడి నుంచి రూ.2 లక్షల విలువజేసే బంగారు గొలుసు, ఓ చరవాణి స్వాధీనం చేసుకున్నాం. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వారు పేర్కొన్నారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

TO LET

తిరుపతి అంకాలమ్మ గుడి దగ్గర opp: RTC బస్టాండ్ ఇంద్రలోక్ అపార్ట్‌మెంట్ 3 BHK - 404 నార్త్ ఫేస్ ఫ్లాట్ అద్దెకు కలదు. Ph: 98663 61369.

JOBS

Tele Callers Female Qua: Any Degree & Basic system knowledge. N Sreenatha Reddy Recovery Agency, Bairagapattida, TPT ✆ 90328 01545

తిరుపతి, సేవా సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్టు, వంట మనుషులు, నైట్ డ్యూటీ చేయుటకు హౌస్ కీపింగ్ స్టాఫ్ M/F కావలెను. Cont: 99495 32652.

తిరుచానూరు లాడ్జి నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, రూమ్ బాయ్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: 94405 81161.

సహానా గ్రాండ్ హోటల్ తిరుపతి నందు హౌస్ కీపింగ్ వర్క్ చేయుటకు సిబ్బంది కావలెను. జీతం: 12 నుండి 14000 వరకు కలదు.Cont:9440364488.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే పరిపాలన భవనం కవాతు మైదానంలో గురువారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

పాకాల, న్యూస్‌టుడే: పాకాలలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా శనివారం ఉదయం ఆవిష్కరించనున్నట్లు విగ్రహ ప్రతిష్ఠ బలిజ ఐక్య కమిటీ తెలిపింది. కమతంపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ, అనంతరం ర్రైస్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో జరిగే సమావేశానికి స్థానిక ప్రజలు హాజరుకావాలని కమిటీ కోరింది.

శ్రీమూలస్థానమ్మతల్లి

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థానమ్మ ఎల్లమ్మతల్లికి శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. రాత్రి సింహవాహనంపై దుర్గాదేవి స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం రాత్రి శ్రీమిట్ట గంగమ్మతల్లి తిరుచ్చిపై పట్టణ వీధుల్లో విహరించారు.

బొప్పరాజుపల్లిలో జనంలో పరుగులు తీస్తున్న పశువులు

ఉత్సాహంగా పశువుల పండగ

చంద్రగిరి, న్యూస్‌టుడే: అరిగిలవారిపల్లిలో శుక్రవారం పశువుల పండగా నిర్వహించారు. ఉత్సవాలను వీక్షించడానికి విచ్చేసిన అశేష జన సమూహంలో కోడెగిత్తలు రంకెలేస్తూ దూసుకెళ్లాయి. కొందరు యువకులు గాయపడ్డారు. ● **పాకాల:** కూనపల్లి, ఓబులశెట్టివారిపల్లి గ్రామాల్లో పశువులను అలంకరించి వీధుల వెంట ఊరేగించారు. కోడెగిత్తలను నిలువరించి కొమ్ములకు కట్టిన బహుమతులను దక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ● **రామచంద్రాపురం:** బొప్పరాజుపల్లిలో పశువుల పండుగ నిర్వహించారు. తిలకించడానికి భారీ సంఖ్యలో ప్రజలు గ్రామానికి చేరుకున్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సంక్రాంతి కానుకగా శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, రైతులకు వ్యవసాయ భూములపై హక్కులు కల్పించడంలో జిల్లా యంత్రాంగం సఫలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా గురువారం ఆన్‌లైన్ లాటరీ విధానంలో లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. లబ్ధిదారులకు ల్యాండ్ పూలింగ్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు తుడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. లబ్ధిదారులకు కనీసం రెండు సెంట్ల ఇంటి స్థలం, రిజిస్ట్రేషన్ రుసుములు రూ.26.25 కోట్లను మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారులపై ఆర్థిక భారం లేకుండా చేశారు.

లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ వెంకటేశ్వర్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి

భవిష్యత్తులో వాణిజ్య సముదాయాలు: తుడా ఛైర్మన్

రాష్ట్రంలో మొదటిసారి ఒక ఊరు మొత్తం భూమి సమస్యను పరిష్కరించి భూములు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని తుడా ఛైర్మన్ అన్నారు. భవిష్యత్తులో శెట్టిపల్లి పరిసరాల్లో వాణిజ్య సముదాయాలు, హోటల్‌లు, కన్వెన్షన్ హాల్‌లు రానున్నాయని, తద్వారా శెట్టిపల్లి భూముల విలువ గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. 225 ఎకరాలలో మోడల్ టౌన్ షిప్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.1.50 కోట్లు చొప్పున సుమారు రూ.350 ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. తుడా కార్యదర్శి శ్రీకాంత్ బాబు, ప్రణాళిక అధికారులు దేవి కుమారి, వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

2,111 మందికి పట్టాలు

శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం చూపలేకపోయిన వైకాపా ప్రభుత్వం సమస్యను మరింత జటిలం చేస్తూ తుడా నుంచి నగరపాలికకు బదలాయించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు తుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సి.దివాకర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతగా శెట్టిపల్లి భూముల సమస్యను పరిగణించి శాస్త్రీయంగా సమస్యకు పరిష్కారం చూపించారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ నేతృత్వంలో తుడా, రెవెన్యూ అధికారులు శ్రమించి శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం చూపారు. 636 ఎకరాల శెట్టిపల్లి భూముల సమస్యను ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా పరిష్కరించి ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో పారదర్శకంగా 2,111 మందికి భూముల పట్టాలను కేటాయించారు. త్వరలో తుడా తరపున భూమి రిజిస్ట్రేషన్ చేసి క్యూఆర్ కోడ్‌తో కూడిన ల్యాండ్ పూలింగ్ ఓనర్ డాక్యుమెంట్‌తో పక్కాగా భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి

వేంపల్లె, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఓ వైద్య విద్యార్థి సీపీఆర్ చేసి కాపాడాడు. తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మణికంఠ సాయినగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. మిద్దెపై గాలిపటం ఎగురవేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న వైద్య విద్యార్థి సోహెబ్ మణికంఠను పరీక్షించి సీపీఆర్ చేశాడు. స్పృహలోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పాతికేళ్ల తర్వాత కాటమరాజుకు పూజలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: అగరాల గ్రామంలో పాతికేళ్ల తర్వాత కాటమరాజు ఉత్సవాన్ని నిర్వహించారు. జాతీయమార్గం విస్తరణలో భాగంగా అగరాల పొలిమేరలోని కాటమరాజు దేవరమిట్ట ప్రాగణం కోల్పోయింది. అప్పట్నించి కాటమరాజు దేవరమిట్ట ప్రాంగణంకు అనువైన స్థలం లేకపోవడంతో ఉత్సవాలు ఆగిపోయాయి. తెదేపా సీనియర్ నాయకులు ఏవీ రమణమూర్తి, టి.జయచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, తోట చంద్రబాబులు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు. రాయలవారికోట-అగరాల మార్గంలోని ప్రభుత్వ ఆధీనంలోని పత్తిగుట్టప్రాంతంలో కాటమరాజు దేవరమిట్ట కోసం కొంత స్థలాన్ని చదును చేయించారు. కాటమరాజు దేవర్లను నెలకొల్పి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు.

శ్రీవారి ఆలయంలోకి గోదామాలలు తెస్తున్న పెద్ద జీయ్యంగారు, అధికారులు

తిరుమల శ్రీవారికి గోదామాలలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారికి మహాభక్తురాలైన (ఆండాళ్ అమ్మవారు) శ్రీగోదాదేవి పరిణయోత్సవాన్ని పురస్కరించుకుని గోదామాలలు శ్రీవారి మూలవిరాట్‌కు శుక్రవారం అలంకరించారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీగోదాదేవి నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. గోదాదేవిమాలలను తిరుమల పెద్ద జీయర్‌స్వామి మఠానికి ఉదయం చేరుకున్నాయి. అనంతరం పెద్ద జీయర్ మఠం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువచ్చారు. జీయంగార్లు, పోటు ఏఈవో మునిరత్నం, గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారం ఘనత ప్రభుత్వానిదే

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన శెట్టిపల్లి భూ బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ న్యాయం చేకూర్చారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. భూ సమస్య పరిష్కరించిన సీఎం, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆరణికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా నాయకులు శెట్టిపల్లి భూములపై కన్నేసి తూతూమంత్రంగా ప్రొసీడింగ్స్ ఇచ్చి.. రాజకీయ లబ్ధికి యత్నించారని ఎమ్మెల్యే ఆరోపించారు.

IN THE COURT OF I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI

I.A.No.7 OF 2025 & O.S.No.14 OF 2025

Y.SURESH ...Plaintiff/Petitioner

Vs

N.NAGARAJU ...Defendant/Respondent

SUIT SUMMONS & NOTICE TO DEFENDANT/RESPONDENT

N.Nagaraju, S/o N.Govindaiah,
Resident of D.No.10-11-383,
Doddapuram street, Tirupati

ప్రోనోటు అసలు, వడ్డీ పైకం రాబట్టుకొనుటకు వాది పైకనిన దావాను ప్రతివాదిపై దాఖలు చేసియున్నారు. మరియు ప్రతివాది స్థిరాస్తిని జప్తు చేయుటకు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. పై కనిన కేసులో ప్రతివాది మరియు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం కోర్టువారు తా.21-01-2026 వాయిదా వేసి యున్నారు. కావున మీరు సదరు తేదీన ఉదయం 10.30 గంllలకు నేరులోగానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ అక్షేపణలు తెలియ చేయవలసినది. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానం చేయుదురు.

KADIYALA BHASKAR & VIDHYALA SUNIL KUMAR

Advocates for plaintiff/petitioner, Tirupati

Mobile Nos: 9849460658, 9966838262

సీఎం దృష్టికి బాలాజీ రైల్వే డివిజన్ అంశం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్ చేయాలన్న ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ బృందం కోరారు. సంక్రాంతి పురస్కరించుకుని కుటుంబ సమేతంగా నారావారిపల్లెకి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని నేతృత్వంలో సమితి కన్వీనర్ గిరిధర్ కుమార్ బృందంతో కలిసి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.

సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సాధన సమితి కన్వీనర్ గిరిధర్

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా పరిగెడుతోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పసుపులేటి శివప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి ప్రతిమను అందజేశారు.

ముఖ్యమంత్రికి శ్రీవారి ప్రతిమ అందజేస్తున్న నేతలు హరిప్రసాద్, శివప్రసాద్

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ఐతేపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి గురువారం నారావారిపల్లిలో ముఖ్యమంత్రిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు రమణమూర్తి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తూ మరిన్ని పరిశ్రమలు రావడానికి చొరవ చూపుతున్న ఎమ్మెల్యే నానిని ముఖ్యమంత్రి అభినందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీఎంతో పారిశ్రామికవేత్త రమణమూర్తి, ఎమ్మెల్యే పులివర్తి నాని



చెరువు నిండినా.. ఆదాయం సున్నా

చేపలు పెంచితే పంచాయతీకి రాబడి

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లో ఆర్థిక వనరులు గుర్తించి పంచాయతీలను బలోపేతం చేయాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. దీనికి సంబంధించి సమష్టిగా అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించాలని పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలోని సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి నిదర్శనం పేరూరు పంచాయతీ. చెరువు నిండా నీళ్లు ఉన్నా చేపలు పెంచడంలో శ్రద్ధ చూపించడం లేదు. ఫలితంగా చెరువులోని చేపలను కొందరు అనధికారికంగా పట్టుకుంటూ పంచాయతీకి గండికొడుతున్నారు.

నిండుకుండలా పేరూరు చెరువు

భారీ వర్షాలకు జలకళ

తిరుపతి గ్రామీణ మండలంలోని పేరూరు చెరువు, జిల్లాలోని మూడు పెద్ద చెరువుల్లో ఒకటి. సుమారు 150 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో భారీ వర్షాలకు స్వర్ణముఖి ప్రవహిస్తే ఆ నీటిని చెరువుకు మళ్లిస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండిపోయి కలుజు పారుతోంది. సాధారణంగా పంచాయతీలకు చెరువుల ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. దీనికి నిదర్శనం మండలంలోని మంగళం, చెన్నాయగుంట, టీఎన్ పాళెం చెరువులే. ఈ చెరువుల్లో ఏటా చేపలు వదిలి వాటిని వేలం పాడతారు. తద్వారా పంచాయతీకి ఎంతో కొంత ఆదాయం సమకూరుతోంది.

ఐదేళ్లకు ముందు..

పేరూరు పంచాయతీలో ఐదేళ్లకు ముందు చెరువు నిండినప్పుడు చెరువులో చేపలు వదిలారు. వీటిని మూడు నెలలు సంరక్షించిన తర్వాత వేలం నిర్వహించారు. స్థానికంగా ఉన్న కొందరు వేలం పాడి చేపలను సొంతం చేసుకున్నారు. ఆ నగదును పంచాయతీ ఖాతాలో జమ చేశారు. తద్వారా పంచాయతీకి ఆర్థికంగా చెరువు ద్వారా కొంత మేలు జరిగింది.

అనధికారికంగా పట్టుకుని విక్రయం

పేరూరు చెరువు నిండి రెండు వారాలుగా కలుజు పారుతోంది. చెరువులో వంజిరం, జిలేజీలు, కొరమేన్లు, చెరువు చేపలు ఉన్నాయి. వీటిని స్థానికంగా ఉన్న కొందరు పట్టుకుని ఆది, బుధవారాల్లో సొమ్ము చేసుకుంటున్నారు. పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇటీవల మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో పేరూరు చెరువులో చేపలు పెంచితే పంచాయతీకి ఆదాయం వస్తుందని సర్పంచి విన్నవించారు. చెరువు నిండా నీళ్లు ఉన్నాయి.. ఇరిగేషన్, ఫిషరీస్ శాఖ అధికారులు దీనికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

తర్పణాలకు పోటెత్తిన నగరవాసులు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కపిలతీర్థంలో తర్పణాలు వదిలేందుకు నగరవాసులు పోటెత్తారు. తమ పెద్దలకు నూతన వస్త్రాలు పెట్టి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గతంలో ఆలయ ప్రవేశ ద్వారం నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు తర్పణాలు నిర్వహించేవారు. ఇటీవల రద్దీ ఏర్పడి గొడవ జరగడంతో ఈ సారి అధికారులు ఆలయ పరిసర ప్రాంతాలకు ఆనుకొని ఉన్న విశాలమైన ప్రదేశంలో తర్పణాలు, పిండ ప్రదానాలు చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిన్నగొట్టిగల్లు: జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు.

ఈ నెల 18 వరకు గృహోపకరణాలపై తగ్గింపు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా సత్య సంస్థ జనవరి 13 నుంచి 18 వరకు సంక్రాంతి సేల్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక సేల్ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 70 శాతం వరకు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయని సంస్థ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈఎంఐలు, క్యాష్‌బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు అందిస్తోంది. సమీపంలోని సత్య షోరూమ్‌ను సందర్శించి సద్వినియోగం చేసుకోండని కోరింది.

తెదేపా, జనసేన ఫ్లెక్సీ వివాదం

● ఇరువర్గాల దాడులు.. ఆసుపత్రిలో చికిత్స

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఫ్లెక్సీ వివాదం తెదేపా, జనసేన వర్గాల మధ్య దాడులకు దారి తీసింది. జనసేనకు చెందిన శ్రీనివాసులు తిరుపతి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో మంజునాథ హోటల్ నిర్వహిస్తున్నారు. దాని పక్కనే తెదేపాకు చెందిన మునిశేఖర్ రాయల్ పార్కింగ్ స్టాండును కొనసాగిస్తున్నారు. శ్రీనివాసులు కూటమి నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని.. ఇరు దుకాణాల మధ్యన, ప్రధాన రోడ్డుకు కనిపించేలా పెట్టారు. పార్కింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందిగా ఉందని పార్కింగ్ స్టాండు నిర్వాహకులు తొలగించమని చెప్పారు. యజమాని వచ్చాక తొలగిస్తామని మంజునాథ హోటల్ సిబ్బంది చెప్పడంతో పార్కింగ్ సిబ్బంది అతనిపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు తమ హోటల్ సిబ్బందితో కలిసి పార్కింగ్ స్టాండులోకి వెళ్లి అందరిపై దాడికి పాల్పడ్డారు. మునిశేఖర్ రాయల్ తమ్ముడు రాజ్‌కుమార్ రాయల్‌తోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న తెదేపా కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పరామర్శించారు. తూర్పు సీఐ శ్రీనివాసులు ఘటన గురించి విచారించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

మార్టూరు, న్యూస్‌టుడే: కోల్‌కతా- చెన్నై 16వ నంబరు జాతీయ రహదారిపై గంజాయి తరలిస్తున్న ఇద్దరిని మార్టూరు పోలీసులు పట్టుకుని, 50 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన అబ్దుల్ అజీజ్, నెల్లూరులో ఉండే పాకాలకు చెందిన షేక్ ఫర్జానా బేగంతో కలిసి అరకు నుంచి బెంగళూరుకు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 32 మందికి జరిమానా

తిరుపతి(లీగల్), న్యూస్‌టుడే: నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 32 మంది వాహన చోదకులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. నగరంలో తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి పర్యవేక్షణలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఎస్వీఎంసీకి సీపీఎం నేత పార్థివదేహం

ఏవీ వర్మ పార్థివదేహం అప్పగిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: సీపీఎం సీనియర్ నేత ఏవీ వర్మ(84) పార్థివదేహాన్ని ఎస్వీ వైద్య కళాశాల(ఎస్వీఎంసీ)కు గురువారం అప్పగించారు. కుటుంబ సభ్యులు, సీపీఎం నాయకులు ఏవీ వర్మ మృతదేహంతో ఎస్వీఎంసీ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఫోరెన్సిక్ ప్రొఫెసర్ శశికాంత్‌కు పార్థివదేహాన్ని అప్పగించారు. అనాటమి విభాగంలో పార్థివదేహాన్ని ఉంచి వైద్య విద్యార్థులకు బోధించనున్నారు. అంతిమయాత్రలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాంభూపాల్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ అధ్యక్షులు అంజయ్య, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొని ఆయన సేవలను కీర్తించారు.

బైక్‌పై వెళ్తున్న మహిళ గొలుసు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: భర్తతో ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చొని వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును మరో బైక్‌పై వస్తున్న యువకులు లాక్కున్నారు. అలిపిరి పీఎస్ ఎస్‌ఐ నరసింహరావు వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కలంజర్‌దాసు, రేవతి కొంతకాలంగా నగరంలోని పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా భార్య గృహిణి. గురువారం మధ్యాహ్నం భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై రేణిగుంట రోడ్డులోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ వద్ద పోతుండగా.. వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనంలో ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని 34 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పారిపోయారు. ఆమె అదుపు తప్పి కిందపడ్డారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మునిరత్నం (పాతచిత్రం)

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ఎ.రంగంపేట యాదవ కాలనీలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. చంద్రగిరి పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్.సుబ్బ మునిరత్నం(45)కి, దేవరకొండ గ్రామానికి చెందిన వసంతతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. సెంట్రింగ్ పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. 15వ తేదీన పండుగ కావడంతో సుబ్బమునిరత్నం ఇంటి నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన ఆయన తల్లి ఈశ్వరమ్మ వెళ్లి చూడగా ఇంట్లో మృతి చెంది ఉన్నాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించి శవ పంచనామా చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

శ్రీఆనందవల్లీదేవికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు: గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీఆనందవల్లీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండగను పురస్కరించుకుని అమ్మవారికి క్షీరం, నారికేళం, చందనం, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలతో దీప, ధూప, నైవేద్యాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.

హనుమంతా.. పర్వతమంత

కొండ చరియల్లో శిలాజ దేవతామూర్తులు దర్శనమిస్తుంటారు. శ్రీకాళహస్తిలోని కైలాసగిరి పర్వత శ్రేణుల్లో అంజూరు మండపానికి వెళ్లే మార్గంలో కైలాసగిరి పర్వతం అంచున హనుమంతుడి ముఖంతో స్పష్టంగా కన్పించడాన్ని భక్తులు గుర్తించారు. పలువురు జైహనుమంతా. . బలవంతా అంటూ ఆయన్ను స్తుతించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఆన్‌లైన్ టికెట్ చూపుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, అధికారులు

ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లింపులను మరింత సులభతరం చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున శివయ్య గోపురం సమీపంలో రూ.1.81 కోట్లు వ్యయంతో నూతనంగా సిద్ధం చేసిన 'ఆర్జితం సముదాయాన్ని' శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలి ఆన్‌లైన్ టికెట్‌ను ఆయన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేకుండా భక్తులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. భక్తులకు అవసరమైన విశ్రాంతి భవనం, సెల్‌ఫోన్ కౌంటర్లు, లగేజీ కేంద్రాలన్నీ ఇక్కడే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. సుమారు రూ.30 లక్షలతో ప్రచార రథాన్ని తీర్చిదిద్దారన్నారు. ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, గోపీనాథ్, రాఘవయ్య, ప్రత్యేక ఆహ్వానితులు శైలజ, వెంకటరామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టి.. తుక్కులోకి

అక్రమ రవాణా.. చోరీ ఘటనలు.. గంజాయి నేరస్థులు వినియోగించడం, ప్రమాద, ఇతరత్రా ఘటనల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాటిని స్టేషన్ ముందు రోడ్డు పక్కన ఉంచారు. నేర అభియోగాల నమోదుతో పాటు కేసులు కోర్టుల్లో అపరిష్కృతంగా ఉండటంతో వాహనాలు తుక్కుగా మారిపోతున్నాయి. పట్టుకున్న వాహనాలకు పత్రాలు చూపించి లేదా జరిమానా చెల్లించి వాహనదారులు తీసుకెళ్లని ఫలితంగా అవి తుక్కులోకి చేరుతున్నాయి. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

తొట్టె సరే.. నీరేది?

పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద విస్తారంగా పశువుల నీటి తొట్టెలు నిర్మించారు. ఒక్కో తొట్టెకు రూ.35 వేల అంచనాతో నిర్మించారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని పూడి ఎస్సీ కాలనీ వద్ద తొట్టెను నిర్మించి నెలలు అవుతున్నా.. నీరు నింపక పోవడంతో తొట్టె వృథాగా మారుతోంది. దీంతో ప్రయోజ లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు తొట్టెకు నీరు నింపి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

బాధితులకు చేయూత.. ముఖ్యమంత్రి సహాయనిధి

సహాయనిధి చెక్కులతో లబ్ధిదారులు

నాగలాపురం, న్యూస్‌టుడే: అనారోగ్యం, ప్రమాద సమయాల్లో చేతిలో చిల్లిగవ్వ లేక బాధిత కుటుంబాలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అవసరానికి అప్పులు పుట్టక నా అనుకున్న వారిని కాపాడుకోవడానికి పడే కష్టాలు అలవికానివి. కార్పొరేట్ వైద్యశాలల్లో చేరి చికిత్సల అనంతరం వచ్చే బిల్లులను చెల్లించడానికి ఎదురైన కష్టాలతో సతమతమయ్యే బాధితులకు భరోసా కల్పిస్తోంది ముఖ్యమంత్రి సహాయనిధి.

దరఖాస్తు విధానం ఇలా..

బాధితులు వైద్యశాలలో ఖర్చు చేసిన అన్ని బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలి. రేషన్‌కార్డు, ఆధార్ కార్డులతో పాటు ఆసుపత్రుల్లో అయిన ఖర్చుల వివరాల బిల్లులతో స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదించాలి. ఎమ్మెల్యేతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి నెల రోజుల్లో బాధితులకు ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందచేస్తారు.

కూటమి పాలనలో..

వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన ఈ నిధిని కూటమి పాలనలో పునరుద్ధరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాలకు ఆసరా కల్పిస్తోంది సీఎంఆర్ఎఫ్. కూటమి పాలన ప్రారంభమైన ఆరు నెలలకే సహాయనిధిని తిరిగి అమలుచేసి బాధితులకు తోడ్పాటు నందిస్తున్నారు. వైద్యశాలల్లో అయిన ఖర్చుల్లో రూ.50-90 శాతం నగదును బాధితులకు తిరిగి ఇస్తున్నారు. నియోజకవర్గంలో..

పదిహేను రోజుల్లోపే అందించాం

రాజకీయాలకు అతీతంగా అందరికీ సీఎంఆర్ఎఫ్‌ను అందిస్తున్నాం. బాధితులు పూర్తి బిల్లులతో సంప్రదిస్తే వారి అర్హతకు అనుగుణంగా సహాయనిధితో తోడ్పాటునందిస్తున్నాం. సహాయనిధి పేరిట ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మోసపోవద్దు. ప్రభుత్వం ఎటువంటి ఖర్చులు బాధితులపై పెట్టకుండా సహాయాన్ని అందిస్తోంది. **- కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే**

మండలం	లబ్ధిదారుల సంఖ్య	పంపిణీ (రూ.లక్షల్లో)
నాగలాపురం	24	16.70
పిచ్చాటూరు	37	27.55
నారాయణవనం	28	19.63
సత్యవేడు	19	10.40
వరదయ్యపాళెం	27	17.74
బీఎన్‌కండ్రిగ	19	12.36
కేవీబీపురం	25	14.94

దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పేదలకు దుస్తుల పంపిణీ

నాగలాపురం: వెల్లూరు చర్చిలో సంక్రాంతి సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో పాస్టర్ జోసెఫ్, డక్లస్‌లు శుక్రవారం స్థానిక పేదలకు దుస్తులు అందించారు. పాస్టర్లు అందించిన విరాళాలను ఎమ్మెల్యే అభినందించారు. మురళి, కామాక్షయ్య, రాజమాణిక్యం, మునివేలు, షణ్ముగాచారి పాల్గొన్నారు. నాగలాపురం పడమటి ఎస్సీకాలనీలో గురువారం శ్రీకృష్ణ మందిరానికి ఎమ్మెల్యే సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి నిర్వాహకులకు అందించారు.

మహిళకు చెక్కు పంపిణీ చేస్తున్న కూరపాటి శంకర్‌రెడ్డి, నేతలు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సత్యవేడు, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.20 వేల చెక్కును మండలంలోని మదనంబేడు గ్రామానికి చెందిన మునెమ్మకు శుక్రవారం సత్యవేడులో నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, మురళి, కిరణ్, దయ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: సమస్య: శ్రీకాళహస్తి మండలంలోని మద్దిలేడులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం.

- రమణ, స్థానికుడు

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

- పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో, శ్రీకాళహస్తి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని చియ్యవరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోయి నీరు పారడం లేదు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది సాయంత్రమైతే దాడి చేస్తున్నాయి. పూర్తి స్థాయిలో కాలువలు లేక పోవడం సమస్యగా మారుతోంది. **- హిమజ, స్థానికురాలు**

సమాధానం: సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శితో చర్చించి, వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.

- సురేంద్రనాథ్, ఎంపీడీవో

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, జగడంపల్లె ప్రాంతాల్లో చెత్తా చెదారాలు పేరుకు పోతున్నాయి. చాలా రోజులుగా శుభ్రం చేయడం లేదు. **- సుభాన్, జగడంపల్లె**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో ఆ ప్రాంతాలను వెంటనే శుభ్రం చేయిస్తాం. సంక్రాంతి పండగ సందర్భంగా సిబ్బంది కొరత ఏర్పడింది. వెంటనే చర్యలు తీసుకుంటాం.

- బి.శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు

తొలగిన వ్యర్థాలు

తొట్టంబేడు : శ్రీకాళహస్తి ఆర్టీసీ ప్రాంగణం వ్యర్థాలకు నిలయంగా మారి ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. సమస్యపై 'ఈనాడు'లో గురువారం 'ప్రాంగణం వ్యర్థలకు నిలయం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు ప్రాంగణం ఆవరణలోని ప్లాస్టిక్ గోతాలు, గ్లాసులు, గాజు పెంకులను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించారు.

పుల్లంపేట : విజేతకు బహుమతి అందిస్తున్న సర్పంచి మణికంఠ

ఓబులవారిపల్లె: ఆటల పోటీల్లో చిన్నారులు, పెద్దలు

నాగలాపురం : ఆవులకు పూజ చేస్తున్న ఛైర్మన్ పద్మనాభరాజు

ముగిసిన సంక్రాంతి సంబరాలు

ఏర్పేడు: సంక్రాంతి, కనుమ పండగ పర్వదినాలను పురస్కరించుకుని తిరుపతి ఐఐటీ, ఐసర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంగణాల్లో రెండు రోజుల పాటు భోగి మంటలు వేశారు. సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేలా ఎద్దులబండ్లను ప్రత్యేకంగా అలంకరించారు. ముగ్గుల పోటీలు, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. **పుల్లంపేట:** పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో శుక్రవారం కనుమ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రైతులు తమ ఇళ్లలోని పశువులను అందంగా అలకించి పూజించారు. తిప్పాయపల్లె గ్రామంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేణుగోపాలపల్లెలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. **ఓబులవారిపల్లె:** తెలుగువారికి పెద్ద పండగైన సంక్రాంతి పల్లెకు శోభ తెచ్చింది. గంగిరెద్దుల సన్నాయి మేళాలు కనువిందు చేశాయి. పెద్దలరంపాడులో గోపూజ నిర్వహించారు. పల్లెల్లో చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ ఆట, పాటల్లో నిమగ్నమయ్యారు. **నాగలాపురం:** సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో పశువుల పండుగను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఆలయ గోశాలలోని ఆవులను సుందరంగా ముస్తాబుచేసి పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఛైర్మన్ పద్మనాభరాజు, ఈవో లత, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ఏర్పేడు: ఆకట్టుకుంటున్న ఐఐటీ విద్యార్థులు గీసిన సంక్రాంతి ముగ్గు

ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎద్దులబండి

గౌరీ దేవికి ప్రత్యేక పూజలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి పట్టణంలోని వెలమపాలెంలో గౌరీ దేవికి మూడో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా మూడు ప్రదేశాల్లో గౌరమ్మను ప్రతిష్ఠించి, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. శనివారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు.

తిరుచ్చిపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి, గోదాదేవి

శాస్త్రోక్తంగా కల్యాణం

నారాయణవనం: శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లను తిరుప్పావై ప్రవచనంతో మేల్కొలిపి ధనుర్మాస, నిత్యకైంకర్య పూజలు చేపట్టారు. సాయంత్రం గోదాదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకంగా తిరుచ్చివాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, సిబ్బంది, అర్చకులు పర్యవేక్షించారు.

వీధి దీపాల ఏర్పాటు

రేణిగుంట, న్యూస్‌టుడే: కుర్రకాలువ సమీపంలోని జగనన్న కాలనీలో నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గత నెలలో రేణిగుంటలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానికంగా కాపురం ఉంటున్న కార్తికేయ సమస్య పిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది నూతనంగా 17 వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుకలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని కంచరపాళెంలో వందేళ్లు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలో అడుగు పెడుతున్న ఎస్.ఆళ్వారయ్యను గ్రామస్తులందరూ కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా చేపట్టారు. శుక్రవారం తెదేపా మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచి దశరథన్ ఆధ్వర్యంలో కేకు కోసి పంచి పెట్టారు. వృద్ధ దంపతులను ఘనంగా సన్మానించారు. పలువురు స్థానిక యువత ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ముక్తిగురువు శ్రీకృష్ణాజీ ప్రత్యేక దర్శనం

శ్రీకృష్ణాజీ ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని బత్తులవల్లంలోని ఏకం ఆలయం(గోల్డెన్ సిటీ)లో శుక్రవారం కల్కిభగవాన్ కుమారుడు ముక్తిగురువు శ్రీకృష్ణాజీ ప్రత్యేక దర్శనానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆయన దీక్ష, ఆశీర్వచనం కల్పించారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు ఆయన ఆశీర్వాదం పొందారు. ట్రస్టు ప్రతినిధులు ఆచార్యఆనంద గిరీజీ, సమదర్శిని, లోకేష్‌జీ, సునీల్‌జీ, బొప్పన రమేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రామోత్సవం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కొత్తబజారు వీధిలోని శ్రీకోదండరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీభుజంగేశ్వరాలయం, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా సూర్యనారాయణ హోమం

సూర్యనారాయణుకి పూజలు చేస్తున్న వేదపండితులు

వరదయ్యపాళెం: సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశిస్తున్న మకర సంక్రమణాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్(ఏకం) కార్యాలయంలో గురువారం సూర్యనారాయణహోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ సూర్యభగవానుడికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ట్రస్టు ప్రతినిధులు సునీల్‌జీ, లక్ష్మీజీ, అరుణ్, బొప్పన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పుల్లంపేట పద్మశాలీలు మకర సంక్రాంతిని పురస్కరించుకుని నగర సంకీర్తన నిర్వహించారు. మొదట భద్రావతి సమేత భావనారుషి ఆలయం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన పుల్లంపేట పురవీధుల గుండా సాగింది. ఇంటింట పద్మశాలీలు స్వాగతిస్తూ పూజలు చేపట్టారు. యేడాది పాటు అందరూ సుఖ శాంతులతో ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ నగర సంకీర్తనను ప్రతి అమావాస్యనాడు నిర్వహిస్తున్నారు.

యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఛైర్మన్ కేకే చౌదరికి గజమాలతో స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

పెనగలూరు(పుల్లంపేట): యువత ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడక ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కేకే చౌదరి అన్నారు. శుక్రవారం పెనగలూరు మండలానికి విచ్చేసిన ఆయనను కూటమి నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. సాతపల్లె గ్రామాన్ని సందర్శించిన ఆయనను కూటమి నాయకులు మండల సమస్యలను తెలియజేశారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

శ్మశానవాటికను పట్టించుకోరా..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: హిందువుల శ్మశానవాటికను పురపాలక సంఘ అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా సువర్ణముఖీ నదీ తీరంలోని సమాధులు వద్దకు వెళ్లి పట్టణ ప్రజలు వారి సంబంధీకులకు నివాళులు అర్పిస్తుంటారు. అయితే సమాధులను పట్టించుకోకపోవడం, చుట్టూ పిచ్చిమొక్కలతో అక్కడకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వాపోయారు. ఇకనైనా ఇక్కడి పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు.

బాధితులకు సామగ్రి అందజేత

సామగ్రి, బంగారు నగలు అందజేస్తున్న పోలీసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్‌లో పోగొట్టుకున్న సామగ్రి, బంగారు నగలను తిరిగి ప్రయాణికులకు అందజేశారు రేణిగుంట పట్టణ పోలీసులు. పట్టణ పోలీసుల కథనం మేరకు. .. తిరుపతి నగరానికి చెందిన వినోద్, విన్న తమిళనాడు నుంచి స్వగ్రామమైన తిరుపతికి గురువారం రైల్లో బయలు దేరారు. రేణిగుంట రైల్వేస్టేషన్ వద్ద సామగ్రి పోగొట్టుకున్నారు. వారు వెంటనే రేణిగుంట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణ ఎస్సై ధర్మారెడ్డి సిబ్బంది విచారణ చేపట్టి సామగ్రిని గుర్తించి బాధితులకు అప్పగించారు. ఇందులో 20 గ్రాములు బంగారం ఉంది.

శాంతి ఆశ్రమం పీఠాధిపతి శివైక్యం



కైలాస నందగిరి స్వామి (పాత చిత్రం)

నారాయణవనం : ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రమైన కైలాసకోనలోని శాంతి ఆశ్రమ పీఠాధిపతి కైలాస నందగిరిస్వామి శుక్రవారం మధ్యాహ్నం శివైక్యం పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆశ్రమంలో సమాధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు .. తొట్టంబేడు: సంక్రాంతి రోజున జూద స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని తంగేళ్లపాలెం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐలు తిమ్మయ్య, ప్రకాష్, ఎస్సై జ్యోతి సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. 13 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కోడి పుంజులు, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో పది మంది .. బీఎన్‌కండ్రిగ: గాజులపెళ్లూరు, బంగ్లాతోట గ్రామాల్లో గురువారం కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిని ఎస్ఐ హరిప్రసాద్ అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.12,200 నగదు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది బాలగురవయ్య, రమేష్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల .. రేణిగుంట, న్యూస్‌టుడే: గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... గురువారం కొత్రమంగళం సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డ్రోన్ సాయంతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12 వేలు నగదు, 10 చరవాణీలు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు గ్రామీణ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు. ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం గుర్తింపు.. వరదయ్యపాళెం: మండలంలోని రామిరెడ్డిపాళెంలో ఇటీవల అదృశ్యమైన వృద్ధురాలు అటవీప్రాంతంలో శవమై కనిపించింది. కాంబాక్కం పంచాయతీ రామిరెడ్డిపాళెంనకు చెందిన వెంకటసుబ్బమ్మ(60) గత నెల డిసెంబరు 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి, కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గురువారం ఉబ్బల మడుగు మార్గంలో ఇందిరానగర్ సమీపంలోని కాంబాక్కం బీట్ అటవీ ప్రదేశంలో పశువుల కాపరులు వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహానికి అక్కడే పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వాహనం అదుపుతప్పి.. గాయాలు.. శ్రీకాళహస్తి: వాహనం అదుపు తప్పడంతో విజయమ్మ దివ్యాంగురాలు ప్రమాదానికి గురయ్యారు. గిరిప్రదక్షిణ చేసుకుని వస్తున్న సమయంలో శుక్రవారం వేడాం వద్ద రోడ్డు లోతట్టుగా ఉండటంతో ఆమె ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అదే సమయంలో ఆ మార్గం గుండా వెళ్తున్న డీఎస్పీ నరసింహమూర్తి హుటాహుటిన ఆమెను అత్యవసర వాహనం ఎక్కించి చికిత్సలు చేయించారు.

CHANGE OF NAME
I, PALAM SUBRAMANYAM (OLD NAME), S/o P. SUBBAIAH, R/o 22-34, THIMMISETTYPALLI VILLAGE, C M RACHAPALLI POST, RLY KODUR MANDAL, TIRUPATI DIST, A. P - 516101, INDIA. HAVE CHANGED MY NAME TO PALEM SUBRAMANYAM (NEW NAME). HENCEFORTH, I SHALL BE KNOWN AS PALEM SUBRAMANYAM (NEW NAME).

ప్రదక్షిణం.. పల్లవించిన సంబరం

● తీరం.. ఆహ్లాదం.. ● ఘనంగా ఎదురుసేవ మహోత్సవం

తీరంలో పతంగులు ఎగురవేస్తున్న యువత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కైలాసగిరి ప్రదక్షిణోత్సవం సదర్భంగా పల్లెసీమలన్నీ పులకించిపోయాయి. పెళ్లిపిలుపులతో వచ్చిన సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలతో పాటు ఊరందూరుకు శివాలయంలోని అన్నపూర్ణాదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్వాగతించేందుకు ఆయా గ్రామస్థులు తరలివరావడంతో కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో సందడి వాతావరణం నెలకొంది. కచ్చితమైన సమయపాలనతో ఉత్సవం ఆద్యంతం రమణీయంగా జరిగింది. భక్తులు రంగవల్లులు అలంకరించి ఆదిదంపతులకు స్వాగతం పలికారు.

భక్తి.. ఆకలి తీర్చి..

ఆలయం తరపున గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన కౌంటర్లల్లో బిస్కట్లు, నీళ్ల బాటిళ్లు, పండ్లు, పాయసం అందుబాటులో ఉంచారు. అంజూరు మండపం వద్ద శ్రీపాద కూలీలకు ప్రత్యేక భోజనాలు ఆలయం తరపున అందుబాటులోకి తీసుకువచ్చారు. వేయి లింగాలకోన వద్ద భక్తులందరికీ స్వయంభు ఆశ్రమం తరపున అంబలి స్వామి భోజనాలు ఏర్పాటు చేశారు.

అధికారుల సమన్వయం

గిరిప్రదక్షిణ మార్గంలో కొత్త రోడ్డు అందుబాటులోకి రావడంతో కష్టాలు తప్పాయి. అంజూరు మండపం వద్ద ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు, ట్రాఫిక్ స్తంభించిపోకుండా అధికారుల సమన్వయంతో ఉత్సవం నిర్ణీత సమయానికి శ్రీకాళహస్తికి చేరుకుంది.

శ్రీపాదకూలీలకు భోజనాలు వడ్డిస్తున్న ఈవో దంపతులు

ఘనంగా ఎదురుసేవ..: కైలాసగిరి ప్రదక్షిణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి సువర్ణముఖి తీరం వద్ద ఉన్న ఎదురుసేవ మండపానికి ఉత్సవమూర్తులు తరలివచ్చారు. ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మారింది.

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

పండగ వేళ.. రోడ్డన్నీ కిటకిట

సంక్రాంతి పండగ సందర్భంగా కొనుగోలుదారులతో సూళ్లూరుపేట బజారు వీధులు గురువారం రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు దుకాణాల వద్ద ప్రజలు అధిక సంఖ్యలో కొనుగోలు చేశారు. వీధుల్లో సందడి వాతావరణం నెలకొంది. ట్రాఫిక్ వల్ల ప్రజలు కొంతమేరకు ఇబ్బంది పడ్డారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

వైభవంగా సిద్దేశ్వరస్వామి గిరి ప్రదర్శన

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని శిరసనంబేడు గ్రామంలో శుక్రవారం రాత్రి సిద్దేశ్వరస్వామి గిరిప్రదర్శన మహోత్సవం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని ఆలయం వద్ద అలంకరించి ప్రత్యేక వాహనంపై సమీపంలో ఉన్న సిద్దలయ్య కొండవద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం 10 కి.మీ గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం, తెదేపా నాయకులు మురళీకృష్ణారెడ్డి, కృష్ణయ్య, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామి

'పురుషులకూ ముగ్గుల పోటీలు నిర్వహిస్తాం'

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. నాయుడుపేట గాంధీ పార్కు వద్ద గురువారం సాయంత్రం పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'వైకాపా ప్రభుత్వ పాలనలో విసిగిపోయి ప్రజలు కూటమిని అధికారంలోకి తెచ్చుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో పండగల్ని జరుపుకొంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్రాంతి సంబరాలను స్వగ్రామంలో చేసుకోవడం మనందరం ఆదర్శంగా తీసుకోవాలి. వచ్చే ఏడాది నియోజకవర్గంలో ఏదో ఒక చోట సంక్రాంతి సంబరాలను వైభవంగా చేస్తాం. పురుషులకు కూడా రంగవల్లుల పోటీలు జరుపుతాం' అని పేర్కొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

మన్నెమాలలో అలరించిన రంగవల్లులు

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని మన్నెమాల ఎస్సీ కాలనీలో సంక్రాంతి ముగ్గుల పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. విజేతలకు స్థానిక నాయకులు చింతంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, సన్నారెడ్డి జగదీష్‌రెడ్డి, బాలసుమన్ రెడ్డి బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

నిత్యం అంతరాయం.. సాగని ప్రయాణం

ట్రాఫిక్ సమస్యతో తిప్పలు

నాయుడుపేట పట్టణం: పట్టణంలోని రాజగోపాలపురం ప్రధానవీధి ఆక్రమణలకు గురై రాకపోకలకు సమస్యగా మారింది. రోడ్డుపై దుకాణాలకు సంబంధించిన మెట్లు కట్టి ఇరుక్కుగా మారుస్తున్నారు. వాహనాలు ముందుకు సాగడం లేదు. పురవీధులు గుంతలమయంగా మారడంతో వాహనాలు గుంతల్లో దిగబడుతూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

వాహనాలపై నుంచే కొనుగోళ్లు..

పురపాలక కార్యాలయం, పోలీసు స్టేషన్, బ్యాంకుల ఎదుట ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ■ నాలుగు రోడ్ల కూడలి నుంచి తూర్పు, పడమర, దక్షిణం, ఉత్తర దిక్కుల్లోని రహదారుల్లో వ్యాపార సంస్థల ఎదుట ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. పూల దుకాణాల వీధిలో వాహనాలపై నుంచే కొనుగోలు చేయడంతో సమస్యగా మారింది. ■ శ్రీకాళహస్తి రోడ్డు నుంచి అగ్రహారపేట మీదుగా విద్యాసంస్థలకు వెళ్లే రోడ్డు కుంచించుకుపోయింది. పాఠశాలల బస్సులు, వ్యాన్లు, ఆటోలు, ఇతర వాహనాలు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ నిలుస్తోంది. ■ బజారు వీధుల్లో నెలలో 15 రోజులు ఒకవైపు, మరో 15రోజులు ఇంకోవైపు ద్విచక్ర వాహనాలు పెట్టేలా చేశారు. ఆటోలు రాకపోకలకు వేర్వేరు మార్గాలను అమర్చారు. ఇక పగటి పూట భారీ వాహనాలు రాకూడదనే నిబంధనలు ఉన్నాయి. కానీ అమలుకావడం లేదు. ఆటోలు అన్నిచోట్లా నిలిపేస్తున్నారు.

నాయుడుపేట బజారువీధుల్లో ఆగిన ట్రాఫిక్

నామమాత్రపు విధులు

పోలీసు సిబ్బంది నాలుగు రోడ్లకూడలిలో క్రమం తప్పకుండా ఉంటున్నారు. మిగిలిన చోట్ల ఎక్కడా కానరావడంలేదు. రోడ్లపై పెట్టే వాహనాల యాజమానులపై చర్యలు తీసుకోవడం లేదు. కళాశాలలు, పాఠశాలలు, డిగ్రీ కళాశాలల వద్ద యువత ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతూ అమ్మాయిల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకోవడంలేదు. డీఎస్పీ చెంచుబాబును వివరణ కోరగా ట్రాఫిక్‌పై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ? పట్టణంలోని శ్రీలక్ష్మి థియేటర్ వెనుక వీధిలో విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. - మాధవయ్య, స్థానికుడు

? సోనియాగాంధీ నగర్ రోడ్డుపై చెత్త వేస్తున్నారు. దుర్వాసన వస్తుంది. కాలువలో మురుగు, చెత్త తొలగించకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. -వెంకటచలం, స్థానికుడు

? షార్ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే రహదారి పక్కన మురుగు ముందుకు కదలడం లేదు. - శేషాద్రి ● సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. - చిన్నయ్య, కమిషనర్

బాలాయపల్లి, న్యూస్‌టుడే: ? వెంగమాంబాపురం పంచాయతీ పర్వారిసేను వీధుల్లో కాలువలు లేక ఇళ్లలోకి మురుగు వస్తోంది. - తులశమ్మ, స్థానికురాలు

? జయంపు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగుతుంటాయి. ఈ ప్రాంతంలో కోళ్లమాంసం వ్యాపారులు వ్యర్థాలను పడేస్తున్నారు. – ఈశ్వర్, స్థానికుడు

సమాధానం: అధికారులతో చర్చిస్తాం. చెత్త వేయొద్దని వ్యాపారులకు సూచనలు చేస్తాం.
– రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో బాలాయపల్లి

ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లింపులను మరింత సులభతరం చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున శివయ్య గోపురం సమీపంలో రూ. 1.81 కోట్ల వ్యయంతో నూతనంగా సిద్ధం చేసిన 'ఆర్జితం సముదాయాన్ని' శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలి ఆన్‌లైన్ టికెట్‌ను ఆయన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేకుండా భక్తులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. భక్తులకు అవసరమైన విశ్రాంతి భవనం, సెల్‌ఫోన్ కౌంటర్లు, లగేజీ కేంద్రాలన్నీ ఇక్కడే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. సుమారు రూ.30 లక్షలతో ప్రచార రథాన్ని తీర్చిదిద్దారన్నారు. ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు గురప్పశెట్టి, గోపీనాథ్, రాఘవయ్య, ప్రత్యేక ఆహ్వానితులు శైలజ, వెంకటరామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి బాలాజీ రైల్వే డివిజన్ అంశం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్ చేయాలన్న ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ బృందం కోరారు. సంక్రాంతి పురస్కరించుకుని కుటుంబ సమేతంగా నారావారిపల్లెకి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని నేతృత్వంలో సమితి కన్వీనర్ గిరిధర్ కుమార్ బృందంతో కలిశారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

పాకాల, న్యూస్‌టుడే: పాకాలలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా శనివారం ఉదయం ఆవిష్కరించనున్నట్లు విగ్రహ ప్రతిష్ఠ బలిజ ఆహ్వాన కమిటీ తెలిపింది. కమతంపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ చేపడతామని చెప్పారు.

క్రికెట్ విజేత వాకాడు

వాకాడు, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలో జరిగిన వాకాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో వాకాడు రైజింగ్ లయిన్స్ జట్టు రాయల్ ఛాలెంజర్స్‌పై గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రన్నర్‌కు రూ.50 వేలు నగదు బహుమతులు అందించారు. గ్రామపెద్దలు, కోచ్‌లు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన రైజింగ్ లయన్స్ సభ్యులు

యువతకు ఉపాధి అవకాశాలు

పెనగలూరు(పుల్లంపేట): యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కేకే చౌదరి అన్నారు. శుక్రవారం పెనగలూరు మండలానికి విచ్చేసిన ఆయనను కూటమి నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. మండల సమస్యలను తెలియజేశారు. పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

మారుతున్న గ్రామాల రూపురేఖలు

సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలోని మారుమూల గ్రామాల్లో పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ద్వారకాపురం గ్రామ పంచాయతీలో సీఎస్ఆర్ నిధులతో కొత్త పనులు చేస్తున్నారు. చిన్న పంచాయతీ కావడంతో రాబడి తక్కువగా ఉండేది. గ్రామానికి వెళ్లడానికి సరైన దారి లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండేవి. తాగునీటి సమస్యలతో అవస్థలు ఎదుర్కొనేవారు. గ్రామానికి ఇరువైపులా భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడంతో సామాజిక బాధ్యత కింద స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు ద్వారకాపురం, మాబాక గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులు కేటాయించడంతో అభివృద్ధి పరంగా గ్రామ స్వరూపమే మారిపోయింది.

ద్వారకాపురంలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన రోడ్డు

గోదాములు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

ఇండస్ కాఫీ పరిశ్రమ యాజమాన్యం ద్వారకాపురం ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీరోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. గ్రామం మొదట్లో బస్సు షెల్టర్, మాబాకలో మినరల్ వాటర్‌ప్లాంటు వంటివి రూ.70 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. కొనేటిరాజుపాళెం, పాలచ్చూరు, మేనకూరు ఎన్‌జేఆర్ కాలనీల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. వద్దిగుంటకండ్రిగలో రూ.60 లక్షలతో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గోదాము నిర్మించారు. రెండేళ్ల క్రితం గ్రీన్‌టెక్ పరిశ్రమ యాజమాన్యం ద్వారకాపురంలో అంతర్గత సీసీరోడ్డు నిర్మించింది. ఐదేళ్ల తరువాత మళ్లీ గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి జరుగుతోంది.

మేనకూరు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వేదికపై ప్రముఖులు

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరంలో శుక్రవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సందర్శకులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పూర్వీకుల నాటి సంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ పండగలతో ప్రజల్లో ఐక్యత, సంతోషం, సేవాభావం అలవడతాయన్నారు. ముందుగా సంక్రాంతి సంబరాల బెలూన్‌ను ఎమ్మెల్యే గాల్లోకి వదిలారు. చిన్నారులు, యువత ఉత్సాహంగా గాలి పటాలు ఎగురవేశారు. మహిళలు గౌరీదేవి ప్రతిమలను నిమజ్జనం చేశారు. కళాకారులు, చిన్నారులు, ఆర్కెస్ట్రా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, పుర వైస్‌ఛైర్మన్ రఫీ, తెదేపా నాయకులు చంద్రారెడ్డి, సుబ్బారావు, రాజేష్, కృష్ణారావు, గంగాప్రసాద్, కన్నెమ్మ, సుధీర్‌లు పాల్గొన్నారు.

భక్తిగీతానికి నృత్యం చేస్తున్న ఆంజనేయస్వామి

దుర్వాసన భరించాల్సిందేనా!

సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రహదారి పక్కన చెత్త వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో వ్యర్థాలు ఉండటంతో మురుగు ముందుకు కదలడం లేదు. ఇక్కడ ఉన్న చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

రోడ్డు వేశారు.. కాలువ మరిచారు

నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలో సిమెంటు రోడ్లు వేసిన చోట మురుగు కాల్వలు కట్టలేదు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బాలాజీ గ్రీన్‌సిటీలో ఓ వీధిలో సిమెంటు రోడ్డు నిర్మించి కాలువ ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు ఖాళీ స్థలాల్లోకి వెళ్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

గుంతలు.... ప్రయాణికులకు చిక్కులు

ఆటకానితిప్ప నుంచి కొరిడి, పేర్నాడు గ్రామాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు గుంతలు పెద్దవి కావడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

బిందె నిలువదు.. నీటితో నిండదు

ఈ చిత్రం బాలాయపల్లి మండలం మన్నూరు కొత్తూరు కాలనీలోనిది. ఇటీవల బోరు దిమ్మెపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో సిమెంటు నిర్మాణం విరిగిపోయింది. అప్పటి నుంచి నీళ్ల కోసం వచ్చే వారు దానిపై బిందెలు పెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయానికి సమీపంలో ఉన్న సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, బాలాయపల్లి

భోజనం తయారీ కేంద్రంలో మంటలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట లక్ష్మణనగర్ ఎదురుగా ఓ భోజన తయారీ కేంద్రంలో శుక్రవారం మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని ఆర్పేశారు. కేంద్రంలో దేవుడి పటాల వద్ద దీపం వెలిగించి సిబ్బంది ఆలయానికి వెళ్లారు. దీపం చుట్టుపక్కల వేలాడదీసిన కాగితాలు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదు.

యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

సూళ్లూరుపేట గ్రామీణం ,న్యూస్‌టుడే: మండలంలోని ఇల్లుపూరు గ్రామంలో శుక్రవారం ఎస్‌వీఎస్ ఫౌండేషన్ ఛైర్మన్ యన్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వాలీబాల్, పుట్‌బాల్, బాస్కెట్‌బాల్ కిట్లను పంపిణీ చేశారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

విద్యార్థులకు కిట్లు ఇస్తున్న విజయలక్ష్మి

కోడి పందెం ఆడారు.. పోలీసులకు చిక్కారు

ఓజిలి, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం సాయంత్రం నెమలపుడి ఎస్సీ కాలనీ సమీపంలో మామిడికాలువ వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి అయిదు కోడి పుంజులు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలియజేశారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని కొండూరు పంచాయతీ బూడిదలవాగు ఎస్సీ కాలనీకి చెందిన కుంబాల గున్నయ్య (70) ఆత్మహత్యకు యత్నించారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. ఆయన భార్య ఏడాది క్రితం మరణించారు. మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం గున్నయ్య పురుగు మందు తాగారు. స్థానికులు వాకాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టి మెరుగైన చికిత్స నిమిత్తం గూడూరు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగుందని హెడ్‌కానిస్టేబుల్ బాబ్జీ తెలిపారు.

ఆటో బోల్తా నలుగురికి గాయాలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మూరు సమీప జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఆటోబోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక చంద్రబాబునగర్‌కు చెందిన ఇద్దరు పురుషులు, మహిళలు కలిసి ఆటోలో ఇసుక ట్రాక్టర్లకు నింపేందుకు బయల్దేరు. మార్గమధ్యలో వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది.

పండగ వేళ.. ఆలయాలు కిటకిట

పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడులో వీర్లయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం
● కాశీతోటలో కోలాటం చేస్తున్న మహిళలు ● కుమ్మరిగుంటలో సాయినాథుని తెప్పోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని సాలెవీధిలో శ్రీరామ భక్త అన్నదాన సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. కుమ్మరిగుంటలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి చందనంతో ప్రత్యేకాలంకరణ చేశారు. ★ కట్టెల వీధిలోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. కుమ్మరిగుంట చెరువులో ప్రత్యేక పూలతో చేసిన తెప్పపై సాయిబాబా ఉత్సవమూర్తిని ఊరేగించారు. ★ నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ వెంకటరమణ, ఎస్సైలు ఏడుకొండలు, గోపి బందోబస్తు చర్యలు చేపట్టారు. పట్టణంలోని కాశీతోటలోని చెంచమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ★ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం గౌరమ్మ ప్రతిమలను ఏర్పాటు చేసి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని బంగారు ఆభరణాలతో ముస్తాబు చేశారు. ★ **సూళ్లూరుపేట పట్టణం:** పట్టణంలోని మన్నారు పోలూరులోని సత్య జాంబవతి సమేత అళఘ మల్లారి కృష్ణస్వామి ఆలయంలో కనుమ పండగ సందర్భంగా తితిదే ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. **పెళ్లకూరు:** మండలంలో రోసనూరులో భూపతేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. **నాయుడుపేట:** తిమ్మాజీకండ్రిగ సమీపంలో స్వర్ణముఖి తీరంలో వెలిసిన దుర్గామల్లేశ్వరి ఆలయంలో కనుమ మహోత్సవం నిర్వహించారు. **నాయుడుపేట పట్టణం:** పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడులో వీర్లయ్యస్వామి మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలు పొంగళ్లు వడ్డించారు. **బాలాయపల్లి:** నిడిగల్లులో చెన్న కేశవస్వామిని గ్రామోత్సవం చేశారు. పిగిలాం గ్రామంలో శుక్రవారం వేడుకగా గొబ్బెమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి ప్రతిమను తయారు చేసి పూజలు చేశారు.

చెన్నై జట్టు సత్తా

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని నందమూరి తారక రామారావు క్రీడా మైదానంలో శుక్రవారం అంతర రాష్ట్రాల అండర్-14 క్రికెట్ పోటీలు నిర్వహించారు. తొలుత టాస్ గెలిచిన తిరుపతి జట్టు బ్యాటింగ్ చేసి 41.1 ఓవర్లకు 10 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేశారు. జట్టులో గయానా కృష్ణ ప్రసాద్ 86 పరుగులు, సాయితేజ 48 పరుగులు సాధించారు. తరువాత బరిలో దిగిన చెన్నై జట్టు బ్యాటింగ్ చేపట్టి 34.2 ఓవర్లకు ఒక్క వికెట్ కోల్పోయి 212 పరుగులు చేసింది. జట్టులో ప్రతీష్ 101 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నితీష్‌కుమార్ 31, ప్రేమ్ 58 పరుగులు సాధించారు. 9 వికెట్ల తేడాతో చెన్నై జట్టు విజయం సాధించింది.

ఎన్‌బీకేఆర్ జయంతి వేడుకలు

బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఆయన తనయుడు హిమకుమార్‌రెడ్డి తదితరులు

వాకాడు, న్యూస్‌టుడే: ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జయంతిని గురువారం వాకాడులోని బాలకృష్ణా సేవా క్షేత్రం ఆవరణలో నిర్వహించారు. ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఆయన తనయుడు నేదురుమల్లి హిమాకుమార్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి పదవి.. అభివృద్ధికి అడ్డు

నాయకుల కనుసైగల్లో అధికారులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: డివిజన్‌లోని పలుశాఖల్లో కీలక అధికారుల పోస్టుల్లో ఎక్కువగా ఇన్‌ఛార్జి అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏడాదిగా రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొందరు బదిలీపై వచ్చిమరీ పనులకు మోకాలు అడ్డుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పర్యవేక్షణ కొరవడి.. పనులు సాగక

గూడూరు జలవనరులశాఖ డివిజన్‌లో రెగ్యులర్ ఈఈ లేరు. వెంకటగిరి డీఈ ఇన్‌ఛార్జి ఈఈగా వ్యవహరిస్తున్నారు. ఏడాది నుంచి వీరే బాధ్యతలు నిర్వహించడంతో జలవనరుల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా ఉంది. తుపాన్ అత్యవసర నిధులతో చేపట్టిన చెరువు మరమ్మతులు సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గంలో నాణ్యత లేకుండా జరిగినా క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకుండా బిల్లులు చెల్లిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరో వైపు స్వర్ణముఖిలో కలవకూరు, గూడలి ప్రాంతాల్లో డిసిల్టింగ్ పేరుతో ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారు. ఇక్కడ జరుగుతున్న తవ్వకాలపై అధికారుల కనుసైగల్లో నడుస్తుంది. అక్రమ ఇసుక తవ్వకందారులు పోర్లుకట్ల ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నా విమర్శలు వినిపిస్తున్నాయి.

పంచాయతీరాజ్ శాఖలో ఇదే తంతు

గూడూరు కేంద్రంగా ఉన్న పంచాయతీరాజ్ డివిజన్‌లో కూడా రెగ్యులర్ ఈఈ లేకపోగా.. కోట పీఆర్ ప్రాజెక్టు డీఈ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, చిట్టమూరు, వాకాడు వెంకటగిరి మండలాల్లో జరిగే సీసీరోడ్లు, భవనాల నిర్మాణం పట్ల పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఈఈ, డీఈ పోస్టులకు ఒక్కరే కావడంతో రెండింటికీ న్యాయం చేయలేకున్నారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు అభివృద్ధి లేకుండా ఉంది. నాయుడుపేట పీర్ సబ్‌డివిజన్‌కు కూడా రెగ్యులర్ ఈఈ లేకపోవడం ఏఈగా ఉన్న అధికారి ఇన్‌ఛార్జి డీఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆరు మండలాల్లో పీఆర్ రెగ్యులర్ ఏఈలు లేకుండా ఇంజినీరింగ్ సహాయకులే ఏఈలుగా వ్యవహరించడంతో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

ఇంజినీరింగ్ విభాగంలోనూ..

పురపాలిక సంఘంలో డీఈ, ఏఈ, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు లేకుండా ఇన్‌ఛార్జి అధికారుల ద్వారా పనులు చేస్తున్నారు. దీంతో రహదారుల నిర్మాణానికి సంబంధించిన అంచనాలు, తయారీ సాంకేతిక అనుమతులు, ఎంబుక్‌లు రికార్డులంతా నాయకులకు అనుకూలంగా బిల్లులు చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు.

ర.భ శాఖలో ఒక్కరే...

నాయుడుపేట ర.భ శాఖ సబ్‌డివిజన్‌లో గతంలో అయిదుగురు ఏఈలు ఉండేవారు. ప్రస్తుతం నాయుడుపేట కేంద్రంగా ఉన్న ఏఈ ఆరు మండలాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రహదారుల పర్యవేక్షణ, నిర్వహణ, రోడ్ల నిర్మాణంపై పర్యవేక్షణ కొరవడింది.

శాంతి ఆశ్రమం పీఠాధిపతి శివైక్యం

నారాయణవనం: ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రమైన కైలాసకోనలోని శాంతి ఆశ్రమ పీఠాధిపతి కైలాస నందగిరిస్వామి శుక్రవారం మధ్యాహ్నం శివైక్యం పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆశ్రమంలో సమాధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

(c) eenadu

జాతరలా జనం.. తీరం మనోహరం

సంక్రాంతి పర్వదినం వేళ విశాఖ తీరం జనజాతరను తలపించింది. నగరవాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులతో గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌రోడ్డు కిటకిటలాడింది. నోవోటెల్ హోటల్ నుంచి కైలాసగిరి వరకు సుమారు 6కి.మీ మేర ఎటుచూసినా సందర్శకుల కోలాహలం నెలకొంది. సముద్ర తీరంలో వేలాది మంది ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సేద తీరారు.
– ఈనాడు, విశాఖపట్నం

ట్రాఫిక్ పద్మవ్యూహం ఛేదించేది ఎలా..?

భోగాపురంలో విమానం ఎగిరేలోగా రోడ్లు విస్తరించాలి

12చోట్ల పైవంతెనలు అవసరమని ప్రతిపాదనలు

ఈనాడు, విశాఖపట్నం

విశాఖ నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. సిగ్నల్స్ దాటుకుని 49కి.మీ దూరం ప్రయాణించి విమానం అందుకోవాలంటే రెండు గంటల సమయం పడుతుందనే అభిప్రాయం వ్యక్తం కావడంతో కొన్ని కీలక ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి.

మద్దిలపాలెం వద్ద ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

★ **నత్తనడకన రోడ్ల పనులు:** ఎన్ఏడీ కూడలి నుంచి భోగాపురం వెళ్లడానికి సుమారు 22 ట్రాఫిక్ సిగ్నల్స్ దాటుకోవాలి. అదే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయితే 13 సిగ్నల్స్ ఉంటాయి. ఒక్కో సిగ్నల్ దాటాలంటే సుమారు 2-3 నిమిషాలు పడుతోంది. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో 5నిమిషాలు కూడా పడుతోంది. దీంతో భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరాలంటే రెండు గంటలపైగా సమయం పడుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం తొలుత ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అవి నత్తనడకన సాగుతున్నాయి. కారు షెడ్డు కూడలి నుంచి లంకెలపాలెం వరకు 12 పైవంతెనల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేశారు. తర్వాత మెట్రో రైలుతో వాటిని ముడిపెట్టడంతో పైవంతెనలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి.

★ **మరిన్ని వందేభారత్‌లు అవసరం:** విశాఖ విమానాశ్రయం మూసివేస్తే ప్రయాణికులకు ఆర్థిక భారంతో పాటు, సమయం వృథా అవుతుంది. అందుకే విశాఖ నుంచి విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతికి మరిన్ని వందే భారత్ రైళ్లను మంజూరు చేయాలని విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తాజాగా లేఖ రాశారు.

గోవా తరహాలో..రెండు ఎయిర్ పోర్టులు : భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభమైతే ప్రస్తుత విశాఖ విమానాశ్రయాన్ని పూర్తిగా నేవీ పరిధిలోకి తెచ్చి మూసివేయనున్నారు. గోవా ఎకానమీ 15 బిలియన్ డాలర్లు కాగా, ఏపీలో ఒక్క విశాఖ ఎకానమీ చూస్తే 48 బిలియన్ డాలర్లు ఉంది. అంటే గోవా కంటే మూడు రెట్లు ఎక్కువ. అయినా గోవాలో రెండు ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు భోగాపురం, విశాఖలోని పార్మా కంపెనీలు, వీఎస్ఈజెడ్ ఉన్న అనకాపల్లి, గాజువాక నుంచి వచ్చేవారికి విశాఖ విమానాశ్రయం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

నగర జనాభా (సుమారు)	నిత్యం తిరిగే కార్లు	ఆటోలు	ద్విచక్ర వాహనాలు	పాఠశాలలు, కళాశాలల బస్సులు	ఆర్టీసీ, సిటీ బస్సులు
23 లక్షలు	4.7 లక్షలు	50 వేల పైమాటే!	11 లక్షలు పైగా	1445	832

తారల క్రికెట్..అదరహో..!

నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) అభిమానుల్లో సంక్రాంతి జోష్ నింపింది. చాలా కాలం తర్వాత విశాఖలో సినీ నటుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. తారలు సైతం మైదానంలో కలియ తిరుగుతూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. తొలిరోజు రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో పంజాబ్ దే షేర్ జట్టు, కర్ణాటక బుల్డోజర్స్, రెండో మ్యాచ్‌లో భోజ్‌పురి దబాంగ్, తెలుగు వారియర్స్ జట్లు తలపడ్డాయి. కర్ణాటక జట్టు విజయం సాధించగా, తెలుగు వారియర్స్ ఓడిపోవడం అభిమానులను నిరాశపర్చింది. జట్టులోని అక్కినేని అఖిల్, తమన్, ప్రిన్స్ తదితర నటులు తమ ఆట తీరుతో అలరించారు. తారలు పాయల్ రాజ్‌పుత్, తేజస్వి తదితరులు మైదానంలో సందడి చేశారు.
– పీఎంపాలెం, న్యూస్‌టుడే

మైదానంలో తేజస్వి..

వికెట్ తీసిన ఆనందంలో తెలుగు వారియర్స్ క్రీడాకారులు

బ్యాటింగ్ చేస్తున్న అఖిల్

పాయల్ రాజ్‌పుత్..

బౌలింగ్ చేస్తున్న అశ్విన్‌బాబు, విజయానందంలో కర్ణాటక బుల్డోజర్స్ జట్టు క్రీడాకారులు

మకర సంహారం.. గజేంద్ర సంరక్షణం

రావే ఈశ్వర.. కావవే వరద.. సంరక్షింపు భద్రాత్మకా.. అంటూ గజేంద్రుడు శ్రీమహావిష్ణువును ఆర్తితో వేడుకోగా.. శ్రీమన్నారాయణుడు పరుగున వచ్చి మకర సంహారం చేసిన ఘట్టాన్ని అర్చకులు వినోదాత్మకంగా ఆవిష్కరించారు. కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సింహగిరిపై సింహాద్రినాథుడి గజేంద్ర మోక్షం ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

వరదరాజస్వామి అలంకరణలో అప్పన్నస్వామి

అత్యవసర వైద్య సైన్యం సిద్ధం!

ఏఎంసీ స్కిల్ ల్యాబ్ ఆధ్వర్యంలో శిక్షణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్యకళాశాల (ఏఎంసీ)లో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రం (స్కిల్ ల్యాబ్) అత్యవసర వైద్య విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ విపత్తుల విభాగం సహాయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని పరికరాలను కేంద్రం సమకూర్చింది. ఏఎంసీ ఎనస్తీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ కేంద్రం సేవలందిస్తోంది. ఇక్కడ వైద్య కోర్సులు అభ్యసిస్తున్న 1200 మంది యూజీలు, మరో 600 మంది పీజీలకు కార్డియో పల్మనరీ రిసెస్టేషన్ (సీపీఆర్), బేసిక్ కార్డియాలజీ లైఫ్ సపోర్టు (బీసీఎల్ఎస్)లపై శిక్షణ ఇస్తున్నారు. ఏడాది కాలం నుంచి ఈ శిక్షణను ముమ్మరం చేశారు. 'వెంటిలేటర్ మేనేజ్‌మెంట్, ఎయిర్ వే, బీసీఎల్ఎస్, సీపీఆర్, ఏసీఎల్ఎస్ (అడ్వాన్స్‌డ్ కార్డియో లైఫ్ సపోర్టు) అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. ఎనస్తీషియా విభాగానికి చెందిన అధ్యాపకవర్గం ఈ ప్రక్రియలో భాగమవుతోంది. సమాజంలో వివిధ వర్గాలకు చెందిన 400 మందికి అవగాహన కల్పించాం. మరో వెయ్యి మంది విద్యార్థులకు, నర్సులు, పారామెడికల్ స్టాఫ్‌కు తర్ఫీదు ఇచ్చాం. వీరంతా అత్యవసర సమయాల్లో బాధితులకు సీపీఆర్, బీసీఎల్ఎస్, ఏసీఎల్ఎస్ విధానాల్లో సత్వర వైద్యం అందించి సమీప ఆసుపత్రులకు తరలిస్తారు' అని కేజీహెచ్ ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ కె.అపర్ణజీ చెప్పారు.

మెడికోలకు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యులు

అదిరేటి ఆతిథ్యం... అల్లుడి ఆశ్చర్యం!

అత్తింటికి వచ్చిన ఆ కొత్త అల్లుడికి దక్కిన ప్రేమ, గౌరవంతో కూడిన 'విందు' ఆశ్చర్యం, ఆనందానికి గురిచేసింది. కొత్త అల్లుడి వయసు ఇరవై తొమ్మిదేళ్లు... ఆ సంఖ్యను పోల్చుతూ ఏకంగా 290 రకాల మిఠాయిలు, రకరకాల భోజనం, కూరలు తదితరాలను వడ్డించారు. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన నాళం రమేష్, కళావతి సాయిలక్ష్మి మూడు దశాబ్దాల క్రితం నర్సీపట్నం వలసొచ్చారు. గత ఏడాది జులైలో తమ కుమార్తె నవ్యను నర్సీపట్నానికి చెందిన శ్రీహర్షకు ఇచ్చి వివాహం చేశారు. తొలి సంక్రాంతి సందర్భంగా అల్లుడికి 140 రకాల మిఠాయిలు, ఇతర తిను బండారాలు, 40 రకాల కూరలు, పది రకాల బిర్యానీలు వడ్డించారు. – నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రజాధనమేగా.. పోతేపోనీ..

✦ **ఏళ్లుగా అసంపూర్తిగా ఎస్టీపీ, ఈతకొలను**
✦ **జీవీఎంసీ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు**

కార్పొరేషన్, పెందుర్తి న్యూస్‌టుడే

మహా విశాఖ నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. చేపట్టిన అభివృద్ధి పనులు సంవత్సరాలైనా వినియోగంలోకి రావడం లేదు. ఒప్పందం ఉల్లంఘించి గుత్తేదారులు మధ్యలో పనులు నిలిపివేసినా అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా చేసిన పనులకుగాను కొందరికి బిల్లులు చెల్లిస్తుండటం గమనార్హం.

■ **ఏడేళ్లుగా పూర్తికాని ఎస్టీపీ:** అప్పుఘర్ వద్దనున్న ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం) పునరుద్ధరణ పనులకు 2018లో రూ.50 కోట్లతో జీవీఎంసీ టెండర్లు ఆహ్వానించింది. గుత్తేదారు రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికీ ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశానని గుత్తేదారు చెబుతుండగా, ఒప్పందం ప్రకారం పని పూర్తయిన తరువాతనే బిల్లులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఎస్టీపీ అందుబాటులోకి రాక.. ఇప్పటికీ మురుగు నేరుగా సముద్రంలో కలుస్తోంది.

■ **రూ.50లక్షలు వెచ్చించి వదిలేశారు:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో నగరంలో రూ.720 కోట్ల అభివృద్ధి పనులకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా ఎనిమిది జోన్లలో 8 ఈత కొలనులు నిర్మించాలని ప్రతిపాదించారు. భీమిలి, మధురవాడ టీచర్స్ లేఅవుట్‌లో స్థానికులు వ్యతిరేకించడంతో టెండర్లు పిలవలేదు. 95వ వార్డు చినముషిడివాడ వుడా కాలనీలోరూ.50లక్షలతో ఈతకొలను నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. రూ.40లక్షల పనులు పూర్తయినట్లు చూపిన ఇంజినీరింగ్ అధికారులు గుత్తేదారుకు బిల్లులు జారీ చేశారు. తర్వాత గుత్తేదారు మిగతా పనులు చేయకుండా వెళ్లిపోయాడు. కొందరు అధికారులు గుత్తేదారుతో లాలూచీపడి నిధులు విడుదల చేయించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా రూ.40లక్షల ప్రజాధనం వెచ్చించినా ఇప్పటికీ ఈతకొలను అందుబాటులోకి రాలేదు. కమిషనర్ స్పందించి మధ్యలో విడిచిపెట్టిన నిర్మాణాలపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చినముషిడివాడ వుడాకాలనీలో అసంపూర్తిగా ఉన్న ఈతకొలను

మరో ఆయుధాగారం ఏర్పాటు

సింధియా, న్యూస్‌టుడే: జిల్లాలోనే మరో ఆయుధాగారం నిర్మాణానికి భీమునిపట్నంలో శిలాఫలకం ఆవిష్కరించినట్లు నేవీ యంత్రాంగం ఇటీవల తన ఎక్స్‌లో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ హాజరైనట్టు తెలిపింది. ఇప్పటికే ఈఎన్‌సీకి చెందిన నేవల్ ఎయిర్‌స్టేషన్‌కు సమీపాన 'నేవల్ ఆర్మమెంట్ డిపో' ఉన్న సంగతి తెలిసిందే. ఆత్మనిర్భర్ భారత్ పేరిట దేశీయంగా నౌకాదళం తన సామర్థ్యాన్ని మరింతగా బలోపేతం చేసే క్రమంలో ఆయుధాగారాన్ని భీమునిపట్నంలో ఏర్పాటు చేస్తుండటం మంచి పరిణామంగా భావించవచ్చు.

నైపుణ్యం పెంచి.. ఉపాధి చూపించి..!

యువతకు సెమ్స్‌లో ప్రత్యేక శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే

సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు ప్రస్తుతం సరైన ఉద్యోగాలు లభించని పరిస్థితి. కళాశాలల్లో సరైన ప్రయోగ వసతులు లేకపోవడం దీనికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరాలు, పట్టణాల్లోని విద్యార్థులకు కొంతవరకు నైపుణ్య శిక్షణ అందుబాటులో ఉంటున్నా.. గ్రామీణ అభ్యర్థులు ఆ శిక్షణ లేక వెనుకబడుతున్నారు. అలాంటి వారికి సింధియా సమీపంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో శిక్షణ ఇచ్చి ఉపాధి బాట పట్టిస్తున్నారు.

సెమ్స్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

✦ **దేశంలోనే రెండో కేంద్రం:** యువతలో ఉద్యోగ నైపుణ్యాలు పెంచడానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ-జీకేవై) పథకాన్ని జాతీయ స్థాయిలో అమలులోకి తెచ్చింది. అందులో భాగంగా తొలి నైపుణ్య శిక్షణ కేంద్రం ముంబయిలో ఏర్పాటు చేయగా.. రెండోది సింధియా సమీపంలో ఉన్న పూర్వపు ఐఎంయూ భవనంలో ఏర్పాటు చేశారు.

✦ ఇటీవల కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్సార్) నిధులను ఈ కేంద్రానికి ఇచ్చి పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దోహదపడుతున్నాయి. 'పరిశ్రమల్లో యంత్రాల పనితీరు, భద్రత, విధి నిర్వహణలో అనుసరించాల్సిన సాంకేతిక విధానాలను నేర్పిస్తున్నాం. వెనుకబడిన ప్రాంతాల అభ్యర్థులకు కనీస అర్హత 8వ తరగతిగా నిర్ణయించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నాం' అని సెమ్స్ సీవోవో కమాండర్ గోపీకృష్ణ తెలిపారు.

✦ **శిక్షణ ఉపయోగపడింది:** ప్రొడక్షన్ డిజైనింగ్ ఇంజినీరింగ్ కోర్సు చేశా. వైజాగ్ జనరల్ కార్గో సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించింది. సెమ్స్‌లో ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. నాకు ఎంతగానో ఉపయోగపడింది. డిజైన్ టెక్ సంస్థలో ఉపాధి లభించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. – శశాంక్, గాజువాక

శిక్షణ తీసుకున్న అభ్యర్థులు: 20వేలు

ఉపాధి పొందినవారు:. 80%

ఉపాధి కల్పించిన సంస్థలు : ఫ్లిప్‌కార్ట్, యూనో మిండా, టాటా ఎలక్ట్రానిక్స్, కొచ్చిన్ షిప్‌యార్డు, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్, డిజైన్ టెక్, పెన్నార్ ఇండస్ట్రీస్.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

నేడు, రేపు గవర అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

✦ తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' గవర అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెంలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. ✦ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు(శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
✦ మరిన్ని వివరాలకు 9154918858, 8008621414 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు. – న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

కోస్టుగార్డు డీజీగా పరమేశ్ శివమణి

సింధియా, న్యూస్‌టుడే : భారతీయ తీరగస్తీదళం డైరెక్టర్ జనరల్‌గా పరమేశ్ శివమణి నియమితులయ్యారు. శివమణి ఈనెల 15న బాధ్యతలు చేపట్టారు. పరమ తటరక్షక్ పతకం సాధించిన ఈయన ఇండియన్ కోస్టుగార్డుకి 26వ డైరెక్టర్ జనరల్‌గా నియమితులైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

శ్రద్ధాంజలి

జననం: 20-07-1956 మరణం: 05-01-2026

మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని పదిలపరుచుకుని, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మీరు స్వర్గస్తులైనారని, తెలియజేయుటకు చింతిస్తున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో...

కీ॥శే॥ వెలగల రామ చంద్రా రెడ్డి గారు
గంగిరెడ్డి షిప్పింగ్, విశాఖపట్నం

భార్య : వెలగల శారదాదేవి

కుమారుడు - కోడలు: వెలగల రామ సుధీర్ రెడ్డి- సుమలత
కుమార్తె - అల్లుడు: మిత్తాన కుసుమ శ్రీలత - సత్య ప్రసాద్ రెడ్డి
మనుమరాలు : సిద్ధిక్షరెడ్డి మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది: 17-01-2026 స్థిరవారం(శనివారం) మురళీనగర్‌లోగల మా స్వగృహం నందు జరుగును.

షాపింగ్ మాల్‌లో చోరీ చేసి.. శ్మశానవాటికలో దాచేసి..

గాజువాక, న్యూస్‌టుడే : సంక్రాంతికి కొత్త వస్త్రాలు కొనడానికి గాజువాకలోని ఓ మాల్‌కు వెళ్లిన దంపతులకు చెందిన బంగారం, నగదు చోరీకి గురికాగా.. పోలీసులు 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్నారు. దీనికి సంబంధించిన శుక్రవారం గాజువాక సౌత్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిమాచల్‌నగర్‌కు చెందిన కొండేటి రమణ, పైడిరాజు దంపతులు బుధవారం రాత్రి కొత్తగాజువాకలోని ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లారు. తమ వెంట తెచ్చిన 11 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదుతో కూడిన బ్యాగును అక్కడ సెక్యూరిటీ గార్డుకు ఇచ్చి టోకెన్ తీసుకున్నారు. పనిముగించుకుని బిల్లింగ్ చేయించాక చూస్తే తమ బ్యాగు కనిపించలేదు. దుకాణంలో వాకబు చేసినా లాభం లేకపోవడంతో వీరు గాజువాక క్రైం పోలీసులను ఆశ్రయించారు. క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే ఒకవ్యక్తి బ్యాగ్ తీసి బైక్‌పై శ్రీహరిపురం వైపు వెళ్లడం కనిపించింది. బైక్ నెంబర్ ఆధారంగా విచారణ జరిపితే శ్రీహరిపురం ఇందిరాకాలనీకి చెందిన ముద్దాడ వాసు (30) చోరీ చేసినట్లు తేలింది. నిందితుడి ఇంటికివెళ్లి విచారిస్తే.. తాను నేరం చేయలేదని మొదట బుకాయించినా పోలీసులు తమదైన స్థాయిలో విచారణ చేపట్టగా సమీప శ్మశానవాటికలో బ్యాగు దాచానంటూ చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వాసును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గాజువాక క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు వాసు

పతంగమా.. అలఅలా సాగిపో...!

సంక్రాంతి పర్వదినం సందర్భంగా గురువారం సాయంత్రం ఆర్కేబీచ్‌లో గాలిపటాల(పతంగుల) సందడి నెలకొంది. పోటాపోటీగా గాల్లోకి వదలడంతో తీరాకాశంలో విహంగాలు గుంపులుగుంపులుగా ఎగురుతున్నట్లుగా అనిపించింది. విమానం, గెద్ద, తదితర ఆకృతుల్లో ఉన్న భారీ పతంగులు గగనంలో విన్యాసాలు చేస్తూ విహరించడం చూసి పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు.
– ఈనాడు, విశాఖపట్నం

ఉక్కులో మరో 800 మంది బయటకు?

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో మరో 800 మంది బయటకు వెళ్లే అవకాశం కన్పిస్తోంది. మొదటిసారి 1124 మంది, రెండో దఫా 467 మంది వీఆర్ఎస్‌తో బయటకు వెళ్లారు. మళ్లీ ఇపుడు మూడో దఫా వీఆర్ఎస్ ప్రకటించగా ఇప్పటి వరకూ సుమారు 400 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 20 వరకూ గడువు ఉంది. కాబట్టి 800 వరకు దరఖాస్తులు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటికే కర్మాగారంలో మానవ వనరుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉత్పత్తి, ఉత్పాదకతలు ఎలా సాధ్యమని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు లక్ష్యాలను చేరుకోవాలంటూ పరుగులు పెట్టిస్తూ మరో వైపు వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను బయటకు పంపే ప్రయత్నం చేయటం ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు విభాగాలు మూతపడ్డాయి. సుదీర్ఘ అనుభవం కలిగిన ఉద్యోగులు లేకపోతే ఉత్పత్తి, నిర్వహణ విభాగాలు నడిపించడం ప్రశ్నార్థకమే అనిపిస్తోంది.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

త్రైపాక్షిక విన్యాసాలకు వెళ్లిన ఐసీజీ నౌక అతుల్య

మాల్దీవుల్లో త్రైపాక్షిక సముద్ర విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: త్రైపాక్షిక సముద్ర విన్యాసాల్లో పాల్గొనేందుకు భారతీయ తీరగస్తీ దళానికి చెందిన ఐసీజీ డోర్నియర్, ఐసీజీ అతుల్య, ఐసీజీ వజ్ర నౌకలు మాల్దీవులు చేరినట్లు కోస్టుగార్డు వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఆ దేశ విన్యాసాల కోసం శ్రీలంక కోస్టు గార్డు నౌక ఎస్‌ఎల్‌ఎస్ సురిమిలం కూడా చేరినట్లు పేర్కొన్నాయి. ఈ విన్యాసాలు మాల్దీవుల జాతీయ రక్షణ దళాల సారథ్యం వహిస్తున్నట్లు వివరించాయి.

20 నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయసేకరణ

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20న తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందని ప్రజలు పాల్గొనాలని తెలిపారు. నేరుగా పాల్గొనలేని వారు జిల్లాలోని విద్యుత్తు ఆపరేషన్ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనవచ్చని వివరించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, ప్రజలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న కొత్త జేసీ బాధ్యతల స్వీకరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమితులైన విద్యాధరి ఈనెల 19న బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ రిలీవ్ అయి శుక్రవారం బయలుదేరి గుంటూరు వెళ్లారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో విద్యాధరి ఆదివారం లేదా సోమవారం జేసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆమె చిత్తూరు జిల్లా జేసీగా పని చేస్తున్నారు.

విద్యాధరి, సంయుక్త కలెక్టర్

ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో శుక్రవారం సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా సుమారు 52 రోజుల క్రితం షట్‌డౌన్ చేసి ఉత్పత్తిని నిలుపుదల చేశారు. అప్పటినుంచి అధికారులు, కార్మికులు శ్రమించి ఈ యూనిట్‌లోని అన్ని విభాగాలకు వార్షిక మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. ప్రస్తుతం 1, 2, 3, 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి యథావిధిగా జరుగుతోందని కార్మిక వర్గాలు తెలిపాయి.

హంస నావలో.. వరాహ పుష్కరిణిలో..

అప్పన్న స్వామి తెప్ప తిరునాళ్ల ఉత్సవం రేపు

పుష్కరిణి వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులు

సింహాచలం, న్యూస్‌టుడే

పుష్య బహుళ అమావాస్య సందర్భంగా సింహాద్రి అప్పన్న స్వామి తెప్ప తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరగనుంది. ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహాద్రినాథుడి కొండపై నుంచి అడివివరం గ్రామానికి తరలివస్తారు. గ్రామంలోని వరాహ పుష్కరిణి చెరువులో హంస నావపై విహారం చేస్తారు. ఆ మేరకు సింహాచలం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

■ **రోజు వ్యవధిలోనే స్వామి అనుగ్రహం..:** కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని గజేంద్ర మోక్షం ఉత్సవానికి శుక్రవారం సింహగిరిపై నుంచి కిందకు తరలివచ్చిన అప్పన్న స్వామి ఒక్కరోజు వ్యవధిలోనే ఆదివారం మరోసారి అడివివరం గ్రామానికి తరలివరావడంతో గ్రామస్థుల ఆనందం వ్యక్తమవుతోంది. విజయదశమి నాడు శమీ పూజోత్సవానికి స్వామివారు కొండ దిగువకు రావాల్సి ఉండగా తుపాను నేపథ్యంలో రద్దయింది. సింహగిరిపైనే ఉత్సవాన్ని జరిపించారు. ఆ లోటును మరపించేలా స్వామివారు వరుసగా రెండుసార్లు కొండపై నుంచి రావడంతో గ్రామంలో ఉత్సవ వాతావరణం నెలకొంది. మళ్లీ స్వామివారు ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా మార్చి 3న సింహగిరిపై నుంచి కొండ దిగువకు పెళ్లిచూపుల ఉత్సవానికి తరలివస్తారు.

■ **వేణుగోపాలుడిగా విహారం..:** తెప్ప తిరునాళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని అప్పన్న స్వామి వేణుగోపాలుడిగా భక్తులను అనుగ్రహిస్తారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కొండపై నుంచి పల్లకిలో మెట్లమార్గం గుండా అడివివరం గ్రామంలోని వరాహ పుష్కరిణి తటాకానికి చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి హంస రూపంలో అలంకరించి పూలనావపై దేవేరులతో కలిసి విహరిస్తారు. చెరువు మధ్యలోని ఉద్యానమండపంలో విశేష పూజలందుకుంటారు. తెప్పోత్సవం అనంతరం సర్వజన మనోరంజని వాహనంపై సింహాద్రినాథుడు గ్రామ తిరువీధిలో పాల్గొంటారు. తిరువీధి పూర్తయిన తర్వాత రాత్రివేళ మెట్లమార్గంలో తిరిగి సింహగిరికి చేరుకుంటారు. ఉత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తామని ఈవో సుజాత తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 6 తర్వాత దర్శనాలు యథావిధిగా లభిస్తాయని తెలియజేశారు.

■ **ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు..:** తెప్పోత్సవానికి దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈఈ సీహెచ్. రమణ, డీఈ సుంకరి తాతాజీ, వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ సురేశ్, ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు, గోపాలపట్నం ఎస్ఐ రామారావు పుష్కరిణి చెరువు వద్ద ఏర్పాట్లపై సమీక్షించారు. పోలీసుల ఆధ్వర్యంలో రద్దీ నియంత్రణ, చెరువు మార్గంలో ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. శనివారం సాయంత్రం నాటికి ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఈఈ రమణ తెలిపారు. మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో పది మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బారికేడ్లు, విద్యుత్తు దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, హంస నావ, పుష్కరిణి మండపం ముస్తాబు, తదితర కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు.

స్వామి వారు విహరించే నావను సిద్ధం చేస్తున్న సిబ్బంది

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

నచ్చిన వస్త్రాలు కొనలేదని ఉరేసుకుని బలవన్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పండగ పూట ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. తనకు నచ్చిన వస్త్రాలు కొనలేదని మనస్తాపానికి గురై ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాతవెంకోజీపాలేనికి చెందిన పల్లవి (14) అనే 8వ తరగతి విద్యార్థిని సంక్రాంతి సందర్భంగా తనకు చీర కొనాలని తల్లిని అడిగింది. ఆమె ఇప్పటి నుంచే చీర ఎందుకంటూ ఆఫ్ శారీ తీసుకోమని చెప్పడంతో వారి మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని ఓ అపార్టుమెంటులో కాపలాదారుగా పనిచేస్తున్న తాత వద్దకు వెళ్లింది. అక్కడి వాచ్‌మెన్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె ఎప్పటికీ రాకపోవడంతో తల్లి తన పెద్ద కూతురిని అక్కడికి పంపించింది. ఆమె ఎంతగా తలుపు కొట్టినా స్పందన లేదు. కిటికీ తెరిచి చూడగా.. విగత జీవిగా కనిపించింది. సీఐ ప్రసాద్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతురాలి తండ్రి టైలర్ కాగా.. తల్లి ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిది శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని తిరుపతిపాలెం గ్రామం. కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం విశాఖ నగరానికి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జూద శిబిరాలపై దాడి.. రూ.1.40 లక్షల స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పండగ నేపథ్యంలో వేర్వేరు ప్రాంతాల్లో జూదం ఆడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు. ఆ వివరాలిలా.. సంక్రాంతి రోజున భీమిలి, మూడో పట్టణ స్టేషన్ల పరిధిలో జూదం ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సీఐ భాస్కరరావు, సిబ్బంది దాడులు చేపట్టారు. భీమిలిలో 9 మందిని, చినవాల్తేరులో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితులను, నగదును సంబంధిత పోలీసు స్టేషన్‌లకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.

నగరం ఊరెళ్లింది..

ఆర్టీసీ కాంప్లెక్స్-మద్దిలపాలెం రహదారి ఇలా..

సంక్రాంతి పర్వదినానికి పెద్దఎత్తున ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో నగరం బోసిపోయింది. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదార్లు శుక్రవారం నిర్మానుష్యంగా కనిపించాయి. - ఈనాడు, విశాఖపట్నం

నిర్మానుష్యంగా తెలుగుతల్లి పైవంతెన

ట్రావెల్ బస్సుల్లో కొనసాగుతున్న తనిఖీలు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలతో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గత రెండు రోజుల్లో నిబంధనలు పాటించకుండా అధిక ధరలు వసూలు చేస్తున్న నాలుగు బస్సులపైన, పన్ను చెల్లించని, పర్మిట్ లేని ఇతర కారణాలతో 22 బస్సులపై కేసులు నమోదు చేసి వీరి నుంచి రూ.54 వేల అపరాధ రుసుం వసూలు చేసినట్లు డీటీవో ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలియజేశారు. ప్రయాణికుల నుంచి అత్యధికంగా డబ్బులు వసూలు, స్టేజ్ క్యారియర్‌తో నడపడం, ప్రయాణికుల జాబితా సక్రమంగా లేకపోవడం, ఇతర నిబంధనలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసర సహాయం కోసం రవాణా శాఖ హెల్ప్‌లైన్ నెంబర్ 9281607001లో సంప్రదించాలని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈనెల 18 వరకు తనిఖీలు కొనసాగుతాయన్నారు.

బస్సు రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

రేపు తిరుమలలో అవగాహన సదస్సు

తగరపువలస, న్యూస్‌టుడే: జాతీయస్థాయి ఇంజినీరింగ్, వైద్య విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. విశాఖ జిల్లా తగరపువలస జాతీయరహదారిలోని తాళ్లవలస గ్రామంలోని తమ క్యాంపస్ ఆవరణలో ఈనెల 18వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభం కానుందన్నారు. ఇందులో భాగంగా ఆసక్తి గల అభ్యర్థులు www.thirumalaedu.comలో ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా పేర్లను నమోదు చేసుకోలేని వారికి సదస్సు రోజున ఉదయం 9 నుంచి రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. అయిదు నుంచి పది తరగతుల విద్యార్థులకు జేఈఈ, ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ లాంటి సంస్థల్లో ప్రవేశాలు, కెరీర్‌పై అవగాహన కల్పించడంతో పాటు దేశంలోని అత్యున్నత ఇంజినీరింగ్ సంస్థలు, వైద్య సంస్థల్లో ఏ విధంగా సీటు పొందాలి అనే విషయాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వారు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9133332103, 9133332104 కార్యాలయం నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆత్మనిర్బర్ సంక్రాంతి వేడుకలు విజయవంతం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో చేపట్టిన ఆత్మనిర్బర్ సంక్రాంతి వేడుకలు విజయవంతం అయ్యాయని నిర్వాహకులు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, తదితరులు రావడంతో మరింత వన్నె చేకూరిందన్నారు. వారం రోజుల పాటు నగర ప్రజల చెంతకు పల్లె వాతావరణాన్ని తీసుకురావడంతో అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి ఆస్వాదించారన్నారు. సంబరాల సెట్టింగు శనివారం వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వైభవంగా అప్పన్నస్వామి గజేంద్రమోక్షం ఉత్సవం

తొలిపావంచా వద్ద స్వామికి స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

సింహాచలం, న్యూస్‌టుడే: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సింహాద్రినాథుడి గజేంద్రమోక్షం ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వరదరాజ స్వామిగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. సపరివార సమేతంగా సాయంత్రం 4 గంటలకు సింహగిరిపై నుంచి మెట్లమార్గంలో కొండ దిగువకు బయలుదేరారు. కొండ దిగి వచ్చిన స్వామికి తొలిపావంచా వద్ద ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, మాజీ ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు, సిబ్బంది సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేద పారాయణల నడుమ స్వామిని తిరువీధిగా పైడితల్లి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లి అనంతరం పూలతోటలోని ఉద్యాన మండపంలో కొలువుదీర్చారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు నిర్వహించారు. విశేష అర్చనలు, ధూపదీప సేవలు జరిపారు. వైదిక కార్యక్రమాల అనంతరం మకరి వేట ఉత్సవాన్ని నిర్వహించారు. మండపం ఎదురుగా ఉన్న కొలనులో గజరాజు, మొసలి విగ్రహాలను అమర్చారు. స్వామి సుదర్శన చక్రాన్ని ప్రయోగించినట్లుగా తారాజువ్వలు ప్రయోగించి అర్చకులు గజేంద్రమోక్షం కళ్లకు కట్టేలా జరిపించారు. అశేష భక్తజనం ఉత్సవంలో పాల్గొని స్వామిని సేవించారు. దేవస్థానం ఈవో ఎన్.సుజాత ఉత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గజేంద్ర మోక్షం సందర్భంగా సుదర్శన చక్రంతో మొసలిని సంహరించే ఘట్టాన్ని బాణసంచాతో ఆవిష్కరించిన దృశ్యం

★ **తారాజువ్వల జోస్యం..:** మకర వేటలో వెలిగించే తారాజువ్వలను రైతులు ఈ ఏడాది పంటలు ఎలా పండుతాయన్న అంశాన్ని అంచనా వేస్తారు. మూడు సార్లు వెలిగించే తారాజువ్వలు వరి, అపరాలు, మెట్ట పంటలకు ప్రతిరూపంగా భావిస్తారు. మూడుసార్లు జువ్వలు సక్రమంగా వెలిగితే ఆయా పంటలు బాగా పండుతాయని నమ్ముతారు. శుక్రవారం ఉత్సవం రెండుసార్లు విజయవంతంగా జువ్వలు వెలగగా ఒక జువ్వ సరిగా వెలగలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రెండు పంటలు బాగా పండుతాయని రైతులు పేర్కొన్నారు.

మహాప్రస్థాన వాహనం కోసం తప్పని నిరీక్షణ

ఐదు గంటల పాటు కేజీహెచ్‌లోనే

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలానికి చెందిన కూడ కుమారి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించగా, ఆమెను స్వగ్రామానికి తరలించడానికి మహాప్రస్థాన వాహనాన్ని సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ఐదు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. చెట్టు మీద నుంచి పడిపోవడంతో తలకు గాయమై 6న కేజీహెచ్‌లో చేరిన కుమారి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శుక్రవారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహం తరలింపు వాహనం కోసం ఐదు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. తమ గ్రామానికి ఐదు నుంచి ఆరు గంటల పాటు ప్రయాణించాల్సి ఉంటుందని త్వరగా వాహనం సమకూర్చాలని మృతురాలు భర్త రమేష్ వైద్యులను కోరారు. సాయంత్రం వాహనం సమకూరడంతో మృతదేహాన్ని తరలించారు. ఇప్పటికైనా కేజీహెచ్‌లో అంబులెన్సులు, మృతదేహాల తరలింపు వాహనాల సంఖ్యను పెంచాలని రోగులు కోరుతున్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

M Swift VXI / CNG / 2023 / AP40L 9761 Sundaram Finance Ltd., Anakapalli. Cont : 9440909730, 7901677807.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాల్లో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్‌లోన్. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 9396999669

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావులమదుం జంక్షన్, ప్రతినెల 5,19 తేదీల్లో మందులు

PERSONAL CLASSIFIEDS

LOST

DOCUMENTS LOST

I, Atmakuri Venkata Sivaprasad s/o Late Satyaraja, D.No.7-5-44, Aditya, Pandurangapuram, Visakhapatnam-03, AP. I was Lost my Original Documents Nos are : 1) 959/2009 2) 950/2009 3) 3976/2005 4) 3977/2007 5) 4503/2000 6) 1851/1985 7) 1852/1985, While I was travelling from Pandurangapuram to Ramnagar Area.. Pl. Inform if anybody found : 9848194605

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ICAS వైజాగ్. జ్యోతిష్యం, వాస్తు, హస్తరేఖ సర్టిఫైడ్ డిప్లొమా కోర్సులు ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ అడ్మిషన్లు. క్లాసులు ప్రతీ శని, ఆదివారాలలో అమర్ కాన్సెప్ట్ స్కూల్ NAD కొత్తరోడ్ శ్రీ నవోదయ Jr.కాలేజ్, గురుద్వార్ ICAS App.లో క్లాసులు J.శ్రీనివాస్ 9966666659, 9441389808

PEOPLE CARE

OLD AGE HOME

అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లో మదర్ & ఫాదర్ రిటైర్మెంట్ హోమ్ ఆధునికవసతులతో డాక్టర్ & నర్సింగ్ పర్యవేక్షణలో వృద్ధులు & పేషెంట్లకు సేవలు 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

GAJUWAKA

Gajuwaka & Aganampudi Flat for Sale 2 BHK & 3 BHK Available East & West Facing. Contact: 9100682263.

MVP COLONY

MVP Colony, Sector-8 Ushodaya Junction, 2BHK Flat with Seaview, for Sale, handover in 2 Months Ct : 9908232343.

PENDURTHI

2BHK 1000 Sft. & 3BHK 1260 Sft. Police Station, Pendurthi Jn. Zudio Backside Brundavan Garden. 8886216096, 9393108858.

SIRIPURAM

1.16 Cr Siriavenue Apartment 3BHK N/F 1375 Sft UDS 46 Sqy Near Tirumala IIT Opp. Sampath Vinayaka Swamy Temple 9849352323

GENERAL

Chinawaltair Road Opp. 3Town Police Station 3BHK E/W 1539 Sft. Ready to Occupy in 3 Months Contact: 9573493811.

2BHK 1125 Sft. East & West Facing Flats for Sale at Pineapple Colony, Arilova with Car Park. 7396663627, 9985746625.

FLAT FOR SALE 1225 SFT (UDS-60 SQ. YDS) 2 BHK S/F, 1st FLOOR @ BALAJINAGAR OPP: AU 9959577800, 9492121361

HOUSE FOR SALE

ANAKAPALLI

అనకాపల్లిలో 92 చ॥గ॥ ఇల్లు 11 1/2x 72 అమ్మకమునకు కలదు. 14 అ॥ల రోడ్డు. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే. సంప్ర॥ 9849966043/ 8374429445.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగా 'మం' గోవిందపురం రోడ్డు, హైవేకి 1/2km తారోడ్డుఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట & 4ఎకరాలు కొబ్బరితోట అమ్మకం ✆ 9440255187

PLOT FOR SALE

ANAKAPALLI

Rebaka (Anakapalli to Sabbavaram Highway) Just 300 Meters, 800 Sq.yds. Cost: 12,000/- per Sq.yard. Negotiable. ✆ 9100682263.

BHOGAPURAM

Newly Launched Commercial Venture at Bhogapuram all Facings & 366 Sq.Yds. Tagarapuvalasa "Y" Jn. towards Airport Road. Suitable for all types of Business. 9992273747.

Bhogapuram Bheemili VMRDA Layouts New & Resale Plots 167, 267, 500, 1000Sq.yds Near to Airport. ✆ 9966311167.

COMMERCIAL PLOTS FOR SALE 366 Sq. yds TAGARAPULVALSA "Y"JN Towards Airport Road Newly launched Commercial venture at BHOGAPURAM Direct highway facing ✆9866844433

విశాఖలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చుట్టు ప్రక్కల అప్రూవ్డ్ ఇండ్ల స్థలాలు బ్యాంక్‌లోన్‌తో అమ్మకం. గరిమెళ్ళ శ్రీధర్ 9493640600,9246678028.

KOTHAVALASA

1274 Sq.Yd. VUDA, N/S/W Corner Bits. 40 Feet Roads Kothavalasa. 500 Mtrs. distance from Raipur 6Lines Highway ✆ 8008770421.

కొత్తవలసకి అతి చేరువలో ప్లాంటేషన్ సదుపాయంతో, రాయపూర్ హైవేకి దగ్గరలో అతితక్కువ ధరలలో ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి 9951611123.

MADHURAWADA

300 Sq.yds. x 2 Plots E/F Nagarapalem with or without LRS. Contact: ✆ 9177939766 , 9347778898.

Madhurawada Kapuluppada VUDA Plots 216, 245, 267, 751, 960, 1000, 1200, 4200 Details. ✆ 9866883434.

PENDURTHI

చినముషిడివాడ వుడా N/F 170 గ॥లు & పెందుర్తిలో వుడా E/F 200చ॥గ॥లు స్థలంలు అమ్మకం. 6281307400 / 9985049722.

GENERAL

200 Sq.y. East Facing Plot in SVN Layout Near Saraswati Temple, Vizianagaram. Direct Parties only. ✆ 9121782266.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call : 9866219067

Residential East facing 306 yds plot in Viman nagar, NAD, Vizag for Sale. contact: 9441021552

భోగాపురం ఎయిర్‌పోర్ట్ దగ్గర్లో తర్లువాడ గూగుల్‌డేటా సెంటర్ చుట్టు ప్రక్కల VMRDA వుడా ప్లాట్స్ అమ్మకం బ్యాంక్ లోన్ కలదు. Ph: 7995143119.

TO LET

SEETHAMMADHARA

For Rent 3 BHK + Pooja room (house 1st Floor), Seethammadhara North Extension. Ph: 9704778149, 8008727930

COMMERCIAL

MADDILAPALEM

3BHK commercial flat for rent at prime locality JSR residency, Maddilapalem High way, Nr.Satyam Jn., ✆ 8500340656.

JOBS

చిరంజీవ చిట్‌ఫండ్ ప్రైలిలో నూతనంగా ప్రారంభించబడుచున్న బ్రాంచెస్‌లో పనిచేయుటకు చిట్‌ఫండ్ రంగంలో కనీసం 3 సం॥ల పైన అనుభవం కల్గిన రీజనల్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, అకౌంట్స్ స్టాఫ్ కావలెను. ✆: 9441413345.

10th Age 18-40 మా NGO ద్వారా నిరుద్యోగులు వైజాగ్‌లో ఫ్రీగా ప్రభుత్వ సర్టిఫికేట్ & స్టైపండ్‌తో &15k-18k జీతంతో మెడికల్ జాబ్స్ ✆7036571263.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సన్మార్గంలో నడిపే బుద్ధుని బోధనలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బుద్ధుని బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని, వాటిని అందరూ ఆచరించాలని నాగపూర్‌కు చెందిన బౌద్ధ భిక్షువు జ్ఞానదీప్ మహాథేరో పేర్కొన్నారు. అనకాపల్లి మండలం శంకరం బొజ్జన్నకొండ వద్ద శుక్రవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో బౌద్ధమేళా నిర్వహించారు. ముందుగా కొండ ప్రవేశద్వారం వద్ద పతాకావిష్కరణ చేశారు. కొండ ప్రధాన గుహ వరకు పంచశీల శాంతియాత్ర చేపట్టారు. గుహలో ధ్యానముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసిన అనంతరం కొండ దిగువ భాగంలో దమ్మ మహాసభ నిర్వహించారు. మహాథేరో మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచాన్ని మేలుకొల్పుతున్నాయని తెలిపారు. పంచశీల సూత్రాలను ఆచరించాలని... ద్వేషం, ఈర్ష్య, పగ, ప్రతీకారం విడనాడాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో బౌద్ధ ఆరామాలు ఘన చరిత్రకు నిదర్శనంగా నిలిచాయన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెయ్య సిద్ధార్థ మాట్లాడుతూ శంకరం వద్ద ఏటా బౌద్ధ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కంబోడియా, మయన్మార్, నాగపూర్‌కు చెందిన భిక్షువులు తరలివచ్చారన్నారు. బొజ్జన్నకొండ వద్ద రూ. 15 కోట్లతో ఫుడ్‌కోర్ట్, లేజర్ షో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గొంది నవీన్, విశాఖపట్నం అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు, పర్యాటకులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ వద్ద బౌద్ధ భిక్షువులు బోధిరత్న మహాథేరో (నాగపూర్), రజ దమ్మాజీ (మయన్మార్) కంటి బారమోజీ (కంబోడియా), వన్నెత్ చట్‌జీ (కంబోడియా), బౌద్ధ ఉపాసకులు

వాహనాలు ఢీకొని ఇద్దరు.. అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలో ఒక వ్యక్తి కాలువలో పడి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉక్కునగరం సెక్టారు-2లోని 321ఏలో కుటుంబంతో నివశిస్తున్న ఎస్.సతీష్(54) ఉక్కు కోఆపరేటివ్ స్టోర్స్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బయటకు వెళ్లిన సతీష్ తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా.. సెక్టారు-3లోని డీఏవీ పాఠశాల సమీపంలోని కాలువలో ఓ వ్యక్తిపడి ఉన్నాడని సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా.. సతీష్‌గా గుర్తించారు. మద్యం తాగి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ నజీర్ తెలిపారు.

మృతిచెందిన వృద్ధుడు

రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో..: జగదాంబ కూడలి, న్యూస్‌టుడే: వృద్ధుడిని వాహనం ఢీకొనడంతో సంఘటన స్థలం వద్దే మృతిచెందాడు. దీనికి సంబంధించి రెండో పట్టణ ట్రాఫిక్ ఎస్.ఐ. సింహాచలం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ వృద్ధుడు శుక్రవారం రాత్రి ఎల్ఐసీ బిల్డింగ్ వైపు నుంచి రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొని వెళ్లిపోయాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. వృద్ధుడిని పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారంలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వడ్లపూడి కూడలి సమీపంలో..: కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి వడ్లపూడి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... వడ్లపూడి నిర్వాసిత కాలనీకి చెందిన చింత సంతోష్‌కుమార్ (34) తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి వడ్లపూడి కూడలి సమీపంలో నిల్చొని మరో వ్యక్తితో మాట్లాడుతుండగా జాతీయ రహదారి నుంచి వడ్లపూడి ప్రధాన రహదారిలోకి మలుపు తిరుగుతున్న ట్రాలర్ వెనుక భాగం తాకింది. సంతోష్‌కుమార్ కింద పడిపోవడంతో తల పైనుంచి చక్రాలు వెళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాలర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. మృతుడిని కొన్నాళ్ల క్రితం భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి సూర్యారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతోష్ కుమార్

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	145	142
లైవ్	172	162
డ్రెస్డ్	249	294
స్కిన్‌లెస్	284	304

పెందుర్తి

తెరపై ఈనాడు

రాజాసాబ్ - అనగనగా ఒకరాజు (మార్నింగ్, ఫస్ట్ షో), భర్త మహాశయులకు విజ్ఞప్తి (మ్యాట్నీ, సెకండ్ షో)

ఎన్టీఆర్ విగ్రహానికి ముస్తాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా పెందుర్తి కూడలిలోని ఆయన విగ్రహాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 18న వర్ధంతి జరుగనున్న నేపథ్యంలో మేయర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విగ్రహానికి రంగులు వేయించారు. శిథిలమైన రెయిలింగ్‌ను తొలగించి నూతనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. విగ్రహం నవీకరణతో కూడలి నూతన శోభ సంతరించుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 97వ వార్డు పులగానిపాలెంలోని 288బి/12 స్తంభానికి ఉన్న వీధి దీపం గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. - కళ్యాణ్. ✓: త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, వీధి దీపాల నిర్వహణ ఏఈ.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: చీమలాపల్లి నుంచి పొర్లుపాలెం వైపు వెళ్లే రహదారిలో వీధి దీపాలు లేక రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. - వెంకటరావు. ✓: సమస్యను పరిష్కరించేలా చూస్తాం. - శంకరావు, జేఈ, పెందుర్తి.

?: సబ్బవరం జోడుగుళ్ల నుంచి చిన గొల్లపాలెం వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. - పి.ఆనంద్. ✓: పరిశీలించి చెత్త తొలగింపునకు ఏర్పాట్లు చేస్తాం. - పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి సబ్బవరం.

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండల పరిషత్తు కూడలి నుంచి ఊటగెడ్డ కూడలి మీదుగా ఎన్టీపీసీ వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. - నాయుడు. ✓: రహదారికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. - లలిత, ఏఈ, ఆర్‌అండ్‌బీ.

అభివృద్ధికి ఆమడ దూరం..!

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: 'నాడు - నేడు' పథకంలో భాగంగా పాత పాఠశాలలను పునర్నిర్మించి అభివృద్ధి చేస్తామని గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు హామీలిచ్చి ఊదరగొట్టారు. ఆచరణ మాత్రం అంతంతమాత్రంగానే చేపట్టారు. దీంతో పలు పాఠశాలల్లో కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయి అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయాయి. నరవ జెడ్పీ పాఠశాలలో భవనం ఆగి తుప్పలు పట్టింది. డీపీఈపీ నిధులతో నిర్మించిన మరో భవనం అభివృద్ధికి నోచుకోక పాడైపోతోంది.

అసంపూర్తిగా నరవ పాఠశాల భవనం

ప్రస్తుతం 13 గదుల్లో నిర్వహణ:

ఈ పాఠశాలను ప్రస్తుతం 13 గదుల్లో నిర్వహిస్తున్నారు. అందులో ఒకటి ప్రధానోపాధ్యాయుల గది. ఒకటి ఉపాధ్యాయులు, మరొకటి ల్యాబ్‌కు వినియోగించగా మిగిలిన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు మూడు సెక్షన్ల చొప్పున 15 గదులు ఉండాల్సి ఉండగా కేవలం పది మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయిన డీపీఈపీ భవనం పూర్తయితే 4 గదులు, నాడు-నేడు పథకంలో మంజూరైన భవనం ప్రారంభమైతే మరో ఆరు గదులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 382 మంది పిల్లలు ఉన్నారు. అదనపు గదులు నిర్మాణం జరగకపోవడంతో ఇరుకు గదుల్లోనే చదవడంతో పాటు సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు అవకాశం లేకుండా పోతోంది.

అధికారులు చొరవ చూపాలి

పాఠశాలల్లో అసంపూర్తిగా ఉండిపోయిన భవనాలు పూర్తి చేయించే విషయంలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అధికారులతో పాటు కూటమి నాయకులు చొరవ చూపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణం గతంలో కంటే అధ్వానంగా ఉందని పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి పచ్చదనంతో కళకళలాడేలా చేయాలని వారంతా కోరుతున్నారు.

ప్రజాధనం వృథా:

నాడు - నేడు పథకంలో భాగంగా తొలి విడత రూ.72 లక్షలతో భవనం నిర్మించి మధ్యలో వదిలేశారు. రెండో విడత రూ.1.06 కోట్లు విడుదల అయినప్పటికీ పనులు జరిపించకుండా వదిలేశారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది అధికారులకే తెలియాల్సి ఉంది. డీపీఈపీ నిధులు రూ.55 లక్షలు వెచ్చించి భవనం నిర్మించినప్పటికీ కొంత నిధులు మధ్యలో విడుదల ఆపకపోవడంతో పనులను గుత్తేదారు వదిలేశాడు. ఫలితంగా ఈ రెండు భవనాలకు వెచ్చించిన రూ.1.27 కోట్లు నిధులు మరుగున పడిపోయినట్టయింది. ఇప్పటికైనా పాలకులు, విద్యాశాఖ అధికారులు స్పందించి పనులు చేయిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కల్పించిన వారవుతారు.

జూదరులపై కేసుల నమోదు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న పలువురిపై పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, చింతలగ్రహారం ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో జూద శిబిరాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆయా శిబిరాలపై దాడి చేశారు. లక్ష్మీపురంలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. చింతలగ్రహారంలో జూదం ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గేమింగ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి, గొర్లెవానిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4 కోడి పుంజులు, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తవ్వి వదిలేశారు.. పూడ్చేదెవరు..?

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట - మేహాద్రి రిజర్వాయర్ రహదారి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. 24 గంటల మంచినీటి సరఫరా పైపులైన్లు వేయడం కోసం రహదారిని తవ్వి పునర్నిర్మించకుండా వదిలేశారు. దీంతో గోతులు ఏర్పడి ద్విచక్రవాహనాలు జారి చోదకులు గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిని 100 అడుగులకు విస్తరిస్తామని అధికారులు, పాలకులు ప్రకటించడం మినహా ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఈ రహదారిని ఆనుకొని పదుల సంఖ్యలో కాలనీలు, గ్రామాలు ఉన్నాయి. వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమ కష్టాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దర్పణం

అదుపుతప్పితే.. ప్రమాదమే..!

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి మార్గంలోని పరవాడ ఊటగెడ్డ కూడలికి సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచిఉంది. కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. గాజువాక, ఎలమంచిలి, ఫార్మాసిటీ, అచ్యుతాపురం, ఎన్టీపీసీకి వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో కల్వర్టు రక్షణ గోడలను భారీ వాహనాలు ఢీకొట్టడంతో కూలిపోయాయి. రాత్రి సమయంలో ఇక్కడ చీకటిగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి గెడ్డలో పడి గాయాల పాలవుతున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని చోదకులు కోరుతున్నారు.

భయపెడుతున్న విద్యుత్తు స్తంభాలు

ఫోకస్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ గండి వారి వీధి, గ్రామీణ బ్యాంకు సమీపంలోని ఎల్ఈడీ విద్యుత్తు స్తంభాలు వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. స్తంభాల అడుగుభాగం తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో స్థానికులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం ఈ రహదారి పాదచారులు, వాహనదారులతో రద్దీగా ఉంటుంది. ఈ స్తంభాలు నివాసాలు, దుకాణాలను ఆనుకుని ఉన్నాయి. వీటి నిర్వహణను అధికారులు గత కొన్నాళ్లుగా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలు కూలిపోక ముందే సమస్యను పరిష్కరించాలని నివాసితులు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం, అడుగు భాగం (ఇన్‌సెట్లో)

అ.వీ.ఇ.వీ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి - ఆనందపురం రహదారిపై ఇరువాడ వద్ద ఈనెల 14న రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సబ్బవరం పోలీసులు తెలిపారు. చామనఛాయ రంగు కలిగి, సుమారు ఐదున్నర అడుగుల పొడవు ఉంటాడని నీలం గడుల చొక్కా, నేవీ బ్లూ బనియన్, కాఫీ రంగు నిక్కరు ధరించి ఉన్నాడని సీఐ ఆర్.రామచంద్రరావు తెలిపారు. ఇటీవల ఆయన మతిస్థిమితం సరిగాలేక తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించామన్నారు. ఏదో వాహనం ఢీకొని చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నట్లు ఆయన సీఐ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేత

శ్రీను కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనుకు అనకాపల్లికి చెందిన కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందించింది. ఈనెల 14న అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొణతాల లక్ష్మీపార్వతి, కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మళ్ల జగదీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని దాడి శ్రీనును కుటుంబ సమేతంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు.

ఘనంగా సంక్రాంతి క్రీడా పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు, సర్పంచి సుజాత, ముత్యాలు తదితరులు

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో సంక్రాంతి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలను సర్పంచి చింతకాయల సుజాత ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రికెట్ విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, వాలీబాల్ విజేతలకు రూ.7 వేలు, రూ.5 వేలు, ముగ్గుల పోటీల విజేతలకు రూ.5వేలు, రూ.2500, రూ.1500 చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు, దేవి, రవి, అప్పన్న, అమ్మోరు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ★ పరవాడలో పైలా గోపిచంద్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను భాజపా సీనియర్ నాయుడు కూండ్రపు సోమునాయుడు చేతులమీదుగా అందజేశారు.. బండారు రాజు, చుక్క గోపి, బత్తి లోకేష్, రెడ్డి లావణ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భజన చెట్టు ఊరేగింపు

వేపగుంట, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాముల వారి భజన చెట్ల ఉత్సవాలు పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. వేపగుంట రామాలయంలోని భజన చెట్టుకు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా ఆధ్వర్యంలో రామభక్తులు భజనలు చేస్తూ ప్రతీ ఇంటి ముంగిటకు భజన చెట్టును తీసుకెళ్లారు. గ్రామపెద్దలు ముత్తానాయుడు, శేశెట్టి అప్పారావు, సాలాపు రమణ, బల్ల అప్పారావు, తెలసారి కనకరాజు, దమరసింగు అప్పలరాజు, అలమండ శ్రీనివాసరావు పలువురు పెద్దలు పూజలు చేశారు.

వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు

శ్రీనివాసుడికి తిరుమంజన సేవ

శ్రీవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకస్వామి

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేదమంత్రాల నడుమ పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీవారిని అభిషేకించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

కనులపండువగా ఎర్రయమ్మ పేరంటాల తీర్థం

ఎర్రయమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న నాయకులు, భక్తులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలో శుక్రవారం రాత్రి ఎర్రయమ్మ పేరంటాల తీర్థాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు ఎర్రయమ్మను దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక సీఐ మల్లికార్జునరావు, నాయకులు పైలా శ్రీనివాసరావు, సిరిపురపు అప్పలనాయుడు, చుక్క రామునాయుడు, పైలా సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, గండి నమోబాబు, కూండ్రపు సోమునాయుడు, పైలా చిన అక్కునాయుడు తదితరులు పేరంటాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాముగరిడీలు, భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెల్లో కనుమ సందడి

దీపాంజలినగర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో సంక్రాంతి, కనుమ సందడి నెలకొంది. పరవాడ మండలం మడకపాలెంలో ముగ్గులు, మ్యూజికల్ ఛైర్, ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. మహిళలు ఆకట్టుకునే రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దుబాయి, సౌదీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఈ పోటీలకు ఆర్థిక సాయం అందించారు. సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ క్రీడా మైదానంలో సాగరిక రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఎన్టీపీసీ ఉద్యోగులు, కుటుంబసభ్యులు ఉత్సాహంగా పాల్గొని గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం తవ్వవానిపాలెంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బోకం శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. పి.పద్మలత(ప్రథమ), బొడ్డి లావణ్య (ద్వితీయ), వేచలపు నాగేశ్వరి (తృతీయ), ఆర్.సుశీల (నాలుగు), బోకం భారతి (ఐదు) స్థానాల్లో నిలిచారు. నగదు బహుమతులు అందించారు. మొగలిపురంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా పెందుర్తి తెదేపా సమన్వయకర్త గండి బాబ్జీ హాజరై మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చినయాతపాలెం శ్రీవీరాంజనేయ ఉత్సవ కమిటీ ప్రతినిధి శరగడం దుర్గినాయుడు, దేవీపురంలో గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో గోమాతకు పూజలు చేశారు.

మడకపాలెంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తవ్వవానిపాలెం ముగ్గుల పోటీల విజేతలతో నిర్వాహకులు

గోవుకు పూజలు చేస్తున్న చినయాతపాలెం గ్రామస్థులు

పరసల సందడి ప్రారంభమాయె..!

వేపగుంట, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో పరసల సందడి శుక్రవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు చింతలగ్రహారం రామాలయం వద్ద రాముల వారి పరసను వైభవంగా జరిపారు. గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని రాములవారికి పూజలు చేశారు. ఈనెల 17న వేపగుంట ముత్యమాంబ, పైడితల్లమ్మ, 22న చింతలగ్రహారం దుర్గామాత, 23న పురుషోత్తపురం పైడిమాంబకు, ఈనెల 19న నరవ పైడితల్లమ్మ, 25న ఆంజనేయస్వామి, 27న కోట నరవ పైడితల్లమ్మ, 25న గవరజగ్గయ్యపాలెం ఆంజనేయస్వామి, 31న బంగారమ్మ అమ్మవార్ల పరసలు జరిపేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, పెద్దలు నిర్ణయించారు.

చింతలగ్రహారం పరసలో పాల్గొన్న స్థానికులు

మృతుల కుటుంబాలకు చేయూత

మృతుడి కుటుంబ సభ్యురాలికి నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సినిమా హాల్ కూడలికి చెందిన ఫొటోగ్రాఫర్ పైలా గోపీచంద్ ఇటీవల మృతి చెందాడు. పరవాడ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ప్రతినిధులంతా ముందుకొచ్చి తలా కొంత వేసుకుని రూ.31 వేలు సమకూర్చారు. మృతుడి కుటుంబ సభ్యులు ఈ మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. మున్ముందు గోపీచంద్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పైలా శ్రీను, సెక్రటరీ బాషా, చిన్న, గాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సూరాడ ముత్యాలు ఇటీవల తీరంలో చేపల వేట సాగిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గ్రామ సర్పంచి చింతకాయల సుజాత, మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు తన సొంత నిధులు రూ.25 వేలు అందించారు. ఈమేరకు గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మృతుని భార్య అప్పలనర్సకు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు.

జన్మదిన శుభాకాంక్షలు

మంచి మనసున్న విద్యావేత్త, సామాజికవేత్త, BJP యువనాయకులు శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

శ్రీమతి నాదెళ్ళ జ్యోతి M.Sc, జ్యోతి ఎంటర్‌ప్రైజెస్, గోపాలపట్నం

జన్మదిన శుభాకాంక్షలు

నిస్వార్థ సేవాపరులు, ఎన్నో సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తున్న పెందుర్తి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు.

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech & MBA Kites Skills Pvt. Ltd. Founder MD & CEO

లయన్స్ క్లబ్ Dist: 316A, పెందుర్తి

జన్మదిన శుభాకాంక్షలు

BJP పెందుర్తి నియోజకవర్గ యువకిశోరం, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ... అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్న శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు.

గా॥ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్

తాండ్ర పాపారాయుడు వెలమ సొసైటీ, పెందుర్తి రి॥నెం. 6/2020

మీ వివాహాది శుభకార్యక్రమాలకు, బిజినెస్ మీటింగ్‌లకు, ఆఫీషియల్ ఫంక్షన్లు మొదలైన వాటికి సంప్రదించండి

ఫోన్: 8985616888

జన్మదిన శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, ఎందరికో మార్గదర్శకులు, BJP పెందుర్తి నియోజకవర్గ రథసారధి శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

గా॥ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

సేనాపతి సోమశేఖర్‌నాయుడు

మేనేజింగ్ డైరెక్టర్, డిజిటల్ టు డిజిటల్ ఇంజినీరింగ్, 97వ వార్డు అధ్యక్షుడు, జనసేన పార్టీ

జన్మదిన శుభాకాంక్షలు

శ్రీ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్; ప్రెసిడెంట్: లయన్స్ క్లబ్, పెందుర్తి

పెందుర్తి నియోజకవర్గం BJP నాయకులు

జన్మదిన శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, ఎందరికో మార్గదర్శకులు, BJP పెందుర్తి నియోజకవర్గ రథసారధి శ్రీ గొర్లె రామునాయుడు గార్కి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

గా॥ గొర్లె రామునాయుడు గారు M.Sc., M.Tech. & MBA KITES Skills Pvt. Ltd. Founder MD & CEO BJP పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

మహాత్మా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ పినగాడి జం॥ పెందుర్తి

మహాత్మా నర్సింగ్ కాలేజ్,

కైట్స్ స్కిల్స్ ప్రై॥ లిమిటెడ్

టీచింగ్ & నాన్‌టీచింగ్ స్టాఫ్, పెందుర్తి

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - అనగనగా ఒకరాజు
సప్తగిరి - రాజాసాబ్

వందేభారత్‌కు దువ్వాడలో హాల్టు కల్పించాలి

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: విశాఖ - సికింద్రాబాద్ వందే భారత్ రైలు దువ్వాడలో హాల్టు కల్పించాలని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు కంచుమర్తి ఈశ్వర్ వాల్తేరు సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఏకే మహరాణాలను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు కొత్తగా వందేభారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తెచ్చేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

?: సూర్య అపార్టుమెంట్ (బక్కన పాలెం)లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. – అపార్టుమెంట్ వాసులు ✓: చెత్త తరలించేలా చర్యలు తీసుకుంటాం. – సాయికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: కీతన్‌పేట(భీమిలి) నుంచి తగరపువలస వరకు స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయి. – రాంబాబు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – తగరపువలస ట్రాఫిక్ పోలీసులు

?: మిథిలాపురి వుడాకాలనీ (మధురవాడ)లో తారురోడ్డు గోతులమయంగా ఉంది. – స్థానికులు ✓: త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేపడతాం. – శ్రీనివాస్, ఏఈ

?: 5వ వార్డు పరిధి గణేష్‌నగర్(మధురవాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – రామకృష్ణ ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజారవికుమార్, ఆరోగ్య అధికారి

?: సాగర్‌నగర్ శివాలయం గుడి దగ్గర వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టేస్తున్నారు. – స్థానికులు ✓: ఆర్టీసీ బస్సులకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. – ట్రాఫిక్ పోలీసులు, ఆరిలోవ

?: జూపార్కు (సాగర్‌నగర్) ఎదురుగా ఉన్న బీచ్‌లో సాయంత్రం పూట ఆకతాయిల బెడదతో ఇక్కట్లకు గురవుతున్నాం. – స్థానికులు ✓: పరిశీలించి గస్తీ ఏర్పాటు చేస్తాం. – నాయుడు, గస్తీ పోలీసులు

రద్దీ మార్గాలు.. అడుగడుగునా గుంతలు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి ఎండాడలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రధాన మార్గాల్లో గుంతలు ఏర్పడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముబారక్‌కాలనీ నుంచి ఎండాడ 100 అడుగుల రహదారిని కలిపే మార్గం, వైఎల్పీ లేఅవుట్ నుంచి రాడిసన్ బ్లూకు మార్గం, శిరుగుడినగర్ నుంచి వివేకానంద్ నగర్‌కు వెళ్లే దారులు అధ్వానంగా దర్శనమిస్తూ ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. రాత్రి వేళ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తారు రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శిరుగుడినగర్-వివేకానంద్ నగర్ దారి ఇలా..

గోతులమయంగా ముబారక్‌కాలనీ నుంచి ఎండాడ 100 అడుగుల రోడ్డుకు వెళ్లే మార్గం

జాతర గట్టుపై అన్నసమారాధన

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతర గట్టుపై వెలిసిన శ్రీదుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం కనుమ పండుగ పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల హరిప్రసాద్‌శర్మ, రాంబాబుశర్మ, మూర్తి శర్మల సారథ్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వాంబేకాలనీకి చెందిన అర్చకులు శంకర్‌రావు, శిరీష దంపతుల ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, నిర్వహణ కార్యదర్శి పోతిన శివ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ బృందం

జాతీయస్థాయి జలక్రీడల్లో సత్తా

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో సాధన చేసిన జలక్రీడాకారిణి ఎన్.గాయత్రి జాతీయ స్థాయిలో పతకాలు సాధించినట్లు కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీకేపీఏపీ) అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోని జిల్లాలోని సహస్రధార, మహేశ్వర్ ఘాట్‌లలో ఈనెల 12 నుంచి 15 తేదీ వరకు జరిగిన 13వ నేషనల్ కెనాయి స్లాలోమ్ ఛాంపియన్‌షిప్-2026, మూడో నేషనల్ కయాక్ క్రాస్ ఛాంపియన్ షిప్-2026లో తృతీయస్థానాల్లో నిలిచి రజత పతకాలు సాధించిందన్నారు.

ఎన్.గాయత్రి

ఘనంగా అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం శుక్రవారం జీవీఎంసీ మధురవాడ జోన్ కార్యాలయం వద్ద వైభవంగా జరిగింది. పేరంటాలకు కుంకుమ పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. యువకులు, మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త అల్లాడ ఉమమహేశ్వరరావు, లింగేశ్వరరావు, వెంకట్‌రావు, జనసేన రాష్ట్ర నాయకులు నక్కా శ్రీధర్ తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటంలో వారణాసి ఘట్టాన్ని కళాకారులు పిళ్లా రాంబాబు, జి.ఎల్.నాయుడు, అల్లాడ సత్తిబాబు తదితరులు ప్రదర్శించి సందర్శకులను అలరించారు.

పూజలు చేస్తున్న గ్రామపెద్దలు

నిజాయతీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికులు

మధురవాడ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య శుభ్రత పనులు చేస్తున్న కార్మికులకు రోడ్డుపై దొరికిన బంగారు నగలు బాధితులకు అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం గ్రామంలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అరుణ, రాము, డ్రైవర్ ప్రసాద్‌లు భోగి రోజు బుధవారం విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో గ్రామంలో రోడ్డుపై రూ.5 లక్షల విలువైన సుమారు 4.5 తులాల రెండు బంగారు నక్లెస్‌లు దొరికాయి. విషయాన్ని సూపర్‌వైజర్ అప్పలరాజు, 7వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోష్‌కుమార్‌లకు తెలియజేశారు. వీరంతా కలిసి బంగారు నగలు పోగొట్టుకున్న బాధితుల గురించి గ్రామంలో ఆరా తీశారు. మల్లయ్యపాలెంలోని రాజగోపాల్ రెసిడెన్సీ వాసులైన కె.రామచంద్రరావు, సౌమ్య దంపతులకు చెందినవిగా తెలుసుకున్నారు. గురువారం ఉదయం రెండు నక్లెస్‌లను పారిశుద్ధ్య విభాగం అధికారుల సమక్షంలో బాధితులకు అప్పగించారు. దీంతో నిజాయతీ చాటుకున్న ముగ్గురు కార్మికులను పలువురు అభినందించారు.

దొరికిన నగలను బాధితులకు అందిస్తున్న పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ సంతోష్ తదితరులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై కనుమపండుగ పురస్కరించుకుని ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరానికి చెందిన కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు అక్షయ, మోనిషా, నివేదిత, రోషిత, లక్ష్మిప్రియ, తనిష, షణ్ముఖశ్రీ, శాంతిశ్రీలు వారి హావభావాలతో శాస్త్రీయ, జానపద నృత్యాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. నృత్యాలకు సందీప్ కుమార్ దర్శకత్వం వహించారు. చిన్నారులకు స్థానిక పరిపాలనాధికారి సి.రమేష్‌రెడ్డి ధ్రువపత్రాలను అందించి అభినందించారు.

మధురవాడ శిల్పారామం వద్ద..

విశాఖకు సినీ పరిశ్రమ వచ్చేలా కృషి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు సినీ పరిశ్రమ వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన 'సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్)' మ్యాచ్‌ను వీక్షించారు. ముందుగా ఆయా జట్లకు చెందిన సినీ క్రికెటర్లతో మాట్లాడారు. ఇప్పటికే విశాఖలో దిగ్గజ ఐటీ సంస్థలు ఒక్కొక్కటిగా కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని, మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనుందన్నారు. సినీ పరిశ్రమకు విశాఖ ఓ సెంటిమెంట్ లాంటిదన్నారు. దర్శకులు [illegible]దర్, రాఘవేంద్రరావు తదితరులు తమ చిత్రాల్లో ఒక్క సన్నివేశమైనా విశాఖలో చిత్రీకరించడానికి ప్రాధాన్యత నిచ్చేవారన్నారు. రాబోయే రోజుల్లో విశాఖను సినీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం పర్యాటకరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పర్యాటకం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కొద్దిసేపు గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను వీక్షించారు.

స్టేడియంలో సినీ నటుడు సాయికుమార్ తదితరులతో ఎమ్మెల్యే గంటా

'తడి, పొడి'.. తడబడి

కొమ్మాది, న్యూస్‌టుడే: రహదారులపై వ్యర్థాలు పేరుకుపోకుండా ఎక్కడికక్కడ తడి, పొడి చెత్త సేకరణ డబ్బాలను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఇవి చాలా చోట్ల అపహాస్యం పాలు కాగా కొన్ని ప్రాంతాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలో 5, 6, 7 వార్డుల్లో రూ.7.50 లక్షలతో మూడు వార్డుల్లో రహదారుల వెంబడి 120 డబ్బాలను గతంలో ఏర్పాటు చేశారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చెత్త డబ్బాల నిర్వహణ ఉంటే ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించే అవకాశాలున్నాయా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవస్థ పూర్తిస్థాయిలో గాడినపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మధురవాడలో భవన నిర్మాణ సామగ్రి వద్ద చెత్త డబ్బా ఇలా..

శిథిలమవుతున్న గంభీరం ఆనకట్ట!

ఆనందపురం, న్యూస్‌టుడే: బృహదాచల కొండల పంక్తుల నడుమ ప్రకృతి ఒడిలో సుందరమైన గంభీరం జలాశయం డ్యామ్ శిథిలావస్థకు చేరువలో ఉంది. గత కొన్నేళ్లుగా నిర్వహణ గాలికి వదిలేయడంతో జలాశయానికి ముప్పువాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. వేసవిలో విశాఖ నగర వాసుల దాహార్తిని తీర్చుతున్న ఈ జలాశయంపై అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని పలువురు సూచిస్తున్నారు.

నెలకొన్న సమస్యలు ఇవే..: జలాశయం డ్యామ్ తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. డ్యామ్ దిగువ భాగం శిథిలమై రాళ్లు పైకి తేలాయి. వరద దాటికి ఒక్కొక్కటిగా జారుకుంటున్నాయి. డ్యామ్ కింద మట్టి భాగం వరదకు కొట్టుకుపోవడంతో పెద్ద గోతులు మారింది. జలాశయం దిగువ భాగంలో ఏర్పడిన రంధ్రం ద్వారా నీరు బయటకు పోతోంది.

జలాశయం దిగువ భాగంలో పడిన రంధ్రం ద్వారా పోతున్న నీరు

★ జలాశయం చుట్టూ పెద్ద పొదలు, ముళ్ల చెట్లు పెరిగి కళావిహీనంగా మారింది. దీంతో జలాశయానికి చేరుకోవడానికి మార్గం పూర్తిగా పొదలతో మూసుకుపోవడంతో ఇబ్బందిగా తయారైంది. జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో చెబుతున్న రాజకీయ నాయకులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జలాశయం నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై భీమిలి జలవనరుల శాఖ ఏఈ విజయకుమార్ స్పందిస్తూ గంభీరం జలాశయం వద్ద పెరిగిన పొదలను 20 రోజుల్లో తొలగిస్తామన్నారు. మరమ్మతులకు సంబంధించి ప్రాథమికం అంచనా వ్యయం వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించామని పేర్కొన్నారు.

రాళ్లు తేలిన జలాశయం ఫోర్స్ భాగం

ఘనంగా గోపూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: కనుమ పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో శుక్రవారం గోపూజ సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న ఆలయ అర్చకులు, వేద పండితులు గోశాలలోని కపిల గోవుకు శోడషోపచార పూజలు చేశారు. ఈవో ఎన్.సుజాత పూజల్లో పాల్గొన్నారు. గోమాతకు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అర్చకులు హారతులిచ్చి ఆరాధించారు. ఈవో సుజాత గోవులకు ఇష్టమైన ఆహారాన్ని తినిపించారు. కార్యక్రమంలో ఏఈవో రమణమూర్తి, పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న గోశాలలో గోపూజ నిర్వహిస్తున్న ఈవో సుజాత, అధికారులు

పద్మనాభుడి గిరి ప్రదక్షిణ

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీఅనంత పద్మనాభస్వామి గిరి ప్రదక్షిణ గోవింద నామస్మరణతో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండ దిగువన ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి పద్మనాభం, ఇసకలపాలెం గ్రామాల మీదుగా తోడ్కొని వెళ్లి స్వామివారి పూల తోటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి స్వామి వారి ఊరేగింపు గోస్తనీ నదీ తీరం వెంబడి అర్చకునిపాలెం చేరుకొని స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద ఉన్న ఉయ్యాల మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మనాభం కూడలి మీదుగా తిరిగి ఆలయానికి చేరుకోవడంతో స్వామివారి గిరి ప్రదక్షిణ ముగిసింది.

స్వామివారి ఉత్సవమూర్తులను తోడ్కొని వస్తున్న భక్తులు

గజ వాహనంపై వరదరాజ స్వామి వైభవం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: మకర వేట ఉత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి అడివివరం గ్రామంలో సింహాద్రి అప్పన్న స్వామి గ్రామ తిరువీధి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పూలతోటలో ఉత్సవం ముగిసిన అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం దరి ఉద్యాన మండపంలో కొలువుదీర్చారు. విరామం అనంతరం స్వామిని గజ వాహనంపై అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేద పారాయణల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి తిరువీధి వేడుకగా నిర్వహించారు. గ్రామస్థులు వీధుల్లో రంగవల్లికలతో స్వామికి స్వాగతం పలికారు. పండ్లు, ఫలహారాలు సమర్పించి భక్తి చాటుకున్నారు. తిరువీధి అనంతరం స్వామివారు మెట్లమార్గం గుండా తిరిగి సింహగిరికి చేరుకున్నారు. అర్చకులు పవళింపు సేవ నిర్వహించి ఆలయ ద్వారాలు మూసివేశారు.

గజవాహనంపై గ్రామ తిరువీధిలో పాల్గొన్న అప్పన్న స్వామి

వైభవంగా సంక్రాంతి సంబరాలు

చిట్టివలస కొత్తపేటలో ముగ్గుల పోటీలు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని చిట్టివలస, తగరపువలస, బీచ్‌రోడ్డు, భీమిలి గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. చిట్టివలస కొత్తపేటలో రంగవల్లులు, తదితర మనోరంజక పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. చేపలుప్పాడ పద్నాలుగు గ్రామాల్లో దేవుని భజన చెట్టు ఊరేగింపు, దాసరికాలు జరిగాయి. నాల్గో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మాజీ సర్పంచి కారి అప్పారావు, నాయకులు మైలపల్లి రాము, సూరాడ చిట్టిబాబు, పుక్కెళ్ల అప్పలరాజు పాల్గొన్నారు. కాపులుప్పాడ, కల్లివానిపాలెం గ్రామాల్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యులు బోర బంగారెడ్డి, రాధాకుమారి, మాజీ సర్పంచి దుంప నర్సింహమూర్తి, నాయకులు గుడ్ల వెంకటరమణ, బోర సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో కుటుంబాలవారిగా దేవుడి ఇంటిలో కుటుంబాల పెద్దలకు నైవేద్యాలు సమర్పించారు. దూరాభారంలో ఉద్యోగ జీవనం సాగించే వారి గ్రామాల్లో తరలి రావడంతో అంతా సరదాగా చెప్పుకొనే కబురుతో, ముగ్గుల పోటీలు, ఆటల పాటలతో ఉత్సాహంగా గడిపారు. కులవృత్తుల ప్రదర్శనలు, యువత వాలీబాల్, క్రికెట్, పరుగు పందెం, చెరువుల్లో ఈత పోటీలు, దేవాలయాల్లో దీపారాధన, వివిధ రకాల దైవ భజన సంగీతా కార్యక్రమాలు చేపట్టారు.

పద్మనాభం, న్యూస్‌టుడే: కృష్ణాపురం, పద్మనాభం, మద్ది తదితర గ్రామాల్లో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి వివిధ రకాల క్రీడలు, ఆటల పోటీలతో సందడి చేశారు. ముఖ్యంగా తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: ముత్యాల ముగ్గులు.. ముచ్చటైన ఆటలు.. కొమ్మదాసరి పాటలు.. హరిదాసు కీర్తనలు.. కలిసి ఆడిన కోలాటం.. గొంతు కలిపిన భజన బృందం, గంగిరెద్దుల విన్యాసాలు.. ఘల్లుఘల్లున మోగిన తప్పెటగుళ్లు.. అంతటా తెలుగుదనంతో రేవళ్లపాలెం గ్రామం పల్లె వాతావరణాన్ని తలపించింది. రేవళ్లపాలెం విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు శుక్రవారంతో ముగిశాయి.

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడలో గురువారం ముత్యాలముగ్గులు, గొబ్బెమ్మలు, జానపద నృత్యాలు, హరిదాసుని వేషధారణతో వేడుకలు నిర్వహించుకున్నారు. గ్రామ కమిటీ, గోపాలకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో దాదాపు 80 మంది మహిళలు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, గ్రామస్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయా కమిటీ సభ్యులు తెలిపారు.

చేపలుప్పాడలో దేవుని భజన చెట్టును ఇంటింటికి ఊరేగించి పూజలు చేస్తున్న దృశ్యం

కృష్ణాపురంలో కోలాటం

రేవళ్లపాలెంలో..

వెల్లంకిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు

గొల్లల ఎండాడలో..

ఆకట్టుకున్న సంకీర్తనలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో సాగర్‌నగర్ సమీప బీచ్‌రోడ్డులోని శ్రీమొగదారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో శుక్రవారం గొల్లల ఎండాడ గరిడీ బృంద సభ్యులు తోడిపెద్దుతో తరలివచ్చి సంకీర్తనలతో కీర్తించారు. ఆలయ ధర్మకర్త సూరపనేని లక్ష్మీప్రసాద్ సమక్షంలో తోడపెద్దు ఊరేగింపుతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. తదనంతరం సాగర్‌నగర్ కాలనీ, గుడ్లవానిపాలెం తదితర ప్రాంతాల్లోనూ గరిడీ బృంద సభ్యులు ఈ కార్యక్రమాలు ఘనంగా చేశారు.

సంకీర్తనలు ఆలపిస్తున్న గరిడీ బృందం

తీరానికి పచ్చని శోభ

జూపార్కు తీరంలో

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్, జూపార్కు తీరాల్లో గురువారం అలల తీవ్రత తగ్గి సముద్రం కొంత మేర వెనక్కి మళ్లడంతో పలు ఆకర్షణీయ దృశ్యాలు వెలుగుచూశాయి. దాదాపు ఒకే పరిమాణంలోని ఇసుకతిన్నెలు, పచ్చటి నాచుతో హరితశోభ ఉట్టిపడేలా రాళ్లు కనిపించాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస అవంతి కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటుపల్లి నాగేశ్వరరావు (46) అనే ఆటో డ్రైవరుకి శుక్రవారం తీవ్రగాయాలయ్యాయి. తాటిచెట్లపాలేనికి చెందిన ఈయనకు రెండు కాళ్లు, నడుం విరిగిపోయాయి. కోల్‌కతా నుంచి విశాఖ వైపు వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఈయన ఆటోను ఢీకొంది. నగరం నుంచి ప్రయాణికులను తగరపువలస ప్రాంతానికి తీసుకునివచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడ్ని సంగివలసలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. సీఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ★ కె.నగరపాలెం కూడలి సమీపంలోని గంభీరం గెడ్డ వంతెన వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రెండు ప్రమాదాల్లో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మహిళలు గాయపడినట్లు పోలీసులు చెప్పారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా తెదేపా నాయకులు రవ్వ వెంకటరావు స్మారక చిల్డ్రన్ క్రికెట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం సాయంత్రం బహుమతులను ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన సంతపేట ఎస్సీకాలనీ జట్టుకి, రన్నరప్ చిట్టివలస జట్టుకి అతిథిలుగా హాజరైన తెదేపా జీవీఎంసీ ఒకటో వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు, ప్రధాన కార్యదర్శి దిండి వెంకటేశ్, తదితరులు బహుమతులు అందించారు. తెదేపా నాయకులు కొప్పల కృష్ణ, మద్దిల సుబ్బారావు, తీన్‌మూర్తి, రవ్వ ఆనంద్, జాకబ్, కిరణ్, వాద్ర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. * తగరపువలస శ్రీనగర్‌లో ముగ్గుల పోటీల విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాయకులు జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, వెంపాడ రమణ, పందిరి విజయ్ పాల్గొన్నారు. ★ తగరపువలస బంగ్లామెట్టలో సంక్రాంతి క్రికెట్ పోటీల విజేతలకు తెదేపా నాయకులు గరే చంద్రమౌళి, సదానంద బహుమతులు పంపిణీ చేశారు.

విజేతలైన మహిళలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

అదుపు తప్పిన ఎద్దులు... ముగ్గురికి గాయాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: అనంతవరం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎద్దుల బండ్ల పోటీల్లో స్వల్ప అపశ్రుతి చోటుసుకుంది. ఈ ఘనటలో ఇద్దరికి గాయాలయ్యాయి. సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామంలోని యువత ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లు, గుర్రం పరుగు పోటీలు నిర్వహించారు. వరి పంట కోసిన పొలాల్లో ఈ పోటీలు నిర్వహించడంతో నేల చదునుగా లేకపోవడం, పొలం గట్లు ఎత్తు పల్లాల వల్ల ఎద్దుల బండి అదుపు తప్పి జనాలపైకి దూసుకుపోవడంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. అంతకు ముందు గుర్రం పరుగు పందేలు నిర్వహిస్తుండగా ఒక గుర్రం జనాలపైకి దూసుకురావడంతో ఒక వ్యక్తి గాయపడ్డారు. బాధితులను 108 ద్వారా విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. వరుసగా రెండు అపశ్రుతులు జరగడంతో నిర్వాహకులు పోటీలను మధ్యలోనే ఆపేశారు.

(c) eenadu

విశాఖ తూర్పు

గజ వాహనంపై వరదరాజ స్వామి వైభవం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: మకర వేట ఉత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి అడివి వరం గ్రామంలో సింహాద్రి అప్పన్న స్వామి గ్రామ తిరువీధి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పూలతోటలో ఉత్సవం ముగిసిన అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం దరి ఉద్యాన మండపంలో కొలువుదీర్చారు. విరామం అనంతరం స్వామిని గజ వాహనంపై అధిష్ఠింపజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి తిరువీధి వేడుకగా నిర్వహించారు. గ్రామస్థులు స్వామికి ఘనంగా స్వాగతం పలికారు. పండ్లు, ఫలహారాలు సమర్పించి భక్తి చాటుకున్నారు. తిరువీధి అనంతరం స్వామివారు మెట్లమార్గం గుండా తిరిగి సింహగిరికి చేరుకున్నారు. అర్చకులు పవళింపు సేవ నిర్వహించి ఆలయ ద్వారాలు మూసివేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ 1 గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: ఈస్టుపాయింట్ కాలనీలో చెత్త పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.
- పోలిరెడ్డి, వెంకటరావు, స్థానికులు

✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి పరిసరాల శుభ్రత చర్యలు చేపడతాం.
- ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన విజయనగరం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ చౌదరి వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఆర్‌జేవీ కాలనీకి చెందిన ఎస్.సత్యం(64) సెక్యూరిటీగార్డుగా పనిచేసేవారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని విజయనగరం వచ్చారు. పండగ సందర్భంగా బంధువుల ఇంటికని వీటీ అగ్రహారానికి నడిచి వెళ్తుండగా.. ఎత్తు వంతెన సమీపంలోని ఎంఆర్‌ఎఫ్ టైర్ల దుకాణం వద్ద ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆయన కుమారుడు ఎస్.గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహన చోదకుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామన్నారు.

దుర్వాసన, దోమల బెడద

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12వ వార్డు పరిధి చినగదిలి నేతాజీనగర్ సేవా మార్గం ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు కదలడం లేదు. సుమారు రెండు నెలలుగా కాలువల్లో వ్యర్థాలు తొలగించడం లేదని స్థానికులు అంటున్నారు. వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన శుభ్రత చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చినగదిలి నేతాజీనగర్ ప్రధాన కాలువలో ఇలా..

'సూర్యఘర్'తో సత్ఫలితాలెన్నో..

శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: సౌరశక్తిని సద్వినియోగం చేసుకుంటే విద్యుత్తు బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఎంతో ప్రయోజనం లభిస్తుందని ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

■ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ రూఫ్ టాప్ పలకలు ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ అందజేస్తోంది. వీటి ఏర్పాటుకు బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కూడా కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు ముందుకొస్తే రాయితీ శాతం వారికి మరింత అధికం. సౌర విద్యుత్తు ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు ఉత్పత్తి అయితే అందులో వంద యూనిట్లు సొంతానికి వాడుకోగా.. మిగతాది ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఆ మేరకు ఆదాయం కూడా లభిస్తుంది.

శివాజీపాలెంలో ఏర్పాటు చేసిన సౌర పలకలు

■ మద్దిలపాలెం, చైతన్యనగర్, భానునగర్, పిఠాపురంకాలనీ, శివాజీపాలెం, మంగాపురంకాలనీ, వెంకోజీపాలెం, తారకనీడు, కొత్తవెంకోజీపాలెం, అంబేడ్కర్‌కాలనీ, రఘువీధి, శివాలయం తదితర ప్రాంతాలు మద్దిలపాలెం సెక్షన్ పరిధిలోకి వస్తాయి. పైన తెలిపిన ప్రాంతాల్లో సుమారు లక్షకుపైగా జనాభా ఉన్నారు. గృహ విద్యుత్తు సర్వీసులు 24,500 వరకు ఉన్నాయి. సౌర విద్యుత్తు కోసం ప్రస్తుతం 195 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 75 సౌర పలకలు ఏర్పాటు చేశారు.

నిత్యం అవగాహన కల్పిస్తున్నాం..

మద్దిలపాలెం డివిజన్ పరిధిలో వినియోగదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఇంటింటికీ వెళ్లి సూర్యఘర్ పథకంపై వివరిస్తున్నాం. సౌర పలకలు సరఫరా చేసే సంస్థల ప్రతినిధులను తీసుకెళ్లి వినియోగదారుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఆసక్తి గల వినియోగదారులు శివాజీ పార్కు సమీప విద్యుత్తు కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.
- పి.త్రినాథ్, విద్యుత్తు ఏఈ

ఊరెళ్లిన జనం..దారులు నిర్మానుష్యం

బీఆర్టీఎస్ మార్గంలో పెదగదిలి కూడలి ఇలా..

ఆరిలోవ, న్యూస్‌టుడే: నిత్యం వాహన రద్దీగా ఉండే ఆరిలోవ ప్రాంతం సంక్రాంతి నేపథ్యంలో బోసిపోయింది. బీఆర్టీఎస్ మార్గంలోని పెదగదిలి కూడలి, పాత ఆరిలోవ అంబేడ్కర్ కూడలి జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వలస కుటుంబాలు ఆరిలోవ ప్రాంతంలో ఎక్కువగా నివాసం ఉంటున్నాయి. ఆయా జిల్లాలతోపాటు ఒడిశా నుంచి వలస వచ్చిన ప్రజలు సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లడంతో గురువారం రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖలో సుమారు 60 నుంచి 70 శాతం మంది ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు కావడంతో సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లారు. దీంతో పండగ రోజుల్లో రహదారులు బోసిపోయాయి. సిరిపురం, బీచ్‌రోడ్డు, పెదవాల్తేరు వంటి కీలక ప్రాంతాల్లోనే వాహనాల రాకపోకలు అంతంతమాత్రంగా కనిపించాయి.

జనసంచారం లేని సిరిపురం రహదారి

తీరంలో పచ్చదనం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్, జూపార్కు, తీరంలో గురువారం అలల తీవ్రత తగ్గి సముద్రం కొంత మేర వెనక్కి మళ్లడంతో పలు ఆకర్షణీయ దృశ్యాలు వెలుగు చూశాయి. దాదాపు ఒకే పరిమాణంలోని ఇసుకతిన్నెలు, పచ్చటి నాచుతో హరితశోభ ఉట్టిపడేలా రాళ్లు కనిపించాయి.

జూపార్కు సమీపంలో..

రోడ్డుపైనే భవన నిర్మాణ వ్యర్థాలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ ప్రాంతంలో రోడ్ల పైనే భవన నిర్మాణ వ్యర్థాలు పడేస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎక్కడ కొత్తగా ఇళ్లు నిర్మించినా పాత భవనాలకు చెందిన వ్యర్థాలను ముడసర్లోవ ప్రాంత రహదారులపై పోగులుగా వేస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతం కావడం వల్ల రాత్రి వేళ లారీలతో తెచ్చి పోగులుగా వేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముడసర్లోవ రిజర్వాయర్ కొండ సమీప రహదారిపై రాళ్లకుప్పలు

ఈ 'తుప్పు' వదిలేదెప్పుడో!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని మమత వసతి గృహం వద్ద ఓ ట్యాంకరు లారీ కొన్నేళ్లుగా బాగా తుప్పు పట్టేసి ఉంది. పూర్తిగా మూలకు చేరిన ఈ వాహనం తుక్కు కింద సంబంధిత వ్యాపారులకు విక్రయించాల్సి ఉన్నప్పటికీ ఏయూ అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇది వసతిగృహం పరిసరాల్లో ఉన్నందున వెంటనే దీన్ని సంబంధిత ప్రదేశం నుంచి తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే సంబంధిత విభాగాధికారులు దీన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ట్యాంకరు లారీ దుస్థితి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. చినగదిలి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మకర సంక్రమణ దీక్ష విరమణ, చక్రస్నానం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 5 గంటలకు మేలుకొలుపు సేవ, నిత్య పూజలు, అర్చనలు, మంగళాశాసనం, తీర్థ ప్రసాదగోష్ఠి నిర్వహించినట్లు ఆలయ ధర్మాచార్యులు పీవీ నరసింహాచార్యులు తెలిపారు. చినగదిలి నార్త్ శిర్డీ సాయిబాబా మందిరంలో ఉదయం విశిష్ట హారతులు, కాగడ హారతి, పంచామృతాలతో అభిషేకం, మధ్యాహ్న హారతి, పేదలకు అన్నసమారాధన, సాయంత్రం సంధ్యా హారతి, నక్షత్ర హారతి, శేజ్ హారతి జరిగాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నట్లు అర్చకులు నగేష్‌శర్మ, ఆలయ అధ్యక్షులు వానపల్లి అప్పారావు తెలిపారు. పెదగదిలి శివాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. శ్రీకృష్ణాపురం గోశాల ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామిని మకర సంక్రాంతి, ఉత్తరాయణం ప్రారంభం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రామకృష్ణాపురంలో వారాహి అమ్మవారు

శ్రీకృష్ణాపురంలో పూజలందుకుంటున్న సూర్యనారాయణ స్వామి

చినగదిలిలో శిర్డీ సాయిబాబా

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12వ వార్డు పరిధి తోటగరువులో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారని, ఆనందోత్సాహాల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఒమ్మి కృష్ణ తెలిపారు. కనుమ సందర్భంగా శుక్రవారం పశువులకు పూజలు చేశారు. తోటగరువు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం మేలుకొలుపు సేవ, అభిషేకాలు, నిత్య పూజలు జరిగినట్లు ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ తెలిపారు. అనంతరం గ్రామస్థులంతా సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని రంగు రంగుల ముగ్గులు వేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా చెరకు గడలు, కలశాలు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈవో గాయత్రి, అర్చకులు పాల్గొన్నారు.

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడలో గురువారం ముత్యాలముగ్గులు, గొబ్బెమ్మలు, జానపద నృత్యాలు, హరిదాసుని వేషధారణతో వేడుకలు నిర్వహించుకున్నారు. గ్రామ కమిటీ, గోపాలకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో దాదాపు 80 మంది మహిళలు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, గ్రామస్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయా కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

కొండచిలువ కలకలం

కరాస, న్యూస్‌టుడే : పండగపూట రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉండగా ఓ కొండచిలువ రోడ్డుదాటుతూ కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్‌ఎస్టీఎల్ 80 అడుగుల రోడ్డు మీద శుక్రవారం ఉదయం సుమారు పది అడుగులున్న కొండచిలువ స్థానికులకు కనిపించింది. భయంతో కరాసకు చెందిన త్రినాథ్‌కు సమాచారం ఇచ్చారు. అతను కొండచిలువను చాకచక్యంగా బంధించాడు. అటవీ శాఖ సిబ్బందికి అందజేస్తానని తెలిపాడు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

ఆరిలోవ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలను వేదాంత సంస్థ సీఎస్‌ఆర్ పథకం కింద అభివృద్ధి చేస్తుండడంతో వీటికి మంచి రోజులు వచ్చాయి. ఇందులో భాగంగా 12వ వార్డు పరిధి సింహగిరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి రంగులు వేసి అభివృద్ధి చేశారు. గోడలపై జంతువుల బొమ్మలు వేశారు. పిల్లలు సులభంగా నేర్చుకునేందుకు ఆంగ్ల అక్షరాలను బొమ్మలతో తీర్చిదిద్దారు. ఈ కేంద్రానికి టీవీ కూడా సమకూర్చారు. ఆరిలోవ ప్రాంతంలో సొంత భవనాలు కలిగి ఉన్న ఏడు అంగన్‌వాడీ కేంద్రాలను ఈ విధంగా అభివృద్ధి చేసినట్లు అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణాధికారిణి సెల్వియా పేర్కొన్నారు. బాలలకు అవసరమైన బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. వేదాంత లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా నందఘర్ ప్రాజెక్టు పేరిట వీటిని అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

కేంద్రంలో అమర్చిన టీవీ, గోడపై ఆకట్టుకునేలా జంతువుల బొమ్మలు

వేడుకగా ఆధ్యాత్మిక ప్రదర్శన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో సాగర్‌నగర్ సమీప బీచ్‌రోడ్డులోని శ్రీమొగధారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో శుక్రవారం గొల్లల ఎండాడ గరిడీ బృంద సభ్యులు తోడపెద్దుతో తరలివచ్చి సంకీర్తనలతో కీర్తించారు. ఆలయ ధర్మకర్త సూరపనేని లక్ష్మీప్రసాద్ సమక్షంలో తోడపెద్దు ఊరేగింపుతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. తదనంతరం సాగర్‌నగర్ కాలనీ, గుడ్లవాని పాలెం తదితర ప్రాంతాల్లోనూ గరిడీ బృంద సభ్యులు ఈ కార్యక్రమాలు ఘనంగా చేశారు.

సంకీర్తనలు ఆలపిస్తున్న గరిడీ బృందం

అదుపు తప్పిన ఎద్దులు... ముగ్గురికి గాయాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: అనంతవరం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎద్దుల బండ్ల పోటీల్లో స్వల్ప అపశ్రుతి చోటుసుకుంది. ఈ ఘనటలో ఇద్దరికి గాయాలయ్యాయి. సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామంలోని యువత ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లు, గుర్రం పరుగు పోటీలు నిర్వహించారు. వరి పంట కోసిన పొలాల్లో ఈ పోటీలు నిర్వహించడంతో నేల చదునుగా లేకపోవడం, పొలం గట్లు ఎత్తు పల్లాల వల్ల ఎద్దుల బండి అదుపు తప్పి జనాలపైకి దూసుకుపోవడంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. అంతకు ముందు గుర్రం పరుగు పందేలు నిర్వహిస్తుండగా ఒక గుర్రం జనాలపైకి దూసుకురావడంతో ఒక వ్యక్తి గాయపడ్డారు. బాధితులను 108 ద్వారా విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. వరుసగా రెండు అపశ్రుతులు జరగడంతో నిర్వాహకులు పోటీలను మధ్యలోనే ఆపేశారు.

కీలక మార్గం.. నిత్యం అంధకారం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ మానసిక ఆసుపత్రి మీదుగా బీచ్‌రోడ్డు జీసీసీ సంస్థకు చేరుకునే మార్గంలో కొన్నాళ్లుగా వీధి దీపాలు వెలగక వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రభుత్వ మానసిక, ఛాతి, ఈఎన్‌టీ ఆసుపత్రులున్నాయి. వాటిలో పనిచేసే సిబ్బంది షిఫ్ట్ డ్యూటీలు పూర్తి చేసుకుని అర్ధరాత్రి వేళ విధులకు వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆకతాయిల బెడద వెంటాడుతోందని పలువురు నర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు. ఈ మార్గంలో గతంలో గొలుసు చోరీలు కూడా జరిగిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం కుక్కల బెడద కూడా వెంటాడుతున్నందున సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెలగని వీధి దీపాలు

తీరంలో సందడే సందడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కనుమ పండగ పురస్కరించుకొని శుక్రవారం ఆర్కే బీచ్‌లో గాలిపటాల సందడి నెలకొంది. నగరవాసులు ఉదయం నుంచి పెద్ద ఎత్తున తీరానికి చేరుకొని రకరకాల గాలిపటాలు ఎగురవేశారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా అందరూ వీటిని ఎగురవేసి ఉల్లాసంగా గడిపారు.

జాతీయస్థాయి జలక్రీడల్లో పతకాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో సాధన చేసిన జలక్రీడాకారిణి ఎన్.గాయత్రి జాతీయ స్థాయిలో పతకాలు సాధించినట్లు కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీకేఏఏపీ) అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోని జిల్లాలోని సహస్రధార, మహేశ్వర్ ఘాట్‌లలో ఈనెల 12 నుంచి 15 తేదీ వరకు జరిగిన 13వ నేషనల్ కెనాయి స్లాలోమ్ ఛాంపియన్ షిప్-2026, మూడో నేషనల్ కయాక్ క్రాస్ ఛాంపియన్ షిప్-2026లో తృతీయస్థానాల్లో నిలిచి రజత పతకాలు సాధించిందన్నారు.



ఎన్.గాయత్రి

విశాఖకు సినీ పరిశ్రమ వచ్చేలా కృషి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు సినీ పరిశ్రమ వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) మ్యాచ్‌లను వీక్షించారు. ముందుగా ఆయా జట్లకు చెందిన సినీ క్రికెటర్లతో మాట్లాడారు. ఇప్పటికే విశాఖలో దిగ్గజ ఐటీ సంస్థలు ఒక్కొక్కటిగా కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని, మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనుందన్నారు. సినీ పరిశ్రమకు విశాఖ ఓ సెంటిమెంట్ లాంటిదన్నారు. దర్శకులు బాలచందర్, రాఘవేంద్రరావు తదితరులు తమ చిత్రాల్లో ఒక్క సన్నివేశమైనా విశాఖలో చిత్రీకరించడానికి ప్రాధాన్యత నిచ్చేవారన్నారు. రాబోయే రోజుల్లో విశాఖను సినీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం పర్యాటకరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పర్యాటకం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కొద్దిసేపు గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను వీక్షించారు.

స్టేడియంలో సినీ నటుడు సాయికుమార్ తదితరులతో ఎమ్మెల్యే గంటా

నిజాయతీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికులు

మధురవాడ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య శుభ్రత పనులు చేస్తున్న కార్మికులకు రోడ్డుపై దొరికిన బంగారు నగలు బాధితులకు అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం గ్రామంలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అరుణ, రాము, డ్రైవర్ ప్రసాద్‌లు భోగి రోజు బుధవారం విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో గ్రామంలో రోడ్డుపై రూ.5 లక్షల విలువైన సుమారు 4.5 తులాల రెండు బంగారు నక్లెస్‌లు దొరికాయి. విషయాన్ని సూపర్‌వైజర్ అప్పలరాజు, 7వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోష్‌కుమార్‌లకు తెలియజేశారు. వీరంతా కలిసి బంగారు నగలు పోగొట్టుకున్న బాధితుల గురించి గ్రామంలో ఆరా తీశారు. మల్లయ్యపాలెంలోని రాజగోపాల్ రెసిడెన్సీ వాసులైన కె.రామచంద్రరావు, సౌమ్య దంపతులకు చెందినవిగా తెలుసుకున్నారు. గురువారం ఉదయం రెండు నక్లెస్‌లను పారిశుద్ధ్య విభాగం అధికారుల సమక్షంలో బాధితులకు అప్పగించారు. దీంతో నిజాయతీ చాటుకున్న ముగ్గురు కార్మికులను పలువురు అభినందించారు.

దొరికిన నగలను బాధితులకు అందిస్తున్న పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ సంతోష్ తదితరులు

మీ శిరస్త్రాణం.. నాణ్యమైనదేనా..?

మాధవధార, న్యూస్‌టుడే

శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానాతో పాటు మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేస్తామని రవాణా, పోలీసు శాఖలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శిరస్త్రాణం తప్పనిసరిగా మారింది. 2024 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు శిరస్త్రాణం ధరించని 69583 చోదకుల లైసెన్సులను కూడా తాత్కాలికంగా రద్దు చేశారు. పట్టుబడిన ప్రతిసారీ రూ.వెయ్యి అంతకన్నా ఎక్కువ జరిమానా చెల్లించేకంటే ఒకసారి కొంటే సరిపోతుందనే భావన చోదకుల్లో వస్తోంది. దీంతో తక్కువ ధరకు వచ్చే నాసిరకం శిరస్త్రాణాలు కొనుగోలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల సమయాల్లో ఇవి ఏమాత్రం రక్షణగా నిలవడం లేదు. అందువల్ల నాణ్యమైన శిరస్త్రాణం ధరించాలని పోలీసులు చెబుతున్నారు.

ఎలాంటివి వినియోగించాలంటే..

★ భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్) రూపొందించిన బీఐఎస్ 4151:2015 శిరస్త్రాణాలు మాత్రమే పెట్టుకోవాలి. వీటి బరువు 1500 గ్రాములకు మించకూడదు. రోజువారీ వినియోగానికి ఫుల్‌ఫేస్, లోయర్‌ఫేస్ కవర్ ఉన్నవి వాడాలి. సరైనా పరిమాణం, బిగువైన చిన్ స్ట్రాప్ ఉండేలా చూసుకోవాలి.

★ శిరస్త్రాణం బయట కనిపించే కవచమే కాదు లోపల పొరలూ రక్షిస్తాయి. హెల్మెట్లోకి గాలి ప్రసరణ జరిగి, లోపల వేడి, చెమటను తగ్గించే సౌకర్యాలు వెంటిలేషన్ సిస్టమ్ ఉండే హెల్మెట్లను ఎంచుకోవాలి.

★ ఫైబర్ గ్లాస్, పాలీ కార్బొనేట్, కంపోజిట్ పదార్థాలతో చేసిన హెల్మెట్ బయటపొర మొదటి దెబ్బను స్వీకరించి, పదునైన వస్తువులు తలలోకి చొచ్చుకెళ్లకుండా అడ్డుకుంటుంది. బయట పొర తర్వాత ఉండే ఈపీఎస్ ప్రమాద సమయంలో మొదడుపై పడే దెబ్బ తీవ్రతను తగ్గిస్తోంది. ఈపీఎస్ మీద ఉండే మృదువైన పొరే కంఫర్ట్ ప్యాడింగ్. శిరస్త్రాణం తలపై కదలకుండా ఉండేలా చూస్తుంది. గాలి, దుమ్ము, వర్షం, పురుగులు నుంచి కళ్లను విజర్ రక్షిస్తోంది.

★ తక్కువ ధరకు వస్తుందనే ఆశతో నాసిరకం కొన్నా ఫలితం ఉండదు. ప్రమాణాలు ప్రకారం నాణ్యమైన శిరస్త్రాన్ని అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే మేలని అధికారులు చెబుతున్నారు.

కృష్ణాపురంలో గోపూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: కనుమ పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో శుక్రవారం గోపూజ సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న ఆలయ అర్చకులు, వేద పండితులు గోశాలలోని కపిల గోవుకు శోడషోపచార పూజలు చేశారు. ఈవో ఎన్.సుజాత పూజల్లో పాల్గొన్నారు. గోమాతకు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అర్చకులు హారతులిచ్చి ఆరాధించారు. ఈవో సుజాత గోవులకు ఇష్టమైన ఆహారాన్ని తినిపించారు. కార్యక్రమంలో ఏఈవో రమణమూర్తి, పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న గోశాలలో గోపూజ నిర్వహిస్తున్న ఈవో సుజాత, అధికారులు

పద్మనాభుడి గిరి ప్రదక్షిణ

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీఅనంత పద్మనాభస్వామి గిరి ప్రదక్షిణ గోవింద నామస్మరణతో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండ దిగువన ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి పద్మనాభం, ఇసకలపాలెం గ్రామాల మీదుగా తోడ్కొని వెళ్లి స్వామివారి పూల తోటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై కనుమపండుగ పురస్కరించుకుని ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరానికి చెందిన కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు అక్షయ, మోనిషా, నివేదిత, రోషిత, లక్ష్మిప్రియ, తనిష, షణ్ముఖశ్రీ, శాంతిశ్రీలు వారి హావభావాలతో శాస్త్రీయ, జానపద నృత్యాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. నృత్యాలకు సందీప్‌కుమార్ దర్శకత్వం వహించారు. చిన్నారులకు స్థానిక పరిపాలనాధికారి సి.రమేష్‌రెడ్డి ధ్రువపత్రాలను అందించి అభినందించారు.

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

●విశాఖ ఉత్తరం ●విశాఖ దక్షిణం

నార్వే అమ్మాయి.. విశాఖ అబ్బాయి..

కరాస, న్యూస్‌టుడే: ప్రేమకు ఎల్లలు ఉండవని నిరూపించారు ఈ జంట. పెళ్లితో వీరు ఒక్కటయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలి సమీపంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొట్టిపల్లి సైమన్ నార్వేలో ఉద్యోగం చేస్తున్నారు. అక్కడ బ్యాంకు ఉద్యోగిగా స్థిరపడ్డారు. నార్వేలోనే లాంగ్వేజ్ థెరపిస్ట్‌గా పనిచేస్తున్న తూరా అయూర అనే అమ్మాయితో ఆయనకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కొంతకాలం కలిసి ఉన్నాక కుటుంబ సభ్యులతో మాట్లాడి పెళ్లికి ఒప్పించారు. దీంతో శుక్రవారం విశాఖలో వీరి పెళ్లి జరిగింది. వీరిని అందరూ అభినందించారు.

వధూవరులతో పెద్దలు

కొండ చిలువ కలకలం

కరాస, న్యూస్‌టుడే : పండగపూట రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉండగా ఓ కొండచిలువ రోడ్డుదాటుతూ కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఎస్‌టీఎల్ 80 అడుగుల రోడ్డు మీద శుక్రవారం ఉదయం సుమారు పది అడుగులున్న కొండచిలువ స్థానికులకు కనిపించింది. భయంతో కరాసకు చెందిన త్రినాథ్‌కు సమాచారం ఇచ్చారు. అతను కొండచిలువను చాకచక్యంగా బంధించాడు. అటవీ శాఖ సిబ్బందికి అందజేస్తానని తెలిపాడు.

కొండచిలువను పట్టుకుంటున్న యువకుడు

రహదారులు అధ్వానం.. ఒళ్లంతా హూనం..

గురుద్వారా ప్రార్థనా మందిరం రహదారిలో గోతులు..

గురుద్వారా, న్యూస్‌టుడే

ఉత్తరం నియోజకవర్గం జీవీఎంసీ వార్డుల్లోని రహదారులకు మోక్షం కలగడం లేదు. అధ్వానంగా మారి ప్రయాణికుల ఒళ్లు హూనమయ్యే దుస్థితి నెలకొంటోంది. ఏళ్ల కాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనచోదకులకు అటుగా ప్రయాణాలు కత్తిమీద సాములా మారాయి. పాదచారులు సైతం నడవడానికి సంకోచించాల్సి వస్తోంది. ఓ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింటే మరోచోట దారంతా గోతులమయమై, ఇంకో చోట అంచులు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. నివాసాలు, జనసంచారం ఎక్కువగా ఉండే సీతమ్మధార నార్త్ఎక్స్‌టెన్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ మోర్ దుకాణం, గురుద్వారా ప్రార్థనా మందిరం పక్కన, బాలికల పాపాహోంకు వెళ్లే మార్గాలన్నీ ఇదే మాదిరిగా దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రహదారులు బాగుపడలేదని కూటమి ప్రభుత్వంలోనైనా రూపురేఖలు మారుతాయనే ఆశతో ఎదురుచూస్తున్నామని పరిసర కాలనీల ప్రజలు వాపోతున్నారు. అధికారులు మొక్కుబడి పర్యటనలు తప్ప పనులేమీ చేపట్టడం లేదని వారంతా ఆరోపిస్తున్నారు. దారుణమైన రహదారులకు మరమ్మతులు జరిపి ఈ కష్టాల నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

బాలయ్యశాస్త్రి లేఅవుట్ మోర్ దుకాణం మార్గంలో..

నడక మార్గంలో ఆక్రమణలు.. తప్పని అవస్థలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ పూర్ణామార్కెట్ నుంచి పాతపోస్టాఫీసు వరకు హెరిటేజ్ వాక్ పేరిట ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టనుంది. ఇందు కోసం జీవీఎంసీ రూ.47లక్షలు కేటాయించింది. మార్కెట్ నుంచి పోస్టాఫీసు వరకు రహదారికి ఒక వైపు ఆరు మీటర్ల మేర ప్రత్యేకంగా పెయింటింగ్ వేసి కేవలం నడవటానికే ఆ దారి వినియోగించనున్నారు. ఈ క్రమంలో వాహనాలు లోపలికి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటారు. ఈ ప్రాంతంలోని పురాతన కట్టడాలను సందర్శకులు నడుస్తూ వీక్షించేలా ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రస్తుతం ఈ మార్గంలో వాహనాలు వెళ్తుండగా, వర్తకులు కాలిబాట ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో సంబంధిత దుకాణాలకు వచ్చేవారు రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. హెరిటేజ్ వాక్ ప్రాజెక్టు వస్తే కొంత స్థలాన్ని అందుకోసం కేటాయించాల్సి ఉన్నందున ఆ మేరకు వ్యాపారులు రహదారిని మరింత ఆక్రమించే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో నడక మార్గాలను ఆక్రమించిన వారిని దశలవారీగా తొలగించి, కేవలం దుకాణాల్లోనే విక్రయాలు చేపట్టే విధంగా అవగాహన కల్పిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. లేకుంటే వ్యాపారులు నడక మార్గాన్ని ఆక్రమిస్తే.. పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితులు తప్పవు.

పూర్ణామార్కెట్ సమీప కాలిబాటపైనే వ్యాపారాలు

ఎన్టీఆర్ వర్ధంతి వార్డు స్థాయిలోనూ నిర్వహించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని ప్రతి వార్డులో నిర్వహించాలని, ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించాలని పార్టీ శ్రేణులను తెదేపా జిల్లా అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ ఒక ప్రకటనలో కోరారు. బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అలాగే పార్టీ కార్యాలయంలో నివాళి అర్పించనున్నామని, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: బాలయ్యశాస్త్రి లేఅవుట్ పోర్టు స్టేడియం వెనుక మార్గంలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీను

✓: చెత్తను తరలించేలా చూస్తాం. - క్రాంతి కుమార్, 14వ వార్డు పారిశుద్ధ్య అధికారి

మాధవధార, న్యూస్‌టుడే: ?: 50వ వార్డు మాధవధార పరిసర ప్రాంతాల్లో క్లాప్ వాహనాలు రాకపోవడంతో ఇళ్లల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. - పి.రాజు ✓: క్లాప్ కార్మికులకు సమాచారం ఇచ్చి చెత్త తరలించేలా చర్యలు తీసుకుంటాం. - బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ?: జగదాంబకూడలి వెంకటేశ్వర సినిమా హాల్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్నారు. అటుగా వెళ్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - రత్నమాల, స్థానిక మహిళ ✓: పరిశీలించి మందుబాబులపై చర్యలు తీసుకుంటాం. - యర్రన్నాయుడు, రెండో పట్టణ సీఐ

వైభవంగా ప్రసన్న వినాయక పరస

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: కాలనీలు, గ్రామాల్లో నిర్వహించే పరసలు సంస్కృతి, సంప్రదాయాలను వారధిగా ఉంటాయని వాటి విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత పేర్కొన్నారు. జీవీఎంసీ 55వ వార్డు జాషువానగర్‌లో గురువారం రాత్రి శ్రీప్రసన్న వినాయక పరసను వైభవంగా నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాషువానగర్ గ్రామ గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ గుమ్మడి అచ్చిబాబు, ఈ.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, నిర్వాహకులు

భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

భజన చెట్టు ఊరేగింపు ఉత్సవం

మాధవధార, న్యూస్‌టుడే: కనుమ పండుగను పురస్కరించుకుని మాధవధారలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో భజన చెట్టును వైభవంగా ఊరేగించారు. దీపాలు వెలిగించి, భక్తి పాటలు పాడుతూ, భజనలు చేస్తూ గ్రామమంతా తిరిగారు. సంక్రాంతి సందర్భంగా గ్రామంలో మేలుకొలుపు నిర్వహించి గ్రామస్థుల నుంచి నూనె, బియ్యాన్ని విరాళాలుగా సేకరించి రామాలయంలో స్వామివారికి పూజలు చేసి, ప్రసాద వితరణ చేశారు.

సందడిగా కనుమ.. గోవులకు పూజలు..

భూసమేతుడి సన్నిధిలో ఆవులకు పూజలు చేస్తున్న భక్తులు

మాధవధార, న్యూస్‌టుడే: కనుమ పండగ సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ 51వ వార్డు అప్పయ్యనగర్‌లో వెలిసిన శ్రీ భూసమేత విజయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గోకులంలోని కృష్ణుడి విగ్రహానికి అభిషేకాలు, ఆవులకు పూజలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో మకర సంక్రాంతి సందర్భంగా సాయినాథుడికి విశేష పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు జరిపి నూతన వస్త్ర అలంకరణ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సాయినాథుడికి హారతి సమర్పించారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: కప్పరాడ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పల్లె వాతావరణం తలపించేలా నమూనా సెట్టు వేశారు. కనుమ సందర్భంగా శుక్రవారం ఆలయ గోశాలలోని గోవులకు పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నరసింహనగర్ శివారు ప్రాంతంలోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో అర్చకులు సారిపాక సూర్యనారాయణశర్మ, వి.ఎస్.కుమార్ మంత్రోచ్ఛారణ నడుమ కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి అమ్మవారి దత్తత దేవాలయమైన అంబికా బాగ్‌లో గోవులకు పూజలు నిర్వహించారు. భక్తులు గోవుల చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజించారు. ఆలయ ఏఈఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా పూజలు జరిగాయి.

నరసింహనగర్ పంచాయతన దేవాలయంలో..

వైభవుడి సన్నిధిలో పల్లె నమూనా

బాబా విగ్రహానికి హారతి ఇస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అంబికాబాగ్‌లో గోవులకు పూజలు చేస్తున్న భక్తులు

స్పందనకు వందనం

సీసీ రోడ్డు నిర్మాణం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 36వ వార్డు ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న రహదారి శిథిలమై గోతులమయంగా మారిన వైనంపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి కొత్తగా సీసీ రోడ్డు వేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారి దర్శనాలకు పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నుంచి భారీ సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. క్యూలైన్లు మెయిన్‌రోడ్డును తాకాయి. దర్శనాల కోసం గంట నుంచి రెండు గంటల సేపు క్యూలైన్లలో భక్తులు వేచి చూడాల్సి వచ్చింది. అమ్మవారికి ప్రాతః సమయంలో పంచామృతాభిషేకం సేవ నిర్వహించారు. వెండినగలతో అమ్మవారిని అలంకరించారు.

వెండినగలతో కనకమ్మకు అలంకరణ

క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నిజాయతీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికులు

మధురవాడ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు రోడ్డుపై దొరికిన బంగారు నగలు బాధితులకు అప్పగించి తమ నిజాయతీని చాటుకున్నారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం గ్రామంలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అరుణ, రాము, డ్రైవర్ ప్రసాద్ భోగి రోజు బుధవారం విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో గ్రామంలో రోడ్డుపై రూ.5 లక్షల విలువైన సుమారు 4.5 తులాల రెండు బంగారు నక్లెస్‌లు దొరికాయి. విషయాన్ని సూపర్‌వైజర్ అప్పలరాజు, 7వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోష్‌కుమార్‌లకు తెలియజేశారు. వీరంతా కలిసి బంగారు నగలు పోగొట్టుకున్న బాధితుల గురించి గ్రామంలో ఆరా తీశారు. మల్లయ్యపాలెంలోని రాజగోపాల్ రెసిడెన్సీ వాసులైన కె.రామచంద్రరావు, సౌమ్య దంపతులకు చెందినవిగా తెలుసుకున్నారు. గురువారం ఉదయం రెండు నక్లెస్‌లను పారిశుద్ధ్య విభాగం అధికారుల సమక్షంలో బాధితులకు అప్పగించారు. దీంతో నిజాయతీ చాటుకున్న ముగ్గురు కార్మికులను పలువురు అభినందించారు.

దొరికిన నగలను బాధితులకు అందిస్తున్న పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ సంతోష్ తదితరులు

భాజపా విజయోత్సవ ర్యాలీ

అక్కయ్యపాలెం(దొండపర్తి), న్యూస్‌టుడే: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా సారథ్యంలోని 'మహాయుతి' కూటమి అత్యధిక స్థానాల్లో గెలవడంతో భాజపా శ్రేణులు విశాఖ నగరంలో శుక్రవారం సంబరాలు జరుపుకొన్నారు. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ, సంబరాలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భాజపా ఇన్‌ఛార్జి ఎస్.వి.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కారాల మహేష్, వార్డు అధ్యక్షుడు సతపతి ఈశ్వరరావు, 42వ వార్డు అధ్యక్షుడు గురుగోవింద్, సుధాకర్‌రెడ్డి, బి.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో పాల్గొన్న భాజపా నాయకులు

పద్మనాభుడి గిరి ప్రదక్షిణ

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువైన అనంత పద్మనాభస్వామి గిరి ప్రదక్షిణ శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండ దిగువున ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకిలో పద్మనాభం, ఇసకలపాలెం గ్రామాల మీదుగా ఊరేగించి స్వామివారి పూల తోటలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి స్వామివారి ఊరేగింపు గోస్తనీ నదీ తీరం వెంబడి అర్చకునిపాలెం చేరుకొని స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వద్దనున్న ఉయ్యాల మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మనాభం కూడలి మీదుగా తిరిగి ఆలయానికి చేరుకోవడంతో స్వామివారి గిరి ప్రదక్షిణ పూర్తయింది. అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొని విజయవంతం చేశారు.

స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

గజ వాహనంపై వరదరాజ స్వామి వైభవం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: మకర వేట ఉత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి అడివివరం గ్రామంలో సింహాద్రి అప్పన్న స్వామి గ్రామ తిరువీధి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పూలతోటలో ఉత్సవం ముగిసిన అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం దరి ఉద్యాన మండపంలో కొలువుదీర్చారు. విరామం అనంతరం స్వామిని గజ వాహనంపై అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాల, వేద పారాయణల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి తిరువీధి వేడుకగా నిర్వహించారు. గ్రామస్థులు వీధుల్లో రంగవల్లికలతో స్వామికి స్వాగతం పలికారు. పండ్లు, ఫలహారాలు సమర్పించి భక్తి చాటుకున్నారు. తిరువీధి అనంతరం స్వామివారు మెట్లమార్గం గుండా తిరిగి సింహగిరికి చేరుకున్నారు. అర్చకులు పవళింపు సేవ నిర్వహించి ఆలయ ద్వారాలు మూసివేశారు.

గజవాహనంపై అప్పన్న స్వామి

బోసిపోయిన రహదారులు

మాధవధార, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగకు నగర వాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో రహదారులు బోసిపోయాయి. నిత్యం వాహనాల రద్దీతో, రణగొణ ధ్వనులతో కిక్కిరిసిన రోడ్లు శుక్రవారం జనసంచారం లేక వెలవెలబోయాయి. మాధవధార, మురళీనగర్, మర్రిపాలెం కాలనీలో ప్రధాన రహదారులతో పాటు, జాతీయ రహదారి బిర్లా కూడలి నుంచి ఎన్ఏడీ వరకు, మర్రిపాలెం బీఆర్టీఎస్ ఖాళీగా దర్శనమిచ్చాయి. చాలా చోట్ల దుకాణాలు తెరవకపోవడంతో సందడి లేక రోడ్లు బోసిపోయాయి.

నిర్మానుష్యంగా మారిన మాధవధార వుడాకాలనీ ప్రధాన రహదారి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నిత్యం జనంతో కిటకిటలాడే దక్షిణ నియోజకవర్గంలో పలు కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి నేపథ్యంలో ప్రజలు స్వస్థలాలకు వెళ్లడంతో దారులన్నీ బోసిపోయాయి. జగదాంబ, సూర్యబాగ్, టౌన్ కొత్తరోడ్డు, కలెక్టర్ కార్యాలయం, కురుపాం మార్కెట్, వైజాగ్ చేపలరేవు ప్రాంతాల్లో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి.

జగదాంబకూడలిలో..

సూర్యబాగ్ ప్రాంతంలో..

జాతీయస్థాయి జలక్రీడల్లో పతకాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో సాధన చేసిన జలక్రీడాకారిణి ఎన్.గాయత్రి జాతీయ స్థాయిలో పతకాలు సాధించినట్లు కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీకేఏపీ) అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోని జిల్లాలోని సహస్రధార, మహేశ్వర్ ఘాట్‌లలోఈనెల 12 నుంచి 15 తేదీ వరకు జరిగిన 13వ నేషనల్ కెనాయి స్లాలోమ్ ఛాంపియన్ షిప్-2026, మూడో నేషనల్ కయాక్ క్రాస్ ఛాంపియన్ షిప్-2026లో తృతీయ స్థానాల్లో నిలిచి రజత పతకాలు సాధించిందన్నారు.

ఎన్.గాయత్రి

నిత్యావసరాల పంపిణీ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా వార్డులోని మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని మహిళలకు స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ నేతృత్వంలో స్థానికులు పుల్లేటికుర్తి రామకృష్ణ, దొడ్డి రాజు, యెదురుపాకల బాబీ సంయుక్త ఆధ్వర్యంలో పంచదార, కందిపప్పు, బెల్లం, ఇతర వస్తువులు అందజేశారు.

18 నుంచి అమ్మవారి పరస

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 36వ వార్డు చెంగళరావుపేట బజార్‌లో కొలువైన పోలమాంబ అమ్మవారి పరస ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి పరసకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

పండుగ వేళ పడకేసిన పారిశుద్ధ్యం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నా అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. జీవీఎంసీ 42, 55వ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. తాటిచెట్లపాలెం, గ్యాస్ గొడౌన్ ఏరియా, 80 అడుగుల రోడ్డు, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీలు, గెడ్డలు పూడికలతో నిండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఎప్పటికప్పుడు తొలగించకుండా రోజుల తరబడి ఉంచేస్తుండడంతో భారీ ఎత్తున వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రైల్వేన్యూకాలనీ ప్రాంతాల్లో కొన్నిచోట్ల చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు మీదే వ్యర్థాలు పారబోస్తున్నారు. సంక్రాంతి పండుగ కావడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఇళ్ల మధ్యలోని డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. 42, 55వ వార్డులు సరిహద్దున ఉండటంతో సమస్యలపై ఏ వార్డు అధికారులకు ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని ఆయా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాటిచెట్లపాలెం రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

రైల్వేన్యూకాలనీ ప్రాంతంలోని డ్రైనేజీలో నిలిచిన మురుగు

మీ శిరస్త్రాణం.. నాణ్యమైనదేనా..?

మాధవధార, న్యూస్‌టుడే

శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానాతో పాటు మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేస్తామని రవాణా, పోలీసు శాఖలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శిరస్త్రాణం తప్పనిసరిగా మారింది. 2024 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు శిరస్త్రాణం ధరించని 69583 చోదకుల లైసెన్సులను కూడా తాత్కాలికంగా రద్దు చేశారు. పట్టుబడిన ప్రతిసారీ రూ.వెయ్యి అంతకన్నా ఎక్కువ జరిమానా చెల్లించేకంటే ఒకసారి కొంటే సరిపోతుందనే భావన చోదకుల్లో వస్తోంది. దీంతో తక్కువ ధరకు వచ్చే నాసిరకం శిరస్త్రాణాలు కొనుగోలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల సమయాల్లో ఇవి ఏమాత్రం రక్షణగా నిలవడం లేదు. అందువల్ల నాణ్యమైన శిరస్త్రాణం ధరించాలని పోలీసులు చెబుతున్నారు.

ఎలాంటివి వినియోగించాలంటే..

★ భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్) రూపొందించిన బీఐఎస్ 4151:2015 శిరస్త్రాణాలు మాత్రమే పెట్టుకోవాలి. వీటి బరువు 1500 గ్రాములకు మించకూడదు. రోజువారీ వినియోగానికి ఫుల్‌ఫేస్, లోయర్‌ఫేస్ కవర్ ఉన్నవి వాడాలి. సరైనా పరిమాణం, బిగువైన చిన్ స్ట్రాప్ ఉండేలా చూసుకోవాలి.

★ శిరస్త్రాణం బయట కనిపించే కవచమే కాదు లోపల పొరలూ రక్షిస్తాయి. హెల్మెట్లోకి గాలి ప్రసరణ జరిగి, లోపల వేడి, చెమటను తగ్గించే సౌకర్యాలు వెంటిలేషన్ సిస్టమ్ ఉండే హెల్మెట్లను ఎంచుకోవాలి.

★ ఫైబర్ గ్లాస్, పాలీ కార్బొనేట్, కంపోజిట్ పదార్థాలతో చేసిన హెల్మెట్ బయట పొర మొదటి దెబ్బను స్వీకరించి, పదునైన వస్తువులు తలలోకి చొచ్చుకెళ్లకుండా అడ్డుకుంటుంది. బయట పొర తర్వాత ఉండే ఈపీఎస్ ప్రమాద సమయంలో మొదడుపై పడే దెబ్బ తీవ్రతను తగ్గిస్తోంది. ఈపీఎస్ మీద ఉండే మృదువైన పొరే కంఫర్ట్ ప్యాడింగ్. శిరస్త్రాణం తలపై కదలకుండా ఉండేలా చూస్తుంది. గాలి, దుమ్ము, వర్షం, పురుగులు నుంచి కళ్లను విజర్ రక్షిస్తోంది.

★ తక్కువ ధరకు వస్తుందనే ఆశతో నాసిరకం కొన్నా ఫలితం ఉండదు. ప్రమాణాలు ప్రకారం నాణ్యమైన శిరస్త్రాన్ని అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే మేలని అధికారులు చెబుతున్నారు.

98వ జయంతి



శ్రీ బి. ధర్మారావు
ప్రముఖ కార్మిక నాయకులు
17-01-1928 - 12-09-1987

శ్రీ భీమనాథం ధర్మారావు గారి 98వ జయంతి కార్యక్రమం 17-01-26 శనివారం ఉదయం గం॥ 10-00 లకు ధర్మశక్తి నగర్, ఎం.వి.పి. కోలనిలోనూ, గం॥ 11-00 లకు యూనియన్ ఆఫీస్ లోనూ దివంగత నేతకు నివాళి అర్పించుటకు పోర్టు కార్మికులు, ధర్మశక్తి నగర్ వాస్తవ్యులు పాల్గొన గోరుచున్నాము.

పోర్టు ఎంప్లాయీస్ యూనియన్

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

కొండచిలువ కలకలం

కొండచిలువను పట్టుకుంటున్న యువకుడు

కరాస, న్యూస్‌టుడే : పండగపూట రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉండగా ఓ కొండచిలువ రోడ్డుదాటుతూ కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఎస్టీఎల్ 80 అడుగుల రోడ్డు మీద శుక్రవారం ఉదయం సుమారు పది అడుగులున్న కొండ చిలువ స్థానికులకు కనిపించింది. భయంతో కరాసకు చెందిన త్రినాథ్‌కు సమాచారం ఇచ్చారు. అతను కొండచిలువను చాకచక్యంగా బంధించాడు. అటవీ శాఖ సిబ్బందికి అందజేస్తానని తెలిపాడు.

వైష్ణవి గార్డెన్స్‌లో కుక్కల బెడద

ఎస్టీబీఎల్ వైష్ణవి గార్డెన్స్‌లో కుక్కల తిష్ఠ

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డు వైష్ణవి గార్డెన్స్‌లో కుక్కలు గుంపులు నివాసితులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా రాకపోకలు సాగిస్తే వెంటపడి తరుముతుండడంతో కాలనీవాసులు వణికిపోతున్నారు. రాత్రి వేళల్లో కుక్కల అరుపులతో ప్రశాంతత లోపిస్తోందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీ సంఘం ప్రతినిధులు వాపోతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే :

?: గాజువాక 65వ వార్డు కొండప్రాంతాల్లో కుళాయి నీరు సరిగా రావడం లేదు. ఎప్పుడు కుళాయిలు విప్పుతారో తెలియడం లేదు. – మంగరాజు, భానోజీతోట, – సత్యం, బీసీరోడ్డు ✔: సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చాం. –కేదార్‌నాథ్, ఏఈ.

?: సీతానగరం పాఠశాల రోడ్డులో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది.– సింహాద్రి, 75వ వార్డు ✔: సిబ్బందితో నిర్మూలన చర్యలు తీసుకుంటాం. –కిరణ్‌కుమార్, ఏఎంఒహెచ్.

రోడ్డు 'రింగు'న పడింది..!

రూ.18 కోట్లతో ఇన్నర్ రింగు రోడ్డుకు కదలిక

గాజువాకకు న్యూస్‌టుడే

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక పట్టణానికే తలమానికంగా త్వరలోనే ఇన్నర్ రింగురోడ్డు రాబోతోంది. పట్టణీకరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న రహదారులను విస్తరించి ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దడానికి మహావిశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) చర్యలు చేపట్టింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి తొలి దశలో సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వచ్చే ఏడాది నాటికి రింగురోడ్డు కల సాకారం కాబోతోంది. దీనివల్ల గాజువాక ట్రాఫిక్ సమస్య తీరనుంది.

గాజువాకలో ట్రాఫిక్ రద్దీ

విస్తరించనున్న పోర్టు వై.జంక్షన్‌కు వెళ్లే మార్గం

ఏమి చేస్తారంటే... ● గాజువాక కూడలిని కలుపుకొని ఇన్నర్ రింగ్ రోడ్డును తీర్చిదిద్దనున్నారు. కొత్తగాజువాక కూడలి నుంచి వంటిల్లు, అలాగే జగ్గుసెంటర్ నుంచి పోర్టు వై.జంక్షన్, గంగవరం పోర్టు ఎంట్రన్స్ నుంచి బీసీరోడ్డు కూడలిని కలుపుతూ 9 కిలోమీటర్ల పొడవైన రహదారిని పునరుద్ధరిస్తారు. ప్రస్తుతం ఈ రహదారి 40, 60అడుగుల వెడల్పుతో ఉంది. దీన్ని అక్కడి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విస్తరించాలని నిర్ణయించారు. ఇదే మార్గంలో పోర్టు 2.3 కిమీ దారిలో ఇరువైపులా సేవా మార్గాలు అందుబాటులోకి తేనున్నారు.

● ఇవే కాకుండా జీవీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి కణితిరోడ్డు అభివృద్ధికి రూ.13.65 కోట్లు, సమతానగర్ జంక్షన్ నుంచి దల్లివానిపాలెం కూడలికి రూ.2.01 కోట్లు, గొంతెనవానిపాలెం స్టేడియం నుంచి కణితిరోడ్డు కనెక్టివ్‌కు రూ.1.02 కోట్లు, గంగవరం బీచ్ కనెక్టివిటీ రోడ్డుకు 1.03 కోట్లు కేటాయించారు. ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పెదగంట్యాడ రహదారి విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులు పూర్తయితే మరిన్ని అనుబంధ పరిశ్రమలు, లాజిస్టిక్స్, కొత్త ఇండస్ట్రియల్ కారిడార్లు, శాటిలైట్ టౌన్ల అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని జీవీఎంసీ అధికారులు భావిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

గాజువాక ఎదుగుదలకు ఆటంకంగా నిలిచిన రహదారుల విస్తరణ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇన్నర్ రింగ్ రోడ్డు రాకతో సరికొత్త అభివృద్ధిని చూడబోతున్నాం. గత వైకాపా పాలనలో ముందు చూపులేని ఫలితంగా అభివృద్ధి కుంటుపడింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారుల విస్తరణకు పెద్ద పీట వేశాం.

–పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గాజువాక

భారీ క్రేను... రోడ్డు ఆక్రమించేను..

సేవా రహదారిపై నిలిపిన భారీ క్రేన్

న్యూస్‌టుడే, సింధియా: పారిశ్రామిక ప్రాంతం ఐవోసీ కూడలి సమీపాన సేవా రహదారిపై భారీ క్రేను ఒకటి రోజుల తరబడి నిలిచి ఉంది. నిత్యం మల్కాపురం స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే తవ్వకాలతో ఇరుకుగా మారిన సేవా దారి కాస్త ఇలాంటి భారీ వాహనాలతో మరింత ఇరుకుగా మారింది.

రాఘవాచార్యులకు పురస్కారం అందజేత

అద్దంకి రాఘవాచార్యులకు పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ హౌసింగ్‌బోర్డుకాలనీ అభయాంజనేయ ఆలయ ప్రతినిధి, ప్రముఖ ప్రవచనకారులు అద్దంకి రాఘవాచార్యులకు తిరుప్పావై వాక్ఝురి పురస్కారం వరించింది. హైదరాబాద్ కొండాపూర్‌లోని సీతా రామాంజనేయ ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలతో అలరించినందుకు గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్ ఎస్.వాసుదేవరావు, కార్యదర్శి సీహెచ్ విజయ రాఘవాచార్యులు, మేనేజర్ శర్మ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు.

సేవలతో సంతృప్తి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : మనకి ఉన్న దాంట్లో కొంత బీదవారికి, అవసరమైన వారికి సాయం అందించడంలో ఎంతో తృప్తి కల్గుతుందని జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో డాక్టర్ అనుపోజు శ్రీనివాసరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామంలో పేదలకు ఉచితంగా వస్త్రాలు పంపిణీ చేపట్టారు. గోవిందరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గ్రామపెద్దలు నావన సింహాచలం, దాత శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వందేభారత్‌కు దువ్వాడలో హాల్టు కల్పించాలి

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: విశాఖ - సికింద్రాబాద్ వందేభారత్ రైలు దువ్వాడలో హాల్టు కల్పించాలని జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కంచుమర్తి ఈశ్వర్ వాల్తేరు సీనియర్ డీసీఎం పవన్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఏకే మహరాణాలను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు కొత్తగా వందేభారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తెచ్చేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి ప్రాంతాలకు పలు ప్రత్యేక రైళ్లు నడపడం అభినందనీయమన్నారు.

డీసీఎం పవన్‌కుమార్‌కు వినతిపత్రం అంద జేస్తున్న జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు ఈశ్వర్

మట్టి గుట్టలు... ఎన్నాళ్లీ తిప్పలు..!

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇంట్లోంచి బయటకు రావాలంటే మట్టి దిబ్బలు, రాళ్ల గుట్టలు ఉక్కు నిర్వాసితకాలనీవాసులకు నరకం చూపిస్తున్నాయి. గతనెల రెండోవారంలో నెల్లిముక్కు, దుర్గవానిపాలెం, సీతానగరం మీదుగా బాలచెరువు వెళ్లేంత వరకూ కాలువలపై కట్టడాలను తొలగించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా వ్యర్థాలను తొలగించకుండా వదిలేయడంతో నివాసితులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

✦ ఇటీవల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో జేసీబీ సాయంతో అక్కడక్కడ కొంతమేర వ్యర్థాలను తీసి చేతులు కడిగేసుకున్నారు. నేటికీ పరిస్థితి మెరుగుపడలేదు. సిమెంటు పలకలు, షెడ్లు, మెట్ల మార్గాలు, ప్రహరీలను కూల్చిన వ్యర్థాలు ఇళ్ల ముందర గుట్టలుగా ఉండడంతో బితుకు బితుకుమంటున్నారు. కూల్చివేతల సమయంలోనే టిప్పర్లను రంగంలోకి దింపి డెబ్రీస్, ఇతర వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం, ప్రజారోగ్య విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపం నివాసితులకు శాపంగా మారింది. ఇకనైనా వ్యర్థాలను తరలించాలని కోరుతున్నారు.

నెల్లిముక్కులో ఇళ్లముందు వ్యర్థాలు

ఘనంగా మాధవస్వామి ఉత్సవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : కనుమ పండగను పురస్కరించుకుని పాత గంగవరం కొండపై మాధవస్వామి, మహాలక్ష్మి, సత్యభామ అమ్మవార్ల తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై ఉత్సవ మూర్తులను దర్శించుకుని అక్కడ సత్యభామ రాయికి మొక్కులు చెల్లించుకున్నారు.

అలంకరణలో మాధవస్వామి, మహాలక్ష్మి అమ్మవారు

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు

వుడాకాలనీ (గాజువాక), న్యూస్‌టుడే : ధనుర్మాస ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం వుడాకాలనీ మామిడితోట ప్రసన్న వేంకటేశ్వర స్వామి, వాంబేకాలనీ వైకుంఠ వేంకటేశ్వరస్వామి, హౌసింగ్‌బోర్డు శ్రీవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు ఆఖరు రోజు సామూహిక అర్చనలు, సహస్రనామావళి, పూర్ణాహుతిని సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారికి పూజలు నిర్వహిస్తూ..

భక్తిశ్రద్ధలతో గోపూజ

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే: కనుమ పండగను పురస్కరించుకొని షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గోపూజలు ఘనంగా నిర్వహించారు. బాలాజీకి పూజలు చేసిన అనంతరం గోశాలలు గోవులకు పూజలు చేపట్టి ఆలయ ప్రాంగణంలోకి రెండు గోవులను తీసుకొచ్చి వాటికి సుందరంగా అలంకరణ చేసి అర్చకులు గోపూజ చేపట్టారు. భక్తులు పూజలు చేశారు. గోపూజ విశిష్టతను భక్తులకు అర్చకులు తెలియజేశారు.

గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

శ్రీరామభజన ఉత్సవం

కరాస, న్యూస్‌టుడే : కనుమ పండగ సందర్భంగా శుక్రవారం కొత్తపాలెం శ్రీగౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామభజన ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో శ్రీసీతారాముల వారిని ఊరేగింపుగా ప్రతి ఇంటికి తిప్పి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి చెంతన భక్తులంతా తమ మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తాతబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు రాజు, రమేష్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాములవారి భజనోత్సవంలో పాల్గొన్న గౌరీసేవా సంఘం సభ్యులు

దయాల్‌రెడ్డి జీవితం ఆదర్శనీయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నిస్వార్థ నాయకుడిగా, మూడు దశాబ్దాలపాటు పెదగంట్యాడ సర్పంచిగా విశేష సేవలందించిన తిప్పల దయాల్‌రెడ్డి జీవితం అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం పెదగంట్యాడ కూడలిలో దయాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి, నాయకులు తిప్పల అప్పలస్వామి, రమణారెడ్డి, నితీశ్‌రెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, డిప్యూటీ మేయర్, పలువురు కార్పొరేటర్లు

నార్వే అమ్మాయి.. విశాఖ అబ్బాయి..

కరాస, న్యూస్‌టుడే : ప్రేమకు ఎల్లలు ఉండవని నిరూపించారు ఈ జంట. పెళ్లితో వీరు ఒక్కటయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలి సమీపంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొట్టిపల్లి సైమన్ నార్వేలో ఉద్యోగం చేస్తున్నారు. అక్కడ బ్యాంకు ఉద్యోగిగా స్థిరపడ్డారు. నార్వేలోనే లాంగ్వేజ్ థెరపిస్ట్‌గా పనిచేస్తున్న తూరా అయూర అనే అమ్మాయితో ఆయనకు పరిచయమై ప్రేమగా మారింది. కొంతకాలం కలిసి ఉన్నాక కుటుంబ సభ్యులతో మాట్లాడి పెళ్లికి ఒప్పించారు. దీంతో శుక్రవారం విశాఖలో వీరి పెళ్లి జరిగింది. వీరిని అందరూ అభినందించారు.

వధూవరులు

నిజాయతీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికులు

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం గ్రామంలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అరుణ, రాము, డ్రైవర్ ప్రసాద్‌లు భోగి రోజు బుధవారం విధుల్లో ఉండగా రోడ్డుపై సుమారు 4.5 తులాల రెండు బంగారు నక్లెస్‌లు దొరికాయి. విషయాన్ని పై సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వీరు నగలు పోగొట్టుకున్న బాధితుల గురించి గ్రామంలో ఆరా తీశారు. మల్లయ్యపాలెంలోని రాజగోపాల్ రెసిడెన్సీ వాసులైన కె.రామచంద్రరావు, సౌమ్య దంపతులకు చెందినవిగా తెలుసుకున్నారు. గురువారం ఉదయం రెండు నక్లెస్‌లను పారిశుద్ధ్య విభాగం అధికారుల సమక్షంలో బాధితులకు అప్పగించారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

సంబరాల్లో పాల్గొన్న కోరమాండల్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ అధిపతి నారాయణ

సింధియా(శ్రీహరిపురం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం దరి కోరమాండల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంస్థ ఆవరణలో పొంగలి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంబరాల్లో ఉద్యోగుల పిల్లలతో కోలాటం ప్రదర్శించారు. ఈ సంబరాల్లో సంస్థ ప్రెసిడెంట్ సీహెచ్.శ్రీనివాసరావు, మానవ వనరుల విభాగం అధిపతి కేవీవీవైఎస్ నారాయణ, శ్రీకాంత్, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి శాంతినగర్‌కాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఇ.కె.చారి గృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గత 25 ఏళ్లుగా క్రమంతప్పకుండా ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలను ఒకేచోట ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరికి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బొమ్మల కొలువు వద్ద ఇ.కె.చారి దంపతులు

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అయ్యప్పను, మెట్లను సుందరంగా పూలతో, దీపాలతో అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షల విశిష్టత, జ్యోతి దర్శనం ప్రత్యేకతను అర్చకులు భక్తులకు తెలియజేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆలయ కమిటీ వారు ప్రత్యేకంగా పూలతో, దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

← ప్రత్యేక దీపాలంకరణలో అయ్యప్పస్వామి

విజేతలకు బహుమతుల అందజేత

విజేతలకు బహుమతులు అందిస్తున్న కోరాడ శ్రీనివాసరావు

సింధియా, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా కళింగ వైశ్యుల మహిళలకు ప్రాంతీయంగా నిర్వహించిన ముగ్గులు, మ్యూజికల్ ఛైర్ పోటీల్లో విజేతలకు ఈనెల 15న రాష్ట్ర కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కోరాడ శ్రీనివాసరావు అధ్యక్షతన బహుమతులను అందజేశారు. కార్పొరేషన్ ద్వారా కళింగ వైశ్య కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించేలా కృషిచేస్తానని భరోసా ఇచ్చారు.

అక్కడ తీసి.. ఇక్కడ పోసి..

గాజువాక, న్యూస్‌టుడే : భూగర్భ పైపులైన్లు, గెడ్డలు, విద్యుత్తు పనుల కారణంగా ఎక్కడికక్కడ రోడ్లను తవ్వేసి ఆ మట్టిని బీసీరోడ్డులో గుట్టలుగా పోగులు పెడుతున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించేవారంతా అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బీసీరోడ్డు సంజీవకాలనీ, వికాస్‌నగర్ మార్గంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. రాత్రి వేళ గుట్టుగా టిప్పర్లతో తెచ్చి పడేస్తున్నా జీవీఎంసీ అధికారులు ఇటు కన్నెత్తయినా చూడడం లేదు. ఇలాగే ఊరుకుంటే మార్గం డంపింగ్ యార్డుగా తయారవుతోందని, ఇకనైనా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బీసీరోడ్డులో మట్టి గుట్టలు

బోసిపోయిన రహదారులు

ఏకేసీకాలనీ కూడలి సమీపంలో..

ఖాళీగా గాజువాక కూడలి

గాజువాక, మల్కాపురం, న్యూస్‌టుడే : సంక్రాంతి పండగ వచ్చిందంటే పట్టణం పల్లెబాట పడుతోంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్లు బోసిపోయి కనిపించాయి. పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కువగా ఇతర ప్రాంతాలకు చెందిన వారే ఉంటారు. పండగకు సొంతూర్లు వెళ్లిపోవడంతో రోడ్ల మీద జన సంచారమే లేదు.

* గాజువాకలోనూ ఇదే పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి పాతగాజువాక కూడలి, షీలానగర్ నుంచి కూర్మన్నపాలెం వెళ్లేంతవరకూ ఉన్న జాతీయ రహదారిలో సందడి తగ్గింది.

కేవీలో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. క్రీడోత్సవాల్లో పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, ఫన్‌ఈవెంట్స్, క్రోకోడైల్ రేస్, డాడ్జ్ బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆరుగురు విద్యార్థులు రీజనల్ పోటీల్లో పాల్గొని 16 పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, కోచ్ ధనలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన శివాజీ హౌస్ జట్టు

భక్తిశ్రద్ధలతో కోదండ రాముని పరస

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు మిండి కోదండ రాముని పరస గురు, శుక్రవారాలు ఘనంగా జరిగింది. కోదండ రామున్ని సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మిండి, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్‌కాలనీ వాసులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస జరిగింది. మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీశ్ దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి, గ్రామంలో పలు వీధులకు విద్యుత్తు దీపాలంకరణ చేశారు.

పరసలో సందడి

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద ఈనెల 22న కాకి అప్పన్న పరస జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిర్వాహక ప్రతినిధి కాకి పోలిరెడ్డి అధ్యక్షతన గోడ పత్రికలను విడుదల చేశారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోనే తొలి పరసగా ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. రమణారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరస గోడపత్రికలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

వస్త్ర ప్రదర్శన సద్వినియోగం చేసుకోవాలి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత హస్తకళలను ప్రోత్సహిస్తున్న ఉక్కునగర వాసులకు ధన్యవాదాలు అని చేనేత హస్తకళల సేవా సంఘం ప్రతినిధి హరీష్ అన్నారు. ఈనెల 18 వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. ఉక్కునగరం సెక్టారు-5లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ఈ ప్రదర్శనను ఉక్కునగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి
మాకు దైవ సమానులు, మార్గదర్శకులు
శ్రీ డా॥ S.V. నారాయణరావు గారు స్వర్గస్తులైనందుకు
చింతిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ....
కీ॥శే॥ డా॥ S.V.నారాయణరావు గారు
వ్యవస్థాపకులు: జానకి నర్సింగ్ హోమ్ చట్టివానిపాలెం, గాజువాక
జననం: 07-09-1947 మరణం: 06-01-2026
శ్రీమతి & శ్రీ M. శివకుమార్ - గాయిత్రి
M. రుద్రస్వరూప్, M. సహస్ర
SRI SHIVA CLINICAL LAB
అక్కిరెడ్డిపాలెం, గాజువాక. ✆ 9949600575

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

తూర్పు కాపు/గాజుల కాపు అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, తూర్పు కాపు/ గాజుల కాపు అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఈనాడు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026 శనివారం), రేపు (18 జనవరి 2026 ఆదివారం)ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్ ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80086 21414ను సంప్రదించవచ్చు. ఫోన్/ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నవారు వధూవరుల బయో డేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

రావమ్మా.. గోమాత

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: కనుమ సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. గోవుకు ప్రత్యేకంగా పసుపు, కుంకుమ పూసి పూజలు చేశారు. ఏటా కనుమ రోజున గోపూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని అర్చకస్వాములు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మీ సామగ్రి.. మా బాధ్యత

ప్రయాణికులకు అండగా రైల్వేశాఖ

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

బ్రహ్మపురకు చెందిన ఓ యువకుడు ముఖాముఖి కోసం హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బంధువుల ఇంటికని విజయనగరంలో రైలు దిగాడు. తొందరలో విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు విలువైన వస్తువులు మరిచిపోయాడు. అప్రమత్తమయ్యేసరికే బండి కదిలిపోవడంతో రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు వివరాలు పరిశీలించి, కొన్ని గంటల్లోనే అందించారు.

విజయవాడ వెళ్లేందుకు ఓ కుటుంబం విజయనగరం స్టేషన్‌కు వచ్చింది. రైలు ఎక్కే హడావుడిలో ఓ బ్యాగు వదిలేశారు. కొంతదూరం వెళ్లాక 139కు కాల్ చేసి విషయం చెప్పారు. హెల్ప్‌లైన్ సిబ్బంది సమాచారంతో సిబ్బంది బ్యాగును తీసుకుని విశాఖ పంపించి, అక్కడ అందేలా చూశారు.

నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో సామగ్రి, బ్యాగులు, విలువైన వస్తువులు మరిచిపోతుంటారు. కొందరు రైలెక్కాక మరి దొరకదేమోనన్న ఆలోచనతో వదిలేస్తున్నారు. మరికొందరు కంగారులో బండి దిగి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆ పరిస్థితి లేకుండా తామే తీసుకొచ్చి అందిస్తామని చెబుతోంది రైల్వే శాఖ. మీ సామగ్రి.. మీ బాధ్యత.. అని కాకుండా.. మీ సామగ్రి బాధ్యత మాదే అని పేర్కొంటోంది.

మర్చిపోతే ఏం చేయాలి..

రైలు.. స్టేషన్లలో లగేజీ, విలువైన వస్తువులు మర్చిపోతే సమీపంలోని జీఆర్పీ లేదా ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేయాలి. వారు స్పందించకపోతే ఉన్నతాధికారులకు చెప్పొచ్చు. రైలులో ప్రయాణిస్తుంటే 139ను సంప్రదించవచ్చు. వివరాల ఆధారంగా సకాలంలో వస్తువులు చేరేలా చూస్తారు.

మర్చిపోయిన వస్తువులు ప్రయాణికుడికి అందిస్తున్న ఆర్పీఎఫ్ అధికారి

వీడియో కాల్..

139ను సంప్రదిస్తే నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. పేరు, చరవాణి నంబరు, రైలు పేరు, బెర్తు సంఖ్య తదితర వివరాలు చెప్పాలి. వారు ప్రయాణికుల సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తెలియజేస్తారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగి వస్తువులను గుర్తిస్తారు. సరిపోల్చడానికి వీలుగా వీడియో కాల్ చేస్తారు.

అప్రమత్తత అవసరం..

రైలు ప్రయాణాల్లో చాలామంది చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలను మరిచిపోతుంటారు. కొందరు బ్యాగులను వదిలేస్తారు. అప్రమత్తంగా ఉంటే ఆ పరిస్థితి ఉండదు. ఒకవేళ పొరపాటున వదిలేసినా మేం అండగా ఉంటున్నాం. గతేడాది జనవరి నుంచి ఈనెల 13 వరకు 139 మంది ప్రయాణికులు ఇలా వస్తువులు పోగొట్టుకున్నారు. రూ.28.34 లక్షల విలువైనవి తిరిగి అందించాం.

– ఆర్కే రావు, రైల్వే ఇన్‌స్పెక్టర్

సహపంక్తి భోజనాలు చేస్తున్న కుటుంబాలు

ఆనందం.. బ్రహ్మానందం

అక్క.. తమ్ముడు.. అన్నయ్య.. మావయ్య.. అత్తయ్య.. అమ్మ.. చిన్నాన్న.. పెదనాన్న.. ఇలా అందరూ కళ్లముందు ఒకేసారి కనిపిస్తే.. వాళ్లందరితో కలిసి కబుర్లు చెబుతూ విందు ఆరగిస్తే.. ఆ ఫీలే వేరబ్బా. సంక్రాంతి వేళ 80 కుటుంబాలు ఒకేచోట చేరాయి. ఎస్.కోట నియోజకవర్గం చందులూరు శివారు కసిరెడ్డిపాలెం గ్రామంలోని శుక్రవారం కనిపించిన సందడిది. కోలాటం, ముగ్గుల పోటీలతో ఆనందంగా గడిపి.. సహపంక్తి భోజనాలు చేశారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

సంక్రాంతి లోగిలి

నెల్లిమర్ల: సెగిడివీధికి చెందిన ముడిమంచి శ్రీను పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఇలా తీర్చిదిద్దారు.

న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఎంపికైన హర్షిత, ప్రణవి

జాతీయస్థాయి పోటీలకు చీపురుపల్లి విద్యార్థినుల ప్రాజెక్టు

కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో గతేడాది జులైలో అంతర్జాలంలో నిర్వహించిన ఇండియన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టింకర్‌ప్రెన్యూర్- 2025లో చీపురుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.హర్షిత(9వ తరగతి), పీవీఎల్ ప్రణవి(8వ తరగతి) సత్తాచాటారు. వచ్చేనెల 16 నుంచి 20 వరకు దిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో తమ ప్రాజెక్టు ప్రదర్శించడానికి ఎంపికయ్యారు.

స్వచ్ఛతపై చెప్పారు.. వందలో మెరిశారు!

ప్రాజెక్టు ఉద్దేశం ఇదీ..

విద్యార్థులు ఈ-సిటిజన్ కార్డు పేరుతో ప్రాజెక్టును తయారు చేసి ఏఐ టింకర్‌పెన్యూర్ కార్యక్రమంలో పొందుపర్చారు. గ్రామ పంచాయతీ యూనిట్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. పంచాయతీల్లోని ప్రతి పౌరుడికి ఈ-సిటిజన్ కార్డు కేటాయిస్తారు. గ్రామంలో వ్యక్తిగతంగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి దానిలో చిత్రాలు పొందుపర్చితే వారికి క్రెడిట్ పాయింట్లు కేటాయిస్తుంది. వాటి ఆధారంగా గృహ, స్థల పన్నులపై రాయితీ పొందొచ్చు. ఏఐతో జతచేయడంతో తప్పుడు సమాచారం పొందుపర్చడానికి అవకాశం ఉండదు. విద్యార్థులకు గైడ్ టీచర్‌గా ఏవీఆర్డీ ప్రసాద్ వ్యవహరించారు.

మనది 45వ స్థానం

దేశవ్యాప్తంగా 1,700కి పైగా పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులను తయారుచేసి ఈ కార్యక్రమంలో పాల్గొనగా.. వంద ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. చీపురుపల్లి విద్యార్థులు జాతీయ స్థాయిలో 45వ స్థానం దక్కించుకున్నారు. వచ్చే నెలలో దిల్లీలో జరగనున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇంపాక్ట్ ఫెస్టివల్, సమ్మిట్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థులకు మెంటార్‌గా వ్యవహరించనుంది. విద్యార్థులను హెచ్ఎం డి.ఉమామహేశ్వరి అభినందించారు

సంక్రాంతి.. సూపర్ సిక్స్

జామి మండలం రామయ్యపాలెం గ్రామంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి సంక్రాంతి సంబరాల్లో భాగంగా తన ఇంటి ముందు వేసిన రంగవల్లి ప్రత్యేకంగా నిలిచింది. సీఎం చంద్రబాబునాయుడు బొమ్మతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇలా సూపర్ సిక్స్‌గా వివరించారు. – న్యూస్‌టుడే, జామి

ఆకట్టుకున్న కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ముగ్గు

మడికి చిక్కుముడి

జాయింట్ ఎల్‌పీఎంలతో ఇబ్బందులు

– ఈనాడు, విజయనగరం

రామభద్రపురం మండలానికి చెందిన రైతు గోవిందుకు ఎకరన్నర భూముంది. రీ సర్వే అనంతరం పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకంలో 1.01 ఎకరాలు మాయమయ్యాయి. చివరికి ఆయనకు అధికారికంగా అర ఎకరాకు మాత్రమే పాస్‌పుస్తకం అందింది. మిగిలిన భూమి జాయింట్ ఎల్‌పీఎంలో నమోదైంది.

రీ సర్వే చేస్తున్న ఉద్యోగులు

గత ప్రభుత్వం భూముల రీసర్వే ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయలేకపోయింది. ఇందులో తప్పిదాల వల్ల జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లతో కొత్త చిక్కులు ఏర్పడ్డాయి. దీనివల్ల రైతులు తమ భూములను అమ్ముకోలేకపోతున్నారు. బ్యాంకుల నుంచి అవసరమైన రుణం పొందలేకపోతున్నారు. చివరకు అన్ని అర్హతలుండీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

సమస్యలివీ..

★ జాయింట్ ఎల్‌పీఎం అంటే ఒకే సర్వే నంబరులో ఎక్కువ మంది రైతుల భూముల ఖాతాలు కలిపి ఉండటం. దీంతో ఆన్‌లైన్‌లో ఒకే భూమి అందరికీ కనిపిస్తుంది. లేదా కొందరిది వేరొకరికి చూపిస్తుంది.

★ సకాలంలో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి.

★ తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత పిల్లలకు వారి భూమి వారసత్వంగా దక్కుతుంది. ఇద్దరు పిల్లలుంటే వారి పేర్లు వెబ్‌ల్యాండ్‌లో కనిపిస్తాయి. అయితే ఎవరికెంతనేది ఉండదు. ఇలా కొందరు చిక్కుకున్నారు.

★ గతంలో జరిగిన రీ సర్వేలో ఒకచోట అయిదు సబ్ డివిజన్లు ఉంటే, దానంతటినీ ఒక మడిగా పరిగణించి డ్రోన్ మ్యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అందులో గట్లు లేకపోవడంతో ఒకే ఎల్‌పీఎంగా గుర్తించారు. ఆ ఎల్‌పీఎంకి ఒకే రైతు అనుభవదారుగా ఉంటారు. కానీ వెబ్‌ల్యాండ్‌లో అలా ఉండవు. అందులో కొన్ని సబ్ డివిజన్లలో ఒకరి పేరు, మరికొన్ని సబ్ డివిజన్లలో ఇంకొందరి పేర్లు కనిపిస్తాయి

★ గతంలో పక్కపక్క పొలాలను మారకం చేసుకునేవారు. అవి రెవెన్యూ దస్త్రాల్లో మార్చలేదు. ఇలా చాలావరకు ఇలానే జాయింట్ ఎల్‌పీఎంలు పుట్టుకొచ్చాయి.

రుసుము చెల్లిస్తే సేవ

సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు జేఎల్‌పీఎంల విభజనకు దరఖాస్తు చేసుకోవచ్చని రెండు జిల్లాల సర్వేశాఖ అధికారులు తెలిపారు. రూ.50 రుసుము చెల్లిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



అర చేతుల్లో ఆరు ప్రాణాలు

ఈ చిత్రం చూశారా.. ఎంత ప్రమాదకరంగా ఉందో కదూ.. ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది వెళ్లకూడదన్న నిబంధన ఉన్నా కొందరు యథేచ్ఛగా ఐదారుగురితో రాకపోకలు సాగిస్తున్నారు. శుక్రవారం నగరంలోని ఎన్‌సీఎస్ రోడ్డులో ఓ వ్యక్తి అయిదుగురు చిన్నారులతో కలిసి ఇలా ప్రయాణిస్తూ 'న్యూస్‌టుడే' కంటపడ్డాడు. శిరస్త్రాణాలు ధరించలేదు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలకు ముప్పు తప్పదు. చోదకుడికి ముందు ఇద్దరు, వెనుక ముగ్గురు చిన్నారులు కూర్చుండడం గమనార్హం.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

కాంప్లెక్స్.. ఖాళీ

నిత్యం కిటకిటలాడే విజయనగరం జిల్లా కేంద్రం వెలవెలబోయింది. గురు, శుక్రవారాల్లో ప్రధాన కూడళ్లన్నీ ఖాళీగా కనిపించాయి. పీడబ్ల్యూ మార్కెట్, సిటీ స్టాండ్ రోడ్డు, ప్రకాశం పార్కు దారి, నగర పాలక సంస్థ కార్యాలయ కూడలి, ఎంఆర్ కళాశాల కూడలి, గంట స్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల రోడ్, డాబాలతోట, ఎంజీ రోడ్, కోళ్ల మార్కెట్ నిర్మానుష్యంగా మారాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లలో సైతం ప్రయాణికులు కానరాలేదు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, గ్రామీణం

ఈనాడు, విజయనగరం

సైబర్ ఉచ్చు చిక్కితే చిత్రహింసలే

మయన్మార్ నుంచి వచ్చిన బాధితుల ఆవేదన ఇది

'విదేశాల్లో కొలువుల ఆశచూపి సామాజిక మాధ్యమాల్లో వల విసురుతారు. రూ.లక్షల్లో వేతనం చెల్లిస్తామంటూ ప్రలోభపెడతారు. అలాంటి ప్రకటనలు చూసి నమ్మి వారి ఉచ్చులో పడితే చిత్రహింసలకు గురి కావాల్సిందే. పైగా ప్రాణాలతో బయటపడే అవకాశాలూ తక్కువ..' అని సైబర్ నేరగాళ్లకు చిక్కుకుని మయన్మార్ నుంచి బయటపడిన విజయనగరానికి చెందిన ఇద్దరు సోదరులు తాముపడ్డ అవస్థలు చెప్పారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో ఇంటికి చేరిన వీరు 'ఈనాడు'కు తమ అనుభవాలను వివరించారు.

ఇంటర్ తర్వాత ప్రత్యేకంగా కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన ఈ సోదరులు ఇన్‌స్టాగ్రామ్‌లో విదేశాల్లో కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల కొలువుల ప్రకటన చూసి ఆకర్షితులయ్యారు. కడప జిల్లాకు చెందిన స్నేహితులతో కలిసి తొలుత గత మే 16న ఒకరు, వారం తర్వాత మరొకరు థాయ్‌లాండ్ వెళ్లారు. సైబర్ నేరగాళ్ల ముఠా అక్కడ వారం పాటు హోటల్‌లో ఇచ్చిన ఆతిథ్యానికి సంబరపడిపోయారు. ముందు ఒక బృందాన్ని కిడ్నాప్ తరహాలో మయన్మార్ తరలించారు. కి.మీ. దూరం అడవుల్లో నడిపించారు.

★ ఆ తర్వాత మరో బృందంలో మరొకరు వెళ్లారు. ఇలా మన దేశం నుంచి తీసుకెళ్లిన వారందరినీ మయన్మార్‌లోని ప్రత్యేక భవనాల్లో బంధించారు. వారికి ఇన్‌స్టాగ్రామ్‌లో నూతన ఐడీలు సృష్టించి సైబర్ నేరాలు చేయించారు.

రెండో చరవాణే కాపాడింది..

పరిస్థితి అర్థమైన తర్వాత ఎలా బయటపడాలో తెలియక భయంతో వణికిపోయారు. వారి వద్ద చరవాణులను నేరగాళ్లు స్వాధీనం చేసుకున్నారు. సోదరులు ఇద్దరు తీసుకెళ్లిన రెండు చరవాణుల్లో ఒకటి అప్పగించి.. రెండోది వారి కంట పడకుండా భద్రపర్చుకున్నారు. వీడియో కాల్ ద్వారా తల్లికి అక్కడ బందీలైనట్లు వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వద్ద మొర పెట్టుకున్నారు. లొకేషన్ షేర్ చేశారు. ఈ విషయం తెలిసి రెండో చరవాణిని దుండగులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర మంత్రి చొరవ చూపి ఆ దేశ రాయబారులతో సంప్రదింపులు జరిపించడంతో నవంబరు 18న మయన్మార్ పోలీసులు నేరగాళ్ల ఉచ్చు నుంచి వారికి విముక్తి కల్పించారు. రెండో చరవాణి సాయంతో మిగతావారి ఉనికి గుర్తించి బయటకు తీసుకురాగలిగారు. విదేశాంగ అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత దిల్లీకి, అక్కడ నుంచి ఇంటికి చేరారు.

బిడ్డలిద్దరూ వస్తారనుకోలేదు..

మాది పేద కుటుంబం. భర్త మృతితో ఇద్దరు కుమారులను ఉన్నంతలో చదివించా. విదేశాల్లో నెలకు రూ.1.20 లక్షల ఉద్యోగమంటే ఆశపడ్డారు. ఇప్పట్లో నా బిడ్డలు వస్తారనుకోలేదు. కొడుకులిద్దరూ నా ఒడికి చేరుకునేలా చేసిన మంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు... అని బాధితుల తల్లి పేర్కొన్నారు.

న్యూస్‌టుడే– బొబ్బిలి, రామభద్రపురం, శృంగవరపుకోట

దారి మార్చి.. ఏమార్చి

నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై గంజాయి రవాణా

గంజాయి అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతోంది. అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఒడిశా నుంచి విచ్చలవిడిగా విశాఖ, విజయనగరం తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. పోలీసుల వలకు చిక్కినవారు కొందరైతే.. చిక్కని వారు ఎందరో. రామభద్రపురం మండలం కొటక్కి, ఎస్.కోట మండలం బొడ్డవర కూడలి, పాచిపెంట మండలం పి.కోనవలస వద్ద జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు అడ్డంకిగా మారడంతో స్మగ్లర్లు కొత్తదారులు వెతుకున్నారు. నిర్మాణంలో ఉన్న విశాఖ- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని అవకాశంగా మలుచుకుంటున్నారు.

రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద ఈనెల 10న 15 కిలోలు, గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో కాకర్లవలస వద్ద ఈనెల 12న 5.7 కిలోల గంజాయి పట్టుకున్నారు. నాలుగు ద్విచక్రవాహనాలు, 12 మంది యువకులను అరెస్టు చేశారు. ఒడిశా, పార్వతీపురం, సాలూరు, వంగర, రాజాం, తెర్లాం మండలం వెలగవలస, విశాఖ ప్రాంతాలకు చెందిన యువకులుగా పోలీసులు తెలిపారు. ఇలా దొరికినది కొంతైతే దొరకనిది ఎక్కువ. ★ ఎస్.కోట మండలం బొడ్డవర కూడలి చెక్‌పోస్ట్ వద్ద ఏటా 20కి పైగా కేసులు నమోదయ్యేవి. గత మూడు నెలల్లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం.

రామభద్రపురంలో స్వాధీనం చేసుకున్న సరకు(పాతచిత్రం)

హరిత రహదారిపై రయ్.. రయ్..

విశాఖ- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంలో ఉంది. ఈ మార్గంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కొంతమంది అక్రమ రవాణా సాగిస్తున్నారు. పాచిపెంట వద్ద ఇంటర్‌ఛేంజిలో హరిత రహదారి ఎక్కి విజయనగరం, కొత్తవలస చేరుకుంటున్నారు. జామి వద్ద ఇంటర్ ఛేంజి వరకు వచ్చి విజయనగరం చేరుకుని వివిధ మార్గాల్లో తరలిస్తున్నారు. స్థానికంగా కొంతమంది ఏజెంట్లకు చేరవేస్తున్నారు. సాలూరు, రామభద్రపురం, మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం వంటి ప్రాంతాలు ఒడిశాకు దగ్గరగా ఉండడం మరో కారణం.

మూలాలు గుర్తిస్తున్నాం..

వాహన తనిఖీలు మరింత విస్తృతం చేస్తాం. కీలక రహదారులను జల్లెడ పడుతున్నాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి సరకు వస్తోంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై రామభద్రపురం మండలం కాకర్లవలస వద్ద కొత్తగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. గంజాయి మూలాలను అన్వేషిస్తున్నాం. – భవ్యారెడ్డి, డీఎస్పీ, బొబ్బిలి

(c) eenadu

సంబరం.. అంబరం

ఆటలు.. పాటలు.. వేషధారణలు.. ఊరేగింపులు.. పోటీలు.. ముగ్గులు.. కోలాటాలు.. నృత్య ప్రదర్శనలు.. ఇలా ఒక్కటేమిటి గ్రామగ్రామాన ఒకటే సందడి.. ఏ వీధికెళ్లినా.. ఏ కూడలిలో ఉన్నా సంక్రాంతి శోభ ఉట్టిపడింది.. ఉమ్మడి జిల్లాలో ఊరూవాడా సంబరాలు మిన్నంటాయి. బాడంగి, కొత్తవలస, పాలకొండ మండలాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అలరించారు.
– న్యూస్‌టుడే, వీరఘట్టం, పాలకొండ, బాడంగి, కొత్తవలస

సంక్రాంతి సందర్భంగా కొత్తవలస మండలం మంగళపాలెంలో నాగ సాధువుల వేషధారణలో పలువురు సందడి చేశారు. గ్రామానికి చెందిన శివయ్య సేవా పీఠం ఆధ్వర్యంలో భక్తులు శివలింగంతో ఊరేగింపు నిర్వహించారు. అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి రామాలయం వరకు నృత్యాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. – న్యూస్‌టుడే, కొత్తవలస

వీరఘట్టం మండలం కిమ్మి గ్రామంలో విలయ ప్రళయ మూర్తి గీతానికి నృత్యం చేస్తున్న గ్రామస్థులు

మంగళపాలెం కూడలిలో పాతకాలపు పనిముట్ల ప్రదర్శన

బాడంగి మండలం గజరాయునివలసలో కోలాటం పోటీలు

పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో ఆకట్టుకున్న వేషధారణలు

కిమ్మిలో..

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో కొలువుదీరిన స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాన్ని అందించారు.

జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు, చిత్రంలో అధికారులు

మంత్రి కొండపల్లి ఇంట సంక్రాంతి శోభ

గంట్యాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వగ్రామంలో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. మాజీ ఎంపీ కొండపల్లి పైడితల్లినాయుడు కుటుంబ సభ్యులంతా కలిసి ఒకేచోట పండగ నిర్వహించుకున్నారు. పెద్దలకు కొత్త దుస్తులు చూపి పొత్తర్లు ఇచ్చారు. అందరూ ఫొటోలు దిగి ఆనందంగా గడిపారు. అనంతరం తాటిపూడి జలాశయంలో కుటుంబ సభ్యులంతా కలిసి బోటు షికారు చేశారు. మాజీ ఎమ్మెల్యే డా.కేఏ.నాయుడు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, సాంబమూర్తి, సంతోష్, రఘుమండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోటులో విహరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	162	294	304

విద్యలనగరానికి.. పచ్చని తోరణం

నగరపాలికలో భారీగా మొక్కల పెంపకం

రక్షణకు ట్రీగార్డుల ఏర్పాటు

అవకాశాలివీ..

❖ నగరంలో 12 వరకు భారీ సెంటర్ డివైడర్లు, 100 వరకు ఉద్యానాలున్నాయి. మరో 12 చెరువులున్నాయి. వీటిల్లో నాటేందుకు అవకాశం ఉంది.

❖ కోమటి చెరువు, పెద్ద చెరువు, బుచ్చెన్నకోనేరు, అయ్యకోనేరు, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో సుందరీకరణ చర్యల్లో భాగంగా పచ్చదనాన్ని పెంచారు. రక్షించాల్సిన అవసరం ఉంది

❖ ఉడాకాలనీ, ప్రదీప్‌నగర్, అయ్యన్నపేట, కొత్తపేట నీళ్ల ట్యాంకు దారి, ఇందిరా నగర్, కంటోన్మెంట్, కలెక్టరేట్ నుంచి కామాక్షినగర్ మీదుగా గుర్ల రోడ్డు, బీసీ కాలనీ, వైఎస్సార్ నగర్, పోర్టు సిటీ పాఠశాల ప్రాంతాల్లో కొత్తగా వేయనున్నారు.

❖ ఇప్పటికే ఉద్యాన శాఖను ఏర్పాటు చేశారు. ఏడీగా సంతోష్‌కుమార్ ఇటీవల విధుల్లో చేరారు. పని చేసేందుకు 44 మంది సిబ్బందిని సైతం నియమించారు. నిత్యం రెండు ట్యాంకర్లతో నీళ్లు పోస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం జిల్లా కేంద్రాన్ని పచ్చగా మార్చుతున్నారు.. ఇప్పటికే తాగునీటి కొరతను అధిగమించేందుకు అత్యాధునిక రీఛార్జ్ పిట్‌లను ఏర్పాటు చేశారు.. మరోవైపు వేడిని, కాలుష్యాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీగా మొక్కలు నాటుతున్నారు. తాజాగా వాటికి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

40 ప్రాంతాల్లో..

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం కరవైంది. వేలల్లో మొక్కలేసినట్లు చూపించినా.. క్షేత్రస్థాయిలో కానరాలేదు. ట్రీగార్డులు, శిలాఫలకాల పేరిట పెద్దఎత్తున దోచేశారనే ఆరోపణలొచ్చాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. నగర పాలికలో 40 ప్రాంతాలను గుర్తించింది. గతేడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనం- మనం కార్యక్రమం కింద ఆయా చోట్ల 50 వేల వరకు నాటాలని నిర్ణయించారు. ఇప్పటికే 3 వేల వరకు వేశారు.

రక్షణ ఇలా..: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాల కింద పెద్దచెరువు, కంటోన్మెంట్ ఉడాకాలనీ, ఎత్తుబ్రిడ్జి, బస్‌షెల్టర్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలేశారు. వాటిని రక్షించేందుకు ఇటీవల 1000 వరకు ట్రీగార్డులు చేయించారు. ఒక్కోదానికి రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

నగరంలోని పెద్దచెరువు సమీపంలోని మొక్కలకు ట్రీగార్డులు పెడుతున్న కార్మికులు

గతంలో దోచేశారిలా..

★ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ‘జగనన్న హరిత నగరాలు’ కార్యక్రమం కింద 2,650 మొక్కలకు గానూ రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు.

★ మెగా ప్లాంటేషన్ ద్వారా 10 వేలు నాటామని పేర్కొన్నారు. ఇవేవీ క్షేత్రస్థాయిలో కానరాలేదు.

★ కేవలం ట్రీగార్డుల కోసమే రూ.18.20 లక్షల వరకు వెచ్చించారు. ★ నామ ఫలకాల ఏర్పాటుకు మరో రూ.8.75 లక్షలను గుత్తేదారుకు ముట్టజెప్పారు.

పండ్ల రకాలే ఎక్కువ..

ఇటీవల 1000 ట్రీగార్డులు వచ్చాయి. 50 వరకు పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేశాం. ప్రాంతాలకు అనుగుణంగా మిగిలినవి పెడతాం. కాలుష్యం తగ్గించడం, పచ్చదనం, నీడ పెంపులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే వర్షాకాలం నాటికి విడతల వారీగా 50 వేల వరకు మొక్కలు నాటుతాం. ఇందులో పండ్ల రకాలవే అధికంగా ఉన్నాయి. అయిదు వేల వరకు వచ్చాయి. – ప్రసాద్, ఈఈ, నగరపాలక సంస్థ

ఇంటర్ ప్రయోగ పరీక్షలపై నిఘా

ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

విద్యార్థి దశలో ఎంతో కీలకమైన ఇంటర్ విద్యలోనే ఉన్నత లక్ష్యానికి బాటలు పడతాయి. అందుకే విద్యార్థులు పుస్తకాలతో కుస్తీలు పడుతుంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొత్త సంస్కరణలు చేపడుతోంది. ఇప్పటికే ఉత్తమ ఫలితాల సాధనకు ‘సంకల్పం’ పేరుతో వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. మరోవైపు ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వృత్తి విద్య(ఒకేషనల్), ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జనరల్(ఎంపీసీ, బైపీసీ) వారికి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా నిఘా నీడలో జరిపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు పెడుతున్నారు.

జిల్లాలో ముందుగా వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. సంబంధిత విద్యార్థులకు 44 కేంద్రాలు, సాధారణ సబ్జెక్టుల వారికి 41 కేంద్రాలు కేటాయించారు. జనరల్‌కు 1,916 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 2,597 మంది హాజరుకానున్నారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రక్రియంతా లైవ్ స్ట్రీమింగ్ చేసి కలెక్టరేట్, ఇంటర్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేస్తారు. తద్వారా ఎక్కడా అవకతవకలు, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీఐఈవో వై.నాగేశ్వరరావు తెలిపారు.

❖ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 14
❖ కేజీబీవీలు, సాంఘిక, గిరిజన సంక్షేమ కాలేజీలు: 28
❖ మోడల్ స్కూళ్లు: 4
❖ ప్రైవేటు కళాశాలలు: 36
❖ ప్రథమ, ద్వితీయ విద్యార్థులు: 17,530
❖ ప్రయోగ పరీక్షలకు హాజరయ్యేవారు : 7,362 మంది

శివారు ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షణ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి నేపథ్యంలో నేరాల నియంత్రణకు డ్రోన్లను వినియోగిస్తున్నామని విజయనగరం ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రద్దీ ప్రాంతాలు, శివారు గ్రామాలపై దృష్టిపెట్టామన్నారు. సంబంధిత ఫుటేజీల సాయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, జూదం ఆడినా, పందేలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈత రాక.. ఊపిరి వదిలి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: కాలువలో పడి ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన గరుగుబిల్లి మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై ఫకృద్దీన్ వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్ సమితికి చెందిన సూర్యనారాయణ(33) సుంకి పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ పార్కు సమీపంలో ఉన్న ఇటుక బట్టీలో పనిచేస్తున్న చెల్లిని చూసేందుకు వచ్చాడు. శుక్రవారం ఉదయం బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తూ నాగావళి నది ఎడమ కాలువలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై రాజేష్ వివరాల ప్రకారం.. పెదకలాం గ్రామానికి చెందిన చింతాడ సంతోష్(29) వ్యాపారం చేసేవాడు. గతనెల 28న పార్వతీపురం నుంచి ఇంటికి వెళ్తూ నర్సిపురం శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు స్పందించి విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ ఇళ్లన్నీ కన్నీళ్లతో నిండిపోయాయ్

పండగ వేళ సంతోషం నిండాల్సిన ఆ ఇళ్లన్నీ కన్నీళ్లతో నిండిపోయాయి. గత రెండు రోజుల్లో వేర్వేరు ఘటనల్లో జిల్లాకు చెందిన ఆరుగురు మృత్యువాత పడడంతో తీవ్ర విషాదం నెలకొంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

మక్కువ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మక్కువ మండల కేంద్రానికి చెందిన డోల మధు(19) మృతిచెందాడు. ఎస్సై వెంకటరమణ వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే మధు, కొయ్యాన కార్తీక్, గూనాన కార్తీక్ గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై ములక్కాయవలస బయలుదేరారు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పింది. మధు తలకు తీవ్రగాయం కాగా మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మధును మక్కువ పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మధు (పాతచిత్రం)

వేపాడ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వలస కూలీ మృతిచెందిన ఘటన వేపాడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. క్వారీలలో వలస కూలీగా పనిచేస్తున్న నర్సిపల్లిమెట్ట ప్రాంతానికి చెందిన గోపు రామదాసు(27) సోదరుడు రామచంద్రరావుతో ఆహారం కోసం ద్విచక్రవాహనంపై బొద్దాం గ్రామానికి వెళ్లాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తిరిగి వస్తుండగా కోనేరు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో రామదాసు అక్కడికక్కడే మృతి చెందాడు. రామచంద్రరావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత తండ్రి రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వల్లంపూడి ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

పెనుబాకలో తాపీమేస్త్రీ..

రాజాం, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని తాపీ మేస్త్రీ మృతిచెందిన ఘటన రాజాం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెనుబాక గ్రామానికి చెందిన మూకళ్ల రాము(44), బలగ శ్రీరాములు శుక్రవారం బొద్దాం సమీపంలో జరిగిన ఉత్సవాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ స్వగ్రామం వస్తుండగా.. పెనుబాక సమీపంలో రాజాం పురపాలిక పరిధిలోని కొత్తవలసకు చెందిన గేదెల శేఖర్ వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. శ్రీరాములు క్షేమంగా బయటపడగా, రాము, శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాము అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివరాలు సేకరిస్తున్నట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృత్యువాత

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన విజయనగరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ చౌదరి వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఆర్‌జేవీ కాలనీకి చెందిన ఎస్.సత్యం(64) అక్కడే సెక్యూరిటీగార్డుగా పనిచేసేవారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని విజయనగరం వచ్చారు. పండగ సందర్భంగా బంధువుల ఇంటికని వీటీ.అగ్రహారానికి నడిచి వెళ్తుండగా.. ఎత్తువంతెన సమీపంలోని ఎంఆర్‌ఎఫ్ టైర్ల దుకాణం వద్ద ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆయన కుమారుడు ఎస్.గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహన చోదకుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామన్నారు.

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

ICAS ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్, జ్యోతిష్యంలో డిప్లొమా కోర్సులు నేర్పబడును అడ్మిషన్లు ప్రారంభం సెంట్రల్ స్కూల్ బాలాజీనగర్ VZM 9966666659, 9394789246

REAL ESTATE

FLAT FOR SALE

అయ్యకోనేరు దక్షిణ గట్టు, ఉత్తర గట్టు వద్ద మరియు ధర్మపురి 80Ft. రోడ్డుకు అతి దగ్గరలో ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. 7995588192.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

HOUSE FOR SALE

Independent House for Sale 267 Sq.Y N/F, Ground / First Floor, at K.L.Puram, VZM C: 8074031348, 9705563456.

విజయనగరం ప్రియనగర్ కాలనీ D మార్ట్‌దగ్గర 167 (30x50) గజాలు G+2 ఉత్తరం ఫేస్ ఇల్లు అమ్మకం. SBI బ్యాంక్‌లోన్ సౌకర్యం ✆ 9441749727.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE

CMR Layout 267 Sq.Y (40X60) S/F, Vuda Site for Sale,. Near to Vizag Road, Vizianagaram C: 8074031348, 9705563456.

200 Sq.y. East Facing Plot in SVN Layout Near Saraswati Temple, Vizianagaram. Direct Parties only. ✆ 9121782266.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Newly Launched Commercial Venture at Bhogapuram all Facings & 366 Sq.Yds. Tagarapuvalasa "Y" Jn. towards Airport Road. Suitable for all types of Business. 9992273747.

విశాఖలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చుట్టు ప్రక్కల అప్రూవ్డ్ ఇండ్ల స్థలాలు బ్యాంక్‌లోన్‌తో అమ్మకం. గరిమెళ్ళ శ్రీధర్ 9493640600,9246678028.

JOBS

మీమీ గ్రామాలలో మా కంపెనీ వాలంటీర్స్ కావలెను. జీతం నెలకు 10,000/- సంప్రదించండి సెల్: 9949483153.

వేణుగోపాలుని ఉత్సవం

పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

జామి, న్యూస్‌టుడే: జామి మండలం అన్నమరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా ముగిశాయి. గోదాదేవి, వేణుగోపాలస్వామికి నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు పార్వేటు ఉత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

రాజవేణుగోపాలుని జాతర..

రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలం పనసలవలసలో రాజవేణుగోపాలస్వామి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ఏటా కనుమ రోజున నిర్వహించడం ఆనవాయితీ. దీంతో గురువారం సాయంత్రం నుంచి సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

పుష్పాలంకరణలో రాజవేణుగోపాలుడు

జీతాలివ్వండి సారూ

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు.. స్వచ్ఛ సంక్రాంతి పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించిన కార్మికుల కళ్లల్లో పండగ కనిపించలేదు. వ్యర్థాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న వారికి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీల్లో 2 నుంచి 6 నెలల వరకు జీతాలు రావాలి. ఈమేరకు రూ.1.51 కోట్ల మేర బకాయిలున్నాయి. కొన్నిచోట్ల రెండు నెలలకు బిల్లులు పెట్టినా చెల్లింపునకు అనుమతి రాలేదు. పెద్ద పంచాయతీ అయిన ఎస్.కోటలో ఆరు నెలలు, కొత్తవలసలో 2 నుంచి అయిదు నెలలు బకాయిలున్నాయి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

పంచాయతీ	సిబ్బంది	నెలలు	బకాయిలు (రూ.లక్షల్లో)
ఎస్.కోట	44	6	72
కొత్తవలస	69	3-5	47.83
చీపురుపల్లి	52	2	15.8
గరివిడి	56	2	14.00
జామి	13	2	2.34

ఎస్.కోటలో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాధారణ నిధుల్లేకే..

పంచాయతీల్లో రెగ్యులర్, ఒప్పంద కార్మికులు, క్లాప్‌మిత్రలు పేరుతో కార్మికులు పనిచేస్తున్నారు. రెగ్యులర్, ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పంచాయతీ సాధారణ నిధులు(జనరల్ ఫండ్), క్లాప్‌మిత్రల వేతనాలు ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లిస్తారు. సాధారణ నిధుల్లేక బకాయిలు పేరుకుపోయాయి. క్లాప్‌మిత్రలకు ఆర్థిక సంఘం నిధుల నుంచి డ్రా చేస్తున్నా ప్రభుత్వ అనుమతులు రావడం లేదు.

ఇల్లు గడిచేదెలా..

తెలుగింటి పండగల్లో ప్రధానమైనది సంక్రాంతి. కొత్త దుస్తులు, పిండివంటలు, కూతుళ్లు, అల్లుళ్లకు కానుకలు ఇలా అధికంగా ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీ వచ్చే సరికి జీతం రాకపోతే అప్పులు, వాయిదాలు వాళ్ల ఒత్తిడి అధికంగా ఉంటుంది. దీంతో ఇల్లు ఎలా గడుస్తుందని సతమతమవుతున్నారు. వేతనాల సమస్యపై పంచాయతీల ఈవోలతో మాట్లాడుతామని విజయనగరం డీపీవో మల్లికార్జునరావు తెలిపారు. త్వరితగతిన చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

సీతారాంపురంలో ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన లక్కవరపుకోట మండలం సీతారాంపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం. . 25 ఏళ్ల కిందట ముక్కా ముత్యాలనాయుడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన వర్ధంతి కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. పాలకేంద్రానికి సంబంధించిన క్యాన్లు, రాళ్లతో ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం తెదేపా శ్రేణులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గోవిందరావు చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరించారు. పార్టీపై వ్యతిరేకత ఉన్న వారే దీనికి కారణమని, స్థానికంగా ఇలాంటి ఘటనలు పలుమార్లు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ముత్యాలనాయుడు కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను త్వరితగతిన పట్టుకొని, కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

క్షేమంగా వెళ్లండి

సంక్రాంతి నేపథ్యంలో పల్లెలకు రాకపోకలు పెరిగాయి. ఈక్రమంలో అన్ని మార్గాల్లోనూ రద్దీ నెలకొంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసు శాఖ ప్రయాణికులను అప్రమత్తం చేస్తోంది. ‘రిటర్న్ జర్నీ- సేఫ్ జర్నీ’ పేరిట వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. మూడు రోజుల పాటు ప్రధాన మార్గాలు, పట్టణాల్లో తమ సిబ్బంది ప్లకార్డులతో సూచనలు చేస్తారన్నారు. శిరస్త్రాణం ధరించడం, వేగనియంత్రణ, రోడ్డు భద్రతా నియమాలను తెలియజేస్తూ నిబంధనల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఆదివారం వరకు కొనసాగుతుందని చెప్పారు. – న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

విజయనగరంలో అవగాహన

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? వసంత గ్రామంలో రక్షిత మంచినీటి పథకం చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. అవస్థలు పడుతున్నాం. - **స్థానికులు** ★ పారిశుద్ధ్య పనులు చేపడతాం. - **విజయకుమార్, డిప్యూటీ ఎంపీడీవో** - గంట్యాడ గ్రామీణం

? జూనపాడువలస ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు లేవు. వర్షం కురిస్తే వీధుల్లోకి నీరు వస్తోంది. - **స్థానికులు** ★ నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. కాలువలు నిర్మించేందుకు కృషి చేస్తాం. - **ప్రణయ, ఏఈ** - రామభద్రపురం

? మెరకముడిదాం మండలం శ్యామరాయవలసలో బంగారమ్మతల్లి చెట్టు దగ్గర ఉన్న బోరుబావి పాడైంది. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ మరమ్మతులు చేయిస్తాం. - **సంగమేష్, ఏఈ** - మెరకముడిదాం

? పెదమజ్జిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మురుగు బయటకు వచ్చే పైపులు పాడయ్యాయి. - **స్థానికులు** ★ మరమ్మతులు చేపడతాం. - **ఉమాభారతి, ఐసీడీఎస్ సీడీపీవో** - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

చీకటి భయం తొలగింది

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం చినమానాపురంలో ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే దారిలో దీపాలు లేవు. ఎప్పుడు ఏ జంతువులు దాడి చేస్తాయోనని వాహన చోదకులు భయపడేవారు. దీనిపై 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించారు. రూ.3 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు వెచ్చించి గ్రామస్థులు మరికొంత సమకూర్చారు. విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేశారు.

కల్వర్టుకు ప్రమాదం తప్పింది

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని బజారు కూడలిలో ఇటీవల నిర్మించిన కల్వర్టుపై వెంటనే రాకపోకలు సాగించారు. దీంతో నాణ్యతపై ప్రభావం పడింది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో 'నిర్మించిన వెంటనే రాకపోకలా' శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి దీనిమీదుగా రాకపోకలు నిలిపివేశారు.

నేటి నుంచి బాల అన్నమ్మ పేరంటాల జాతర.. సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి మండలం సురవరంలో బాల అన్నమ్మ పేరంటాల జాతర ఈనెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు మూడు రోజుల పాటు తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భద్రతా నియమాలు పాటించాలి

గజపతినగరం: సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి తిరుగు ప్రయాణాలు చేస్తున్నవారంతా రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు సూచించారు. గజపతినగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ★ బొబ్బిలి: బొబ్బిలి ప్రధాన కూడలిలో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. 'సురక్షిత ప్రయాణం మీకు శుభం కలిగించాలి' తదితర ప్లకార్డులు ప్రదర్శించారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో శుక్రవారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ★ వంకాయలు: 50 ★ దొండ: 40 ★ టమాటా: 40 ★ బీర: 55 ★ బెండ: 50 ★ కాకర: 50 ★ చిక్కుడు: 30 ★ ఆనపకాయ (ఒకటి): 25 ★ అరటి (జత): 20 ★ మునగ: 85 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంపలు: 25 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 120 ★ పచ్చిమిర్చి: 80 ★ క్యాబేజీ: 30 ★ క్యారెట్: 42 - న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామ: అనగనగా ఒక రాజు, రాజాసాబ్ ★ ఎస్వీసీ సీతారామ మిని: నారీ నారీ నడుమ మురారి ★ ఎస్వీసీ అప్సర: మన శంకరవరప్రసాద్‌గారు ★ రాజా లక్ష్మీ థియేటర్: అనగనగా ఒక రోజు ★ వాసవి: రాజా సాబ్ ★ టీబీఆర్ స్క్రీన్-1: మన శంకరవరప్రసాద్‌గారు ★ టీబీఆర్ స్క్రీన్-2: నారీ నారీ నడుమ మురారి - న్యూస్‌టుడే, బొబ్బిలి

కొత్త పంచాయతీల్లో వసతుల కరవు
విభజించారు.. సమస్యలే మిగిల్చారు

న్యూస్‌టుడే- సంతకవిటి, వంగర, రాజాం గ్రామీణం, తెర్లాం

ఒకే పంచాయతీలో ఎక్కువ గ్రామాలు ఉండడం, పెరిగిన జనాభా దృష్ట్యా 2019లో పలు కొత్త పంచాయతీలు ఏర్పాటు చేశారు. ఆరేళ్లు కావస్తున్నా కనీసం సౌకర్యాలు కల్పించలేదు. సొంత భవనం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు, పాలకవర్గం, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

వంగర మండలం కింజంగి ఆర్‌ఆర్‌కాలనీ పంచాయతీలో పాకలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లో కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో నేటికీ సొంత భవనాలు లేవు. ప్రభుత్వ పథకాల అమలు, పాలకవర్గం గ్రామసభలు పశువుల పాకల్లో, దేవాలయాల్లో కొనసాగుతున్నాయి. మౌలిక వసతులు కల్పించాలని నేతలు, అధికారులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

పూరిపాకలే దిక్కు..

వంగర మండలం పెద్ద దేవకివాడ, చిన దేవకివాడ గ్రామాలు మడ్డువలస ప్రాజెక్టులో పడ్డాయి. దీంతో నిర్వాసిత గ్రామాలు శ్రీహరిపురం ఆర్‌ఆర్‌కాలనీ, కింజంగి ఆర్‌ఆర్‌కాలనీగా ఏర్పడ్డాయి. ఈ రెండూ పంచాయతీలుగా గుర్తించారు. రెండు చోట్లా పూరిపాకలు, ప్రైవేటు భవనాలపై ఆధారపడాల్సి వస్తోంది. రోడ్లు, వీధి కాలువలు పూర్తిస్థాయిలో లేవు.

స్థల వివాదంతో ఇక్కట్లు..

రాజాం మండలం శ్యాంపురం పంచాయతీ నుంచి గుయ్యానవలస, రామానుజంపేట గ్రామాలను విడదీసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినా.. స్థల వివాదంతో నిర్మాణానికి నోచుకోవడంలేదు. వీధి కాలువలు లేక మురుగు నిల్వ ఉంటోంది.

అన్నీ అవస్థలే..

తెర్లాం మండలం అప్పలంపేట గతంలో విజయరాంపురంలో కలిసి ఉండేది. 2019లో అప్పలంపేట, కొల్లివలస కలిపి అప్పలంపేట పంచాయతీ ఏర్పడింది. ఇక్కడ మొత్తం 1,366 జనాభా ఉన్నారు. రామమందిరంలోనే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కార్యాలయం పెట్టారు. కాలువల నిర్వహణ సక్రమంగా లేదని ప్రజలు వాపోతున్నారు. కొల్లివలసలో ఆర్‌అండ్‌బీ రహదారి పాడైంది. కాలువలు లేవు. ఇంటింటి కుళాయిలు సరిగా పనిచేయడంలేదు. విద్యుత్తు లోటొల్టేజీ సమస్య పీడిస్తోంది. పంచాయతీ భవనం ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందంటున్నారు. రూ.32 లక్షలతో పంచాయతీ భవనం నిర్మిస్తున్నామని, మిగతా సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీవో రేగి రాంబాబు తెలిపారు.

ప్రతిపాదనలు పంపించాం..

వంగర మండలం శ్రీహరిపురం ఆర్‌ఆర్‌కాలనీ, కింజంగి ఆర్‌ఆర్‌కాలనీ, రాజాం మండలం గుయ్యానవలస పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **కె.రామారావు, వి.శ్రీనివాసరావు, పంచాయతీ విస్తరణాధికారులు, వంగర, రాజాం**

తిరుగు ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం

గుర్లలో సిబ్బందికి మిఠాయి బాక్సు అందజేస్తున్న ఎస్పీ

రాజాం, న్యూస్‌టుడే: సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గ్రామాలకు తరలి వచ్చిన జనం తిరుగు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. శుక్రవారం రాజాం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. 'రిబ్బన్ జర్నీ- సేఫ్ జర్నీ' పేరిట జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. శిరస్త్రాణం ధరించి, రహదారి నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. స్థానిక పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. రాజాం పట్టణ, గ్రామీణ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్ర పాల్గొన్నారు. ★ **రేగిడి:** ఎస్పీ రేగిడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. ఎస్సై బాలకృష్ణ తదితరులు ఎస్పీకి మొక్క అందజేశారు. ★ **గుర్ల:** గుర్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. రోడ్డు భద్రత అవగాహనలో భాగంగా రిబ్బన్ జర్నీ- సేఫ్ జర్నీ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. సంక్రాంతి సందర్భంగా ఎస్సై నారాయణరావు, సిబ్బందికి ఎస్పీ స్వీట్లు అందజేశారు. ★ **గరివిడి:** గరివిడి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలనకు ఏం చర్యలు తీసుకుంటున్నారో ఎస్సై లోకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు.

కూరగాయల వ్యాపారి నిజాయతీ

శ్రీకాకుళం గ్రామీణం: బంగారు ఆభరణాలు, నగదుతో ఉన్న సంచి పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగించి ఓ కూరగాయల వ్యాపారి నిజాయతీ చాటుకున్నారు. నరసన్నపేట నుంచి సాసుపల్లి 'హేమలత' దంపతులు శుక్రవారం రేగిడి వెళ్తున్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం బైరి వద్ద ఓ మిఠాయి దుకాణం వద్ద ఆగారు. ఆ సమయంలో రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదుతో ఉన్న సంచిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పక్కనే కూరగాయల దుకాణం నడుపుతున్న ఆర్.వాసుదేవరావు గమనించి.. దాన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. ఈలోగా సంచి పోయిందని లబోదిబోమన్నారు. ఆగిన ప్రదేశాల్లో వాకాబు చేసుకుంటూ వచ్చి, మిఠాయి దుకాణం వద్ద అడగ్గా లేదని చెప్పడంతో గ్రామీణ మండల పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆ సంచి వారిదేనని నిర్ధారించుకున్న తర్వాత వాసుదేవరావు సమక్షంలో ఎస్సై కె.రాము అందించారు.

సంక్రాంతి పండగ.. అంతా సందడిగా

బాడంగి: కోలాటం పోటీల్లో విజేతలకు బహుమతి అందజేత

న్యూస్‌టుడే, బృందం: సంక్రాంతి, కనుమ సందర్భంగా గురు, శుక్రవారాల్లో వాడవాడలా వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు. ముగ్గుల పోటీల్లో యువతులు ప్రతిభ చూపించారు. యువత, పెద్దలు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. పలు రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కనుమ రోజు పశువులకు పూజలు చేశారు. బంధువులతో పండగ కోలాహలంగా జరిగింది.

సంతకవిటి: కాలారలో సంగిడి పోటీలు

బొబ్బిలి: చింతాడ తోటపల్లి గట్టుపై జనసందోహం

సంతకవిటి మండలం గోవిందపురంలో కోలాహలం


గజపతినగరం: ముచ్చర్లలో నృత్య ప్రదర్శన

చీపురుపల్లి: పీకే పాలవలసలో యువతుల కోలాటం

చాలీచాలని గదుల్లో చదువులెలా?

రాజాం పట్టణం పరిధిలోని కొత్తవలస మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల అసంపూర్తిగా ఉంది. నాడు-నేడు కింద రూ.33 లక్షలు మంజూరవగా.. అదనపు భవనం పనులు ప్రారంభించారు. నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే నిలిపివేశారు. సరిపడినన్ని గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతిగది ఉపాధ్యాయుల గదిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. సమస్యను ఎంఈవో దుర్గారావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

అల్లుకున్న ప్రమాదం

గంట్యాడ మండలం పెదమజ్జిపాలెంలో విద్యుత్తు స్తంభాలకు పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. వర్షాల సమయంలో షాక్ కొడుతున్నాయని, విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పొదలను తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పెదమజ్జిపాలెం

వాహనం కదలదు.. చెత్త తరలదు

బొబ్బిలి మండలం మెట్టవలసలో చెత్త సేకరణ కోసం తెదేపా ప్రభుత్వ హయాంలో సమకూర్చిన వాహనం మూలకు చేరి, నిరుపయోగంగా మారింది. మరమ్మతులకు గురవడంతో వదిలేశారు. గ్రామంలో చెత్త పేరుకుపోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. విషయం డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

అన్న క్యాంటీన్ సిద్ధం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమైంది. పేదల ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం క్యాంటీన్లను పునరుద్ధరించింది. చీపురుపల్లి శ్రీకాకుళం ప్రధాన రహదారిని ఆనుకుని తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, ఉపఖజానా కార్యాలయాల సముదాయంలో రూ.61 లక్షలతో నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తి కావొచ్చాయి. కొద్ది రోజుల్లో ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు.

నీరు చేరి.. ప్రమాదంగా మారి

బొబ్బిలి పట్టణంలోని రాజా కళాశాల రహదారి అధ్వానంగా తయారయ్యింది. సమీపంలోని ద్విచక్రవాహనాలు మరమ్మతులు చేసేవారు నీటిని రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో రహదారంతా బురదమయంగా మారింది. గోతులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పుర కమిషనర్ రామలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. నీరు విడిచిపెట్టే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

పేదలకు వస్త్రాల పంపిణీ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక పరిధిలోని సారథి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం పేదలకు వస్త్రాలను అందించారు. వెయ్యి మందికి వస్త్రాలు సమకూర్చినట్లు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కిల్లారి శ్రీను తెలిపారు. మహిళలకు చీర, పురుషులకు దుప్పటి, పంచి, తువ్వాలు ఇచ్చారన్నారు. వైకాపా పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ★ **గుర్ల:** మన్యపురిపేటలో పేదలకు సర్పంచి బి.హైమావతి, ఆమె భర్త వెంకటరమణ శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ★ **రామభద్రపురం:** సంక్రాంతి సందర్భంగా రామభద్రపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల దాలయ్య రూ.2.5 లక్షలు విలువైన దుస్తులను 500 మంది పేదలకు పంపిణీ చేశారు. ★ **రేగిడి:** పెదలింగాలవలసకు చెందిన అడపా చిరంజీవి దంపతులు లింగాలవలస, తోకలవలస, వావిలవలస, చినలింగాలవలస గ్రామాలకు చెందిన దివ్యాంగులు, వృద్ధులు 400 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ★ **చీపురుపల్లి గ్రామీణం:** చీపురుపల్లి మండలం మెట్టపల్లికి చెందిన మీసాల చిన్నారావు, సుశీల దంపతులు చీపురుపల్లిలో పేదలకు వస్త్రాలు అందజేశారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల దాలయ్య

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: విధులు ముగించుకుని వస్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని గజపతినగరం పోలీసు స్టేషనులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్.తిరుపతిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు వివరాల ప్రకారం.. తిరుపతిరావు ముచ్చర్లలో భోగి పండగ సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు బందోబస్తుకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వస్తుండగా.. ద్విచక్రవాహనం అదుపుతప్పింది. కొండపేట సమీపంలో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. తీవ్ర గాయాలవడంతో గజపతినగరం ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయనగరం తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానిస్టేబుల్ అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల మండలం అచ్యుతాపురం పంచాయతీ శివారు గొల్లపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ముల్లు సూరి రాములుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. దేవుడి పూజ కోసం వెలిగించిన ప్రమిదలోని ఒత్తిని ఎలుక పట్టుకెళ్లింది. ఆ నిప్పు తాటాకులకు అంటుకొని మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిస్తామని తహసీల్దారు ఆదిలక్ష్మి తెలిపారు.

ఇరువర్గాల కొట్లాట

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం బొండపల్లిలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో నలుగురికి గాయాలయ్యాయి. సంక్రాంతి సందర్భంగా గురువారం రాత్రి గ్రామంలోని కూరాకుల వీధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓ వర్గానికి చెందిన యువకులు ద్విచక్రవాహనాలతో ముగ్గులు తొక్కించడంతో మరో వర్గానికి చెందినవారు ప్రశ్నించారు. ఇరువర్గాలు కొట్లాటకు దిగడంతో పెద్దలు వారించి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. శుక్రవారం ఉదయం సర్వేశ్వరపురం కూడలిలో చికెన్ సెంటర్ వద్ద ఉన్న ఓ యువకుడిని ఒక వర్గానికి చెందినవారు తీవ్రంగా కొట్టారు. దీంతో మరోసారి ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రాజీకి సంప్రదింపులు జరుగుతుండడంతో ఇంకా కేసు నమోదు చేయనట్లు సమాచారం.

నలుగురిపై కేసు నమోదు

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం శ్రీహరిపురం ఆర్‌ఆర్‌కాలనీలో ఈనెల 15న సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేస్తుండగా.. మహిళలపై దుర్భాషలాడినట్లు గ్రామానికి చెందిన చీమల శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన సీమల శ్రీను, రాము, నారాయణమ్మ, శనపతి ఈశ్వరరావుపై కేసు నమోదైందని ఎస్సై పేర్కొన్నారు.

నేతల మృతికి సంతాపం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కలవరాయికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పాటూరు సింహాచలం (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. భార్య, కుమారుడు ఉన్నారు. ఈయన మృతికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, నాయకులు సంతాపం తెలిపారు. గతంలో ఏసీఎస్ అధ్యక్షుడిగా పని చేశారు. ★ **రేగిడి:** రేగిడి మండలం ఒప్పంగి మాజీ సర్పంచి, ఎంపీటీసీ గంటా సింహాచలం (76) ఈనెల 15న ఆకస్మాత్తుగా మృతిచెందారు. రాత్రి నిద్రపోయిన వ్యక్తి ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి మృతిచెంది ఉన్నారు. ప్రస్తుతం ఆయన భార్య శకుంతల పారంపేట ఎంపీటీసీగా, కోడలు మంగమ్మ ఒప్పంగి సర్పంచిగా ఉన్నారు. పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల మండలం గరికివలస ఉన్నత పాఠశాల విద్యార్థిని కేసలి పావని రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ బి.మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థినిని అభినందించారు.

వ్యాసరచనలో ప్రతిభ

బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

గరివిడి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా శ్రీకృష్ణ ఎనలైట్ టెస్టింగ్ అసోసియేషన్ మండలస్థాయి రామాయణ, మహాభారతాల వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించింది. గోదావరి దేవి సరాఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శనపతి ప్రేమ లిఖిత ప్రథమస్థానం సాధించిందని ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థినికి బహుమతి అందజేశారు.

కార్యకర్తలతో సమావేశం

మెరకముడిదాం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ శుక్రవారం మెరకముడిదాం మండలం సోమలింగాపురంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ శిరువూరి వెంకటరమణరాజు ఆహ్వానం మేరకు వచ్చారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు మండల వైకాపా నాయకులు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 101 రకాలతో విందు

రామభద్రపురం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్‌లో కొత్త అల్లుడు పూసర్ల వెంకటసాయికుమార్‌కు అత్తవారు బొడ్డు నాగసైనకుమార్, సత్య 101 రకాల వంటకాలతో భోజనం పెట్టారు.

ఆలయానికి వెండి పళ్లెం బహూకరణ.. మెంటాడ, న్యూస్‌టుడే: చింతలవలసలోని షిర్డీసాయి ఆలయానికి జయతి గ్రామానికి చెందిన ఉప్పల శ్రీను, లక్ష్మి దంపతులు అర కిలో వెండి పళ్లెం బహూకరించారు.

రాజాం అభివృద్ధికి సహకరించండి

జీఎంఆర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, న్యూస్‌టుడే: జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజాం అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. జీఎంఆర్‌ను సత్కరించారు. ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న పెద్దలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం జగన్నాథపురంలో మూడురోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీల్లో పది జట్లు పోటీ పడగా.. ఫైర్‌లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. కింగ్ హిట్టర్ జట్టు ద్వితీయస్థానం సాధించింది. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, సర్పంచి బొద్దల పద్మ, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు చేతులమీదుగా విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

నిర్మించిన వంటగది

మెరకముడిదాం, న్యూస్‌టుడే: ఉత్తరావల్లి ఉన్నత పాఠశాలలో 1992- 97 ఏడాదిలో చదువుకున్న విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. రూ.50 వేలతో పాఠశాలలో వంటగదిని ఏర్పాటుచేశారు. సరస్వతీదేవి విగ్రహాన్ని నిర్మించారు. వాటిని శుక్రవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు అచ్చుతరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2001- 02లో పదో తరగతి చదివిన విద్యార్థులు సంక్రాంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఆనందంగా గడిపారు. తమ గురువులను సత్కరించారు.

మతిస్థిమితంలేని వ్యక్తికి సాయం

రేగిడి, న్యూస్‌టుడే: వావిలవలసలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తికి సపర్యలు చేసి, సత్రంలో ఉంచినట్లు రాహుల్ అన్నదాన సత్రం నిర్వాహకుడు సిద్ధార్థ శుక్రవారం తెలిపారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న అతనికి విద్యాసాగర్, ఎం.త్రినాథ, కె.మురళీకృష్ణ అనే యువకుల సాయంతో క్షవరం, స్నానం చేయించామన్నారు. ఇతని బంధువులు ఎవరైనా ఉంటే వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

నేడు కొటారుబిల్లి కనకదుర్గమ్మ జాతర

కొటారుబిల్లి(గంట్యాడ), న్యూస్‌టుడే: భక్తుల కొంగుబంగారం కొటారుబిల్లి కనకదుర్గమ్మ జాతరకు గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా ముక్కనుమ నాడు ఈ వేడుక నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నూతన ఆలయం నిర్మించాక తొలి జాతర కావడంతో గ్రామస్థులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలివస్తారు. కనీసం 50 వేలమంది పాల్గొంటారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వేడుక ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

వేపాడ మండలంలోని కృష్ణారాయుడుపేటలో ఎడ్ల పరుగు పోటీలు

సందడే.. సందడి

విజయనగరంలో అరిసెలు వండుతున్న యువతులు

సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆడిపాడారు. పలుచోట్ల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన, వేషధారణలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల, కొత్తవలస, డెంకాడ, జామి, ఎల్.కోట, విజయనగరం పట్టణం, గ్రామీణం

కనపెడ్డిపాలెంలో ముగ్గుల పోటీలు

కొత్తవలస మండలం మంగళపాలెంలో..

నగరంలో నిర్మానుష్యంగా రైల్వేస్టేషన్

కొత్తవలస: చిన్నారుల నృత్య ప్రదర్శన

సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న రాపర్తి జగదీష్‌బాబు తదితరులు

గంగిరెద్దుతో యువత

జామి: అంధ ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

చంపావతి నదీ తీరంలో సందడి చేస్తున్న నగరవాసులు

మంగళపాలెంలో పోటీలను తిలకిస్తున్న ప్రజలు

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: **మన శంకరవరప్రసాద్‌గారు, ది రాజాసాబ్** ★ శ్రీకృష్ణ: **అనగనగా ఒక రాజు** ★ ఆదిత్య: **నారీ నారీ నడుమ మురారి** ★ లీలామహల్: **మన శంకరవరప్రసాద్‌గారు** ★ రంజనీ స్క్రీన్- 1: **మన శంకరవర ప్రసాద్‌గారు** ★ శివరంజనీ స్క్రీన్-2: **నారీ నారీ నడుమ మురారీ, అనగనగా ఒక రాజు** ★ హిమగిరి: **మన శంకరవరప్రసాద్‌గారు** ★ సప్తగిరి: **భర్త మహాశయులకు విజ్ఞప్తి** – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఆది అంతం లేనిదే సనాతనం

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆది అంతం లేనిదే సనాతన ధర్మమని, చిరకాలం అలాగే ఉంటుందని నోయిడాలోని ఇస్కాన్ టెంపుల్ కో- ప్రెసిడెంట్ వేదాంత చైతన్య ప్రభూజీ అన్నారు. గవరపాలెం సీతారామ ఆలయంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

నిరుద్యోగులకు నైపుణ్యాలు

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

జేవీఎస్.రావు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించే లక్ష్యంతో చాలామంది నిరుద్యోగులు ప్రైవేటు శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గ్రూప్స్ వంటి పరీక్షలకైతే రాష్ట్రాలు దాటి మరీ వెళ్తున్నారు. అయితే ఇదంతా ఖర్చుతో కూడుకున్నది కావడంతో కొందరు ఇంటి వద్దే చదువుకుంటున్నారు. అలాంటి వారికి అండగా నిలుస్తున్నారు నెల్లిమర్ల మండలం బొప్పడాం జడ్పీహెచ్‌ఎస్‌లో భౌతిక శాస్త్ర సహాయకుడిగా పనిచేస్తున్న జె.వి.ఎస్. రావు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా సేవా దృక్పథంతో నిరుద్యోగులకు గ్రూపు-1, 2, వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. పది మందికి సాయం చేయాలని ఆలోచనతో పదేళ్ల క్రితం ఇంటి నుంచే మొదలైన అతని ఆశయం ఇటీవల కాలంలో బాహ్య ప్రపంచానికి పరిచయమైంది. గడిచిన డిసెంబరు నుంచి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పేద విద్యార్థులకు సెలవు దినాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. త్వరలో వారానికి మూడు రోజుల పాటు కోట వద్ద సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు ప్రకృతి పాఠాలు

జీవనశైలిలో మార్పులు, మారిన ఆహారపు అలవాట్లతో చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈక్రమంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ, మొక్కల పెంపకంపై సూచనలు చేస్తున్నారు విజయనగరానికి చెందిన బి.కాంతిశ్రీ. ఎంఏ ఎంఈడీ చేసిన ఆమె, ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నా.. విద్యార్థుల ద్వారా సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే గతేడాది ఆగస్టు నుంచి వి.టి.అగ్రహారంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఉచితంగా సాంఘికశాస్త్రం బోధిస్తున్నారు. అధిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో నష్టాలు, సేంద్రియ సాగుతో లాభాలను తెలియజేస్తున్నారు. బాలల పుట్టిన రోజున ఆక్సిజన్ మొక్కలు ఇస్తున్నారు. భూమి, ప్రకృతి, వాతావరణం, పోషకాలు, మూలకాలు, మొక్కలు.. ఇలా పర్యావరణంతో పాటు మానవ శరీరానికి ఉపయోగపడే అంశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని చెబుతున్నారు. మరోవైపు మిద్దె పంట పెంచుతున్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూప్‌నకు అడ్మిన్‌గా ఉన్నారు.

విద్యార్థినికి మొక్క అందజేస్తున్న కాంతిశ్రీ

కాలువల్లేక అవస్థలు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో పక్కా కాలువలు లేవు. దీంతో రోడ్డుపైనే మురుగు పారుతోంది. స్థానిక 50వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఇళ్లల్లో నుంచి వచ్చే వాడుక నీరు పోయేందుకు మార్గం లేదు. ఈక్రమంలో దోమలు విజృంభిస్తున్నాయని, పందుల బెడద ఎక్కువైందని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్లపై మురుగు పారకుండా చూస్తామన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ట్యాంక్‌బండ్ మార్గంలో అంధకారం

నగరంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. బాలాజీ కూడలి నుంచి ఎల్‌బీసీ భవనం వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వారం రోజులుగా చీకటి అలుముకుంటోందని చోదకులు చెబుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వైపు వెళ్లడానికి ఇది ప్రధాన దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎగ్జిబిషన్ గ్రౌండ్, ఆచంట గార్డెన్స్ ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల వారు ఫిర్యాదులు చేస్తున్నారు. కుక్కల గుంపులు సైతం వెంటాడుతున్నాయని చెబుతున్నారు. ఈ సమస్యపై నగరపాలిక డీఈఈ రత్నాకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. దీపాలను బాగుచేయిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

గుంతల రోడ్డుతో అవస్థలు

డెంకాడ మండలం డి.తాళ్లవలస గ్రామం నుంచి అమకాం ప్రాంతానికి వెళ్లే రహదారి పూర్తిగా పాడై గోతులతో అధ్వానంగా తయారైంది. రాత్రి సమయాలలో రాకపోకలు సాగించేటపుడు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఎంపీడీవో భవానీని 'న్యూస్‌టుడే' వివకరణ కోరగా.. పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, డెంకాడ

కనక మహాలక్ష్మికి కుంకుమార్చన

సంక్రాంతి సందర్భంగా నగరంలోని సిటీబస్టాండ్ కనకమహాలక్ష్మికి గురు, శుక్రవారాల్లో లక్ష కుంకుమార్చన సేవ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గాయత్రీశర్మ ఆధ్వర్యంలో పూజలు సాగాయి. ఈ సందర్భంగా అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

రామనారాయణంలో గోపూజ

విజయనగరం గ్రామీణం, కంటోన్మెంట్: విజయనగరం రామనారాయణంలో శుక్రవారం కనుమ సందర్భంగా నిర్వాహకులు ఎం.వెంకటరమణ, ఉమారత్నం ఆధ్వర్యంలో గోపూజ జరిగింది. అనంతరం నాగదేవతకు పాలాభిషేకం చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానం-హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో గోపూజ జరిగింది.

నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అర్చకులు సోమశేఖర్ కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు సాగాయి.

ఘనంగా నారితల్లెమ్మ తీర్థం

జామి, న్యూస్‌టుడే: మండలంలో తానవరం గ్రామంలో నారితల్లెమ్మ తీర్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆలయంలో గుండాన్ని అమ్మవారిగా పూజిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కనిమెల్ల గ్రామానికి చెందిన సింగిపురపు రమణ కందివలస వద్దగల రహదారి దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

దల్లిపేట గ్రామంలో మరొకరికి..

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలంలోని దల్లిపేట గ్రామానికి చెందిన కొయ్య అప్పన్న గురువారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

మూడు ఆలయాలో హుండీల నగదు చోరీ

డెంకాడ, న్యూస్‌టుడే: డెంకాడ మండలంలోని రఘుమండ, అమకాం గ్రామాల్లోని మూడు ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి కొంత మంది యువకులు హుండీలను పగులగొట్టి అందులోని నగదును అపహరించారని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. రఘుమండ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి అయిదుగురు యువకులు హుండీను పగులగొట్టి అందులోని సుమారు రూ.84 వేల నగదును అపహరించారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ ప్రదేశంలో ఉండటంతో ముగ్గురిని పట్టుకున్నారు. మరో ఇద్దరు ద్విచక్రవాహనంపై పరారయ్యారు. అమకాం గ్రామంలోని పోలమ్మతల్లి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల హుండీల్లో రూ.80వేలు చోరీకి గురైందని కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. నిందితులు డెంకాడలోని యాతపేట, విజయనగరం దాసన్నపేట, ఆనందపురం మండలం గొట్టిపల్లి ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామ్మూర్తి, హెచ్‌సీ కృష్ణ తెలిపారు.

బహుమతులతో విద్యార్థులు

విజయనగరం గ్రామీణం: మకరసంక్రాంతి సందర్భంగా రెండు రోజుల పాటు విజయనగరం మండలం గుంకలాం ఎడ్యుకేటెడ్ మెంబర్స్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉపాధ్యాయుడు భాస్కరరావు తదితరులు పుస్తకాలు అందించారు.

త్రిపురనేనికి నివాళి

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: సంఘ సంస్కర్త, హేతువాది, రచయిత త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి గురువారం నగరంలోని పోలీసు కార్యాలయంలో జరిగింది. అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

సీతారాంపురంలో వంటల పోటీలు

ఎస్.కోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలంలోని సీతారాంపురం గ్రామంలో పండగ సందర్భంగా శుక్రవారం పిండి వంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. డోకుల అచ్చంనాయుడు ఆధ్వర్యంలో పోటీలు ఆసక్తిగా సాగాయి. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

గ్రామాల్లో జోరుగా కోడి పందేలు

డెంకాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా పలు గ్రామాల్లో కోడి పందేలు జోరందుకున్నాయి. మండలంలోని చొల్లంగిపేట, ముంగినాపల్లి, గునుపూరుపేట, డెంకాడ, జొన్నాడ, అమకాం, తమ్మాపురం, తదితర గ్రామాల శివారు ప్రాంతాలు, మామిడితోటల్లో పందేల శిబిరాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వేలల్లో బెట్టింగులు కాస్తున్నారు. వీటిని తిలకించేందుకు విజయనగరం, తదితర ప్రాంతాలనుంచి జనం భారీగా తరలివస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) విజయనగరం పట్టణం - 80089 02900 విజయనగరం గ్రామీణం - 80085 74317 ఎస్.కోట - 80085 74326 భోగాపురం - 70959 54646

? వీటీ.అగ్రహారం నుంచి ముడిదాం వెళ్లే రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**

★ కార్మికులతో శుభ్రం చేయిస్తాం.

- శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

? తోటపాలెం సాయినగర్‌లో కుక్కల సంచారం ఎక్కువైంది. **- స్థానికులు**

★ అక్కడి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తాం.

- కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

? దాసన్నపేట నాలుగు రోడ్ల కూడలి నుంచి రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో గుంతలు ఏర్పడ్డాయి. **- స్థానికులు**

★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ప్రసాద్, ఈఈ, నగర పాలక సంస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పలకల ఏర్పాటు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలిక పరిధిలోని బాలాజీ నగర్ ప్రాంతంలో కల్వర్టులపై పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఈఈ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి చర్యలు తీసుకున్నారు.

జాతీయ పోటీలకు పయనం

కొత్తవలస, న్యూస్‌టుడే: ట్యాంగ్ సూడో స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు శుక్రవారం దిల్లీకి చేరుకుందని కంటకాపల్లికి చెందిన ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముఖ్య శిక్షకుడు ప్రకాశరావు తెలిపారు. ఈ నెల 18న నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున అన్ని విభాగాల్లోనూ 16 మంది పాల్గొంటున్నారని తెలియజేశారు. రాష్ట్ర జట్టుతో శిక్షకుడు ప్రేమ్ కుమార్, మేనేజర్ టి.రేవంత్ ఉన్నారన్నారు.

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని అంజనీపుత్ర వాకర్స్ క్లబ్ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు, వృద్ధులకు అండగా నిలిచారు. స్థానిక మున్సిపల్ నడక మైదానం, అయ్యన్నపేట ఎస్సీ, బీసీ కాలనీల్లో శుక్రవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని వావిలపాడు పంచాయతీ కడకొండలో 40 గిరిజన కుటుంబాలకు బీల పెద తాతా జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రగ్గులు, నీటి సీసాలను గురువారం పంపిణీ చేశారు. బీల సతీష్, దేముడునాయుడు, వార్డు సభ్యురాలు పాలి ఈశ్వరమ్మ, బూడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రగ్గులు అందిస్తున్న కుటుంబీకులు

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

విద్యార్థికి బహుమతి అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ తదితరులు

జామి, న్యూస్‌టుడే: జామి మండలం భీమసింగి గ్రామానికి చెందిన గార కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు ఫౌండర్, ప్రెసిడెంట్ గార ఈశ్వరరావు ఆర్థిక సహకారంతో పంచాయతీ పరిధిలోని 7 గ్రామాలకు చెందిన 11 మంది విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు, షీల్డు, ప్రశంసాపత్రం గురువారం రాత్రి అందజేశారు. ముఖ్య అతిథిగా విజయనగరం డిప్యూటీ కలెక్టరు కోరాడ శ్రీనివాసరావు హాజరయ్యారు. సర్పంచి జె.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు డి.హైమావతి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరింది

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలోని సోంపురం ఎస్సీ కాలనీవాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మండల పరిషత్తు నిధులు రూ.7 లక్షలతో సర్పంచి మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సత్యన్నారాయణ చొరవతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. పండగ సందర్భంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చి, ఒక్కో స్టీలు బిందెని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు చేతుల మీదగా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



డెంకాడ: ట్రోఫీలతో సందడి చేస్తున్న క్రీడాకారులు, యువకులు

డెంకాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ టోర్నీల్లో యువత పాల్గొన్నారు. డెంకాడ మండలంలోని గునుపూరుపేట గ్రామంలో గురువారం జీపీఎల్ పేరిట నిర్వహించిన టోర్నీలో ఆరు జట్లు తలపడగా విన్నర్, రన్నరప్ జట్లకు నగదు బహుమతులు, క్రీడాకారులకు ట్రోఫీలను అందజేశారు.

జామి, న్యూస్‌టుడే: గొడుకొమ్ము గ్రామంలో పండగ సందర్భంగా క్రికెట్ పోటీలను ఆ గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. వారం రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో జామి, ఎల్.కోట, కొత్తవలస, ఎస్.కోట మండలాల్లోని 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో అలమండ జట్టు అలమండ సంత బృందపై విజయం సాధించింది. విజేతలకు రూ.15, రూ.8 వేల చొప్పున అందజేశారు.

పెదకొండ్రాజుపాలెంలో పూరిల్లు దగ్ధం

భోగాపురం, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన భోగాపురం మండలంలోని పెదకొండ్రాజుపాలెంలో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బి.సన్యాసి ఇంటిలో మంటలు వ్యాప్తి చెందడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకొని మంటలను అదుపుచేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. పండగ వేళ జరగడంతో కన్నీరుమున్నీరవుతున్నారు.

మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

(c) eenadu

కనులపండువగా.. శ్రీవారి కనుమ మహోత్సవం

రాజాధిరాజ వాహనంపై ఊరేగింపుగా వస్తున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చిన వెంకన్న కనుమ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణలు.. పండితుల వేద మంత్రాల నడుమ వేడుకగా నిర్వహించారు. దొరసానిపాడు కనుమ మండపంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక పట్టాన్ని తిలకించిన భక్తకోటి పునీతమైంది. తొలుత కనుమ మండపాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం సమయంలో ద్వారకాతిరుమల ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడ్ని రాజాధిరాజ వాహనంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి ఊరేగింపుగా దొరసాని పాడులోని కనుమ మండపం వద్దకు పయనమయ్యారు. స్వామి, అమ్మవారిని కనుమ మండపం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు, పండితులు స్వామికి హారతులు పట్టారు.

తరలి వచ్చిన భక్తులు

తలపడిన కోళ్లు.. చేతులు మారిన కోట్లు

- సంప్రదాయం మాటున భారీగా పందేలు
- మూడు రోజులు పండగ సందడి

ఈనాడు-ఏలూరు, భీమవరం: ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు.. సంప్రదాయ క్రీడలు.. కోడి పందేలు.. జూదాలు.. బరులకు సినిమా సెట్టింగ్‌లు, ఎల్‌ఈడీ తెరలు.. ప్రత్యక్ష ప్రసారాలతో ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సంక్రాంతి పండగ మూడు రోజులూ సందడిగా సాగింది. సంప్రదాయం మాటున ఉమ్మడి జిల్లాలో కోడిపందేలు, కోతాట, గుండాట తదితర జూదాలు రికార్డు స్థాయిలో జరిగాయి. పెద్ద, చిన్నవి కలిపి 300కు పైగా బరులు వాటిల్లో వెయ్యి దాకా జూద శిబిరాలు నడిచాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల కాంతిలో కొనసాగాయి. మూడు రోజుల్లో కలిపి రూ.వందల కోట్లు చేతులు మారాయి. డబ్బులు పోగొట్టుకున్న వాళ్లు కొందరు బరుల వద్దే రభస సృష్టించారు. మీర్జాపురం, గౌరవరం బరుల్లో వివాదం ఏర్పడి కొంతసేపు పందేలు నిలిచాయి. ఇలాంటి స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగియటంతో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం, నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

విచ్చలవిడిగా...

పగలు, రాత్రి తేడా లేకుండా బరుల్లో కోడి పందేలు, జూద క్రీడలు విచ్చల విడిగా సాగితే ఏ ఒక్క చోట అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. ఓ ప్రజాప్రతినిధి బరి నిర్వహించగా మరో ప్రజాప్రతినిధి అన్నీ తానే చూసుకుంటానని నిర్వాహకుల నుంచి రూ.3 కోట్లు జేబులో వేసుకున్నారు. మరో ముఖ్యనేత అండతో అతి పెద్ద బరి ఏర్పాటైంది. నేతలకు బరులు కాసులు కురిపించాయి. బరులను తొలగించాలంటూ శుక్రవారం సాయంత్రం నుంచి పోలీసుల హడావుడి ప్రారంభించారు.

బహుమతులుగా కార్లు, బైకులు

మీర్జాపురం, దుగ్గిరాల, చేబ్రోలు, నారాయణపురం, తాడేపల్లిగూడెం, తణుకు, పెదఅమిరం, ఐ.భీమవరం, వెంప, నరసాపురం తదితర ప్రాంతాల్లో రూ.కోటికిపైగా పందెం ఒకటి, రూ.25 లక్షల పందేలు మూడు జరిగాయి. మిగిలినవి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల దాకా మరికొన్ని రూ.50 వేల నుంచి రూ.5 లక్షల మధ్య జరిగాయి. గెలిచినోళ్ల పందెం సొమ్ముతోపాటు ప్రోత్సాహక బహుమతులుగా కార్లు, ఖరీదైన మోటారు బైకులు దక్కించుకున్నారు. మండవల్లి మండలానికి చెందిన ఓ రొయ్యల వ్యాపారి తన కోళ్ల ఐదు పందేలు నెగ్గటంతో నగదుతోపాటు రూ.11 లక్షల కారు ఒకటి దక్కింది.

సీతారాంపురం నార్త్‌లో బరి వద్ద నృత్య ప్రదర్శన

కారుకు 200.. బైక్‌కు 100

పందేలను చూసేందుకు వెళ్తున్న వారికి పార్కింగ్ ఫీజు వసూలు చేయడం పెదవేగి మండలం దుగ్గిరాలలో కనిపించింది. కారుకు రూ.200, ద్విచక్ర వాహనానికి రూ.100 చొప్పున బౌన్సర్లతో వసూలు చేశారు.

- ఈనాడు, ఏలూరు.

సినీ తారల సందడి

పెదఅమిరంలో కోడి పందేలు తిలకిస్తున్న ఉప సభాపతి రఘురామ, కైకలూరు ఎమ్మెల్యే కామినేని, దగ్గుపాటి సురేష్

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన కోడి పందేల్లో సినీ తారలు సందడి చేశారు. శుక్రవారం ఉప సభాపతి రఘురామరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ప్రముఖ సినీ నిర్మాత దగ్గుపాటి సురేష్, నటీనటులు హేమ, రోషన్, డింపుల్ హయాతితోపాటు టీవీ యాంకర్లు, హాస్యనటులు హాజరయ్యారు. పోటీలో గెలుపొందిన వారికి రోషన్, డింపుల్ చేతుల మీదుగా నగదు బహుమతి అందించారు.

పెదఅమిరం బరిలో నగదు అందిస్తున్న సినీనటి డింపుల్ హయాతి, నటుడు రోషన్

స్వర్ణాభరణాలతో అలంకరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం దుర్గాపురంలో జరిగిన కోడిపందేల్లో ఒకేసారి 6 పుంజులను బరిలోకి వదిలారు. ఆ పందెంలో అయిదింటిని చంపిన కోడిపుంజుకు బంగారు గొలుసు మెడలో వేసి నిర్వాహకులు ఊరేగింపు నిర్వహించారు. పందెంలో గెలిచిన కోడిపుంజుకు దాదాపు 15 కాసుల బంగారు ఆభరణాలు, పులిగోరుతో అలంకరించారు.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కోడి పందేల నేపథ్యంలో పలు ప్రధాన మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. భీమవరం-నరసాపురం, భీమవరం-లోసరి మార్గాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. తాడేరు, డేగాపురం, గొల్లవానితిప్ప వద్ద ప్రధాన రహదారులను ఆనుకొని బరులు ఏర్పాటు చేయడంతో అక్కడికి భారీ సంఖ్యలో వచ్చిన వాహనాలతో సమస్య జటిలంగా మారింది.

మాల కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ వధూవరులకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (17 జనవరి 2026, శనివారం), రేపు (18 జనవరి 2026, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 80086 21414 & 91549 18858 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

పోటెత్తిన భక్తులు.. చేతులెత్తేసిన అధికారులు

అంతరాలయంలో దర్శించుకుంటున్న భక్తులను లాగుతున్న సీఐ, మహిళ పోలీసులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఉత్సవాల్లో ఆలయ అధికారుల ఆలసత్వం బయట పడింది. కొత్త కమిటీ తమ దర్పం ప్రదర్శించేందుకు లెక్కకు మించి భక్తులను తీసుకురావడంతో సామాన్య భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చామని.. కనీసం వృద్ధులకు, పిల్లలకు మంచినీరిచ్చే నాథుడే కరవయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుమ రోజు కావడంతో భక్తులు మొక్కులు చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు కిలో మీటర్ దూరం వరకు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులను అదుపు చేయలేకపోవడంతో పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. క్యూలో ఉన్నవారు గంటల తరబడి ఎండలో నిల్చొని అవస్థలు పడ్డారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మరో పక్క ఓ ధర్మకర్తను పోలీసులు పంపించకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. భక్తులను పంపించే క్రమంలో మహిళతో అనుచితంగా ప్రవర్తించిన పోలీసులకు ప్రధానార్చకుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

తిరుగు ప్రయాణంలోనూ తిప్పలే..!

సంక్రాంతి ముగియడంతో సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుప్రయాణమవుతున్నారు. ఏలూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం సాయంత్రం బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు.

-ఈనాడు, ఏలూరు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

యలమంచిలి : ఉన్నత పాఠశాలలో 1994- 95 బ్యాచ్

ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన వాళ్లు పండగకు సొంతూళ్లకు వచ్చి పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు పెట్టుకున్నారు. చింతలపూడి మండలం శివాపురంలో ఎన్నారై వాసు 80 మంది విద్యార్థులకు రూ.3 వేల చొప్పున ఉపకార వేతనమిచ్చారు. దాసరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గులు, సైకిల్ పోటీలు నిర్వహించి విద్యార్థులు, మహిళలు 500 మందికి చేయూతనిచ్చారు. పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు పండగ సందర్భంగా వచ్చి సమావేశాలు పెట్టుకున్నారు. -న్యూస్‌టుడే, పాలకొల్లు

నేత్రపర్వం.. ప్రభల ఉత్సవం

ఆచంట మండలంలో ప్రభల ఉత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. కరుగోరుమిల్లి, పెనుమంచిలి, కందరవల్లి, వల్లూరు, కోడేరు, భీమలాపురం తదితర గ్రామాల్లో శైవక్షేత్రాల్లో ఉత్సవ మూర్తులను రంగురంగుల ప్రభలపై కొలువుదీర్చి వరిచేలు, పంట కాలువలు దాటుకుంటూ తీర్థాల పుంత వద్దకు చేర్చి పూజలు చేశారు. -న్యూస్‌టుడే, ఆచంట

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆయన తన స్వగ్రామమైన ఆగర్తిపాలెంలో శుక్రవారం పొలం పనుల్లో పాల్గొన్నారు. వ్యవసాయ కార్మికులతో కలిసి పొలంలో దిగి ఎరువు చల్లారు. అనంతరం ఎరువుల వినియోగంపై రైతులు, కార్మికులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని, అపార ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

పొలంలో ఎరువు చల్లుతున్న మంత్రి నిమ్మల

దారిద్ర్యం నుంచి దశ తిరిగి

31-10-25న ప్రచురితమైన కథనం

31-08-25న

తాడేపల్లిగూడెం పట్టణానికి రావాలంటే గుంతలమయమైన రహదారులతో గత అయిదేళ్లలో వాహన చోదకులు, ప్రయాణికులు నరకయాతన పడ్డారు. తరచూ ప్రమాదాల బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఈ దుస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతూ 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పట్టుబట్టి మరీ ఈ రహదారిని బాదంపూడి పెట్రోల్ బంకు నుంచి ప్రత్తిపాడు వై జంక్షన్ వరకు 12 కిలోమీటర్ల దారిని రూ11.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. దీంతో వాహన చోదకులు, స్థానికులు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి నిర్మాణం తర్వాత ఇలా..

- ఈనాడు, తాడేపల్లిగూడెం, న్యూస్‌టుడే, ప్రతిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

బయనేరు.. బాధ తీర్చేదెవరు



వేదాంతపురం సమీపంలో బయనేరు వాగుపై సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన ఆ తర్వాత కొద్ది కాలానికే వరదలకు కొట్టుకుపోయింది. శ్లాబ్ ఎక్కడికక్కడ విరిగి మూడు ముక్కలైంది. వేదాంతపురం పరిసర గ్రామాల నుంచి బుట్టాయగూడెం మండలం కంగాలవారిగూడెం, తదితర గిరిజన గ్రామాలకు వెళ్లడానికి వీలుగా ఈ వంతెన నిర్మించారే కానీ ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. రైతులు, వ్యవసాయ కూలీలకు అగచాట్లు తప్పడం లేదు. చేసేది లేక విరిగిన వంతెన స్థానంలో సిమెంట్ స్తంభాలను అడ్డుగా వేసి వాటిపై ప్రమాదకరంగా దాటుతున్నారు. వాహనాలు తిరిగే అవకాశం లేక కొందరు లక్ష్మడుగూడెం వెళ్లే మార్గంలో కాలువను దాటుతూ గమ్యం చేరుతున్నారు. తమ ఇక్కట్లు తీరేలా వంతెనను పునర్ నిర్మించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

ఘనంగా పెళ్లికూతురమ్మ తిరునాళ్లు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట, శేషమ్మచెరువు గ్రామాల మధ్య పెళ్లికూతురమ్మ తిరునాళ్ల శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వధూవరుల ప్రతిమలకు భక్తులు పూజలు చేశారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సంక్రాంతి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 18న విశాఖపట్నం-చర్లపల్లి(08517), 19న చర్లపల్లి-విశాఖపట్నం(08518) రైళ్లు నడుస్తాయని చెప్పారు. మార్గం మధ్యలోని దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, రాయనపూడి, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ-పంట.. ఏఐ అండ!

వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే యాప్ తీసుకురాగా.. తాజాగా రబీలో కృత్రిమ మేధ(ఏఐ)ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అత్యధికంగా వరి.. జిల్లాలో పంట కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలు అందాలన్నా.. ఈ-పంట నమోదు తప్పనిసరి. ప్రస్తుతం సర్వే నంబర్లను ల్యాండ్ పార్సిల్స్‌గా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు.

లింక్ ఓపెన్ చేయగానే.. రైతుల ఫోన్లకు సంక్షిప్త సందేశం(మెసేజ్) పంట వివరాల నమోదు ముందు, చేసిన రోజు, ఆ తర్వాత ధ్రువీకరణతో సమాచారం వస్తోంది. రైతులకిచ్చిన సంక్షిప్త సందేశంలో లింక్ ఓపెన్ చేసి ఈ- పంటలో నమోదైన వివరాలు సరిచూసుకోవచ్చు. భూ విస్తీర్ణం తగ్గిన, పంట రకం తప్పుగా నమోదైతే.. అందులోనే నేరుగా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించింది.

జిల్లా రబీ సమాచారమిలా(ఎకరాల్లో).. సాధారణ సాగు విస్తీర్ణం: 2,38,605, ఇప్పటి వరకు సాగైంది: 1,01,600, ఈ-పంట నమోదుకు గుర్తింపు: 3,54,476, ఇప్పటి వరకు నమోదైంది:15,069, ఈ-పంటలో నమోదు:24,620, రైతులు:8,844

అధికారి పోస్టు ఖాళీ.. ఇన్‌ఛార్జికి లేదు

ఏ శాఖలోనూ పూర్తిస్థాయిలో అందని సేవలు

కొయ్యలగూడెం గ్రామీణ, ఉంగుటూరు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో కీలకమైన పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్లుగా భర్తీకి నోచుకోకపోవడంతో ప్రజలకు సేవలు అందడంలేదు. ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఒక్కో అధికారికి నాలుగైదు మండలాల బాధ్యతలను అప్పగించడంతో ఎవరికీ అందుబాటులో లేక, సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

☆ కొయ్యలగూడెంలోని హోమియో వైద్యశాలలో వైద్యాధికారి పోస్టు కొన్ని నెలలుగా భర్తీకి నోచుకోలేదు. వైద్యం కోసం దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ మధ్య జరిగిన బదిలీల్లో ఇక్కడి వైద్యాధికారి బదిలీపై వెళ్లారు. కాంపౌండరు పోస్టు కూడా ఖాళీగానే ఉంది. అటెండరు పోస్టు మాత్రమే భర్తీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు డాక్టరు గారు లేరు అని చెప్పడానికే ఆమె పరిమితమయ్యారు. జిల్లాలో మూడు చోట్ల ఆయుర్వేద, రెండు చోట్ల హోమియో వైద్యాధికారి పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

☆ ఉంగుటూరు మండల తహసీల్దారు స్థానం 15 నెలలుగా ఖాళీగానే ఉంది. డిప్యూటీ తహసీల్దారుకు బాధ్యతలు అప్పగించి చోద్యం చూస్తున్నారు. రీసర్వే బాధ్యతలు కూడా చూడాల్సి రావడంతో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు తగిన న్యాయం జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాట్రాయి మండలంలోనూ కీలకమైన తహసీల్దారు, ఎంపీడీవో స్థానాలు కొన్ని నెలలుగా ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటీ ఎంపీడీవోగా మారిన ఈవోపీఆర్డీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

✦ కొయ్యలగూడెంలో ఉద్యానశాఖ అధికారికి జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల బాధ్యతలను అప్పగించారు. జలవనరుల శాఖలోనూ ఇదే పరిస్థితి. ఉపాధిహామీ పథకం ఏపీవోకు చింతలపూడికు ఇన్‌ఛార్జిగా నియమించారు. కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు వైద్య సెలవుపై వెళ్లడంతో కొన్ని నెలలుగా ఆ స్థానం ఖాళీగా ఉండి చదువరులు కేవలం పత్రికల పఠనానికే పరిమితమయ్యారు.

✷ ఆయుష్ వైద్యశాలల్లో ఖాళీలు ఉన్న చోట్ల ప్రభుత్వ నియామకాలు జరిపే వరకు ఇన్‌ఛార్జులను నియమిస్తామని ఆయుష్ ఆర్‌డీడీ కుమార్‌బాబు చెప్పారు. గ్రంథాలయాల్లో ఖాళీ స్థానాల్లో ఇన్‌ఛార్జులను నియమించడానికి కూడా అవకాశం లేకుండా ఉందని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

చదువులమ్మ గుడికి.. అపూర్వ సంక్రాంతి!

సర్కారు బడుల ప్రగతికి చేయూత

భీమవరం పట్టణం, ఆచంట, పాలకోడేరు, నరసాపురం, పెనుమంట్ర, పోడూరు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు, వ్యాపారాలు, పారిశ్రామిక రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సంక్రాంతి వేళ తప్పనిసరిగా సొంతూళ్లకు వస్తుంటారు. ఇలాంటి వారంతా తాము విద్యాబుద్ధులు నేర్చిన సర్కారు బడుల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు బాల్య మిత్రులంతా కలిసి సందడి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూతనిచ్చి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. పశ్చిమలో గత కొన్నేళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా ఆత్మీయ సమ్మేళనాల సందర్భంగా పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులకు విరాళాలు ప్రకటించారు. కొన్ని చోట్ల గతంలో చేపట్టి పూర్తి చేసిన నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేశారు.

శృంగవృక్షం పాఠశాలలో రూ.11.25 లక్షలతో నిర్మించిన భోజనశాల

☛ భీమవరం ఏఆర్‌కేఆర్ పురపాలకోన్నత పాఠశాల ఆవరణలో 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఇటీవల రూ.2 లక్షలతో సరస్వతీమాత, లక్ష్మీదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

☛ మొగల్తూరు మండలం కేపీ పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు 2005-06 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50 వేలతో వంట, భోజన సామగ్రి సమకూర్చారు.

☛ పోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమకూర్చిన రూ.30 వేలతో అభివృద్ధి చేశారు. మైక్‌సెట్ ఇచ్చేందుకు ఇటీవల తీర్మానించారు.

☛ ఆచంట మండలం వల్లూరు పాఠశాల ప్రాంగణంలో రేకుల షెడ్డుకు 1978-79 బ్యాచ్ విద్యార్థులు సీలింగ్ వేయించారు. పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు సమకూర్చారు.

☛ శృంగవృక్షం జడ్పీ పాఠశాలల ప్రాంగణంలో 1991-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.11.25 లక్షలతో మధ్యాహ్న భోజనశాల నిర్మించారు.

రూ.30 వేలతో శుభ్రం చేసిన పోడూరు క్రీడా మైదానం

.. ఇలా జిల్లాలో చాలా పాఠశాలలకు పూర్వ విద్యార్థులు సాయమందిస్తున్నారు. భీమవరం పీఎస్ఎం, యూన్నీ లక్ష్మీబాయి బాలికోన్నత పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ప్రతిభ కలిగినవారికి ఏటా రూ.2.50 లక్షల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. మొగల్తూరులో పెన్మెత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థులు గతంలో రూ.20 లక్షల వరకు సమకూర్చారు. కేపీపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ నిర్మాణానికి, ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో భోజనశాల, సౌర విద్యుత్తు ప్లాంటు, సైకిల్‌స్టాండ్ల నిర్మాణాలకు పూర్వ విద్యార్థులే నిధులు సమకూర్చారు.

రేవ్ పార్టీకి తెరతీసి.. పోలీసులకు చిక్కి..

ముఖ్యనేత ఒత్తిడితో జూదంగా కేసు నమోదు

ఈనాడు-ఏలూరు, గణపవరం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో సంక్రాంతి పండగ వేళ రేవ్ పార్టీకి తెర దీసిన నిర్వాహకులు పోలీసులకు చిక్కారు. అయితే పోలీసులు వాస్తవాలు దాచి వక్రభాష్యం చెప్పారు. ఈ వ్యవహారంలో ముఖ్య నేత ఒకరు జోక్యం చేసుకుని తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవటంతో పోలీసులు తలొగ్గి జూదం ఆడుతూ పట్టుబడ్డారని పొంతన లేని కేసు నమోదు చేసి కథ సుఖాంతం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం..

★ భోగి పండగ నాడు అర్ధరాత్రి వేళ (తెల్లవారితే గురువారం) గణపవరం- వెంటపాడు పోలీస్ స్టేషన్ల సరిహద్దులోని ఓ ఆక్వా చెరువు వద్దకు సుమారు 30 మంది పురుషులు, నలుగురు యువతులు ఖరీదైన కార్లలో చేరుకున్నారు. గత వైకాపా హయాంలో గుడివాడలో నిర్వహించిన క్యాసినో తరహాలో యువతులతో అశ్లీల నృత్యాలు చేయించటానికి అర్ధరాత్రి వేళ అక్కడకు రప్పించి అందుకు ఏర్పాట్లు చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకున్నారు. నిర్వహణ పనుల్లో ఉన్నవారిని వారి కార్లను అదుపులోకి తీసుకున్నారు. నృత్యాలు చేయటానికి తీసుకొచ్చిన యువతులను మాత్రం తప్పించేశారు. వారిని ఎందుకు తప్పించాల్సి వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. అయితే అక్కడ ఉన్న వారంతా ప్రముఖుల కుటుంబాలకు చెందిన వ్యక్తులు, ఆపై వారంతా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఉన్నతోద్యోగులు.. వ్యాపారులుగా తెలిసింది. దీంతో ఒకరిద్దరు నేతలు జోక్యం చేసుకుని పొంతన లేని కేసు పెట్టి కథ సుఖాంతం చేశారని సమాచారం.

ఖరీదైన కార్లు.. సూటు బూటేసుకుని అర్ధరాత్రి వేళ కంపుకొట్టే రొయ్యలు, చేపల చెరువుల వద్దకు జూద మాడటానికి వచ్చారంటే నమ్మశక్యం కావటం లేదు. పండగ మూడు రోజులు ఊరువాడ భారీ బరులు ఏర్పాటు చేసి ఒక వైపు కోడి పందేలు మరో వైపు జూద శిబిరాలు నిర్వహిస్తే కనీసం వాటివైపు కన్నెత్తి చూడని పోలీసులు ఎక్కడో రొయ్యల చెరువు వద్ద జూదమాడుతున్నారని తెలిస్తే వెళ్లి పట్టుకుని కేసు నమోదు చేశామని చెప్పటం మరీ విచిత్రం. ఎంతో ఖరీదైన కార్లలో వచ్చిన వారి నుంచి పట్టుబడిన సొమ్ము రూ.25 వేలు మాత్రమేనని చెబుతున్నారు. 16 కార్లలో వచ్చిన 28 మంది నుంచి లభ్యమైంది ఆ కొద్దిమొత్తమేనట.

ఎస్సై ఏమన్నారంటే.. గణపవరం ఎస్సై మణికుమార్ మాట్లాడుతూ ఘటనా స్థలంలో యువతులు ఎవరూ లేరని, మద్యం తాగుతూ పలువురు యువకులు జూదం ఆడుతుండగా పట్టుకుని వారి నుంచి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అది సంధ్యా సాయికి చెందిన ఆక్వా చెరువు అని చెప్పారు.

గంగానమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

అమ్మవారి సన్నిధిలో జస్టిస్ మన్మథరావు తదితరులు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తూర్పువీధి గంగానమ్మ జాతర నేత్ర పర్వంగా కొనసాగుతోంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు గురువారం మేడలోని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్ కమిటీ సభ్యుడు జిల్లెళ్లమూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆహ్వానం మేరకు ఏలూరు వచ్చి, గ్రామ దేవతను దర్శించుకున్నట్లు చెప్పారు. అంతకుముందు జస్టిస్ కె.మన్మథరావుకు జాతర కొలుపుల కమిటీ సభ్యులు మేళతాళాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాశ్, సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, శ్రీనివాస్, పి.దుర్గాప్రసాద్, సత్యనారాయణ, శ్రీకృష్ణ సాయితేజ, సాయిబాబా, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేంకన్నను దర్శించుకున్న జస్టిస్ సుధీర్‌కుమార్

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం జస్టిస్ సుధీర్ కుమార్‌ను పాలకమండలి ఛైర్‌పర్సన్ పాలడుగు రమాదేవి దంపతులు సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

19 నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 19 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో పాడి రైతులకు మెరుగైన సేవలందించాలని అధికారులను ఆదేశించారు. పాడిరంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

విద్యుత్తు సరఫరా, టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్తు సరఫరా, టారిఫ్‌పై ఈ నెల 20న తిరుపతి, 22, 23 విజయవాడ, 27న కర్నూలులో హైబ్రిడ్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్) పి.ఉషారాణి శుక్రవారం తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు, 1.00 నుంచి 1.30 గంటల వరకు ప్రత్యక్ష విధానంలో, మధ్యాహ్నం 2.00 నుంచి 4.30 గంటల వరకు దూరదృశ్య సదస్సు (వీసీ) ద్వారా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్తు వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత సంస్థలు, ఆసక్తి గల ప్రజలు ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలు, సూచనలు చేయాలని ఉషారాణి కోరారు.

వైమానిక దళంలో ఉద్యోగావకాశాలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'అగ్నిపథ్' ప్రవేశపెట్టాక భారత వైమానిక దళంలో క్లరికల్/టెక్నికల్ కేడర్లతో నాలుగేళ్ల కాల వ్యవధికి సేవలందించేలా కొత్త ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్రబాబు తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 2006 జనవరి 1 నుంచి 2009 జులై 1 మధ్య జన్మించి, 152 సెంటీమీటర్ల ఎత్తున్న వారు అర్హులన్నారు. ఫిబ్రవరి 1లోపు https:///iafrecruitment.edcil.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జనగణనకు ఏర్పాట్లు

కార్యనిర్వాహక అధికారుల నియామకం

కుక్కునూరు, న్యూస్‌టుడే: జనగణన 2027 కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దీనికి సంబంధించి జిల్లా, మండల, పురపాలికల్లో అధికారులను నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా జనాభా లెక్కల ముఖ్య అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. అదనపు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా జేసీని నియమించారు. జనగణన అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి ఉంటారు. అదనపు సెన్సస్ అధికారులుగా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి, విద్యాశాఖాధికారి, పంచాయతీ, అటవీ శాఖ అధికారులు, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీలు, జిల్లా ఉప సెన్సస్ అధికారిగా స్టాటిస్టికల్ అధికారి వ్యవహరిస్తారు. జనగణనకు అధికారుల నియామకం పూర్తిచేయాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

సబ్ జిల్లాస్థాయి బృందం.. సబ్ కలెక్టర్/ఆర్డీవో సబ్ డివిజనల్ సెన్సస్ అధికారిగా ఉంటారు. ఛార్జ్ సెన్సస్ అధికారులుగా తహసీల్దార్లు, అదనపు అధికారులుగా ఎంపీడీవోలు, సహాయ అధికారులుగా క్లర్క్, ఇన్‌ఛార్జి అధికారులుగా ఉప తహసీల్దార్/అంతకంటే తక్కువ స్థాయి అధికారులుంటారు.

పట్టణ స్థాయిలో.. మున్సిపాలిటీ/నగర పంచాయతీ అధికారులు ఛార్జ్ సెన్సస్ అధికారులుగా వ్యవహరిస్తారు. అదనపు అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారి/టీపీఎస్/డీఈఈ/ఏఈఈ/మున్సిపాల్టీలోని రెవెన్యూ అధికారి ఉంటారు. మున్సిపల్/కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఇతర అధికారులు పట్టణ సెన్సస్ అధికారులుగా పనిచేస్తారు.

18న తిరుమల విద్యాసంస్థల అవగాహన సదస్సు

టి.నగర్, న్యూస్‌టుడే: అయిదు నుంచి పదో తరగతి వరకు పూర్తి చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ నెల 18న రాజమహేంద్రవరం విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ సదస్సు ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా ప్రసిద్ధ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్ వంటి అత్యుత్తమ యూనివర్సిటీలలో సీటు సంపాదించాలంటే ఏ విధంగా పరీక్షలకు సిద్ధం కావాలనే అంశాలను సదస్సులో వివరిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, వారికి ఉన్నత విలువలు ఎలా నేర్పాలో తెలియజేస్తారన్నారు. ఈ సదస్సుకు హాజరవ్వాలంటే ముందుగా 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టిఐఆర్‌యుఎంఎఎల్ఎఈడీయు.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకోలేని వారు అదే రోజు 9 గంటలలోపు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 79979 89322, 79979 89323 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వ్యర్థాలతో విజ్ఞానం

పంట ఉత్పత్తులతో ఆకర్షణీయ వస్తువుల తయారీ

కేవీకేలో ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు

ఉండి, న్యూస్‌టుడే: కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు.. పనికిరాని ప్రతి వస్తువుతో కళారూపాలు సృష్టించవచ్చని నిరూపిస్తున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. వివిధ పంట ఉత్పత్తుల నుంచి వెలువడే వ్యర్థాలతో ఆకర్షణీయ వస్తువులు తయారు చేస్తున్నారు ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు.

వరి కంకులతో ఫ్లవర్ వాజ్

దేశంలో పండే వివిధ పంటలపై కేవీకేలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ప్రధానంగా వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తి కోసం కేళీలు ఎప్పటికప్పుడు తొలగిస్తుంటారు. కాండం తొలిసే పురుగు ఆశించి తెల్లకంకులు (తాలు, తప్పలొచ్చిన) వాటిని తీసేస్తారు. వాటిని ఒకే సైజులో కత్తిరించి వివిధ రంగులద్ది ఆరబెట్టారు. కూజాను పోలిన పెద్ద సీసాలో రాగి, జొన్న, మొక్కజొన్న తదితర (చిరుధాన్యాల) విత్తనాలు వరుసల్లో పోశారు. ఆపై రంగులద్దిన పనికిరాని కంకులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఫ్లవర్‌వాజ్ కేవీకేకి వచ్చేవారందర్నీ ఆకట్టుకుంటోంది.

చిరుధాన్యాల ప్రాధాన్యం తెలియజేస్తూ..

ఆనప కాయలు వివిధ రూపాల్లో ఉత్పత్తి అవుతుంటాయి. వాటి లోపలుండే విత్తనాలు సేకరించి ప్రదర్శనా క్షేత్రాల్లో ఉంచారు. ఎండిన సొరకాయ డిప్ప సగ భాగంలోపల కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, ఊదలు తదితర చిరుధాన్యాల కంకులు ఉంచారు. ఆహార పదార్థాల్లో చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించేందుకు ఈ ఫ్లవర్‌వాజ్ బాగా ఉపయోగపడుతోంది. ఈ పంటలు పండని రోజుల్లో రైతులు, విద్యార్థులు, సందర్శకులొచ్చినా విత్తన రకాలు, పంటల తీరును ప్రత్యక్షంగా తెలియజేసేందుకు వ్యర్థాలతో విజ్ఞానాన్ని అందించే విధంగా వివిధ వస్తువులు తయారు చేస్తున్నామని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు.

ఆహారం కల్తీ అయ్యిందని ఘర్షణ

హోటల్‌లో ధ్వంసమైన సామగ్రి

రైల్వేస్టేషన్ కూడలి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఆహారం కల్తీ అయ్యిందని ఆరోపిస్తూ గురువారం తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ కూడలిలోని ఇబ్బాస్ కింగ్స్ హోటల్ నిర్వాహకుడు ఇబ్రహీంతో పెంటపాడు గ్రామానికి చెందిన సాయిరెడ్డి, వెంకటరెడ్డి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి సుమారు 100 మందితో వచ్చి తమ హోటల్‌పై దాడి చేశారని నిర్వాహకుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిరెడ్డి, వెంకటరెడ్డిలతో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తాడేపల్లిగూడెం పట్టణ ఎస్సై నాగరాజు తెలిపారు.

పండగ వేళ.. కబళించిన మృత్యువు

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

సంక్రాంతి పండగ వేళ జరిగిన ప్రమాదాలు పలు కుటుంబాల్లో పెను విషాదం నింపాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనల్లో ముగ్గురు యువకులు, ఓ చిన్నారి సహా అయిదుగురు దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వీధికుక్క అడ్డురావడంతో..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వీధి కుక్క అడ్డురావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం ఆర్యపేటకు చెందిన జి.వెంకట తాతాజీ (20), తన స్నేహితుడు బి.కమలాకర్ కలిసి ఈ నెల 12న రాత్రి ద్విచక్ర వాహనంపై మేడపాడులో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మేడపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఒక్కసారిగా శునకం అడ్డు రావడంతో దానిని తప్పించబోయి కింద పడిపోయారు. ఈ ఘటనలో తాతాజీకి తలకు తీవ్ర గాయమైంది. కమలాకర్ కాళ్లు, చేతులకు సాధారణ గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తాతాజీని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.

అమ్మ లేదు.. నువ్వూ వెళ్లిపోయావా నాన్నా!

రంగారావు (పాతచిత్రం)

కలిదిండి, న్యూస్‌టుడే : 'మమ్మల్ని వదిలేసి అమ్మ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అమ్మా, నాన్న.. నువ్వే అయ్యావు. ఇప్పుడు నువ్వూ మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా నాన్నా?' అంటూ ఆ చిన్నారులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. హాయిగా సంక్రాంతి నిర్వహించుకోవాల్సిన వేళ.. ఆ కుటుంబాన్ని విషాదం ముంచెత్తింది. రోడ్డు ప్రమాదం తండ్రిని బలికోరడంతో చిన్నారులు విలవిల్లాడిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడినాడకు చెందిన గాదేపల్లి రంగారావు(34) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన భార్య ఏడాది కిందట మృతి చెందారు. అప్పటి నుంచి అన్నీ తానే అయ్యి పిల్లలను గారాబంగా చూసుకుంటున్నారు. ఈ నెల 14న రాత్రి 9.30 గంటల సమయంలో పని మీద ద్విచక్ర వాహనంపై ఆకివీడు వెళ్తుండగా.. మార్గం మధ్యలో చినతాడినాడ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో రంగారావు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం అయ్యింది. స్థానికులు ఆకివీడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే రంగారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్సై తెలిపారు. దీనిపై రంగారావు సోదరుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో సంక్రాంతి కళ తప్పింది.. నిశ్శబ్దం తాండవిస్తోంది.

సినిమాకు వెళ్తూ...

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కనుమ పర్వదినాన సరదాగా సినిమాకు వెళ్తున్న ఇద్దరిపై విధి కన్నుకుట్టింది. ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కొయ్యలగూడెం మండలం శ్రీరంగపట్నానికి చెందిన మాణికల శ్రీనివాసరావు(45), దొంగల మధు బంధువులు. శుక్రవారం వీరు సినిమాకని జంగారెడ్డిగూడెం వెళ్తుండగా.. బయ్యనగూడెం- నరసన్నపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై వారి వాహనం అదుపు తప్పి.. కిందపడిపోయారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా.. మధుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనం ఢీకొని...

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పదహారో నంబరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. పాదచారుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పెదవేగి ఎస్సై మాదల హరిగోపాల్ కథనం మేరకు.. ఆగిరిపల్లికి చెందిన నాగులపల్లి సుబ్బారావు మద్యానికి బానిసై గత నెల 15న ఇంటి వద్ద నుంచి కూలి పనుల నిమిత్తం పెదవేగి మండలం అమ్మపాలెం వచ్చారు. ఇక్కడ పనులు చేస్తూ గురువారం రాత్రి జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్నారు. ఆయన్ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని చిన్నారి..

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం-ఉండి మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని సుమారు నాలుగేళ్ల బాలిక మృతి చెందడంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆర్పీఎఫ్ ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉండి రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన గూడూరి మోహన ఈశ్వర సాయి (31) విజయవాడలోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య ముగ్గురు సంతానం ఉన్నారు. పండగ సెలవుల నేపథ్యంలో ఈనెల 14న మోహన ఈశ్వర సాయి జంగారెడ్డిగూడెంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. కాగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన తన మిత్రుల కోసం పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. స్నేహితులతో చాలా సేపు గడిపిన మోహన ఈశ్వరసాయి గురువారం రాత్రి గ్యాస్ నొప్పిలా రావడంతో బయటకు వెళ్తున్నానని స్నేహితులతో చెప్పి బయలుదేరారు. అయితే గ్యాస్ నొప్పి మాత్రలు తెచ్చుకునేందుకు లాడ్జి సిబ్బందితో కలిసి సెంటర్‌లోకి వెళ్లగా.. దుకాణాలు మూసివేయడంతో తిరిగి వచ్చేసి.. రిసెప్షన్‌లోని ఓ వ్యక్తి వద్ద ఉన్న గ్యాస్ మాత్రను వేసుకున్నారు. అనంతరం బయట కూర్చున్న మోహన ఈశ్వరసాయి శుక్రవారం ఉదయం మృతి చెంది ఉన్నారు. దీంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప॥ గో॥ జిల్లా. సెల్: 8500405678, 9885912559

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ॥ రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
✆98486 67454

PLOT FOR SALE

Near Velpur Petrol Bunk 250 Square Yards N/F from Tanuku to Velpur Main Road 50 Feet Distance. 8500268603.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

Vizag Commercial Venture Newly Launched at Bhogapuram, Airport Road. Suitable for all Types of Business. 9992273747.

భీమవరం, PP రోడ్, భారతీయ విద్యాభవన్ స్కూల్ దగ్గరలో 200 చ॥గ॥ స్థలం ఫెన్సింగ్‌తో ఉన్నది అమ్మకమునకు కలదు. సెల్: 9392122526.

RK Township వారి రాజమండ్రి వెంచర్లపై సంక్రాంతి Gold ఆఫర్ కలదు. వివరాలకు: బ్రాంచ్ మేనేజర్, Contact Cell: 99490 91197.

JOBS

ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ నందు పాలకొల్లు, నరసాపురం ఏరియాలలో పనిచేయుటకు, సెక్యూరిటీ ఆఫీసర్, (Ex. సర్వీస్‌మేన్) సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, 8 గం॥ డ్యూటీ, PF, ESI కలదు. సంప్ర: 83096 50572, 74167 12755, 94937 85599.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.50 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

అదుపు తప్పిన బస్సు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

సురక్షితంగా బయటపడిన 26 మంది ప్రయాణికులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పొగ మంచు కారణంగా రహదారి సరిగా కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కుడి వైపు మార్జిన్ దిగింది. ఈ ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పెదగొన్నూరు నుంచి శుక్రవారం ఉదయం గుడివాడకు 26 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పెదపాలపర్రు ఉన్నత పాఠశాల సమీపంలో ఇటీవల వేసిన హైవే బైపాస్ వద్ద పొగమంచు వల్ల దారి కనిపించలేదు. దీంతో కుడివైపు మార్జిన్ దిగడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేయడంతో కాలవ గట్టుపై నిలిచింది. ప్రయాణికులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. కంట్రోలర్ విజయ్ ప్రమాదం వివరాలు సేకరించారు.


డ్రైవర్, కండక్టర్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్టీసీ అధికారి

కొన్నంగుంట వద్ద వాహనంలో మంటలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు మండలం బోర్వంచ శివారు కొన్నంగుంట వద్ద టాటా మ్యాజిక్ వాహనంలో మంటలు చెలరేగాయి. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అడవినెక్కలంకు చెందిన జుజ్జవరపు ఆనందరావు తన సతీమణితో కలిసి నూజివీడు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో టాటా మ్యాజిక్ పూర్తిగా దగ్ధమైంది. నూజివీడు అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. ఆటోలో ప్రయాణిస్తున్న దంపతులు ఇరువురు ప్రమాదం నుంచి బయట పడ్డారు. అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

నిప్పు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెల్లని చెక్కు కేసుల్లో జైలు, జరిమానా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన దారపురెడ్డి సురేశ్ చంద్ర కుమార్ రాజాకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. బాపులపాడుకు చెందిన యర్రగొర్ల రామయ్య 2022 జూన్ 12న ముద్దాయి చంద్రకుమార్ రాజాకు రూ.3.50 లక్షలు అప్పుగా ఇచ్చారన్నారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని రామయ్య కోరగా ముద్దాయి 2023 జనవరి 9న రూ.3.50 లక్షలకు చెక్కు ఇచ్చినట్లు చెప్పారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారన్నారు. తరువాత కోర్టులో కేసు వేయగా చంద్రకుమార్ రాజాకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

★ బాకీ తీర్మాన నిమిత్తం ఇచ్చిన చెక్కు చెల్లని నేరానికి నూజివీడుకు చెందిన సొంగా లూర్దుమాతకు ఆరు నెలల జైలు, రూ.2లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన పందేటి రామారావు 2021 ఆగస్టు 3న లూర్దుమాతకు రూ.6 లక్షలు అప్పుగా ఇచ్చారన్నారు. కొంత కాలం తరువాత బాకీ చెల్లించాలని రామారావు కోరగా లూర్దుమాత రూ. 2021 డిసెంబరు 18న రూ. 6లక్షల చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును నగదు వసూలు నిమిత్తం బ్యాంకులో వేయగా ఆమె ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారన్నారు. తరువాత పందేటి రామారావు కోర్టులో వేయగా.. విచారణ అనంతరం లూర్దుమాతకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

వైద్యురాలిపై దాడి యత్నం

బాధ్యుడైన జడ్పీ పాఠశాల పీడీపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న వైద్యురాలిని దుర్భాషలాడి.. ఆమెపై దాడికి యత్నించిన ఓ ప్రభుత్వ ఉద్యోగిపై జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన దీప్తి స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం కంసాలికుంటలో జరిగిన కోడి పందేల్లో కారం శేఖర్ అనే వ్యక్తికి కోడి కత్తి తగిలి కాలికి గాయమైంది. దీంతో ఆయన్ను బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తీసుకొచ్చారు. అయితే అక్కడ ఆ సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు దీప్తి క్షతగాత్రుడు శేఖర్‌ను పరిశీలించి చికిత్స అందిస్తుండగా.. శేఖర్ బంధువు అయిన బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ తెల్లం శ్రీనివాసరావు సదరు వైద్యురాలితో వాగ్వాదానికి దిగాడు. మద్యం తాగి ఉన్న శ్రీనివాసరావు.. వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దుర్భాషలాడి దాడికి యత్నించాడు. దీనిపై వైద్యురాలు దీప్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజ్ స్టైల్	సా॥ 5 - రా॥ 9
EFM సరాగాలు	రా॥ 9 - రా॥ 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 11 - ఉ॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

భీమవరం

• భీమవరం • ఉండి

పండగ వేళ దాన ధర్మాలతో పుణ్యం

పాలకోడేరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా వృద్ధులు, పేదలకు దాన ధర్మాలు చేయడం పుణ్యప్రదమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన పాలకోడేరు మండలం పెన్నాడ విచ్చేశారు. స్థానికులు సరిపిడకల రామారావు, శారద దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధులు, వితంతువులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నాటి ఆచారం.. పునఃప్రారంభం

ఆకివీడు, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ సందర్భంగా శుక్రవారం ఆకివీడులోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి, జలదుర్గ శక్తీశ్వర స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన మూడు ఎడ్ల బళ్లపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. ఇకపై పాత పద్ధతిలో ఎడ్ల బళ్లపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. 35 ఏళ్ల క్రితం వరకు కనుమ రోజున ఎడ్ల బళ్లపై స్వామివార్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

ఎడ్ల బళ్లపై స్వామివార్ల ఊరేగింపు

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	భీమవరం గునుపూడి: 80085 74474
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:

? బ్యాంకుకాలనీలో కొన్ని నెలలుగా డ్రెయిన్లు శుభ్రం చేయడంలేదు. మురుగు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
- రామచందర్, విశ్వేశ్వరరావు, స్థానికులు

? పారిశ్రామికవాడ, చినరంగని పాలెం ప్రాంతాల్లో చెత్త తీయడంలేదు, డ్రెయిన్లు శుభ్రం చేయడానికి ఎప్పుడు వస్తారో తెలియదు
- బి.సూర్యనారాయణ, జి.కిశోర్, ప్రైవేటు ఉద్యోగులు

✔ పారిశుద్ధ్య సిబ్బందితో వెళ్లి వెంటనే శుభ్రం చేయిస్తాను. **- ఎ.రాంబాబు, పురపాలక సహాయ కమిషనర్**

వృద్ధురాలి నేత్రాల దానం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లుకు చెందిన కారుమూరి సీతామహాలక్ష్మీ(75) గురువారం మృతి చెందగా.. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ఆమె కుమారుడు కుమారస్వామి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమె కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. క్లబ్ అధ్యక్షుడు కొప్పు సుబ్బారావు, సభ్యులు కుమారస్వామి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకివీడు: గుమ్ములూరు రోడ్డులోని బరిలో తలపడుతున్న పుంజులు

నందమూరుగరువులో గుండాట

మహదేవపట్నంలో కోడిపందేలు తిలకిస్తున్న మహిళలు, ఎన్నారైలు

కాలు దువ్విన కోళ్లు.. భారీ ఎత్తున పందేలు

మూడ్రోజులూ యథేచ్ఛగా జూదక్రీడలు

ఉండి, పాలకోడేరు, న్యూస్‌టుడే: సంప్రదాయం మాటున సంక్రాంతి మూడు రోజులూ కోడి పందేలు, జూద క్రీడలు యథేచ్ఛగా సాగాయి. భారీ ఎత్తున ఏర్పాటు చేసిన బరుల్లో విద్యుత్తు దీపాల వెలుతురులో అర్ధరాత్రి వరకు కోడి పందేలు జోరుగా నిర్వహించారు. మహదేవపట్నం బరిలో ఒక్కో పదెం రూ.2 లక్షల వరకు వెళ్లింది. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి వచ్చిన కొందరు ప్రవాసాంధ్రులు వచ్చి వాటిని తిలకించారు. ఖరీదైన వాహనాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులు తరలొచ్చి పందేలు కాశారు. గుండాట, కోతాట, మూడుముక్కలాట వంటి జూదాలు యథేచ్ఛగా సాగాయి.

మహదేవపట్నం బరి వద్ద పార్కింగ్ చేసిన కార్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పరిధిలోను, మండలంలోని చినకాపవరం, గుమ్ములూరు, అజ్జమూరు, సిద్దాపురం తదితర గ్రామాల్లో నిర్వహించిన జూద క్రీడల్లో రూ.కోట్లలో చేతులు మారాయి. మా బరికి రండి బిర్యానీ, ఐస్‌క్రీమ్ ఉచితంగా ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి ఎక్కువగా బరుల వద్దకు తరలివచ్చారు.

★ గొల్లలకోడేరు, పాలకోడేరులో కోడి పందేల బరులు జాతరను తలపించాయి. బరులు రక్తసికం కాగా, జూదం మాటున రూ.కోట్లు చేతులు మారాయి. గొల్లలకోడేరు బరిలో అధిక పందేలు గెలిపొందినవారికి మూడు ద్విచక్రవాహనాలు బహుమతులుగా అందజేశారు. ఇదే గ్రామంలో ఏర్పాటు చేసిన మరో బరిలో లక్కీడ్రా నిర్వహించి ఫ్రిజ్, టీవీ, మిక్సీ, గ్రైండర్ తదితర బహుమతులు అందజేశారు. బరుల వద్ద గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడంతో మద్యం ఏరులై పారింది. ఎంఆర్‌పీ కంటే సీసాకు రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేశారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం, నవుడూరు, నందమూరుగరువు, కొణితివాడ, మత్స్యపురి గ్రామాల్లోని పొలాల్లో బరులు ఏర్పాటు చేశారు. నవుడూరు, కొణితివాడల్లో జోడీ పందేల్లో గెలుపొందిన వారికి ద్విచక్ర వాహనాలు బహుమతిగా ఇచ్చారు. మండల వ్యాప్తంగా కోడి పందేలు నిర్వహించిన 60 మందిపై 21 కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజ్‌కుమార్ తెలిపారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: తాడేరు బరి వద్ద జబర్దస్త్ బృందం బుల్లెట్ భాస్కర్, ఫైమా, నరేష్ తదితరులు సందడి చేశారు. డేగాపురం, గొల్లవానితిప్పరోడ్డు, తుందుర్రు, యనమదుర్రు, రాయలం, చినఅమిరం ప్రాంతాల్లో పందేలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

8 మంది అరెస్టు.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణం పరిధిలో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశామని ఎస్సై బి.వై.కిరణ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ. 10 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలని తుమ్మలపల్లి మంగరాజు ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ తుమ్మలపల్లి శివ అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం విష్ణు కళాశాలలో బీడీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న అబ్బరాజు పవన్‌కల్యాణ్‌కు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, స్వచ్ఛంద సంస్థలు దాతలు అందిస్తున్న సేవలు మరువరానివన్నారు.

భూ పోరాట యోధుడు సాంబమూర్తి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పేద ప్రజల కోసం భూపోరాటాలు చేసిన యోధుడు నాగిడి సాంబమూర్తి అని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. సాంబమూర్తి వర్ధంతి సభను శుక్రవారం భీమవరం మండలం నాగిడిపాలెంలో నిర్వహించారు. పేదల కోసం ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ కళా వేదికపై ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం నటరాజ నృత్య కళారంజని (ఐ.పంగిడి) వారి చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. అనంతరం రుద్రాణి కూచిపూడి కళా నిలయం (భీమవరం), వేదాంతం పార్థసారథి శిష్య బృందం (విజయవాడ) వారిచే కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. రాత్రికి శ్యాంబలాంబ కళానికేతన్ (ఏలూరు) వారిచే 'శివభక్త సంబరాసుర' నాటకం ప్రదర్శించారు.

మంత్రి శ్రీనివాస్‌ను కలిసిన నాటక పరిషత్ ప్రతినిధులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు భీమవరం వచ్చిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను చైతన్య భారతి నాటక పరిషత్ ప్రతినిధులు మర్యాదరపూర్వకంగా శుక్రవారం కలిసి సత్కరించారు. పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు.

అల్లుడికి 202 రకాల పదార్థాలతో విందు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడుకు చెందిన జనసేన నాయకుడు తోట వాసు ఆయన అల్లుడు, కుమార్తె కోసం 202 రకాలతో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. నూతన దంపతులు సంక్రాంతికి తన ఇంటికి వచ్చిన సందర్భంగా కనుమ రోజు శుక్రవారం మధ్యాహ్నం విందులో వివిధ రకాల మాంసాహారం, శాకాహారం, మిఠాయిలు, పిండి వంటలు ప్రత్యేకంగా తయారు చేయించి అరిటాకులో వడ్డించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

ఉండి, న్యూస్‌టుడే: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగ. ఆ సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో రకరకాల ముగ్గులు వేసిన చిన్నారులు, మహిళలందరూ అభినందనీయులని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు సతీమణి రమాదేవి అన్నారు. ఉండి మండల తెదేపా అధ్యక్షుడు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో గౌడపేటలో కోదండ రామాలయం వేదికగా సంక్రాంతి రోజున సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు.

రంగవల్లులు వేస్తున్న మహిళలు, యువతులు

ఆకివీడు, న్యూస్‌టుడే: స్థానిక తీగలదొడ్డి రామాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో రంగవల్లులు, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలు, యువతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు.

★ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలు, రాష్ట్రస్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహించారు.

భీమవరం వన్‌టౌన్, వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం, భీమవరం పట్టణాల్లోని పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. భీమవరం 8వ వార్డు చినరంగన్నపాలెం, 18వ వార్డుల్లో సీఐటీయు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వందల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉండిలో ముగ్గుల పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న రమాదేవి

ఆకివీడు, న్యూస్‌టుడే: వేంద్రలో రెండు రోజుల పాటు క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, మ్యూజికల్ ఛైర్స్, పాలకోడేరు, శృంగవృక్షం, వేంద్ర, మోగల్లు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. కనుమ సందర్భంగా గొల్లలకోడేరులో బరికిలమ్మ అమ్మవారి జాతర నిర్వహించారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం భీమవరం మండలం వెంపలో మహిళలకు రంగవల్లులు, పిల్లలకు మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో మేము సైతం

భీమవరంలో సేవలందించిన ఎన్‌సీసీ క్యాడెట్లు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి నేపథ్యంలో భీమవరంలో వాహనాల రద్దీ నెలకొంది. ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. వాహనాల రాకపోకల నియంత్రణలో భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వారికి సహాయంగా ఉంటూ సేవలందించారు. నాలుగు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకు పలు కూడళ్లలో పోలీసులతోపాటు విధులు నిర్వర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా క్యాడెట్లు సేవలందించారు.

యాజమాన్యం సూచనలతో..

సంక్రాంతికి ఇతర రాష్ట్రాలు, ప్రధాన పట్టణాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని కళాశాల యాజమాన్యం చెప్పింది. దీంతో అంబేడ్కర్ కూడలి, ప్రకాశం చౌక్, చిన్నవంతెన, మావుళ్లమ్మగుడి ప్రాంతం, ఉండిరోడ్డు, పాత బస్టాండు తదితర ప్రాంతాల్లో సేవలందించాం. **- ఎ.కృష్ణాజీ**

గతం అనుభవంతో..

పలుచోట్ల జరిగిన వేడుకలు, ప్రముఖుల పర్యటనల సమయాల్లో మేమంతా సేవలందించాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో చాలా చురుగ్గా పాల్గొంటాం. అదే సమయంలో నిబంధనలు చెబుతుంటాం. సంక్రాంతి వేళలో కొద్దిసేపు కూడా ఖాళీ దొరకలేదు. పోలీసులు అధికారులు చెప్పినట్లు నిబంధనలు పాటిస్తూ, ప్రయాణ ఇబ్బందులు లేకుండా పని చేశాం. **- కె.ఎల్ సంతోశ్‌కుమార్**

డీఎస్పీ రఘువీర్ విష్ణుతో క్యాడెట్లు

కొత్త విషయాలు తెలిశాయి

ఇక్కడ ట్రాఫిక్ సేవలతో కొత్త విషయాలు తెలిశాయి. త్రిబుల్ రైడింగ్, వేగంగా వెళ్లే వారికి నిబంధనలు చెప్పాం. శిరస్త్రాణం ధరించండి అంటూ చెబితే చాలా మంది తప్పకుండా పాటిస్తామంటూ సమాధానం ఇచ్చారు. దీంతోపాటు మేం చెప్పిన దారుల్లోనే వాహనాలు మళ్లించారు. **- టి.ప్రవీణ్‌కుమార్**

ప్రయాణికులు సహకరించారు

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రయాణికులు మేం చెప్పిన నిబంధనలు పాటించారు. దీంతో ఎక్కడా రద్దీ ఉండేది కాదు. ఒకేసారి వందలాది వాహనాలు పట్టణంలోకి వచ్చినా చోదకులు తొందరపడకుండా సహకరించడంతో వాహనాలు సాఫీగా వెళ్లాయి. **- వై.గౌతమ్**

ఎక్కడైనా సేవల్లో పాల్గొంటాం

సంక్రాంతి సందడి ముగిసింది. ఇక పట్టణంలోని మావుళ్లమ్మ ఆలయం దగ్గర సేవల్లో పాల్గొంటాం. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద సేవలందించాం. ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఉండకుండా సేవలే కాదు, జనరద్దీలో చోరుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తాం. **- లక్ష్మణసాయి**

క్రికెట్ కలిపింది స్నేహితుల్ని

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో చదువుకున్న వారందర్నీ క్రికెట్ కలిపింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ సంక్రాంతికి సొంతూరిలో వాలిపోతారు. ఇంకేముంది అంతా కలిసి నాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంటూ శుక్రవారం రోజంతా క్రికెట్ ఆడుతూ సరదాగా గడిపారు. రెండు జట్లుగా ఏర్పడి సీరియస్‌గా ఆడారు. ఒక జట్టు విన్నర్, మరో జట్టు రన్నర్‌గా నిలిచింది. రెండో పట్టణ సీఐ కాళీచరణ్ పోటీలను తిలకించి వారిని ఉత్సాహపరిచారు. జనసేన నాయకుడు చనమల్ల చంద్రశేఖర్ ట్రోఫీని అందజేశారు. వేణుమాధవ్, టి.శ్రీను, ప్రిన్స్, విజయకుమార్, బాపూజీ, సత్య, గోపి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న పూర్వ మిత్రులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పరిధి రుస్తుంబాదలోని గోగులమ్మ ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం హోరా హోరీగా సాగాయి. పురుషుల విభాగంలో ఆంధ్ర జట్టుపై జమ్ము-కశ్మీర్, సీఆర్‌పీఎఫ్ దిల్లీ జట్టుపై ఎండీయూ విశ్వవిద్యాలయం, వైఎంసీఏ ఫరీదాబాద్ జట్టుపై రోహతక్ హరియాణా, ఎస్డీ స్పోర్ట్సుక్లబ్ పశ్చిమబెంగాల్‌పై కోల్‌కత్తా పోలీస్ జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో కేరళపై సీఆర్‌పీఎఫ్ దిల్లీ, ఆంధ్రపై హిమాచల్‌ప్రదేశ్, కేరళపై పశ్చిమబెంగాల్ జట్లు విజయం సాధించాయని నిర్వాహకులు తెలిపారు.

మండోదరమ్మకు అష్టోత్తర జలాభిషేకం

కోలమూరు (ఉండి), న్యూస్‌టుడే: కోలమూరులో 108 కలశాలతో మహిళలు శుక్రవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో సంతాన గోపాలస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రామరాజు, ఛైర్మన్ నంబూరి బదరీ నారాయణరాజు (బేబీ), కూనపరాజు రాంబాబు, కూనపరాజు శ్రీనివాసరాజు, పేరిచర్ల సీతారామరాజు, రుద్రరాజు అప్పలరాజు, పేరిచర్ల పద్మనాభరాజు నేతృత్వంలో తొలుత ప్రత్యేక పూజలు చేశారు. ద్వారకాతిరుమలకు చెందిన ముదునూరి వెంకట సుబ్బరాజు - పద్మావతి దంపతులు పీటలపై కూర్చొని స్వామికి కనుమ పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. గోపూజ అనంతరం ఆలయ నుంచి 108 కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి మండోదరమ్మ పూరి గుడిసె చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తరువాత సుబ్రహ్మణ్యస్వామి, కైలాసనాథ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం అనంతరం మండోదరమ్మకు అష్టోత్తర జలాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు.

కోలమూరులో కలశాల ఊరేగింపు

సోమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయంలో కనుమ పండగ సందర్భంగా స్వామికి విశేషాభిషేకాలు చేశారు. స్వామి వారి ఎదుట ఉండే నందీశ్వరుడికి ప్రత్యేకాలంకరణ చేసి శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట ఒంగోలు గిత్తలకు ప్రధానార్చకులు పూజలు చేయించారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: యండగండిలో పోలేరమ్మ జాతర సేవా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయానికి సమీపంలో పూరి గుడిసె నుంచి అమ్మవారిని అత్తారింటికి సాగనంపే కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. శనివారం జాతర ఊరేగింపు నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు చిలుకూరులో ఊరేగింపు

చిలుకూరు (ఉండి), న్యూస్‌టుడే : చిలుకూరులో పైడమ్మ జాతర సేవా కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. సినీ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి దంపతులు అమ్మవారికి తొలుత ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం జాతర ఊరేగింపు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం

పెదపుల్లేరు (ఉండి), న్యూస్‌టుడే: దాతల సహకారంతో నిర్మిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి నూతన ఆలయ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పెదపుల్లేరులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు కలిదిండి నరసింహరాజు, కలిదిండి కృష్ణంరాజు, భాస్కరరాజు, సత్యనారాయణరాజు, సుబ్బరాజు తదితరులు సమావేశమయ్యారు. ఈ ఆలయాన్ని ఏప్రిల్ 12న ప్రారంభించాలని నిర్ణయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు దాతలు మరింతగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

రాబోయే పండగకి ఆత్మీయ సమ్మేళనం

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: రాబోయే సంక్రాంతికి తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించుకున్నామని 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తెలిపారు. ఎన్నార్పీ అగ్రహారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మహదేవపట్నంలో శుక్రవారం సమావేశమయ్యారు. నాటి తరగతి నాయకుడు, వాల్తేరు డీఆర్ఎం కార్యాలయ ప్రస్తుత సూపరింటెండెంట్ పి.రమేష్‌బాబు, ఆచార్య ఎన్‌వీ గణపతిరాజు, మహదేవపట్నం మాజీ సర్పంచి జుత్తిగ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచి మండపాక నరసింహమూర్తి, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. పూర్వ విద్యార్థులు వేగేశ్న శారద, పెన్మెత్స సత్యనారాయణరాజు, రుద్రరాజు వెంకట సుబ్బరాజు, గిడుతూరి చేతనరావు, రుద్రరాజు నాగరాజు, బద్ది సత్యనారాయణ తదితరులు పాల్గొని పాఠశాల ప్రగతికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఉపాధి పథకంపై ఇంటింటి ప్రచారం

వీరవాసరం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం వీబీ జీ రామ్‌జీగా పేరుమార్చి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. పథకం పేరు మార్పుతో శ్రామికులకు, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నష్టం కలిగిస్తోందంటూ ఈనెల 18 నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీరవాసరంలో ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. వ్యకాసం నాయకులు పి.మృత్యుంజయ, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బాలం విజయ్‌కుమార్, యండమూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ప్రతులు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

ప్రధమ వర్ధంతి

ఉన్నతమైన వ్యక్తిత్వం
అందరినీ
ఆప్యాయతానురాగాలతో,
చిరునవ్వుతో
పలుకరించే మీరు
గతించి సంవత్సరకాలం
అయిననూ మీ జ్ఞాపకాలు
స్మరించుకుంటూ...
మీరు చూపిన
బాటలో పయనిస్తూ...
మీ పవిత్ర ఆత్మ ఆ భగవంతుని
పాదాల చెంత
సేద తీరాలని ఆకాంక్షిస్తూ...
బాధతప్త హృదయాలతో..

శ్రీమతి అందే లీలావతి గారు
W/o. అందే సత్యం గారు (లేటు)
అందే టైలర్స్, భీమవరం

కుమారులు :
అందే రామయ్య
అందే వెంకటేశ్వరరావు (వాసు)

కోడళ్ళు :
శ్రీదేవి
వరలక్ష్మి

కుమార్తెలు :
గండేపల్లి పద్మావతి
తులా మాణిక్యం

అల్లుళ్ళు:
నారాయణ రావు (లేటు)
కృష్ణమూర్తి

మనుమలు, మనమరాండ్రు,మునిమనుమలు మరియు కుటుంబ సభ్యులు

ప్రధమవర్ధంతి : ది.17.01.2026 శనివారం భీమవరం బైపాస్ రోడ్‌లోని సిద్ధార్థ I.T.I ఎదురుగా సత్యాస్ ఫంక్షన్ హాల్ నందు జరుపబడును.

(c) eenadu

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

తలపడుతున్న జట్లు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పరిధి రుస్తుంబాద లోని గోగులమ్మ ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. పురుషుల విభాగంలో ఆంధ్ర జట్టుపై జమ్మూ-కశ్మీర్, సీఆర్‌పీఎఫ్ దిల్లీ జట్టుపై ఎండీయూ విశ్వవిద్యాలయం, వైఎంసీఏ ఫరీదాబాద్ జట్టుపై రోహతక్ హరియాణా, ఎస్డీ స్పోర్ట్సుక్లబ్ పశ్చిమబెంగాల్‌పై కోల్‌కత్తా పోలీస్ జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో కేరళపై సీఆర్‌పీఎఫ్ దిల్లీ, ఆంధ్రపై హిమాచల్‌ప్రదేశ్, కేరళపై పశ్చిమబెంగాల్ జట్టు విజయం సాధించాయని నిర్వాహకులు తెలిపారు.

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

వాసవీమాత సేవలో బుల్లితెర నటులు

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీశాంతి ధాంలో బుల్లితెర నటులు జాకీ, హరిత దంపతులు శుక్రవారం దర్శించుకుని అమ్మవారి మరకత ప్రతిమకు పూజలు చేశారు. తొలుత ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. హరిత మాట్లాడుతూ వాసవీమాత దర్శనం ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

ఆలయంలో జాకీ, హరిత దంపతులు

క్రీడాకారులతో నటుడు పృథ్వీరాజ్, రాంకీ

సినీ నటుల సందడి

నరసాపురం, న్యూస్‌టుడే: రుస్తుంబాదలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను గురువారం సినీ నటుడు పృథ్వీరాజ్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత రాంకీ తిలకించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో ఫొటోలు తీయించుకున్నారు.

నరసాపురం: పంజా కూడలిలో నిలిచిన వాహనాలు

కిక్కిరిసిన రహదారులు

నరసాపురం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో రహదారులు శుక్రవారం వాహనాల రద్దీతో కిటకిటలాడాయి. తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నరసాపురం పట్టణంలో వనువులమ్మ జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీనికి తోడు సంక్రాంతికి వచ్చి తిరుగుప్రయాణమైన వారి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తగినంత పోలీసు సిబ్బంది లేక పోవడంతో సమస్య తీవ్రమైంది. ✦ పాలకొల్లులో అయ్యప్పస్వామి ఆలయం సమీప కూడలిలో గురు, శుక్రవారాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. మూడు ప్రధాన మార్గాల్లో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భూపోరాట యోధుడు సాంబమూర్తి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పేద ప్రజల కోసం భూపోరాటాలు చేసిన యోధుడు నాగిడి సాంబమూర్తి అని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. సాంబమూర్తి వర్ధంతి సభను శుక్రవారం భీమవరం మండలం నాగిడిపాలెంలో నిర్వహించారు. పేదల కోసం ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఊరూరా.. పందేల జాతర!

ఆచంట, పాలకొల్లు మార్కెట్, యలమంచిలి, మార్టేరు, న్యూస్‌టుడే: పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఊరూరా వేసిన బరుల్లో భోగి రోజున ప్రారంభమైన కోడిపందేలు, జూదాలు కనుమ రోజు పొద్దుపోయే వరకు యథేచ్ఛగా కొనసాగాయి. మూడు రోజుల పాటు జూదాల్లో మునిగి తేలిన పందెంరాయుళ్లు అధిక శాతం ఖాళీ జేబులతో ఇళ్లకు చేరుకున్నారు. ● ఆచంట నియోజకవర్గ పరిధిలోని ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోని బరులపై రూ.2 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని నిర్వాహకుల లెక్కలు వేస్తున్నారు. దీనిలో సగం సొమ్ము మామూళ్ల రూపంలో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో 32 చోట్ల బరులు వేసి జూదాలు నిర్వహించారు. ఆచంట-మార్టేరు, ఆచంట-పాలకొల్లు, పాలకొల్లు-వాసవీ పెనుగొండ, సిద్ధాంతం- వాసవీ పెనుగొండ ప్రధాన రహదారుల పక్కనే కోడిపందేలు, గుండాట తదితర జూదాలను విచ్చల విడిగా నిర్వహించారు. ప్రభల తీర్థం, పెళ్లికూతురమ్మ తిరునాళ్లు జరిగే ప్రాంతాల వద్ద కూడా జూదాలు నిర్వహించారు. ● పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో పూలపల్లి, వడ్లవానిపాలెం, లంకలకోడేరు, శివదేవునిచిక్కాల, యలమంచిలి మండలం కలగంపూడి, యలమంచిలి, కాజ గ్రామాల్లో పందేలు నిర్వహించారు. పందేలను వీక్షించేందుకు మహిళలు సైతం భారీగా తరలివచ్చారు. ● పెనుమంట్ర మండలంలో కోడిపందేల బరుల్లో రాత్రి 7 గంటల వరకు పందేలు, గుండాట సాగాయి. ఆలమూరు బరిలో సీరియల్ నటులు జాకీ, హరిత దంపతలు సందడి చేశారు. పలు చోట్ల స్వల్ప ఘర్షణలు చోటు చేసుకోగా నిర్వాహకులు సర్దిచెప్పి పందేలను ముందుకు నడిపించారు. వాసవీ పెనుగొండ, వడలి, దొంగరావిపాలెం తదితర గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు జోరుగా సాగాయి.

పాలకొల్లు: వడ్లవానిపాలెంలో తలపడుతున్న పుంజులు

పాలకొల్లు: బరి ప్రాంగణంలో గుండాట ఆడుతున్న మహిళలు

కొప్పర్రు: బరి వద్ద జోడెడ్ల బండి సెట్టింగ్

చేతులు మారిన రూ.లక్షలు

నరసాపురం, గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని ఆదర్శనగర్, లక్ష్మణేశ్వరం, కేపీపాలెం బీచ్, సీతారామపురం, కొప్పర్రు, వేములదీవి, తూర్పుతాళ్లు, కొత్తపాలెం, ముత్యాలపల్లి, వారతిప్ప, కొత్తోట, కాళీపట్నం, పేరుపాలెం తదితర ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ఏర్పాటు చేశారు. వీవర్స్ కాలనీలో గుండాటతో పాటు కోతాట, లోపల-బయట తదితర జూద క్రీడలు యథేచ్ఛగా నిర్వహించారు. రూ. లక్షలు చేతులు మారాయి. కొన్ని బరుల వద్ద ఆర్కెస్ట్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

నగదు లెక్కిస్తున్న నిర్వాహకులు

బుల్లెట్ల హల్‌చల్

మొగల్తూరు, న్యూస్‌టుడే: కోడిపందేల బరుల్లో బుల్లెట్లు(ద్విచక్రవాహనాలు) హల్‌చల్ చేశాయి. పలువురు నిర్వాహకులు పందెగాళ్లను ఆకట్టుకునేందుకు బుల్లెట్లను బహుమతిగా అందించేందుకు ముందస్తుగా వాటిని సమకూర్చి బరుల వద్ద ప్రదర్శనకు ఉంచారు. ముత్యాలపల్లి బరిలో ఒకటి, కొత్తోటలో మూడు బుల్లెట్ వాహనాలు ఏర్పాటు చేశారు. కొత్తోట బరిలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన పందెగాళ్లు రెండు, కొత్తోటకు చెందిన వారు ఒక వాహనాన్ని సొంతం చేసుకున్నారు. విజేతలకు వాహనాలను శుక్రవారం డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న అందజేశారు.

కొత్తోట బరి వద్ద ఉంచిన వాహనాలు

సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పితాని

ఎస్సీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సిద్ధాంతంలో లంకపేట వద్ద ఎంపీ, ఎమ్మెల్యే నిధులు సుమారు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ సామాజిక భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భవనాలు సమైక్యతను పెంపొందిస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ, సర్పంచి గనిరాజు, కూటమి నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

దాత విరాళంతో షెడ్డు నిర్మాణం

పోడూరు, న్యూస్‌టుడే: కొమ్ముచిక్కాల పంచాయతీ ఆవరణలో దాత విరాళంతో షెడ్డు నిర్మించారు. గ్రామ సభలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇది అనుకూలంగా మారింది. గ్రామానికి చెందిన నాగరాజు రాజన్‌రాజు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సీతామహాలక్ష్మి రూ.2.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. పంచాయతీ చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు గుంటూరి సుందర రామకృష్ణంరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రూ.2.5 లక్షల విరాళం అందజేసినట్లు సర్పంచి గుంటూరి రామకృష్ణంరాజు తెలిపారు.

స్థావరాలపై దాడులు.. కేసులు

నరసాపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కోడిపందేలు నిర్వహించిన పలువురిపై శుక్రవారం పోలీసులు కేసులు నమోదు చేసి కోడి పుంజులు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మొగల్తూరులో 10 మందిని అదుపులోకి తీసుకుని ఆరేసి చొప్పున కోడి పుంజులు, కత్తులు, నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జి.వాసు తెలిపారు. నరసాపురం పట్టణం జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు.

పాలకొల్లు మార్కెట్, గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో పది శిబిరాలపై గురు, శుక్రవారాల్లో దాడిచేసి 30మందిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. ✦ యలమంచిలి మండలంలో 18 శిబిరాలపై దాడి చేసి 31మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కె.గురయ్య తెలిపారు.

పోడూరు, న్యూస్‌టుడే: జగన్నాథపురం, జిన్నూరు, కవిటం, గుమ్మలూరు, పోడూరు గ్రామాల్లో జూద స్థావరాలపై శుక్రవారం దాడి చేసి 10మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట	: 90631 44737
పాలకొల్లు	: 80085 74510	పెనుగొండ	: 80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర	: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? రాయపేటలో పలు చోట్ల వీధిదీపాలు సక్రమంగా వెలగటం లేదు. - కోటేశ్వరరావు
✔ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.
- ఆర్. గంగావర ప్రసాద్, పురపాలక డీఈ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ? సీతారాంపురం సౌత్ నుంచి పసలదీవి, తూర్పుతాళ్లు వెళ్లే రహదారి వెంబడి అక్రమణలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.
- నేతల సత్యనారాయణ, సీతారాంపురం సౌత్
✔ అక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతాం.
- జీవీఎస్ కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ

నరసాపురం రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్ వద్ద వరుస

తిరుగు ప్రయాణంలో అతిథులు

నరసాపురం, పట్టణం, మొగల్తూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులు శుక్రవారం సాయంత్రం తిరిగి ఆయా ప్రాంతాల పయనమయ్యారు. నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు తదితర పట్టణాల్లో బస్టాండ్లు, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఉండి, ఆకివీడులోని రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఈ నెల 17 నుంచి మూడురోజుల వరకు రద్దీ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు.. జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో 20 చొప్పున, 19న 15 బస్సులు ఏర్పాటు చేశారు. ఆయా బస్సుల్లో సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా అవసరమైతే బస్సులను పెంచుతామని, అంతర్జాలంలో రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ పేర్కొన్నారు.

చెరుకూరి సేవలు చిరస్మరణీయం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో మంచినీటి చెరువు తవ్వించి ప్రజలకు తాగునీరు అందించిన ఘనత పురపాలక పూర్వ ఛైర్మన్, దివంగ చెరుకూరి లక్ష్మణరావుకు దక్కుతుందని, పట్టణాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సంక్రాంతి సందర్భంగా నరసాపురం పట్టణంలోని వశిష్ఠ ఘాట్‌లో చెరుకూరి లక్ష్మణరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రంగనాథ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బ్రాహ్మణులకు నిత్యావసర సరకులు అందజేశారు.

ఊరేగింపులో పాల్గొన్న ఛైర్మన్, ఈవో, అధికారులు

క్షీరారామంలో గ్రామోత్సవం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం స్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవ మూర్తులకు అర్చకులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ మీసాల రామచంద్రరావు, ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరేశ్వరస్వామికి అభిషేకాలు

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: కనుమ సందర్భంగా శుక్రవారం వాసవీ పెనుగొండ గ్రామంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. లింగాలవీధి కోదండ రామాలయం, సంపత్ వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పుష్య మాస బహుళ త్రయోదశి సందర్భంగా నరసాపురం పట్టణంలోని కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర, కపిల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ప్రదోష కాలంలో నందీశ్వరునికి పంచామృతాభిషేకాలు చేశారు.

అయ్యప్ప ఆలయంలో బొమ్మల కొలువు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు-నరసాపురం రహదారిలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. తొలుత స్వామికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కనుమ పండగ రోజున అయ్యప్పకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

వేడుకగా ప్రభ ఉత్సవం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: కనుమ రోజున వడలిలో పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో మేళతాళాలతో అగస్త్యేశ్వరస్వామి ప్రభల ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈవో హనుమాన్, పాలకమండలి ఛైర్మన్ వి.శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆచంట, న్యూస్‌టుడే: కరుగోరుమిల్లి వద్ద తీర్థాల పుంతలో నిర్వహించిన జాతరకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన బాలలు చిన్న ప్రభలను తీసుకువచ్చి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

చల్లగ చూడాలి.. సిరులు కురవాలి!

నరసాపురం: గాజుల అలంకరణలో పుంతలో ముసలమ్మ

పేరుపాలెంసౌత్‌లో మొగదారమ్మ

నరసాపురం: కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ రోజుల్లో పలు గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు వైభవంగా జరిగాయి. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నరసాపురం పట్టణంలో వనువులమ్మ, మహాలక్ష్మమ్మ జాతరను తిలకించేందుకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. నరసాపురం పట్టణ పరిధి రాయపేటలోని పుంతలో ముసలమ్మ(శీతలమాత) ఆలయంతో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుల కోటేశ్వరరావు సమర్పించిన గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్‌లో మొగదారమ్మ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం గ్రామంలో గరగాలమ్మ జాతరను గురువారం రాత్రి శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గరగ నృత్యాలు, సన్నాయి మేళాలతో గ్రామంలో ఊరేగించారు. శుక్రవారం అమ్మవారిని చలువ దుస్తులపై ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవార్లకు విశేష పూజలు.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని ఆదికేశవ ఎంబెరు మానార్ ఆలయంలో శుక్రవారం స్వామికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదికేశవ పెరుమాళ్, గోదాదేవిల కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి, యతిరాజ వల్లీ తాయారు, గోదాదేవిలకు విందు వేడుకను వైభవంగా జరిపారు.

అలంకరణలో ఉత్సవమూర్తులు

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను కారు ఢీకొట్టి ఘటన పాలకొల్లు మండలం దిగమర్రులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శివదేవునిచిక్కాలకు చెందిన డి.రాజు తన మేనల్లుడితో కలిసితన ద్విచక్రవాహనంపై శుక్రవారం చించినాడ వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా దిగమర్రులో సాయిబాబా ఆలయం సమీపాన ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజుతో పాటు అతడి మేనల్లుడికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో పాలకొల్లులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పెనుమంట్ర మండలంలో.. **మార్టేరు, న్యూస్‌టుడే:** మార్టేరు- అత్తిలి రాష్ట్ర రహదారిలో వరుస ప్రమాదాలు వాహనదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. బుధవారం రాత్రి శ్రీరామపురం ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో అత్తిలి మండలం ఆరవల్లికి చెందిన వ్యక్తితో పాటు ఆలమూరుకు చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరిని రాజమహేంద్రం లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ✦ గురువారం రాత్రి నత్తారామేశ్వరం శివారులో ముందు వెళ్తున్న కారు ఒక్కసారిగా ఆగడంతో వెనుక వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి కింద పడిపోయారు. ఈ ఘటనలో అత్తిలికి చెందిన శ్రీనుకు గాయాలయ్యాయి.✦ శుక్రవారం సాయంత్రం బ్రాహ్మణచెరువులో ఇద్దరు చిన్నారులు, భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న తాడేపల్లిగూడేనికి చెందిన రమణను మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నలుగురికీ స్వల్పగాయాలయ్యాయి.✦ వెలగలేరు ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్న వాసవీ పెనుగొండ మండలానికి చెందిన యువకుడు సత్య అదుపు తప్పిపడిపోయి గాయాల పాలయ్యారు.

గోదావరిలో యువకుడి గల్లంతు?

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: చించినాడ వంతెన సమీపాన గోదావరి నదిలో యువకుడు గల్లంతైనట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలానికి యువకుడు ఎన్.శ్రీమణికంఠ కుమార్ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అదే రోజు రాత్రి అతడి చరవాణి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో చించినాడ వంతెన వద్ద మోగుతున్నట్లు స్థానికులు గుర్తించి.. దాని ద్వారా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీమణికంఠ నదిలో గల్లంతైనట్లు అనుమానిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో యలమంచిలి పోలీసులు శుక్రవారం నదిలో గాలింపు చర్యలు చేపట్టగా అతడి ఆచూకీ లభ్యం కాలేదు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్‌లోని బీచ్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కేపీపాలెం జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన 2005-06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య స్మృతులను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. ఈ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు 400 ప్లేట్లు విరాళంగా అందించారు.

నాలుగు తరాల.. ఆత్మీయ సంబరం

మొగల్తూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం కడిమివారి కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 'మూలాలను గౌరవిస్తూ తరాలను కలుపుకొంటూ పెద్దల ఆశీస్సులతో వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్దాం' నినాదంతో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నాలుగు తరాల వారసులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల్లో వృద్ధులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

సమ్మేళనానికి హాజరైన కమిడి కుటుంబీకులు

వృద్ధురాలి నేత్రాల దానం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లుకు చెందిన కారుమూరి సీతామహాలక్ష్మి(75) గురువారం మృతి చెందగా.. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ఆమె కుమారుడు కుమారస్వామి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమె కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. క్లబ్ అధ్యక్షుడు కొప్పు సుబ్బారావు, సభ్యులు కుమారస్వామి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పథకంపై ఇంటింటి ప్రచారం

వీరవాసరం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం వీబీ జీ రామ్‌జీగా పేరుమార్చి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. పథకం పేరు మార్పుతో శ్రామికులకు, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నష్టం కలిగిస్తోందంటూ ఈనెల 18 నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీరవాసరంలో ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. వ్యకాసం నాయకులు పి.మృత్యుంజయ, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బాలం విజయ్‌కుమార్, యండమూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రాలు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

గాలికొదిలేశారు!

పెనుమంట్ర పంచాయతీ పరిధి బ్రాహ్మణచెరువులో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవిత విలీన విద్యా వనరుల కేంద్ర భవనం నిర్వహణ లేక అధ్వానంగా మారుతోంది. ఈ కేంద్రాన్ని కొద్దికాలం క్రితం ఆలమూరు గ్రామానికి తరలించారు. నాటి నుంచి ఈ భవనాన్ని పట్టించుకొనేవారే లేదు. ఆరు నెలల క్రితం దీనిలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆ శిక్షణ పూర్తయ్యాక ఈ భవనం వైపు చూసే వారే కరవయ్యారు. లోపల తలుపులు దెబ్బతినగా. . ఫ్లోరింగ్ నెర్రలు తీస్తుంది. వెనుక భాగంలో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పెనుమంట్ర

దెబ్బతిన్న తలుపులు

పునాదులు దాటని పనులు

పిచ్చిమొక్కలతో నిండి ఉన్న ఈ ప్రాంగణంలో పెనుమంట్ర తహసీల్దారు కార్యాలయ భవన నిర్మాణాన్ని 2018లో చేపట్టారు. రూ.90 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా బేస్‌మెంట్ పూర్తయ్యే సరికి వైకాపా ప్రభుత్వ అధికారంలోకి వచ్చింది. తరువాత దీని గురించి పట్టించుకోలేదు. ఆరు నెలల కిత్రం కలెక్టర్ నాగరాణి ఈ ప్రాంతానికి వచ్చిన సందర్భంలో ఈ భవన నిర్మాణం పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఈ ప్రాంతం పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయాన్ని పెనుమంట్ర సమితి భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ అంశంపై సంబంధిత ఏఈ శ్రీనివాస్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.
-న్యూస్‌టుడే, పెనుమంట్ర

(c) eenadu

తాడేపల్లిగూడెం

● తాడేపల్లిగూడెం ● తణుకు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఉప్పరగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం నుంచి హోరాహోరీగా సాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో భాగంగా శుక్రవారం ఉప్పరగూడెం, చింతలపూడి, బ్రాహ్మణగూడెం, వెంకట్రావుపాలెం జట్లు తలపడ్డాయి తుది పోరులో తలపడుతున్నాయి. ఈ పోటీలను గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం యాగర్లపల్లి ఇండేన్ గ్యాస్ రహదారి అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **-రాజా**

✔ చర్యలు చేపడతాం. **-ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

? తాడేపల్లిగూడెం మసీదు సెంటరులో కల్వర్టు వద్ద వ్యర్థాలు పేరుకుని నీరు నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. **-యూసఫ్, స్థానికుడు**

✔ వ్యర్థాలు తొలగించి నీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

19 నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలో ఈనెల 19 నుంచి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, శాస్త్రీయ పశుపోషణ తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. 19న కె.ఇల్లిందలపర్రులో శిబిరం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఉత్తమ ప్రణాళిక.. వందశాతం ఉత్తీర్ణత

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ఇప్పటికే ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోంది. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి అందరూ సమాన స్థాయికి చేరేలా ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఐదుగురు చొప్పున విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ స్లిప్ టెస్టుల రూపంలో వారి ప్రగతిని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్తిలి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు అవలంబిస్తున్న పద్ధతులను ఇలా వివరించారు.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

పాఠశాలలు		బాలురు	బాలికలు
అత్తిలి	11	192	254
ఇరగవరం	8	219	221
తణుకు	11	389	387

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సహచర విద్యార్థుల సహకారంతో మంచి మార్కులు సాధించాలనే తపన పెరిగింది. ఏకాగ్రతతో చదివితే మనసులో నిక్షిప్తమై ఉంటాయన్న ఉద్దేశంతో తెల్లవారు జామునే నిద్రలేచి చదువుతున్నాం. **-భవ్యశ్రీ**

సందేహాల నివృత్తి

పది పరీక్షల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల్లో వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తున్నారు. పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధిచడం కోసం ప్రణాళిక ప్రకారం చదువుతున్నాం. **-జెస్సీ**

నమ్మకం కలిగింది

పది పరీక్షల కోసం పూర్తి అవగాహనతో పరీక్షలకు సన్నద్ధమవుతున్నాం. పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలం అనే నమ్మకం కలిగింది. **-దివ్యశ్రీ**

మెలకువలు పాటించి..

అధ్యాపకుల మెలకువలు తప్పకుండా పాటిస్తాం. అవి మంచి మార్కులు రావడానికి దోహదం చేస్తాయి. భయం లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధమవుతున్నా. భయపడితే నేర్చుకున్న అంశాలు మర్చిపోయే అవకాశం ఉంది. **-మధుశ్రీ**

ఘనంగా నేరేళ్లమ్మ జాతర

అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఇరగవరం, న్యూస్‌టుడే: పేకేరులో గత 11 రోజులుగా నిర్వహిస్తున్న నేరేళ్లమ్మ జాతర ఘనంగా ముగిసింది. శుక్రవారం గ్రామంలోని అమ్మవార్లకు మహా కుంభం నివేదించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచి హేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి మహంకాళమ్మ సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

కూచిపూడిని ప్రారంభిస్తున్న ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం కొబ్బరితోటలోని శ్రీదేవి మహంకాళమ్మ 46వ వార్షిక జాతరలో భాగంగా సంస్కృతి ఉత్సవాలను గురువారం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొర్రెడ్డి ఆదిలక్ష్మి ప్రారంభించారు. తొలిరోజు కూచిపూడి శ్రీనివాస రాయ నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పార్వతి కల్యాణం హరికథ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారిని బొర్రెడ్డి ఆదిలక్ష్మి సత్కరించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం సమకూరింది. హైదరాబాద్ పంజాగుట్టకు చెందిన ఎం.లక్ష్మీప్రసన్న కుమారి రూ.లక్ష, తాడేపల్లిగూడేనికి చెందిన పసుమర్తి ధన వెంకట సూర్యనారాయణ రూ.లక్ష విరాళాలను ఆలయ కార్యాలయంలో శుక్రవారం జమ చేశారు. ఈ సందర్భంగా అధికారులు దుర్గాప్రసాద్, హనుమంతాచార్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాల్ని అందజేశారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మానవత్వాన్ని చాటుకున్నారు. తణుకు మండలం తేతలి జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కుటుంబ సభ్యులను వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కారు దిగి క్షతగాత్రులను పరామర్శించారు. తన సిబ్బందిని అప్రమత్తం చేసి క్షతగాత్రులను తన వాహనంలో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంటుతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలని చరవాణిలో ఆదేశించారు.

అమ్మవారి సేవలో కారుమూరి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలిలోని వెంకమ్మ, మహంకాళమ్మను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కారుమూరికి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఆయన వెంట వైకాపా మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు

బహుమతులతో విజేతలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, లెమన్ స్పూన్, పరుగు పందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఐద్వా నాయకురాలు పి.జయమ్మ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, కాటమ నాయకులు పాల్గొన్నారు. ● తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని 17, 19 వార్డుల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలిచినవారికి బహుమతులు అందజేశారు. శ్రీధర్ తన నివాసం వద్ద సంప్రదాయ దుస్తుల్లో కుటుంబ సభ్యులు వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీధర్ నివాసం వద్ద నాగలితో సందడి చేసిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తదితరులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తణుకు మండలం దువ్వలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు గ్రామ సర్పంచి ఎ.బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న పండు తదితరులు

ఆకట్టుకున్న రంగవల్లిక

తాడేపల్లిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఎ.పి.హెచ్.బి.కాలనీలో కనుమ సందర్భంగా ఒక మహిళ వేసిన రంగవల్లిక చూపరులను ఆకట్టుకుంటోంది. గోదాదేవి నీటిలో చూస్తున్నపుడు తన ప్రతిబింబం కృష్ణుడి రూపంలో కనపడుతున్నట్లుగా ఊహిస్తోంది. దీనిని రంగురంగుల ముగ్గులతో అలంకరించిన తీరు చూపరులను ఎంతో ఆకర్షిస్తోంది.

ప్రత్తిపాడులో.. ప్రత్తిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం ప్రత్తిపాడులో రంగవల్లుల పోటీలను జనసేన మండల ప్రధాన కార్యదర్శి, గ్రామ అధ్యక్షుడు చెరకూరి జగత్ సోమశేఖర్(పండు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినవారికి పండు, సహచరులు బహుమతులు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి కిరీటం

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం పాలేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గ్రామానికి చెందిన మద్దుల కేశసాయి వెంకట రాజేష్, నాగ సిరి నీలిమ దంపతులు సుమారు రూ.80 వేల విలువైన వెండి కిరీటం సమర్పించారని ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి పూజలు చేశారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం

దర్శిపర్రు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం దర్శిపర్రులో గురువారం శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు స్వామికి స్వయంపాకం అందించారు. ముందుగా ఉత్సవ మూర్తిని దర్శించుకున్నారు.

లలితా పారాయణం

తాడేపల్లిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం కొబ్బరితోటలోని శ్రీదేవి మహంకాళమ్మ 46వ జాతర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం రాత్రి పద్మనాభ వల్లభ కమిటీ ఆధ్వర్యంలో లలితా సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం చిద్విత మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా కోడి పందేలు

రూ.కోట్లు చేతులు మారిన వైనం

తాడేపల్లిగూడెం బరిలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వెంకట్రామయ్య తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సంక్రాంతిని పురస్కరించుకుని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గురు, శుక్రవారాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. రూ.కోట్లు చేతులు మారాయి. బరుల వద్ద గుండాట, కోతాట నిర్వహించారు. పందెంలో నగదుతో పాటు యూనికార్న్, బుల్లెట్ వంటి వాహనాలను నిర్వాహకులు అందించారు. తాడేపల్లిగూడెం బరిలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను బరి నిర్వాహకుడు పైబోయిన వెంకట్రామయ్య, అలంపురం సొసైటీ అధ్యక్షుడు పాశర్ల ప్రసాద్ ఘనంగా సత్కరించారు. నీలాద్రిపురం బరిలో జరుగుతున్న పందేలను ఏపీ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ తిలకించారు.

పట్టెంపాలెం బరిలో తలపడుతున్న కోళ్లు

తేతలి: భారీ ఏర్పాట్లు చేసిన బరి, పందెంరాయళ్లు

తణుకు గ్రామీణం, అత్తిలి, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలో తణుకు, పైడిపర్రు, తేతలి, దువ్వ, కావలిపురం, రేలంగి, ఓగిడి, అయినపర్రు, తూర్పు విప్పర్రు, అత్తిలి, కె.సముద్రగట్టు గ్రామాల్లో బరులు ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల్లో కోడి పందేలతో పాటు కోతాట, గుండాట తదితర క్రీడలతో కలిపి సుమారు రూ.8 కోట్ల వరకూ చేతులు మారినట్లు సమాచారం. తణుకు, తేతలి, గొటేరు, అత్తిలి గ్రామాల్లో భారీ బరులను ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో సైతం విద్యుద్దీపాల కాంతుల్లో పోటీలు నిర్వహించారు. పందేలను వీక్షించేందుకు బరుల వద్ద ప్రత్యేకంగా కుర్చీలు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేశారు. కొన్ని బరుల వద్ద మద్యం నేరుగా విక్రయించడంతో పలువురి మధ్య ఘర్షణలు జరిగాయి.

ఊపందుకున్న పనులు.. తీరనున్న వెతలు

రూ.2.80 కోట్లతో మురుగు కాలువ, రహదారి నిర్మాణం

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

గుంతల రోడ్లు, అస్తవ్యస్త డ్రెయినేజీతో ఇంతవరకూ అవస్థలు పడిన తాడేపల్లిగూడెం ప్రజల కష్టాలు త్వరలో తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు ఊపందుకోవడంతో ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన ఏపీ నిట్ కళాశాలకు సంబంధించిన మురుగు నీటి వివాదం పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ మురుగుని పట్టణంలోని ప్రధాన డ్రెయిన్‌కు అనుసంధానించే పనులు పూర్తికావచ్చాయి. నిట్‌కు చెందిన డ్రెయిను గణేష్‌నగర్, బాపూజీ పుంతరోడ్డు నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ ఎస్వీఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న ప్రధాన డ్రెయిన్‌కు అనుసంధానిస్తున్నామని.. దీని నిర్మాణానికి నిట్ విద్యా సంస్థ రూ.1.35 కోట్ల గ్రాంటును పురపాలక సంఘానికి మంజూరు చేసిందని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఈ మొత్తంతో పాటు మున్సిపాలిటీ మరో రూ.40 లక్షలు ఖర్చు చేసిందని చెప్పారు. ● ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా పట్టణంలోని నాలుగు ప్రధాన చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కొండయ్య, మాల కొండయ్య, వానపల్లిగూడెం, తాడేపల్లి చెరువులను అభివృద్ధి చేస్తామని.. ప్రస్తుతం ఇవి టెండర్ల దశలో ఉన్నాయన్నారు.

తుది దశలో డ్రెయిన్ పనులు

గణేష్ నగర్ నుంచి ఎస్వీఆర్ సర్కిల్ వరకు ఉన్న 850 మీటర్ల పొడవున మట్టిరోడ్డును రూ.1.45 కోట్లతో బీటీగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ రోడ్డుకి ప్రస్తుతం పైపులైన్లు నిర్మిస్తున్నామని.. ఈ పనులు కూడా చివరి దశకు వచ్చాయన్నారు. అనంతరం రహదారి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

అభివృద్ధి చేయనున్న గణేష్‌నగర్ - ఎస్వీఆర్ సర్కిల్ రోడ్డు

● లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువు ఈ నెల 23తో ముగుస్తుందని.. ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. ఈ గడువు ముగిసిన తరువాత అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని లేఅవుట్లకు సంబంధించి మున్సిపాలిటీ తీసుకునే చర్యలకు ప్రజలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

22 మంది అరెస్టు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు మండలం తేతలి, దువ్వ, మండపాక, పైడిపర్రు గ్రామాల్లో గుండాట, కోడి పందేలు తదితర జూద క్రీడలు నిర్వహిస్తున్నవారిపై గురు, శుక్రవారాల్లో పది కేసులు నమోదు చేశామని ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. 22 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10300 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

శిబిరాలపై దాడి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలంలో కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని శుక్రవారం పోలీసులు తెలిపారు. అత్తిలి మండలం గుమ్మంపాడు, అత్తిలి, కె.సముద్రపుగట్టు, చలివేంద్రచెరువు గ్రామాల్లో కత్తులు కట్టి కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరాలపై దాడులు చేశామన్నారు. నిందితుల నుంచి 8 కోళ్లు, రూ.7200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

పల్టీ కొట్టిన కారు

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెద తాడేపల్లి చెరువు మలుపు వద్ద గురువారం రాత్రి కారు పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న కారు మలుపు తిప్పే క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగుబోదెలో పడింది. దానిలో ఉన్న ఆరుగురు స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. వారు అక్కడ నుంచి వేరే వాహనంలో వెళ్లిపోయారు.

అపూర్వ సమ్మేళనం

పరిమెళ్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం పరిమెళ్లలోని జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో 1997-1998 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వారంతా 28 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న చోట కలవడంతో ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తాము ఏ రంగంలో స్థిరపడ్డారో సభాముఖంగా తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేయాలని తీర్మానించుకున్నారు. పాఠశాలకు వచ్చిన వెంటనే వందేమాతరం, తిరిగి వెళ్లే ముందు జనగణ గీతాన్ని ఆలపించడం గమనార్హం. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పొంచి ఉన్న ప్రమాదం

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం నుంచి రాతి చెరువు పుంత మీదుగా కావలిపురం చేరే మార్గంలో కాలువపై నిర్మించిన వంతెన నుంచి నేరుగా రోడ్డును దాటే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అక్కడ రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనం అదుపు తప్పితే సుమారు 15 అడుగులు కిందకి పడే ప్రమాదముంది. వంతెన దాటిన వెంటనే ఎడమవైపు లేక కుడివైపునకు వెళ్లాలి. గమనించకుండా అదే వేగంతో నేరుగా వెళ్తే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్టేనని స్థానికులు చెబుతున్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

అలంపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో అలంపురం, దర్శిపర్రు గ్రామాల్లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరిపరపు రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో శాస్త్రవేత్తలు, మేధావులు రైతు సంఘ సదస్సుల్లో పాల్గొని ప్రజలను చైతన్యం చేసేందుకు సన్నద్ధం అవుతున్నారన్నారు. కార్యక్రమంలో వడ్డా సన్యాసిరావు, జక్కంశెట్టి బంగారయ్య, పాపారావు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు

అధ్వానంగా పాలగుండం చెరువు

ఇరగవరంలో పిచ్చిమొక్కలతో నిండిన పాలగుండం చెరువు

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరంలో మహిషాసుర మర్దిని సమేత ఉమా పాలేశ్వరస్వామి ఆలయానికి చెందిన పాలగుండం చెరువు అధ్వానంగా తయారైంది. ఇందులో పిచ్చి మొక్కలు, తూడు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆలయానికి తూర్పు భాగంలో ఉండే చెరువు చరిత్రలో ప్రసిద్ధి చెందింది. దీనిని గతంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దారు. చెరువు మధ్యభాగం వరకు రెయిలింగ్‌తో కూడిన ఇనుప వంతెన నిర్మించి శివుని విగ్రహం ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహణ లేక ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ విషయమై ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో చెరువు అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని వివరించారు.

వెలవెలబోయిన బస్టాండు.. నిర్మానుష్యంగా రహదారులు

కళతప్పిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: గడచిన నాలుగు రోజుల నుంచి కిటకిటలాడిన తాడేపల్లిగూడెం బస్టాండులో శుక్రవారం కనీసం 50 మంది ప్రయాణికులు లేరు. కనుమ రోజున ప్రయాణాలు చేయకూడదని ఒక సంప్రదాయం ఉండటంతో ప్రయాణికులు ఎక్కువగా కనిపించలేదు. ఆక్యుపెన్సీ సగటు కన్నా తక్కువగా నమోదైందని, బస్సులు అన్నీ ఖాళీగా తిరిగాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. అయితే సంక్రాంతి రోజు రద్దీగా ఉన్నా ఆర్టీసీ సర్వీసులు తగ్గించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని స్థానికులు తెలిపారు. కనుమరోజు కేఎన్ రోడ్డు మీద జనసంచారం తక్కువగా ఉంది.

జనసంచారం లేని కె.ఎన్.రోడ్డు

నాటి ఆచారం.. పునఃప్రారంభం

ఆకివీడు, న్యూస్‌టుడే: సంక్రాంతి, కనుమ సందర్భంగా శుక్రవారం ఆకివీడులోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి, జలదుర్గ శక్తీశ్వర స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన మూడు ఎడ్ల బళ్లపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. ఇకపై పాత పద్ధతిలో ఎడ్ల బళ్లపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. 35 ఏళ్ల క్రితం వరకు కనుమ రోజున ఎడ్ల బళ్లపై స్వామివార్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

(c) eenadu

సంతోషాల సంక్రాంతి

మముబ్రోవుమా.. మాధవరాయా

అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత మాధవరాయ స్వామి

మంగళ వాయిద్యాలు, కేరళ కళాకారుల డప్పులు, చెక్కభజన గానాలాపనలు, బృందావనం కళాకారుల నృత్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య మాధవరాయ స్వామి పార్వేట ఉత్సవాన్ని మైదుకూరులో శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. తొలుత భూదేవి, శ్రీదేవి సమేత మాధవరాయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో ప్రజలు ఉత్సవాన్ని తిలకించి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

అమ్మోరు తల్లికి దండం

ప్రొద్దుటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో సంక్రాంతి లక్ష్మిగా పెద్దమ్మ తల్లి

ఎంత చక్కగున్నమో

దువ్వూరు గ్రామోత్సవంలో బాలికల కోలాటం

నే ఆడితే

కలసపాడు లక్ష్మీచెన్న కేశవ స్వామి ఆలయం వద్ద చిన్నారి నృత్యం

మూడు రోజులపాటు ఊరూరా సంబరాలు

పెద్ద పండగ సంక్రాంతిని మూడు రోజులపాటు ఊరూరా ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. పుష్య మాస మంచు తెరల్లో భోగి మంటలతో వెచ్చగా కొత్త ఆశలను తీసుకొచ్చింది నవక్రాంతి. మగువలు గడప గడపనా ముత్యాల ముగ్గులతో పుడమికి కొత్త శోభనద్దారు. హరిదాసుల కీర్తనలు, బసవన్నల ఆటలు, కోడి పందేల ఉల్లాసం, పతంగుల హోరుతో పల్లె సీమల్లో అంతటా సందడే కనిపించింది. పలుచోట్ల కోళ్ల కత్తులు దూశాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడి, నివాసం ఉంటున్న వారిలో సింహభాగం స్వగ్రామాలకు చేరుకోవడంతో ఊళ్లు ఆత్మీయతను అద్దుకున్నాయి. పలువురు పండగను ముగించుకుని బరువెక్కిన హృదయాలతో తిరుగు ప్రయాణమయ్యారు. - న్యూస్‌టుడే బృందం

దైవ రూపం

కలసపాడులో గోదాదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వేషధారణ



పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్త జన సందోహం

మేమూ పోటీపడతాం

నరసింహాపురం.. కుర్చీలాటలో పాల్గొన్న మహిళలు

రంకెలేసిన బసవన్నలు

చాపాడు మండలం వెదురూరులో బండ లాగుతున్న ఎడ్ల వెంట పరుగులు తీస్తున్న జనం

ముత్యమంత తలంబ్రాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 1న వైభవంగా నిర్వహించే సీతారాముల కల్యాణ ఘట్టానికి 120 కిలోల ముత్యాలు సేకరించాలని తితిదే ఉన్నతాధికారులు నిర్ణయించారు. ముత్యం రంగు, పరిమాణం ఆకర్షణీయంగా ఉండేలా జాగ్రత్త వహిస్తున్నారు. ఇందుకు రూ. 12-15 లక్షలు అవసరమవుతాయని అంచనా. ఈ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు రామయ్యపై అపారమైన భక్తిభావం, దాతృత్వం చాటుతున్న పలువురితో పరిపాలనా అధికారులు చర్చించారు.

ముత్యాలు

● 1.50 లక్షల పొట్లాలు: మార్చి 27న ధ్వజారోహణం, శ్రీరామ నవమి ఆస్థానం ఉంటుంది. అదేరోజు భక్తులకు పంపిణీ చేయడానికి 1.50 లక్షల తలంబ్రాల పొట్లాలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు అవసరమైన బియ్యం, నెయ్యి, పసుపు, కుంకుమ, కంకణాలు, విడి ప్యాకెట్లను తితిదే సరఫరా చేయనుంది. జగదభిరాముడు, జానకమ్మ పరిణయ వేడుకలను కనులారా వీక్షించడానికి తరలిరానున్న ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులు, సందర్శకులకు కల్యాణ వేదిక ప్రాంగణంలోనే వీటిని అందజేయనున్నారు. ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలను సీనియర్ అధికారులకు అప్పగించాలని నిర్ణయించారు.

ఆర్టీసీకి కనక మహాలక్ష్మి

కడపలో ఆర్టీసీ కార్గో కార్యాలయం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఎలాంటి ఖర్చు లేకుండా.. పెట్టుబడి లేకుండా ఆర్టీసీకి ఆదాయం తెచ్చే వాటిల్లో కార్గో ఒకటి. అంతర్ రాష్ట్రానికి అయితే ఒక రోజులో.. పక్క జిల్లాలకు అయితే నాలుగైదు గంటల్లో వస్తువులను ఆ సంస్థ చేరవేస్తోంది. పైగా సురక్షితంగా గమ్యస్థానానికి చేరుస్తోంది. కొన్ని వస్తువులకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తోంది. దీంతో ఈ వ్యాపారం రోజు రోజుకు వృద్ధి చెందుతోంది. కడప ఆర్టీసీ జోన్(కడప, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి) పరిధిలో ఉండే జిల్లాల్లో కార్గో వ్యాపారం గడిచిన ఏడాదిలో గణనీయంగా పుంజుకుంది. ఆదాయపరంగా అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. కడప ద్వితీయ స్థానంలో నిలిచింది. చివరి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా ఉంది.

జిల్లా ఆదాయం (రూ.కోట్లలో)	2024	2025
కడప	7.82	7.85
తిరుపతి	6.91	6.45
చిత్తూరు	3.71	4.08
అన్నమయ్య	2.96	3.40
నంద్యాల	3.58	3.40
కర్నూలు	5.27	4.72
అనంతపురం	7.84	8.00
సత్యసాయి	3.30	3.44

ఆ మాటే మోసం

ఈనాడు, కడప: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తులతో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు ఎంత అవగాహన కల్పించినా బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ఉద్యోగాలు, బహుమతులు అనే ఆశలు చూపుతూ మోసగాళ్లు ఇతరుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ప్రముఖ వ్యక్తుల చిత్రాలతోనూ సామాజిక మాధ్యమాలను ఉపయోగించి డబ్బుల వసూలు చేస్తున్నారు.

◆ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ తండ్రీ కొడుకులు. గత సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆస్తుల చిట్టాను ముంబయికి చెందిన రుషాంత్ జయకుమార్ వాడ్కే అనే వ్యక్తి చేజిక్కించుకున్నాడు. వెబ్‌సైట్‌లో ఉంచిన చిట్టాను తీసుకున్నాడు. తాను సహ చట్టం సభ్యుడినంటూ ఆ ఇద్దరితో పరిచయం చేసుకున్నాడు. మీ ఆస్తుల చిట్టా మొత్తం ఎన్నికల సంఘానికి సమర్పించలేదని, ఈ విషయాన్ని కేంద్ర దర్యాప్తు బృందాల దృష్టికి తీసుకెళ్తానంటూ ఈ- మెయిల్ ద్వారా బెదిరింపులకు దిగాడు. సుధాకర్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు కటకటాలపాలయ్యాడు.

◆ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఫొటోను ఒకరు తన సామాజిక మాధ్యమ ఖాతా డీపీగా పెట్టుకున్నాడు. అత్యవసరంగా తన ఖాతాకు నగదు పంపాలని.. మరుసటి రోజే తిరిగి చెల్లిస్తానంటూ పలువురికి సందేశాలు పంపాడు. కలెక్టర్ స్థాయి అధికారి నగదు అడగడంపై పలువురు అనుమానించారు. విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో తన ఫొటోను వాట్సప్ డీపీగా పెట్టుకుని నగదు అడిగితే ఇవ్వొద్దని ఆయన చెప్పాల్సి వచ్చింది.

◆ రాజంపేటకు చెందిన వెంకటేశ్వర్లు వాట్సప్‌ను ఓ వ్యక్తి హ్యాక్ చేశాడు. తన బ్యాంకు ఖాతాకు నగదు పంపాలని ఆ ఫోన్‌లో ఉన్న పలు నంబర్లకు సందేశాలు పంపాడు. సందేశం చూసిన వారు తిరిగి కాల్ చేసే సౌలభ్యం లేకుండా బ్లాక్ చేశాడు.

హోదాలతో నమ్మిస్తూ.. బెదిరిస్తూ...:

సైబర్ నేరగాళ్లు తమను రకరకాల హోదాలతో పరిచయం చేసుకుంటున్నారు. నమ్మకం కలిగేలా మాట్లాడతారు. పోలీసు దుస్తులు, ఆయా సంస్థల లోగోలు, నకిలీ పోలీసు స్టేషన్ల సెట్‌లలో కూర్చుని వీడియో కాల్ చేస్తున్నారు. మాయ మాటలతో వ్యక్తిగత వివరాలు సేకరించి భయపెడుతున్నారు. కేసులంటూ భయపెడుతూ బయట పడాలంటే నగదు బదిలీ చేయాలంటూ బెదిరిస్తున్నారు. ఇలా జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధితో పాటు మరో నలుగురు వ్యక్తుల నుంచి ఇప్పటికే ఈ తరహా దోపిడీకి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదని.. అలా ఎవరైనా చెబితే పక్కా మోసమని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందిపుచ్చుకుంటే అభ్యుదయం

ఎస్సీ యువతకు పీఎంఏజేఏవై పథకం

కడప (గ్రామీణ), న్యూస్‌టుడే: జిల్లాలో 29,676 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 1,92,678 మంది సభ్యులున్నారు. ఎస్సీ, ఎస్టీ సభ్యులే పూర్తిగా కొన్ని సంఘాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన సభ్యుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ సభ్యుల కోసం ప్రధానమంత్రి అనుసూచిత జాతీయ అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) పథకాన్ని కూడా తీసుకొచ్చారు. ఇందులో యూనిట్ ధర రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు ఉంటుంది. అందులో పది శాతం లబ్ధిదారుని వాటా, రూ. 50 వేల రాయితీ, మిగిలింది ఉన్నతి కింద వడ్డీ లేని రుణంగా అందించనుంది.

ఆటోలు

జిల్లాకు 175 యూనిట్లు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 39(కడప మినహా) మండలాల్లో లబ్ధిదారుల ఎంపిక చేయాలని పీడీ ఆదేశాలు జారీ చేశారు. మండలానికి 5 నుంచి 10 మందిని లబ్ధిదారులను ఎంపిక చేయాలని అందులో సూచించారు. పథకం కింద సుమారు 56 రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. జిల్లాకు 175 యూనిట్లు లక్ష్యంగా ఇచ్చారు. ఈ నెల 24వ తేదీలోపు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారు తన వాటా, బీమా సొమ్మును సీఈవో సెర్ప్‌కు జమ చేసి, వివరాలు ఉన్నతి పోర్టల్లో ఈ నెల 29వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఇవీ అర్హతలు.. నిబంధనలు

● లబ్ధిదారు ఎస్సీ వర్గానికి చెందిన స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండాలి. ● రుణానికి సంఘం తీర్మానం చేయాలి. ● లబ్ధిదారు వయస్సు 20 - 35 ఏళ్ల మధ్య ఉండాలి. ● నిరుద్యోగి [illegible] పథకాలలోను పీఎంఎజేఎంఈ, పీఎంఈజీపీ కింద ఎలాంటి రుణం తీసుకుని ఉండరాదు. ● బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి(డ్వాక్రా)లో రుణం తీసుకుని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టి ఉండకూడదు. ● తీసుకున్న రుణంతో కొత్తగా ఇప్పుడు యూనిట్ ఏర్పాటు చేయాలి. ● లబ్ధిదారు తన వాటా పది శాతంతో పాటు యూనిట్ ధరలో ప్రతి [illegible] రూ. 4 చొప్పున కలిపి మొత్తం సెర్ప్ సీఈవో ఖాతాలో జమ చేయాలి. ● ప్రభుత్వం ద్వారా ఏదేని గౌరవ వేతనం పొందుతూ ఉండకూడదు.

కొత్త పుస్తకాలతో పాత తిప్పలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సమస్యలు పరిష్కరించడానికి రీ సర్వే చేసిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ- పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తోంది. రీ సర్వే చేసిన గ్రామాల్లో ప్రజాప్రతినిధులు వీటిని పంపిణీ చేస్తున్నారు. పుస్తకాలు ఇచ్చే సమయంలో ఆధార్ ఈకేవైసీ చేస్తున్నారు. ఈ సమయంలో పాత పాస్‌పుస్తకాలు రైతులు నుంచి తిరిగి తీసుకోవడం, భూ వివాదాలు లేకుండా స్పష్టమైన భూ హక్కులు కల్పించాలని ప్రభుత్వం సూచించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం సదరు ఆశయం అంతగా నెరవేరడం లేదు.

● పంపిణీలోనూ జాప్యం: రాజంపేట, కడప, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలో 235 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే చేశారు. వీటిల్లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో కూడిన 69,886 పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు 50 శాతం కూడా రైతులకు పంపిణీ చేయలేదు.

● పరిష్కరిస్తేనే వేగం: పాస్ పుస్తకాల్లో రైతుల ఫొటోలు సక్రమంగా లేకపోవడం, రైతులను గుర్తించకపోవడం, అందుబాటులో లేకపోవడం, నోషనల్ ఖాతా, మరణించడం, ఇతర ప్రాంతాల్లో ఉండడం, బ్యాంక్ రుణం, పాత పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, ఒకే భూమికి సంబంధించి రెండు సార్లు నమోదు కావడం, భూ ఖాతాలు సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. దీంతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో జాప్యం చోటుచేసుకుంటోంది. చిన్న, చిన్న సమస్యలను జిల్లా అధికారులు పరిష్కరిస్తే వేగంగా పుస్తకాలు పంపిణీ చేయడానికి వీలుంటుంది.

ప్రమాదాన్ని మోసుకెళ్తున్నారు!

రెండో ముంబయిగా పేరొందిన ప్రొద్దుటూరు వర్తక వాణిజ్యానికి ప్రసిద్ధి. అందుకు అనుగుణంగా ఇక్కడ రహదారులు మాత్రం అభివృద్ధి చెందలేదు. ఇరుకు దారులతో. ఇష్టారీతిన నడిచే వాహనాలతో పట్టణ వాసులు నిత్యం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు మరీ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అందుకు ఈ చిత్రం ఓ నిదర్శనం. ఒకరు ద్విచక్ర వాహనంపై పెద్ద డబ్బా పట్టుకుని కూర్చుని ట్రాఫిక్ మధ్యలో వెళ్తున్న ఈ దృశ్యం ప్రొద్దుటూరు పట్టణం గాంధీరోడ్డులోనిది. డబ్బా బరువుకు

జారినా, మరో వాహనానికి తగిలినా ప్రమాదకరమనే విషయాన్ని విస్మరించి ఇలా ప్రయాణం సాగించారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ఎంత పొంగితే అంత అనుగ్రహం

సంక్రాంతి పండగ కనుమ పర్వదినం వేళ పులివెందులలోని వాసవీ కాలనీ వాసులు ఓ నమ్మకాన్ని అనుసరిస్తారు. కాలనీ వాసులంతా ఇళ్ల బయట వరుసగా పొయ్యిలు ఏర్పాటు చేసుకుంటారు. ఇష్టదైవం శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆరాధిస్తూ పాలను పొంగించే కార్యక్రమాన్ని చేపడతారు. అవివాహిత యువతులు, సంతానం కోరుకునే మహిళలు, ఉన్నత విద్యలో రాణించాలనుకునే వారు ఇందులో పాల్గొంటారు. కట్టెల పొయ్యిపై పాలను మరిగిస్తారు. ఎవరివి బాగా పొంగితే వారికి లక్ష్మీనరసింహుని అనుగ్రహం దక్కుతుందని.. వారి కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. - న్యూస్‌టుడే, పులివెందుల

కారాగారంలో మత్తు వదిలిస్తాం...

జైలు పర్యవేక్షణాధికారి రాజేశ్వరరావు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: 'కడప కేంద్ర కారాగారంలో త్వరలో వ్యసన విముక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాం. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సహకారంతో సేంద్రియ ఉద్యాన పంటల సాగు ప్రారంభిస్తున్నాం' అని కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి రాజేశ్వరరావు తెలిపారు. 'న్యూస్‌టుడే'తో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు..

త్వరలో వ్యసన విముక్తి కేంద్రం



గంజాయి, పొగాకు, డ్రగ్స్, మద్యం, సారా, సామాజిక మాధ్యమాలకు బానిసలై జైలుకు వస్తున్న వారే ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఉంటున్నారు. జైలులో అడుగు పెడితే ఒక్కసారిగా అవన్నీ కట్టడవుతాయి. దీంతో పలువురు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటు చేసి చికిత్స అందించాలని నిర్ణయించాం. సిబ్బంది నియామకానికి ఇటీవల ఇంటర్వ్యూలు కూడా నిర్వహించాం. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, అకౌంటెంట్, కౌన్సిలర్, సైకాలజిస్ట్, సామాజిక కార్యకర్త, వార్డు బాయ్, మగ నర్స్‌తో పాటు మరికొన్ని ఉద్యోగాలకు డీఐజీ ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టనున్నాం.

ఆర్గానిక్ వ్యవసాయం

జైలులో సేంద్రియ పంటలను సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకుగాను కలెక్టర్ శ్రీధర్ సహకారం తీసుకుంటున్నాం. న్యాక్ ద్వారా శిక్షణ, నాబార్డ్ ద్వారా టైలరింగ్, ప్లంబింగ్ తదితర రంగాల్లో ఖైదీలకు శిక్షణ ఇస్తాం. ఖైదీల్లో పూర్తిస్థాయిలో మార్పులు తెచ్చేందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నాం.

తమలపాకు నోరే కాదు.. ధరా పండింది

వేంపల్లె, న్యూస్‌టుడే: నోళ్లను ఎర్రగా పండించే తమలపాకుల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఈ సారి గణనీయంగా పెరిగాయి. నూరు కట్టలు(10,000 ఆకులు) రూ. 6,000 పలుకుతున్నాయి. దీంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలోని వేంపల్లె, చింతకొమ్మదిన్నె, ఖాజీపేట, చెన్నూరు, దువ్వూరు, మైదుకూరు, సిద్దవటం తదితర మండలాల్లో 700 హెక్టార్లలో రైతులు తమలపాకు తోటలు సాగు చేశారు.

సాగులో ఉన్న తమలపాకు తోట

● గత ఏడాది తప్పని నష్టం: ఎకరా సాగుకు కౌలు, విత్తనాలు, ఎరువులు, తీగల కోసం రూ. 2 లక్షలమేర వెచ్చించారు. ఏడాది కాలంగా తమలపాకుల ధర నానాటికీ తీసికట్టుగా మారింది. వంద కట్టలదాకులు రూ. 1,500 మించి లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఒకదశలో సాగు, కౌలు ఖర్చులు కూడా దక్కక పలువురు రైతులు తోటలను తొలగించారు. మొంథా తుపాను కారణంగా గోదావరి జిల్లాలు గుంటూరు తదితర ప్రాంతాలల్లో సాగు చేసిన తోటలు దెబ్బతిన్నాయి. దీంతో జిల్లాలోని తోటలకు గిరాకీ వచ్చింది. చెన్నూరు, ఖాజీపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి తిరుపతి, చెన్నై, హుబ్లీ, ధార్వాడా, హైదరాబాద్, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత రెండేళ్లలో తమలపాకులకు ఎప్పుడూ లేని ధర ఇప్పుడు పలకడంతో రైతులు సంతోషిస్తున్నారు.

చెన్నైలో నకిలీ మద్యం సీసా మూలాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే పలువురు అరెస్ట్ అయ్యారు. కొందరు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కూడా వేటుకు గురయ్యారు. ఈ కేసు దర్యాప్తు పర్వం కొనసాగే కొద్దీ మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా నకిలీ మద్యాన్ని నింపేందుకు ఉపయోగించిన సీసాలను చెన్నైలో తయారు చేయించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు చెన్నై, కోయంబత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నారు.

● మొత్తం లక్షకు పైగా తయారీ: ములకలచెరువు నకిలీ మద్యాన్ని 180 ఎంఎల్ సీసాల్లో నింపారు. ఎక్కడి నుంచి తెచ్చారని ఆరా తీయగా తీసుకొచ్చారని నకిలీ మద్యం తయారీదారులను విచారించగా చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాల్లో తయారు చేయించినట్లు తెలిపారు. దీంతో ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాలకు వెళ్లి గత నాలుగు రోజులుగా తనిఖీలు చేపట్టారు. సీసాలను ఎంతకాలం నుంచి తయారు చేస్తున్నారు.. ఎవరెవరికి సరఫరా చేశారు.. కేవలం నకిలీ మద్యం తయారీకే ఇచ్చారా! ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు సరఫరా చేశారా అనే వివరాలను అధికారులు ఆరా తీస్తున్నారు. కొనుగోలుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను నగదు రూపంలో ఇచ్చారా.. డిజిటల్ రూపంలో చేశారా.. అనే వివరాలూ తెలుసుకుంటున్నారు.

పరిహారంతో జాతీయ మార్గం సుగమం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చాగలమర్రి నుంచి వేంపల్లె వరకు రెండు, నాలుగు వరుసలతో జాతీయ రహదారి-440 ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఇరవై ఆరు గ్రామాలకు సంబంధించి మొత్తం 403.52 ఎకరాలు సేకరించారు. ఇందుకుగాను రూ. 99.91 కోట్ల పరిహారం చెల్లించాలని నిర్ధారించారు. భూములు, కట్టడాలను కోల్పోతున్న బాధితుల వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఎన్‌హెచ్ అధికారులు హైదరాబాద్‌లోని రీజినల్ పేమెంట్ ఆఫీస్(ఆర్పీవో)కు ఇప్పటికే పంపారు. దీంతో గత ఆరు నెలల వ్యవధిలో రూ. 29.52 కోట్లు బాధితుల ఖాతాల్లో జమ చేశారు. ఈ విషయమై జాతీయ రహదారుల విభాగం ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఆర్పీవో నుంచి మిగిలిన రూ. 70.39 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. మరో ఆరు నెలల్లోగా రహదారి పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

మండలం	భూసేకరణ	విస్తీర్ణం (ఎకరాలు)	పరిహారం (రూ.కోట్లు)	చెల్లింపు
ప్రొద్దుటూరు	04	48.32	9.61	7.00
రాజుపాళెం	08	107.00	17.60	11.13
ఎర్రగుంట్ల	05	101.63	11.00	1.45
వీఎన్ పల్లె	08	103.86	33.00	3.61
వేంపల్లె	01	42.69	25.70	6.63

చౌకగా తీసిపారేయొద్దు

ఫోర్టిఫైడ్ బియ్యం.. తింటే ఆరోగ్యం

ముకోసం

కమలాపురం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చౌక ధరల దుకాణాల ద్వారా కార్డులో ఉన్న ఒక్కొక్కరికీ ఉచితంగా బియ్యం అందిస్తున్నాయి. వాస్తవానికి ఇవి పోషకాలతో కూడినవి. ఈ విషయమై పలువురికి అవగాహన ఉండటం లేదు. దీంతో వీటిని కొందరు చులకనగా చూస్తున్నారు. కిలో రూ. 15 నుంచి రూ. 18కి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫోర్టిఫైడ్(పోషకాలు) బియ్యం తిని ఆరోగ్యంగా ఉండాలని జాతీయ పోషకాహార సంస్థ అవగాహన కల్పిస్తోంది. 'ఈ రోజు పోషణ.. రేపటి బలమైన భవిష్యత్తు' అనే నినాదంతో ప్రచారం కూడా చేస్తోంది.

ఫోర్టిఫైడ్ బియ్యం

● రక్తహీనత దూరం: ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో ఫోర్టిఫైడ్ గింజలు కలుపుతారు. వీటిలో ఇనుము, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ-12 వంటి సూక్ష్మ పోషకాలుంటాయి. అల్పాదాయ కుటుంబాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను దూరం చేసేందుకు ఇవి దోహద పడతాయి.

వద్దు ఆర్థిక భారం

కిలో రూపాయికే ఇంటికి చేరే పోషకాల బియ్యాన్ని అమ్ముకుని కిలో రూ. 45 నుంచి రూ. 50కి తెచ్చుకునే బియ్యంతో ఆర్థికంగా భారం పడుతుంది. పోషకాలు లేకపోవడంతో వాటిని తింటే ఉపయోగం ఉండదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రతి నెలా జిల్లాలోని 5.78 లక్షల కుటుంబాలకు అందజేస్తున్నారు. ఆ బియ్యాన్ని సద్వినియోగం చేసుకుంటే పోషకాహార లేమి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాల బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు పౌరసరఫరాల అధికారులు సూచిస్తున్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు
ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

తెదేపాలో పలువురి చేరిక

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో పలువురు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. పెద్దకొండప్పు కాలనీకి చెందిన జగదీశ్వర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి తెదేపా నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సమక్షంలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై 50 కుటుంబాలు పార్టీలో చేరాయన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాషా, తెదేపా రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తొండూరు మండల కన్వీనర్ మారెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

20 నుంచి విద్యుత్తు ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు ధరల ప్రతిపాదనలపై ఈ నెల 20 నుంచి ఏపీ ఈఆర్సీ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతోందని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో.. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 22, 23 తేదీల్లో.. కర్నూలు ఏపీ ఈఆర్సీ కార్యాలయంలో 27న ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. వినియోగదారులు నేరుగా అక్కడకు వెళ్లి తమ అభిప్రాయాలను తెలియచేయవచ్చని.. వెళ్లలేని వారు ఆయా జిల్లాల ఎస్ఈ, డివిజన్ ఈఈ కార్యాలయాల నుంచి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ నుంచి అభిప్రాయాలను తెలుసుకోవచ్చన్నారు.

ఒంటిమిట్టకు నేడు తితిదే జేఈవో

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: దేవునికడపలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం శనివారం రానున్నారు. ఈ క్షేత్రంలో ఈ నెల 18 నుంచి 28 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్న ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం జేఈవో, ఆయా విభాగాల సీనియర్ అధికారులు ఇక్కడికి రానున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ ఏడాది మార్చి 26వ నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. భక్తులకు కావాల్సిన వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటి నుంచే దృష్టి సారించారు. ఈ సారి ముందస్తుగానే చేపట్టాల్సిన పనుల కోసం టెండర్లు పిలిచారు. రామయ్య క్షేత్రాన్ని సందర్శించిన తర్వాత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

పశువైద్య విద్యార్థుల ప్రతిభకు పురస్కారాలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (తిరుపతి) పరిధిలోని అంతర్ కళాశాల పోటీల్లో ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచారు. నాలుగు కళాశాలల మధ్య వివిధ అంశాలపై ఇటీవల విజయనగరం జిల్లా గరివిడిలోని ప్రభుత్వ వెటర్నరీ కళాశాల ఆవరణంలో పలు అంశాల వారీగా పోటీలను నిర్వహించారు. సామూహిక దేశభక్తి గేయంలో ప్రొద్దుటూరు పశువైద్య విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాదు, హెచ్‌వోడీ రాజకిశోర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

డీసీసీబీలలో దారుణాలు

● మొండికేసిన బకాయిలు
● నిలిచిన కోట్ల రూపాయలు
● ఓటీఎస్ అవకాశం కల్పించాలని ఆప్కాబ్‌కు నివేదన

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా వసూలు కాని అప్పు సహకార రంగాన్ని పట్టి కుదిపేస్తోంది. కర్నూల్ కేంద్ర పలు రకాల రుణాలు తీసుకుని బ్యాంకుకు చెల్లించలేని మొత్తం రూ.కోట్లలో ఉంది. దీనిపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమై వసూలు, రెన్యువల్ చేస్తూ వేల కోట్ల నుంచి వందల కోట్లకు బకాయిలు తగ్గించారు. అయినా వసూలు, రెన్యువల్‌కు సహకరించని రుణాలే ఇప్పుడు సహకార రంగాన్ని నిద్ర పోనివ్వకుండా చేస్తున్నాయి. ప్రభుత్వమైనా ఆదుకోవాలి లేదంటే ఆప్కాబ్ కూటమి ఏకాల రుణ పరిష్కార (ఓటీఎస్) పథకం కింద మొత్తమైన లబ్ధితో బకాయిలు తగ్గించాలని.. దీనిపై ఆప్కాబ్ చేసిన సూచన మేరకు డీసీసీబీ బాధ్యులు పరిస్థితిని నివేదించారు.

ఇదీ పరిస్థితి

★ జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, దాని పరిధిలో 24 శాఖలు వాటి కింద ఉమ్మడి కడప జిల్లాలో 77 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలున్నాయి. ఆప్కాబ్ డీసీసీబీ సహకార సంఘాలకు సంఘాలు రైతులకు రుణాలు ఇస్తున్నాయి. అప్పు ఇచ్చిన సకాలంలో వసూలు చేసి తిరిగి తీసుకున్న రీతిన పైస్థాయికి అప్పు జమ చేయడం రివాజు.

★ డీసీసీబీ నుంచి తీసుకున్న అప్పులు సంఘాలు సక్రమంగా చెల్లించలేకున్నాయి. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును నిబంధనల ప్రకారం జమ చేయక అప్పులుగా మారి ఇప్పుడు భారంగా తయారైంది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక 2015 నుంచి చెల్లించకుండా నిలబడిపోయిన అప్పుల సమస్యను పరిష్కరించాలని ఆప్కాబ్‌కు సూచించినట్లు తెలిసింది. ఈ కాలానికి అంటే 2015కు ముందు రుణం తీసుకుని అసలు కంటే వడ్డీ ఎక్కువ లేదా దానికి సమానమైన మొత్తం వివరాలను సేకరించి పంపాలని ఆప్కాబ్ ఆదేశంతో డీసీసీబీ కూడా నివేదిక పంపింది.

అపరాధ రుసుమే భారం

ఒక రైతు రుణం తీసుకుంటే దానికి 12 నెలల కాలానికి 7 శాతం వడ్డీ పడుతుంది. ఆ గడువు దాటితే అసలు, వడ్డీపై మళ్లీ వడ్డీ పడుతుంది. దానికి గడువు ఉంటుంది. అప్పటికీ చెల్లించకపోతే దానిపైన ఇంట్రెస్ట్ ఆన్ ఓడీ (వాయిదా మీరిన అప్పుపై మళ్లీ వడ్డీ వేయడం) ఇలా వడ్డీలకు వడ్డీలు పడుతూ ఉంటాయి. ఈ గడువు దాటితే ఎన్పీఏ కిందికి వెళ్లి పడుతుంది. ఆ పరిస్థితి నుంచి దాటి బ్యాంకులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ఓటీఎస్ ఒక్కటే మార్గమని అన్ని జిల్లాల డీసీసీబీ పాలకవర్గం ఆప్కాబ్‌కు కోరుతోంది.

ఓటీఎస్ పరిష్కారమా?

ఇలాంటి పరిస్థితుల్లో వాణిజ్య బ్యాంకులైతే తమకు వచ్చే లాభాల్లో కొంత నిధులు దామాషాగా వచ్చి ఇలా పేరుకుపోయిన అప్పుల రికవరీకి ఏక కాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) కింద రుణం వసూలు చేసుకుంటారు. వాడుక భాషలో అయితే దీన్ని వన్ టైం సెటిల్‌మెంటు విధానం అంటుంటారు. వాస్తవానికి సహకార రంగంలో ఈ పద్ధతి లేదు. అలా కావాలంటే ఆప్కాబ్ అనుమతించాల్సి ఉంటుంది. అందులో ఆప్కాబ్, డీసీసీబీ, సహకార సంఘం ఏ ఎంత శాతం భరించాలనేది ఆప్కాబ్ పాలక వర్గం తీర్మానించి పంపాల్సి ఉంటుంది. అదిలా ఉంటే ఒక వేళ ఓటీఎస్ వచ్చినా భరించే పరిస్థితిలో సహకార సంఘాలు లేవు.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..

యాదవ అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు యాదవ అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' యాదవ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, జనవరి 17న), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 9154366099 & 9154772006 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు

● వధూవరుల బయోడేటా & ఫొటోలను పక్కన ఇచ్చిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చూసుకోవచ్చు.

తితిదే ఆలయాల ప్రత్యేకాధికారి నియామకం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: జిల్లాలోని తితిదే విలీన ఆలయాల ప్రత్యేకాధికారిగా ఆడిట్ విభాగం సంయుక్త సంచాలకులు (జాయింట్ డైరెక్టర్‌)గా పనిచేస్తున్న డి.రామచంద్రారెడ్డిని నియమిస్తూ సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం, దేవునికడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, జమ్మలమడుగు నారాపుర వెంకటేశ్వరస్వామి, తాళ్లపాక చెన్నకేశవ, సిద్ధేశ్వర క్షేత్రాలు, నందలూరు సౌమ్యనాథస్వామి, బోయనపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయాలు తితిదే పరిపాలన పరిధిలో ఉన్నాయి. ఇక్కడ ఆయన చేస్తున్న ఆర్జిత సేవలు, భక్తులకు కల్పించాల్సిన వసతులు, అభివృద్ధి పనులను ప్రత్యేకాధికారి నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

రామచంద్రారెడ్డి

కోదండరాముడి పార్వేట గ్రామోత్సవం

ప్రత్యేక అలంకారంలో కోదండ రాముడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కనుమ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రామయ్య క్షేత్రం నుంచి నాగేట్ల దిబ్బపైన ఉన్న పార్వేట మండపానికి వేడుకగా ఊరేగింపు తీసుకెళ్లారు. రామయ్య దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పుర వీధుల్లో రాములోరి గ్రామోత్సవం వైభవంగా సాగింది. తితిదే ప్రత్యేకాధికారి డి.రామచంద్రారెడ్డి, ఏఈ కె.ఈశ్వర్‌రెడ్డి, ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అశ్వవాహనంపై లక్ష్మీనరసింహ స్వామి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధి చిన్నదాసరపల్లె సమీపంలో వేయి నూతుల కోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వేద పండితులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అశ్వవాహనంపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామిని వేయినూతుల కోన నుంచి చిన్నదాసరపల్లెకు తీసుకొచ్చి ఊరేగింపు నిర్వహించారు.

వేయినూతులకోనలో అశ్వవాహనంపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహుడు

ఊరేగిన వృషభాచలేశ్వరుడు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలో వృషభాచలేశ్వరస్వామి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇక్కడి మెయిన్ బజారులోని ఆలయంలో అర్చకుల హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించిన ట్రాక్టర్ తొట్టిలో ఉంచి వీధుల్లో ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు బొప్పాయి విడిది, గాండ్లవీధి, కటపాఠశాలు, కమ్మవీధి, పాతపేట మీదుగా ఆలయం వరకు సాగింది. ఆలయ కమిటీ ఛైర్మన్, ఈవో సుబ్రహ్మణ్యం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న వృషభాచలేశ్వరుడు

కొలువుదీరిన వీరాంజనేయస్వామి

ఒంటె వాహనంపై అంజన్న

చక్రాయపేట, న్యూస్‌టుడే: గండి క్షేత్రంలో గురువారం రాత్రి ఒంటె వాహనంపై అంజన్న గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరిస్వామి, రాజారమేష్ స్వాములు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణం నుంచి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రైవేట్ బస్సు వాహనాలపై ఆర్టీఏ అధికారులు జిల్లావ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 15 వరకు ముమ్మరంగా దాడులు చేశారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, రాజంపేట, పులివెందుల పరిధిలో తనిఖీలు ఎక్కువగా సాగించారు. మొత్తం 23 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ. 1,54,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సందర్భంగా ఎవరైనా అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చాలని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు.

● **ఇవీ గుర్తించిన లోపాలు:** ★ టికెట్‌కు అధికంగా వసూలు. ★ సీట్ బెల్ట్ లేకుండా, రిఫ్లెక్టింగ్ స్టిక్కర్ లేకపోవడం. ★ పరిమితికి మించి సామగ్రి రవాణా చేయడం. ★ సిబ్బంది యూనిఫారం ధరించకపోవడం. ★ ప్రయాణికుల జాబితా లేకపోవడం. ★ పన్ను చెల్లించకుండా, ఎఫ్‌సీ లేకుండా, నిర్వహణ సరిగా లేకుండా నడపడం.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుపత్రాలను పరిశీలిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వీధుల్లో తిరుగుతూ చీపుర్లు విక్రయిస్తాడు. ఆ సమయంలో ఏ ఇంటికైనా తాళం వేసి ఉంటే దాన్ని పగులగొట్టి నగలు, నగదు దోచుకెళ్లే దొంగను చీరాల పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మహ్మద్ మొయిన్ వెల్లడించారు. చోరీ కేసులో విచారణ చేస్తుండగా స్థానిక రైల్వే స్టేషను సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నెల్లూరు జిల్లా గూడూరు పట్టణం గాంధీనగర్‌కి చెందిన రామనాథం కిరణ్‌ని అదుపులోకి తీసుకున్నారు. పలు చోరీలతో పాటు గత ఏడాది నవంబరు 11న సిద్దవటం మండలం నలందా నగర్‌లోనూ ఇదే తరహాలో చోరీ చేసినట్లు గుర్తించారు. వివిధ పోలీసు స్టేషన్లలో ఇతనిపై 65 కేసుల వరకు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇతని నుంచి 156 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067

JOBS

Wanted Male Warden's at Bangalore City Speaking Skills English and Hindi, Attractive Salary to be paid. Cont: 9666567679, 9704209798.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పులివెందులలో ఆకట్టుకున్న సంగీత విభావరి

నృత్యం చేస్తున్న కళాకారులు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల అనగానే సినిమాలలో ఫ్యాక్షన్ నేపథ్యం చూపించే వారని.. క్షేత్ర స్థాయిలో అలా ఏమీ ఉండదని పులివెందుల ప్రజలు ఎంతో సౌమ్యులని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని శ్రీకృష్ణ ఆలయం సమీపంలో ఉన్న క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. పులివెందుల వాసులకు కోనసీమ తరహాలో వినోదాన్ని పంచుతున్నామన్నారు. సినీ గాయకులు దీపు, రితిక, జానులిరిలు పాటలు పాడి శ్రోతలను ఉర్రూతలూగించారు.

భారీగా హాజరైన ప్రజలు

సంస్కృతి, సంప్రదాయాలకు పండగలు ప్రతీకలు

వేంపల్లె, న్యూస్‌టుడే: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా వేంపల్లెలో ఆయన పార్టీ నేతలతో కలిసి గురువారం గాలిపటాలు ఎగురవేశారు. సంక్రాంతి పల్లెల పండుగ, రైతులు, అల్లుళ్ల పండుగ అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగుర వేస్తున్న మాజీ ఎంపీ తులసిరెడ్డి తదితరులు

బరులు ఎరుపెక్కాయ్!

● కత్తులు దూసిన కోళ్లు
● కట్టలు తెగిన రూ.కోట్లు

వేంపల్లెలో కోళ్లను బరిలోకి వదిలేందుకు సిద్ధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, తదితరులు

లింగాల, న్యూస్‌టుడే: పులివెందుల నియోజకవర్గంలో బరులు ఎరుపెక్కాయి. కోడి పందేలు ఆడొద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా చివరికి పందెంరాయుళ్లదే పైచేయి అయింది. భోగి, కనుమ సందర్భంగా సిద్ధారెడ్డిపల్లె, దేవరగుట్టపల్లె, రామిరెడ్డిపల్లె, దొండ్లవాగు, పార్నపల్లె, మురారిచింతల, నల్లపురెడ్డిపల్లె, వెంకటాపురం, అలవలపాడు, వేంపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో పందెం కోళ్లు కత్తులు దూశాయి. రూ. లక్షకు రూ.10 వేలు నిర్వాహకులు వసూలు చేయడంతో పలుచోట్ల వాదోపవాదాలు జరిగాయి. ఒక్కొక్క బరిలో రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షలకు పైగా పందెం కాశారు. దొండ్లవాగులో పందేలు తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎక్కువ పందేలు నెగ్గిన వారికి సొమ్ముతో పాటు బుల్లెట్ బైక్ బహూకరించారు.



కోళ్లకు కట్టే కత్తులు ఇవే

వేంపల్లె, పులివెందుల: గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో పోటాపోటీగా కోడి పందేలు నిర్వహించారు. ఈ పందేలలో పందెంరాయుళ్లు లక్షలు పందెం కాశారు. హోరాహోరీగా సాగిన పోటీలు అందరిలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. మండలంలోని రామిరెడ్డిపల్లెలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ బోరెడ్డి జగన్నాథరెడ్డి, అలవలపాడులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బాలస్వామిరెడ్డి, వేంపల్లెలో దిల్‌మాంగే చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోడి పందేలు నిర్వహించారు. వేంపల్లెలో నిర్వహించిన కోడి పందేలకు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్‌రవి హాజరై కోడి పందేలను పరిశీలించారు.

కోడి పందేలను తిలకిస్తున్న ప్రజలు

పందెం పోరులో మృతి చెందిన కోళ్లు

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌ల మధ్యలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 50-55) మృతి చెందినట్లు శుక్రవారం జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. సాయంత్రం ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌ల మధ్య గూడ్స్ రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

అల్లూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం ఎస్.కొత్తపల్లె- అల్లూరు గ్రామాల మధ్యలో కుందూ నదిలో గురువారం ఓ వృద్ధురాలి మృతదేహం గుర్తించినట్లు ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మృతురాలు దువ్వూరు మండలం పెద్దజోలాపురానికి చెందిన శూలం వీరయ్య భార్య లక్ష్మీదేవి(75)గా గుర్తించామన్నారు.

గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుదాఘాతం

● సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన వైద్య విద్యార్థి

వేంపల్లె, న్యూస్‌టుడే: గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఓ వైద్య విద్యార్థి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటన వేంపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. అచేతనంగా పడి ఉన్న అతనికి సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి తప్పేలా చేసిన వైద్య విద్యార్థిని స్థానికులు అభినందించారు. తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మణికంఠ తన కుటుంబ సభ్యులతో స్థానిక సాయినగర్‌లోని బంధువుల ఇంటికి సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చారు. ఈ నేపథ్యంలో అదే ఇంటి మిద్దెపై గాలిపటం ఎగురవేసే క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్తు తీగపై పడి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైద్య విద్యార్థి సోహెబ్ మణికంఠను పరీక్షించి అరగంట పాటు సీపీఆర్ చేశాడు. అనంతరం అతను స్పృహలోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్యాస్ సిలిండర్ మంటల్లో కౌన్సిలర్‌కు తీవ్ర గాయాలు

మైదుకూరు, న్యూస్‌టుడే : వాయుబండ లీకేజీతో జరిగిన ప్రమాదంతో మైదుకూరు పురపాలక కౌన్సిలర్ మామిళ్ల వెంకటసుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డారు. వంట గదిలోకి వెళ్లిన వెంకటసుబ్బయ్య దోమల నివారణ అగరబత్తి వెలిగించే ప్రయత్నంలో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు గుర్తించి ఆయనను బయటకు తెచ్చేలోపే తీవ్రంగా గాయపడ్డారు. కడప సర్వజన ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల క్రిష్టియన్ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయమై పులివెందుల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సురేష్ అనే వ్యక్తి మరో ముగ్గురితో కలిసి అదే కాలనీకి చెందిన లక్కీ అనే వ్యక్తితో వ్యక్తిగతంగా ఘర్షణ పడి ఇనుప కడ్డీతో కొట్టడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాధన చేస్తాం.. లక్ష్యం సాధిస్తాం

ఆలిండియా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థినులు బాల్ బ్యాడ్మింటన్ క్రీడా రంగంలో దూసుకెళుతున్నారు. స్పోర్ట్స్ డైరెక్టరు నరసింహారెడ్డి నేతృత్వంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు పి.తులసి, భువన చంద్రిక, అంజుమ్, ఐశ్వర్య, తేజశ్విణి, మునెమ్మ ఫిబ్రవరి నెలలో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు యోవేవి జట్టు తరపున తలపడనున్నారు. పట్టుదల, ఏకాగ్రతతో ఆలిండియాలో మెరవాలన్నదే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. ఇదివరకు వారు సాధించిన ప్రతిభ, విజయాలు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ఆటలంటే ఇష్టం..

నా పేరు పి.తులసి. ఆర్సీపీఈలో డీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. మాది మదనపల్లె జిల్లా బుచ్చిరెడ్డిగారిపల్లె. అమ్మానాన్న గౌరమ్మ, రామయ్య (రైతు). పాఠశాల స్థాయి నుంచి ఆటలంటే ఇష్టం. హ్యాండ్‌బాల్, కబడ్డీ క్రీడా పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాను. యోవేవి తరపున ఫిబ్రవరి నెలలో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాను. ఉత్తమ ప్రతిభ కనబరచేందుకు సాధన చేస్తున్నా. దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని, డీఎస్సీ పరీక్షల్లో పీఈటీ ఉద్యోగమే నా లక్ష్యం.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఆర్సీపీఈ విద్యార్థినులు

జాతీయ స్థాయిలో రాణించాలని ధ్యేయం

నా పేరు బి.భువనచంద్రిక. ఆర్సీపీఈలో బీపీఈడీ రెండో ఏడాది చదువుతున్నా. మాది కమలాపురం మండలం అగస్తలింగాయపల్లె. అమ్మ లక్ష్మీదేవి కష్టంతోనే చదువుకుంటున్నా. 8వ తరగతిలో జోనల్ స్థాయిలో ఆడాను. గతేడాది అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం ఆలిండియా విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యాను. జట్టును ముందుకు నడిపించేందుకు సాధన చేస్తున్నా. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని, ప్రభుత్వ పీఈటీ ఉద్యోగం సాధించి విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నదే నా ధ్యేయం.

(c) eenadu

అమ్మో.. చిరుత!

గ్రామాల్లోకి వస్తున్న వన్యప్రాణులు ● భయాందోళనలో ప్రజలు

సిద్దవటం, న్యూస్‌టుడే : లంకమల అభయారణ్యం నుంచి వన్యప్రాణులు సిద్దవటం మండల పరిధిలోని గ్రామాల్లోకి వస్తున్నాయి. వేసవి కాలంలో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాలకు అవి తరచూ వచ్చేవి. శీతా కాలంలోనూ వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల మూలపల్లెలో చిరుత సంచారంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వన్యప్రాణులు ఆహార కొరతతో వస్తున్నాయా లేదా వాటి సంఖ్య పెరగడంతో ఆవాసాలు ఎంచుకునేందుకు వస్తున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది.

● కడప రేంజి పరిధిలోని సిద్దవటం మండలం మూలపల్లెలోని ప్రధాన రహదారి మీదుగా మూడు నెలల కిందట చిరుత తన రెండు పిల్లలతో రాత్రి వేళ సంచరించింది. ఇటీవల మళ్లీ ఓ చిరుత సాయంత్రం వేళ మూలపల్లెలోని ఎస్సీ కాలనీ సమీపంలో కనిపించింది.

● ప్రతి ఏటా వేసవికాలం వచ్చిందంటే జంగాల పల్లె-వెలుగుపల్లె గ్రామాల మధ్యలో ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపైకి రాత్రి వేళ పలుమార్లు చిరుత వస్తోందని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ ఈ దారి మీదుగా వెళ్లాలంటే భయాందోళనగా ఉందని వెలుగుపల్లె గ్రామస్థులు వాపోతున్నారు.

● కొన్ని నెలల కిందట సిద్దవటం ఎగువపేటలోని పాఠశాల సమీపంలో ఉన్న నివాస గృహాల వద్దకు సాయంత్రం వేళ ఓ క్రూరమృగం వచ్చింది. ఏడాది కిందట ఎలుగుబంటి సిద్దవటం గ్రామ శివారుకు వచ్చింది. అలాగే జగనన్న కాలనీ సమీపంలో ఉన్న పొలాల వద్దకు మరో ఎలుగుబంటి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఇలా వన్యప్రాణులు అన్ని కాలాల్లోనూ సిద్దవటం గ్రామ సమీప ప్రాంతాల్లోకి వస్తుండడంపై భయాందోళన చెందుతున్నామని, నివారణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు అటవీ అధికారులను కోరుతున్నారు.

మూలపల్లెలో చిరుత కోసం గాలిస్తున్న అటవీ సిబ్బంది

కెమెరాలు ఏర్పాటు చేయిస్తాం

మూలపల్లె గ్రామంలో ప్రధాన రహదారి మీదుగా గతంలో చిరుతలు సంచరిస్తున్నట్లు తమ దృష్టికి రాగా గాలింపు చర్యలు చేపట్టాం. ఇటీవల మరో మారు మూలపల్లె గ్రామం వద్దకు రావడంపై ఆరా తీస్తున్నాం. ఇక్కడి అనుమానాస్పద ప్రదేశాల్లో త్వరలో కెమెరాలు అమర్చి వాటిని గుర్తిస్తాం. రాత్రివేళ ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తే వాటికి హాని కల్గించకుండా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- ప్రసాద్, కడప రేంజి అటవీశాఖ అధికారి

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

ఒంటిమిట్ట రామాలయంలో ప్రత్యేక పూజలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు ఎల్.వి. గంగాధరశాస్త్రి, అర్చన దంపతులు గురువారం సందర్శించారు. రాములోరి సన్నిధికి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులను దర్శించారు. ఆలయ చారిత్రక వైభవాన్ని అర్చకులు వివరించారు. అనంతరం వారిని సత్కరించారు.

పూజలు చేస్తున్న భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధరశాస్త్రి దంపతులు

కాశినాయన: గోయిపాయిపల్లెలో చౌడేశ్వరీ అమ్మవారు

తాళ్లపాకలో చెన్నకేశవస్వామి

సుండుపల్లి: ఎగువ ఈడిగపల్లెలో చిట్లాకుప్ప వద్ద ప్రజలు

సిద్దవటం: భాకరాపేటలో శ్రీరాముని ఊరేగింపు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరం

బి.కోడూరులో ఎద్ల బండిపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

సంక్రాంతి సంబరం అంబరాన్నంటింది. ఈ సందర్భంగా రాజంపేట, బద్వేలు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో కోడి పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చిట్లాకుప్ప వద్ద నిప్పు పెట్టి పశువుల పండగ జరిపారు. పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. **- న్యూస్‌టుడే, రాజంపేట క్లస్టర్ బృందం**

కొండమాచుపల్లిలో గొబ్బెమ్మను సాగనంపుతున్న భక్తులు

బద్వేలులో కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కలసపాడు: పార్వేట వేడుకల్లో భక్తులు

అట్లూరు: పార్వేటలో మహిళలు

మహిళలకు చీరల పంపిణీ

రాజంపేట గ్రామీణ న్యూస్‌టుడే: మండల పరిధిలోని పోలి గ్రామంలో కూటమి నేతలు నాలుగు వేల మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు పోలి సుబ్బారెడ్డి, యల్లటూరి శ్రీనివాసరాజు, నరసయ్య, సుధాకర్, పోలి కమలాకర్ పాల్గొన్నారు. మేకవారిపల్లి గ్రామంలో మహిళలకు శుక్రవారం మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.

సిద్దవటం : సిద్దవటం ఎగువపేటలోని చెంచులక్ష్మీ యానాది కాలనీ, ఎస్సీ కాలనీ, బందారుపల్లె ఎస్సీ కాలనీల్లోని పేదలకు శుక్రవారం జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఒక కోడి, రూ.200 నగదును అందజేశారు. వెంకటాయపల్లెలో వాలీబాల్ పోటీల విజేతకు మొదటి బహుమతిగా రూ.15 వేల నగదు అందజేశారు.

కలసపాడు : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆరుమందికి డీసీసీబీ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి రూ.35 వేల ఆర్థికసాయం అందించారు. తెదేపా నాయకులు పి.బాలిరెడ్డి, దుగ్గిరెడ్డి, జిలానీ, ప్రహ్లాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేకలవారిపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న రాజంపేట మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్యనాయుడు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తాం

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం చెన్నయ్యగారి పల్లెలో పలువురు నాయకులు ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆడపూరు, అరవ పల్లి, నందలూరు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని ఎంపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు మేడా మధు, కలీం, శ్రీధర్, ఆజీజ్, పల్లె మాధవి తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మట్లిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న తెదేపా రాజంపేట ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

చెముడూరులో వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెదేపా బద్వేలు ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షుడికి సత్కారం

బద్వేలు (గ్రామీణ), న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు కమతం పూతి రామచంద్ర వరప్రసాద్ దంపతులను శుక్రవారం కనుమ పండుగ సందర్భంగా బద్వేలు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు మాలేపాటి సునీల్‌కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ర వరప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ అందరికీ సుఖ సంతోషాలను కలిగించాలని, అందరు కలిసిమెలిసి ఉండాలని కోరారు.

ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్ర వరప్రసాద్‌ను సన్మానిస్తున్న మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు సునీల్‌కుమార్

ఆసక్తిగా ఎడ్ల బండ లాగుడు ప్రదర్శనలు

వీరబల్లి, సుండుపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి పురస్కరించుకుని వీరబల్లి మండలంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో తెదేపా రాజంపేట ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. అలాగే మట్లి గ్రామంలో కోడిపందేలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరయ్యారు.

బద్వేలు గ్రామీణ: మండలంలోని లక్ష్మీపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెముడూరులో జరిగిన వేడుకల్లో తెదేపా బద్వేలు ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి దంపతులు పాల్గొని సందడి చేశారు.

కలసపాడు : మండలకేంద్రంలోని అంకాలమ్మ ఆలయం వద్ద ఎడ్ల బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. దీనిని డీసీసీబీ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం విజేతలకు నగదు అందజేశారు.

రాజంపేట గ్రామీణ : ఆకేపాడు గ్రామంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

వీరబల్లి : సంక్రాంతి సంబరాలకు స్వగ్రామమైన గడికోట యడబల్లె వచ్చిన యాంకర్ లాస్యకు శుక్రవారం వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రరెడ్డి సన్మానించారు. సంక్రాంతి సంబరాలకు ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి బంధువులు, మిత్రులతో సరదాగా గడిపారు.

కలసపాడు: బండలాగుడు ప్రదర్శన ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి

ఆకేపాడులో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

క్రికెట్ విజేత మంటపంపల్లె జట్టు

మంటపంపల్లె(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని మంటపంపల్లెలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆతిథ్యం ఇచ్చిన జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో శుక్రవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. మంటపంపల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 110 పరుగులు చేసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన పత్రపల్లి జట్టు 70 పరుగులకే ఆలౌట్ అయింది. గెలుపొందిన మంటపంపల్లె జట్టుకు జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి ప్రథమ బహుమతి రూ.30 వేలు, కప్‌ను అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన పత్రపల్లి క్రీడాకారులకు సాలాబాదుకు చెందిన తెదేపా నాయకుడు బుజ్జి రూ.20 వేలు ఇచ్చారు. కార్యక్రమంలలో ఎంపీటీసీ సభ్యుడు సుంకేసుల బాషా, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, తుమ్మలకుంట్ల ఈశ్వరయ్య, బొడ్డే వెంకటరమణ, మామిళ్ల శ్రీహరి పాల్గొన్నారు.

విజేతలకు కప్పు ప్రదానం చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, తెదేపా నాయకులు

ఇంకెన్నాళ్లు గుంతలతో అవస్థలు

కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న గుంతలు వాహన చోదకులను భయపెడుతున్నాయి. గతేడాది అక్టోబరు, నవంబరులో కురిసిన భారీ వర్షాలకు గోతులు పడ్డాయి. సకాలంలో మరమ్మతులు చేయలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంకెన్నాళ్లీ గుంతల అవస్థలు అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కనీసం గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

నిరుపయోగంగా డిజిటల్ బోర్డు

టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి గత ప్రభుత్వం రాత్రి, పగలు కనిపించేలా డిజిటల్‌బోర్డు ఏర్పాటు చేసింది. ఇటీవల గాలి వచ్చి పడిపోవడంతో రేకులు ఊడిపోయాయి. బోర్డు ప్రమాదకరంగా ఉండటంతో అక్కడి నుంచి తీసి రోగులు కూర్చునే అరుగుపై పెట్టారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి కనీసం బోర్డును ఏర్పాటు చేయడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పోరుమామిళ్ల**

బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

సంక్రాంతి పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులు కొన్ని రద్దు కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్సుల మధ్య విరామ సమయం ఉండటంతో చాలా సేపు వారు నిరీక్షించాల్సి వచ్చింది. సుండుపల్లి బస్సు షెల్టర్ వద్ద శుక్రవారం సాయంత్రం రాయచోటి, పీలేరు మార్గంలో వెళ్లేందుకు ప్రయాణికులు ఇలా ఎదురు చూస్తున్నారు. **- న్యూస్‌టుడే, సుండుపల్లి**

దారిపై కంకర.. ప్రయాణం సాగక

చిన్నయరసాల బస్టాండ్ నుంచి టేకూరుపేటకు వెళ్లే మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. రహదారి విస్తరణ పనులు చేస్తున్న గుత్తేదారులు ఈ గుంతలు ఉన్న ప్రాంతంలో కంకర పోశారు. నెలలు గడుస్తున్నా తారు రహదారి నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఈ ప్రాంతంలో వెళ్లే వాహన చోదకులు ఈ కంకరతో ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలను పూడ్చివేసి రహదారి బాగు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.**- న్యూస్‌టుడే, పోరుమామిళ్ల**

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలో గురప్పగారిపల్లి, మట్లి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ పత్రాలను తెదేపా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు శుక్రవారం అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎం.భానుగోపాల్‌రాజు, సర్పంచి నాగార్జునాచారి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమరేశ్వర్‌రాజు, నాయకులు వై. సురేంద్రారెడ్డి, భూషయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట గ్రామీణ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు రవికుమార్ నాయుడు, నాయకులు బాపనయ్య నాయుడు, నాగేశ్వర నాయుడు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతాయ్.. పట్టించుకోండి

దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం

కలసపాడు, న్యూస్‌టుడే : విద్యుత్తు స్తంభాలు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారాయి. ఈ పరిస్థితి కలసపాడు మండల కేంద్రంలో నెలకొంది. స్థానిక గిద్దలూరు ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభం దెబ్బతింది. ఏడాది కిందట స్తంభం దెబ్బతిని ఏ సమయంలోనైనా కూలే స్థితిలో ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కాలం చెల్లిన ఎల్‌టీ విద్యుత్తు తీగల రాపిడితో నిప్పు రవ్వలు పడుతున్నాయి. అతుకులతో పలుమార్లు తెగిపడిన సందర్భాలున్నాయి. వీటితో ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని, పలుమార్లు విద్యుత్తు అధికారులు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. విరిగిన స్తంభం ఎక్కేందుకు విద్యుత్తు సిబ్బంది భయపడుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ట్రాన్స్‌కో ఏఈ మహేష్‌ను వివరణ కోరగా త్వరలో కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయడంతో పాటు కాలంచెల్లిన తీగలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయిస్తామన్నారు.

అడుగుభాగంలో దెబ్బతిన్న విద్యుత్తు స్తంభం

అతుకులతో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు : కలసపాడులోని గిద్దలూరు ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభం ఏడాది క్రితం పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ ఉన్న కాలం చెల్లిన ఎల్‌టీ విద్యుత్తు తీగలు అతుకులతో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. స్తంభం ఎక్కేందుకు సిబ్బంది భయపడుతున్నారు. సమస్యను ఏడాది నుంచి విద్యుత్తు అధికారులు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదు. **- కృష్ణారెడ్డి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, కలసపాడు**

వసతులు శూన్యం.. ప్రజలకు కష్టం

మహబూబ్‌నగర్‌లో దెబ్బతిన్న సీసీ రహదారి

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలకలో రహదారులు, మురుగుకాలువ వ్యవస్థ దారుణంగా తయారైంది. గతంలో వేసిన రహదారులు, కాలువలు శిథిలావస్థకు చేరాయి. మరి కొన్ని ప్రాంతాల్లో రహదారులు లేని వీధులు దర్శనమిస్తున్నాయి. పురపాలకలో 35 వార్డులున్నాయి. లక్షకు పైగా జనాభా ఉంది. పట్టణం శరవేగంగా విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లు వసతులు లేవు. ● పురజనుల నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు కల్పించడంతో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో వీధి రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఆటోలు కూడా రావడం లేదు. అత్యవసరమైతే ఆటో డ్రైవర్లు ముఖం చాటేస్తున్నారు. పట్టణంలోని మహబూబ్ నగర్, రామాంజనేయ నగర్, భావనారాయణ నగర్ ప్రాంతాల్లో రహదారుల పూర్తిగా దెబ్బతిన్నాయి. మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేక లోతట్టు ప్రాంతాల్లోని పలు వీధులు చిన్నపాటి వర్షానికి ముంపునకు గురవుతున్నాయి. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ● ఆర్టీసీ బస్టాండు వెనుక వీధి, ఆంజనేయ నగర్, సిద్ధవటం రోడ్డులోని సీఎస్‌ఐ చర్చి, జ్యోతిరావు పులే కూడలి, అటవీ కార్యాలయం, మహమ్మద్ కాలనీ, మైదుకూరు రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ సర్కిల్, పోరుమామిళ్ల రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల, కోట వీధి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లోకి వర్షాకాలంలో మురుగు, వాన నీరు చేరుతుండటంతో ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సీసీ రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థను బాగుకు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

శివానగర్‌లో అధ్వానంగా మురుగు కాలువ

ప్రతిపాదనలు పంపాం : సీసీ రహదారులు, డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు రూ.302 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. అనుమతులు మంజూరు చేసి నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం. పట్టణంలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- నరసింహారెడ్డి, కమిషనర్, బద్వేలు పురపాలక సంఘం

రాజంపేట కౌన్సిలర్ మృతి


సుబ్రహ్మణ్యం (పాత చిత్రం)

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట పురపాలక సంఘం కౌన్సిలర్ తంబా సుబ్రహ్మణ్యం(62) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన పురపాలక ఆరో వార్డు నుంచి వైకాపా తరపున గెలుపొందారు. కౌన్సిలర్ మృతిపై ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యోగేశ్వర్‌రెడ్డి, నాయకులు సంతాపం తెలియజేశారు.

శ్మశానవాటిక దారికి స్థల వితరణ

సిద్దవటం, న్యూస్‌టుడే : టక్కోలు బీసీ కాలనీ ప్రజల సౌకర్యార్థం శ్మశానవాటిక దారి కోసం స్థలం కొనుగోలు చేసినట్లు తెదేపా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా శ్మశానానికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడేవారని, రైతు నుంచి రూ.10 వేలకు కొనుగోలు చేసి ఆ స్థల కొనుగోలు పత్రాన్ని గ్రామస్థులకు అందజేసినట్లు వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

వృద్ధురాలి మృతదేహం లభ్యం

అల్లూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం ఎస్.కొత్తపల్లె- అల్లూరు గ్రామాల మధ్యలో కుందూ నదిలో గురువారం ఓ వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మృతురాలు దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన కూలం వీరయ్య భార్య లక్ష్మీదేవి(75)గా గుర్తించామన్నారు. మృతికి కారణాలు తెలియరాలేదన్నారు. శుక్రవారం ఆమె కుమారుడు పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 50-55) మృతి చెందినట్లు శుక్రవారం జీఆర్పీ ఎస్సై బాష్యారెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. సాయంత్రం ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ల మధ్య గూడ్స్ రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీకి సంబంధించి ఆధారాలు ఏవీ లభించలేదన్నారు.

జమ్మలమడుగు శివారులో తప్పిన ప్రమాదం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే దారిలో ప్రమాదం తప్పింది. ఈ నెల 15వ తేదీ ప్రొద్దుటూరు రోడ్డులోని పెట్రోలు బంక్ వద్ద స్క్రాప్ లోడ్ లారీ నుంచి మంటలు చెలరేగాయి. వాటిని స్థానికులు గమనించి మంటలను ఆర్పారు, అక్కడే ఉన్న ఇసుక, నీళ్లను చల్లి మంటలను ఆర్పి ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడ్డారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

లారీలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న స్థానికులు

డీసీసీబీలో దారుణాలు

- మొండికేసిన బకాయిలు
- నిలిచిన కోట్ల రూపాయలు
- ఓటీఎస్ అవకాశం కల్పించాలని ఆప్కాబ్‌కు నివేదన

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా వసూలు కాని అప్పు సహకార రంగాన్ని పట్టి కుదిపేస్తోంది. కొన్నేళ్ల కిందట పలు రకాల రుణాలు తీసుకుని బ్యాంకుకు చెల్లించలేని మొత్తం రూ.కోట్లలో ఉంది. దీనిపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమై వసూలు, రెన్యూవల్ చేస్తూ వేల కోట్ల నుంచి వందల కోట్లకు బకాయిలు తగ్గించారు. అయినా వసూలు, రెన్యూవల్‌కు సహకరించని రుణాలు ఇప్పుడు సహకార రంగాన్ని నిద్ర పోనివ్వకుండా చేస్తున్నాయి. ప్రభుత్వమైనా ఆదుకోవాలి లేదంటే ఆప్కాబ్ కరుణతో ఏకకాల రుణ పరిష్కార (ఓటీఎస్) పథకం కింద మోక్షమైనా లభించాలి. లేదంటే ఇబ్బందులు తప్పవు. దీనిపై ఆప్కాబ్ చేసిన సూచన మేరకు డీసీసీబీ బకాయి పరిస్థితిని నివేదించారు.

ఇదీ పరిస్థితి

★ జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, దాని పరిధిలో 24 శాఖలు వాటి కింద ఉమ్మడి కడప జిల్లాలో 77 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలున్నాయి. ఆప్కాబ్ డీసీసీబీ సహకార సంఘానికి సంఘాలు రైతులకు రుణాలు ఇస్తున్నాయి. అప్పు ఇవ్వడం సకాలంలో వసూలు చేసి తిరిగి తీసుకున్న చోటికే పెట్టుబడికి అప్పు జమ చేయడం రివాజు.

★ డీసీసీబీ నుంచి తీసుకున్న అప్పులు సంఘాలు సక్రమంగా చెల్లించలేకున్నాయి. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును నిబంధనల ప్రకారం ఇవ్వలేక అప్పులు తప్పుతప్పులుగా మారి ఇప్పుడు భారంగా తయారైంది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక 2015 నుంచి చెల్లించకుండా నిలబడిపోయిన అప్పుల సమస్యను పరిష్కరించాలని ఆప్కాబ్‌కు సూచించినట్లు తెలిసింది. ఈ కాలానికి అంటే 2015కు ముందు రుణం తీసుకుని అసలు కంటే వడ్డీ ఎక్కువ లేదా దానికి సమానమైన మొత్తాల వివరాలను సేకరించి పంపాలని ఆప్కాబ్ ఆదేశంతో డీసీసీబీ కూడా నివేదిక పంపింది.

అపరాధ రుసుమే భారం

ఒక రైతు రుణం తీసుకుంటే దానికి 12 నెలల కాలానికి 7 శాతం వడ్డీ పడుతుంది. ఆ గడువు దాటితే అసలు, వడ్డీపై మళ్లీ వడ్డీ పడుతుంది. దానికీ గడువు ఉంటుంది. అప్పటికీ చెల్లించకపోతే దాన్ని ఇంట్రెస్ట్ ఆన్ ఓడీ (వాయిదా మీరిన అప్పుపై మళ్లీ వడ్డీ వేయడం) అలా వడ్డీలకు వడ్డీలు పడుతూ ఉంటాయి. ఈ గడువు దాటితే ఎన్పీఏ కిందికి వెళ్లి పడుతుంది. ఆ పరిస్థితి నుంచి దాటి బ్యాంకులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ఓటీఎస్ ఒక్కటే మార్గమని అన్ని జిల్లాల డీసీసీబీల పాలకవర్గం ఆప్కాబ్‌ను కోరుతోంది.

ఓటీఎస్ పరిష్కారమా?

ఇలాంటి పరిస్థితుల్లో వాణిజ్య బ్యాంకులైతే తమకు వచ్చే లాభాల్లో కొంత నిధులు దామాషాగా చెల్లించి ఇలా పేరుకుపోయిన అప్పుల రికవరీకి ఏక కాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) కింద రుణం వసూలు చేసుకుంటారు. వాడుక భాషలో అయితే దీన్ని వన్ టైం సెటిల్మెంటు విధానం అంటారు. వాస్తవానికి సహకార రంగంలో ఈ పద్ధతి లేదు. అలా కావాలంటే ఆప్కాబ్ అనుమతించాల్సి ఉంటుంది. అందులో ఆప్కాబ్, డీసీసీబీ, సహకార సంఘం ఏది ఎంత శాతం భరించాలనేది ఆప్కాబ్ పాలకవర్గం తీర్మానించి పంపిన మేరకు ఉంటుంది. ఇదిలా ఉంటే ఒక వేళ ఓటీఎస్ వచ్చినా భరించే పరిస్థితిలో సహకార సంఘాలు లేవు.

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..
యాదవ అవివాహితులకు సువర్ణావకాశం
నేడు, రేపు యాదవ అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' యాదవ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, జనవరి 17), రేపు (ఆదివారం, జనవరి 18న) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.
మరిన్ని వివరాలకు 9154366099 & 9154772006 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు
● వధూవరుల బయోడేటా ఫొటోలను పక్కన ఇచ్చిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చూసుకోవచ్చు.

తితిదే ఆలయాల ప్రత్యేకాధికారి నియామకం

రామచంద్రారెడ్డి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: జిల్లాలోని తితిదే విలీన ఆలయాల ప్రత్యేకాధికారిగా ఆడిట్ విభాగం సంయుక్త సంచాలకులు (జాయింట్ డైరెక్టర్)గా పనిచేస్తున్న డి.రామచంద్రారెడ్డిని నియమిస్తూ సంయుక్త కార్యనిర్వహణాధికారి వెల్లూరు వీరబ్రహ్మం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం, దేవునికడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, జమ్మలమడుగు నారాపుర వేంకటేశ్వరస్వామి, తాళ్లపాక చెన్నకేశవ, సిద్దేశ్వర క్షేత్రాలు, నందలూరు సౌమ్యనాథస్వామి, బోయనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలు తితిదే పరిపాలన పరిధిలో ఉన్నాయి. ఇక్కడ అమలు చేస్తున్న ఆర్జిత సేవలు, భక్తులకు కల్పించాల్సిన వసతులు, అభివృద్ధి పనులను ప్రత్యేకాధికారి నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

హోరాహోరీగా బండ లాగుడు

చాపాడు, న్యూస్‌టుడే: ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా జరిగే హోరాహోరీ ఎడ్ల బండలాగుడు పోటీల్లో భాగంగా చాపాడు మండలంలోని వెదురూరు, నరహరిపురంలో వేలాది మంది ప్రజలు చుట్టుపక్కల పల్లెల నుంచి తరలివచ్చారు. రెండు గ్రామాల్లో మొత్తం 14 జతలు సీనియర్ కేటగిరి ఎడ్లు పాల్గొనగా పోటీలు ఉత్కంఠగా సాగింది.

● నరహరిపురంలో మైదుకూరు విజేత

మైదుకూరు పట్టణానికి చెందిన కుర్ర వెంకటేష్‌యాదవ్ ఎడ్లు ప్రథమ బహుమతి సాధించాయి. రెండో బహుమతి ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి ఎడ్లు, మూడో బహుమతి కల్లూరుకు చెందిన శివకృష్ణ ఎడ్లు, నాలుగో బహుమతి రూకవారిపల్లెకు చెందిన విద్యఓబుళరెడ్డి, ఐదో బహుమతి నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోలీ ఎడ్లు నిలిచాయి.

వెదురూరులో చౌటపల్లికి ప్రథమ బహుమతి

ప్రొద్దుటూరు మండలం చౌటపల్లికి చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి ఎడ్లు ప్రథమ బహుమతి సాధించాయి. రెండో బహుమతి ప్రొద్దుటూరుకు చెందిన తేజేశ్వర్‌రెడ్డి, మూడో బహుమతి నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోలీ, నాలుగో బహుమతి రంగసాయిపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి, ఐదో బహుమతి ప్రకాశం జిల్లా అగ్రహారానికి చెందిన నాగశివశంకర్ ఎడ్లు సాధించాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 1,00,116, రూ. 70,016, రూ. 40,010, రూ. 20,016, రూ. 10,016, రూ. 8,016 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

వెదురూరులో ఎడ్ల వెంట జనం పరుగులు

నరహరిపురంలో ఉత్కంఠగా..

రసవత్తరంగా ఒంటెద్దు ప్రదర్శన..

ముద్దనూరు: పట్టణంలోని బలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఎద్దుల ప్రదర్శన రసవత్తరంగా నిర్వహించారు. మండల భాజపా నాయకుడు మాధుసూదన్‌రెడ్డి కుమారుడు గుణవంతరెడ్డి ఆధ్వర్యంలో ఒంటెద్దు బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ప్రొద్దుటూరుకు చెందిన గోర్ల సుబ్బరాయుడు, ఆళ్లగడ్డకు చెందిన మిద్దెల పెద్దగురయ్య ఎద్దులు వరుస బహుమతులు సాధించాయి. ఈ కార్యక్రమంలో భాజపా గ్రామ, నాయకులు పాల్గొన్నారు.

వింజమూరులో ఎర్రగుంట్ల ఎద్దు..

వింజమూరు, న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలంలోని చాకలకొండ క్రికెట్ మైదానంలో కనుమ పండగ సందర్భంగా శుక్రవారం ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా జరిగాయి. 1300 కేజీల బండను 100 మీటర్లు వేగంగా లాగడంతో ఎర్రగుంట్లకు చెందిన బొగ్గుల రాముకు చెందిన ఎడ్లు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రథమ బహుమతిగా రూ.50 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన వారికి బహుమతులు అందజేశారు. కూనల వెంకటేశ్వర్లు, సర్పంచి ఉప్పిరెట్ల సుబ్బలక్ష్మీకుమారి, వెంకటేశ్వర్లు, దిండు మహేష్, మబ్బు బుచ్చయ్య తదితరులు పోటీలు నిర్వహించారు.

కోదండరాముడి పార్వేట గ్రామోత్సవం

ప్రత్యేక అలంకరణలో కోదండ రాముడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కనుమ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రామయ్య క్షేత్రం నుంచి నాగేటి తిప్పపైన ఉన్న పార్వేట మండపానికి వేడుకగా దాశరథిని ఊరేగిస్తూ తీసుకెళ్లారు. రామయ్య దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పుర వీధుల్లో రాములోరి గ్రామోత్సవం వైభవంగా సాగింది. తితిదే ప్రత్యేకాధికారి డి.రామచంద్రారెడ్డి, ఏఈ కె. అమరనాథ్‌రెడ్డి, ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అశ్వ వాహనంపై లక్ష్మీనరసింహుడు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధి చిన్నదాసరపల్లె సమీపంలో వేయి నూతుల కోనలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం వేదపండితులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అశ్వవాహనంపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామిని వేయినూతుల కోన నుంచి చిన్నదాసరపల్లెకు తీసుకొచ్చి ఊరేగింపు నిర్వహించారు.

వేయినూతులకోనలో అశ్వవాహనంపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహుడు

ఊరేగిన వృషభాచలేశ్వరుడు

వేంపల్లె,న్యూస్‌టుడే: వేంపల్లెలో వృషభాచలేశ్వరస్వామి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇక్కడి మెయిన్ బజార్‌లోని ఆలయంలో అర్చకుడు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు విద్యుద్దీపాలతో అలంకరించి ట్రాక్టర్ తొట్టెలో ఉంచి వీధుల్లో ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు బొడ్డు చావిడివీధి, గాంధీరోడ్డు, కడపరోడ్డు, కాపువీధి, పాతపేట మీదుగా ఆలయం వరకు సాగింది. ఆలయకమిటీ ఛైర్మన్ పీవీ రమణ, ఈవో సుభాష్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పూజలందుకుంటున్న వృషభాచలేశ్వరుడు

ఒంటె వాహనంపై అంజన్న

చక్రాయపేట, న్యూస్‌టుడే: గండిక్షేత్రంలో గురువారం రాత్రి ఒంటె వాహనంపై అంజన్న గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరిస్వామి, రాజారమేష్ స్వాములు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణం నుంచి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఒంటె వాహనంపై శ్రీ వీరాంజనేయస్వామి

పెట్రోల్ బంకు పర్యవేక్షణ బాధ్యత ఎంఈకి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు పర్యవేక్షణ బాధ్యతలను పురపాలక ఇంజినీరు శ్రీనివాసులుకు అనంతపురం పురపాలక రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) నాగరాజు అప్పగించారు. పెట్రోల్ బంకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ ఈయన స్థానంలో ఇదే విభాగంలో పని చేస్తున్న రవికి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెట్రోల్ బంకు నిర్వహణపై ఆ ప్రాంత సచివాలయ వార్డు కార్యదర్శి నుంచి ఏఈ, డీఈ తదితర ఆరుగురు పర్యవేక్షణ చేపట్టాలని ఆర్డీ తన ఆదేశంలో తెలిపారు. పెట్రోల్ బంకులోనే డిప్యూటేషన్‌పై ఉన్న సచివాలయ వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శిపై ఎలాంటి విచారణ చేపట్టలేదు. కొద్ది రోజుల కిందట ఆర్డీ విచారణకు వచ్చిన అనంతరం ఓ నివేదికను ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

ఎంపీతో జడ్పీటీసీ సభ్యుడి భేటీ

తిరుపతి ఎంపీ గురుమూర్తితో జడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, తదితరులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో తిరుపతి ఎంపీ గురుమూర్తితో ఎర్రగుంట్ల జడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్య, వైకాపా నాయకుడు మార్తల సాంబశివారెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఒక ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఎంపీని కలిసి తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఊరుటూరు బాబు, షేక్ సత్తార్, బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి ఎదురెళుతున్నారు!

మైదుకూరు పురపాలక పాతపాలెం వద్ద అటు హుబ్లీ-కృష్ణపట్నం ఇటు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారుల కూడలి వద్ద వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. ప్రమాదాలకు అవకాశం ఉన్నా అపసవ్య దిశలో రాకపోకలు చేస్తున్నారు. కృష్ణపట్నం నుంచి వచ్చే వాహనాలు కర్నూలు వైపునకు వెళ్లాలంటే కి.మీ దూరంలోని సరస్వతీపేట నుంచి, హుబ్లీ వైపు నుంచి వచ్చే వాహనాలు కడప వైపు వెళ్లాలంటే కి.మీ దూరంలోని గడ్డమాలవాడ వద్ద మలుపు తిరగాల్సి వస్తుంది. కి.మీ దూరం వెళ్లకుండా వాహనదారులు అపసవ్య దిశలో రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నా చోదకులు పట్టలేదు. ఇటీవల పోలీసులు అపసవ్యదిశలో సాగే వాహనదారులకు జరిమానా వేశారు. అపసవ్య దిశలో రాకపోకలు సాగకుండా జాతీయ రహదారి అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

-న్యూస్‌టుడే, మైదుకూరు

నామఫలకలు పునరుద్ధరించరే!

హుబ్లీ-కృష్ణపట్నం జాతీయరహదారిలో భాగంగా మైదుకూరు-బద్వేలు మధ్య నాలుగు లేన్లగా విస్తరించినా గ్రామాల వద్ద నామఫలకలను పునరుద్ధరించలేదు. విస్తరణ పనులకు అడ్డం లేకుండా గతంలో గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన నామఫలకను తొలగించారు. పనులు పూర్తి చేసి నాలుగు నెలలు పైబడినా గోపిరెడ్డిపల్లె, రాయప్పగారిపల్లె గ్రామాల వద్ద రోడ్డు పక్కనే నామఫలకలను వదిలేశారు.

-న్యూస్‌టుడే, మైదుకూరు

ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు

ట్రావెల్స్ బస్సు పత్రాలను పరిశీలిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రైవేట్ బస్సు వాహనాలపై ఆర్టీఏ అధికారులు జిల్లావ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 15 వరకు ముమ్మరంగా దాడులు చేశారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, రాజంపేట, పులివెందుల పరిధిలో తనిఖీలు ఎక్కువగా సాగించారు. మొత్తం 23 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ. 1,54,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సందర్భంగా ఎవరైనా అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చాలని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు.

20 నుంచి విద్యుత్తు ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు ధరల ప్రతిపాదనలపై ఈ నెల 20 నుంచి ఏపీ ఈఆర్సీ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతోందని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో.. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 22, 23 తేదీల్లో.. కర్నూలు ఏపీ ఈఆర్సీ కార్యాలయంలో 27న ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. వినియోగదారులు నేరుగా అక్కడకు వెళ్లి తమ అభిప్రాయాలను తెలియచేయచ్చని.. వెళ్లలేనివారు ఆయా జిల్లాల ఎస్ఈ, డివిజన్ ఈఈ కార్యాలయాల నుంచి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ నుంచి అభిప్రాయాలను తెలుసుకోచ్చన్నారు.

నిర్మాణ సామగ్రికి కాళ్లు.. ఆందోళనలో లబ్ధిదారులు

- సిమెంటు బస్తాలు, ఇనుప కడ్డీలు, నీళ్ల మోటార్లు మాయం
- జగనన్న కాలనీలో బిక్కుమిక్కుమంటూ నివాసం

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

గత వైకాపా ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ముద్దనూరురోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనకాల సుమారు 2,315 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వేగంగా పనులు జరుగుతున్నాయి. గత కొన్ని నెలలుగా కాలనీలో దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తూ పనులకు ఆటంకం కలిగిస్తున్నారు. కాలనీలో రాత్రిళ్లు, ఎవ్వరూ లేని సమయంలో చొరబడి సిమెంటు బస్తాలు, ఇటుకలు, ఇనుక కడ్డీలు, నీటి మోటార్లను దోచుకెళ్తుండటంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. కేవలం 823 ఇళ్లు నిర్మాణాలు పూర్తవగా కొందరు నివాసాలు ఉన్నారు. ఇటీవల పెరిగిపోతున్న చోరీలతో ఈ ప్రాంతంలో ఉండాలంటే ప్రజలు భయపడుతున్నారు. అంబవరం వద్ద లే అవుట్-1లో 50 ఎకరాలు, లే అవుట్-2లో 20 ఎకరాలు కేటాయించి ఒక్కో కుటుంబానికి ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని ఇంటి నిర్మాణం నిమిత్తం ఇచ్చారు.

ఇటీవల 265 ఇంటి నెంబరులో చోరీ అయిన నీటి మోటారు

నిఘా కట్టుదిట్టం చేస్తాం

అంబవరం గ్రామం వద్ద జగనన్న కాలనీలో దొంగతనాలు జరగకుండా నిఘా కట్టుదిట్టం చేస్తాం. ప్రజలు కూడా పోలీసులకు తోడ్పాటు అందించాలి. ప్రతి వీధిలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకుని జాగ్రత్తలు పాటించాలి. గుర్తుతెలియని, అనుమానితులు కాలనీలో సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. దొంగతనాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తాం.

-నరేష్ బాబు, పట్టణ సీఐ, జమ్మలమడుగు

సాధన చేస్తాం.. లక్ష్యం సాధిస్తాం

ఆలిండియా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థినులు బాల్ బ్యాడ్మింటన్ క్రీడా రంగంలో దూసుకెళుతున్నారు. స్పోర్ట్స్ డైరెక్టరు నరసింహారెడ్డి నేతృత్వంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు పి.తులసి, భువన చంద్రిక, అంజుమ్, ఐశ్వర్య, తేజశ్విణి, మునెమ్మ ఫిబ్రవరి నెలలో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు యోవేవి జట్టు తరపున తలపడనున్నారు. పట్టుదల, ఏకాగ్రతతో ఆలిండియాలో మెరవాలన్నదే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. ఇదివరకు వారు సాధించిన ప్రతిభ, విజయాలు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ఆటలంటే ఇష్టం..

నా పేరు పి.తులసి. ఆర్సీపీఈలో డీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. మాది మదనపల్లె జిల్లా బుచ్చిరెడ్డిగారిపల్లె. అమ్మానాన్న గౌరమ్మ, రామయ్య (రైతు). పాఠశాల స్థాయి నుంచి ఆటలంటే ఇష్టం. హ్యాండ్‌బాల్, కబడ్డీ క్రీడా పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాను. యోవేవి తరపున ఫిబ్రవరి నెలలో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాను. ఉత్తమ ప్రతిభ కనబరచేందుకు సాధన చేస్తున్నా. దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని, డీఎస్సీ పరీక్షల్లో పీఈటీ ఉద్యోగమే నా లక్ష్యం.

కోచ్ నరసింహారెడ్డితో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణులు

జాతీయ స్థాయిలో రాణించాలని ధ్యేయం

నా పేరు బి.భువనచంద్రిక. ఆర్సీపీఈలో బీపీఈడీ రెండో ఏడాది చదువుతున్నా. మాది కమలాపురం మండలం అగస్తలింగాయపల్లె. అమ్మ లక్ష్మీదేవి కష్టంతోనే చదువుకుంటున్నా. 8వ తరగతిలో జోనల్ స్థాయిలో ఆడాను. గతేడాది అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం ఆలిండియా విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యాను. జట్టును ముందుకు నడిపించేందుకు సాధన చేస్తున్నా. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని, ప్రభుత్వ పీఈటీ ఉద్యోగం సాధించి విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నదే నా ధ్యేయం.

తెదేపాలో పలువురి చేరిక

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో పలువురు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. పెద్దకొండప్ప కాలనీకి చెందిన జగదీశ్వరరెడ్డి తన అనుచరులతో కలిసి తెదేపా నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సమక్షంలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై 50 కుటుంబాలు పార్టీలో చేరాయన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాషా, తెదేపా రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తొండూరు మండల కన్వీనర్ మారెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

EENADU e Classifieds
REAL ESTATE
JOBS
PLOT FOR SALE
Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 9866219067
Wanted Male Warden's at Bangalore City Speaking Skills English and Hindi, Attractive Salary to be paid. Cont: 9666567679, 9704209798.
ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ.. 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626, 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

పండగ ముగిసింది.. రద్దీ పెరిగింది

ప్రొద్దుటూరు వెళ్లేందుకు బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: హిందువుల పెద్ద పండగైన సంక్రాంతి సంబరాలు చివరి దశకు చేరుకోవడంతో చాలా మంది తిరుగు ప్రయాణమయ్యారు. ప్రొద్దుటూరు, తాడిపత్రి వైపు వెళ్లే బస్సులు రద్దీగా మారాయి. బస్సులు రాగానే సీట్ల కోసం ప్రయాణికులు పెద్ద ఎత్తున గుమిగూడి పోటీపడ్డారు. శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్, బెంగళూరు వంటి దూరం వెళ్లే ప్రయాణికులు సైతం శుక్రవారం రాత్రి బస్సుల కోసం వేచి ఉన్నారు.

గండికోటలో పర్యాటకుల సందడి

రంగనాథస్వామి ఆలయం వద్ద పర్యాటకులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటకు సందర్శకులు పోటెత్తారు. సంక్రాంతి పండగకు సొంత ఊర్లకు వచ్చిన బంధువులతో పాటు పలు ప్రాంతాల నుంచి సందర్శకులు కుటుంబ సభ్యులతో వచ్చి సందడి చేశారు. కోటలోని జుమ్మామసీదు, పెన్నానదిలోయ, మాధవరాయస్వామి దేవాలయం, రంగనాథస్వామి ఆలయంపై చెక్కిన శిల్పాల అందాలు పర్యాటకులను కట్టిపడేశాయి. గండికోటలో సరైనా పార్కింగ్ సౌకర్యం, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పశువైద్య విద్యార్థుల ప్రతిభకు పురస్కారాలు

విజేతలుగా నిలిచిన ప్రభుత్వ పశువైద్య కళాశాల విద్యార్థినులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (తిరుపతి) పరిధిలోని అంతర్ కళాశాలల పోటీల్లో ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచారు. నాలుగు కళాశాలల మధ్య వివిధ అంశాలపై ఇటీవల విజయనగరం జిల్లా గరివిడిలోని ప్రభుత్వ వెటర్నరి కళాశాల ఆవరణంలో పలు అంశాల వారీగా పోటీలను నిర్వహించారు. సామూహిక దేశభక్తి గేయంలో ప్రొద్దుటూరు పశువైద్య విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాదు, హెచ్‌వోడీ రాజకిశోర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బయటొద్దు అసెంబ్లీకెళ్లి గర్జించు జగనూ

మాట్లాడుతున్న 'సీమ సమితి' జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: బయట మాట్లాడటం సరికాదు.. అసెంబ్లీకెళ్లి గర్జిస్తే ఓటర్లు హర్షిస్తారని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి సూచించారు. శుక్రవారం ఆయన ర. భ. శాఖ అతిథి భవనంలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ లిఫ్టు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు గత, ప్రస్తుత ముఖ్యమంత్రులైన జగన్, చంద్రబాబు కృషి చేయాలన్నారు.

సంక్రాంతి వేళ.. ఆనందాల హేల

ప్రొద్దుటూరు పట్టణం రాజరాజేశ్వరి కాలనీవాసుల పంజాబీల వేషధారణ

ప్రొద్దుటూరులో దేవతామూర్తుల ఊరేగింపు

జమ్మలమడుగులో నారాపుర వేంకటేశ్వరస్వామి దర్శనం

పెన్నాతీరంలో సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, దేవగుడి గ్రామాల ఉత్సవ విగ్రహాలు

ఖాజీపేటలోని రావులపల్లె గ్రామంలో రాములవారు

చాపాడు: ప్రత్యేకాలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం

పండగ సంప్రదాయాలను భవిష్యత్తు తరాల ప్రజలు మరిచిపోకుండా నేటి తరం వారు కొనసాగిస్తూ అందర్నీ కనువిందు చేసేలా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గ గ్రామాలు, పట్టణాల్లో వాడవాడలా సంక్రాంతి, కనుమ పండగల సంబరాలు వెల్లివిరిశాయి. ఆయా గ్రామాల దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నదులు, పవిత్ర స్థలాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ప్రతి ఇంటి వద్ద కొత్త చుట్టాలతో ఊరు సందడిగా మారింది. పార్వేట ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మహిళలు, చిన్నారుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామోత్సవం పెద్ద ఎత్తు బాణసంచా కాల్చుతూ అమ్మవారి ఊరేగింపు చేశారు. **-న్యూస్‌టుడే, బృందం**

వినాయకస్వామికి పుష్పాభిషేకం

కొర్రపాడులో వినాయక స్వామికి పుష్పాలతో ప్రత్యేకాలంకారం

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని కొర్రపాడులో సంక్రాంతి పండగ సందర్భంగా గురువారం పురాతన రాతి వినాయకుని విగ్రహానికి ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు కుంకుమ పంపిణీ చేశారు.

CHANGE OF SURNAME
I, Polepalle Hima Bindu, W/o Polepalle Santhosh Kumar (Old Name), R/o. D.No.3/1125, Y.M.R. Colony, Proddatur Town and Mandal, Y.S.R. Kadapa Dist., A.P., I here by change my surname from POLEPALLE to POLEPALLI Hereafter, I shall be known as POLEPALLI HIMA BINDU.

CHANGE OF SURNAME
I, Polepalle Santhosh Kumar, S/o Venkataiah Polepalle (Old Name), R/o. D.No.3/1125, Y.M.R. Colony, Proddatur Town and Mandal, Y.S.R. Kadapa Dist., A.P., I here by change my surname from POLEPALLE to POLEPALLI Hereafter, I shall be known as POLEPALLI SANTHOSH KUMAR.

CHANGE OF NAME
I, BACHCHU SUVARANA W/o BACHCHU VEERA RAGHVA (Old Name), D.No.18/285, Seshu gari Street, Proddatur, YSR Dist, AP hereby changed my name as BACCHU SUVARNA (New Name) for all future purposes. Henceforth I will be known as BACCHU SUVARNA

CHANGE OF NAME
I, BACHCHU VEERA RAGHVA (Old Name) S/o BACHCHU VEERA BRAMHAIAH, D.No 18/285, Seshu gari Street, Proddatur, YSR Dist, AP hereby changed my name as BACCHU VEERA RAGHAVA (New Name) for all future purposes. Henceforth I will be known as BACCHU VEERA RAGHAVA

చిన్నగురువలూరులో ఐదుగురి అరెస్టు

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం చిన్నగురువలూరులో నిర్వహించిన కోడి పందేల నిర్వాహకులు ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గురువారం రాత్రి చుట్టుపక్కల పల్లెల నుంచి జూదరులు వచ్చి గురువలూరులో కోడి పందేలు ఆడుతున్న సమాచారం తెలుసుకుని పోలీసులు దాడులు చేశారు. వారి వద్ద నుంచి రూ. 9,500 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

గ్యాస్ సిలిండర్ మంటల్లో కౌన్సిలర్‌కు గాయాలు

మైదుకూరు, న్యూస్‌టుడే : వాయుబండ లీకేజీతో జరిగిన ప్రమాదంతో మైదుకూరు పురపాలక కౌన్సిలర్ మామిళ్ల వెంకటసుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డారు. వంట గదిలోకి వెళ్లిన వెంకటసుబ్బయ్య దోమల నివారణ అగరబత్తి వెలిగించే ప్రయత్నంలో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు గుర్తించి ఆయనను బయటకు తెచ్చేలోపే తీవ్రంగా గాయపడ్డారు. కడప సర్వజన ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇరువర్గాల ఘర్షణ: అయిదుగురికి...

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గండ్లూరు గ్రామంలో డబ్బు విషయమై జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయరాములు శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీ గండ్లూరు గ్రామంలోని శివాలయం సమీపంలో నాగన్న, బెంజిమెన్ వర్గాల మధ్య డబ్బు విషయంలో ఘర్షణ చోటు చేసుకుని దాడులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన అయిదుగురికి గాయాలైనట్లు తెలిపారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా లింగమయ్యస్వామి తిరునాల

గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న పోతురాజు వెండి విగ్రహం

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చౌటిపల్లె గ్రామంలో వైభవంగా లింగమయ్య స్వామి తిరునాల నిర్వహించారు. గురువారం, శుక్రవారం రెండు రోజులుగా లింగమయ్యస్వామి, పెద్దమ్మతల్లిని వేలాదిమంది భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మండలం నుంచేకాకుండా పొరుగు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున దుకాణాలు, చెరుకుల అంగళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జెయింట్ వీల్, బాతు బొమ్మ బండి ఎక్కి స్నేహితులు, బంధువులతో ఆనందాలను పంచుకున్నారు. మాజీ సర్పంచి, తెదేపా నాయకుడు వెల్లాల రామలింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

18న పద్యాలు, చిత్రలేఖనం పోటీలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: వేమన సేవా సమితి ఆధ్వర్యంలో 18న స్థానిక గ్రంథాలయంలో 6, 7, 8వ తరగతి విద్యార్థులకు వేమన పద్యాలు, 9, 10 తరగతుల వారికి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సూర్యనారాయణరెడ్డి, జి. వెంకటేశ్వర్లరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పద్యాలు రాగ యుక్తంగా చెప్పి తాత్పర్యాన్ని వివరించాలి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభిస్తామని, ఆసక్తి ఉన్న వారు 98493 54729ను సంప్రదించాలని వారు కోరారు.

విజేతలకు బహుమతులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఐపీఎల్ మాజీ క్రికెటర్ పైడికాల్వ విజయ్‌కుమార్

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల సందర్భంగా ప్రొద్దుటూరు పురపాలక మైదానంలో నంద్యాల కొండారెడ్డి యువసేన నాయకులు రసూల్ గౌస్ ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ పోటీలు ఫైనల్స్ జరిగాయి. ప్రథమ స్థానంలో కడప బృందం గెలుపొందగా ప్రొద్దుటూరు బృందం రెండో స్థానంలో నిలిచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐపీఎల్ మాజీ క్రికెటర్ పైడికాల్వ విజయ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందించారు. ఆదివారం వరకు ఆటల పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం

విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎన్డీయే కూటమి నాయకుడు శివనారాయణరెడ్డి, తదితరులు

కొండాపురం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని ఎన్డీయే కూటమి మండల ఇన్‌ఛార్జి శివనారాయణరెడ్డి శుక్రవారం అన్నారు. సంకాంత్రి పండగ వేడుకల్లో భాగంగా ఎన్డీయే కూటమి మండల నాయకుడు రెండెద్దుల రామాంజనేయులరెడ్డి ఆధ్వర్యంలో తాళ్లప్రొద్దుటూరులో క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో 26 జట్లు పాల్గొనగా. . ఫైనల్ మ్యాచ్‌లో విజేత కొండాపురానికి చెందిన బాషా జట్టుకు రూ. 20,116, రెండో స్థానంలో తాళ్లప్రొద్దుటూరు సుధాకర్ జట్టుకు రూ. 15,116 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్‌కుమార్, నాయకులు శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

R.V. TOURS AND TRAVELS PVT. LTD.
మన ప్రొద్దుటూరు ప్రజలకు శుభవార్త
Travel Expo 2026
Discounts on Domestic & International Tour Package
RV Travel Expo
R V Ramana
Chairman & Founder
వేదిక : హొటల్ కొవ్వూరు గ్రాండ్
RTC బస్సు స్టాండ్ దగ్గర, ప్రొద్దుటూరు
SCAN HERE
Date: 17th & 18th January, 2026
Time: 10am to 7pm
12 Nights / 13 Days Europe Tour RS.3,25,000/- +5% GST +5% TCS PER PERSON
5 Nights / 6 Days Singapore & Malaysia RS.1,12,000/- +5% GST +5% TCS
5% OFF ON INTERNATIONAL TOUR PACKAGES
4 Nights / 5 Days Dubai RS.99,500/- +5% GST +5% TCS
4 Nights / 5 Days BANGKOK & PATTAYA RS.36,999/- +5% GST +5% TCS PER PERSON
7 Nights / 8 Days JAPAN RS.3,50,000/- +5% GST +5% TCS
10 Nights / 11 Days VIETNAM & CAMBODIA RS.1,75,000/- +5% GST +5% TCS
4 Nights / 5 Days BALI RS.95,000/- +5% GST +5% TCS
5 Nights / 6 Days SRILANKA RS.59,500/- +5% GST +5% TCS
6 Nights / 7 Days BHUTAN RS.65,000/- +5% GST +5% TCS
6 Nights / 7 Days SCOTLAND & LONDON RS.2,85,000/- +5% GST +5% TCS
4 Nights / 5 Days PHUKET & KRABI RS.53,000/- +5% GST +5% TCS
4 Nights / 5 Days BAKU RS.1,05,000/- +5% GST +5% TCS
13 Nights / 14 Days KAILASH - MANASAROVAR RS.2,85,000/- +5% GST +5% TCS PER PERSON
11 Nights / 12 Days CHARDHAM YATRA RS.65,000/- +5% GST PER PERSON
10% OFF ON DOMESTIC TOUR PACKAGES
2 Nights / 3 Days YAMUNA PUSHKARALU RS.26,000/- +5% GST PER PERSON
3 Nights / 4 Days KASHI - AYODHYA - PRAYAGRAJ RS.27,999/- +5% GST PER PERSON
12 Nights / 13 Days MUKTINATH RS.76,500/- +5% GST
13 Nights / 14 Days AMARNATH RS.72,500/- +5% GST
9 Nights / 10 Days KASHI - GAYA PRAYAGRAJ RS.57,999/- +5% GST
11 Nights / 12 Days GUJARAT & MADHYA PRADESH RS.69,999/- +5% GST
7 Nights / 8 Days TAMILNADU RS.52,999/- +5% GST
6 Nights / 7 Days KARNATAKA RS.49,999/- +5% GST
7 Nights / 8 Days MAHARASTRA RS.48,000/- +5% GST
6 Nights / 7 Days KERALA RS.49,999/- +5% GST
10 Nights / 11 Days RAJASTHAN RS.65,999/- +5% GST
2 Nights / 3 Days KOLKATA GANGA SAGAR RS.25,000/- +5% GST
For More Tour Packages... Enquire Now
*T&C Apply
PH: 8712018330, 9154225674, 7032666921

కడప
• కడప • పులివెందుల • కమలాపురం

స్థానికులకు పంచపరివర్తన పుస్తకాలు అందజేస్తున్న భాజపా జిల్లా అధికార ప్రతినిధి హరిప్రసాద్

దేశసేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర గొప్పది

వేంపల్లె, న్యూస్‌టుడే: దేశసేవలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాత్ర గొప్పదని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలిహరిప్రసాద్ అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా వేంపల్లెలో శుక్రవారం స్థానికులకు ఆర్ఎస్ఎస్ వారు ముద్రించిన పంచపరివర్తన పుస్తకాలను పంపిణీ చేశారు. ఎక్కడ ఏవిపత్తు జరిగినా ఎలాంటి ప్రచారాపేక్ష లేకుండా సేవ చేసేందుకు ఆర్ఎస్ఎస్ ముందంజలో ఉంటుందన్నారు.

భారతజట్టు క్రీడాకారులకు అభినందన

వేంపల్లె, సింహాద్రిపురం, న్యూస్‌టుడే: గోల్‌బాల్ భారత జట్టు క్రీడాకారులు రావడీటి తేజేంద్ర, రెడ్డివర్ల దేవీప్రియలను పులివెందుల మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి అభినందించారు. వేంపల్లెకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డివర్లదేవీలు గతవారం నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ గోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారతజట్టు తరఫున పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా వారిని సింహాద్రిపురంలోని తన ఇంటికి బీటెక్ రవి ఆహ్వానించి సత్కరించారు. గండి దేవస్థానం మాజీ ఛైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు.

క్రీడాకారులను శాలువాతో సత్కరించి అభినందించిన మాజీ ఎమ్మెల్యే బీటెక్ రవి

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: సమాజంలో తిరుగుతున్న అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. గంజాయి, మత్తు, డ్రగ్స్ తదితర వాటి నుంచి జిల్లాను కాపాడేందుకు ఆయా ఠాణాల పరిధిలోని పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు ముమ్మరంగా సోదాలు చేస్తున్నారని తెలిపారు. కడప రెండో పట్టణ ఠాణా పరిధిలో గురు, శుక్రవారాల్లో పాడుబడిన భవనాలు, శ్మశానవాటికలు, ముళ్లపొదలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయిపేట, అల్మాస్‌పేట, మాసాపేట సమాధులు, బిస్మిల్లానగర్ ప్రాంతాల్లో నిఘా ఉంచారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు జరుగుతుంటే డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. దాడుల్లో సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై రామకృష్ణ, రఫి ఉన్నారు.

అనాథలకు పండ్ల పంపిణీ

అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న మాసా కోదండరాం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: నగరంలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో జిల్లా బాధ్య మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. తెదేపా పద్మశాలి సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరాం ఆధ్వర్యంలో కేకు కోసి అనాథలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్రకార్యదర్శి నబీకోట శ్రీనివాసులు, పలువురు నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: యు.రాజుపాలెంలో ఎదురెదురుగా ఉండే రెండు కుటుంబాలు వారి కుక్కను తోలగించే విషయమై శుక్రవారం ఘర్షణ పడ్డారని ఎస్సై మునుజాకీర్ తెలిపారు. రెండు కుటుంబాలకు చెందిన మహిళల మధ్య కుక్కను తోలగించే క్రమంలో వాగ్వాదం జరిగింది. వారికి సర్ది చెప్పేందుకు మహానంద, మాధవ, నాగార్జునలు వెళ్లగా.. వారిపై బ్రహ్మయ్య, దస్తగిరి, మస్తాన్‌లు ఇనుపరాడ్లతో దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఇరు కుటుంబాల వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

దాడికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని నగరిగుట్టకు చెందిన పెద్ద మస్తాన్ అనే వ్యక్తికి కడప ఏఎస్‌జే కోర్టు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధించినట్లు పులివెందుల పట్టణ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. నగరిగుట్టకు చెందిన పెద్ద మస్తాన్ అదే ప్రాంతానికి చెందిన అన్నదమ్ముల ఆస్తి విషయంలో 2022లో రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం వాదనలు విన్న కడప ఏఎస్‌జే కోర్టు న్యాయమూర్తి నిందితుడికి పైన పేర్కొన్న విధంగా శిక్ష విధించారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SHRIRAM Finance)

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.9/3-ఎ3, ఆంధ్రాబ్యాంక్ మిద్దెపైన, మెయిన్‌రోడ్డు, పులివెందుల - 516390, కడప జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు శాఖ కార్యాలయం పులివెందుల (ఇకపై కంపెనీ / లెండరు గా వ్యవహరించబడుతుంది)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.16.01.2026** న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) హర్షవర్ధన్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ దండ్లు ఆద్యనార్ రెడ్డి, తండ్రి చిన్న భాగరయ్య, డి.నెం.1-4-94, మారుతి వీధి, పులివెందుల, కడప జిల్లా
2) దండ్లు ఆద్యనార్ రెడ్డి, తండ్రి చిన్న భాగరయ్య, డి.నెం.1-4-94, మారుతి వీధి, పులివెందుల, కడప జిల్లా
3) దండ్లు నారాయణమ్మ భర్త దండ్లు ఆద్యనార్ రెడ్డి, డి.నెం.1-4-94, మారుతి వీధి, పులివెందుల, కడప జిల్లా
4) దండ్లు సరోజమ్మ, తండ్రి కదిరప్ప, డి.నెం.1-966-2, నాగులకట్ట వీధి, కడప - 516360

డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.24,41,304/- (ఇరవై నాలుగు లక్షల నలభై ఒక్క వేల మూడు వందల నాలుగు రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLVDLTF2106030002 డిమాండ్ నోటీసు తేది: 04.10.2025

స్థిరాస్తుల వివరములు

వైయస్ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, పులివెందుల సబ్‌జిల్లా, పులివెందుల మండలం, [illegible] 58అ. లేదా 17.678 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 64 1/2అ. లేదా 19.659మీ. [illegible]

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/జోనల్ కార్యాలయం — సం/- అధీకృత అధికారి,
తేది: 16.01.2026 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంప్రదాయం ఉట్టిపడేలా.. సంక్రాంతి సంబరాలు

పులివెందుల : పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

కమలాపురం: మోక్షనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోగటంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి దంపతులు

పులివెందుల శిల్పారామంలో అలరించిన చిన్నారుల నాట్యం

సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో కోడి పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చిట్లాకుప్ప వద్ద నిప్పు పెట్టి పశువుల పండగ జరిపారు. పలు చోట్ల పార్వేట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థినుల కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. **- న్యూస్‌టుడే, కడప క్లస్టర్ బృందం**

కమలాపురం : ముగ్గుల పోటీల విజేతలతో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి.. పులివెందుల : ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విజేతగా నిలిచిన జట్టుకు నగదు అందిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, నిర్వాహకులు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పెండ్లిమర్రిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పెండ్లిమర్రికి చెందిన కె.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. తెదేపా మండల సమన్వయకర్త ఎస్వీ గంగిరెడ్డి, భాజపా మండల కమిటీ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, భాజపా నాయకుడు బాలగురవయ్య, మాజీ సర్పంచి నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారత రెడ్డి సంఘం మండలాధ్యక్షుడిగా అంకిరెడ్డి

చెన్నూరు, న్యూస్‌టుడే: అఖిల భారత రెడ్డి సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా చీమల చిన్న అంకిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర నాయకుల నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ మేరకు చెన్నూరులో శుక్రవారం ఆ సంఘ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SHRIRAM Finance)

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం.9/3-ఎ3, ఆంధ్రాబ్యాంక్ మిద్దెపైన, మెయిన్‌రోడ్డు, పులివెందుల - 516390, కడప జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు శాఖ కార్యాలయం పులివెందుల(ఇకపై కంపెనీ / లెండరు గా వ్యవహరించబడుతుంది)**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.16.01.2026** న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) **ఎ.హరినాథరెడ్డి,** తండ్రి లేట్ ఎరికలరెడ్డి, డి.నెం.149, విజయ హోమ్స్, కడప రోడ్డు, పులివెందుల టౌన్, పులివెందుల మండలం, కడప జిల్లా - 516390
2) **ఎ.అంజని,** భర్త హరినాథ రెడ్డి ఎ., ఇ.నెం.149, విజయ హోమ్స్, కడప రోడ్డు, పులివెందుల టౌన్, పులివెందుల మండలం, కడప జిల్లా - 516390
3) **పాతాళ ఆంజనేయులు** తండ్రి పి.గంగయ్య, డి.నెం.1/5-1-78, మెయిన్ బజార్, పులివెందుల కడప జిల్లా - 516390

డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.73,26,306/- (డెబ్బై మూడు లక్షల ఇరవై ఆరు వేల మూడు వందల ఆరు రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLVDLTF2210290003 డిమాండ్ నోటీసు తేది: 23.08.2025

స్థిరాస్తుల వివరములు

వైయస్ఆర్ కడప జిల్లా, పులివెందుల సబ్ జిల్లా, పులివెందుల మున్సిపల్ ఏరియా, పులివెందుల టౌన్, పులివెందుల గ్రామలెక్కదాఖలా సర్వేనెం.206, గోపి విహార్ వీధి, పంచాయతీ ఇంటి.నెం.1/2101-2, ప్రస్తుత మున్సిపల్ నెం.1-4-30, హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: కె.వెంకటసుబ్బయ్య ఇల్లు, ఉత్తరం: లేన్ (సందురాస్తా), దక్షిణం: ఇమాములు ఇల్లు, ఈ హద్దుల మధ్య స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 60అ. లేదా 18.288 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 19 1/2అ. లేదా 5.943 మీ. ఖాళీ స్థలం మరియు ఇందున నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ కొలతలు: తూర్పు నుండి పడమర: 60అ. లేదా 18.288 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 19 1/2 అ. లేదా 5.943మీ. మరియు ఇందున నిర్మించిన ఫస్ట్ ఫ్లోర్ కొలతలు: తూర్పు నుండి పడమర: 53 1/2 అ. లేదా 17.833మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 19 1/2అ. లేదా 5.943 మరియు ఇందున నిర్మించిన 2వ అంతస్తు కొలతలు: తూర్పు నుండి పడమర: 22 1/2అ. లేదా 6.858మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 19 1/2అ. లేదా 5.943 అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధ స్థలంతో సహా నీటి కొళాయి కనెక్షన్‌తో సహా.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/జోనల్ కార్యాలయం — సం/- అధీకృత అధికారి,
తేది: 16.01.2026 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

చోదకులకు శిరస్త్రాణం.. సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: వాహనదారులు సీటు బెల్ట్, శిరస్త్రాణం ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటపడొచ్చునని కడప రెండో పట్టణ ఎస్సై రామకృష్ణ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా శుక్రవారం రెండో పట్టణ పరిధిలోని వాహనదారులకు అవగాహన కల్పించారు. చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అతి వేగం, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. ● సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సైబర్ నేరాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ● తెల్లవారుజామున వాహనాలు నడిపే వారు వాహనాన్ని ఆపి నీళ్లతో ముఖం కడుక్కుని వెళ్లాలని పోలీసులు సూచించారు.

రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పిస్తున్న రెండో పట్టణ ఎస్సై రామకృష్ణ

వైద్య శిబిరానికి స్పందన

వేముల, న్యూస్‌టుడే: మండలంలోని బెస్తవారిపల్లెలో మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విశ్రాంత తహసీల్దార్ కుర్లి వెంటేష్ జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యులు కుర్లి శంకర్, విజయలక్ష్మిలు శిబిరం ఏర్పాటు చేశారు. 150 మంది రోగులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. పలువురు దివ్యాంగులకు రైస్ కుక్కర్లు అందజేశారు. దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కుక్కర్లు పంపిణీ చేస్తున్న వైద్యులు శంకర్, విజయలక్ష్మి

వేడుకగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్లటూరు(పెండ్లిమర్రి), న్యూస్‌టుడే : మండల పరిధి వెల్లటూరులో శ్రీచెన్న కేశవస్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిల కల్యాణోత్సవం ముత్యాల తలంబ్రాలతో వేడుకగా జరిపించారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన దాత పోతు నాగమల్లారెడ్డి నిర్మించిన గదిని ఆయన ప్రారంభించారు. తెదేపా మండల సమన్వయకర్త ఎస్వీ గంగిరెడ్డి, వెల్లటూరు సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

అందుబాటులో ఆధునిక వస్త్రాలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: నగరంలోని ఆధునిక వస్త్రాలు అందుబాటులో ఉండటం శుభ పరిణామమని సీపీసీ ఛానల్ ఎండీ ఉదయ్‌కిరణ్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శుభమస్తు షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఎలక్ట్రికల్ బైక్ లక్కీడ్రాను ఆయన తీశారు. రాజమండ్రికి చెందిన సోమరాజుకు ఎలక్ట్రికల్ బైక్ దక్కినట్లు ప్రకటించారు. షాపింగ్ మాల్ నిర్వాహకులు బయ్యావాసు, రవిలను ఆయన అభినందించారు. మేనేజర్లు రమణ, సాయిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడ్రా తీస్తున్న సీపీసీ ఛానల్ ఎండీ ఉదయ్‌కిరణ్, చిత్రంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు

ఉద్యమనేత కవిరాజు త్రిపురనేని రామస్వామి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: హేతువాద ఉద్యమ నేత కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి సమాజ అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఆర్ఐ సోమశేఖర్ నాయక్ అన్నారు. త్రిపురనేని రామస్వామి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామస్వామి రాసిన రాణాప్రతాప్ నాటకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేదించిందన్నారు. అప్పట్లోనే ఉన్నత చదువుల కోసం ఐర్లాండ్ వెళ్లారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్సైలు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, పావని తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్ఐ సోమశేఖర్‌నాయక్

సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయుల నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఆరోపించారు. కడప కలెక్టరేట్ ఎదుట గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గాలిపటాలు ఎగురవేసి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీరాజా మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీఆర్సీ, ఐఆర్, పెండింగ్‌లో ఉన్న బకాయిలను సకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఇంతవరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామనిహెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు, సంఘం ప్రతినిధులు నరసింహారావు, రమణ, ఎజాస్ అహ్మద్, ప్రభాకర్,బాబు, మహబూబ్‌బాషా, చంద్రశేఖర్, శ్రీహరి, కొండయ్య, విశ్వనాథ్, దత్తు, శ్రీహరి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట గాలిపటాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బాలుర వసతి గృహానికి సొబగులు

విద్యార్థులకు శుద్ధిజలాన్ని అందించే కేంద్రం

వేముల, న్యూస్‌టుడే : సీఎస్ఆర్ నిధులతో స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహం మెరుగులు దిద్దుకుంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన వసతిగృహం మరమ్మతులకు నోచుకోక దెబ్బతింది. స్లాబు పూర్తిగా దెబ్బతినడంతో వర్షాకాలంలో నీరు గదుల్లోకి వచ్చి విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. సమస్యను అధికారులు యురేనియం పరిశ్రమ జీఎం సుమన్‌సర్కార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన వసతిగృహ మరమ్మతులకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వసతిగృహానికి మరమ్మతులు చేయడంతో అందంగా తయారైంది. విద్యార్థులకు శుద్ధి జలాన్ని అందించేందుకు కేంద్రాన్ని నిర్మించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు మరమ్మతులు చేశారు. సీఎస్ఆర్ నిధులతో అన్ని వసతులు కల్పించిన సంస్థకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

manipalhospitals LIFE'S ON

మణిపాల్ హాస్పిటల్స్, మిల్లర్స్ రోడ్, బెంగుళూరు
ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌తో కలిసి ప్రముఖ న్యూరో సర్జన్‌ను ఇప్పుడు మన కడప పట్టణం నందు సంప్రదించగలరు.

మెదడు మరియు వెన్నముక క్లినిక్

Dr Karthik Reddy MNV
Associate Consultant - Neuro Surgery
DrNB-Manipal Hospitals, Bangalore Fellow in Neuroendoscopy
Fellow in Endoscopic Spine Surgery - S Korea
Fellow in Pain Medicine (FIPM) MBBS - Kurnool Medical College, Kurnool

స్థలం: ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్,
అంధ పాఠశాల ఎదురుగా, శంకరాపురం, కడప - 516002, ఆంధ్రప్రదేశ్
తేది: 18th జనవరి 2026, ఆదివారము సమయం: ఉదయం 11 AM నుండి మధ్యాహ్నం 2 PM వరకు

మీరు క్రింద పేర్కొన్న లక్షణాలతో బాధపడుతున్నారా?
• తీవ్రమైన మెడ మరియు వెన్నునొప్పి • చేతులు మరియు కాళ్ళకు వ్యాపించే నొప్పి • చేతులు మరియు కాళ్ళలో బలహీనత • చేతులు లేదా కాళ్ళలో తిమ్మిరి • నడకలో ఇబ్బంది లేదా అసమతుల్యత • తరచుగా మూత్ర విసర్జన • మూర్ఛ • మెదడులో కణితులు • పక్షవాతం • స్ట్రోక్ • మెదడులో రక్తం గడ్డకట్టడం • మెదడు క్యాన్సర్

అపాయింట్‌మెంట్ కోసం సంప్రదించండి: 8019371784 / 8019371785
నృసింహ శేఖర్ ఎ.వి. - 9980527425